నెహ్రూ

ఆత్మకథ

అనువాదకుడు

ముదిగంటి జగ్గన్న శాస్త్రి

ఆదర్శ గ్రంథమండలి
విజయవాడ-2

ఆఱవ కూర్పు

1964 ఆగష్టు

మూల్యము :

12 రూపాయలు

క్యాలికో బైండు

15 రూపాయలు

ముద్రణ :

శ్రీ గాయత్రి ప్రెస్, విజయవాడ-3.

శ్రీ విజయలక్ష్మి ఆర్టు ప్రింటర్సు, విజయవాడ-2

కీర్తిశేషురాలగు
కమలకు

— జవహర్‌లాల్ నెహ్రూ

తొలిపలుకు

192౬ లగాయతు 1931 వరకు "పల్లెటూరి గ్రంథమండలి" పేరిట సుమారు 15 పుస్తకములను వ్రాసి ఆంధ్రభాషామతల్లిని సేవించితిని. కొన్ని రాజకీయ అవాంతరములచే తదాది నేటివరకు వ్యర్థుడనై భాషాసేవ చేయజాలకపోతిని.

నేడు నా కీయవకాశమును కల్పించి తమ "యాత్మకథను" తెనిగింప ననుజ్ఞ యిచ్చిన పండిత జవహర్లాల్ నెహ్రూగారి కెంతయు కృతజ్ఞుడను. నా కీయనుజ్ఞకు శిఫార్సు చేసిన డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారికిని, పై మండలి నింతవరకును పోషించిన యాంధ్రలోకమునకును కృతజ్ఞుడను.

ఇందులో కొన్ని యచ్చుతప్పులును, యితర లోపములును గలవు. ఆంధ్రపాఠకుల ప్రోత్సాహముచే వీనిని నూతన ముద్రణములో సవరించుకొందును.

అనువాదకుడు :

ముదిగంటి జగ్గన్న శాస్త్రి

అభిప్రాయములు

శ్రీ జగన్న శాస్త్రిగారు ఆంధ్రులకు చిరకాల పరిచితులు. వారి పల్లెటూరి గ్రంథమాలవల్ల వారి పేరు ఎల్లరకును పరిచయమే. ఇప్పుడు జవహర్‌లాల్ నెహ్రూగారి "ఆత్మకథను" తెనుగించుటవలన మన కృతజ్ఞతకు మరింత పాత్రులైనారు.

ఇంక వీరి శైలినిగూర్చి మనము చెప్పవలసినదేమున్నది? ఆంగ్లగ్రంథములను తెనుగించునపుడు - తెలుగు తర్జుమావలెనుండక, మూలమే తెలుగా అనిపించవలెను.

మనము అట్టి ప్రమాణమునుబట్టి చూడ వీరిగ్రంథములలో నెవ్వియు వ్యతిరేక విమర్శనకు పాత్రముకాకపోవుటయే కాక, మన యొక్క పొగడ్త పొందవలసినవై యున్నవి.

బందరు
24—4—37

భోగరాజు పట్టాభి సీతారామయ్య

పీఠిక

ఈ పుస్తకము 1934 జూన్ మొదలు 1935 ఫిబ్రవరివరకు (పోస్టుస్క్రిప్టు, మరికొన్ని స్వల్పమార్పులుతప్ప) పూర్తిగ జయిలులోనే వ్రాయబడెను. జయిలులోని దీర్ఘకాలయేకాంతవాసములలో నొకనిశ్చితమయిన పనిని కల్పించుకొనుటయు హిందూదేశములోని గతచరిత్రను సింహావలోకనముచేయుటయు యీ పుస్తకము వ్రాయుటకు గల ప్రధానోద్దేశ్యము. నే నీపనిని స్వయముగ నన్ను నేను ప్రశ్నించుకొనుభావముతో ప్రారంభించి చివరకు నట్లే నడిపితిని. నేను దీనిని బుద్ధిపూర్వకముగ పాఠకులకొరకు వ్రాయలేదు. అట్లుచేసినను నా దృష్టిలో నాదేశ స్త్రీపురుషులుమాత్రమే యుండిరి. విదేశీయులకైనచో నేను మరొకవిధముగ వ్రాసియుండెడివాడను. తేలికగ విడిచివేసిన కొన్ని భావములను వివరించుచు కొన్నిటిని క్లుప్తపరచుచు వ్రాసెడివాడను.

ఈ పుస్తకము నా విషాదఘట్టములలో వ్రాయబడెనని పాఠకుడు గుర్తించునుగాక ! ఇందులో దాని చిహ్నములు కాన్పించుచునే యుండును. ఇది ప్రశాంతకాలములో వ్రాయబడినచో మరియొకవిధముగ నుండెడిది; ఎక్కువ నిరోధము చూపబడెడిది. అయినను నేను దీని నిట్లే యుంచుట నిశ్చయించితిని: నేను దీనిని వ్రాసినకాలములోని భావముల నిది తెలుపును కనుక కొంతమంది కిది రుచింపవచ్చును.

నా మానసికాభివృద్ధిని తెలుపుటకే నేను ప్రయత్నించితినిగాని నవీనభారతదేశచరిత్రను వ్రాయబూనలేదు. ఇది యట్టి చరిత్రవలె పయికి కాన్పించి పాఠకుని పెడమార్గమునబెట్టి దీనికీయగూడని ప్రాముఖ్యత నిచ్చునట్లు చేయవచ్చును. కనుక నిది కేవలము పాక్షికమైనదనియు, నహంకారపూరితమైనదనియు పాఠకుని హెచ్చరింపగోరుచున్నాను; అనేక ప్రధానవిషయములు నిర్లక్ష్యము చేయబడెను. విషయములను సృష్టించిన యనేకమంది ప్రధానపురుషుల నుదహరింపలేదు. నిజమైన చరిత్రయే నైనచో నిది క్షమార్హముగాదు. కాని స్వీయ చరిత్రలో దీనిని మన్నింపవచ్చును. మన నవీనచరిత్రను చదువగోరువా రితర పుస్తకములను చూచుకొనవలెను, అయినను

యీ పుస్తకము మరికొన్ని వ్యక్తుల చరిత్రలు మధ్యనున్న కాళీలను పూర్తిచేసి యదార్థములను గ్రహించుట కొక యాస్కారముగ నుండవచ్చును.

అనేక సంవత్సరములు కలిసి పనిచేసినట్టియు, నా కమితగౌరవమును, ప్రేమయు గలట్టియు కొంతమంది సహచరులను నేను నిర్మొగమాటముగ విమర్శించితిని. నేను వర్గములను వ్యక్తులను (ఒక్కొక్కప్పుడతికఠినముగగూడ) విమర్శించితిని. ఆ విమర్శవలన నాకు వారియెడల గల గౌరవమెంతమాత్రము తగ్గలేదు. ప్రజావ్యవహారములలో పని చేయువారు పరస్పరముగను, వారు సేవించు ప్రజలయెడలను నిర్మొగమాటముగ నుండవలెనని నేను భావించితిని. బాహ్యామర్యాదయు, క్లిష్టమును, ఒక్కొక్కప్పుడు బాధను కలిగించునట్టియు సమస్యలను చర్చింపక విడిచివేయుట పరస్పర సమాధానమునకు తోడ్పడజాలదు. మనల నెదుర్కొను సమస్య యట్లు పరిష్కరింపబడజాలదు. భేదములను, సమానాంగీకారములను గ్రహించుటమీదనే యదార్థమైన సహకారమాధారపడవలెను. ఆ విధముగ యదార్థములను (కష్టమైనవే యైనను) యెదుర్కొనవలెను. అయినను నేను వ్రాసినదానిలో నే వ్యక్తిపైనను ద్వేషముగాని, క్రౌర్యముగాని లేవని నేను విశ్వసింతును.

నేటి హిందూదేశ సారాంశములను నేను బుద్ధిపూర్వకముగ చర్చింపమానివేసితిని. జయిలులో వానినిగురించి నేను పూర్తిగ తెలిసికొనుట కవకాశము లేకపోయెను. ఏమిచేయవలెను ? అను విషయమునుగూడ నేనచ్చట నిశ్చయింపలేకపోతిని. నా విడుదలయైన తరువాతగూడ నీవిషయమున కేమి జేర్చుటయు ప్రయోజనకరము కాదని భావించితిని. అది నేనిదివరకు వ్రాసినదానితో సరిపడునట్లు కాన్పించలేదు. కనుక "నీ ఆత్మకథ" భూతచరిత్రయొక్క యసమగ్ర వ్యక్తిగత పటముగనే యుండును. ఇది వర్తమానమునకు దరిచేరునుగాని, దాని సంపర్కమును జాగ్రత్తగ విడిచిపెట్టును.

బేడెన్ వీలరు
జనవరి 2-1936

జవహర్‌లాల్ నెహ్రూ

విషయసూచిక

జవహర్లాల్ నెహ్రూ

1

కాశ్మీరావతరణము

"తన కథను తాను వ్రాసికొనుట చక్కని విషయమే యైనను అంత సుగమముకాదు. తనను గురించి దూషణచేసికొనిన తన హృదయమును రాచి పెట్టును; స్తుతి చేసికొనిన పాఠకుల చెవులకు ములుకుల వలె నుండును."

—అబ్రహాము కౌలీ.

శ్రీమంతుల కడుపున (ముఖ్యముగా హిందూదేశమున) నపురూపముగాపుట్టు యేకైక పుత్రుడు పదివాళ్ళు చెడిపోవును; దద్దమ్మ యగును పుట్టిన పదకొండేళ్ళవరకు తానొక్కడే బిడ్డడైనను నిక యాశయే యుండదు. నా యిద్దరు చెల్లెండ్రు నాకంటె చాల చిన్నలు. మాలో నొక్కొకరిమధ్య చాలవత్సరములు యెడముండుటచే నాబాల్యమున సమవయస్కులు లేక నేనొంటరిగా పెరిగి యొంటరిగానే కాలము గడిపితిని. నన్ను మామూలు పాఠశాలలకు పంపక ప్రత్యేకోపాధ్యాయులచే చదువు చెప్పించుటచే, సహపాఠుల సావాసముకూడా నాకు కఱవయ్యెను. హిందూకుటుంబమువలె మా ఇంట దగ్గర బంధువులు, అన్నదమ్ముల బిడ్డలు మొదలగువారనేకులుండి సందడిగనేయుండినను, వారందరును నాకంటె చాల పెద్దలగుటచే నాటపాటలలో వారికి చాలనివాడనని వారు నన్ను విడిచివేసెడివారు. ఆ పెద్దఇంట నే నొక్కడనే నా యాటపాటలలో నుండెడివాడను.

మేము మొదట కాశ్మీర నివాసులము. ఔరంగజేబు తరువాత మొగలు సామ్రాజ్య మంతరించు కాలమున, రెండువందల యేండ్ల క్రిందట, మా పూర్వులు ధన, యశస్సుల నార్జించుట కా పర్వత లోయలనుండి సస్యసమృద్ధియైన మైదానములకు దిగి వచ్చిరి. అప్పుడు ఫరక్‌సైర్ చక్రవర్తి. మా పూర్వీకుడు రాజకౌలు, కాశ్మీర దేశమున పరివ్యను, సంస్కృత భాషలలో గొప్ప పండితుడగుటచే,

చక్రవర్తి యతని పాండిత్యమునకు మెచ్చి, 1716 ప్రాంతమున నతనిని తన రాజధానియైన ఢిల్లీకి రావించి యొక జాగీరును, నొక కాలువ యొడ్డున నొక భవనమును సమర్పించెను. ఈ భవనమునుబట్టి నెహ్రూ (నహర్ కాలువ) పదము నతని పేరునకు చేర్చిరి. కౌలు మా కుటుంబ నామము. ఇది (కౌలు) నెహ్రూక్రింద మారెను. తరువాత కౌలు పదము తగ్గిపోయి మేము నెహ్రూలమైతిమి. తరువాత సంభవించిన దుర్దినములలో నీ కుటుంబ మనేక కష్టములకు పాలై, చివరి కా జాగీరునుకోల్పోయెను. మా ముత్తాత లక్ష్మీనారాయణ నెహ్రూ ఢిల్లీ చక్రవర్తి నామమాత్రావశిష్టమైన న్యాయస్థానంలో 'సర్కారు కంపెనీ' మొదటి వకీలుగా నుండెను. మా తాత గంగాధర నెహ్రూ 1857నాటి తిరుగుబాటుకు పూర్వము కొంతకాలము ఢిల్లీ కొత్వాలుగానుండి 1861 లో — ముప్పదినాల్గవయేట చనిపోయెను.

1857నాటి తిరుగుబాటుచే, ఢిల్లీతో మా కుటుంబ సంబంధమంతయు తెగిపోయెను. అపుడు మా కుటుంబమునకు చెందినపత్రములు, దస్తావేజులు నశించిపోయి యున్నదంతయు పోవుటచే మా కుటుంబము ఢిల్లీవీడి ఆగ్రా చేరెను. అప్పటికి మా తండ్రి పుట్టలేదు; కాని మా పెత్తండ్రులిరువురును పెద్దలై కొంత ఇంగ్లీషు భాషను నేర్చుకొనిరి. ఈ భాషా పరిచయమే మా రెండవ పెత్తండ్రిని, మా కుటుంబములోని మరికొంతమందిని యొక ఆకస్మిక దుర్మరణమునుండి రక్షించెను. అతనితో మా మేనత్త (ఒక చక్కని అందకత్తె)యు, మరికొందరును ఢిల్లీనుండి పోవుచుండిరి. దారిలో వారిని కొందరాంగ్లయోధులు తారసించి మా మేనత్త యొక ఆంగ్లయువతియని, మా పెత్తండ్రి యామె నెత్తుకొనిపోవుచున్నాడని యనుమానపడి నిందింప నారంభించిరి. ఆ రోజులలో నిందలు; నిందలనుండి విచారణ లేకుండ న్యాయము చెప్పుట; శిక్షించుట నిముషములమీదపని. మా పెత్తండ్రికిని తదితర కుటుంబమంతకు నురితీయబడు దుర్గతి పట్టియుండెడిది. కాని మా పెత్తండ్రియొక్క యింగ్లీషుభాషాజ్ఞానము కొంత కాల యాపనకు తావిచ్చుటచే నతని పరిచయస్థుడొకడచటకు వచ్చి

వారందరిని రక్షించెను. ఆ కుటుంబము కొన్ని యేండ్లు ఆగ్రాలో నివసించెను. 1861 సంవత్సరము మే ఆరవ తేదీని (మా తాతపోయిన మూడు నెలలకు) ఆగ్రాలోనే, మా తండ్రి జన్మించెను. సరిగా ఆ సంవత్సరమే, ఆ నెలలోనే, ఆ దినమందే కవిచంద్రుడు రవీంద్రనాథ టాగూరు జన్మించెను. కుటుంబ భారమంతయు మా తండ్రికంటె చాల పెద్దలైన మా యిద్దరు పెత్తండ్రులపై బడెను. మా పెత్తండ్రి బ్రిటిషు ప్రభుత్వ న్యాయశాఖలో జేరి, యనేక ప్రదేశములలో నుద్యోగము చేయుచు కొంతవరకు కుటుంబమునకు దూరస్థమైపోయెను. రెండవ యాయన రాజపుత్రస్థానంలో ఖేత్రీ సంస్థానంలో పదిసంవత్సరములు దివానుగా పనిచేసిన తరువాత న్యాయపరీక్షలో నుత్తీర్ణుడై ఆగ్రాలో న్యాయవాదిగా పనిచేసెను.

మా తండ్రి యీయనయొద్ద పెరిగి పెద్దవాడయ్యెను. వారిద్దరి వాత్సల్యము చిత్రమై, పితృ, భ్రాతృవాత్సల్యమిళితమై యుండెను. మా తండ్రి కడసారి వాడగుటచే మా ముత్తవతల్లికి గారాబు బిడ్డడయ్యెను. మా పెత్తండ్రి క్రొత్తగా స్థాపింపబడిన హైకోర్టులో ప్లీడరు. హైకోర్టు ఆగ్రానుండి అలహాబాదుకు మారుటచే మా కుటుంబమును అలహాబాదుకు మారెను. నాటినుండి అలహాబాదు మా నివాస మయ్యెను. చాల సంవత్సరములపిదప నే నచ్చటనే పుట్టితిని. మా పెత్తండ్రి క్రమముగా పెద్ద ప్రాక్టీసు సంపాదించి హైకోర్టు ప్లీడరులలో నొక నాయకుడయ్యెను. ఇంతలో మా తండ్రి కాన్పూరు, అలహాబాదులలో నున్నత పాఠశాల కళాశాలలలో క్రమముగా నుత్తీర్ణుడగుచుండెను. ఆతడు బాల్యమున కేవలము పర్షియను, అరబ్బీ భాషలనే నేర్చి, వయసు వచ్చిన తరువాతనే ఆంగ్లము నభ్యసించెను. ఆ వయసున పర్షియను భాషలో మంచి పాండిత్యము గడించుటచే నతనికంటె చాల పెద్దలు కూడ నతనిని గౌరవించెడివారు. ఈ పాండిత్య మటుండ నతడు పాఠశాల, కళాశాలలలో నల్లరిచిల్లరి పనులలో నారితేరి, చదువుమీద కంటె నాటపాటలలోనే యెక్కువ ధ్యానముంచుటచే, కళాశాలలోని పోకిరీనాయకులలో నొకడుగా చూడబడుచుండెడివాడు. పాశ్చాత్య

మస్తులు, పాశ్చాత్యపోకడలు అతని నాకర్షించెను. అతడు కొంత మోటుప్రవర్తనము చూపినను, ఆంగ్లపండితు లతని ప్రేమించి, చెడుపద్ధతులనుండి తప్పించెడివారు. అతని యుత్సాహమును వారు మెచ్చుకొనెడివారు. తెలివితేటలకు లోటులేదు! అప్పుడప్పుడు తప్పటడుగులిడినను, తరగతిలో కూడ బాగుగనే యుండెడివాడు.

అతడు విశ్వవిద్యాలయ పరీక్షలలో క్రమముగ (సామాన్యముగనే) నుత్తీర్ణుడగుచు బి. ఏ. పరీక్షకు వెళ్ళెను. అతడు దానికై గట్టి కృషిచేయలేదు. మొదటి పరీక్షా పత్రమును పాడుచేసెనని తలంచి తక్కిన పరీక్షలకు వెళ్ళకుండుటకై నిశ్చయించి, తాజమహాలులో (పరీక్షలు అప్పుడు ఆగ్రాలో జరుగుచుండెడివి) కాలక్షేపము చేయుచుండగా, కాలేజి పండితు డతనిని పట్టుకొని మొదటి పరీక్షాపత్రమును బాగుగనే వ్రాసెనని హెచ్చరించి, తక్కిన పరీక్షలకు హాజరు కాక పోవుట మూర్ఖత్వమని చీవాట్లు వేసెను. ఇంతటితో నతని చదువు పూర్తియయ్యెను. అతడు పట్టభద్ర బిరుదాంకితుడు కాలేదు. అతడు మంచి వృత్తిలో స్థిరపడి జీవితమును గౌరవప్రపత్తులతో గడుప నుంకించుచు, శక్తిసామర్థ్యములను చూపుటకును, సమర్థులకు ఫలప్రద మగునదియును (హిందూదేశమున నప్పటిలో) ప్లీడరీవృత్తి యొక్కటియే యని నిశ్చయించెను. అంతేగాక తన యన్నగారి సాదృశ్యముకూడ నతనికి గాన్పించుచునే యుండెను. అతడు హైకోర్టు వకీలు పరీక్షకు వెళ్ళి ప్రప్రథముడుగా నుత్తీర్ణుడై బంగరుపతకమునుగూడ బొందెను. అతనికి హృద్యమైన వృత్తి లభించెను.

అతడు కాన్పూరు జిల్లాకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించి జయము గాంచవలెనని యతిశ్రద్ధతో పనిచేసి త్వరలోనే పైకివచ్చెను. ఆట పాటలలోను, యితర వినోదములలోను నతనికిగల సరదా కొంత కాలమును మ్రింగివేసెను. కుస్తీయనిన నతడు చెవికోసికొనెడివాడు. ఆ రోజులలో కాన్పూరు కుస్తీపందెములకు ప్రసిద్ధి.

కాన్పూరులో మూడు సంవత్సరములు పని నేర్చికొనినతరువాత తండ్రిగారు అలహాబాదు హైకోర్టులో చేరిరి. చేరిన కొద్దికాలము

లోనే ఆయన సోదరుడు నందలాల్ నెహ్రూ హఠాత్తుగా చనిపోయెను. ఇది మాతండ్రికి తీరని కష్టమాయెను. అతడు ప్రేమాస్పదుడైన సోదరుడేకాక తండ్రివలెకూడ నుండెను. కుటుంబ ప్రధాన పోషకుడు చనిపోవుటచే నా పెద్ద కుటుంబ భారమంతయు మాతండ్రి మీదనే పడెను. అతడు తన వృత్తిలో నిమగ్నుడయి కొన్నిమాసము లన్ని యితర పనులను కట్టిపెట్టెను. మా పెత్తండ్రిగారియొద్ద నుండెడి కేసులన్నియు మాతండ్రికే వచ్చిపడుచుండెను. ఆయన కష్టించి పనిచేయుటవలన నవన్నియు నెగ్గుచుండుటచే నితర కేసులు, విపరీత ధనము రాదొడగెను. అతడు చిన్న వయస్సులోనే గొప్ప వకీలు అయ్యెను. కాని యిదంతయు నూరక చేకూరలేదు. అతడా న్యాయదేవతకు దాసుడయ్యెను. స్వంత పనులుగాని, ప్రజాసేవనుగాని చక్కబెట్టుట కతనికి తీరికయే లేకుండెను. శలవులు, కాళీదినములుకూడ దానికే చాలకుండెను. కాంగ్రెసు ఇంగ్లీషు చదువుకొనిన మధ్యతరగతుల వారి నప్పుడప్పుడే యాకర్షింప నారంభించెను. అతడుకూడా కొన్ని కాంగ్రెసులకు వెళ్ళి నామమాత్రపు సమ్మతుల నొసంగును. చేతినిండ పనియుండుటచే నతడప్పటిలో కాంగ్రెసుపట్ల శ్రద్ధ వహించలేదు. ఇంతేకాక రాజకీయములలోను, ప్రజాసేవలోను నతడేమి చేయవలెనో తెలియకుండెను. అతడు దానిని గురించి యోచింపనులేదు. ఏయుద్యమములోగాని యే సంస్థలోగాని యే మూలనోనుండి తలయూచుటతని చేతగాదు. అతని బాల్యంపు టుత్సాహశక్తి తఱిగినట్లు కాన్పించినను నది యతనివృత్తిలో ప్రవేశించి యతనికి జయము చేకూర్చి, యాత్మవిశ్వాసమును, యభిమానమును పెంపొందించెను. పోరాటమనిన యతనికి సరదా! ఐనను నతడు రాజకీయ రంగములోనికి దుముకలేదు. నిజమున కప్పటి జాతీయ కాంగ్రెసులో పోరాటమేమియును లేనేలేదు. మొత్తముమీద నతని కది యపరిచిత విషయము; అతని మనస్సు తనవృత్తిమీదనే యుండెను. ఇతరుల ప్రసాదముచేగాక, నితరులసాయ మెంతమాత్రమును లేక తన మనోబల, బుద్ధిబలములచేతనే యతడు జయలక్ష్మిని చేపట్టెను.

నిజమున కతడు రూఢ్యర్థములేని జాతీయవాది; కాని యతడు యింగ్లీషువారిని, వారిపద్ధతులను మెచ్చుకొనుచుండెను. తన దేశస్థులు చాల పతితులైరనియు, వారి దుస్థితికి వారర్హులే యనియు నతడు భావించెడివాడు. ఏమియు పనిచేయకుండ శుష్కవాచాలత్వముతో ప్రొద్దుబుచ్చు రాజకీయవేత్తలపట్ల నతని మనస్సులో కొంత తిరస్కారభావ ముండెను. రాజకీయములలో పనిచేసెడివారిలో చాలమంది (అందరును కాదు) జీవితములో వ్యర్థులనెడి భావము (తనకు చేకూరిన జయముచే కలిగిన యహంకార జనితము) కూడ యతని కుండెడిది.

మా యాదాయము హెచ్చినకొలది మాఖర్చులుకూడ నిరంతరము హెచ్చుచుండెను. తన కెప్పు డెంత ధనము కావలెననిన నంత ధనమును సంపాదించగల శక్తియున్నపుడు మూటగట్టుట మాతండ్రి శక్తిసామర్థ్యముల కొక మచ్చగా దోచెను. మంచి రసికుడును, భోగలాలసుడును అగు మా తండ్రి సంపాదించినదంతయు హాయిగా ఖర్చుపెట్టుచుండెను. క్రమముగా మా పద్ధతులు పాశ్చాత్యములైపోయెను.

నా శైశవదశనాటి మా యింటికథ యిట్లుండెను. నేను అలహాబాదులో 1889 నవంబరు పదునాల్గవ తేదీని జన్మించితిని.

2

శైశవము

నా శైశవ మీావిధముగా పెద్దలచాటున విశేషాంశము లేవియు లేకయుండెను. నేను మా పెత్తండ్రి బిడ్డల సంభాషణలను వినుచుండెడివాడను. కాని యవన్నియు నాకర్థమయ్యెడివి కావు. తఱచుగా నీసంభాషణ భారతీయులపట్ల నాంగ్లేయులును యురేషియనులును చేయు అవమానములకును, ధూర్తప్రవర్తనమునకును సంబంధించి యుండెడిది. దీనిని సహింపక ధిక్కరించుటే ప్రతిభారతీయుని ధర్మమని వారు చెప్పుకొనెడివారు. పాలక పాలితులమధ్య గలిగెడి ముష్టాముష్టి సోదాహరణముగ చర్చింపబడుచుండెడిది. ఆంగ్లేయుడొక భారతీయుని చంపినచో వానిని తెల్లదొరలే విచారించి విడచివేసెడివారు. రైలుబండ్లలో తెల్లవారికి ప్రత్యేకముగ పెట్టెలుండెడివి. బండి ఎంత క్రిక్కిరిసి యున్నను, యీ పెట్టెలలో నే భారతీయుని యెక్కనివ్వరు. ప్రత్యేకింపబడని పెట్టెలలోకూడ నే యింగ్లీషువాడో సాచుకొని కూర్చొని యే భారతీయుని లోపలకు రానీయడు. బహిరంగమైన పార్కులలో బల్లలు కుర్చీలు తెల్లవారికి ప్రత్యేకింపబడియుండును. నాదేశమును పాలించు పరిపాలకుల యీ దుశ్చేష్టితములకు నాకెంతయో కోపముగలిగెడిది. భారతీయు డెవడేని యీ దురంతముల నెదుర్కొనిననాడు నేను సంతోషముతో గంతులిడెడివాడను. తఱచుగా మాకుటుంబములోని వారో లేక వారి స్నేహితులో యిట్టి పోరాటములను కల్పించుకొనెడివారు. అప్పుడు మేమందరము చొక్కాలు పైకితీసెడివారము. మా పెత్తండ్రి కుమారు డొకడు మంచి బలిష్టుడు. అతడు తఱచు యే ఇంగ్లీషువానితోనో ఢీకొనెడివాడు. యురేషియనులు తాముకూడ పాలకజాతివారమే యనిపించుకొనవలెనని యింగ్లీషు యుద్యోగికంటెను, వర్తకునికంటెనుకూడ మరింత యమర్యాదగా సంచరించుటచే మా పెత్తండ్రికుమారుడు వారిమీదకు మరింత జోరుగా వెళ్లెడివాడు. రైలుప్రయాణములోనే యీ పోరాటములు తఱచు జరుగుఛుండెడివి.

పరప్రభుత్వమువారి ప్రవర్తనము నాకెంత యేవగింపుగా నుండినను, నేనెప్పుడును యే ఆంగ్లవ్యక్తిపైన ద్వేషము చూపి యెరుగను. ఆంగ్ల ఉపాధ్యాయిను లెందరో నాకు బోధకులాంగ్రుగ నుండిరి. మా తండ్రిగారి యాంగ్లస్నేహితు లెందరో మా యింటికి వచ్చెడివారు. నేను వారిని నా హృదయములో మెచ్చుకొనెడివాడను.

సాయంకాలము తండ్రిగారి స్నేహితు లెందరో అతనిని చూడ వచ్చెడివారు. అతడు పగటి కష్టమంతయు తీరునట్లు వారందరితోను పెద్ద నవ్వు నవ్వెడివాడు. చివర కతని నవ్వు అలహాబాదులో పేరు వడసెను. ఈ పెద్దలందరు యేమి మాట్లాడుకొనుచుందురో, వినవలె నని నే నొక్కొక్కప్పుడు తెరచాటుగ వినెడివాడను. అప్పుడు నేను దొరికితినా నన్ను పట్టుకొని, భయపెట్టి కొంతసేపు తండ్రిగారి తొడమీద కూర్చుండ బెట్టెడివారు. తండ్రిగారు ఎర్రటి మద్యమును త్రాగుచుండ నే నొకనాడు చూచితిని. విస్కీ నే నెరుగుదును. అతని స్నేహితులును, అతడును దానిని త్రాగుచుండ నే ననేకసార్లు చూచి తిని. కాని ఈ ఎర్రటి క్రొత్తవస్తువేదియో నాకు భయంకరముగా కాన్పించెను. తండ్రిగారు రక్తమును త్రాగుచున్నారని చెప్పుటకు నేను మా తల్లియొద్దకు పరుగిడితిని.

తండ్రిగారియెడల నా కపరిమిత గౌరవము. నేను చూచిన వా రందరికంటె నతనిలో ధైర్యసాహసములు, శక్తిసంపదలు, బుద్ధి విశేష ములు మూర్తీభవించినట్లు నాకు గోచరించెను. నేను పెద్దవాడనైన తరువాత నతనివలె నుండవలెనని యువ్విళ్లూరుచుంటిని. నేనతని నెంత గౌరవించి, ప్రేమించెడివాడనో యతడనిన యంత భయపడెడి వాడను. అతడు నౌకర్లమీదను, యితరులమీదను మండిపడునపుడు నేను వణుకుచుండెడివాడను. అతని ముక్కోపితనమునకు నా కింతవరకు సాటి కాన్పించలేదు. కాని యదృష్టవశమున, నతనిలో కొంత హాస్యరసము, అప్రతిహతమైన నిగ్రహశక్తియుండుటచే పెద్దయైనకొలది యతడు కోపమును తగ్గించుకొన గలిగెను. నా బాల్యములో నే నొకసారి యతని కోపమునకు గురియైతిని. ఒకరోజున నతనిగదిలో రెండు ఊట

కలములనుచూచి యతని కా రెండును అవసరముండవని తలంచి నే నొక దానిని తీసికొంటిని. మాతండ్రి దానికొరకెంతయో వెతికించెను. నేను నిజమును చెప్పనయితిని. చివరకు కలము దొరుకుటచే నా నేరము బయటపడెను. మాతండ్రి నన్ను చావగొట్టెను. నేను శరీరబాధ చేతను, అవమానముచే పొర్లిపొర్లి వచ్చు దుఃఖముచేతను మా తల్లి యొద్దకు పరుగిడితిని. తరువాత చాలరోజులవరకు నా శరీరమున కనేక తైలములు, మందులు వ్రాయబడెను.

ఈ శిక్షకు నా కాయనపై నెట్టిద్వేషమును కలుగలేదు. కొంచెము మోతాదు హెచ్చయినను అది యుక్తమైనశిక్షయే యని నేను భావించితిని. అతనియెడల నాకు గౌరవ ప్రేమ లెప్పటివలెనే యున్నను భయముమాత్రము నిలచిపోయెను. మా తల్లియెడల నాకట్టి భయములేదు. నే నేమిచేసిననుసరే ఆమె కప్పిపెట్టును. ఆమె నన్ను ఎక్కువగా ప్రేమించుటచే నే నామెపై కొంచె మధికారమును చలా యించెడివాడను. తండ్రికంటె నాకెక్కువచేరికయగుటచే నే నామెతో నన్నియు చెప్పికొనెడివాడను. ఆమె పొట్టిగా నుండుటచే నేను త్వరలోనే యామెయంతటి పొడగరినైతిని. ఆమె యందము మెచ్చదగియుండెను. అతి చిన్న పాదములు, కోమలములయిన హస్తములు ఆమె యందమును పెంచుచుండెను. కాశ్మీరమునుండి యామె పూర్వులు రెండుతరములక్రిందనే దిగివచ్చుటచే మాకంటె యర్వాచీనులు. మా తండ్రిగారి మున్షీ ముబారక్ ఆలీ నా విశ్వాసమును చూఱగొనెను. అతడు బదానులోని యొక గొప్ప కుటుంబమునకు చెందినవాడు. 1857 నాటి పితూరీలో నతనివంశము యింగ్లీషు సిపాయిలచే నాశనముగావింపబడెను. ఈ కష్టములవలన నత డందరి యెడలను, ముఖ్యముగా పిల్లలయెడల మృదుమధుర భావములను కలిగియుండుటచే నా కేదేని కష్టము వాటిల్లిన నే నతనియొద్దకు వెళ్ళెడివాడను. అతడు పురాణగాథలను, 'అరేబియనురాత్రుల' లోని కథలను, 1857–58 లలో జరిగిన వింతచర్యలను అసంఖ్యాకముగా చెప్పుచుండ నేను నిశ్చేష్టుడనై గంటలకొలది వినుచుండెడివాడను. నేను

పెద్దవాడనైన చాలకాలమునకు "మున్షీ జీ" చనిపోయెను. అతడు నా కెప్పటికిని జ్ఞప్తియందుండును.

నా తల్లియు, పెత్తల్లియు హిందూపురాణములనుండి చెప్పుచుండెడి రామాయణ భారతగాథలనుకూడ నేను వినుచుండెడివాడను. మా పెత్తల్లి — నందలాల్ భార్య పురాణ భారతగ్రంథములను బాగుగా చదివెను. ఆమె కథలకు తరుగులేదు. కనుక భారతపురాణములలోను, గాథలలోను నాకు మంచి పరిచయము కలిగెను.

మతమున నాకు సరియైనభావములు లేకుండెను. అది ఆడంగుల వ్యవహారముగా కాన్పించెను. మా తండ్రి పెత్తండ్రులు దానిని వేళాకోళముగా చూచి, దానియందు శ్రద్ధలేకయుండిరి. ఇంటనున్న స్త్రీలనేక పూజలు, వ్రతములు చేయుచుండెడివారు. తక్కినవారి వలె చూచీచూడనట్లూ అక్కొనవలెనని యనుకొనినను నేను వాటిని కొంత యానందించెడివాడను. మా తల్లియో, పెత్తల్లియో గంగా స్నానమునకు పోయినపు డొక్కొక్కప్పుడు నేనుకూడ వెళ్ళుచుండెడివాడను. ఒక్కొక్కప్పుడు అలహాబాదులోనో, కాశీలోనో దేవాలయములకు బోవుచుండెడివారము; లేదా చాల పవిత్రుడని పేరు వడసిన యే సన్యాసినైనను చూడబోయెడివారయి. కాని ఇదేదియు నా భావమును మార్పజాలదయ్యెను. ఇక ననేక పర్వదినము లుండెడివి. హోలీపండుగ; పట్టణమంతయు కోలాహలము. ఒకరిపయి నొకరు రంగునీరు చల్లుకొందురు. దీపావళి; దీపముల పండుగకు వేల కొలది మట్టి ప్రమిదెలతో చమురుపోసి ప్రతియింటిముందర జ్యోతులను వెలిగింతురు; జన్మాష్టమి; అర్ధరాత్రివేళ ఖయిదులోపుట్టిన కృష్ణుని జననోత్సవమును సల్పెదరు. దసరా; రామలీలలు, రామచంద్రుని కథలోను లంకా విజయములోను కొన్నిరంగములను ప్రదర్శించుచు జరుపు యుత్సవము; జనులు గుంపులు గుంపులుగా దీనిని చూడ వత్తురు. పిల్లలందరును మొహరంపండుగను (హాసన్ హుసేనుల విషాదచరిత్రను తెలుపు యుత్సవమును) చూడ వెళ్లెడివారు. రెండు యీదు (పండుగల) రోజులలోను మున్షీ జీ మంచిదుస్తులను ధరించి

పెద్దమశీదుకు దైవప్రార్థనలకు వెళ్లెడివాడు. నేనతనియింటికి బోయి సేమ్యాపాయసము, యితర మధురపదార్థములు తినెడివాడను. రక్షాబంధనము మొదలగు చిన్నపండుగ లింక నెన్నియో గలవు.

కాశ్మీరుదేశస్థులమగు మాకు—యితర హిందువులు చాల మంది చేయని — ప్రత్యేకపండుగలు కలవు. ఇందులో 'నౌరోజు' (మా పంచాంగము ప్రకారము సంవత్సరాది) పండుగ ముఖ్యము. ఆనాడు మేమందరమును క్రొత్తదుస్తులను కట్టుకొనెదము. మిఠాయిలు కొనుక్కొనుటకు పిల్లలకు డబ్బులిచ్చెదరు.

కాని వీటన్నిటికంటెను నేను నా పుట్టినరోజున జరిగెడి యుత్సవము నెక్కుడుగా చూచుకొనెడివాడను. ఆ నాడు ప్రాతఃకాలముననే దుస్తులను ధరించెడివాడను. నా కందరును బహుమానముల నిచ్చెడివారు. మధ్యాహ్నము గొప్ప విందు జరిగెడిది. దీనికంతకును నేనే కథానాయకుడనని నా కుండెడిది. నా పుట్టినదిన మంత యరుదుగా రానేలయని నేను చింతించి యెక్కువ జన్మదినము లుండవలెనను యాందోళనను లేవదీయవలెనని నేను ప్రయత్నించితిని. ముదిమివచ్చి మీదపడుచున్నదని జ్ఞప్తికితెచ్చు జన్మదినములు వచ్చునని నే నప్పు డెఱుగనైతిని. మా బంధువుల యింటనో స్నేహితులయింటనో పెండ్లి వచ్చునపుడు మా కుటుంబమంతయు దూర ప్రయాణముచేసెడిది. అవి మాకు, పిల్లలకు, మంచి సరదాదినములు. పెండ్లి దినములలో నిర్బంధములన్నియు సడలుచుండుటచే మేము మా యిష్టమువచ్చినట్లు రాజ్యము చేసెడివారము. పెండ్లివారి విడిదెలో ననేక కుటుంబములుచేరి పిల్లలపటాలము కావలసినంత యుండుటచే నా కప్పు డొంటరితన ముండెడిదికాదు. మేము మాయిష్టమువచ్చిన ట్లల్లరిచేయుచుండ మధ్యమధ్య పెద్దలు చీవాట్లు పెట్టెడివారు. హిందూ వివాహములు బీదసాదలందరి యిండ్లలోను చాల వ్యయకరములని, దూబారాతో గూడిన యాడంబరములని పూర్తిగా గర్హింపబడెను. ఇదెంతయు సత్యము. దూబరామాట యటుండ కళాహీనమైన నిరర్థక తంతు (కొన్ని మినహాయింపులు లేకపోలేదు.) చూచుటకు చాల బాధా

కరముగనే యుండును. దీనికంతకును మధ్యతరగతులవారే దోషులు. బీదలుకూడ (యెక్కువ ఋణములుచేసి) చాల ఖర్చుచేసెదరు. కాని వారి దారిద్ర్యముకు వారి సాంఘికాచారములే కారణమనుట (కొంద రిట్టే శలవిచ్చుచుందురు.) కంటె హాస్యాస్పదము మరొకటుండబోదు. బీదలబ్రతుకు సంతోషమనునది లేక చాల నిస్సారముగను, భార భూయిష్టముగను నుండుననుసంగతి మనము తఱచు మఱచిపోదుము. కొద్దిపాటి సంగీతమును, విందులను ప్రసాదించు వివాహపుటుత్సవములు నిర్జీవమైన వారిజీవితయెడారులలో నచ్చటచ్చట నొకపచ్చిక బయలువలె తోచుచు వారి పేలవ నిత్యజీవితమునకు కొంత విశ్రాంతి నొసగును. నవ్వుకొనుట కెట్టి యవకాశములులేని వారి జీవితముల కీపాటికూడ నుండకూడదను క్రూరులెవరుందురు ? వ్యర్థములైన ఖర్చుల నరికట్ట వలసినదే! దూబరా తగ్గవలసినదే! కాని వారి జీవితములలో, సంతోషమునకు తావుండవలెను.

మధ్యతరగతులవారి సంగతియు నింతే. వ్యర్థమైన ఖర్చులు దూబరాలు తీసివేసినచో కొంతకాలమున కొకసారి దూరబంధువు లును, ప్రాతస్నేహితులును, కలుసుకొనుట కివి మంచితరుణములు. భారతదేశ మతివిశాలమైన దగుటచే ననేకమంది స్నేహితు లొకేసారి యొకచోట సమావేశమగుట చాలాకష్టము. కనుకనే మన పెండ్లిండ్ల కింతటి ప్రాముఖ్యత కలిగెను. కాన్ఫరెన్సులు, రాజకీయసభలు, కాంగ్రెసు మొదలైన విపుడు వీనిస్థానమును తీసుకొనుటయేగాక చాల విధముల వీనిని మించినవి.

కాశ్మీరు దేశస్థులలో (ఉత్తరాదివారివలె) ఘోషాపద్ధతిలేదు. ఏ కాశ్మీర దేశస్థుడైనను మరియొక కాశ్మీరునియింటికి నిరాటంకముగ పోవచ్చును. పర్వములలోను, యుత్సవములలోను స్త్రీ పురుషులు కలసికొందురు. ఒకచోట కలసి కూర్చొనెదరు. కాని స్త్రీలు తఱచు ప్రత్యేక పంక్తిలో కూర్చొనెదరు. బాలబాలిక లింతకంటె సమాన హోదాలో నుందురు. కాని యిప్పటి పాశ్చాత్యుల స్వేచ్ఛవంటిది మాత్రము వారికుండదు.

నా బాల్యమిట్లు గడిచెను. ఒక్కొక్కప్పుడు (పెద్దకుటుంబములో తప్పవు.) కుటుంబకలహములు జరుగుచుండెడివి. ఇవి పెచ్చు పెరిగి మా తండ్రిచెవుల పడినప్పు డతనికి కోపము కలిగెడిది. ఆడవారి తెలివి తక్కువవలన నివి వచ్చుచుండుననని యతడు భావించెడివాడు. నిజ మేమి జరిగెడిదో నాకు తెలిసెడిదికాదు. ఎడముఖము, పెడముఖము లనుబట్టి యెక్కడనో దోషముండగలదని నే ననుకొనెడివాడను. నాకు చాల విచారము కలిగెడిది. తండ్రిగా రిందులో కలుగజేసికొనిన మేము వణకిపోయెడివారము.

నా కొక చిన్న సంగతి యింకను జ్ఞాపకమున్నది. నా కప్పుడు యేడెనిమిది సంవత్సరములు. నేను ప్రతి సాయంకాలము గుఱ్ఱపు స్వారీ చేసెడివాడను. ఒక సాయంకాలము నా గుఱ్ఱము నన్ను పడ ద్రోసి యింటికి పారిపోయెను. తండ్రిగా రప్పుడు టెన్నిసువిందు చేయుచుండిరి. అందరును భయపడి బండ్లమీద, సైకిళ్ళమీద, కాలినడకను గుంపులుగుంపులుగా బయలుదేరి నా కొఱకు వెతుక నారంభించిరి. నన్ను వారు త్రోవలో కలుసుకొనిరి. నే నొక వీర కార్యముచేసినట్లు వారు నన్ను గౌరవించిరి.

3

దివ్యజ్ఞానము

నా పదియవయేట మేము 'ఆనందభవనము' కు మారితిమి. ఈ భవనమునకుచేరి పెద్దతోట, ఈదుట కొరకకొలను కలవు. ఇందులో మరికొన్ని భవనములు కట్టబడెను. పనివాండ్రు త్రవ్వుట, కట్టుట మొదలగు పనులు చేయునపుడు నేను వారిని ప్రేమతో నిరీక్షించి చూచుచుండెడివాడను.

నేనా కొలనులో బాగుగా ఈదుట నేర్చుకొని దీర్ఘకాలపు మండువేసవి దినములలో సమయము దొరికినపుడెల్ల రోజు కనేకసార్లు దానిలో మునుగుచుండెడివాడను. సాయంకాలము నా తండ్రి స్నేహితు లనేకమంది కొలనుకు వచ్చెడివారు. అప్పు డది యొక వింతగా నుండెడిది. ఆ కొలనువద్దను మా యింటను నెలకొల్ప బడిన విద్యుద్దీపము లారోజులలో అలహాబాదులో వింతగా నుండెను. స్నానములవేళ నాకు మంచి హుషారుగా నుండెడిది. ఈతరానివానిని ముందుకు వెనుకకు గెంటి కొలనులోకి త్రోయునట్లు భయపెట్టుట నా కొక సరదాగా నుండెడిది

డాక్టరుసప్రూగా రపుడు అలహాబాదులో చిన్న వకీలు. అతనికి ఈతరాదు. నేర్వవలెనని తలంపు లేదు. అతడు పదిహేను అంగుళముల లోతులో మొదటిమెట్టుమీద కూర్చుని ముందుకుదిగక యెవడైనను ముందుకుత్రోయ ప్రయత్నించుచో లబలబలాడెడివాడు. మా తండ్రికిని ఈతరాదు. కాని పళ్ళుబిగించి చేతులు తపతప కొట్టుకొనుచు కష్టము మీద నతడు గట్టుకు చేరెడివాడు. అపుడు బోయరుయుద్ధము జరుగు చుండెను. నా సానుభూతి బోయరులవైపున నుండెను. యుద్ధ విశేషములు తెలిసికొనుటకు నేను వార్తాపత్రికలు చదివెడివాడను.

అప్పుడే మా చెల్లెలు పుట్టెను. ప్రతివారికిని తమ్ముడో చెల్లెలో పుట్టుచుండ నా కా భాగ్యము కలుగకపోయెనని రహస్యముగా

విచారించెడివాడను. చివరకు నా కట్టి భాగ్యము లభింప నున్నదని పర మానందభరితుడనైతిని. తండ్రిగా రపుడు యూరపులోనుండిరి.

తండ్రిగారు యూరపు వెళ్ళుటచే హిందూదేశములో నున్న కాశ్మీర బ్రాహ్మణులలో కలకలము బయలుదేరెను. తిరిగివచ్చినతరువాత ఆయన ప్రాయశ్చిత్తము చేసుకొనలేదు. కొంతకాలము క్రిందట పండిత బిషన్ నారాయణధర్ (ఇతడు తరువాత కాంగ్రెసు అధ్యక్షు డయ్యెను) వెళ్ళివచ్చి ప్రాయశ్చిత్తము చేసికొనినను కూడా పూర్వా చారబ్రాహ్మణబృంద మతనిని వెలివేసిరి. దీనివలన సంఘములో రెండు బలీయమైన చీలిక లేర్పడెను. తరువాత చాలామంది కాశ్మీరయువకులు చదువుకొరకు యూరపువెళ్ళి తిరిగివచ్చి (కొద్ది ప్రాయశ్చిత్తము చేయించుకొని) సంఘసంస్కార శాఖలో జేరుచుండిరి. ఆ ప్రాయ శ్చిత్తము కేవలం బూటకము. అందులో మత మేమియు లేదు.

అది సంఘతత్త్వమునకు బాహ్యముగా తలయూచుట, అట్లు చేసి, ప్రతివాడును బ్రాహ్మణేతరులతోను, హిందువులు కానివారితోను కలసిమెలసి భోజనభాజనములు చేసెడివాడు. మా తండ్రిగా రింకొక యడుగు ముందుకు వేసిరి. ఈ బూటకపు ప్రాయశ్చిత్తమున కాయన అంగీకరించలేదు. సంఘములో గగ్గోలు బయలుదేరి ఆయనతో మూడవకక్ష యేర్పడెను. కొద్ది సంవత్సరములలో యీ కక్షలు కలసి పోయెను. భావములు మారిపోయి ప్రాతనిర్బంధములు తొలగిపోయెను. తరువాత చాలమంది కాశ్మీర బాల బాలికలు చదువులకొఱకు యూరపు లేక అమెరికాలకు వెళ్ళి తిరిగివచ్చినపుడు ప్రాయశ్చిత్తము సంగతి ఎత్తినవారే లేరు. భోజనముల నిర్బంధము (ముసలమ్మలకు తప్ప) పూర్తిగా పోయెను. కాశ్మీరేతరులు, భారతేతరులు, ముసల్మా నులు కలసి తినుట సామాన్యమయ్యెను. ఘోషా (కాశ్మీరులు కానివారి యెడల నుండెడిది) పోయెను. 1930 నాటి రాజకీయ సంరంభముతో నిది పూర్తిగా పోయెను. ఇతరసంఘములతో నంతర్వివాహము లంత సామాన్యము (అచ్చటచ్చట జరుగుచున్నను) కాలేదు. నా చెల్లెండ్రిరు వురును కాశ్మీరేతరులనే వివాహమాడిరి. మా కుటుంబములో నొకడు

హంగరీదేశపు కన్యను వివాహమాడెను. అంతర్వివాహములపట్ల మత నిర్బంధము లేదు. కాని జాతిభేదమే యెక్కువగా పట్టిచ్చెడిది. మా ప్రత్యేకసంఘమును మా ప్రత్యేక ఆర్యముఖలక్షణములను నిలుపుకొనవలెనను నేడి కోరిక చాలమంది కాశ్మీరులలో గలదు. మేము ఈభారత భారతేతర మానవసముద్రములో మునిగిపోదుమేమోయను భయము. ఈ విశాల భారతములో మే మత్యల్ప సంఖ్యాకులము.

నా పదకొండవయేట బ్రూక్సుదొరవద్ద గురుకులవిద్య ప్రారంభ మయ్యెను. అతడు నిశితమైన దివ్యజ్ఞాన సమాజికుడు. అనిబిసెంటు దొరసాని యతనిని మాతండ్రికి సిఫార్సు చేసెను. సుమారు మూడు సంవత్సరములతడు మాతో నుండెను. అతనియొద్ద నేననేక విషయములు నేర్చుకొంటిని. హిందీ, సంస్కృతములను బోధించుటకు మరియొక వృద్ధ పండితుడుండెను. ఎన్ని యేండ్లతని వద్ద నేను చదివినను ఆ చదువు నాకు వంటబట్టలేదు. నేను తరువాత హారోలో సంపాదించిన ల్యాటిను భాషాజ్ఞానముతో పోల్చిన నా సంస్కృతజ్ఞాన మతిస్వల్పము. కాని యాతప్పు నాది. నాకు భాషలు త్వరగా వచ్చెడివికావు. వ్యాకరణమనిన తలనొప్పి. బ్రూక్సుదొర గ్రంథపఠనమందు నాకు మంచి యాసక్తిని కలుగజేసెను. నేననేక యింగ్లీషు పుస్తకములను చదివితిని. గద్యము సందేగాక పద్యమందును నాకభిరుచి మెండయ్యెను. నాలో ననేక మార్పులు కలిగినను ఈ అభిరుచి నేటికిని నిలిచియుండెను.

అతడు శాస్త్రములో గూడ నా కభినివేశమును కల్గించెను. మే మొక చిన్న రసాయన శాలను సృష్టించితిమి. నేననేక గంటలకాల మందులో పరిశోధనలను చేయుచు గడిపెడివాడను. ఈ చదువేకాక బ్రూక్సుదొరవలన నాకు కొంత దివ్యజ్ఞాన సంపర్కము కలిగెను. అతడు ప్రతివారము తన మందిరములో దివ్యజ్ఞాన సభలను జరిపినపుడు నేను హాజరగుచుంటిని. క్రమముగా కొన్ని దివ్యజ్ఞానభావములును, పదజాలమును నాకు పట్టుపడెను. ఆత్మానాత్మవాదము, అవతారవాదము, దివ్యపురుషులు, ముక్తపురుషులు, సిద్ధపురుషులు, యితర లోకములు కర్మసిద్ధాంతవాదములు; బ్లావట్స్కీ మొదలగు దివ్యజ్ఞాన సమాజికుల

గ్రంథములేగాక హిందూమతగ్రంథములు, బుద్ధధమ్మపదము, పైథాగరసు, అపొలోనియసు మొదలగు నితర వేదాంతులు, ఆత్మద్రష్టలు:-అన్నియును, అందరును చర్చింపబడుచుండెను, చర్చింపబడుచుండిరి. నా కా చర్చయంతయు నర్థమయ్యెడిది కాదు; కాని యిది వినుట కద్భుతముగను మనోజ్ఞముగను నుండెడిది. విశ్వరహస్యకీలక మిందులో నున్నట్లు నేను భావించితిని. నేను మతమునుగురించి, యితరలోకములనుగురించి మొట్టమొదటిసారి బుద్ధిపూర్వకముగ యోచింప నారంభించితిని. ముఖ్యముగా హిందూమతము పట్ల, (కర్మకాండలు చిల్లరతంతులపట్లగాక) భగవద్గీత, ఉపనిషత్తులు మొదలగు వానిపై నాకు గౌరవము హెచ్చజొచ్చెను. అవి నా కర్థము కాలేదు. కాని యవి గొప్పయద్భుత గ్రంథములుగా కాన్పించెను. దివ్య శరీరములనుగూర్చి నేను కలలుగనుచుంటెని. ఆకాశమున వందలకొలది మైళ్ళు యెగురుచున్నట్లు నా జీవితమంతట చాలసారులు కలలు వచ్చుచుండెను. క్రింద ప్రపంచమంతయు గిరుగ్రన తిరుగు వనవాటిక వలె తోచుచుండెడిది. ఫ్రూడ్ మొదలగు ఆధునికు లీ కలల కేమి యర్థము చెప్పెదరో నాకు తెలియదు.

ఆరోజులలో అనిబిసెంటుదొరసాని అలహాబాదు వచ్చి దివ్యజ్ఞానమునుగురించి యనేకోపన్యాసముల నిచ్చెడిది. ఆమె వక్తృత్వము నన్ను మొదలంట కదల్చివేసి, మిరిమిట్లు కప్పినట్లు కలలోనున్నట్లు చేసెడిది. నేను దివ్యజ్ఞానసమాజములో చేరుటకు నిశ్చయించుకొని తండ్రిగారియనుజ్ఞ నడిగితిని. ఆయన యొక్క నవ్వునవ్వి సరేయనెను.

ఆయన దాని కంత ప్రాముఖ్యత నీయకపోవుట నాకు కొంచెము కష్టముగా దోచెను. నాదృష్టిలో నత డనేకవిధముల గొప్పవాడే యైనను ఆధ్యాత్మికదృష్టిలేనివాడని యనుకొంటెని. ఒకప్పు డతడును దివ్యజ్ఞానసమాజికుడే. బహుశః మతముకొరకుగాక వినోదము కొఱకత డందులో చేరెను. కనుకనే వెంటనే తగ్గిపోయెను.

నా పదమూడవయేట నేను దివ్యజ్ఞాన సమాజికుడ నైతిని. బిసెంటుసతియే మంచిసలహా యిచ్చి కొన్ని యద్భుత చిహ్నములను గురించి బోధచేసి నాకు స్వయముగా నుపదేశముచేసెను. నేను పులకితగాత్రుడ నైతిని. ముప్పదియేండ్ల క్రిందట బాల్యమున మన మెట్లు కాన్పించెడివారమో, యెట్లు భావించెడివారమో చెప్పుట కష్టమే కాని, యీ నా దివ్యజ్ఞానపురోజులలో (ఒక్కొక్కడు పవిత్రతను సూచించు) నిర్జీవదృష్టిని కలిగియుండెడివాడనని నాకు జ్ఞాపకము. అది యిప్పటికిని తఱచు యీ సమాజ స్త్రీపురుషులలో కానవగును. దేవతాగణములో నొకడనని బిర్రబిగియుటచే నా యీడు బాల బాలికలకు నేను వెలియైతిని.

బ్రూక్సుదొర వెళ్లుటతోడనే నాకు దివ్యజ్ఞాన సమాజముతో సంపర్కము పోయెను. అనతికాలములోనే (కొంత నేను యింగ్లండుకు చదువుకు పోవుటచే) దివ్యజ్ఞానము నాజీవితమునుండి పూర్తిగా తొలగిపోయెను. కాని నాటినుండి నాకు దివ్యజ్ఞానసమాజికులయెడ గౌరవము నశించెను. వారు నెత్తిమీద దేవతలవలెగాక సామాన్యులవలె కాన్పించిరి. వారికి సాహసములేని, కడుపులోనీళ్ళుకదలని వేషము కావలెను; దేశభక్తునిశిలువ కాక సుకుమారజీవితము కావలెను. కాని బిసెంటుసతియందు మాత్రము నాకపరిమిత గౌరవముండెడిది.

తరువాత రష్యా జపాను యుద్ధము వచ్చెను. జపానుయొక్క విజయవార్తలు నాకత్యుత్సాహము కలిగింప ప్రతిదినము వార్తాపత్రికల కొఱకెదురుచూచెడివాడను.

చాలసొమ్ము ఖర్చుపెట్టి నేనెన్నియో జపాను పుస్తకములను తెప్పించి చదివితిని. జపానుచరిత్రలో నేను మైమరచినట్లయ్యెను.

నా మనస్సులో జాతీయభావములు నాటుకొనెను. యూరపుయొక్క దాస్యశృంఖలములనుండి ఆసియా, భారతదేశముల మోక్ష

మునుగురించి నేను తలపోసెడివాడను. చేత కత్తిబూని భారతదేశము కొఱకును, దానికి స్వేచ్ఛను సంపాదించుటకును వీరపురుషోచితకార్యముల నొనర్చునట్లు నేను కలలను గనుచుండెడివాడను.

నా పదునాల్గవయేట మాయింట చాలా మార్పులు గలుగుచుండెను. మా పెత్తండ్రులు పెద్దలై వారి వారి గృహములను ప్రత్యేకముగా నేర్పరచుకొనిరి. నా మనస్సులో క్రొత్తభావములు, అనిశ్చితములైన యూహలు మొలకెత్త నారంభించెను. కన్యలయెడ నాకు మరికొంత శ్రద్ధకలిగెను. నే నింకను బాలబృందముతో నుండుటకే యెక్కువ యిష్టపడెడివాడను. బాలికలతో కలియుట నాకు తగదనుకొంటిని. కాని మా కాశ్మీరస్థుల విందుల సందర్భములో (మాలో చక్కని పిల్లలకు కొదువలేదు) చూపులు లేక స్పర్శ పుల కాంకితముగ నుండెడివి.

నా పదిహేనవయేట, 1905 మే నెలలో మేము సకుటుంబముగా యింగ్లండు ప్రయాణమైతిమి.

4

హారో - కేంబ్రిడ్జి

మే నెలాఖరుకు మేము లండను చేరితిమి. త్రోవలో డోవరు వద్ద రైలెక్కుచు జపానుయొక్క సముద్రజయమునుగురించి చదివి నేను పొంగిపోతిని. మరునాడు డర్బీపందెములు చూడబోతిమి. మేము లండనులో దిగుటతోడనే అన్సారీగారిని కలుసుకొంటిమి. ఆయన గొప్పపరీక్షలలో పేరుప్రఖ్యాతులతో నుత్తీర్ణుడై లండను ఆస్పత్రిలో డాక్టరుగా నుండెను.

నాకు పదిహేను సంవత్సరము లుండుటచే బడిలో చేర్చుకొను వయస్సు కొంచెము మించినను అదృష్టవశమున నొక ఖాళీ దొరకెను. మా కుటుంబము యూరపు వెళ్ళి కొన్ని నెలలకు తిరిగి భారతదేశము చేరుకొనెను.

ఇదివర కెన్నడు నేను క్రొత్తవారిమధ్య నొంటరిగా నుండక పోవుటచే యింటిబెంగ కలిగెను. కాని యది యెంతకాలమో యుండలేదు. బడిజీవితము కొంతవరకు నాకు సరిపడెను. పనితోను ఆటలతోను నాకు తీరికలేక యుండెడిది. కాని నేను కేవలము వారితో నైక్యము కాజాలక కొంత యొంటరితనము తప్పెడిదికాదు. మొత్తముమీద నాటలలో పూర్తిగా జోక్యముకలిగించుకొనెడి వాడను. నాకు ల్యాటినుభాష రాకపోవుటచే నన్ను మొట్ట మొదట తక్కువ తరగతిలో పడవేసిరి. కాని త్వరలోనే నేను చటచట పైకివచ్చితిని. చాల విషయములలో ముఖ్యముగా విషయ జ్ఞానములో నేను నా యీడువారిని మించియుంటిని. పుస్తకములు, వార్తాపత్రికలు నేను చాల చదివెడివాడను. ఆంగ్ల బాలురకు ఆటలుతప్ప మరేమియు తెలియవని, వారు మొద్దులని మా తండ్రికి నేనువ్రాసినట్లు జ్ఞాపకము. కాని నేను పైతరగతులలోనికి పోయినకొలది కొంతమంది తెలివైనవా రుండెడివారు. అక్కడి యెన్నికలలో నేను శ్రద్ధతీసికొనెడివాడను. అవి 1905 చివర జరిగి లిబ

రలుపక్షము జయించెను. మా తరగతి ఉపాధ్యాయుడు 1906 లో మమ్ము క్రొత్తప్రభుత్వమును గురించి ప్రశ్నించెను. తరగతిలో నేనొక్క డనే దానికి సమాధానము చెప్పగలిగితిని. ప్రభుత్వ కార్యనిర్వాహక వర్గమువారి పేర్లనుకూడా పూర్తిగా నేకరువుబెట్టితిని. నా యుపా ధ్యాయు డాశ్చర్యచకితుడయ్యెను.

రాజకీయములేగాక వాయుయానముకూడ నన్నాకర్షించెను. రైట్ సోదరులు, డ్యూమాంటు అనువారలు నపు డిందులో ప్రము ఖులు. త్వరలోనే నేను నా వారపు శెలవులలో భారతదేశమునకు వాయువిమానములో రాగలుగుదునని మా తండ్రికి వ్రాసితిని.

హారోలో నాతో నలుగురైదుగురు భారతవిద్యార్థు లుండెడి వారు. నేను వారిని మాఇంటనే - ప్రధానోపాధ్యాయునిఇంట - కలుసు కొనెడివాడను. బరోడాగయిక్వారుగారికుమారు డొకడు మాతో నుండెడివాడు. అతడు నాకంటె చాల పెద్ద; క్రికెటులో విఖ్యాతుడు. నేను వచ్చిన కొద్దిరోజులకే యతడు వెళ్ళిపోయెను. తరువాత కపుర్థల మహారాజు పెద్దకుమారుడు పరమజిత్ సింగు, (తిక్కా-సాహెబు) వచ్చెను. అతని కచ్చటి పరిస్థితు లెంతమాత్రము సరిపడలేదు. అతడు యితరులతో కలియకపోవుటచే వా రతనిని వేళాకోళము చేసెడివారు. అతనికి కోపమువచ్చి "కపుర్థల వచ్చినచో మిమ్మేమి చేసెదనో చూడుడు" అనెడివాడు. కాని దీనివలన నతనిస్థితి బాగుపడలేదు.

నేను హారోలో బాగుగనేయుంటిని. కాని యది నాకు చాల నల్లు తోచుచుండెను. విశ్వవిద్యాలయము నన్నాకర్షించెను. 1906, 1907 లలోని భారతదేశ వార్తలు నన్నాందోళనపరుపసాగెను. ఇంగ్లీషు పత్రికలద్వారా వార్త లతిస్వల్పముగా వచ్చినను ఆ కొద్ది వార్తలే వంగదేశము, పంజాబు, మహారాష్ట్రములలో గొప్పగొప్ప విషయములు జరుగుచున్నట్లు తెలుపుచుండెను. లజపతిరాయి, అజిత సింగులు ప్రవాసమున కంపబడిరి. వంగదేశము గందరగోళముగా నుండెను. పూనాలో తిలకుగారిపేరు మార్మ్రోగుచుండెను. స్వదేశీ,

బహిష్కారములు ప్రారంభమయ్యెను. ఇదంతయు నన్నద్భుతముగా కదల్చివేసెను. వీనిని గురించి మాట్లాడుకొనదగినవాడు హారోలో నా కొక్క పిట్టయైనను లేకపోయెను. సెలవులలో నా స్నేహితులను, బంధుగులను కలుసుకొని నా మనస్సులోనున్న భావములను వెలిబుచ్చితిని.

నేను బడిలో బాగుగా చదివినందున నాకు 'గారిబాల్డీ జీవితము' బహుమతి యీయబడెను. ఈ పుస్తకము చాల బాగుండుటచే తదితర పుస్తకములనుకూడ తెప్పించి గారిబాల్డీకథ పూర్తిగా చదివితిని. హిందూదేశములోకూడ నిట్టి వీరకలాపదృశ్యములు, స్వాతంత్ర్య కదనములు నా కట్టెదుట కాన్పించెను. నా మనస్సులో ఇటలీ, హిందూదేశములు రెండును చిత్రముగా కలిసిపోయెను. ఈ భావములకు, నా చదువుకుకూడ హారో చాల చిన్నదిగా కాన్పించుటచే మా తండ్రి నొప్పించి నేను హారో విడిచితిని.

కేంబ్రిడ్జి, ట్రినిటీ కళాశాల 1907 అక్టోబరు ప్రారంభము; నా వయసు పదిహేడు లేక పదునెనిమిది. నా యిష్టమువచ్చినట్లు చేయుటకు బడిలోకంటె నెక్కుడుస్వేచ్ఛ! నా చిన్నతనము పోయినట్లు, పెద్దవాడనయినట్లు నేను గర్వించితిని. నేను కేంబ్రిడ్జి యిరుకువీథుల లోను, పెద్ద భవనములలోను సగర్వముగా నడిచెడివాడను. మూడు సంవత్సరములు ప్రశాంతముగా నేను కేంబ్రిడ్జిలో నుంటిని. స్నేహితులతోను, ఆటలతోను, పనితోను ఆ మూడు వత్సరములు సుఖముగా గడిచెను. నా బుద్ధి క్రమముగా వికసించుచుండెను. నేను ప్రకృతిశాస్త్రము ననగా రసాయన, వృక్ష, భూగర్భ శాస్త్రములను తీసుకొంటిని. అచ్చట నా తోటివారు చాలమంది పుస్తకములను గురించి, సాహిత్యమునుగురించి, చరిత్రనుగురించి, ఆర్థిక, రాజకీయములను గురించి పండితులవలె మాట్లాడుచుండిరి. మొదట వీరియర్థకృషి, పాండిత్యము నన్ను కొంచెము కంగారుపెట్టెను. నేను కొద్దిపుస్తకములు చదివినతోడనే దీనిపస తెలిసిపోయెను. మామూలు విషయములు నా కవగతమయ్యెను. నీట్షే, బెర్నార్డుషా, డికిన్సను మొదలగు

బహిష్కారములు ప్రారంభమయ్యెను. ఇదంతయు నన్నద్భుతముగా కదల్చివేసెను. వీనిని గురించి మాట్లాడుకొనదగినవాడు హారోలో నా కొక్క పిట్టయైనను లేకపోయెను. సెలవులలో నా స్నేహితులను, బందుగులను కలుసుకొని నా మనస్సులోనున్న భావములను వెలిబుచ్చితిని.

నేను బడిలో బాగుగా చదివినందున నాకు 'గారిబాల్డీ జీవితము' బహుమతి యీయబడెను. ఈ పుస్తకము చాల బాగుండుటచే తదితర పుస్తకములనుకూడ తెప్పించి గారిబాల్డీకథ పూర్తిగా చదివితిని. హిందూదేశములోకూడ నిట్టి వీరకలాపదృశ్యములు, స్వాతంత్ర్య కదనములు నా కట్టెదుట కాన్పించెను. నా మనస్సులో ఇటలీ, హిందూదేశములు రెండును చిత్రముగా కలిసిపోయెను. ఈ భావములకు, నా చదువుకుకూడ హారో చాల చిన్నదిగా కాన్పించుటచే మా తండ్రి నొప్పించి నేను హారో వీడితిని.

కేంబ్రిడ్జి, ట్రినిటీ కళాశాల 1907 అక్టోబరు ప్రారంభము; నా వయసు పదిహేడు లేక పదునెనిమిది. నా యిష్టమువచ్చినట్లు చేయుటకు బడిలోకంటె నెక్కుడుస్వేచ్ఛ! నా చిన్నతనము పోయినట్లు, పెద్దవాడనయినట్లు నేను గర్వించితిని. నేను కేంబ్రిడ్జి యిరుకువీథులలోను, పెద్ద భవనములలోను సగర్వముగా నడిచెడివాడను. మూడు సంవత్సరములు ప్రశాంతముగా నేను కేంబ్రిడ్జిలో నుంటిని. స్నేహితులతోను, ఆటలతోను, పనితోను ఆ మూడు వత్సరములు సుఖముగా గడిచెను. నా బుద్ధి క్రమముగా వికసించుచుండెను. నేను ప్రకృతిశాస్త్రము ననగా రసాయన, వృక్ష, భూగర్భ శాస్త్రములను తీసుకొంటిని. అచ్చట నా తోటివారు చాలమంది పుస్తకములను గురించి, సాహిత్యమునుగురించి, చరిత్రనుగురించి, ఆర్థిక, రాజకీయములను గురించి పండితులవలె మాట్లాడుచుండిరి. మొదట వీరియర్థకృషి, పాండిత్యము నన్ను కొంచెము కంగారుపెట్టెను. నేను కొద్దిపుస్తకములు చదివినతోడనే దీనిపస తెలిసిపోయెను. మామూలు విషయములు నా కవగతమయ్యెను. నీట్షే, బెర్నార్డుషా, డికిన్సను మొదలగు

వారి గ్రంథములను గురించి మేము చర్చించెడివారము. మేము నీతిని గురించి, స్త్రీ పురుష సంబంధమును గురించి గొప్పవారివలె మాట్లాడెడివారము. మధ్య మధ్య గొప్పవారి గ్రంథములనుండి యుదహరించెడివారము. పెద్దపెద్ద కబురులేగాని స్త్రీపురుషసంబంధములో మాలో చాలమంది పిరికివారు. అందులో నే నొకడను. కేంబ్రిడ్జి విడిచిన చాలసంవత్సరములవరకు నాకున్నది పుస్తకజ్ఞానమే. దీనికి కారణము నే నేమియు చెప్పజాలను. అది పాపమని మే మెవరము తలంచలేదు. నే నెప్పుడును తలంచలేదు. దానిని మతము నిషేధించుటలేదు. అందులో నీతిగాని యవినీతిగాని లేదు. అయినను నాకు కొంచెము సిగ్గుండెడిది.

కొంత వయస్సుచేత, కొంత ఆస్కార్ వైల్డు, వాల్టరుపేటరుల రచనలవలన జీవితము భోగయోగ్యమని నే నపుడు తలంచితిని. కాని కేవలభోగము లేక సుకుమారితనము నన్నాకర్షింపలేదు. మతస్వభావము లేక మతనిర్బంధములయెడ రోతగలిగిన నేను మరియొక ప్రమాణము చూచుకొంటిని. నేను ప్రతిదానిని లోతుగాచూడక బాహ్యముగనే చూచితిని. జీవితములోని యందచందములు, శృంగారము, భోగభాగ్యములు నైచ్యములేని సరసజీవనము నన్నాకర్షించెను. అట్టి జీవితమును నే ననుభవించితిని. నాకందులో పాపమెంతమాత్రమును కాన్పించలేదు. అయినను, త్యాగ, సాహసములు మాకు క్రొత్తలుకావు. నాతండ్రివలెనే నేనును మొదట డబ్బుతోను జీవితముతోను చెలగాటమాడు జూదరిని. 1907, 1908 లలో భారతరాజకీయములు గందరగోళముగనుండ నేను వాటిలో పాల్గొనవలెననుకొంటిని. ఇది సుకుమారజీవనముకాజాలదు. ఇట్టి మిశ్రమములు విరుద్ధములునగు భావములు నా మనస్సును కలవరపరచెను. అనిశ్చయము, కంగారు నన్ను పీడించెను. చివరకు నే నెట్టి నిశ్చయమునకు రాజాలకపోతిని. ఈలోపల జీవితము సుఖముగా సాగిపోవుచుండెను. దీర్ఘశీతవాసరనిశలందు మేము వెచ్చని పొగసెగను కూర్చొని చలి మమ్ము తరిమివేయువరకు సావకాశముగను తీవ్రముగను (ఒక్కొక్కప్పుడు కొట్టుకొనునట్లును) చర్చించుకొనుచుండెడివారము. జీవితసమస్యలు మాకింకను యదార్థములు కాలేదు. అవి

యుద్ధమునకు పూర్వపురోజులు. 20 వ శతాబ్ద ప్రారంభము. త్వరలో నీ ప్రపంచము నశించి మృత్యువు, వినాశము, ప్రపంచయువకుల హృత్సంతాపము, బాధ మొదలగువానితో నిండిన మరియొక ప్రపంచము రానుండెను. కాని భావి తెలియమి యగున నివి దాగియుండి యంతయు నిశ్చితమైన సక్రమాభివృద్ధిగనే కాన్పించెను.

సాగుబడికలవారి కిది యానందముగనేయుండెను. 1907 మొదలు చాలసంవత్సరములవఱకు హిందూదేశము ఆందోళనతో నుడికిపోవుచుండెను. 1857 తరువాత హిందూదేశము పరప్రభుత్వమునకు పిల్లివలె లొంగిపోకుండ పోరాడుట కిదియే ప్రథమము. తిలకుగారి కార్యకలాపములు, అతనిశిక్ష, అరవిందఘోషు, బెంగాలు, స్వదేశీ బహిష్కారోద్యమములు యింగ్లండులోని భారతీయులను కదల్చెను. మాలో విభీషణుడొక్కడూ లేకుండ మేమందరము 'తిలకీయులము' లేక నతివాదుల మయితిమి.

కేంబ్రిడ్జిలో భారతీయులకు 'మజ్లిసు' అను సంఘ మొకటి యుండెడిది. మేమక్కడ తఱచు రాజకీయములను చర్చించెడివారము. కాని యదంతయు మాకొక వినోదము. పార్లమెంటుపోకడలను, విశ్వవిద్యాలయ వాగ్వివాదములను శపథిపలను అనుసరించుటే మాపని గాని యదార్థవిషయములతో ఢీకొనుట మాపనికాదు. నేను 'మజ్లిసు'కు తఱచు వెళ్ళెడివాడను. కాని నే నెప్పుడును మాట్లాడియెరుగను. నాకు బిడియము మెండు. ఆత్మవిశ్వాసము తక్కువ. నా కళాశాల చర్చలలోకూడ నా యీ కష్టము తొలగిపోలేదు. అచ్చట టరము కొక్కసారియైన మాట్లాడనివానికి జుల్మానా వేయుదురు. తఱచు నే నా జుల్మానా చెల్లించుకొంటిని.

'మజ్లిసు' లోను, యిండ్లవద్ద సంభాషణలలోను భారతవిద్యార్థులు భారతరాజకీయములనుగురించి చర్చించునపు డతిఘాటుగా మాట్లాడెడివారు. వా రప్పుడు బంగాళములో ప్రారంభమగుచుండిన దౌర్జన్య కృత్యములను మెచ్చుకొనుచుండినట్లుకూడ మాట్లాడెడివారు. తరువాత నీయోధులే కలెక్టర్లు, హైకోర్టుజడ్జీలు, చలనములేని

లాయర్లు నయిరి. తరువాత జరిగిన భారతరాజకీయ సంరంభములలో నీ పడకగది అగ్గిరాము లెవరు కానరారైరి! అప్పటి రాజకీయవేత్తలలో పెద్దలుకొందరు మమ్ము కేంబ్రిడ్జిలో కలుసుకొనిరి. మేము వారిని గౌరవించితిమి కాని మా విజ్ఞానము గొప్పదియని, మేము విషయములను విశాలదృష్టితో చూడగలమని, వారికంటె నధికుల మని విఱ్ఱవీగెడివారము. వారిలో బిపిన్‌చంద్రపాల్, లజపతిరాయి, గోక్లే మొదలగువారు కలరు. పాలుగారిని మా యతిథిగృహములో కలుసుకొంటిమి. మేము పన్నెండుమంది మాత్రమే యున్నను పదివేలమంది కుపన్యసించుచున్నట్లుత డురుముచుండెను. ఆ రణగొణ ధ్వనిలో నతడు చెప్పినది నాకు తెలియలేదు. లాలాజీ సహేతుకముగ మాట్లాడెను. పాలుగారి యుపన్యాసముకంటె లాలాజీది బాగుండెనని నేను తండ్రిగారికి వ్రాయగా మాతండ్రి చాల సంతసించెను. గోక్లేగారు కేంబ్రిడ్జిలో బహిరంగోపన్యాసమిచ్చెను. ఈ సభలో చివర క్వాజాగారు లేచి యంతుపొంతులేని యొక పెద్దప్రశ్న వేసిరి. ప్రశ్న సమాప్తమగుసరి కది యెట్లు ప్రారంభమయ్యెనో, విషయ మేదియో మేము మరచిపోతిమి. హార్దయాలు భారతీయులలో మంచి కీర్తిసంపాదించెను. నేను కేంబ్రిడ్జిలోనుండుటకు కొద్ది పూర్వ మతడు ఆక్సఫర్డులో నుండెను. నేను హారోలో నున్న రోజులలో రెండుసారు లతనిని లండనులో కలుసుకొంటెని. కేంబ్రిడ్జిలోని నా సహపాఠులలో చాలామంది కాంగ్రెసు రాజకీయములలో తరువాత చాల ముఖ్యపాత్రలను ధరించిరి. సేనుగుప్త నేను వెళ్ళిన కొద్ది కాలములోనే కేంబ్రిడ్జి వీడెను. కిచలూ, షెర్వానీగారలు కొంచె మించుమించు నా సమకాలీకులు. కొంతమంది సమకాలీకులు మంత్రులు, కలెక్టర్లు అయిరి. లండనులో మేము శ్యామ్‌జీ క్రిష్ణవర్మను గురించి, యతని భారతగృహమును గురించి వినుచుండెడివారము. కాని నే నెన్నడు నతనిని కలియలేదు. ఆ యింటెని చూడలేదు. ఒక్కొక్కప్పు డతని పత్రికను చూచెడివారము. 1926 లో నే నతనిని జినీవాలో కలుసుకొంటెని. అతనిజేబు లెప్పుడు తన పాతపత్రికలతో

నిండియుండెడివి. అతనివద్దకు వచ్చిన ప్రతి భారతీయుడు బ్రిటిషు ప్రభుత్వ గూఢచారియేయని యత డనుకొనెడివాడు. లండనులో కూడ భారత కార్యాలయముచే తెరువబడిన విద్యార్థి కేంద్ర మొకటి యుండెడిది. భారత విద్యార్థులను పొంచుండుట కిది యేర్పడెనని భారతీయులచే భావింపబడుచుండెడిది. చాలమంది భారతీయులు తమ కిష్టమున్నను లేకున్నను దీనిని సహింపక తప్పదయ్యెను. దీని శిఫార్సు లేనిదే ఏ విశ్వవిద్యాలయములోను జేరుట యసాధ్యము.

హిందూదేశ రాజకీయములలో మా తండ్రి ప్రవేశించెను. నే నతని రాజకీయములతో నేకీభవింపకపోయినను దీనికి సంతోషించితిని. అతడు తనస్నేహితులు, చాలమంది తోటివకీళ్లునయిన మితవాదులలో జేరెను. అతడు తన రాష్ట్రములో నొక రాజకీయసభ కధ్యక్షుడై మహారాష్ట్ర, బంగాళముల యతివాదులను ఖండించెను. అతడు రాష్ట్ర కాంగ్రెసుకమిటీ అధ్యక్షుడుగకూడ నుండెను. అతడు 1907 లో సూరతు కాంగ్రెసు విచ్ఛిన్నమై కేవలము మితవాద సంఘముగా తేలిననా డచ్చటనే యుండెను. ఇది జరిగిన వెంటనే నెవిన్సను అలహాబాదువచ్చి మా తండ్రి కతిథిగా నుండెను. అతడు 'యిండియా' పుస్తకములో మాతండ్రి "ఉదారతలోతప్ప యన్నింటిలోను మితవాది" యని వ్రాసెను. ఇది చాల పొరపాటు. మా తండ్రి తన రాజకీయములలోతప్ప మరెందులోను మితవాదికాడు. క్రమముగా నతని స్వభావ మీ కొద్దిపాటి మితవాదమునుకూడ త్రోసివేసెను. తీవ్రభావములు, తీవ్ర యనురాగ విరాగములు, అమితమైన యభిమానము, గొప్ప బుద్ధిబలము—ఇన్ని కలవాడు మితవాది యెట్లగును? కాని 1907, 1908 లలోను తరువాత కొంతకాలమున కతడు మితవాదులలో మితవాదిగనుండి యతివాదులపై కారములు మిరియములు నూరుచుండెను. దీనికి కారణమేమి? అతడు న్యాయచట్ట నిబంధనలమధ్య పెరిగినవాడగుటచే, రాజకీయముల నా దృష్టితో చూచుట సహజము. ఎట్టి కార్యకలాపములేని శుష్కప్రలాపముల వలన లాభము లేదని యతడు స్పష్టముగా చూడగలిగెను. స్వదేశీ,

బహిష్కారములం దాయనకంత శక్తి కాన్పించలేదు. ఈ యుద్యమముల వెనుకనున్న మతముతో మిళితమైన జాతీయత యతనికి గిట్టదు. హిందూదేశములో తాతలనాటి రోజులు తిరిగివచ్చుట కతని కెంత మాత్రము నిష్టములేదు. తాతలనాటి సాంఘికాచారములు, కులతత్వములు మొదలగునవి మన యభివృద్ధి నరికట్టునవియని యతడుతలంచెను. అతడు పాశ్చాత్యుల యభివృద్ధిచే మోహితుడయి యింగ్లండుతో కలసి యుండినగాని యిది చేకూరనేరదని భావించెను.

సాంఘికముగా చూచినచో 1907 నాటి జాతీయత హానికరముగనేయుండెను. ప్రాచ్యదేశములలో నితర చోట్లవలెనే యిచ్చటను క్రొత్త జాతీయత మతముతో కూడియుండెను. సాంఘికదృష్టిలో మితవాదులదే ముందంజ యయ్యెను. కాని వారు ప్రజా సామాన్యముతో సంబంధములేక యుండెడివారు. ఆర్థిక దృష్టితో వా రంతగా చూడక పైనున్న మధ్యతరగతులవారి దృక్పథముతో చూచెడివారు. వా రభివృద్ధికి భంగకరములైన ప్రాచీన కులాచారములను త్రోసివేయు చిన్న చిన్న సాంఘిక సంస్కరణములను కూడ సమర్థించెడివారు. మితవాదులతో జేరి తండ్రిగారు తీవ్రరూపమును దాల్చిరి. బంగాళము, పూనాలలో నేకొద్దిమంది నాయకులోతప్ప తక్కిన యతివాదులందరు యువకులు. యువకు లిట్లు వారిష్టమువచ్చినట్లు బరితెగించు టతనిని రెచ్చగొట్టెను. వ్యతిరేకము నతడు సహింపజాలక తాను మూర్ఖులనుకొనిన వారిపై ధ్వజమెత్తుచు సమయము దొరికినపుడు వారిపై దుముకుచుండెను. అతని వ్యాసమొకటి నన్ను కలత బెట్టెను. తనరాజకీయములతో బ్రిటిషు ప్రభుత్వము తృప్తిపడగలదని సూచించునట్లు నేనాయనకు వ్రాసితిని. నా సూచన కాయన మండిపడి నన్ను తక్షణమే యింగ్లండు నుండి రమ్మని వ్రాయవలెనను కొనెను. నేను కేంబ్రిడ్జిలోనుండగా నా వృత్తివిషయమై చర్చవచ్చెను. కలెక్టరు పరీక్షకు చదువవలెనని యూగిసలాడితిమి. దానియెడల నా రోజులలో నింకను మోహముకలదు. కాని మా తండ్రికి, నాకు దానియందంత మోహము లేకపోయెను. నేను కేంబ్రిడ్జిలో డిగ్రీ

తీసుకొనుసరికి నాకు 20 సంవత్సరములు. అప్పుడు 22 మొదలు 24 వరకు కలెక్టరు పరీక్షకు పోవలెను. పరీక్షలో నుత్తీర్ణుడనైనచో మరియొక వత్సర మచ్చట నుండవలెను. మొత్తము మరి నాలుగేండ్లు. నేను యింగ్లండులో చాలకాల ముంటినని మా కుటుంబమువారికి విసుగు జనించెను. నేను కలెక్టరునైనచో హిందూదేశములో నన్నే మూలకో విసిరి వేసెదరు. నేను తమయొద్దనే యుండవలెనని మా తల్లి దండ్రులు కోరుచుండిరి. ఇట్టి యనేక కారణములచే మా తండ్రి వృత్తినే (బారిష్టరు) ఖాయము చేసుకొంటిమి. 1910 లో డిగ్రీ తీసుకొని నేను కేంబ్రిడ్జి వీడితిని. నేను నా పరీక్షలో రెండవ తరగతిలో నుత్తీర్ణుడనై తరువాత రెండు సంవత్సరములు లండను చుట్టుపట్ల తిరుగుచుంటిని. నా బారిష్టరు చదువున కంతకాలము పట్టెడిదికాదు. నేనంత పేరుప్రఖ్యాతులుగాని, యపఖ్యాతిగాని లేకుండ నా పరీక్షలలో క్రమముగా నుత్తీర్ణుడనైతిని. పుస్తకములను చదువుచు సామ్యవాద భావములచే నాకర్షింపబడుచు నప్పటి రాజకీయములందు శ్రద్ధతీసికొనుచు నేను తక్కిన కాలము నెట్లో గడిపెడివాడను. ఐర్లండును, స్త్రీల స్వాతంత్ర్యోద్యమమును నేను ప్రత్యేకముగా నభిమానించెడివాడను. 1910 లో నేను ఐర్లండు చూడబోతిని. అప్పుడే ప్రారంభమగుచుండిన 'సిన్ ఫీన్' యుద్యమము నన్నాకర్షించెను. నేను కొంతమంది హారో స్నేహితులతో కలసి దూబరా ఖర్చు మొదలు పెట్టుటచే మా తండ్రి మస్తుగా పంపెడుసొమ్ము నాకు చాలెడిదికాదు. నేను పాడైపోవుచుంటినని మా తండ్రి ఖేదపడసాగెను. కాని నే నట్టిపనులేమియు చేయుటలేదు. నేను 'నగర త్రిపాది' యని పిలువబడు ధనికుడైన బుర్రలేని యింగ్లీషువాని ననుకరింప యత్నించుచుంటిని. అర్థములేని యీ సుకుమార జీవనమువలన నా కేమియు ప్రయోజనము లేక పోయెను. నా సెలవులలో నేను యూరపు వెళ్లుచుండెడివాడను. 1909 వేసవిలో మా తండ్రి, నేను బెర్లినులో నుంటిమి. అప్పుడే జెప్లిను ప్రభువు తన క్రొత్త విమానములో కాన్‌స్టన్సు కాసారమునుండి యెగిరివచ్చెను. అతని దూర ప్రయాణముల కదియే

ప్రథమమగుటచే పెద్దయుత్సవము జరిగెను. కైజరు స్వాగతమిచ్చెను. 20 లక్షలమంది విమానాశ్రయమువద్ద గుమిగూడగా నది యాకాశ మున రివ్వురివ్వున తిరుగుచు సకాలమునకు వచ్చి వ్రాలెను. ఆడ్ లాన్ హోటలు వారా రోజున జెప్లిను ప్రభువు పటములను పంచిపెట్టిరి. ఆ పట మింకను నాయొద్దకలదు. తరువాత రెండు నెలలకు పారిసు పట్టణమంతయు తిరిగిన మొదటి విమానము మేము చూచితిమి. లామ్‌బర్టు అనునతడు దానిని నడిపెను. 18 వత్సరముల తరువాత నేను తిరిగి పారిసువచ్చినపుడు లిండ్‌బర్గు అట్లాంటిక్కునుండి తళతళ మెరయు బాణమువలె వచ్చిపడెను. నేను 1910 లో డిగ్రీ తీసికొని యొక చిన్ననావలో నార్వే వెళ్ళినపు డొకప్రమాదము తప్పెను. మే మొక పర్వతసీమలో తిరుగుచు నలసి, సొలసి, యెండదెబ్బతిని ఒక చిన్న హోటలుజేరి స్నానము చేయవలెననుకొంటిమి. స్నానమనునది యచ్చటి వారికి క్రొత్త. అచ్చట నట్టియేర్పాటు లేమియు లేవు. కాని సమీప మునన్న నదిలో స్నానము చేయవచ్చునని. ఒక యింగ్లీషు యువ కుడు నేను రెండు చిన్న తుండుగుడ్డలను తీసికొని గర్జించుచున్న యా నదిలో దుమికితిమి. అది యంత లోతులేదు, కాని చాల జారుగా నుండెను. చలిచే గడ్డకట్టుచుండెను. నేను జారిపడితిని. నా యవయవ ములు కొంకరలువోయి శరీరస్మృతితప్పిపోయి నేను నీటిలో కొట్టు కొనిపోవుచుండ నా స్నేహితుడు గట్టుననుండి పరుగెత్తుకొనివచ్చి కాలుపట్టుకొని నన్ను పైకి లాగివేసెను. ఇంగ్లండులో నేడు సంవత్స రము లున్నతరువాత 1912 శరత్కాలమున నేను హిందూదేశమునకు తిరిగివచ్చితిని. ఈ మధ్యకాలము సెలవులలో రెండుసార్లు మాత్రమే నే నింటికి వచ్చితిని.

5

భారతదేశములో యుద్ధకాలపు రాజకీయములు

1912 అంతమున హిందూదేశములో రాజకీయములు నిర్జీవముగ నుండెను. తిలకు జయిలులో నుండెను. తగిన నాయకత్వము లేక నతివాదులు చతికిలబడిరి. రాష్ట్రవిభజన రద్దగుటతోడనే వంగదేశము చల్లబడెను. మితవాదులు మింటో మోర్లేశాసనసభాపథకము చుట్టూ మూగిరి. సముద్రాంతములందు ముఖ్యముగా దక్షిణాఫ్రికాలో నున్న భారతీయులపట్ల కొంత శ్రద్ధచూపబడుచుండెను. కాంగ్రెసు కొన్ని తీర్మానములను చేయుచు నెవరిని యాకర్షింపక నేటేట కూడు మితవాదకూట మాయెను. నేను 1912 లో బంకిపురపు కాంగ్రెసుకు వెళ్ళితిని. అది యింగ్లీషు తెలిసిన పైతరగతివారి వ్యాపారము. ప్రతిచోట ప్రాతఃకాలకోటులు, యిస్త్రీ చేయబడిన సూటులు కాన్పించెను. అది రాజకీయోద్రేకములేని పెద్దల సమావేశము. గోఖ్లే హాజరయినవారిలో ముఖ్యుడు. మంచిశక్తి, అతిశ్రద్ధ, నిశితమైన యభిమానము గలిగి యతడు రాజకీయములందు, ప్రజాసేవయందు, మంచి శ్రద్ధవహించుచుండెను. అతనియెడల నాకు మంచి యభిప్రాయము కలిగెను.

గోఖ్లే బంకిపురమును వీడునపు డొక చిత్రము జరిగెను. అపు డతడు పబ్లికుసర్వీసెసు కమీషనుసభ్యుడగుటచే ప్రత్యేక మొదటితరగతి రైలుపెట్టెలో ప్రయాణముచేయుట కర్హుడై యుండెను.

అతని కపు డస్వస్థతగా నుండెను. జనులు గుంపులుగుంపులుగ వచ్చి యతనిని వేధించుచుండ ప్రశాంతముగా ప్రయాణముచేయవలెనని యతడు తనపెట్టెలో నెక్కెను. తక్కిన పెట్టెలు కలకత్తాకు తిరిగిపోవుచుండిన కాంగ్రెసుప్రతినిధులతో నిండియుండెను. భూపేంద్రనాథబాసు (తరువాత కౌన్సిలుసభ్యుడయ్యెను) మెల్లగావచ్చి తన పెట్టెలో నెక్కవచ్చునాయని గోఖ్లేగారి నడిగెను. గోఖ్లే చాల మొగ

మాటముగలవాడగుటచే నొప్పుకొనెను. కొంచెము సేపయినతరువాత బాసుగారు మరలవచ్చి తన స్నేహితుడుగూడ రావచ్చునాయని ప్రశ్నించెను. అతడు దానికిని యొప్పుకొనెను. స్నేహితు లిరువురు పైనున్న స్థలములో కూర్చొనుట కష్టముగానుండుననియు, క్రింది రెండు స్థానములను తమకిచ్చి గోక్లే పయిన పరుండవచ్చుననియు బాసుగారు బండి కదులుటకు సిద్ధముగా నున్నప్పుడు వచ్చి మెల్లగా సెలవిచ్చిరి. పాపము గోక్లేగా రట్లే చేసిరి.

నేను హైకోర్టులో చేరితిని. దానియందు నాకు కొంత యభిరుచి కలిగెను. నేను యింగ్లండు నుండి తిరిగివచ్చిన మొదటిరోజులు బాగుగనేయుండెను. ప్రాత సంబంధములను కల్పుకొనుచుంటిని. కాని నా తోడివారితో కలిసి నేను గడుపుచుండిన జీవితము నిరర్థకమైన వ్యర్థజీవితముగా కాన్పించెను. నా పరిసరములతో సంతుష్టి చెందకుండుటకు నా సంకర విద్యయే కారణము. యింగ్లండులోనున్న ఏడు సంవత్సరములలో నా యాచారములు భావములు వేరు. ఇచ్చటి పరిస్థితులు వేరు. అదృష్టవశాత్తు నా యింటిపరిస్థితులు బాగుగనే యుండెను; కాని అంతమాత్రముతో నేమగును ? కొంతకాలము వకీళ్ళ లైబ్రరీలోను, క్లబ్బులలోను చెల్లెడిది. రెంటిలోను ఒకే మనుష్యులొకే విషయములను గురించి (అదియు మా వృత్తికి సంబంధించి) పదేపదే చర్చించుచుండుటచే బుద్ధివికాస మేమియు లేక జీవితము నిరర్థకముగా కాన్పించెను. మంచి వినోదములు కాలక్షేపములు లేవయ్యెను.

"రెండుజాతులు నేల కలుసుకొన నేరవు ? భారతీయులింగ్లీషు వారిని విసిగింతురుగనుక, అభేద్యమైన కారణమిదియే!" అని యొక యాంగ్లేయుడు వ్రాసెను. చాలమంది యాంగ్లేయులిట్లే భావింపవచ్చును. ఇందులో నాశ్చర్యములేదు. పై గ్రంథకర్తయే భారతదేశములో ప్రతి యాంగ్లేయుడు దేశము నాక్రమించుకొనిన సైన్యములో తానొక సభ్యుడనని భావించి యట్లే ప్రవర్తించుననియు నీ పరిస్థితులలో రెండు జాతుల మధ్య నెట్టి నిర్బంధములు లేని సహజ

బాంధవ్యముండుట యసంభవమనియు మరియొక గ్రంథములో వ్రాసెను. ఆంగ్లేయులు భారతీయుడు నొకరినొకరెప్పుడు మోసపుచ్చుచున్నారు. కనుక వారికి సహజ స్నేహమెట్లు సంభవించును ?

మామూలుగా ఆంగ్లేయు డెప్పుడు నొకేతరహా మనుష్యులను (తన ఆఫీసు ప్రపంచమునకు సంబంధించినవారిని) కలుసుకొనును. అసలైనవారి నత డెప్పుడును కలియడు. కలియునో పలకరించడు. భారతదేశములో బ్రిటిషు పరిపాలనవలన నుద్యోగ జాతికి ప్రాధాన్యత వచ్చెను. వారు సంఘపెద్దలైరి. యీ జాతి అత్యంత నిర్జీవమైనది. సంకుచిత బుద్ధిగలది. మంచి కుశాగ్రబుద్ధిగల ఇంగ్లీషు యువకుడైనను భారతదేశములో కాలిడిన తోడనే వాని బుద్ధి విజ్ఞానములు మందగించును. సజీవభావములకు నుద్యమములకు దూరుడగును. ఒకరోజు ఆఫీసులో అంతుపొంతులేని కాగితపు కట్టలను తిరుగవేసిన తరువాత నతడు కొంత కసరతుచేసి క్లబ్బుకుపోయి తనవారితో గలిసి విస్కీ త్రాగి యింగ్లండు నుంచి వచ్చు సచిత్ర వారపత్రికలను చదువును. అతడు పుస్తకములను చదువనేచదువడు. చదివిన నే ప్రాత గ్రంథమునో పైకి దీయును. యీ క్రమాగత బుద్ధిమాంద్యమున కతడు భారతదేశమును నిందించును. శీతోష్ణస్థితులను శపించును. తన కష్టములను పెంచుచున్నారని యాందోళనపరుల నాడిపోయునేకాని సంకుచితబుద్ధిగల నిరంకుశ ప్రభుత్వవిధానమే దీనికంతకు కారణమని, దానిలో తానొక చిన్నభాగమని యతడు గ్రహింపడాయెను! సెలవులు, ఫర్లోలు అనుభవింపగల ఇంగ్లీషు యుద్యోగిగతియే ఇదియైనచో నతని క్రింద పనిచేయు భారతోద్యోగిగతి వేరె చెప్పవలెనా? ఇంగ్లీషుఫక్కీననుకరించుటకే యతడు ప్రయత్నించును. ఆంగ్లసామ్రాజ్యమున కాస్పదమైన నూతన ఢిల్లీలో గొప్ప గొప్ప ఆంగ్ల, భారతీయోద్యోగులవద్ద కూర్చుని ప్రమోషన్లు, ఫర్లోలు, బదిలీలు, సెలవుగొడవలు, ఉద్యోగస్తులలో జరుగు యవినీతి, కథాకాలక్షేపములు మొదలగువానితో గూడిన వారి యనంతసంభాషణలను వినుటకంటె విషాదము వేరొండు యుండబోదు.

ఈ యుద్యోగవాతావరణమే, నౌఖరీసంప్రదాయమే హిందూదేశ మధ్యతరగతులవారందరికి, ముఖ్యముగా యింగ్లీషు చదువుకొన్న విద్యాధికబృందమునకు పరమపావనమయ్యెను. ఇతరవృత్తులవారు, డాక్టర్లు, లాయర్లు మొదలగువారుగూడ దీనికే జోహారులైరి. అర్థ ప్రభుత్వ విశ్వవిద్యాలయ పరిషత్సభలకు నిదియే జబ్బు. వీరందరు నొక ప్రత్యేక ప్రపంచములో జీవింతురు. రాజకీయము లీ పైతరగతివారికే సంబంధించెను. 1906 నాటి జాతీయోద్యమము మొట్టమొదటిసారి యీ మాంద్యమును తొలగించి మధ్యతరగతివారిలోని క్రిందవారికి, కొంతవరకు ప్రజాసామాన్యమునకు నూతనజీవము నిచ్చెను. గాంధీజీ నాయకత్వముక్రింద నిది మరింత త్వరితగతినిచెందెను. కాని జాతీయ పోరాటము సచేతనమైనను సంకుచితమైనది. అది యితర కార్యములకు తావీయకుండ మనశక్తిని, కాలమును మ్రింగివేయును.

కనుక నే నింగ్లండునుంచి తిరిగి వచ్చినకొత్తరోజులలో జీవితముతో విసుగుజెందితిని. నావృత్తితో నేను తృప్తిచెందలేదు. రాజకీయములు దీనికి తగియుండలేదు. నేను కాంగ్రెసులోజేరి సభలలో పాల్గొనుచుంటిని. ఫిజీకి పోవు భారత నిర్బంధకూలీలకు, దక్షిణాఫ్రికా భారతీయులకు సంబంధించిన ప్రత్యేకవిషయములు వచ్చినప్పుడు నేను నా శక్తిసామర్థ్యములన్నింటిని వినియోగించి పనిచేసెడివాడనుకాని యివి తాత్కాలికములు. నే నప్పుడప్పుడు వేటకు బోయెడివాడను.

నాకు దానియందు ప్రత్యేక వ్యసనములేదు. కాని యరణ్యమనినను, విహారములనినను ప్రీతి. జంతువులను చంపుటయందు నాకు ప్రావీణ్యత లేదు. నేను దానికొరకు యత్నించెడివాడను కాను. కాశ్మీరములో నేనొకసారి యొక యెలుగును చంపితిని. మరియొకసారి లేడిని కొట్టితిని. నిరపరాధియైన యా చిరుతప్రాయపు లేడి నా కాళ్ళముందరపడి జొట జొట కన్నీరుకారు తన విశాలనేత్రములతో నన్నాపాదమస్తకము చూచి ప్రాణములు విడిచెను. దానితో నాకున్న కొద్దిపాటి వేటతమకము నశించెను.

ఆ నేత్రములప్పటినుండియు నన్ను తరచు వేధించుచునేయుండెను. గోఖ్లేగారి 'భారతసేవక సంఘము' నన్నారోజులలో నాకర్షించెను. నావృత్తిని వీడుటకు నాకపుడిష్టము లేకపోవుటచేతను, దాని రాజకీయము లతి మితవాదముగ నుండుటచేతను నేనందులోచేరవలెనని యెన్నడు ననుకొనలేదు. కాని దేశసేవకొరకతి స్వల్పవేతనములతో తృప్తిపడిన యాసంఘసభ్యులయెడల నాకెక్కుడు గౌరవముండెడిది. ఇది పూర్తిగా సరియైన పద్ధతులలో లేకపోయినను తదేకదీక్షతో గూడిన యెడతెగని పని కిచ్చుట నవకాశమున్నదని నేనుభావించితిని. కాని రాజకీయములతో సంబంధమెంతమాత్రము లేని యొక చిన్నవిషయములో శ్రీనివాస శాస్త్రిగారు నా కాశ్చర్యము కలిగించిరి. ఆయన యలహాబాదులో విద్యార్థుల కుపన్యసించుచు వారు మర్యాదగ మెలగవలెనని, యుపాధ్యాయులయెడల, పండితులయెడల వినయవిధేయతగ నుండవలెనని, చట్టబద్ధమైన ప్రభుత్వముచే తయారుచేయబడిన నియమ, నిబంధనలనన్నింటిని జాగ్రత్తగ పాటింపవలెనని బోధించిరి. ఈ ధర్మపన్నములను చదువుట నాకెంతమాత్రము నచ్చలేదు. అధికారతత్త్వమునకే ప్రాశస్త్యమునిచ్చు యీతత్త్వబోధ యనవసరముగ కాన్పించెను. హిందూదేశములో ప్రబలిన నౌఖరీతత్వమే దీనికి కారణమని నే ననుకొంటిని. శాస్త్రిగారింకను చెప్పుచు విద్యార్థులు తాము చేసెడి దోషముల నన్నింటిని వెంటనే యధికారులకు తెలియపర్చవలెననిరి. అనగా నొకరిపై నొకరు గూఢచారిగ నుండవలెను. శాస్త్రిగారీ కఠినపదముల నుపయోగించలేదు. కాని వాటిభావము సుస్పష్టముగనేయుండెను. ఒక గొప్ప నాయకుని యిట్టి మిత్రవాక్యములకు నే నచ్చెరువందితిని. ఇంగ్లండునుండి నేను క్రొత్తగా వచ్చితిని. అచ్చట పాఠశాలలలోను కళాశాలలలోనుగూడ సహపాఠి నెన్నడు మోసపుచ్చరాదనియే నాకు బోధింపబడెను. కొండెములనుచెప్పి, మూటలుమోసి తోడివానిని కష్టములలో త్రోయుటకంటె వేరుపాపములేదు. ఈ సూత్రముకు కేవల భిన్నమైన శాస్త్రిగారి నీతికిని నాకు నేర్పబడిన నీతికిని చాల భేదము కలదు.

ప్రపంచయుద్ధము మా దృష్టి నాకర్షించెను. అది దూరమున జరుగుచుండుటచే మొదట మన జీవితముల నంతగా బాధించలేదు. దాని భయంకర రూపమును హిందూదేశ మెన్నడు చూడలేదు. రాజకీయము లంతరించెను. భారత రక్షణచట్టము దేశమును నులిమివేయుచుండెను. రెండవయేడు దాటినతరువాత కుట్రలు, కాల్పులు మొదలగు వార్తలు వినవచ్చెను. పంజాబులో సైనికులను జేర్చు విపరీత విధానము బయటపడెను.

రాజభక్తి ప్రమాణము లెంత గట్టిగా వినవచ్చినను బ్రిటిషు వారియెడల నభిమానము లేకుండెను. మితవాదులు నతివాదులు గూడ జర్మనువిజయములను గుతూహలముతో వినుచుండిరి. జర్మనుల యెడల ప్రేమలేదు. కాని మన ప్రభుత్వ పరాజయము చూడవలెననియే మా కోరిక. దుర్బలుడు, అసహాయుడు నగువాడిట్లే యితరులు పగదీర్చుటను జూచి యువ్విళ్లూరును. యుద్ధముచేయుచున్న దేశములన్నిటిలో ఫ్రాన్సుమీద నా కెక్కు డభిమానముండెను. మిత్రమండలివారి యెడ తెగని ప్రచారము కొంత పనిచేసెను.

క్రమముగా రాజకీయ జీవితము మరల హెచ్చుజొచ్చెను. లోకమాన్యతిలకు జైలునుండి వచ్చి బిసెంటుసతితో హోమురూలు సంఘములను స్థాపించుచుండెను. నేను వారిద్దరను కలుసుకొంటిని. కాని ప్రత్యేకము బిసెంటు సంఘమునకే పనిచేసితిని. బిసెంటు భారత రాజకీయరంగములో ముఖ్యపాత్ర ధరింపసాగెను. కాంగ్రెసు సభలలో తీవ్రత హెచ్చెను. ముస్లిముసంఘము కాంగ్రెసుతో సమముగా నడువసాగెను. వాతావరణ ముత్సాహపూరిత మగుచుండెను. చాలమంది యువకులము త్వరలో గొప్పవిషయములు జరుగగలవని యాశించుచుంటిమి. బిసెంటు ప్రవాసము విద్యార్థికులను రెచ్చగొట్టి హోమురూలు సంఘములను దేశమంతట విజృంభింపజేసెను. 1907 లగాయతు కాంగ్రెసును వీడిన యతివాదులేగాక చాలమంది మధ్య తరగతివారు గూడ వీనిలో చేరిరి. కాని యివి ప్రజలను ముట్టలేదు. బిసెంటు ప్రవాసము మితవాదనాయకులను వృద్ధసంతతివారిని కూడ

కదల్చెను. ప్రవాసమునకు కొంచెముముందు శ్రీనివాసశాస్త్రిగారి గంభీరోపన్యాసములను పత్రికలలో చదివి మేమానందించెడివారము. కాని ప్రవాసమునకు కొంచెము ముందో లేక వెనుకనో శాస్త్రిగారేలకో హఠాత్తుగా మూకీభావము వహించిరి. కార్యాచరణకు గడంగవలసిన సమయమువచ్చినపు డాయన మమ్ము పూర్తిగా విడిచివేసెను. నాటి నుండి శాస్త్రిగారు కార్యదక్షుడు కాడనియు, నుపద్రవముల నెదుర్కొనుట కాయన బుద్ధివిశేషము పనికిరాదనియు నేను విశ్వసించితిని. ఇతర మితవాద నాయకులు ముందంజవేసిరి. కాని కొందరు తరువాత వెనుకాడిరి. కొందరు నిల్చిపోయిరి. భారతదేశ రక్షకసైన్యములో భారతీయులను జేర్చు సందర్భములో పెద్ద చర్చ జరిగెను. భారతీయులకు యూరోపియనులకు ననేక విషయములలో నవమానకరములైన విభేదములు గల్పింపబడెను. యువకులకు కొద్దిపాటి సైనికశిక్షణమైనను అబ్బునను కారణముతో చివరకు తొడ్పడుటకే మేమంగీకరించితిమి. ఈ పనిని సాగించుట కలహాబాదులో నొక కమిటీకూడ యేర్పరచితిమి. నేను నా దరఖాస్తు పంపితిని. ఇంతలో బిసెంటుప్రవాసము వచ్చెను. ఆ వేడిలో కమిటీసభ్యులను— మా తండ్రి, చింతామణి మొదలగు వారిని ప్రభుత్వ చర్యను గర్హించుటకే పనినంతను రద్దుచేయునట్లొప్పించితిని. దీనిని బహిరంగముగా తెలియపరచితిమి. ఈ దుడుకు కార్యమునకు తరువాత కొంతమంది విచారించిరట.

బిసెంటుప్రవాసముతో మాతండ్రి మరికొంతమంది మితవాద నాయకులు హోమురూలు సంఘములో జేరిరి. కొన్ని నెలలైన తరువాత మితవాద బృందము జారిపోయెను. మా తండ్రి నిలిచియుండి యలహాబాదుశాఖ కధ్యక్షుడయ్యెను. క్రమముగా మా తండ్రి సనాతన మితవాదమతమును బోగొట్టుకొనుచుండెను. మనలను లక్ష్యము చేయక నీచముగా చూచుచున్న ప్రభుత్వమునకు దోసిలొగ్గుట, సాగిలబడుట యతని స్వభావమునకు విరుద్ధము. కాని ప్రాత యతివాద నాయకు లతని నాకర్షింపలేదు. వారిభాష వారిపద్ధతి యతనికి

నచ్చలేదు. బిసెంటుప్రవాసము తరువాత జరిగిన సంగతులతనిని ముందుకు త్రోయుచుండెను. కాని యతడు సందేహించుచుండెను. మితవాద రాజకీయములు లాభములేదనియు, హిందూమహమ్మదీయ సమస్య తేలినగాని సరియైనపని జరుగుట కవకాశము లేదనియు నతడా రోజులలో చెప్పుచుండెడివాడు.

ఈ కీలకము దొరికినచో మాలో నతి చిన్నవానితో కూడ ముందుకు దుమికెదనని యతడు మాటయిచ్చెను. అఖిలభారత కాంగ్రెసు కమిటీవారు మాయింట కూడి తయారుచేసిన సంయుక్త కాంగ్రెసు-లీగుపద్ధతి 1916 లక్నో కాంగ్రెసులో నామోదింపబడెను. దీనితో నతడు తృప్తిపడి తోడి మితవాదబృందముతో త్రెంచుకొనినైన వచ్చుట కిచ్ఛగించెను. మాంటేగు భారతకార్యదర్శిగా భారతదేశమును చూచుటకు వచ్చువరకు వారు కలసియేయుండిరి. మాంటేగుచెమ్సుఫర్డుప్రణాళిక ప్రచురమగుటతోటనే యభిప్రాయభేదము లంకురించెను. 1918 లో ప్రత్యేక సంయుక్తరాష్ట్రసభ మా తండ్రి యాధిపత్యమున లక్నోలో జరిగెను. మాంటేగుచెమ్సుఫర్డు ప్రణాళికను ఖండించునని మితవాదు లీ సభను బహిష్కరించిరి. తరువాత యీ తీర్మానములను చర్చించుటకు సమకూడిన ప్రత్యేక కాంగ్రెసునుకూడ వారు బహిష్కరించిరి. అప్పటినుండి మితవాదులు కాంగ్రెసునుండి సెలవుతీసికొనిరి. మెజారిటీ తమకు వ్యతిరేకమైనను తమ యభిప్రాయములను వెల్లడించి వాటికొరకు పోట్లాడకుండ కాంగ్రెసునుండియు తదితర బహిరంగసభలనుండియు మెల్లగా జారిపోవు యీ మితవాద యాచారము ప్రజాపక్షమున పనిచేయువారలకెంతమాత్రము తగదని నాకు దట్టెను. దేశములో ప్రజాభిప్రాయము కూడ నిదియనియే నా యుద్దేశ్యము. భారత రాజకీయములలో మితవాదులు పూర్తిగా నంతరించిపోవుట కీ పిరికిపద్ధతియే కొంతకారణమని నా నిశ్చయము. మితవాదులు మొత్తముగా బహిష్కరించిన తరువాత శ్రీనివాసశాస్త్రిగా రొక్కరే తొలిదినములలో కొన్ని కాంగ్రెసులకు వచ్చి తమ యభిప్రాయము వెలిబుచ్చెడివాడు. దీనిచే

ప్రజలలో నాయనకు గౌరవము కలిగెను. యుద్ధమారంభమైన తొలి వత్సరములలో నా రాజకీయ క్రియాకలాప మతి స్వల్పము. నేను బహిరంగసభలలో నెన్నడు నుపన్యసించలేదు. ఉపన్యసించుటయనిన నాకతిభయము. ఇంగ్లీషులో మాట్లాడగూడదని నా యభిప్రాయము. హిందుస్తానీలో చాలకాలము మాట్లాడలేనని సందేహము. అలహాబాదులో నేను మొట్టమొదట 1915 లో నుపన్యసించితిని. నే నింగ్లీషులోనే మాట్లాడితిని. సప్రూగారు సభ ముగియుటతోడనే నన్ను కౌగలించుకొని బహిరంగముగా ముద్దుపెట్టుకొనిరి. నేను బహిరంగముగా నుపన్యసించగల్గినందుల కాయన యుబ్బిపోయెను. ప్రజాసేవకులలో మరియొక క్రొత్తవాడు కలిసెనని యాయన సంతోషము. ఆ రోజులలో మాట్లాడుటయే ప్రజాసేవ.

అలహాబాదు యువకులము సప్రూగారు రాజకీయములలో ముందుకువత్తురని యనుకొనెడివారము. పట్టణములోనున్న మితవాదులలో నుత్సాహము, భావోద్రేకము కలవా డతడే. అతనితో పోల్చినచో మాతండ్రి యుద్రేకహీనుడు. సప్రూగారే మమ్ముద్ధరింతురని కొంతకాల మూహించితిమి. పండిత మదన మోహన మాలవ్యా, యతని చిరకాల ప్రజాసేవ మమ్మాకర్షించెను. అతనితో మేము దీర్ఘసంభాషణలను సలుపుచు దేశమును నడుపుమని యతనిని బలవంతపరచెడివారము.

మాయింట తొలివత్సరములలో రాజకీయసమస్యలను చర్చించుటంత శాంతమైన వ్యాపారముకాదు. వానిని తలపెట్టినపు డుద్రేకము హెచ్చెడిది. కార్యదీక్షయుండవలెనని, మాటలుపనికిరావని నేనుచేయు విమర్శలను తండ్రిగారు వినుచు నే నతివాది నగుచుంటినని కనిపెట్టిరి. చేయవలసినపని నిర్ధారణకాలేదు. వంగదేశములో జరుగుచుండిన దౌర్జన్యకార్యములవైపు మరలుదునేమోయని యాయన బాధపడెడివారు. య.దార్థముకు నన్నది యాకర్షింపలేదు. కాని ప్రస్తుత పరిస్థితులకు చేతకానివారివలె లొంగిపోరాదని, యేదో కొంతపని చేయవలెనని నేనాదుర్దాపడెడివాడను. జయప్రదముగా

పనిజరుగుటయనిన నెంతమాత్రము తేలిక విషయముకాదు. తండ్రిగారుకూడా మితవాద వేదాంతముతో తృప్తిపడలేదు. ఆయనలో నాంతరంగిక సంరంభము జరుగుచుండెను. ఇంకొకగతిలేదని పూర్తిగా విశ్వసించినపుడుగాని యాయన యొక స్థితినుండి మరియొక స్థితికి మారువాడుకాడు. ఒకసారి యొకయడుగు వేసినచో నిక వెనుకకు మరలడు.

బిసెంటు ప్రవాసముతో నతని రాజకీయములలో బహిరంగమైన మార్పుకలిగెను. క్రమముగా నతడు ముందుకుసాగి తన మితవాద బృందమును చాల వెనుకకు దిగద్రొక్కి 1919 పంజాబు దురంతములతో తన పూర్వజీవితమును తన వృత్తిని యొకసారిగా విడనాడి, గాంధీజీ ప్రారంభించిన నూతనోద్యమముతో నైక్యమయ్యెను. కాని యా దినమింకను రాలేదు. 1915 మొదలు 1917 వరకతడు డోలాయమానముగ నుండి నన్ను గురించి యాందోళనపడుచుండుటచే రాజకీయములను గురించి శాంతముగా మాట్లాడెడివాడు కాడు. అతనికి మాపై కోపము వచ్చుచుండుటచే మా సంభాషణలు తరచు హఠాత్తుగా సాగిపోవుచుండెడివి.

నేను గాంధీజీని మొట్టమొదట 1916 క్రిస్టమసులో లక్నో కాంగ్రెసు రోజులలో కలుసుకొంటిని. దక్షిణాఫ్రికాలో నతడు సలిపిన పోరాటమునకు మే మతనిని మెచ్చుకొంటిమి. కాని యతడు రాజకీయ వేత్త కానట్లు, మాకు దూరస్థుడైనట్లు, మా కంటె వేరైనట్లు మాలో చాలమంది యువకులము భావించెడివారము. కాంగ్రెసులోను, జాతీయ రాజకీయములలోను పాల్గొనుట కతడపు డిచ్ఛగింపక దక్షిణాఫ్రికాలోని భారతీయుల సమస్యను గురించియే మాట్లాడుచుండెను. తరువాత కొద్ది కాలముననే యతడు చాంపరానులో రయితులతరఫున తేయాకుతోట యజమానులమీద ధ్వజమెత్తి విజయమునుబడయుట తోడనే మేము సంతోషముతో పొంగితిమి. అతడు తన పద్ధతులను హిందూదేశములో కూడ ప్రయోగింపనున్నాడని మేము గ్రహించితిమి. అవి విజయవంతములగునట్లు కాన్పించెను.

లక్నో కాంగ్రెసు ముగిసిన తరువాత సరోజినీదేవి యలహాబాదులోనిచ్చిన గంభీరోపన్యాసములు మమ్ము కదల్చివేసెను. అవి జాతీయతతోను దేశభక్తితోను నిండియుండెను. నా కళాశాల రోజులనాటి యనిర్ధారిత సామ్యవాదభావము లంతరించుటచే నేను జాతీయవాదినైతిని. కాని క్రొత్త పుస్తకములను చదివినకొలది నాలో సామ్యవాదభావములు మరల మొలకెత్త నారంభించెను. అవి శాస్త్రసంబంధములుగాక కేవల యూహలు, గాలికోటలు, మానవ దయాళుత్వమునకు సంబంధించినవిగా నుండెను. బెర్ట్రండు రస్సెలుగారి గ్రంథములను నేను యుద్ధకాలములోను తరువాతనుకూడ చదువుచుంటిని. ఈ భావములు, కోరికలు, నాలో సంఘర్షణను లేవదీసెను. న్యాయవాదవృత్తియం దసంతృప్తి కలిగించెను. మరొకటి చేయునది లేక నేను దానిని వీడకుంటిని. కాని ప్రజాసేవకు నావృత్తికి నెంతమాత్రము సరిపడదనుభావము నాలో నానాటి కభివృద్ధియగుచుండెను. అది దోషమనికాదు కాని కాలము, శక్తి యీ రెంటికి చాలవు. కలకత్తాలోని విఖ్యాతలాయరైన సర్ రాష్‌బిహారీఘోషు నాయందహేతుక ప్రేమకలవాడై నావృత్తిలో పైకివచ్చుటకు తగిన సలహాల నొసంగెను. ముఖ్యముగా న్యాయశాస్త్రమునకు సంబంధించిన విషయము నొకదానిని తీసుకొని యొకపుస్తకము వ్రాయుమనెను. పిల్లలాయరు పెద్దవాడగుట కిది మంచిమార్గమని యతని యభిప్రాయము. దానిని వ్రాయుటలో నా కతడు సాయముచేసెదననెను. కాని యతడు నా న్యాయవాదవృత్తియందుచూపిన శ్రద్ధయంతయు వృధాయయ్యెను. నాకాలమును, శక్తిని న్యాయపుస్తకములను వ్రాయుటలో వినియోగించుటకంటె బుద్ధితక్కువేదియు నాకు కాన్పించలేదు. సర్ రాష్‌బిహారీ తనవృద్ధాప్యంలో చాల ముక్కోపిగ చిర్రుబుర్రుగ తన క్రిందనుండు వకీళ్ళకు పెద్దపులివలె నుండెడివాడు. నా కతడనిన యిష్టము. అతని దోషములలోను లోటులలోను కొంత సొంపులేకపోలేదు. సిమ్లాలో నొకసారి తండ్రిగారు, నేను అతనికతిథులముగ నుంటిమి. అపుడే 1918 మాంటేగు చెమ్సుఫర్డునివేదిక బయలుపరచెను. ఒకసాయంకాల మతడు

కొందరు స్నేహితులను విందుకు పిలిచెను. అందులో వృద్ధులైన కపర్డి గారొకరు. భోజనానంతరము వారిరువురు తీవ్రవాదమునకు గడంగిరి. ఘోషుగారు మితవాది. కపర్డిగారపుడు ప్రధానతిలకేయుడు. గోక్లే బ్రిటిషు యేజెంటు అని, తాను లండనులోనుండగా తనపై గూఢచారిగా నుండెనని కపర్డి గోక్లేగారిని విమర్శింప నారంభించెను. సర్ రాష్ బిహారీ దీనిని సహించలేక గోక్లే మానవులలో నుత్తముడని; తనకు ముఖ్యస్నేహితుడని, యతనికి వ్యతిరేకముగా నెవ్వరిని యొక్కమాట యైన జెప్పనీయనని గర్జించెను. కపర్డిగారపుడు శ్రీనివాసశాస్త్రి గారిమీద పడిరి. సర్ రాష్‌బిహారీ కిదియు నిష్టము లేకపోయెను. కాని దీని నంతగా నెదుర్కొనలేదు. గోక్లేగారియెడల నున్నంత గౌరవ మతనికి శాస్త్రిగారియందు లేదు. గోక్లేగారున్నంతకాలము నత డా సంఘమునకు ధనసహాయము చేసెననియు, నతడు మృతినొందిన తరువాత మాని వేసెననియుకూడ చెప్పెను.

కపర్డిగారు తరువాత తిలకుగారిని మెచ్చుకొననారంభించెను. ఇతడు నిజముగా చాలగొప్పవాడు. "అద్భుతమైనమనిషి" 'ఋషి' యని యతడనెను. 'ఋషియా? నాకు ఋషులనినమంట, ఋషులతో నాకేదియు పనిలేదు' అని సర్ రాష్‌బిహారీ ముదలకించెను.

6

నా వివాహము - హిమాలయారోహణము

నా వివాహము 1916 లో ఢిల్లీపట్టణమున వసంతకాలములో జరిగెను. నేను వేసవి కొన్నినెలలు కాశ్మీరములో గడిపి నా కుటుంబము నచట విడిచి నా పెత్తండ్రికుమారునితో పర్వతములలో ననేక వారములు విహరించి లడక్ రోడ్డు నెక్కితిని. టిబెట్టుకుబోవు (పశ్చిమములో నైన) బిక్కుబిక్కుమను నీ సన్నని పర్వతలోయలగుండ పోవుటకు నా కిదియే ప్రథమము. జోజీలాకనుమనుండి పచ్చని రత్న కంబళములనుబోలు పర్వతసానువుల నొకవంకను, చెట్లుచేమలులేని కొండల నొకవంకను మేము చూచితిమి. మంచుచే కప్పబడి తళతళ మెఱయు శిఖరము లొకవంకను, మందగమనముతో మమ్ముకలుసు కొన దిగివచ్చు నదులతోగూడిన శిఖరము లొకవంకను, పైకిపోవుచుండ మేమా సన్నని లోయ నెక్కుచుంటిమి. గాలి యతిచలిగ సహింప నశక్యముగ నుండెను. కాని పగలు సూర్యభగవానుడు వెచ్చదనము నిచ్చుచుండెను. గాలి పొగ, లేక నిష్కల్మషముగ నుండుటచే నొక్కొక్కప్పుడు దూరవస్తువులు దగ్గఱగనున్నట్లు తోచెడివి. కాని యొంటరితన మంతకంతకు హెచ్చుచుండెను. చివరకొక చెట్టుగాని, పుట్టగాని మాకు సావాసములేకుండెను. కొండమంచు, ఒక్కొకపుడు మంచి పువ్వులు - అయినను ఈ ప్రకృతి విహారస్థలములలో నా కపరమితోత్సాహము, శక్తిసామర్థ్యములు కలిగెను.

ఇచట మా కొక మంచి యనుభవము కలిగెను. మేము జోజీలాకనుమ దాటినతరువాత అమరనాథ్‌గుహ యచ్చటి కెనిమిది మైళ్ళలో కలదని వింటిమి. అంతయు మంచుతో కప్పబడిన గొప్ప కొండ నొకదానిని మేము దాటవలెను. అది మాకొక లెక్కకాదను కొని మా యుత్సాహములో మే మాయత్నముకు గడంగితిమి. ఒక గొల్లవాడు మార్గముచూపుచుండ మేము మా మకామును (అది

11,500 అడుగుల యెత్తున నుండెను) వీడి పర్వతముపైకి పోతిమి. ఒకరినొకరము తాళ్ళతో కట్టుకొని పర్వతమును దాటుచు, మంచు దిబ్బల నెక్కుచు పోవుచుండ మా కష్టము లంతకంతకు హెచ్చు చుండెను. గాలి పీల్చుకొనుటకు కష్టమగుచుండెను. మంచుకురియుచు భయంకరముగ జారుచుండ మే మలసిపోతిమి. ఒక్క యడుగైనను ముందుకు పడుట గగనముగనుండెను. కాని మేము మా మూర్ఖ ప్రయత్నమును మానలేదు. ప్రాతఃకాలము నాలుగు గంటలకు మా మకాముఁవీడి కొంచె మించుమించు పన్నెండు గంటలు విరామము లేకుండ నెక్కుచు చివరకొక గొప్ప మంచుభూమికి చేరగలిగితిమి. ఆ దృశ్య మత్యద్భుతముగ నుండెను. చుట్టు మంచుశిఖరములచే నలంక రింపబడి యది దేవతావిహారస్థలమువలె నుండెను. ఇంతలోనే క్రొత్త మంచు, పొగపట్టుటచే మా కా దృశ్యము మాయమయ్యెను. మే మెంత యెత్తున నుంటిమో నేనెరుగను. కాని యది 15,000 మొదలు 16,000 అడుగుల వఱకు నుండియుండవలెను. అమరనాథ్‌గుహాకంటె మేము చాల యెత్తున నుంటిమి. మే మీ మంచుభూమిని దాటి (సుమారు అరమైలు దూరము) యవతలప్రక్కనున్న యమరనాథ్ గుహకు పోవలెను. ఎక్కవలసినదంతయు నెక్కితిమి. కనుక మా కష్టములన్నియు గట్టెక్కినవని యనుకొని యలసియున్నను, ఉత్సా హముతో మే మిందుకు బూనుకొంటిమి. అచ్చటచ్చట బొరియ లుండి క్రొత్తమంచు వానిని కప్పివేయుచుండెను. ఈ క్రొత్తమంచే యొకసారి కొంచె మించుమించు నా కొంపతీసెను. దానిమీద కాలిడితినో లేదో నేనొక యగాధములోనికి పోవుచుంటిని. ఈ యగా ధములోనుండు వస్తువేదైనను చెక్కుచెదరక నెన్ని యుగములయిన భద్రముగనుండి భూగర్భశాస్త్రజ్ఞులకు పనికివచ్చెడిది. కాని త్రాడు నన్ను పట్టియుండెను. నే నా బొరియయొక్క యంచును పట్టుకొం టిని; నన్ను పైకిలాగివేసిరి. దీనిచే మా యుత్సాహము సన్నగిలినను మేము మా ప్రయాణము మానలేదు. ఈ బొరియ లంతకంతకు సంఖ్యలోను, వెడల్పులోను హెచ్చనారంభించెను. వీనిని దాటుటకు

మా కెట్టిసాధన యుపకరణములు లేక విసిగి, నిరాశచెంది అమరనాథ్ గుహను చూడకుండగనే మేము వెనుకకు మఱలితిమి. ఎత్తైన కాశ్మీరు లోయలు, పర్వతములు మా కమితానందము నొనగూర్చుటచే నేను త్వరలోనే వానిని తిరిగి చూడవలెనని నిశ్చయించుకొంటిని. నే ననేక స్థలములను చూడవలెనని తిరుగవలెనని యూరుచుంటిని. టిబెట్టు దేశములో నత్యద్భుత కాసారమైన మానసరోవరము, దాని ప్రక్కనే యున్న కైలాసపర్వతము చూడవలెనను కోరిక నా కానందము నిచ్చెడిది. ఇది పదునెనిమిది వత్సరముల క్రిందటిమాట. కాని నేటికిని నేను కైలాస మానసరోవరములను చూడజాలనైతిని. చివరకు కాశ్మీరమును చూచుటకైన పోజాలకపోతిని! అంతకంతకు నన్ను రాజకీయములు, ప్రజాసేవ బంధించుటచే పర్వతముల నధిరోహించుటకు, సముద్రములను లంఘించుటకుబదులు జయిళ్ళకుపోవుట సంభవించెను. కాని నే నింకను హిమాలయములను, మానసరోవరమును, నా యభీష్టమగు కైలాసగిరిని చూడవలెనను కలలను గనుచుందును. ఈలోపల జీవితము పరుగెత్తుచు, యౌవనము నడివయసుకు; నడివయసు అంతకంటె నధ్వాన్నమగు మరియొక యవస్థకు దారితీయుచున్నది. కైలాస, మానసరోవరములకు పోకుండగనే వృద్ధాప్యము వచ్చి మీదపడునని యొక్కొక్కపుడు నే ననుకొనుచుందును.

7

గాంధీజీరాక, సత్యాగ్రహము, అమృతసరము

ప్రపంచయుద్ధము ముగిసెను. హిందూదేశములో నుద్రేక మణచివేయబడెను. యంత్రపరిశ్రమ లభివృద్ధిచెంది పెట్టుబడిదారుల ధనాధికారములు హెచ్చెను. కొద్దిమంది యైశ్వర్యవంతులయి యింకను అధికారమును, ధనమును కూడబెట్టవలెననెడి దురాశా పరవశులయి యుండిరి. కాని జనసామాన్య మిట్టి యదృష్టమునకు నోచికొనలేదు. తమ్ము ముంచివేయు ఋణభారము లెట్లు తగ్గునాయని వారు పరితపించుచుండిరి. చట్టములలో గొప్పమార్పులు కలుగు ననియు, స్వరాజ్యము చాలవరకు రాగలదనియు, క్రొత్తయుద్యోగము లనేకముల కాస్పదముండుటచే తమ స్థితి బాగుపడగలదనియు మధ్య తరగతి వా రాశించుచుండిరి. రాజకీయాందోళన చట్టసమ్మతము, శాంతియుతముగ నుండెను. స్వయంనిర్ణయ, స్వపరిపాలనములను గురించి ప్రజలు నమ్మకముగా చెప్పుకొనుచుండిరి. ఈ యసంతృప్తి కొంత జనసామాన్యములో, ముఖ్యముగా రైతులలోకూడ నుండెను. సైన్యములోనికి ప్రజలను బలవంతముగా చేర్చుపద్ధతిని పంజాబు గ్రామాదులలోని ప్రజ లింకను మరచిపోలేదు. 'కొమగటమారు' లోనివారిని, తదితరులను కుట్రచేసిరను నేరముల నారోపించి యణచి వేయుట యగ్నిహోత్రములో నాజ్యము పోసినట్లయ్యెను. అనేక యుద్ధరంగములలో పనిచేసివచ్చిన యుద్ధభటులు వెనుకటివలె మేదకులుగ నుండక బుద్ధివికాసము కలిగియుండుటచే నసంతృప్తిగ నుండిరి. టర్కీ, ఖిలాఫతు సమస్యల సందర్భములో మహమ్మదీయులకు కోపము కలిగి యాందోళన హెచ్చుచుండెను. టర్కీతో నింకను సంధిజరుగ లేదు. కాని స్థితిగతులు చెడుచున్నవి.

ఒకప్రక్క యాశ, మరియొకవంక ఆదుర్దా, భయము ముప్పిరి గొనియుండ భారతదేశమంతయు పరిస్థితులను నిరీక్షించుచుండెను.

అట్టిస్థితిలో చట్టప్రకారము జరుపవలసిన తతంగములు, నిరోధములు నక్కఱలేకుండగనే అరెస్టుచేసి శిక్షించుట కన్ని జబర్దస్తీ యవకాశములుగల రౌలటుబిల్లులు తయారయ్యెను. భారతదేశమంతయు నొక్కపెట్టున వీటి నెదిర్చెను. మితవాదులుకూడ తమ యావచ్ఛక్తి వినియోగించిరి. హిందూదేశములో నీ పక్షమను భేదము లేకుండ నందరు నడుములుగట్టిరి. అయినను ప్రభుత్వసభ్యులయామోదముతో నివి చట్టములయ్యెను. ఇవి మూడేండ్లవరకు మాత్రమే వర్తించునని బుజ్జగించిరి. కాని, నాకు తెలిసినంతవఱకీ మూడేండ్లలో నొక్కసారియైనను వీని నుపయోగించలేదు. ఈ మూడేండ్లు నెంతమాత్రము చల్లనివత్సరములు కావు. 1857 తరువాత హిందూదేశ మెపుడు నిట్టి సంకటదినములను చూచి యెరుగదు.

మరియొక ముఖ్యవిషయము. నేడు పదిహేను సంవత్సరములైనతరువాత, రౌలటుబిల్లులకంటె కఠినతరములైన క్రొత్తచట్టము లెన్నియో మనకు ప్రసాదింపబడినవి. ఏ క్రొత్తచట్టములక్రింద ఆర్డినెన్సులక్రింద బ్రిటిషుప్రభుత్వ సంపదలను, ఆశీర్వాదములను మన మింతగా ననుభవించుచుంటిమో యట్టి వీటితో పోల్చిచూచినచో నాటి రౌలటుబిల్లులను మనము స్వాతంత్ర్యపట్టాగా భావింపవచ్చును. కాని యీ భేదముమాత్రమున్నది. 1919 లగాయితు మాంటేగు చెమ్సుఫర్డు ప్రణాళికయను, 'స్వపరిపాలన' యని పిలువబడు గొప్ప మోతాదు మనకు ప్రసాదింపబడెను. ఇప్పుడు మనకు మరియొక మోతాదు రానున్నదట! ఇట్లే మన మభివృద్ధి పొందుచున్నాము!

1919 ప్రారంభమున గాంధీజీ చాలా జబ్బుపడి కొంచె మించుమించు మంచముమీదనుండియే రౌలటుబిల్లుకు తన యంగీకారము నీయవలదని రాజప్రతినిధిని వేడుకొనెను. తక్కిన విన్నపములను త్రోసివేసినట్లే దీనినికూడ త్రోసివేయుటచే, తనకిష్టము లేకున్నను గాంధీజీ యఖిలభారత యాందోళనమును లేవదీసెను. అతడు సత్యాగ్రహసభను స్థాపించెను. దానిలోని సభ్యులు రౌలటుచట్టములను, అప్పుడప్పుడు నిర్ణయింపబడు యితర యన్యాయచట్టములను నుల్లం

ఘించుటకు ప్రమాణము చేతురు. అనగా వారు బుద్ధిపూర్వకముగ బహిరంగముగ జయిలును వరించవలెను. వార్తాపత్రికలలో నీ తీర్మానమును మొదట చదివినపు డుత్సాహభరితుడనై తిని. చిట్టచివర కంధకారము తొలగి కార్యకారియగు మార్గము, బహిరంగ ప్రత్యక్ష పద్ధతియొకటి దొరికెనని యుప్పొంగితిని. నేను వెంటనే సత్యాగ్రహ సభలో జేరగోరితిని. చట్టములను ధిక్కరించుట జయిళ్ళకు పోవుట మొదలగు తత్ఫలితములు నా బుర్రలోనికి రాలేదు. వచ్చెనో నేను వాటిని లెక్కచేయలేదు. కాని యింతలో హఠాత్తుగా నా యుత్సాహ మంతయు నొక్కసారి చల్లబడెను. మా తండ్రి దీనికి కేవలము వ్యతిరేకి. అతడొక క్రొత్తపద్ధతి తొక్కునపుడు తత్ఫలితముల నన్నింటిని పూర్తిగా యోచించికాని చేయడు. సత్యాగ్రహసభను గురించి యోచించినకొలది దాని కతడు మరింత విముఖుడగుచుండెను. కొంత మందివ్యక్తులు జయిళ్ళకు పోయినంతమాత్రమున లాభమేమి ? అది ప్రభుత్వముపై నెట్టివత్తిడి కలిగించగలదు ? ఈ సందేహము లిట్లుండ ముఖ్యముగా స్వవిషయమే యతని నెక్కువగా బాధించెను. నేను జయిలుకుపోవుట బుద్ధితక్కువయని యతడనుకొనెను. అప్పటికి జయిలు యాత్ర లింకను ప్రారంభముకాలేదు. తండ్రిగారికి తన బిడ్డలయెడ కత్యంతప్రేమ. అతనిప్రేమ పైకి కాన్పించక నిగూఢముగ నుండును.

చాలకాల మీ మానసికపోరాటము మాలో జరుగుచుండెను. ఇది సామాన్యవిషయముకాదు. సమస్తమును తారుమారుచేయు విషయము కనుక మే మొకరికొకరము నొప్పికలిగింపకుండ జాగ్రత్తగనే సంచరించుచుంటిమి. తండ్రిగారి బాధను తగ్గించవలెనని నాకుండెను. కాని నేను సత్యాగ్రహమును విడువజాలనయ్యెను. మే మిరువురము బాధపడుచునేయుంటిమి. నిశీథములందు నే నొంటరిగా మనఃఖేదము నొందుచు తెన్నుగానక తచ్చాడుచుండెడివాడను. తండ్రిగారు నేను జయిలుకు పోవుచో నాగతి యెట్లుండునో చూచుటకని స్వయముగా కటికనేలమీాద పడుకొని చూచెను.

మా తండ్రి యాహ్వానముపై గాంధీజీ యలహాబాదు వచ్చెను. వారిరువురును నేను లేకుండ దీర్ఘసంభాషణలను జరుపుకొనుచుండెడి వారు. చివరకు తండ్రిగారికి మనోవ్యాకులత కలిగింపవలదనియు, తొందరపడవలదనియు గాంధీజీ నాకు సలహాయిచ్చెను. ఇది నాకు విచారకరముగనుండెను. ఇంతలో దేశములో నూతన సమస్య లేర్పడుటచే పరిస్థితులన్నియు మారి సత్యాగ్రహము విరమింపబడెను.

సత్యాగ్రహదినము, యావద్భారత హర్తాళములు, వ్యాపారమంతయు పూర్తిగా కట్టివేయబడుట, ఢిల్లీ, అమృతసరములలో పోలీసులు మిలిటరీ తుపాకులను కాల్చుట, చాలమంది హతులగుట, అమృతసరము, అలహాబాదులలో మూకలు దౌర్జన్యముచేయుట, జలియనువాలాబాగులో మానవహనకర్మ, పంజాబులో సైనికశాసన భయంకర ప్రదర్శనము, పంజాబు యావద్భారతమునుండియు వేరుచేయబడుట, కోసివేయబడుట, ఇతరులుచూడకుండ నొకగొప్ప తెర దానిని కప్పివేయుట, దాచివేయుట, వార్తలన్నియు నరికట్టబడుట, ప్రజలచ్చటకుపోకూడదు,అచ్చటనుండి రాకూడదు ఇట్టి నరకముతయారయ్యెను. ఆ నరకమును తప్పించుకొనివచ్చిన కొందరువ్యక్తులు భయభ్రాంతులై నోట మాటరాక, యదార్థములు చెప్పజాలకుండిరి. అసహాయులమై యశక్తులమై బయటనున్న మేము వార్తల కెదురుచూచుచుంటిమి. మా హృదయములు ఖేదభరితములై యుండెను. సైనిక శాసనములను ధిక్కరించి పంజాబులో బాధపడుచున్న ప్రాంతములకు బహిరంగముగ పోవలెనని మాలో కొందర మనుకొంటిమి. కాని మేము వారింపబడితిమి. ఇంతలో బాధితులకు సహాయముచేయుటకు పరిస్థితులను తెలిసికొనుటకు కాంగ్రెసు తరఫున పని ప్రారంభింపబడెను.

సైనికశాసనములను తగ్గించుటతోడనే కాంగ్రెసు ప్రముఖులు, తదితరులు పంజాబులోని కురికిరి. సహాయకశాఖను పండిత మదన మోహనమాలవ్యా, స్వామి శ్రద్ధానందగార్లు నడిపిరి. గాంధీజీ సలహా, సంప్రదింపులతో మాతండ్రి, చిత్తరంజనదాసు పరిశోధనశాఖను నడిపిరి. దేశబంధుదాసు ముఖ్యముగా నమృతసర ప్రాంతమును తీసికొనెను.

అతని సహాయార్థము నే నచటకు పంపబడితిని. అతనితోను, అతని క్రిందను పనిచేయుటకు నాకదియే ప్రథమము. ఇది నాకమూల్యమైన యనుభవమునిచ్చెను. నాకతనియెడల గౌరవము హెచ్చెను. జలియనువాలాబాగుకును, మానవులను పొట్టలమీద ప్రాకించిన యా భయంకరమైన సందుకును సంబంధించిన సాక్ష్యమంతయు మా యెదుటనే తీసికొనబడెను. మేము స్వయముగా ననేకసారు లా తోటకు పోయి ప్రతి చిన్న విషయమును కూలంకషముగా పరిశోధించితిమి.

ఆ తోటకింకను మరికొన్ని మార్గములున్నవను యుద్దేశ్యముతో డయరుసేనాని యంతసేపు కాల్చెనని యెడ్వర్డుథామ్సన్ సూచించెను. అదియే డయరుయుద్దేశ్యమైనను నతని బాధ్యత యంతమాత్రముచే తొలగిపోలేదు. అట్టి యుద్దేశ్య మతని కుండుట కేవలము హాస్యాస్పదము. అతడు నిలచిన యెత్తైన చోటునుంచి చూచినచో నాప్రదేశమంతయు చక్కగా కాన్పించి యనేక యంతస్తులుగల మేడలచే నది యెట్లావరింపబడియున్నదో తెలియగలదు. ఒక్కప్రక్క మాత్రము నూరు గజములవరకు నయిదడుగుల గోడయుండెను. జాజ్వల్యమానమైన దావానలముతమ్ముదహించి వేయుచుండ, తెన్నుగానక వేలకొలది జనులీగోడవైపు కుఱుకు లెత్తుకొనుచు వచ్చి గోడనెక్కి పారిపోవుటకు యత్నించుచుండ పారిపోకుండ జ్వాల లప్పుడీ గోడమీదకు (ఇది మా సాక్ష్యముల వలనను గోడమీదనున్న యసంఖ్యాకములైన గుండ్ల చిహ్నములవలనను కాన్పించుచునేయున్నది.) పంపబడెను. అంతయు ముగిసిన తరువాత దెబ్బలు తగిలినవారియొక్కయు శవములయొక్కయు పెద్దగుట్ట లీగోడల కిరుప్రక్కల పడియుండెను.

1919 అంతమున నొకరాత్రి బండిలో నే నమృతసరమునుండి ఢిల్లీకి పోవుచుంటిని. నే నెక్కినపెట్టెలో పైన నొక్కస్థానము తప్ప తక్కినవన్నియు నిద్రించుచున్న బాటసారులతో నిండియుండుటచే నే నాస్థానము నాక్రమించితిని. నాతోటి బాటసారులందరు సైనికోద్యోగులని నేను ప్రాతఃకాలమున తెలిసికొంటిని. వారు పెద్దగొంతుకలతో సంభాషించుకొనుచుండ నవి నా చెవులబడుచుండెను. వారిలో నొకడు విజయస్వనముతో గంభీరముగా మాట్లాడుచుండెను.

అతడేడయరు. జలియనువాలాబాగుప్రేరుడు. అతడు తన యమృతసరపు టనుభవమును వర్ణించుచుండెను. పట్టణమంతయు నితనిదయకు పాత్రమైయుండెననియు తిరుగబడిన యీ పట్టణమును బూడిదపాలుచేయ సమకట్టితినిగాని దానిమీద దయతలచి విడిచివేసితిననియు నతడు చెప్పుచుండెను. హంటరుకమిటీయెదుట సాక్ష్యమిచ్చి యతడు తిరిగి వచ్చుచుండెను. ఆతని సంభాషణ, నిర్లక్ష్యము నా కాశ్చర్యము కలిగించెను. గోధుమవన్నె చారలుగలిగిన పయిజామాతోను, వదులుగా నుండిన గౌనుతోను నతడు ఠీవిగా ఢిల్లీస్టేషనులో దిగెను.

పంజాబు పరిశోధనా కాలములో నేను గాంధీజీ నెక్కుడుగా చూచితిని. అతని సలహాలు మా కమిటీకి వింతగా కాన్పించుటచేమే మామోదించెడివారము కాము. కాని యతడెల్లపుడు తన వాదమును సహేతుకముగా నిలుపుకొని మమ్మొప్పించెడివాడు. తరువాత జరిగిన హంశము లతని సలహాలలోనున్న బుద్ధి విశేషములను చాటెను. అతని రాజకీయ పరిజ్ఞానములో నాకు విశ్వాస మంతకంతకు హెచ్చజొచ్చెను.

పంజాబు దురంతములు, పరిశోధనలు తండ్రిగారిని మార్చివేసెను. అతని న్యాయ, చట్టసంబంధమైన పునాదులు మొదలంట కూలిపోయి మరియొక వత్సరములో రానున్న మార్పు కతని మనసు తయారగుచుండెను. అతడు తన మితవాదస్థితినుండి చాలదూరము కదలెను. మితవాద పత్రికయైన 'లీడరు' పత్రికతో నసంతృప్తిచెంది యతడు 1919 లో 'ఇండిపెండెంటు' పత్రికను స్థాపించెను. ఇది చాల జయప్రదముగ నడచెను. కాని మొదటినుండియు పెత్తనములో చాల కొఱవడియుండెను. పెత్తందారు లందరు డైరెక్టర్లు, పత్రికాధిపతులు, మేనేజర్లు దీనికి బాధ్యులు. నేనుకూడ (ఎట్టియనుభవము లేనివాడను) నొక డైరెక్టరును. పత్రిక తగాదాలు, పేచీలు నన్ను చికాకు పరచెను. నేనును మా తండ్రియు పంజాబుకు పోయినపుడు మా చిరకాలాభావమువలన నది పసచెడి ధనలోపముచే కొట్టుకొనుచుండెను. అది యిక కోలుకొనలేదు. మేము జయిలుకు వెళ్ళుటతోడనే యది ఛిన్నాభిన్నమై చివరకు 1923 లో నంతరించెను. 1919 క్రిస్టమసులో

తండ్రిగారు అమృతసరు కాంగ్రెసు కధ్యక్షుడయ్యెను. సైనిక శాసన భీభత్సమువలన నూతనపరిస్థితు లేర్పడుటచే తా మీ మహాసభలో జేరవలెనని యతడు మితవాదశిఖామణులను హెచ్చరించెను. "విదళిత పంజాబు హృదయము" మి మ్మాహ్వానించుచున్నది అని యతడు వారికి వ్రాసెను. వా రా యాహ్వానము నాదరింపలేదు. వారి కన్నులు మాంటేగుచెమ్సుఫర్డు సంస్కరణములమీద పడెను. ఈ తిరస్కారము వలన తండ్రిగారికి వారికి మరింత దూరమయ్యెను.

అమృతసరు కాంగ్రెసు మొట్టమొదట గాంధి కాంగ్రెసు. లోక మాన్యతిలకుకూడ చర్చలలో ముఖ్యపాత్ర ధరించెను. కాని హెచ్చు మంది ప్రతినిధులు బయటనున్న జనసమూహములు గాంధీనాయ కత్వము కొఱకే చూచుచుండిరి. 'మహాత్మాగాంధీకి జై' యను శంఖారావము భారతరాజకీయాకాశమున మారుమ్రోగ నారంభిం చెను. ప్రవాసమునుండి క్రొత్తగా విడువబడిన ఆలీసోదరులు కాంగ్రెసులో జేరిరి. జాతీయోద్యమమున కొక క్రొత్తరూపము క్రొత్తవికాసము కలిగెను.

మహమ్మదాలీ ఖిలాఫతు తరఫున యూరపు వెళ్లెను. హిందూ దేశములో ఖిలాఫతుకమిటీ యంతకంతకు గాంధీజీ పలుకుబడిక్రిందకు వచ్చి యతనిదౌర్జన్యరహిత సహాయనిరాకరణభావములతో వియ్యము నొంద నారంభించెను. ఖిలాఫతునాయకులు మౌల్వీలు, ఉలేమాలు 1920 జనవరిలో ఢిల్లీలో జరిపిన మొట్టమొదటి సభలలో నొకటి నా కింకను జ్ఞాపకమున్నది. ఒకఖిలాఫతు రాయబారము వైస్రాయి వద్దకు పోవుచుండెను, గాంధీజీ దానితో పోవలసియుండెను. అతడు వెళ్ళులోపల వైస్రాయికి రాయబారముయొక్క చిత్తుముసాయిదా ముందుగా పంపబడెను.

గాంధీజీ వెళ్ళి యా ముసాయిదా చదివి దానినెంతమాత్రము నంగీకరింపక దానిలో ముఖ్యమైన మార్పులను చేసినగాని తాను దానితో సంబంధము పెట్టుకొనజాలనని చెప్పెను. అందులో నేమియు నిర్ధారణ చేయబడలేదనియు, నది పదజాలముతో నిండియున్న దనియు, మహమ్మదీయులకు కావలసిన కనీస మేదియో స్పష్టముగా,

నిస్సందేహముగా నుదహరింపబడవలెననియు, దానికొరకు ప్రాణముల నైన నర్పింప సిద్ధముగా నుండవలెననియు నతడు చెప్పెను. ఈ చిత్తు తమకుగాని, ప్రజలకుగాని, వైస్రాయికిగాని, బ్రిటిషుప్రభుత్వమునకు గాని తగియుండలేదని యతడు స్పష్టపరిచెను. వారికి దానియందు పట్టుదలయేయున్నచో నది యొక్కటియే సరియైన గౌరవమార్గము. హిందూదేశములో నిట్టివాద మదివఱకు రాజకీయములలోగాని, మరేశాఖలోగాని క్రొత్త; కనివిని యెఱుగనిది. మనము శుష్కమైన యుత్ప్రేక్షలకు నలవాటుపడితిమి. బేరముచేయుట యనునది మనకు సహజమైపోయెను. చివరకు గాంధీజీవాద మంగీకరింపబడెను.

ముసాయిదాలోనున్న లోపములను, నిర్ధారణ లేకపోవుటను సూచించుచు దానికి చేర్చుకొనవలసినదని కొన్ని పేరాలను వ్రాసి యతడు వైస్రాయి యాంతరంగిక కార్యదర్శికిపంపెను. ఈ చివరపేరా లలో కనీసపుకోర్కెలు వివరింపబడెను. వైస్రాయి జవాబు చిత్రముగా నుండెను. అతడీ చివర పేరాలను త్రోసివేసి మొదటి ముసాయిదాయే తన యభిప్రాయములో చాల యుక్తముగనున్నదని సెలవిచ్చెను. ఈ వ్రాతప్రతివ్రాతలవలన తన స్థితియు, ఖిలాఫతుకమిటీస్థితియు స్పష్ట మయినదని గాంధీజీ చివరకీ రాయబారములో చేరెను.

ప్రభుత్వము ఖిలాఫతుకోర్కెలను తీర్చునదికాదనియు, పోరా టము తప్పదనియు కాన్పించుచునేయుండెను. మౌల్వీలతోను, ఉలేమాలతోను దీర్ఘసంభాషణలు జరిగెను. సహాయనిరాకరణమును గురించి ముఖ్యముగా దౌర్జన్యరాహిత్యమునుగురించి చర్చలు జరుగు చుండెను. దౌర్జన్యరాహిత్యమును సంపూర్ణముగా నొప్పుకొనినచో వారి యాజ్ఞలకు బద్ధుడనగుదునని గాంధీజీ స్పష్టపరిచెను. ఈ విషయ ములో నెంతమాత్రము చచ్చుపనికిరాదు; మెత్తదనమునకు, దాపరికము (మానసికమైన) నకు తావులేదు. మౌల్వీలీభావమునర్థముచేసుకొనుట తేలికయైన విషయముకాదు. దాని నొక మతముక్రిందగాని రాజకీయ యెత్తుగా నంగీకరించెదమని స్పష్టపరచి వారు దాని నొప్పుకొనిరి.

1920 లో ఖిలాఫతు రాజకీయోద్యమములు రెండును సమ ముగా నభివృద్ధియై కాంగ్రెసు గాంధీజీయొక్క దౌర్జన్యరహిత

సహాయ నిరాకరణము నవలంబించుటతో నవి రెండును చేతులు కలిపెను. ఖిలాఫతు కమిటీ మొట్టమొదట నీపద్ధతి కంగీకరించెను. ఉద్యమమును ప్రారంభించుటకు ఆగష్టు మొదటి తేది స్థిరపరుపబడెను.

దీనినిగూర్చి యోచించుట కింతకు పూర్వమే అలహాబాదులో నొకసభ సయ్యదు రజాఆలీగారి యింట జరిగెను. మహమ్మదాలీ యింకను యూరపులోనే యుండెను. కాని షౌకాతాలీ సభలో నుండెను. ఈ సభ పూర్తిగా నా కాశాభంగము కలిగించెను. కనుక నాకు జ్ఞాపకము. షౌకతాలీ యుత్సాహముగనే యుండెను. కాని కొంచెమించుమించు తక్కినవారందరు సుముఖులుగాలేరు. వ్యతిరేకాభిప్రాయము చెప్పుటకు వారికి ధైర్యములేదు. కాని సాహసము చేయుటకు వారికుద్దేశ్యములేదు. వీరా విప్లవోద్యమమును నడిపించు మొనగాండ్రు ? బ్రిటిషు సామ్రాజ్యమును ధిక్కరించు జగజెట్టీలు ? అని నేననుకొంటిని. గాంధీజీ ఉపన్యసించిన తరువాత వారు మరింత వణక నారంభించిరి. అతడు తన యుత్తమ శాసక ధోరణిలో మాట్లాడెను. అతనిలో వినయ ముట్టిపడుచుండెను. కాని యతడు స్పష్టముగ వజ్రకాఠిన్యతతో మాట్లాడుచుండెను; భాష మృదువుగ మెత్తగ నుండెను. కాని వంచుటకు, విరుచుటకు వీలులేకుండగ నావేశభరితముగ నుండెను. అతని నేత్రములు సాధువుగను గంభీరముగను నుండెను. కాని వాటి నుండి భయంకర నిశ్చయశక్తులు రాజుచుండెను. అత్యంత శక్తివంతుడైన శత్రువుతో నిదియొక గొప్ప పోరాటము కానున్నది. మీరు దీనికి పూనుకొనదలిచినచో సమస్తము పోగొట్టుకొనుటకు సిద్ధము కావలెను. సంపూర్ణమైన దౌర్జన్యరాహిత్యమును శిక్షను పూనవలెను. యుద్ధము ప్రకటింపబడినతోడనే సైనిక శాసనమమలులోకి వచ్చును. మనదౌర్జన్యరహిత పోరాటములో మనకు జయము చేకూరవలెనన్న మన ప్రక్కకూడ డిక్టేటరులు, సైనికాధికారులు నుండవలెను. కాని యీ డిక్టేటరు పదవి మీ యభీష్టము మీద, మీ యంగీకారము మీద, మీ సహాయ సంపత్తులమీద నాధారపడియుండును. మీకు నా యెడల వెగటుగలిగినచో మీరు నన్ను త్రోసివేయవచ్చును. త్రొక్కివేయవచ్చును. నే నందుల కెంత

మాత్రము మిమ్ము నిందించెడివాడను కాను. ఈ యర్థము వచ్చునట్లతడు మాట్లాడెను. ఈ సైనికోదాహరణములు నతని యప్రతిహత విశ్వాసము చాలమంది శ్రోతల గుండెలలో రాయిపడినట్లయ్యెను. కాని షౌకతాలీ యచ్చటనే యుండి సందేహమనస్కులను హుషారు పరచెను. వోటింగు సమయము వచ్చినపు డత్యధిక సంఖ్యాకులు మెల్లగా, సిగ్గుపడుచు తీర్మానమున కంగీకారంగా, ననగా పోరాటమునకే వోటుచేసిరి.

మహా సంగ్రామమును ప్రారంభించుటకు మార్గ మిదియేనా? యని నేను గాంధీజీ నడిగితిని. సభలో నపరిమితోత్సాహము, నిప్పులను కురిపించు భాష, కన్నుల నెఱ్ఱజేయుట మొదలగునవి యుండునని నే ననుకొంటిని. దీనికిబదులు నడివయసు పిరికి సమూహ మచ్చట నాకు ప్రత్యక్షమయ్యెను. అయినను వీరు పోరాటమునకే వోటు చేసిరి. ముస్లింలీగులోని యీ సభ్యులలో చాల కొద్దిమంది మాత్రమే తరువాత జరిగిన పోరాటములో జేరిరి. ఈ వీరులలో చాలమంది ప్రభుత్వ పదవులలో సురక్షితముగా జేరుకొనిరి. అప్పుడుగాని, తరువాత గాని యీ ముస్లింలీగు హెచ్చుమంది మహ్మదీయుల యభిప్రాయమును ప్రాతినిధ్యమును వహించలేదు. 1920 లోని ఖిలాఫతు కమిటీయే వీరి యదార్థ ప్రతినిధి. ఇది యుత్సాహముతో పోరాటములోని కురికెను.

కాంగ్రెసులో తీర్మానమింకను కాకపోయినను గాంధీజీ ఆగష్టు 1వ తేదీని సహాయ నిరాకరణమును ప్రారంభింప తలపెట్టెను. ఆ రోజుననే బొంబాయిలో లోకమాన్య తిలకు చనిపోయెను. ఆ యుదయముననే గాంధీజీ సింధుదేశము తిరిగి బొంబాయిచేరెను. నే నతనితో నుంటిని. బొంబాయిలో తా మెంతయో ప్రేమించిన మహానాయకుని గౌరవింప పదిలక్షలమంది జనము పాల్గొనిన యీ మహోత్సవములో మేముకూడ నుంటిమి.

8

నా బహిష్కార ప్రవాసము

నా రాజకీయములు నాజాతికి, బూర్జువా జాతికి చెందియుండెను. అప్పుడు మధ్యతరగతులవారివే నోరుగల రాజకీయములు. మితవాదులు నతివాదులుకూడ వారి ప్రతినిధులే. వీరు హెచ్చుతగ్గు స్థాయీలలో వారి యభివృద్ధినే కోరిరి. మొత్తముమీద బ్రిటిషుపాలనక్రింద బాగు పడి యేమార్పుకలిగిన తమ ప్రస్తుతస్థితియు, ప్రయోజనములు చెడి పోవునో యని భయపడు పై కొద్దిమంది మధ్యతరగతివారికి మాత్రమే యీ మితవాద ప్రతినిధియగుచున్నాడు. బ్రిటిషు ప్రభుత్వముతోను పెద్దజమీందారీ తరగతులతోను వీనికి సన్నిహితసంబంధము కలదు. అతివాది మధ్యతరగతులలో క్రిందితరహావారి ప్రతినిధి, యంత్రపారి శ్రామికకూలీలు కొద్దిచోట్లమాత్రమేస్థానికముగా నుండిరి. వీరికి పలుకు బడి తక్కువ. రైతాంగము దారి తెన్నుకానక దారిద్ర్యముచే పీడింప బడుచు, ననేక వెతలనొందుచు, దుఃఖభాజకమైన తమవిధికి విడువబడి ప్రభుత్వము, జమీందార్లు, వడ్డీవ్యాపారస్తులు, చిన్న ప్రభుత్వోద్యో గులు, పోలీసులు, లాయర్లు, పురోహితులు: వీరువారననేల వారి దగ్గరకు చేరు అడ్డమైనవారిచేతను త్రొక్కబడి, దోచుకొనబడు ఆంధ్రప్రజ, వార్తా పత్రికలను చదువు చదువరి, హిందూదేశములో కోట్లకొలది కర్షకులు, లక్షలకొలది కార్మికులు నున్నసంగతికాని, వారి కెట్టి ప్రాధాన్యతయు నున్నసంగతిగాని యూహింపజాలడు. బ్రిటిషువారి యాధిపత్యమున నున్న ఆంగ్లోయిండియను పత్రికలు పెద్ద యుద్యోగస్తుల కేళీవిలాసములతో నిండియుండును; పెద్ద పట్టణములలోను, పర్వత సీమలలోను నుండు యింగ్లీషువారి సాంఘిక జీవితము, వారి విందులు, వారి భోగవిలాసములు, సుకు మారదుస్తులు, నాటకాదులు సవిస్తరముగా వర్ణింపబడును. భారత రాజకీయములు పూర్తిగా విడచివేయబడును. కాంగ్రెసు సభలను

గురించికూడ నేకోద్దిపంక్తులనో, యే వెనుక పేజీలోనో గిలకరింతురు. ఏ భారతీయుడో కాంగ్రెసును తిట్టుటయు, విమర్శించుటయు బ్రహ్మాండమైన వార్తయగును. అప్పుడప్పుడే సమ్మెను గురించియో పెద్దగా పడును. దొమ్మి జరిగినపుడే యే పల్లెసీమయో తటాలున ప్రాముఖ్యత వహించును. భారత పత్రికలును ఆంగ్లోయిండియను పత్రికలనే యనుకరింప యత్నించెను. కాని యవి జాతీయోద్యమము కెక్కువ ప్రాధాన్యత నిచ్చెను. తక్కినదంతయు భారతీయులకు వచ్చు పెద్ద యుద్యోగములతోను, చిన్న యుద్యోగములతోను, వారి ప్రమోషనులతోను, బదిలీలతోను, యుద్యోగస్థునికొరకు చేయబడు విందులతోను అప్పుడు "గొప్ప యుత్సాహము వెల్లువయగుట" తోను నిండియుండును. ప్రభుత్వమువారే వ్యవసాయిక ప్రాంతమునకో క్రొత్త తరము కట్టునపుడు (అట్టి తర మెప్పుడును ప్రభుత్వాదాయమును పెంచును.) భూఖామందు కది నష్టముగనుక పెద్దగోల చేయబడును. ఆ పటములో బీదరయితు యెచ్చటను మనకు కాన్పించడు. ఈ పత్రికలన్నియు భూఖామందులచేత పెట్టుబడిదారులచేత నడుపబడును. "జాతీయ ప్రెస్సు" అనునదీ విధముగా నుండెను. భూఖామందుల హక్కును సంరక్షించుటకు (శాశ్వతతరము కట్టనిచోట) శాశ్వతతరమును కట్టవలెనని కాంగ్రెసు తన మొదటి సంవత్సరములో నిరంతరము తీర్మానించుచుండెను. కాని రయితు సంగతి నెవరు తలపెట్టరైరి. జాతీయోద్యమము వలన నీ యిరువై సంవత్సరములలోను స్థితిగతులద్భుతముగా మారిపోయెను. ఇప్పుడు బ్రిటిషువారి యధీనములోనున్న పత్రికలు కూడ భారతీయ రాజకీయసమస్యలకు చోటిచ్చితీరవలెను. కాని వారు వాటిని తమ యిచ్చవచ్చినట్లు వ్రాయుదురు. భారత పత్రికలు మరి కొంత విశాలదృష్టిని చూపుచు కార్మికునిగురించి, రయితునుగురించి మెహార్బానీగా (అదియొక ఫ్యాషనుకనుక) వ్రాయును. గ్రామసీమలందు, పరిశ్రమలయందు కొద్ది శ్రద్ధ హెచ్చుచున్నను భారత పెట్టుబడిదారుల యొక్కయు భూఖామందులయొక్కయు ప్రయోజనములనే ముఖ్యముగా నవి సమర్థించును. భారత జమీందారు లెందరో

యీ పత్రికలమీద పెట్టుబడిపెట్టి తాము పెట్టినదానికి తగినలబ్ధిపొందు చున్నారు. ఈ పత్రికలను నడుపువారిలో చాలమంది కాంగ్రెసు సభ్యులుకూడ కాకపోయినను చాలపత్రికలు కాంగ్రెసుపత్రికలని పిలవ బడుచున్నవి. ప్రజలలో కాంగ్రెసుకు చాల పలుకుబడికలదు. కనుక వ్యక్తులు, సంఘములు దానిని తమస్వార్థముకొరకుపయోగించుకొను చున్నారు. కొంచెము తీవ్రవస్థాయిలో నడుపబడు పత్రికలెప్పుడు పెద్ద పెద్ద జుల్మానాలకు భయపడుచుండవలెను, లేదా కఠిన ముద్రణచట్టము క్రింద నణచివేయబడునను భీతి.

1920 లో ఫ్యాక్టరీలలోగాని పొలములలోగాని యుండు కూలీల పరిస్థితులు నా కెంతమాత్రము తెలియవు. కాని దేశములో విపరీత దారిద్ర్య దుఃఖము లున్నవనియు, స్వాతంత్ర్యము వచ్చుటతోడనే మొట్టమొదట నీసమస్య నెదుర్కొనవలయుననియు నేనెరుగుదును. కాని మధ్యతరగతులవారి యధికారముతోగూడిన స్వేచ్ఛయే తరువాత సోపానమని నే ననుకొంటిని. గాంధీజీ ఛాంపరాను కైరాలలో నడిపిన కర్షకోద్యమములతరువాత నేను రైతాంగసమస్యలయందు మరికొంత శ్రద్ధవహించుచుంటిని. కాని 1920 లో నా మనస్సు రాజకీయములందు రానున్న సహాయనిరాకరణమునందు లగ్నమయ్యెను. అప్పుడే చిత్రముగా నప్రయత్నముగ రయితాంగముతో నాకు సంబంధముకలిగెను. నాతల్లి, నాభార్య కమల జబ్బుగా నుండుటచే నేను వారిని ముస్సోరీ తీసుకొని వెళ్ళితిని. మాతండ్రి పెద్దకేసులో దాసుగారితో పోరుచుం డెను. మేము ముస్సోరీలోని సెవాయిహోటలులోనుంటిమి. అప్పుడు ఆఫ్గను బ్రిటిషురాయబారులమధ్య సంధిప్రయత్నములు జరుగుచుం డెను. ఆఫ్గను రాయబారు లా హోటలులోనేయాగిరి. కాని వారెవరి తోను కలియకుండ ప్రత్యేకముగ భోజనభాజనములను చేయుచుండిరి. వారి సంగతియే నాకేమియు తెలియలేదు. హఠాత్తుగ నొక సాయం కాలము పోలీసుసూపరింటెంటు వచ్చి నే నా రాయబారివర్గముతో నెట్టి సంభాషణలు సంబంధములు పెట్టుకొననని వ్రాసి యియ్యవలసి నదిగా ప్రభుత్వ మానతిచ్చెనను హుకుము నాకు జారీచేసెను.

నే నాశ్చర్యపడితిని. నే నచ్చట నెలరోజులనుండి యున్నను వారి నెవరిని చూచి యెరుగను. అట్లు చూచుట కవకాశములును లేవు. ఆ యధికారి రాయబారుల నెప్పుడును కాచియే యుండుటచే నతని కీ సంగతి బాగుగా తెలియును. పైగా వందలకొలది గూఢచారులు విరామము లేకుండ తిరుగుచునేయుండిరి. నే నేమియు వ్రాసియిచ్చువాడను కానని యతనికి చెప్పితిని. చివరకు డెహరాడూను జిల్లానుండి 24 గంటలలో వెళ్ళిపోవలెనని నన్నాజ్ఞాపించిరి. బాధపడుచున్న నా తల్లిని, భార్యను వీడుటకు నా కిష్టములేకపోయెను. కాని యప్పుడు శాసనోల్లంఘనము లేకపోవుటచే నేను ముస్సోరీ వీడితిని.

మా తండ్రి సర్ హార్కోర్టు బట్లరు (గవర్నరు) గారిని బాగుగా నెరుగును. అత డాయన కొకజాబు వ్రాయుచు నిట్టి తెలివితక్కువ యాజ్ఞ నత డిచ్చియుండడనియు, సిమ్లాలోని యే వ్యక్తియో యీ పని చేసియుండవచ్చుననియు వ్రాసెను. గవర్నరు అది చాల నిరుపద్రవకర మైనదనియు, నెట్టి గౌరవభంగము లేకుండ జవహర్లాలు అట్లు చేయ వచ్చునని బదులు వ్రాసెను. తండ్రిగారు దీని కంగీకరింపక నా తల్లికి గాని భార్యకుగాని వ్యాధి హెచ్చినచో నాజ్ఞయుండుగాక! లేకపోవు గాక! నే నచ్చటకు వెళ్ళితీరెదనని తిరుగజాబు వ్రాసెను. అస్లే మాతల్లివ్యాధి హెచ్చుటచే మే మిరువురము బయలుదేరితిమి. మేము ప్రయాణమగుటకు పూర్వ మా యాజ్ఞ రద్దయినట్లు మాకు తంతి వచ్చెను. మేము ముస్సోరీ చేరినతోడనే హోటలువద్ద నా చిన్నబిడ్డ నెత్తుకొనిన యొక ఆఫ్గనుని చూచితిని. అతడు ఆఫ్గను రాయబారు లలో నొకడనియు, ఆఫ్గను మంత్రి యనియు తెలిసికొంటిని. నా బహి ష్కారవార్తను ఆఫ్గనులు పత్రికలలో చదువుకొనిరి. నాటినుండి వారి ప్రధాని మా తల్లికి ప్రతిదిన మొక గంపెడు పండ్లను పువ్వులను పంపనారంభించెను.

తరువాత తండ్రిగారు, నేను నొక గిద్దరు రాయబారులను కలుసుకొంటిమి, వారు మమ్ము ఆఫ్ఘనిస్థానము రావలసినదని హృదయపూర్వకముగా నాహ్వానించిరి. కాని మేము పోజాలకపోతిమి.

ఆ దేశములో క్రొత్త ప్రభుత్వముక్రింద నా యాహ్వానమింకను నిలిచియుండునో లేదో నాకు తెలియదు. నా బహిష్కారకాలములో నేను రెండువారము లలహాబాదులో నుంటిని. ఈ కాలములోనే నాకు కిసాను యుద్యమముతో జోక్యము కలిగెను. ఈ సంబంధమే తరువాత పెద్దదియై నా మానసికదృష్టి నెక్కువగా మార్చివేసెను.

అలహాబాదులోనున్న ప్రధాన రాజకీయవేత్తల దృష్టిని తమ దుర్భరదారిద్ర్యస్థితి నాకర్షింపవలెనని ప్రతాపఘరు జిల్లానుండి 200 మంది రైతులు 1920 జూన్ మండువేసవిలో 50 మైళ్ళ దూరము నడచి అలహాబాదు వచ్చిరి. రామచంద్రుడు వారికి నాయకత్వము వహించెను. ఈ కిసాను లొక యమునానది ఘాటులో నదియొడ్డున యెండలో కూర్చునియున్నారని తెలిసి, కొందరు స్నేహితులతో నే నచ్చటకు పోతిని. తాలూకాదారులు తమ్ము పెట్టు హింసలను, అవమానములను వివరించి, తమస్థితి యసహ్యముగానున్నదని వారు మొఱపెట్టిరి. ఈ పనిమీద వారు అలహాబాదు వచ్చినందుకు వారిపై పగదీర్చుకొన మండిపడుచున్న తాలూకాదార్లనుండి రక్షించుటకు, తగిన పరిశోధనచేయుటకు మమ్ము రావలసినదని వారు వేడుకొనిరి. వారెట్టి యభ్యంతరములను విన్నరైరి! చివఱకు రెండు రోజులలో వత్తునని నేను వారి కభయమిచ్చితిని. నేను మరికొంత మంది స్నేహితులను తీసికొని రైలు, పక్కారోడ్డులేని యా మారుమూల గ్రామములలో మూడురోజులు వారితో గడిపితిని. అది నా కన్నులను తెఱచెను. గ్రామసీమలన్నియు నుత్సాహోద్రేకములతో పొంగుచుండుటను మేము చూచితిమి. కాకిచే కబురంపుచో వేలకొలది జనులు సమావేశమగుచుండిరి. ఒక గ్రామము మరియొక గ్రామముతో నంచెలమీద కబురులంపుచు గ్రామములే కాళీయగుచు, పొలములు, చేలగట్లు, పుంతలు, సందుగొందులు జనాకీర్ణమై పెద్దలు, పిన్నలు, స్త్రీలు, పురుషులు నేలయీనినట్లు సభాప్రదేశమునకు రాదొడంగిరి. వారికంటె ముందు సీతారామ్, సీతారామ్, రామ్ రామ్ యను రావము లాకాశమును నింపుచు, దశదిశల మారుమ్రోగు

చుండ నా ప్రోతలను విని, చుట్టుపట్ల గ్రామములవారందరు పరుగు పరుగున వచ్చెడివారు. వారు స్త్రీ పురుషులు, చినుగుగుడ్డలను ధరించి యుండిరి. వారు తమప్రేమను మాపై కురిపించి, మే మేదియో శుభవార్తలను తెచ్చితిమనియు, వారిని గట్టెక్కింపగల నాయకుల మనియు గంపెడాశతో ప్రేమపురస్సరముగా మమ్మాదరించిరి. వారిని, వారి దుఃఖములను, వారి యపారకృతజ్ఞతను చూచినపుడు లజ్జాదుఃఖములు నన్నావరించెను. నా భోగభూయిష్టమైన సుఖజీవనమునకు, నర్ధనగ్నశరీరులై యనేక యిడుమలుపడుచున్న వేలకొలది భారతపుత్ర, పుత్రికామతల్లులను నిర్లక్ష్యముచేసిన పట్టణవాస రాజకీయములకు సిగ్గిలితిని. హిందూదేశ యధఃపతనమునకు, గర్భదారిద్ర్యమునకు విచారపడితిని. నా కండ్ల యెదుట కట్టబట్టలేక తినతిండి లేక నలిపివేయబడి దుఃఖావృతమైయున్న యొక నూతన భారతము కాన్పించెను. దూరమున పట్టణమునుండి తీరుబడిగా చూడవచ్చిన, మాయందు వారికిగల విశ్వాసము నన్ను మరింత కలవరపరచెను. ఈ క్రొత్త బాధ్యత వహించుట భయావహముగనుండెను. వారిని నలిపివేయుచు దినదినాభివృద్ధియగు పన్నులభారము, పొలములనుండి మట్టిగుడిసెలనుండి పారద్రోలుట, కొట్టుట, వారి నన్నిపక్కల నుండియు భక్షించు రాబందులు, జమీందారు యేజంటులు, వడ్డీ వ్యాపారస్తులు, పోలీసులు – పగలంతయు చెమటోడ్చి కష్టించి, చివరకు వారిపాటంతయు వారిదికాక వారికి మిగులునది తన్నులు, తిట్లు కడుపుమంటలు – యిట్టి యసంఖ్యాక విషాదగాథల నెన్నింటినో వింటిని. అచ్చటకు వచ్చినవారిలో చాలమందికి సెంటుభూమియైన లేదు. వారి భూములు జమీందారులచే లాగివేయబడి కొంపలనుండి తరుమగొట్టబడిరి. భూమి సారవంతమైనది. కాని పన్నులభార మమితము. వారికున్న భూపరిమితులు తక్కువ. వాటికొరకు ప్రాకులాడు వారెక్కువ. ఈ యవకాశము తీసికొని భూఖామందులు పెద్దపెద్ద యన్యాయ కప్పములను గుంజుదురు. రయితుకు మరొక మార్గములేక వడ్డీవ్యాపారస్థునియొద్ద ఋణముచేసి కప్పము చెల్లించును. తరువాత

ఋణముకాని పన్నుకాని యిచ్చుకొనలేకపోవుటచే పొలమునుండి, యింటినుండి లేవగొట్టబడును.

ఇట్లు చాలాకాలమునుండియు జరుగుచు, రయితు దరిద్రుడగుచుండెను. ఇట్టిస్థితిలో రామచంద్రబాబాయను నొక మహారాష్ట్రుడు ప్రజలను మేల్కొలిపెను. ఇతడు ఫిజీదీవులకు నిర్బంధకూలీగా వెళ్ళి తిరిగివచ్చి యీ ప్రాంతములలో తిరుగుచు, తులసీదాసు రామాయణ కీర్తనలను పాడుచు రయితుల యిబ్బందులను వినుచుండెను. అతని కంత విద్యలేదు. కొంతవరకు తనస్వార్థముకొరకు వారి నుపయోగించుకొనెను. కాని యతడు ప్రజలను కూడగట్టగల మంచి సమర్థుడు. తఱచు సభలలో కూడి తమకష్టనిష్ఠూరములను చర్చించుకొనవలయునని యతడు రయితులకు బోధించి వారిలో సంఘీభావము కలిగించెను. తఱచు పెద్దసభలు జరుగుచుండెడివి. ఇవి వారికి కొంత శక్తినిచ్చెను. 'సీతారామ్' పురాతనమునుండి వచ్చుచున్న మామూలు కేకయే! కాని యతడు దానికొక యుద్ధ సాంప్రదాయము కల్పించి యవసరసమయముల నుపయోగించు చిహ్నముగను వివిధసీమలవారి నైక్యపరచు సంధానకరణిగను నుపయోగించెను. ఫైజాబాదు, ప్రతాపఘురు, రాయిబెరిల్లీజిల్లాలు సీతారాముల పురాణగాథలతో నిండియుండెను. తులసీదాసుహిందీ రామాయణము ప్రజల కభిమానగ్రంథము. చాలమందిప్రజలకు దీనిలోని వందలకొలది పద్యములు కంఠోపాఠములు. రామచంద్ర బాబా సమయానుకూలముగా నీ పద్యములనుతీసి యుదహరించెడివాడు. అతడు రయితులను కొంతవరకు దిట్టపరచి వారి కనేక లేనిపోనియాశలను కల్పించెను. అతనికొక ప్రణాళికలేదు. వారిలో మంచియుద్రేకము కలిగించి యతడు బాధ్యత నితరులకు విడిచివేసెడివాడు. అలహాబాదులో నున్నవారి కీయుద్యమముపట్ల శ్రద్ధకలిగించుట కత డంతమంది రయితులను తీసుకొనివచ్చెను. మరి రెండుమూడు వత్సరములతడీయుద్యమములో ప్రధానపాత్ర తీసుకొని రెండుమూడుసార్లు జయిలుకు కూడ పోయెను.

కాని తరువాత నతడు బాధ్యతలేనివాడై యపనమ్మకస్థుడయ్యెను. అయోధ్య వ్యవసాయ కాందోళన కన్నివిధముల తగియుండెను. అది "అయోధ్యప్రభువులము" అని తమంత తామే పిలుచుకొను తాలూకాదారులపుట్ట. ఇచ్చట అధమాధమమైన జమీందారీపద్ధతి యుండెను. జమీందారులు పెట్టుబాధ లసహ్యాములయ్యెను. భూమిలేని కూలిజనము హెచ్చుజొచ్చెను. ఒక్కతరగతి రయితుమాత్రమే యుండుటచే వారికి సంఘీభావము కుదిరెను.

హిందూదేశమును రెండుభాగములుగా విభజింపవచ్చును. పెద్ద పెద్ద భూఖామందులున్న జమీందారీప్రాంతము, రయితువారీప్రాంతము. కాని యందులో కొంత మిశ్రమముకూడ కలదు. బంగాళము, బీహారు, సంయుక్తరాష్ట్రములు జమీందారీప్రాంతములు. రైతువారీపద్ధతిలోని రైతుస్థితి యింతకంటె కొంచెము మెరుగు. పంజాబు, గుజరాతులలో రైతు జమీందారీప్రాంతములోని రైతుకంటె మంచిస్థితిలో నున్నాడు.

జమీందారీలలో ననేకరకముల రయితులున్నారు. భూమిహక్కు గలరైతు, లేనిరైతు, రైతుక్రిందరైతు. వీరిలో నొకరిప్రయోజనములు మరియొకరి ప్రయోజనములతో భేదించుచుండుటచే కలయికకుదరదు. 1920 లో అయోధ్యలో హక్కుగల రైతులుకాని, యావజ్జీవరైతులుకాని లేరు. కొద్ది కాలపరిమితిగల రైతులే యుండుటచే నెక్కువశిస్తు కట్టుకొనువాడు వచ్చినపుడెల్ల పాతవాడు గెంటివేయబడును. అయోధ్యలో నాచరణలో నీకొద్దికాలపరిమితికూడ గడచువరకు నమ్మకములేదు. భూఖామందు తాను తీసుకొను సొమ్ముకెప్పుడు రశీదు యివ్వడు. పన్ను యివ్వలేదను నెపముతో నతడు రైతును తొలగింపవచ్చును. రైతు రుజువుపరచుకొనుట కాస్కారముండదు. ఈపన్ను కాక ననేక యన్యాయ 'తొడపాసెము' లున్నవి. ఒక తాలూకాలో నిట్టివి 50 రకము లున్నవని నేను వింటిని. ఇది యత్యుక్తి కావచ్చును. కాని తాలూకాదార్లు తమయిండ్లలోని పెండ్లిండ్లకు, విదేశములో కుమారుని చదువుకు, గవర్నరుగారికి లేక

మరొక పెద్దదొరగారికి విందు, మోటారు లేక యేనుగును కొనుటకు యీ యన్నింటికి డబ్బు గుంజుదురు. వీరికి ప్రత్యేక పేరులు మోట్రానా (మోటారు కొనుటకుపన్ను) హాథానా (ఏనుగును కొనుటకుపన్ను)కూడ గలవు. కనుక నయోధ్యలో వ్యావసాయి కాందోళన బయలుదేరుటలో నాశ్చర్యమేమియు లేదు. నగరవాసులు రాజకీయ వేత్తలు మొదలగువారిసహాయ మెంతమాత్ర మవసరములేకుండ నిది దానంతటదియే ప్రబలుట నా కాశ్చర్యముగ దోచెను. దీనికి కాంగ్రెసుతో గాని సహాయ నిరాకరణముతో గాని సంబంధమేమియులేదు. ఈ రెండు గొప్పయుద్యమములకు మూలకారణ మొక్కటియే. ఇట్టి వ్యవసాయకోద్యమమునుగురించి పట్టణవాసులకు కించెత్తైనను తెలియక పోవుటే నా కాశ్చర్యము కలిగించెను. ఒక్కపత్రికలో గూడ దీనిని గురించి యొక్క పంక్తియైనను కానరాదయ్యెను. మన ప్రజలతో నెట్టి సంబంధమునులేక మన మొక చిన్న ప్రత్యేక ప్రపంచములో జీవించుచున్న ట్లిదివరకెన్నడు గుర్తించనట్లు నేనిపుడు గుర్తింప గలిగితిని.

9

కిసానులమధ్య సంచారము

నేను గ్రామములలో మూడురోజులు గడిపి అలహాబాదు వెళ్ళి వచ్చితిని. ఈ మాసంచారములో మేము గ్రామగ్రామము వెళ్ళి వారిమట్టి గుడిసెలలో నివసించుచు వారితో గంటలకొలది మాట్లాడుచు సభలను జరుపుచు చాలా గ్రామసీమలను జూచితిమి. మా మోటారుచిన్న పల్లెలకు పోవుటకు తగినబాటలు లేకపోవుచే ననేకమంది రైతులు రాత్రింబవళ్ళు పనిచేసి తాత్కాలికముగా మట్టిరోడ్లను తయారుచేసిరి. తఱచు మా మోటారు అచటచ్చట దిగిపోవుచుండెను. అప్పుడు వారత్యుత్సాహముతో దానిని భుజముల మీద నెత్తికొని మోసెడివారు. అప్పటికి చాలభాగము మేము కాలినడకనే వెళ్ళవలసివచ్చెను. ప్రతిచోట మాకు పోలీసులు, గూఢచారులు, ఒక డిప్యూటీ కలెక్టరు సిద్ధము. మేము పొలములను, చెలకలను, అడ్డపడిపోవుటచే వారు మాతో రాజాలక కటకటపడుచుండిరి. పాప మా డిప్యూటీ కలెక్టరు లక్నో నుండివచ్చిన యొక సుకుమారిబిడ్డ. ఆత డొక్కొక్కప్పుడు మా వేగమును తగ్గించుమని ప్రార్థించుచుండెడివాడు. చివరకతడు మాతో రాజాలక మెల్లగా జారిపోయెను. అది జూన్ నెలయగుటచే సూర్యభగవానుడు ప్రచండకిరణములతో వెలుగొందుచుండెను. నే నెప్పుడు నట్టి యెండలలో తిరుగకపోవుటయేగాక, యింగ్లండు నుంచి వచ్చినది లగాయితు వేసవిలో నే పర్వతసీమలకో పోవుచుండెడివాడను. నే నిపుడు తలకొక చిన్నరుమాలునుచుట్టి పగలంతయు తీవ్రమైన యెండలలో తిరిగినను నా యావేశములో నా కెట్టివేడియు తెలియకుండెను. నే నెట్టియెండనైన భరింపగలనని నా కెంతయో సంతోషము కలిగెను. ఎట్టి శీతోష్ణములనైన భరింపగలుగుటచే నాకు జయిలులోను, బయట పనిచేయునపుడు కూడ కష్టమనునదిలేక నిర్విచారముగ సాగిపోవుచుండెడిది. నా శరీరమారోగ్యవంతముగ నుండుటయు, నే నెప్పుడు కసరతు చేయుచుండుటయు (మా తండ్రిగారినుండి నేను

దీనిని నేర్చుకొంటిని) దీనికి గారణములు. మా తల్లిదండ్రులు నెరసినను ఆలోచనలచే ముఖమున ముదిమియు; ముడుతలు కాన్పించినను తక్కిన శరీరమంతయు (చనిపోవుటకొకసంవత్సరమువరకు) నంతకంటె నిరువదివత్సరములు చిన్నదిగనే యుండెను. నేను 1920 జూనులో ప్రతాపఘురు వెళ్లుటకు పూర్వ మనేకసారులు గ్రామములకు వెళ్ళియచ్చటనుండి రయితులతో మాట్లాడితిని. కుంభమేలములలో వేల కొలదిమందిని గంగాతీరమున చూచితిని. గ్రామములలో హోము రూలు ప్రచారమును సలిపితిమి. కాని వారిస్థితిని భారతదేశమున వారికున్న ప్రాధాన్యతను నే నెన్నడు పూర్తిగా గుర్తించనైతిని. మనలో చాలమందివలె నేనును వారి నామామాత్రముగా చూచితిని. ఈ ప్రతాపఘురుసంచారములో నేను కండ్లు తెరచితిని. నాటినుండి నా కట్టెదుట కట్టగుడ్డ తినతిండి లేక కడుపుమంటతో మలమలమాడు భారతదేశమే కాన్పించును.

ఆ రైతులు నా సిగ్గు పోగొట్టి బహిరంగసభలలో మాట్లాడ నేర్పిరి. అంతకుమునుపు నేను బహిరంగసభలో నుపన్యసించలేదు. అందులో హిందూస్తానీయనిన మరింత భయము. కాని నా కిప్పు డది తప్పినదికాదు. నేను వక్తను కాకపోవుటచే నెదుటమనిషితో మాట్లాడుసరళిలో ప్రసంగములుగా మాట్లాడుచు నా మనస్సులోను, హృదయములోను నున్నదానిని చెప్పివేసెడివాడను. సభలో పది మందియున్నను, పదివేలమందియున్నను నొకేమాదిరిగా ప్రసంగ సాంప్రదాయములోనే మాట్లాడెడివాడను. నా భాషలో ప్రవాహ ముండెడిది. చాలమందికి నేను చెప్పినదంతయు తెలియకపోవచ్చును. నాభాషకాని, భావముకాని వారికి సరళముగా నుండకపోవచ్చును. పెద్దసభలలో కొంతమందికి నేను చెప్పినది వినపడకపోవచ్చును. కాని వారు వీనిని లెక్కచేయక నాయందు సంపూర్ణ విశ్వాసము నుంచిరి.

నేనొకసారి ముస్సోరి వెళ్ళి నా తల్లిని, భార్యను చూచి తిరిగివచ్చి మరల నా సంచారము ప్రారంభించితిని. ఈ యుద్యమ మంత

కంతకు హెచ్చుచుండెను. అణగద్రొక్కబడిన కిసానుజాతి కెక్కడ లేని యాత్మవిశ్వాసముకలిగి సాభిమానముతో తలయెత్తుకొని నడువ నారంభించెను. జమీందారు ఏజంటులు, పోలీసులు మొదలగువారి భయము బొత్తిగా తగ్గిపోయెను. ఒకనిని పొలమునుండి తొలగించి నపుడు మరియొక డెవడు దానిదరికి పోడయ్యెను. జమీందారు నౌకర్ల దౌర్జన్యములు, అన్యాయ తొడపాసెములు తగ్గనారంభించెను. ఎచ్చట నైన నట్టివి జరిగెనా వెంటనే రిపోర్టుచేయబడుచు తగిన పరిశోధనలు జరుగుచుండెను. తాలూకాదార్లు భయపడి తమ్ము కాపాడుకొనుటకే చూచుకొనిరి. రాష్ట్రప్రభుత్వమువారు అయోధ్య వ్యవసాయక చట్ట మును సవరణచేసెదమని వాగ్దత్తము చేసిరి.

"ప్రజల సహజ నాయకులము" అని తమ్ముతామే పిలుచు కొను తాలూకాదార్లు, జమీందార్లు భూమికంతకు ప్రభువులైనవారు, బ్రిటిషుప్రభుత్వలాలనచే తయారయిన మొద్దబ్బాయిలు! ఆ ప్రభు త్వముచే ప్రసాదింపబడిన, లేక ప్రసాదింపబడని ప్రత్యేకవిద్యచేతను, శిక్షణచేతను వారు పూర్తిగా బుద్ధిమాంద్యులైరి. వారు తమరైతుల కావగింజంతయైనను పనిచేయక ప్రజలమీద, భూమిమీద బ్రతుకు పరాన్నభుక్కులు. వారు స్థానిక ప్రభుత్వోద్యోగులను సంతోషపెట్టి తమ ప్రత్యేక హక్కులను, ప్రయోజనములను కాపాడమని వేధించు చుండుటయే వారి ప్రధానకార్యము. బ్రిటిషు ప్రభుత్వమువంటి ప్రభుత్వ మున్నంతకాలమే వారు జీవింతురు. నేను 1921 సంవత్సర మంతయు గ్రామములలో తిరుగుచుంటిని. అసహాయోద్యమము తీవ్రరూపమును దాల్చి దాని సందేశము మూలమూలలనున్న కుగ్రామములకు చేరుచుండెను.

వందలకొలది కాంగ్రెసు సేవకులు గ్రామములలోపడి తమ సందేశము నిచ్చుటయేగాక కిసానుల కష్టములు తొలగింపబడునని చెప్పుచుండెడివారు. స్వరాజ్యపదము సమస్తము నిముడ్చుకొనుచుం డెను. అయినను అసహాయోద్యమము వ్యావసాయకోద్యమము రెండు ప్రత్యేకోద్యమములు. కాంగ్రెసుబోధచే లావాదేవీలు హఠాత్తుగా

తగ్గి, గ్రామములలో పంచాయతులు ప్రబలెను. కాంగ్రెసు సేవకుడు వెళ్ళిన ప్రతిచోట దౌర్జన్యరాహిత్యమును గురించియే బోధించుచుండు టచే నద్భుతమైన శాంతియుత వాతావరణ మేర్పడెను. దీనిని పూర్తిగా ప్రజ లర్థముచేసికొనక పోవచ్చును. అయినను యిది రైతు నెట్టి దౌర్జన్యము చేయకుండ చేసెను. ఇది తక్కువ ఫలిత మెట్లగును? వ్యావసాయికోద్యమము దౌర్జన్యమునకు పేరుపొందెను. అయోధ్యలో కొన్ని ప్రాంతముల రయితులు నిరాశచెందుటచే పరాభవలేశము, దావానలము దరికొల్పు నంతటి తీవ్రతలోనుండిరి. అట్టివా రద్భుత శాంతిని చూపిరి. నే నెరిగినంతవరకు దౌర్జన్య మొక్కసారియే జరిగెను. ఒకనాడొక తాలూకాదారు తన యింట కొందఱు మిత్రులతో కూడి తన భార్యయెడల యవినీతిగను, యమర్యాదగను సంచరించుచున్నా డని యొకరైతు వాని నొక్క లెంపకాయ కొట్టెను. మరియొకవిధమైన దౌర్జన్యము ప్రభుత్వముతో సంఘర్షణకు కారణమయ్యెను. అరువది డెబ్బదివేల మంది కిసాను లొక్కొక్కప్పుడు వారిసభలకు పోవునపుడు టిక్కెట్టులేకుండ రైలుబండ్లమీద ప్రయాణముచేయుచు రైల్వే యధికారు లడిగినచో పాతరోజులు పోయినవనియు, కొత్తరోజులు వచ్చినవనియు చెప్పుచుండెడివారు. వారిని ప్రోత్సహించిన వా రెవరో మేమెరుంగము. మే మెప్పుడునట్లు సూచించియుండలేదు. రైల్వే యధికారు లతికఠిననిర్బంధములను చూపుటచే నిది తరువాత తగ్గిపోయెను.

1920 లో చిన్న నేరములను చేసిరను కారణమున కొందరు రైతునాయకులు నిర్బంధింపబడిరి. ప్రతాపఘురులో విచారణ జరుగ వలసియుండెను. వేలకొలది జనులు కోర్టుఆవరణ లగాయతు ఖయిదీ లున్న జయిలువరకు నిసుక వేసినను రాలనట్లు మూగిపోయిరి. మేజస్ట్రేటు చేయాడక విచారణ మరునాటికి వాయిదా వేసెను. మరునాడు ప్రజలు ద్విగుణమై జయిలునుకూడ కప్పివేసిరి. చివరకు జయిలులోనే విచా రణ సలిపి ఖయిదీలను విడిచివేసిరి. కిసానులు దీనినొక గొప్ప విజ యముగా నెంచి ప్రభుత్వము నెప్పుడు నిట్లు సంఖ్యాబలముచే జయింప గల మనుకొనిరి.

1921 జనవరిలో కొంతమంది రైతునాయకులు రైబెరిల్లీ జయిలులో నిర్భంధింపబడిరి. వెనుకటివలెనే వేలకొలది జనులచ్చటకు వెళ్ళిరి. కాని యీసారి ప్రభుత్వము చాల కట్టుదిట్టములను జేసి పోలీసు, మిలిటరీ మద్దతులతో ప్రజల నాపివేసిరి. పట్టణము వెలుపల నొక చిన్ననది కవతలప్రక్క జనప్రవాహ మాపివేయబడెను. చాల మంది యెట్లో యితర దిశలనుండి పట్టణములోనికి వచ్చుచుండిరి. ఇట్టిస్థితిలో నే నచ్చటకు వెళ్ళితిని. నే నింక ముందుకు పోరాదని జిల్లా మేజస్ట్రేటు హుకుము నా కందజేయబడెను. నే నా హుకుము వెనుకభాగముగ నన్నే చట్టముక్రింద యే న్యాయము ప్రకారము ముందుకు పోరాదని నిషేధించిరో తెలుపవలసినదనియు, నంతవరకు నేను వెళ్ళుచునే యుందుననియు వ్రాసిపంపితిని. నేను నదిదగ్గరకు పోవుసరి కవతలప్రక్కనుండి తుపాకి కాల్పులు వినవచ్చెను. నన్ను వంతెనయొద్ద మిలిటరీ ఆపివేసెను. ఆ చుట్టుపట్ల పొలములలో దాగి యున్న భయభ్రాంతులైన కిసానులు నా చుట్టు మూగసాగిరి. ఒక ప్రక్క నొక చిన్ననది కవతలనైపున తోడిసోదరులపై బారెడు దూరములో కాల్పులు జరుగుచుండ, సైనికు లంతట విజృంభించి యుండ ప్రజ లావేశపడుచుండిరి. నే నప్పు డచట రెండు మూడు వేలమంది సభలో నుపన్యసించి భయభ్రాంతులైన ప్రజల యుద్రేక, భయములను తగ్గించితిని. సభ జయప్రదముగా జరిగి, కిసానులు శాంత పడినమీదట కలెక్టరు కాల్పులు జరుగుచోటునుండి వచ్చిరి. అతడు వేడుటచే నే నాయనయింటికి పోగా నన్నత డచ్చట నేదో యొక మిష పెట్టి రెండు గంటలవరకు ఆపివేసెను.

ఆ కాల్పులలో చాలమంది చనిపోయిరి. కిసానులెంత శాంత ముగ నున్నను అధికారులు పొమ్మని యాజ్ఞాపించినపుడు కదలకుండుటే వారు చేసిన పాపము. నేను, లేక వారి విశ్వాసము చూరగొనిన మరి యొకరు చెప్పినచో వారు తప్పక వెళ్ళిపోయెడివారు. నా కొఱకు కొంచెమాగవలసినదని యెవరో మేజస్ట్రేటుతో చెప్పినను ఆయన వినలేదు. తాను విఫలుడైనచోట నొక యాందోళనపరుడు జయిం

చుట నాయన యెట్లుచూడగలడు? అధికారగర్వముతో కూడిన పర ప్రభుత్వము లట్లొప్పుకొనజాలవు.

రై బెరిల్లీ జిల్లాలో నాకాలమున రెండుసార్లు కాల్పులు జరిగెను. తరువాత ప్రతి పంచాయతీసభ్యునకు, ప్రధాన రైతు నాయకునకు నంతకంటె నధ్వాన్న మగు భయంకరపరిపాలన ప్రారంభమయ్యెను. ప్రభుత్వమెట్లైనను ఆ యుద్యమము నణచివేయ సంకల్పించెను. ఆ రోజులలోనే కాంగ్రెసు సందేశము ననుసరించి రాటమువడకుట గ్రామగ్రామమునకు ప్రాకుచుండెను. కనుక రాటము రాజద్రోహమయ్యెను. రాటము తగులబెట్టబడెను. వడుకువాని కేబాధయో కల్పింపబడుచుండెను. వందలకొలది నిర్బంధింపబడిరి. అనేకవిధముల వ్యావసాయిక, కాంగ్రెసు యుద్యమములను రెంటిని రై బెరిల్లీ, ప్రతాపఘరు జిల్లా గ్రామసీమలలో లేకుండచేయ ప్రభుత్వము సంకల్పించెను. ఉద్యమములకు చాలవరకు ప్రధాననాయకు లొక్కరే.

మరికొద్దికాలమునకు ఫైజబాదు జిల్లాలోకూడ నిర్బంధ ప్రయోగము లారంభమయ్యెను. కొన్నిగ్రామములలోని రైతులొక జమీందారు ప్రోద్బలముచే నొక తాలూకుదారు ఆస్తి దోచుకొనిరి. అట్లు దోచుకొనమని మహాత్మాగాంధీగారియాజ్ఞయైనదని యా యమాయక ప్రజలను నమ్మించుటచే వా రది నిజమనినమ్మి "మహాత్మాగాంధీకిజై" అని యఱచుచు నట్లుచేసిరి. నా కిది తెలిసినపుడు చాలకోపమువచ్చి నే నొకటిరెండు దినములలో వెళ్ళితిని. వెళ్ళుటతోడనే నేనొక సభ జరుపగా చుట్టుపట్ల పదిగ్రామముల నుండి యైదారువేలమంది జనము హాజరైరి. వారు తమకును ఉద్యమమునకు తెచ్చిన యపకీర్తినిగురించి నేనతి కఠినముగా మాట్లాడితిని. దోషులైనవారు బహిరంగంగా తమ తప్పిదము నొప్పుకొనవలెనని చెప్పి సభలోనట్టివారున్నచో చేతుల నెత్తవలెనని నేనంటినో లేదో వెంటనే రెండుడజనులమంది చేతులనెత్తిరి.

తరువాత వారితో నేను ముఖస్తముగా మాట్లాడినపుడు వారు తాము మోసపోయిన విధమును పూసగ్రుచ్చినట్లు చెప్పగా విని యా యమాయిక యవివేక ప్రజలను చిరకాల నిర్బంధముల

పాలు చేసితినిగదాయని నే నెంతయు ఖేదపడితిని. కాని చిత్రమేమన యీ రెండుమూడు డజనులమంది మాత్రమే బాధపడలేదు. ప్రభుత్వ మీ సదవకాశము నెట్లు పోగొట్టుకొనగలదు? ఒక వేయిమంది నిర్బం ధింపబడిరి. జిల్లాజయిలంతయు క్రిక్కిరిసిపోయెను. విచారణ సుమా రొక్కసంవత్సరమువరకు సాగింపబడెను. విచారణ ముగియులోపల చాలమంది జయిలులోనే చనిపోయిరి. చాలమందికి దీర్ఘకాలశిక్షలు ప్రాప్తించుటచే నేను జయిలుకు పోయినప్పుడు చాలమందిని చూడ గలిగితిని. హిందూదేశములోని కిసానులకంత శరీరపటిమ, చాలకాల మాగగల శక్తిసామర్థ్యములు లేవు. కఱవులు, జాడ్యములు మొదలగు నవి యొక్కొక్కప్పుడు లక్షలకొలది రైతులను తుడిచివేయుచుండును. ప్రభుత్వము జమీందారులు కలిసి యొక సంవత్సర మనర్గళముగా కురిపించిన నిర్బంధాగ్నికి తాళగలుగుట కేవల మాశ్చర్యమైన విష యము. చివరకు ప్రభుత్వమునకు వారు తాత్కాలికముగా లొంగక తప్పినదికాదు. ఐనను యుద్యమము సన్నసన్నముగా సాగుచునే యుండెను. ఒక్కవిషయము మాత్రము మనము జ్ఞప్తియందుంచు కొనవలెను. ఇదంతయు 1921 యంతమున కాంగ్రెసు ప్రారంభించిన జయిలుయాత్రలకు పూర్వమేయని మనము మఱువరాదు. ఈ రెండవయుద్యమములో కూడ వారు ముఖ్యపాత్ర ధరించిరి. వ్యావ సాయికోద్యమమువలన భయపడి ప్రభుత్వము క్రొత్తవ్యావసాయిక చట్టములనుచేయ త్వరపడిరి. వీనివలన కిసానులకు కొంతలాభము కలుగునని యెంచబడెను. ఇంతలో ఉద్యమము తగ్గినట్లుండుటచే పై చట్టము సడలింపబడెను. దానివలవ నయోధ్యలోని కిసానులకు జీవితకాలహక్కు స్థిరపరుపబడెను. ఇది బాగుగనే కాన్పించెను. కాని యిది విశేషలాభదాయకముకాదని తరువాత తెలిసికొనబడెను. అయోధ్యలో నింకను అప్పుడప్పుడు వ్యావసాయిక బాధలు కలుగు చునే యుండెను. 1929 లో ప్రారంభమైన ప్రపంచ ఆర్థికమాంద్యముచే ధరలు విపరీతముగా పడిపోవుటవలని మరల నొక విషమపరిస్థితి యేర్పడెను.

10

అసహాయోద్యమము

పంజాబు, ఖిలాఫతు అన్యాయములు భారతదేశమంతట చర్చనీయాంశము లయ్యెను. వీనిని సవరించుటకు ప్రారంభింపబడిన యసహాయోద్యమమంత్రమును ప్రతివాడు జపించుచుండెను. జాతీయ స్వాతంత్ర్యము స్వరాజ్యము అను పెద్దసమస్యకు తాత్కాలికముగ నంత ప్రాధాన్యత యివ్వబడలేదు. గాంధీజీకి నిర్ధారణలేని, పెద్దపెద్ద యాశయములనిన యిష్టముండదు. అతడెప్పుడు నిదమిత్థమను నిర్వచనము, నిర్ధారణగల విషయములకే ప్రాముఖ్యతనిచ్చును. అయినను స్వరాజ్య శబ్దము ప్రజలకు తారకనామ మగుచుండెను. పెద్దపెద్ద సభలలో ననేక వేలమందిలో నిది యుదహరింపబడుచుండెను.

అసహాయోద్యమమునుగురించియు ముందుచేయవలసిన కర్తవ్యమును గురించియు చర్చించుటకు 1920 వ సంవత్సర శరత్కాలమున కలకత్తాలో ప్రత్యేక కాంగ్రెసు జరిగెను. చిరకాల మమెరికాలోనుండి యింటికి తిరిగివచ్చిన లాలాలజపతిరాయి దాని కధ్యక్షత వహించెను. అతడు అసహాయోద్యమమును నెదిర్చెను. భారతరాజకీయములలో నతని కతివాదియని పేరు. కాని యతని సామాన్యదృష్టి, శాస్త్రబద్ధమై, మితవాదసరళిలో నుండును. పరిస్థితుల బలవంతముచేతనే యతడు తిలకు మొదలగు నితర యతివాదులతో చేరెను. అతనికి మంచి సాంఘిక యార్థిక పరిజ్ఞానముండుటచే చాలమంది భారత నాయకులకంటె విశాల దృష్టియే యుండెను.

1909 ప్రాంతమున బ్లంటుగారు గోఖ్లే, లజపతిరాయిగార్లను సందర్శించి తన 'డయిరీ' లో వారి నతికఠినముగా విమర్శించుచు, వారు యదార్థముల నెదుర్కొనుటకు పిరికిపడుచుండిరనియు, భయపడుచుండిరనియు వ్రాసెను. కాని లాలాజీ చాలామంది భారతనాయకులకంటె వానిని బాగుగనే యెదుర్కొనెను. బ్లంటుగారి యభిప్రాయములా కాలపు రాజకీయములు, నాయకులు నెంతటి తక్కువస్థాయిలో

నున్నదియు సూచించును. కాని పదిసంవత్సరములలో నిది యంతయు తారుమారయ్యెను. ఒక్క లాలాలజపతిరాయేగాక, నతనితో చాల మంది బుద్ధిమంతులే యసహాయోద్యమము నెదిరించిరి. కొంచెమించు మించు కాంగ్రెసు పాతసంరక్షకులందరు దీనినెదిర్చిరి. చిత్తరంజన దాసుగారీ వ్యతిరేకవాదులకు నాయకుడు. అత డీ తీర్మానము వెనుక నున్న తత్త్వమునకు వ్యతిరేకికాడు. కాని శాసనసభా బహిష్కార మతనికి గిట్టలేదు.

వృద్ధసంతతి నాయకులలో గాంధీప్రక్క మా తండ్రి యొక్కడే యుండెను. అంతకుపూర్వ మతడు దానినిగురించి యెంతయో తర్జన భర్జనచేసెను. దానికివచ్చిన యభ్యంతరముల నన్నింటిని యతడును చూచి పునరాలోచనచేసెను. ఇతర మిత్రులవలెనే యతనికిని యీ యపూర్వమార్గమెచటకు గొంపోవునోయను సందేహములుతోచి జంకు చుండెను. జయప్రదమగు కార్యము నతడు కాంక్షించుచుండెను. ఈ తీర్మానము అట్టికార్యమును నిర్వచించెను. అప్పటికి నతడు గాంధీజీ, చిత్తరంజనదాసులతో దీర్ఘసంభాషణను జరుపుచునేయుండెను. దాసు గారు, మాతండ్రి యపు డొక పెద్దకేసులో నిరుపక్షములను వహించి పనిచేయుచుండుటచే తఱచు కలసికొనుచుండిరి. వారిద్దరు నీ సమస్య నొకదృష్టితోనే చూచి యొకే పర్యవసానమునకు వచ్చిరి.

కలకత్తా ప్రత్యేకకాంగ్రెసుకుపూర్వము తండ్రిగారితోనే నం తగా కలియలేదు. కాని నే నాయనను కలిసినపుడెల్ల నతడీ సమస్యను నిరంతర మెల్లెదుర్కొనెడివాడో చూచుచుండెడివాడను. జాతీయదృష్టి నటుంచి, యతడు దీనిని వ్యక్తిగతముగా కూడా చూచెను. అసహా యోద్యమ మనగా ముందర నతడు తనవృత్తి వీడవలెను. అనగా తనపూర్వజీవితమునంతను త్రోసిపుచ్చి క్రొత్తదానిని సృష్టించుకొన వలెను. షష్టిపూర్తియైనవాని కిది యెంతటికష్టమో వేరుగ చెప్ప నక్కరలేదు. తనవృత్తిని, తన పూర్వపు రాజకీయమిత్రులను, తన కింతవర కలవడిన సాంఘికజీవితమును, తన భాగ్యభోగ్యములకు తగి నట్లు చేయుచుండిన యనేక ఖర్చులను – ఇన్నింటిని వీడవలెను.

ఆర్థికవిషయ మంత తేలికమైనదికాదు. తన వృత్తివలన వచ్చు ఆదాయము పోయినపుడు జీవిత వ్యయప్రమాణము పూర్తిగా తగ్గింపబడవలెను.

అయినను అతని యాత్మగౌరవము, హేతుజ్ఞానము, మానధనము నతనిని క్రమముగా నుద్యమములోనికి దింపెను. అనేక విషయ పరంపరలచే కలిగిన క్రోధానలము పంజాబు దురంతరములతో పూర్తియయ్యెను. ద్రోహముచేయుట, దాని కన్యాయము జతచేయుట, జాతీయ పరాభవము యను క్రోధపూరిత భావముల కేదియో యొక మార్గముండవలెను. కాని యతడు కేవల ముత్సాహ తరంగములచే కొట్టుకొనిపోవువాడు కాడు. శుశిక్షణకలిగిన న్యాయవాదబుద్ధితో మంచిచెడుగులను మథనముచేసిన మీదటనే యతడు తుదినిర్ణయము గావించుకొని యీ యుద్యమములో గాంధీజీతో కలిసెను.

గాంధీజీ, వ్యక్తిగతముగా నతని నాకర్షించెను. అతనిని మార్చుటకీ యాకర్షణమే కొంతకారణము. అతని ప్రేమా ప్రేమలు రెండును తీవ్రములు. అతడు ద్వేషించువానితో నెన్నటికి కలియడు. కాని వీ రిద్దరి కలయిక చిత్రమైనది. ఒకడు ఋషి, తపస్వి, మతాభిమాని, జీవితము ప్రసాదించు భాగ్యభోగ్యములను, సుఖాదికములను త్యజించినవాడు. రెండవవాడు భోగి. జీవితము ప్రసాదింపగల సమస్తైశ్వర్యములను, భోగములను అనుభవించినవాడు; ముందు రానున్న దానికొఱకు (పరముకొఱకు) లెక్కచేయనివాడు. వేదాంతపరిభాషలో నది భోగి, యోగుల కలయిక. కాని వా రిరువురను బంధించి, వారి కత్యంతమైత్రినిచేకూర్చు సామాన్యపాశములు, ప్రయోజనములు కలవు.

యోగియు, భోగియు వ్యతిరేక దృక్పథములనుండి బయలుదేరి, వివిధమార్గముల త్రొక్కుచు, (ఒకడు మతాభిమానియై, మరియొకడు దానికి వ్యతిరేకియై) నీచస్వభావములేని దృష్టికలవారై తమ్మొకరి నొక రర్థము చేసికొనగలరు - ఒక్కొక్కప్పుడు వారు కేవలము కలసికొనెదరని వాల్టరుపేటరు తన పుస్తకములలో నొకచోట వ్రాసెను.

కలకత్తా ప్రత్యేక కాంగ్రెసుతో రాజకీయాలలో గాంధీయుగ మారంభమై నేటివరకు సాగుచుండెను. కాంగ్రెసు రూపమే మారి పోయెను. యూరపియను దుస్తులు పలాయనమయి కొద్దికాలములో ఖద్దరు మాత్రమే కానవచ్చెను. క్రొత్తతరగతి ప్రతినిధి, ముఖ్యముగా, మధ్యతరగతులలో క్రిందితరహాకు చెందినవాడు, కాంగ్రెసు ప్రతినిధి యయ్యెను. హిందూస్తానీభాష యంతకంత కెక్కువగా వాడబడు చుండెను. ఒక్కొక్కపుడు కాంగ్రెసు సభ జరుగు రాష్ట్రములోని భాషయే యుపయోగింపబడుచుండెను. జాతీయసేవలో విదేశభాష నుపయోగింపరాదను భావముకూడ పెరుగుచుండెను. కాంగ్రెసు సభ లలో నూతన జీవితము, నూతనోత్సాహము, నూతనశక్తి, శ్రద్ధా భక్తులు తాండవమాడుచుండెను.

కాంగ్రెసు సభ ముగిసినతరువాత గాంధీజీ అమృతబజారు పత్రి కాధిపతియైన శ్రీయుత మోతీలాలు ఘోషుగారిని సందర్శింపబోయెను. అతడుమృత్యుశయ్యపైనుండెను. నేను గాంధీజీతోనుంటిని. ఘోషుగారు గాంధీజీని, యతని యుద్యమమును ఆశీర్వదించి తనమట్టుకు తా నితర లోకములకు పోవుచుంటిననియు, నవి యే లోకములైనను, బ్రిటిషుప్రభు త్వము మాత్రము లేనిలోకములని తనకొక గొప్ప సంతోషము కల దనియు చెప్పెను. చివరకతడు యీ సామ్రాజ్యము పోజాలనిచోట నుండును! కాంగ్రెసునుండి తిరిగివచ్చునపుడు గాంధీజీతో నేను, రవీంద్రనాథ్ టాగూరును, అతని యన్నగారు 'బరోదాదా' ను చూచుటకు వెళ్ళితిని. మేమచ్చట కొన్ని దినములుంటిమి. అచ్చట సి. యఫ్. ఆండ్రూసుగారు నాకు కొన్ని పుస్తకములనిచ్చిరి. నేను వానిని శ్రద్ధతో చదివితిని. అవి ఆఫ్రికాలోని సామ్రాజ్యతత్త్వ ఆర్థిక విధానమును తెలుపుచుండెను. మోరెల్‌గారి 'నల్లవానిభారము' అను పుస్తకము నన్నెక్కువగా కదల్చివేసెను.

కొంచె మించుమించు యీ సమయముననే సి. యఫ్. ఆండ్రూసు 'స్వాతంత్ర్యము—సత్వరావసరము' అను నొక కరపత్ర ములో భారతదేశ స్వాతంత్ర్యము కావలెనని సమర్థించెను. సీలీగారు

హిందూదేశమును గురించి వ్రాసిన వ్రాతలననుసరించి ఈ వ్యాసము వ్రాయబడెను. అది భారతదేశ స్వాతంత్ర్యము నప్రతిహతముగ సమర్థించుటయేగాక మా హృదంతరాళములలో నున్న భావములను వ్యక్తముచేయుచుండెను. మనలో కలిగిన తీవ్రప్రబోధమును, మన యసంపూర్తి కోరికలను, నతని నిష్కపట సరళభాష మరింత స్పష్ట పరచెను. ఆతడు వ్రాసినదానిలో నార్థిక పునాదులుకాని, సామ్యవాదము గాని లేవు. అది జాతీయతతో నుట్టిపడుచుండెను. భారత పరాభవాగ్ని, దానిని నిర్మూలింపవలెననెడి దృఢసంకల్పము, మన మింకను పొందుచున్న యధఃపతనము—ఇవన్నియు వివరింపబడెను. ఆండ్రూసు వంటివిదేశీయుడు, భారతదేశములోని పాలకజాతికి జెందినవాడు, మన యాంతరంగికాక్రోశము వెలిబుచ్చగలుగుట మహాద్భుత విషయము. సీలీగారు చాలకాలము క్రిందనే చెప్పినట్లు అసహాయోద్యమమన "మనపై యధికారము చెలాయించుచున్న పరిపాలనకు తోడ్పడుట కంటె వేరు లజ్జాస్పదమగు విషయమేమియు లేదు" అను భావము. "ఆంతరంగికమైన గొప్ప సాంఘిక పరివర్తన మొక్కటియే యాత్మాభి వృద్ధికి మార్గము. అట్టి పరివర్తనమునకు తగిన యుత్సాహశక్తి భార తాంతరాత్మనుండియే ప్రభవింపవలెను. అది పైనుండి ప్రసాదింపబడు ఋణములవలనను, దానధర్మములవలనను, దయాధర్మ బిచ్చముల వలనను, ప్రకటనలవలనను వచ్చునదికాదు. అది అంతరాత్మ జనితము— "ముక్తులుకండు ! బానిసత్వమును పారద్రోలుడు!" అను మంత్రమును గాంధీమహాత్ముడు భారతాత్మకుదో్బధించినపుడు అట్టి యాంతరంగికో త్సాహము వియన్నదీతోయములవలె వెల్లువయై పారుచుండ నేనా దుర్భర భార విమోచనము నాధ్యాత్మికానందముతో ననుభవించితిని. భారతాత్మ యొప్పొంగెను. ఒక్కక్షణికములో దాస్యశృంఖలములు సడల నారంభించి, స్వాతంత్ర్యకవాటము తెరువబడును" అని ఆండ్రూసు వ్రాసెను.

తరువాత మూడు మాసములలో భారతదేశమంతయు నసహా యోద్యమ తరంగములో మునిగిపోయెను. శాసనసభాబహిష్కార

మద్వితీయముగా జరిగెను. అది శాసనసభల కొక్కడును పోకుండ చేసి స్థానములను ఖాళీచేయలేదు; చేయజాలకపోయెను. ఏ పదిమంది వోటరులైనను యెన్నుకొనవచ్చును! లేదా పోటీ లేకుండగనే యెన్నుకొనబడవచ్చును! అత్యధికసంఖ్యాకులు వోటుచేయలేదు. భారత సందేశమును గౌరవించినవారెవరు అభ్యర్థులుగా నిలువలేదు. ఎన్నిక దినమున సర్ వెలంటైన్ షిరాలుగారు అలహాబాదులో నుండిరి. ఆయన అన్ని పోలింగులకుపోయి చూచి బహిష్కార విజయమునకు నిర్ఘాంతపడెను. అలహాబాదుకు పదిహేను మైళ్ళ దూరములోనున్న యొక పోలింగు కొక్క వోటరు కూడా పోలేదు. అతడు భారత దేశమును గురించి వ్రాసిన యొక పుస్తకములో తన యనుభవములను వర్ణించెను. చిత్తరంజనదాసు మొదలగువారు కలకత్తా కాంగ్రెసులో బహిష్కరణోద్యమమునకు ప్రతికూలురైనను కాంగ్రెసు తీర్మానమునకు కట్టుబడిరి. ఎన్నికలగుటతోడనే, 1920 డిసెంబరు నాగపురకాంగ్రెసు నిండుసభలో రెండుపక్షములవారు కలసికొనిరి. ఉద్యమ విజయమువలన సందేహమనస్కుల సందేహములన్నియు పటాపంచలయ్యెను.

కలకత్తా కాంగ్రెసు తరువాత కొంతమంది పాతనాయకులు కాంగ్రెసునుండి జారిపోయిరి. వారిలో జిన్నాగారొకరు. సరోజినీదేవి ఈయనను 'హిందూమహమ్మదీయైక్యతాసంధానకర్త' యని పిలిచెను. వెనుక ముస్లింలీగును, కాంగ్రెసు సమీపమునకు తెచ్చుటలో నితడు చాల బాధ్యతవహించెను. కాని కాంగ్రెసులో కలిగిన క్రొత్త మార్పులు – అసహాయోద్యమము – ప్రజాసామాన్యము పాల్గొనుటకు వీలగునట్లు చేయబడిన నూతన మార్పులు యతని కెంతమాత్రము నిష్టములేదు. ఆతనికి రాజకీయముగా కొంత భేదాభిప్రాయమున్నను, కాంగ్రెసును వీడుట కిదియే ముఖ్య కారణము కాదు. రాజకీయముగా నతనికంటె చాల వెనుకనున్నవారెందరో యిప్పుడును కాంగ్రెసులో నున్నారు. స్వభావముచే నతడు క్రొత్తగా కాంగ్రెసుతో నెంతమాత్రము సరిపెట్టుకొన జాలడయ్యెను. ఖద్దరు కట్టుకొని హిందుస్థానీభాషలో

నుపన్యసించమని కోరు మూకతో నుండుట యతనికి కంపరముగా నుండును. బయటనుండు ప్రజల యుత్సాహ మతనికి ప్రజారోగము వలె కాన్పించును. అతనికిని భారతప్రజలకును (హస్తిమశకాంతరము గలదు.) సవిలేరో, బాండుస్త్రీలకును, మట్టిగుడిసెలతో కూడిన భారతగ్రామమునకు గలంతయంతరువు గలదు. అతడొకసారి మెట్రిక్యులేషనుపరీక్షలో నుత్తీర్ణులైనవారినే కాంగ్రెసులో చేర్చుకొనవలెనని యిష్టాగోష్ఠిలో సూచించెను. దీనినతడు బుద్ధిపూర్వకముగ సూచించెనో లేదో నేనెరుగను. కాని యతనిభావముల కది తగియే యుండెను. కనుక కాంగ్రెసునుండి జారిపోయి భారతరాజకీయములలో నేకాకిగనుండెను. తరువాత నైక్యతను చేకూర్చిన యీ పాత రాయబారి అభివృద్ధిని భంగముచేయు ముస్లిం కులతత్త్వవాదులతో చేరెను.

మితవాదులు లేక లిబరలుపక్షమువారు కాంగ్రెసుతో నెట్టి సంబంధము లేకయుండిరి. వారు దానిని వీడుటయేగాక ప్రభుత్వముతో కలిసిపోయి మంత్రులుగ, పెద్దపెద్దయుద్యోగులుగనుండి కాంగ్రెసుతోను, అసహాయోద్యమముతోను పోరాటములో ప్రభుత్వమునకు సాయపడిరి. కొంచెమించుమించు వారికి కావలసినవి చేకూరినవి. కనుక వారికి నాందోళన చేయనవసరములేదు. ఒకవంక దేశము నుద్రేకముతో నుడికిపోవుచు నంతకంతకు విప్లవయుతమగుచుండ వారు బహిరంగముగ విప్లవవ్యతిరేకులై ప్రభుత్వములో నొకభాగమయిరి. వారు ప్రజలనుండి పూర్తిగావిడిపోయి ప్రతివిషయమును ప్రభుత్వదృష్టితో చూడనారంభించిరి. నిజమునకు వారొకపక్షముగాక కొద్దిపెద్ద పట్టణములలో నచ్చటచ్చట చెల్లాచెదరుగానుండు కొద్దిమందివ్యక్తులు. శ్రీనివాసశాస్త్రిగారు సామ్రాజ్యరాయబారియై బ్రిటిషుప్రభుత్వము తరఫున ననేక బ్రిటిషుడొమినియనులను, అమెరికానుకూడా సందర్శించి బ్రిటిషు ప్రభుత్వముతో పోరుసల్పుచున్నందులకు కాంగ్రెసు తన దేశప్రజలను తనివిదీర విమర్శించుచుండెను.

అయినను అంతమాత్రముచే లిబరులుపక్షమువారికిసుఖములేదు. తన ప్రజలనుండి విడిపోవుట తన ప్రజలచేశత్రువుగా పరిగణింపబడుట సంతోషమైన విషయము కాజాలదు. గాంధీజీ మందలింపులవలన నసహాయోద్యమము తద్వ్యతిరేకులయెడ నెంతశాంతముగ, సాధువుగ, నున్నను ప్రజోద్రేకము వ్యతిరేకులయెడల దయాదాక్షిణ్యాము లుంచనేరదు. ఆవాతావరణమే వ్యతిరేకుల నణచివేసి దానిని సమర్థించువారి కుత్సాహశక్తులను, నూతనోత్తేజమును ఒసంగును. విప్లవోద్యమములకు ప్రజోద్రేకములకు నెప్పుడును యిట్టిద్వివిధశక్తులుండును. అవి ప్రజాపక్షముననున్న వ్యక్తులను ప్రోత్సహించి, వారిశక్తులను బహిర్గత మొనరించి వ్యతిరేకుల శక్తిసామర్థ్యముల నణచివేయును.

ఈ కారణముచేతనే కొందరు అసహాయోద్యమములో సహనములేదనియు; స్వతంత్రాభిప్రాయములకు, కార్యములకు, అది తావీయక నిర్జీవమైన సమానతను తెచ్చిపెట్టుననియు గోలచేసిరి. ఇందులో సత్యమున్నది. కాని ఆ సత్యమెట్టిదనిన అసహాయోద్యమము ప్రజలయుద్యమము. అది కోట్లకొలది భారతీయులలో నద్భుత శక్తివిశ్వాశములను పురిగొల్పిన యద్వితీయవ్యక్తిచే నడుపబడెను. కాని దానివలన ప్రజలలో గలిగిన మార్పులో నెక్కుడు సత్యముగలదు. వారు ముక్తులైనట్లు, గొప్పభారము నొక్కసారిగా త్రోసివేసినట్లు, క్రొత్త స్వేచ్ఛాభావముల ననుభవింపసాగిరి. వారిని నులిమివేసిన భయ మొక్కసారిగా పలాయనమయ్యెను. వారు తలయెత్తి నిర్భయముగా నడువసాగిరి. మూల మూలలనున్న బజారులలోను, సంతలలోను ప్రజలు కాంగ్రెసునుగురించి, స్వరాజ్యమునుగురించి, పంజాబుహత్యలనుగురించి, ఖిలాఫతునుగురించి చర్చించుకొనుచుండిరి. కొన్ని గ్రామసీమలలో 'ఖిలాఫతు' కు క్రొత్తయర్థము కల్పింపబడెను. 'ఖిలాఫ్' అను ఉర్దూశబ్దమునకు 'వ్యతిరేక' మని యర్థము. వారీ యర్థము తీసికొని ప్రభుత్వమునకు వ్యతిరేకము అని దానికర్థము జేసికొనిరి. వారు తమ ప్రత్యేక ఆర్థికబాధల నన్నింటిని ముఖ్యముగా

చర్చించుకొనుచునే యుండిరి. అనంతమైన సభలు, ఉపన్యాసములు, కాన్ఫరెన్సులు వారి రాజకీయ పరిజ్ఞానము నధికము జేయుచుండెను.

మేము 1921 లో నొక యద్భుతావేశములో తేలియుండెడి వారము. ఉద్రేకము, పొంగిపొంగివచ్చు యుత్సాహము, ఒకవిధమైన హుషారు మాలో మూర్తీభవించెను. ధర్మయుద్ధములో నొనగూడు యానందము మమ్మావరించెను. సందేహము, జంకుగొంకులు మమ్ము బాధించలేదు. మా మార్గము మా ముందర కంటికికట్టినట్లు కాన్పించుచు మేము ముందుకు పోవుచుంటిమి. ప్రభుత్వముతో సంఘర్షణ తప్పదని తెలియుటచే మమ్ము తీసుకొనిపోవులోపల నెంతపనియైనను చేయవలెనని మే మదివరకెన్నడు చేయనట్లు చాలకష్టపడి పనిచేసితిమి.

మేము స్వేచ్ఛ యబ్బినట్లే భావించి స్వేచ్ఛాగర్వము ననుభవించెడివారము. సణుగుట గొణుగుట మాయమయ్యెను. అధికారులతో సంఘర్షణ తప్పించుకొనుట కపసవ్య న్యాయపదజాలము నాశ్రయించుటే మానివేసితిమి. మేము భావించినదానిని చచ్చులేకుండ యిండ్ల కప్పులనుండి కూడ చాటితిమి. ఫలితములకు మే మేమి లెక్కచేసితిమి ? జయిలా ? మేము దానికొరకే చూచుచుంటిమి. అది మా యుద్యమమునకు మరింత దోహదమునిచ్చును. పాపము మా చుట్టును తిరుగుచు, మే మెచ్చటికి పోయిన నచ్చటికి దేవుడాయని వచ్చుచుండు నసంఖ్యాకమగు గూఢచారిగణమును చూచినపుడు మాకు చాల విచారము వేసెడిది. మా మార్గము లెప్పుడు బహిరంగముగనే యుండెను. మా కట్టెదుట భారతదేశమునంతను అద్భుతముగా మార్చివేయుచున్న రాజకీయప్రచారము జరుపుచున్నారమనియు, భారత స్వాతంత్ర్యము నతిసమీపమునకు తెచ్చితిమనియు సంతోషమే కాక, మా పద్ధతులలోను మా యాశయములలోనుకూడ మేము శత్రువుకంటె నైతికముగా ననేకరెట్లధికులమను భావముతో నుప్పొంగెడివారము. మా నాయకుని గురించియు నతడు కనిపెట్టిన యపూర్వ యుద్యమమును గురించియు గర్వించెడివారము. తఱచు మేము మా

యాత్మ పవిత్రతనుగురించి మురిసిపోవుచుండెడివారము. తీవ్రయుద్ధ రంగమధ్యమున మే మాంతరంగిక ప్రశాంతి ననుభవించెడివారము.

మా నీతి హెచ్చినకొలది ప్రభుత్వనీతి తగ్గుచుండెను. ఏమి జరుగుచున్నదియు వారికర్థము కాదయ్యెను. భారతదేశములో తమకు తెలిసిన పాత ప్రపంచమంతయు ముక్కలై పోవుచున్నట్లు వారికి తోచెను. ప్రతిచోట క్రొత్త సంగ్రామోత్సాహము, ఆత్మవిశ్వాసము, నిర్భయము ప్రస్ఫుటమగుచుండెను. భారతదేశములో బ్రిటిషుపాలనము నకు గొప్ప అండయైన – ఆధిక్యత – మూచుచుండగా నశించుచుండెను. అల్పనిరోధములు ఉద్యమమునే బలపర్చుచుండెను. పెద్దనాయకులపై చర్యతీసికొనుటకు ప్రభుత్వము చాలకాలము సందేహించెను. దానివలన నెట్టిఫలితము సిద్ధించునో వారికి తెలియకుండెను. భారత సైన్యమును విశ్వసింపదగునా? పోలీసులు ఆజ్ఞలను శిరసావహింతురా? 1921 డిసెంబరులో రీడింగుప్రభువు వైస్రాయి, చెప్పినట్లుగా వారు "విభ్రాంతాత్ములైరి, మతిహీనులైరి."

1921 వేసవిలో సంయుక్తపరగణాల ప్రభుత్వమువారు తమ జిల్లా యధికారుల కొక చిత్రమైన రహస్యయుత్తరువు పంపిరి. ఈ యుత్తరువు తరువాత నొక వార్తాపత్రికలో ప్రకటింపబడెను. 'శత్రువే' అనగా కాంగ్రెసు, ఎప్పుడు ముందు 'కాలుదువ్వు' చున్నదనియు, నిది చాల విషాదకరమైన విషయమనియు నీ యుత్తరువు సవిచారముగా వెలిబుచ్చెను. ఈ పరిస్థితిని మార్చి తామే ముందు కాలుదువ్వుట కనేకపద్ధతులు సూచింపబడెను. వాటిలో 'అమానుసభ' లనెడి హాస్యాస్పదములైన సభలను స్థాపించుట యొకటి. అసహాయోద్యమము నీ యమోఘవిధమున ఢీకొనవలెనని లిబరలుపక్ష మంత్రివర్గమువారు సూచించుటచే దీని నవలంబించిరని విశ్వసింపబడెను.

చాలమంది బ్రిటిషు యధికారుల నాడులు స్తభింప నారంభించెను. వారి యారాట మధికమయ్యెను. అంతకంత కభివృద్ధిచెందుచున్న వ్యతిరేకభావము, ప్రభుత్వాధికారత్వము భారతోద్యోగులను నడివర్షాకాలపు మేఘములవలె కప్పివేయుచుండెను. కాని పద్ధతు

లన్నియు సాత్త్వికములగుటచే బలవంతముగా నణచివేయుట కెట్టి మిష యవకాశము యదను దొరకదయ్యెను! సామాన్య యాంగ్లేయు డెవ్వడు దౌర్జన్యరాహిత్యసంధతను నమ్మజాలకుండెను. ఇది రహస్యముగా జరుగుచున్న దౌర్జన్య పన్నాగములను కప్పిపుచ్చు తంతు, మోసము అనియు, నిది యెప్పుడో యొకనా డమాంతముగా దౌర్జన్యముతో బ్రేలు ననియు నతడు భావించెను. ప్రాచ్యము చిత్రమైనదని యచ్చటి బజారులలోను, సందుగొందులలోను నిరంతరము రహస్యకుట్రలను పన్నుచుందురని చిన్ననాటనుండియు కలుపబడిన విశ్వాసములతో నుండు ఆంగ్లేయు డీ రహస్యాయుతము లనుకొనబడిన దేశవిషయములనుగురించి సరళముగా భావింపజాలడు. ఏ రహస్యములు లేని నిరాడంబరుడైన యా ప్రాచ్యుని గ్రహించుట కత డెట్టి ప్రయత్నము చేయడు. వందలకొలది మైళ్ళదూరము నుండి గూఢచారులు, రహస్య సంఘములు తెచ్చు గాథలనుండి ప్రాచ్యునిగురించి భావముల నేర్పరచుకొని యత డొక యూహాప్రపంచము నిర్మించుకొనును. 1919 ఏప్రిల్ నెలలో పంజాబులో నిట్లే జరిగెను. ప్రభుత్వమువారిని, యింగ్లీషుప్రజలను హాఠాద్భయమావహించెను. వారికి ప్రతిచోట నుపద్రవము, ప్రజలందరు నొక్కసారి లేచుట, భయంకర హత్యలతో గూడిన రెండవమ్యూటినీ కాన్పించెను. ఎట్లైనను ఆత్మరక్షణ మొనర్చుకొనవలెననెడి యంధప్రయత్నమే జలియనువాలా భీభత్సమునకు పొట్టలమీద ప్రాకించిన యమృతసరకాండకు కారణమయ్యెను.

1921 యుద్రేక పూరితమైన సంవత్సరము; ఉద్యోగస్థుల నుడికించుటకు, రెచ్చగొట్టుటకు, నిరుత్సాహపరచుటకు తగిన దెంతయో యుండెడిది. ప్రత్యక్షముగా జరుగుచుండినవిషయములే, కన్నెట్టగానుండ నికనూహింపబడు విషయములనుగురించి వేరుగ చెప్పనక్కరలేదు. ఈ పిచ్చియూహాలకుచెందిన యుదాహారణ మొకటి నా కింకను జ్ఞాపకమున్నది.మాసోదరి, స్వరూపవివాహముహూర్తము 1921 మే10వ తేదీన అలహాబాదులో జరుపుటకు పెద్దలచే నిశ్చయింపబడెను. అనేకమంది

ప్రధాన కాంగ్రెసు నాయకులు, గాంధీజీ, ఆలీసోదరులు మొదలగు వారు దీని కాహ్వానింపబడిరి. ఇంతమందికి ననుకూలముగ నుండు టకై యాసమయమందే అలహాబాదులో కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గ సమావేశ మేర్పాటు చేయబడెను. స్థానిక కాంగ్రెసు సంఘమువారు బయటనుండి వచ్చు మహానాయకుల సందర్శన లాభము పొందవలెనని, జిల్లా కాన్ఫరెన్సు నేర్పాటుచేసి, చుట్టు ప్రక్కల గ్రామములనుండి వేలకొలది రైతులు వత్తురని బ్రహ్మాండమైన ప్రయత్నములు చేసిరి.

ఈ రాజకీయ సభలవలన అలహాబాదు పట్టణమంతయు మహోద్రేకముతోను కోలాహలముతోను నిండియుండెను. కొంతమందికిది కలవరమునకు కారణమయ్యెను. ఒకనాడు నా బారిష్టరు స్నేహితుడొకడు చాలమంది ఇంగ్లీషువారు దీనివలన భయభ్రాంతులయిరనియు పట్టణములో గొప్పతిరుగుబాటు జరుగునని భావించిరనియు చెప్పెను. వారు తమ భారతదేశ పోకడలను విశ్వసింపక తమ జేబులలో నెప్పుడు రివాల్వరులను తీసికొని వెళ్ళెడివారు. అవసరమైనచో ఇంగ్లీషు ప్రజలను దాచుటకు నలహాబాదుకోట తయారుగా నుంచబడెనని యిష్టాగోష్ఠిగా చెప్పుకొనుచుండెడివారు. సుఖముగా నిద్రించుచు నతిశాంతముగానున్న అలహాబాదు పట్టణమును కేవల శాంతిదూతయే సందర్శింప వచ్చు సమయమున తిరుగుబాటు జరుగునని యూహింపగలుగుట నా కాశ్చర్యము కలిగించెను. అది నా కర్థముకాలేదు. అమ్మో! ఉపద్రవమే! (నా చెల్లెలి వివాహదినము) 1857లో మీరటులో జరిగిన విప్లవోద్యమ వార్షికదినము. దానినే జరుపబోవుచున్నారు, అని చెప్పబడుచుండెడిది. 1921 లో ఖిలాఫతు యుద్యమమునకు చాల ప్రాముఖ్యత నిచ్చుటచే చాలమంది మౌల్వీలు, మహమ్మదీయ మతనాయకులు రాజకీయపోరాటములో ప్రధానపాత్ర ధరించిరి. వారు ఉద్యమమునకు మత స్వభావము కల్పించుటచే చాలమంది మహమ్మదీయుల నది యాకర్షించెను. మతస్వభావమెంతమాత్రములేని పాశ్చాత్య సంపర్కముగల మహమ్మదీయులు

చాలమంది గెడ్డములను పెంచుట మొదలగు క్రియలచే సనాతన సూత్రములను పాటించెడివారు. పాశ్చాత్యసంపర్క మభివృద్ధియైన కొలది తగ్గిపోవుచున్న మౌల్వీలపలుకుబడి, గౌరవము మరల హెచ్చ నారంభించి ముస్లింజాతిపై యధికారము చేయనారంభించెను. ఆలీ సోదరులు (సహజముగా మతస్వభావముగలవారు) యీ విధానమును బలపర్చిరి. గాంధీజీకి మౌల్వీలనినను, మౌలానాలనినను అఖండగౌరవము. అతడుకూడ దీనికి తోడ్పడెను.

ఉద్యమముయొక్క మత, ఆధ్యాత్మిక ప్రాశస్త్యమునుగురించి గాంధీజీ యెప్పుడు వక్కాణించుచునే యుండెను. అతనిమత మధికార పూరితముకాదు. కాని జీవితము నది నిశ్చితమైన మతదృష్టి తోనే చూచెను. ఉద్యమమంతయు నీ దృష్టితో నిండియుండి ప్రజలకు సంబంధించినంతవరకు యొక మతప్రబోధముగా పరిణమించెను. కాంగ్రెసు సేవకులు చాలమంది సహజముగా తమ నాయకుని యనుకరించి యత్నించి యతనిభాషనే వల్లింపనారంభించిరి. కాని కార్యనిర్వాహక వర్గములోని గాంధీజీ ప్రధానసహచరులైన మోతిలాల్, దేశబంధుదాసు, లాలాలజపతిరాయి మొదలగువారు (మామూలుభాషలో) మతప్రసక్తి లేనివారు. వారు రాజకీయ సమస్యలను రాజకీయదృష్టితోనే తర్కించెడి వారు. వారు బహిరంగోపన్యాసములలో మతముసంగతి యెత్తెడివారు కారు. కాని వారుచెప్పెడి విషయములకంటె వారివ్యక్తిగత సాదృశ్యమే –వారు సమస్తైశ్వర్యములను భోగభాగ్యములను, భవ్యహర్మ్యములను విడిచిపుచ్చి, సన్యాస జీవితము నాలింగనమొనర్చలేదా? – ప్రజల నెక్కుడుగ నాకర్షించెను. ఇదియే మతచిహ్నముగా తీసికొనబడి మత ప్రబోధ ప్రచారమునకు తోడ్పడెను.

మన రాజకీయములలో నీ మతవిజృంభణమేమి? యని నే నొక్కొక్కప్పుడు బాధపడెడివాడను. నా కది యెంతమాత్రము నిష్టము లేదు. మౌల్వీలు, మౌలానాలు, స్వాములవార్లు మొదలగువారు సభ లలో నుపన్యసించెడి విషయములు నాకు చాలవరకు దౌర్భాగ్యము లుగా దోచెను. వారు చెప్పెడి చరిత్ర, సాంఘికశాస్త్రము, ఆర్థిక

శాస్త్రములన్నియు నాకు చాలతప్పులుగా కనిపించెను. ప్రతిదానిని మతముతో ముడిపెట్టుచుండుటచే నిర్దుష్టమైన యాలోచనల కెంత మాత్రము వీలులేకుండెను. గాంధీజీ పదప్రయోగములుకూడ 'రామ రాజ్యము' 'కృతయుగము తిరిగి రానున్నది' – యనునట్టివి యొక్కొక్కప్పుడు నాకు చాల కంటకముగ నుండెడివి. కాని దీనితో జోక్యము కల్పించుకొనగలశక్తి నాకు లేకపోయెను. ప్రజల కాపదములు బాగుగ తెలియుననియు, నర్థమగుననియు, కనుక గాంధీజీ వాని నుపయోగించుకొనుచున్నాడనియు నేను సంతృప్తి పడుచుండెడివాడను. ప్రజల హృదంతరాళములను చూఱగొనుటలో నతని కద్భుత శక్తి కలదు.

ఇంతకు నేనీ విషయములనుగురించి యంతగా బాధపడలేదు. ఉద్యమాభివృద్ధిలోను, యెడతెగని పనిలోను మునిగియుండుటచే నా కిట్టి స్వల్పములనుగూర్చి యోచించుటకు తీరిక లేకయుండెను. ఒక మహోద్యమములో నన్నిరకముల మనుష్యులు నుందురు. ప్రధాన ప్రవాహము సక్రమముగా నున్నంతవరకు, పిల్లకెరటములను, చిన్న గుంటలను మనము లెక్కచేయనక్కరలేదు. ఇక గాంధీజీ యసామాన్యుడు. అతని నర్థముచేసుకొనుట చాలకష్టము. ఒక్కొక్కప్పుడతని భాష సామాన్య ఆధునికున కర్థముకాదు. అతడు చాల గొప్ప వాడనియు, ననన్యుడనియు, మహోత్తమనాయకుడనియు మే మర్థము చేసికొని యతనియందు సంపూర్ణ విశ్వాసముంచి సమస్తము నతనికే బాహాటంగా విడిచివేసితిమి. తఱచు మేమతని వెఱ్ఱులనుగురించి, చిత్రమైనభావములనుగురించి, మాలో మేము చర్చించుకొనుచున్నాము. స్వరాజ్యము వచ్చినతరువాత నీవెఱ్ఱులను (కొంత వేళాకోళముతో) ప్రోత్సహింపకూడ దనుకొనెడివారము.

మాలో చాలమంది రాజకీయములలోను ఇతర విషయముల లోను నతని పలుకుబడి కెక్కువగా లోబడియుండుటచే మతసాంప్రదాయములో కూడ మేమతనినుండి పూర్తిగా తప్పించుకొనజాలక పోతిమి. ప్రత్యక్షముగా కాకపోయినను పరోక్షముగానైనను వచ్చు

దాడులనుండి మమ్ము మేము రక్షించుకొనజాలకపోతిమి. మతము యొక్క బాహ్యాడంబరములు నన్నాకర్షింపలేదు. మతనామధారులు ప్రజలను కొల్లగొనుటను నేను సహింపజాలనైతిని. అయినను నేను దానికి తలయొగ్గితిని. నా బాల్యము లగాయతు నే నెన్నడు నెరుగని మతాభిమానము నాకు 1921 లో కలిగెను. అప్పటికి నేను దాని నెక్కువగా దరిచేరనీయలేదు.

మన యుద్యమముయొక్కయు, సత్యాగ్రహముయొక్కయు, నైతిక, ధార్మికబలమునే నే నెక్కువగా మెచ్చుకొనెడివాడను. దౌర్జన్యరాహిత్యసూత్రము శాశ్వతమని, శిలాశాసనమని నేను భావింపలేదు. నేను దానిని పరమపదముగా శిరసావహింపలేదు. కాని యది నన్నంతకంత కెక్కుడుగ నాకర్షించెను. భారతదేశ పరిస్థితులను బట్టియు, మన సాంప్రదాయములను, చరిత్రనుబట్టియు నదియే మన మవలంబింపదగిన సరియైన నీతి యను విశ్వాసము నాలో నానాటికి ప్రబలెను. రాజకీయముల నాధ్యాత్మి మొనర్చుట నా కొక చక్కని భావముగా తోచెను. యోగ్యమైన పరమావధికి యోగ్యమైన సాధనములే యుండవలెను. అది కేవల నైతికసిద్ధాంతమే కాక యదార్థ రాజకీయముగాగూడ తోచెను. అయోగ్యములైన సాధనములు తఱచుగా పరమావధికి దీసికొనిపోవుటయేగాక క్రొత్త సమస్యలను, క్రొత్త కష్టములను తెచ్చిపెట్టును. అట్టి సాధనములను బూనుట పంకి లావిష్టు లగుట, వ్యక్తి, జాతీయాత్మ గౌరవములకు తగదనియు, వినాశకరమనియు తోచెను. అపవిత్రులము కాకుండ దానినుండి మన మెట్లు తప్పించుకొనగలము? ప్రాకుటవలనను వంగివంగి నడచుటవలనను మన మెట్లు గౌరవముగను, వేగముగను ముందుకు పోగలము?

అప్పటి నా భావము లట్లుండెను. అసహాయోద్యమము నా కోరి కను - జాతీయస్వాతంత్ర్యమును, నోరులేని యమాయిక ప్రజాదోపిడి నంతముచేయుటయు, నానైతికభావములను సంతృప్తిపరచి నా కాత్మ స్వేచ్ఛ నొసంగు సాధనమును - ఈడేర్చెను. ఈ యాత్మతృప్తి

ముందర నపజయమునైనను నేను లెక్కచేయకపోతిని. అట్టి అప జయము కేవలము తాత్కాలికము. ప్రతిసాయంకాలము గాంధీజీ ఆశ్రమప్రార్థనలలో భగవద్గీతాశ్లోకములు చదువబడుచుండెను. నా కందులోని వేదాంత మర్థముకాలేదు. కాని నే నా శ్లోకములను ప్రీతితో చదివెడివాడను. అవి మానవు డెట్లుండవలెనో సూచించెను:—కార్యములయందు తొట్రుపాటులేక శాంతమును, స్థిరత్వమును పొందుము. కర్మయందే నీ కధికారము కలదు. ఫలముకొరకు వృధా జిజ్ఞాసపడకుము. అంతశ్శాంతి, సామ్యత లేనివాడనగుటచే (బహుశః) నీ యాశయము నాకు మరింత యాదరణీయమయ్యెను.

11

1921 మొదటి నిర్బంధము

1921 అద్వితీయ సంవత్సరము. జాతీయత, రాజకీయములు, మతము, కుమతము, విమతము – ఇవన్నియు కలగాపులగమయ్యెను. ఈ యన్నింటివెనుక వ్యావసాయికాందోళనము, పెద్దపెద్ద పట్టణము లలో పారిశ్రామిక కూలీ యుద్యమములు నుండెను. జాతీయత బ్రహ్మాండముగా దేశము నావరించిన యొక మహాశయము పరస్పర విరుద్ధములైన యీ యసంతృప్తిని సమన్వయపరచుటకు ప్రయత్నించి చాలవరకు విజయమునొందెను. కాని యీ జాతీయత మిశ్రమముగ నుండెను. దీనివెనుక, హిందూజాతీయత, భారతసరిహద్దులను దాటి చూచు ముస్లింజాతీయత, కాలతత్వమున కెక్కువగా సరిపడిన భారత జాతీయత స్పష్టముగా కాన్పించుచుండెను. అప్పటిమట్టు కవి యన్నియు కలిసి పనిచేసెను. "హిందూముసల్మాను కి జై" యను కేకలే ప్రతిచోట ప్రతిధ్వనించెను. గాంధీజీ యిట్టి నానాకులముల వారిని, నానాగోత్రములవారిని సమన్వయపరచి, యేకత్రాటిని నడిపింప గలుగుటే మహాద్భుతవిషయము. అతడు "ప్రజల యవ్యక్తకోరికలను వ్యక్తీకరించుట కేర్పడిన మూర్తి"

ఈకోరికలు, రాగములుగలిగి తామెదుర్చుచున్న ప్రభుత్వముపై నిసుమంతయైనను ద్వేషములేకపోవుటయే మరింతయద్భుతవిషయము. జాతీయత ముఖ్యముగా వ్యతిరేకభావభూయిష్టము: అది యితరజాతు లపై గల క్రోధద్వేషములమీద పెరిగి పెద్దదియగును. ముఖ్యముగా బానిసదేశములో పరప్రభుత్వము దీనికి గురియగును. 1921 లో భారత దేశమున, బ్రిటిషువారిపయి నిట్టి క్రోధద్వేషములు గలవు. కాని యిదే స్థితిలోనున్న యితరదేశములతో పోల్చిచూచినచో నిది యత్య ల్పము. గాంధీజీ దౌర్జన్యరాహిత్యము కెక్కువ ప్రాధాన్యతనిచ్చుటయే దీనికి కారణమని నిస్సందేహంగా చెప్పవచ్చును. ఉద్యమ మారంభ

మగుటతోడనే సేతుసీతనగ మధ్యదేశమంతయు నొక్కసారిగా, యనుభవించిన యధికార, స్వేచ్ఛాభావములు, త్వరలోనే జయము చేకూరనున్నదను భావముకూడ దీనికి కొంతకారణము. ఇంత జయప్రదముగా పనిజరుగుచున్నపుడు జయ మరచేతిలోనున్నపుడు క్రోధమేల? ద్వేష మెందులకు? మే ముదారతను చూపగలమని, చూపవచ్చునని భావించితిని.

జాతీయోద్యమము నెదిర్చి వ్యతిరేకముగ పనిచేసిన కొద్దిమంది భారతీయులపట్ల మాత్రము మే మట్టియుదారత చూపియుండలేదు. అట్లని మాకు వారియెడల ద్వేష క్రోధములు లేవు. వారి కెట్టి పలుకుబడియు లేకపోవుటచే మేము వారిని లెక్కసేయ నవసరమే లేదు. కాని వారి దుర్బలత్వమునకు సమయానుకూల తత్వమునకు, జాతీయ గౌరవభంగ ప్రవర్తనకు వారియెడల మా కాంతర్యమున ద్వేష ముండెడిది.

ఈ విధముగా మేము, మాకొక నిర్ణయం లేకపోయినను, జోరుగా పోవుచుంటిమి. కాని మా పరమావధిని గురించి మాకు నిర్దుష్టమైన యాలోచన యెంతమాత్రము లేకుండెను. మన యుద్యమ తత్వభాగమును, నిశ్చల లక్ష్యమును మే మెంత నిర్లక్ష్యము చేసితిమో తలచుకొనిన యిప్పు డాశ్చర్యమగుచున్నది. మే మందరము స్వారాజ్యమును గురించి గంభీరముగ నుపన్యసించెడివారము. కాని దాని కెవరికి తోచిన యర్థము వారు చెప్పెడివారము. యువకులకు చాలమందికది రాజకీయ స్వాతంత్ర్యమని లేక దానిని పోలినదని ప్రజాస్వామికమని యర్థమయ్యెను. మేము మా యుపన్యాసములలో నట్లే చెప్పెడివారము. రైతులను కూలీలను నలిపివేయుచున్న యనేక బాధలు విధాయకముగా తగ్గునని కూడా మాలో చాలమంది భావించితిమి. కాని నాయకులకు చాలమందికి స్వారాజ్యము స్వాతంత్ర్యముకంటె చాల తక్కువయను భావములున్నట్లు స్పష్టమయ్యెను. గాంధీజీ యీ విషయమై నిర్ధారణ లేక యుండుటయేగాక దీనినిగురించి స్పష్టమైన యాలోచనను ప్రోత్సహింపకుండెను. కాని యత డెప్పుడు క్రింది

తరగతివారినిగురించి వివరముగ మాట్లాడుచుండుటచే మేము శాంత పడెడివారము. కాని యతడు పైవారికి గూడ నభయహస్తము నిచ్చు చుండెడివాడు. గాంధీజీ యెప్పుడు నే సమస్యకైనను హేతువాద ప్రాశ స్త్యమునుగాక గుణ, శీల, పవిత్రతల ప్రాశస్త్యమునే యిచ్చుచుండెడి వాడు. అతడు భారతప్రజలకు నిర్భయతత్వమును, గుణ, శీల, శక్తులను ప్రసాదించుటలో నద్భుత విజయమును గాంచెను.

ప్రజల యీ యసమాన ధైర్యస్థైర్యములే మా కెక్కడలేని విశ్వాసము కలుగ జేసెను. ఛిన్నాభిన్నమై చెల్లాచెదరై భ్రష్టులై వెనుకపడియున్న ప్రజలొక్కసారి నడుములుబిగించి తలయెత్తి దేశ మంతటను సమిష్టికార్యములో సుశిక్షిత పాత్రధరించిరి. ఈ కార్య మొక్కటియే ప్రజల కప్రతిహతమైన శక్తినిచ్చునని మేము భావించి తిమి. ఈ కార్యము వెనుక నుండవలసిన భావమును మేము నిర్లక్ష్యము చేసితిమి. ఇదమిద్ధమను లక్ష్యము, ప్రయోజనము లేనిదే ప్రజల యుత్సాహశక్తులు చాలవరకు నిరర్థకమగునను సంగతియే మేముమరచి పోతిమి. కొంతవరకు ఉద్యమములోనున్న మతప్రబోధము మమ్ము ముందుకు నడుపుచుండెను. రాజకీయ ఆర్థిక సమస్యలను బాగుచేయు టకు లేక దుర్మార్గమును పోగొట్టుటకు దౌర్జన్యరాహిత్యమను నూతనసందేశమును మనప్రజలు ప్రపంచమునకు ప్రసాదింప నుద్దే శింపబడిరను భావముండెడిది. అన్నిజాతులకు నెవరికివారు తామే నెత్తిమీద దేవతలమని యుండెడి పిచ్చిభ్రమయే మ మ్మావ హించెను. యుద్ధమునకు, దౌర్జన్యయుతమగు నన్ని పోరాటములకు దౌర్జన్యరాహిత్యము నైతిక సామ్యమయ్యెను. అది కేవల మొక నైతిక ప్రతీకారమేకాక శక్తివంతమైయుండెను. యంత్రములను గురించి, ఆధునిక నాగరికతనుగురించి గాంధీజీకున్న పాతభావము లను మే మంగీకరింపలేదు. అవి యాధునిక పరిస్థితులకు వర్తింప వనియు, కేవల గగనకుసుమములవంటివనియు నతడును తలంచెడివా డని మే మనుకొంటిమి. భారత పరిస్థితులకు తగినట్లు కొన్ని మార్పులను చేసికొనుట కవకాశమున్నను ఆధునిక నాగరికత సాధిం

చిన వానిని మాలో చాలమంది తిరస్కరింప సంసిద్ధులము కాము. పెద్ద యంత్రములు హుటాహుటి ప్రయాణములు వ్యక్తిగతముగ నన్నెల్లపుడు నాకర్షించెను. అయినను నిస్సందేహముగ గాంధీజీ తత్వము చాలమందికి పట్టుటచే వారు యంత్రములను తత్ఫలితములను విమర్శించుచుండెడివారు. కనుక కొంతమంది భవిష్యత్తుకు చూచుచుండ మరికొంతమంది వెనుకకు గతమును చూచుచుండిరి. ఉభయులు, చిత్రముగా తా మొనర్చు సమిష్టి కార్యాచరణము భావ్యమే యని తలంచిరి. దీనివలన త్యాగసహన మెక్కువ సుకరమయ్యెను.

నేను పూర్తిగా నీ యుద్యమములో నైక్యమైపోతిని. అనేక వేలప్రజలు నావలెనేయుండిరి. నేను నా యితరసంబంధములను పాత స్నేహితులు, పుస్తకములు, చివరకు వార్తాపత్రికలు కట్టిపెట్టితిని. అంతవరకు నేను కొన్ని నవీన గ్రంథములను చదువుచు ప్రపంచ వ్యవహారాభివృద్ధిని గమనించుచుంటిని. దీనికి నాకిప్పుడు తీరిక లేకయుండెను. కుటుంబబంధనములు నన్నెంతగా బాధించినను, నేను నా కుటుంబమును, భార్యను, కుమార్తెను కొంచె మించుమించు మరచిపోతిని. నే నారోజులలో వారి కెంతభారముగ, కష్టముగ నుండెడివాడనో, నా భార్య నా యెడల నెంతటి యద్భుతమైన యోర్పు, సహనము చూపెనో చాలకాలము గతించిన తరువాతనే నేను గ్రహింపగలిగితిని. నేను ఆఫీసులలోను, కమిటీ సభలలోను ప్రజాసమూహములలోను జీవించుచుండెడివాడను. “పొండు! గ్రామములకుపొండు!” అను యుద్ధనినాదము వినిపించుటతోడనే మే మనేక మైళ్ళు పొలములను, చెలకలను, అడ్డము త్రొక్కుకొని పోవుచు, మూలమూలలనున్న గ్రామములను సందర్శించుచు రైతుసభలలో నుపన్యసించెడివారము. ప్రజోత్సాహమును ప్రజావశీకరణశక్తిని నేననుభవించితిని. పల్లెజల చిత్తవృత్తిని, పట్టణ ప్రజలకు, రైతుకు గలభేదమును నేనర్థము చేసికొననారంభించితిని. దుమ్ములోను, ధూళిలోను, అసుఖములోను, పెద్దపెద్ద సభలలోని త్రోపుడులలోను, త్రొక్కు-

లాటలలోను నేను హుషారుగనే యుండెడివాడను. అప్పటినుండి నే నొక్కొక్కప్పుడు క్రోధపూరితులు, వ్యతిరేకులు నగు ప్రజలను తారొక్కొనవలసివచ్చెడిది. నా వెనుకటి యనుభవము, దానివలన నాకు గలిగిన విశ్వాసము నా కిప్పుడు ప్రయోజనకారులయ్యెను. నేను తిన్నగా ప్రజలమధ్యకు పోయెడివాడను; వారిని విశ్వసించెడివాడను. అభిప్రాయభేదమున్నను వారెల్లప్పుడు నింతవరకు నాయెడల నాదరణమును మెచ్చుకోలును చూపించిరి. కాని ప్రజ లస్థిరులు. భవిష్యత్తులో నాకు విపరీతానుభవములే సంభవింపవచ్చును.

నేను ప్రజను విశ్వసించితిని; ప్రజ నన్ను విశ్వసించెను. కాని వారిమధ్య నన్ను నేను మరచిపోలేదు. నే నెప్పుడు వారికి దూరముగ నున్నట్లే భావించి నా ప్రత్యేక మానసికస్థానమునుండియే నేను వారిని సవిమర్శగా చూచెడివాడను. ఆచారములోను, కోరికలలోను, మానసికాధ్యాత్మిక దృష్టిలోను ప్రతివిషయములోను నన్ను చుట్టి యుండెడి వేలకొలది ప్రజలతో భిన్నుడనైన నేను వారి విశ్వాస ప్రేమల నెట్లు చూఱగొంటినా యని యాశ్చర్యపడెడివాడను. వారు నన్ను సరిగా నర్థము చేసికొనకపోవుటచే నిది సంభవించెనా ? నన్ను బాగుగ నెరిగిన తరువాత వారు నన్ను సహించెదరా ? అసత్యనటనలచే నేను వారి ప్రేమ నార్జించితినా ? నేను వారియెడ నిష్కపటముగ, నిర్మొగమాటముగ నుండుటకే యత్నించితిని. నే నొక్కొక్కప్పుడు కఠినముగా మాట్లాడుచు వారి మూఢవిశ్వాసములను ఆచారములను విమర్శించుచుండినను వారు నన్నెంతయో సహించుచుండెడివారు. అయినను వారు నా నిజస్వరూపముగాక నన్ను గురించి వా రూహించుకొనిన యూహాస్వరూపమునే ప్రేమించిరను భావము నన్ను వీడకుండెను. ఈ హుళక్కి స్వరూప మెంతకాలము నిలువగలదు ? దీని నేల నిలువనీయవలెను ? అది నశించి, యదార్థము వారికి గోచరించినపు డేమిజరుగును ?

నేను పలువిధముల గర్విష్టిని. కాని యీ నిరాడంబర ప్రజలలో గర్వమనునది మందున కైనను కానరాదు. వారికంటె చాల

ఘనులమని యనుకొను మధ్యతరగతులవారమైన మనవలె వారిలో విఱ్ఱవీగుటగాని, యసంస్కార ప్రవర్తనగాని లేదు. వారంత బుద్ధి మంతులుగారు; వ్యక్తిగతముఁగ నాకర్షణశక్తి గలవారును కారు. కాని బాహుళ్యముమీఁద వారు విచారమును పుట్టించుచు విషాద జ్వాల లతిసమీపములో దగుల్కొనునను భావమును కలిగించెడివారు.

పేరెన్నికగనిన సేవకులమై మేము, మహాసభలలో వేదికల మీద ప్రవర్తించువిధము విపరీతముగా నుండెను. అక్కడ కావలసినంత బుఱ్ఱతిరుగుడుండెడిది. మా వాగాడంబర యుపన్యాసములలో నసంస్కారమున కెంతమాత్రము లోపముండెడిదికాదు. మా కందరకు కొంత వరకు నీ దోషమే పట్టెను. కాని కొంతమంది ఖిలాఫతు పిల్లనాయకు లిందులో మమ్మందరను 'చిత్తుచేసిరి'. వేలకొలది గల సభలలో సహజముగ ప్రవర్తించుట చాల కష్టము. మా కెవరికి బహిరంగ సభల యనుభవములేదు. మేము నాయకులవలె కనపడవలెనని, గాఢాలోచన తత్పరులవలె, శ్రద్ధాసమన్వితులవలె యుండుటకు ప్రయత్నించెడి వారము. మేమునడచునపుడు, మాట్లాడునపుడు, నవ్వునపుడు వేలకొలది కన్ను లెదురుచూచుచున్నవని మే మెరిగియుండుటచే మేము దానికి తగినట్లు ప్రవర్తించుచుండెడివారము. తఱచు మా యుపన్యాసము లతిగంభీరముగ నుండెడివి. అవి యెంత గంభీరముగ నుండెడివో యంత విచిత్రముగ, విషయశూన్యముగ నుండెడివి. ఇతరులు మనలను చూచునట్లు మనము మనలను చూచుకొనుట చాల కష్టము. కనుక నన్ను నేను విమర్శించుకొనజాలక నితరుల ప్రవర్తన నతి జాగ్రత్తగ పరీక్షించుచుండెడివాడను. ఈ వృత్తి నాకు చాల వినోదము కలిగించుచుండెడిది. ఇంతలో నేనుకూడ నితరుల దృష్టిలో నింత హాస్యాస్పదముగనే కాన్పించవచ్చునని భీతి కలుఁగుచుండెడిది.

1921 లో కాంగ్రెసు వ్యక్తులు మాత్రమే నిర్బంధింపబడి శిక్షింపబడిరి. అప్పుడు ప్రజానిర్బంధములు లేవు. భారత సైన్యములో ద్వేషము పురికొల్పిరని ఆలీసోదరులకు దీర్ఘశిక్షలను విధించిరి. వారేపదములకొరకు శిక్షింపబడిరో ఆ పదములే నూఱులకొలది వేదికల

మీాద వేలకొలది ప్రజలచే నుచ్చరింపబడెను. నేనిచ్చిన యుపన్యాసములకు నాపై రాజద్రోహము మోపబడునని వేసవిలో వదంతులు చెలరేగెను. కాని యప్పుడట్టిచర్య యేదియు తీసికొనబడలేదు. వత్సరాంతమునకు పరిస్థితులు విషమించెను. వేల్సుయువరాజు భారతదేశము రానుండుటచే కాంగ్రెసు వానిరాకసందర్భమున జరుగు యుత్సవములను బహిష్కరించెను. నవంబరు మాసాంతమున బంగాళములో కాంగ్రెసు వాలంటీరుదళము అక్రమసంఘముగా ప్రకటింపబడెను. తోడనే యీాయస్త్రము సంయుక్త పరగణాలమీాదగూడ ప్రయోగింపబడెను. "నా మణిబంధములపై యినుపబేడీలను నా శరీరముపై యయోమయ శృంఖలాభారమును నే ననుభవించుచున్నాను. అది దాస్యబంధజనితావేదన. భారతదేశమంతయు నొకపెద్దకారాగారము. కాంగ్రెసురథమెంతమాత్ర మాగునదికాదు. నన్ను తీసికొనిపోయిననేమి? మానిననేమి? నేను మృతిచెందిననేమి? జీవించిన నేమి?" అను సందేశమును దేశబంధుదాసు బంగాళమున కొసంగెను. మా రాష్ట్రములో మేమీా సవాలును తీసికొని మావాలంటీరుదళము విరమింపబడదని ప్రకటించుటయేగాక దినపత్రికలలో వాలంటీర్ల పేర్లను ప్రకటించితిమి. మొదటిజాబితాలో మొదటిపేరుమాతండ్రిగారిది. అతడువాలంటీరు కాకపోయినను, ప్రభుత్వయాజ్ఞలను ధిక్కరించుటకే చేరి తనపేరునిచ్చెను. డిశెంబరుప్రారంభములో యువరాజు మా రాష్ట్రమునకు వచ్చుటకు కొద్దిరోజులుపూర్వము ప్రజానిర్బంధములు ప్రారంభమయ్యెను.

చివరకు పరిస్థితులు విషమించెనని మేము గుర్తించితిమి. కాంగ్రెసుకు ప్రభుత్వమునకు సంఘర్షణ ప్రారంభము కానుండెను. జయిలు యింకను క్రొత్త. జయిలుకుపోవుట యను భావమింకను నూతనము. అలహాబాదు కాంగ్రెసు కార్యాలయములో నొకనాడు నేను వెనుకపడియున్న పనినంతను పూర్తిచేసుకొనవలెనని చాలసేపటివరకు పనిచేయుచుంటిని. పోలీసులు సెర్చివారంటు తీసుకొనివచ్చిరనియు, ఆఫీసును చుట్టుముట్టిరనియు నుద్రేకపూరితుడైన యొకగుమస్తా నాతో

చెప్పెను. అదియే నాకు మొదటిసారికనుక నేనును కొంచెము ద్రే పడితిని. కాని పోలీసులరాకపోకలవలన నిసుమంతయు చలింపనివానివలె నుండవలెననుకోరిక హెచ్చుగా నుండుటచే నేనొకగుమాస్తాను పోలీస యుద్యోగితో కూడనుండమని యాజ్ఞాపించి తక్కినవారిని పోలీసులన లెక్కచేయక తమతమ పనులలోనుండ నియమించితిని; కొంచెమ సేపయిన తరువాత ఆఫీసు వెలుపల నిర్బంధింపబడిన యొక స్నేహితుడు నాయొద్ద సెలవుతీసికొనుట కొకపోలీసువానితో కూడ వచ్చెను. ఈ వింత సంభవములను నిత్యకర్మలవలె చూడవలె నను గర్వముతో నేను కటికి వానివలె నా స్నేహితుని చూచితిని. నేను వ్రాసుకొనుచున్న యుత్తరము పూర్తియగువరకు నుండవలసినదని యతనిని, పోలీసువానిని నిర్లక్ష్యముగా చూచితిని. పట్టణములో నింకను నిర్బంధములు జరుగు చున్నవను వార్త లేతెంచుటచే నేనింటికిపోయి యచ్చట నేమి జరుగు చున్నదో చూడవలెనని చివరకు నిశ్చయించుకొంటిని. పోలీసులు మా యింటి నప్పుడే వెతుకుచుండిరి. వారు తండ్రిగారిని నన్ను నిర్బంధిం చుటకు వచ్చిరని తెలిసికొంటిని.

యువరాజు బహిష్కార మత్యద్భుతముగ పనిచేసెను. అతని నెచ్చటకు గొంపోయిన నచ్చటనే హర్తాళములు, శూన్యవీధులు సిద్ధ మయ్యెను. అతడు వచ్చినపు డలహాబాదు మృతనగరమువలె శ్మశాన వాటికవలె కాన్పించెను. కలకత్తాపట్టణ మొక్కసారిగా తన కార్య కలాపముల నన్నింటిని కట్టివేసెను. అది యువరాజుయెడల కాఠిన్య తయే యగును. కాని దోష మతనిదికాదు. అతనియెడల నెట్టిద్వేషము చూపింపబడలేదు. కాని ధ్వంసము కావింపబడుచున్న తమగౌరవాధిక్య తలను నిలువబెట్టుకొనుటకు యువరాజను వ్యక్తి నుపయోగించుకొన వలెనని భారతప్రభుత్వమువారు ప్రయత్నించిరి.

నిర్బంధపరంపరలు, శిక్షలు, ముఖ్యముగా బంగాళములోను సంయుక్తపరగణాలలోను చెలరేగెను. ఈ రాష్ట్రములోని ముఖ్య కాంగ్రెసునాయకులందరు నిర్బంధింపబడిరి. మామూలు వాలంటీర్లు వేనకువేలు జయిళ్ళను నింపుచు నేల యీనినట్లు వచ్చుచుండిరి.

సంయుక్తపరగణాల రాష్ట్రికాంగ్రెసు కమిటీ సభ్యులందరు (55 మంది) కమిటీసభ జరుగుచుండగా నిర్బంధింపబడిరి. ఇంతవరకు కాంగ్రెసులో కాని రాజకీయములలోగాని పాల్గొననివారు చాలమందికూడ నీ ప్రవాహములో వచ్చిపడి నిర్బంధింపవలసినదని బలవంతపెట్టుచుండిరి. ప్రభుత్వ గుమాస్తాలెందరో సాయంకాల మాఫీసునుండి తమ యిండ్లకు తిరిగి పోవుచుండ నీ ప్రవాహములో కొట్టుకొనిపోయి తమయిండ్లకు బదులు జయిళ్ళలో తేలుచుండెడివారు. యువకులు బాలురు పోలీసులారీలలో నెక్కి కూర్చుని పొమ్మనిను, పోవ నిరాకరించుచుండిరి. ప్రతి సాయంకాలము స్వరాజ్యనినాదములు మిన్నుముట్టుచుండ, లారీ తరువాత లారీ జయిలుయావరణలోనికి వచ్చిపడుచుండ జయిలు అధికారు లేమిచేయుటకు తోచక బాధపడుచుండిరి. అప్పుడప్పుడొక పోలీసులారీ, కొంతమంది మనుష్యులను, యెట్టి పేరులు లేకుండ తీసికొనివచ్చెడిది. మరియొక చిత్రమేమన పేర్కొనబడిన సంఖ్యకంటె నెక్కువమంది లారీనుండి దిగెడివారు. ఈ విపరీతపరిస్థితులలో తామెట్లు నడచుకొనవలెనో జయిలుఅధికారులకు తెలిసెడిదికాదు. జయిలు స్మృతిలో దీని కెట్టి యాస్కారము కాన్పించదు.

క్రమముగా ప్రభుత్వమువారు వివక్షతలేని నిర్బంధములను మానివేసి పేరుకలవారినే పట్టుకొనుచుండెడివారు. ప్రజలలో కూడ క్రమముగా మొట్టమొదటి వీరావేశము తగ్గ నారంభించెను. విశ్వాసార్హులైన నాయకులందరు జయిలులోనుండుటచే నసహాయత అనిశ్చయము ప్రబలెను. కాని యీ మార్పు కేవలము బాహ్యము. రాజకీయాకాశ మింకను మేఘావృతమైయుండి విప్లవసంఘటనల నీనుచుండెను. మొత్తము ముప్పదివేలమంది నిర్బంధింపబడినట్లు 1921 డిసెంబరు 1922 జనవరిలలో అంచనావేయబడెను. కొంచెమించుమించు నాయకులందరు జయిలులోనే యున్నను ప్రధాన నాయకుడైనను గాంధీమహాత్ముడింకను బయటనుండి యక్రమకార్యముల నిరోధించుచు, సందేశములనిచ్చుచు, కర్తవ్యమును తెలుపుచు, ప్రజల నుద్బోధించుచుండెను. భారతసైన్య మేమగునో, పోలీసు

లేమిచేయుదురో యను భీతాంగముచే ప్రభుత్వమువారతని నింత వరకు ముట్టలేదు.

హఠాత్తుగా 1922 ఫిబ్రవరిలో రంగమంతయు మారిపోయెను. గాంధీజీ సాత్త్వికనిరోధమును నిలపివేసెననియు, పోరాటములోని యుద్ధసంరంభము నాపివేసెననియు జయిలులోనున్న మే మత్యాశ్చర్యముతో విని నిర్ఘాంతపోతిమి. చౌరీచౌరాదగ్గర కొంతమంది పల్లెటూరి ప్రజలు పోలీసు దౌర్జన్యము నెదిర్చి పోలీసుస్టేషనును పదిపన్నెండుమంది పోలీసులతో సహా తగులపెట్టుటచే నిట్లు చేయబడెనని వింటిమి. ప్రతిరంగములోను మనదే ముందంజయై బల మప్రతిహతముగా కాన్పించుచున్న సమయమున పోరాటము నిట్లు నిలిపివేయుట మా కెంతయో ఆగ్రహము కలిగించెను. కాని జయిలులోని మా ఆశాభంగమువలనను, ఆగ్రహమువలనను లాభ మెవరికి చేకూరనేరదు. సాత్త్వికనిరోధ మాపివేయబడెను. అసహాయోద్యమ మంతరించెను. ప్రభుత్వ మనేక నెలలనుండి పొందుచున్న భయవిహ్వాలతలు తగ్గెను. అది యూపిరి పీల్చుకొన నారంభించి మొదటిసారి మన మీద దుముకుట కవకాశము లభించెను. కొద్దివారములైనతరువాత వారు గాంధీజీని నిర్బంధించి దీర్ఘకాలశిక్ష విధించిరి.

12

దౌర్జన్యరాహిత్యము - కత్తితత్త్వము

చౌరీచౌరాయైనతరువాత హఠాత్తుగా యుద్యమము నాపివేయుట కొక్క గాంధీజీ తప్ప తక్కినవారందరు నైక్యకంఠముతో గర్హించిరి. నా తండ్రి యీ వార్త విని నిర్విణ్ణుడయ్యెను. యువకులు సహజముగ మరింత యాందోళనపడిరి. మా కొండలవంటి యాశ లన్నియు నేలగూలుటచే నీ మానసిక విపర్యయము సహజము. దీనిని నిలిపివేయుటకు చెప్పబడిన కారణములు, వాటివలన కలిగిన ఫలితములు మాకు మరింత బాధ కలిగించెను. చౌరీచౌరా విషయము చాల విచారకరమైనదే! అది ముమ్మాటికి విచారమైనదే! దౌర్జన్యరాహిత్యతత్త్వముకు కేవలము వ్యతిరేకము! కాని మారుమూల నున్న యొక గ్రామము, దారి తెన్ను లేని గ్రామములోని యుద్రేక పూరితులైన రైతుమూకయు, స్వాతంత్ర్యముకొఱకు చేయు జాతీయ పోరాటము నాపివేయవలసినదేనా? అచ్చటచ్చట క్వచితుగా జరుగు దౌర్జన్యమున కిదియే విధాయిక ఫలితమగుచో, దౌర్జన్యరాహిత్య సంగ్రామ తత్త్వములోను, యీ శాస్త్రములోను నేదోయొక లోప ముండితీరవలయును. ఏలనన నట్టి దురదృష్ట సంభవ మేదియు జరుగకుండ పూచీపడుట యసంభవము. మనము ముందుకుపోవుటకు పూర్వము మూడువందల యఱువైలక్షల భారతీయులకు, దౌర్జన్యరాహిత్య వేదాంతాచరణములందు శిక్షణ నొసంగవలసినదేనా? అట్లయిన భరింపరాని దౌర్జన్యముచే పోలీసులు మనల నుద్రేకపరచినచో మనలో నెంతమంది సంపూర్ణ శాంతి ప్రదర్శింపగలరు? మన మొకవేళ నట్లే చేయవచ్చుననుకొనినను దౌర్జన్యముచేయుటకు, నితరులచే చేయించుటకు, మన యుద్యమములోనికి దూరిన లెక్కలేని యేజెంటుల నేవ రేమిచేయగలరు? దౌర్జన్యరాహిత్యపద్ధతి పనిచేయుట కిదియే ప్రధాన షరతుమైనచో నది యెప్పుడును విఫలమగును.

జయప్రదము కాగలదను విశ్వాసముచేతనే మన మీ పద్ధతి కంగీకరించితిమి. కాంగ్రెసు దీని నీ కారణముచేతనే తన స్వంతము చేసికొనెను. ఇది సరియైన మార్గమనియేకాక మన ప్రయోజనము నొనగూర్చునది యనియే గాంధీజీ దీనిని దేశముకు ప్రసాదించెను. పేరు కిది 'న' కారముతో ప్రారంభమైనను, మంచి శక్తివంతమైన పద్ధతి; నిరంకుశాధికారముకు వినమ్రులమై దోసిలొగ్గుటకు కేవల వ్యతిరేకము. ఇది కార్యమునుండి పారిపోవు పిరికిపంద కాశ్రయము కాక, దౌష్ట్యమును, జాతీయదాస్యమును ధిక్కరించు వీరకార్యము. కాక యేకొద్దిమందియో - శత్రువులే మిత్రాకారంలో రావచ్చును. తమ సాహసకార్యములచే మన యుద్యమమును తారుమారుచేయ గలిగినచో, నంత మొందింపగలిగినచో, నెంతటి ధైర్యవంతులైన, నెంతటి బలవంతులైన నేమి ప్రయోజనము ? గాంధీజీ శాంతి యుతమైన అసహాయోద్యమమును, దౌర్జన్యరాహిత్యమును తన వక్తృత్వముచేతను, యొప్పింపగల యద్భుతశక్తిచేతను సమర్థించెను. అతని భాష నిరాడంబరము, సరళము. అతని కంఠధ్వని, రూపము ఉద్రేక మెంతమాత్రము లేక ప్రశాంతముగ స్పష్టముగ నుండెను. కాని యీ బాహ్యాహిమాకారము వెనుక రాజుచుండు యగ్నికణముల వేడిమియు ప్రబలమైన యుత్సాహశక్తియు నుండెను. అతడు పలుకు పలుకులు మా మనస్సులను, హృదయకుహరము లను చొచ్చుకొని తీవ్రసంక్షోభము కలుగజేసెడివి. అతడు చూపిన మార్గ మతికఠినముగను, కష్టముగను నుండెను. కాని యది ధైర్యమైనది. స్వాతంత్ర్యభూమికి గొంపోవునదిగ కాన్పించెను. ఆ వాగ్దానము వలననే మనము మన విశ్వాసమును హామీయిచ్చి ముందు కురికితిమి. 1920 లో "కత్తియొక్క సిద్ధాంతము" అనువ్యాస ములో నత డిట్లు వ్రాసెను.

"దౌర్జన్యమా లేక పిరికితనమా - యేదియుక్తమను నొక్కప్రశ్న యుదయించినపుడు నేను దౌర్జన్యమునే సిఫార్సుచేసెదనని ముమ్మాటికి విశ్వసించుచున్నాను ... అసహాయమై, తన పరాభవాగ్నిని

చల్లార్చుకొనలేని పిరికిపందయై పడియుండుటకంటె భారతదేశము తనమానసంరక్షణార్థ మస్త్రములను బూనవలెననియే నా కోరిక. కాని దౌర్జన్యరాహిత్యము దౌర్జన్యముకంటె ననేకమడుంగులు గొప్పదని నేను విశ్వసించుచున్నాను. శిక్షించుటకంటె క్షమించుటే వీరలక్షణము. క్షమా వీరస్యభూషణం. క్షమ యోధునకలంకారము. కాని శిక్షింపగలశక్తియుండి యాపనిచేయకుండుటే క్షమ యగును. అసహాయుడు క్షమింతునని నటించు టర్థశూన్యము. పిల్లిచే చీల్చి చెండాడబడు యెలుక పిల్లిని క్షమించుట యనజనదు...

కాని భారతదేశ మట్టియసహాయస్థితిలో నున్నదని నేను విశ్వసింపజాలను. నా మట్టుకు నే నసహాయుడనని విశ్వసింపను ...

నన్ను సరిగా నర్థముచేసికొన గోరుచున్నాను. శక్తి శరీర పుష్టిచే కలుగజాలదు. అది యప్రతిహతేచ్ఛ లేక బుద్ధిబలముచేత కలుగును ... నేను గాలిమేడలను నిర్మించుకొనువాడనుగాను. నే ననుభవ సహితమైన యాదర్శపురుషుడను. దౌర్జన్యరాహిత్యమతము ఋషులకొఱకు యతీశ్వరులకొరకు మాత్రమే యుద్దేశింపబడలేదు. అది మామూలు ప్రజలకుకూడ నుద్దేశింపబడెను. దౌర్జన్యము పశుధర్మమైనట్లు దౌర్జన్యరాహిత్యము మనజాతి ధర్మము. పశువులలో నాత్మ నిద్రాణమైయుండును. కనుక నది పశుబలధర్మముతప్ప మరి దేనిని యెరుగదు. మానవుని యుత్తమస్థితి యుత్తమధర్మమునకు, ఆత్మబలమునకు, విధేయులము కావలెననియే శాసించుచున్నది.

కనుక ప్రాచీనధర్మమైన స్వార్థత్యాగమునే నేను భారతదేశమునకు సూచింపసాహసించితిని. సత్యాగ్రహము, అసహాయోద్యమము, సాత్వికనిరోధము ఇవన్నియు నా ధర్మమునకు క్రొత్త పేరులే కాని వేరుకావు. దౌర్జన్యమధ్యమున దౌర్జన్యరాహిత్యతత్త్వము కనిపెట్టిన ఋషిపుంగవులు న్యూటనుకంటె గొప్పబుద్ధిమంతులు. వారు వెల్లింగ్టనుకంటె మహాయోధాగ్రేసరులు. అస్త్ర, శస్త్ర ప్రయోగములందు ప్రావీణ్యులయ్యు వాని నిష్ప్రయోజకతను గుర్తించి

దుఃఖభాజకమైన ప్రపంచమునకు దౌర్జన్యముకాక దౌర్జన్యరాహిత్యమే మోక్షప్రదమని వారు బోధించిరి.

బుద్ధిపూర్వకముగ బాధనొందుటయే సజీవమైన దౌర్జన్య రాహిత్యము. అది దుర్మార్గునియిచ్ఛకు చవటపెద్దమ్మలవలె లొంగి పోవుటకాక, నిరంకుశుని నిరంకుశత్వమును ప్రతిఘటించుటకు తన యాత్మబలమునంతను వినియోగించుటే యగును. ఈ మన నిజ ధర్మముక్రింద పనిచేయు నొక్కవ్యక్తి యధర్మసామ్రాజ్యమునంతను నెదిర్చి ధిక్కరించి తనమానమును, తనమతమును, తనయాత్మను రక్షించుకొని యా సామ్రాజ్యపతనమునకు గాని, పునరుద్ధరణకుగాని పునాదులను నిర్మింపవచ్చును. భారతదేశము దుర్బలమైనదిగనుక దౌర్జన్యరాహిత్యము నవలంబింపవలసినదని నేను వాదించుటలేదు. తనశక్తిని, తనబలమును గుర్తెరింగియే బుద్ధిపూర్వకముగ నది దౌర్జన్యరాహిత్యమును చేపట్టవలెనని నేను కోరుచుంటిని ... భారత దేశ మవినాశమైన యాత్మను కలిగియున్నదనియు నది యెట్టిశరీర దుర్బలత్వమునైన నవలీలగా జయించి ప్రపంచమంతయు నేకమై యొక్కుమ్మడిగా వచ్చినను, ధిక్కరింపగలదనియు గుర్తించవలె ననియే నా కోరిక. ఈ యసహాయోద్యమమును. సిన్‌ఫినిజమునుండి నేను వేరుపరచితిని; ఏలనన దౌర్జన్యమొకవంక నిది యొకవంక పని చేయజాలవు. కాని యీ శాంతియుత పోరాటమును సోదాచేయ వలసినదని నేను దౌర్జన్యవాదులనుకూడ కోరుచున్నాను. దీనిసహజ దుర్బలత్వమువలన నిది విఫలము కాజాలదు. తగినంత ప్రోత్సాహము లేకపోవుటచే నిది విఫలము కావచ్చును. నిజమైన యపాయ మప్పుడే కలుగును. జాతీయపరాభవము నిక నెంతమాత్రము సహింపజాలని యుత్తమ పురుషులు తమక్రోధమును వెలిబుచ్చజూతురు. వారు దౌర్జన్యమును పూనెదరు. నా దృష్టిలో వారు తమ్ము, తమదేశమును దుర్మార్గమునుండి రక్షించుకొనజాలరు. భారతదేశము కత్తిని చేబట్టి నచో తాత్కాలికముగ జయించిన జయింపవచ్చును. నా హృదయ ములో నేనట్టి భారతదేశమును చూచి గర్వింపజాలను. నా సర్వ

స్వము నాకు భారతదేశమే ప్రసాదించెను. కనుక నే నామెను వరించి తిని. ఆమె ప్రపంచమునకొక సందేశము నీయగలదని నా పరమ విశ్వాసము."

ఈ వాదము మమ్ము కదల్చివేసెను. కాని మాకు, జాతీయ కాంగ్రెసుకు దౌర్జన్యరాహిత్య మొక మతము లేక వేదవాక్కు కాలేదు; కాజాలదు. అది కొన్ని ఫలితముల నీయగల యొక పద్ధతి, యొక నీతి. ఆ ఫలితములవలననే దానిమంచిచెడుగులను మనము చివర వరకు గుర్తింపవలసియుండును. వ్యక్తులు దానిని మతముగ, నిర్వివాద మైన సిద్ధాంతముగ భావించుకొనవచ్చును. కాని యే రాజకీయ సంస్థయు నదిరాజకీయముగనే యుండునంతవర కట్లుచేయజాలదు.

చౌరీచౌరాయు, తత్ఫలితములు దౌర్జన్యరాహిత్య పద్ధతిని పరీక్షింప నవకాశమిచ్చెను. గాంధీజీ సాత్విక నిరోధము నాపివేయుట కిచ్చిన కారణములే సరియైనవైనచో మన శత్రువు లెప్పుడు పోరాట మును నిలిపివేయుటకు తగిన పరిస్థితులను సృష్టింప శక్తిగలిగియుందు రనియే మేము భావించితిమి. ఇది యసహాయోద్యమ దోషమా? లేక గాంధీజీ దానికిచ్చు నర్థములోనున్న దోషమా? ఇంతకు నతడే యీ యుద్యమప్రదాత, నిర్మాత కనుక నేది దాని స్వరూపమో, యేది కాదో నిర్ణయింపగల యుత్తమ న్యాయాధికారి మరెవరుకలరు? అతడు లేనిదే మన యుద్యమ మెక్కడ? చాల వత్సరములైన తరువాత 1930 శాసనోల్లంఘనోద్యమమునకు కొంచెము ముందు గాంధీజీ యీ విషయమును స్పష్టపరచెను. అచ్చటచ్చట క్వచితుగా బయలుదేరు దౌర్జన్యమువలన నుద్యమము నాపివేయకూడదని యతడు చెప్పెను. అట్టి విధిలేని సంభవమువలన నది పనిచేయ జాలనిచో నది యన్నిపరిస్థితులకు తగిన యాదర్శపద్ధతి కాజాలదు. గాంధీజీ దీని నంగీకరింపడు. అతనిదృష్టిలో నీ పద్ధతి సరియైనదగు టచే నన్నిపరిస్థితులకు తగియుండి, వ్యతిరేక వాతావరణములో కూడ తగ్గుస్థాయిలోనైన పనిచేయగలిగి యుండవలెను. దౌర్జన్యరాహిత్య

కలాపము కెక్కువ యవకాశమిచ్చిన యీ యర్థము గాంధీజీ మనః పరిపాకజనితమో కాదో నేను చెప్పజాలను.

యథార్థమునకు చాలమంది యట్లూహించినను, 1922 ఫిబ్రవరిలో 'సాత్వికనిరోధము నాపివేయుటకు చౌరీచౌరా యొక్కటియే కారణముకాదు. దానితో కుండనిండెను. గాంధీజీ తఱచు ఆంతరంగిక ప్రబోధమునుబట్టియే నడుచుచుండును. ప్రజలతో కలిగిన సన్నిహిత, చిరపరిచయముచే నతడు ప్రజ లెట్లు భావింతురో, యేమిచేతురో, ఏమిచేయగలరో గ్రహింపగల యొక నూతనశక్తి నార్జించెను. అతడీ యాంతరంగిక ప్రబోధానుసారము తన కర్తవ్యమును నిర్ణయించుకొని తన నిర్ణయమున కాశ్చర్యచకితులు, క్రోధపూరితులునగు తన తోడి నాయకుల సంతృప్తికొరకు కారణములను చూపయత్నించును. ఇవి, చౌరీచౌరా సందర్భములోవలె, యంత తృప్తికరముగా నుండవు. మన యుద్యమ మా సమయమందు (పైకి యుత్సాహశక్తులు దేశమంతటను వెల్లివిరియుచున్నను) ముక్కముక్క లగుచుండెను. శిక్షణము, క్రమము నశించుచుండెను. నాయకులందరు జయిలులో నుండిరి; తమంత తాము నడుపుకొని పోగలశక్తి, శిక్షణలను, ప్రజ లింకను పొందియుండలేదు. ఊరు పేరు లేనివాడైనను సరే కాంగ్రెసు కమిటీని వశపరచుకొనవచ్చును. యథార్థము కనేకమంది దుర్మార్గులు, ప్రభుత్వ ఏజెంటులతో సహా, ముందుకువచ్చి కొన్ని స్థానిక కాంగ్రెసు, ఖిలాఫతు సంఘములను వశపరచుకొనిరి. వారిని నిరోధించుటకు మార్గమేమియు లేదు.

అట్టిపోరాటములో నిట్టి కథలు కొంతవరకు జరుగక తప్పవు. జయిలుకు పోవుటలో నాయకులు ముందు నాయకత్వము వహించి తక్కినవారికి యుద్యమమును విడువక తప్పదు. ఈ పనులను చేయవలెననియు, వీనిని చేయరాదనియు, ప్రజలకు శిక్షణనిచ్చుటయే మనము చేయదగిన పని. 1930 వచ్చుసరికి మనము ప్రజల కనేక సంవత్సరము లట్టి శిక్షణ నొసంగితిమి. కనుకనే 1930, 32ల లోని శాసనోల్లంఘనోద్యమము లెక్కుడు క్రమసిద్ధిగను, శక్తివంతముల్లు

గను నుండెను. 1921, 22 లలో నిది లేకుండెను. ప్రజల యుద్రేకోత్సాహముల వెనుక నిదియేమియు లేకుండెను. ఉద్యమ మాపి వేయబడనిచో నచ్చటచ్చట ననేకచోట్ల దౌర్జన్యములు జరిగియుండు ననుటకు సందేహము లేదు. ప్రభుత్వము దీనిని రక్తపాతముతో నణచివేసి భయంకర పరిపాలనను స్థాపించెడిది. దానితో ప్రజలలో భీతావహము కలిగి యవినీతి సంభవించెడిది. బహుశః యీ కారణములే గాంధీజీ మనస్సులో పనిచేసెను. ఈ విషయములను, దౌర్జన్య రాహిత్య శాస్త్రావశ్యకతను గుర్తించినచో గాంధీజీ నిశ్చయమే సరియైనది. మాలిన్యము నాపివేసి యతడు పునర్నిర్మాణము చేయవలసి వచ్చెను. కనుక 1921 లో సాత్విక నిరోధము నాపివేయుట యుక్తమే కావచ్చును.

కాని యొక మహోద్యమము నీ విధముగా హఠాత్తుగా కట్టిపెట్టుట దేశములో మరియొక విషాదమునకు సాయపడి యుండవచ్చును. రాజకీయ పోరాటములో నచ్చటచ్చట జరుగు వ్యర్థదౌర్జన్య మాపి వేయబడెను. కాని యణచివేయబడిన దౌర్జన్యమునకు మరియొక మార్గముండవలెను. తరువాత సంవత్సరములలో నిది కులకక్షలకు దోహదమునిచ్చెను. వివిధసంఘములలోని కులకక్ష ప్రేరకులు అసహాయోద్యమమునకు, శాసనోల్లంఘనమునకు కలిగిన ప్రజామోదముచే శవాకారములవలె పడియుండిరి. ఇప్పుడు వారు పైకిలేచిరి. గూఢచారి యేజెంటులు, కులకక్షలను పెంచి ప్రభుత్వమెప్పను బడయదలచినవారు దీనికి పూనిరి. మాప్లా విప్లవము, అసామాన్య క్రూరపద్ధతులచే దాని నణచివేయుట కులకక్ష ప్రేరక పిశాచముల కవకాశము నిచ్చెను. శాసనోల్లంఘన మాపివేయబడక యీ యుద్యమము ప్రభుత్వముచే నణచివేయబడినచో కులద్వేషములు కులపోరాటములు నంత చెలరేగకుండెడివి.

శాసనోల్లంఘన మాపివేయబడక పూర్వము మరియొక విధమగు ఫలితము నిచ్చిననుయిచ్చునట్టి విశేష మొకటి తటస్థించెను. శాసనోల్లంఘనముయొక్క మొదటి ధాటి ప్రభుత్వమును గజగజ

లాడించెను. అప్పుడే రీడింగుప్రభువు, వైస్రాయి, తాను విశ్రాంతి నొందినట్లు బహిరంగసభలో చెప్పెను. వేల్సు యువరాజు హిందూ దేశములో నుండుటచే ప్రభుత్వబాధ్యత మరింత హెచ్చెను. 1921 డిసెంబరులో ప్రజా నిర్బంధములు ప్రారంభమైన వెంటనే, కాంగ్రెసుతో రాజీచేసుకొనుటకు, ముఖ్యముగా యువరాజు కలకత్తాకు పోవనున్న సందర్భమున, ప్రభుత్వము ప్రయత్నించెను. జయిలులో నున్న దేశబంధుదాసుకు, బంగాళాప్రభుత్వ ప్రతినిధులకు మధ్య కొంత రహస్య సంభాషణ జరిగెను. చిన్న రౌండుటేబిలు సమావేశము కాంగ్రెసు, ప్రభుత్వములమధ్య జరుగవలెనని సూచింపబడెను. కరాచీ జయిలులోనున్న మౌలానా మహమ్మదాలీ యీ కాన్ఫరెన్సులో నుండవలెనని గాంధీజీ పట్టుబట్టుటచే నిది వీగి పోయెను. ప్రభుత్వ మందుల కొప్పుకొనలేదు.

చిత్తరంజనదాసు గాంధీజీ యభిప్రాయముతో నీ విషయములో నేకీభవింపక తాను జయిలునుండి వచ్చినతరువాత గాంధీజీని బహిరంగముగ విమర్శించి యతడు తప్పుచేసెననెను. మాకు, జైలులోనుండుటచే, యదార్థములు తెలియకపోవుటచే మే మెట్టినిర్ణయము చేయజాలక పోతిమి. కాని యీ స్థితిలో నట్టి కాన్ఫరెన్సువలన నెట్టిలాభము కలుగ నట్లే కాన్పించెను. యువరాజు కలకత్తాను సందర్శించుకాలము నెట్లో గడపుకొనుటకే ప్రభుత్వ మీ యెత్తు యెత్తెను. ప్రధానసమస్య లట్లే యుండెడివి. తొమ్మిదేండ్లు గడచినతరువాత మనజాతియు, కాంగ్రెసుయు అనేకరెట్లు బలపడినను, యెట్టిఫలితము లేనియట్టి కాన్ఫరెన్సు జరిగెను. దీనిసంగతి యటుండ మహమ్మదాలీ యుండవలెనని గాంధీజీ పట్టుబట్టుట కేవలము సమంజసమనియే నా యభిప్రాయము. కాంగ్రెసు నాయకుడుగనేకాక ఖిలాఫతునాయకుడుగ కూడ నీతనిరాక చాల యవసరము. సహచరుని విడిచివేసెడి యే పద్ధతియు, నీతియు నెప్పుడును క్రమమైనది కానేరదు. అతనిని ప్రభుత్వము జయిలునుండియే విడిచిపెట్టినపు డింక కాన్ఫరెన్సువలన నెట్టి లాభము కలుగజాలదని స్పష్టమగుచునే యుండెను,

మాతండ్రి, నేనూ చెరియారునెలలు వేరువేరు కోర్టులచే శిక్షింపబడితిమి. ఆ విచారణలు కేవలము నాటకములు అయినను మే మందులో పాల్గొనలేదు. మాయుపన్యాసములలోను యితరచర్యల లోను మమ్ము శిక్షించుటకు తగినంతసరుకు లేకపోలేదు. కాని మాపై ప్రయోగింపబడిన నేరములు మాత్రము నవ్వుపుట్టింపక మానవు. తండ్రిగారు కాంగ్రెసు వాలంటీరుదళములో సభ్యుడని, దానిని రుజువుచేయుటకు హిందీసంతకముతోనున్న యొకఫారము దాఖలు చేయబడెను. సంతకము మాతండ్రిదేయైనను, అత డంతకు పూర్వ మెన్నడు హిందీలో సంతకము చేయకపోవుటచే, నతని హిందీ సంత కము నేకొద్దిమంది మాత్రమో యానవాలుపట్టగలరు. ఒక చింకి గుడ్డలవాడు సంతకమును రుజువుచేయుటకువచ్చి (యతనికి పొట్టకోసి నను అక్షరముముక్క రాదు) కాగితమును చేతపుచ్చుకొని పరీక్షించు వానివలె నటించి సంతకమును తిరుగవేసి చూచుచుండెను. నాకుమార్తె (అప్పటికి నాలుగేండ్లు) విచారణకాలమందు తండ్రిగారియొద్దనేయుండి యీ వినోదము చూచుచుండెను.

హర్తాళము చేయవలసినదని నోటీసులు పంచిపెట్టినట్లు నా మీద కేసుతేబడెను. లా ప్రకార మది యప్పట్లో నేరముకాదు. ఇప్పుడు, మనకు డొమినియను పరిపాలన కరతలామలకము చేయబడి నది. కనుక నిది నేరమేకావచ్చును. ఎట్లైనను నేను శిక్షింపబడితిని. మూడునెలలయిన తరువాత నేను నా తండ్రితోను తదితర మిత్రుల తోను జయిలులోనుండగా నొకడు వచ్చి, శిక్షలను తనిఖీచేయు అధి కారి నే నక్రమముగా శిక్షింపబడితినని కనిపెట్టెననియు నాశిక్ష రద్దు చేయబడుటచే నేను వెళ్ళిపోవలసియుండునని చెప్పెను. నా తరఫున నెవరును పనిచేయకపోయినను, యిది యట్లు జరిగెనా యని నే నాశ్చర్యపడితిని. శాసనోల్లంఘన మాపివేయబడుటచే తనిఖీచేయుజడ్జీ లకు చురుకుపుట్టెను. నా తండ్రిని విడిచివెళ్ళుట నాకు విచారకరము గనే యుండెను. వెంటనే నేను అహమ్మదాబాదు వెళ్ళి గాంధీజీని చూడవలెననుకొంటిని. నే నచ్చటకు వెళ్ళులోపల గాంధీజీ నిర్బంధింప

బడుటచే, నే నతనిని సబర్మతి జయిలులో చూచితిని. అతని విచారణ కాలమందు నేను దగ్గరనే యుంటెని. ఆ విచారణ మా జన్మలో మాకు మఱపుకురాదు. న్యాయమూర్తి ఒక ఆంగ్లేయుడు. అతి మర్యాదగను, సవిచారముగను ప్రవర్తించెను. కోర్టులో గాంధీజీ యిచ్చిన స్టేటుమెంటు అద్భుతముగ నుండెను. మేము భావోద్రేక పూరితులమై తిరిగి వచ్చితిమి.

నేను అలహాబాదు తిరిగివచ్చితిని. కాని స్నేహితులును, సహచరులును, జయిలులోనుండుటచే నొంటరినైతిని. కాంగ్రెసు వ్యవహారములు సక్రమముగా నుండకపోవుటచే నేను దానికి పూనుకొని ముఖ్యముగా విదేశవస్త్ర బహిష్కారమును సాగించితిని. శాసనోల్లంఘనమాగినను యదిమాత్ర మాచరణలోనేయుండెను. అలహాబాదులోని విదేశవస్త్ర వ్యాపారులందరు విదేశబట్టల నిక దిగుమతి చేయమనియు, కొనమనియు ప్రమాణపత్రములను వ్రాసియిచ్చి దీని కొక సంఘము నేర్పరచిరి. సంఘుకట్టుబాటులకు వ్యతిరేకముగ నడచినచో జుల్మానా విధింపబడునను సూత్రమున్నను పెద్దపెద్ద వర్తకులు దీనికి భిన్నముగా విదేశబట్టలను దిగుమతి చేయసాగిరి. ప్రమాణమును పాటించువారి కిది కష్టముగ నుండినను వారెట్టి చర్యను తీసుకొనజాలకుండుటచే మేము పికెటింగుచేయ నిశ్చయించితిమి. పికెటింగు పేరుచెప్పినతోడనే జుల్మానాలు చెల్లింపబడి క్రొత్తప్రమాణపత్రములు తీసుకొనబడెను. జుల్మానా లన్నియు బట్టల వర్తక సంఘమునకు జమకట్టబడెను.

రెండుమూడు రోజులయినతరువాత మరికొంతమంది సహచరులతో నేను మరల నరెస్టుకాబడితిని. అక్రమముగా భయపెట్టితిమనియు, నిర్బంధించి డబ్బు తీసుకొంటిమనియు మాపై నేరము మోపబడెను. నాపై మరికొన్ని నేరములును, రాజద్రోహము కూడ మోపిరి. నేను వాదించక కోర్టులో నొక పెద్ద స్టేటుమెంటు యిచ్చితిని. చివరకు మూడు నేరములకు మొత్తముమీద యిరువది యొక్క మాసములు శిక్షించిరి. ఇది నా రెండవ శిక్ష. ఆరువారములు యటనుంటినో లేదో, నేను తిరుగ నా జయిలు ఆశ్రమమునకు పోతిని.

13

లక్నో జిల్లా జయిలు

1921 భారతదేశములో రాజకీయ నేరములకు ఖయిదు సంభవించుట క్రొత్త విషయముకాదు. ముఖ్యముగా బంగాళావిభజన మయినతరువాత నిరంతర జన ప్రవాహ మెప్పుడును జయిలుకు పోవుచు నేయుండెను. విచారణ లేకుండగనే ప్రవాస శిక్షలు కూడ నుండెను. అప్పటికి భారతనాయక శిఖామణియగు లోకమాన్య తిలకుకు వృద్ధాప్యములో నారువత్సరములు శిక్ష విధింపబడెను. యీ ప్రవాస జయిలు శిక్షావిధానము యుద్ధమువలన మరింత వృద్ధియై యావజ్జీవశిక్షలకు, నురిశిక్షలకు కారణమైన కుట్రనేరములు మరింత తఱచయ్యెను. ఆలీసోదరులు, అబ్దుల్ కలమ్ అజాదుగారలు యుద్ధ కాలపు ప్రవాసితులలో నుండిరి. యుద్ధము ముగియుటతోడనే పంజాబులోని సైనికశాసనము చాలమందిని తన పొట్టబెట్టుకొనెను. కాని రాజకీయ నేరములకు ఖైదుచేయబడుట తరచయినను యింతవర కది బుద్ధి పూర్వకముగ వరింపబడలేదు. అది యొకరు పనిచేయుచుండ నా పని సందర్భములోనో లేక నే గూఢచారి యతనిపై కన్ను వేయుట చేతనో సంభవించుచుండెడిది. దానిని తప్పించుకొనుటకు కోర్టులలో వాదించు కొనెడివారు. దక్షిణాఫ్రికా సత్యాగ్రహోద్యమములో గాంధీజీయు, నతని వేలకొలది యనుచరులు మరియొక మార్గమును చూపించిరి.

అయినను 1921లో కారాగారమగమ్య ప్రదేశముగ నుండెను. క్రొత్త ఖయిదీని కబళించిన యీ ఇనుపద్వారముల వెనుక నేమిజరిగెడిదో యెవరికెరుక! అందలి నివాసులందరు ముచ్చులనియు, నుపద్రవకరులైన నేరస్థులనియు, సాహసికులనియు మే మూహించితిమి. జయిలనిన ఒంటరితనము, అవమానము, బాధ, కష్టములు – ఈయన్నింటిని మించి ముందేమి రానున్నదోయను భయము, 1920 లగాయితు

వేలకువేలు జయిలుకు పోవుచుండుటచే మేము క్రమముగా దాని కలవడి జయిలనిన నప్రయత్నముగా కలుగుచుండు నసహ్యాతా ద్వేషములు తగ్గుచుండెను. కాని ముందుగా నెంతటి మానసికసిద్ధి కలిగియున్న వానికైనను యినుప ద్వారములను దాటుటతోడనే మొట్టమొదట కలుగు నుద్రేకము మానదయ్యెను. నాటి లగాయితు నేటివరకు మూడువందల వేలమంది స్త్రీ పురుషులు రాజకీయ నేరముల కా యినుపకవాటములను దాటిరి. ఇందులో వేలకొలది యనేకసార్లు వచ్చుచు పోవుచుండుటచే లోపల నేమిజరుగునదియు బాగుగ గ్రహించియే యుందురు. వారచ్చటి విపరీత జీవితముకు, తిండిలోను, పనిలోను, మార్పు అనున దెంతమాత్రము లేని నిర్జీవ జీవితముకు, సాధ్యమగునంతవర కలవాటుపడిపోవుటకే ప్రయత్నించిరి. అలవాటుపడిరి. అయినను మే మచ్చటకు క్రొత్తగా పోయినపుడెల్ల కొంచె మా ప్రాతయుద్రేకము, పటపటాంగము, నాడీ వేగము నుండకతప్పదు. విశాల ప్రపంచమును, పచ్చికబయిళ్ళను, జనసంఘములను, బండ్లవేగములను, బంధుజనులను, మిత్రబృందమును కడసారి చూడవలెనని మా నేత్రము లప్రయత్నముగా వెనుకకు తిరిగి చూచును.

నేను మొదటిసారి జయిలులోనున్న కాలము నాకు జయిలు అధికారులకు కూడ నుద్రేకభరితముగ నుండెను. ఈ క్రొత్తరకపు ఖయిదీని చూచుటతోడనే జయిలు అధికారులు సగము స్తంభించిపోయిరి. దినదినాధికమగుచున్న వారి సంఖ్యాబల మపరిమితముగా నుండి పాత జయిలు సాంప్రదాయముల నన్నింటిని తుడిచివేయు మహా ప్రవాహమువలె కాన్పించెను. ఈ క్రొత్త యతిథి మరింత కొరకరానికొయ్య. ఇతడన్ని తరగతులనుండియు వచ్చుచు మధ్య తరగతినుండి హెచ్చుగా వచ్చుచుండెను. వీరందరు మామూలు ఖయిదీలకంటె కేవలము భిన్నమైన వారగుటచే వారిని చూచినట్లు వీరిని చూచుటకు వీలులేదు. దీని నధికారులు గ్రహించిరి. కాని వారి కేమిచేయుటకు తోచకుండెను. ఇతడు సామాన్య ఖయిదీ

సాధువు కాడు; వినయవిధేయతలుకలవాడు కాడు. జయిలులో నున్నను సంఖ్యాబల మతనికి పెట్టనికోటవలె నుండెను. బయట జరుగుచున్న యాందోళనము, లోపల జరుగుచున్న దానిని పరీక్షించుచున్న ప్రజల శ్రద్ధయు దీనికి మరింత దోహదము నిచ్చెను. మా కిట్టి కొద్ది యహంభావదృష్టియున్నను మేము సామాన్యముగా జైలు అధికారులకు తోడ్పడుచునేయుంటిమి. మా సహాయమే లేనిచో జయిలు అధికారుల కష్టములు పెరుమాళ్ళకే యెఱుక. జయిలరు తఱచు మాదగ్గరకువచ్చి వాలంటీరు లున్నచోటుకు వెళ్ళి వారిని శాంతపరచమని కోరెడివాడు.

మా యంతట మేము జయిలుకు వెళ్ళితిమి. చాలమంది వాలంటీర్లు అనాహూయముగా జయిలులోనికి చొరబడిరి; కనుక తప్పించుకొని పారిపోదురను భయ మెంతమాత్రము లేకుండెను. ఎవనికైనను వెళ్ళిపోవలెనని కోరికయున్నచో క్షమార్పణ చెప్పిన చాలును. లేదా ముం దట్టి పనిచేయనని వ్రాతమూలము చాలును. పారిపోవుటకు ప్రయత్నించుటకంటె వేరు యపకీర్తిలేదు. అది రాజకీయములనుండి తొలగుటయే యగును. లక్నో జయిలు సూపరింటెండెంటు దీనిని బాగుగ గ్రహించి జయిలరుతో కాంగ్రెసుఖయిదీలను బయటకుపోవునట్లు చేయగలిగినచో నతనికి ఖానుబహాదరు బిరుదము నీయవలసినదని ప్రభుత్వమునకు శిఫార్సుచేసెదనని చెప్పెడివాడు.

జయిలులో, లోపలగాయున్న యొకయావరణలో, పెద్దకొటారులలో నా సహచరఖయదీలు చాలమంది యుండెడివారు. మాలో పదునెనిమిదిమంది బట్టలనేత నేసెడి యొకపాతపాకలో నుంచబడితిమి. దానిముందొక విశాలస్థలము కలదు. మాతండ్రి, నేను, నాపెత్తండ్రి బిడ్డ లిరువురు—మా నలుగురకు 20 యడుగుల పొడుగు, 16 అడుగుల వెడల్పుగల యొక చిన్న పాక ప్రత్యేకముగ నిచ్చిరి. ఒక కొటారు నుండి మరియొక కొటారునకు పోవుటకు మాకు తగినంత స్వేచ్ఛ యిచ్చిరి. బయటనుండి మమ్ము చూచుటకు వచ్చు బంధువులతో తరుచు మాట్లాడుట కవకాశ మిచ్చిరి. వార్తాపత్రికలు వచ్చుచుండు

టచే, క్రొత్త నిర్బంధములను, ఉద్యమాభివృద్ధిని చదువుచు నుత్సాహ భరితుల మగుచుండెడివారము. వాదోపవాదములు, సంభాషణలు చాలాకాలము పట్టుచుండుటచే నాకు చదువుకొనుటకు, మరే ప్రయోజనమైన పనిచేయుటకు తీరిక యుండెడిదికాదు. నేను ప్రాతఃకాలములందు మా పాక నతిశుభ్రముగ తుడిచి కడిగివేసెడివాడను. తండ్రిగారి బట్టలను, నా బట్టలను శుభ్రముగా నుతికెడివాడను. తరువాత నూలు వడికెడివాడను. అది శీతకాలము. మొదటి కొలదివారములు మా వాలంటీర్లకు, వారిలో చదువురానివారికి పాఠములను చెప్పనిచ్చిరి. హిందీ, ఉరుదూ మొదలగు ప్రాథమిక విషయములను బోధించెడివారము. సాయంకాలము చేతిబంతియాట యాడెడివారము. కాని క్రమముగా నిరోధములు హెచ్చుజొచ్చెను. మా యావరణ దాటి వాలంటీర్లను చూచుటకు బయటకు పోనిచ్చెడివారుకారు. పాఠశాలయు తరగతులు నిలచిపోయెను. అప్పుడే నన్ను విడిచిపెట్టిరి.

నేను మార్చి మొదటివారములో వెళ్లి తిరిగి ఏప్రిల్ లో వచ్చితిని. నేను వచ్చుసరికి పరిస్థితులన్నియు పూర్తిగా మారిపోయెను. తండ్రిగారిని నైనిటాలు జయిలుకు మార్చిరి. అతడు వెళ్ళుటతోడనే క్రొత్తనియమముల నమలుపరచిరి. నేతశాలలో నుంచబడిన ఖయిదీలందరు కొటారులలోనికి మార్చబడిరి. ప్రతి కొటారు జయిలులో నొక జయిలువంటిది. కొటారునకు కొటారునకు నెట్టి సంబంధము లేకుండచేసిరి. బంధుదర్శనము ఉత్తరములు నెలకొక్కసారియే జరుగవలెననిరి. భోజన మతిముక్తసరి చేయబడెను.

నా కొటారులో సుమారేబదిమంది యుండిరి. మేము క్రిక్కిరిసి యుంటిమి. మా బిచానాలకు మూడునాలుగడుగుల దూరము మాత్రమే యుండెను. నా కొటారులో నున్నవారందరు నాకు పరిచయులు. చాలమంది స్నేహితులు. కాని రాత్రింబవళ్లు 'మరుగు' అనునది లేక యసహ్యాముగ నుండెను. అస్తమానము చూచినవారినే చూచుట, ఒకేమాదిరి చిన్నపేచీలు, గిల్లికజ్జాలు – వీనిని తప్పించు కొనుట కెట్టి ప్రశాంతాగారము లేకపోవుట. మేము బహిరంగము

గనే బట్టల నుతికెడివారము; కసరత్తుకొరకు కొటారుచుట్టు పరు గెత్తెడివారము. సహేతుకముగా మాట్లాడుశక్తి తగ్గువరకు సంభాషించుచు, వాదించుకొనుచుండెడివారము. నిత్యపేలవ సంసారజీవితమే నూరురెట్లు పెంచబడినట్లుండెను. అన్ని తరహాల మనుష్యులము, అన్ని యభిరుచులు కలవారము నచ్చట జేరితిమి. అది మా యందరకు బాధాకరముగనే యుండెను. నే నేకాంతవాసముకొఱకు వాచిపోతిని. తరువాత సంవత్సరములలో జయిళ్ళలో నేకాంతవాస మెక్కువయై బాధపడి మంచి సావాసము కావలెనని కోరెడివాడను. అప్పుడు 1922 నాటి లక్నో జిల్లా జయిలుజీవితము జ్ఞాపకము వచ్చెడిది. మొత్తము మీాద వ్రాసికొనుటకు, చదువుకొనుటకు నవకాశమున్నచో నేకాంత వాసమునే నేను కోరెడివాడను.

నా సావాసకాండ్రందరు నసాధారణ బుద్ధిమంతులగుటచే నానందముగనే యుండెడిది. కాని యొకేజీవితము విసుగుదలగానుండి మే మేకాంతమును కోరుచుండెడివారము. నేను నా కొటారునువిడిచి పెట్టి బయట యావరణలో నొంటరిగా కూర్చొని మేఘావృతమైన యాకాశమువంక తదేకదృష్టితో చూచుచుండెడివాడను. నే నెండకు, వర్షముకు నోర్చి వీలైనంతవరకు చాలకాల మక్కడనే గడపెడి వాడను. నే నాప్రశాంతప్రదేశమున పవళించి, గగనవీధులను, వీనీలనీరదశ్యామమును పరీక్షించుచు, మున్నెన్నడు నెరుంగన ట్లా యద్భుత చిత్రవిచిత్ర వర్ణసౌందర్యము నాస్వాదించితిని.

మా కాల మపుడు భోగ్యముకాక భారముగ నుండెడిది. కాని చలిచలి ముందుకు పోవుచుండు నా యమృత రసభరిత మేఘపంక్తిని చూచి యానందించుటలో గడుపుకాల మతి సంతోషావహముగ స్వేచ్ఛాప్రదముగ నుండెడిది. ఒక క్రొత్త విషయమును కనుకొను టలో కలిగెడి యానందము, నిర్బంధమునుండి తప్పించుకొంటినను భావము నాకు కలిగెను. ఆ ప్రత్యేక వర్షాకాలమట్లు నన్నేల యాకర్షించెనో చెప్పజాలను. దానికి పూర్వాపరము లట్టియనుభవము నాకు కలుగలేదు. పర్వతాగ్రములనుండియు, సముద్రతీరములనుండియు నే

ననేకసార్లు సూర్యోదయ సూర్యాస్తమయములను వీక్షించి, యా బంగరుతోయముల జలకమాడి, జగత్ప్రాణుని మాహాత్మ్యమున కచ్చెరువందితిని. కాని యంతటితో నితరకార్యములలో మగ్నుడ నగుచుంటిని. కాని జయిలులో సూర్యోదయ సూర్యాస్తమయములను చూచుటకు మేము నోచుకొనలేదు. ఉదయమున నెప్పుడో ప్రచండ భానుడు మా సంరక్షకులైన జయిలుగోడలను దాటివచ్చును. మా కంటికి కెట్టివర్ణములు కానరావు. ఎట్టి యందచందములు లేని యా మట్టిగోడలను, ఆ బారకీచులను చూచుచుండుటచే మా కండ్లు కాయలుకాచి నిస్తేజములయ్యెను. అవి రంగులకొరకు, వెలుతురు, నీడలకొరకు తపించుచుండ ప్రావృట్కాలమేఘరాజి చిత్రవిచిత్రా కారములతో, వర్ణములతో నాట్యమాడుచురాగా నే నత్యాశ్చర్యా నందమగ్న మానసుడనై సమాధిస్థితిని పొందుచుంటిని. ఒక్కొక్కప్పుడా మేఘములు విచ్ఛిన్నమగుచుండ వానిమధ్య ననంతనభో భాగమో యనునట్టు లగాధనీలద్యుతి మెఱయుచుండెను.

క్రమముగా మా మీాద నిర్బంధము హెచ్చెను. కఠినచట్టము లమలుజరుపబడెను. మన యుద్యమ లోతుపాతులు తెలియుటచే ప్రభుత్వము తమ్మెదిరింప సాహసించినందులకు వారిధాక ననుభవింప వలెననిరి. క్రొత్త చట్టముల నమలుపరచుటలో రాజకీయ ఖైదీలకు జయిలు అధికారులకు సంఘర్షణ మేర్పడెను. చాల నెలలవరకు మేము బంధుసందర్శనము చేయ నిరాకరించితిమి. మాలో నేడుగురను నన్ను, పురుషోత్తమదాసు టాండను, మహాదేవ దేశాయి, జార్జిజోసెఫ్, బాలక్రిష్ణశర్మ, దేవదాసుగాంధి మొదలగువార్లను, తక్కిన జయిలుతో సంబంధములేని మారుమూలకు త్రోసివేసిరి.

మమ్మొక చిన్నయావరణలో నుంచిరి. అచ్చట కొన్ని కష్టము లున్నను మొత్తముమీాద నాకు బాగుగనేయుండెను. అంత క్రిక్కిరిసి యుండకపోవుటచే నాకు కొంత శాంతి, మరుగు యుండెను. చదువు కొనుటకు నితరపనులు చేసికొనుటకు నవకాశముండెను. మా కితర

ఖయిదీలతోను, యితర ప్రపంచముతో నెట్టిసంబంధము లేకుండెను. రాజకీయఖయిదీల వార్తాపత్రికల నాపివేసిరి.

కాని బయటనుండి యేవో కొన్ని వార్తలు వచ్చుచునే యుండెడివి. నెలనెలకువచ్చు యుత్తరములు, బంధుసందర్శనములు కూడ కొద్దివార్తలను తెచ్చెడివి. బయట యుద్యమము సన్నగిలినట్లు కాన్పించెను. ఆ సంధిసమయము దాటిపోవుటతోడనే విజయ మంత కంతకు వెనుకకుపోయెను. కాంగ్రెసులో రెండు చీలికలేర్పడెను. మార్పు కావలెనను పక్షము, మార్పు కూడదను పక్షము. మొదటి పక్షమునకు చిత్తరంజనదాసు, మా తండ్రి నాయకులై కాంగ్రెసు నూతన రాష్ట్రీ, కేంద్రశాసనసభా యెన్నికలకు నిలిచి, సాధ్యమైనచో వానిని పట్టుకొనవలెననిరి. రెండవదానికి సి. రాజగోపాలాచారి నాయకుడై కాంగ్రెసువిధానములో నెట్టిమార్పు యుండరాదనిరి. అప్పుడు గాంధీజీ జయిలులోనుండెను. అధికారముకొరకు ప్రాకు లాడుటచే వచ్చు తగాదాలచేతను; కుట్రలచేతను, మనల నెంతయో ముందుకు గొనిపోయిన మహోన్నతాశయములు తుడిచివేయ బడుచుండెను. ఉత్సాహోద్రేకములు వెల్లివిరియు కాలములోనే ఘనకార్యములు, సాహసకార్యములు జరుగగలవు. కాని వేడితగ్గినతరువాత జరుగనేరవని మేము గుర్తించితిమి. భవిష్యత్తు అంధకారముగ నుండెను. అది యెట్లు జరుగనున్నను మా జీవితము లలో చాలాభాగము జయిళ్ళలోనే గడుపవలసియుండునని యను కొంటిమి. ఈవిధముగ మేము మాట్లాడుకొనెడివారము. జార్జిజోసెఫ్‌తో జరిగిన సంభాషణలో మే మీ పర్యవసానమునకే వచ్చితిమి. అప్పటినుండి జోసెఫ్ మనకు చాలదూరమగుటయేకాక మనకార్యము లనుకూడ తీవ్రముగ విమర్శింప నారంభించెను. లక్నోజిల్లాజయిలులో సివిలువార్డులో, నొక శరత్కాలసంధ్యాసమయమున జరిగిన యా సంభాషణ మతనికి జ్ఞాపకమున్నదో లేదో నేను చెప్పజాలను; మేము కసరత్తు, దినచర్య మొదలగు వాటి కభ్యాసపడితిమి. కసరత్తునకు మా యావరణచుట్టు పరుగెత్తెడివారము. లేదా మాలో నిద్దరము

మా దొడ్డిలోనున్న నూతిలోనుండి యొక పెద్ద తోటబాల్చీతో యెద్దులవలె నీరు లాగెడివారము. ఈవిధముగా మా యావరణలో నున్న యొక చిన్నకూరగాయలతోటకు నీరు పెట్టెడివారము. మాలో చాలమంది ప్రతిదినము కొద్దిగా వడికెడివారు. కాని యధ్యయన మును నేను ప్రధానవృత్తిగా పరిగణించి యెప్పుడు చదువుచుండెడి వాడను. సూపరింటెండెంటు యెప్పుడు మమ్ము చూడవచ్చినను నేను చదువుచునే యుండెడివాడను. ఆ దొరగారి కీవిద్యావ్యాసంగము భరించలేదు. దానిని విమర్శించుచు నత డొకసారి తనవిద్య పన్నెం డవయేటనే సమాప్తమయ్యెనని సెలవిచ్చెను. నిశ్చయముగా నీవిద్యా భావమే యా యాంగ్లసైనికధైర్యరాశి కెట్టికష్టమైన యాలోచనలను రాకుండచేసెను! బహుశః మా రాష్ట్రములోని జయిళ్ళయిన్స్పెక్టరుజనరలు హోదాకుగూడ నితని నదియే తీసికొనిపోయి యుండ వచ్చును. శీతకాలదీర్ఘనిశలు, వినీలభారతాకాశము మమ్ము నక్షత్ర పంక్తి కాకర్షించెను. కొన్ని పటములసహాయముతో మేము వాటి ప్రదేశములను కనుగొంటిమి. ప్రతిరాత్రి మేము వాటికొరకు వేచి యుండి చిరమిత్రులను చూచు నానందముతో వాటికి స్వాగత మిచ్చెడివారము.

మే మిట్లు కాలముగడుపుచుండ దినములు, వారములు, మాస ములునయ్యెను; ఒక నిత్యజీవితమునకు మే మలవడితిమి. కాని బయట ప్రపంచములో భారమంతయు తల్లులపయిన, భార్యలపయిన, సోదరీ మణులపయిన పడెను. చిరవియోగమువలన వారు విసుగుచెందిరి. వారి ప్రియులందరు జయిళ్ళలోనుండ, వారిస్వేచ్ఛయే వారికొక కళం కముగ తోచెను. మా మొదటి నిర్బంధమయినతోడనే పోలీసులు అలహాబాదులోని మాయింటిని — ఆనందభవనమును తఱచు సంద ర్శింప నారంభించిరి. నాతండ్రిగారికి, నాకు, విధింపబడిన జుల్మానా లను వసూలుచేయుటకు వారు వచ్చెడివారు. జుల్మానాలను చెల్లింప రాదని కాంగ్రెసు విధించెను. కనుక పోలీసులు ప్రతిదినమువచ్చి చిన్న చిన్న కర్రసామాగ్రి తీసికొనిపోయెడివారు. ఇందిర నా నాలు

గేండ్లకూతురు, పోలీసుల యీ నిరంతరదాడిని సహింపక తన యసహ్యాతను వారికెరిగించెను.

జయిలులో రాజకీయ ఖయిదీలు మామూలు ఖయిదీలతో కలియకుండుటకు సర్వవిధముల తంటాలుపడెడివారు. రాజకీయఖయిదీలకు ప్రత్యేకజయిళ్ళ నేర్పాటుచేసెడివారు. కాని పూర్తిగా విడదీయుట యసంభవమయ్యెను. మేము వారితో తఱచు కలిసెడివారము. వారిద్వారా ప్రత్యక్షముగ జయిలునిజపరిస్థితులు తెలిసికొనెడివారము. అవినీతి, సాంకర్యము, దౌర్జన్యము – ఇదియే జయిలుకథ. భోజన మతి హేయ్యము. నే ననేకసారులు దానిని తినవలెనని చూచి తిని. కాని యది తిన నర్హాముగాకుండెను. సాధారణముగా జయిలు యుద్యోగులు పూర్తిగా నసమర్థులు. వారికి తక్కువజీతముల నిచ్చెదువారు. కాని ఖయిదీలనుండి, వారిబంధువులనుండి డబ్బు గుంజుకొనుటకు వారి కనేకావకాశములు కలవు. జయిలరుకు నతని సహకారులకు, వార్డరులకు ననేకబాధ్యతలు, ధర్మములు నుండుడచే వాని నెవడైనను సమర్థతతోను, ఆత్మశుద్ధిగను నెరవేర్చుట యసంభవమే. మా రాష్ట్రములలోని జయిళ్ళలో జయిలు పరిపాలనావిధానమునకు ఖయిదీలను సంస్కరించి, వారికి మంచివృత్తులను నేర్పుటకు నెట్టిసంబంధము లేదు. ఖైదులో పనిచేయించుట ఖయిదీని బాధించుటకే! అతడు భయభ్రాంతుడై యడుగులకు మడుగులొత్తుచుండవలెను. అతడు జయిలుపేరువినిన భయభ్రాంతుడై నేరముచేసి తిరిగి జయిలుకు రాకుండ నుండవలెననియే దానియుద్దేశ్యము. ఈమధ్య కొద్దిమార్పులు రాజకీయ ఖయిదీలు చేసిన యాందోళన వలన జరిగెను. ఆహారము, దుస్తులు కొంచెము నయమయ్యెను. అసహాయోద్యమమువలన వార్డరుల జీతములుకూడ హెచ్చింపబడెను. పిల్లలకు, పిన్నవయసు ఖయిదీలకు వ్రాత, వాచకము నేర్పుటకు కొద్దిపాటి యేర్పాటులు గావింపబడెను. కాని యీ మార్పులు మంచివేయైనను అసలు సమస్య యథాప్రకారముగనే యున్నది. వెనుకటి జయిలుతత్వముమాత్ర మట్లే నిలిచి

యుండెను. మామూలు ఖయిదీలకొరకేర్పడిన యీ చట్టములను, నియమములను కొంచెమించుమించు రాజకీయఖయిదీలందరు సహింపవలసివచ్చెను. వారికి ప్రత్యేకసౌకర్యములు, ఆదరణ లేవు. కాని వారు తెలివిగలవారగుటచే వారిబత్తెములనుండి డబ్బులాగుట యంత సులువుగా జరుగుటకు వీలు లేకుండెను. ఈ కారణముచే జయిలు అధికారులకు వీరనిన సహజముగా కన్నెఱ్ఱ. ఏ కారణముచేతనైన నెవరైన జయిలునియమముల నుల్లంఘింపవలసివచ్చెనా వానిచావు మూడినదన్నమాటే! అట్టినియమభంగమునకే ఆజాద్ అను పదిహేను పదహారేండ్ల కుఱ్ఱవానికి కొరడాదెబ్బలశిక్ష విధింపబడెను. అతని యొంటిమీది బట్టలన్నియు తీసివేయబడి యతడొక ముక్కోణమునకు కట్టివేయబడెను. ఒక్కొక్కదెబ్బ యతనియొడలు మీదపడి యెఱ్ఱటి తట్టు తేలుచుండ నతడు "మహాత్మా గాంధీకిజై" అని యరచుచుండెను. అతడు స్పృహతప్పి పడిపోవువరకు నతని యొంటిమీద పడిన ప్రతి దెబ్బయు "మహాత్మా గాంధీకిజై" తో మేళవించుచుండెను. తరువాత కొంతకాలమున కా పిల్లవాడే ఉత్తరహిందూదేశములోని టెర్రరిస్టు సంఘముల కొక నాయకుడయ్యెను.

14

తిరిగి బయటపడితిని

జయిలులో స్త్రీలకంఠధ్వని, పిల్లల నవ్వులు వినరావు. మన కక్కడ వినబడు ధ్వనులు చాల కటువుగ నుండును. కంఠధ్వనులు పరుషముగ భయజనకముగ నుండును. ఇక భాష కేవలము పశు ప్రాయము-చాలవరకు బూతులు. ఒకసారి నాకొక క్రొత్త కొఱత హఠాత్తుగా జ్ఞప్తికి వచ్చెను. లక్నో జయిలులో నేడెనిమిదిమాసము లుండినను నాకు కుక్కఅఱపు యెప్పుడు వినిపించలేదు.

1923 జనవరి నెలాఖరున లక్నో జయిలో నున్న రాజకీయ ఖయిదీలనందరిని విడిచివేసిరి. విడుదలను గురించి ముందుగా పుకారు లేమియు లేకపోవుటచే మే మాశ్చర్యపడితిమి. స్థానికశాసనసభలలో రాజకీయఖయిదీలను విడుదలచేయవలెనను తీర్మానము గావింపబడెను. కాని ప్రభుత్వకార్యనిర్వాహకవర్గ మట్టితీర్మానములను సాధారణ ముగా పెడచెవినిబెట్టుదురు. కాని ప్రభుత్వమువారిదినములు బాగుం డెను. కాంగ్రెసు ప్రభుత్వమునకు వ్యతిరేకముగా నేమియు చేయుట లేదు. కాంగ్రెసువారు తమలోతాము కొట్లాడుకొనుచుండిరి. జయి లులో పెద్దనాయకు లెవరు లేరు. కనుక మంచిదేయని వారు మమ్మ విడిచివేసిరి.

జయిలుద్వారములను దాటుటతోడనే కొంతయుల్లాసము, స్వేచ్ఛ యెప్పుడు కలుగుచుండును. మంచిగాలి, విశాలమైదానములు రహదారితో గూడుకొనిన వీధులు, పాతస్నేహితులను కలుసుకొనుట ఇవన్నియు కొంత యుల్లాసము పుట్టించును. మే ముత్సాహముతో పొంగితిమి, కాని యిది యెంతకాలము? కాంగ్రెసు పరిస్థితు లేమియు బాగుండలేదు. ఆదర్శములు పోయి పన్నుగడలు వచ్చెను. ఏమాత్ర మాత్మవిచారము గలవారికైన రాజకీయములనిన యేవగింపుకలిగించు మామూలుపద్ధతులచే, కాంగ్రెసును వశపరచుకొనుట కనేకముఠాలు ప్రయత్నించుచుండెను.

నేను శాసనసభా ప్రవేశ వ్యతిరేకిని. ఇది చివరకు మన లక్ష్యమును తుడిచివేయునట్లు నాకు కాన్పించెను! కాని దేశములో మరియొక రాజకీయవిధాన మేదియు లేదు. మార్పు కూడదనువారు 'నిర్మాణ కార్యక్రమము' ను సమర్థించిరి. అనగా సంఘసంస్కారము. దీనిసుగుణమేమన నిది కాంగ్రెసుసేవకులకు ప్రజాసంబంధము కలిగించును. కాని రాజకీయములు – రాజకీయకర్మ కావలెననువారి నిదెట్లు తృప్తిపరుపగలదు? ప్రత్యక్షపద్ధతి యొకసారి విఫలమైనతరువాత కొంత శాసనసభాట్టహాసముండక తప్పదు. ప్రభుత్వతో డ్పాటుకు, నిర్మాణమునకుగాక ప్రభుత్వమును ప్రతిఘటించుటకు, ధిక్కరించుటకు దీనిని మా తండ్రి, చిత్తరంజనదాసు నడిపిరి.

జాతీయపోరాటమును సాగింపవలెననియే శాసనసభాప్రవేశము నెప్పుడు చిత్తరంజనదాసు సమర్థించుచుండెను. మా తండ్రికిగూడ కొంచెమించుమించుగ నట్టిభావమే యుండెను. కాని 1920 లో నతడు తన దృక్పథమును గాంధీజీకి లోబరచెను. అతడు యావచ్ఛక్తిని పోరాటములో వినియోగింప నెంచెను. అప్పుడు గాంధీజీ సిద్ధాంతమును పూర్తిగ నంగీకరించు టొక్కటియే దానికి మార్గమయ్యెను. సిన్ఫీనులవలె పార్లమెంటులో ప్రవేశించి కామన్సుసభకు హాజరు కాకుండ నుండవలెనని చాలమంది యువకులకుండెను. నేను 1920 వేసవిలో గాంధీజీ నీ పద్ధతి కంగీకరింపమంటిని. కాని యట్టివిషయములలో నత డచలుడు. మహమ్మదాలీకూడ బహిష్కారపద్ధతి కిష్టపడలేదు. ఇతరు లెట్లు భావించిననేమి ? చివరకు గాంధీజీవాక్యమే వేదవాక్యము. అత డుద్యమజనకుడు. కనుక చిన్నవివరముల కతనికి తగినంతస్వేచ్ఛ నీయవలెనని మే మనుకొంటిమి. ఓట్లు నీయకుడు, పోలింగులకె వెళ్ళకుడు అను దాని నర్థముచేసికొనునట్లు సిన్ఫీను పద్ధతిని ప్రజ లర్థముచేసికొనజాలరని యతని వాదన. ఎన్నుకొనబడి సభలకు పోకుండుట ప్రజలలో గందరగోళముకు కారణమగును. ఒకసారి కౌన్సిలులోనికి పోయినతరువాత నది వారినాకర్షించుననియు, వారిక బయటకు రారనియు, వారిని బయటకు రప్పించుటకు మన

యుద్యమములో తగినంతశిక్షణ, బలము లేవనియు, శాసనసభల ద్వారా ననేక ప్రత్యక్షాప్రత్యక్షమార్గముల ప్రభుత్వ మెప్పులకు హోదాలకు దాసులగుట సంభవింపవచ్చుననియు నతడు చెప్పెను.

ఈ వాదములో బల మెంతయో కలదు. స్వరాజ్యపార్టీ శాసన సభలకు వెళ్లినపు డిందులో చాల ముచ్చట్లు జరిగెను. అయినను 1920 లో కాంగ్రెసు శాసనసభలను పరిపరచుకొనుటకు పూను కొనినచో నేమయ్యెడిదో చెప్పజాలము. ఖిలాఫతుకమిటీ బలముకూడ నుండుటచే రాష్ట్రసభలలోను, కేంద్ర అసెంబ్లీలలోను యెన్నకొన బడు సీట్లు కాంగ్రెసుకే చేకూరెడివనుటలో నెట్టి సందేహము లేదు. నేడు (ఆగష్టు 1934) అసెంబ్లీకి కాంగ్రెసుసభ్యులను నిలుపుటకొక పార్లమెంటరీబోర్డు స్థాపింపబడెను. కాని 1920 లగాయతు నేటివరకు మన సాంఘిక, రాజకీయచీలికలను పెంచుట కనేక కారణము లేర్పడెను. కనుక రాబోవు యెన్నికలలో కాంగ్రెసు కెట్టివిజయము కలిగినను అది 1920 నాటి విజయముతో సరిపోజాలదు.

నేను జయిలునుండి వచ్చుటతోడనే, రెండుపక్షములవారిమధ్య రాజీకుదుర్చుటకు తోడ్పడితిని. కాని లాభము లేకపోయెను. చివరకి రెండుపక్షముల రాజకీయములతోను నేను విసుగుచెందితిని. రాష్ట్రీ కాంగ్రెసుకమిటీ సెక్రటరీనగుటచే నేను కాంగ్రెసుసంస్థను చక్కబెట్ట పూనుకొంటిని. గతసంవత్సరమంతయు తల్లక్రిందులగుటచే, చేయ వలసినదెంతయో యుండెను. నే నెంత కష్టపడినను లాభము లేక పోయెను. నాకేమియు తోచకుండెను. ఇంతలోనే మరియొక క్రొత్త రంగము తయారయ్యెను. నేను విడుదలయైన కొద్దివారములకే నన్ను అలహాబాదు మున్సిపల్ చైర్మన్ పదవిలోనికి గెంటిరి. ఈ యెన్నిక చాల హఠాత్తుగా జరుగుటచే నిది జరుగుటకు 45 నిమిషములకు పూర్వ మెవరును నా పేరు సూచించి యుండలేదు.

చిత్రముగా నాసంవత్సరమున దేశమంతట ప్రధాన కాంగ్రెసు నాయకులు మున్సిపాలిటీల కధ్యక్షులైరి. చిత్తరంజనదాసు కలకత్తాకు మొదటి మేయరు. విఠల్‌భాయిపటేలు బొంబాయి కార్పరేషను

శీలము, ఆశయములు, వాని నమలుపరుపగల శక్తిసామర్థ్యములుకల నీవంటివారే రాష్ట్ర విద్యావిధాత యగుననుకొనుము! నీ వద్భుత కార్యములు చేయజాలవా? తానీమధ్యనే గవర్నరును చూచె ననియు, నా విధానము నమలుజరుపుటకు నాకు సంపూర్ణస్వేచ్ఛ యివ్వబడుననియు చెప్పెను. అప్పు డతడు చాలదూరము పోవునట్లు గ్రహించి తా నధికారరీత్యాగాక, తనంత తానే యీ సూచన చేసినట్లు చెప్పెను.

సర్ గ్రింవుడ్ రాజకీయ, ద్రావిడ ప్రాణాయామసూచన నాకు నవ్వుపుట్టించెను. నేను ప్రభుత్వముతో మంత్రిత్వరీత్యా సంపర్కము కలిగించుకొనుట యనూహ్యమేకాక, నా కేహ్యముగకూడ నుండెను. నిర్మాణ కార్యక్రమముకొరకు నేను పరితపించుచుంటిని. నాశము చేయుట, ఆందోళనచేయుట, సహాయముచేయకుండుట మానవుల సామాన్యధర్మములు కావు. కాని యట్టి నిర్మాణభూమికి చేరుటకు ముందు మనలో చాలామంది మన జీవితములను, శక్తిసామర్థ్యము లను, మన సమస్తమును, యీ జీవిత ఎడారులలో పోరిపోరి, యలసి సొలసి పోగొట్టుకొనవచ్చును; నిర్మాణమును మన బిడ్డలో, మన బిడ్డల బిడ్డలో చేయవలసియుందురు.

ఆ రోజులలో నధమపక్షము సంయుక్తరాష్ట్రములలో, మంత్రు లతిచౌక. అసహాయోద్యమకాలములో పనిజేసిన లిబరలు మంత్రు లిరువురు రాజీనామా యిచ్చిరి. కాంగ్రెసుయుద్యమ మతితీవ్రముగా నున్న రోజులలో ప్రభుత్వమువారు లిబరలుమంత్రులను కాంగ్రెసుపై ధ్వజమెత్తుట కుపయోగించుకొనిరి. వా రప్పుడు ప్రభుత్వ కార్య నిర్వాహకవర్గముచే గౌరవింపబడిరి, పూజింపబడిరి. ప్రభుత్వమును కాంగ్రెసు ఒక్కుమ్మడిగా నెదుర్కొనుటచే నా గండమును కాచు కొనుటకు ప్రభుత్వము తమ కిచ్చిన గౌరవమే యని యనుకొనక, పాప మా మంత్రు లది తమదే యనుకొనిరి; తమ హక్కే యను కొనిరి. ఆ పోరాటము తగ్గుటతోడనే ప్రభుత్వదృష్టిలో మంత్రుల విలువకూడ పడిపోయెను. ప్రభుత్వము మునుపటి గౌరవ, మర్యాద

లను చూపించుట మానివేసెను. దీనివలన మంత్రులకు కోపము వచ్చెను. వారి కోపతాపముల నెవరు లెక్కపెట్టకపోవుటచే వారు రాజీనామా యివ్వవలసివచ్చెను. అప్పుడు క్రొత్త మంత్రులకొరకు వలవేయ నారంభించిరి. ఇది వెంటనే జయప్రదము కాలేదు. శాసన సభలోనున్న కొద్దిమంది లిబరలుసభ్యులను, తమతోడివారి నట్లమా నుషముగా త్రోసివేసిరను సానుభూతిచే నూరకొనిరి తక్కిన వారిలో చాలమంది జమీందారులు, సామాన్యచదువు చదివిన వారుకూడ లేరు. కాంగ్రెసు శాసనసభలను బహిష్కరించుటచే, నానాగోత్రములవారు నందులో చేరిరి.

ఈ ప్రతిఘటనలో కొంత న్యాయమున్నది. రాజకీయములను గురించి, సాంఘికవిషయములను గురించి యెట్టి విశాలదృష్టియు లేక లిబరలు మంత్రులు చాల సంకుచితబుద్ధితో నుండిరి. కాని యది వారి వంధ్యాసిద్ధాంతదోషము. కాని వారు తమ నిత్యకృత్యముల నాత్మ శుద్ధితో నెరవేర్చెడివారు. వారితరువాత నుద్యోగములోనికి వచ్చిన వారిలో కొందరు జమీందారులు. వారి విద్య అత్యల్పము. వారి నక్షరజ్ఞు లనదగును. భారతీయులు కేవలమసమర్థులని చాటుటకే గవర్నరు వీరిని పట్టుకొని యీ యున్నతపదవులలో పెట్టినట్లు కాన్పించును. "లక్ష్మీకైక సాధ్యమేదియు లేదని ప్రజలు చెప్పుకొనుటకే యది నన్ను పైకి తెచ్చెను" అను వాక్యము వీరికి బాగుగ వర్తించును. చదువున్ననేమి, లేకున్ననేమి ! ఈ మంత్రులకు జమీందారీ వోటు కలదు. వారు పెద్దపెద్ద ఉద్యోగస్థులకు విందులు చేయగలరు. మలమలమాడు రైతులనుండి పిండబడిన ధనము కింతకంటె యోగ్య మైన ప్రయోజన మేదికలదు ?

15

సందేహము - సంఘర్షణ

నన్ను బాధించు సమస్యలను మరుచుటకై నే ననేక కార్యములలో నిమగ్నుడనైతిని. కాని నన్నవి వీడకుండెను. అవి నన్ను బాధించుచుండ వాటికి తగిన సమాధానములు వచ్చెడివికావు. నా సందేహములనుండి తప్పించుకొనుటకే నే నిప్పుడు కార్యాచరణకు గడంగితిని. కాని 1920-21 లలో నిది సంపూర్ణముగ నా యాత్మనే వ్యక్తముచేసెను. నేను నన్ను రక్షించుచుండెడి యావరణలోనుండి బయటకువచ్చి భారతరంగములు, బయట ప్రపంచమును చూచితిని. అంతకుమునుపు నేను గుర్తించని యనేకమార్పులు, క్రొత్త భావములు, క్రొత్త సంఘర్షణలు తలయెత్తెను. నాకు వెలుతురుకన్న అంధకారమెక్కువయ్యెను. గాంధీజీ నాయకత్వముపై నా విశ్వాసమెప్పటివలెనుండెను. కాని నే నతని విధానములోని కొన్ని భాగముల నెక్కువవిమర్శగా పరీక్షింప నారంభించితిని. అతడు జయిలులోనుండుటచే నే నతని సలహా తీసుకొనజాలకపోతిని. కాంగ్రెసు పక్షములు రెంటిలో నేదియు నన్నాకర్షింపలేదు. కౌన్సిలుపక్షమువారు సంస్కరణ, చట్టవిధానమంత్రములకు తిరిగిరి. ఇవి యంధకార వీధులలోని కొంకగంతు. మార్పుకూడదనువారు మహాత్ముని ప్రియశిష్యు లనుకొనబడిరి. కాని చాలమంది గొప్పవారి శిష్యులవలెనే వీరును యుపదేశములోని పదములనే తీసికొని వాటిసారమునకు ప్రాధాన్యత నీయలేరు. వారిలో చైతన్యతలేదు. కొంచె మించుమించు వా రాచరణలో సంఘసంస్కర్తలుకాని స్వరాజ్యపార్టీ పార్లమెంటరీయెత్తులలో మునిగియుండ వీరికి ప్రజలతో సంబంధ ముండెడిది.

నేను జయిలునుండి వచ్చుటతోడనే దేశబంధుదాసు నన్ను స్వరాజ్యపార్టీకి మార్చవలెనని యత్నించెను. నే నతని వాదమునకు లొంగలేదు. నా తండ్రి స్వరాజ్యపార్టీ నాయకుడైనను నన్నెప్పుడు తన మతములోనికి త్రిప్పుకొనవలెనని యత్నింపలేదు. నే నందులో

చేరిన యతడు చాల సంతసించెడివాడు, కాని యత డా విషయము పూర్తిగా నాకే వదలివేసెను.

ఈ కాలములో మా తండ్రికి దాసుగారికి చాలమైత్రి కలిగెను. అది రాజకీయ సహచర్యముకంటె చాల గొప్పది. వారి యన్యోన్యత స్నేహభావము చూచినపుడు నా కాశ్చర్యమువేసెడిది. ఏలనన వయసు ముదిరిన తరువాత పెద్దస్నేహము కుదురుట యరుదు. మా తండ్రికి చాలమంది పరిచయులుండిరి; వారితో కులాసాగా నవ్వుచు సరససల్లాపములు చేయుచుండెడివాడు. కాని స్నేహ విషయమై యతడు జాగ్రతగ నుండుటయేకాక వయసు మీరిన తరువాత స్తనశల్య పరీక్ష చేయుచుండెడివాడు. కాని వీ రిరువుర మధ్య యీ యడ్డంకులన్నియు నశించి యొకరి నొకరు హృదయ పూర్వకముగా ప్రేమించుకొనిరి. నా తండ్రి తొమ్మిదేండ్లు పెద్దవా డైనను యతనికంటె బలిష్టుడు, ఆరోగ్యవంతుడు. ఇద్దరు గొప్ప లాయర్లు. చాల పేరు ప్రఖ్యాతులను బడసినవారైనను వారిలో చాల భేదములుండెను. దాసుగారు లాయరేకాక కవి. అతనిలో కవి కుండెడి భావోద్రేకముకలదు. అతడు తనభాషలో చక్కని కవిత్వము వ్రాసెను. అతడు మంచివ్యక్తి. మతస్వభావముకలవాడు. మా తండ్రి యెక్కువ యనుభవజ్ఞుడు, ఉద్రేకములేనివాడు. వ్యవహారత, మత వాసన లేనివాడు. అత డెప్పుడు యోధుడు. కొట్టుటకు, పడుటకు సిద్ధము. అత డెవరిని మూర్ఖులని యనుకొనెనో వారిని విడిచిపెట్టడు. వ్యతిరేకము సహింపడు. ఇట్లు మా తండ్రి, దాసుగారు కొన్ని విషయములలో భేదించినను నొక పార్టీని నడుపుటకు చక్కగాకుదిరిరి. ఒకరిలోటుల నొకరు తీర్చివేసిరి. వారి పరస్పరవిశ్వాస మద్భుతము. కనుక వారొకరితో నొకరు ముందుగ నాలోచింప నక్కరలేకుండ నొకరిపేర నొక రెట్టి స్టేటుమెంటు, లేక ప్రకటననైన నివ్వవచ్చు ననుకొనిరి.

ఈ వ్యక్తిగత సంబంధమే స్వరాజ్యపార్టీకి దేశములో బల మును, పేరుప్రతిష్టలను చిరస్థాయిత్వమును కలుగచేయుటకు చాల

వరకు పనిచేసెను. శాసనసభలద్వారా వ్యక్తిగతముగా ముందుకు పోవచ్చునని దూరిన స్వలాభపరు లిందులోనుండుటచే మొట్టమొదట నుండియు చీలుట కిందులో నవకాశములుండెను. ప్రభుత్వముతో సహకారము చేయవలెనను నిజమైన మితవాదులు కొందరుండిరి. ఎన్నిక లగుటతోడనే యీ స్వభావము పైకుబుకుటచే వెంటనే నాయకులు వీరిని గర్హించిరి. మా తండ్రి 'దుష్టాంగమును ఖండించివేసెదను' అని చెప్పి యట్లే చేసెను.

1923 లగాయతు నా కుటుంబములో నా కెక్కుడు శాంతియు, సంతోషము కాన్పించెను. నా కుటుంబ సంబంధములలో నే నదృష్టవంతుడనగుటచే, వారు చిక్కులలోను కష్టకాలములోను, నన్ను శాంతపరచి నా కాశ్రయము నిచ్చెడివారు. నా భార్య యద్భుత ప్రవర్తనకు 1920 లగాయతు నే నామె కెంత ఋణపడియుంటినో నేను గ్రహించితిని. ఆమె యభిమానరాశి, చురుకుపాలు కలది. అయినను నా చేష్టల నన్నింటిని సహించుటచేయేగాక నా కామె సంతోషమును, ఆత్మశాంతిని చేకూర్చుచుండెడిది. 1920 లగాయతు మా జీవితపద్ధతిలో కొంతమార్పు కలిగెను. అది చాల నిరాడంబరముగనుండెను. చాలమంది నౌకరులు తగ్గించబడిరి. అప్పటికి ప్రధాన సుఖముల కేమియుకొఱత లేకుండెను. కొంతయనవసరమైన వాటినివదల్చుకొనుటకు, కొంత ప్రస్తుతఖర్చులకు డబ్బుకొరకు, గుఱ్ఱములు, బండ్లు మా క్రొత్త జీవితవిధానము కనవసరమైన గృహసామగ్రి మొదలగు నవెన్నియో అమ్మివేయబడెను. కొంతసామగ్రి పోలీసులు తీసుకొని పోయి యమ్మివేసిరి. తోటమాలీలు, కరసామగ్రి లేకపోవుటచే మా తోట పాడయిపోయెను. ఇంటి యందచందములు తగ్గిపోయెను. మూడేండ్లవరకు యింటిని తోటను మేము శ్రద్ధగా చూడలేదు. దండిగ ఖర్చుపెట్టుకొను నలవాటు కలవాడగుటచే తండ్రిగారికి ఖర్చు తగ్గించుట కిష్టములేదు. కనుక నతడు తన తీరికకాలములో కొంతడబ్బు సంపాదింపవలెనని యింటివద్దనే ప్లీడరుసలహా యిచ్చుచుండెడివాడు. అతనికంత తీరిక లేకపోయినను బాగుగనే సంపాదించెడివాడు. ఆర్థిక

ముగా తండ్రిగారిమీద నాధారపడుట నాకు కష్టముగ, నసంతుష్టిగ నుండెను. నేను ప్రాక్టీసు మానినది లగాయితు స్వంతసొమ్ము నా కేమియు లేకుండెను. నా భార్య, నేను చాల స్వల్పమే ఖర్చు పెట్టెడి వారము. మే మంతకొద్దితో కాలక్షేపము చేయగలుగుట నాకే యాశ్చర్యమయ్యెను. 1921 లో నే నీవిషయము కనుగొని చాల తృప్తినొందితిని. ఖద్దరుబట్టలకు, మూడవతరగతి రైలుప్రయాణము నకు నంతసొమ్మవసరము లేదు. అప్పుడు మేము మాతండ్రియొద్దనే యుండుటచే ననేక యితర గృహాఖర్చులున్న సంగతి నే నెరుగనైతిని. ఎట్లైనను డబ్బుండదనుభయము నన్నెప్పుడు బాధించలేదు. అవసర మున్నచో నేను కావలసినంత సంపాదింపగలిగెడివాడను. మేము స్వల్పముతోనే కాలము గడుపగలము.

మేము మా తండ్రి కంత భారముగ నుండెడివారముకాము. అట్టి సూచన వినినచో నతని కెంతయో బాధకలిగెడిది. అయినను నేను నాస్థితితో తృప్తిపొందక మూడేండ్లీ సమస్యనుగురించి యాలో చించి విఫలుడనైతిని. కావలెనన్న నాకు మంచి లబ్ధిగలకృషి దొరకక పోదు. కాని యట్టి కృషికి బూనినచో నేను చేయుచుండిన దేశసేవ మానివేయవలెను. లేదా కొంతకాలమునైన నందుకు వినియో గింపవలెను. ఇంతవరకు నేను నా కాలమునంతను కాంగ్రెసు, మున్సి పల్ సేవలకే వినియోగించుచుంటిని. డబ్బుచేసికొనుటకు నే నీపను లను మానివేయుట నా కయిష్టముగా నుండెను. పెద్దపెద్ద వర్తక కంపెనీలనుండి వచ్చిన లాభదాయకములగు నవకాశములను త్రోసి వేసితిని. బహుశః వారు నా సమర్థతకుగాక నా పేరు తమ స్వార్థము కొరకు కుపయోగించుకొనుటకే యంత పెద్దజీతముల నిచ్చెదమనిరి. పెద్ద పరిశ్రమలతో నే నీవిధముగా సంబంధముపెట్టుకొనుట కిచ్చగింప లేదు. ఇక న్యాయవాదవృత్తికి బోవుట యసూహ్యాము. దానిని గురించి తలచినకొలదియు నది నా కయిష్టమయ్యెను.

1924 లో కాంగ్రెసు కార్యదర్శులకు జీతముల నీయవలెనను సూచన వచ్చెను. నే నొక కార్యదర్శిని. ఇది నాకు బాగుగనే

కాన్పించెను. పొట్టగడచుటకైనను, యేమియు నివ్వకుండ యెవనిని తనకాలమునంతను సేవచేయవలసినదనుట తప్పిదమని నాకు తోచెను. లేకపోయినచో నితరమార్గములద్వారా డబ్బువచ్చువానిని చూడవలెను. అంత తీరుబడికలవాని నెల్లప్పుడు రాజకీయముగా విశ్వసించుటకు వీలులేదు. పనికి వారిని బాధ్యులనుచేయుటకు వలనుపడదు. కాంగ్రెసు హెచ్చుజీతముల నీయజాలదు. మన జీతములు చాల తక్కువ. పబ్లిక్ నిధులనుండి జీతమును తీసుకొనరాదను దురభిప్రాయమొకటి భారతదేశములో కలదు. నే నట్లుచేయరాదని మా తండ్రియే తీవ్రముగా ప్రతిఘటించెను. నాతోడి కార్యదర్శి చాల డబ్బునిక్కచ్చిలోనుండి కూడ జీతము తీసికొనుట గౌరవభంగమని తలంచుచుండెను. కాని యెట్టి గౌరవభంగము లేక జీతముతీసికొన సిద్ధముగానున్న నేనుకూడ జీతములేకుండగనే పనిచేయవలసివచ్చెను. ఒక్కసారియే నేను తండ్రిగారితో నీవిషయము గురించి చెప్పి డబ్బుకొరకతనిమీద నాధారపడుట నా కిష్టములేదంటిని. ప్రజాసేవ చేయకుండ నేను నా కాలమునంతను స్వల్పధనార్జనకొరకు వినియోగించుట కేవలము మూర్ఖత్వమని యతడనెను. నాకు నా భార్యకు నొక్కవత్సరముకు కావలసినదాని నతడు కొద్దిరోజులలో సంపాదింపగలననెను. ఈ వాదము బలీయముగనే యున్నను నా కంత తృప్తిగలేకుండెను. అయినను నే నతనిప్రకారమే నడచితిని.

1923 ప్రారంభమునుండి 1925 చివరవరకు కుటుంబవ్యవహారములతోను, డబ్బు చిక్కులతోను మాకు సరిపడెను. ఈలోపల రాజకీయములు మారుచు నా కిష్టములేకపోయినను నే నఖిలభారత కాంగ్రెసులో బాధ్యతగల పదవి వహించితిని. 1923 లో నొకచిత్రమైన స్థితి యేర్పడెను. గత వత్సర గయాకాంగ్రెసుకు చిత్తరంజనదాసు అధ్యక్షుడయ్యెను. కనుక నతడే 1923 లో నఖిలభారత కాంగ్రెసు కమిటీ చైరుమనుగ నుండును. కాని యీ కమిటీలో స్వరాజ్యపార్టీ నీతికి; నతనికి వ్యతిరేకమైనవారికి మెజారిటీ యుండెను. 1923 లో బొంబాయిలో జరిగిన కమిటీ మీటింగులలో పరిస్థితులు

విషమించెను. దాసుగారు చైరుమను పదవికి రాజీనామా యిచ్చెను. రెండుపక్షముల మధ్యనున్న యొక చిన్న మధ్యపక్షము కార్య నిర్వాహకవర్గమయ్యెను. ఈ కార్యనిర్వాహకవర్గముకు కమిటీలో సరియైన బలము లేదు. ముఖ్య రెండు పక్షములలో నేదో యొకదానిపై నిది యాధారపడెను. ఒకదానితో కలసినచో నిది మరియొకదాని నోడింపగలదు. డాక్టరు అన్సారీ క్రొత్త అధ్యక్షుడయ్యెను. నేనొక కార్యదర్శిని.

మా కిరుప్రక్కలనుండియు కష్టములే సంభవించెను. నోఛేంజర్లకు కోటయైన గుజరాతు కేంద్ర కార్యాలయమువారి యాజ్ఞలను కొన్నింటిని తిరస్కరించెను. ఆ వత్సరమే వేసవిలో జాతీయజెండా సత్యాగ్రహము జరుగుచున్న నాగపురములో మరియొక కమిటీ మీటింగు జరిగెను. ఆ దురదృష్ట మధ్యపక్షమునకు చెందిన మా కార్యనిర్వాహకవర్గ మంతటితో నంతరించెను. అది యెవరికి ప్రాతినిధ్యము వహింపక కాంగ్రెసులో నిజమైన పలుకుబడికలవారిపై నధికారము చెలాయింపవచ్చెను కనుక శాస్తి జరిగెను. గుజరాతుచూపిన యవిధేయతకు దానిమీద విశ్వాసరాహిత్యముకు యత్నింపగా నది విఫలమగుటచే మేము రాజీనామా యిచ్చితిమి. నే నతిసంతోషముతో రాజీనామా యిచ్చి పీడవదలినట్లు భావించితిని. పార్టీ యెత్తులు, జిత్తులు కొద్దికాలపు టనుభవమే - నాకు బాధకలిగించెను. కొంతమంది ప్రధాన కాంగ్రెసునాయకుల పన్నుగడకు నే నాశ్చర్యపడితిని.

ఈ సభలో చిత్తరంజనదాసు నన్ను 'ఉద్రేకశూన్యుడవు' అని నిందించెను. అది యుక్తమే కావచ్చును. అది మనము పోల్చుదాని ప్రమాణమునుబట్టి యుండును. నాస్నేహితులలోను సహచరులలోను చాలమందితో నన్ను పోల్చినచో నేను ఉద్రేకములేనివాడనే. అయినను భావము, ఉద్రేకము, కోపము మొదలగునవి నన్ను ముంచునేమో లేక నేను వానిచే నీడ్వబడుదునేమో యని నే నెప్పుడు భయపడుచునే యుందును. ఉద్రేకములేకుండుటకే నే ననేక వత్సరములు సాధనచేసితిని. నే నిందులో పొందిన జయము కేవలము బాహ్యమనియే నా భయము.

16

నాభాలో నౌకకథ

స్వరాజ్యపక్షమువారికి, నోఛేంజర్లకు ద్వంద్వయుద్ధము జరిగి క్రమముగా స్వరాజ్యపక్షము గెలుపొందుచుండెను. 1923 శరత్కాలములో ఢిల్లీలో జరిగిన "ప్రత్యేకకాంగ్రెసు"లో స్వరాజ్యవాదులకు మరికొంత జయము కలిగెను. ఈ కాంగ్రెసు అయినవెంటనే నాకొక యపూర్వానుభవము తటస్థించెను.

సిక్కులకు, ముఖ్యముగా అకాలీలకు, పంజాబు ప్రభుత్వముతో తఱచు సంఘర్షణ జరుగుచుండెను. గురుద్వారములలో మహంతుల యవినీతి హెచ్చుగానుండుటచే మత సంస్కారోద్యమ మొకటి బయలుదేరి, యవినీతిపరులగు మహంతులను తీసివేసి గురుద్వారములను పవిత్రపరచి, వాటి యాస్తులను జాగ్రత్త పెట్టుటకు సంకల్పించెను. ఇందులో ప్రభుత్వము జోక్యము కల్పించుకొనుటచే సంఘర్షణ మేర్పడెను. గురుద్వారోద్యమము కొంతవర కసహాయోద్యమ ప్రబోధమువలననే కలిగెను. అకాలీల పద్ధతులుకూడ దౌర్జన్య రాహిత్యతత్త్వమునే యనుకరించెను. చాల సంఘటనలు సంభవించెను. కాని వాటిలో గురుకాభాగు పోరాటము ముఖ్యమైనది. అందులో వందలకొలది సిక్కులు, చాలమంది సైనికులుగ పనిచేసినవారు, పల్లెత్తుమాటాడకుండ, చేయి యెత్తకుండ, తమ స్థానమునుండి తమధర్మమునుండి యొక్కయడుగైనను కదపకుండ పోలీసులు వారిని పశువులను మోదునట్లు మోదుచుండ, నగ్నిపరీక్షనిచ్చిరి. ఈ ధైర్య స్థైర్యములను, ఈ సాహసమును, పట్టుదలను చూచి భారతదేశము నిర్ఘాంతపోయెను. ప్రభుత్వమువారు గురుద్వార కమిటీ యక్రమ సంఘమని ప్రకటించిరి. ఈ పోరాటము కొన్ని వత్సరములు జరిగి చివరకు సిక్కులకే జయముచేకూరెను. సహజముగా కాంగ్రెసుకు

దీనియందు సానుభూతికలిగి కొంతకాల మీ యుద్యమమును పరీక్షించుటకమృతసరములో నొక ప్రత్యేకోద్యోగినికూడ నుంచెను.

ఇప్పుడు నేను చెప్పబోవు కథకు నీ సిక్కుల ఉద్యమమునకు సంబంధము లేకపోయినను యీ యుద్యమ ప్రబోధమువలననే యిది సంభవించెననుటకు సందేహములేదు. పంజాబులోని నాభా, పాటియాలా మహారాజు లిరువురకు (రెండును సిక్కు సంస్థానములే) పరస్పర విరోధముండి పోరాడుకొనుచుండ భారతప్రభుత్వము నాభా మహారాజును సింహాసనమునుండి తొలగించిరి. నాభాసంస్థానమును పరిపాలించుట కొక బ్రిటిషు యేజెంటును నియమించిరి. సిక్కు లీ కార్యమును గర్హించి నాభాలోను, బయటను ఆందోళనము చేయుచుండిరి. ఈ సందర్భములో నాభాలోనే 'జయితో' యనుచోట జరుగుచున్న యొక మతయుత్సవమును క్రొత్తపరిపాలకుడు డాపివేసెను. ఇది న్యాయముకాదని చెప్పుటకు నాపివేయబడిన యుత్సవము సాగించుటకు, సిక్కులు జయితోకు, జాతాలను పంప నారంభించిరి. పోలీసు లీ జాతాల నాపి, చావబాది, నిర్బంధించి మారుమూలనున్న దోవ తెన్ను లేని యే యడవిలోనో విడిచిపెట్టి వచ్చెడివారు. ఈ కథ నంతను నేను మొదటినుండియు వినుచుంటిని. ఢిల్లీ ప్రత్యేక కాంగ్రెసు అయినతోడనే మరియొక జాతా పోవుచున్నదనియు నచ్చటకువచ్చి జరుగుచున్నదంతయు చూడవలసినదనియు నన్నాహ్వానించిరి. నే నతిసంతోషముతో నంగీకరించి, గిద్వానీ, సంతానము గార్లతో బయలుదేరితిని. జాతా కాలినడకనే బయలుదేరెను. మేమొకబండిలో బయలుదేరి జాతా జయితోకుజేరు సమయమునకే చేరుకొంటిమి. మేము దూరమునుండి జాతాను పరీక్షించుచుంటిమి. జాతాను పోలీసు లాపివేసిరి. నాభా సంస్థానములో కాలుపెట్టరాదని పెట్టినచో వెనుకకుతిరిగిపోవలసినదని యింగ్లీషు పరిపాలకుని సంతకముతో నా కొక హుకుము జారీచేయబడెను. గిద్వానీ, సంతానము గార్లమీదకూడ నిట్టి నోటీసు జారీచేయబడెను. నాభా ప్రభుత్వముకు వారి పేర్లు తెలియకపోవుటచే పేర్లుదహరింపకుండనే నోటీ

సుల నిచ్చిరి. మేము జాతాలో పాల్గొనుటకు రాలేదని ప్రేక్ష కులముగా వచ్చితిమని నాభా చట్టములను వేటిని మేము భంగము చేయదలచుకొనలేదని చెప్పితిమి. మేమిదివరకే నాభా రాష్ట్రము లోనికి ప్రవేశించుటచే, ప్రవేశింపకూడదను సమస్య కవకాశమే లేదు. మే మకస్మాత్తుగా మాయమైపోగలశక్తి మాకు లేదు. జయితోనుండి బయలుదేరుబండి చాల గంటలకుగాని బయలుదేరదు. కనుక నంత వరకైన మే ముండెదమంటిమి. మమ్ము వెంటనే అరెస్టుచేసి తీసికొని పోయిరి. మమ్ము తీసికొనిపోయిన తరువాత జాతాను మామూలు ప్రకారము సన్మానించిరి.

పగలంతయు నిర్బంధించి సాయంకాలము మమ్ము స్టేషనుకు నడిపించి తీసికొనివెళ్ళిరి. సంతానముగారి యెడమచేతికి, నా కుడిచేతికి కలిపి యినుపబేడీలు తగిలించి వానికొక గొలుసుకట్టి పోలీసా గొలుసు చేతపుచ్చుకొని మమ్ము నడిపించుచుండెను. గిద్వానీగారినట్లే ప్రత్యే కముగా నడిపించిరి. జయితో వీధులలో మమ్మీవిధముగా నడిపించుట గొలుసుకట్టి కుక్కనుతీసికొని వెళ్లువిధమును నాకు జ్ఞప్తికి తెచ్చెను. మొట్టమొదట మేము కొంచె ముద్రేకపడితిమి. కాని వెంటనే యీ హాస్యమును మే మానందించితిమి. మందగమనముతో పోవు క్రిక్కిరిసి యున్న యొక మూడవతరగతి రైలుబండిలో నెక్కి మధ్య నొకసారి మారుచు, కొంతసేపు నాభా జయిలులో గడుపుచు, మే మా రాత్రి నెట్లో గడిపితిమి. ఇంతకాలము, మరునాడు మధ్యాహ్నము నాభాజయి లుకుమమ్ము వప్పగించువరకు నా జంటబేడీలు, బండగొలుసు, మాకు సహచారిగ నుండెను. రెండవవాడు తోడ్పడనిదే మేము కదలుటకు వీలులేదు.

నాభా జయిలులో మా ముగ్గురిని యనారోగ్యము, యపరి శుద్ధము నగుయొక చిన్నగదిలో కుక్కిరి. అది తేమగనుండి పైకప్పు మా చేతి కందుచుండెను. రాత్రి మేము నేలమీదనే పడుకొనగా నొక ఎలుక నా ముఖముమీదనుండి పరుగెత్తుటచే నే నులిక్కిపడి లేచితిని. రెండు మూడురోజులయిన తరువాత మమ్ము కోర్టుకు తీసి

కొనివెళ్ళిరి. అక్కడ తల్లక్రిందులు విచారణతంతు దినదినము జరుగుచుండెను! ఆ మేజిస్ట్రేటు లేక జడ్జి యెంతమాత్రము చదువు రానివాడు. అతని కింగ్లీషు రాదు సరికదా కోర్టుభాషయైన ఉర్దూ కూడ వ్రాయజాలడని నాకు సందేహము తోచెను. మే మతని నొక వారము రోజులు పరీక్షించి చూచినను నత డొక పంక్తియైన వ్రాయ డయ్యెను. అతడు వ్రాయవలసివచ్చినచో కోర్టు రీడరును వ్రాయ మనెడివాడు. మేము చిన్న చిన్న దరఖాస్తులను పెట్టితిమి. అతడు మేము చూచుచుండగా వాటిమీద నెట్టి యార్డరులను వేయలేదు. అతడు వాటినట్లేయుంచి మరునాడు వాటిమీద మరియొకరిచే సముజాయిషీ వ్రాయించి పట్టుకొని వచ్చెడివాడు. మే మిదివరలో వాదించుకొనెడివారము కాము; అసహాయోద్యమరోజులలో వాద నను మానివేయుటచే వాదించుకొనుట తప్పుగా కాన్పించెను. కాని నేను జరిగిన సంగతులను తెలుపుచు నొక పెద్ద స్టేటుమెంటు, నాభా పద్ధతులను గురించి నా స్వంత యభిప్రాయములను వ్రాసియిచ్చితిని.

మా కేసు చాల చిన్నవిషయమైనను రోజులు గతించిపోవు చుండెను. అకస్మాత్తుగా నొక మార్పు కలిగెను. ఒక మధ్యా హ్నము కోర్టు ముగిసిన తరువాత మమ్మచ్చటనే యుంచి సాయం కాలము యేడుగంటలకు మమ్మొక గదిలోనికి తీసికొనిపోయిరి. అచ్చట నొక బల్లదగ్గర నొక మనిషి కూర్చొనెను; మరికొందరు సమీపములో నుండిరి. మమ్ము జయితోలో నరెస్టుచేసిన పోలీసు ఉద్యోగి లేచి యొక స్టేటుమెంటు యిచ్చుచుండెను. మే మెచ్చట నుంటిమి ? ఏమి జరుగుచున్నది ? అని నే నడిగితిని. అది కోర్టు గది యనియు కుట్రనేరముకు మేము విచారింపబడుచున్నామనియు నాకు బదులుచెప్పిరి. ఇంతవరకు నాభా సరిహద్దులనుదాటి యాజ్ఞోల్లంఘ నము చేసినందుకు విచారింపబడితిమి. ఇది వేరు కేసు. మొదటి కేసులో నారుమాసములకంటె నెక్కువ శిక్షకు వీలులేకపోవుటచే నది చాలదని మరియొక నేరము కనిపెట్టుచుండిరి. కుట్రనేరముకు ముగ్గురు చాలరు. కనుక మాతో నెట్టి సంబంధములేని మరియొకని

నరెస్టుచేసి విచారణకు తెచ్చిరి. ఈ దురదృష్టవంతు డొక సిక్కు—మతస్థుడు. ఇతనిని మే మెరుగము. కాని మేము జయిల్కు వెళ్ళినప్పుడితనిని పొలములలో చూచితిమి.

కుట్రనేరము నింత నిర్లక్ష్యముగ విచారణచేయ ప్రారంభించుట లాయరునైన నా కాశ్చర్యము కలిగించెను. కేసు పూర్తిగా నబద్ధపు కేసు. ఏమైనను మర్యాదకైన కొంత తతంగముండవలెను. జడ్జితో మేము మా కేవిధమైన నోటీసులేదనియు, మేము వాదించుట కేర్పాట్లు చేసికొనియుందుమనియు చెప్పితిమి. ఇట్లు చెప్పినను యతనికి చీమకుట్టినట్లయిన లేకుండెను. అది నాభాపద్ధతి! మా కొక లాయరు కావలెనని నేను సూచించితిని. నాభాచట్టముల ప్రకారము దీనికి వీలులేదని యతడనెను. నాభాపద్ధతులు మాకు మరింత యర్థమగుచుండెను. కొంత విసుగుదలతో మేము విచారణలో పాల్గొనమనియు తన యిష్టమువచ్చినట్లు చేయవచ్చుననియు జడ్జితో చెప్పితిమి. కాని నేను వీనిని పూర్తిగా పాలింపజాలకపోతిని. మమ్ము గురించి చెప్పు పచ్చికల్లలను విని యూరుకొనలేక నప్పుడప్పుడు సాక్షులను గురించి మా యభిప్రాయము క్లుప్తముగ విషయముకు సంబంధించి వెలిబుచ్చెడివాడను. జరిగిన విషయములను గురించి వ్రాతమూలకముగా మేమొక స్టేటుమెంటు కూడ యిచ్చితిమి. ఈ రెండవ జడ్జి మొదటివానికంటె చదువుకొన్నవాడు, తెలివైనవాడు.

ఈ రెండు కేసులు నీ విధముగా సాగుచుండెను. మేము ప్రతిదినము కోర్టు కెప్పుడు వెడుదుమాయని, జయిలు దుర్గంధమైనను తప్పునని చూచుచుండెడివారము. ఈలోగా నా పరిపాలకుని తరపున జయిలు సూపరింటెండెంటు వచ్చి మేము నాభా వీడిపోయెదమని వ్రాతమూలకముగా క్షమార్పణ యిచ్చినచో మాపై కేసులు తగ్గింపబడునని చెప్పెను. మేము క్షమార్పణ చెప్పుకొనవలసినదేదియు లేదనియు మా కాయనయే క్షమార్పణ నీయవలసియున్నదనియు మే మేమియు వ్రాసి యిచ్చువారము కామనియు చెప్పితిమి. మా అరెస్టు జరిగిన పదిహేను రోజులకు రెండు విచారణలు పూర్తియయ్యెను. ఈ

కాలమంతయు మేము వాదింపనే లేదు. కనుక నిది ప్రాసిక్యూషను సాక్ష్యముకే పట్టెను. చాలకాలము, మధ్యమధ్య ఆపివేయుటతో సరిపోయెను. ఏమాత్రము సందేహమువచ్చినను వాయిదావేయుట లేదా, ఈ రంగము వెనుకనున్న యధికారితో బహుశః - ఇంగ్లీషు పరిపాలకునితో - సంప్రదింపులతో సరిపోయెను. ప్రాసిక్యూషను పూర్తి యైనతరువాత చివరరోజున మేము మా స్టేటుమెంటులను వ్రాసి యిచ్చితిమి. మొదటికోర్టు లేచి కొద్దికాలములోనే తిరిగివచ్చి ఉర్దూలో వ్రాయబడిన పెద్ద జడ్జిమెంటు కట్టను తీసికొనివచ్చెను. ఈ పెద్ద జడ్జిమెంటు ఆ స్వల్పకాలములో వ్రాయబడజాలదు. మా స్టేటు మెంటుల నీయకపూర్వమే యది తయారుచేయబడెను. జడ్జిమెంటు చదువలేదు. నాభారాష్ట్రమును వీడ నిరాకరించినందు కారునెలలు వడ్డింపబడెనని ముక్తసరిగా చెప్పిరి. కుట్రకేసులోకూడ ఆ రోజుననే పదునెనిమిదిమాసములో లేక రెండేండ్లో విధించిరి. మొత్తముమీద మాకు రెండేండ్లో లేక రెండున్నరయేండ్లో విధింపబడెను.

మా విచారణకాలమంతట భారతసంస్థానపరిపాలన లేక భారత సంస్థానములోని బ్రిటిషుపరిపాలనలోని యదార్థములనుగురించి కొంత వరకు ప్రకటించు ననేక చిత్రవిచిత్ర సంగతులు జరిగెను. ఆ విధాన మంతయు నొక నాటకము కనుకనే కోర్టులోనికి పత్రికాప్రతినిధులను యితరులను రానీయలేదు. పోలీసులు వారి యిష్టమువచ్చినట్లు చరించెడివారు. వారు తఱచు మేజిస్ట్రేటును లేక జడ్జిని నిర్లక్ష్యము చేయుటేగాక నతనియాజ్ఞల నుల్లంఘించెడివారు. పాపమా మేజిస్ట్రేటు దీనిని నోరెత్తకుండ సహించెను. కాని నే మేల సహింపవలెను? చాలసార్లు నేను లేచి పోలీసు లుచితముగా ప్రవర్తింపవలెనని, మేజిస్ట్రేటు ఆజ్ఞలను శిరసావహింపవలసియుండునని గట్టిగా చెప్పవలసి వచ్చెను. ఒక్కొక్కప్పుడు పోలీసు లమర్యాదగా కాగితములను లాగివేయుచుండగా మేజిస్ట్రేటు యేమియు చేయలేక తెల్లబోయి చూచుచుండ, తనకోర్టులో తానే క్రమమును నిలుపుకొనలేక పోవుటచే, నతని పనిని మేము చేయవలసివచ్చెడిది! పాప మా

మేజిస్ట్రేటుస్థితి చాల విచారకరముగ నుండెను. అతడొకవంక పోలీసులకు భయపడుచుండెను. మరియొకవంక మమ్ముచూచే భయపడుచుండెను. ఏలనన, మా అరెస్టులనుగురించి వార్తాపత్రికలు గగ్గోలు చేసెను. కొంచెమించుమించు ప్రధాన కాంగ్రెసునాయకులలో నెన్నబడు మాబోంట్లగతి యిట్లున్నపు డిక సామాన్యులగతి యెట్లుండును?

ఈ స్వదేశ సంస్థానముల సంగతి మా తండ్రికి తెలియును. కనుక నతడీ యనుకొనని నిర్బంధమున కుద్రేకపడెను. మేము నిర్బంధింపబడిన సంగతి మాత్రమే తెలిసెను. కాని తక్కిన వివరములేమియు పత్రికలలో పడలేదు. అతడావేడిలో వైస్రాయికి నా వార్త తెలియుటలేదని తంతి నిచ్చెను. నాభాలో నన్నతడు చూచుటకు వీలులేదనిరి. చివరకు జయిలులో చూడవచ్చుననిరి. నేను వాదించుకొనుటలేదు. కనుక నతడు మాకు చేయునదేమియు లేకపోవుటచే నే నతనిని వెళ్లిపోవలసినదని బ్రతిమాలితిని. అతడు కపిలదేవ మాలవ్యాను, ఒక మంచివకీలును స్థితిగతులను పరీక్షించుచుండవలసినదని నియమించి వెడలిపోయెను. నాభాకోర్టుల కొద్ది యనుభవమువలన కపిలదేవుని న్యాయజ్ఞానమెంతయో యభివృద్ధియై యుండవలెను. పోలీసు లతనిచేతిలోనున్న కొన్ని కాగితములను బహిరంగముగా కోర్టులో లాగికొన యత్నించిరి.

కొంచెమించుమించు భారతసంస్థానము లన్నియు వెనుకపడి యున్నట్లు జగద్విఖ్యాతమే. అవి సమర్థత, యుదారత లేని వ్యక్తిగత నిరంకుశత్వములు. ప్రపంచమునకెప్పుడు తెలియరాని వింతలెన్నియో యచ్చట జరుగుచుండును. అయినను వారియసమర్థతయే కొన్నివిధముల దుర్మార్గమును తగ్గించి ప్రజలదుఃఖభారమును కొంతవరకు తేలికపరచును. ఏలనన ఈ యసమర్థతయే కార్యనిర్వహణములో గూడనుండుటచే నిరంకుశత్వము, అన్యాయముకూడ నంతశక్తివంతములుగానుండవు. అంతమాత్రముచే నిరంకుశత్వము సహ్యము కానేరదు. కాని యది యంత ప్రబలదు; విస్తరించదు! భారతసంస్థానము ప్రత్యేకు బ్రిటిషుప్రభుత్వాధికారము క్రిందకే వచ్చినయెడల నీ కాస్త

లాభముకూడా పోవును. రాజ్యాధికారము లెప్పటివలెనే యుండును. నిరంకుశత్వము చెక్కుచెదరదు. పాతచట్టములు పాతవిధానములు పనిచేయుచునే యుండును. వ్యక్తిస్వేచ్ఛ, సభలను జరుపుకొను స్వేచ్ఛ, అభిప్రాయములను వెలిబుచ్చు స్వేచ్ఛ — ఈ యన్నిటిమీద నిర్బంధములన్నియు మామూలుగనే యుండును. ఒక్కమార్పుమాత్రమే చేయబడును. ఈమార్పుతోనే రంగమంతయు మారిపోవుచున్నది. కార్యనిర్వహణము బలీయమై పటుత్వముగా పని చేయుటచే దుర్బలత్వముచే సడలియున్న పైపాశములన్నియు నొక్కసారి బిగియును. కొంతకాలమయినతరువాత బ్రిటిషుపాలన కొన్ని పాత యాచారములను, పద్ధతులను మార్చవచ్చును. మార్చెదరు. ఏలనన యట్టివి పటుత్వమైన పరిపాలనకు, వర్తకప్రాబల్యముకు నడ్డంకులు. కాని మొట్టమొదటమాత్రము వారు ప్రజలను లొంగదీసుకొనుటకు వాటి నుపయోగించుకొనెదరు. ప్రజలిప్పుడు సామంతరాజ్యములకు నిరంకుశత్వమునకుతోడు వాటి నతికఠినముగా నమలుపరుపగల కార్యనిర్వాహక వర్గమునుకూడ సహింపవలెను.

నాభాలో నేను కొంతవరకు దీనిని చూడగలిగితిని. ఈ సంస్థాన మొక బ్రిటిషు పరిపాలకునిక్రింద నుండెను. ఒక్క భారత ప్రభుత్వముకు తప్ప నత డెవరికి జవాబు చెప్పనక్కరలేని నిరంకుశుడు. అయినను మాకతిసామాన్య హక్కులనుకూడ తిరస్కరించి, మాటిమాటికి నాభాచట్టములక్రింద విధానముక్రింద నది యుక్తమే యని చెప్పుచుండిరి. మే మీ విధముగ నాధునిక నిరంకుశయంత్రము యొక్కయు, సంస్థాన ప్రభుత్వముయొక్కయు, ఫాక నెదుర్కొనవలసి వచ్చెను. మా కారెంటివలన కలుగవలసిన లాభములు శూన్యమగుచు నష్టములుమాత్రమే సంక్రమించెను. ఈ విధముగా మా విచారణ పూర్తియయి మేము శిక్షింపబడితిమి. ఓర్పులో నేమున్నదో మాకు తెలియదు. కాని దీర్ఘశిక్షయను గట్టివిషయము నాకు కొంత శాంతినిచ్చెను. మేము జడ్జిమెంటునకళ్ళ నడుగగా దరఖాస్తు పెట్టుకోవలెననిరి,

ఆ సాయంకాలమే సూపరింటెండెంటు జయిలుకువచ్చి నాభా పరిపాలకుడు క్రిమినలు ప్రొసీజరుకోడ్ క్రింద మా శిక్షల నాపివేసిన ట్లొక ఆర్డరు చూపించెను. ఎట్టిషరతును కోరబడలేదు. కనుక ఆర్డరు ప్రకారము మా శిక్షలాఖరయ్యెను. ఆ పరిపాలకుడే యిచ్చిన మరి యొక ఆర్డరుప్రకారము మేము నాభా వీడిపోయి ప్రత్యేక యనుజ్ఞ లేనిదే తిరిగి రాకూడదనిరి. నేనీ రెండు ఆర్డర్ల నకళ్ళను అడుగగా నిచ్చుటకు వీలులేదనిరి. మమ్మప్పుడు స్టేషనుకు తీసికొనివెళ్లి యచ్చట విడిచిపెట్టిరి. మేము నాభాలో నెవరిని యెరుగము. రాత్రియగుటచే పట్టణద్వారములన్నియు బంధింపబడెను. అంబాలా కొకబండి పోవు చుండగా మేము దానినెక్కితిమి. అచ్చటనుండి నేను ఢిల్లీకి, నలహా బాదుకుపోతిని. ఆ రెండు ఆర్డరులను, రెండుజడ్జిమెంటులను పంపించ వలసినదని అలహాబాదునుండి నే నా పరిపాలకునకు వ్రాసితిని. అతడు వాటిని పంపుటకు వీలులేదనెను. నేను అపీలు చేయవలసియుండుననని చెప్పిననుకూడ నతడు పెడచెవినిబెట్టెను. ఈ శిక్షలింకను నా మీద నట్లేయుండి నాభాప్రభుత్వముకాని బ్రిటిషుప్రభుత్వముకాని తలచు కొనినపుడు పైకి వచ్చినను రావచ్చును.

మేము ముగ్గురము విడువబడితిమి. కుట్రకేసులో మాతో గుదిగుచ్చబడిన యానాల్గవ సిక్కుముద్దాయిగతి యేమయ్యెనో నా కిప్పటికి తెలియలేదు. బహుశః అతనిని విడిచియుండరు. అతనికి పలుకుబడిగల స్నేహితులు, ప్రజాందోళన లేకపోవుటచే సామాన్యు లందరివలెనే యతడు సంస్థానకారాగారవిస్మృతిలో మునిగిపోయెను. నే మతనిని మరచిపోలేదు. మేము చేయగలిగినది చేసితిమి; కాని యది ఎంతయోలేదు. గురుద్వారకమిటీవా రతని కేసులోకూడ శ్రద్ధతీసికొనిరనియే నా విశ్వాసము. అతడు 'కొమగటమారు' లోని వారిలో నొకడనియు చాలాకాలము జయిల్లోనుండి యంత్రకితమే వచ్చెననియు మేము వింటిమి. అట్టివానిని పోలీసులెట్లు విడిచిపెట్టి యూరుకొనగలరు? కనుక వారతనిని మాపై జమాయించబడిన కేసులో కుక్కిరి; మేము ముగ్గురము నాభా జయిలునుండి మాతో

మైఘనుక్రిమిని మూటగట్టుకొని వచ్చితిమి. నేను మూడు నాలుగు వారములు మంచము పట్టితిని. తక్కినవారిద్దరు చాలకాలమునకు తీవ్ర జ్వరబాధితులైరి.

ఈ నాభాకథకు మరియొక పిల్లకథకూడ కలదు. గిద్వానీ కాంగ్రెసు ప్రతినిధిగా నమృతసరములోనుండిన సిక్కుగురుద్వార కమిటీతో సంబంధము కలిగియుండెను. కమిటీవారు 500 మందిగల యొక ప్రత్యేకజాతాను జయితోకు పంపిరి. వారితో గిద్వానీ ప్రేక్షకుడుగా వెళ్ళెను. అతడు నాభారాష్ట్రములోనికి ప్రవేశించు నుద్దేశ్యముతో వెళ్ళలేదు. నాభాసరిహద్దు పోలీసులు జాతాపై తుపాకులను పేల్చుటచే ననేకమంది గాయపడిరి. కొంతమంది చనిపోయిరి. దెబ్బలు తినినవారికి సహాయముచేయుటకు గిద్వానీ వెళ్ళగా పోలీసులతనిపై బడి యతనిని తీసికొనిపోయిరి. అతనిపై కోర్టులో నెట్టిచర్యయు తీసికొనబడలేదు. అతని నొక సంవత్సరమువరకు జయిలులోనుంచి యారోగ్యమంతయు పూర్తిగా చెడినతరువాత విడిచిపెట్టిరి.

గిద్వానీ నరెస్టుచేసి యంతకాలముంచుట కార్యనిర్వాహకాధికారమును కేవలము దుర్వినియోగపరచుటగా నాకు దోచెను. నేను పరిపాలకునికి వ్రాసి గిద్వానీ నక్లైల నిరోధించిరని యడిగితిని. అనుజ్ఞలేనిదే నాభారాష్ట్రమును ప్రవేశింపరాదను ఆర్డరు నుల్లంఘించుటచే నతడు నిర్బంధింపబడెనని యతడు వ్రాసెను. నేనిది న్యాయవిరుద్ధమని సవాలుచేసి, దెబ్బలు తినినవారికి సహాయము చేయువానిని నిర్బంధించుట యుచితము గాదనియు, వారి ఆర్డరును నాకు పంపుటకుగాని, ప్రకటించుటగాని చేయవలెననియు కోరితిని. అత డందులకు నిరాకరించెను. నేను నాభా వెళ్ళవలెననుకొంటిని. మిత్రధర్మమిదియేయని నే ననుకొంటిని. కాని చాలమంది స్నేహితుల సలహాపైనుక నేను శరణుగొని దుర్బలత్వమును దాచుకొనుటకు వానినొక వ్యాజముగా నుపయోగించితిని. నాభాజయిలుకు తిరిగిపోవుట కిష్టము లేకపోవుట చేతను, దుర్బలత్వముచేతను నే నాగిపోతిని. స్నేహితుని యీ విధముగా విడుచుట నాకెప్పుడును లజ్జాస్పదముగనుండెను. తఱచు మన మందరము పరాక్రమముకంటె వివేకమునే యెక్కువగ గణింతుము,

17

కాకినాద - మహమ్మదాలీ

1923 డిసెంబరులో కాంగ్రెసు కాకినాడలో జరిగెను. దానికి మహమ్మదాలీ యధ్యక్షుడు. అతడు దీర్ఘోపన్యాసము నిచ్చెను. అది చదువతగినది. అతడు మహమ్మదీయులలోని రాజకీయ భావాభివృద్ధిని, కులతత్త్వభావాభివృద్ధిని వివరించి, 1908 లో ఆగాఖాను యాధిపత్యమున వైస్రాయివద్దకు వెళ్ళిన ముస్లిం రాయబారము ప్రభుత్వముచేతనే నడుపబడెనని చూపించెను.

నా కిష్టములేకపోయినను, అతని యధ్యక్షకాలములో కార్యదర్శిగా నుండవలసినదని మహమ్మదాలీ నన్ను ప్రోత్సహించెను. భవిష్యద్విధానము నాకు స్పష్టముగా లేనపుడు కార్యనిర్వాహక బాధ్యత వహించుట నాకిష్టములేకుండెను. కాని నేనతనిని నిరాకరింపజాలకపోతిని. మరియొక కార్యదర్శి క్రొత్తయధ్యక్షునితో నావలె సామరస్యముగ పనిచేయజాలక పోవచ్చునని మేమిరువుర మనుకొంటిమి. అతనికి గాఢమైన 'ఇష్టానిష్టములు' కలవు. అదృష్టవశాత్తు అతని 'ఇష్టములు' నావియు నొక్కటియే యయ్యెను. మమ్ము ప్రేమపాశము పరస్పర గౌరవాతిశయము బంధించెను. అతడు గాఢమతాభినివేశము కలవాడు. నేను కాను. కాని యతని విశ్వాసము, నపరిమితశక్తి, కుశాగ్రబుద్ధి నన్నాకర్షించెను. అతనిలో మంచిహాస్యమున్నది కాని యొక్కొక్కప్పు డతని వేళాకోళము బాధ కలిగించుచుండుటచే చాలమంది స్నేహితుల నతడు పోగొట్టుకొనెను. ఫలితమెట్టిదైనను నతడు తెలివిమైన యాక్షేపణను దాచుకొనజాలడు.

మాకు స్వల్ప భేదాభిప్రాయములున్నను మేమా వత్సరము బాగుగనే గడపితిమి. అఖిలభారత కాంగ్రెసుకమిటీ ఆఫీసులో నేనొక మార్పు తెచ్చితిని. అందు సభ్యులపేర్ల చివరనో మొదటనో మహాత్మా, మౌలానా, పండిత్, షేక్, సయ్యద్, మున్షి, మౌల్వీ,

శ్రీయుత, శ్రీ, మిస్టర్, ఎస్క్వైరు అను బిరుదులు గౌరవపదము లెన్నియో యుండెడివి. వీటిని నేను తీసివేసితిని. మహమ్మదాలీ నాకొక క్రోధపూరిత తంతిపంపి నేను మామూలుపద్ధతి మార్చరాదని ముఖ్యముగా గాంధీజీ నెప్పుడు మహాత్మయనియే పిలువవలెనని 'ప్రెసిడెంటు' హోదాతో నాజ్ఞాపించెను.

'సర్వశక్తివంతుడు' అను మరియొక విషయమును గురించి తఱచు మాకు వాదము పడుచుండెడిది. కాంగ్రెసు తీర్మానములలో కూడ ప్రార్థన పేరిటనో కృతజ్ఞతను తెలుపుటకో మహమ్మదాలీ భగవంతుని పేరు తెచ్చుచుండెడివాడు. నే నది కూడదనెడివాడను. నేను మతహీనుడనని యతడనెడివాడు. కాని పైకట్లు ప్రవర్తించుచున్నను నేను యదార్థ మతస్వభావము కలవాడనని యతడు తరువాత చెప్పుచుండెడివాడు. అతని స్టేటుమెంటులో నెంతయో సత్యము కలదని నే నాశ్చర్యపడెడివాడను. అది బహుశః మతము, మత విషయము అనువాటి యర్థముపై నాధారపడియుండును.

మతచర్చ మమ్మిద్దరను రెచ్చగొట్టుననియు, నే నతనికి కష్టము కల్గింపవచ్చుననియు నతనితో వాదించెడివాడను కాను. ఏ సిద్ధాంతమునైన గట్టిగా నమ్మినవారితో వాదించుట చాల కష్టమైన విషయము. చాలమంది మహమ్మదీయులతో దీనిని వాదించుట మరింతకష్టము. వారిమార్గము ముక్కుకు సూటియైన సూచీముఖమార్గము. విశ్వాసి కుడియెడమలకు తప్పరాదు. హిందువులలో నట్లుకాదు. ఆచరణలో వారు చాల సనాతనులుగ నుండవచ్చును. కాలవిరుద్ధములైన, ఉపద్రవకరమైన, వినాశకరమైన యాచారముల ననుష్ఠింపవచ్చును, అనుష్ఠించుచున్నారు. అయినను సాధారణముగా వారు మతమును గురించి యెట్టి నూతన భావములనైన చర్చించుటకు సంసిద్ధులు. ఆధునిక ఆర్యసమాజికులలో నీ విశాలత లేదని నా యభిప్రాయము. మహమ్మదీయులవలెనే వారును, ముక్కుకు సూటియైన తమ స్వంత సూచీముఖ మార్గమునే యవలంబింతురు. బుద్ధిమంతులైన హిందువులలో కొంతవేదాంత సంప్రదాయ ముండుటచే నది

మతసమస్యను శాస్త్రరీత్యా చర్చించుట కవకాశము నిచ్చుచున్నది. హిందూసంఘములోనికి వచ్చుపరస్పరాచార, అభిప్రాయ భేదములే కొంత దీనికి కారణమని నా యభిప్రాయము. హిందూమతము మతమే కాదనికూడ తఱచు చెప్పబడుచుండెను. అయినను దానిలో నెంతటి యద్భుతమైన పట్టుదల, జిగి కలదు! ఎన్నియుగాంతరములనైన దాటి జీవింపగల యెంతటి యద్భుతశక్తికలదు! చార్వాకునివలె నిరీశ్వర వాదియైన వానినికూడ హిందువుకాడని యనుట కెవరును సాహసింపరు. హిందూమతము తనబిడ్డల నాశ్లేషించి యుండును. నేను బ్రాహ్మణుడను కనుక మతమునుగురించి సాంఘికాచారములను గురించి నేనేమి చెప్పిన నేమి యాచరించిననుకూడ బ్రాహ్మణుడనే. భారత ప్రపంచముకు నేను 'పండిత' యిత్యాదినే యగుదును. ఒక సారి స్విడ్జర్లండులో నేనొక తురుష్క పండితుని కలుసుకొంటిని. నన్నతనికి ముందుగ పరిచయపరచు నుత్తరములో పండిత జవహర్లాలు నెహ్రూ' అని యుండెను. నన్ను చూచుటతోడనే యతనికి కొంత యాశ్చర్యము, నాశాభంగము కలిగించెను. 'పండిత' యను శబ్దమువలన నతడొక వయసుమీరిన వృద్ధపండిత శ్రేష్ఠుని చూడబోవుచున్నట్లు భావించెనని నాతో చెప్పెను.

కనుక నేను మహమ్మదాలీ మతమును గురించి చర్చింపలేదు. కాని యతడూరకొను స్వభావము కలవాడుకాడు. నేనతనిని ఢిల్లీలో చూడబోయినపుడు నన్ను మతమునుగురించి చర్చింప నిర్బంధించెను. 'నేను మతపిచ్చకలవాడనని నీ వనుకొందువు. నే నట్టివాడను కానని రుజువుచేసెదను' అని యతడనెను. మతమునుగురించి యతడు చాల పుస్తకములు నతిశ్రద్ధతో చదివినట్లు చెప్పి యనేకమతపుస్తకముల బీరువాలను చూపించెను. తన యధ్యయన ఫలితముగా కొరానులో నున్నదంతయు నూటికి తొంబదియేడువంతులు పూర్తిగా హేతుబద్ధమైనదని కనుగొనెననియు కొరానుతో సంబంధము లేకుండగనే దీనిని రుజువు చేయవచ్చుననియు నతడు నాతో చెప్పెను. తక్కిన మూడువంతులు నతనిహేతువు కంగీకృతము కాకపోయెను.

కాని తొంబదియేడుపాళ్ళు హేతుబద్ధముగనే యున్న కొరాను తక్కిన మూడుపాళ్ళుకూడ యుక్తముగనే యుండి యతని హేతుజ్ఞానమేతప్పు కాగూడదా ? చివర కత డా తీర్మానమునకే వచ్చి కొరానును నూటికి నూరుపాళ్ళు అంగీకరించెను.

ఇందలి తర్క మంత తేలికయైనదికాదు. అయినను నేను వాదింపదలచుకొనలేదు. కాని తరువాత కథ నిజముగా నాకాశ్చర్యము కలిగించెను. తెలిసికొనవలెననెడి విశాలబుద్ధితో నెవరైన కొరాను చదివినచో దానిసత్యము నొప్పుకొనక తప్పదని తాను రూఢిగా చెప్పగలనని యతడనెను. బాపు (గాంధీజీ) దానిని శ్రద్ధగా చదివెననియు ఇస్లాంయొక్క సత్యము నతడు గ్రహించియుండక తప్పదనియు నభిమానముచేతనే దానినతడు ప్రకటించుటలేదనియు నతడు నాతో చెప్పెను. ఈ వత్సరమైత్రి గడచినతరువాత మహమ్మదాలీ కాంగ్రెసునుండి మెల్లగా జారిపోవ నారంభించెను. లేక నతడట్లు కాంగ్రెసే అతనినుండి జారిపోయెను. ఈ విధానము కొంత నెమ్మదిగనే జరుగుటచే నతడు చాలవత్సరములు కాంగ్రెసుకు హాజరయి దాని కమిటీమీటింగులలో ప్రధానపాత్ర వహించుచుండెను. కాని; నానాటికి చీలిక పెద్దదగుచు మార్గములు భేదించుచుండెను. దీనికే ప్రత్యేకవ్యక్తి, వ్యక్తులు బాధ్యులుకారు. దేశములోనున్న కొన్ని పరిస్థితులే దీనికి కారణము. కాని యీఫలితము చాల దురదృష్టమైనది. అది మా కందరకు బాధగనేయుండెను. ఏలన, సాంఘిక సమస్యలను గురించి యెట్టి యభిప్రాయ భేదములున్నను, రాజకీయములలో నెట్టి భేదాభిప్రాయము లేదు. భారత స్వాతంత్ర్యమున కతడు దోసిలొగ్గెను. ఈ సమాన రాజకీయదృష్టియుండుటచే సాంఘికముగగూడ మా కతనితో పరస్పరాంగీకృత సమాధానము కుదిరెడిది. సాంఘిక ప్రయోజన సాధకులమని నటించు యభివృద్ధి వ్యతిరేకులకు నితనికి రాజకీయసామ్య మేమియు లేదు.

1928 వేసవిలో నతడు యూరపు వెళ్ళుట హిందూదేశ దురదృష్టము. సాంఘిక సమస్యను పరిష్కరించుటకపుడు గొప్పప్రయత్నము

జరిగి కొంచెమించుమించు విజయవంత మగుచుండెను. అప్పుడిచ్చట మహమ్మదాలీ యున్నచో పరిస్థితులు మరొకవిధముగ నుండెడివి. అతడు తిరిగివచ్చుసరి కంతయు భిన్నమగుటచే నతడు రెండవ పక్ష మునజేరెను. 1930 లో శాసనోల్లంఘన మతితీవ్రముగా నున్నసమయ మున వేలకొలది జనులు జయిలులో నుండగా మహమ్మదాలీ కాంగ్రెసు తీర్మానమును నిర్లక్ష్యముచేసి రౌండు టేబిలు సభకు హాజ రయ్యెను. అది నాకు బాధకలిగించెను. అది యతనిహృదయములో నతనికే యసుఖముగా నున్నట్లు లండనులోని యతని చర్యలవలన ద్యోతకమగుచుండెను. తన యదార్థస్థానము హిందూదేశ పోరాట ములో నున్నట్లతడు భావించెను. హిందూదేశము తిరిగి వచ్చియుండి నచో నతడు పోరాటములో కురికెడివాడని నా నమ్మకము. చాల వత్సరములనుండి వ్యాధి యతనిని బాధించుచుండెను. తగినంత విశ్రాంతి ఔషధసేవ చేయవలసియుండగా నమోఘఫలితమును సాధించవలెననెడి విచారమే యతని మృత్యువుకు కారణమయ్యెను. నైనీజయిలులో నాకతనిమృత్యువార్త యశనిపాతమువలె వినవచ్చెను.

1929 లాహోరు కాంగ్రెసులో నే నతనిని కడసారి కలుసు కొంటిని. అతడు నా యధ్యక్షోపన్యాసములో కొన్ని భాగములతో తృప్తిచెందక తీవ్రముగా విమర్శించెను. కాంగ్రెసు చాల ముందుకు పోవుచున్నట్లు, రాజకీయముగా ముందంజవేయుచున్నట్లు నతడు కనుగొనెను. అతడు స్వయముగా ముందంజవేయు స్వభావము కలవా డగుటచే తాను వెనుకబడి యితరులు ముందుకు పోవుట కిష్టపడ డయ్యెను. “జవహర్, నా భరతవాక్యము వినుము! నీ ప్రస్తుత సహ కారులు నిన్ను విడిచిపెట్టుదురు! మంచి విషమసమయమున వారు నీ విధికి నిన్ను విడిచివేతురు. నీ కాంగ్రెసు మనుష్యులే నిన్నురికంబ ముల కెక్కింతురు” అని యతడు నన్ను గట్టిగా మందలించెను. ఎంతటి నిష్ఫ్కారెడి జ్యోతిషము!

కాకినాడ కాంగ్రెసులో నఖిలభారత సేవాదళ పునాదులు వేయబడెను. అందుకు పూర్వము జయిలుకు పోవుటకు పనిచేయుటకు

తగు సంస్థలు లేకపోలేదు. కాని మంచిశిక్షణ, సంఘీభావము లేకుండెను. కాంగ్రెసుయొక్క సామాన్యాధిపత్యముక్రింద జాతీయసేవచేయు నొక యావద్భారత సుశిక్షితసైన్యము తయారుచేయవలెనని డాక్టరు హార్డికరు భావించెను. అతడు నా తోడ్పాటు కోరుటచే నతిసంతోషముతో నే నందుల కొప్పుకొంటిని. కాకినాడలో నిది ప్రారంభింపబడెను. ఈ సేవాదళమునకే కాంగ్రెసునాయకులనుండి వచ్చిన వ్యతిరేక భావములు మా కాశ్చర్యము గొల్పెను. ఇది కాంగ్రెసులో మిలిటరీశాఖ స్థాపించుటయనియు, నుపద్రవకరమైన తప్పుడుత్రోవ యనియు కొందరనిరి. మిలిటరీశాఖ నాగరికాధికారమును తల్క్రిందులు చేయునేమొ ! పైనుండి వచ్చుయాజ్ఞలను శిరసావహించుటొక్కటే వాలంటీర్లకు కావలసిన శిక్షణయని మరికొంతమంది యనిరి. అంతకు మినహా యిక వాలంటీర్లు అడుగుతో నడుగైన వేయనక్కరలేదు. సుశిక్షితులైన వాలంటీర్లను తయారుచేయవలెననెడి భావము కాంగ్రెసు సిద్ధాంతమైన దౌర్జన్యరాహిత్యమునకు వ్యతిరేకమని కొందరి మనస్సులో నుండెను. ఎట్లైనను హార్డికరు యీ పనికి బూనుకొని యనేకవత్సరముల కృషిద్వారా మన సుశిక్షితులైన వాలంటీర్లు యెక్కువ పటుత్వము దౌర్జన్యరాహిత్యము చూపగలరని ప్రదర్శించెను.

నేను కాకినాడనుంచి తిరిగి వచ్చుటతోటనే 1924 జనవరిలో మరొక చిత్రమైన యనుభవము కలిగెను. నేను కేవలము జ్ఞాపకమును బట్టి వ్రాయుచుండుటచే తేదీలు కలగాపులగము కావచ్చును. అలహాబాదులో గంగాతీరమున కుంభమేళ లేక అర్థ కుంభమేళ జరుగుచుండెను. లక్షలకొలది జనులు త్రివేణి - గంగా, యమునా, సరస్వతి కలియుచోట స్నానముచేయుటకు వత్తురు. గంగాగర్భము సుమారొక మైలుకలదు; కాని శీతకాలములో నది లోపలికి పోవుటచే పెద్ద పెద్ద యిసుక తిప్పలు బయటపడి యాత్రికులకు పాకలు, పందిళ్ళు వేయుటకు చాల వీలుగా నుండును. ఈ గర్భములోనే గంగ తఱచు తన మార్గమును మార్చుకొనుచుండును. 1924 లో గంగాప్రవాహము, త్రివేణిలో యాత్రీకులు స్నానముచేయుట కుపద్రవకరము

గనే యుండెను. ఒకేసారి స్నానముచేయువారిని నియమించి యుప ద్రవమును చాలవరకు తగ్గించవచ్చును.

పర్వదినములలో గంగలో స్నానముచేసి పుణ్యము మూట గట్టుకొనవలెనను నుద్దేశ్యము నా కెప్పుడు లేకపోవుటచే నే నీసమస్యలో నెంతమాత్రము శ్రద్ధతీసికొనలేదు. త్రివేణిలో స్నానము చేయరాదని స్థానికప్రభుత్వము నిషేధించుటచే పండిత మదన మోహన మాలవ్యాకు ప్రభుత్వముకు చర్చ జరుగుచున్నట్లు పత్రికలలో చూచితిని. మతప్రకారము త్రివేణిలో స్నానముచేయవలసి యున్నదని మాలవ్యాజీ దీని కభ్యంతరపెట్టెను. ఉపద్రవములు, జన నష్టము లేకుండచేయుట ప్రభుత్వ ధర్మమేకాని యది తన సహజధోరణిలో నా పనిని చాల కర్రపడివాటముగ నుద్రేకజనకముగ ప్రారంభించెను.

కుంభదినమున నేను ప్రాతఃకాలముననే, స్నానముచేయుటకు గాక, మేలాను చూచుటకు, నదికివెళ్ళి యచట మాలవ్యాజీ స్నానము చేయుట కనుజ్ఞనీయవలసినదని జిల్లామేజిస్ట్రేటుకు మర్యాదగా వ్రాసి పంపెనని తెలిసికొంటిని. మేజస్ట్రేటు అనుజ్ఞను నిరాకరించెను. దాని మీద మాలవ్యాజీ సత్యాగ్రహము చేయుటకు నిశ్చయించి రెండు వందలమందితో త్రివేణికి బయలుదేరెను. దీనిని చూచుటకు నేను నా వేడిలో సత్యాగ్రహజట్టులో చేరితిని. ప్రజలు త్రివేణికి పోకుండ మైదానములో నొక పెద్ద యడ్డంకి కల్పింపబడెను. మే మీ యడ్డంకి దగ్గరకు పోవుసరికి పోలీసులు మమ్మాపివేసి మా దగ్గరున్న నిచ్చెనను లాగికొనిరి. దౌర్జన్యరాహిత్య సత్యాగ్రహులము కనుక మే మచ్చట నిసుకలో శాంతముగా కూర్చుంటిమి. ఇట్లు గంట తరువాత గంట గడచిపోవుచుండెను. భాస్కరు డాకసమున ప్రచండ కిరణములతో వెలుగొందుచుండెను. ఇసుకతిన్నెలు చుఱ్ఱున మండుచుండెను. మా కడుపులు మాడుచుండెను. ఒకవంక పదాతులు, మరియొక వంక గుఱ్ఱపుదళము మమ్ము కాచియుండెను. చివరకు మే మందరము చాల విసిగి యేదో యొకటి చేయవలెననుకొంటిమి. అధికారులుకూడ చాల విసిగి దానిని త్వరితము చేసిరి. గుఱ్ఱపుదళము కాజ్ఞ యిచ్చుట

తోడనే వారు గుఱ్ఱముల నెక్కిరి. వారు మాపైకురికి మమ్ము తరిమి వేయవచ్చుచున్నట్లు నాకు తట్టెను. గుఱ్ఱపుదళముచే తరుమగొట్ట బడుట నా కిష్టములేకుండెను. అంతేకాక నచ్చట కూర్చుండుటతో కూడ మేము విసుగుచెందితిమి. కనుక దగ్గరనున్న వారితో గోడలను దాటిపోవుదమని సూచించి నేను పైకెక్కితిని. వెంటనే పదులు యిరువదులు చొప్పున పైకెక్కిరి. కొంతమంది కట్టిన గెడలను నూడబెరికి దోవచేసిరి. ఎవరో నా కొక జాతీయజెండా యిచ్చిరి. దానిని నేను కూర్చొన్నచోట నొక గెడకు కట్టితిని. నేను కొంచె ముదేశ్రికడి ప్రజలు పైకెక్కుచుండుటను త్రోసుకొని ముందుకు వచ్చుటను, పోలీసులు వారిని త్రోసివేయుచుండుటనుచూచి యానందించుచుంటిని. గుఱ్ఱపుదళము నిరపాయకరముగనే పనిచేసెను. వారు కఱ్ఱలను విసరుచు ప్రజలను వాటితో గెంటుచుండిరి. కాని యెవరికి హానికలుగజేయలేదు.

చివరకు నే నవతలప్రక్కకు దిగి చాల వేడిగా నుండుటచే స్నానముచేయ నిశ్చయించితిని. నేను తిరిగి వచ్చుసరికి మాలవ్యాజీ మొదలగువా రెప్పటివలెనే యచ్చటనే కూర్చొనియుండిరి. కానిగుఱ్ఱపు దళము, పదాతులు కలసి సత్యాగ్రహులకు గోడకు మధ్యనిలచిరి. నేను మరల మాలవ్యాజీవద్దకు వచ్చి కూర్చుంటిని. మరికొంతసేపు మేమట్లు కూర్చుంటిమి. వ్యవహారము స్తంభించెను. మాలవ్యాజీ యాందోళనపడసాగెను. అతడు భావోద్రేకము నణచుకొనుచున్నట్లు కాన్పించెను. హఠాత్తుగా నత డాశ్చర్యముగ పోలీసుల మధ్య నుంచియు గుఱ్ఱములమధ్యనుంచియు దూరివెళ్లెను. అట్లు చేయగలు గుట యాశ్చర్యమే కాని వృద్ధుడై, దుర్బలశరీరుడైన మాలవ్యాజీ యట్లు చేయుట మహాద్భుతవిషయము. మేముకూడ నతని ననుకరించితిమి. మమ్ము వెనుకకు నెట్టివేయుటకు కొంతసేపుయత్నించి పోలీసు లూర కొనిరి. మరికొంతసేపటికి వారువెళ్లిపోయిరి. ప్రభుత్వము మాపై చర్య తీసికొనెదరని మే మూహించితిమి. కాని యట్టిదేదియు జరుగలేదు. బహుశః ప్రభుత్వము మాలవ్యాజీమీద నెట్టిచర్య తీసికొన నిచ్ఛగింప లేదు. కనుక నీ చిన్న చేపకూడ దాటిపోయెను.

18

మా తండ్రి - గాంధీజీ

1924 లో గాంధీజీకి జయిలులో చాల జబ్బుచేసినట్లు శస్త్రము చేసినట్లు హఠాత్తుగా వార్తలే తెంచెను. భారతదేశమంతయు నొక్కసారి విచారసాగరమున మునిగిపోయెను. భయభ్రాంతులమై మేమూపిరి పీల్చుట మాని ముందేమి జరుగునోయని నిరీక్షించుచుంటిమి. కాని గండము దాటెను. తోడనే మూలమూలలనుండి జన ప్రవాహ మతనిని చూచుటకు పూనా బయలుదేరెను. అత డింకను ఆస్పత్రిలో ఖయిదీగ నుండెను. కాని కొంతమంది స్నేహితు లతనిని చూడవచ్చ ననిరి. తండ్రిగారు నేను నతనిని ఆస్పత్రిలో చూచితిమి. అప్పటి కతడు తన యారువత్సరముల శిక్షలో రెండువత్సరముల శిక్ష ననుభవించెను. అతడు వ్యాధినుండి కోల్కొనుచుండుటచే ప్రభుత్వ మతని మిగత శిక్షాకాలమును రద్దుచేసి విడిచివేసిరి. అతడు బొంబాయితీరముననున్న జుహూలో విశ్రాంతి తీసుకొనుటకు వెళ్లెను.

మా కుటుంబముకూడ జుహూ వెళ్లి యచ్చట సముద్రతీరమున ఒక చిన్నకుటీరములో బసచేసెను. మేము కొన్నివారము లచ్చట గడిపితిమి. చాలాకాలమునకు నేను మరల నా కత్యంతప్రీతికరమైన యీత, పరుగెత్తుట, స్వారిచేయుట మొదలగు వినోదములతో సముద్రతీరమున విహరించితిని. కాని మేము వినోదముకొఱ కచ్చటకుపోలేదు. తండ్రిగారు గాంధీజీకి స్వరాజ్యపార్టీవారి స్థితిని తెలిపి, ప్రత్యక్షసహాయము కాకపోయిన నతని యాశీర్వాదమునైన పొంద కోరెను. నన్ను బాధించుచున్న కొన్ని సందేహములను తీర్చుకొనవలెనని నే నాతురతతో నుంటిని. అతనిభవిష్యద్విధాన మెట్లుండునో నేను తెలిసికొన గోరితిని.

జుహూ సంభాషణలు, స్వరాజ్యపక్షముకు సంబంధించినంతవరకు గాంధీజీని జయించుటలోగాని, కొంచెమైన నతనికి నచ్చచెప్పుటలోగాని యెట్టిఫలితము పొందలేదు. ఎంత మిత్రసంభాషణము

యెంతటి మర్యాద ప్రవర్తన యున్నను చివరకు రాజీమాత్రము కుదరలేదు. అట్లు భేదించుటకే యొప్పుకొని వారల్లే ప్రెస్సులకు స్టేటుమెంటుల నిచ్చిరి.

నేనుగూడ కొంచె మాశాభంగముపొంది, జుహూనుండి తిరిగి వచ్చితిని. గాంధీజీ నా సందేహములలో నొక్కదాన్నైనను తీర్చ లేదు. అతడు భవిష్యత్తును చూడ నిరాకరించెను. దూరస్థవ్యాప్తి, గల ప్రోగ్రాము నతడు వేయకుండెను. మే మోర్పుతో ప్రజా 'సేవ' చేయవలెను. కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమమును, సంఘసంస్కార విధానమును ఆచరించి తీవ్రకార్యక్రమముకొరకు వేచియుండవలెను. అట్టి సమయ మేతెంచినను చౌరీచౌరావంటి మరియొక యవాంతర మేదైన వచ్చిన మన యుద్యమ మాగిపోదా? అనునదే యదార్థ సమస్య. దానికి గాంధీజీ యప్పుడేమియు సమాధానము చెప్పలేదు. గమ్యస్థానమునుగురించికూడ నతడు నిర్ధారణ లేకయుండెను. కాంగ్రెసు యధావిధిగా దాని నప్పట్లో ప్రకటింప నవసరము లేక పోయినను, మనస్సులలోనైన మనం దేనినిసాధింపగోరుచున్నామో స్పష్టముగ నుండవలెనని మేము కోరితిమి. మనము స్వాతంత్ర్యమును, కొంత సాంఘికమార్పును కోరుచున్నామా లేక మన నాయకు లంత కంటె చాల తక్కువకే రాజీపడెదరా? కొద్దినెలలకు పూర్వమే నేను మా రాష్ట్ర సభాధ్యక్షోపన్యాసములో స్వాతంత్ర్యమును గురించి నొక్కి చెప్పితిని. నేను నాభానుండి వచ్చినతరువాత 1923 శర త్కాలములో నీ సభ జరిగెను. నేను నాభా జయిలునుండి సంపా దించి తెచ్చిన జ్వరముతో మంచముమీద నుండియే నా యుప న్యాసమును వ్రాసి పంపితిని.

కాంగ్రెసులో స్వాతంత్ర్యసమస్యను గురించి స్పష్టపరుపవలె నని మాలో కొంద రాశించుచుండ, మన లిబరలు మిత్రులు మనల నుండి జారిపోయి సామ్రాజ్యాధికార ప్రతిభావిశేషములో బహిరంగ ముగ నోలలాడుచుండిరి. శాస్త్రిగారు సామ్రాజ్య రాయబారి యయ్యెను. సర్ తేజిబహదూర్ సప్రూ 1923 లో లండనులో జరి

గిన సామ్రాజ్యసభలో "సామ్రాజ్యమునకు సామ్రాజ్యహోదాను కల్పించినది నాదేశమేయని నేను సగర్వముగా నుడువుచున్నాను" అని వ్రువ్వెను. ఈ లిబరలు నాయకులకు మనకు మహోదధి యడ్డ మున్నట్లుండెను. వారి ప్రపంచము వేరు మనప్రపంచము వేరు. వారి భాష వేరు. మన భాష వేరు. మన కలలకు వారి కలలకు సామ్యమే లేదు. ఇట్టిస్థితిలో మన గమ్యస్థానమును గురించి మనము స్పష్టముగ నిర్వివాదముగ నుండనక్కఱలేదా ?

కాని యిట్టియాలోచన లప్పుడు కొద్దిమందికే గలవు. చాల మందికి నిర్ధారణయనిన యిష్టములేకుండెను. ముఖ్యముగా జాతీ యోద్యమములో కొంత యస్పష్టత, రహస్యములుండును. 1924 మొదటి నెలలో ప్రజాదృష్టి యంతయు శాసనసభలలోను అసెంబ్లీల లోనుగల స్వరాజ్యపార్టీవారిపై బడెను. "లోపలనుండి ప్రతిఘటించె దము' శాసనసభలను బ్రద్దలుచేసెదము" అని బడాయికొట్టిన యీ బృందము లేమిచేసియున్నవి? కొన్ని శుభచిహ్నములు కాన్పించెను. అసెంబ్లీ సాంవత్సరిక బడ్జెటు త్రోసివేయబడెను. భారత స్వాతంత్ర్య షరతులనుగురించి నిర్ణయించుటకు రౌండుటేబిలు చర్చ కావలెనను తీర్మానమొకటి చేయబడెను. దేశబంధుదాసు నాయకత్వముక్రింద బెంగాలుశాసనసభలో సప్లయిలతీర్మాన మోడింపబడెను. వైస్రాయి గవర్నరు రెండుబడ్జెటులను ధృవపరచుటచే నవి చట్టములయ్యెను. శాసన సభలలో కొన్ని యుపన్యాసములు, కొంత యుద్రేకము, స్వరాజ్యవాదులలో తాత్కాలిక విజయోత్సాహము, పత్రికలలో పెద్దపెద్ద శీర్షికల మినహా మరేమియులేదు. వారిక నేమిచేయుగలరు ? వారీయెత్తులనే తిరిగితిరిగి వేయగలరు. కాని వానిలోని వింత తగ్గి పోయెను. ఉద్రేకము మాయమయ్యెను. బడ్జెటులను వైస్రాయి లేక గవర్నరులు ధృవపరచుచుండ ప్రజాహృదయము దానికలవాటుపడి పోయెను. తరువాతమెట్టు శాసనసభలలోనున్న స్వరాజ్యవాదుల కతీతమైనది. అది శాసనసభల బయటనే జరుగవలెను,

1924 సంవత్సరముమధ్య అహమ్మదాబాదులో అఖిల భారత కాంగ్రెసు కమిటీ మీటింగు జరిగెను. ఈ సభలో గాంధీజీకి స్వరాజ్య వాదులకు నకస్మాత్తుగా నొక సంఘర్షణ జరిగెను. దీనిని గాంధీజీయే ప్రారంభించెను. అతడు కాంగ్రెసు సభ్యత్వపురూల్సు మార్చివేసి, వోటు అర్హతను మార్చి కాంగ్రెసు చట్టములోనే ప్రధానమార్పు చేసెను. ఇంతవరకు కాంగ్రెసు చట్టముయొక్క ప్రధాన సూత్రము నంగీకరించి నాలుగణాలు చెల్లించినవాడు సభ్యుడుకావచ్చును. నాలుగణాలకు బదులు తాను స్వంతముగా వడికిన వడుకునూలు నీయవలెనను షరతును పెట్టవలెనని యతడు చూచెను. వోటుహక్కు నిది చాల సంకుచితపరచుచున్నది. కనుక అ. భా. కాం. కమిటీ దీనిని చేయజాలదు. తన కభ్యంతరముగా కాన్పించినపుడు గాంధీజీ యెప్పుడు చట్టములలోనుండు శబ్దములను లెక్కచేయడు. మన చట్టము నిది భంగపరచుచున్నదని నే ననుకొని నా కార్యదర్శి పదవికి రాజీనామా యిచ్చితిని. కాని మరికొన్ని కారణములచే నేను దాని నుపసంహరించుకొంటిని. అ. భా. కాం. కమిటీలో నీ తీర్మానమును మా తండ్రి, దాసుగారు తీవ్రముగా నెదిరించి తమ యసమ్మతిని తెలుపుటకు వోటింగుముందు తమ యనుచరులతో సభనుండి బయటకు వెళ్ళిపోయిరి. అప్పుడుకూడ తీర్మానము నెదిరించు వారు కొందరు సభలోనే యుండిరి. తీర్మానము నధిక సంఖ్యాకు లామోదించిరి. కాని చివరకది తగ్గించుకొనబడెను. స్వరాజ్యవాదులు వెళ్ళిపోవుటచేతను, మా తండ్రి, దాసుగారు, యీ విషయములో నెంతమాత్రము సడలకపోవుటచేతను గాంధీజీ చాల బాధపడెను.

ఆ తీర్మానము తీవ్రముగా నెదిరింపబడునని తెలిసియు నతడు వడుకునూలు వోటింగు అర్హతనే యంతగా నేల సమర్థించెనో నా కర్థముకాలేదు. బహుశ కాంగ్రెసులో తన ఖాదీ నిర్మాణ కార్యక్రమమునందు నమ్మకముకలవారిని మాత్రమే యుంచి తక్కినవారిని తరిమివేయవలెనని, లేదా దాని కంగీకరించుచున్నట్లు చేయవలెనని యత డనుకొనెను. అధిక సంఖ్యాకు లతనిపక్షముననే యున్నను తన

పట్టుదల తగ్గించుకొని యతడితరులతో రాజీపడెను. ఈ సమస్య సందర్భములో నతడు తరువాత మూడు నాలుగు మాసములలో ననేకసార్లు మారెను. అతడు నే నెక్కడనుంటిని? నే నెచ్చటకు పోవలెను? అను స్థితిలోనుండెను. అతని కట్టిస్థితి యెన్నడు నుండదని నే ననుకొనుటచేతనే నాకది యాశ్చర్యము కలిగించెను. ఆ సమస్య యంత గొప్పదికాదు. పనిచేయుట వోటింగు అర్హతగ నుండవలె నను భావము చాల యవసరమే. కాని దాని కా సంకుచితరూపము నిచ్చుటచే దానియర్థము కొంత తగ్గెను.

అపరిచిత విషయములలో నడుచుటచే గాంధీజీకి కష్టములు కలిగెనని నేను నిశ్చయించుకొంటిని. అతడు తన ప్రత్యేక సత్యాగ్రహరంగములో నసమానుడు; అతని బుద్ధివైశద్య మతనిని ధర్మ మార్గముననే నడుపుచుండెను. స్వయముగ తాను పనిచేయుచు నితరులచే ప్రశాంతముగ పనిచేయించు నతడు ప్రజలలో సంఘ సంస్కారమును కలుగజేయగలడు. అతడు యుద్ధముచేయగలడు. లేదా ప్రశాంతముగ నుండగలడు. కాని మధ్యరకపు వ్యవహార మతనికి పనికిరాదు. శాసనసభలలోనుండి పోరాడెదము. ప్రతిఘటించెదమను స్వరాజ్యపార్టీ విధాన మతనికి చప్పగనుండెను. శాసనసభలలోనికి వెళ్ళదలచినచో ప్రతిఘటించుటగాక మంచి శాసనములను గావించుటకు ప్రభుత్వమునకు తోడ్పడుటకే వెళ్ళవలెను. అట్లు చేయుట కిష్టములేనిచో బయట నుండవలెను. స్వరాజ్యవాదు లీ రెండింటిలో దేనిని చేయనైరి. అట్టివారితో నతడేమి చేయవలెను?

చివర కతడు వారితో సమాధానపడెను. వెనుకటి పావలా సభ్యత్వమును తీసివేయలేదు. దానికి ప్రత్యామ్నాయముగా వడుకు నూలు యివ్వవచ్చుననిరి. తనమట్టుకు తాను దూరముగనుండి శాసన సభలలో స్వరాజ్యవాదుల కృషి నత డాశీర్వదించెను. అతడు రాజకీయములనుండి విరమించెననిరి. అధికారులు ప్రభుత్వమువారు నతని పలుకుబడి నశించుచున్నదనియు, నతడు తన శక్తి నంతను కోల్పోయెననియు విశ్వసించిరి. దాసు, నెహ్రూలు, గాంధీజీని

వెనుకకు తరిమివేసిరనిరి. రాజకీయరంగమును వారాక్రమించినట్లు కాన్పించెను. ఈ పదిహేనువత్సరములలో నిట్టి విమర్శ లనేకసార్లు చేయబడుటయు, భారత ప్రజాహృదయ మెంతమాత్రము మన ప్రభుత్వమునకు తెలియదని ప్రతిసారియు జగద్విదిత మగుటయు మన మెరిగిన విషయమే! భారత రాజకీయరంగమునకు వచ్చినది లగాయతు ప్రజలకు సంబంధించినంతవరకు గాంధీజీ పలుకుబడి యప్రతిహతముగనే యుండెను. ఇంతేకాదు! అతని పలుకుబడి యంతకంతకు హెచ్చుచుండెను. ఇంకను హెచ్చుచున్నది. మానవ స్వభావము దుర్బలమగుటచే వారతని యాశయములను నెరవేర్చ జాలకపోవచ్చును. కాని వారి హృదయము లెప్పుడు నతనిని ప్రేమించుచుండెను. తగినపరిస్థితులు, కారణములు సహాయపడినపుడు వారొక్కసారిగా పైకి లేచెదరు. లేనపుడు వారెచ్చటనో పడియుండె దరు. నాయకుడు ప్రజోద్యమమును గారడివానివలె శూన్యము నుండి సృష్టింపడు. పరిస్థితులేర్పడినపు డతడు వాటి నుపయోగించు కొనును. అట్టి పరిస్థితుల నతడు తయారుచేయవచ్చును. కాని వాటిని సృష్టింపజాలడు.

విద్యార్థికులలో గాంధీజీ పలుకుబడి తగ్గినమాట నిజము. ముందుకుపోవు వీరావేశముకూ వారతనిని ననుసరింతురు. కాని యుద్య మము వెనుకకు తగ్గినపుడు వారతనిపై కారములు మిరియములు నూరుదురు. అయినను వారిలో నధికసంఖ్యాకు లతనికి జోహారుల నర్పింతురు. మరియొక పటుతరకార్యవిధాన మేదియు లేకపోవుటయే దీనికి కొంత కారణము. లిబరలుపక్షము, రెస్పాన్సిలిష్టులు మొదలగు వారిని మనము లెక్కింపనక్కరలేదు. ప్రభుత్వమును భయపెట్టుటకు దౌర్జన్యము చేయవలెనని విశ్వసించెడివా రాధునిక ప్రపంచములో హద్దులను మీరినవారు. వారి పద్ధతులు నిష్ప్రయోజనములు, ప్రాచీనములు. సామ్యవాదపద్ధతి యింకను తెలియరాదు; కాంగ్రెసు లోని పైతరగతులవారి కది భయజనకముగ నుండెను.

1924 లో కొద్దికాలము మాతండ్రికి, గాంధీజీకి రాజకీయ ముగ దూరమైనను, త్వరలోనే వారిమైత్రి మరింత యధికమయ్యెను. వారిలో వారికెట్టి భేదాభిప్రాయములున్నను వారొండొరుల నెక్కుడుగా ప్రేమించి గౌరవించుకొనెడివారు. వారంతగా దేనిని గౌరవించిరి? గాంధీజీ వ్రాతలనుంచి తీయబడిన "భావతరంగములు" అను చిన్నపుస్తకముకు పీఠిక వ్రాయుచు తండ్రిగారు కొంత సూచననిచ్చిరి.

"ఋషులను గురించియు, మానవాతీతులను గురించియు నేను వింటిని; కాని నేనెన్నడు నట్టివారిని కలుసుకొనలేదు; అట్టివారు నిజముగా నుందురనికూడ విశ్వసింపకపోతిని. నేను మానవులను, మానవవిషయములను విశ్వసింతును. ఈ ప్రతిలో కూర్పబడిన 'భావతరంగములు' మానవసంభవములు, మానవవిషయములు. అవి విశ్వాసము, శక్తి యను మానవుని రెండు ప్రధానలక్షణములను తెలుపుచున్నవి. "ఇదంతయు మనల నెచ్చటకు గొంపోవుచున్నది" అని విశ్వాసముగాని, శక్తిగాని లేనివారు ప్రశ్నింతురు. "జయలక్ష్మికి లేక మృత్యుసదనముకు" అను సమాధానము వారి కర్థముకాదు. ఈలోపల నొక నిరాడంబరమూర్తి యప్రతిహతమైన విశ్వాసశక్తుల మీద ... నమ్రముగా నిలచి మాతృదేశ పాదారవిందములకడ నాత్మార్పణ మొనర్పుడు, చిత్రవధల ననుభవింపుడను మహత్తర సందేశమును తన ప్రజల కిచ్చుచుండెను. ఆ సందేశము లక్షలకొలది ప్రజల హృదయములలో ప్రతిధ్వనించుచుండెను ... " "మనలో చక్రవర్తు లెందరులేరు? విషయములను జయించిన విషయాధిపతు లెందరులేరు" అను స్వీన్బరను వాక్యములతో నతడు దానిని ముగించెను.

గాంధీజీ మహాత్మునివలె, ఋషివలెగాక నతడు మానివునివలెనే యభినందించెను. స్వయముగ శక్తివంతుడు యితరులకు మోకరించని వాడు నగుటచే నతడు గాంధీజీ యాత్మశక్తిని మెచ్చుకొనెను. ఈ మైదడుగుల మనిషిలో, యీ దుర్బల శరీరునిలో నెంతటి మహాబల వంతులకైన లొంగని వజ్రశక్తికలదు. గొప్ప ముఖలక్షణములాలేవు!

మొలగుడ్డ, నగ్నశరీరము ! అట్టి యితనిలో ననేకమందిచే హృదయ పూర్వకముగ జోహారు లొనరింపచేయు నమోఘశక్తి కలదు. అతడు బుద్ధిపూర్వకముగ వినమ్రుడైనను అత్యంతశక్తివంతుడు, ప్రతిభాశాలి; అది యతనికి తెలియును. ఒక్కొక్కప్పు డతడాజ్ఞలనిచ్చును; అధికారమును చెలాయించును. అవి శిరసావహింపబడును. అతని గంభీర ప్రశాంత నేత్రము లెవనినైనను కదలనీయక నెమ్మదిగ నంతరంగ పరిశోధనచేయును. స్పష్టము, నిర్మలము నగు యతని కంఠధ్వని హృదంతరాళముల ప్రవేశించి భావోద్రేకము కలిగించును. సభామంటపమున నొకడున్నను, వేలున్నను, అతని మోహనశక్తి వారిలో ప్రవేశించి ప్రతివాడు నతనితో నైక్యభావము నొందును. బుద్ధిని పూర్తిగ నిర్లక్ష్యము చేయకపోయినను ఈ భావమునకు బుద్ధితో సంబంధములేదు. బుద్ధి హేతువులకు నిశ్చయముగా రెండవ స్థాన మీయబడును. ఈ యద్భుత 'మంత్రశక్తి' వక్తృత్వముచేత గాని, లలితపద ప్రయోగముచేతగాని సంభవించినది కాదు. భాష నిరాడంబరముగ విషయబద్ధముగనుండి, పొల్లుపద మొక్కటియు మచ్చుకైన కానరాదు. అతని యనన్యనిష్కాపట్యత, వ్యక్తిత్వము మనలను వశపరచుకొనెను. అతనిలో నద్భుత యంతశ్శక్తులున్నట్లు కాన్పించును. అతనినిగురించి యట్టి సాంప్రదాయముకూడ బయలుదేరుటచే నది మంచి వాతావరణము కలిగించుటకు తోడ్పడుచుండెను. ఈ సాంప్రదాయము నెరుగనట్టియు, తన పరిసరములతో సామరస్యము లేనట్టియు, క్రొత్తవాడీ మంత్రమునకు కట్టుబడక పోవచ్చును. లేదా అంతగా కట్టుబడకపోవచ్చును. అయినను ప్రతిఘటించువారి నోడించుట లేదా నిరాయుధులనుచేయుట గాంధీజీయొక్క గొప్పశక్తులలో నొకటి.

గాంధీజీ ప్రకృతి సౌందర్యము నానందించినను కర్తృక వస్తువులలో నతనికి సౌందర్యము కానరాదు. తాజమహాలు అతనికి నిర్బంధ పరిశ్రమ ఫలము కాని యంతకంటె వేరుకాదు. అతనికి యాఘ్రాణశక్తి చాల తక్కువ. అయినను తన స్వాంతవిధమున వత

డొక జీవితకళను కనుగొని తన జీవితమునంతను నొక కళగాచేసెను. అతని హావ, భావములన్నియు, తళుకు బెళుకులు లేక యర్థవంత ములు, శోభాసమన్వితములు. అతనిలో చిరుబురులు, చికాకు, చిందర వందరలు మొదలగున వేవియులేవు. ఆత్మశాంతి పొందిన వాడై దాని నితరులకు వెదజల్లుచు జీవిత దుస్సహామార్గముల నత డవలీలగా నడచిపోవుచుండును. మా తండ్రికి నితనికి నెంత భేదము కలదు! అతనిలోకూడ నాత్మశక్తి, రాజఠీవి లేకపోలేదు. పై స్విన్బరను వాక్యము లతనికిని వర్తించును. అతడున్న యే సభలో నైనను విధాయికముగా కేంద్ర మతడేయగును. పంక్తిలో నత డే మూల కూర్చొనినను చివరకదియే శీర్షమగును. అతనిలో నమ్రత వినయము లేవు. అతనితో భేదించువాని నత డెంతమాత్రము విడిచి పెట్టడు. బుద్ధిపూర్వకముగా నధికారగర్వము గలిగిన యతడు గొప్ప భక్తిని, తీవ్రవ్యతిరేకమునుకూడ సృష్టించుకొనును. అతనివద్ద తటస్థ భావమనునది పనికిరాదు. అతనిని ప్రేమింపనైన ప్రేమింపవలె లేదా ద్వేషింపవలెను. విశాలమైన నుదురు, బిగింపబడిన పెదవులు, భల్లూ కపుపట్టు సూచించు గడ్డము - ఇటలీ వస్తు ప్రదర్శనశాలలలోని రోమనుచక్రవర్తుల విగ్రహములను మఱపించును. మా దగ్గరనున్న యతని చిత్రమును చూచి యిటలీలోని చాలమంది స్నేహితు లీ పోలికను గురించియే శ్లాఘించిరి. చివర సంవత్సరములలో ముఖ్య ముగా నతనితల రజిత శిరోజశోభల నీనునపు డతనిలో నొకవింత శోభ, యొక గొప్పదనము కాన్పించెను. నే నతనియెడల పక్షపాత ముగ నుండవచ్చును. కాని దుర్బలత్వము, నల్పత్వములతో నిండి యుండిన యీ ప్రపంచములో నా కట్టి యుదార విగ్రహము కాన రాలేదు. అతనికున్న యా గొప్పదనముకొరకు నా యద్భుతశక్తి కొరకు నా చుట్టుప్రక్కల వెదకి వ్యర్థుడనైతిని.

గాంధీజీ 1924 లో స్వరాజ్యపార్టీతో కుస్తీపట్టు సమయమున మా తండ్రి ఫొటో యొకటి నే నతని కిచ్చితిని. అందులో మాతండ్రికి మీసములు లేవు. అదివరకు గాంధీజీ మా తండ్రి నెప్పుడు మీసకట్టు

తోనే చూచెను. ఈ ఫోటోను చూచుటతోడనే యతడుతటాలున లేచి దానిని చాలసేపు చూచెను. మీసములు లేకపోవుటచే ముఖము యొక్కయు గడ్డముయొక్కయు కాఠిన్యత బయటపడెను. అతడు చిరునవ్వుతో తాను దేనితో పోరుచున్నదియు నిప్పుడు తెలిసికొంటినని చెప్పెను; అయినను ఆ ముఖము నేత్రయుగ్మముచేతను, నిరంతర మందస్మిత జనిత రేఖా లావణ్యముచేతను మార్దవము నొందెను. అప్పుడప్పుడు కండ్లు ప్రకాశించుచుండెను. తండ్రిగారసెంబ్లీ కార్యక్రమమును తీసినీటి కెదురెక్క చేపవలె పూనుకొనిరి. అతని న్యాయచట్టసంబంధమైన శిక్షణ కిది యెంతయు తగియుండెను. సత్యాగ్రహమును దాని సంతతి కంటె నత డీక్రీడాసూత్రముల నెరుంగును. అతడు తన పార్టీని కఠిన శిక్షణలో నుంచుటయేగాక నితర వ్యక్తులను బృందములను కూడ తనకు తోడ్పడ పురికొల్పెను! కాని యతడు తనతోడివారితోనే బాధలు పడవలసివచ్చెను. స్వరాజ్యపార్టీ మొదటిరోజులలో నోఛేంజర్లతో పోరాడవలసి వచ్చి బలము చేకూర్చుకొనుట కనేకమంది యవకతవక మనుష్యులను జేర్చుకొనెను. తరువాత యెన్నికలు వచ్చెను. వీటికి ధనము కావలసివచ్చెను. అది ధనవంతులనుండి రావలెను. కనుక నీ ధనవంతులను జోకొట్టవలెను. కొంతమందిని స్వరాజ్యపార్టీ అభ్యర్థులుగా నుండ గోరిరి. "ఒకరినుండి యొకరిని కాపాడెదమని వాగ్దానము చేయుచు బీదలనుండి వోటులను, ధనవంతులనుండి ధనమును సంపాదించు సాధువైన కళయే రాజకీయములు" అని యొక యమెరికాసామ్యవాది చెప్పుచున్నాడు.

మొదటినుంచియు నీ కూటములన్నియు పార్టీని దుర్బలపరచెను. అసెంబ్లీలోను శాసనసభలలోను పనిచేయుట కితర మితవాద పక్షములతో రాజీలు నిత్యావసరములయ్యెను. కనుక నితరులపై ధ్వజమెత్తుట యట్టి సూత్రములు పనికిరావయ్యెను. క్రమముగా పార్టీ శిక్షణలోను పార్టీపటిమలోను బలము తగ్గెను. అందులోని దుర్బలులు సమయానుకూల స్వాపాపములు చిక్కులను కల్పింప నారంభించిరి.

"లోపలనుండి ప్రతిఘటించెదము" అను నాశయముతో స్వరాజ్య వాదులు శాసనసభపై దాడివెడలిరి. కాని యాక్రీడ కిద్దరుండవలెను. ప్రభుత్వము స్వరాజ్యవాదులలోనే చీలికలను, వ్యతిరేకభావములను కల్పించి తా నింపులో పాల్గొన నిశ్చయించెను. గొప్పయుద్యోగము లను, అనేక మోహములను ప్రభుత్వమెప్పులను, దుర్బలసోదరుల ముందర పడవేసిరి. వారు వాటి నెత్తుకొనుటయే చేయవలసినపని. వారి శక్తిసామర్థ్యములు, వారి రాజకార్యధురంధరత్వము పొగడ బడుచుండెడివి.

కనుక స్వరాజ్యవాదుల సామాన్యనీతి తగ్గెను. అచ్చటచ్చట వ్యక్తులు వ్యతిరేక పక్షముకు జార నారంభించిరి. మోతీలాల్ తండ్రి 'దుష్టాం గమును ఖండించెదను' అని యుఱుముచు, గర్జించుచుండెడివాడు. కాని దీనివలన లాభములేకపోయెను. కొంతమంది స్వరాజ్యవాదులు మంత్రులైరి. కొంతమంది రాష్ట్రములలో యెగ్జిక్యూటివు కౌన్సిల ర్లయిరి. కొంతమంది 'రెస్పాన్సివిష్టులు' లేక 'రెస్పాన్సివు కో ఆప రేటర్లు' అను ప్రత్యేక బృందముగ నేర్పడిరి. మొట్టమొదట లోక మాన్యతిలక్ యీపదమును, మరియొక ప్రత్యేక పరిస్థితులలో నుప యోగించెను. ఇప్పుడు దీనిభావము 'ఒడుపు దొరికెనా నీవొక పద విని స్వీకరించి హాయిగా ననుభవింపుము' అయ్యెను. ఇట్టివారున్నను స్వరాజ్యపక్షము సాగెను కాని మాతండ్రి దాసుగారు దీనితో విసిగిరి. దీనికితో డుత్తరహిందూదేశములో హిందూముస్లిము తగాదాలు రెచ్చి తఱచు కొట్లాటలలోనికి దిగెను.

1924 డిసెంబరులో కాంగ్రెసు బెల్గాములో జరిగెను. గాంధీజీ యధ్యక్షత వహించెను. చాలకాలమునుండి శాశ్వతముగ నధ్యక్షాతీతు డైన యతడధ్యక్షుడగుట తల్లక్రిందులు వ్యాపారముగ నుండెను. అతని యధ్యక్షోపన్యాసము నాకు రుచింపలేదు. అది యెంతమాత్రము నుత్తేజ కరముగలేదు. గాంధీజీ ప్రోత్సాహముచే నన్ను తిరిగి అ. భా. కాం. వర్కింగు కార్యదర్శిగా నెన్నుకొనిరి. నాకిష్టములేకపోయినను నేను శాశ్వత కార్యదర్శి నగుచుంటిని.

1925 వేసవిలో మా తండ్రి యుబ్బసముతో బాధపడెను. అతడు హిమాలయములలోని డార్జిలింగునకు కుటుంబముతో వెళ్ళెను. నేనచ్చట కొంతకాల ముంటిని. మేము డార్జిలింగునుండి హిమాలయములలోనున్న చాంబాకు వెళ్ళితిమి. అక్కడనుండగా నొకనాడు చిత్తరంజనదాసు చనిపోయినట్లు తంతివార్త వచ్చెను. ఆ వార్త వినుటతోటనే దుఃఖాక్రాంతుడై మా తండ్రి చాలసేపు నోటమాట రాక కూర్చునియుండెను. అది యతనికొక పెద్ద గొడ్డలిపెట్టు. అతని నట్టిస్థితిలో నే నెన్నడు చూడలేదు. అతని కత్యంతమిత్రుడు సహచరుడు నైనవాడు భారమునంతను నతనిపై విడిచి వెళ్ళిపోయెను. ఆ భార మంతకంతకు పెరుగుచుండుటయేగాక వారిరువురకు విసుగుదల కలిగించెను. దాసుగారి ఫరిద్పూరు కాంగ్రెసు ఉపన్యాసము విసుగుదల కలిగినవాని యుపన్యాసమును బోలియుండెను. మరునాడే మేము చాంబాదాటి తిరిగి డార్జిలింగునకు, యచ్చటనుండి అలహాబాదు కలకత్తాలకు ప్రయాణమైతిమి.

19

కులతత్త్వ ప్రాబల్యము

నాభా జయిలునుంచి వచ్చినతరువాత నేను మంచముపట్టితిని. నా కది యొక క్రొత్తయనుభవము. దుర్బలత్వముచే జ్వరముచే నే నెన్నడు మంచము పట్టియుండలేదు. నే నారోగ్యవంతుడనని నాకు కొద్ది గర్వము కూడ కలదు. హిందూదేశములో సాధారణముగా నభినయింపబడు రోగిష్టితనము, రోగిష్టి పద్ధతి యనిన నాకు మంట. నా యౌవనము, శరీరపాటవము నా కనుభవయోగ్యమయ్యెను. కాని యీ వ్యాధి తగ్గినతరువాత నేను కొంతకాలము మంచముమీదనే యుండవలసివచ్చెను. ఈ కాలములో నేను నా పరిసరములకు నా నిత్యకార్యములకు నుదాసీనుడనై యుంటిని. నేను చెట్లను వేరుచేసి కట్టెను మాత్రమే చూడగలిగినట్లు భావించెడివాడను. నా మనస్సు వెనుకటికంటె నిర్మలముగ, ప్రశాంతముగ నున్నట్లు కాన్పించెను. గొప్పవ్యాధిచే బాధపడినవారందరికి నిది సామాన్యమేయని నా యుద్దేశ్యము. కాని నా కిది యొక యాధ్యాత్మికానుభవమువలెనుండి యెంతయో మంచిచేసెను. నే నుద్రేకపూరిత రాజకీయములనుండి యుత్థితుడనై నన్ను కార్యాచరణకు పురిగొల్పిన లక్ష్యమును, ఆశయములను మరింత స్పష్టముగా చూడగలిగితిని. కాని యిట్లు స్పష్టమయినకొలది మరికొన్ని ప్రశ్నలుదయించుచు నేను వాటికి సరియగు సమాధానముల నీయజాలకపోవుచుంటిని. అప్పటి నా యనుభవమును గురించి నే నంతగా వ్రాయజాలను. ఆ భావమును నేను చులకనగా వ్యక్తముచేయజాలను.

హిందూ ముస్లిము తగాదాలు ముఖ్యముగా నుత్తరహిందూదేశమున నధికమగుచుండెను. పెద్ద పట్టణములలో చాలచోట్ల నిర్దాక్షిణ్యమగు కొట్లాటలు జరిగెను. క్రోధము అవిశ్వాసము ప్రబలిన కొలది పోట్లాటలకు మనము మున్నెన్నడు కని విని యెరుగని నూతన కారణములు బయలుదేరుచుండెను. పూర్వము గోవధ తగాదాలకు

కారణమగుచుండెను. మొహరము రామలీలలవంటి పండుగ లొకే సారి వచ్చిపడినపు డట్టితగాదాలు వచ్చుచుండెడివి.

మసీదులవద్ద సంగీతము, వాయిద్యములు యిప్పుడు క్రొత్త తగాదాకు కారణమయ్యెను. తమ ప్రార్థనల కివి యడ్డంకులని ముస్లిములు వీటి కభ్యంతరపెట్టిరి. ప్రతి పట్టణములోను చాల మసీదు లున్నవి వారు రోజుకయిదుసార్లు ప్రార్థింతురు. కనుక నుత్సవములకు (శ్రాద్ధ, వివాహాదిక) ధ్వనులకు లోటులేకుండుటను పోట్లాటల కవకాశము లెప్పుడును గలవు; ముఖ్యముగా సాయంకాల ప్రార్థన కాలమున నివి పనికిరావనిరి. ఈ కాలముననే హిందూదేవాలయములలో పూజలుచేయుచు జేగంటలు వాయించుచుందురు. దీనిని ఆర్తి యందురు. కనుక ఆర్తి నమాజుయుద్ధము లిప్పుడు ప్రాముఖ్యత నహించెను. పరస్పరభావములపట్ల గౌరవము కొద్దిపాటి సర్దుబాటు చేసికొనిన నమసిపోవలసిన సమస్య నిరంతర ద్వేషమునకు కొట్లాటలకు కారణమగు టాశ్చర్యకరము. కాని మతద్వేషముల కాలోచన, హేతువు, సర్దుపాటు యవసరములేదు. ఇది నొకరిపై నొకరిని పురిగొల్పు అధికారములోనున్న మూడవపక్ష మున్నపు డిది రాజుట యతి సులభము.

కాని యీ కొట్లాటల కనవసర ప్రాముఖ్యత యివ్వబడుచున్నది. చాల పట్టణములు, పల్లెలు నిట్టి కొట్లాటలు లేకుండ సుఖజీవనము చేయుచున్నవి; వార్తాపత్రికలు ప్రతి చిన్న పోట్లాటను గోరంతలు కొండంతలు చేయును. దీనిని పైనున్న కులనాయకులు పెంచుచు తమకులము కెక్కువ రాజకీయ హక్కులు కావలెనని బిగియుచుందురు.

కాంగ్రెసుకు దీనివలన కష్టము తటస్థించెను. చాలమంది కాంగ్రెసువారు జాతీయ బురఖాలోనున్న కులనాయకులు. కాని కాంగ్రెసు యీ కులనాయకుల కెంతమాత్రమూ స్థానమీయలేదు. కనుక నిరుతెగల యతివాదులు కాంగ్రెసును దూషింపనారంభించిరి. గాంధీజీ చిరకాలము క్రిందటనే కులసమస్యను పరిష్కరించుట కొ-

పరిణాళిక నేర్పరచెను. అవి యధికసంఖ్యాకుల యుదారతవలనను; సోదరభావములవలనను తీరగలవని యతని యభిప్రాయము. ముస్లిములు దేని నడిగినను యిచ్చి వేయవలెననియే యతడనెను. వారితో బేరములు వలదనియు వారిని పై విధమున పూర్తిగా జయింపవలెననియు నతడనెను. తక్కినవారు దేని నిజప్రయోజన మెంత కలదో యావంతయు నెరుగకపోయినను ప్రతిదాని కొనుగోలు ధర తెలిసినవారివలె నంతబేరమే కావలెనని పట్టుబట్టిరి. వస్తుధర వారికి తెలియును. కాని కొనబడిన వస్తు వెట్టిదో వా రెరుగకైరి!

ఇతరులను చులకనగా విమర్శింపవచ్చును; నిందింపవచ్చును. మన యభీష్టము లీడేరకపోవుట కేదియో కారణము దొరకవచ్చును. మనము ప్రభుత్వముమీద కులనాయకులమీద నింద వేసెదము. వారు కాంగ్రెసును నిందింతురు. బ్రిటిషుప్రభుత్వ మెప్పుడును మనలో చీలికల నేర్పరచియే పాలించెను, పాలించుచున్నది, పాలించును. సామ్రాజ్యము లెప్పుడు నట్లేచేయును. మనము దానిని నిందించిన లాభములేదు. దానిని నిర్లక్ష్యముచేసి, దానికి తగిన కట్టుదిట్టములు చేసికొనలేకపోవుట మనలోపముకాని మరియొకరిదికాదు.

మన యీలోపము నెట్లు తీర్చుకొనగలము? ఇది బేరముల చేత నెంతమాత్రము కుదురునదికాదు. మన మెంత బేరమాడినను మనకంటె నెక్కువకు బేరమాడి, బేరమాడుటయేకాక దానిని కార్యరూపమునబెట్టగల ప్రభుత్వములేదా? ఒక సామాన్య జాతీయదృష్టి సాంఘికదృష్టి లేనిచో సామాన్యశత్రువుపై సమష్టిపోరాట మెట్లుజరుగగలదు? మనము ప్రస్తుతమున్న రాజకీయ, ఆర్థిక పునాదుల నట్లేయుంచి యచ్చటచ్చట నతుకులను మెత్తులను పెట్టుట సంస్కరించుట లేక 'భారతీయ పరము చేయుట' వలన లాభమేమి? మనలక్ష్య మప్పుడు వంపకములలోనికి దిగును. అధికారములోనున్న మూడవ పక్ష మప్పుడు విధాయకముగా ప్రధానపాత్రధరించి తనదత్తపుత్రులకే వరముల నిచ్చును. ప్రస్తుతరాజకీయ, సాంఘిక పునాదులకు కేవల భిన్న

మగు నూతనపునాదులమీదనే మనము స్థిరమైన సమిష్టిపోరాటము నడుపగలము.

కాని కొంచె మించుమించు మన నాయకులందరు ప్రస్తుత సంకుచిత రాజకీయ సాంఘిక పునాదులలోనే గుడిగుడి గుండా రాగము తిరుగుదురు. వారిదృష్టి యెంతసేపు సంస్కరణయుతముగాని విప్లవయుతముగాదు. కాని హిందూదేశములో రాజకీయ, సాంఘిక, ఆర్థికసమస్య లేవియైనను సంస్కరణ పద్ధతులచే తృప్తికరముగా పరిష్కరింపబడుకాలము గతించెను. అవి విప్లవముచేతనే సాధింపబడవలెను.

మన స్వాతంత్ర్య పోరాటములో స్పష్టమైన లక్ష్యములు, ఆశయములు లేకపోవుటచేతనే కులతత్వములు పెచ్చుపెరిగెను. ప్రజలకు స్వరాజ్య పోరాటముకు తమ నిత్యజీవితములోని బాధలకు స్పష్టమైన సంబంధమేమియు కానరాదు! తాత్కాలి కోత్సాహములో వారొక్కొక్కప్పుడు బాగుగనే పోరాడెడివారు. కాని దానివెనుక తగినంత హేతుబలము లేకపోవుటచే యుద్యమము వెనుకకు తగ్గిన కాలములో కులనాయకులు వారిని మతము పేరిట తమ ప్రయోజనములకొరకు కుపయోగించుకొనెడివారు. హిందువులలోను మహమ్మదీయులలోను కూడ బూర్జువాతరగతులవారు ప్రజాసామాన్యమునకు చివరకు మధ్యతరగతులలోని క్రింది తరహావారికి కూడ నెంతమాత్రము సంబంధములేని కోరికలకొరకు హక్కులకొరకు పవిత్రమైన మతము పేరిట ప్రజాసానుభూతి బడయుట చోద్యముగ నుండును. ఏ కులముతరఫున తీసికొనిరాబడు ప్రతి కులహక్కు, కోరిక మనము పరిశీలించి చూచినను చివర కది యుద్యోగవాంఛతప్ప మరియొకటి కాదు. ఈ యుద్యోగము లతిస్వల్పముగనుండి మధ్యతరగతులలోని పైతరహావారికి పోవును. శాసనసభలలో నెక్కువ స్థానములు ప్రత్యేకస్థానములు కావలెనను కోరికకూడ నిట్టిదే. ఇది పెద్ద రాజకీయాధికారము నిచ్చునది యని చెప్పబడును. ఇట్టివి జాతీయాభివృద్ధికి, జాతీయమైక్యతకు భంగకరములు. ఇవి యా యా కులములలోని యే

కొద్దిమంది పైతరగతులవారికో యుపకరించును గాని కులముకంతకు, ప్రజలకందరకు నుపకరించు ననుట వట్టికల్ల. ఈ గొడ్డుపోతు కోరిక లను మతోద్రేకముతో లంకెపెట్టి యదార్థమును మరుగుపరుచు చున్నారు.

ఈవిధముగా రాజకీయాభివృద్ధిభంజకులు కులనాయకత్వము పేరిట రాజకీయరంగములో తిరిగి ప్రవేశించిరి. కులాభిమానము కంటె రాజకీయాభివృద్ధి ధ్వంసముచేయుటయే వారిసంకల్పమని వారి నడకలే విశదముచేయగలవు. ఒక్క రాజకీయముగనే వారు మనకడ్డము తగులవచ్చునని మన మనుకొనవచ్చును. కాని యీ సందర్భములో వా రెంతదూరమైనను పోవుచుండుట కడు విచారకరము. ముస్లిము కులనాయకులు భారతజాతీయతను, భారతస్వాతంత్ర్యమును యెంత మాత్రము లెక్కచేయనట్లే కాన్పింతురు. హిందూ కులనాయకు లెప్పుడు పైకి జాతీయతపేరిటనే మాట్లాడినను ఆచరణలో దాని వంకపోరు! వా రెట్టి ప్రయోజనకరమగు కార్యమును చేయుట కసమర్థు లగుటచే ప్రభుత్వమునకు సాగిలబడి చివరకు దానినికూడ వ్యర్థముగనే చేసిరి. ఉభయులు 'సామ్యవాదమును' అట్టి 'యుపద్రవ' యుద్యమములను ఖండింతురు. పెట్టుబడిదారుల ప్రయోజనములకు సంబంధించినంతవర కుభయులు నేకగ్రీవముగనే యుందురు.

కాంగ్రెసులో చాలమంది ముస్లిములు కలరు. భారతదేశ మంతట పేరెన్నిక పొందినవారు, సమర్థులు చాలమంది కాంగ్రెసు ముస్లిములు కలసి 'జాతీయ ముస్లిముపక్షము' స్థాపించి ముస్లిముకుల నాయకుల నెదిర్చిరి. మొదట వారికి కొంతజయము చేకూరి చదువు కొనిన ముస్లిములలో చాలమంది వారితరపునయున్నట్లే కాన్పించిరి. కాని వారందరు మధ్యతరగతులలో పైతరహాకు చెందినవారగుటచే వారి వారి యుద్యోగములను వ్యాపారములను చూచుకొని ప్రజా సామాన్యముతో సంబంధము పోగొట్టుకొనిరి. నిజముగా వారు తమ ప్రజలవద్దకు పోనేలేదు. వా రేసభలోనో కూర్చుని వారిలో వారు కొన్ని యేర్పాటులను రాజీలను కుదుర్చుకొను చుండెడివారు.

ఈ యాటలో వారికంటె కులనాయకు లెక్కువ దిట్టలగుటచే వారి నొకచోటునుండి మరియొకచోటుకు తరుముచు చివరకు వా రెట్టి సూత్రములతో బయలుదేరిరో యట్టిసూత్రములనే విడచిపెట్టులాగున చేసిరి. చివరకు వా రొక్క సమిష్టి ఎన్నికలను సూత్రముకు దిగివచ్చి దానినైనను కాపాడుకొనజాలకపోయిరి.

ముస్లిము జాతీయవాదుల పతనము విచారకర కథనము. దానికి చాల వత్సరములుపట్టెను. ఈ వత్సరము (1934) తో దాని చివరయధ్యాయము ముగిసెను. 1923 వత్సరములోను, తరువాతను వారు చాల బలముగనుండి నాయకులను తీవ్రముగ నెదిర్చిరి. చాల సారులు గాంధీజీ ముస్లిముకులనాయకుల కోరికల నంగీకరించుటకు తయారయ్యెను. కాని ముస్లిము జాతీయవాదులే దీనిని వల్లకాదనిరి.

కులసమస్యలను పరస్పరసంభాషణలవలనను, చర్చలవలనను కుదుర్చుకొనుట కనేక ప్రయత్నములు జరుపబడెను. ఈ 'ఐకమత్య సభ'లో ముఖ్యమైనదానిని మహమ్మదాలీ 1924 లో ఢిల్లీలో గాంధీజీ 21 దినము లుపవాసమున్న కాలములో జరిపెను. ఈ సభలకు చాలమంది సదభిప్రాయములతోను, శ్రద్ధాభక్తులతోను వచ్చి సమన్వయముకొరకు చాల పాటుపడిరి. కొన్ని పవిత్ర తీర్మానములు గావింపబడెను. కాని ముఖ్యసమస్య పరిష్కరింపబడలేదు. గొప్ప సమస్యల నధికసంఖ్యాకుల వోటులతో గాక పవిత్రమైన యైక్యబుద్ధి తోనే సమన్వయపరచవలెను. కాని యన్నిసంఘములలోను అతి వాదులు కలరు. వారిప్రకారము పరిష్కారమనగా నందరు తమ యభిప్రాయములకు లొంగిపోవుటయే. నిజముగా కొంతమంది ముఖ్య కులనాయకుల కెట్టిపరిష్కారము నవసరములేనట్లే తోచును. వారిలో చాలమంది రాజకీయాభివృద్ధికి విముఖులు. కనుక రాజకీయ పరివర్తనము కోరువారికి సమన్వయ మెట్లు సంభవించును?

సిక్కులు తమ హక్కులను కోరుచుండిరి. పంజాబులో నీవిధముగా త్రివిధ సంగ్రామ మేర్పడెను. ఒక సంఘము మరియొక సంఘమును చూచి భయపడుచుండుటచే ద్వేషములు పెరుగుచుండెను.

కొన్ని రాష్ట్రములలో వ్యావసాయిక తగాదాలు – వంగదేశములో హిందూ జమీందారులు ముస్లిము రయితాంగం – కులసంబంధమైన బురఖాలో కాన్పించెను. పంజాబు సింధులలో ధనవంతులు వడ్డీ వ్యాపారస్తులు సాధారణముగ హిందువులు. ముస్లిము వ్యవసాయ దారులు ఋణగ్రస్తులు. దారిద్ర్యముచే పీడింపబడు ఈ ఋణగ్రస్తులకు రక్తమును పీల్చెడి ఋణదాతలమీదగల ద్వేషమంతయు కులద్వేష మునకు దోహదము నిచ్చుచుండెను. సాధారణముగా ముస్లిములు బీద వారగుటచే కులనాయకులు వారి బీదతనముచే ధనవంతులపై కలిగిన ద్వేషమును కులప్రయోజనములకు వినియోగించుకొనెడివారు. దీని చేతనే ముస్లిము కులనాయకులు కొంత ప్రజాప్రాతినిధ్యము కలవారై కొంత బలము సంపాదింపగలిగిరి. హిందూకులనాయకులు ధనవంతు లైన వడ్డీవ్యాపారస్తులకును, ఉద్యోగస్తులకును ప్రతినిధులైరి. వీరివెనుక హిందూప్రజల బలమంతగాలేదు. కనుక నీ సమస్య యార్థికసమస్యతో మిళితమగుచుండెను. ఇది రానురాను కలవారికి, లేనివారికి పోరాట ముగా మారవచ్చును. కాని యంతవరకు అన్ని కులములకు చెందిన ప్రస్తుత కులనాయకులందరు నేకమయి తమ భేదభావములను సమన్వయ పరచికొని లేనివారిపై కొక్కుమ్మడిగా నురుకుదురు. ప్రస్తుత పరిస్థితు లలోకూడ మూడవపక్షము లేకపోయినచో రాజకీయ పరిష్కారము కుదురు టంత ఘనకార్యముకాదు.

1924 లో ఢిల్లీ నైకమత్యసభ నైనదో లేదో యప్పుడే అలహాబాదులో హిందూముస్లిము పోరాటములు చెలరేగెను. మేము వెంటనే అలహాబాదు వెళ్ళితిమి. అది యంతతీవ్రముగా పరిణమింపక పోయినను దానితరువాత కలిగిన ద్వేషములు, కోర్టువ్యాపారములు చాలకాల ముండెను. ఆ వత్సరమే రామలీల యుత్సవసందర్భములో నచ్చట మరియొక సంఘర్షణ జరిగెను. మసీదులవద్ద వాయిద్యాదు లను నిషేధించుటచే నిప్పటి కెనిమిది వత్సరములనుండి అలహా బాదులో రామలీలోత్సవములను జరుపుటయే మానివేసిరి. నా చిన్న తనములో నేను వాటినెంతయో యానందముతో ననుభవించెడి.

వాడను ! అది హిందూ యుత్సవమైనను బహిరంగమున జరుగుటచే ననేకమంది ముస్లిములుకూడ నందులో పాల్గొనుచుండిరి. ప్రతిచోట సంతోషముతో నిర్విచారము తాండవమాడు చుండెడిది. వర్తకము విజృంభించెడిది. నేను పెద్దవాడనైన తరువాత దీనిని చూచితిని. అప్పటికి నా యభిరుచులన్నియు మారుటచే నా కంత యుత్సాహము లేకపోయెను. కాని ప్రజ లీ యుత్సవములను, తమాషాలను చూచి తమ దుఃఖములను, కష్టములను, శ్రమలను మరచిపోయెడివారు. ఇప్పటి కేనిమిది సంవత్సరములనుండి అలహాబాదులోని బాలబాలిక లీ సంతోషముకు, నీమాత్రపు దైనందిన శ్రమజనిత దుఃఖోపశమనమునకు నోచికొనరైరి. ఇదంతయు స్వల్ప పేచీలకొఱకు ! మతము మతతత్వము దీని కుత్తరవాది యగుచున్నది. ఆహా ! వా రెంత సంతోషశూన్యులు ! ఎంతటి సంతోషసంహారకులు !

20

మున్సిపలు కార్యనిర్వహణము

నేను అలహాబాదు మున్సిపలు పని రెండేండ్లు సాగించితిని. నా చైరుమను పదవికి పరిమితి మూడేండ్లు. రెండవయేడు ప్రారంభమగుటతోడనే నా బాధ్యత తొలగించుకొన జూచుచుంటిని. నా కా పనియందు శ్రద్ధకలిగి నా కాలమును, బుద్ధిని దానికి వినియోగించితిని. నేను దానిని జయప్రదముగ నెరవేర్చి నా సహచరులందరి యామోదము బడసితిని. రాష్ట్రప్రభుత్వముగూడ నాపైనున్న రాజకీయ ద్వేషమును తగ్గించుకొని, నా మున్సిపలు కార్యములను కొన్నింటిని మెచ్చుకొనిరి. అయినను యదార్థప్రయోజనముల నిచ్చెడివాటిని వేటిని చేయకుండ నా చేతులు బంధింపబడెను ; అభ్యంతరములు, నడ్డంకులు కల్పింపబడెను.

అది యొకరు బుద్ధిపూర్వకముగ కల్పించు యభ్యంతరము కాదు. అందరు నాకు మనఃపూర్వకముగ సహకారముచేసిరి. కాని యొకప్రక్క ప్రభుత్వయంత్రము, మరియొకవంక ప్రజలయొక్కయు, మున్సిపలు సభ్యులయొక్కయు నుదాసీనత కలవు. ప్రభుత్వముచే తయారుచేయబడిన మున్సిపలు పరిపాలన యను యుక్కుచట్టము గొప్ప యభివృద్ధిని నూతన మార్పులను చేయనీయదు. మున్సిపాలిటీ యెప్పుడు ప్రభుత్వముమీద నాధారపడునట్టి యార్థిక నీతియే దానికి ప్రసాదింపబడెను. మున్సిపలు చట్టముల ప్రకారము నూతన పన్ను విధానములు సాంఘికాభివృద్ధి పనికిరావు. చట్టము ప్రకారము చేయదగినవాటికి గూడ ప్రభుత్వామోద ముండవలెను. మార్కండేయాయుర్దాయ ముండి, యెడతెగని యోర్పుగలవాడున్నచో నీ యామోదముకొరకెదురు చూచుచుండవచ్చును. జాతీయ సాంఘిక నిర్మాణములకు సంబంధించిన వ్యవహారము వచ్చినపుడు ప్రభుత్వయంత్ర మెంత నెమ్మదిగ, నెంతకష్టముగ, నెంత యసమర్థముగ నడిచెడిదో చూచిన నా కాశ్చర్యము వేసె

డిది. కాని రాజకీయ శత్రువు నణచవలసివచ్చినపుడు మాత్రము వారిలో నా మందగమనము, అసమర్థత మాయమగును.

రాష్ట్రప్రభుత్వములోని స్థానిక స్వపరిపాలనశాఖ కొకమంత్రి యధిష్ఠానదేవతగానుండును. కాని సాధారణముగా నీ మంత్రి శేఖరునకు మున్సిపలు వ్యవహారములు మరేయితర ప్రజావ్యవహారములు తెలియవు. నిజమున కతనిలెక్కయే లేదు. శాశ్వతమైన ఐ. సి. యస్. యుద్యోగులచే నడుపబడు యతనిశాఖయే యతనిని నిర్లక్ష్యము చేయును. ప్రభుత్వమనగా ముఖ్యముగా పోలీసు ధర్మము, శిక్షించుట యను గొప్ప భారతోద్యోగుల భావములే వీరికిని పట్టుబడును. అధికార గర్వము, అధికారపెత్తనము వెలిగింపవలెనను భావమే వీరికి కాన్పించును. కాని ప్రజాబాహుళ్యముకు చెందు సాంఘికసేవ చేయవలెననెడి యవసర మెంతమాత్రము వీరికి కాన్పించదు. ప్రభుత్వమెప్పుడు మున్సిపాలిటీలకు ఋణదాతలు. కనుక పోలీసు ధర్మమైన తరువాత వారికి ఋణదాత ధర్మమే ముఖ్యము. ఋణ వాయిదాలు సరిగా చెల్లింపబడుచున్నవా? మున్సిపాలిటీలో తగినంత ధనమున్నదా లేదా? అది దివాలాతీయదు కదా! ఈ ప్రశ్న లవసరమైనవే యైనను మున్సిపాలిటీలు విద్య, పారిశుధ్యము నను ప్రయోజనకరములగు ధర్మములను కొన్నింటిని నెరవేర్చవలసి యున్నదనుసంగతి సామాన్యముగా మరచిపోబడుచున్నది. అది రొక్కము తీసికొని తిరిగి వాయిదాలప్రకార మిచ్చివేయుట కేర్పడిన సంస్థకాదు. భారతమున్సిపాలిటీలో సాంఘికసేవావకాశములే చాలతక్కువ; డబ్బునిక్కచ్చి యున్నచోట దీనికిని నాస్తిచెప్పుదురు. అందులో మొదట సాధారణముగా విద్యకే యెక్కువ దెబ్బతగులును. పాలకజాతివారికి మున్సిపలు పాఠశాలలతో సంబంధములేదు. వారిబాలురు మంచిస్థితిలో నుండు ప్రయివేటుబడులకు పోదురు.

భారతదేశ పట్టణములను మనము రెండుభాగములుగా విభజింపవచ్చును. సందులతోను గొందులతోనుకూడి క్రిక్కిరిసియుండు ప్రధాన నగరము. రెండవది విశాలమైన భవనములు, సుందర కుటీ

రములు, తోటలు ప్రాకారములుగల యుద్యోగస్థుల శ్రేణులు. ఈ యుద్యోగ శ్రేణులతోనే ఇంగ్లీషు వ్యాపారస్థులు ఇంగ్లీషు యుద్యోగులు, మధ్యతరగతులలోని పైతరహాకు చెందిన భారతీయులు, యితర వృత్తులవారు భారతోద్యోగస్థులు మొదలగువా రుందురు. మున్సిపాలిటీకి వచ్చు రాబడిలో హెచ్చు మొత్త ముద్యోగస్థుల శ్రేణులనుండిగాక ప్రధాన నగరమునుండియే వచ్చును. కాని ప్రధాన నగరముకంటె నీ శ్రేణులకే యెక్కువ మొత్తము వెచ్చింపబడును. విశాలమైన యీ శ్రేణుల కెక్కువ రోడ్లు కావలెను. దానితో నెక్కువ మరమ్మతులు, తుడుచుట, నీళ్ళు చల్లుట, దీపములు వెలిగించుట, మురుగుకాలవలు, నీటిసప్లయి, పారిశుద్ధ్యము ఇట్టివనేకములు కావలెను. నగరభాగ మెప్పుడు నిర్లక్ష్యము చేయబడును; ఇక పట్టణములోని బీదప్రాంతములసంగతి చెప్పనక్కరలేదు. వాటికి మంచిరోడ్లు లుండవు. ఇరుకుసందులలోను గొందులలోను దీపములుండవు. సరియైన మురుగుకాలువలు పారిశుధ్యముగా వుండవు. వారీబాధల నన్నింటిని యనుభవింతురు. వారికష్టములను చెప్పుకొననైన చెప్పుకొనరు. చెప్పుకొనిరో వినువా రెవరు? 'పెద్దనోరు చిన్ననోరు' గలవారందరు నుద్యోగశ్రేణులలోనే యుందురు.

ఈ భారమును కొంత సమము చేయుటకు కొన్ని యభివృద్ధులను కలిగించుటకు భూముల విలువమీద నే నొకపన్ను వేయనెంచితిని. నే నీ సూచన చేయుటతోడనే జిల్లా మేజిస్ట్రేటు యిది భూమిశిస్తుపద్ధతికి చట్టములకు వ్యతిరేకమనెను. అట్టిపన్ను శ్రేణులలోని భవనముల యజమానులపైననే యెక్కువగా పడియుండెడిది. కాని ప్రభుత్వము బీదలమీదపడు ప్రత్యక్షపన్నులను, వస్తువులపై సుంకములను జంకుగొంకులులేకుండ నామోదించును. అవి ధరలను పెంచును; వర్తకము నణచును; బీదలపై నెక్కువభారము పడును.

ఈవిధముగా మున్సిపలు చైరుమనుగా నే నొకవంక కనబడని పెత్తనము వెలిగించు ప్రభుత్వ యంత్రముతోను (ఇది యజగళము వలె కదలదు. నూతనమార్గములను త్రొక్కదు) తత్తుల్యముగనే

కదలని నా సహచర సభ్యులతోను మెలగవలసివచ్చెను. ఇందులో కొంతమంది యుత్సాహపరులున్నను మొత్తముమీద వారు మార్పుకు, మంచికి యంత సుముఖులుకారు. పాతమార్గములు మంచివేకదా, సంశయాస్పదమగు క్రొత్త యనుభవములేల ? చివరకీ యుత్సాహవంతులు నిర్వీర్యమగు దినచర్య కలవాటుపడి క్రమముగా నల్లమందుభాయిలైపోయిరి.

ప్రతివత్సరము వార్తాపత్రికలు ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వ తీర్మానములు మున్సిపాలిటీలను స్థానికసంస్థలను విమర్శించుచు వాటి లోటుపాటుల నెత్తిపొడుచును. దీనినుండి భారతదేశమునకు ప్రజా స్వామికసంస్థలు పనికిరావను సారాంశము తీయబడుచున్నది. వారి లోపములు స్పష్టములేయైనను వారెట్టి సంకుచిత యుక్కుచట్టములో పనిచేయవలసి యున్నారో గమనించువారెవరును లేరు. ఇది నిరం కుశత్వముకాదు. ప్రజాస్వామికముకాదు. ఇది యారెంటియొక్కయు సంకరము. దీని కా రెంటి లోపములు కలవు. కేంద్రప్రభుత్వమునకు కొంత యధికారము పెత్తనము నుండవచ్చును. కాని యా కేంద్ర ప్రభుత్వము ప్రజాస్వామికము, ప్రజా యవసరములను గుర్తెరుంగు నదియైనపుడు స్థానిక ప్రజాసంస్థకు సరికాదు. ఇట్లు కానినాడు రెంటికి సంఘర్షణ తప్పదు. లేదా కేంద్రప్రభుత్వమునకు లొంగక తప్పదు. ఈ విధముగా కేంద్రాధికారము బాధ్యతాయుత అధికారమును చలాయించును. ఇది చాల యసంతృప్తికరమైనవిషయము. దీనివలన నిజమైన ప్రజాధికారము నశించును. మున్సిపలుబోర్డు సభ్యులుకూడ తమరి నెన్నుకొను ప్రజలవైపుగాక నెక్కువగా కేంద్రప్రభుత్వ ప్రసాదముకొరకే చూచుచుందురు; ప్రజలుకూడ బోర్డును మరచిపోవు దురు. నిజమైన సాంఘికసమస్య లెన్నడు బోర్డుకు రాజాలవు. అవి దానిధర్మముక్రిందకు రాకుండుటయే దీనికి కారణము. పన్ను వసూలు చేయుటయే దాని ప్రధాన ధర్మము.

స్థానిక సంస్థల వోటింగు అర్హతకూడ చాల సంకుచితముగనే యున్నది; దానిని చాలవరకు పెంచి యెక్కువమందికి వోటింగుహక్కు

కలుగచేయవలెను. బొంబాయి కార్పొరేషనువంటి గొప్ప కార్పొరేషనుకూడ చాల సంకుచితమైన వోటింగు పద్ధతిచేతనే యెన్నుకొనబడినదని నేను భావించెదను. కొంతకాలముక్రిందట వోటింగు అర్హత నెక్కువమందికి కలుగచేయవలెనను తీర్మానము కార్పొరేషనులోనే యోడింపబడెను. చాలమంది సభ్యులు తమస్థితితో తృప్తిపడి దానిని మార్చుటకు పోగొట్టుకొనుటకు నిష్టపడరైరి.

కారణము లేవియైనను మన స్థానికసంస్థలంత జయప్రదమైనవి సమర్థమైనవికావు. అట్లున్నను వాటిని ప్రజాస్వామిక పరిపాలన యభివృద్ధిలోనున్న దేశములలోని కొన్ని మున్సిపాలిటీలతో పోల్చవచ్చును. సాధారణముగా నవి నీతిబాహ్యములుకావు; అసమర్థతయే వాటికున్నలోపము; బంధువుల కుద్యోగము నిచ్చుటయే వాటికున్న దుర్బలత్వము. వాటిలక్ష్యము లన్నియు సరియైనవికావు. ఇవి యన్నియు సహజములు. ఏలనన ప్రజాస్వామికము జయప్రదము కావలెనన్న దానివెనుక వివేకముగల ప్రజాభిప్రాయము బాధ్యత యుండవలెను. దానిబదులు మన కెక్కడ చూచిన నధికార ప్రాబల్యము, ప్రజాస్వామికముకు కావలసిన సమర్థత లేకపోవుటయు కాననగును. ప్రజాసామాన్యముకు విద్యనిచ్చు పద్ధతి లేదు. వివేకవంతమగు ప్రజాభిప్రాయమును నిర్మించు యత్నములు లేవు. కనుక విధాయకముగా ప్రజాదృష్టి వ్యక్తులమీద కులతత్త్వముల మీద తదితర స్వల్పసమస్యలమీద పడును.

మున్సిపలు పరిపాలనలో 'రాజకీయములు' లేకుండ చేయుటకే ప్రభుత్వ మందులో ముఖ్యముగా శ్రద్ధతీసికొనును. జాతీయోద్యమముతో సానుభూతిచూపు తీర్మానము చేసినచో ప్రభుత్వము గుడ్లెఱ్ఱ చేయును. జాతీయ వాసనగల పాఠ్యపుస్తకములను మున్సిపలు పాఠశాలలలో పెట్టనీయరు. జాతీయనాయకుల పటములనుకూడ నచ్చట పెట్టనీయరు. జాతీయపతాకము నచ్చటనుండి పీకివేతురు. లేదా మున్సిపాలిటీని రద్దుచేసెదరు. చాల రాష్ట్రప్రభుత్వములు మున్సిపలు సంస్థలనుండియు స్థానికసంస్థలనుండియు కాంగ్రెసువారిని తరిమివేయు

తీవ్రప్రయత్నములు చేసినట్లు కాన్పించును. మున్సిపలువిద్య మొదలగు శాఖలకు ప్రభుత్వ గ్రాంటుల నీయమని బెదిరించి యొకవిధమగు వత్తిడి కలుగజేసిన వారిపని యీడేరకలదు. కొన్నిచోట్ల ముఖ్యముగా కలకత్తా కార్పొరేషనులో శాసనోల్లంఘనములోగాని ప్రభుత్వ వ్యతిరేకమైన మరేయితర రాజకీయోద్యమములలోగాని జయిలుకు పోయినవారు పనికిరారను శాసనములుకూడ చేయబడెను. దీని యుద్దేశ్యము కేవలము రాజకీయమే; అసమర్థతకాని యసర్వాతకాని దీనికి కారణములుకావు.

మన మునిసిపాలిటీలు స్థానికసంస్థలు నెంతటి స్వాతంత్ర్యము ననుభవించుచున్నవో యవి యెంత ప్రజాస్వామికములో తెలుపుటకీ కొద్దియుదాహరణములే చాలును. అన్ని మున్సిపలు, స్థానికసంస్థల సేవలలోను రాజకీయ ప్రతికక్షులను లేకుండచేయు యత్నమున కర్థమేమియో మనము కొంచెము గ్రహింపవలసియున్నది. గత పదునాలుగు సంవత్సరములలోను దఫదఫాలుగా మూడులక్షలు జయిలుకుపోయిన ట్లుంచనా వేయబడెను. రాజకీయముల నటుంచి, యీ మూడులక్షలలోను భారతదేశములోని యత్యంత శక్తివంతులు, ఆదర్శపురుషులు, సాంఘిక శ్రేయస్సు నభిలషించువారు, స్వార్థరహితులు కలరనుట నిర్వివాదాంశము. వారు చొరవకలవారు, శక్తివంతులు, ధర్మతత్పరులు, సేవచేయవలెననెడి యాశయముకలవారు. కనుక ప్రజాసంస్థలలోను నితర యుపయుక్తమగు సేవలలోను పనిచేయుట కిట్టివారే సర్వవిధముల సమర్థులగుటచే వీరినే సేవకులుగ తీసికొనవలెను. అయినను వీరు వీటిలో ప్రవేశించకుండ ప్రభుత్వము సర్వప్రయత్నములను చేయుటయేగాక శాసనములనుకూడచేసి వారిని వారియెడల సానుభూతిచూపినవారిని శిక్షించెను; అది పెంపుడుకుక్కజాతికి ప్రాధాన్యత నిచ్చెను. దానినే ముందుకుత్రోయుచు మన స్థానికసంస్థలు సమర్థతతో పనిచేయుటలేదని ఫిర్యాదుచేయును. రాజకీయములకు స్థానికసంస్థలతో సంబంధములేదని ప్రభుత్వమువారెంత యెలుగెత్తిచాటినను, తమ్ము బలపరచుకొనుటకు రాజకీయము

లలో జోక్యము కల్పించుకొనుటకు ప్రభుత్వము కెట్టి యభ్యంతరము లేదు. గ్రామములలో ప్రభుత్వముతరఫున ప్రచారముచేయవలెనని స్థానిక బోర్డులలోని యుపాధ్యాయులు నిర్బంధింపబడిరి. లేనిచో వారి యుద్యోగములకు తర్పణముల నిచ్చుకొనవలెను!

గత పదిహేను వత్సరములనుండియు కాంగ్రెసుసేవకు లనేక క్లిష్టపరిస్థితుల నెదుర్కొనవలసివచ్చెను; వారు గొప్ప బాధ్యతలను వహించిరి. శక్తివంతమై యున్నిబలములను చేకూర్చుకొనిన ప్రభుత్వమును కొంత జయప్రదముగ వారెదిర్చిరి. ఈ కఠిన శిక్షావిధానము వారి కాత్మవిశ్వాసమును, సమర్థతను, చిరకాలము తాళగల శక్తిని ప్రసాదించెను. చాలకాలమునుండి పెత్తనము వెలిగించుచు దేశమును నిర్వీర్య మొనర్చుచుండిన ప్రభుత్వవిధానము భారత ప్రజల కే గుణగణములు, శక్తిసంపదలు లేకుండచేసెనో వాటి నిది ప్రసాదించెను. ఈ కాంగ్రెసు యుద్యమములోకూడ నన్ని ప్రజాసంబంధ యుద్యమము లలోవలె చాలమంది మూర్ఖులు, అసమర్థులు, అయోగ్యులు, నధములు లేకపోలేదు. అట్టివారింకను ఉన్నారు. కాని యొకేయర్హతలు గలిగిన మరియొకనికంటె సామాన్య కాంగ్రెసుసేవకు డెక్కువ సమర్థుడు, శక్తివంతుడు అని చెప్పుటకు నా కెట్టి సందేహములేదు. ఈ సందర్భములో ప్రభుత్వము వారి సలహాదారులు గుర్తించని మరియొక విషయము కలదు. కాంగ్రెసు సేవకుల కెట్టియుద్యోగము యెట్టినౌకరీ యవకాశము లేకుండచేయు యత్నమును యదార్థమైన విప్లకారు డాహ్వానము చేయును. సామాన్యకాంగ్రెసువాది యెంతమాత్రము విప్లవకారుడు కాడు. అతడు కొంతకాల మర్ధ-విప్లవ ప్రయత్నము చేసిన తరువాత తన నిత్యజీవితకలాపములోనికి దిగిపోవును. అతడు తన వర్తకములోనో వృత్తిలోనో స్థానిక రాజకీయ గజిబిజిలలోనో జిక్కుకొనిపోవును. అతని దృష్టిలో పెద్ద సమస్యలన్నియు మాసిపోవును; అతనికుండిన విప్లవతృష్ణ నశించును. ఒడలుబరువెక్కును. ఉత్సాహమే సన్నగిలి కడుపులోనీళ్ళు కదలనిస్థితిని వాంఛించును. కనుక నే విప్లవతత్వముగల కాంగ్రెసువాదులు తమతోడివారెన్నడు

శాసన సభలలోనికి స్థానిక బోర్డులలోనికి పోకుండగను నౌకరీలను వాంఛింపకుండగను చేయు యత్నించెదరు. ప్రభుత్వమువారిపు డట్లు చేసి వారి యత్నములకు కొంత సాయపడుచున్నారు. ఏలనన నౌకరీ దొరకకపోయినచో కాంగ్రెసు సేవకుని విష్లవతృష్ణ కొంతయైనను నిలుచును లేదా మరింత యభివృద్ధిచెందును.

ఒక సంవత్సరము మున్సిపలు పనితో నేను విసిగితిని. అచ్చట నేను నా శక్తినంతను చక్కగా వినియోగించినట్లు భావించితిని. నేను చురుకుగ పనిచేయగలిగితిని. కొంత సమర్థత చూపితిని కాని గొప్ప మార్పు దేనిని చేయజాలకపోతిని. చివరకు నేను రెండేండ్లు పూర్తి యగుటతోడనే 1925 లో రాజీనామా యిచ్చితిని. ఈ వత్సరమే శరత్కాలములో నా భార్యకు చాల జబ్బుచేసెను. ఆమె యనేక మాసములు లక్నో ఆస్పత్రిలో నుండెను. ఆ వత్సరము కాంగ్రెసు కాన్పూరులో జరిగెను. నేను అలహాబాదు కాన్పూరు లక్నోల మధ్య (నే నింకను కాంగ్రెసు కార్యదర్శిగనే యుంటిని) తఱచు పరుగిడ వలసివచ్చెను. నా భార్యకు స్విట్జర్లాండులో మరికొంత వైద్యము చేయించవలెననిరి. నేను సంతోషించితిని. భారతదేశమును వీడిపోవుట కైదైనను వీలుదొరుకునా యని నేను చూచుచుంటిని. నా మనసు చాల చికాకుగా నుండెను. నాకు నిర్దుష్టమైన మార్గము కాన్పించకుండెను. నేను భారతదేశమునకు చాల దూరములో నున్నచో నచ్చటినుండి విషయములను నిర్దుష్టముగా చూడగలుగుదునని యనుకొంటిని. 1926 మార్చి మొదటివారములో నేను, నా భార్య, కుమార్తె బొంబాయినుండి వెనీసుకు పయనమైతిమి.

21

యూరపులో

పదమూడు సంవత్సరముల తరువాత నేను తిరిగి యూరపు వెళ్ళితిని. ఈ పదమూడేండ్లు యుద్ధము, విప్లవము, అద్భుతమైన మార్పులతో నిండియుండెను. పాతప్రపంచమంతయు యుద్ధమువలన కలిగిన రక్తస్రావములలోను, భీతాంగములోను నశించెను. ఒక క్రొత్త ప్రపంచము తయారయ్యెను. మే మచ్చట సంవత్సరము తొమ్మిది మాసము లుంటిమి. నా కచ్చట శరీర మనశ్శాంతులు కుదిరెను. నా చెల్లెండ్రిద్దరు మాతో నుండిరి. నే నప్పుడప్పు డితర ప్రాంతములకు పోవుచుండెడివాడను. పర్వత శిఖరములమీద నున్నపుడు నాకు హిందూదేశముకు నైరోపా ప్రపంచమునకుకూడ సంబంధము లేకయుండెను. కాని మొత్తముమీద జీవితము నిస్సారముగ నుండెను. నా భార్య యారోగ్యబలములు వృద్ధియయ్యెను. మాకు భారతీయు లంతగా కాన్పించెడివారుకారు. అచ్చటచ్చట భారతదేశమునుండి బహిష్కరింపబడినవారు, పాత విప్లవకారులు కాన్పించెడివారు.

జినీవాలో శ్యామ్‌జీ క్రిష్ణవర్మ వ్యాధిగ్రస్తురాలైన భార్యతో నొక మేడమీద నుండెడివాడు. ఆ వృద్ధదంపతులు నౌకరు లెవరు లేకుండ తమంత తామే కాలక్షేపము చేసెడివారు. అతనియొద్ద చాల ధన మున్నను ఖర్చుచేయక ట్రాముబండి నెక్కుటకు బదులు నడిచిపోయెడివాడు. అతని యిల్లు, నేల, గదులు, బీరువాలు, పుస్తకములు సమస్తము దుమ్ముతోను ధూళితోను నిండియుండెడివి. పుస్తకములు, కాగితములు నేలమీద చిమ్మివేయబడి యుండును.

శ్యామ్‌జీ విదేశములలో చదువుకొను భారతీయులకొరకు తన ధనము వినియోగింపనెంచి దానికి నన్నొక ధర్మకర్తగా నుండవలెననెను. నే నట్టి బాధ్యతను పెట్టుకొనుట కిష్టపడలేదు. నే నొకవేళ శ్రద్ధచూపినచో నేనతని ధనము నాశించుచున్నానని యత

డనువమానపడునని నా భయము. అతనివద్ద నే నున్నదియు నెవరికి తెలియదు. భారతదేశమునుండి యప్పుడప్పుడు ప్రధాన భారతీయులే జినీవా వచ్చుచుండిరి. శ్యామ్‌జీ యధికారవాసన కలవారి నెవరిని సమీపించడు. అనధికారులు వచ్చినప్పు డతడు వారితో చర్చించు చుండును. కాని వా రతనితో బహిరంగముగా కలియుటకు మాట్లాడు టకు నిష్టపడక రహస్యముగా క్షమార్పణ చెప్పుకొనెడివారు. అతని తోడి సంపర్కము ప్రమాదకరమని తలంపబడుచుండెడిది.

కనుక శ్యామ్‌జీయు, నతనిభార్యయు, బిడ్డలు బంధువులు, స్నేహితులు, పరిచయులు, తుద కెట్టి మానవసంపర్కము లేకుండ నొంటరిగనే జీవించెడివారు. అతడు పూర్వ సంప్రదాయమునకు చెందినవాడగుటచే నతని రోజులు గతించెను. కాని యతని నేత్ర ములలో నింకను పాత యగ్నికణములు కొన్ని లేకపోలేదు. మా యిరువురకు సామ్యమెంతమాత్రము లేకపోయినను నాతనియెడల సానుభూతి, గౌరవము కలవు. ఈ వృద్ధ దంపతు లిరువురు నొకరి తరువాత నొక రీమధ్యనే చనిపోయిరని వార్తాపత్రికలు తెలుపు చున్నవి. భారతనారీమణులకు విదేశములలో శిక్ష నొసగుట కతని భార్య చాలధనము నిచ్చెనట.

స్విట్జర్లండులో నేను రాజామహేంద్రప్రతాపుని చూచితిని. ఇతడు మంచి యుత్సాహపరుడు. ఇత డెప్పుడు యదార్థవిషయములను గమనింపక గాలిమేడలలో నివసించును. ఇత డొక చిత్రమైనమనిషి. ఇతని దుస్తులు, మిలిటరీవేషము, రష్యనుజోళ్ళు, పెద్దపెద్ద జేబులు; ఆ జేబులనిండ కాగితములు, బొమ్మలు, ఉత్తరములు, డాక్యుమెంటులు అన్నియు వింతగా నుండును. ఒకసారి చీనాదేశములో నతని విలువ యైన కాగితములపెట్టె పోయెనట. కనుక నప్పటినుంచియు నత డా పెద్దజేబులలోనే సమస్తము తీసికొనిపోవునట! అతడు చీనా జపాను టిబెట్టు ఆఫ్ఘనిస్థానము మొదలగు దేశములలో సంచారమొనర్చెను. అతని సంచారములనుగురించి సాహసకృత్యములను గురించి యనేక చిత్రవిచిత్ర కథల నతడు చెప్పెడివాడు. అతడు 'ఆనందసంఘము'

అను నొక సంఘమును స్థాపించెను. 'ఆనందములో నోలలాడుము' అను నదియే దానిలక్ష్యము. ఈ సంఘమునకు లట్వియా (లేక లిథువేనియా)లో నఖండ విజయము చేకూరెను.

ప్యారిసునగరములో మేము కామాదొరసానిని చూచితిమి. ఆమె చలచల మీదకువచ్చి వ్రేలుచూపుచు, నతితీక్ష్ణముగా చూచుచు హఠాత్తుగా నీ వెవ్వరవని యడుగునపు డతి భయంకరముగ నుండును. తరువాత ఇటలీలో నేను మౌల్వీ ఒబేదుల్లాను కలుసుకొంటిని. అతడు తెల్వైనవాడేకాని, పాతరకపు రాజకీయ యెత్తులలో నారితేరినవాడు. ఆధునిక భావములతో నతని కెట్టి సంపర్కము లేదు. అతడు 'భారత సంయుక్త ప్రజాస్వామికములు' అను నొక ప్రణాళికను వ్రాసెను. అది కులసమస్యలను పరిష్కరించుటకొక యోగ్యమైన యత్నము. బర్కతుల్లా మరియొక మౌల్వీ అతనిని నేను మొదట బెర్లినులో కలుసుకొంటిని. అత డత్యుత్సాహవంతుడు; ప్రసన్నవదనుడు; వృద్ధుడైనను సంతోషముతో నుప్పొంగువాడు. అతడు నిరాడంబరుడు; అంత తెలివిగలవాడు కాకపోయినను నూతనభావముల నలవర్చుకొనుటకు, నాధునిక ప్రపంచము నర్థము చేసికొనుటకు యత్నించెడివాడు. అతడు 1927 లో స్యాన్ ఫ్రాన్సిస్కోలో చనిపోయెనని విని నేను చాల విచారించితిని.

బెర్లినులో యుద్ధసమయములో భారతీయులందరు కలసి యొక సంఘముగా నేర్పడిరి. వీరికథ వినదగినది. వీరిలో చాలమంది వివిధ జర్మను విశ్వవిద్యాలయములలో 1914 సంవత్సరములో విద్యార్థులుగా నుండెడివారు. వీరు జర్మను విద్యార్థులతో సమానముగా నాడుకొనుచు, పాడుకొనుచు వారి విజ్ఞానముపట్ల గౌరవ, మర్యాదలను చూపెడివారు. యుద్ధముతో వీరికెట్టి సంబంధము లేకపోయినను జర్మనీలో బయలుదేరిన జాతీయావేశము వీరినికూడ కొంతవరకు కదల్చెను. వారు బ్రిటన్‌కు వ్యతిరేకులేకాని జర్మనీకి సుముఖులుకారు. వారి భారతజాతీయతచే బ్రిటిషువారి శత్రువులు వారికాప్తులైరి. బుద్ధిపూర్వకముగా విప్లవకారులైన భారతీయులు కొందరు యుద్ధసమ

యములో స్విట్జర్లండుద్వారా జర్మనీ వచ్చిరి. వీరొక సంఘముగా నేర్పడి యమెరికాలోనున్న హారదయాలును రప్పించిరి. ఇంతలో బ్రిటిషువారికి వ్యతిరేకముగా నున్నవారినందరిని తమవైపునకు త్రిప్పుకొనవలెనను నుద్దేశ్యముతో జర్మను ప్రభుత్వ మీ సంఘమునకు ప్రాధాన్యత నిచ్చెను. భారతీయు లీ యంతర్జాతీయ పరిస్థితులను తమ జాతీయ ప్రయోజనములకు వినియోగింప నెంచి జర్మనుప్రభుత్వముతో బేరములు చేయనారంభించిరి; భారతదేశమునకు స్వాతంత్ర్యము నిచ్చెదమను నభయహస్తమును ప్రమాణపత్రములను కోరిరి. జయము చేకూరినచో భారతదేశమునకు స్వాతంత్ర్యము నిచ్చెదమను షరతుతో జర్మను విదేశ రాజ్యాంగశాఖవారు వీరితో క్రమమైన సంధి చేసికొనినట్లు కాన్పించును. ఈ షరతుతోను, మరికొన్ని చిల్లర షరతులతోను భారతసంఘమువారు యుద్ధములో జర్మనీకి సహాయము చేయుటకొప్పుకొనిరి. ఈ సంఘముపట్ల నన్నివిధములైన యధికార మర్యాదలు చూపబడెను. దీని ప్రతినిధులను విదేశ రాయబారుల వలెనే గౌరవించిరి.

అప్రయత్నముగా మీదపడిన యీ యాకస్మిక ప్రాముఖ్యత వలన వీరిలో కొందరిబుర్రలు తిరిగిపోయెను. చరిత్రాత్మకమైన పాత్రలను ధరించుచున్నట్లు, నూతనశక నిర్మాణ కృషిలో నిమగ్ను లయిపోయినట్లు వీరు భావించెడివారు. వీరిలో చాలమంది యద్భుత సాహసకార్యములను చేసిరి. కొంతమంది మృత్యువువాతనుండి బయట పడిరి. యుద్ధావసానకాలమున వీరి ప్రాముఖ్యత తగ్గిపోయెను. హార దయాలు నీ సంఘమువారు, జర్మను ప్రభుత్వముకూడ విశ్వసింపలేదు.

యుద్ధము ముగిసెను. దానితో బెర్లినులోని భారతసంఘము కూడ నంతమొందెను. వారి యాశలన్నియు నడియాసలగుటచే వారి జీవితములు దుర్భరముగ నుండెను. వారు పెద్దయెత్తుల నెత్తి విఫల మనోరథులయిరి. యుద్ధకాలములోని యీ సాహసము, ఆ ప్రాముఖ్యత ముందర జీవిత మిప్పుడు పేలవమయ్యెను. కాని, యీ పేలవ జీవిత మునకుకూడ వారు నోచికొన్నరైరి! వారు భారతదేశమునకా తిరిగి

రాలేరు! యుద్ధములో దెబ్బతినిన జర్మనీలో జీవించుటంత చులకన విషయము కాదు. తరువాత కొద్దిమందిని భారతదేశమునకు రానిచ్చిరి. కాని చాలమంది జర్మనీలోనే యుండవలసివచ్చెను. వారి స్థితి కడు శోచనీయము. వారే రాజ్యముకు చెందని ప్రజలైరి. వారికి క్రమమైన ప్రయాణటిక్కెట్లు లేవు. వారు జర్మనీ దాటి బయటకు పోజాలరు. జర్మనీలో జీవించుట యమలోకములో జీవించుటవలె నుండెను. వారు స్థానికపోలీసుల దయాధర్మబిచ్చముల పాలైరి. ఒకప్రక్క కష్టములు, రక్షలేకపోవుట, మరియొకవంక నన్నమో రామచంద్రాయని పొట్ట చేతబట్టుకొనిపోవుట ! ఇది వారి స్థితి.

1633 లో నాజీ ప్రభుత్వము వచ్చినతరువాత, నాజీ సిద్ధాంతమును పూర్తిగా నంగీకరించిననేతప్ప, వారి కష్టములు ద్విగుణమగుచుండెను. జర్మనీలో నాసియా దేశపు విదేశస్థులయెడల నేవగింపు కలదు; సరిగా నున్నంతసేపు వారి నచ్చట నుండనిత్తురు. హిట్లరు హిందూదేశములో బ్రిటిషుసామ్రాజ్య పరిపాలన యుండవలెననియే యనేకసార్లు వచించెను; కనుక బ్రిటిషుప్రభుత్వమువారి యాగ్రహమునకు గురియైన భారతీయులను హిట్లరు ప్రోత్సహింప నొల్లడు.

చంపాక్రమణ పిళ్ళ యనునతనిని నేను బెర్లినులో కలుసుకొంటిని. ఇతడు మరియొక ప్రవాసి; ఆడంబరుడు, కనుక భారత విద్యార్థు లితని కమర్యాదయైన బిరుదు నిచ్చిరి. ఇతనికి జాతీయత యొక్కటియే యర్థమగును. ఇత డే సమస్యను సాంఘికముగ, నార్థికముగ గ్రహింపజాలడు. జర్మనుజాతీయవాదులతో నిత డెంతమాత్రము నటమటిక లేక యుండెడివాడు. ఇతడు బెర్లినులో చనిపోయెనని కొద్ది నెలలక్రిందట నేను జయిలులో నుండగా వింటిని.

వీరేంద్రనాథ చటోపాధ్యాయుడు కేవలము భిన్నమైన తరగతికి చెందిన పురుషుడు! ఇతడు భారతదేశములో ప్రసిద్ధికెక్కిన వంశములోనివాడు! ఇతని నందరు చటోయని పిలిచెడివారు. ఇతడు మంచి సమర్థుడు. నిత్యసంతోషి. ఇత డెప్పుడు డబ్బుకు బాధపడెడి

వాడు; బట్టలు చినిగియుండెడివి; తిండి కెప్పుడు తడువుకొనవలసి వచ్చెడిది. అయినను నతని హాస్యము, హుషారు అతని నెన్నడు విడువకుండెను. నేను ఇంగ్లండులో చదువుకొను రోజులలో నా కంటె నతడు కొన్ని యేండ్లు పెద్ద. నేను హారో వెళ్ళినపు డతడ డాక్సుఫర్డులో నుండెను. నాటినుండి యతడెప్పుడు భారతదేశము రాలేదు. ఒకొక్కప్పుడు స్వదేశమునకు పోవలెననెడిబెంగ యతనిని బాధించెడిది; చిరకాలముక్రిందటనే యతడు తన గృహపాశముల నన్నింటిని తెంపివేసెను; హిందూదేశము వచ్చినను అతనికి సంతోషముండ నేరదనుట నిశ్చయము. ఆహా! చాల సంవత్సరములు గతించినను, చాలదేశములు తిరిగినను స్వదేశ గమనోత్కంఠ యెంతటిబలీయమైనది! 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' ఈ వ్యాధి ఈ యాత్మ దాహము (మేజినీ యనినట్లు) యే ప్రవాసికి తప్పెను ?

నేను విదేశములలో కలుసుకొనిన భారతరాజకీయ ప్రవాసుల త్యాగ సాహసములను, దుర్భర బాధలను ప్రస్తుత యదార్థ కష్టములను పూర్తిగా గ్రహించితిని. అయినను వారిలో చాలమంది నా కంతగా నచ్చలేదు. నేను వారి నెందరనో కలుసుకొనలేదు. వారు ప్రపంచమంతటను చిమ్మబడియున్నారు. పేరు ప్రతిష్ఠ లున్నవారినే కొద్దిమందినో మన మెరుగుదుము. తక్కినవారు భారతప్రపంచము నుండి మృగ్యమై వారు సేవింపనెంచిన భారతీయులచేతనే విస్మరింపబడిరి. నేను కలుసుకొనిన కొద్దిమందిలోను చటోపాధ్యాయ, యం. యన్. రాయి లిరువురే తమబుద్ధిబలముచే నన్ను మెప్పించిరి. రాయిని నేను మాస్కోపట్టణములో నొక్కయరగంటసేపు కలుసుకొంటిని. అప్పు డతడు కమ్యూనిష్టు నాయకుడు. ఇప్పు డతని కమ్యూనిజము సనాతన కామింటరన్ జాతినుండి దిగిపోయెను. చటో, కొంచెము వాసనయున్నను; క్రమమైన కమ్యూనిష్టు కాడు; రాయి యిప్పటికి మూడు వత్సరములకు పైగా భారతదేశ జయిలులో నున్నాడు. మేము చాలమంది యూరపియనులను అమెరికనులను కలుసుకొంటిమి.

విఖ్యాత పురుషుడైన రోమారోలాను చూచుటకు మే మనేక సార్లు జినీవానుండి ప్రశాంతమైన ఆల్గాసీమకు యాత్రలు చేసితిమి. మొదటిసారి గాంధీజీ దగ్గరనుండి పరిచయలేఖను తీసికొని వెళ్ళితిమి. జర్మనీదేశపు యువక కవి, నాటక రచయితయగు ఆర్నష్టు టోలరును మరువజాలను. నాజీ ప్రభుత్వములో నిష్ఫ డతడు జర్మనుకాడు. న్యూయార్కు-యొక్క- నాగరిక స్వాతంత్ర్య సంఘముకు చెందిన రోజరు బాల్డ్వినుకూడ స్మరణీయుడు. అమెరికాలో స్థిరపడిన గ్రంథకర్త ధనగోపాల ముఖర్జీతో జినీవాలో స్నేహము చేసికొంటిమి.

యూరపు వెళ్లుటకు ముందు హిందూదేశములో ఆక్సుఫర్డు-గ్రూపు - మూవ్మెంటుకు చెందిన, ఫ్రాంక్ బుశ్మనును కలుసుకొంటిని. అతడు తన యుద్యమమును గురించిన సాహిత్యమును కొంత నాకిచ్చెను. నేను దాని నాశ్చర్యముతో చదివితిని. అకస్మాత్తుగా మతమును మార్చుట, తప్పిదముల నొప్పుకొనుట, తిరిగి యుద్ధరింపబడి రనుట; బుద్ధిబల సంపల్లక్షణము కానట్లు నాకు తోచెను. బుద్ధిమంతులుగా కాన్పించు కొందరువ్యక్తు లీ వింతయుద్రేకముల నెట్లనుభవింపగలరో నా కర్థముకాలేదు. నా కుతూహలము హెచ్చెను. జినీవాలో నేను బుశ్మనును తిరిగి కలుసుకొంటిని. అతడు నన్ను తన అంతర్జాతీయ గృహవిందులో నొకదానికి రమ్మనెను. ఇది రొమానియాలో నెచ్చటనో యుండెను. ఈ నూతన భావోద్రేకమును నేను దగ్గిర నుండి చూడజాలకపోయినందుకు విచారించితిని. నా కుతూహలము శాంతింపదయ్యెను. ఈ ఆక్సుఫర్డు గ్రూపు మూవ్మెంటు యొక్క-యభివృద్ధినిగురించి నేను చదివినకొలది నా యాశ్చర్య మధికమగు చుండెను.

22

భారతదేశములో వివాదములు

మేము స్విట్జరులందు చేరుటతోడనే యింగ్లండులో పనివారందరు సమ్మెకట్టిరి. నాకు చాల యుద్రేకము కలిగెను. నా యభిమాన మంతయు సమ్మెదారులమీదనే యుండెను. కొద్దిరోజులలోనే యీ సమ్మె యంతరించెననువార్త వ్యక్తిగతముగా నాకొక దెబ్బవలె నుండెను. కొన్ని నెలలయిన తరువాత నేను యింగ్లండులో కొద్దిరోజులుంటిని. గనులలో పనిచేయువా రింకను పోరుచుండిరి. రాత్రులందు లండను అంధకార బంధురమయ్యెను. గనులు త్రవ్వుప్రాంతముకు నేను వెళ్ళితిని. బక్కపేగులు, లోతుకళ్ళు, బిక్కమొగములు కల స్త్రీలను, పురుషులను, బిడ్డలను నేను చూచితిని.

ఇంకొక యాశ్చర్య మేమన నీ సమ్మెదారులను, వారి భార్యలను స్థానిక కౌంటీకోర్టులలో విచారణ చేయుచుండిరి. విచారణచేయు మేజిస్ట్రేటు లీ బొగ్గుగనులకు డైరెక్టర్లుగనో లేక మేనేజర్లుగనోయుండిరి, వారు విచారణ సలిపి యత్యవసర శాసనముల క్రింద వీరిని చిన్న చిన్న నేరములకు శిక్షించుచుండిరి. ఒక కేసు, ముఖ్యముగా నా కమిత కోపము కలిగించెను. తమతో సమ్మెకట్టనివారిని వెక్కిరించిరని యొడిలో బిడ్డలుగల ముగ్గురు నలుగురు స్త్రీలను ముద్దాయి బోనులోనికి రప్పించి విచారణచేయ నారంభించిరి. ఆ యువతీమ తల్లులును, (వారి శిశువులును) దుఃఖభాజనులై, తగిన పోషణ లేక యుండిరి. దీర్ఘపోరాటము వారి యారోగ్యమును నాశనముచేసెను. వారు కృశించి, శల్యములవలె నుండిరి. తమ నోటిదగ్గర యన్నము పడగొట్టుచున్నారని సమ్మెకట్టనివారిపై వారికి ద్వేషము హెచ్చుచుండెను. పైతరగతులవారు క్రిందితరగతులవారి కెట్టి న్యాయము కలిగింతురో మనము తఱచు వినుచునే యుందుము. హిందూదేశములో నింతకంటె సామాన్యమైనది వేరొకటి యుండబోదు. కాని యింగ్లండులో నిట్టి దారుణము లుండునని నే ననుకొనలేదు. అది నా

కొక యశనిపాతమువలెనుండెను. ఈ సమ్మెదారులలో కలిగిన భీతి నా కాశ్చర్యము కలిగించెను. పోలీసులు, అధికారులు వారి నమితముగా భయపెట్టిరి. వా రనేక నైచ్యములను నోరెత్తకుండ సహించిరి. చిర పోరాటమువలన వా రలసిపోయిరనుటలో సందేహము లేదు. వారి యుత్సాహము వెన్నువిరిగియుండెను. వారితో సమ్మెకట్టినయితర సంఘములవారు చాలకాలము క్రిందటనే వారిని విడిచిపెట్టిరి. అయినను భారతదేశములోని దరిద్రకార్మికులకు వీరికి హస్తిమశకాంతరముకలదు. బ్రిటిషు బొగ్గుగనుల పనివారల కొక కట్టుదిట్టమైన సంఘము కలదు; జాతినంతను, లేక ప్రపంచమునంతను యావరించిన కార్మిక యుద్యమాభిమానము కలదు; ఎప్పటికప్పుడు వార్తలను ప్రకటించు సదుపాయములు కలవు. ఇతరవిధములైన సౌకర్యము లెన్నియో కలవు. భారత కార్మికున కివేమియు లేవు. కాని, వారిద్దరిలోను కాన్పించు ఆ బిక్కచూపులో, నా భయవిహ్వాలతలో నెంతయో సాదృశ్యము కలదు.

ఆ సంవత్సరము శాసనసభలకు అసెంబ్లీసభకు భారతదేశములో నెన్నికలు జరుగుచుండెను. వాటియందు నా కంత శ్రద్ధలేదు. నేను స్విట్జర్లండులో నుండగా వాటినిగురించి జరుగుచుండిన కొన్ని భయంకర వివాదములు నాకు వినవచ్చెడివి. శాసనసభలలోనున్న స్వరాజ్యపార్టీ లేక క్రమమైన కాంగ్రెసుపార్టీని యెదిరించుటకు పండిత మదన మోహన మాలవ్యా లాలాలజపతిరాయిగార్ల యాధిపత్యమున జాతీయపక్షమను నొక నూతన పక్ష మేర్పడెను. పాత పార్టీకి యీపార్టీకిగల సూత్రభేదములేవియో నాకప్పుడు తెలియకుండెను. నిశ్చయముగా శాసనసభలలోని ప్రస్తుత భారతపార్టీలన్నియు అల్లిబిల్లి పార్టీలేకాని మరియొకటి కాదు; వాటిని భేదించు నిజమైన సూత్రము లేవియు లేవు. మొట్టమొదటిసారి స్వరాజ్యపార్టీ శాసనసభలలో తీవ్రతను ప్రవేశపెట్టెను. అది యితరపార్టీలకంటె నెక్కువ తీవ్రరాజనీతి నవలంబించెను. కాని, యిది మోతాదు భేదముగాని తత్త్వతః భేదముకాదు.

ఈ నూతన జాతీయపార్టీ మరికొంత మితవాదదృష్టి కలిగి స్వరాజ్యపార్టీకంటె నిశ్చయముగా ప్రభుత్వమువైపు మ్రొగ్గెను. అది హిందూమహాసభతో నెక్కువగా కలిసి పనిచేయుచున్న పదహారణాల హిందూపార్టీగకూడ నుండెను. మాలవ్యా పండితుడు దానికి నాయకుడగుట యర్థమగుచునే యున్నది. ఏలనన అది కొంచెమించుమించు అతని ప్రజాదృష్టినే వ్యక్తముచేయుచుండెను. అతడు తన పాతస్నేహములచేతనే కాంగ్రెసులో నుండెను. కాని యతనికి లిబరలు లేక మితవాదులకు బుద్ధిభేద మేమియులేదు. అతడు సహాయ నిరాకరణోద్యమమును చేబట్టలేదు. కాంగ్రెసుయొక్క ప్రత్యక్ష కార్యవిధానము నంగీకరింపలేదు. కాంగ్రెసు నీతిని నిరూపించుటలో నతని కెట్టి సంబంధములేదు. నూతన కాంగ్రెసు అతని నెప్పుడును గౌరవించును. ఆహూయము చేయును; కాని, యతడు నిజముగా నందులోనివాడు కాడు. అతడు వర్కింగుకమిటీ సభ్యుడు కాడు. అతడు కాంగ్రెసు ఆజ్ఞలను, ముఖ్యముగా శాసనసభలకు చెందిన వాటిని శిరసావహింపలేదు. అతడు హిందూమహాసభయొక్క సుప్రసిద్ధ నాయకుడు. కులసమస్యలలో నతని నీతికి, కాంగ్రెసు నీతికి భేదము కలదు. అతనికి మొట్టమొదటినుంచియు కాంగ్రెసుతో సంబంధముండుటచే నా సంస్థలయందుకల మమకారము వీడకుండెను. స్వాతంత్ర్య యుద్ధసమయమున కాంగ్రెసు ఒక్కటే దీనికొరకే కొద్ది ప్రయోజనకర కార్యమునైన చేయుచున్న ట్లతడు గ్రహించెను. భావోద్రేక మతనిని కొంత కాంగ్రెసువైపు లాగును. ఈ విధముగా నతని హృదయము తఱచు కాంగ్రెసు డేరాలలో (ముఖ్యముగా యుద్ధసమయములలో) నుండును. అతనిబుద్ధి యితరచోట్ల నుండును. విధాయికముగా నీ స్థితి యతనిలో నిరంతర సంఘర్షణను తెచ్చి పెట్టుచుండెను. అప్పుడప్పు డొకేసారి రెండువైపులకుపోవు ప్రయత్నముండెడిది. ఇది ప్రజలను కలవరపరచుచుండెను. కాని జాతీయత యొక కలగూరగంప. మాలవ్యాజీ కేవల జాతీయవాది. అతనికి సాంఘిక, ఆర్థిక మార్పులతో నెంతమాత్రము సంబంధములేదు.

అతడు ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానికములన్నిటిలోను పాత సనాతన క్రమమునే సమర్థించెను; ఇంకను సమర్థించును. భారత రాకుమారులు, తాలూకుదార్లు, పెద్ద జమీందార్లు అతనిని తమ హితము కోరు మిత్రునివలె చూతురు. ఇది యుక్తమే! భారతదేశములో విదేశీయుల యధికార మెంతమాత్రము లేకపోవు టొక్కటియే యతనికి కావలసిన మార్పు. అత డెప్పుడో తన చిన్నతనములో చదువు కొన్నట్టియు, పొందినట్టియు రాజకీయ చదువు, రాజకీయ శిక్షణము నతనిబుద్ధి నింకను పట్టియుండెను. విప్లవయుతము, శక్తివంతము నగు నీ యుద్ధానంతర యిరువదియవ శతాబ్దమున నతడు టి. హెచ్. గ్రీన్, జాన్ స్టూవర్టు మిల్లు, గ్లాడ్ సన్, మోర్లే మొదలగువారి పందొమ్మిదవ శతాబ్దపు టర్ధస్థావర దృష్టితోను, మూడు, నాలుగు వేల యేండ్లనాటి పాత హిందూ విజ్ఞాన సాంఘికశాస్త్ర దృష్టితోను చూచును. ఇది పరస్పర విరుద్ధభావముల కలయిక; కాని యీ పరస్పర విరుద్ధముల నన్నింటిని సమన్వయపరచగల తన శక్తియం దతని కద్భుతవిశ్వాసము కలదు. చిన్నవయసునుండియు ననేకరంగములలో నతడు గావించుచువచ్చిన చిరకాల ప్రజాసేవక చరిత్రయు, కాశీ హిందూ విశ్వవిద్యాలయమువంటి మహాసంస్థను జయప్రదముగ స్థాపించుటయు నతని నిష్కళంక విశ్వాసము, శ్రద్ధ, నిష్కాపట్యత మనోజ్ఞమగు వక్తృత్వము, సాధుస్వభావము, ప్రసన్నరూపరేఖాదులు– ఈ యన్నింటిచే నతడు భారతప్రజలచే, ముఖ్యముగా హిందువులచే ప్రేమింపబడుచున్నాడు. రాజకీయములలో నతనితో నేకీభవింపక పోయినను, లేక ననుసరింపకపోయినను వా రతనిని గౌరవింతురు, ప్రేమింతురు. వయసుచేతను, చిరప్రజాసేవచేతను, అతడు భారత రాజకీయ భీష్ముడు. కాని, యీ భీష్ముడు కొంచెము పూర్వకాలపు మనిషివలె కాన్పించును. ఇతని కాధునిక ప్రపంచముతో నెంత మాత్రము సంబంధములేదు. అతని కంఠధ్వని శ్రావ్యముగనుండును. కాని చాలమంది కతని భాష యర్థముకాదు, లేదా వారు దానిని పెడచెవినిబెట్టుదురు.

మాలవ్యాజీ రాజకీయముగ తనకంటె చాల యభివృద్ధిచెంది కాంగ్రెసు నీతికి కట్టుబడగల శిక్షను కోరెడి స్వరాజ్యపార్టీలో చేర జాలకపోవుట సహజము. అతనికి కొంత తక్కువ తీవ్రత గలిగినట్టి దియు, వ్యక్తిగతముగ నెక్కువ స్వేచ్ఛనిచ్చునట్టిదియు నగు పార్టీ కావలెను. నూతన పార్టీలో నతని కివి దొరకెను. దానికతడే విధాత, యతడే నాయకుడు.

లాలా లజపతిరాయికి కొంత మితవాద దృష్టియే. కుల సమ స్యలలో కొంత భేదభావమున్నను అత డీ నూతన పార్టీలో నెట్లు చేరెనో తెలిసికొను టంత తేలిక కాదు. ఆ వేసవిలో నేను లాలాజీని జీనీవాలో కలుసుకొంటిని. మా సంభాషణలవలన నతనికి కాంగ్రెసు పార్టీపై నెదురుతిరుగు యుద్దేశ్యమున్నట్లు నేను కనుగొన్నైతిని. ఇది యెట్లు సంభవించెనో నా కిప్పటికీ తెలియదు. కాని యెన్నికలు జరుగుచున్న కాలములో నతడు కొన్ని యన్యాక్తమైన నిందల నారో పించెను. వీటిద్వారా యతనిమనసు యెట్లు పనిచేయుచున్నదియు మనకు తెలియదు. కాంగ్రెసు నాయకులు భారతేతరులతో కుట్రలు పన్నుచున్నారనియు, కాబూలులో కాంగ్రెసుశాఖను నిర్మించు టట్టిదేయనియు నతడు నిందించెను. అనేకసారులు కోరినను అతడు తన నిందల నెప్పుడు నిరూపించలేదు. వివరములను తెలు పను లేదు.

లాలాజీ చేసిన నిందలను నేను స్విట్జర్లాండులో పత్రికద్వారా తెలిసికొని యాశ్చర్యపడితిని. కాంగ్రెసు కార్యదర్శిని కనుక నాకు మా సంస్థసంగతి యంతయు తెలియును. కాబూలుకమిటీని కాంగ్రెసు క్రింద తీసికొనుటకు నేనే కారకుడను. అప్పుడు నా కా నిందలలోని వివరములు తెలియకపోయినను, వాటి స్వభావమునుబట్టి కాంగ్రెసుకు సంబంధించినంతవరకు వాటి కాధారములేవియు లేవని నేను చెప్ప గలను. ఇందులో లాలాజీ యెట్లు మభ్యపడెనో నాకు తెలియదు. అతడనేక వదంతులపై నాధారపడి యుండవలెను. ఈమధ్య నతడు మాల్వీ ఒబేదుల్లాతో చేసిన సంభాషణ దీనికి కారణమగునేమో;

కాని యీ సంభాషణలో నా కసామాన్యమైన దేదియు గోచరించ లేదు. కాని యెన్నికలు అసాధారణ విషయములు. అవి సామాన్య ప్రమాణములను తారుమారు చేయును, బుద్ధులను చెడగొట్టును. నేను వాటిని చూచినకొలది నాకాశ్చర్యము హెచ్చుచున్నది; ఏవ గింపు మెండగుచున్నది.

కాని, వ్యక్తులసంగతి యటుండ, దేశములో కులకక్షలు హెచ్చుచుండుటచే జాతీయపక్షమో, లేక నట్టి మరియొక పక్షమో తప్పనిసరి యయ్యెను. ఒకవంక హిందువుల జనసంఖ్యనుచూచి ముస్లి ములు భయపడుచుండిరి. మరియొకవంక ముస్లిములు బెదరించుచున్నా రని హిందువులకోపము హెచ్చుచుండెను. ప్రత్యేక హక్కులనిచ్చె దరా ? లేక అవతలప్రక్కకు లేచిపోమా ?' 'నిలుచున్నవారు నిలు చున్నప్రకారముగనే జవాబు చెప్పవలెను.,' అనువిధమున ముస్లిములు దండనచేసి యడుగుచున్నట్లు చాలమంది హిందువులు భావించిరి. ఈ కారణముచేతనే హిందూ మహాసభకు కొంత ప్రాముఖ్యత వచ్చెను. ఇది హిందూజాతీయతకు, ముస్లిము కులతత్త్వము నెదిరించు హిందూ కులతత్త్వముకు ప్రాతినిధ్యము వహించెను. హిందూమహా సభవారి తీవ్ర కార్యక్రమము ముస్లిము కులతత్త్వమును మరింత రెచ్చగొట్టెను; ఈ విధముగా క్రియ, ప్రతిక్రియల కంతు లేకుండెను. ఈ మథనములో దేశములో కులజ్వరము హెచ్చిపోయెను. ముఖ్య ముగా నిది దేశములోని యధికసంఖ్యాకులైన వర్గమువారికి నల్ప సంఖ్యాకులలో నెక్కువమందిగల వర్గములవారికి మధ్యగల సమస్య. కాని, చిత్రముగా దేశములోని కొన్ని భాగములలో నిది తారుమా రయ్యెను. పంజాబులోను, సింధులోను హిందువులు, సిక్కులు నల్ప సంఖ్యాకులు. ముస్లిము లధికసంఖ్యాకులు. ముస్లిములు భారతదేశ మంతటిలో నల్పసంఖ్యాకులమని భయపడుచున్నట్లే యీరాష్ట్రముల లోని యల్పసంఖ్యాకు లధికసంఖ్యాకులచే నలిపివేయబడుదురని భయ పడుచుండిరి. నిజము చెప్పవలెననిన నీ రెండు తెగలలో నుద్యోగము లను వాంఛించెడి మధ్యతరగతులవా రొకరినొకరు త్రోసివేయుదురని

భయపడుచుండిరి. గొప్పమార్పులుకలిగిన తమప్రయోజనము లెచ్చట చెడిపోవునోయని పెట్టుబడిదారులు కొంతవరకు భయపడుచుండిరి.

ఈ కులకక్షాభివృద్ధిచేత స్వరాజ్యపార్టీ చెడిపోయెను. దీనిలోని ముస్లిముసభ్యులు కొందరు జారిపోయి కుల సంఘములలో జేరిరి; హిందూసభ్యులు కొందరు జాతీయపక్షములో జేరిరి. హిందూ యెన్నికవర్గముకు సంబంధించినంతవరకు మాలవ్యాజీ, లాలాజీల కలయిక చాల బలీయమైనది. కులకక్షల కాకరమైన పంజాబులో లాలాజీ పలుకుబడి యత్యద్భుతమైనది. స్వరాజ్యపార్టీ తరఫున యెన్నికలలో పోరాడవలసిన భారమంతయు మోతీలాల్ షుచే (?) — మాతం(డ్రిపై బడెను. అతని భారమును పంచుకొనుటకు చిత్తరంజనదా సచ్చట లేడయ్యెను. అతనికి పోరాటమనిన సరదా! అతడు దానినెప్పుడు విడిచియెరుగడు. ఎదిరి బలము వృద్ధియగుచుండుటచే నతడు తన యావచ్ఛక్తిని యెన్నిక సంగ్రామములో చూపించెను. అతడు చావుదెబ్బలు కొట్టెను; తానుతినెను. ఉభయపక్షములవారు నొకరిపైనొకరు దయా దాక్షిణ్యములను చూపలేదు. ఈ యెన్నిక వెనుక ద్వేషకథనములే మిగిలెను.

జాతీయపక్షముకు మంచి విజయము చేకూరెను. కాని యీ విజయము అసెంబ్లీయొక్క రాజకీయ పటుత్వమును నిశ్చయముగా న్యూనతపరచెను. రాజకీయ కేంద్రాకర్షణశక్తి మరింత దక్షిణ ముఖముపట్టెను. స్వరాజ్యపార్టీయే కాంగ్రెసుయొక్క దక్షిణపక్షము. అది బలము చేకూర్చుకొను యత్నములో ననేకమంది నమ్మిక స్వామిద్రోహుల నందులోనికి దూరనిచ్చెను. కనుక వానిపటుత్వము సన్నగిలెను. జాతీయపక్షముకూడ ఆ నీతినే యవలంబించెను. కనుక నీ బలగములోనికి బిరుదావళులనుధరించినవారు, పెద్దభూఖామందులు, పరిశ్రమ యజమానులు గల చిత్రవిచిత్ర రంగుల కూటమొకటి తయారయ్యెను.

ఒక ఘోరవిషాదసంభవము 1926 సంవత్సరాంతము నంధకార ములో ముంచివేసెను. అది సేతుసీతనగమధ్యస్థ భారతదేశమునంతను

భయోత్పాతముచే నిర్విణ్ణముచేసెను. కులద్వేషములు మన ప్రజల నెంతటి నైచ్యమునకు దింపునో యిది విదితముచేయుచున్నది. జ్వర ముతో పడియున్న స్వామీశ్రద్ధానందు నెవడోయొక మతోన్మాదుడు కత్తితో పొడిచి చంపెను. ఆహా! ఘూర్ఖా సైన్యముల కెదురురొమ్ము నిచ్చుచు, నా దందహ్యమానమగు నగ్నికీలల నాశ్లేషింప చటచట ముందుకుపోయిన శ్రద్ధానందున కెట్టిమృత్యువు! సుమారెనిమిదేండ్లక్రిత మతడు, ఢిల్లీలోని జేముమసీదు సభామంటపమునెక్కి వేలకొలది హిందువులు ముస్లిములు గల సభలో నైకమత్యమును గురించియు భారతస్వాతంత్ర్యమును గురించియు బోధించెను. ఆ మహాసభలోని వారందరు 'హిందూ ముసల్మానుకి జై' యను జయ జయ ధ్వాన ములు నింగిముట్టునట్లుగా నతని నభినందించిరి. సభల వెలుపల వీధులలో వా రుభయులు నా ధ్వనిని తమ రక్తముతో మేళవింప జేసిరి. తనను స్వర్గమునకు గొంపోవు పుణ్యకార్యము చేయుచున్నట్లు భావించిన తోడిదేశీయునిచే నత డిపుడు చంపబడెను. ధర్మ కార్యము కొరకు చావుకైనను తెగింపు చూపెడి భౌతికధైర్యమును నే నెప్పుడు నభినందించితిని. మనలో చాలమంది యట్లభినందించెద రనియే నా యుద్దేశ్యము. స్వామీశ్రద్ధానందున కట్టి యద్భుత నిర్భ యత్వముండెను. కాషాయాంబరములలో నుండిన ఆ యాజాను బాహువు ఆదర్శమైన విగ్రహము! వయోవృద్ధుడైనను నిసుమం తయు వంగని యా శరీరపుష్టి! మెఱయుచుండు నేత్రములు; ఇత రుల దుర్బలత్వమునకు నొక్కొక్కపుడు ముఖమండలము మీద కాన్పించు విసుగుదల లేక కోపముయొక్క ఛాయ — జీవముతో నుట్టి పడు నా విగ్రహము నా స్మృతిపథమున నెట్లున్నదో? అది మరల మరల నెట్లు తిరిగి ద్యోతకమగుచున్నది!

23

బ్రస్సెల్సులో పీడిజాతుల సభ

1926 వత్సరాంతమున నేను బెర్లినులో నుండగా పీడిత జాతుల సభ యొకటి బ్రస్సెల్సులో జరుగనున్నదని వింటిని. ఆ భావము నాకు నచ్చుటచే భారతజాతీయ కాంగ్రెసుకూడ బ్రస్సెల్సు కాంగ్రెసులో నధికారరీత్యా పాల్గొనుట మంచిదని నేను స్వదేశముకు వ్రాసితిని. నా సూచన యంగీకరింపబడి, నేనే భారత కాంగ్రెసు ప్రతినిధిగా దీనికొరకు నియోగింపబడితిని.

బ్రస్సెల్సు సభ 1927 ఫిబ్రవరి మొదటివారములో జరిగెను. దీనికి కారకులెవరో నే నెరుగను. అప్పుడు బెర్లినునగరము రాజకీయ ప్రవాసులను, విప్లవకారులను ప్రపంచమంతటినుండి యాకర్షించు కేంద్రమయ్యెను. అది క్రమముగ నీ సందర్భములో ప్యారిసునగరమును మించుచుండెను. కమ్యూనిస్టు బృందముకూడ నచ్చట బలముగ నుండెను. పీడింపబడు జాతులన్నియు కలిసి అంతర్జాతీయముగ నేదో యొక సమిష్టికార్యము జరుపవలెననియు, వారు కూలిసంఘముయొక్క యెడమ పక్షమువారు కలిసి యొక సమిష్టికార్యము చేయవలెనను సూచన లాకాశమును నింపుచుండెను. స్వాతంత్ర్య సంగ్రామమనిన సామ్రాజ్యతత్త్వమును పిశాచముపై కందరు కలసి యురుకుటయే యను భావ మంతకంతకు హెచ్చుచుండెను. కనుక సమిష్టి యాలోచనలు, వీలైనచోట సమిష్టికార్యాచరణము కావలె ననుకొనిరి. వలసరాజ్యములు గల యింగ్లండు, ఫ్రాన్సు, ఇటలీ మొదలగునవి సహజముగా నిట్టి యత్నములకు వ్యతిరేకముగా నుండెను. కాని జర్మనీ, యుద్ధానంతరము వలస రాజ్యములు గలదికాదు. కనుక జర్మనుప్రభుత్వ మితర ప్రభుత్వములలోని వలసలలోను, కాలనీల లోను జరుగు నిట్టి యాందోళనాభివృద్ధిని యుదారమగు తటస్థభావముతో చూచుచుండెను. బెర్లిను నగరము ప్రపంచములోని యసంతుష్టులకు, విప్లవాభిమానులకు కేంద్రమగుట కిదియొక కారణము.

వీరిలో చీనాలోని క్యూ-మిం-టాంగుకు చెందిన యెడమ పక్షము వారు ప్రప్రధానులుగ నుండిరి. ఈ పక్ష మపుడు చీనా దేశము నంతను తుడిచివేయుచుండ, నీ జగన్నాథ రథముక్రింద పాత సామంత సంస్థానములన్నియు ప్రగ్గుచున్నట్లుండెను. ఈ నూతన మార్పుల ముందర సామ్రాజ ప్రభుత్వములుకూడ తమ దుడుకుచేష్టలను, అధికార పూరితస్వనమును కోల్పోయిరి. చీనాదేశపు నైకమత్య స్వాతంత్ర్య సమస్యల పరిష్కార మరచేతిలో నున్నట్లు కాన్పించెను. క్యూ-మిం టాంగు జయభేరి మ్రోగించెను. కాని వారు రానున్న కష్టములను గుర్తించి యంతర్జాతీయ ప్రచారముచే మరింత బలము చేకూర్చు కొనన నెంచిరి. విదేశములలోనున్న కమ్యూనిష్టులతోను, కమ్యూనిష్టు లకు చేరికన్నైనవారితోను కలిసి పనిచేయుచున్న పై పార్టీ యొక్క యెడమ పక్షమువారే, దేశము వెలుపల, చీనా జాతీయస్థితిని బల పర్చుటకు దేశములో తమ స్వంతపార్టీని బలపర్చుటకు నీ ప్రచార మవసరమని పట్టుబట్టిరి. అప్పుడీపక్షము బలవద్విరోధములుగల రెండు మూడు చీలికలుగా చీలిపోక, పైకి యేకముఖమునే ప్రదర్శించెను. కనుక క్యూ-మిం-టాంగుయొక్క యూరపియను ప్రతినిధులు పీడిత జాతుల సభ జరుగవలెననెడి భావము నాహూయము చేసిరి బహుశః మరికొంతమందితోకలసి వారే యీ భావముకు కారకులై యుండవచ్చును. మొదటనుంచియు, కొంతమంది కమ్యూనిష్టులు వారికి చేరికైన వారు వెనుకనుండి దీనికి దోహదము నిచ్చుచునే యుండిరి. కాని మొత్తముమీద కమ్యూనిష్టులు దూరముగనే యుండిరి. ల్యాటిను అమెరికానుండి మంచిసహాయము, బలము చేకూరెను; అమెరికా సంయుక్తరాష్ట్రము లార్థికసామ్రాజ్యముపట్ల గుఱ్ఱగానుండెను. విప్లవనీతి, యట్టియధ్యక్షుడుగల మెక్సికో నగరము అమెరికాసంయుక్తరాష్ట్రములకు వ్యతిరేకముగా ల్యాటిను అమెరికను, బ్లాకులో నాయకత్వము వహింప నుత్సుకతతో నుండెను. కనుక మెక్సికో బ్రస్సెల్సు కాంగ్రెసుయెడల మంచి శ్రద్ధవహించెను. అధికారరీత్యా ప్రభుత్వము

పాల్గొనజాలదు. కనుక నదియొక రాజకీయవేత్త నుదారసాక్షిగా చూచుచుండవలెనని పంపించెను.

జావా, ఇండో-చీనా, పాలస్తీను, సిరియా, ఈజిప్టు, ఉత్తర ఆఫ్రికా, యరబ్బులు, ఆఫ్రికా దేశపు నీగ్రోలు – ఈ జాతుల ప్రతినిధు లందరు బ్రస్సెల్సు సభకు వచ్చిరి. కూలిసంస్థల యెడమపక్ష ప్రతినిధు లెందరో వచ్చిరి. ఐరోపాదేశపు లేబరు సంగ్రామములలో నొక పురుషాంతరమునుండియు ప్రధానపాత్ర ధరించుచుండిన విఖ్యాత పురుషు లచ్చట నుండిరి. కమ్యూనిష్టులును అచ్చటనుండి కార్య క్రమములో నెక్కువగా పాల్గొనిరి. వారు కమ్యూనిష్టులుగాగాక ట్రేడు యూనియను ప్రతినిధులుగా వచ్చిరి. జార్జి ల్యాన్సుబరీ అధ్యక్షుడుగా నెన్నుకొనబడెను; అతడు గంభీరోపన్యాసము నిచ్చెను. ఆ సభ యంత పిచ్చసభ కాదనుట కదియే తార్కాణము! దానికి కమ్యూ నిజముతో నెట్టి సంబంధములేదు. కాని యా సభ కమ్యూనిష్టులపట్ల మిత్రభావమును వహించెననుటలో సందేహములేదు. కొన్ని విషయ ములలో వారికి సమాధానము కుదరకపోయినను కలిసి పనిచేయుటకు వారి కనేక సామ్యకారణములు కలవు.

'సామ్రాజ్య వ్యతిరేకసభ' యను శాశ్వత సంస్థకుకూడ నధ్యక్షుడుగా నుండుటకు ల్యాన్సుబరీగా రొప్పుకొనిరి. కాని, తరువాత నతడు తొందరపడినందులకు విచారించెను. లేదా బహుశః బ్రిటిషు లేబరుపార్టీ సహచరు లతని ప్రవర్తన నంగీకరించలేదు. అప్పుడు లేబరుపక్షము 'చక్రవర్తికి ప్రతిపక్షము'. ఇది వెంటనే 'చక్రవర్తి ప్రభుత్వము'గ మారెను. భవిష్యత్కార్యవర్గ మంత్రి శేఖరులు సాహసపూరితమైన విప్లవ రాజకీయములలో నెట్లు తగు ల్కొనగలరు! ల్యాన్సుబరీ తీరికలేదను నెపముతో తన యధ్యక్ష పదవికి రాజీనామా యిచ్చెను; అతడు లీగుసభ్యత్వమునకుగూడ రాజీనామా యిచ్చెను. రెండుమూడు నెలలక్రిందటనే యతని యుపన్యాసము విని మురిసిపోయిన నాకిది మనోవ్యథ కలిగించెను.

అయినను సామ్రాజ్య వ్యతిరేకసభాప్రోత్సాహకులలో చాల మంది విఖ్యాతపురుషులు గలరు. ఈన్స్టీను, సన్యాటుసేను భార్య, రోమారోలా మొదలగువారు కలరు. పాలస్తీనులో వచ్చిన అరబ్బీ, యూదుల పోరాటములలో లీగువారు అరబ్బులకు సుముఖమైన నీతిని పాటించిరి. దీని నంగీకరింపక ఈన్స్టీను చాలమాసములైన తరువాత రాజీనామా యిచ్చెను. బ్రస్సెల్సుకాంగ్రెసు, దాని తరువాత నప్పుడప్పు డనేకచోట్ల జరుపబడిన లీగు కమిటీ సభలు కాలనీలలోను, పరాధీన దేశములలోను గల కొన్ని కొన్ని సమస్యల నర్థముచేసికొనుటకు నా కెంతయో తోడ్పడెను. పాశ్చాత్య లేబరు ప్రపంచములోని యంతఃకలహములనుకూడ నేను వాటిద్వారా చూడగలిగితిని. వాటిని గురించి నా కదివరకే కొంత తెలియును. నేను వాటిని గురించి చదివియుంటిని. కాని స్వయముగ చూచియెరు గను. నా కిప్పు డట్టియనుభవము కలిగెను. ఈ యంతఃకలహములకు సంబంధించిన సమస్యలను నే నొక్కొక్కప్పు డెదుర్కొనవలసి యుండెను. లేబరుప్రపంచములోని రెండవ యింటర్ నేషనల్ కంటె మూడవదానియెడల నాకు సానుభూతి కలదు. యుద్ధమయినతరువాత రెండవ యింటర్ నేషనలు చరిత్రయంతయు నా కేవగింపు కలిగించెను. ఆ సభలో నుద్దండపిండములుగా పనిచేసిన బ్రిటిషు లేబరుపార్టీ వారి పద్ధతులు హిందూదేశములోనున్న మా కందరకు తగినంత స్వానుభవములయ్యెను. కనుక నేను విధిలేక కమ్యూనిజమువైపు తిరిగితిని. దానిదోషము లేవియైన నది మోసము నెరుగదు; నమ్మిక స్వామిద్రోహము నెరుగదు. సామ్రాజ్యవాసన ఎంతమాత్రము దానికి లేదు. కమ్యూనిజములోని విశేషాంశము లేవియు నాకు తెలియక పోవుటచే నా సంబంధము సిద్ధాంతబద్ధముకాదు. అప్పుడు దాని విశాల లక్షణములతో మాత్రమే నాకు పరిచయముండెను. ఇవి నన్నాక ర్షించెను. రష్యాలో జరుగుచున్న యద్భుత మార్పులుకూడ నన్నాక ర్షించెను. కాని కమ్యూనిష్టుల నిరంకుశమార్గములచేతను, నైచ్య పద్ధతులచేతను, తమతో నంగీకరింపని ప్రతివానిని నిందించు స్వభా

వముచేతను నా కాగ్రహము కలిగెను. వారు చెప్పినట్లు నిస్సందేహ ముగా యీ కోపముకు నా బూర్జువా విద్యయు, శిక్షణయు కారణములు.

సామ్రాజ్య వ్యతిరేకలీగు కమిటీమీటింగులలో చిన్న చిన్న విషయములను గురించి వాదించుటలో నేను సాధారణముగా ఆంగ్లో అమెరికను సభ్యులపైపుననే యుండుట చిత్రముగా నుండెడిది. అధ మము పద్ధతిలోనైన మా కొక సాదృశ్య ముండెడిది. ప్రకటనలవలె కాన్పించు, శబ్దభూయిష్టమగు, కొండపీటిచాంతాడు తీర్మానములకు మే ముభయులము సభ్యంతర పెట్టెడివారము. మే మవి నిరాడంబర ముగ సూత్రప్రాయముగ నుండవలె నందుము. కాని, యూరపు లోని సాంప్రదాయము దీనికి విరుద్ధము. కమ్యూనిస్టులకు, కమ్యూనిస్టులు కానివారికి తఱచు యభిప్రాయభేద ముండెడిది. సామాన్యముగా మే మొక రాజీకి వచ్చెడివారము; తరువాత మాలో కొంతమంది యిండ్లకు తిరిగివచ్చుటచే మరెట్టి కమిటీమీటింగులకు పోజాలకపోతిమి.

సామ్రాజ్య ప్రభుత్వములయొక్క కలోనియలు శాఖవారు, విదేశరాజ్యాంగశాఖవారు బ్రస్సెల్సు కాంగ్రెసును కొంత భయముతో చూచిరి. బ్రిటిషు విదేశ రాజ్యాంగశాఖకు చెందిన 'ఆంగరు' అను విఖ్యాత రచయిత దానినిగురించి కొంచెమ్ముద్రేకపూరితము, పరిహాసా స్పదము నగు చరిత్రను వ్రాసెను. ఆ కాంగ్రెసులోనే అంతర్జాతీయ గూఢచారులు కుప్పలుగ నుండిరి. ప్రతినిధులలోనే చాలమంది గూఢ చారు లుండిరి. ఒక చిన్న తమాషాకథ జరిగెను. ప్యారిసు నగర ములోనున్న నా యమెరికను స్నేహితుని యొకనాడొక ఫ్రెంచిగూఢ చారిగ నున్న ఫ్రెంచి స్నేహితుడు చూడవచ్చెను. కొన్ని విషయ ములనుగురించి యతడు కేవలము తన మిత్రుని సందర్శించుటకే వచ్చెను. అతడు తనపనిని పూర్తిచేసిన తరువాత నా యమెరికనును 'మన మీ మధ్యనే కలుసుకొంటిమికదా! నీవు నన్ను గుర్తించ లేదా?' యని యడిగెను. ఆ యమెరికను యెంత గట్టిగా నాలోచించినను యేమియు జ్ఞప్తికిరాక తా నతనిని గుర్తించలేదని చెప్పెను. అప్పు

డా గూఢచారి యేజెంటు తా నతనిని బ్రస్సెల్సు కాంగ్రెసులో కలుసుకొనెననియు, నతడు చేతులు, కాళ్ళు, ముఖము సమస్తము నల్లని మసిపూసుకొని నీగ్రో ప్రతినిధిగా వచ్చెననియు చెప్పెను.

సామ్రాజ్య వ్యతిరేక లీగు కమిటీ మీటింగు కొలోనులో జరిగెను. దానికి నేను వెళ్ళితిని. మీటింగు ముగిసినతరువాత సాక్కో-వాన్జెటీ సభకు దగ్గరనున్న డసెల్డార్ఫుకు పోవలెననిరి. మేము వెళ్ళితిమి. ఆ మీటింగునుండి మేము తిరిగివచ్చుచుండగా పోలీసులు మమ్ము ప్యాసుపోర్టులను చూపించమనిరి; నేను దానిని కొలోను హోటలులోనే విడిచిపెట్టితిని. వెంటనే నన్నొక పోలీసుస్టేషనుకు తీసికొనిపోయిరి. అదృష్టవశాత్తు నావలెనే యొక ఆంగ్లమిథున మీ కష్టములోపడిరి. ఒకగంట గడచినతరువాత, పోలీసు ప్రముఖుడు మమ్ము విడిచివేసెను.

తరువాత వత్సరములలో సామ్రాజ్య వ్యతిరేక లీగు కమ్యూనిజమువైపు యెక్కువగా మ్రొగ్గెను; కాని, నాకు తెలిసినంతవర కది యెప్పుడు తన వ్యక్తిలక్షణములను పోగొట్టుకొనలేదు. ఉత్తర ప్రత్యుత్తరములద్వారా నాకు దానితో కొంత దూరపుసంబంధము మాత్రమే యుండెను. 1931 లో భారత ప్రభుత్వముకు కాంగ్రెసుకు జరిగిన ఢిల్లీ సంధిలో, నేను భాగస్వామినని దానికి నామీద నమిత్తమైన కోపముగలిగి నన్నొక్క కలము పోటుతో నది బహిష్కరించెను. మరికొంత నిజముచెప్పవలెననిన నది యొకవిధమగు తీర్మానమునుచేసి నన్ను బహిష్కరించెను. దానికి తీవ్రమైనకోపము కలిగినమాట వాస్తవమేకాని, నా స్థితిని తెలుపుటకు నా కది కొంత యవకాశమునిచ్చి యుండవలసినది.

1927 వేసవిలో మాతండ్రి యూరపు వచ్చెను. నే నతనిని వెనీసు పట్టణములో కలిసితిని. తరువాత కొద్దిమాసములును మేము తరుచు కలిసియేయుంటిమి. మే మందరము సోవియటుయొక్క పదవ సాంవత్సరికోత్సవ సందర్భములో నవంబరు నెలలో మాస్కో వెళ్ళితిమి. మేము మాస్కోలో మూడునాలుగు రోజులు మాత్రమే యుండుట

కాఖుకునిముషములో నిశ్చయించుకొంటిమి. నే మచ్చుటకు వెళ్ళి సంమలకు చాల సంతసించితిని. ఆ కొద్దిపాటి వీక్షణముకూడ ఫలప్రదముగ నుండెను. అది నూతన రష్యాను గురించే మాకంతగా బోధించ లేదు. బోధించ జాలకుండెను. కాని యది మేము చదువుకొన గలుగుటకు తగిన పునాదులను వేసెను. మా తండ్రి కట్టి సోవియటు సామాజిక భావములు కేవలము క్రొత్తలు. అతనికున్న శిక్షణయంతయు న్యాయబద్ధము. చట్టబద్ధము. అత డా గుడి దాటి చులకనగా పైకి పోజాలడు. కాని యతడు మాస్కోలో చూచినదానితో చాల సంతృప్తిచెందెను. సైమను కమిషనుగురించి మొట్టమొదట ప్రకటించినపుడు మేము మాస్కోలోనుంటిమి. మాస్కోపత్రికలో మేము దానిని గురించి మొట్టమొదట చదివితిమి. తండ్రిగారు కొద్దిరోజులలోనే ఒక భారతదేశపు అప్పీలులో సర్. జాన్ సైమనుతో తోడివకీలుగా లండను ప్రీవీకౌన్సిలుకు వెళ్ళవలసియుండెను. అదియొక పాత జమీందారీకేసు. అనేక సంవత్సరములకిందట మొట్టమొదటిస్థితిలో నేనును దానిలో పనిచేసితిని. నే నందులో నిక నెట్టిశ్రద్ధయు తీసి కొనలేదు.

1927 వ సంవత్సరము గతించుచుండెను. యూరపులో మా యునికి యంతకంతకు పొడిగింపబడుచుండెను. తండ్రిగారు యూరపు చూచుటకు రాకపోయినచో బహుశః మే మంతకాల ముండెడి వారముకాము. మా త్రోవలో మేము కొంతకాలము యూరపు ఆగ్నేయ భాగములోను, టర్కీ, యీజిప్టులలోను నుండవలె నను కొంటిమి. నేను క్రిస్టమసులో మద్రాసులోనున్న కాంగ్రెసుకు పోవలెనను యాతురతతో నుండుటచే తగిన వ్యవధి లేకుండెను. నేను - నా భార్య, చెల్లెలు, కుమార్తె, మేము డిసెంబరు మొదటి వారములో మార్సెల్సునుండి కొలంబోకు పయనమైతిమి. మా తండ్రి మరియొక మూడుమాసములు యూరపులో నుండెను.

24

భారతదేశముకు తిరిగివచ్చుట—రాజకీయములలో తిరిగిమునుగుట

నేను యూరపునుండి మంచి శరీర మానసికారోగ్యములతో తిరిగి వచ్చితిని. నా భార్యకు పూర్తియారోగ్యము కలుగలేదు. కాని చాలవరకు నయమయ్యెను. కనుక నా కామెనుగురించిన యాందోళన తగ్గెను. నే నినుమడించిన శక్తి సామర్థ్యములతో నుండుటచే పూర్వము నన్ను తఱచు క్రుంగదీయుచుండెడి ఆంతరంగిక సంఘర్షణయు, ఓటమియు నిప్పుడు పలాయనమయ్యెను. నా దృక్పథము విశాలమయ్యెను. కేవల జాతీయత సంకుచితము, నసంపూర్ణమునగు సిద్ధాంతముగా నాకు కాన్పించెను. రాజకీయస్వేచ్ఛ, స్వాతంత్రత ముఖ్యముగా కావలసినవే! కాని యవి సరియగు మార్గమునకు గొంపోవు సోపానములు మాత్రమే యగును. సాంఘిక స్వేచ్ఛయు సంఘముయొక్కయు, ప్రభుత్వముయొక్కయు, సామ్యవాదపరమగు నిర్మాణము లేనిదే దేశముకాని, వ్యక్తులుకాని యభివృద్ధి నొందజాలరు. ప్రపంచ వ్యవహారములు నాకు కళ్ళకుకట్టినట్లు కాన్పించెడివి. సదా మారుచుండినను, ఆధునిక ప్రపంచముపై నా కెక్కువ పట్టుదొరికెను. వర్తమాన వ్యవహారములను, రాజకీయములను, గురించియేగాక, శాస్త్రము, విజ్ఞానము, మొదలగు విషయములను గురించి నే నెంతయో చదివితిని. యూరపు, అమెరికాలలో జరుగుచుండిన రాజకీయ, ఆర్థిక, వైజ్ఞానికపరివర్తనములే యొక మనోజ్ఞమైన యధ్యయనమని నేను కనుగొంటిని. కొన్ని యసంతృప్తికరములగు విషయములున్నను సోవియటురష్యా నన్నెక్కుడుగా నాకర్షించెను. అదియే ప్రపంచమున కాశను పురిగొల్పు సందేశము నిచ్చుచున్నట్లు కాన్పించెను. యూరపు 1920 ప్రాంతములలో నొకవిధముగా స్థిరపడుటకు ప్రయత్నించుచుండెను. ఆర్థికదుస్థితి యింకను తొలగకుండెను. ఈ స్థైర్యము కేవలము బాహ్యమే! యూరపులోను,

ప్రపంచములోను అచిరకాలములోనే పెద్ద రాజకీయ భూకంపములు, గొప్ప పరివర్తనములు రానున్న వను విశ్వాసముతో నేను తిరిగి వచ్చితిని.

ఈ ప్రపంచ సమస్యల నెదుర్కొనుటకు మన ప్రజలను, దేశమును శక్తి వంచన లేకుండ తయారు చేయుటయే,, తగిన శిక్షణను గఱపుటయే మనము చేయవలసిన ధర్మముగా నాకు కాన్పించెను. మొట్టమొదట మన రాజకీయ స్వాతంత్ర్య లక్ష్యమునుగురించి యెట్టి సంశయములు నుండరాదు. ఇదియే మన రాజకీయలక్ష్యమనియు, డొమినియను ప్రభుత్వమని యర్థములేకుండ చేయబడు గజిబిజి సంభాషణకంటె యిది కేవలము భిన్నమైనదనియు స్పష్టముగా నెఱుంగవలెను. తరువాత సాంఘికలక్ష్యము కలదు. కాంగ్రెసు యిప్పుడీ విషయములో నెక్కువగా పనిచేయవలె ననుకొనుట మితిమీరిన కోరికయని నేను భావించితిని. కాంగ్రెసు కేవలమొక జాతీయ రాజకీయ సంస్థ. దాని కితరవిధముగ చింతించు నలవాటు లేదు. అయినను 'శ్రీరామ' చుట్టవచ్చు ననుకొంటిని. కాంగ్రెసు వెలుపల లేబరు సంఘములోను యువకులలోను యీ భావము నెక్కువగా వ్యాప్తి చేయవచ్చును. దీనికొరకు నేను కాంగ్రెసు ఆఫీసుకు దూరముగా నుండగోరితిని. మూలమూలలనున్న గ్రామసీమలలో కొన్ని నెలలుండి వారిపరిస్థితులను గుర్తింపవలెనను కోరిక కూడ నుండెడిది. కాని యిది జరుగదయ్యెను! పరిస్థితులు నన్ను తిరుగ కాంగ్రెసు రాజకీయ కుహరములోని కీడ్చెను.

నేను చెన్నపట్టణము చేరుటతోడనే నన్నీ సుడిగుండము పట్టుకొనెను. నేను స్వాతంత్ర్యము, యుద్ధభయము, సామ్రాజ్య వ్యతిరేకలీగు మొదలగు విషయములను గురించి వర్కింగుకమిటీ కొక తీర్మానగుచ్ఛమును పంపితిని. కొంచె మించుమించు అవన్నియు నంగీకరింపబడి వర్కింగుకమిటీ తీర్మానములుగా పరిగణింపబడెను. నేను వాటిని కాంగ్రెసు బహిరంగసభలో నుపపాదించితిని. అవి యన్నియు నేకగ్రీవముగ నంగీకరింపబడుట నా కాశ్చర్యముగొల్పెను.

స్వాతంత్ర్యతీర్మానమును అనిబిసెంటు సతికూడ బలపర్చెను. ఈసర్వాంగీకారము తృప్తికరముగనే యుండెను. కాని యీ తీర్మానములు సరిగా నర్థము చేసికొనబడ లేదు. స్వాతంత్ర్య తీర్మానమును గురించి చర్చలు బయలుదేరెను.

ఈ నా తీర్మానములు మామూలు కాంగ్రెసు తీర్మానములకంటె కొంతభిన్నముగ నుండెను. ఇవి యొక నూతన దృక్పథమును చూపుచుండెను. నిస్సందేహముగ చాలమంది కాంగ్రెసువారి కివి రుచించెను. కొంతమంది కివి యంత రుచింపకపోయినను ప్రతిఘటించుటకు తగినంత యసంతృప్తి లేకుండెను. బహుశః వారు వీటిని వదల్చుకొని ముందుకు మరింత ముఖ్యతీర్మానములకు పోవుటకై వీటి నామోదించుటయే మంచిమార్గమని తలంచియుందురు. కనుక స్వాతంత్ర్య తీర్మానమప్పుడు కాంగ్రెసు యొక్క ప్రాణప్రదము, అప్రతిహతమునగు సూత్రముకాదు. అది వ్యాప్తి చెందుచు నంతకంతకు వృద్ధిచెందుచున్న యొక భావము ; వాసన.

గాంధీజీ మద్రాసులో నుండెను. అతడు కాంగ్రెసు సభలకు హాజరయ్యెను. కాని కాంగ్రెసు నీతిని నిరూపించుటలో నత డెట్టి జోక్యము కల్పించుకొనలేదు. వర్కింగుకమిటీలో సభ్యుడైనను నతడా మీటింగులకు హాజరుకాలేదు. స్వరాజ్య పార్టీప్రాబల్యము వచ్చినప్పటి నుండి యతడు కాంగ్రెసుపట్ల సాధారణముగా నట్టి రాజకీయ దృక్పథమునే కలిగియుండెను. కాని తఱచుయతనిసలహా తీసికొనబడుచుండెను. అతనికి తెలియకుండ ముఖ్యతీర్మానములు చేయబడలేదు. నా తీర్మానముల నత డెంతగా నామోదించెనో నాకు తెలియదు. అతని కవి రుచింపనట్లే నేను భావించెదను. అవి చెప్పునట్టి విషయములుగాక వాటిసాధారణ ధోరణి, దృక్పథము లతనికి నచ్చియుండవు. అయినను అతడు వాటినెప్పుడు విమర్శించలేదు.

సైమను కమిషనును నిరసించుచు దానిని బహిష్కరింపవలెనను మరియొక తీర్మానము వచ్చిననపుడా కాంగ్రెసుసభలోనే స్వతంత్ర తీర్మానముయొక్క యదార్థత బయలుపడెను. ఈ తీర్మాన ఫలితముగా

భారతదేశమున కొక రాజ్యాంగప్రణాళికను తయారుచేయుట కొక యఖిలపక్ష సభను పిలువవలెననిరి. మితవాదబృందముల తోడ్పాటు వాంఛింపబడినది. వారు స్వాతంత్ర్యమును గురించి యెన్నడు నూహింప జాలరు. వారంతగా వెళ్ళిన నేదో యొకవిధమగు డొమినియను పరి పాలనవరకు పోగలరు.

నేను మరల కాంగ్రెసు కార్యదర్శినైతిని. దానికి వ్యక్తిగత కారణములు కలవు. ఆ సంవత్సరము కాంగ్రెసు అధ్యక్షుడు డాక్టరు అన్సారీ నా చిర మిత్రుడు. నా తీర్మానములు చాలవర కామోదింపబడుటచే నేను వాటి నాచరణకు బెట్టవలసియుండెను. అఖిల పక్షమహాసభా తీర్మానము కొంతవరకు నా తీర్మానముల సారమును లాగివేసెను. అయినను చేయవలసిన దెంతయో యుండెను. అఖిల పక్షమహాసభా యంత్రద్వారమునగాని, మరే యితర కారణములచేత గాని కాంగ్రెసు మరింత రాజీకి, మరింత మితవాద స్థితికి దిగిపోవు నేమో యను భయమే నేను తిరిగి యుద్యోగము స్వీకరించుటకు యదార్థ కారణము. అది యొకసారి యీ ప్రక్కకు మరొకసారి మరొక ప్రక్కకు నూగిసలాడుచున్నట్లుండెను. అది మితవాదము వైపు దిగకుండ స్వాతంత్ర్యలక్ష్యము నంటిపెట్టుకొని యుండునట్లు నా శక్తికొలది చేయనెంచితిని.

జాతీయ కాంగ్రెసు ప్రతివత్సరము జరుపబడురోజులలో నెప్పుడు ననేక ప్రదర్శనములు జరుపబడుచుండును. మద్రాసులో జరిగిన ప్రదర్శనములలో రిపబ్లికను కాన్ఫరెన్సు ప్రదర్శన మొకటి జరిగెను. అదియే మొదటిసభ. (అదియే ఆఖరుసభ యయ్యెను.) నన్ను అధ్యక్షునిగా నుండమనిరి. నేను రిపబ్లికనును కనుక నా కాభావము నచ్చెను. దీనిని ప్రోత్సహించినవారెవరో నాకు తెలియకపోవుటచే నేను సందేహించుచుంటిని. కుక్కగొడుగులవలె లేచు సంస్థలతో నేను సంబంధము పెట్టుకొననొల్లను. చివరకు నే నధ్యక్షతవహించి తరువాత విచారించితిని. ఈ రిపబ్లికను కాన్ఫరెన్సుకు పురిటిలోనే సంధికొట్టెను. దానిచే గావింపబడిన తీర్మానముల మూలమును సంపాదించుటకు నే

ననేక మాసములు యత్నించి చివరకు విఫలుడైనాడని. మనలో చాలమంది క్రొత్తక్రొత్త విషయములకు పూనుకొనివచ్చి, తోడనే వాటిని వాటికర్మమునకు విడిచివేయుచుండుట చాల యాశ్చర్యముగ నుండును. మనము పట్టుదల లేనివారమని కావించబడు విమర్శలో సత్యమెంతయో కలదు.

కాంగ్రెసుసభ జరిగినతరువాత, మద్రాసు వీడులోపల ఢిల్లీలో హాకీము అజ్మల్‌ఖాను చనిపోయెను. అతడు వెనుక కాంగ్రెసు అధ్యక్షుడగుటచే కాంగ్రెసు రాజకీయపెద్దలలో నొకడు. అత డంతకంటె నెక్కువ. కాంగ్రెసు నాయకత్వములో నతని కొక ప్రత్యేకస్థానము. కలదు. ఆధునిక సంపర్కమే మాత్రములేని శుద్ధ సనాతనపద్ధతిలో పెరిగి మొగలులనాటి ఢిల్లీ సామ్రాజ్య విజ్ఞానములో మునిగినను అతని లలితప్రవర్తనము, మృదుమధుర కంఠధ్వని, యనార్ద్రి హాస్యము సంతోషదాయకముగ నుండును. అతడు, తనతీరులలో, తన రీతులలో, చూపులలో, కీవిలో పురాతన సాంప్రదాయమునకు చెందు రాజదర్బారులోనివాడు. అతని ముఖమున మొగలు చక్రవర్తుల చిత్రములసాదృశ్యము కాన్పించును. అట్టివాడు సాధారణముగా రాజయ ఝంఝామారుతములోనికిరాడు. ఆందోళనపరులైన నూతన జాతివారు తమ్ము బాధించినపుడు భారతదేశములోని బ్రిటిషువారిట్టి పురాతన తెగకొరకు తఱచు పరితాపపడుచుండెడివారు. హాకీము సాహేబ్ తన చిన్నతనములో రాజకీయములవంక పోలేదు. ప్రఖ్యాతి చెందిన వైద్య కుటుంబ యాజమాన్యమును వహించుచు నతడు గొప్పప్రాక్టీసు కలిగియుండెను. యుద్ధపరిస్థితులు, చిరస్నేహితుడు, సహచరుడు నగు డాక్టరు అన్సారీయొక్క పలుకుబడి యతనిని కాంగ్రెసువైపు త్రిప్పెను. తరువాత సంభవించిన పంజాబు సైనిక శాసనములు, ఖిలాఫతు సమస్య యతనిని తీవ్రముగా సంచలింప చేసెను. అత డసహాయోద్యమము నామోదించెను. అతడు కాంగ్రెసు కొక వరప్రదాత. అతడు పాతసాంప్రదాయమువారికి క్రొత్త సాంప్రదాయమువారికి సఖ్యత కుదుర్చు సంధానకరణిగనుండి,

పాత సాంప్రదాయము వారిబలమును కాంగ్రెసుకు కలుగచేసెను. అతడు హిందువులను ముస్లిములను చాల దగ్గరకు తెచ్చెను. ఉభయులు నతనిని గౌరవించి, యతని సాదృశ్యములకు సుముఖులగుచుండిరి. గాంధీజీ కతడు విశ్వాసపాత్రుడగు మిత్రుడు. హిందూ మహమ్మదీయ విషయములలో గాంధీజీ కతనిమాటయే శాసనము. మా తండ్రియు నతడు సహజముగా నొండొరులను ప్రేమించుకొనిరి.

హిందూ మహాసభా నాయకులు కొందరు లోపభూయిష్టమగు నా విద్యచేతను, 'పరిష్యను' విజ్ఞానము నాకు సమానపునాదియగుట చేతను నేను హిందూసాంప్రదాయములను, వాసనలను యెఱుగనివాడ నని నిందించిరి. నా కెట్టివిజ్ఞానముకలదో, అసలు విజ్ఞానముకలదో లేదో చెప్పుట నాకు కష్టసాధ్యమైనపని. పరిష్యనుభాష నాకు రానే రాదు కాని, మా తండ్రి హిందూ-పరిష్యను విజ్ఞానవాతావరణ ములో పెరిగినమాట సత్యము. అది యుత్తర హిందూదేశమునకు పురాతన ఢిల్లీ కోర్టు ప్రసాదించిన పైతృకధనము. దానికీ పతిత దినములలోకూడ ఢిల్లీ, లక్నోలు రెండును ప్రధాన కేంద్రములు. కాశ్మీర బ్రాహ్మణులలో పరిస్థితులకు తగినట్లు మారు గొప్ప శక్తి కలదు. వారు భారత మైదానభూములకు దిగివచ్చినప్పు డీ హిందూ పరిష్యను విజ్ఞాన మచ్చట ప్రబలముగ నుండుటను గాంచి, దీనిని స్వీకరించి, పరిష్యను, ఉర్దూలలో చాలమంది విఖ్యాతపండితుల నుద్భవింపజేసిరి. తరువాత మారిపోవుచున్న సాంప్రదాయములను గుర్తించి వా రట్టివేగముతోనే యాంగ్లభాషావిజ్ఞానమును సాధించిరి. ఇప్పటికి హిందూదేశములో పరిష్యనుభాషలో విఖ్యాతపండితులైన కాశ్మీరు లెందరో కలరు. సర్. తేజబహాదరుసప్రూ, రాజా నరేంద్ర నాథు లట్టివారే!

కనుక హాకీము సాహేబుకు, మా తండ్రికి సామ్య మెంతయో యుండెను. వారు పాత కుటుంబ సంబంధములనుకూడ గుర్తించిరి. వారిరువురు చాల మిత్రులై యొకరినొకరు భాయీసాహబు అని పిలుచుకొనుచుండెడివారు. వారికిగల యనేక బంధములలో రాజ

కీయము లాభమున వచ్చును. ఇంటివద్ద యాచారములలో హాకీమ్‌జీ చాల సనాతనుడు. అతడు నతని కుటుంబమువారు పాతయాచారములను వీడజాలకపోయిరి. అతని కుటుంబములోని కఠిన ఘోషా పద్ధతిని నే నెచ్చటను చూచియుండలేదు. అయినను స్త్రీలు స్వేచ్ఛ వడసినగాని యేదేశము, యేజాతియు వృద్ధిపొందజాలదని హాకీమ్‌జీ పూర్తిగా విశ్వసించెను. దీనినిగురించి యతడు నాకు నచ్చచెప్పుచు తుర్కీదేశపు స్త్రీలు తమ స్వాతంత్ర్యపోరాటములో తీసికొనిన పాత్రను తా నెంతయో మెచ్చుకొంటినని నాకు చెప్పుచుండెడివాడు. కెమల్‌పాషా ముఖ్యముగా నీ తుర్కీదేశపు స్త్రీలవలననే స్వాతంత్ర్యం బడసెనని యతడు చెప్పెను.

హాకీము అజ్మల్‌ఖానుయొక్క మృత్యువు కాంగ్రెసుకు గొప్ప నష్టము. దాని గొప్పయండయొకటి కూలిపోయినట్లయ్యెను నాటినుండి మా కందరకు ఢిల్లీని సందర్శించునపుడెల్ల నొక లోపము కాన్పించు చుండును. ఏలనన ఢిల్లీ యన హాకీమ్‌జీ బల్లిమరనులోనున్న యతని భవనమునయ్యెను. 1928 సంవత్సరము రాజకీయముగా చేతినిండ పనికలిగిన సంవత్సరము. దేశమంతయు సంచలనముతో నిండి యుండెను. ప్రజల నొక క్రొత్తయావేశము ముందుకు పోదుచుచున్నట్లుండెను. ఈ నూతన సంచలన మన్ని వర్గములలోను సమానముగ నున్నట్లు కాన్పించెను. బహుశః యీ మార్పు నేను దేశమును వీడి నప్పటినుండియు క్రమముగ జరుగుచుండెను. నేను తిరిగి వచ్చుసరి కిది నాకు గొప్పదిగ కాన్పించెను. 1926 లో హిందూదేశమింకను నెమ్మదిగ, స్తబ్ధముగనుండెను. బహుశః అది 1919-1922 నాటి ప్రయత్నమునుండి యింకను పూర్తిగా కోల్కొనలేదు. 1928 లో నది నూతనత్వము, చురుకు, హుషారు, నిగూఢశక్తి గలిగియుండెను. పారిశ్రామిక కార్మికులలోను, రచయితలలోను, మధ్యతరగతి యువకులలోను, సాధారణముగా విద్యార్థికులలోను అన్ని చోట్ల నిది ప్రత్యక్షమగుచునే యుండెను.

శ్రేడుయూనియను ఉద్యమము చాల యభివృద్ధి యయ్యెను. ఏడెనిమిదేండ్ల క్రితము స్థాపింపబడిన అఖిలభారత శ్రేడుయూనియను కాంగ్రెసు బలీయమైన సంస్థయయ్యెను. అది సంఖ్యాబలము చేతను చక్కని కట్టుబాట్లచేతను వృద్ధియగుటయేగాక దాని భావములు, యాశయములు శక్తివంతములుగను, అతివాద ధోరణిలోనుండెను. సమ్మెలు తఱచయ్యెను. తరగతులలో నాత్మవిశ్వాసము వృద్ధియగుచుండెను. వస్త్రపారిశ్రామికులు, రైల్వేలవారు మంచి వ్యవస్థలను కలిగియుండిరి. వీటిలో బొంబాయిలోని గిర్నీ కార్మిక సంఘము, జి. ఐ. పి. రైల్వే సంఘము చాలబలీయమై, మంచి యభివృద్ధిలో నుండెను. లేబరువ్యవస్థ లభివృద్ధి జెందుటతోడనే అంతఃకలహ బీజములు, చీలికలు పశ్చిమము నుండి దిగుమతియయ్యెను. ఇండియను శ్రేడుయూనియను మూవ్మెంటు స్థాపింపబడినతోడనే పరస్పర విరుద్ధపక్షము లేర్పడెను. కొంతమంది రెండవ యింటర్నేషనలును బలపరచిరి. మరికొంతమంది మూడవ యింటర్నేషనలు నభిమానించిరి. కొంతమంది సంస్కరణవాదులు, కొంతమంది గొప్ప మార్పులు కలుగవలెనను విప్లవవాదులు. ఈ యుభయులమధ్య ననేకరంగుల, అనేక డిగ్రీల యభిప్రాయములవారున్నారు. సమయానుకూల తత్పరులును (అన్ని ప్రజాయుద్యమముల లోను యిది తప్పదు) కలరు.

రయితాంగములో కూడ కలకలము బయలుదేరెను. ఇది సంయుక్తపరగణాలలో, ముఖ్యముగా, అయోధ్యలో కానవగుచుండెను. అచ్చట నన్యాయములను ప్రతిఘటించు పెద్దపెద్ద రయితు సభలు సామాన్యమయ్యెను. నూతన అయోధ్య టెనెన్సీ చట్టము బీదరయితు దుస్థితి నెంతమాత్రము మార్చలేదు. ప్రభుత్వమువారు పన్నులను హెచ్చించుటకు ప్రయత్నించుటచే గుజరాతులో రయితులకు, ప్రభుత్వమునకు పెద్దపోరాటము సంభవించెను. గుజరాతులో ప్రభుత్వమునకు రయితులతో ప్రత్యక్ష సంబంధము కలదు. ఈ పోరాటమే సర్దారు వల్లభాయిపటేలు నడిపిన బార్డోలీ సత్యాగ్రహము. భారత దేశమంతయు జయజయ ధ్వానములను ప్రమోగించుచుండ

నీ పోరాటము తుములమయ్యెను. బార్డోలీ రయితులకు ఘనవిజయము చేకూరెను. కాని యది యావద్భారత దేశములోనున్న రయితాంగములో కలిగించిన సంచలనమే నిజమైన విజయము. ఆశకు, శక్తికి, విజయమునకు భారతరయితుకు బార్డోలీ యొక చిహ్నము; ఒకగుర్తు; ఒక యుదాహరణము.

1928 నాటి భారతదేశముయొక్క మరియొక ప్రధానలక్షణము యువజనోద్యమము. ప్రతిచోట యువజనసంఘములు స్థాపింపబడెను. యువజనసభలు జరుపబడుచుండును. ఇందులో మత సంఘములు మొదలు విప్లవభావములను, విప్లవశాస్త్రమును చర్చించు సంఘముల వరకు నుండెను. వాటికి కారణము లేవియైన, నవి వేటిపేర జరుపబడినను, అట్టి యువజన సభలలో నెప్పుడు దేశము నావరించి యున్న ప్రధాన సాంఘిక, ఆర్థిక సమస్యలు కూలంకషముగ చర్చింపబడుచుండెడివి. సాధారణముగా సమూలమైన మార్పులనే యవి సమర్థించుచుండెను.

కేవల రాజకీయ దృష్టితో చూచినచో నీ వత్సరము సైమను కమిషను బహిష్కరణముకును అఖిలపక్ష సభకును ప్రసిద్ధిచెందెను. ఈ బహిష్కరణలో మితవాదులు కాంగ్రెసుకు తోడ్పడిరి. అది యఖండవిజయము నొందెను. సైమనుకమిషను యెచ్చటకు వెళ్ళినను 'సైమను గో బాక్' యను శాత్రవనినాదములే ప్రతిధ్వనించెను. ఈ విధముగా భారత ప్రజల కొక్క సైమనుపేరు మాత్రమే కాక ఇంగ్లీషుభాషలోని మరిరెండు పదములుకూడ వచ్చెను. ఇవి రెండే వారికి తెలిసిన పదములు. సైమను కమిషను సభ్యుల నీ పదములు దయ్యములవలె వెంటాడించెను. క్రొత్తఢిల్లీలోని వెస్టరనుహాస్టలులో నొకనాటి రాత్రి ఈ సభ్యులు నివసించియుండగా నిశీథమందు చీకటిని చొరుచుకొని యీ సంగీతమే వారికి వినవచ్చెనని యొక కథ చెప్పబడుచున్నది. యదార్థమేమనగా వారిని మేల్కొల్పిన యీ యవినయధ్వని సామ్రాజ్య రాజధాని శిథిలసీమల నావహించి యుండు శృగాలగానమే !

రాజ్యాంగ ప్రణాళిక ప్రధానసూత్రములను స్థిరపరచుటలో సఖలపక్ష సభ కెట్టి కష్టము లేదు. అవి ప్రజాస్వామిక పార్లమెంటరీ జాతికి చెందినవిగ నుండవలెను. వాటి నెవడైనను వ్రాయవచ్చును. కులసమస్య లేక మైనారిటీసమస్యలోనే నిజమైన కష్టము, ఒక్కటే కష్టమువచ్చెను. ఆ కాన్ఫరెన్సులోనే నన్ని కులములలోని యతివాదులు నుండుటచే సంగీకారము కుదురుట యసంభవమయ్యెను. అది వెనుకటి యైకమత్యసభలవలెనే నిష్ఫలమయ్యెను. యూరపు నుండి వసంతకాలములో తిరిగివచ్చిన మాతండ్రి యీ కాన్ఫరెన్సులో నెక్కువ శ్రద్ధతీసికొనెను. చివరకు కడసారిప్రయత్నముగా మాతండ్రి యాధిపత్యమున ప్రణాళికను తయారుచేయుటకు కులసమస్యను గురించి పూర్తియైన నివేదికను ప్రకటించుటకు నొక చిన్న కమిటీ యేర్పరచిరి. ఈ కమిటీ నెహ్రూకమిటీయని పిలువబడెను. తరువాత నీ నివేదిక నెహ్రూనివేదిక యయ్యెను. సర్ తేజబహదరు సప్రూ కూడ నిందులో నొక సభ్యుడు. నివేదికలోని కొంతభాగమున కతడు బాధ్యుడు.

నే నీ కమిటీ సభ్యుడను కాను. కాని కాంగ్రెసు కార్యదర్శి నగుటచే నాకు దానితో నెక్కువ జోక్యముండెను. నా స్థితి యకటా వికటముగ నుండెను. ఏలనన అధికార సంపాదన యదార్థసమస్యయై యుండగా 'కాగితచట్టములను' తయారుచేయుట వృథయని నేను భావించితిని. మన లక్ష్యమని చెప్పబడిన డొమినియను పరిపాలనకీ మిశ్రమ కమిటీలవలన విధాయకముగా నేర్పడు యడ్డంకులు నన్ను మరింత బాధించెను. నాకీ కమిటీయొక్క నిజమైన ప్రాముఖ్యత కులప్రతిష్టంభనలనుండి బయటబడుట కది యేదైన మార్గము కనుగొనవచ్చుననను నదియే! ఏదోయొక యంగీకారమువలన లేక సంధివలన నీ సమస్యకు పరిష్కార మేర్పడునని నే ననుకొనలేదు. మనశ్రద్ధను సాంఘిక ఆర్థిక సమస్యలమీదకు మరలించినపుడే మనకది సాధ్యమగును. కాని తగినంతమంది యొప్పుకొనినచో తాత్కాలిక సంధియైనను కొంత కష్టమును తొలగించి తద్వారా దృష్టిని

యితర సమస్యలమీదకు మఱలింపవచ్చుననుకొంటిని. కనుక నేను కమిటీయొక్క పని కభ్యంతరముకల్గింపక చేయగలిగినసహాయముచేసితిని.

జయము కరతలామలకమైనట్లే కాన్పించెను. ఒకటి రెండు విషయములుమాత్రమే మిగిలెను. ఇందులో నిజముగా ముఖ్యమైనది పంజాబు. ఇచ్చట హిందూ, ముస్లిము, సిక్కు సమస్యకలదు. కమిటీవారు పంజాబుసమస్యను తమనివేదికలో నొకనూతనదృక్పథమునుండి వీక్షించి తమ సూచనలను కులములకు సంబంధించిన లెక్కలద్వారా సమర్థించిరి. కాని యిది యంతయు వృధయయ్యెను. భయము, అవిశ్వాసము యుభయపక్షములవారిని యావరించెను. ఆ స్వల్పదూరమును తరించుటకు కావలసిన యా చిన్ని యడుగే పడదయ్యెను.

అఖిలపక్ష సభ తమకమిటీయొక్క నివేదికను చర్చించుటకు లక్నోలో సమావేశమయెను. తిరిగి మాలో కొంతమందికి సందిగ్ధావస్థవచ్చెను. కులపరిష్కారమునకు మే మడ్డము తగులువారము కాము. కాని స్వాతంత్ర్య సమస్యమీద మే మెంతమాత్రము లొంగ దలచుకొనలేదు. ఈ సమస్య విడిచివేయవలసినదని మేము కోరితిమి. దీనివలన కాంగ్రెసు తన స్వాతంత్ర్య తీర్మానమును విడనాడనక్కరలేదు. మితవాదులు తమ డొమినియను పరిపాలననే ప్రేమించుకొనవచ్చును. కాని మా తండ్రి నివేదికను పూర్తిచేయవలెనని కూర్చొనెను. అతడు లొంగలేదు. బహుశః ఆ పరిస్థితులలో నత డింకొకలాగున చేయజాలడు. అప్పుడు కాన్ఫరెన్సులోని స్వాతంత్ర్యపక్షమువారు దానితరఫున నన్ను స్వాతంత్ర్యలక్ష్యము తగ్గించు దేనితోనైనను మా కెట్టి సంబంధము లేదను స్టేటుమెంటు నీయమనిరి. కాని మేము వారి కాటంకమువచ్చువారముకామని స్పష్టపరచితిమి. మేము కులతత్త్వములకు సంబంధించిన స్టేటుమెంటు కడ్డము పోదలచుకొనలేదు. అంత పెద్దసమస్య సందర్భముల మే మవలంబించిన మార్గ మంత పటుత్వమైనదికాదు. అది వ్యతిరేక భావసూచకము. ఆ రోజుననే మేము భారతస్వాతంత్ర్యమును స్థాపించే మాదృక్పథమునొక కార్యరూపము నిచ్చితిమి.

అఖిలపక్ష సమావేశము నాకు మరియొక యాశ్చర్యము కలిగించెను. అది, అయోధ్య తాలూకుదార్ల ప్రోత్సాహమువలన, నూతన చట్టములోని ప్రధాన హక్కులకు మరియొకపరతు జేర్చెను. దాని ప్రకారము తాలూకుదారుల తాలూకాలలో వారికన్న సంపూర్ణాధికారములకు పూచీ యివ్వబడెను. ఆ చట్టమంతయు స్వంత ఆస్తుల పునాదులమీదనే నిలుపబడెననుమాట వాస్తవమే! కాని పెద్దపెద్ద సంస్థానములకు సంబంధించిన యాస్తిహక్కులలో చట్టములోనుండి యెన్నటికి తీసివేయకూడని రాజ్యాంగ చట్ట పునాదులు వేయుట నాకు దౌర్జన్యముగా కాన్పించెను. కాంగ్రెసు నాయకులు సంతకంటె నెక్కువగా కాంగ్రెసువారు కానివారు తమ స్వజనములోని వారైన సామ్యవాదులనుగాక, జమీందారుల 'కంపెనీ'నే ప్రోత్సహించుచున్నట్లిది విదితము చేయుచున్నది. చాలమంది నాయకులకు మాకు మధ్య చాలదూరమున్నట్లు స్పష్టమయ్యెను. ఇట్టి పరిస్థితులలో నేను కాంగ్రెసు కార్యదర్శిగానుండుట చాల వికృతముగానుండెను. భారతస్వాతంత్ర్య సంఘమును స్థాపించినవారిలో నొకడనను మిషతో నేను రాజీనామా యిచ్చితిని. వర్కింగు కమిటీ దీనికొప్పుకొనక కాంగ్రెసు నీతితో నెట్టి సంఘర్షణములేకుండ మా సంఘము కార్యములను నెరవేర్చుకొనవచ్చునని నాకును సుభాష్ చంద్రబోసుకును (అతడు కూడ రాజీనామా దాఖలు చేసెను) చెప్పిరి. కాంగ్రెసు యిదివరకే స్వాతంత్ర్యముకొరకు ప్రకటించెననుట వాస్తవము. తిరిగి నేను దీని కంగీకరించితిని. నా రాజీనామా నుపసంహరించుకొనుటకు నన్ను బుట్టలోవేయు టెంత సులభమో! యాశ్చర్యమగును! ఇది చాల సార్లు జరిగెను. ఉభయులలో నెవరును త్రెంచివేసికొనుటకు నిజముగా నిష్టపడక పోవుటచే, నట్లుజరుగకుండ ప్రతి సారును మే మాశ్లేషించుచుంటిమి.

గాంధీజీ యీ అఖిలపక్ష సభలోగాని, కమిటీ మీటింగులలోగాని పాల్గొనలేదు. అతడు లక్నో కాన్ఫరెన్సుకు రానైన రాలేదు. ఈలోపల "తిరిగి పొండు" అను కేకలతో గూడిన గుంపులు నల్ల

జెండాలు వెంట తరుముచుండ సైమను కమిషను సంచారము సాగించుచుండెను. అచ్చటచ్చట పోలీసులకు గుంపులకు చిన్నచిన్న కలహములు కలుగుచుండెను. లాహోరులో పరిస్థితులు విషమించెను. అకస్మాత్తుగా దేశమంతట క్రోధానల మలముకొనెను. లాలాలజపతిరాయి సైమను కమిషను ప్రతికూల ప్రదర్శనములో నాయకత్వము వహించెను. వేలకొలది ప్రజలముందర నతడు రోడ్డు ప్రక్క నిలిచియుండగా నొక యాంగ్ల యువకపోలీసుయుద్యోగి వానిపై బడి, వాని వక్షస్థలము మీద కమిచీతో మోదెను. ప్రజలుకాని, లాలాజీకాని దౌర్జన్యపద్ధతుల నవలంబించుట కెట్టిప్రయత్నము చేయలేదు. అట్లు ప్రశాంతముగ నతడచ్చట నిలిచియుండగా నతనిని, యతని సహచరులు ననేకమందిని పోలీసువారు చావబాదిరి. ఈ వీధులలోని ప్రదర్శనములలో పాల్గొను వారెవరైనను పోలీసులతో సంఘర్షణ వచ్చునను సంగతి గుర్తెరుగవలెను. మన ప్రదర్శనము లెప్పుడును ప్రశాంతములైనవే యైనను లాలాజీ సంగతి తెలిసి యతడు మనఃపూర్వకముగనే దీని ననుభవించెను. అయినను, ఆ నిర్హేతుకమైనదాడియు, నందులో చూపబడిన యనవసర పశుత్వము భారతప్రజల కొక యశనిపాతమువలె నుండెను. అవి మేము పోలీసు లాఠీప్రయోగముల కలవడని రోజులు. అనవసర పశుత్వమువలన మా యభిమానము మొద్దుబారిపోయి యుండలేదు. మా నాయకరత్నము, పంజాబు కేసరి యట్లుచూడబడుట ఘోరముగా కాన్పించెను. దేశమంతట ముఖ్యముగా నుత్తర హిందూ దేశములో నిర్వీర్యమగు క్రోధము ప్రబలెను. ఆహా! మే మెంత యసహాయులము! మా నాయక శిఖామణుల యభిమానధనమును రక్షింపనైన రక్షింపజాలని మే మెట్టి నీచులము!

వక్షస్థలముమీద తగులుటచే లాలాజీకి తగిలిన శరీర గాయములు తీవ్రముగనే యుండెను. అతడు చాల కాలమునుండి హృద్రోగముచే బాధపడుచుండెను. బహుశః మంచి యారోగ్యముగల యువకున కవి యంతప్రమాదము కాకపోవచ్చును. లాలాజీ యువకుడుకాడు. ఆరోగ్యవంతుడు కాడు. కొద్ది వారములకే సంభవించిన యతని

మృత్యువుకు నీ శరీర గాయముల కెట్టిసంబంధము కలదో నిశ్చితముగా చెప్పుట కష్టమే. అతని డాక్టర్లు మృత్యువు నీ గాయములు త్వరితము చేసెనను నభిప్రాయ మిచ్చిరి. కాని యీ శరీర గాయముల వెనుక నున్న మానసికాందోళనమే లాలాజీ నెక్కువగా బాధించెననుటలో నా కెట్టి సందేహము కాన్పించదు. అతడు తనకు కలిగిన పరాభవము కుగాక తనను కొట్టుటలో భారతజాతికంతకు కలిగిన పరాభవాగ్నికే కుమిలిపోయెను.

ఈ జాతీయ పరాభవాగ్నియే భారత హృదయమును దహించుచుండెను. లాలాజీయొక్క మృత్యువు వెంటనే సంభవించు టచే దానికి విధాయికముగా పోలీసు దౌర్జన్యమే కారణమనిరి. విచారము కోపమునకును, క్రోధమునకును తావిచ్చెను. ఈ విషయమును మనము బాగుగా గుర్తించవలెను. తరువాత జరిగిన సంభవములను కొంతవరకైన మన మప్పుడే యర్థముచేసికొనగలము. భగత్సింగు కథయు నుత్తర హిందూదేశములో నతని కకస్మాత్తుగా వచ్చిన యద్భుత పేరుప్రఖ్యాతులును మనకు దీనివలననే యర్థముకాగలవు. వ్యక్తులను, కార్యములను; కార్యముల నుద్భవింపజేసిన మూలము లను వాని వెనుకనున్న కారణములను నర్థముచేసికొనకుండ గర్హించుట సులభము, మౌర్ఖ్యము. ఇంతకుపూర్వము భగత్సింగు పేరు ప్రఖ్యాతులుకలవాడు కాడు. దౌర్జన్యము చేసినందువలనగాని; భయ పెట్టుటవలనగాని యతని కాపేరుకలుగలేదు! హిందూదేశములో టెర్ర రిస్టు లప్పుడప్పుడు గత ముప్పది సంవత్సరములనుండియు, కాన్పించు చునేయుండిరి. వంగదేశములో నెప్పుడో, మొట్టమొదటి రోజులలో తప్ప; వారిలో నొక్కనికిని భగత్సింగుకు కలిగిన పేరుప్రఖ్యాతులలో నొక్క శతాంశమైనను లేదు. ఈ యదార్థము నెవరును కాదన జాలరు. దీని నొప్పుకొని తీరవలెను. మరియొక విషయమేమన టెర్రరిజము అప్పుడప్పు డుబుకుచుండినను భారతయువకులకు దాని యందు యదార్థమైన ప్రేమలేదు. పదిహేను సంవత్సరముల నిరంతర దౌర్జన్యరాహిత్య ప్రచారము భారతదేశ పునాదులను మార్చి

వేసెను. ప్రజల నది టెర్రరిజముపట్ల మరింత యుదాసీనులను, విముఖులను చేసెను. టెర్రరిష్టులు సాధారణముగా వచ్చుచుండు మధ్యతరగతులలోని క్రింది తరహావారును, విద్యాధికులును దౌర్జన్య పద్ధతులకు వ్యతిరేకమైన కాంగ్రెసు ప్రచారమువలన పూర్తిగా మారి పోయిరి. విప్లవము కావలెనని కోరువారిలోని యుత్సాహవంతులు, ఆలస్యము నొల్లనివారు విప్లవము టెర్రరిజమువలన రాదనియు, నది పాతగిలిన వ్యర్థప్రయత్నమనియు, నది యథార్థమైన విప్లవకార్యముల కడ్డుతగులుననియు గ్రహించిరి. భారతదేశములోను యితరచోట్లను టెర్రరిజము నశించుచున్నది. అది ప్రభుత్వ వత్తిడిచేతగాక (అది దానిని యణచవచ్చును, బిరడా వేయవచ్చును. కాని, నశింపు చేయజాలదు) దానిలోనున్న మూలకారణములచేతను, ప్రపంచ పరిస్థితులచేతను నశించును. టెర్రరిజము సాధారణముగా దేశము లోని విప్లవోద్వేగ శైశవ సూచకము. ఆ యంతరువు దాటును. దానితో టెర్రరిజముకూడ నొక ప్రధాన విధానముగ నంతరించును. స్థానిక కారణములచేత వ్యక్తుల నణచుటచేత నది యప్పుడప్పుడు పొక్కవచ్చును. నిశ్చయముగా భారతదేశ మీ యంతరువును దాటును. ఈ మధ్యేమధ్యే సంభవములుకూడ క్రమముగా నశించును. భారతదేశ ప్రజలందరు దౌర్జన్యపద్ధతులను విశ్వసించుట మానివేసిరని దీని యర్థముకాదు. వారు చాలవరకు వ్యక్తిగత దౌర్జన్యమును, టెర్రరిజమును విశ్వసించుట మానివేసిరి. ఇతరదేశము లన్నింటిలో నవసరమైనట్లే యిచ్చటను స్వాతంత్ర్య సంపాదనకొరకు సక్రమమైన దౌర్జన్యపద్ధతు లవసరమగుకాలము వచ్చునని విశ్వ సించువారు చాలమంది లేకపోలేదు. అది యిప్పుడప్రస్తుత సమస్య. కాలమే దానిని పరిష్కరింపగలదు. దానికి టెర్రరిష్టు పద్ధతులతో సంబంధములేదు.

కనుక భగత్సింగుకు టెర్రరిష్టు కార్యముచే పేరు కలుగలేదు. అతడు తాత్కాలికముగ లాలాలజపతిరాయియొక్కయు, తద్వారా జాతి యొక్కయు గౌరవమును రక్షింపవచ్చినట్లుండెను. అత డొక చిహ్న

మయ్యెను; కార్యము మరువబడెను. చిహ్నముమాత్రమే మిగిలెను. కొద్ది నెలలలో పంజాబులోని ప్రతిగ్రామము తక్కువ స్థాయిలో నుత్తర హిందూస్థానమంతయు నతని నామముతో మారుమ్రోగెను. అతనిని గురించి యసంఖ్యాకమగు గీతములు బయలుదేరెను. అతడు సాధించిన పేరు ప్రఖ్యాతు లద్భుతములు.

సైమను కమిషను ప్రహారణమయిన కొద్ది రోజులకు లజపతిరాయి ఢిల్లీలో జరిగిన అ. భా. కాం. కమిటీకి హాజరయ్యెను. అతనియొంటిమీద గాయము లింకను కాన్పించుచుండెను. అతడింకను దెబ్బల ఫలితముగా బాధపడుచుండెను. ఆ సభ లక్నో అఖిలపక్ష సభ తరువాత జరిగెను. స్వాతంత్ర్య సమస్య ఏదో యొక రూపమున చర్చకు వచ్చెను. సందర్భ మెట్టిదో నాకు జ్ఞప్తిలేదు. కాని కాంగ్రెసు రాజకీయ సాంఘిక నిర్మాణములలో తీవ్రమైన మార్పులను తెచ్చెడి విప్లవ దృక్పథమునో లేక సంస్కరణ విధానమను లక్ష్యమునో - రెంటిలో దేనినో యొకదానిని నిశ్చయించుకొనవలసిన సమయము వచ్చినదని నేను విపులముగ మాట్లాడితిని. ఆ నా యుపన్యాసమునకు ప్రాముఖ్యత లేదు. లాలాజీ కమిటీలో దానికి ప్రత్యుత్తరమిచ్చుచు దానిలో కొంతభాగమును విమర్శింపకపోయినచో నేను దానిని మరచియుండెడివాడను. బ్రిటిషు లేబరుపార్టీ నుండి మనమేమియు నాశింపరాదని యతడు మందలించెను. నాకు సంబంధించినంతవరకా మందలింపుయవసరము. ఏలనన నేను బ్రిటిషు అధికార లేబరునాయకత్వమునుచూచి పొంగువాడను కాను.

లాహోరు తిరిగి వెళ్ళుటతోడనే లాలాజీ అ. భా. కాం. కమిటీలో నేనిచ్చిన యుపన్యాసమును, మరల దానికి సంబంధించిన యనేక సమస్యలనుగురించి తన వారపత్రికయైన 'ప్రిజ' లో వ్రాయదొడగెను. మొదటి వ్యాసముమాత్రమేవచ్చెను. రెండవ వ్యాసము తరువాత వారములో వచ్చులోపల నతడు చనిపోయెను. అసంపూర్తియైన యతని యీ మొదటి వ్యాసము (బహుశః అదియే నతడు ప్రచురణకిచ్చిన కడసారి వ్రాత) నన్ను విచారమున ముంచెను.

25

లాఠీచార్జీల యనుభవము

లాలా లజపతిరాయి దెబ్బలతో చనిపోవుటచే సైమనుకమిషను బహిష్కరణము మరింత తీవ్రమయ్యెను. లక్నో కాంగ్రెసు కమిటీ దాని నాహ్వానించుటకు గొప్పప్రయత్నములను చేసిరి. చాల రోజులుముందుగనే ప్రచారముకొరకు నసలు ప్రదర్శనముకు సంసిద్ధం చేయుటకు బ్రహ్మాండమైన యుత్సవములు, సభలు, ప్రదర్శనములు చేయబడుచుండెను. నేను లక్నో వెళ్ళి వీటిలోకొన్నింటిని చూచితిని. చాల సక్రమముగ, ప్రశాంతముగ, జయప్రదముగ జరుగుచున్న ఈ ప్రదర్శనములచే ప్రభుత్వముకు కళ్ళుకుట్టి వారు వీటి కభ్యంతరములను కల్పింప నారంభించి, కొన్ని ప్రాంతములలో నుత్సవములను జరుపగూడదని నిషేధించిరి. ఈ సందర్భములోనే నా కొక క్రొత్త యనుభవముకలిగెను. నా శరీరము పోలీసు కమిచీదెబ్బలను, లాఠీ ప్రహారణములను చవిజూచెను.

రహదారీ కడ్డమను నెపమున యుత్సవములను నిషేధించిరి. అట్టిదోషము కలుగకుండుటకు మేము పదునారుమంది చొప్పున విడివిడిగా విజనముగానుండు వీధులనుండి సభాప్రదేశమునకు పోవ నిశ్చయించితిమి. శాస్త్రరీత్యా యిది యాజ్ఞోల్లంఘనమే యగును. ఏలనన జెండాయు, పదునారుమంది జనము నొక యుత్సవమగును. నే నిట్టి పదునారుమందిగల యొక యుత్సవము నడిపితిని. తరువాత గోవిందవల్లభపంతు యాధిపత్యమున మరి పదునారుమంది వచ్చిరి. మా యుభయులకు చాల యెడముండెను. మేము రెండువందల గజములు దూరము వెళ్ళితిమో లేదో మా వెనుక గుఱ్ఱపుడెక్కల మ్రోత వినిపించెను. ఆ రోడ్డున జనములేరు. మేము వెనుకకు తిరిగి చూచుసరికి కొంతమంది యశ్వారూఢులైన పోలీసులు వాయువేగమున మాపైకి వచ్చుచుండిరి. వారు క్షణికములో మాపైకి వచ్చుటచే నా దాడికి పదునారుమందిగల మా చిన్నదళము విడిపోయెను.

వెంటనే పోలీసులు పెద్ద కమిచీలతో మా వాలంటీర్లను మోదనారంభించిరి. సహజముగా వారు ప్రక్కతోవల శరణుజొచ్చిరి. కొందరు చిన్న చిన్న దుకాణములలో ప్రవేశించిరి. పోలీసులు వారిని వెంబడించి చావమోదిరి. గుఱ్ఱములు మాపై బడవచ్చినపుడు నా బుద్ధి గూడ సహజముగా రక్షణ నన్వేషించెను. ఆ దృశ్యము కడు దీనమైనది. కాని, మరియొక యూహ నన్నచ్చోటు నుండి కదలనీయలేదు. నే నా మొదటిదాడికి నిలువగలిగితిని. రోడ్డుమధ్య నే నొక్కడనే యున్నట్లు నే నకస్మాత్తుగా తెలిసికొంటిని. నాకు కొద్ది గజములదూరములో నన్నివైపులను పోలీసులు వాలంటీర్లను కొట్టుచుండిరి. పోలీసుల కంతగా కాన్పించకుండుటకు నే నప్రయత్నముగా రోడ్డు ప్రక్కకు మెల్లగా జారనారంభించితిని. కాని తిరిగి నాలో నేను తర్కించుకొని యీ విధముగా జారిపోవుట నాకు తగదని నిశ్చయించుకొంటిని. ఈ తర్కముకంతకు కొద్ది సెకనులుపట్టెను. కాని నాలో జరిగిన ఆ యాంతరంగిక పోరాటము, ఆ నిశ్చయము కళ్ళకు కట్టినట్లు నా స్మృతిపథమున నిలిచియుండెను. నేను భీరువువలె ప్రవర్తించుట సహింపజాలని నా యభిమానధనము చేతనే యానిశ్చయము కలిగెను. అయినను భీరధీరత్వములమధ్య నెంతయో యెడములేక పోవుటచే నే నటు వాలినను వాలి యుండెడివాడను. నే నట్లు నిశ్చయించితినో లేదో యప్పుడే యొక యశ్వారూఢుడైన పోలీసు తన పొడుగైన క్రొత్త కమిచీని విసురుకొనుచు చటచట నామీదకువచ్చెను. నే నతనిని ముందుకు పొమ్మని నా తలను తప్పించుకొంటిని. తలను ముఖమును రక్షించుకొనుట కిది మరియొక ప్రయత్నము. అతడు నా వీపుమీద 'ఛెళ్ళుమను' రెండు దెబ్బలను తగిలించెను. నాకు రిమ్మెత్తెను. శరీరమంతయు కంపించెను. కాని నే నింకను నా కాశ్చర్యము, తృప్తియు కలుగునట్లు నిలిచియే యుంటిని. తరువాత పోలీసుదళమును మా మార్గమున కడ్డముగా నిలబెట్టిరి. వాలంటీర్లు తిరిగి కలుసుకొనిరి. వారి శరీరము రక్తసిక్తమయ్యెను. కొంతమంది బుఱ్ఱలు పగిలెను. గోవింద వల్లభపంతు తన పరివారముతో మమ్ము కలుసుకొనెను. వారికికూడ

ప్రహారణములు తగిలెను. మేమందరము పోలీసుల యెదుట నేలమీద కూర్చుంటిమి. మేమట్లు చీకటిపడువరకు కూర్చుంటిమి. ఒక ప్రక్క గొప్ప గొప్ప ప్రభుత్వోద్యోగులు కూడిరి. మరియొకవంక వార్తలు ప్రబలినకొలది ప్రజలు గుంపులుగూడ నారంభించిరి. చివర కధికారులు మమ్ము మామూలు మార్గమున పోవుటకంగీకరించిరి. మాపై దాడి వెడలి మమ్ము బాదిన పోలీసులు ముందు అంగరక్షకులుగ నడచుచుండ మేము మా మార్గముననే వెళ్ళితిమి.

దీనివలన నెక్కుడు ఫలితము కలుగుటచే నీ నీ చిన్న విషయమునుగురించి యింతవివరముగా వ్రాసితిని. లాఠీ దెబ్బల కాగగలిగితినను యుత్సాహములో నేను నా శరీరబాధను పూర్తిగా మరచిపోతిని. ఈ కథ యంతయు జరుగుచుండగా, నా మనస్సు అతి నిర్మలముగా నుండుటయు, నా భావములను నేను బుద్ధిపూర్వకముగ పరీక్షించుకొనుచుండుటయు, నా కాశ్చర్యముగ నుండెను. మరునాటి యగ్నిపరీక్ష కీ నాందీయుత్సవము నా కెంతయో తోడ్పడెను. మరునాడే సైమను కమిషను రావలసిన దినము; మా ప్రదర్శనము జరుగుదినము.

అప్పుడు మా తండ్రి అలహాబాదులోనుండెను. నాపై పోలీసులు దాడివెడలినవార్త వినినచో నతడు మా కుటుంబము చిరాకుపడుదురను భయము నాకుండెను. కనుక నేనంతయు బాగుగనేయున్నదనియు, నతడు విచారపడనవసరములేదనియు రాత్రి టెలిఫోనులో చెప్పితిని. కాని యతడు చికాకుపడి, నిద్రపట్టక, రాత్రి పన్నెండుగంటలకు లక్నో వచ్చుటకు నిశ్చయించుకొనెను. ఆఖరురైలు దాటిపోవుటచే నతడు మోటారులో పయనమయ్యెను. త్రోవలో నతనికొక యవాంతరము కూడ తటస్థించెను. చివర కత డలసి సొలసి నూట నలుబదియారు మైళ్ళు ప్రయాణముచేసి లక్నోకు ప్రాతఃకాల మయిదుగంటలకు చేరుకొనెను. మేమప్పుడే యుత్సవములో పాల్గొనుటకు స్టేషనుకు బయలుదేరుచుంటిమి. మేము చేసిన ప్రయత్నములకంటె గత సాయంకాలపు సంభవములే లక్నో నంతను మేల్కొలిపెను. సూర్యోదయము కాక

పూర్వమే వేలకొలదిజనము స్టేషనుకు చేరిరి. పట్టణములోని వివిధ భాగములనుండి యసంఖ్యాకమగు చిన్న చిన్న యుత్సవములు బయలు దేరెను. కాంగ్రెసుఆఫీసునుండి యనేకవేలమంది నలుగురు చొప్పున బారులు తీరి పోవు ప్రధానయుత్సవము బయలుదేరెను. మేమీ ప్రధాన యుత్సవములో నుంటిమి. మేము స్టేషనుకు వెళ్ళుటతోడనే పోలీసులు మమ్మాపివేసిరి. స్టేషనుముందర చతురపుమైలుదూరము విశాలమైన బహిరంగప్రదేశముండెను. మేమీ మైదానమునకొక వైపున బారులుతీరి నిలిచితిమి. ముందుకు త్రోసికొనిపోవు యత్న మేమియు లేక నచ్చటనే మా యుత్సవ మాగిపోయెను. ఆ ప్రదేశము మామూలు పోలీసులతోను, గుఱ్ఱపు పోలీసులతోను, మిలిటరీతోను నిండియుండెను. ఆ యుత్సవము చూడవచ్చిన యభిమానుల సంఖ్య యంతకంతకు హెచ్చెను. వీరిలోచాలమంది యిద్దరు ముగ్గురు చొప్పున మైదానములో సర్దుకొనిరి. దూరములో నడుచుచున్న సమూహ మొకటి మా కకస్మాత్తుగా కాన్పించెను. అది యీ ప్రదేశమునంతను కప్పివేయుచుండిన రెండుమూడు శ్రేణుల యాశ్వికదళము. వారు మాపై బడుటకు దౌడుమీదవచ్చుచు, మైదానములో నచ్చటచ్చట చెల్లాచెదరుగానున్న వారిని మోదుచు, గుఱ్ఱములతో త్రొక్కి-కొనుచు వచ్చుచుండిరి. స్వారిచేయుచువచ్చిన యాశ్వికుల దాడి చూచుట కందముగనే యుండెను. కాని త్రోవలో నిరపరాధులు, యుత్సవమును చూచుటకువచ్చినవారు గుఱ్ఱపు డెక్కలక్రిందబడి నలుగుచుండిరి. దాడిచేసిన యీ దళముల వెనుక నీ ప్రజలు నేల మీద పడియుండిరి. కొందరు లేవలేని స్థితిలోను, కొందరు బాధచే మూల్గుచు మైదానమంతయు నొక యుద్ధరంగమువలె నుండెను. ఆశ్వికులు క్షణికములో మాపైకి వచ్చిరి. మొదటి దళ మప్పుడే యుత్సవములోపాల్గొను జనసమూహముపై బడెను. మేము కదలలేదు; మా స్థలములను వీడలేదు. కనుక గుఱ్ఱములు చివర నిముసమున తటాలున ఆగి వెనుక కాళ్ళపై నిలిచి ముందరి డెక్కలనెత్తి గాలిలో మా శిరములపై తాండవమాడుచుండెను. తరువాత నాశ్వికులు మామూలు

పోలీసులుకూడా మమ్ము లాఠీలతోను, పొడుగుపాటి కమిచీలతోను మోద నారంభించిరి. అది శివతాండవమువలె నుండెను. గతసామాన్యకాలముండిన యా నిర్మలదృష్టి నాకు లేకపోయెను. నే నున్నచోట నుండి యొక్క యంగుళమైనను ముందువెనుకలకు పోరాదనిమాత్రమే గ్రహించితిని. ఆ దెబ్బలచే నేను సగము గ్రుడ్డివాడనైతిని. ఒక్కొక్కపుడు కొద్దికోపము దెబ్బకుదెబ్బ తీయవలెననుకోరిక నన్నావహించుచుండెను. నా యెదుటనున్న పోలీసుయుద్యోగిని గుఱ్ఱముమీదనుండి పీకివేసి నే నా గుఱ్ఱము నెక్కుట యొక ఘనకార్యము కాదనుకొంటిని. కాని యొక న్యాయమునకు కట్టుబడుటయు, చిరశిక్షణయు నన్ను మందలించెను. ముఖముమీద దెబ్బపడకుండ తప్పించుకొనుటకుతప్ప నేను చేయైనను యెత్తలేదు. ఇంతేగాక మే మేమాత్రము దౌర్జన్యమునకు గడంగినను మాలో నసంఖ్యాకులను కాల్చుటయు పేల్చుటయు జరుగునని నే నెరుగుదును.

యుగములవలె కాన్పించిన యీ కొద్దినిముషములైనతరువాత మా పంక్తి నెమ్మదిగా నడు గడుగు చొప్పున విడిపోకుండగనే త్రోవయిచ్చుచుండెను. దీనిమూలమున నేను కొంత యొంటరినైతిని. మరింత దెబ్బల వర్షము కురియ నారంభించెను. అకస్మాత్తుగా వెనుకనుండి నన్నెవరో పట్టుకొని మోసికొనిపోయిరి. నా సహచరులలో కొందరు యువకులు నాపై గొప్పదాడి రానున్నదని భావించి నన్ని సూక్ష్మమార్గమున రక్షింప నిశ్చయించిరి.

యుత్సవములలో పాల్గొనుచున్నవారు తిరిగి మా మొదటి పంక్తికి నూరడుగుల దూరములో నిలువబడిరి. పోలీసులుకూడ వెనుకకుతగ్గి మాకు యేబదియడుగులదూరములో నుండిరి. ఈ కష్టముకు కారణమైన సైమనుకమిషను అరమైలుపైగానున్న స్టేషనునుండి రహస్యముగా జారిపోవు సమయమున మే మీవిధముగా నుంటిమి. అయినను వారికి నల్లజెండాలు తప్పవయ్యెను. తరువాత మేము పెద్ద యుత్సవముతో కాంగ్రెసుఆఫీసుకువచ్చి యచ్చటనుంచి విడిపోతిమి. నేను నాకొర కాతురతతో నున్న తండ్రిగారియొద్దకు వెళ్ళితిని. తాత్కాలికావేశము తగ్గిపోవుటచే నాశరీరమంతయు బాధింపనారం

భించి యలసట హెచ్చుచుండెను. నా శరీరములో నొప్పిపెట్టని భాగమేదియు కాన్పించదయ్యెను. ఒడలునిండ గాయములు, కవ్రుకు దెబ్బలు మొదలగువాని చిహ్నములుండెను. అదృష్టవశాత్తు నాకు మర్మస్థానములలో మాత్రము దెబ్బలు తగులలేదు. నా స్నేహితులు చాలమంది కంతటి యదృష్టము పట్టలేదు. వారికి చాల గాయములు తగిలెను. నా ప్రక్కనిలిచిన గోవిందవల్లభపంతు ఆరడుగుల చిల్లర మనిషియగుటచే దెబ్బలకు మరింత గురియయ్యెను. అప్పుడు తగిలిన గాయములచే నతడు చాలకాలము వరకు నడుము యెత్తలేక, నే పనియు చేయజాలకయుండెను. నా శరీరస్థితియు, సహనశక్తియు బాగుండెనను మరింతగర్వముతో నేను బయటపడితిని. కాని దెబ్బల కంటె మాపై దాడి వెడలిన యా పోలీసులయొక్క, ముఖ్యముగా నుద్యోగస్థులయొక్క ముఖములను నేనెన్నటికిని మరువజాలను. నిజమైన దెబ్బలను చాలవరకు యూరపియను సార్జంటులే కొట్టిరి. భారత పోలీసులు నుద్యోగస్థులు కొంచెము తేలికపద్ధతుల నవలంభించిరి. ఆహా! ఆ ముఖములు ద్వేషముతో, రక్తపిపాసతో నిండి, యావంతయైన సానుభూతికి మానవలక్షణములు లేక కొంచె మించుమించు పిచ్చి యెత్తినట్లుండెను. బహుశః ఆ సమయమున మా ముఖములును చూచుటకంత ద్వేషపూరితముగనే యుండవచ్చును. తటస్థముగా నుండి నంతమాత్రమున మేము మా శత్రువులపట్ల ప్రేమపూరితులమై యుండలేదు. మా తాటస్థ్యము మా ముఖముల యందచందములను వృద్ధిచేయలేదు. అయినను మాలో క్రోధములేదు; వ్యక్తిగతమైన పోరాటముకాని, ద్వేషముకాని లేదు; రెండు బలీయమైన వింత శక్తులకు మే మా సమయమున ప్రతినిధులమైతిమి. అవి మా బుద్ధులను, మా హృదయములను జయించి మా కోరికలను, రాగములను ఉద్రేకపరచి మమ్ము గ్రుడ్డియుపకరణములుగా చేసికొనెను. మే మెందుకు పోరాడుచుంటిమో, నే మెచ్చటకు పోవుచుంటిమో తెలియకుండగనే గ్రుడ్డిగా పోరితిమి. కార్యోద్రేకము మమ్మెల బంధించెను. కాని, యదిగతించుటతోడనే యిదియంతయు దేనికొరకు? దేనికొరకు? యను ప్రశ్న యుదయించెను.

26

ట్రేడు యూనియను కాంగ్రెసు

ఆ వత్సరము సైమనుకమిషను బహిష్కరణము, అఖిలపక్ష శాసనసభ దేశములో రాజకీయముగ ప్రసిద్ధిచెందెను. కాని నా ప్రత్యేకశ్రద్ధ, కార్యాసక్తి యితరత్రయుండెను. కాంగ్రెసు కార్యదర్శి నగుటచే నే నా సంస్థను పరీక్షించుచు దానిని బలపరచుట కెక్కుడుగా పనిచేయుచుంటిని. ప్రజల దృష్టిని సాంఘిక, ఆర్థిక మార్పుల వైపు మరలించుటయే నా ప్రధానాశయము. స్వాతంత్ర్యమును గురించి మద్రాసులో మే మార్జించిన స్థానము కట్టుదిట్టము చేసికొనవలసియుండెను. ముఖ్యముగా నఖిలపక్షసభ మమ్ము వెనుకకు లాగుచుండుటచే నిది మరింత యవసరమయ్యెను. ఈ లక్ష్యముతో నేను చాలవరకు తిరిగి యనేక ప్రధానసభలలో నుపన్యసించితిని. 1928 లో నేను నాలుగు రాష్ట్రసభలలో—పంజాబు, దక్షిణమున మలబారు, ఢిల్లీ, సంయుక్తపరగణాలలో నధ్యక్షత వహించితిని. వంగ, బొంబాయిలలో ననేక యువజనసభలకు, విద్యార్థుల సభలకు కూడ నధ్యక్షత వహించితిని. అప్పుడప్పుడు సంయుక్తపరగణాలలో గ్రామసీమలకు వెళ్ళితిని. తఱచు పారిశ్రామిక కూలీలకుకూడ నుపన్యసించుచుంటిని. స్థానికపరిస్థితులనుబట్టి రూపము భేదించుచుండినను, సభలలో నున్న సభ్యులనుబట్టి ప్రాముఖ్యత హెచ్చింపబడుచున్నను మొత్తముమీద నా యుపన్యాసముల సారాంశ మొక్కటిగనే యుండెను. ప్రతిచోట నేను రాజకీయ స్వాతంత్ర్యమునుగురించి, సాంఘిక స్వాతంత్ర్యమునుగురించి చెప్పుచు మొదటిది రెండవదానిని సాధించుట కొక సోపానమని చెప్పుచుంటిని. నేను సామ్యవాదభావములను వ్యాప్తిచేయ కోరితిని. జాతికి వెన్నెముకవంటివారైన కాంగ్రెసు సేవకులు, విద్యాధికులు నతి సంకుచిత జాతీయభావములనే కలిగియుండుటచే ముఖ్యముగ వారిలోనే యీ భావములను వ్యాప్తిచేయకోరితిని. వారి యుపన్యాసములు ప్రాచీన యౌన్నత్యమును పొగడుచుండెను. పర

ప్రభుత్వముచే మనకు దాపరించిన ఆర్థిక, ఆధ్యాత్మిక కష్టములను మన ప్రజల వివిధబాధలను పరప్రభుత్వమువలన కలుగు నవమానములను, జాతీయగౌరవ స్వాతంత్ర్యవాంఛ, మాతృ పాదారవిందముల కడ నాత్మార్పణ మొనరింపవలసిన యావశ్యకత మొదలగు విషయములనుగురించి చెప్పుచుండెను. ఆవిషయము లందరకు సుబోధకములైన ప్రతి భారతహృదయము నట్టి భావములతోనే స్పందించుచుండెను. నాలోనున్న జాతీయభావముకూడ నుద్దీపితమయ్యెను. కాని వాటిలోని సత్యమున కెట్టిభంగము కలుగకపోయినను నిరంతర మాపాటనేపాడుచుండుటచే నవి పేలవమగుచు నితరసమస్యలను గురించియు మనపోరాటములోని ప్రధానాంశములను గురించియు యోచించుట కడ్డు తగులుచుండెను. అవి కేవల ముద్రేకమును పెంచుచుండెనేకాని యాలోచనను వృద్ధిచేయుచుండుటలేదు.

భారతదేశమునకు సామ్యవాదమును తెచ్చుటలో నేను ప్రథముడనుగాను. నిజముగా నేను వెనుకపడియుండి, యనేకమంది యీ సందేశమును నాకంటె ముందు ఘోషించియుండ నెమ్మదిగా యడుగడుగుచొప్పున నే బాధతో ముందుకు నడచితిని. పనివాండ్ర ట్రేడు యూనియను ఉద్యమాశయములలో నిశ్చయముగా సామ్యవాద పరముగ నేయుండెను. యువజనసంఘములు చాలవరకు నట్లేయుండెను. నేను యూరపునుండి 1927 డిసెంబరులో తిరిగి వచ్చునరి కస్పష్టము గజిబిజిగనుండిన సామ్యవాదము భారతదేశ వాతావరణములో నొకభాగమైపోయెను. అంతకుముందును చాలమంది సామ్యవాదులు చెల్లాచెదురుగనుండిరి. వారు చాలవరకు గాలిమేడలను కట్టుచుండిరి. మార్క్సుసిద్ధాంతము వారి నంతకంత కాకర్షించుచుండెను. కొద్దిమంది నూటికి నూరువంతులు మార్క్సు శిష్యుల మనుకొనిరి. అమెరికా, యూరపులలోవలెనే యిచ్చట సోవియటు యూనియనులో జరిగిన యభివృద్ధులవలన, ముఖ్యముగా నయిదు సంవత్సరముల ప్లానువలన నీభావము బలీయమయ్యెను.

ప్రధాన కాంగ్రెసు ఆఫీసులు చేతిలోనున్న కాంగ్రెసుముఖ్యులలో నొకడనగుటయే నేను సామ్యవాది నగుటలో నున్న ప్రాముఖ్యత. ఈవిధముగనే యోచింప నారంభించిన కాంగ్రెసు ముఖ్యులింకను కలరు. సంయుక్తపరగణాల రాష్ట్రకాంగ్రెసు కమిటీలలో నిది బాగుగ విదితమయ్యెను. ఈ కమిటీలలో మేము 1926 లోనే తేలికయైన సామ్యవాద ప్రోగ్రాము నొకదానిని వేయుటకు యత్నించితిమి. మారాష్ట్రము జమీందారులయొక్కయు, తాలూకుదారులయొక్కయు రాష్ట్రము. మేము మొట్టమొదట భూమిసమస్య నెదుర్కొనవలసియుండెను. వర్తమాన భూపద్ధతి పోవలెననియు ప్రభుత్వము వ్యవసాయదారులకు మధ్య నెవరునుండరాదనియు మేము ప్రకటించితిమి. వాతావరణమింకను సట్టిభావముల కలవడకపోవుటచే మేము కొంత జాగ్రతగనే పోవలసియుండెను.

మరుసంవత్సరము, 1929 మా కాంగ్రెసుకమిటీ మరియొక యడుగు ముందుకుపోయి సామ్యవాదపద్ధతిమీాద అ. భా. కాం. కమిటీకొక సూచనచేసెను. ఈ రెండవ కమిటీ ఆ సంవత్సర వేసవిలో బొంబాయిలో కలుసుకొని మా రాష్ట్రకమిటీ తీర్మాన పీఠిక నవలంబించి మొత్తము తీర్మానము వెనుకనున్న సామ్యవాద సూత్రము నంగీకరించెను. మా రాష్ట్ర తీర్మానములోని వివరమైన ప్రణాళిక నాలోచించుటకు మరియొక తేదీకి వాయిదావేసిరి. చాల మంది అ. భా. కాం. కమిటీలోను మా రాష్ట్రకమిటీలోను అంగీకరింపబడిన ఈ తీర్మానములను మరచి సామ్యవాద విషయము గత సంవత్సర కాంగ్రెసులో నకస్మాత్తుగా వచ్చినట్లూహించుచుందురు. కాని అ. భా. కాం. కమిటీ ఆ తీర్మానమును బాగుగ యోచించకుండ నామోదించిరనుట సత్యము. బహుశః చాలమంది సభ్యులు వారేమిచేయుచుండిరో గుర్తింపలేరు. భారత స్వాతంత్ర్య లీగు యొక్క మా రాష్ట్రశాఖ స్పష్టముగా సామ్యవాదపరముగనుండ మిశ్రమ సంస్థయైన కాంగ్రెసు కమిటీకంటె మరికొంతముందుకు వెళ్ళెను. స్వాతంత్ర్యసంఘలక్ష్యములలో నొకటి సాంఘిక స్వేచ్ఛ

యనుట సత్యము. మేము భారతదేశమంతట ఈ లీగును బలీయమైన సంస్థగాచేసి తద్వారా స్వాతంత్ర్య, సామ్యవాద ప్రచారములను చేయ నెంచితిమి. దురదృష్టవశాత్తు, నా కాశాభంగము కలుగునట్లు, ఈ లీగు మా రాష్ట్రములో కొంతవరకుతప్ప యెప్పుడు వృద్ధిచెందలేదు. దేశములో దీనికి తగినబలము లేకపోయెను. మాలో చాలమంది కాంగ్రెసులోకూడ చాల ప్రధానులము, కాంగ్రెసు సిద్ధాంతములోనైనను, స్వాతంత్ర్య తీర్మానము నవలంబించుటచేతను, వారెల్లపుడు కాంగ్రెసుసంస్థ ద్వారముననే పనిచేయగలరు. లీగును మొట్టమొదట స్థాపించినవారిలో కొందరికి దానినొక గొప్పసంస్థగా చేయవలెనను శ్రద్ధలేదు. వారు దానిని కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గము మీద నొత్తిడి కలుగజేయు నొక పరికరముగను, కాంగ్రెసు వర్కింగు కమిటీ యెన్నికలలో నుపయోగించుకొను పరికరముగను చూచిరి. కనుక స్వాతంత్ర్యలీగు కృశించెను. కాంగ్రెసు తీవ్రరూపమును దాల్చిన కొలది యది శక్తివంతులనందరను తనలోనికి లాగుకొనుటచే లీగు దుర్బలమయ్యెను. 1930 లో శాసనోల్లంఘనము వచ్చుటతోడనే లీగు కాంగ్రెసులో కలసిపోయి యంతరించెను.

1928, 1929 లలో నా అరెస్టు వదంతులు బయలుదేరెను. పత్రికల సూచనలలోను స్నేహితుల రహస్యమందలింపులలోను యెంతసత్యమున్నదో నాకు తెలియదు. కాని యీ మందలింపుల వలన నా కది సమీపించుచున్నట్లే తోచెడిది. నేను దీనిని లెక్క చేయలేదు. ఎప్పుడు అరెస్టు వచ్చినను నేను దానిని సామాన్య విషయమువలెనే చూచితిని. కనుక నరెస్టు వదంతులవలన లాభములు లేకపోలేదు: అవి నా నిత్య జీవితమునకు కొంత యుద్రేకము, పట్టు సమకూర్చెను. 1928_1929 సం॥లలోనే నాకు చాల సావకాశము దొరికెను. 1930 ఏప్రిల్ వరకు నా అరెస్టు రాలేదు. తరువాత ఖయిదు వెలుపలనున్న నా స్వల్పకాలములో స్థిరత్వము లేకపోయెను. నేను మాయింట కొద్ది కాలము చూచిపోవుటకు వచ్చినయొక క్రొత్త వానివలె మెలిగెడివాడను; లేదా, రేపేమి రానున్నదో యను

సందేహ మనస్కుడనై తిరుగుచు జయిలు పిలుపుకొరకెప్పుడు నెదురు చూచుచుండెడివాడను.

1928 అంతమున కలకత్తా కాంగ్రెసు సమీపించుచుండెను. మా తండ్రి దానికధ్యక్షుడు. అత డఖిలపక్ష సభా వ్యవహారములలో నిమగ్నుడై దానికొరకు తన నివేదికను తయారుచేసి కాంగ్రెసుచే నామోదింప జేయగోరెను. ఇది నా కిష్టము లేదని యత డెరుగును. స్వాతంత్ర్యసమస్యమీద రాజీపడుటకు నే నంగీకరించువాడను కాను. ఇది యతని కోపకారణము. మే మీ విషయమునుగురించి యంతగా చర్చించుకొనెడివారము కాము. కాని మాలో మానసిక పోరాటము చెరియొకవైపు లాగవలెనను ప్రయత్నము ఉండెడిది. అభిప్రాయ భేదములు మా కింతకుపూర్వము తఱచు కలుగుచుండెను. అవి ప్రధానమైనవే యగుటచే మేము వేరు వేరు రాజకీయ కక్షలలో నుండెడివారము. కాని యింతటి తీవ్రత యెన్నడు కలుగలేదు. ఇది మా ఇద్దరకు విచారముగనే యుండెను. కలకత్తాలో పరిస్థితులు విషమించెను. కాంగ్రెసులో తనమాట నెగ్గనిచో ననగా అఖిలపక్ష నివేదికయొక్క తీర్మానమునకు మెజారిటీ లేకపోయినచో తాను కాంగ్రెసు అధ్యక్షతను వహింపనని మాతండ్రి తెలిపెను. అదిచాల సహేతుకము, చట్టబద్ధము. అయినను యెదిరిపక్షములో చాలమంది కిది విషాదజనకముగ నుండెను. ఈ విషయము నింతతీవ్రస్థితికి తెచ్చుటకు వారికిష్టములేదు. విమర్శించుట, గర్హించుటయేగాని బాధ్యతను వహించుటకు వెనుకకు తగ్గుట తఱచుగా నొక యభ్యాస మయ్యెను. నావను నడుపవలసిన భారము మనపై వేసికొనకుండ విమర్శవలన నెదుటిపక్షము మనకు లాభకరమగు విధమున తన పద్ధతిని మార్చుకొనునను యాశ యెప్పుడు నుండును. ప్రస్తుత భారత ప్రభుత్వమువలె మనకు బాధ్యులు కాకుండ, కదల్చుటకు వీలులేని బాధ్యతారహితమైన కార్యనిర్వాకవర్గ మున్నప్పుడు మనము చేయగలిగినది విమర్శయే! ఆ విమర్శ ఖండనరూపముననే యుండి తీరును. అయినప్పటికి వ్యతిరేక విమర్శ పటుతరముగ నుండవలెననిన

దానివెనుక నవకాశము వచ్చుచో సంపూర్ణాధికారము, బాధ్యత వహింపగల మానసిక యత్నము, సంసిద్ధత యుండవలెను. ఆ యధికారము ప్రభుత్వముకు సంబంధించిన నాగరిక, సైనిక, ఆంతరంగిక, నైదేశిక శాఖ లన్నిటిమీాద నుండవలెను. లిబరలుపక్షమువారివలె సైన్యములో కొంత బాధ్యతయే కావలెనని కోరుట మన యసామర్థ్యము నొప్పుకొనుటయే యగును; విమర్శలోని సారమును తీసివేసినట్లే యగును.

ఇట్టివిమర్శలు, గర్హించుటలు, వానివలన సహజముగా సంభవించు ఫలితములకు వెనుకాడుటలు గాంధీజీ విమర్శకులలో తఱచు జరుగుచుండెను. అతని యనేకచర్యలందు హితవులేనివారు కాంగ్రెసులో ననేకులుగలరు. వారు వానిని తీవ్రముగ ఖండింతురు. కాని వారతనిని కాంగ్రెసునుండి తరిమివేయ సంసిద్ధులుకారు. దీని నర్థము చేసికొనుట సులభమే కాని యిది యేపక్షమునకు యోగ్యముకాదు. కలకత్తా కాంగ్రెసులో నిట్టికష్టము లే సంభవించెను. ఉభయపక్షముల మధ్య రాయబారములు జరిగెను. ఒక రాజీసూత్రము కుదిరెనని ప్రకటించిరి. కాని చివరకిది హుళ్ళక్కియయ్యెను. అనంతయు గందరగోళముగ నవినీతికరముగ నుండెను. చివరకు కాంగ్రెసుయొక్క ప్రధానతీర్మానము అఖిలపక్ష సభయొక్క నివేదిక నామోదించుచు, బ్రిటిషు ప్రభుత్వము సంవత్సరములోగా దాని కంగీకరింపనిచో స్వాతంత్ర్య తీర్మానమునకు మరలునని తెలియచేసెను. ఈ తీర్మానము స్వాతంత్ర్య ఆదర్శమునుండి క్రిందకు దిగినమాట సత్యము. ఏలనన అఖిలపక్షనివేదిక పూర్తియైన డొమినియను పరిపాలననైనను కోరలేదు. అయినను అది యోగ్యమైన తీర్మానము. ఏలనన నది చీలిక లేకుండ చేసి 1930 లో ప్రారంభమైన పోరాటమునకు కాంగ్రెసు నేకీముఖముచేసెను. బ్రిటిషుప్రభుత్వ మొక సంవత్సరములో అఖిలపక్ష సభాచట్టము నామోదించరనుమాట నిశ్చయము. ఇక పోరాటము తప్పనిసరి. దేశ పరిస్థితులనుబట్టి గాంధీజీ నాయకత్వము లేనిదే యెట్టిపోరాటము సఫలము కాజాలదు.

నేను బహిరంగ కాంగ్రెసులో, నిండు హృదయముతో కాక పోయినను, తీర్మానము నెదిరించితిని. అయినను నన్నే తిరిగి కార్య దర్శిగా నెన్నుకొనిరి. ఏమి జరిగినను సరే నేను కార్యదర్శిపదవి నంటి పెట్టుకొనియుంటిని. కాంగ్రెసు ప్రపంచములో నేను సుప్రసిద్ధ 'బ్రే' పట్టణ బిషప్పువలె నుంటిని. కాంగ్రెసుసింహాసనముపై నే యధ్య క్షుడు కూర్చొనినను కాంగ్రెసు సంస్థ కంతకు నేనే కార్యదర్శిగా నుంటిని.

కలకత్తా కాంగ్రెసుకు కొద్దిరోజులు పూర్వము బొగ్గుగనుల కేంద్రమయిన జారియాలో అఖిలభారత ట్రేడ్ యూనియను కాంగ్రెసు జరిగెను. నేను మొదట రెండురోజులు దానిలో పాల్గొని తరువాత కలకత్తా వెళ్ళిపోతిని. అదియే నా మొదటి ట్రేడు యూని యను కాంగ్రెసు. వ్యవసాయకులలోను, పనివాండ్రలోను నేను కల్పిం చుకొనిన జోక్యములే నాకు ప్రజలలో కొంతపలుకుబడి కలిగించినను కేవలము పైవాడను. సంస్కరణవాదులకు నతివాదులకు గల పాత పోరాటము జరుగుచునేయుండెను. ప్రధానమయిన సమస్య లేవియన నేదో నొక యింటరునేషనలుకు సామ్రాజ్య వ్యతిరేక లీగుకు నఖిల పసిఫిక్ యూనియనుకు దీనినొక యంగముగా జేర్పించుట; జినీవాలో జరుగు ఇంటర్ నేషనల్ లేబరు ఆఫీసు కాన్ఫరెన్సుకు ప్రతినిధులను పంపుట. ఈ సమస్యలకంటె ముఖ్యమైనది యీ కాంగ్రెసులోని రెండు పక్షములవారికి దృక్పథములోగల గొప్ప భేదము. పాత ట్రేడు యూని యను గ్రూపువారు రాజకీయములలో మితవాదులు. పారిశ్రామిక విషయములలో రాజకీయముల జోక్యమును వారు విశ్వసింపరు. వారు పారిశ్రామిక కార్యములనే విశ్వసింతురు. అవికూడ జాగ్రత్తగ జరుగ వలె నందురు. పనివాండ్ర పరిస్థితులు క్రమముగ మెల్లగ బాగుపడు టయే వారి లక్ష్యము. ఈ గ్రూపునాయకుడు యన్. యమ్. జోషి. ఇతడే తఱచు జినీవాకు భారత లేబరుప్రతినిధిగా వెళ్లెడివాడు. రెండవ గ్రూపు యింతకంటె నతివాదులు. రాజకీయ కార్యములను వారు విశ్వసింతురు. వారు బహిరంగముగ తమ విప్లవదృక్పథమును తెలిపిరి.

ఎట్టి అధికారము లేకపోయినను దానిపై కొందరు కమ్యూనిష్టులకు, కమ్యూనిజముకు చేరికయైనవారికి పలుకుబడి కలదు. ఈ గ్రూపువారు బొంబాయిలోని నేత పారిశ్రామిక పనివాండ్రను పట్టుకొనిరి. వీరి నాయకత్వము క్రిందనే బొంబాయిలో నేతపనివాండ్ర గొప్పసమ్మె కొంతవరకు జయప్రదముగ జరిగెను. బొంబాయిలో గిర్నీ కామ్‌ఘర్ యూనియను అను నొక శక్తివంతమైన నేతపనివాండ్ర క్రొత్త యూనియను బయలుదేరి లేబరుపరిస్థితుల కాధిపత్యము వహించెను. ఈ విప్లవ గ్రూపువారి పలుకుబడిక్రిందనున్న మరియొక బలీయమైన యూనియను జి. ఐ. పి. రైల్వే యూనియను. ట్రేడు యూనియను కాంగ్రెసు పుట్టినదిలగాయతు దాని కార్యనిర్వాహకత్వము, ఆఫీసు జోషీ చేతిలోను అతని సహచరుల చేతులలో నుండెను. ఈ యుద్యమమును లేవదీయుటకు జోషీయే బాధ్యుడు. విప్లవ పక్షమువారికి సామాన్యులందరిమీద నెక్కువ పలుకుబడియున్నను పయినుండి నీతిని మార్చుటకు తగిన సావకాశము లేవియు లేవు. ఈ స్థితి యసంతృప్తిగనుండెను. ఇది నిజపరిస్థితులను తెలుపకుండెను. అసంతృప్తియు, సంఘర్షణము బయలుదేరెను. ట్రేడు యూనియను కాంగ్రెసులో నధికారమును లాగుకొనవలెనను కోరిక విప్లవపక్షము వారికి కలిగెను. చీలిక కలుగునేమో యను భయముచే విషయములను విషమ పరిస్థితికి తీసుకొనుపోవుట కిష్టము లేకుండెను. హిందూదేశములో ట్రేడుయూనియను యుద్యమ మింకను బాల్యావస్థలోనుండెను. అది దుర్బలముగనుండి చాలవరకు పనివాండ్రుకాని నాయకులచే నడుపబడుచుండెను. అట్టిపరిస్థితులలో నెప్పుడును పయివారికి పనివాండ్రను కొల్లగొట్టు స్వభావముండును. ఇది భారత ట్రేడు యూనియను కాంగ్రెసులో విదితమయ్యెను. కాని జోషీ సంవత్సరముల తరబడి పనిచేసి మంచి శ్రద్ధగలిగిన ట్రేడుయూనియనిష్టు అని రుజువయ్యెను. అతనిని రాజకీయముగ మితవాది, వెనుకబడినవాడు అని యనువారు కూడ భారత లేబరు యుద్యమము కతడు చేసినసేవను గుర్తించెదరు.

మితవాదులలోగాని, యతివాదులలోగాని, యెవరిని గురించియు మన మిట్లు చెప్పుటకు వీలులేదు.

జారియాలో నా వ్యక్తిగత సానుభూతి విప్లవపక్షము వైపుననే యుండెను. కాని క్రొత్తవాడనగుటచే ట్రే. యూ. కాంగ్రెసు యొక్క యీ గృహకల్లోలములకు దూరముగ నుండవలెనని నిశ్చయించు కొంటిని. నేను జారియా వీడినతరువాత ట్రేడు యూనియన్ కాంగ్రెసు సాంవత్సర యెన్నికలు జరిగెను. మరు వత్సరమునకు నన్ను అధ్యక్షు నిగా నెన్నుకొనిరి. విప్లవపక్ష యభ్యర్థి నోడించుటకు బహుశః నా కెక్కువ సావకాశము లున్నవని యనుకొని మితవాదపక్షమువారు నన్ను పెట్టియుందురు. ఎన్నిక తేదీని నేను జారియాలోనే యుండినచో విధాయకముగా పనివాండ్రలో నొకడైన యభ్యర్థి కనుకూలముగా నా పేరు నుపసంహరించుకొనెడివాడను. క్రొత్తవానిని, పనివాండ్ర తెగకు చెందనివానిని అకస్మాత్తుగా నధ్యక్షపదవిలోనికి త్రోయుట నా కయుక్తముగా కాన్పించెను. భారతదేశములో ట్రేడు యూనియను యుద్యమము శైశవావస్థలో నున్నదనుట కిదియే చాలును.

1928 లేబరు తగాదాలతోను, సమ్మెలతోను నిండియుండెను. 1929 కూడ నట్లే వెళ్ళెను. ఈ సమ్మెలలో తీవ్రవాదులు, బొంబాయి నేతపనివాండ్రు నాయకత్వము వహించిరి. వంగదేశపు నారమిల్లు లలో పెద్ద సమ్మె జరిగెను. జెమ్షెడ్ పురపు యినుపపనులలోను, రైల్వేలలోను కూడ సమ్మెలు జరిగెను. జెమ్షెడ్ పురపు తగరపు పనులలో ననేకమాసము లొక ధైర్యమైన దీర్ఘపోరాటము జరిగెను. గొప్ప ప్రజా సానుభూతి యున్నను శక్తివంతమైన యా కంపెనీ పని వాండ్రను నిలిపివేసెను.

మొత్తముమీద రెండు సంవత్సరములును పారిశ్రామిక యసంతృప్తితో నిండియుండి లేబరుపరిస్థితు లధ్వాన్న మగుచుండెను. యుద్ధానంతర వత్సరములు హిందూదేశములో పరిశ్రమలకు పర్వదిన ములు. అమితమగు లాభములు సంపాదింపబడెను. అయిదారు సంవత్సరములవరకు నారమిల్లులు లేక ప్రతిమిల్లులలో సాంవత్సరిక డివి

డెండులు నూటికి నూరు నూటయేబదికూడ మించిపోయెను. గొప్ప లాభములన్నియు యజమానులకు, వాటాదారులకు వెళ్ళెను. పని వాండ్రు యథాప్రకారముగ నేయుండిరి. సాధారణముగ కూలి యేమా త్రము హెచ్చినను ధరవరలలోను ఆ హెచ్చుయుండుటచే వారికది యథాప్రకారమే యయ్యెను. తృటికాలములో లక్షలకు లక్షలు లాభ ములు చేసికొనబడుచుండు యీరోజులలోకూడ చాలమంది పని వాండ్రతిదరిద్రమగు గుడిసెలలో నివసించుచుండిరి. వారి స్త్రీలకు కట్ట వస్త్రములైనను లేకయుండెను. బొంబాయిలోని పరిస్థితులు దీన ముగ నుండెను. కాని కలకత్తాలోని మహాసౌధాంతరసీమల కొక గంట ప్రయాణములోనున్న నారపనివాండ్రస్థితి మరింత యధ్వాన్న ముగ నుండెను. అర్థనగ్న శరీరులైన స్త్రీలు, యెట్టి సంస్కారము లేనివారు గ్లాస్గో, డండీలకు, భారతదేశములోని కొద్దిమంది కోటీ శ్వరులకు నిరంతర ధనప్రవాహము పంపుటకే తృషితముకే పని చేయుచుండిరి.

పనివాండ్రు దుస్థితిలోనేయుండి లాభమేమియు ననుభవింపక యున్నను లాభసాటి సంవత్సరములలో పరిశ్రమ కెంతమాత్రము లోటులేకుండెను. కాని యీ మంచిదినములు పోయి పెద్దలాభము లను చేసికొనుట కంత సులభముకానపుడు భారమంతయు పనివాండ్ర మీదనే పడెను. వెనుకటి లాభములను మరచిపోయిరి. అవి తిని వేయబడెను. ఇప్పుడు లాభములు తగినంత రాకపోయినచో పరిశ్రమ లెట్లు సాగగలవు? కనుక పారిశ్రామిక యసంతృప్తి, లేబరు కష్టములు ప్రభుత్వమును, యజమానులనుకూడ భయపెట్టిన బొంబాయిలోని యఖండ సమ్మెలు, లక్ష్యములలోను, సంఘటనములోను లేబరు యుద్యమము స్వశక్తిని గ్రహించుచు, తీవ్రము, యుపద్రవకరము నగు రూపములను దాల్చుచుండెను. రాజకీయోద్యమముకూడ తీవ్ర ముగా నభివృద్ధిచెందుచుండెను. ఈ రెండును సంబంధములేక ప్రత్యే కములే యైనను యివి కొంతవరకు జోడింపబడుచుండును. ప్రభుత్వ భవిష్యత్తు తృప్తికరముగ కాన్పించలేదు.

1929 మార్చి మాసములో ప్రభుత్వము విప్లవపక్ష ప్రధానులను నిర్బంధించి సక్రమమైన లేబరుసంస్థపై అకస్మాత్తుగాపడెను. బొంబాయి గిర్నీ కామ్‌ఘర్ యూనియను నాయకులను, వంగ, పంజాబు, సంయుక్తపరగణాలలోని నాయకులను నిర్బంధించిరి. వీరిలో కొందరు కమ్యూనిస్టులు, కొందరు వారికి చేరికయైనవారు, కొందరు కేవలము ట్రేడుయూనియనిస్టులు, నాలుగున్నర సంవత్సరములవరకు సాగింపబడిన ప్రఖ్యాత మీరటుకుట్రకేసు కిదియే ప్రారంభము.

మీరటు కేసు ముద్దాయిలతరపున మాతండ్రి యాధిపత్యమున నొక డిఫెన్సు కమిటీ యేర్పడెను. అందు డాక్టరు అన్సారీ మొదలగు కొంతమంది సభ్యులముగ నుంటిమి. మాపై కఠినమైనభారముపడెను. డబ్బు పోగుచేయు టంతసులభమైన పనికాదు. ధనవంతులకు సామ్యవాదులయెడల, కమ్యూనిస్టుల యెడల, లేబరు ఆందోళనపరులందు నెక్కువ సానుభూతిలేదు. లాయర్లు తమసేవకొరకెవరిరక్తమునో యొకరి రక్తమును పిండకతప్పదు. మా కమిటీలో కొందరు గొప్ప లాయర్లు మా తండ్రి మొదలగువారు కలరు. సలహా చెప్పుటకు, మామూలుగా మార్గముచూపుటకు వారెప్పుడును సిద్ధముగనేయుండిరి. దానివలన మా కంత ఖర్చులేదు. కాని, వారు మీరటులో నెలల కొలది యొకేసారి కూర్చొనజాలరు. మేము కలిసికొనిన యితర లాయర్లు యీ కేసును వీలున్నంతవరకు డబ్బుసంపాదించుట, కొక సాధనగా చూచుకొనిరి.

మీరటు కేసుకాక యం.యస్. రాయి మొదలగువారి డిఫెన్సు కమిటీలతోకూడ నాకు సంబంధముండెను. ప్రతిసందర్భములో నేను నా స్వంతవృత్తికి చెందినవారి ధనపిపాస కాశ్చర్యపడితిని. 1919 లోని మార్షల్‌లా రోజులలో మొట్టమొదట నాకిట్టియాశ్చర్యము కలిగెను. తనవృత్తిలో గొప్ప పేరుపొందిన లాయరొకడు సైనికశాసనమున కాహుతియైనవారియొద్ద పూర్తిఫీజుకావలెనని రొక్కించెను. అది చాల హెచ్చుమొత్తము. వారిలో నొక తోడి లాయరుకూడ నుండెను. అతనికి ఫీజుచెల్లించుటకు వీరిలోచాలమంది యప్పుచేయవలసివచ్చెను.

లేదా ఆస్తి నమ్మివేసిరి. నా తరువాత యనుభవములు మరింత బాధకరముగనుండెను. మేము మతిదరిద్రులైన పనివాండ్రనుండి డబ్బుడబ్బు చొప్పున వసూలుచేసి లాయర్లకు పెద్దపెద్ద చెక్కులను చెల్లించితిమి. అది నా కయిష్టముగనుండెను. ఇంతకు చేసిన పనియంతయు వ్యర్థముగ కాన్పించెను. రాజకీయ నేరము, లేబరు నేరము మనము వాదించినను, వాదింపకున్నను ఫలిత మొక్కటియే. మీరటు కేసు వంటి కేసులలో ననేకసందర్భములనుబట్టి వాదము కావలెననుటలో సందేహము లేదు.

మీరటు డిఫెన్సు కమిటీకి ముద్దాయిలతో ననేకచిక్కులు తటస్థించెను. వీరిలో ననేకరకముల మనుష్యులుండిరి; డిఫెన్సువిధానములో ననేకరకములుండెను. వీరిలో సామరస్యమనునది యెంత మాత్రము లేకుండెను. కొన్ని నెలలయినతరువాత మేము క్రమమైన కమిటీని కట్టిపెట్టి వ్యక్తిగతముగా సహాయము చేయుచుండెడివారము; రాజకీయపరిస్థితులు మా దృష్టి నెక్కుడుగా నాకర్షించుచుండెను. 1930 లో మే మందరము జయిలులో నుంటిమి.

27

ఆకాశములో నుఱుములు

1929 కాంగ్రెసు లాహోరులో జరుగనుండెను. పదివత్సరము లయినతరువాత నది తిరిగి పంజాబునకు వచ్చెను. ప్రజల మనస్సులు పదివత్సరములపూర్వపు 1919 నాటి సంభవములవైపు తిరిగెను. జలియనువాలాబాగు, అవమానభరితమైన సైనికశాసనము, అమృతసరపు కాంగ్రెసు, అసహాయోద్యమ ప్రారంభము – ఈ పది వత్సరములలో ననేకములు జరిగి, భారతదేశ వైఖరి మారిపోయెను. రాజకీయతీవ్రత హెచ్చుచుండెను. సంగ్రామవాతావరణము త్వరిత ముగా నభివృద్ధిగాంచుచుండెను. రాబోవు సంగ్రామఛాయలు దేశ ముపై బడెను. ఏ కొద్దిమందికో తప్ప అసెంబ్లీసభ, రాష్ట్రసభలు రుచింపకుండెను. నిరంకుశము, అధికారయుతము నగు ప్రభుత్వమున కొక వేషమువలెనుండి, యవి 'నిత్యవిధులను' జరుపుచుండెను. కొంతమంది కిది భారతదేశపు 'పార్లమెంటు' సభ్యుల అలవెన్సులని చెప్పుకొనుట కొక సాకుగనుండెను. 1928 లో సైమనుకమిషను బహిష్కరణ తీర్మానమును చేయుటతో నసెంబ్లీసభ తుదిసారి ప్రజల నాకర్షించెను.

తరువాతకూడ ప్రభుత్వమునకు, నధ్యక్షునకు నొక పోరాటము జరిగెను. అసెంబ్లీ స్వరాజ్యపార్టీ యధ్యక్షుడైన విఠల్భాయిపటేలు స్వతంత్రుడగుటచే కోమల ప్రభుత్వగాత్రమున కొకముల్లువలెనుండెను. అతని రెక్కలను ఛేదించుటకు యత్నములు జరిగెను. ఇట్టి సంభవము లప్పుడప్పు డాకర్షించుచుండినను ప్రజాహృదయము బయటజరుగు విష యములపై కేంద్రీకరింపబడెను. మాతండ్రికి కౌన్సిలుపనితో పూర్తిగా ముఖము మొత్తెను. శాసనసభలవలన నా స్థితిలో నంతకంటె నెక్కు వేమియు లభింపజాలదను తన యభిప్రాయము నతడనేకసారులు వెల్లడించెను. అవకాశము దొరికినచో వాటినుండి బయటపడవలెనని యతడనుకొనుచుండెను. అతని బుద్ధి చట్టబద్ధము. అతడు న్యాయ

పద్ధతులకు, విధానమునకు నలవడెను. కాని భారతదేశములో చట్టబద్ధమగు పద్ధతులనబడునట్టివి వ్యర్థములనియు నిరుపయోగములనియు నతడు పరిస్థితుల ప్రాబల్యముచే కనుగొనెను. భారతదేశములో చట్టమే లేదనియు, ఆర్డినెన్సులు మొదలగువాని రూపములో నొక వ్యక్తి యిచ్ఛానుసారముగనో లేక నొక నిరంకుశవర్గము యిచ్ఛననుసరించియో, న్యాయము లకస్మాత్తుగా గారడివాని టోపీలోనుండి యూడిపడు మెముకలవలె పుట్టుచుండునపుడు న్యాయపరిపాలనయే లేదనియు నతడు తన న్యాయబుద్ధికి నచ్చ చెప్పుకొనుచుండును. ఆచారములచేత, స్వభావముచేత నతడు విప్లవకారు డెంతమాత్రము కాడు. మధ్యతరగతి ప్రజాస్వామిక మనునది యున్నచో నతడు విధాయికముగా నట్టిచట్టమునకు మూలవిరాట్టువలె నుండెడివాడు. కాని పరిస్థితులనుబట్టి భారతదేశములో బూటకపు పార్లమెంటు నాటకముతో చట్టబద్ధమగు నాందోళన జరిపెదమను భాష యతని కంతకంతకు కోపము కలిగించుచుండెను.

కలకత్తాకాంగ్రెసులో వహించిన పాత్రకుమినహా గాంధీజీ రాజకీయములకు దూరముగనేయుండెను. కాని పరిస్థితు లతని కెప్పటి కప్పుడు ద్యోతకమగుచునేయుండెను. కాంగ్రెసునాయకు లతనిసలహా తఱచు తీసికొనుచునేయుండిరి. కొన్నివత్సరములనుండి యతనిప్రధాన కార్యక్రమము ఖాదీప్రచారము. ఈ లక్ష్యముతో నతడు యావద్భారతము విశేషసంచారము గావించెను. అతడు వరుసగా ప్రతిరాష్ట్రమునకు పోయి ప్రతిజిల్లాను, యేమాత్రమైనను పేరుగల ప్రతిపట్టణమును, మారుమూలలనున్న గ్రామసీమలను చూచెను. ప్రతిచోట వేలు, లక్షలు జనము నత డాకర్షించెను. అతనిప్రణాళికను నడుపుటకు ముందుగా ననేకమంది పనిచేయవలసివచ్చెను. ఈవిధముగా నత డనేకసారులు భారతదేశమును తిరిగి దక్షిణమున కన్యకుమారి మొదలు యుత్తరమున హిమాచలమువరకు, తూర్పుకనుమలు మొదలు పశ్చిమ సముద్రమువరకు గల విశాల భారతదేశమున ప్రతి

చిన్న ప్రాంతమును చూచెను. అతనివలె భారతదేశమును మానవ మాత్రుడెవడు తిరిగియుండలేదని నా యభిప్రాయము.

పూర్వకాలమున దిమ్మరీడులగు యాత్రీకులు నిరంతరము ప్రయాణము చేయుచుండెడివారు. కానివారి ప్రయాణసాధనము లతి మందములగుటచే యావజ్జీవముచేసిన ప్రయాణములు రైలుమీద, మోటారుమీద చేయు నొక సంవత్సర ప్రయాణముకు సరికావు. గాంధీజీ రైలుమీద, మోటారుమీద వెళ్ళుటయేగాక కాలినడక గూడ సాగించెను. ఈ విధముగా నతడు భారతదేశముయొక్క నసమాన జ్ఞానము సంపాదించెను. కోట్లకొలది ప్రజ లతనిని చూచి యతనితో స్వయముగా సంపర్కము కలిగించుకొనిరి.

1928 మందు వేసవిలో నతడు సంయుక్తపరగణాలకు ఖాదీ ప్రచారమునకు వచ్చి యనేక వారము లచ్చట సంచారముచేసెను. నే నతనితో నప్పుడప్పుడు కొద్దిరోజులు వెళ్ళెడివాడను. ఇదివరకు నా కనుభవమున్నను నే నత డాకర్షించు మానవసముద్రమును చూచి యాశ్చర్యపడెడివాడను. గోరకపూర్పువంటి తూర్పుజిల్లాలలో నిది మరింత యద్భుతమయ్యెను. ఆ జనసమూహము మిడుతల దండు వలె నుండును. మేము గ్రామసీమలలో తిరుగునపుడు ప్రతి కొద్ది మైళ్ళకు పదివేలు, పాతికవేలు జేరుచుండెడివారు. ఆ రోజులలోని ప్రధానసభకు లక్షమందిపైగా వచ్చెడివారు. ఏ కొద్ది పట్టణముల లోనోతప్ప దూరశ్రవణ యంత్రములు లేవు. ఇంతమందికి వినిపించు టసాధ్యము. బహుశః వారేమియు వినుటకు రాలేదు. 'మహా త్ముని' చూచుటతో వారు సంతోషించెదరు. గాంధీజీ సాధారణ ముగ అనవసర శ్రమలేకుండ కొద్దిగనే మాట్లాడెడివాడు. లేనిచో గంటలకొలది రోజులకొలది నీ పద్ధతిని నడుపుట దుస్సాధ్యము.

యు. పి. ప్రచారమంతట నే నతనితో నుండలేదు. నావలన నతనికి ప్రత్యేక ప్రయోజన మేమియు లేదు. నేను ప్రయాణము చేయు పార్టీసంఖ్యను పెంచుటలో నర్థములేదు. సమూహములలో నుండుటకు నా కభ్యంతరములేదు. కాని త్రోపులను పడుటకు,

రాపుడు ననుభవించుటకు, కాళ్లు నలుగగొట్టించుకొనుటకు, తగినంత యుత్సాహము కాన్పించదు. నాకు చేయవలసిన యితరపని యెంతయో యుండెను. అది రాజకీయపరిస్థితులు విషమించుచున్న సమయము. వానితో పోల్చిన నాకు స్వల్పవిషయముగా కాన్పించిన ఖాదీకి బంధింపబడియుండుట నా కిష్టములేదు. కొంతవరకు నేను గాంధీజీయొక్క, రాజకీయములకు సంబంధించిన మధ్యే మధ్యే వ్యాపారములకు, కోపము వెలిబుచ్చెడి వాడను. అతనియాలోచన వెనుక నున్న పునాది నా కెన్నటికి నర్థముకాలేదు. ఆ రోజులలో నతడు ఖాదీపనికొరకు ధనము వసూలు చేయుచుండెను. దరిద్రనారాయణుల కొరకు 'దరిద్రులయొక్క నారాయణుడని' లేక 'దరిద్రులలో నివసించెడి నారాయణుని' కొరకు డబ్బు కావలెనని యతడు తరచు చెప్పుచుండెడివాడు. దానిని గృహపరిశ్రమలకు వినియోగించి బీదలకు పనికల్పించుట కతడుద్దేశించెను. కాని యీ పదము వెనుక దారిద్ర్యమును కీర్తించు భావము కాన్పించును. భగవంతుడు ప్రత్యేకముగ దరిద్రులకు ప్రభువు. వారతని ముద్దుబిడ్డలు. ప్రతిచోట సాధారణముగ నుండు మతదృష్టి యిదియే యని నేను భావించెదను. నేను దీనిని మెచ్చుకొనజాలను. నాదృష్టిలో దారిద్ర్య మసహ్యమైనది. దానితో పోరి దానిని చీల్చి చెండాడవలసినదేకాని దాని నెంతమాత్రము ప్రోత్సహింపరాదు. ఈ దృష్టి విధాయకముగ దారిద్ర్యమును సహించి దాని నుత్పత్తి చేసిన పద్ధతిపై దాడిచేయును. దీనికి సిద్ధపడినవారేదోవిధముగ దానిని సమర్థించ జూతురు. వారు లేమిని దారిద్ర్యమును చూడగలుగుదురు. కాని జీవితావసరములలో పుష్కలముగా నిండియుండు ప్రపంచచిత్రమును చూడజాలరు. బహుశః వారి ప్రకారము బీదసాద లెప్పుడు మనలో నుందురు.

గాంధీతో దీనిని గురించి నే నెప్పుడు చర్చించినను అతడు ధనవంతులు తమధనమును ప్రజల ధర్మవిధిగా భావింపవలెననును. ఇది యెప్పుడో తాతలనాటి దృష్టి. దీనిని మనము తరచుగా హిందూదేశములోను మధ్యయుగపు యూరపులోను చూచెదము.

ఇట్లు జరుగుట సంభవమని, సాంఘిక సమస్యను పరిష్కరించుట కిదియే విధమని సహేతుకముగా మన మెట్లు భావింపగలమో నా కెంత మాత్రము నర్థముకాలేదు. అసెంబ్లీసభ నేను పైన చెప్పినట్లు నిద్ర మత్తు వ్యాపారమగుచుండెను. దాని నిప్పచ్చర వ్యాపారములో నెవరును శ్రద్ధవహించుట లేదు. భగవత్సింగు, బి. కె. దత్తులు ప్రేక్షకుల గేలరీలనుండి రెండు బాంబులను అసెంబ్లీహాలు నేలమీదకు విసిరినపుడది యొకనాడు దద్దరిల్లెను. ఎవరికి గట్టిదెబ్బలు తగులలేదు. బహుశః ముద్దాయిలు తరువాత చెప్పినట్లు, ఆ బాంబుల చప్పుడు చేయుటకు, కదలిక కలిగించుటకు నుద్దేశింపబడెను, కాని బాధించుట కుద్దేశింపబడలేదు.

అట్లే యసెంబ్లీలోను బయటకు వారు కదలికను కలిగించిరి. టెర్రరిష్టుల యితరచర్య లింత నిరుద్రవకరముగ లేవు. లాలాలజపతి రాయిని కొట్టిన యింగ్లీషు పోలీసుఆఫీసరును లాహోరులో వేల్చి చంపిరి. వంగదేశములోను, ఇతరచోట్లను టెర్రరిష్టుచర్యలు తిరిగి తలయెత్తినట్లు కాన్పించెను. కుట్రనేరము లనేకులపై మోపబడెను. డెటెన్యూలసంఖ్య త్వరలో హెచ్చిపోయెను. లాహోరు కుట్రకేసులో కోర్టులో పోలీసులచే నసాధారణ రంగములు ప్రదర్శింపబడెను. దీని వలన నీ కేసు ప్రజాహృదయమును చాలవర కాకర్షించెను. కోర్టు లోను, ఖయిదులోను తమయెడల చూపబడిన యవమానుషములను నిరసించుటకు చాలమంది ఖయిదీలు నిరశనదీక్షబూనిరి. అది యెట్లు ప్రారంభమయ్యెనో నాకు జ్ఞప్తిలేదు; కాని చివరకీ సమస్య ఖయిదీలపట్ల ముఖ్యముగా, రాజకీయఖయిదీలపట్ల చూపబడు యమానుష సమస్యగా తేలెను. ఈ నిరశనదీక్ష వారములకొలది సాగుచు దేశములో నుద్రేకము కలిగించెను. ముద్దాయిల శరీరదుర్బలతచే వారిని కోర్టుకుతీసికొనిపోవుటకు వీలులేకుండెను. విచారణలకు తఱచు వాయిదాలుపడుచుండెను. అందుచే భారతప్రభుత్వము ముద్దాయిలు, వారి తరపు ప్లీడర్లు యక్కరలేకుండగనే కోర్టువిచారణ జరుపవచ్చునను

శాసనమును ప్రవేశపెట్టెను. ఖయిదులో చూపబడవలసిన విధాన మునుకూడ వారే యోచించవలెను.

నిరశనదీక్ష మాసము జరిగెను. నేను లాహోరులో నుండుట సంభవించెను. ఖయిదులోనున్న కొంతమందిని చూచుటకు నా కనుజ్ఞ యిచ్చుటచే నే నా యవకాశము వినియోగించుకొంటిని. నేను భగత్సింగును చూచుట కదియే మొదటి పర్యాయము. జతీన్ దాసు మొదలగువారిని చూచితిని. వారందరు చాల దుర్బలముగనుండి మంచము పట్టిరి. వారితో నెక్కువగా మాట్లాడుటకు వీలు లేకుండెను. భగత్సింగు ముఖకమల మతిప్రసన్నముగ, బుద్ధివైశద్యము ప్రకటించునదిగ, నతి నిర్మలముగ, ప్రశాంతముగ నుండెను. అందులో క్రోధమెంతమాత్రము కాన్పించుట లేదు. అత డతిసాధువు. అతి సాధువుగ మాట్లాడెను. కాని నెలరోజులనుండి యుపవసించువా డాధ్యాత్మికముగ, శాంతముగ కాన్పించు ననుకొనెదను. జతీన్ దాసు మరింత శాంతముగ, సుకుమార బాలికవలె మార్దవముగ, సాధువుగ కాన్పించెను. నేను చూచినపు డత డమిత బాధపడుచుండెను. తరువాత నతడు యుపవాసఫలితముగ నరువదియొకటవ దినమున దివంగతుడయ్యెను. 1907 లో లాలాలజపతిరాయితో ప్రవాసమున కంపబడిన తన పినతండ్రియగు సర్దారు అజిత్సింగును చూడవలెనని లేదా యతని వార్తనైన వినవలెనని భగత్సింగు తపించుచున్నట్లు కాన్పించును. అనేక వత్సరము లతడు విదేశములలో ప్రవాసిగా నుండెను. అతడు దక్షిణ అమెరికాలో స్థిరవాసర మేర్పరచుకొనినట్లు స్పష్టముగు రిపోర్టులుకలవు. కాని యతనినిగురించి నిజమేదియు తెలియునని నే ననుకొనను. అతడు జీవించినది లేనిది కూడ తెలియదు.

జతీన్ దాసు మృత్యువు దేశమంతట నుద్రేకము కలుగజేసెను. అది రాజకీయ ఖయిదీల నెట్లుచూడవలెనను సమస్యను ముందుకు తీసికొనివచ్చెను. ఈ విషయమునుగురించి యోచించుట కొక కమిటీ ప్రభుత్వముచే నియమింపబడెను. ఈ కమిటీచర్చల ఫలితముగా ఖయిదీలను మూడు తరగతులుగా విభజించు క్రొత్తసూత్రములు సృజింపబడెను. స్థితిగతులను చక్కబరచుట కేర్పడిన యీ క్రొత్తసూత్ర

ముల వలన లాభమేమియు లేకపోయెను. స్థితిగతు లెప్పటివలెనే యత్యంత యసంతృప్తిగ నుండెను.

గ్రీష్మ, వర్షఋతువులు క్రమముగ నాకురాలుకాలములోనికి జొరబడినతోడనే రాష్ట్రకాంగ్రెసు కమిటీలు లాహోరుకాంగ్రెసు ప్రెసిడెంటు నెన్నుకొను సన్నాహములో నుండెను. ఈ యెన్నిక దీర్ఘ కాలము పట్టుచు ఆగస్టు లగాయతు అక్టోబరువరకు జరుగుచుండెను. 1929 లో గాంధీజీ ఐక్యకంఠముతో నధ్యక్షుడుగా నెన్నుకొనబడెను. రెండవసారి యతనిని కాంగ్రెసు అధ్యక్షునిగా నుంచుటలో కాంగ్రెసు యధికారపరంపరలలో నతనికి మరింతయౌన్నత్యమేదియు గలుగదు. చాలవత్సరములనుండి యతఁ డధ్యక్షాతీతుడుగ నుండెను. పోరా టము సన్నిహితముగా నుండుటచే దాని నతడు నడిపింపక తప్పదు. కనుక నీ సమయమున కాంగ్రెసు కతడే యధ్యక్షుడుగా నుండుట మంచిదని సాధారణముగా భావింపబడెను. ఇంతేగాక నధ్యక్షతకు తగినంత పేరుప్రఖ్యాతులు కలవాడు మరియొకడు లేడు.

కనుక రాష్ట్రకమిటీలు గాంధీజీని యధ్యక్షునిగా సూచించెను. కాని యతడు దానిని తిరస్కరించెను. అతడు గట్టిగా వలదని చెప్పి నను అతనితో వాదించి యొప్పించవచ్చునను యాశ కాన్పించెను. తుదిపరిష్కారము చేయుటకు లక్నోలో అ. భా. కాం. కమిటీసభ జరిగెను. చివరనిమిషమువరకు నత డొప్పుకొనుననియే మే మంద రము భావించితిమి. అత డెంతమాత్రము నిచ్చగింపక చివరనిమిష ములో నా పేరు సూచించెను. అతని తుదితిరస్కారమునకు అ. భా. కాం. కమిటీ తెల్లబోయి యిట్టిచిక్కుస్థితికి తేబడినందుకు కొంత యాగ్రహము పొందెను. ఎవరు దొరకనందున వైరాగ్యము చెంది చివరకు నన్నే యెన్నుకొనిరి.

ఆ యెన్నికచే నాకు కలిగిన చికాకు, హైన్యభావము నా కెన్నడు కలుగలేదు. నాకు గలిగిన గౌరవమును నేనుగుర్తింపకపోలేదు. అది యసామాన్య గౌరవము. మామూలు పద్ధతిగా నెన్ను కొనబడినచో నే నానందించెడివాడను. నేను సింహద్వారమున రాలేదు. ప్రక్క గుమ్మమునైననురాలేదు. అకస్మాత్తుగా నే నొక

దిడ్డివాకిలినుండి యూడిపడి సభ్యులు నివ్వెరపడి యొప్పుకొనునట్లు చేసితిని. వారు గంభీరవదనముతో దానిని కప్పిపుచ్చి తప్పనిసరియగు మాత్రవలె నన్ను దిగమ్రింగిరి. నా యభిమానమున కిదియొక చురక వలెనుండి నేనీ గౌరవమును తిరిగి యిచ్చివేయవలె ననుకొంటిని. అదృష్టవశాత్తు నే నట్లు వెలితికాకుండ నిరోధించుకొని విచార హృదయముతో మెల్లగా జారితిని.

బహుశః యీ నిశ్చయమునకు మా తండ్రి పరమానంద భరితుడయ్యెను. నా రాజకీయము లతనికి పూర్తిగా గిట్టవు. కాని యతడు నన్నెక్కుడుగ ప్రేమించుటచే నా కేమంచి సంభవించిన నత డానందపడుచుండును. తఱచుగా నతడు నన్ను విమర్శించుచు నాతో కొంచెము కటువుగా మాట్లాడును. కాని మర్యాద దక్కించుకొన దలచువాడెవడు నతనిసమక్షమున నన్ను దూషింపజాలడు.

నా యెన్నిక నా కొక గొప్ప గౌరవమును, గొప్ప బాధ్యతను తెచ్చిపెట్టెను. తండ్రివెనుక నే కుమారు డధ్యక్షపీఠమునకు వచ్చుట సామాన్యవిషయము. కాంగ్రెసు అధ్యక్షులలో నే నందరికంటె పిన్నవయస్కుడనని తఱచు చెప్పబడుచుండెను. ఇది నిజముకాదు. గోఖ్లేకును నదియే వయస్సని నే ననుకొనెదను. మౌలానా అబుల్ కలాం అజాదు నలుబది వత్సరములలోపుననే యధ్యక్షుడయ్యెను. గోఖ్లే ముప్పది వత్సరములు నిండినతోడనే పెద్ద రాజకీయవేత్తలలో నొకడుగా పరిగణింపబడెను. అబుల్ కలాం అజాదు తనవిశేషపాండిత్యం నుగ్గడించుటకు తగిన పూజ్యవయోదృష్టిని సాధించెను. రాజకీయ విశారదత్వము నా గుణములలో నొకటిగా నెప్పుడు పరిగణింపబడలేదు. విశేషపాండిత్యము కలదని నన్నెవరు దూషింపలేదు. కనుక నాతల నెరసినను, దృష్టిదోషమబ్బినను వయసుమీరినవాడనను నింద నాకు తప్పిపోయెను.

లాహోరు కాంగ్రెసు సమీపించెను. ఈ లోపల పరిస్థితులు వానిలోనున్న యంతశ్శక్తులచే ప్రచలితమగుచు క్రమముగా ముందుకు పరుగిడుచుండెను. వ్యక్తులు తా మెంత పటాటోపము బూనినను చాల యల్పమైన పాత్రనే వహింపగలరు. నిర్దాక్షిణ్యముగ చఱిచఱి

ముందుకుబోవు మహాయంత్రములో మన యొక యల్పభాగ మను భావము తోచుచుండెను. విధిప్రేరితమగు నిట్టి ప్రవాహాభివృద్ధి నరికట్ట తలంచి ప్రభుత్వమువారొక యడుగు ముందుకు వేసిరి. వైస్రాయియైన ఇర్విన్ ప్రభువు, రౌండు టేబిలు సమావేశము జరుగనున్నదను నొక ప్రకటన గావించెను. ఆ ప్రకటన వలలో పడవేయుటకు దగిన పదజాలముతో నిండియుండెను. దానికెంత యర్థమునైనను చెప్పుకొనవచ్చును. లేదా యది శుష్కముగావచ్చును. రెండవ యర్థమే న్యాయమని మాలో చాలమంది యనుకొంటిమి. ఒకవేళ దానిలో నేదియైన యున్నను అది మనము కోరుదానికి దగ్గర కాదు. వైస్రాయి ప్రకటన జరిగినదో, లేదో యప్పుడే 'కొంపమునిగిపోయినట్లు' ఢిల్లీలో 'నాయకులసభ' యొకటి యేర్పాటు గావింపబడెను. అన్నివర్గముల మనుష్యులకు యాహ్వానము లంపబడెను. గాంధీజీ, మోతీలాల్ బదులు మాతండ్రి, విఠల్‌భాయి పటేల్ (యింకను అసెంబ్లీ యధ్యక్షుడు) గార్లును, తేజబహాదరు సప్రూవంటి మితవాద నాయకులు మొదలగు నితరులు నచ్చట నుండిరి. కొన్ని షరతులకు లోబడి వైస్రాయిప్రకటన నంగీకరించుటకొక సమిష్టి తీర్మానము గావించుకొనబడెను. ఇవి చాల ప్రధానమైనవనియు ముఖ్యముగా నెరవేర్పబడవలయు ననియు జెప్పబడెను. ప్రభుత్వ మీ షరతుల కొప్పుకొననిచో తోడ్పాటుగావింపబడుననిరి. ఈషరతులు * చాలగట్టివి. వీటివలన నెంతయో భేదము కలిగెడిది.

మితవాద యతివాద పక్ష ప్రతినిధులందరు నిట్టి తీర్మానమున కంగీకరించు టొకవిజయము. కాంగ్రెసు కిది యొకపతనము. సామా

---

* ఈ షరతు లేవియనిన :

1. జరుగబోవు కాన్ఫరెన్సులో జరుపబడు చర్చలన్నియు భారతదేశమునకు సంపూర్ణ డొమినియను పరిపాలన పునాదిమీదనే యుండవలెను.

2. కాన్ఫరెన్సులో కాంగ్రెసువారి ప్రాతినిధ్య మెక్కువగా నుండవలెను.

3. రాజకీయ ఖయిదీల నందరిని విడిచిపెట్టవలెను.

4. ప్రస్తుత పరిస్థితులలో సాధ్యమగునంతవరకు నిప్పటినుండియు భారత ప్రభుత్వము డొమినియను ప్రభుత్వ పద్ధతులమీదనే నిర్వహింపబడవలెను.

న్యాంగీకార ప్రమాణదృష్టిలో నిది ఘనమైనది. కాని యిందులో నొకయుచ్చు అమర్చబడినది. ఈ షరతు లధమము రెండు దృక్పథములతో చూడబడెను. కాంగ్రెసువారు వీనిని ప్రధానముగా నెంచిరి. ఇవి నెరవేరనిచో తోడ్పాటు యసంభవమనిరి. వారి కవి కనీసపుకోరికలు; తరువాత జరిగిన కాంగ్రెసువర్కింగుకమిటీ మీటింగులో నిది స్పష్టము చేయబడెను. అందులో నిదియైనను ముందు కాంగ్రెసు జరుగబోవు తేదీలోపల జరుగవలెననిరి. మిత వాదులకవి గరిష్టకోరికలు. వారు వాటి నట్లుప్రకటించెదరేకాని యవి ప్రసాదింపబడనిచో తోడ్పాటు నిరాకరింతుమనుపట్టుదల లేదు. పరిధానములని చెప్పబడుచున్నను వారిషరతులు నిజముగా షర తులుకావు.

కనుకనే తరువాత మేమందరము జయిళ్ళలో నుండగా, నీ షరతులలో నేదియు నెరవేర్చకపోయినను, మమ్మాల ననేకమందిని జయిళ్ళలో నింపియుంచినను, మా జయిలరుకు మన మితవాద, రెస్పాన్సివిష్టుమిత్రులు సంపూర్ణ సహకారము గావించిరి.

ఇట్లుజరుగునని మాలో చాలమందిమి యనుకొంటిమి. కాని యీ సమిష్టికార్యమువలన కాంగ్రెసువారెట్లు కొంతవరకు నిరోధము చూపగలిగిరో యట్లే లిబరలుపక్షమువారు తదితరులు నెట్టిపరిస్థితుల లోనైనను విచక్షణారహితముగా ప్రభుత్వముకుచేయు సహకారతత్వ మును కొంతవరకు మార్చుకొనెదరనునాశ కొంతయుండెడిది. ఈ రాజీ తీర్మానమున కెంతమాత్రము నిష్టపడని మాలో కొందరము మా కాంగ్రెసులో నెట్టిచీలికలు కలుగకుండుటకే దీని కంగీకరించితిమి. మహాసంగ్రామమురానున్న తరుణమున కాంగ్రెసులో చీలికలను ప్రోత్స హింపజాలము. ప్రభుత్వము మనషరతుల కొప్పుకొనరనుసంగతి సువిదితం కనుక నిది మనస్థితిని బలపరచి మనలోని కుడిపక్షమువారిని మనవైపు త్రిప్పుకొనుట కతిసులభమైనపద్ధతి. కొద్దివారములలో నంతయు తేలి పోవనున్నది. డిసెంబరుమాసము, లాహోరు కాంగ్రెసు సమీపించెను.

అయినను మాలో కొంతమంది కా సమిష్టిప్రకటన చేసు మాత్రనలె నుండెను. స్వాతంత్ర్యవాంఛను భావములోనైన కొంచెము సేపైన విరమించుట పొరబాటు, యుపద్రవకరము. అనగా నిది యుక్తికి సంబంధించినది. అది పేరమాడదగినదిగా తలంపబడెనుగాని ప్రధాన మైనది యనియు నదిలేనిదే మన మెప్పుడు తృప్తినొందజాలమనియు తలంపబడలేదు. కనుక నేను సందేహించి ప్రకటనమీద సంతకము చేయలేదు. (సుబానుబోసు చేయనని ఖండితముగా చెప్పెను) కాని నేను మెత్తపడితిని. ఐనను నేను చాల బాధతో వచ్చి మరునాడే నా కాంగ్రెసుయధ్యక్షతకు రాజీనామా యివ్వ సంకల్పించితిని. నే నీ సంగతి గాంధీజీకి తెల్పితిని. గాంధీజీయొక్క యోదార్పు యుత్తరము మూడుదినముల తీవ్రయోచన నన్ను శాంతపరచెను.

లాహోరుకాంగ్రెసుకు కొంచెముముందు ప్రభుత్వముకు కాంగ్రెసుకుమధ్య సమాధానముకు కడపటి యత్నము జరిగెను. వైస్రాయి ఇర్విను ప్రభువుతో సమావేశ మేర్పాటుచేయబడెను. ఈ సమావేశకారకులెవరో నాకు తెలియదు, కాని విఠల్‌భాయిపటేలు ప్రధానకారకుడని నే నూహించెదను. కాంగ్రెసు దృక్పథమును తెల్పుటకు గాంధీజీ, మా తండ్రి యుండిరి. జిన్నా, సర్ తేజబహ దరుసప్రూ, విఠల్‌భాయిపటేలుగార్లు కూడ నుండిరి. చివరకు సమా వేశమువలన నేమియు జరుగలేదు. వారికి సామ్యమెచ్చుట లేకుండెను. ప్రధానపక్షములైన కాంగ్రెసు ప్రభుత్వములమధ్య నెంతయో దూర ముండెను. కనుక కాంగ్రెసు కిక ముందుకుపోవుటొక్కటే మార్గము. కలకత్తాలో నిచ్చిన సంవత్సరగడువు గతించుచుండెను. కాంగ్రెసు లక్ష్యము స్వాతంత్ర్యమని శాశ్వతముగా ప్రకటింపవలెను. దానిని సాధించుటకు తగుపోరాటయత్నములను గావింపవలెను.

లాహోరుకాంగ్రెసుకుముందు తుదివారములో మరియొక రంగములో నేనొక ముఖ్యవిధిని నెరవేర్చవలసి యుండెను. అఖిల భారత ట్రేడు యూనియను కాంగ్రెసు నాగపురములో జరుగు

చుండెను; నేను దాని కధ్యక్షతవహింపవలసియుండెను. ఒకేవ్యక్తి కొద్దివారముల గడవులో జాతీయకాంగ్రెసుకు, ప్రేడు యూనియను కాంగ్రెసుకు నధ్యక్షతవహించుట యసాధారణ విషయము. నేనీ రెండుసంస్థలకు మధ్య సంధానకర్తగనుండి యొకరి నొకరిదరి జేర్చవలెనని యాశించితిని. జాతీయకాంగ్రెసును మరింత సామ్యవాదపరముగ, మరింత బీదలపరము, సక్రమమైన కట్టుదిట్టములుగల లేబరును జాతీయపోరాటములో జేరునట్లు చేయవలెనని యాశించితిని. బహుశః యీయాశ యడియాస. జాతీయత జాతీయతగా నుండుట మానవుడే సామ్యవాదపరముగ బీదలపరముగ నుండగలదు. కాని జాతీయ కాంగ్రెసుయొక్క దృక్పథ మెంత ధనాఢ్యులపరముగనున్నను దేశములో విప్లవశక్తి చూపగల పటుత్వపక్ష మది యొక్కటియేయని నేను గ్రహించితిని. కనుక లేబరు దానికి తోడ్పడవలెను. అది తన వ్యక్తిత్వమును, యాశయములను స్పష్టముగ కట్టుదిట్టముగ నుంచుకొని కాంగ్రెసుతో సహకారమొనర్చి దానిపై పలుకుబడి సంపాదించవలెను. పరిస్థితులు, ప్రత్యక్షకార్యములో పాల్గొనుట విధాయికముగ కాంగ్రెసునే మరింత విప్లవయాశయములకు, సాంఘిక, ఆర్థిక సమస్యలకు తరుమునని నే నాశించితిని. ఈమధ్య కొద్దివత్సరముల నుండి కాంగ్రెసు రైతుకు గ్రామమునకు సుముఖముగా వృద్ధిచెందుచుండెను. ఈ యభివృద్ధియే సాగుచుండినయెడల నది కొంతకాలములో గొప్ప రైతుసంస్థ కాగలదు. లేదా రైతులప్రాబల్యముగల యొక సంస్థ కాగలదు. మా యు. పి. జిల్లా కాంగ్రెసుకమిటీలలో నాయకత్వము మధ్యతరగతి విద్యాధికులచేతులలోనున్నను నిదివరకే రైతు ప్రాతినిధ్యము బలీయముగ నుండెను.

ఈవిధముగా గ్రామమునకు పట్టణమునకు నిరంతర పోరాటమున కవకాశముండెను. జాతీయకాంగ్రెసుకు ట్రే. యూ. కాంగ్రెసుకు గల సంబంధ మీ పోరాటముపై నాధారపడియుండును. కాని యిది యిప్పటిసంగతికాదు. ప్రస్తుతము జాతీయకాంగ్రెసు మధ్య

తరంగతులవారిచే నడుపబడుచు పట్టణముల వశములో నుండెను. భారతస్వాతంత్ర్యసమస్య తేలనంతవరకు దానిని జాతీయతయే రాజ్యముచేయును. జాతీయభావమే దేశములో నత్యంత శక్తివంత మైనది కాగలదు. అయినను కాంగ్రెసును క్రమశిక్షణగల లేబరుసమీపమునకు తెచ్చుట యావశ్యకముగా నాకు తోచెను. యు. పి. లో మేము రాష్ట్ర ట్రే. యూ. కాం. శాఖనుండి రాష్ట్రకాంగ్రెసుకమిటీకి ప్రతినిధులనుకూడా నాహ్వానించితిమి. చాలమంది కాంగ్రెసునాయకులు లేబరువ్యవహారములలో ముఖ్యపాత్రవహించిరి. కాని లేబరులోని యతివాదులు జాతీయకాంగ్రెసుపట్ల విముఖముగ నుండిరి. వారు దానినాయకులను నమ్మకుండిరి. దాని యాశయములు ధనాఢ్యులవనియు, నభివృద్ధి నరికట్టుననియు వారు భావించిరి. కాంగ్రెసు జాతీయసంస్థ.

1929 లో భారతదేశములోని ట్రేడుయూనియనులు విట్లీకమిషను యను లేబరు రాయల్ కమిషనుసమస్యమీద నాందోళనపడసాగెను. ఎడమపక్షమువారు దానిని బహిష్కరింపవలెననిరి. కుడిపక్షమువారు సహకారముచేయవలెననిరి. కుడిపక్షములోని నాయకులకు కొందర కందులో సభ్యత్వమునిచ్చుటచే స్వార్థము పనిచేసెను. ఈ విషయములో, యనేక యితర విషయములలోవలె, నా సానుభూతి యెడమపక్షమువైపున యుండెను. మనము ప్రత్యక్షపోరాటమును జరుపుచున్న సమయమున లేక జరుపనున్న సమయమున ప్రభుత్వ కమిషనులతో సహకారముచేయుట విరుద్ధముగ కాన్పించెను.

నాగపుర ట్రే. యూ. కాంగ్రెసులో విట్లీకమిషను బహిష్కరణసమస్యయే ప్రధానసమస్య. దీనిలోను, వివాదములోనున్న యితరవిషయములలోను యెడమపక్షమువారికే విజయము కలిగెను. ఈ కాంగ్రెసులో నేను చాల యప్రధానుడను. లేబరురంగములోనికి క్రొత్తగా వచ్చినవాడనగుటచే నేను తడవుకొనుచు సందేహించుచుంటిని. సాధారణముగా నే నతివాదులకు సుముఖముగనే

నా యభిప్రాయములను ప్రకటించితిని. కాని నే నెవరితోను కలిసి పోకుండ నిష్పక్షపాతమైన యుపన్యాసకునివలె నుంటిని. కాని శాసించు యధ్యక్షునివలె నుండ లేదు. ట్రే. యూ. కాం. విభజనమును, క్రొత్త మితవాదసంస్థను నిర్మించుటను నే నొక ప్రేక్షకునివలె చూచుచుంటిని. కుడిపక్షములవారు విడిపోవుట యుక్తముకాదని నేను భావించితిని. యెడమపక్షనాయకులు కొందరు వారిని త్వరితపరచి విడిచిపోవుట కన్ని సాకులకు నాస్కారమిచ్చిరి. ఈ రెండుపక్షములకు మధ్య నొకపెద్ద మధ్యపక్ష మసహాయముగ నుండెను. బహుశః సరియైన నాయకత్వ మున్నచో వారీ యిరుపక్షములవారిని నిరోధించి ట్రే. యూ. కాం. విడిపోకుండ చేయగలిగెడివారు. ఒకవేళ విడిపోవుటయే తటస్థించినను యంతటి దుష్ఫలితము లుండెడివికావు.

కనుక భారతదేశములో ట్రేడుయూనియను యుద్యమమునకు గొప్ప నష్టము సంభవించి యది యిప్పటికిని కోల్కొనలేదు. ప్రభుత్వ మిదివరకే లేబరుయుద్యమములోని యతివాదపక్షముల మీద ధ్వజమెత్తెను. దాని ప్రథమఫలితమే మీరటుకేసు. ఇది సాగుచునే యుండెను. యజమానులు కూడ తమ లాభములకొరకు పోరుట కిదియే సమయమనుకొనిరి. 1929_30 శీతాకాలములో ప్రపంచ ఆర్థికమాంద్యము ప్రవేశించెను. ఒకవంక దీనిచే బాధ పడుచు, నన్నివైపులనుండియు పోట్లుపడుచు, ట్రేడుయూనియను అతిదీనస్థితిలోనుండ, భారతపనివాండ్రస్థితి చాల దుర్భరముగ నుండెను. వారిస్థితి నానాటికి దిగజారుచుండ, చేయునదిలేక వా రసహాయులై చూచుచుండిరి. ట్రే. యూ. కాం. లో మరియొకటి రెండువత్సరములలో మరియొకచీలిక బయలుదేరెను. ఈవిధముగా హిందూదేశములో సిద్ధాంతరీత్యా మితవాదబృందము, ప్రధాన ట్రే. యూ. కాం. కమ్యూనిష్టుపక్షము అను మూడు ట్రేడు యూని యను ఫెడరేషను లేర్పడెను. ఆచరణలో నివియన్నియు దుర్బలముగ నిర్వీర్యముగనుండెను. వాటి పరస్పరపోరాటములు పనివాండ్ర

కందరకు కంటకముగనుండెను. 1930 లగాయతు నేను తరుచు జయిలులోనుండుటచే నాకు దీనితో సంబంధము లేకపోయెను. నేనప్పుడప్పుడు కొద్దికాలము వెలుపలనున్నప్పుడు సంఘీభావప్రయత్నములు జరుగుచుండెనని వినుచుంటిని. అవి జయప్రదముకాలేదు. రైల్వేపనివాండ్రు తటస్థులై ప్రత్యేకముగనుండుటచే మితవాదవర్గమునకు బలము చేకూరెను. ప్రభుత్వము వారిని గుర్తించి, జెనీవాలోని లేబరు కాన్ఫరెన్సుకు వారుచేసిన సూచనల నామోదించుటచే వారి కితరగ్రూపుల వారికంటె సౌకర్యమొకటి చేకూరెను. జెనీవాను సందర్శించవలెననెడి యుబలాటము కొంతమంది లేబరునాయకుల నటు లాగివేసెను. వారు తమతో తమయూనియనులను తీసికొనివెళ్ళిరి.

స్వాతంత్ర్యము - తరువాత

లాహోరుకాంగ్రెసు నా స్మృతిపథమున నెప్పుడు నవనవలాడుచుండును. నే నందులో ప్రధానపాత్రధారి నగుటచే నది సహజము. కొంచెముసేపు నే నా రంగస్థలకేంద్రము నాక్రమించితిని. ఆ దినములలో నాలో నుత్పన్నమైన యుత్తుంగభావముల నొక్కొక్కప్పుడు నేను తలచుకొన నుత్సహింతును. లాహోరు ప్రజలు నా కొసగిన యాహ్వానమును నే నెన్నడు మరువజాలను. ఆ యపరిమితోత్సాహము నా వ్యక్తికొరకుగాక నొక యాశయము, నొక చిహ్నము కొరకని నే నెరుగుదును. అయినను, అనేకవేలమంది దృష్టిలోను, హృదయములలోను, కొద్దికాలమైనను, నొక డట్టి చిహ్నమగుట స్వల్పవిషయముకాదు. నే నపరిమితానందభరితుడనై, నా శరీరమును మరచినట్లయ్యెను. కాని నా స్వవిషయము లంత ముఖ్యములుకావు. గొప్పసమస్యలు పరిష్కరింపబడనున్నవి. ఆ వాతావరణమంతయు నుత్సాహపూరితముగ, శ్రద్ధాభరితముగనుండెను. మా నిశ్చయములు కేవల విమర్శలు, వ్యతిరేకాభిప్రాయ ప్రకటనలుగాక దేశము నొక్కసారిగా కదల్చివేసి యనేక లక్షలమంది జీవితములను మార్చివేయు కార్యాచరణ కాహ్వానములగుచుండెను.

మనకు, మన దేశమునకు దూరభవిష్యత్తులో నేమిరానున్నదో యెవరును జోస్యము చెప్పజాలరు. కాని సమీపభవిష్యత్తుమాత్రము స్పష్టముగనే యుండెను. అది మనకు, మనప్రియజనులకు పోరాటము, బాధ సమర్పించుచున్నది. ఈ భావము మా యుత్సాహములను శాంతపరచి మా బాధ్యతల నెక్కువగా గుర్తుకుదెచ్చెను. మే మిచ్చు ప్రతి వోటు సుఖమునకు, భోగములకు, గృహసౌఖ్యములకు, స్నేహితులకు తుది సందేశము. అది యేకాకులైపోవుటకు శరీరమానసిక బాధలకు నాహ్వానము.

స్వాతంత్ర్యమునుగురించిన ప్రధానతీర్మానము, స్వాతంత్ర్య పోరాటముకొరకు చేయవలసిన కార్యక్రమములను నేకగ్రీవముగ నామోదింపబడెను. సవరణరూపమున నిచ్చిన యొక చిన్నసమస్య మీద నిజమైన వోటింగు జరిగెను. ఈ సవరణ యోడింపబడెను. వోటింగు లెక్కలు ప్రకటింపబడెను. ప్రధానతీర్మాన మామోదింపబడెనని డిసెంబరు 31వ తేదీ రాత్రి 12వ గంట మ్రోగుచుండ, పాతసంవత్సరముపోయి క్రొత్తసంవత్సర ముదయించువేళ ప్రకటింపబడెను. ఈవిధముగా కలకత్తా కాంగ్రెసులో నీయబడిన సంవత్సర గడువు గడచినతోడనే క్రొత్తనిశ్చయము గావింపబడి, సంగ్రామ సన్నాహములు ప్రారంభమయ్యెను. చక్రములు చలనములో పెట్టబడెను. కాని మే మెట్లు ప్రారంభింపవలెనో, ఎప్పుడు ప్రారంభింపవలెనో తెలియక నంధకారములో పడియుంటిమి. వ్యూహమును పన్నుటకు, నిర్వహించుటకు అ. భా. కాం. కమిటీవారి కధికారమిచ్చిరి. కాని నిజనిశ్చయము గాంధీజీ చేతిలోనే యుండెనని యందరకు తెలియును.

లాహోరు కాంగ్రెసుకు సమీపసరిహద్దురాష్ట్రములనుండి యనేకమంది ప్రజలు వచ్చిరి. ఈ రాష్ట్రమునుండి కాంగ్రెసుసభలకు వ్యక్తిగతముగా ప్రతినిధు లెప్పుడు వచ్చుచునేయుండిరి. కొన్నిసంవత్సరములనుండి ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ హాజరగుచు మా చర్చలలో పాల్గొనుచుండెను. శ్రద్ధాన్వితులగు యువకులనేకమంది మొదటిసారి లాహోరులో నఖిలభారత రాజకీయతరంగసంపర్కము ననుభవించుటకు సరిహద్దులనుండి వచ్చిరి. వారి యకల్మషహృదయము లాకర్షింపబడెను. వారు స్వాతంత్ర్యపోరాటములో భారతదేశమంతటిలో నైక్యమైత్రిమను భావముతో మరలివెళ్ళి దానికొరకుత్సాహప్రపూరితులయి యుండిరి. వారు నిరాడంబరులు; కాని కార్యశూరులు; భారతదేశములోని తదితర రాష్ట్రములవారందరికంటె తక్కువ జల్పమతులు; వృధావాగ్వాదము చేయరు. వారు తమప్రజల నైక్యము చేయు నారంభించి నూతనభావములను వెదజల్లుచుండిరి. వారికి

జయము చేకూరెను. భారతపోరాటములో చిట్టచివర చేరిన, సరిహద్దు రాష్ట్రి స్త్రీపురుషులు 1930 లగాయతు ప్రధానపాత్ర ధరించిరి.

లాహోరుకాంగ్రెసు యాజ్ఞలప్రకారము మాతండ్రి అసెంబ్లీ లోను శాసనసభలలోను గల కాంగ్రెసుసభ్యులను తమ స్థానములకు రాజీనామా యీయవలసినదని తెలిపెను. వారిలో చాలమంది మొత్తముగా లేచివచ్చిరి. కొద్దిమంది యట్లుచేయుటకు తిరస్కరించిరి. ఇంకను భవిష్యత్తు మాకస్పష్టముగనే యుండెను. కాంగ్రెసుసభలలో జూపబడిన యుత్సాహమెంతయున్నను కార్యక్రమములోనికి దిగి నపుడు దేశమెంతవరకు తోడ్పడునో యెవరికెరుక? మే మొక నిశ్చ యమునకు వచ్చితిమి. వెనుకకు మరలుట యసంభవము. దేశము యొక్కనాడి మాకింకను తెలియకుండెను. మా యుద్యమము నారం భించుటకు కొంతవరకు దేశయుత్సాహమును పరీక్షించుటకు జనవరి 26 వ తేదీ స్వాతంత్ర్య ప్రమాణములను తీసికొన నిశ్చయింప బడెను.

కనుక, మా విధానమును గురించి సందేహములు బాధించు చుండ యుత్సాహముచేతను, జయప్రదమగు నేదోయొక్క కార్యము నాచరింపవలెనను కోరికచేతను మేముపరిస్థితులకొరకు వేచియుంటిమి. జనవరి మొదటివారములో నేను అలహాబాదులోనుంటిని. మా తండ్రి చాలవరకు నితరప్రాంతములలోనే యుండెను. అవి మాఘమేలా దిన ములు. బహుశః అది ప్రత్యేక నుంభసంవత్సరమయియుండుటచే లక్షలకొలది యాత్రికులు అలహాబాదు, లేక పవిత్ర ప్రయాగతీర్థము నకు నిరంతరప్రవాహమువలె వచ్చుచుండిరి. వారిలో రయితులు, కూలివాండ్రు, దుకాణదార్లు, చేతిపనివాండ్రు, వర్తకులు, వ్యాపా రస్తులు, యితరవృత్తులలోనివారు, వీరువారననేల యన్ని బాపతులవారు నుండిరి. నిజముగా నది హిందూదేశముయొక్క యొక ప్రధానలక్ష ణము. నదికిపోవుచు వచ్చుచుండు యీ నిరంతర జనప్రవాహమును, గుంపులను పరీక్షించునపుడు సత్యాగ్రహమునకు, పరిశాంతమగు ప్రత్యక్ష కార్యాచరణకు పిలుపువచ్చినపుడు వీ రెట్లు ప్రవర్తింతురా

యని నేనాశ్చర్యపడుచుండెడివాడను. వీరిలో నెంతమందికి లాహోరు నిశ్చయములు తెలియును? ఎంతమంది వానిని లక్ష్యముచేతురు? భారతదేశములోని మూలమూలలనుండియు ననేక వేల సంవత్సరముల నుండి వారిని, వారివారిని పవిత్రగంగాతోయములలో స్నానము చేయ తీసికొనివచ్చిన యావిశ్వాస మెంత యద్భుత శక్తివంతముగ నుండెను! ఈ యద్భుతశక్తిలో కొంత వారు తమదుస్థితిని పోగొట్టు కొనుటకు రాజకీయ, ఆర్థిక కార్యాచరణవైపు త్రిప్పజాలరా? లేక వారిమనస్సులు మతసాంప్రదాయములతో, మత సింగారములతో నిండి యితరయాలోచనలను చొరనీయవా? ఈ యితరయాలోచన లిదివరకే యచ్చటనుండి యుగయుగములనాటి స్థబ్ధత్వమును కదల్చు చుండెనని నే నెరుగుదును. ప్రజల యస్పష్టకోరికలలోనియు, యాశయములలోనియు నీ చలనమే గత పది పన్నెండువత్సరముల ప్రబోధములకు కారణమై భారతదేశముఖమునంతను మార్చివేసెను. ఆ కోరిక లచ్చటనున్న సంగతియు, వాటివెనుక బ్రహ్మాండమైనశక్తి యున్నసంగతియు నిస్సంశయము. అయినను సందేహము వచ్చుచుండెను. ప్రశ్నలుదయించుచుండెను. వీటికి సమాధానము వెంటనే రాకుండెను. ఈ భావము లెంతవరకు వ్యాపించెను? వాటివెనుక నెంత బలముకలదు? సక్రమమైన పని జరుగుటకు, చిరసహానమునకు శక్తి యెంత కలదు?

మా యింటికి యాత్రికులెందరో గుంపులు గుంపులుగా వచ్చుచుండిరి. అదియొక యాత్రాస్థలమగు భారద్వాజమనుచోట నుండెను. అచ్చట పూర్వకాలమున నొక ప్రాచీన విశ్వవిద్యాలయ ముండెడిది. పర్వదినములలో ప్రాతఃకాలము మొదలు సాయంత్రమువరకు నెడ తెరపి లేకుండ ప్రేక్షకులు మమ్ముచూడవత్తురు. వారిలో చాలమంది వేడుకకొరకు వత్తురనుకొనెదను. వారు వినిన ప్రఖ్యాతపురుషులను ముఖ్యముగా, మాతండ్రిని చూడవలెననుకోరిక యొకటి యుండెను. కాని వచ్చినవారిలో చాలమందికి రాజకీయపరిజ్ఞానము కలదు. కాంగ్రెసు యేమిచేయుచున్నది? యేమి నిశ్చయించినది? ముందేమి

జరుగనున్నది ? యను ప్రశ్నలను వారడుగజొచ్చిరి. తమ నిజాయార్థిక కష్టములు వారిని వేధించుచునే యుండుటచేత వాటినిగురించి తామేమిచేయవలెనో వారు తెలిసికొనగోరిరి. మన రాజకీయ కేకలు వారికి బాగుగా తెలియును. కనుక దినమంతయు మా యిల్లు వారి కేకలతో ప్రతిధ్వనించుచుండెను. నేను యిరవైమంది, యేబదిమంది, నూరుమంది యొక్కొక్క గుంపుగా వచ్చినపుడు వారి కేదియో చెప్పి పంప నారంభించితిని. కాని చివరకిది యసాధ్యమగుటచే నొక్క నమస్కారముచేసి పంపుచుంటిని. దీనికిని యొకయంత ముండవలెను. నేను దాగుటకు ప్రయత్నించితిని. అది నిష్ఫలమయ్యెను. కేకలు అంతకంత కధికమై మిన్నుముట్టుచుండెను. ఇంటి వరండాలన్నియు మమ్ముచూడవచ్చిన ప్రేక్షకులతో నిండిపోయెను. ప్రతి తలుపుదగ్గర ప్రతి కిటికీదగ్గర మమ్మన్వేషించు నేత్రపుంజములు గుమిగూడెను. పని చేసికొనుటకు, మాట్లాడుటకు, తినుటకు, మరేది చేయుటకు నసాధ్యమయ్యెను. ఏమిచేయుటకు తోచక చికాకు, కోపము వచ్చుచుండెను. కాని తరతరములనుండి గర్భదారిద్ర్యమును, బాధలను అనుభవించుచు, సహచరభావము, సానుభూతి తప్ప మరేమియు కోరక కృతజ్ఞతను, ప్రేమను మనపై ప్రవహింపచేయ నచ్చినవారిని తిరస్కరించుటెట్లు ? వారుచూపు యపరిమితశక్తి, ప్రేమలముందర వినమ్రులము, భయకంపితులము గాకుండనుండుట యసాధ్యమయ్యెను.

అప్పుడు మాయింట మాతో నొక ప్రియస్నేహితురాలుండెను. ఆమెతో నెట్టి సంభాషణయైనను జరుపుట తఱచు కష్టమగుచుండెను. బయట జేరుగుంపుల కే కొద్దియో చెప్పివచ్చుటకు నేను ప్రతియైదు నిమిషములకు పయికిరావలసివచ్చుచుండెను. ఈ మధ్య కేకలు, చప్పట్లు వినవచ్చుచుండెను. నా దుస్థితి యామెకు వినోదము కలిగించెను. ఆమె ప్రజలలో నాకుగల పలుకుబడికి కొంచె మాశ్చర్య పడెను. ఆమె యకస్మాత్తుగా నావైపు తిరిగి నేనీ వీరపూజ నెట్లు భావించెదనని ప్రశ్నించెను. నేను దానికి గర్వింపలేదా; నేను బదులు చెప్పుటకుముందు కొంచెము సందేహించితిని, నన్ను చాల వ్యక్తిగత

మైన ప్రశ్న వేసి కంగారుపెట్టిన ట్లామె దీనివలన గ్రహించి క్షమార్పణ కోరెను. ఆమె నన్నెంతమాత్రము కంగారుపెట్టలేదు. కాని నాకది కఠినప్రశ్నగా కాన్పించెను. నా మనస్సు చెదిరిపోయి నా భావములను చేష్టలను విమర్శించుకొన నారంభించితిని. అవి చాల మిశ్రమములై యుండెను.

నాకు ప్రజలలో సామాన్యపలుకుబడి గలమాట సత్యము. విద్యార్థులు నన్ను మెచ్చుకొనెదరు. యువకులకు, యువతులకు నేనొక చిన్నవీరుడను. వారిదృష్టిలో పూర్వగాథలనాటి కీర్తిపుంజములు నాచుట్టు నలముకొనెను. నన్నుగురించి యనేకగీతములు వ్రాయబడెను. అసంభవములు, పరిహాసాస్పదములునగు ననేక కథలు బయలుదేరెను. నా శత్రువులుకూడ నన్నుగురించి మంచివాక్యములను చెప్పుచు సమర్థతతో విశ్వాసముతో నేను కొఱవడనని మెహర్బానీగా యొప్పుకొనుచుండిరి.

ఎట్టి చలనము, నెట్టివికారముపొందకుండ పై పొగడ్తలన్నిటిని దాటగల వాడొక ఋషి కావలెను; లేదా మానవాధముడైన రాక్షసుడు కావలెను. నేనీ రెండు జాతులకు చెందనివాడను. అవి నా తలకెక్కి కొంచెము మత్తుగలుగ చేసి నాకు శక్తిని, విశ్వాసమును కలుగచేసెను. నా పద్ధతులలో నేను కొంచెము నిరంకుశుడనైతిని. ఒక ఛాయ డిక్టేటరునైతిని. అయినను నా యహంకారమంత మితి మీరినదని నే ననుకొనను. నా శక్తిసామర్థ్యములనుగురించి యుక్త జ్ఞానము కల్గియుండి నేను వాటినిగురించి వినమ్రుడనుగా నుండలేదు. కాని వాటిలో నద్భుతమేమియు లేదని నేను బాగుగ నెరుగుదును. నా లోటుపాటులు నాకు బాగుగ తెలియును. ఆత్మపరీక్ష చేసికొను నా యభ్యాసము నే నెట్టితొట్రుపాటుపడకుండ కాపాడి నాకు సంబంధించిన సంభవముల నుదాసీనతతో చూడగలుగుటకు తోడ్పడెను. పేరుప్రఖ్యాతులు తఱచుగా యవినీతిపరుల చెలికత్తెలని పబ్లికు జీవితానుభవమువలన నాకు తెలిసెను. అవి సుగుణసంపత్తికి బుద్ధి విశేషముకు విధాయిక చిహ్నములుకావు. కనుక నాకు కలిగిన ప్రఖ్యాతి

నా తప్పిదములకా? లేక నా శక్తిసంపదలకా! నే నెందుకు ప్రఖ్యాతి కెక్కితిని? బుద్ధివిశేషమునకుగాదు. ఏలనన నది యసాధారణమైనది కాదు. అథవా కీర్తిని సాధించునంతటిది కాదు. త్యాగములనిపిలువబడు వానికినిగాదు. ఏలనన భారతదేశములో మనయెదుటనే వందలు, వేలు యింతకంటె ననంతమగు బాధల ననుభవించి చివరకు ప్రాణ త్యాగముకూడ చేసిరి. నేను వీరుడననుకీర్తి కేవలము కల్పితము. వీరుడనను భావము నా కెంతమాత్రము లేదు. సాధారణముగా వీర దృక్పథము లేని నాటకాభినయము నాకు మూర్ఖముగా కాన్పించును. అద్భుతగాథల సందర్భములో నే నందరికంటె సౌమ్యుడనగు మానవు డను. నాకు కొంత శరీర మానసిక ధైర్యస్థైర్యములున్నమాట వాస్త వము! బహుశః అభిమానమే, గర్వమే దానికి పునాది. అదినాకును, నా గ్రూపునకును, నా జాతికిని చెంది దేనికిని లొంగనిచ్చగింపని యభిమానము.

నా ప్రశ్నకు తృప్తియైన సమాధానము లేదు. నే నపుడు మరి యొకవిధమగు పరిశోధన నారంభించితిని. మాతండ్రి నేను భారత దేశమునుండి ప్రతివారము మా దుస్తులను ప్యారిసు లాండ్రీకి పంపి యిస్త్రీ చేయించుకొందుమను నొక యభూతగాథ కల్పింపబడెను. నే మనేకసార్లు దీనిని ఖండించినను యీ గాథ పెరుగుచునే యుండెను. ఇంతకంటె వికృతము మూర్ఖము నగుదానిని నే నూహింపజాలను. ఇట్టి వ్యర్థవేషభాషలలో మరియు మూర్ఖుడున్నచో మూర్ఖశిరోమణి బహుమతికి నానామమే ప్రత్యేకముగ నుదహరింపదగియుండును. వేల్సుయువరాజుతో నేను పాఠశాలలో చదివితినను మరియొక చిత్రగాథ, యెన్నిసారులు కాదనినను, చెప్పబడుచుండును. యువ రాజు 1921 లో హిందూదేశము వచ్చినపుడు నన్నుగురించి యడిగె నని యొకకథ చెప్పెను. నే నప్పుడు జయిలులో నుంటిని. యదార్థ ముకు నే నతనితో పాఠశాలలో చదివియుండలేదు. నే నింతవర కెప్పుడు నతనిని కలిసికొనలేదు. అతనితో సంభాషించి యుండలేదు.

ఈ గాథలమీాద, నిటువంటి గాథలమీాద నా పలుకుబడి లేక పేరు ప్రఖ్యాతులు నాధారపడియుండెనని నా యభిప్రాయము కాదు. వాటి కింతకంటె గట్టిపునాదులే యుండవచ్చును. కాని, యీ కథల వలన విశదమైనట్లు పైకట్టడము మాత్ర మిట్టియాడంబర వర్ణనలతో నలంకరింపబడెననుటకు సందేహము లేదు. అధమము గొప్ప గొప్ప వారితో తిరుగుచు, భాగ్యభోగముల ననుభవించుచు తరువాత దానినంతను సన్యసించిరనుభావము కలదు. సన్యాస మెప్పుడు భారత హృదయము నాకర్షించెను. కీర్తి కిదియొక పునాదియగుట నా కెంత మాత్రము నచ్చదు.

నేను క్రియారహిత సుగుణ సంపత్తికంటె కార్యాచరణతో గూడిన సుగుణసంపత్తినే యభినందించెదను. త్యాగముకొరకే చేయ బడు త్యాగ, సన్యాసములను నే నంగీకరింపజాలను. మరియొక దృష్టిలో మానసిక, ఆధ్యాత్మికశిక్షణయనుదృష్టిలో – నేను వాటిని గౌరవించెదను. యోగ్యమైన శరీరారోగ్యములను కలిగియుండవలె ననిన క్రమజీవితము, నిరాడంబర జీవితము ముఖ్యావసరములు. గొప్ప గొప్ప సాహసకార్యములను నిర్వహింపబూనినవారికి కష్టసహిష్ణుత, పట్టుదలయుండు టత్యవసరము. కాని సన్యాసజీవితముపట్ల జీవితమునే తిరస్కరించుపట్టున నాకు ప్రీతి, మోహము లేదు. నేను నిజముగా గౌరవించినదానిని దేనిని బుద్ధిపూర్వకముగ విడిచిపెట్టలేదు. కాని గౌరవములు మారుచుండును. నా స్నేహితురాలు నన్నడిగిన ప్రశ్న కింకను ప్రత్యుత్తరము రానేలేదు. ప్రజల యీ వీరపూజవలన నేను గర్వముచెందలేదా? నాకది యెంతమాత్రము నిష్టములేక దానినుండి పారిపోగోరితిని. కాని నేను దానికలవాటుపడవలసివచ్చెను. అది యెంతమాత్రము లేనప్పుడు నాకు కొఱతగనే యుండెడిది. కాని, మొత్తముమీాద ప్రజలు నా యాంతరంగిక కోరికను దేనినో తీర్చెడి వారు. నేను వారి నొప్పించి కార్యరంగములోనికి దింపగలనను భావము నాకు వారి మనోహృదయములపై నొక యధికారభావ మును కలిగించెను. ఇది కొంతవరకు నా యధికారేచ్ఛను తృప్తిపర

చెను. వారిమట్టుకు వారు నాపై, కనపడని నిరంకుశత్వమును చెలా యించెడివారు. ఏలనన వారి విశ్వాస ప్రేమలు నా యంతరంగ మును కదల్చి భావతరంగముల నుద్రేకింపచేసెడివి. నే నెంత వ్యక్తి త్వమును నమ్మువాడనైనను యొక్కొక్కప్పుడు వ్యక్తిత్వపుహద్దులు నశించినట్లు కాన్పించి, యొంటరిగా నున్న నేను రక్షించుకొనుట కంటె నీ దుఃఖభాగులగు ప్రజలతో నిడుమల గుడుచుచుండుటయే మంచిదని భావించెడివాడను. కాని, యీ హద్దు లంత చులకనగా నశించునవికావు. నేను వాటిపై నెక్కి నా కర్థముకాని యీ స్థితి నాశ్చర్యచకిత నేత్రములతో తొంగిచూచెడివాడను.

గర్వము శరీరముమీద క్రొవ్వువలె కాన్పించకుండ పొర మీద పొర పెరుగుచుండును. కాని, ఈ నిత్యాభివృద్ధిని దీనిని పొందు వ్యక్తి గుర్తించనేరడు. అదృష్టవశాత్తు ఈ పిచ్చిప్రపంచంలో సంభవించు కఠినసంఘర్షణలు దాని యుధృతమును తగ్గించును. లేక దానిని పూర్తిగ నాశన మొనరించును. గత కొద్ది సంవత్సరములనుండి హిందూదేశములో మన కట్టి కఠినసంఘర్షణలకు లోటులేకుండెను. మనకు జీవితమను పాఠశాల కష్టసముద్రమయ్యెను. బాధలవంటి కఠినపాఠము వేరొకటి యుండజాలదు. మరియొక విధముగ గూడ నే నదృష్టవంతుడను. నా కుటుంబము, నా బంధువులు, స్నేహితులు, సహచరులు—అందరు మానసికముగ నేనట్టి తొట్రుపాటు పొంద కుండ, యహంకారము పీడకుండచేసి నా కెంతయో తోడ్పడిరి. మున్సి పాలిటీలు, స్థానికసంస్థలు యిచ్చు వినతిపత్రములు, యుత్సవములు, యూరేగింపులు మొదలగునవి నా నరములకలసటను కలిగించి నా లోని హాస్యరసమును, సత్యసంధతను పరీక్షించుచుండెను. ఉత్ప్రేక్ష పూరితము, నలంకారపదభూయిష్టము నగు భాష యుపయోగింప బడుచుండెను. వారి వినయవిధేయతలను, భయభక్తులను చూచు నపుడు నే నా మహాసభలోనివారిని కంగారుపరచి వారి ముఖ లక్షణములలోని మార్పులను వీక్షింపవలెననెడి కుతూహలముతో నవ్వవలెననియో, నాలుక చాపి వెక్కిరింపవలెననియో, లేక తల్ల

క్రిందులుగా నిలువవలెననియో యవశ్యముగా నొక బుద్ధి పుట్టు చుండెడిది. అదృష్టవశాత్తు నా కీర్తికి భంగము కలుగకుండ, భారత దేశములో ప్రజాసేవయెడలగల యుచితమర్యాద చెడకుండ, నేనిట్టి పిచ్చికోరికను అణచివేసి, సాధారణముగ నుచిత మర్యాదతోనే మెలగెడివాడను. కాని యెల్లపుడు నిట్లు జరుగలేదు. అసాధారణముగ విసిగించిన యుత్సవములలోనో, లేక జనసమూహముగల సభలలోనో కొంతప్రదర్శనము చేసెడివాడను. మమ్మాహ్వానించుటకు చేయబడిన యుత్సవమును నే నకస్మాత్తుగా వీడి, నా భార్యనో లేక మరియొక రినో యుత్సవములో, నే మోటరుమీాదనో, గుఱ్ఱపు బండిమీాదనో కూర్చుండబెట్టి గుంపులో కలసిపోయెడివాడను.

ఈ విధముగా భావముల నణచుకొని బహిరంగములో యుక్తముగా ప్రవర్తించుటకు చేయు నిరంతరప్రయత్నము విసుగుకలిగింపక మానదు. దీనిసామాన్య ఫలిత మేమనిన బహిరంగయుత్సవములలో నిది మూతిబిగింపుకు, విచారకలుషితమగు దృష్టికి కారణమగును. బహుశః యీ కారణముచేతనే యొక హిందీమాసపత్రికలోని యొక వ్యాసములో నేను హిందూవితంతువువలె నుందునని వర్ణింపబడితిని. నాకు పూర్వపక్కీ హిందూవితంతువులనిన యెంత యభిమాన మున్నను యిదియొక వజ్రపాతమువలె నుండెను. నిశ్చయముగా వ్యాసకర్త నాకున్నవని యతడనుకొనిన సాధుసంపత్తితో గూడిన వైరాగ్యతత్త్వము, సన్యాసము, ముఖమున చిరునవ్వేనను యెరుగని కార్యతత్పరత సుగుణములను పొగడనెంచెను. నాకు కార్యరూప మును, తీవ్రమును నగు సుగుణసంపత్తియు మందహాస, హాస్యరసము లును కలవని నే నాశించితిని. గాంధీజీ యొకసారి తనలో హాస్యరసమే లేనిచో నాత్మహత్య చేసికొనెడివాడనని యొక పత్రికా ప్రతినిధితో చెప్పియుండెను. నే నంతదూరము పోజాలనుగాని హాస్యము, వినోదము లేనిచో జీవితము నాకు దుర్భరముగా నుండెడిది.

నా కీర్తియు, లలితపదభూయిష్టము, నుత్ప్రేక్షసమన్వితము నగు వినతిపత్రములు మా బంధుజనులలోను, మా మిత్రగణములోను

నిందలకు కారణమగుచుండెను. జాతీయోద్యమములో ప్రధానులైన వారియెడల సాధారణముగ నుపయోగింపబడు బిరుదులు, పెద్దపెద్ద సమాసపదములు, యుత్ప్రేక్షలు మొదలగువానిని నా భార్య నా చెల్లెండ్రు, తదితరులు యేరి యగౌరవముగా నాపై విసురుచుండెడివారు. నన్ను 'భారతభూషణ' అనగా 'భారతరత్నము' 'త్యాగమూర్తి' అనగా 'మూర్తిభవించిన యా త్యాగదేవతా' యని సంబోధించెడివారు. వారి యీ వేళాకోళము నాకు కొంత శాంతినిచ్చెడిది. నేనెచ్చట నతియోగ్యముగా మెలగవలెనో యట్టిబహిరంగసభలలోని జిగి క్రమముగా సడల నారంభించెను. నా చిన్నకూతురుకూడ నీ వినోదములో జేరెడిది. మా తల్లి మాత్రమే నాయెడల నిష్కపటముగానుండి తన ప్రియపుత్రునిపైన నెవరెట్టి వేళాకోళము, నింద మోపినను యొప్పుకొనెడిదికాదు. తండ్రిగారి కిది వినోదముగనుండెను. అతడు తన సానుభూతిని యర్థజ్ఞానమును అతిశాంతముగ వ్యక్తముచేసెడివాడు. కాని, యీ మూకలకేకలు, విసుగు జనింపక చేసెడి బహిరంగ తంతులు, అంతులేనితర్కములు, రాజకీయ దుమారము, నన్ను బాహ్యముగనే స్పృశించుచుండెను; నా నిజసంఘర్షణ నా యంతరంగముననే యుండెను. నాలో నంతర్గర్భితముగానున్న యాశయములు, కోరికలు, భక్తితాత్పర్యములు వెలుపలిపరిస్థితులతో తలపడుచుండెను. నా యాంతరంగికతృష్ణ చల్లారలేదు. నేను వివిధశక్తులు తమతమ యాధిపత్యములకొరకు పోరాడు రంగస్థలమునైతిని. నేను దీనినుండి తప్పించుకొనజూచితిని. నేను సామరస్యమును, సమన్వయమును పొంద యత్నించితిని. ఈ యత్నములోనే నేను కార్యోన్ముఖుడనగుచుంటిని. అది నాకు కొంతశాంతిని సమకూర్చెడిది. బాహ్యసంగ్రామము ఆంతరంగిక సంగ్రామజనిత శ్రమను పోగొట్టెడిది.

నే నిచ్చట జయిలులో కూర్చొని దీనినంతను యెందులకు వ్రాయుచున్నాను? జయిలోనున్నను బయటనున్నను యిదియే పరిశోధన. నాకు కొంతశాంతిని, యాత్మతృప్తిని ప్రసాదించునను యుద్దేశ్యముతో నేను నా భూతభావములను అనుభవములను వ్రాయుచుందును.

29

శాసనోల్లంఘన ప్రారంభము

1930 జనవరి 26; స్వాతంత్ర్యదినము. అది తటిల్లతవలె దేశముయొక్క యపరిమితోత్సాహవిశ్వాసముల మనకు వెలిబుచ్చెను. ఎట్టియుపన్యాసములు, యెట్టిప్రోత్సాహములు లేకుండగనే ప్రతిచోట వేనకువేలు సభలుజరిగి శాంతముగ, పవిత్రభావప్రపూరితముగ స్వాతంత్ర్యప్రమాణములు గైకొనబడెను. ఆ మహాసభలలో నొకవిధమగు భావప్రకోపము ద్యోతకమగుచుండెను. ఈ యుత్సవము గాంధీజీకి తగినప్రోత్సాహము నిచ్చెను. ప్రజానాడిని గుర్తెరింగిన యతడు కార్యాచరణకు కాలము పండెనని గ్రహించెను.

తరువాత నొకటితరువాత నొకటిగ ననేక సంఘటనలు, తుదియంకమునకు గొనిపోవు నాటకమువలె సంభవించెను. శాసనోల్లంఘనము సమీపించి వాతావరణమంతయు నుత్సాహపూరితమగుచుండ మా భావములు 1921–22 నాటి యుద్యమమువైపు వెనుకకు తరలెను. చౌరీచౌరా యైనతరువాత నది యకస్మాత్తుగా నాపివేయబడిన విధానము జ్ఞప్తికివచ్చెను. దేశ మిప్పుడు యెక్కున శిక్షణము నొందెను. సంగ్రామస్వభావ మతిస్పష్టముగ గుర్తింపబడెను. యుద్ధశాస్త్రము కొంతవరకు తెలిసిపోయెను. గాంధీజీ దౌర్జన్యరాహిత్యము విషయమై యతిశ్రద్ధగ నున్నట్లందరకు విదితము. బహుశః పదిసంవత్సరముల క్రితము కొంతమంది మనస్సులలో నున్నట్లిపుడు దీనినిగురించి యెట్టి సందేహము లేదు. ఇది యంతయు నిజమేయైనను దౌర్జన్యమెచ్చటను జరుగకుండ నుండునని మన మెట్లు నిశ్చయముగ చెప్పగలము? అట్టిదేదియైన సంభవించినచో మనశాసనోల్లంఘనోద్యమముపై దానికెట్టి సంబంధముండును? వెనుకటివలె నది యకస్మాత్తుగా నిలిపివేయబడునా? ఈ ప్రశ్న చాలబాధకరముగ నుండెను.

గాంధీజీకూడ యీ ప్రశ్నను గురించి తన నిజధోరణిలో యోచించుచునే యుండెను. అతనిని బాధించుచుండిన సమస్య మరి

యొకవిధముగనుండెనని నేను మా పరస్పర సంభాషణలవలన తెలిసికొంటిని.

మంచిమార్పు, శ్రేయస్సుకలుగజేయుటకు దౌర్జన్యరాహిత్య పద్ధతి యొక్కటే యితనికి మంచిపద్ధతి. దానిని యుచితముగా నడిపినచో నది యెన్నటికిని వ్యర్థముకానేరదు. అదిపనిచేయుటకు, జయించుటకు ప్రత్యేక ప్రసన్న పరిస్థితులుండవలెననియు, బాహ్యాపరిస్థితులు దానికి సరిపడనిచో దాని నుపయోగింపకూడదనియు, వేరుగ చెప్పవలెనా ? అనగా దౌర్జన్యరాహిత్యపద్ధతి యన్నిపరిస్థితులకు పనికిరాదని సర్వకాల సర్వావస్థలయందు నుపయోగించునది ప్రమాదరహితమైనది కాదని సారాంశము. గాంధీజీ యీ సారాంశమును సహింపజాలడు; అది ప్రమాద రహితమని, విశ్వముకంతకు వర్తించు పద్ధతియని గాంధీజీ దృఢవిశ్వాసము. కనుక బాహ్యాపరిస్థితులు ప్రసన్నముగనుండక పోయినను దౌర్జన్యమధ్యమునను అది విధాయకముగ పనిచేసితీరవలెను. పరిస్థితులు మారుచుండిన యెడల దానికనుగుణముగ పనిచేయు విధానమును మార్చుకొనవచ్చును. కాని దాని నాపి వేయుటకు యీ పద్ధతియే వ్యర్థమని యొప్పుకొనినట్లగును.

బహుశః యతని మనస్సు యీ విధమున యోచించెను. కాని యతనిభావములను నేను చెప్పజాలను. అతని దృష్టిలో నేదియో కొంత మార్పు కలిగినట్లు, శాసనోల్లంఘనము అచ్చటచ్చట బయలుదేరు దౌర్జన్యములచే నాపివేయబడ నక్కరలేదనియు నతడు మాకు కొంత సూచనచేసెను. దౌర్జన్యము యుద్యమములో నొకభాగమే యైనచో నది శాంతియుత శాసనోల్లంఘనము కాజాలదు. అప్పుడు దానిని విరమించవలసి యుండును. ఈ సందేహావిచ్ఛేదము మాలో చాలమందికి తృప్తికరముగనుండెను. దీనినెట్లు ప్రారంభించవలెను ? అను పెద్ద సమస్య మమ్మిపుడు బాధింపదొడగెను. జయప్రదముగ నుండుటకు మే మెట్టి విధమగు శాసనోల్లంఘనము ప్రారంభింపవలెను? పరిస్థితుల కేది తగి యుండును ? ప్రజల కేది యంగీకారముగ యుండును ? అప్పుడు 'మహాత్ముడు' మార్గమును చూపెను.

ఉప్పు అకస్మాత్తుగా మహామంత్రమయ్యెను. దాని కద్భుతశక్తి కలిగెను. ఉప్పుపన్నుపై ధ్వజమెత్తవలెననిరి. ఉప్పు చట్టములను ముక్కలు చేయవలెను. మే మాశ్చర్యపడితిమి. ఎక్కడిజాతీయ సంగ్రామము ! ఎక్కడి మామూలు ఉప్పు ! ఈ రెంటికి నెక్కడి సంబంధము! మరియొక యాశ్చర్యకరమగు విషయమేమన గాంధీజీ తన 'పదకొండు షరతులను ' ప్రకటించెను. మనము స్వాతంత్ర్యమును గురించి మాట్లాడుచుండ నొకరాజకీయ సాంఘిక సంస్కరణల జాబితాను తయారుచేయుటలో నర్థమేమున్నది ? గాంధీజీ యీపదము నుపయోగించునపుడు మనము దీని నుపయోగించిన యర్థములోనే యుపయోగించెనా ? లేక మేము వేరువేరు భాషమాట్లాడుకొంటిమా ? పరిస్థితులు ముంచుకొనివచ్చుచుండుటచే మాకు వాదించుకొనుటకు కాలము లేకపోయెను. భారతదేశములో నవి రోజురోజు మా కండ్లముందర రాజకీయముగ పరుగెత్తుచు భయంకరమగు నార్థికమాంద్యము దానిసలముకొనెను; ధరలు పడిపోవుచుండెను. నగరవాసులు దీనికి సంతసించిరి. కాని వ్యవసాయదారు, కవులుదారు యీదృశ్యమును భయోత్పాతముతో గమనించుచుండెను.

తరువాత గాంధీజీ వైస్రాయితో నుత్తరప్రత్యుత్తరములు జరుపుటయు, సబర్మతి యాశ్రమమునుండి దండయాత్రను ప్రారంభించుటకు సంభవించెను. ప్రజలీయాత్రచేయు యాత్రికుల యదృష్టములను దినదినము వినుచుండినకొలది దేశములో నుద్రేకము హెచ్చుచుండెను. మా మీదకు వచ్చుచున్న సంగ్రామమునకు తుది సన్నాహములు చేయుటకు అహమ్మదాబాదులో అ.భా.కాం. కమిటీ మీటింగు జరుపబడెను. సంగ్రామనాయకు డచ్చటలేడు. అతడప్పుడే తనయాత్రీకులదండుతో సముద్ర తీరమునకు చలచల నడచిపోవుచుండెను. వెనుక ముఖము పెట్టుట కతడు తిరస్కరించెను. నిర్బంధములు వచ్చుచో నేమి చేయవలెనను విషయమై అ. భా. కాం. కమిటీవారు నిశ్చయించిరి. కమిటీ సమావేశమగుటకు వీలులేనిచో దాని తరఫున పనిచేయుట కధ్యక్షున కెక్కుడు యధికారముల నిచ్చిరి. అతడు

నిర్బంధింపబడిన కమిటీసభ్యుల స్థానములకు క్రొత్తవారిని పేర్కొన వచ్చును. తన తరువాత తన స్థానమునకు అతడే యొకనిని నియమింప వచ్చును. ఇట్టి యధికారములనే స్థానిక రాష్ట్రకాంగ్రెసు కమిటీలు తమ యధ్యక్షుల కిచ్చెను.

ఈ విధముగ 'డిక్టేటరు'లనబడువారు వర్ధిల్లి, కాంగ్రెసుపక్షమున సంగ్రామ మారంభమయ్యెను. భారతదేశ శక్రటరీలు, వైస్రాయిలు, గవర్నరులు మొదలగువా రాశ్చర్యముతో చేతులుచాచుచు "అయ్యో యిక నేమున్నది! కాంగ్రెసుకు చేటుకాలము దాపురించినది! ఎంత క్రూరమైన పని! చాటనారంభించిరి. ఏలనన కాంగ్రెసు డిక్టేటరు పదవులను విశ్వసించెనట! అప్పుడప్పుడు భారతదేశ మితవాద పత్రికారాజములుకూడ మాకు ప్రజాస్వామిక సుగుణసంపత్తుల నుపదేశించుచుండెను. మేము దీనినంతను మౌనముగ వినుచుంటిమి. ఇంతకంటె మొండికెత్తిన మోసము వేరొండు యుండబోదు. ఆర్డినెన్సు చట్టములచే ప్రతి నాగరికధర్మము నణచివేసి భారత దేశమును బలవంతముగ నిరంకుశత్వముతో పాలించు ప్రభుత్వమువారిట్లు ప్రజాస్వామికనుగురించి కపటభక్తితో బ్రువ్వుచుందురు. మామూలు పరిస్థితులలోనైనను హిందూదేశములో ప్రజాస్వామిక ఛాయ యెచ్చటనున్నది? బ్రిటిషుప్రభుత్వము తన యధికారమును, భారతదేశములో తమకున్న ప్రయోజనములను రక్షించుకొనుజూచుట సహజమే యనుటకు సందేహము లేదు. తన యధికారమును ధిక్కరించినవారిని యణచివేయవచ్చును. కాని ఇదియంతయు ప్రజాస్వామిక పద్ధతియని యదిచేయుసమర్థన చరిత్రాత్మకమై భవిష్యత్సంతతిచే పరీక్షింపబడుగాక!

తన ధర్మములను మామూలుగ నెరవేర్చుకొనుట కసాధ్యమగు స్థితిని కాంగ్రెసు యెదుర్కొనవలసియుండెను. దాని నక్రమ సంఘముగ ప్రకటించిరి. సలహాలకు, కార్యాచరణకు దానికమిటీలు కలుసుకొనుటకు వీలులేకుండ చేయబడెను. మా పోరాటమును సుత రాము బహిరంగముగ నుంచదలచితిమి. మేము రహస్యమును ప్రోత్స

హింపలేదు. కేంద్రములలోను, రాష్ట్రములలోను, స్థానికముగను నున్న నాయకులు నిర్బంధింపబడుట నిశ్చయము. అప్పుడు నడుపువా రెవరు ? మా కొక్కటే మార్గముండెను. యుద్ధముచేయుచున్న సైన్యములో, దెబ్బలుతిన్న సేనాధిపతులకు బదులు క్రొత్తవారి నేర్పరచు నట్లు, మేమును క్రొత్తసేనాధిపతుల నేర్పరచుటకు సన్నాహము చేసితిమి. యుద్ధరంగ మధ్యమున కూర్చొని మేము కమిటీసభలను జరుపజాలము. నిశ్చయముగా నే మొక్కక్కపు డట్లే చేసితిమి. కాని దాని యుద్దేశ్యమును, విధాయిక ఫలితమును, కమిటీయంతయును నిర్బంధింపబడుటయే యైయుండును. యుద్ధరంగము వెనుక భద్రముగా కూర్చొను సామాన్య యుద్యోగ లెవరును మాకు లేరు. ఇంకను దూరమున మరింత భద్రముగ కూర్చొను నాగరికమంత్రివర్గమును లేదు. మా సామాన్య యుద్యోగులు, మంత్రివర్గములు మా సంగ్రామ తత్త్వమునుబట్టి గుండుదెబ్బల కెదురు నిలువవలెను. వారందరు మొట్టమొదటనే నిర్బంధింపబడిరి. ఇంతకు మేము మా 'డిక్టేటరు'ల కిచ్చిన యధికారమెట్టిది ! సంగ్రామమును నిర్వహించు జాతీయ చిహ్నములుగా నియమింపబడుట వారికొక గౌరవము. కాని వారికి గల యదార్థాధికారము తమ్ముతాము జయిలుకు 'శాసించుకొనుటయే' తాము ప్రాతినిధ్యమువహించు కమిటీ బలవంత శాసనములచే పని చేయుటకు వీలులేనపుడే వారు పనిచేయగలరు. ఎప్పుడు, యెచ్చట నీ కమిటీ సమావేశముకలిగినను దానితో 'డిక్టేరు' తనకున్న వ్యక్తిగత యధికారము కోల్పోవును; అతడు లేక నామె యేప్రధాన సమస్యను, సూత్రములను స్పృశింపజాలరు. ఉద్యమములోని చిన్న చిన్నవియు బాహ్యములునగు హంశములను 'డిక్టేటరు' మార్చ గలడు. కాంగ్రెసు "డిక్టేటరుపదవులు" నిజముగా జయిలు సోపానములు. దినదినము యీ విధానము సాగుచుండెను. క్రొత్తవారు దెబ్బలుతినినవారి స్థానము నలంకరించెడివారు.

కనుక మేము, మా తుదిసన్నాహములను గావించుకొని అహమ్మదాబాదులో అ. భా. కాం. కమిటీ సభ్యులవద్ద సెలవుతీసికొం

టిమి. ఏలనన మేమెప్పుడు కలుసుకొనెదమో యెట్లు కలుసుకొనెదమో అసలు కలుసుకొనెదమో లేదో యెవరికీ తెలియదు. అ. భా. కాం. కమిటీయొక్క క్రొత్త యాదేశముల ప్రకారము స్థానిక ఏర్పాటులకు తుదిసంస్కారముల నిచ్చుటకు మేము మా మా తావులకు పోతిమి. సరోజినీదేవి చెప్పినట్లు జయిలుయాత్రకు దంతధావన సామగ్రి వగైరాలను మూటగట్టితిమి. త్రోవలో మేము- మాతండ్రి నేను, గాంధీజీని చూడబోతిమి. అతడు తన యాత్రికుల దండుతో జంబుసరములో నుండెను. మే మతనితో కొద్దిగంటలకాలము గడిపితిమి. తరువాత నతడు లవణ సముద్రయాత్రలోని ముందుమజిలీకి తన సైన్యముతో చటచట బయలుదేరెను. చేత దండముబూని తన యనుచరుల కగ్రేసరుడై, నిశ్చయమగు నడకతో, ప్రశాంతము, నిర్భయమునగు దృష్టితో నడచుచుండ నతనిని నేను కడసారి చూచితిని. ఆ దృశ్య మద్భుతము. భావోద్రేకపూరితము.

జంబుసరములో గాంధీజీ సలహాతో మాతండ్రి అలహాబాదులో నున్న తన భవనమును దేశమునకిచ్చివేయుటకు నిశ్చయించి దానికి "స్వరాజ్యభవనము" అను నూతన నామకరణము చేసెను. అతడు అలహాబాదు చేరుటతోడనే యీ ప్రకటన గావించి వెంటనే దానిని కాంగ్రెసువారికిచ్చివేసెను. ఆ పెద్దభవనములో నొకభాగము ఆస్పత్రిగా మార్చబడెను. అప్పుడు న్యాయవిధానములను జరుపుటకు తగిన సావకాశములేకపోవుటచే సంవత్సరము ఆరుమాసములైన తరువాత నతనియిష్టానుసారము నే నా యాస్తి కొక ధర్మకర్తృత్వము నేర్పాటుచేసితిని.

ఏప్రిల్ మాసము వచ్చెను. గాంధీజీ సముద్రతీరము జేరెను. ఉప్పుచట్టములపై దాడివెడలి శాసనోల్లంఘనమును ప్రారంభించుటకాజ్ఞలకొరకు మేము వేచియుంటిమి. కొన్ని నెలలనుండి మేము మా వాలంటీర్లకు శిక్షణ గఱపుచుంటిమి. కమలయు, కృష్ణయు (నాభార్యయు చెల్లెలు) వారిలోజేరి, దీనికొరకు పురుషవేషము వేసికొనిరి. వాలంటీర్లకు ఆయుధములు, చివరకు కర్రలులేవు. వారు తమపని నెక్కువ

సమర్థతతో నెరవేర్చుటకు, జనసమూహమును నియమించుటకు తగి యుండుటకే శిక్షింపబడుచుండిరి. ఆరవ యేప్రిల్ జాతీయవారములో మొదటిదినము. అది ప్రతిసంవత్సరము 1919 లో జరిగిన సంభవముల జ్ఞాపకార్థము సత్యాగ్రహదినము లగాయతు జలియనువాలాబాగు దినమువరకు జరుపబడుచుండెను. ఆదినమున గాంధీజీ దండీ సముద్రతీర మున ఉప్పుచట్టములను భంగముచేయ నారంభించెను. మూడునాలుగు రోజులైనతరువాత నన్ని కాంగ్రెసు సంఘములు నట్లుచేసి తమ ప్రాంత ములో శాసనోల్లంఘన మారంభింపవచ్చునను యనుజ్ఞ యీయబడెను.

అకస్మాత్తుగా నొక జలాశయము వెల్లువయైనట్లు కాన్పించెను. దేశమంతట నుప్పుపంటయే ప్రధానవిషయమయ్యెను. ఉప్పుతయారు చేయుట కనేక వింతపద్ధతు లవలంభింపబడెను. మాకు దానినిగురించి యేమియు తెలియదు. కనుక మాకవకాశము కలిగినంతవరకు మేము దానినిగురించి చదివితిమి. దానిని తయారుచేయు కరపత్రములను వేసి తిమి. మేము కొన్ని కుండలను, మూకుళ్ళను పోగుచేసి చివరకు కొంత యుప్పనెడి పదార్థమును తయారుచేసితిమి. గొప్పవిజయము బడసి నట్లు మేము దీనితో నూరేగి తఱుచు చాల విపరీతధరల కమ్మివేసెడి వారము. పదార్థము మంచిదా చెడ్డదాయను ప్రశ్నయే లేదు. దుష్ట మగు నుప్పుచట్టమును భంగపరచుటయే ప్రధానవిషయము. మే మిందులో తయారుచేసినయుప్పు నికృష్టమైనదైయైనను విజయముబడసి తిమి. ప్రజల యపరిమితోత్సాహమును దవానలమువలె విజృంభించు చున్న యుప్పుచేయువిధమును చూచినను గాంధీజీ మొదటసూచించి నపుడు సందేహించిన మేము చాల సిగ్గుపడితిమి. ప్రజలనుద్రేక పరచి వారిని సక్రమముగ ప్రవర్తింపచేయగల యతని యద్భుతశక్తికి మే మాశ్చర్యపడితిమి.

నేను మధ్యపరగణాలలోని రాయపూరులో నొక కాన్ఫరె న్సుకు బయలుదేరి వెళ్ళుచుండగా ఏప్రిల్ 14 వ తేదీని నిర్బంధింప బడితిని. ఆ రోజుననే నా కేసు విచారించి ఉప్పుచట్టముక్రింద నా కారు మాసములు విధించిరి. నేను నిర్బంధింపబడవచ్చునని ముందు

గనే నాస్థానే గాంధీజీని కాంగ్రెసు ప్రెసిడెంటుగ పేర్కొంటిని. కాని యతడు దానిని తిరస్కరించునేమోయను భయముచే రెండవ పేరు మా తండ్రిది, సూచించితిని. నేననుకొనినట్టే గాంధీజీ యంగీకరింపలేదు. కనుక తండ్రిగారే తాత్కాలికాధ్యక్షులైరి. అతడు చాల యనారోగ్యముగనుండెను. అయినను అతడత్యుత్సాహముతో నుద్యమములోనికురికెను. ఆ మొదటి మాసములలో నతని పటుతరమగు నేతృత్వము, క్రమశిక్షణను పాలించుట యుద్యమమున కెంతయో లాభదాయకమయ్యెను. ఉద్యమము చాల వృద్ధిపొందెను. కాని యతనికున్న యారోగ్యము శరీరదార్ఢ్యము కృంగిపోయెను.

ఆ రోజు లుద్రేకము పుట్టించు వార్తలతో నిండియుండెను. ఉత్సవములు, లాఠీచార్జీలు, కాల్పులు నిరంతర హర్తాళములు పెషావరుదినము, గహర్వాలీదినము, మొదలగు ప్రత్యేక యుత్సవములు ప్రళయముగా నుండెడివి. తాత్కాలికముగ విదేశవస్త్రబహిష్కరణము, సమస్త బ్రిటిషు వస్తువులబహిష్కరణము పూర్తియయ్యెను. వృద్ధురాలగు నా మాత, నా చెల్లెండ్రు, యుద్యమములోని కురికి ప్రచండమార్తాండ మధ్యందినమున తీవ్రకరోష్ణములో, విదేశవస్త్ర దుకాణములవద్ద నిలచి పికెటింగు చేయుచున్నారను వార్త నన్ను కలచివేసెను. కమలకూడ నట్లే చేసెను. కాని యామె యంతటితో నూరుకొనలేదు. అనేకవత్సరములనుండి యామెను బాగుగ నెరుగుదు ననుకొనిన నాకు మహదాశ్చర్యము కలుగునట్టి యుత్సాహముతోను కృతనిశ్చయముతోను ఆమె అలహాబాదు పట్టణములోను, జిల్లాలోను, పనిచేయ నారంభించెను. ఆమె తన యనారోగ్యమును మరచిపోయి పగలంతయు సూర్యరశ్మిలో పనిచేయుచు నద్భుత కార్యశూరత్వమును చూపెను. నేను దీనిని గురించి జయిలులో ముభావముగ వింటిని. తరువాత మా తండ్రి నన్నచ్చట కలుసుకొనినపుడు కమలకృషినిగురించి యతడెంత మెచ్చుకొనునదియు, ముఖ్యముగ నామెయొక్క కార్యశూరత్వమును గురించియు నాకు స్వయముగా తెలిపెను. నా తల్లియు చిన్నపిల్లలు నెండలో

పనిచేయుట కలడెంతమాత్రము యిష్టపడెడివాడుకాడు. కాని యెప్పుడైనను కొంచెము మందలించుటతప్ప యతడు వారితో నెట్టి జోక్యము కల్పించుకొనలేదు. ఆ మొదటిరోజులలో మాకుచేరినవార్తలన్నిటికంటె గొప్పవార్త పెషావరులో యేప్రిల్ 23 వ తేదీన జరిగిన సంభవములు. తరువాత నిట్టివే సరిహద్దు రాష్ట్రమంతట జరిగెను. భారతదేశములో మరెచ్చటనైనను మరఫిరంగుల జాజ్వల్యమాన దవానలము ముందర నత్యద్భుతముగా ప్రదర్శింపబడిన యీ ప్రశాంతము, శిక్షాయుతధైర్యసాహసములు దేశమునంతను కంపించియుండెడివి. సరిహద్దురాష్ట్రములలో దానికి మరియొక ప్రాముఖ్యత కలదు. ధైర్య సాహసములకు పేరెన్నికపొందిన పఠానులు శాంతస్వభావులు కారు. వారి కట్టి పేరు లేదు. ఈ పఠానులు భారతదేశములో నసమాన యుదాహరణము చూపిరి. సరిహద్దు రాష్ట్రములలోనే గహర్వాలు సైనికులు నాగరిక ప్రజలపై తుపాకులను కాల్చవలసినదను యాజ్ఞలను తిరస్కరించిరి. నిరాయుధులగు ప్రజలపై కాల్చుటకు సైనికునికుండు సహజమగు నయిష్టతచేతను, నిస్సందేహముగ ప్రజల యెడల గల సానుభూతిచేతను వారు కాల్చుటకు తిరస్కరించిరి. కాని తన యధికారుల యాజ్ఞలను ధిక్కరించుటకు సైనికున కొక్క సానుభూతి మాత్రమే చాలదు. దానిఫలిత మతనికి తెలియును. బహుశః గహార్వాలీలు బ్రిటిషుప్రభుత్వము కూలిపోవుచున్న దను దుర్భ్రమచేత నిట్లుచేసియుందురు. అట్టిభావ ముత్పన్నమైనప్పుడే సైనికుడు తన సానుభూతి ప్రకారము యభిరుచుల ప్రకారము చేయ సాహసించును.

ఆ రోజులలో ననేక వింతవిషయములు జరుగుచుండెను. కాని, జాతీయోద్యమములో స్త్రీలు తీసికొనినభాగము నిస్సందేహముగ నద్భుతముగ వారు తమ గృహాంతరసీమల నుండి యసంఖ్యాకముగ తరలివచ్చి, సంగ్రామరంగ మధ్యమున కురికిరి. విదేశవస్త్ర దుకాణములవద్ద, కల్లుదుకాణములవద్ద పికెటింగుచేయుట వారిప్రత్యేక హక్కు. అన్నిపట్టణములలోను కేవలము స్త్రీలు మాత్రమే గల బ్రహ్మాండమగు

యుత్సవములు జరుపబడెను. సాధారణముగ పురుషులపట్టుదలకంటె స్త్రీలపట్టుదలయే సిర్వ్యక్రమముగనుండెను. రాష్ట్రములలోను స్థానిక ప్రాంతములలోను తఱుచు వారే "డిక్టేటరు" లగుచుండిరి.

ఉప్పుచట్టమును పగులగొట్టుట యొకకార్యము మాత్రమే. శాసనోల్లంఘన మితరరంగములకు ప్రాకెను. వైస్రాయి వివిధ ఆర్డినెన్సులను జమాయించి, యనేక కార్యములను నిషేధించుటచే నిది మరింత సుకరమయ్యెను. ఈ ఆర్డినెన్సును, నిషేధములు పెరిగినకొలది వాటిని భంగపరుచుట కవకాశములు వృద్ధియగుచుండెను. ఆర్డినెన్సులు వేటిని ఆపివేయ తలపెట్టెనో వాటిని చేయుటయే సాత్త్వికనిరోధము. ప్రజలు కాంగ్రెసు ఆరంభము చేయుటయే తడవు, ప్రభుత్వదృష్టిలో నొక ఆర్డినెన్సు పనిచేయనిచో వైస్రాయి క్రొత్తఆర్డినెన్సులను తయారుచేయును. కాంగ్రెసు వర్కింగుకమిటీసభ్యులు చాలమంది నిర్బంధింపబడిరి. కాని క్రొత్తసభ్యులను జేర్చుకొనుచు కమిటీ నిరంతరాయముగా పనిచేయుచునే యుండెను. ప్రతి ప్రభుత్వఆర్డినెన్సుకు వర్కింగుకమిటీయొక్క బదిలీతీర్మానము, దాని నెదుర్కొనుటకు తగినయాదేశములతో చేయబడుచుండెను. ఒక్కమినహాయింపుతప్ప యీ యాదేశములన్నియు భారతభూమియందంత నద్భుతమగు నైక్యబుద్ధితో నిర్వహింపబడెను. ఆ మినహాయింపు పత్రికాప్రచురణముకు సంబంధించినదై యుండెను. ముద్రణ ఆర్డినెన్సును జారీచేసి, పత్రికలయొద్ద జామీనుకోరినపుడు వర్కింగుకమిటీవారు జాతీయపత్రికల నట్టిజామీను యీయవలదనియు దానికిబదులు పత్రికలనాపివేయవలసినదనియు నాదేశించిరి. పత్రికాధికారుల కిది యొక గుటకదిగని మాత్రయయ్యెను. ఏలనన యిప్పుడే ప్రజలలో వార్తలకెక్కువ తృష్ణ బయలుదేరెను. అయినను పత్రికలలో నత్యధికసంఖ్య—కొన్ని మితవాదపత్రికలుతప్ప—ప్రచురణ నాపివేసెను. దీనివలన ననేక వదంతులు బయలుదేరెను. కాని వారట్లు చాలకాలముండజాలక పోయిరి. మితవాదపత్రికలు వ్యాపారమును లాగివేయుటచూడ వారికి

కోపము కలుగుచుండెను. కనుక చాలమంది తిరిగి ప్రచురణ నారంభించిరి.

గాంధీజీ మే 5 వ తేదీని నిర్బంధింపబడెను. అతని నిర్బంధ మైన తరువాత పశ్చిమతీరముననున్న యుప్పుకొఠారములపై గొప్ప గొప్ప దాడులు బయలుదేరెను. ఈ దాడులసందర్భములో పోలీసుల యత్యాచారములు హృదయవిదారకముగనుండెను. అద్భుతమగు హర్తాళములు, వుత్సవములు, లాఠీచార్జీలు—వీటితో గూడిన బొంబాయి నగర మప్పుడు రంగస్థలమయ్యెను. లాఠీచార్జీలలో దెబ్బలుతినిన వారికి సేవచేయుట కత్యవసరమగు ఆస్పత్రులు స్థాపింపబడెను. అద్భుతవిశేషము లనేకములు బొంబాయిలో సంభవించెను. మహా పట్టణమగుటచే ప్రచురణ కనేక సౌకర్యము లచ్చట నుండెను. అట్టి ప్రాముఖ్యతయేగల సంభవము లనేకములు చిన్నపట్టణములలోను జరిగెను.

జూను మాసాంతమున మా తండ్రి బొంబాయి వెళ్ళెను. అత నితో మా తల్లి, కమల వెళ్ళిరి. వారి కద్భుతమగు నాహ్వానము లొసంగబడెను. వారచ్చటనుండగా భయంకర లాఠీచార్జీలు జరిగెను. బొంబాయిలో నివి యతిసామాన్యములు. పదిహేనురోజు లయిన తరువాత నచ్చట నొక యసామాన్యమగు నగ్నిపరీక్ష భళ్ళున తెల్ల వారువరకు జరిగెను. వేలకొలది జనసమూహము, వర్కింగుకమిటీ సభ్యులు, మాలవ్యాజీ మొదలగువారు మార్గము కడ్డముగానిలచిన పోలీసులకెదుట రాత్రియంతయు గడిపిరి. బొంబాయినుండి తిరిగి వచ్చునపుడు తండ్రిగారిని జూను 30 వ తేదీని నిర్బంధించిరి. అతనితో సయ్యదు మహమ్మదుకూడ నుండెను. వారు వర్కింగు కమిటీయొక్క తాత్కాలికాధ్యక్షుడు, శక్రటరీ లగుటచే నిర్బంధింపబడి చెరి యారుమాసములు శిక్షింపబడిరి. నాగరికజనులను కాల్చవలసినదని పోలీసులు, సైనికులు నాజ్ఞాపింపబడినపుడు వారు చేయవలసిన ధర్మ ములనుగురించి మాతండ్రి జారీచేసిన స్టేటుమెంటుకే యతడు నిర్బం ధింపబడెను. స్టేటుమెంటు న్యాయశాస్త్రమునకు సంబంధించిన విష

యము. ఈ హింసమునుగురించి ప్రస్తుత బ్రిటిషు యిండియను లా యెట్లున్నదో యది వివరించెను. అయినప్పటికి నది యుద్రేకకరమైన దని యుపద్రవకరమైనదని తలంపబడును.

బొంబాయి పోవుటవలన తండ్రిగారికి చాల శ్రమకలిగెను. ప్రాతఃకాలము మొదలు రాత్రి చాల ప్రొద్దుపోవువరకు నతడు పని చేయుచునేయుండెను. ప్రతిముఖ్యనిశ్చయమునకు నతడు బాధ్యత వహించవలసి యుండెను. అతడు చాలకాలమునుండి యస్వస్థతగ నుండెను. కాని యిప్పుడతడు శ్రమచెంది తనడాక్టర్ల ప్రత్యేకసలహా వలన తక్షణమే సంపూర్ణ విశ్రాంతిని తీసికొనవలెనని నిశ్చయించెను. అతడు ముసోరీ వెళ్ళుట కేర్పాటుచేసికొని ప్రయాణసన్నాహములు గావించెను. కాని ముసోరీ వెళ్ళవలెననుకొనిన తేదీ కొకరోజుముం దర నతడు నైనీ సెంట్రలు జయిలులో మా కొఠారము ముందర ప్రత్యక్షమయ్యెను.

30

నైనీ జైలులో

యేడు వత్సరముల తరువాత తిరిగి జయిలుకు వెళ్లుటచే జయిలు జీవితానుభవములను నేను కొంతవరకు మరచిపోతిని. నేను రాష్ట్రములోని పెద్దజయిళ్ళలో నొకటియగు నైనీ సెంట్రల్ జయిలులో నుంటిని. ఒంటరిగా నన్నొక్కనినే యుంచుట నాకు క్రొత్త యనుభవము. 2200 లేక 2300 మంది ఖయిదీలుగల పెద్దయావరణకు సంబంధములేకుండ నే నొక 100 అడుగుల కైవారముగల యావరణలో నుంచబడితిని. దానిచుట్టు యెత్తుగల గుండ్రనిగోడ యుండెను. దానిమధ్య నాలుగుగదులుగల యందచందములులేని కొంపయొకటి యుండెను. అందులో నాకు రెండు వరుసగదుల నిచ్చిరి. ఒకటి స్నానమునకు పాకీదొడ్డికి, రెండవది నా యునికికి. తక్కిన రెండును కొంతకాలము కాళీగనే యుంచబడెను.

బయట నే నతియుద్రేకపూరితము, విరామరహితము నగు జీవితమును గడిపినతరువాత నిపుడు కొంత యొంటరితనమును, స్వాస్థ్యమును అనుభవించితిని. నేను బాగుగ నలసిపోవుటచే రెండు మూడు రోజులు మస్తుగ నిద్రించితిని. వేడిగాడ్పు లప్పుడే ప్రారంభ మగుటచే నా గదికి పెద్ద యావరణకు మధ్యగల చిన్న సందులో రాత్రులందు నన్ను ఆరుబయట పరుండనిచ్చిరి. నేను దాని నెత్తుకొనిపోదు ననియో లేక బహుశః దానినొక నిచ్చెనక్రింద నుపయోగించి గోడనెక్కి పోవుదుననియో నా పరుపును గట్టిగా గొలుసులతో కట్టివేసిరి. రాత్రి యంతయు వింతధ్వనులతో మ్రోగుచుండెడిది. ఖయిదీఓవరుశీర్లు ప్రధానగోడలను కాపాడుచు తరుచు నొకరికొకరు వివిధస్థాయిలలో సవిపుల నందించుచు నొక్కొక్కప్పుడు దూరమున నుండివచ్చు గాలిహోరువంటి ప్రతిధ్వనిని కలుగచేసెడివారు. రాత్రి కాపలాదార్లు కొఠారములలో తమయొద్దిలోనున్న ఖయిదీలను పైకి బిగ్గరగా లెక్కించుచు నంతయు బాగుగనేయున్నది యను కేకలను

వేయుచుండెడివారు. - రాత్రియనేకసారు లేజయిలు యధికారియో గస్తీతిరుగుచు మా యావరణకువచ్చి ఫ్యాక్టరీలోనున్న వార్డరును కేకలు వేయుచు పరిశోధించుచుండెడివాడు. నా యావరణ తక్కిన వాటికి కొంతదూరములో నుండుటచే నీ ధ్వను లస్పష్టముగనుండి మొట్టమొదట నా కాగోల యర్థమయ్యెడిదికాదు. ఒక్కొక్కప్పుడు నేనొక యరణ్యసమీపమున నున్నట్లు, మృగములు తమ పొలముల లోనికి రాకుండ రయితులఱచుచున్నట్లు భావించెడివాడను. ఒక్కొక్కప్పుడరణ్యము నక్తంచరమృగజాలము నిశీథతాండవము చేయు చున్నట్లు తోచెడిది.

చతురస్రసమగు గోడలకంటె వక్రమగుగోడ నిర్బంధము నెక్కుడుగ జ్ఞప్తికి తెచ్చుట యథార్థమా లేక నా యూహయా ? యను నాశ్చర్యము కలిగెడిది. మూలలు కోణములు లేకపోవుట నిర్బంధ భావము నధికము చేయుచుండెను. పగలు ఆగోడ గగనసీమను గూడ నాక్రమించి దానిలో నొక చిన్నతునకను మాకు ప్రదర్శించుచుండెను. "ఖయిదీలు గగనమని పిలుచు యా చిన్ని వినీలసీమను రాజితకాంతుల నీను తెలిచాపలతో పరుగులెత్తు మేఘపంక్తిని" నేను కాయలుకాచిన నేత్రములతో చూచుచుండెడివాడను. రాత్రులందు ఆ గోడ నన్ను మరింత యావరించుటచే నే నొక నూతియడుగున పడిపోయినట్లుండెడిది లేదా నేను చూచిన నక్షత్రకాంతిచే రాజిల్లెడి యా యాకాశభాగము యదార్థమై కృత్రిమ గ్రహసందోహములో నొక భాగమువలె కాన్పించెడిది.

నా కొఠారుకు, యావరణకు జయిలులో (కుత్తాఘర్) కుక్క యిల్లు అను ప్రసిద్ధనామము కలదు. ఇది దానికిగల పాతపేరేకాని నాకు సంబంధించినదికాదు. ఈ చిన్నికొఠారము మొట్టమొదట, తక్కిన వాటితో జోక్యములేకుండ, ప్రత్యేకముగ నుపద్రవకరులైన ఖయిదీల నితరులతో నెట్టి సంబంధములేకుండ నుంచుటకై నిర్మింపబడెను. తరువాత నిదిరాజకీయ ఖయిదీలకొరకు, డెటిన్యూలకొరకు ప్రత్యేకింపబడెను. ఈ యావరణముకు ముందర కొంతదూరములో, నొక కట్టడ

ముండెను. నాకొట్టులోనుండి నేను దానిని మొట్టమొదట చూచినపుడు నా కాశ్చర్యము కలిగెను. అదియొక పెద్ద పంజరమువలె నుండెను. దానిలో జనము గిరగిర తిరుగుచుండిరి. అది మనుష్యులచే నడుపబడు నీటికుళ్ళాయి యని నేను తరువాత తెలిసికొంటిని. ఒక్కొక్కసారి పదునారుమంది దానికి పనిచేయవలెను. మనము ప్రతిదానికి నలవడునట్లే నేను దానికలవడితిని. కాని మానవశక్తి నీవిధముగ నుపయోగించుట యతిమూర్ఖ్యము, నవనాగరికము. నేను దానిని సమీపించినపుడెల్ల నాకు జంతుప్రదర్శనశాల జ్ఞప్తికివచ్చును.

కొన్నిరోజులవరకు నన్ను నా యావరణముదాటి పైకి పోనిచ్చెడివారుకారు. తరువాత నింకను చీకటియుండగనే ప్రాతఃకాలమున నొక అరగంటసేపు ప్రధానగోడక్రింద నడచుటకు, పరుగెత్తుటకు నా కనుమతి నిచ్చిరి. తక్కిన ఖయిదీలెవరు నన్ను కలుసుకొనుటకు, చూచుటకు వీలులేకుండుటకే నా ప్రాతఃకాల సమయము నిర్ణయింపబడెను. నా కా విహారము ప్రీతికరముగనుండి నా శ్రమను పోగొట్టుచుండెడిది. నాకు దొరికిన యా కొద్దికాలములో సాధ్యమైనంత బహిరంగ వ్యాయామమును పొందవలెనని పరుగెత్తనారంభించి క్రమముగ రోజుకు రెండుమైళ్ళువరకు పరుగెత్తెడివాడను.

నేను ప్రతిదినము ప్రాతఃకాలమున నాలుగుగంటలకు, మూడున్నరగంటలకుకూడ లేచుచుండెడివాడను. రాత్రి చాలసేపు చదువుకొనుటకు తగినదీపము లేకుండుటచే నేను పెందలకడనే నిద్రించెడివాడను. నేను నక్షత్రములను ప్రీతితో పరీక్షించుచుండెడివాడను. బాగుగా తెలిసిన యొక్కొక్క నక్షత్రస్థానమునుబట్టి నాకు సరిగా ప్రొద్దు తెలియుచుండెడిది. నేను పరుండిన చోటునుండి గోడమీదనుండి తొంగిచూచు ధృవనక్షత్రమును చూడగలిగెడివాడను. అది యెప్పుడు నచ్చటనే యుండుటచే నా కమితానందదాయకముగ నుండెడిది.

నెలవరకు నా కితరస్నేహితు లెవరు లేకుండిరి. కాని నే నొంటరిగ లేను. నాతో నొకవార్డరు, ఖయిదీ ఓవరుశీర్లు, వంటచేసి

పెట్టుఖయిదీ, తుడుచువాడు నా యావరణలోనుండిరి. అప్పుడప్పుడు యేదో పనిమీద నితరఖయిదీలు, చాలమంది ఖయిదీ ఓవరుసీర్లు— సి. ఓ. లు. దీర్ఘశిక్షల ననుభవించువారు – వచ్చెడివారు. యావజ్జీవ ఖయిదీలు సామాన్యముగ నుండెడివారు. సాధారణముగా యావజ్జీవశిక్ష యిరువదిసంవత్సరములతో లేక నింకను తక్కువకాలముతో నంతమయ్యెడిది. కాని యిరువది సంవత్సరములుపైగా జయిలులో నున్నవా రనేకులు గలరు. నైనీలో నే నొక యద్భుతాంశమును చూచితిని. ఖయిదీల దుస్తులమీద భుజములసమీపమున చిన్నకర్ర బిళ్ళలు తగిలించబడియుండెను. అవి వారి శిక్షలనుగురించి, విడుదల తేదీని గురించి తెలుపును. ఒక ఖయిదీయొక్క బిళ్ళమీద నతడు 1996 లో విడుదలయగునని నేను చదివితిని. అతడు 1930 నాటి కప్పుడే యనేక సంవత్సరములు జయిలులో గడిపెను. అత డప్పుడు నడివయస్సులో నుండెను. బహుశః యతని కనేకశిక్షలు విధింపబడి యవియన్నియు కూడబడెను. మొత్తము డెబ్బదియైదు సంవత్సరములయ్యెను.

ఈ "యావజ్జీవఖయిదీల"లో చాలమంది వత్సరములకొలది యొక్క శిశువునుగాని, స్త్రీనిగాని, చివరకు మృగములనుగాని చూడరు. బాహ్యప్రపంచముతో వారికెట్టి సంపర్కము లేక మానవ సంబంధము లన్నియు నశించును. భయము పగదీర్చుకొనుట ద్వేషము మొదలగు క్రోధపూరితభావములు వారి నావరించి యుండును. వారు ప్రపంచములో మంచిని, దయను, సంతోషమును మరచిపోదురు. చెడుగులోనే మునిగి తేలుచు క్రమముగ ద్వేషము యొక్క తీవ్రతగూడ నశించి జీవితము నిర్వీర్యమయి, యంత్రము వంటి గాడిదమోతమాత్రమే వారికి మిగులును. యంత్రములవలెనే వారు దినములను యీడ్చుచు నెట్టిభావములు లేక నుండెదరు. అప్పుడప్పుడు ఖయిదీలశరీరములను తూచుచు లెక్కవేయుచుందురు. కాని భయంకరమగు యీ నిర్బంధవాతావరణములోపడి శుష్కించి యెదుగుబొదుగులులేక కృశించిపోవు మనస్సును, ఆత్మను తూచు

కెట్లు ? మరణదండనము పనికిరాదని ప్రజలు వాదించుచుందురు. వారి వాదములు నాకెంతయు సమ్మతమేకాని జయిలులో నా జీవాంతము దుర్భరబాధ ననుభవించుటను నేను చూచునపుడు వ్యక్తిని నెమ్మదిగా ముక్కముక్కలుగా చంపుటకంటె మరణశిక్ష విధించుటయే మంచిదని నేను భావింతును. ఈ 'యావజ్జీవఖయిదీ'లలో నొకడు నాయొద్దకువచ్చి "యావజ్జీవఖయిదీలమైన మాగతి యేమగును ? స్వరాజ్యము మమ్మీ నరకమునుండి తప్పించునా ?" యని ప్రశ్నించెను.

ఈ యావజ్జీవ ఖయిదీలెవరు ? వీరిలో చాలమంది మూకుమ్మడి కేసులలో యేబదిమంది నూరుమంది చొప్పున శిక్షింపబడియుందురు. వీరిలో కొంతమంది బహుశః దోషులుందురు. కాని శిక్షింపబడిన వారిలో నెక్కువమంది నిజముగా దోషులని నేను తలంపను. ఇట్టికేసులలో ప్రజల నిరికించుట చాల సులభము. క్రౌనుతరపున సాక్ష్యము చెప్పువాడును, కొద్ది యానవాలుపట్టుటయు నుండిన చాలును. ఈ రోజులలో దోపిడీలు హెచ్చుచుండుటచే ఖయిదీలు సాలీనా వృద్ధియగుచున్నారు. ప్రజలు కడుపుమంటచే మాడునపుడు వారికనేమి చేయగలరు ? జడ్జీలు, మేజస్ట్రేటులు నేరములు వృద్ధియగుచున్నవని గర్జింపవచ్చును. కాని వాటికి మూలములగు నార్థిక కారణములయెడల వా రంధప్రాయులుగ నున్నారు.

ఏ భూమితగాదా మూలమునో గ్రామములోని రయితాంగములో నొకకొట్లాట బయలుదేరును. లాఠీలు గిరగిర తిరుగును. ఎవడో యొకడు చనిపోవును. ఫలితము, చాలమంది జీవితపర్యంతము లేక చాలకాలము జయిలులోనుందురు. తఱచు యీ విధముగా నొక కుటుంబములోని పురుషులందరు జయిలులోనుండుట తటస్థించి స్త్రీలు వారికర్మముకు విడిచిపెట్టబడుదురు. ఇందులో నొక్కటియు నేరముచేయు జాతికాదు. సాధారణముగ వారు శారీరకముగ, మానసికము సామాన్యగ్రామవాసికంటె నుత్తములైన యువకులు. కొద్ది

శిక్షయు, యితరవిషయముల మీదను, వృత్తులమీదను కొంత శ్రద్ధయు నున్నచో వీరు దేశమున కలంకారములుగ నుండెడివారు.

భారతదేశఖయిదులలో సంఘమునకు చేటు తెచ్చెడివారు, జాతికి యుపద్రవకారులును నైన నేరస్థులు లేకపోలేదు. కాని నిస్సందేహముగ విశ్వసింపదగిన యనేకమంది పిల్లలను, యువకులను నేను జయిలులోచూచి యాశ్చర్యపడితిని. నిజమైన నేరస్థులు నూటికెందరుకలరో నేరములు చేయుజాతికి చెందనివారెందరుకలరో నాకు తెలియదు. జయిలుశాఖలోనివారెవరు, యీ భేదమునుగురించి యూహించనైన యూహించి యుండరు. ఈ విషయమునుగురించి న్యూయార్కులోని సింగుసింగు జయిలువార్డెనుఅయిన లూయీ లాస్ అనునతడు కొన్ని చక్కనియంకెలను తెలియజేసెను. అతడు తనజయిలుజనాభాలో తా నెరిగినంతవరకు నూటికి యేబదిమంది యెంతమాత్రము నేరముచేయువలెనను చింతలేని వారనియు, పాతికమంది పరిస్థితులవలన, వాతావరణమువలన యీడ్వబడినవారనియు, మిగత పాతికమందిలోను సగముమందిమాత్రమే తీవ్రమగు సాంఘిక యాతతాయులనియు లెక్క తేల్చెను. యదార్థమైన నేరస్వభావ మెట్టిదభివృద్ధియు లేని పల్లెలందుగాక నాధునిక నాగరిక రంగస్థలములగు పట్టణములయందే యెక్కువ విజృంభించుచున్నసంగతి మనకందరకు తెలిసినవిషయమే. అమెరికనుదేశపు దోపిడీలు జగద్విఖ్యాతిగాంచెను. సింగుసింగుజయిలుకు యధమాధములగు నేరస్థులు వత్తురని ప్రసిద్ధి. అయినను దానివార్డెనుయొక్క లెక్కపకారము ఖయిదీలలో నూటికి $12\frac{1}{2}$ మంది మాత్రమే నిజముగ చెడ్డవారు. హిందూదేశపుజయిళ్ళలో నీసంఖ్య యింతకంటె చాల తక్కువయని నిరాక్షేపణగ చెప్పవచ్చును. మరింత యదర్థజ్ఞానముగల ఆర్థికనీతి, యెక్కువవిద్య, యెక్కువవృత్తులు త్వరలో మన జయిళ్ళను కాళీచేయగలవు. కాని, దీనిని జయప్రదముగ చేయవలెనన్న మన సాంఘిక నిర్మాణమునకంతకు చెందిన ప్రధానమార్పు లెన్నియో కావలెను. అది జరుగనప్పుడు బ్రిటిషుప్రభుత్వ మిప్పుడుచేయునది

యొక్కటియే జరుగుచుండును. పోలీసుబలమును వృద్ధిచేయుచుండుట భారతదేశములోని జయిళ్ళను పెద్దవిచేయుచుండుట. భారతదేశములో జయిళ్ళకు పంపబడువారిసంఖ్య భయంకరముగ నుండును. అఖిలభారత ఖయిదీలసహాయకసంఘ కార్యదర్శి యీమధ్య ప్రకటించిన రిపోర్టులో నొక్క బొంబాయిరాష్ట్రములోనే 1933 లో 1,28,000 మంది జయిళ్ళకు పంపబడిరని వ్రాసెను. వంగరాష్ట్రములో నా సంవత్సరములోనే 1,24,000 మంది పంపబడిరి. అన్నిరాష్ట్రముల లోని యంకెలు నాకు తెలియవు. కాని రెండు రాష్ట్రములలోనే 2,50,000 మించినపుడు మొత్తము అఖిలభారతసంఖ్య పదిలక్ష లగుటలో నాశ్చర్యముండదు. ఇది శాశ్వత జయిలుజనాభాకాదు. చాల మందికి కొద్దికొద్ది శిక్షలే యుండును. శాశ్వతజనాభా యింతకంటె చాలతక్కువగనే యుండినను నది చాల గొప్పసంఖ్యయే యగును. భారతదేశములోని కొన్ని పెద్దరాష్ట్రములు ప్రపంచములోనికెల్ల పెద్దజయిలు పరిపాలనకు ప్రసిద్ధిచెందెను. ఈ సందేహాస్పదగౌరవము పొందువాటిలో యు. పి. కూడ కలదు. ఇది వెనుకబడిన లేక నభివృద్ధి భంగకరమగు ప్రభుత్వములలో నొకటి. ఖయిదీ యొకవ్యక్తియని, మానవుడని భావించుటకు, నతనిమనస్సు నభివృద్ధిచేయుటకు, కాపాడుటకు నీషణ్మాత్రప్రయత్నము గావింపబడదు. యు. పి. ప్రభుత్వము తమ ఖయిదీలను భద్రపరచుటకుమాత్రమే ప్రసిద్ధికెక్కెను. పారిపోవు ప్రయత్నములే చాలస్వల్పము. వేయిమంది కొక్కడయిన పారిపోగలుగుచున్నాడని నే ననుకొనెను.

జయిళ్ళలోనున్న మరియొక విచారకరవిషయ మేమనిన వాటిలో పదిహేనుసంవత్సరములు దాటిన పిల్లలనేకమంది కలరు. వారిలో చాలమంది బుద్ధిమంతులు. వారి కవకాశమే యున్నచో సులభముగ యోగ్యులయ్యెడివారు. వారికి చదువను, వ్రాయను నేర్పుటకు కొంత ప్రారంభము, చాలకాలముగడచినతరువాత చేయబడెను. కాని యిది యెంతమాత్రమును చాలదు. మరియు నిందులో పటుత్వము లేదు. ఆటపాటలకు యవకాశములు లేవు. ఏవిధమగు

వార్తాపత్రికలు యివ్వరు. పుస్తకములను చదువనీయరు. పన్నెండు గంటలకుపైగా ఖయిదీలందరు తమ కొఠారములలోనో లేక గదులలోనో తీరికగల దీర్ఘసాయం సమయములందు నిర్బంధింపబడుదురు.

మూడు నెలలకొకసారి మాత్రమే బంధువులు దర్శింపవచ్చును. అట్లే యుత్తరములను వ్రాయవచ్చును. ఎంతవికృతమగువ్యవధి? అయినను చాలమంది కీలాభముకూడ చేకూరదు. వారికి చదువు రానిచో (చాలమంది చదువురానివారే) వారే జయిలు అధికారి దయాధర్మము మీదనో యాధారపడవలెను. అతడు తనకిదివరకే యున్నపనిని పెంచుకొనుటకిష్టములేక సాధారణముగ దీని నెగురగొట్టును. ఒకవేళయుత్తరమును వ్రాయుచో, చిరునామా సరిగనీయబడకపోవుటచే నది చావు ఉత్తరముల ఆఫీసుకుచేరును. బంధుదర్శనములు మరింత కష్టతరము. తప్పనిసరిగ నేజయిలు అధికారినో తృప్తిపరచినగాని, సాధారణముగ నవి సంభవింపవు. తఱచు ఖయిదీలను వివిధజయిళ్ళకు బదిలీచేయుచుందురు. అప్పుడు బంధువులు వారి నానవాలు పట్టజాలరు. తమ బంధువులతో సంవత్సరములకొలది యెట్టి సంబంధములేని ఖయిదీల ననేకమందిని నేను చూచితిని. మూడు నెలలు దాటినతరువాత జరిగెడి బంధుదర్శనములు చాల యసాధారణముగ నుండెడివి. కొంతమంది ఖయిదీలు వారిబంధువులు నొకగోడ కిరువంకల నుందురు. వారందరు నొక్కసారిగ మాట్లాడయత్నించెదరు. బంధుదర్శనమువలన కలుగవలసిన కొద్దిపాటి మానవస్పర్శ, కేకలుచేతను, అఱపులచేతను పూర్తిగా నశించిపోవును. చాలకొద్దిమంది ఖయిదీలకు, వేయింటికే యొక్కనికో, మంచియాహారములను యెక్కువ యుత్తరములను యెక్కువ బంధుదర్శనముల రూపమున నెక్కువ సౌకర్యములను కలుగచేసెడివారు. గొప్పరాజకీయ సాత్త్వికనిరోధోద్యమసమయమున వేలకొలది జనులు జయిళ్ళను నింపినపుడు ప్రత్యేకతరగతి ఖయిదీల సంఖ్య కొద్దిగ పెరిగెడిది. అప్పటికి నిది చాలతక్కువ. రాజకీయఖయిదీలలో

నూటికి 95 మంది స్త్రీపురుషులు, మామూలువిధముననే చూడబడు దురు. వారికి సౌకర్యములుకూడ నుండవు.

కొందరువ్యక్తులు, విప్లవకార్యములకు యావజ్జీవము లేక దీర్ఘ కాలము శిక్షింపబడినవారు దఱచు చాలకాలమువరకు నొంటరిగా నుంచబడుదురు. యు. పి. లో నిట్టివారినందరిని ఆచారవతుగా నొంటరికొట్టులలో పారవేయుచుందురు. మామూలుగా నీ యొంటరి కొట్టులు జయిలులో చేసిన నేరములకు ప్రత్యేకశిక్షకొరకు నియమింప బడును. కాని యీ వ్యక్తుల సందర్భములో సాధారణముగా చిన్న పిల్లలు — జయిలు వారినడక మార్గదర్శకముగ నుండినను—యొంటరిగ నుంచబడుదురు. కోర్టువారి శిక్షకుతోడు జయిలుశాఖవారు యెట్టి కార ణములను లేకుండ మరియొక భయంకరశిక్ష వేతురు. ఇది చాల యసా ధారణము, న్యాయవిరుద్ధము. కొద్దికాలమైనను యొంటరినిర్బంధము ననుభవించుట దుర్భరము. దానిని సంవత్సరములకొలది పెంచుట భయంకరమైన విషయము. మనస్సును నెమ్మదిగ, నిరంతరాయముగ పిచ్చి పట్టువరకు పాడుచేయుటయే దీనిఫలము. వెఱ్ఱిచూపు, భయ పెట్టబడిన జంతువాలకము తయారగును. అది యాత్మను డిగ్రీ డిగ్రీ చొప్పున చంపుట, దానిని నెమ్మదిగా చెక్క చెక్కలుగా కోయుట, ఒకవేళ యట్టిమనిషి జీవించియున్నను, వికృతమానవుడై యీ ప్రపంచములో నుండతగనివాడగును. ఈ మనిషి యే నేరమైనను, యే దోషకార్యమునైనను చేసెనా ? యను ప్రశ్న యెప్పుడు కలుగు చునేయుండెను. హిందూదేశములోని పోలీసుపద్ధతులు చిరకాలము నుండి సందేహాస్పదములు, రాజకీయ విషయములలో నివి మరింత యధికము. ద్విగుణము. యూరపియను లేక యురేషియను ఖయిదీలు వారి దోషము లెట్టివైనను, వారిబ్రతుకు యెట్టిదైనను, సరాసరి పెద్ద తరగతులలో నుంచబడుదురు. వారికిమృష్టాన్నము, తేలికపని, యెక్కువ యుత్తరములు, బంధుమిత్ర సందర్శనములు మొదలగునవి చేకూ రును. వారము వారము ఫాదిరీవచ్చుచుండుటచే నతనికి బాహ్యప్రపం చముతో సంపర్కముండును. అతడు మంచిమంచి చిత్రములుగలవి దేశ

పత్రికలను, నవ్యోపుట్టించెడు పత్రికలను చదువుచు నవసరమైనపుడు వారి కుటుంబములతో నుత్తర ప్రత్యుత్తరములను జరుపును.

ఈ యూరకపిచును ఖయిదీల కిట్టిసౌకర్యము లున్నందుల కెవ రును దుఃఖించుటలేదు. ఏలనన నవి తక్కువగ నేయున్నవి. కాని యితరుల సందర్భములో – స్త్రీలేమి, పురుషులేమి నెట్టిమానవ ప్రమాణము నెంతమాత్రమును పరిగణింపకపోవుట కొంచెము బాధ కరముగనే యుండును. ఖయిదీ యొక మానవుడుగ భావింపబడక పోవుటచే నతనికి లేక యామె కెన్నడు నట్టిమర్యాద చూపింపబడదు. ప్రభుత్వనిర్బంధ విధానముయొక్క యమానుష ప్రదర్శనము జయిలులో మనకు కాన్పించును. అది యనాలోచితముగ, నిర్లక్ష్యముగ పనిచేయుచు దానిచేతికి చిక్కు ప్రతిదానిని నలిపివేయు దయా శూన్యమగు యంత్రము. ఈ యంత్రమును ప్రస్ఫుటము చేయుటకే జయిలుచట్టము లుద్దేశపూర్వకముగ నిర్మింపబడెను. అభిమానమున్న స్త్రీ పురుషులకు ప్రాప్తమయినపుడీ యాత్మశూన్య పరిపాలన బుద్ధి జాడ్యమును, మనోవ్యధను కలిగించును. దీర్ఘకాల శిక్ష ననుభవించు వారొక్కొక్కప్పుడు తమ వ్యర్థజీవితమునకు భగ్నహృదయులై, చిన్న పిల్లలవలె వెక్కివెక్కి యేడ్చుటను నేను కండ్లారజూచితిని. ఆ వాతావరణములో మచ్చుకైనను కానరాని యొక సానుభూతివాక్యము, ఒక్క ధైర్యవచనము వారి ముఖమండలము నకస్మాత్తుగా సంతోష కృతజ్ఞతతో నింపివేసెడిది.

అయినను ఖయిదీలలోనే భూతదయాళుత్వ సౌహార్ద్రములకు సంబంధించి గుండెను కరగించునిట్టి కథనములు సంభవములు నెన్నియో కలవు. ఒకసారి జయిలు కలవాటుపడిన యొక గ్రుడ్డి ఖయిదీ పదమూడు సంవత్సరములైన తరువాత విడువబడెను. ఇంత దీర్ఘకాలము గతించిన తరువాత నతడు యెట్టియాస్కారము లేకుండ నమిత్రమగు ప్రపంచములోనికి బోవుచుండెను. అతనితోడి ఖయిదీ లతనికి కొంత సహాయము చేయగోరిరి. కాని వారంతగా చేయజాలక పోయిరి. జయిలు ఆఫీసులో దాచుకొనబడిన తనవద్ద నొకడు

యిచ్చెను. మరియొక డింకొక వస్త్రము నిచ్చెను. మూడవ ఖయిదీ కొకనికి యొక క్రొత్త చెప్పులజోడు ఆ యుదయముననే వచ్చెను. అతడు సగౌరవముగా దానిని నాకు చూపించెను. జయిలులో నది యొక గొప్పసొత్తు. కాని చాలకాలమతని సహచరుడుగానున్న యీ గ్రుడ్డిఖయిదీ కాలిజోడు లేకుండా వెళ్ళుట నతడుచూచి తన సరిక్రొత్త జోడు నతనికి హృదయపూర్వకముగ నిచ్చివేసెను. బయటకంటె జయిలులోనే యెక్కువ దయకలదని నే నప్పుడనుకొంటిని.

ఆ వత్సరము 1930 అద్భుతమగు రంగములతో నుత్తేజకరములగు సంభవములతో నిండియుండెను. జాలినంతను మేల్కొలిపి యుత్సాహపూరితులను చేయగలుగు గాంధీజీ యద్భుతశక్తి యాశ్చర్యజనకముగనుండెను. దానిలో నేదో కొంత మంత్రశక్తి యున్నట్లుండెను. 'అతడు మట్టిముద్దలనుండి వీరాగ్రేసరుల నుద్భవింప జేయగల శక్తికలవాడు' అని గాంధీజీనిగురించి గోక్లే యుపయోగించిన పదములు మా కందరకు జ్ఞప్తికివచ్చెను. శాంతియుతశాసనోల్లంఘనము జాతీయపరమావధిని సాధింపగల కార్యక్రమమే యని రుజువగుచున్నట్లు కాన్పించెను. మనము జయమును పొందబోవుచున్నారమను యచంచల విశ్వాసము దేశములో బయలుదేరెను. మన మిత్రులు శత్రువులు కూడ నిట్లేతలంచిరి. ఉద్యమములో నుత్సాహముతో పనిచేయుచున్న వారిలో నొక నూతనోద్రేకము బయలుదేరి, యిది కొంతజయిలులోనికి గూడ ప్రాకెను. మామూలు ఖయిదీలు "స్వరాజ్యము వచ్చుచున్నది" అని చెప్పుచు దానిచే తమకు కొంత లాభము చేకూరగలదను స్వార్థచింతతో దానికొరకు కాతురతతో నెదురుచూచుచుండిరి. జయిలువార్డర్లు, బజారులలోని సంభాషణల నన్నింటిని వినుచు స్వరాజ్యము సమీపస్థమయినట్లే భావించుచుండిరి. చిన్నచిన్న జయిలు ఉద్యోగులు కొంచెము భయపడసాగిరి. జయిలులో మాకు దినపత్రికలు లేవు. ఒక హిందీవారపత్రిక మాకు కొన్ని వార్తల నిచ్చుచుండెడిది. ఈ వార్తలే తఱచు మాయూహలను రగుల్కొల్పుచుండెడివి. నిత్యలాఠీచార్జీలు, అప్పుడప్పుడు కాల్పులు,

షోలాపూరు సైనిక శాసనము, జాతీయజెండాకు పదేసి వత్సరములు శిక్షలు. మన ప్రజలను ముఖ్యముగా స్త్రీలనుచూచి మేము గర్వించెడివారము. నాతల్లి, భార్య, చెల్లెండ్రు, బంధువర్గములోనివారు, స్నేహితులాండ్రు మొదలగువారి కార్యోత్సాహముచే నాకు ప్రత్యేకానందము కలుగుచుండెడిది. నేను జయిలులోనుండి వారికి దూరముగ నున్నను ఒక మహోద్యమములో సహచరులమైతిమను నూతన భావముచే మేము మఱింత స్నేహితులమైతిమి. మాకుటుంబము మరింత పెద్ద బృందములో కలిసిపోయినట్లు కాన్పించెను. అయినను దాని పాతవాసనలు స్నేహము, బాంధవ్యము చెక్కుచెదరక నిలిచియుండెను; కమల యొక్క శక్తి, యుత్సాహము, శరీరదుర్బలత్వమును జయింప గలుగుట నా కాశ్చర్యముగనుండెను. నిరంతరము పనిచేయుచుండినను కొంతకాలమైన యామె స్వస్థముగనుండెను.

బయట ననేకమంది యుపద్రవములను బాధలను పొందుచుండ జయిలులో వారికంటె నే నెక్కువసుఖముగ కాలక్షేపము చేయుచున్నానను భావము నన్ను బాధింపదొడగెను; నేను బయటకు పోగోరితిని. కాని యది యసంభవమగుటచే నే నెప్పుడును పనిచేయుచు నా జయిలు జీవితమును కఠినమొనర్చుకొంటిని. నా స్వంతరాట్నము మీద నేను రోజుకు మూడునాలుగు గంటలు వడికెడివాడను. మరి రెండు మూడుగంటలు జయిలు అధికారులను ప్రత్యేకముగ నడిగి నేను నవారునేత నేసెడివాడను. నా కీ పనులు చాల ప్రీతిగ నుండెడివి. ఎక్కువ శ్రద్ధ యక్కరలేకుండ శ్రమనీయకుండ నవి నాకు పనికల్పించెడివి. అవి నా మనస్తాపమును చల్లార్చుచుండెడివి. నేనెక్కువగా చదువుచుండెడివాడను. తక్కిన కాలములో యిల్లు శుభ్రపరచుకొనుట బట్టలుతుకుకొనుట మొదలగు పనులలో నుండెడివాడను. 'నాకువిడిఖయిదు' అగుటచే నేను పై పనులను స్వంతముగా కోరుకొని చేయుచుండెడివాడను.

జయిలులోని నా నిత్యకృత్యములతోను, పై నజరుగుచున్న సంభవములను గురించిన యోచనలతోను నైనీ జయిలులో నేను నా

రోజులను వెళ్ళబుచ్చుచుంటిని. భారతదేశ జయిలు నిర్వాహణ విధానమును పరిశీలించినపుడు నాకది భారతదేశములోని బ్రిటిషు ప్రభుత్వముకు తగియున్నట్లే కాన్పించెను; ప్రభుత్వపరికరములలో గొప్ప పటుత్వమున్నది. ఇది దేశములోని మానవసంపద నెంతమాత్రమును లక్ష్యముచేయక దేశముమీాద ప్రభుత్వాధికారమును మాత్రము వృద్ధి చేయును. బయటకు జయిలు సమర్థతతో పరిపాలింపబడుచున్నట్లు కాన్పించవలెను. కొంతవరకు నిది సత్యమే! కాని యచ్చటకువచ్చిన దురదృష్ట మానవుల నభివృద్ధిపరచి వారికి సహాయము చేయుటయే జయిలుయొక్క ప్రధానోద్దేశ్యమను సంగతి నెవరును గుర్తించినట్లు కాన్పించదు. వారిని ఛేదించుడు! వేధించుడు! ఇదియే యాశయము. వారు జయిలును విడిచివెళ్ళునరికి వారిలో నావంతయు యుత్సాహము లేకుండ నుండవలెను. జయిలు యెట్లు నియమింపబడుచున్నది? ఖయిదీ లెట్లు అదుపులో నుంచబడి శిక్షింపబడుచున్నారు? చాలవరకు ఖయిదీల సహాయము తోడనే యిది జరుగుచున్నది. వారిలో కొంతమంది ఖయిదీవార్డర్లు (సి. డబ్ల్యూలు) లేక ఖయిదీ ఓవరుసీర్లు (సి. ఒ. లు) గ చేయబడుదురు. భయముచేతను బహుమతులును, ప్రత్యేక తగ్గింపులును (వారిశిక్షలో) దొరుకునను నాశతో వీ రిట్లు చేయుదురు. జీతములు తీసికొని పనిచేయు ఖయిదీలుకాని వార్డర్లు తక్కువగనుందురు. జయిలులో జరుగు కాపలా చాలవరకు ఖయిదీ వార్డర్లచేతను సి. ఒ. ల చేతను జరుపబడును. ఖయిదులో గూఢచారితనము ప్రబలముగనుండును. ఖయిదీలే గూఢచారులుగ నుండ ప్రోత్సహింపబడుదురు. ఖయిదీలలో నెట్టికలయిక సమిష్టి కార్యము జరుగనీయరు. ఇది సులభగ్రాహ్యము. ఏలనన వారిని చీల్చియుంచుటచేతనే వా రదుపులో నుంచబడుచున్నారు. బయట, మన దేశపరిపాలనలోగూడ నీ పద్ధతియే పయికంతగా కాన్పించకపోయినను, మరింత పెద్దయెత్తుమీాద నడచుచున్నది. కాని యచ్చట నున్న సి. డబ్ల్యూ లేక సి. ఒ. లు వేరు విధమున నుందురు. వారికిగొప్ప గొప్పబిరుదులుండును. వారియుద్యోగదుస్తులు యెక్కువ పటాటోప

ముగ నుండును. వారి వెనుక జయిలులోవలెనే, రక్షకభటులు విచ్చు కత్తులతో నెప్పుడు సిద్ధముగ నుండును.

ఆధునిక ప్రభుత్వమునకు జయిలెంత ముఖ్యమైనది, యెంత యవసరమైనది! అథమము ఖయిదీ యిట్లు భావింప మొదలిడును. జయిలులోని ప్రధానధర్మములు, పోలీసు, సైన్యములమందర ప్రభుత్వము యొక్క వివిధపరిపాలనాధర్మములు నిమిత్తమాత్రములుగ కాన్పించును. ప్రభుత్వమును గుప్పిటిలో నుంచుకొనువర్గమువారి యిచ్ఛను చలాయించు నిర్బంధపరికరమే నిజముగ ప్రభుత్వమగుచున్నదను మార్క్సు యను సిద్ధాంతము జయిలులోనున్నవారికి బాగుగ నర్థము కాగలదు. ఒకనెలవరకు నేను నా కొఠారములో నొంటరిగనుంటిని. తరువాత నర్మద ప్రసాదసింగు వచ్చెను. అతనిరాక నాకు ముదావహముగ నుండెను. తరువాత రెండున్నర నెలలకు 1930 జూను ఆఖరు రోజున మా చిన్నయావరణ మసాధరణమగు నుద్రేకమున కాకర మయ్యెను. తలవనితలంపుగా మా తండ్రియు, డాక్టరు సయ్యదుమహమ్మదుగార్లు నచ్చుటకు ప్రాతఃకాలముననే వచ్చిరి. వారా యుదయముననే నిద్రించుచుండ నానందభవనములో నిర్బంధింపబడిరి.

31

ఎఱవాడలో రాయబారము

మా తండ్రిని నిర్బంధించుటతో లేక కొంచెము ముందుగ కాంగ్రెసు వర్కింగుకమిటీ యక్రమసంఘముగ ప్రకటింపబడెను. దీనివలన బయట నొక నూతనపరిస్థితి యేర్పడెను. సభ జరుగుచుండగనే కమిటీసంతయు నొక్కసారిగ నిర్బంధింపబడును. తాత్కాలికాధ్యక్షుల కిచ్చిన యధికారముక్రింద వెంటనే క్రొత్తసభ్యులు జేర్చబడుచుందురు. ఈవిధముగ ననేకమంది స్త్రీలు తాత్కాలిక సభ్యురాండ్రయిరి. కమల వారిలో నొకతె.

తండ్రిగారు జయిలుకు వచ్చుసరికి చాలా యనారోగ్యముగ నుండిరి. అచ్చటనున్న పరిస్థితు లతని కెంతమాత్రము సరిపడలేదు. ప్రభుత్వమువారు వీనిని బుద్ధిపూర్వకముగ కల్పించలేదు. అతనికి కలుగు నసౌఖ్యములను తగ్గించుటకు వారు చేయగలిగినదంతయు చేయుటకు సిద్ధముగనే యుండిరి. కాని నైనీజయిలులో వారంతగా చేయజాలకపోయిరి. నా కొఠారులోని నాలుగు చిన్నగదులలోను యిప్పుడు మమ్ము నలుగురను క్రుక్కిరి. తండ్రిగారిని వేరొకచోట మరింత విశాలమైనప్రదేశములో నుంచెదనని జయిలు సూపరింటెండెంటు సూచించెను. కాని మాలో కొంతమంది యతనికి స్వయముగ సేవచేయుటకు వీలుగానుండుటకు మే మొకచోటనే యుండగోరితిమి.

వర్షకాలమప్పుడే ప్రారంభమగుచుండెను. పైకప్పులోనుండి వర్షమచ్చటచ్చట కురియుచుండుటచే గదులలోకూడ పూర్తిగ పొడిగ నుండుట యసంభవముగనుండెను. రాత్రివేళ నతనిప్రక్క నెచ్చట వేయుట యనున దొక నిరంతరసమస్య యగుచుండెను. ఒక్కొక్కప్పు డతనికి జ్వరము వచ్చెడిది. చివరకు మా గదిదగ్గర మరియొక విశాలమగు వరండా నిర్మింపబడెను. ఈ వరండా బాగుగనే యుండెను. కాని

యిది తయారయిన వెంటనే మాతండ్రి విడిచివేయబడెను. మేము దీనిలాభమును బాగుగపొందితిమి.

జూలై మాసాంతమున ప్రభుత్వమునకు, కాంగ్రెసుకు మధ్య సర్. తేజబహుదూర్ సప్రూ, యం. ఆర్. జయకరుగార్లు రాయబారములను నడుపుచున్నట్లు వదంతులు బయలుదేరెను. తండ్రిగారికి ప్రత్యేక ప్రసాదముగా పంపబడుచుండెడి యొక వార్తాపత్రికలో నేమి విషయములను చదివితిమి. వైస్రాయియైన యిర్వినుప్రభువుకును, సప్రూ, జయకరులకును మధ్యజరిగిన యుత్తర ప్రత్యుత్తరములను కూడ నీ పత్రికలో చదివితిమి. తరువాత నీ 'సంధిచేయువారు' గాంధీజీని సందర్శించిరని వింటిమి. ఇట్లు పూనుకొని వచ్చుటకు వారి నేదిప్రోత్సహించెనో, లేక వారు దేనికొరకు ప్రయత్నించుచుండిరో మా కిసుమంతయు తెలియదు. తండ్రిగారు తమనిర్బంధమునకు కొద్దిరోజులుపూర్వము బొంబాయిలో నిచ్చిన యొక చిన్న స్టేట్మెంటు తమ కిట్టిప్రోత్సాహము నిచ్చెనని తరువాత వారు మాకు చెప్పిరి. మాతండ్రిగారితో సంప్రదించినమీాదట స్లోకోంబుగారు దీనిని వ్రాసిరి. మాతండ్రి దీనినామోదించెను. ప్రభుత్వము కొన్ని షరతుల కంగీకరించినచో కాంగ్రెసు శాసనోల్లంఘనమును ఆపివేయుట కవకాశము లుండునని ఈ స్టేటుమెంటు భావించెను. అది నిర్దిష్టములేని తాత్కాలిక వ్యవహారము. తండ్రిగారు గాంధీజీని, నన్ను సంప్రదించుట కవకాశమున్నగాని ఈ నిర్దిష్టములేని షరతు యోచింపబడనేరదని యది స్పష్టపరచెను. ఆ వత్సరము నేను కాంగ్రెసుప్రెసిడెంటు నగుటచే నాపేరుకూడ జేరెను. తండ్రిగారు నిర్బంధింపబడిన తరువాత, నైనీజయిలులో నాకీ సంగతిచెప్పిరి. తొందరలో తానట్టి యనిర్దిష్ట స్టేటుమెంటు నిచ్చితిననియు, దాని కపార్థములు కల్పింపబడవచ్చుననియు నతడు సవిచారముగ తెల్పిన సంగతి నాకు జ్ఞప్తియుండెను. దీనికి నిజముగా నపార్థము కల్పింపబడెను.

గాంధీజీయొద్ద చీటితీసికొని సప్రూ, జయకర్లు జూలై యిరువదియేడవతేదీ హఠాత్తుగా మా జయిలులో వ్రాలిరి. ఆ దినము మరునాడు నేము వారితో దీర్ఘసంభాషణలను జరిపితిమి. తండ్రిగా రప్పుడు జ్వరముతో నుండుటచే నివి చాల యలసట కలిగించెను. మా సంభాషణలు, వాగ్వాదములు తిలఘాతకురాలి చక్రభ్రమణము వలె తల తోక లేకుండ నొకరికొకరి కర్థముకాని భావములోను, భాషలోను జరిగెను. రాజకీయదృష్టిలో మా కంతగొప్ప భేదముండెను. ప్రభుత్వముకు, కాంగ్రెసుకు మధ్య సంధిజరుగుట కావంతయు నవకాశము లేదని మాకు విశదమయ్యెను. వర్కింగుకమిటీ సహచరులతో ముఖ్యముగా గాంధీజీతో, మొదట సంప్రదించకుండ నేమెట్టిసూచనను చేయనిరాకరించితిమి. గాంధీకికూడ నీయర్థమువచ్చునట్లే వ్రాసిపంపితిమి.

పదకొండురోజులయిన తరువాత ఆగస్టు యెనిమిదవ తేదీని డాక్టరు సప్రూ వైస్రాయి ప్రత్యుత్తరముతో మమ్ముచూచుటకు తిరిగివచ్చిరి. మేము యరవాడ వెళ్ళుటకు వైస్రాయి కభ్యంతరము లేదు. కాని బయటనుండి ప్రభుత్వముతో నింకను తీవ్రముగ పోరు సల్పుచున్న వల్లభాయిపటేలు, అబ్దుల్ కలాం అజాదు మొదలగు వర్కింగుకమిటీ సభ్యులను కలుసుకొనుటకు వైస్రాయియు, నతని కౌన్సిలుసభ్యులును అంగీకరింపజాలరని చెప్పి, యీ పరిస్థితులలో యరవాడ వెళ్ళుట కిచ్ఛగింతురా యని సప్రూగారు మమ్మడిగిరి. గాంధీజీ నెప్పుడైనను చూడబోవుటకు మాకెట్టి యభ్యంతరములేదనియు నుండజాలదనియు నే మితరసహచరులను కలుసుకొనుటకు వీలులేకపోవుటచే నేమెట్టి తుదినిర్ణయము చేయజాలమనియు నతనితో చెప్పితిమి.

ఆనాటి పత్రికయే (లేక పూర్వపురోజుపత్రిక) బొంబాయిలో భయంకరమగు లాఠీచార్జి జరిగెనని వల్లభాయిపటేలు, మాలవ్యాజీ, సదర్ షెర్వానీ మొదలగువారు వర్కింగుకమిటీయొక్క తాత్కాలిక సభ్యులుగనో, శాశ్వత సభ్యులుగనో, నిర్బంధింపబడిరని తెలిపెను.

దీనివలన పరిస్థితులేమియు చక్కబడ లేదనియు నీస్థితిని వైస్రాయికి స్పష్టముగ నెరింగింపవలసినదనియు మేము సప్రూగారితో చెప్పితిమి. ఏది ఎట్లున్నను గాంధీజీని సాధ్యమైనంత త్వరలో కలుసుకొనుటలో నుపద్రవమేదియు లేదని సప్రూగారనిరి. మేము యరవాడ వెళ్ళవలసి వచ్చినచో నైనీ జయిలులోనున్న డాక్టరు సయ్యాదు మహమ్మదు, కాంగ్రెసు శక్రటరీ యగుటచే మాతో కూడ రావలసియుండునని మే మిదివరకే సప్రూగారితో చెప్పియుంటిమి. రెండు రోజులయినతరువాత మేము ముగ్గురము ఆగష్టు పదియవ తేదీని ప్రత్యేకరైలుబండిలో నైనీ నుండి పూనా తీసికొనిపోబడితిమి. మారైలు పెద్దస్టేషనులవద్ద ఆగక ప్రక్కనున్న చిన్నచిన్న స్టేషనులవద్ద ఆగుచుండెను. అయినను ఈవార్త వాయువేగమున ప్రసరించి జనులు గుంపులు గుంపులుగ ప్రతి స్టేషనుకు మా బండి యాగినను, ఆగకపోయినను రాదొడగిరి. పదకొండవ తేది రాత్రి ప్రొద్దుపోయినతరువాత పూనా సమీపమున నున్న కిర్కి చేరితిమి.

గాంధీజీయున్న కొఠారములోనే మమ్ముంచెదరనియు లేదా యతనిని వెంటనే చూతుమనియు మే మనుకొంటిమి. యరవాడ జయిలు సూపరింటెండెంటు యిట్టియేర్పాటు చేసెను. కాని నైనీనుండి మాతో వచ్చిన పోలీసు యుద్యోగి తెచ్చిన సందేశము ప్రకార మతడు చివరనిమిషములో తనయేర్పాటులను మార్చుకొనెను. సూపరింటెండెంటు కలనల్ మార్టినుగారు రహస్యమును దాచిపెట్టిరి. కాని తండ్రిగారు వేసిన యుక్తిప్రశ్నలవలన మేము మొట్టమొదట సప్రూ జయకరుల సమక్షముననే గాంధీజీని కలుసుకొనవలెననుభావము స్పష్టమయ్యెను. మేము ముందుగా కలుసుకొనినచో మా దృష్టి మరింత బిరబిగియుననియు లేదా మేమంతకు మునుపటికంటె గట్టిపడుదుమనియు వారు భయపడిరి. కనుక నా రాత్రియు మరుసటి రాత్రింబవళ్ళును మమ్ము వేరొక ప్రత్యేక కొట్టులోనుంచిరి. తండ్రిగారి కిది చాల కంపరముగనుండెను. నైనీ నుండి యింతదూరము నతడెవరిని కలుసుకొనుటకు వచ్చెనో యట్టిగాంధీజీని కలుసుకొననీయక యాశాభంగ

మొనరించుట మనోవ్యథగ నుండెను. పదమూడవ తేదీ యుదయము సప్రూ జయకర్లు వచ్చిరనియు, గాంధీజీ జయిలు ఆఫీసులో వారిని కలుసుకొనెననియు మమ్మచ్చటకు రాఁగోరిరనియు వర్తమానము వచ్చెను. తండ్రిగారు వెళ్ళుటకు నిరాకరించి, యనేక సమాధానములు క్షమార్పణలు చెప్పినమీఁదట మొదట గాంధీజీ నొక్కనినే చూచు షరతుమీఁద దీని కంగీకరించెను. తరువాత మా యందరికోరికపయి నన్ను యరవాడకు తీసికొనిరాబడిన వల్లభాయిపటేలు, జయరామదాసు డాలత్ రామ్‌గార్లను, యెదుట స్త్రీల జయిలులో నుంచబడిన సరోజినీ దేవిని, మా కాన్ఫరెన్సులో కలియనిచ్చిరి. ఆ సాయంత్రము మా తండ్రిని, నన్ను, సయ్యదు మహమ్మదును గాంధీజీ యావరణలోనికి మార్చిరి. తరువాత మేము యరవాడలో నున్నంతకాలము అచ్చటనే యుంటిమి. వల్లభాయిపటేల్ జయరామ్‌దాస్ డాలత్ రామ్‌గార్లు కూడ నచ్చటనే, యా కొద్దిరోజుల సలహా సంప్రదింపుల కొరకు నుంచబడిరి.

సప్రూజయకరులతో మా కాన్ఫరెన్సులు మూఁడురోజులు జరిగెను. మా యభిప్రాయములను వెల్లడించుచు శాసనోల్లంఘన మాపివేసి, ప్రభుత్వముతో సహకార మొనర్చుటకు మా కనీసపు షరతులను తెలుపు యుత్తరములను మార్చుకొంటిమి. ఈ యుత్తరములు తరువాత పత్రికలలో ప్రకటింపబడెను♦

ఈ కాన్ఫరెన్సుల పరిశ్రమవలన తండ్రిగారికి హఠాత్తుగా 16వ తేదీన చాల హెచ్చు జ్వరము తగిలెను. దీనిచే మా ప్రయాణ మాలస్యమయ్యెను. మేము 19వ తేదీరాత్రి తిరిగి ప్రత్యేక రైలులో నైనీ పయనమైతిమి. బొంబాయి ప్రభుత్వమువారు తండ్రిగారి సుఖ ప్రయాణమున కన్ని యేర్పాటులను గావించిరి. యరవాడలోనున్న కొద్ది రోజులలోకూడ నతని సౌఖ్యములనుగురించి ప్రత్యేకశ్రద్ధ తీసికొనబడెను. యరవాడలో మేము దిగిన నాటిరాత్రి జరిగిన యొక చిన్న వినోద విషయము నాకు జ్ఞాపకమున్నది. సూపరింటెండెంటు అగు

♦ కనీసపు షరతులను తెల్పు యుత్తరములు రెండవ అనుబంధములో కలవు.

కల్నల్ మార్టిన్‌గారు మా తండ్రిగారి కెట్టియాహారము ప్రీతిగ నుండునో ప్రశ్నించెను. తండ్రిగారు తనకు సరసమైన తేలిక యాహారము కావలెనని చెప్పుచు ప్రాతఃకాలము ప్రక్కనుండి లేచుట తోడనే తీసికొను తేనీరు లగాయతు రాత్రి భోజనమువరకు నతనికి కావలసిన వివిధోపహారములను వివరించిచెప్పెను. తండ్రిగా రతినిరాడంబరముగ నమాయికముగ నిచ్చిన జాబితాలో తేలికయైన యాహారములే యున్నమాట నిశ్చయము. కాని యది దర్పముగనుండెను. తండ్రిగారు విశ్వసించినట్లే సెవాయిహోటలులోగాని, రిట్జులోగాని యది నిరాడంబరము, సామాన్యమైన యాహారముగనే భావింపబడును. కాని యఱవాడజయిలులో నిది వింతగ, ననుచితముగ, దూరవిషయముగ కాన్పించెను. తండ్రిగారు తన యాహారముకొరకు కావలసిన విలువయైన వివిధవస్తువులను వివరించుచుండ కల్నల్ మార్టినుగారి ముఖలక్షణములను నేను, మహమ్మదు వినోదముగ పరిశీలించుచుంటిమి. అతడు భారతనాయకులలో నత్యుత్తముడు, కీర్తివంతుడు నగువానిని చాలకాలమునుండి తనరక్షణలో నుంచుకొనెను. అతనికి కావలసిన యాహారమంతయు మేకపాలు, ఖర్జూరపుకాయలు, బహుశః అప్పుడప్పుడు నారింజకాయలు. ఇప్పు డతని యొద్దకువచ్చిన క్రొత్తజాతి నాయకుడు విడ్డూరమైనవాడు.

మేము పూనానుండి నైనీ తిరిగి వెళ్ళునపుడు మరల పెద్ద స్టేషనులలో నాగకుండ మూలమూలప్రదేశములలో నాగుచుంటిమి. గుంపులు వెనుకటికంటె నధికమయి ప్లాటుఫారములను నింపుచు, రైల్వేలైను పొడుగునను, ముఖ్యముగా వార్థా, ఇటార్సీ, సాహాన్పూరులలో, తేనెపట్టులవలె మూగుచుండిరి. అపాయములు కొంచెములో దాటిపోవుచుండెను. తండ్రిగారిస్థితి యంతకంత కధ్వాన్నమగుచుండెను. అతని స్వంతడాక్టర్లు, రాష్ట్రప్రభుత్వముచే నియమింపబడిన డాక్టర్లు ననేకమంది యతనిని పరీక్షించిరి. అతనికి జయిలు అధమాధమగు ప్రదేశమని స్పష్టమయ్యెను. అచ్చట నతనికి యుచితమగు వైద్యసహాయము లభింపదు. అయినను పత్రికలలో నొక

స్నేహితుడు అనారోగ్యకారణముచే నతనిని విడిచిపెట్టవలెనని సూచించినపు డతనికి కోపము కలిగెను. తాను చేసినట్లే ప్రజలు భావింతురని యతని భయము. ప్రత్యేక పక్షపాతదృష్టితో తనను విడిచిపెట్టవలదనికూడ నతడు ఇర్విన్‌ప్రభువుకు తంతిపంపెను. కాని, యతనిస్థితి దినదినము పాడగుచుండెను. అతిత్వరితముగ నతనిబరువు తగ్గుచు నతనియాకారము మిగిలెను. సెప్టెంబరు 8వ తేదీని సరిగా పదివారములు జయిలు జీవితమయినతరువాత నతనిని వెడచిపెట్టిరి.

అతడు వెళ్ళిపోవుటతోడనే మా కొఠారము నిస్తేజము, నిర్జీవము నగు ప్రదేశమయ్యెను. అతడు మాతో నుండునపుడు మా కెంతయో పనియుండెడిది. అతనిసౌఖ్యమును పెంచుటకు మే మందరము-నర్మదాప్రసాదు, మహమ్మదు, నేను-చిన్న సేవలను చేయుచు మాదినముల నీ సంతోషావహమగు సేవతో నింపెడివారము. నేను నవారునేత మానివేసితిని. కొద్దిగా నూలు వడికెడివాడను. పుస్తకములను చదువుటకు నా కంతతీరికయుండెడిదికాదు. ఇప్పు డతడు వెళ్ళిపోవుటతోడనే మేము తిరిగి అయిష్టముగను, సంతోషశూన్యముగను మామూలునిత్యకృత్యములకు దిగితిమి. తండ్రిగారి విడుదలతో దినపత్రికకూడ నాపివేయబడెను. నాలుగైదు రోజులయినతరువాత మా బావమఱది రంజిత యస్. పండిట్ నిర్బంధింపబడి మా కొఠారముకే పంపబడెను. ఒక నెల యయినతరువాత, అక్టోబరు 11వ తేదీని, నా యారు మాసముల శిక్షాకాలము పూర్తియగుటచే నన్ను విడిచిరి. సంగ్రామ మింకను జరుగుచుండుటచేతను, తీవ్రతరమగుచుండుటచేతను నా కంత స్వేచ్ఛయుండదని నే నెరుగుదును. 'సంధికారకుల' ప్రయత్నములు వ్యర్థమయ్యెను. నన్ను విడిచిపెట్టినరోజుననే మరియొకటి రెండు ఆర్డినెన్సులను విడిచిపెట్టిరి. నేను బయటపడుటకు సంతోషించి నాకు దొరకు కొద్దిగడువులోనే గట్టికృషి చేయుట కాతురపడుచుంటిని.

కమల యప్పుడు యలహాబాదులో కాంగ్రెసుసేవలో మగ్నురాలై యుండెను. తండ్రిగారు ముస్సోరిలో నౌషధసేవ చేయుచుండిరి. నాతల్లియు చెల్లెండ్రు ఆయనతో నుండిరి. నేను అలహా

బాదులో నొకటెన్నర రోజులు చకచకపనిచేసి కమలతో ముస్సోరి వెళ్ళితిని. గ్రామసీమలలో పన్నుల నిరాకరణోద్యమమును ప్రారంభింప వచ్చునా కూడదా యను గొప్పసమస్య మమ్మెదుర్కొనెను. శిస్తులను పన్నులను చెల్లింపవలసిన సమయమాసన్నమయ్యెను. వ్యవసాయ దినుసుల ధరలన్నియు విపరీతముగా పడిపోవుటచే నెట్టైనను పన్నులు చెల్లుట చాలకష్టతరముగనుండెను. ప్రపంచ ఆర్థిక మాంద్య మిప్పుడు హిందూదేశములో స్పష్టముగ కాన్పించుచుండెను.

శాసనోల్లంఘనములో నొకభాగమును, స్వతంత్రముగ దాని నిజపరిస్థితినిబట్టియు పన్నుల నిరాకరణము ప్రారంభించుట కది దివ్యమైన శుభముహూర్తము. భూఖామందులు సేద్యముచేయు వ్యావసాయకులుగూడ నా సంవత్సరాదాయమునుండి పూర్తి పన్నులు చెల్లించుట యసాధ్యముగ నుండెను. దాచుకొనిన దేమైనను న్నచో వారు దానిని కక్కవలెను లేదా ఋణముచేయవలెను. జమీందారులకు సాధారణముగ వెనుక నేదోకొంతయుండును. లేదా వారెక్కువసుల భముగా నప్పుచేయగలరు. ఎప్పుడు దరిద్రము, కరవుచేత బాధపడు వ్యవసాయదారు వెనుక నేమియునుండదు. అట్టిపరిస్థితులలో ప్రజాస్వామిక దేశములో లేక వ్యవసాయదారులకు క్రమమైన సంస్థలు మంచి పలుకుబడి యున్నచోట వారిదగ్గర నెక్కువగా వసూలు చేయగలుగుట కేవల మసాధ్యము. హిందూదేశములో వారి పలుకుబడి, దేశములో కొన్నిచోట్ల కాంగ్రెసువారి కండగానున్నచోట్లతప్ప, యత్యల్పము. పరిస్థితులు దుర్భరమగుచో వ్యావసాయిక తిరుగుబాటు కలుగునను నిరంతరభయము మాత్రము కలదు. కాని వారనేక పురుషాంతరములనుండి చెప్పుకొనకుండ నెట్టిదుస్థితినైన దిగమ్రింగుచుండుట కలవాటుపడిరి. ఆ సమయములో గుజరాతులోను, మరికొన్ని ప్రాంతములలోను పన్నుల నిరాకరణోద్యమ మభివృద్ధిలో నుండెను. కాని యవియన్నియు శాసనోల్లంఘనములోని భాగములు; కేవల రాజకీయోద్యమములు. ఇవి రైతువారీపద్ధతిగలప్రాంతములు; రైతులే ప్రత్యక్షముగ ప్రభుత్వముతో సంబంధము కలిగియుందురు. వారి

పన్నులనిరాకరణము వెంటనే ప్రభుత్వమునకు నష్టము కలిగించెను. సంయుక్తపరగణాలసంగతి వేరు. మాది జమీందారీ తాలూకుదారీ ప్రాంతము. వ్యవసాయదారులకు, ప్రభుత్వముకు మధ్యనిచ్చటమధ్యవర్తిపి మరిరెయొకడుండును. వ్యవసాయదారులు శిస్తులను చెల్లించుట మాని వేసినచో జమీందారులకు దెబ్బతగులును. ఈ విధముగ తరగతులకు చెందినసమస్యకూడ బయలుదేరెను. కాంగ్రెసు మొత్తము మీద, కేవలము జాతీయసంస్థ. ఇందులో చాలమంది మధ్యరకము జమీందారులు, కొద్దిమంది పెద్దజమీందారులు కలరు. తరగతుల మధ్య పోరాటము జమీందారులకు కోపము కల్గించు విషయమును పురస్కరించుకొని వచ్చుటకు దానినాయకు లత్యంతభయపడుచుండిరి. కనుక వారు శాసనోల్లంఘనమారంభమైన మొదటి యారుమాసములలోను. పరిస్థితులు దీనికెంతయు ననుకూలముగనున్నట్లు నాకు కాన్పించినను గ్రామములలో పన్నుల నిరాకరణోద్యమము ప్రోత్సహింపరైరి. ఈ విధముగగాని మరేవిధముగగాని తరగతులలోని సమస్యలను లేవదీయుటకు నేను వెరువలేదు. కాని కాంగ్రెసు, దానిస్థితినిబట్టి, తరగతులమధ్య పోరాటమును ప్రోత్సహింపజాలదని నేను గుర్తించితిని. అయినప్పటికి, యది జమీందారులను రయితులనుగూడ పన్నుల నీయవలదని ప్రోత్సహింపవచ్చును. సామాన్యజమీందారు ప్రభుత్వము కీయవలసిన కట్టుబడిని బహుశః చెల్లింపవచ్చును. కాని యది యతని దోషమేయగును.

అక్టోబరులో నేను జయిలునుండి బయటకు వచ్చునరికి రాజకీయ ఆర్థికపరిస్థితులు రెండు గ్రామములలో పన్నుల నిరాకరణమును వాంఛించుచున్నట్లు నాకు కాన్పించెను, వ్యవసాయదారుల ఆర్థిక కష్టములు తేటతెల్లముగ నేయుండును. రాజకీయముగ, మన శాసనోల్లంఘన కార్యక్రమమింకను ప్రతిచోట విజృంభించుచున్నను, కొంచెము చప్పబడుచుండెను. జనులు కొద్దికొద్దిగ, నొక్కొక్కప్పుడు గుంపులుగ, జయిలుకు వెళ్ళుచునేయుండిరి. కాని వాతావరణములోని వేడిచల్లారెను. హర్తాళములతోను, యుత్సవములతోను, పట్టణములు, మధ్యతరగతులవారు కొద్దిపాటివిసిగిరి. ఉత్తేజముకలిగించున దేదియో

యొక్కటియుండవలెను. క్రొత్తరక్తము పొంగవలెను. రయితులనుండి కాక నిది మరెచ్చటనుండిరాగలదు? అచ్చట మనకు కావలసినంత జవస్తోమతకలదు. మరియునది ప్రజాసామాన్య ప్రయోజనములకు చెందిన ప్రజల యుద్యమము. నా దృష్టిలో నతిముఖ్యమైన సాంఘికసమస్యలను లేవదీయవలెను.

అలహాబాదులోనున్న రోజున్నరలో నా సహచరులు, నేను దీనినిగురించి చర్చించితిమి. స్వల్పగడువులో మే మచ్చట మా రాష్ట్రి కాంగ్రెసువర్కింగుకమిటీ సభనుజరిపి, చాలాకాలము తర్జనభర్జనచేసిన తరువాత శాసనోల్లంఘనమున కనుజ్ఞయిచ్చుటకు నిశ్చయించి యేజిల్లాయయినను దానిని నడిపించుకొనుట కధికారమిచ్చితిమి. రాష్ట్రిములో నెచ్చటను మేమే దానిని ప్రకటింపలేదు. తరగతులమధ్య పోరాటమును లేకుండచేయుటకు కార్యనిర్వాహకవర్గమువారు దీనిని జమీందారులకు రయితులకుగూడ వర్తింపచేసిరి. ప్రధానమగు సమాధానము రయితులనుండియే వచ్చునని మే మెరుగుదుము.

ముందడుగు వేయుట కిట్టి యనుజ్ఞ బడసినతరువాత మా అలహాబాదు జిల్లాయే మొట్టమొదటియడుగు వేయగోరెను. యీ నూతనోద్యమమున కొకవికాసము కలుగజేయుటకు వారమురోజులయిన తరువాత బాధ్యతగల రయితు మహాసభ నొకదానిని జరుపుటకు మేము నిశ్చయించితిమి. జయిలునుంచి వచ్చిన ప్రథమదినముననే నేను తృప్తికరమగు పనిచేసితినని భావించితిని. దీనికితోడు అలహాబాదు పట్టణములో నే నొక పెద్ద బహిరంగసభలో దీర్ఘముగ నుపన్యసించితిని. ఈ యుపన్యాసములకే తరువాత నేను తిరిగి శిక్షింపబడితిని.

తరువాత అక్టోబరు పదమూడవతేదీని కమల నేను తండ్రిగారితో మూడురోజులుగడుపుటకు ముస్సోరీవెళ్ళితిమి. అతడు కొంచెమారోగ్యముగనున్నట్లు కాన్పించెను. సుగుణముగనుండెనని వ్యాధి తగ్గుచున్నదని భావించి నే నందుకు సంతసించితిని. ప్రశాంతమును, సంతోషప్రదమునగు ఆ మూడుదినములు నా కెప్పుడు జ్ఞప్తియందుండును. స్వగృహ మెంత సౌఖ్యదాయకము! నా కుమార్తె ఇందిర, నా చెల్లెండ్రు - ముగ్గురు ఆడుబిడ్డలు నచ్చటనేయుండిరి. నేను పిల్ల

లతో నాడుకొనెడివాడను. ఒక్కొక్కప్పుడు మే మందరమును యింటిచుట్టు నతిదర్పముగా నొక పెద్ద యుత్సవము జరిపెడివారము. అందరిలో చిన్నదియగు మూడు నాలుగేండ్లబిడ్డ మా జెండాకీర్తన యగు, 'జెండా ఊంచా రహే హామారా' (మా జెండా గగనమార్గమున నెగురును గాక) యను కీర్తనమును పాడుకొనుచు యుత్సవమును నడుపుచుండెడిది. మృత్యుదంష్ట్రికరాళములను తెఱచుకొని వచ్చిన యీ వ్యాధి మా తండ్రిని నాయొద్దనుండి యపహరించుటకు ముందు నే నతనితో నా మూడుదినముల నే గడిపితిని. నేను వెంటనే నిర్బంధింపబడుదునని పసిగట్టి, బహుశః నన్నింకను మరికొంచెము చూడనెంచి, మా తండ్రి యలహాబాదు తిరిగివచ్చుటకు హఠాత్తుగా నిశ్చయించుకొనెను. 19 వ తేదీన అలహాబాదులో జరుగనున్న రయితు మహాజనసభ కందుకొనుటకు కమల నేను పదిహేడవ తేదీని ముస్సోరినుండి దిగితిమి. తండ్రిగారు, తక్కినవారితో, మరునాడు వచ్చుట కేర్పాటు గావించుకొనిరి.

మా గృహోన్ముఖప్రయాణము కొంత యుద్రేకజనకముగ నుండెను. నేను డేరాడూను విడుచుచుండగా 144 వ శెక్షను నాపైన నమలుజరుపబడెను. లక్నోలోకూడ నాపై మరియొక ఆర్డరు 144 వ శెక్షను క్రింద బనాయింపబడెనని వింటిని. వేలకొలది జనము మూగుటచే పోలీసుఆఫీసరు దానిని నా కందజేయజాలక పోయెను. మున్సిపాలిటీవారు నా కొక వినతిపత్రము సమర్పించిరి. తరువాత మోటారులలో మేము అలహాబాదు వెళ్ళితిమి. త్రోవలో ననేకమంది రయితు మహాజనుల కుపన్యసించుటకు అనేకచోట్ల నాగుచు 18 వ తేదీ రాత్రికి అలహాబాదు చేరుకొంటిమి.

19 వ తేదీ యుదయము నాపై మరియొక ఆర్డరు (144 వ శెక్షను క్రింద) సిద్ధమయ్యెను. ప్రభుత్వమువారు నన్ను వెంటాడించుచున్నారను సంగతి విదితమగుచునే యుండెను. నే నిక కొన్నిగంటలలో నుంటిని. నేను తిరిగి నిర్బంధింబడులోపల కిసాను సభకు హాజరు కావలెనను సత్కాంక్షతో నుంటిని. మేము దీనిని ప్రతినిధుల రహస్య

సమావేశమేయని ప్రకటించి యల్లే పరాయివారినెవరిని దానిలోనికి రానీయలేదు. అది యలహాబాదు జిల్లాకు కూలంకషమైన ప్రాతినిధ్యమును వహించెను. నాకు జ్ఞప్తియున్నంతవరకు అందులో 1600 మంది ప్రతినిధులుండిరి. జిల్లాలో పన్నుల నిరాకరణమును ప్రారంభించుట కత్యుత్సాహముతో సభలో తీర్మానింపబడెను. మా ప్రధాన నాయకులలో మాత్రము కొంత సందేహముండెను. ఇట్టి సాహసకార్యము జయప్రదమగునా యను సందేహము. ఏలనన పెద్దజమీందారుల పలుకుబడి, యధికారము ప్రజలను భయోత్పాతములో ముంచివేయు నంత యధికముగా నుండెను. ప్రభుత్వమువారు వారి కండగనుండిరి. రయితులు యీ ఢాక కాగగలరా? కాని హాజరయిన పదునాలు వందలమంది రైతుప్రతినిధులలోను సందేహము సంశయము యానంతయు లేదు. అధమము అది పయికి కాన్పించలేదు. ఆ సభలో మాట్లాడినవారిలో నేనొకడను. దీనివలన బహిరంగసభలో మాట్లాడకూడదని నాపై జారీచేయబడిన 144 వ సెక్షనును ధిక్కరించితినో లేదో నాకు తెలియదు.

తరువాత నేను నా తండ్రిని తక్కిన కుటుంబమును తీసుకొని వచ్చుటకు స్టేషనుకు వెళ్ళితిని ఆనాడు బండి యాలస్యమయ్యెను. వారు వచ్చుటతోడనే రయితులకు పట్టణవాసులకు సంబంధించిన యొక సభలో నుపన్యసించుటకు నేను వారిని విడిచి వెళ్ళితిని. కమలయు నేనును చాల డస్సిపోయి యా సభనుండి రాత్రి యెనిమిదిగంటలకు తిరిగి వచ్చుచుంటిమి. నేను తండ్రిగారితో మాట్లాడవలెనని కుతూహలపడుచుంటిని. అతడు తిరిగివచ్చినతరువాత మేము తిన్నగా మాట్లాడుకొనకపోవుటచే నతడు నా కొర కెదురు చూచుచుండునని నే నెరుగుదును త్రోవలో మా మోటరు మా యింటికి కనుచూపు మేరలో నాపివేయబడెను. నన్ను నిర్బంధించి యమునాతరంగిణిని దాటించి నైనీలో నా మామూలుబసకు తీసికొనిపోయిరి. మా కొర కెదురు చూచుచున్న కుటుంబమునకీ క్రొత్త సమాచారము తెల్పుటకు కమలయొక్కతెయే ఆనందభవనమునకు వెళ్ళెను. సరిగా 9గం.లు కొట్టుసరికి నేను నైనీజయిలు సింహద్వారమును తిరిగి ప్రవేశించితిని.

32

సంయుక్తరాష్ట్రములలో పన్నుల నిరాకరణము

ఎనిమిదిరోజుల తరువాత నేను తిరిగి నైనీజయిలులో నా యెప్పటి పాతకొఠారులో సయ్యదు మహమ్మదు, నర్మదా ప్రసాదు, రంజిత్ పండిట్ గార్లను కలుసుకొంటిని. కొన్నిరోజులయిన తరువాత నేను విడుదలబడిన మరునాడు అలహాబాదులో నే నిచ్చిన యుపన్యాసములోని యనేకభాగముల కనేకచార్జీలు తయారుచేసి జయిలులోనే నన్ను విచారణచేసిరి. నేను వాదించుకొనక కోర్టులో నొక చిన్న స్టేటుమెంటు నిచ్చితిని. 124 ఎ సెక్షన్ క్రింద రాజద్రోహమునకు నాకు 18 మాసములు కఠినశిక్షయు 500 రూపాయలు జుల్మానా విధించిరి. 1882 లోని యుప్పుచట్టముక్రింద నారుమాసములు రు 100 లు విధించిరి. 1930 లోని యారవ ఆర్డినెన్సుక్రిందకూడ నారుమాసములు, 100 రూపాయిలు విధించిరి. చివర రెంటిని యేకకాలమందే యనుభవింపవలెను. కనుక మొత్తము రెండుసంవత్సరములు కఠినశిక్షయు, జుల్మానాలు చెల్లింపనందుకు మరియైదుమాసములు అనుభవింపవలెను. ఇది నా కయిదవపర్యాయము. అయిదవశిక్ష.

నన్ను తిరిగి నిర్బంధించుటయు, శిక్షించుటయు శాసనోల్లంఘనోద్యమ స్వభావమును తాత్కాలికముగా కొంత మార్చగలిగెను. అది మరికొంత యుత్సాహమును, శక్తిని ప్రదర్శించెను. దీనికి చాలవరకు తండ్రిగారే కారకులు. నా నిర్బంధమునుగురించి కమల చెప్పినపు డతనికి కొంచెము విచారముకలిగెను. వెంటనే యతడు కోలుకొని తన ముందరనున్న బల్ల గ్రుద్ది తానిక వ్యాధిగ్రస్తుడుగ నుండజాలనని గర్జించెను. అతడారోగ్యవంతుడుగనుండి వ్యాధికి లొంగక వీరకార్యమును చేయబోవుచుండెను. అది ధైర్యమైన నిశ్చయమే, కాని లోపలనుండి యతనిని తినివేయుచున్న యీ విషవ్యాధిని జయించి నశింపుచేయుట కెట్టి యిచ్ఛాశక్తియు చాలదయ్యెను. కాని యతనిని చూచినవారాశ్చర్యపడునట్లు కొద్దిరోజు లతనిలో గొప్ప

మార్పు కలిగెను. అతడు యరవాడలోనున్నదిలగాయితు, కొన్ని మాసములనుండి యుమ్మిలో రక్తము కక్కుచుండెను. అతడిట్లు నిశ్చయించిన వెంటనే యకస్మాత్తుగా రక్తముపడుట మానివేసెను. కొన్ని రోజులవరకు నది మరల కాన్పించలేదు. దానికతడు చాల సంతసించి నన్నుచూచుటకు జయిలుకు వచ్చినపు డీవిషయము సగర్వముగా నాకెరింగించెను. కాని దురదృష్టవశాత్తు అది కొద్ది కాలమే యట్లుండి తరువాత రక్తము మరింత జోరుగా పడనారంభించెను. వ్యాధి తిరిగి తలయెత్తెను. ఈ మధ్యకాలములో నతడు తన వెనుకటిశక్తితో పని చేసి దేశమంతట శాసనోల్లంఘనమునకు కొంత వికాసము కలిగించెను. వివిధప్రాంతములనుండి వచ్చినవారితో నతడు సంప్రదించి వారికి వివరములగు నాదేశములనిచ్చి పంపించెను. దేశమంతట జరుపగలందుల కతడొక యుత్సవ దినమును నిశ్చయించెను. ఆరోజున నాసేతుహిమాచల పర్యంతము బహిరంగసభలలో నేనిచ్చిన యుపన్యాసములలోని నేరములని యెంచబడిన భాగములు చదువబడెను. ఆ దినమున ననేక లాఠీ ఛార్జీలు, యుత్సవములను, సభలను బలవంతముగా తరిమివేయుట మొదలగునవి జరిగెను. ఆ యొక్క రోజున దేశమంతట నయిదువేల మంది నిర్బంధింపబడినట్లు మదింపు వేయబడెను. అదియెంత యసామాన్యమగు జన్మదినోత్సవము !

వ్యాధిగ్రస్తుడై ఈ బాధ్యతను వహించుటయు, తనశక్తిని ధారపోయుటయు తండ్రిగారి కనర్థదాయకముగ నుండెను. పరిపూర్ణ విశ్రాంతి తీసికొనవలసినదని నేనాయనను ప్రార్థించితిని. అతని కట్టి విశ్రాంతి హిందూదేశములో కలుగుట యసంభవమనియు, నతని మనసు యెప్పుడును, సంగ్రామముమీదనే లగ్నమయి యుండుననియు, విధాయికముగ ప్రజలు సలహాకొర కతనియొద్దకు వెళ్ళుచుందురనియు నేనే గుర్తించితిని. కనుక రంగూను, సింగపూరు, డచ్చిఇండీసు వైపు కొద్దికాలము సముద్రయానము చేయవలసిదని నేను సూచించితిని. అతనికది బాగుగనే కాన్పించెను. ప్రయాణములో నతనితో నొక డాక్టరు స్నేహితుడుకూడ నుండుట కేర్పాటు

గావింపబడెను. ఈ యుద్దేశ్యముతోనే నతడు కలకత్తా వెళ్ళెను. కాని యతనిస్థితి దిగజారుచుండుటచే నతడిక ముందుకు పోజాలక కలకత్తా సమీపమున యేడువారములుండెను. కమలతప్ప తక్కిన కుటుంబము యావత్తు అతనిని కలుసుకొనెను. కమల చాలకాల మలహాబాదులోనే యుండి కాంగ్రెసుసేవ చేయుచుండెను.

పన్నుల నిరాకరణోద్యమముతో గల సంబంధమునుబట్టియే బహుశః నా పునర్నిర్బంధ మంతత్వరితము చేయబడెను. నిజమునకు రయితుప్రతినిధులింకను అలహాబాదులో నుండగనే, కాన్ఫరెన్సు అయిన వెంటనే, నన్ను ఆరోజుననే నిర్బంధించుటకంటె మరేదియు నా యుద్యమమున కంతటిశుభము చేకూర్పజాలకపోయెడిది. దీని వలన వారియుత్సాహ మినుమడించెను. వారు కాన్ఫరెన్సులోని తీర్మానములను జిల్లాలోని గ్రామగ్రామమునకు తీసికొనిపోయిరి. పన్నుల నిరాకరణము ప్రారంభించినట్లు రెండురోజులలో జిల్లా యంతయు ప్రాకిపోయెను. ప్రతిచోట ప్రజలు దీనియెడల నుత్సాహ పూరితులై యుండిరి.

ఆ రోజులలో వార్తల నందచేయుట మాకున్న కష్టములలో ప్రధానకష్టము. మే మేమిచేయుచుంటిమో, ప్రజ లేమిచేయగోరుచుంటిరో వారికి తెలుపుట కష్టముగనుండెను, జుల్మానాలను వేయుదురనియు, నణచివేయుదురనియు భయపడి వార్తాపత్రికలు మా వార్తలను ప్రకటింపకుండెను. అచ్చుఆఫీసులు మా కరపత్రములను, నోటీసులను ముద్రింపవు. ఉత్తరములు, టెలిగ్రాములు పరీక్షింపబడుచు తరుచు ఆపివేయబడుచుండెను. స్వయముగ వార్తల నందచేయువారికి కట్టలనిచ్చి పంపించుటొక్కటే నమ్మకమైన పద్ధతి. వీరి నప్పుడప్పుడు నిర్బంధించుచుండెడివారు. ఇది చాల వ్యయకరము. దీనికెక్కువ క్రమశిక్షణ కావలసియుండెను. మొత్తముమీద నిది కొంతజయప్రదముగనే సాగింపబడెను. రాష్ట్ర కేంద్రములతోనే నిరంతర సంబంధముండెడిది, పట్టణములలోనే నెట్టి వార్తలనైనను వ్యాపింపజేయుట యంతకష్టమైన పని కాదు. ఈ యక్రమవార్తాపత్రి

కలుగను వచ్చుచుండెడివి. ప్రజలు వాటికొరకెప్పుడు నెదురుచూచు చుండెడివారు. పట్టణములలో టముకు వేయుట యొకవిధము. సాధారణముగా దీనివలన టముకు వేయువాడు నిర్బంధింపబడుచుండెను. ప్రతివాడు అరెస్టు అగుటకు సంసిద్ధముగా నుండుటచే దీనినెవరును లక్ష్యముచేయలేదు. ఈ పద్ధతులన్నియు పట్టణములకు సరిపడెను. కాని గ్రామములలో నివి యంత సులభముగా పనిచేయవు. వార్తల నందించువారిమూలమునను, సైక్లోస్టైలు నోటీసులమూలమునను ముఖ్యమైన గ్రామకేంద్రములతో కొంతసంబంధముండెను. కాని యది తృప్తికరముగలేదు. దూరగ్రామములకు మా సందేశములు చేరుటకు చాలకాలము పట్టెడిది.

అలహాబాదులోని కిసాను కాన్ఫరెన్సు కీ కష్టము తొలగి పోయెను. జిల్లాలోని ప్రతి ముఖ్య గ్రామమునుండియు దానికి ప్రతినిధులు వచ్చిరి. వారు తమతమ గ్రామములకు తిరిగివెళ్ళునపుడు నా నిర్బంధమును గురించి కాన్ఫరెన్సులోని క్రొత్తతీర్మానములను గురించి వార్తలను ప్రజలకందజేసిరి. ఆ పదునారువందలమందియు పన్నులనిరాకరణమును బోధించు యుత్సాహపూరిత ప్రచారకులయిరి. కనుక నీ విధముగ నుద్యమప్రారంభవిజయము నిశ్చయమయ్యెను. ఆ ప్రాంతములోని రయితులందరు మొత్తంమీద ప్రారంభములో పన్నులను చెల్లింపరనుట కెట్టి సందేహములేదు. తగినంత భయమును కలిగించినగాని వారసలే చెల్లింపరు. ప్రభుత్వ, జమీందారీ దౌర్జన్య, భయోత్పాతములముందర, వా రెంతవరకు నిలువగలరో యెవరును చెప్పజాలరు.

మేము జమీందారులను, రయితులనుకూడ చెల్లింపవలదంటిమి. సిద్ధాంతరీత్యా ఇది యొక తరగతికి సంబంధించిన సందేశము కాదు. ఆచరణవచ్చుసరికి చాలమంది జమీందార్లు తమ రెవిన్యూ చెల్లించిరి. జాతీయపోరాటముయెడ సానుభూతికలవారుకూడ కొందరు చెల్లించిరి. వారిమీద నెక్కువ వత్తిడిచేయబడెను. వా రెక్కువ

నష్టము పొందుదురు. అయినను వ్యవసాయదారులు చెల్లింపక పన్నుల
నీయలేరు. కనుక మా ఉద్యమము ఆచరణలో శిస్తులనిరాకరణ
నోద్యమ మయ్యెను. అది అలహాబాదుజిల్లానుండి రాష్ట్రములోని మరి
కొన్నిజిల్లాలకు ప్రాకిపోయెను. చాలజిల్లాలలో దానిని శాస్త్రీయముగ
నమలుపరుపలేదు. లేక ప్రకటింపలేదు. కాని రయితులు శిస్తులను
చెల్లింపలేదు. లేక చాలమంది ధర లమితముగా పడిపోవుటచే యెంత
మాత్రము చెల్లింపజాలకుండిరి. ప్రభుత్వము పెద్ద జమీందారులు
చాల నెలలవరకు తిరుగుబాటుచేసిన రయితాంగమును భయపెట్టుట
కెట్టి తీవ్రచర్యను తీసికొనలేదు. శాసనోల్లంఘనముతో గూడిన రాజ
కీయసంగ్రామ మొకవంక, వ్యావసాయకదుర్భిక్షము తెచ్చిపెట్టిన
యార్థికమాంద్య మొకవంక నుండుటచే వారికి మనస్థైర్యము చిక్క
లేదు. ఈ రెండు నొకదానిలో నొకటి కలిసిపోయెను. ప్రభుత్వమెప్పుడు
రయితాంగ తిరుగుబాటుకు భయపడుచుండెను. లండనులో రౌండు
టేబులు కాన్ఫరెన్సు జరుగుసమయమున హిందూదేశములో తమ
కష్టములను పెంచుకొనుటకు, మరింత యద్భుత 'బల' ప్రదర్శనము
చేయుటకు ప్రభుత్వము పూనుకొనలేదు.

యు. పి. లోని పన్నుల నిరాకరణోద్యమమువలన యు. పి, కి.
సంబంధించినంతవర కొక సుగుణము కలిగెను. అది మన సంగ్రామ
మునకు నూతనోత్తేజము చేకూరుటయేగాక దానికి మరింతవిశాలము,
శాశ్వతమునగు పునాదియేర్పడెను. మన పట్టణప్రజలకు అలసట, విసుగు
దల జనించినను, మధ్యతరగతి ప్రచారకుడు చప్పబడినను యు. పి. లో
నీ యుద్యమ మెప్పటివలె బలముగనుండెను, దానికి మున్నెన్నడు
కలుగని బలముకూడ కలిగెనని చెప్పవచ్చును. ఇతరరాష్ట్రములలో
నిచ్చట జరిగినంతమార్పు జరుగకపోవుటచే, పట్టణములే వీనిని నడు
పుచు మధ్యతరగతులవారి యలసటచే నుద్యమ మంతకంతకు క్షీణించు
చుండెను. ఉద్యమములో మొదటినుండియు ప్రధానపాత్ర వహించిన
బొంబాయివంటి మహానగరముకూడ కొంచెము చప్పబడుచుండెను.

అచ్చట, మరియితరచోట్ల నధికారధిక్కారము, నిర్బంధములు సాగు చునేయుండెను. కాని యిదియంతయు కొంతకృత్రిమముగ కాన్పిం చెను. ఉత్సాహశక్తి నశించెను. ఇదియంతయు సహజము. ఏలనన నొక విప్లవస్థాయిలో ప్రజలను చిరకాలముంచుట యసాధ్యము. సాధారణముగా నిది కొన్నిరోజులుమాత్రమే సాధ్యమగును. కాని శాసనోల్లంఘనములో దీనిని నెలలవరకుసాగించు యద్భుతశక్తికలదు. తరువాతకూడ కొంచెము తక్కువస్థాయిలో నది దీని నెంతకాల మయినను నడుపగలదు.

ప్రభుత్వ నిర్బంధము లధికమయ్యెను. ఇంతవరకు నాశ్చర్య ముగా పనిచేసిన స్థానిక కాంగ్రెసుకమిటీలు, యువజనసంఘములు నక్రమ సంఘములుగ ప్రకటింపబడి యణచివేయబడెను. జయిళ్ళలోని రాజ కీయ ఖయిదీల యాదరణ యధ్వాన్నముగనుండెను. జయిలునుండి విడుదలచగుటతోడనే ప్రజలు తిరిగి రెండవశిక్ష ననుభవించుటకు జయిలుకు సిద్ధమగుచుండుట ప్రభుత్వమునకు మరింత కన్నెఱ్ఱగా నుండెను. శిక్షింపబడినను మోకరించని యీ ధిక్కారము పాలకులనైతి కాధిక్యతకు భంగము కలిగించెను. జయిలునియమముల నుల్లంఘించి రనుకారణమున నవంబరు లేక డిశంబరు ప్రథమవారములో (1930) యు. పి. జయిళ్ళలో కొందరిని కొరడాలతో మోదిరి. ఈ వార్త నైనీజయిలులో మాకుచేరి మమ్ము కొంత కలతపెట్టెను. అప్పటి నుండియు దీనికి మే మలవడిపోతిమి. అధమాధముడగు మొండి కెత్తిన నేరస్తుని విషయములోగూడ కొరడాదెబ్బలు అనవసర శిక్ష యనియే నా యభిప్రాయము. యువకులు, అభిమానధనులు అగు వారికి, నియమముల నుల్లంఘించిరను సాంకేతికనేరములకే శిక్ష కేవ లము క్రౌర్యము. మా బారకాసులో నలుగురము దీనినిగురించి ప్రభు త్వమునకు వ్రాసితిమి. రెండువారములవరకు మా కెట్టి సమాధానము రాకపోవుటచే నీ క్రౌర్యమునకు గురియైన వారియెడల సానుభూతి చూపుటకు, కొరాడాదెబ్బలశిక్షను నిరసించుటకు మే మొక మార్గము త్రొక్కనిశ్చయించి మూడు శుష్కోపవాసములను 72 గంటలు చేయ

సంకల్పించితిమి; ఉపవాసములు చేయుట కిదియొక లెక్కకాదు. కాని మాలో నెవరము నుపవాసముల కలవాటుపడలేదు. మే మీ పరీక్ష కాగగలమో లేదో మాకే తెలియదు. నే నిరువదినాలుగుగంటలకు మించి యుపవాసము చేసి యెరుగను.

ఎట్టికష్టము లేకుండగనే మే మా యుపవాసము నిర్వహించితిమి. అది నేను భయపడినంతటి యగ్నిపరీక్ష కాదని, ఆ యుపవాస కాలములో పరుగెత్తుట, గంతులిడుట మొదలగువానిని నే నతిమూర్ఖముగ నడిపితిని. అది నా కంత మంచిచేసినట్లు తోచదు. ఆ మూడు రోజులలోను మే మందరము నే డెనిమిది పౌనులబరువు తగ్గితిమి. ఇది, నైనీజయిలులో గతమాసములో మే మందరము కోల్పోయిన పదిహేనులగాయితు యిరువదియారుపౌనులమీద కొసరు. మా యుపవాసములతో సంబంధము లేకుండా కొరడాశిక్షలపై తీవ్ర వ్యతిరేకాందోళన బయట జరుగుచుండెను. తరువాత యు. పి. ప్రభుత్వమిక ముందెన్నడు నట్టికొరడాశిక్షల నీయవలదని జయిలుశాఖ నాజ్ఞాపించిరని విశ్వసించెదను. కాని యీ యాజ్ఞలు చిరస్థాయిగా నుండునవి కావు; అట్లుండ లేవు. సంవత్సరములతరువాత యు. పి. జయిళ్ళలోను యితరరాష్ట్రములలోను కొరడాశిక్షల కెట్టికొదువ లేకుండెను.

అప్పుడప్పుడు కలుగుచుండు యిట్టివిపత్తులు తప్ప మేము జయిలులో ప్రశాంత జీవితము గడిపితిమి; వాతావరణము మనోజ్ఞముగ నుండెను; అలహాబాదులో శీతకాల మతిసుఖదాయకము. రంజిత పండిట్ మా బార్కుకొక మేరువువంటివాడు. అతడు తోటలను పెంచుటలో నారితేరెను. ఆ మా బోడి యావరణమంతయు వెంటనే పుష్పభరితమై రంగులతో నేత్రపర్వ మొసర్చుచుండెను. అతడా చిన్నపీలికలోనే కొద్దిలో గోల్ఫుబంతి క్రీడ నేర్పాటు చేసెను.

మేము నైనీజయిలులోనుండగా నెత్తిమీదినుండి పోవు వాయువిమానములు మాకొక వినోదముగనుండెను. ప్రాక్పశ్చిమ

ములకుపోవు మహావాయుమార్గములకలహాబాదు రేవుస్థలం ఆస్ట్రేలియా జావా. ఫ్రెంచిఇండోచైనా మొదలగు చోట్లకుపోవు పెద్ద పెద్ద విమానములన్నియు నైనీయొద్ద సరిగా మా తలలపైనుండి పోవుచుండును. బటేవియానుండి వచ్చి పోవుచుండెడి డచ్చిదేశపు లైనరులన్నిటికంటె గొప్పవి. ఒకొక్కప్పుడు మేమదృష్టవంతులమైనచో, నింకను చీకటియుండి నక్షత్రములు కాన్పించుచుండగనే యా శీతకాల ప్రభాత సమయములయం దే విమానమో మాకు కాన్పించుచుండెడిది, అది దీపములతో దేదీప్యమానముగ ప్రకాశించుచుండెడిది, రెండుకొనలను రెండు రక్తారుణదీపము లుండెడివి. ఉషఃకాల వినీలాకాశవీథి నది పయనమగునప్పు డాదృశ్య మతిమనోహరముగ నుండెడిది!

మరియొక జయిలు నుండి పండిత మదనమోహనమాలవ్యా కూడ నైనీజయిలుకు మార్చబడెను. అతనిని ప్రత్యేకముగ నుంచిరి. కాని మే మతనిని నిత్యము చూచుచుండెడివారము. బహుశః నేను బయటనున్నపుడుకంటె జయిలులోనే యతని నెక్కువగ చూచితిని. అత డతియుత్సాహవంతుడైన చెలికాడు. చైతన్యభరితుడు. యౌవనోత్సాహముతో ప్రతి విషయమందు శ్రద్ధతీసికొనువాడు. రంజిత్తు సహాయముతో నతడు జర్మనుభాష నేర్చుకొన నారంభించెను. అత డద్భుతమగు జ్ఞాపకశక్తి చూపెను. కొరడాదెబ్బల వార్త వచ్చినప్పు డతడు నైనీజయిలులోనే యుండెను. అతనియొడలు జలదరించెను. అతడు వెంటనే రాష్ట్రతాత్కాలిక గవర్నరుకు వ్రాసెను. తరువాత నతనికి జబ్బుచేసెను. జయిలులో నతడు చలిని భరించలేకపోయెను. అతనివ్యాధి ముదిరెను. అతనిని పట్టణములోనున్న ఆస్పత్రికి మార్చి శిక్ష పూర్తికాకమునుపే విడిచిపెట్టిరి. అదృష్టవశమున నతనికాస్పత్రిలో స్వస్థత చేకూరెను.

1931–జనవరి యొకటవ తేదీ–ఇంగ్లీషు సంవత్సరాది పండుగ–కమల నిర్బంధము. నేను సంతోషించితిని. ఏలలన యామె తన చెలికత్తెలతో జయిలుకు పోవలెనని తహతహలాడుచుండెను. ఆమె, నా

చెల్లెలు, మరియనేకమంది స్త్రీలు పురుషులేదైననో చిరకాలము క్రిందటనే నిర్బంధింపబడి యుండెడివారు. కాని యాసమయమున ప్రభుత్వము సాధ్యమైనంతవరకు స్త్రీలను నిర్బంధించుట కిష్టపడకపోవుటచే వారింతకాలము మిగిలియుండిరి. ఇప్పటికి యామెకోర్కె నెరవేరెను! దీని కామె యెంతయో యానందించియుండునని నేననుకొంటిని కాని యామె యనారోగ్యస్థితికి నేను భయపడుచుంటిని. జయిలు పరిస్థితులామెకు మరింత బాధ కలిగింపవచ్చునని నా భయము. ఆమె నిర్బంధింపబడినపుడొక పత్రికా ప్రతినిధి యామె సందేశమునర్థించెను. ఆ వేడిలో నామె యనాలోచితముగ తన నిజస్వభావమును తెలుపు నొక చిన్న సందేశమునిచ్చెను. 'నాకిపుడపారమగు సంతోషము కలుగుచున్నది. నా భర్త పదకమలముల ననుసరించినందులకు నే నెంతయు గర్వించుచున్నాను. ప్రజలు మన జెండా నెగురవేసియుంచెదరని నే నాశించెదను.' బహుశః ఆమెకొంచెము యోచించినచో నావిధముగ చెప్పియుండెడిదికాదు. ఏలనన నామె స్త్రీల హక్కుల కొరకు పురుషుల నిరంకుశత్వము నెదుర్చు యోధగా భావించుకొనుచుండెడిది. కాని యా నిమిషమందా భారతసతీత్వము పైకుబుకుటచే పురుషుని నిరంకుశత్వము మఱచిపోబడెను.

మా తండ్రి కలకత్తాలో నుండెను. అతని కెంతమాత్రము స్వస్థత చేకూరలేదు. కాని కమల నిర్బంధము, శిక్ష వినుటతోడనే యాతడు కంపించి యలహాబాదు తిరిగివచ్చుటకు నిశ్చయించెను. మా చెల్లెలు కృష్ణను వెంటనే యలహాబాదు పంపించి కొద్దిరోజులయిన తరువాత నతడు తక్కిన కుటుంబముతో వచ్చెను. జనవరి 12 వ తేదీ యతడు నన్ను చూచుటకు వచ్చెను. అతనిని చూచి నాకు కలిగిన విచార మతనికి తెలియనట్లే కాన్పించెను. కలకత్తాలో నున్నప్పటికంటె తా నిపుడారోగ్యముగ నున్నట్లతడు నాకు చెప్పెను. అతనిముఖ ముబ్బియుండెను. ఇది తాత్కాలిక కారణజనితమని యతనిభావము.

అతని యీ ముఖము నన్ను విడిచిపెట్టలేదు. అందతనిపోలికయే లేదు. అతని కషాయము రానున్నదనుభయము నాలో తొలిసారి ప్రవేశించెను. ఆరోగ్య, బలము లతనిసొత్తులని నే నెప్పుడు భావించు చుండెడివాడను. అతనికి, మృత్యువువచ్చునని నేను చింతింపజాల కుంటిని. అత డెప్పుడు మృత్యుభావమును నిర్లక్ష్యముచేయుచు, దానిని పరిహాసముచేయుచు చిరకాలము జీవింపదలచుకొంటినని చెప్పుచుండెడివాడు. తరువాత నతని బాల్యస్నేహితుడెవడైన చని పోయినచో నత డొంటరిగనున్నట్లు, తా నొక్కడే క్రొత్తవారిమధ్య విడువబడినట్లు భావించుట నేను కనిపెట్టితిని. మృత్యుసూచనకూడ కాన్పించెడిది. కాని సాధారణముగ నీ కలుషభావము మాయమయి పొంగి పొరలుచుండు నతనియుత్సాహసంపద విజృంభించుచుండెడిది. అతనికుటుంబములోని మే మందరము మూర్తీభవించిన యతని గుణ గణములచేతను, విశాలప్రేమచేతను, బంధింపబడితిమి. అతడులేని ప్రపంచము నూహించుట మాకు దుర్ఘటముగనుండెను.

అవి మొదటి రౌండు టేబిలుకాన్ఫరెన్సు తుదిదినములు. చివర చేసిన సూచనలు, ప్రగల్భములు మాకు కొంచెము వినోదముగనే యుండెను. ఆ యుపన్యాసములు, ఆ శ్రీరంగనీతులు, ఆ చర్చలు అసత్యములుగ వ్యర్థములుగ కాన్పించెను. కాని యొక్కసత్యము మాత్ర మాచంద్రార్కమునిలబడెను. మన భరతమాత దుర్భరాగ్ని పరీక్ష కాహుతియగుచున్న సమయమున, మన పురుషులు, నారీ రత్నములు సత్యద్భుతముగ ప్రవర్తించినపుడుకూడ మనపోరాటమును నిర్లక్ష్యముచేసి, తమ నైతికబలము నెదిరిపక్షమున కర్పించు దేశస్థులు కొందరున్నారనుసంగతి విదితమయ్యెను. జాతీయత యను మోస భూయిష్ఠమగు నాచ్ఛాదనక్రింద పరస్పరవిరుద్ధములగు నార్థిక ప్రయోజనము లెట్లుపనిచేయుచున్నదియు, నీ జాతీయత పేరనే పెట్టుబడిదారులైనవారు వీటిని భవిష్యత్తుకుకూడ దాచియుంచు కొనుట కెట్లుయత్నించుచున్నదియు, మును పెన్నడు విశదము కాన ట్లిప్పుడు స్పష్టమయ్యెను. రౌండుటేబిలుసభ యీ పెట్టుబడి

దారుల సమూహము. వారిలో చాలమంది పోరాటము నెదిర్చిరి. కొంతమంది కిక్కురుమనకుండ చూచుచుండిరి. అయినప్పటికి వారప్పుడప్పుడు "కళ్ళప్పగించి యూరకచూచువారుకూడ ద్రోహులే" యను నామెత జ్ఞప్తికి తెచ్చుచుండిరి. కాని లండను కనుసైగచేయుట తోడనే యీ నిరీక్షణ హఠాత్తుగా పలాయనమయ్యెను. వారు తమ తమ ప్రత్యేకప్రయోజనములను భీమాచేయించుకొనుటకు, యింకను లభ్యమగు దోళ్ళదోపుడు బేరములో పంచుకొనుటకు గుభాలున బయలుదేరిరి. కాంగ్రెసు అంతకంత కెడమకుపోవుచున్నదని ప్రజలకు దానిపై పలుకుబడి యంతకంతకు హెచ్చుచున్నదని గుర్తించి మరింత త్వరితముగ నీపటాలాలు లండనులో బారులుతీరెను. హిందూదేశములో పెద్ద రాజకీయమార్పు కలిగినచో ననేకవిధములగు ప్రజలధికారమునకు వత్తురనియు వారికి ప్రాధాన్యత కలుగుననియు, వారు విధిగ విప్లవకర సాంఘికమార్పులను ప్రోత్సహించెదరనియు, తమ ప్రయోజనముల కది యరిష్టమనియు భావింపబడెను. హిందూదేశములోని స్వలాభపరులుకూడ నీ యవకాశమునుండి వెనుకకుజారిరి. ప్రస్తుత సాంఘికనిర్మాణమును పెట్టుబడిదారులను రక్షించుటకు బ్రిటిషువారిచ్చట నుండవలెననియే వారికోరిక. డొమినియనుపరిపాలన కావలెనని పట్టుబట్టుటలోనున్న భావార్థమిదియే. గ్రేటుబ్రిటనుతో రాజీకి ప్రధానభాగముగా హిందూదేశమునుండి వెంటనే యాంగ్ల సైన్యము వెడలిపోవలెననియు, భారతసైన్యము భారతప్రజాస్వామిక వశములో నుండవలెననియు నేను నొక్కిచెప్పినప్పుడొక సుప్రసిద్ధ భారతలిబరలునాయకుడు నాపై మండిపడి, బ్రిటిషుప్రభుత్వము దీనికొప్పుకొనిననుకూడ తాను తన శక్తికొలది దీని నెదిర్చెదనని సెలవిచ్చెను. ఎట్టిజాతీయస్వాతంత్ర్యమునకైనను ప్రధానమగు నీ ప్రాతిపదిక యనవసరమని తాను తలంచెనుగనుక నతడు దాని నెదిర్చెను. విదేశీయులు దాడివత్తురనుభయము దీనికి కొంతకారణమనియు బ్రిటిషు సైన్యము మనల నట్టిదాడినుండి కాపాడవలెనని యతడు కోరుచున్నాడనియు ననుకొనవచ్చును. దాడివచ్చుగాక! రాకపోవుగాక! మగతన

మున్న యేభారతీయునికైన బయటవాని రక్షణకోరుట యనుభావము హేయముగనుండును. కాని భారతదేశములో బ్రిటిషువారుండవలెనని కోరుటకు యదార్థకారణ మిదియని నేను తలంపను. భారతీయులకు వ్యతిరేకముగా నిష్కళంకమైన భారతప్రజాస్వామికమునకు వ్యతిరేకముగా, ప్రజలయభివృద్ధికి వ్యతిరేకముగా భారత పెట్టుబడిదారుల ప్రయోజనములను కాపాడుటకే బ్రిటిషువారు కోరబడుచుండిరి. కనుక రౌండుటేబిలు సభలోని భారతప్రతినిధులలోని నభివృద్ధి నిరోధకులు, కులతత్త్వవాదులు మాత్రమేకాక నభివృద్ధివాదులు జాతీయవాదులు అని పిలుచుకొనువారుకూడ తమకు బ్రిటిషు ప్రభుత్వమునకు మధ్య చాలసామ్యమున్నదని కనుగొనిరి. స్వాతంత్ర్యపోరాటములో జయిలుకు వెళ్ళినమమ్ము; మమ్ము బంధించినవారితో చేతులుకలిపి బారులుతీరి నీతులు సెలవిచ్చువారినికూడ జాతీయత యిముడ్చుకొనునెడల నట్టి జాతీయతక్రిందకురానిదేముండును! ఇంకొకరకపు జాతీయధీరులున్నారు. వీరిపలుకు గంగాప్రవాహము. వీరన్నివిధముల స్వదేశీని ప్రోత్సహింతురు. స్వరాజ్యసార మచ్చటనేయున్నది. త్యాగముచేసియైనను దీనిని సాధించవలెను. అదృష్టవశాత్తు యీ యుద్యమములో వీరికెట్టి త్యాగములేదు. అది వారివ్యాపారములను వృద్ధిచేసెను. వేలకొలది జయిళ్ళకు పోయినపుడు లాఠీకి గురియైనపుడు వీరుతమఖజానా పెట్టెలయొద్ద తాపీగా సొమ్ములెక్కించుకొనుచుండిరి. తరువాత తీవ్ర జాతీయత కొంచెము సాహసముగా కాన్పించినపుడు వీరు తమ యుపన్యాసముల లోని జోరుతగ్గించి యతివాదులను నిరసింపనారంభించి, యెదిరిపక్షముతో నొడంబడికలు సంధులు చేసికొనిరి.

రౌండుటేబిలు కాన్ఫరెన్సును మేము నిజముగా గుర్తింపలేము; లక్ష్యముచేయలేదు. పోరాటమంతయు నిచ్చటనే మన పట్టణము లందు, పల్లెలందు కలదు. మా పోరాటము త్వరలోనేయంతమగు నను భ్రమకూడ మాకు లేదు; ముందురానున్న యుపద్రవముల భీతియులేదు. 1930 నాటిసంభవములు జాతీయశక్తిసంపదలందు ధైర్య

స్థైర్యములందు మాకు దగినవిశ్వాసముకలిగించెను. ఆ విశ్వాసముతోనే మేము భవిష్యత్తు నెదుర్కొంటిమి.

డిసెంబరు లేక జనవరి ప్రారంభములో జరిగిన యొకవిషయము మాకు చాలబాధ కలిగించెను. శ్రీనివాసశాస్త్రిగారు ఎడింబరోలో నుపన్యసించుచు భారతదేశ శాసనోల్లంఘనములో జయిలుకు పోవువారిని దూషణగా మాట్లాడెను. ఆ యుపన్యాసము ముఖ్యముగా నాసమయము మమ్ము చాలబాధించెను. మాకు, శ్రీనివాసశాస్త్రి గారికి రాజకీయములలో చాల వ్యత్యాసమున్నను మే మాయనను గౌరవించితిమి.

రామ్సేమాక్డొనాల్డు తన మామూలు సౌభ్రాతృత్వపు పలుకులతో రౌండు టేబిలుసభ ముగించెను. తన దుష్టపద్ధతులను మానుకొని యా యానందకూటములో జేరవలెనని కాంగ్రెసును హెచ్చరించుభావ మందులో ద్యోతకమగుచుండెను. సరిగా నా సమయముననే 1931 జనవరి 15వ తేదీ ప్రాంతమున అలహాబాదులో కాంగ్రెసు వర్కింగుకమిటీ సమావేశమయ్యెను. ఇతర విషయములతో పాటు ఈ యుపన్యాసము హెచ్చరిక చర్చింపబడెను. నే నప్పుడు నైనీజయిలులోనుంటిని. నేను విడుదలయైనతరువాత నీ విషయము తెలుసుకొంటిని. తండ్రిగారు కలకత్తానుండి యప్పుడే తిరిగివచ్చిరి. అతనికి చాల సుస్తిగానున్నను సభ్యులందరు తనప్రక్కచుట్టు చేరి యీ విషయము నచ్చటనే చర్చింపవలెనని యతడు పట్టుపట్టెను. శాసనోల్లంఘనమును విరమించి మాక్డొనాల్డు కొక సూచన యీయవలసినదని యొకరనిరి. తండ్రిగారికి దీనివలన చాల యుద్రేకముకలిగెను. అతడు తటాలున లేచి ప్రక్కమీద కూర్చుని జాతీయలక్ష్యము చేకూరువరకు తాను రాజీపడజాలననియు, తానొక్కడే మిగిలియున్నను పోరాటము నడిపెదననియు గర్జించెను. ఈ యుద్రేక మతనికి చాల

హానికరమయ్యెను. జ్వరము వెంటనే పొంగుటచే డాక్టర్లచ్చటనున్న వారందరిని పంపివేసి యతని నొక్కనిని విడిచిపెట్టిరి.

చాలవరకు కతనిపట్టుదలచేతనే వర్కింగుకమిటీవారు రెట్టిరాజీలేని యొక తీర్మానము చేసిరి. ఇది ప్రకటింపబడక పూర్వము సర్ తేజ్ బహదురుసప్రూ, శ్రీనివాసశాస్త్రిగార్లయొద్దనుండి తండ్రిగారికొక కేబిలు వచ్చెను. వారిరువురువచ్చి చర్చించువరకు నెట్టినిశ్చయము చేయవలదని తండ్రిగారిద్వారా వారు కాంగ్రెసును కోరిరి. వారప్పుడే మార్గములోనుండిరి. వర్కింగుకమిటీ తీర్మానమొకటి యదివరకే చేయబడెననియు, కాని సప్రూ శాస్త్రిగార్లువచ్చి చర్చించువరకు నది ప్రకటింపబడదనియు జవాబు యివ్వబడెను.

జయిలులోనున్న మాకీ విషయములేవియు తెలియవు. కాని యేదోకొంత 'కుంభకోణము' జరుగుచున్నదని తెలిసి మేము బాధపడితిమి! జనవరి 26 వ తేదీ! స్వాతంత్ర్య ప్రథమవార్షికదినము! ఈ యుత్సవ మెట్లు జరుపబడును! అను భావములే మమ్మావహించెను. ఈ యుత్సవము జరుపబడెననియు, దేశమంతట బహిరంగ సభలు జరుపబడెననియు, నా సభలో స్వాతంత్ర్యతీర్మాన మామోదింపబడెననియు వింటిమి. ఈ యుత్సవ మతిచమత్కారముగ జరుపబడెను. వార్తాపత్రికలు, అచ్చుఆఫీసులు లభ్యము కావయ్యెను. పెలి గ్రామములు, పోస్టుఉత్తరములు చేరకుండెను. అయినను దేశమంతట నన్ని రాష్ట్రభాషలలోను నొకే యర్థమిచ్చు తీర్మానము పట్టణములలోను, పల్లెలలోను, నేకకాలమందు చేయబడెను. ఈ సభలన్నియు చాలవరకు శాసనమును ధిక్కరించియే జరుపబడి పోలీసులచే బలవంతముగా తరిమివేయబడెను.

భూతభవిష్యద్వత్సరములను గురించి చింతించుచు నైనీజయిలులో నుండగా జనవరి 26 వచ్చెను. మా తండ్రిగారిస్థితి చాల కష్టముగా నున్నదనియు నే నింటికి వెళ్ళవలెననియు నకస్మాత్తుగా నా

కా ప్రాతఃకాలమున నెవరో చెప్పిరి. నన్ను విడిచిపెట్టనున్నట్లు తెలిసికొంటిని. నాతో రంజిత్‌కూడ వచ్చెను.

ఆ సాయంత్రమే భారతదేశ వివిధ జయిళ్ళనుండి యనేకమంది విడుదలైరి. వీరందరు కాంగ్రెసువర్కింగుకమిటీ సభ్యులు. వారి స్థానీయులు. మే మందరము కలుసుకొని పరిస్థితులను యోచించుటకు ప్రభుత్వము మా కొక యవకాశము నిచ్చుచున్నది. ఆ సాయంకాల మెట్లయినను నన్ను విడిచెడివారే. తండ్రిగారిస్థితివలన నేను మరికొన్ని గంటలు ముందు విడువబడితిని! 26 రోజులు జయిలుజీవిత మనుభవించినతరువాత కమలకూడ యా దినమే లక్నో జయిలునుండి విడువబడెను. ఆమెకూడ వర్కింగుకమిటీ సభ్యురాలు.

33

తండ్రిగారి నిర్యాణము

నేను తండ్రిగారిని రెండువారములైన తరువాత కలుసుకొంటిని. జనవరి 12 వ తేదీని ఆయన నన్ను నైనీలో కలుసుకొనినప్పు డతని రూపము నాకు భయంకరముగనుండెను. ఇప్పుడది మరింత చెడి పోయెను. ముఖము మరింతయుబ్బిపోయెను. మాటాడుటకూడ కొంత కష్టముగనేయుండెను. అతడు మనసులోనున్నది చెప్పలేకపోవు చుండెను. కాని యతని వెనుకటి యిచ్ఛాశక్తిమాత్రము కొరవడలేదు. ఇదియే మనశ్శరీరములను రెంటిని పట్టియుంచి పనిచేయించుచుండెను. అతడు రంజితును, నన్ను చూచి సంతోషించెను. ఒకటిరెండు రోజు లయిన తరువాత రంజితును నైనీజయిలుకు తీసికొనిపోయిరి. ఇది తండ్రిగారికి కష్టముగనుండెను. అతడు నిరంతరము రంజితుకొరకు ప్రశ్నించుచుండెను. భారతదేశములోని యనేకచోట్లనుండి తన్ను చూచుట కనేకమంది వచ్చుచుండగా తనయల్లుని యేలదూరము చేయవలెనని యతడనుచుండెడివాడు. ఈ పలవరింతవలన డాక్టర్లకు విసుగు కలుగుచుండెను. దానివలన నతనికే సుగుణము కలుగుట యును లేదు. డాక్టర్ల సూచనలచే మూడునాలుగు రోజులయిన తరువాత యు. పి. ప్రభుత్వమువారు రంజితును విడిచిపెట్టిరి.

జనవరి 26 వ తేదీనే, నన్ను విడిచిపెట్టినరోజుననే, గాంధీజీని కూడ విడిచిపెట్టిరి. అతనిని అలహాబాదులో నుంచవలెనని నేనాతుర పడుచుంటిని. అతని విడుదలనుగురించి నేను తండ్రిగారికి చెప్పినప్పు డతడుకూడ గాంధీజీని చూడగోరెను. మరునాడే గాంధీజీ బొంబాయి నుండి బయలుదేరి రాత్రి ప్రొద్దుపోయినతరువాత అలహాబాదు చేరెను. తండ్రిగా రతనికొరకెదురుచూచుచు మేల్కొనియేయుండిరి. అతనిసమక్షము, కొద్దిమాటలు తండ్రిగారి కద్భుత మనశ్శాంతి కలిగించెను. అతనిరాకవలన మా తల్లికికూడ నూరట, శాంతి చేకూరెను.

విడిచిపెట్టబడిన వర్కింగుకమిటీ సభ్యులందరు, సభయొక్క యీ దేశముల కెదురుచూచుచుండిరి. వారిలో చాలమంది తండ్రిగారి కొరకు ఆవేదనపడుచు అలహాబాదు రావలెననుకొనుచుండిరి. కనుక అలహాబాదులోనే వెంటనే సభకావింప నిశ్చయింపబడెను. రెండు రోజులయినతరువాత ముప్పది, నలుబదిమంది వచ్చిరి. వారిసభలు స్వరాజ్యభవనములో జరిగెను. ఆ సభలకు నే నప్పుడప్పుడు వెళ్ళు చుంటిని. కాని నేను వాటిలో నెట్టిముఖ్యభాగము తీసికొనజాలక పోతిని. అచ్చట జరిగిన తీర్మానములుకూడ నా కిప్పుడెంతమాత్రము జ్ఞాపకము లేవు. అవి శాసనోల్లంఘనమును విరమింపరాదనియే తీర్మా నించెనని నేననుకొనెదను.

వచ్చినపాతస్నేహితులు సహచరులు చాలమంది క్రొత్తగా జయిలునుంచి వచ్చి మరల వెంటనేపోవుటకు సిద్ధపడుచున్నవారు తండ్రిగారిని చూడగోరిరి. వా రాఖరిచూపుచూచి, కడసారి సెలవు గైకొనవచ్చిరి. వా రిద్దరుముగ్గురుచొప్పున యుదయ, సాయంకాలముల యందు వచ్చుచుండిరి. తన పాతసహచరులను గౌరవించుటకు పడక కుర్చీలో కూర్చొనెదనని తండ్రిగారు పట్టుబట్టిరి. అతడందులో నొక ముద్దవలె, నోటమాట లేకుండ కూర్చొనెను. ముఖముమీద కాన్పించిన యుబ్బువలన నెక్కువమాట్లాడుట కవకాశము లేకుండెను. కాని యొక పాతస్నేహితుని తరువాత మరియొకడు, నొకసహచరుని తరువాత మరి యొకడు వచ్చివెళ్ళుచుండ నతనినేత్రములు ప్రకాశించుచు వారిని గుర్తించుచుండెను. అతని శిరము కొంచెము వంగెడిది. చేతులు నమ స్కారపూర్వకముగ కలుసుకొనెడివి. అతడంతగా మాట్లాడ లేకపోయి నను కొద్దిమాటలు చెప్పెడివాడు. అప్పుడుకూడ నతని పూర్వపు హాస్యము ద్యోతక మగుచుండెను. అతడక్కడ మృత్యుఘాతము నొంది, శరీరబలముడిగిన యొక వృద్ధమృగరాజమువలె కూర్చొనెను. కాని యతని రాజఠీవి, రాజదర్పము తరుగలేదు. నే నతనిని పరీ క్షించిచూచునపు డతనిలో నేమిభావములు కలుగుచున్నవో కదా? యని యాశ్చర్యపడెడివాడను. అతనికి మన కార్యక్రమములో

నుత్సాహము నశించెనా ? అతడు తఱచు తనలోతానే పోరుచుండెను. అతనివశమునుండి జారిపోవనుంకించుచున్న విషయముల నతడు జయింప యత్నించుచుండెను. చివరకు నీ పోరాటము జరుగుచునే యుండెను. అతడు తన పట్టువీడలేదు. అప్పుడప్పుడు మాత్రో నతడతి స్పష్టముగ మాట్లాడుచుండెడివాడు. గొంతుబాధచే నతడు చెప్పునది మన కర్థముకాకుండినపుడుకూడ కాగితములమీదవ్రాసి తన భావములను వెల్లడించెడివాడు.

అతడు తన యింటిప్రక్కనే జరుగుచుండిన వర్కింగుకమిటీ సభలలో నెట్టిశ్రద్ధ తీసికొనలేదు. పదిహేనురోజుల క్రితమవి యతని కుద్రేకము కలిగించెను. ఇప్పుడు తాను వాటికి చాలదూరములో నున్నట్లు భావించుచుండెను. "మహాత్మాజీ ! నేను త్వరలో వెళ్ళిపోవుచున్నాను. స్వరాజ్యము చూచుటకు నే నిచ్చట నుండజాలను. కాని నీవు దానిని జయింతువని నే నెఱుగుదును. త్వరలోనే నీ కది హస్తగతమవును" అని యతడు గాంధీజీతో ననెను.

ఇతరపట్టణములనుండి రాష్ట్రములనుండి వచ్చినవారు చాలమంది వెడలిపోయిరి. గాంధీజీ, దగ్గరబంధువులు, కొద్దిమంది ప్రియమిత్రులు, నతని చిరమిత్రులు, సుప్రసిద్ధడాక్టరునైన డాక్టరు అన్సారీ, బిధానుచంద్రరాయి, జీవరాజమెహతాగార్లు మిగిలిరి. ఫిబ్రవరి నాల్గవ తేదీ యుదయ మతనికి కొంచెము సుళువుగనున్నట్లు కాన్పించెను. ఈ యవకాశము గైకొని యతనిని లక్నో తీసుకొనివెళ్ళుటకు నిశ్చయించిరి. అలహాబాదులో లేని ఎక్సురేచికిత్స కక్కడ అవకాశము లుండెను. ఆ రోజుననే మోటారులో నతనిని తీసికొనివెళ్ళితిమి. గాంధీజీ మొదలగువారు చాలమంది మాతోకూడ వచ్చిరి. మేము చాల నెమ్మదిగనే వెళ్ళినను అతని కలసట కలిగెను. మరునా డలసట తగ్గుచున్నట్లు కాన్పించెను. అయినను కొన్ని యశుభలక్షణము లుండెను. మరునాడు ప్రాతఃకాలమున, ఫిబ్రవరి యారవతేదీని, నే నతని ప్రక్కనుండి పరిశీలించుచుంటిని. రాత్రి యతడు చాలబాధపడ

విశ్రాంతి లేకయుండెను. అతని ముఖము శాంతినొందినట్లు, పోరాట చిహ్నములేవియు లేనట్లు నే నకస్మాత్తుగా కనుగొంటిని. అతడు నిద్రించెనని నే ననుకొని దానికి సంతసించితిని. కాని మా తల్లి చూపులు నిశితములగుటచే నామె కెవ్వున కేక వేసెను. నే నామె వైపు తిరిగి, యతడు నిద్రించెను కనుక నిశ్శబ్దముగ నుండుమని బ్రతిమాలుకొంటిని. కాని యా నిద్ర యతని చిరనిద్ర, దానినుండి లేచుట యనునది యికనుండజాలదు.

ఆ రోజుననే మే మతని శవమును మోటారులో నలహాబాదు తీసుకొనివచ్చితిమి. నే నందులో కూర్చుంటిని. రంజితు దానిని నడిపించెను. తండ్రిగారికిష్టుడగు హరియును స్వంతనౌకరుకూడ నుండెను. మా వెనుక మా తల్లి, గాంధీజీ, కమల గల మరియొక మోటారు వచ్చెను. తరువాత తక్కిన కారులు వచ్చెను. ఆ రోజంతయు తల దిమ్ముగానుండి యేమిజరుగుచుండెనో నాకు తెలియకుండెను. వరుసగా జరుగుచుండిన సంభవములును, పెద్దగుంపులు నాలోచనకు వీలులేకుండ చేసెను. కొద్దికాలములో లక్నోలో వేలకొలది జేరిరి. శవముప్రక్కన కూర్చుని అలహాబాదు పరుగులో జేరుకొంటిమి. శవము జాతీయపతాకముతో చుట్టబెట్టబడెను. పైన నొక జాతీయపతాకము యెగురుచుండ నలహాబాదు చేరితిమి. మైళ్ళకొలది బారులుతీరి జనులతనిని స్మరింపవచ్చిరి. ఇంటియొద్ద కొన్ని శ్రాద్ధవిధులుండెను. తరువాత పెద్ద జనప్రవాహముతో గంగానదికి ప్రయాణమైతిమి. నదియొడ్డున ఆ శీతాకాలదినము, నగ్నిజ్వాలలు పైకెగయుచు నతని దగ్గరబంధువులమైన మాకు హిందూదేశములోని కోట్లకు ప్రియతమమైన యా శరీరమును దహించివేసెను. గాంధీజీ జనసమూహమునకు కంటతడిపెట్టు కొద్దివాక్యములను చెప్పెను. తరువాత మే మందరము నింట్లకుపోతిమి. మే మొంటరిగా విచారగ్రస్తులమై తిరిగి వచ్చుసరికి నక్షత్రములు గగనవీధి కెగ్రాకి ప్రకాశమానముగ వెలుగొందుచుండెను.

మా తల్లికి నాకు వేలకొలది సానుభూతియుత్తరములువచ్చెను. ఇర్విను దంపతులుకూడ మా తల్లికి యుదారసందేశము పంపిరి. ఈ యద్భుతమగు సానుభూతి ప్రేమ మా బాధ కొంత తగ్గించెను. కాని దుఃఖములను, విచారములను నద్భుతముగ పోగొట్టగల గాంధీజీ సమక్షమే యన్నిటికంటె నెక్కువగా మాతల్లిని, కుటుంబమును మా జీవితములలోని యీ విషమావస్థలోనుండి తరింపజేసెను. మా తండ్రి గతించెనని గుర్తించుట నాకు కష్టముగనే యుండెను. మూడు మాసములైనతరువాత నేను నా భార్యతోను, కుమార్తెతోను సింహాళములో నుంటిని. మేము నువరాఎలియా యనుచోట ప్రశాంతము, విశ్రాంతియుతము నగు కొద్దిరోజులు గడుపుచుంటిమి. ఆ ప్రదేశము నా కెంతయు నాహ్లాదకరముగనుండెను. అది తండ్రిగారికి చాల బాగుగ నుండునని నా కకస్మాత్తుగాతట్టెను. అతనికొరకెందుకు పంపకూడదు; అతడు చాలయలసియుండును. కనుక విశ్రాంతియతనికి శ్రేయస్కరము. నేనతని కలవాబాదు తెలిగ్రాము యిచ్చుటకుకూడ సిద్ధమైతిని.

34

ఢిల్లీ సంధి

మా తండ్రిపోయిన గంటలోనే రౌండుటేబిలు కాన్ఫరెన్సు యొక్క భారతసభ్యుల గుంపు బొంబాయి రేవులో కాలుపెట్టెను. శ్రీనివాసశాస్త్రి, సప్రూ మరికొందరు సరాసరి అలహాబాదు వచ్చిరి. గాంధీజీ కొంతమంది వర్కింగుకమిటీ సభ్యులు నదివరకే యచ్చట నుండిరి. మా యింటివద్ద కొన్ని ప్రయివేటుసభలు జరిగెను. వాటిలో గుండుబల్లసభ చరిత్ర వినిపింపబడెను. ప్రారంభములోనే యొకచిన్న విషయము జరిగెను. శాస్త్రిగారయాచితముగ తనంతటతానే యెడింబరోలో తాను చెప్పినదానికి విచారము వెలిబుచ్చుచు నతడెప్పుడు తన పరిసరములకు లోబడిపోవుననికూడ చెప్పెను. అతనితో నతని యత్యధిక పదగుంభనముకూడ పరుగెత్తుచుండును.

రౌండుటేబిలుప్రతినిధులు సభనుగురించి మేమెరిగినదానికంటె నెక్కువేమియు మాకు తెలుపలేదు. తెరచాటు కుట్రలనుగురించి వారేమేమియో వెళ్ళబుచ్చిరి. ఫలానాప్రభువుగా రిట్లుచెప్పిరి. లేక యొక "సర్"గారు రహస్యముగా నట్లుచేసిరి. భారతదేశ లిబరలు మిత్రులు సిద్ధాంతములకు యదార్థములకు ప్రాముఖ్యత నీయక పెద్ద యుద్యోగస్తులకును వారితో సల్పు రహస్యసంభాషణలకు, గుసగుసలకు నెక్కువప్రాధాన్యతయిత్తురు. లిబరలునాయకులతోడి మాయిష్టాగోష్టి వలన నేట్టిఫలితము కలుగలేదు. ఆర్.టి.సి. తీర్మానముల కావంతయు విలువలేదని స్థిరపడిపోయెను. గాంధీజీవైస్రాయిని దర్శించుట కంగీకరించెను. దానివలన ఫలితము నతడపేక్షించెనని నే ననుకొనను. అయినను, అతడు తనమార్గమును వీడి శత్రువును కలుసుకొని యతనితో దేనినైనను చర్చించుటకెల్లప్పుడు సిద్ధపడును. తన సత్యమునుగురించి పరిపూర్ణవిశ్వాసము కలవాడై యతడు యెదరపార్టీవాని నొప్పింప కోరును. అతడెప్పుడు నాధ్యాత్మికపరిణామమునే కోరుచు క్రోధము, అవిశ్వాసము మొదలగునడ్డంకులను నాశనముచేసి యెదుటివాని ప్రేమను

మృదుభావములను చూఱగొనజూచును. ఈ మార్పుకలిగినచో విశ్వాసము కుదురుట సులభమని యతడెరుగును. లేక విశ్వాసము కలుగకపోయినను శత్రుత్వములోయున్న తీవ్రత యణగిపోవును. పోరాటములోని ద్వేషము నశించును. శత్రువులతో తన స్వంతవ్యాపారములలో నతడనేకవిజయములను బడసెను. కేవలము వశీకరణశక్తిచేతనే యతడు తన శత్రువును జయించుచుండుటాశ్చర్యము. అనేకమందివిమర్శకులు దూషకులు నతనియాకర్షణశక్తిచే మోహితులయి యతనిని భూషించుచుండిరి. ఒకవేళ విమర్శవిరమింపబడకపోయినను అందులో నవహాస్యము మచ్చునకైన కాన్పించెడిదికాదు.

ఈ శక్తినెరిగిన గాంధీజీ యెప్పుడు తనతో భేధించువారిని కలుసుకొన నుత్సహించును. కాని స్వవిషయములలో చిన్నవిషయములలో వ్యక్తులతో వ్యవహరించుట వేరు. జయభేరీ మ్రోగించు సామ్రాజ్యతత్త్వప్రతినిధియగు బ్రిటిషుప్రభుత్వమువంటి యవ్యక్తరూపముతో వ్యవహరించుట వేరు. దీనిని గుర్తించి గాంధీజీ పెద్దయాశలను పెట్టుకొనకుండగనే వెళ్ళెను. శాసనోల్లంఘనోద్యమమింకను జరుగుచునేయుండెను. ప్రభుత్వముతో సంభాషణలు జరుగుచుండుటచే దాని తీవ్రతమాత్రము తగ్గెను. వెంటనేదర్శనమున కేర్పాట్లుగావింపబడెను. కొద్దిరోజులయిన తరువాత మమ్మందరను ఢిల్లీరమ్మనిరి. మేమచ్చట మూడువారములుండి ప్రతిరోజు కలుసుకొనుచు నలసటవచ్చువరకు చర్చించుచుంటిమి. గాంధీజీ ఇర్విన్‌ప్రభువుతో తఱచు మాట్లాడుచుండెను. కాని యొక్కొక్కప్పుడు మూడునాలుగురోజు లెడముండెడిది. భారతప్రభుత్వము యిండియాఆఫీసుతో సంప్రదించుచుండుటచే నీ యాలస్యము జరిగెడిది. ఒక్కొక్కప్పుడు చిన్నవిషయము, కొన్నిమాటలుకూడ వ్యవహారమున కడ్డమువచ్చుచుండెడివి. శాసనోల్లంఘనమును "నిలుపుజేయుట" అను పదము వాటిలో నొకటి. గాంధీజీ మొదటినుండి చివరవరకు శాసనోల్లంఘనము శాశ్వతముగా నాపివేయబడజాలదని, యదియొక్కటే ప్రజలకున్న యాయుధమని స్పష్టపరచుచుండెను. అయినను అది కొంతకాలము నిలుపుచేయబడవచ్చును. ఇర్విన్‌ప్రభు

నీ పదము కభ్యంతరము చెప్పి యిది శాశ్వతము కావలెననెను. గాంధీజీ దీని కొప్పుకొనలేదు. చివరకు 'విరమింపబడెను' అనుపదము ప్రయోగింపబడెను. కల్లుదుకాణములవద్ద, విదేశవస్త్ర దుకాణముల వద్ద పికెటింగును గురించి చాల రాద్ధాంతసిద్ధాంతములు జరిగెను. మా కాలము చాలవరకు సంధికొరకు కావలసిన తాత్కాలిక ఏర్పాటులను చర్చించుటకే వినియోగింపబడెను. ప్రధానవిషయములను మూలకు త్రోసిరి. తాత్కాలికసంధి చేకూరి, యనుదినము జరుగు చుండిన పోరాటము విరమింపబడిన తరువాత, ప్రసన్నపరిస్థితులలో నీ ప్రధానవిషయములను గురించి యోచింపవచ్చు ననుకొనిరి. ఈ సంభాషణలు శాంతిని చేకూర్చుననియు, దానితరువాత ప్రధానవిష యములనుగురించి సంప్రదింపులు జరుగుననియు నేమనుకొంటిమి.

ఆ రోజులలో ఢిల్లీ నానారకములవారి నాకర్షించుచుండెను. విదేశ పత్రికారచయితలు, ముఖ్యముగా అమెరికావారు, చాలమంది యుండిరి. మే మేమియు చెప్పకుండుటచే వారికి మాపయి విసుగు జనించెను. గాంధీ, ఇర్విన్ సంభాషణలనుగురించి మాయొద్దకంటె క్రొత్త ఢిల్లీ సెక్రటేరియటు ఆఫీసునుంచియే వారి కెక్కువవార్తలు వచ్చెడివని వారు మాతో చెప్పుచుండెడివారు. ఇదిసత్యము. గొప్పగొప్ప హోదాల లోనివారెందరో గాంధీకి నమస్కరింప త్వరపడుచుండిరి. ఏలనన గాంధీజీనక్షత్ర మిప్పు డత్యుచ్ఛదశలో లేదా? గాంధీజీకి, కాంగ్రె సుకు నింతవరకు చాలదూరమునుండి తరచు వానిని నిందించిన వా రిపుడు క్షమార్పణకొరకు త్వరపడుచుండిరి. కాంగ్రెసురోజులు బాగున్నట్లు కాన్పించెను. ఏమో! ముందేమి రానున్నదో! కాంగ్రెసు తోను దాని నాయకులతోను చెలిమిచేసుకొనుటయే మంచిది. సంవత్సరములో వారిలో మరియొక మార్పుకలిగెను. వారు కాంగ్రె సును దానిపనులను నోటినిండ తిట్టనారంభించి దానితో తమకెట్టి సంబంధము లేదనిరి.

కులతత్త్వవాదులుకూడ పరిస్థితులవలన గడబిడపడసాగిరి. రాజోద్యపరిపాలనలో వెనుకపడిపోదు రేమో యని గుంజాటనపడ

సాగిరి. కనుక చాలమంది 'మహాత్మ' దగ్గరకువచ్చి, కులసమస్య మీద రాజీపడుటకు తమ కెట్టియభ్యంతరము లేదనియు నతడు పూనుకొనుచో సమాధానమున కెట్టి కష్టము నుండజాలదనియు సెలవిచ్చిరి. గాంధీజీ మేమునివసించు డాక్టరు అన్సారీయింటికి నిరంతర జనప్రవాహము పెద్దహోదాలవారు కొద్దితరహాలవారు రాదొడంగిరి. మా తీరిక కాలములో మేము వారిని శ్రద్ధతో పరీక్షించుచుంటిమి. కొన్ని వత్సరములనుండి గ్రామ, పట్టణములలో కల బీదలతోను, జయిళ్ళలోను, బయటగలవారితోను మాకు సంబంధములేర్పడెను. గాంధీజీని చూడవచ్చిన శ్రీమంతులు మానవస్వభావ ద్వితీయపక్షమును ప్రదర్శించిరి. ఇది చులకనగా మారిపోవు పక్షము. అధికార విజయములను వా రెచ్చటనైన పసిగట్టుచో తటాలునవచ్చి ప్రవాలెదరు. వారు తమ మందస్మితములతో దాని నాహ్వానము చేతురు. వారిలో చాలమంది బ్రిటిషుప్రభుత్వ ప్రధాన స్తంభములు. భారతదేశములో నే ప్రభుత్వము రాజ్యమునకు వచ్చినను వీరు వారికి కూడ తత్తుల్యముగనే ప్రధాన స్తంభములుగ నుందురు.

ఆ రోజులలో క్రొత్తఢిల్లీలో గాంధీజీతో నేను తరుచు ప్రాతర్విహారములలో జేరుచుండెడివాడను. సాధారణముగ నతనితో మాట్లాడుట కదియే సమయము. పగటిభాగమంతయు విభజింపబడి ప్రతినిమిషము నొక్కొక్క వ్యక్తికో, లేక పనికో వినియోగింపబడును. ఒక్కొక్కప్పుడీ ప్రాతర్విహారముకూడ దూరమునుండివచ్చిన యే దర్శనాభిలాషికో, లేక స్వవిషయములో నాలోచింపవచ్చిన యే స్నేహితునికో యిచ్చివేయబడును. మేము భూత, భవిష్యత్, వర్తమానములను గురించి మాట్లాడితిమి. కాంగ్రెసు భవిష్యత్తును గురించిన యతని యభిప్రాయ మొకటి నా కాశ్చర్యము కలిగించెను. స్వాతంత్ర్యము లభించుటతోడనే కాంగ్రెసు దానంతటది యాగిపోవునని నే నూహించితిని. కాంగ్రెసు సభ్యులు ప్రభుత్వము క్రింద నెట్టిజీతభత్యములను తీసికొనునుద్యోగము చేయరాదను చట్టము నది యామోదింపవలెనని యతడనెను. అట్టి యధికారము కోరునతడు

కాంగ్రెసునుండి వెడలిపోవలెను. అతడు దీని నెట్లు సమర్థించెనో నా కిప్పుడు జ్ఞాపకము లేదు. ఇది చాల యసాధారణభావము. దీనిని నే నర్థము చేసికొనుట కష్టసాధ్యము. దీనివలన నసంఖ్యాకములగు కష్టములు సంభవించును. అట్టిసభను యే పెట్టుబడిదారులో తమస్వార్థములకొరకు కొల్లగొనెదరు. సంభవాసంభవములసంగతి యటుంచినచో దీనివలన గాంధీజీ భావముల వెనుకనున్న యాంతర్యము మన కర్థము కాగలదు. కొన్నియుద్దేశ్యములను పురస్కరించుకొని రాజకీయ, ఆర్థిక నిర్మాణములను పునస్సృష్టి చేయవలెనను భావములతో రాజకీయాధికారమును పొందవలెననెడి యాధునిక పార్టీసిద్ధాంతముల కిది కేవలము వ్యతిరేకము.

గాంధీజీ ప్రజాస్వామికభావము నిస్సంశయముగ నాధ్యాత్మికమైనది. దానికి మామూలుగ వాడబడుసంఖ్యతోను, మెజారిటీతోను ప్రాతినిధ్యముతోను సంబంధము లేదు. అది త్యాగముమీద, సేవ మీద నిర్మింపబడును. అది నైతికశక్తినే యుపయోగించును. ఈ మధ్య నొక స్టేటుమెంటులో * ప్రజాస్వామ్యవాది నతడు నిర్వచించెను. 'పుట్టుకచేత నేను ప్రజాస్వామ్యవాదని' అని యతడనును. "మానవజాతిలోని గర్భదరిద్రులతో పూర్తిగ నైక్యమగుట, వారికంటె నెక్కుడుగా జీవింపవలెనను కోరిక లేకపోవుట, దానికి తగినట్లు బుద్ధిపూర్వకముగా నా స్థితిని పొందుటకు శక్తికొలది పనిచేయుట ఇవి ప్రజాస్వామ్యవాదికి లక్షణములైనచో నే నట్టివాడనే" ప్రజాస్వామ్యమును గురించి యతడింకను యిట్లు చెప్పెను.

"కాంగ్రెసుకు కలిగిన ప్రజాస్వామ్యలక్షణము, పలుకుబడి ప్రతి వత్సరము కాంగ్రెసు సభలకు వచ్చు ప్రతినిధులసంఖ్యచేత ప్రేక్షకుల సంఖ్యచేత నేర్పడలేదని యది నిరంతరాభివృద్ధిగా చేసిన సేవ చేతనే యేర్పడెనని మనము గుర్తించెదముగాక! పాశ్చాత్య ప్రజాస్వామికము, యిదివరకే వ్యర్థమయ్యెనని రుజువుకానిచో, నిప్పుడు పంచాగ్నిహోత్రములమధ్య నున్నది భారతపుణ్యభూమియే, ప్రత్యక్ష

---

* 1934 సెప్టెంబరు 17వ తేదీ

యుదాహరణ పూర్వకముగ దాని విజయమునుచూపి, యదార్థ ప్రజాస్వామ్యశాస్త్రమును వెలుగొందచేయుగాక! అవినీతి, మోసము ప్రజాస్వామిక ఫలితములు కాకూడదు. నేడవి నిస్సందేహముగ ప్రస్ఫుటమగుచున్నవి. సంఖ్యయే ప్రజాస్వామికముకు నిజమైన పరీక్ష కాదు. ఏకొద్దిమందియో తాము ప్రాతినిధ్యము వహించు ప్రజ యొక్క యాంతర్యమును, కోరికను యాశయములను ప్రతిబింబింప చేయుట యదార్థ ప్రజాస్వామికముకు వ్యతిరేకముకాదు. దౌర్జన్య పద్ధతులచే ప్రజాస్వామ్యము పరిణామమును పొందజాలదని నేను చెప్ప గలను. ప్రజాస్వామ్యతత్త్వమును బాహ్యమునుండి యెక్కించుటకు వీలులేదు; అది యంతరంగ జనితము."

అతడు చెప్పినట్లు నిశ్చయముగా నిది పాశ్చాత్య ప్రజాస్వామి కముకాదు. కాని దీనికి కమ్యూనిస్టుల ప్రజాస్వామిక భావములకు కొంతపోలికకలదు. ఏలనన అందులోకూడ కొంత యాధ్యాత్మిక వాసన కలదు. కొద్దిమంది కమ్యూనిస్టులు ప్రజల యదార్థావసరములకు, కోరికలకు ప్రతినిధులమని చెప్పెదరు. ప్రజ వారిదృష్టిలో నొక యాధ్యా త్మిక భావమగును. దీనికే ప్రతినిధులమని వారుచెప్పుదురు. అయినను యీ పోలిక చాలస్వల్పము. ఇది చాలదూరము పోజాలదు. దృష్టిలోను, విషయగ్రహణములోను, ముఖ్యముగా పద్ధతులలోను, దౌర్జన్యము లోను, వారికి గొప్ప భేదములు కలవు.

గాంధీజీ ప్రజాస్వామ్యవాది యైనను కాకపోయినను భారత వ్యావసాయిక ప్రజకు ప్రతినిధియగుట నిస్సంశయము. ఆ కోట్లకొలది ప్రజలవ్యక్తావ్యక్త కోరిక లతనిలో మూర్తీభవించెను. అది ప్రాతి నిధ్యముకంటె కొంచెమధికమేయగును. అతడు సామాన్య వ్యవసాయ కుడుకాడు. అతినిశితమైన కుశాగ్రబుద్ధి, మృదులములైనభావములు, పరిపక్వ సంస్కారము, విశాలదృష్టి, దయాళుత్వముకలవాడు. అయి నను ముఖ్యముగా సన్యాసి. అతడు తనరాగములను, ఉద్రేకములను అణచివేసి, వానిని పునీతమొనర్చి యాధ్యాత్మిక వీధులకు త్రిప్పెను. సూదంటురాయివలె నతడు మనుష్యులనాకర్షించును. అతడు భయ

భక్తులను వినయ విధేయతలను స్నేహములను పురిగొల్పును. ఇది యంతయు వ్యవసాయకుని కల్పితమైనది. అతనితో పోలిక లేనిది. అయినను అతడు పెద్దరయితు. రయితులవలెనే యతడు విషయములను చూచును. రయితులవలెనే జీవితములోని కొన్ని యంశములపట్ల సంధుడుగ నుండును. కాని భారతదేశము రయితుదేశము కనుక నతడు తనభారతదేశమును బాగుగ నెరుగును. దాని యెంత చిన్నకదలికనైన నతడు బాగుగ పసికట్టును. అతడెట్టి స్థితినైన నతిసూటిగ స్వభావసిద్ధముగ గ్రహించి మంచి యదనుదొరికిన సమయములో పనిచేయును.

ఆహా! బ్రిటిషుప్రభుత్వముకేగాక తనప్రజలకు నతి సన్నిహిత సహచరులకుగూడ నతడెంతయు దుర్గ్రాహ్యుడు! బహుశః ప్రతిదేశములో నతడీరోజులలో వింతవస్తువగును. భారతదేశమింకను అతనినిగ్రహించి నట్లు కాన్పించదు. లేదా పాపమును, మోక్షమును, దౌర్జన్యరాహిత్యమునుగురించి మాట్లాడు మతప్రవక్తనది యభినందించును. అపార త్యాగములచేతను, కఠిన తపస్సుచేతను 'పుణ్యపర్వతమును' సృజించి కొంతమంది చిన్న దేవతలరాజ్యములను భయపెట్టి పాతుకొనిన పరిపాలననుకూలద్రోసిన సన్యాసులకథలనేకములు భారతపురాణములలో కలవు. ఒకయనంతయాధ్యాత్మిక ప్రవాహమునుండి వెల్లివిరియు గాంధీజీ యాత్మశక్తిని నేను వీక్షించునపుడీపురాణకథలు తరచు నా మనస్సులోనికి వచ్చుచుండెడివి. నిశ్చయముగా నతడు ప్రపంచసామాన్య టంకసాలలో తయారైనవాడు కాడు. అతడు వేఱొకయసాధారణ జాతిలో ముద్రింపబడెను. తఱచు అతని కన్నులనుండి మమ్మగ్రాహ్యమైనదేదియో చూచుచుండెడిది.

హిందూదేశము, పట్టణ, నూతనపారిశ్రామిక హిందూదేశము కూడ వ్యవసాయపోకడలను కలిగియుండెను. కనుక నది తన యీ కుమారుని తనవలెనేయుండి తనవలెనుండనివానిని, మహానాయకునిగ చేయుటెంతయు సహజము. అతడు పురాణస్మరణములను సగము మఱచిపోబడినవాటిని త్రవ్విపైకితీసి యామెకు తన నిజాత్మయొక్క

తళుకులను కనపరచెను. వర్తమాన యంధకారబంధురమగు దుఃఖములో నలిగి యామె నిరర్థక భూత, భవిష్యత్కాలలతో శాంతినొందుటకు ప్రయత్నించెను. కాని యత డామెమనస్సున కాశను, పూర్తిగ చితుకకొట్టబడిన శరీరముకు బలమును, శక్తిని ప్రసాదించెను. భవిష్యత్తు మోహజనకముగ కాన్పించెను. జానస్ వలె నడ రెండు ముఖములతో భూత భవిష్యత్తులను చూడ నారంభించి రెంటిని మిళితము చేయజూచెను. జోడింపజూచెను.

మాలో చాలమంది యీ వ్యవసాయకదృష్టితో సంబంధము త్రెంచుకొంటిమి. పూర్వకాలపుభావములు, ఆచారములు, మతములు మాకు విదేశీయములయ్యెను. మే మాధునికులమను నామకరణము పెట్టుకొంటిమి. అభివృద్ధి, పారిశ్రామికమయము చేయుట, జీవితప్రమాణము నున్నతిచేయుట, సామ్యముచేయుట మొదలగు భావములతో మేము భావించుచుందుము. వ్యవసాయకుని దృష్టి యరిష్టదాయకమని మేము భావించితిమి. కొంతమంది సామ్యవాదమును, కమ్యూనిజమును అభిమానించితిమి. రాజకీయముగ మేము గాంధీజీతో నెట్లు సంపర్కము పెట్టుకొనగలిగితిమి ? చాలమంది యతని ప్రియశిష్యుల మెట్లయితిమి ? ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చుట చాలకష్టము. గాంధీజీ నెరుగనివాని కే సమాధానము తృప్తికరముగ నుండజాలదు. వ్యక్తిత్వమనిర్వచనీయమైనది. అది మనుష్యులయాత్మల నాకర్షించు నొక వింతశక్తి. అతనిలో నిది యపారముగకలదు. అతనిదగ్గరకు పోవు ప్రతివానికి తఱచుగా నతడు వివిధదృక్కులలో కాన్పించును. అతడు ప్రజల నాకర్షించును. కాని తుదకు మానసిక విశ్వాసమువారి నతనియొద్దకు తెచ్చికట్టివేయును. అతని జీవిత వేదాంతముతో వా రేకీభవింపరు. అతని యనేకాదర్శములతో కూడ వా రేకీభవింపరు. తఱచతడు వారికగ్రాహ్యుడు. కానియతడు సూచించిన కార్యము నేత్రగోచరమైనది. దానిని బుద్ధిచే గ్రహింపవచ్చును. గుర్తింపవచ్చును. శుష్కరాజకీయములు దోహదముచేసిన నిర్జీవసాంప్రదాయానంతర మేకార్యముకైనను స్వాగతముండెడిది. ధైర్యోపే

తము, జయప్రదము, నైతికశక్తివిరాజితము నగుకార్యమును త్రోసి వేయుట కెవరితరము? బుద్ధిని, భావప్రపంచములుకూడ నది ముంచి వేసెను, క్రమక్రమముగా నతడు తన కార్యహేతుత్వమునుగురించి మమ్మొప్పించెను. అతని వేదాంతమును మే మంగీకరింపకపోయినను మే మతని ననుసరించితిమి. కార్యమును, దాని వెనుక నున్న భావమును విడదీయుట బహుశః సరియైనపద్ధతికాదు. ఇది తరువాత మానసిక పోరాటమును చిక్కులను తెచ్చిపెట్టును. గాంధీజీ, ప్రధానముగా కర్మవీరుడు. మారుచెందుపరిస్థితుల నతిసూక్ష్మముగా గ్రహించువాడు కనుక మాకు యుక్తమని తోచినమార్గమున నడుచునని మే మవ్యక్తముగ నాశించితిమి. ఏమయిన నతడు నడుచుబాట యింతవరకు సక్రమముగ నుండెను. ముందెప్పుడో విడిపోవలసినచ్చునని దాని నిప్పుడే తల పెట్టుట యుక్తము; అవ్యక్తము.

ఇదంతయు మాకు మనోనిశ్చయము, అకలంకత, యేర్పడ లేదని తెలుపును. మే మెక్కువ తార్కికులము కావచ్చును. కాని గాంధీజీ మాకంటె భారతదేశము నెక్కువగ నెరుగునని మే మెప్పుడును భావించెడివారము. అట్టి యద్భుత భక్తివిశ్వాసములను చూరగొనిన వానిలో ప్రజల యభీష్టాశయములను నెరవేర్చునదేదియో యుండవలెను. మే మతని నొప్పింపగలిగినచో నీప్రజలనందరను త్రిప్పివేయవచ్చునని భావించితిమి. అతని నొప్పించుట సాధ్యముగనే కనిపించెను. ఏలనన అతనిదృష్టి వ్యవసాయక దృష్టియేయైన జన్మతః తిరుగుబాటుదారు, గొప్పమార్పులను తెచ్చిపెట్టు విప్లవకారుడు. జయాపజయముల కత డెంతమాత్రము లక్ష్యముచేయడు.

స్థబ్దులు. నీరసులు నయిన మనప్రజల నత డెంతయాశ్చర్యముగ శిక్షించెను. దార్ఢ్యముచేతను, ద్రవ్యముచేతను నాశపెట్టి యుత డట్లు చేయలేదు. అతని సాధుదృష్టి, మృదువచనము వంతకంటె నతని నిజోదాహరణము-యివియే యతని పరశువేది. 1918 నాటి సత్యాగ్రహదినములలో బొంబాయినివాసియగు ఉమరసొభాని యతనికి ప్రియమైన 'బానిసబోధకుడు' అని పేరిడుట నాకు జ్ఞాపక

మున్నది. తరువాత గడచిన పన్నెండు సంవత్సరములలో నెంతయో జరిగెను. ఈ మార్పులు చూచునరకు మరి జీవించలేదు. కాని యెక్కువ యసంతృప్తవంతులమయిన మేము 1931 వ సంవత్సరములోని మొదటినెలలనుంచి సంతోషోత్సాహ తరంగములతో వెనుకకు చూచితిమి. 1939 మా కొక వింత సంవత్సరము! గాంధీజీ తన మోహనాస్త్రముచే మన దేశము నొక్కసారిగా మార్చివేసినట్లు కాన్పించెను. బ్రిటిషు ప్రభుత్వమును జయించితిమనుకొనిన మూర్ఖు లెవరును లేరు. మన యుత్సాహభావమునకు ప్రభుత్వముతో నెట్టి సంబంధమును లేదు. మనము మన ప్రజలు నారీమణులు మనయువకులు మనబాలురు యుద్యమములో చూపిన ధైర్యసాహసములకు గర్వించి తిమి. అదియొక యాధ్యాత్మిక విజయము. అది సర్వులకు సర్వకాల ముందు నమూల్యమైనది. కాని పరాధీనులను, అణగద్రొక్కబడిన వారము నగు మనకది మరింత యమూల్యమైనది. దీనిని పోగొట్టున దేదియు జరుగకూడదని మే మాతురపడితిమి.

స్వయముగ నాయెడల గాంధీజీ యెప్పుడు నసాధారణ దయ గౌరవము చూపెను. మా తండ్రినిర్యాణ మతనిని నాకు మరింత సామీప్యమునకు తెచ్చెను. నేను చెప్పినదాని నతఁ డెప్పుడు నతి యోర్పుతో విని నా కోర్కెలను తీర్చుట కన్నియత్నములను చేసెను. నేను మరికొంతమంది సహచరులముకలసి యతనిని సామ్యవాద మార్గములోనికి మార్చగలుగుదుమని నే ననుకొంటిని. అతని కది వచ్చినచో క్రమముగా మారెదనని యతడేయనెను. ప్రస్తుత పరి పాలన క్రమములోని దౌర్జన్యము, అన్యాయము, వ్యయము, దుఃఖము మొదలగు వాటినుండి తప్పించుకొనుటకు నాకు వేరు మార్గము కాన్పించకపోవుటచే నతడు విధాయకముగ సామ్యవాద మూలసూత్రము నంగీకరించునట్లు కాన్పించెను. అతడు పద్ధతులలో భేదింపవచ్చును. కాని యాదర్శముతో భేదింపడని నే నప్పు డను కొంటిని. కాని గాంధీజీ యాదర్శములకు సామ్యవాదలక్ష్యమునకు ప్రధానభేదములే యున్నట్లు నే నప్పుడు గ్రహించితిని.

1931 ఫిబ్రవరి ఢిల్లీకథకు వర్తము. గాంధీయిర్విన్ సంభాషణలు కొంతవరకు నడిచినడిచి హఠాత్తుగా నాగిపోయెను. చాలరోజులవరకు వైస్రాయి గాంధీజీకొరకు కబురుపంపలేదు. మా కంతయు భగ్నమయి నట్లేతోచెను. వర్కింగుకమిటీ మెంబర్లు తమతమ రాష్ట్రములకు వెళ్ళుటకు సిద్ధమయిరి. విడిపోవుటకు పూర్వము ముందు కార్యక్రమమును గురించియు, శాసనోల్లంఘనమునుగురించియు మేము సంప్రదించితిమి. భగ్నమయినసంగతి నిశ్చయమయినతోడనే తిరిగి కలుసుకొనుటకు, సంప్రతించుటకు నవకాశముండదని మేము భావించితిమి. నిర్బంధములు చెలరేగునని ప్రభుత్వము కాంగ్రెసుపై తీవ్రముగ దాడి సలుపునని మది నే మింతవరకు చవిచూచిన దానికంటె ఘోరముగు నని యనుకొంటిమి. ఆఖరుసభ యనుకొనినసభలో మేము కలుసుకొంటిమి. ఉద్యమమును నడుపుట కనేక తీర్మానములు చేసితిమి. ఒక తీర్మానమునకు కొంత ప్రాధాన్యతకలదు. ఇంతవరకు ప్రతి తాత్కాలికాధ్యక్షుడు తాను నిర్బంధింపబడినచో తన స్థానము కొకనిని పేర్కొనుచుండెను. ఖాళీయయిన స్థానములలో వర్కింగుకమిటీ సభ్యులను పేర్కొనుచుండెను. స్థానీయముగ వచ్చిన వర్కింగుకమిటీలు పనిచేయకుండెను. అవి యే విషయములోను క్రొత్తగా జోక్యము తీసికొనజాలవు. వారు జయిలుకుమాత్రమే పోగలరు. ఇట్లు నిరంతరము స్థానీయులను పెట్టుచుండుపద్ధతి సాహసమైనది. ఇది కాంగ్రెసును తప్పుమార్గములో పెట్టవచ్చును. దానివలన కొని యుపద్రవములున్నవి. కనుక ఢిల్లీలోని వర్కింగుకమిటీలో తాత్కాలికాధ్యక్షులను పేర్కొనుట, స్థానీయసభ్యులను పేర్కొనుట పనికిరాదని తీర్మానింపబడెను. మొదటి కమిటీలోని మెంబరు, మెంబర్లు పయినున్నంతసేపు వారే పూర్తికమిటీవలె పనిచేతురు. వారందరు జయిలులోనుండుచో పనిచేయు కమిటీయే యుండదు. కాని నే మప్పుడు వర్కింగుకమిటీ యధికారములు దేశములోని ప్రతిమనిషిలోను స్త్రీలోను నిలిచి యుంచునని గంభీరముగాచెప్పి పోరాటము నప్రతిహతముగ సాగింపవలసినదని హెచ్చరించితిమి.

ఈ తీర్మానము యుద్ధమును సాగించుట కొరక ధైర్యమైన త్రోవ. ఇందులో రాజీకెంతమాత్రము చోటులేదు. కాంగ్రెసు యొక్క ముఖ్యస్థానములో కూర్చొని దేశమంతటితోను సంపర్కము కలిగియుండుట నిరంతర సందేశములనుపంపించుట దుర్ఘటమగుచున్న దను సంగతికూడ యిది గుర్తించెను. ఇది తప్పనిసరి. మన సేవకులలో చాలమంది పేరు ప్రఖ్యాతులుగల స్త్రీలు, పురుషులు గలరు. వారు బహిరంగముగనే పనిచేతురు. వారెల్లప్పుడు నిర్బంధింపబడ వచ్చును. 1930 వ సంవత్సరములో సందేశములను తీసికొనివెళ్ళుటకు నివేదికలను పట్టుకొనివచ్చుటకు తనిఖీచేయుటకు రహస్యవార్తా ప్రచారశాఖయొకటి నిర్మింపబడెను. ఇది బాగుగనే పనిచేసెను. రహస్యవార్తలను తెచ్చుశాఖను జయప్రదముగ నడిపింపగలమని యిది ఋజువుచేసెను. కాని కొంతవరకిది మన బహిరంగయుద్యమమునకు సరిపడలేదు. గాంధీజీ దీనికి వ్యతిరేకి. ప్రధానస్థానమునుండి సందేశములు రానపుడు పనినినిర్వహించుబాధ్యత స్థానికప్రజలమీద పెట్టకతప్పదు. లేనిచో వారు పైనుండి యాదేశము వచ్చునని యసహాయులై చూచుచు యూరకొనెదరు. సాధ్యమైనపుడాదేశములు పంపబడుచుండెను.

కనుక మేమీ తీర్మానమును, యితరతీర్మానములను నామోదించి వెళ్ళిపోవుటకు మూటలుకట్టితిమి. అప్పుడే యిర్విన్ ప్రభువువద్ద నుండి మరియొక పిలుపువచ్చెను. సంభాషణలు తిరిగి ప్రారంభమయ్యెను. మార్చి 4 వ తేదీ రాత్రి రెండుజాములవరకు మేము వైస్రాయి యింటివద్దనుంచి రావలసిన గాంధీజీకొరకు వేచియుంటిమి. అతడు రెండుగంటలకు తిరిగివచ్చి మమ్ము నిద్రనుండిలేపి సమాధానము కుదిరెనని చెప్పెను. మేము ముసాయిదా చూచితిమి. నేను చాలవరకు షరతుల నెరుగుదును. అవి యనేకసారులు చర్చింపబడెను. కాని మొట్టమొదటనేయున్న రెండవషరతు, రక్షణలు మొదలగువాటికి సంబంధించినది, నాకాశ్చర్యము కలిగించెను. నేను దాని కెంతమాత్రము సుముఖుడను కాను. నేనప్పుడేమియు చెప్పలేదు. మేమందరము నిద్రించితిమి. చెప్పవలసినదేదియును లేదు.

జరగవలసినపని జరిగిపోయెను. మన నాయకుడు మాటయిచ్చెను. మన మతనితో నేకీభవింపకపోయినను మన మేమి చేయగలము? అతనిని త్రోసివేయవలెనా? అతనితో త్రెంచుకొనవలయునా? మన అభిప్రాయభేదమును ప్రకటింపవలెనా? అది యొకవ్యక్తికి కొంత యాత్మతృప్తినీయవచ్చును. కాని తుదినిశ్చయము నదియేమియు చేయజాలదు. తాత్కాలికముగనైనను శాసనోల్లంఘనము సమాప్తమయ్యెను. ప్రభుత్వము గాంధీజీయొక్క సమాధానమున కిదివరకేయంగీకరించెనని ప్రకటింపగలిగినపుడు వర్కింగుకమిటీకూడ నిప్పుడు దానిని నడిపింపజాలదు. మా యితర సహచరులవలెనే నేనును శాసనోల్లంఘనము నాపివేసి ప్రభుత్వముతో తాత్కాలిక సంధిచేసికొనుటకు సంపూర్ణముగా నిచ్ఛగించుచుంటిని. మా సహచరులను తిరిగి జయిలుకు పంపించుట మా కెవరికి సులభవిషయముకాదు. ఇదివరకే జయిలులో నున్న యనేకవేలమంది నచ్చటనేయుంచుటకు మేము కారకులము కాజాలము. మాలో చాలమంది జయిలులోనుండుటకు తగుశిక్ష పొంది, యచ్చట జరుపవలసిన నిత్యవిధులనుగురించి పరిహాసముగా మాట్లాడినను జయిలు రాత్రిందివములు గడుపుటకు సంతోషప్రదమైన ప్రదేశముకాదు. ఇదిగాక మూడువారముల గాంధీజీ యిర్విన్ సంభాషణలవలన సమాధానము చేకూరునని దేశము భావించుచుండెను. చివరికది భగ్నమగుట ప్రజలకాశాభంగమగును. కనుక వర్కింగుకమిటీలోని మే మందరము మా ప్రధానస్థితికి భంగము గలుగకుండు పద్ధతిని, తాత్కాలిక సమాధానమునకు ప్రసన్నముగనే యుంటిమి.

గొప్పవాదముకు తావిచ్చిన యనేకాంశములతో నా కంత ప్రసక్తిలేదు. అన్నిటికంటె రెండువిషయములలో నా కెక్కువ శ్రద్ధ యుండెను. ఒకటి మన స్వాతంత్ర్యలక్ష్య మెప్పుడు నేవిధముగను చెక్కుచెదరకుండవలెను. రెండవది యు. పి. లో నున్న వ్యవసాయదారులస్థితి నీ సమాధానము బాధించకూడదు. మా పన్నుల నిరాక

రణము లేక శిస్తులనిరాకరణ మింతవరకు చాల జయప్రదముగనుండెను. కొన్ని ప్రాంతములలో చిల్లిగవ్వ టింగునబోణీకాలేదు. రయితులందరు నుత్సాహభరితులైయుండిరి. ప్రపంచవ్యవసాయ పరిస్థితులు, ధరలు మునుపటికంటె నధ్వాన్నముగ నుండెను. మా పన్నుల నిరాకరణము రాజకీయము నార్థికముకూడ నై యుండెను. ప్రభుత్వముతో తాత్కాలిక సమాధానము కుదురుచో శాసనోల్లంఘనము విరమింపబడును. పన్నుల నిరాకరణమునకు రాజకీయకారణము తగ్గిపోవును. కాని యార్థికసమస్య యేమగును? విపరీతమగు ధరలవ్యత్యాస మేమగును? ప్రభుత్వ డిమాండును చాలమంది రయితులు చెల్లింపజాలరు. గాంధీజీ యీ విషయమును యిర్విన్ ప్రభువుకు స్పష్టపరిచెను. పన్నుల నిరాకరణము విరమింపబడును. కాని వారిశక్తికిమించి చెల్లింపవలసినదని మేము రయితులకు చెప్పజాలమని యతడు నిష్కర్షగా చెప్పెను. ఈ విషయము రాష్ట్రమునకు చెందినది కనుక భారత ప్రభుత్వముతో వివరముగా చర్చించుటకు వీలులేకపోయెను. రాష్ట్రప్రభుత్వ మీ విషయమును గురించి మాతో సంప్రతించెదరని, రయితుల దుఃఖములను బాపుటకు వారి యధికారములోనున్నంతయు చేసెదరని మాకభయహస్తమిచ్చిరి. అది యస్పష్టమైనబాస. కాని యా పరిస్థితులలో నంతకంటె నిశ్చయమైన వాగ్దానమును పొందుట కష్టము కనుక నీ విషయమిట్లు తాత్కాలికముగ పరిష్కారమయ్యెను. ఇక మనలక్ష్యమునకు చెందిన ప్రధానసమస్య మిగిలెను. సమాధానములోని రెండవషరతులో నిదికూడ భగ్నముగావింపబడినట్లు నాకు తోచెను. దీని కొరకేనా మనప్రజ లొకవత్సర మంత ధైర్యస్థైర్యములతో పోరాడిరి ? మన ధైర్యవచనములు, క్రియలు దీనితో సమాప్తము చెందవలెనా? ఈ విధముగ నా మార్చి రాత్రియంతయు దీర్ఘాలోచనాతత్పరుడనయి యుంటిని. అమూల్యమయిన దేదియో పోయినట్లు నదియిక పునర్లభ్యము కానట్లు నా హృదయములో నొక శూన్యత యేర్పడెను.

35

కరాచీ కాంగ్రెసు

నా జిజ్ఞాస గాంధీజీ కెట్లో తెలిసెను. మరునాడు ప్రాతఃకాలమున నన్నతను తనతో షికారురమ్మనెను. మేము చాలసేపు మాట్లాడితిమి. ప్రధానమైన దేదియు పోలేదనియు నెట్టి సిద్ధాంతమును జారవిడువలేదనియు నన్నతఁ డొప్పింపయత్నించెను. సమాధానములోని రెండవపరతు కతడు మన స్వాతంత్ర్యకోరికకు సరిపడునట్లొక చిత్రమైన యర్థము తీసెను. అందులోని "భారత ప్రయోజనముల కొరకు" అను మాటలమీఁద నతడెక్కువగా నాధారపడెను. ఆయర్థము నాకు 'బలవంత గ్రాహ్యార్థముగా' కాన్పించెను. అది నాకు నచ్చలేదు. కాని యతని సంభాషణ నాకు కొంత యుపశాంతిగా నుండెను. అగ్రిమెంటు గుణావగుణములటుండ మమ్మాశ్చర్యచకితులనుచేయు నతని విధానము నాకు భయంకరముగ నున్నదని నే నతనితో చెప్పితిని. అతనిలో నగ్రాహ్యమయిన దేదియో యుండెను. పదునాలుగు సంవత్సరము లతని కత్యంత సన్నిహితుడనై యుండినను నా కది యిసుమంతయు నర్థముకాలేదు. అదియే నాకు భయము గొల్పుచుండెను. తనలో నగ్రాహ్యమయిన దేదియో యున్నదని యతడే యొప్పుకొని దానికి తానేమియు చెప్పజాలననియు నది యెచ్చటకు తీసికొనిపోవునో జోస్యము చెప్పజాలననియు చెప్పెను.

ఒకటి రెండురోజు లేమిచేయుటకుతోచక నేను మనశ్శాంతిలేక యిటునటు తిరిగితిని. అప్పుడా యగ్రిమెంటు నెదిరించవలెనని, అడ్డుపెట్టవలెనని నాకులేదు. ఆ స్థితి దాటిపోయెను. నేను చేయఁగలిగిన దంతయు వ్యవహారములో దాని నంగీకరించుచు నామకః దానితో సంబంధములేదని యనుకొనుటయే! అది నా వ్యక్తిగత యహంకారమునే తృప్తిపరచునుగాని పెద్దసమస్య నెట్లు చక్కబరచగలదు? చేసినదానిని సంతోషపూర్వకముగ నంగీకరించి గాంధీజీవలెనే దాని

కత్యంత ప్రసన్నమగు యర్థమునే యేల చెప్పుకొనగూడదు? అగ్రిమెంటు జరిగినవెంటనే పత్రికాప్రతినిధుల కత డీ యర్థమునే స్పష్టపరచి మేము పూర్తిగా స్వాతంత్ర్యమునే సమర్థించుచున్నామని చెప్పెను. అత డెట్టిదురభిప్రాయములు కలుగకుండ నీ యంశమును యిర్విన్‌కు స్పష్టపరచెను. కాంగ్రెసుతరఫున ఆర్. టి. సి. కి ప్రతినిధిని పంపవలసియున్నచో నీ షరతులమీదమాత్రమే పంపెదమనియు, నీ హక్కుకొరకు వాదించెదమనియు నతడతనితో చెప్పెను. ఇర్విన్‌ప్రభు వీ యధికారము నంగీకరింపడు. కాని కాంగ్రెసుకు దానినిగురించి వాదించుటకు హక్కుకలదని గుర్తించెను.

కనుక నేను మానసిక పోరాటముతోను, శరీరబాధతోను అగ్రిమెంటు కంగీకరించుటకు, హృదయపూర్వకముగ పనిచేయుటకు నిశ్చయించితిని. నాకు మరియొక మధ్యమార్గమేమియు కాన్పించలేదు.

గాంధీజీ యిర్విన్‌ప్రభువుతో నగ్రిమెంటుకు రాకముందు తనువాత శాసనోల్లంఘన ఖయిదీలనేగాక తదితర రాజకీయ ఖయిదీలనుకూడ విడుదలచేయవలసినదని కోరెను. మొదటివారు అగ్రిమెంటు షరతుప్రకారము విడుదల యగుదురు. కాని విచారణ చేసినతరువాత శిక్షింపబడినవారు, విచారణచార్జీ, శిక్షలేకుండగనె యుంచబడినవారు వేలకొలదికలరు. ఈ డెటెన్యూలలో చాలమంది యనేక సంవత్సరము లీవిధముగనే యుంచబడుటచే భారతదేశమంతట ముఖ్యముగా దీనిచే నెక్కువగా బాధపడుచున్న వంగదేశములో, విచారణలేకుండ ఖయిదుచేయుపద్ధతిపై కల్లోలము హెచ్చుచుండెను. పెంగ్విన్ ద్వీపప్రధానివలె భారతప్రభుత్వము రుజువులేవియు నుత్తమరుజువులు కాజాలవని విశ్వసించిరి. డెటెన్యూలు దౌర్జన్యయుతమగు తిరుగుబాటుదారులు లేదా దాని కుద్యుక్తులైనవారు గాంధీజీ, అగ్రిమెంటుషరతుగాగాక, వంగదేశములోని రాజకీయ యుద్రేకమును తగ్గించి యెక్కువసుముఖవాతావరణమును కలిగించుటకు వారిని విడుదలచేయవలసినదని కోరెను. కాని ప్రభుత్వమువారు దీని కొప్పుకొనలేదు. భగత్సింగు మరణశిక్షను మార్చ

వలసినదని గాంధీజీ చేసిన వాదననుకూడ ప్రభుత్వ మంగీకరింపలేదు. దీనికి అగ్రిమెంటుకు సంబంధమేమియు లేదు. భారతదేశమంతయు నీ విషయమై గగ్గోలుగానుండుటచే నతడు దీనిని ప్రత్యేకముగా కోరెను. అతనికోరిక వ్యర్థమయ్యెను.

భారతదేశ టెర్రరిష్టుసంఘ చిత్తవృత్తిని తెలుపుప్రసంగ మొకటి నాకు జ్ఞాపకమున్నది. ఇది నా విడుదలయైన వెంటనే జరిగెను. ఒక క్రొత్తవ్యక్తి నన్ను చూచుటకువచ్చెను. అతడు తనపేరు చంద్రశేఖర అజదు అని చెప్పెను. నే నతని నెప్పుడు చూడలేదు. కాని, పది సంవత్సరములక్రితం మతడు పాఠశాలనుండి విరమించి యన్. సి. ఓ. లో జయిలుకు వెళ్ళినట్లు వింటిని. అతడప్పుడు పదిహేను సంవత్సరములవాడు. జయిలు నియమము నుల్లంఘించెనని యతనిని కొరడాలతో బాదిరి. తరువాత నతడు టెర్రరిస్టుగా మారి యుత్తర హిందూదేశములో నొక నాయకుడయ్యెను. ఈ చరిత్ర నేను కర్ణాకర్ణిగ వింటిని. నే నీ వదంతులలో నెట్టిశ్రద్ధ తీసికొనలేదు. నే నతనిని చూచి యాశ్చర్యపడితిని. కాంగ్రెసుకు ప్రభుత్వమునకు రాయబారము జరుగునను వదంతులు విని యితడు నన్ను చూడవచ్చెను. సమాధానము కుదిరిన తమసంఘమును కేమైన శాంతిచేకూరునా? యని యడుగుటకతడువచ్చెను. వారింకను న్యాయబాహ్యులుగనే భావింపబడి యట్టి యాదరణనే పొందుదురా? తలదాచుకొనుటకు చోటు లేకుండ తరుమగొట్టబడుదురా? ఉరికంబము లెప్పుడు వారికొరకెదురు చూడవలసినదేనా? లేక ప్రశాంతమగు వృత్తుల నవలంబించుటకు సావకాశములున్నవా? కేవల టెర్రరిస్టు పద్ధతులవలన లాభములేదని, వాటివలన నెట్టిమంచి చేకూరలేదని గ్రహించితిమని యతడుచెప్పెను. అయినను భారతదేశము కేవలము శాంతిపద్ధతులచేతనే స్వాతంత్ర్యమును బడయుగలదనునమ్మక మతనికిలేదు. భవిష్యత్తులో నెప్పుడో యొకప్పుడు దౌర్జన్యము రావచ్చుననియు, కాని యది టెర్రరిజము కాదనియు నతడుచెప్పెను. కనుక నతడు భారతస్వాతంత్ర్యమునకు సంబంధించినంతవరకు ప్రస్తుత టెర్రరిజము పనికిరాదనెను. కాని

ప్రశాంతముగా నివసించుటకెట్టి యవకాశము కలుగజేయకుండ "నన్నెల్లప్పుడు తరుమగొట్టుచున్నప్పుడు నేనేమిచేయవలెను" అని యతడడిగెను. ఈ మధ్య జరిగిన టెర్రరిస్టుచర్యలు చాలవర కాత్మ రక్షణకొరకు చేయబడినవే యని యతడు చెప్పెను.

టెర్రరిజములో విశ్వాసము నశించుచున్నదని అజదు ద్వారా విని నేను చాలసంతోషించితిని. ఈ విషయములో నాకు తరువాత మరింత నమ్మకము చిక్కెను. అది యొకసంఘముయొక్క భావముగా ననుభవములో నంతరించెను. అచ్చటచ్చట వ్యక్తులకు సంబంధించి యేదో యొక ప్రత్యేకకారణముచేత ప్రతీకారముకొరకవి జరుగు చుండును. అనగా పాతటెర్రరిస్టులు వారి నూతన సహాధ్యాయులు, కార్జన్యరాహిత్యతత్త్వమును స్వీకరించిరని, బ్రిటిషుపరిపాలన నభినం దించువారైరని దీని యర్థముకాదు. వారు టెర్రరిజము నిదివరకు వలె భావించుటలేదు. చాలమందికి ఫాసిజము వాసనలున్నట్లు నాకు కాన్పించెను.

నేను చంద్రశేఖర అజదుకు నా రాజకీయతత్త్వము బోధించి, నా దృక్పథముకు మార్చుకొనచూచితిని. కాని "నేనిప్పుడేమి చేయ వలెను" అని యతడడిగిన ప్రధానప్రశ్నకు నేను నిరుత్తరుడనైతిని. అతనికి అతనివారికి శాంతియుండు సూచనలులేవు. భవిష్యత్తులో టెర్రరిష్టు చర్యలు జరుగకుండ తనపలుకుబడిని వినియోగించవలసిన దని, వాటివలన పెద్దసమస్యకు తనసంఘముకుకూడ నపకారము కలుగు నని నేను చెప్పితిని. రెండుమూడు వారములైనతరువాత గాంధీయిర్విన్ సంభాషణలు జరుగుచుండగా, చంద్రశేఖరఅజదును అలహాబాదు పోలీసులు కాల్చి చంపివేసిరని నేను ఢిల్లీలో వింటిని. ఒక మైదాన ములో పగటివేళ నతడు గుర్తింపబడి పెద్ద పోలీసుదళముచే చుట్టి వేయబడెను. ఒక చెట్టుచాటునుండి యతడు తన్ను రక్షించుకొన జూచెను. ఇరుపక్షముల తుపాకికాల్పులు చెలరేగెను. అతడు చంప బడులోపల నొకరిద్దరు పోలీసులను గాయపరచెను.

తాత్కాలికసమాధానము కుదురుటతోడనే నేను ఢిల్లీకి లక్నో వెళ్ళితిని. దేశమంతట శాసనోల్లంఘనమాపివేయుటకు కొన్ని యేర్పాటులను వెంటనే చేసితిమి. కాంగ్రెసుసంస్థలన్నియు మా నూతన సందేశముల నమలుజరిపెను. మా సైన్యములో చాల యసంతృప్తి చెందినవారు 'కాలుదువ్వు' వారు చాలమంది కలరు. వారి పాతచర్యలను మానివేయునట్లు బలవంతపరచుటకు మా కెట్టిసాధనములు లేవు. కాని యెంతమంది విమర్శించినను నాకు తెలిసినంతవర కొక్క మినహాయింపుకూడ లేకుండ ఆ గొప్పసంస్థ యాచరణలో నీ నూతనవిధానము నవలంబించెను. మా రాష్ట్రములో కొన్ని ప్రాంతములలో పన్నులనిరాకరణ తీవ్రముగ జరుగుచుండుటచే నచ్చట నేమి జరుగునాయని నేను ప్రత్యేకదృష్టితో చూచుచుంటిని. శాసనోల్లంఘనఖయిదీల విడుదల మేము మొట్టమొదట చూడవలెను. ప్రతి నిత్యము వేలకొలది విడువబడిరి. కొన్ని రోజులయినతరువాత పేచీలుగల కొద్దిమందిమాత్రమే జయిలులోనుండిరి. తమతమ గ్రామములకు, పట్టణములకు పోయినపుడు ప్రజలు వీరిని సహజముగ బహూకరించిరి. తఱచు అలంకారములు, విందులు, యుత్సవములు. యూరేగింపులు, సభలు, యుపన్యాసములు, వినతిపత్రములు కోలాహలముగ జరుపబడెను. ఇదియంతయు సహజముగ జరుగునని యనుకొనవలసినదే. కాని పోలీసులాఠీ చెలరేగి మీటింగులను, యుత్సవములను బలవంతముగా చెదరగొట్టిన భీభత్సమునుండి యిదియొక ఆకస్మికమార్పు. పోలీసువారికిది కొంత కన్నెర్రగానుండెను. బహుశః జయిలులో నుంచి వచ్చినవారిలో చాలమంది విజయోత్సాహముతోనుండిరి. విజయమునొందితి మనుకొనుట కెట్టికారణము లేదు. కాని జయిలు నుండి బయటపడుట యెప్పుడు నుత్సాహోద్రేకమును పుట్టించును. అందులో సంఘమంతయు నొక్కసారి విడుదలయైనపు డిక యుత్సాహమునకు మేరయుండదు.

నే నీ విషయము నిచ్చట చెప్పవలసివచ్చెను. ఏలనన తరువాత కొన్ని నెలలకు ప్రభుత్వమువారీ 'విజయోత్సాహ' పాపమునకు

తప్పుపట్టుకొని దీనిని మనపై నొకచార్జిగా బనాయించిరి! అధికార పూరిత వాతావరణములో పెరిగి, యెప్పుడు నందులోనే నివసించుచు ప్రభుత్వమనిన సైన్యమే యనుభావములోనుండి, ప్రజలలో నెట్టి వేళ్ళు యాధారములు లేనివారికి తమ గౌరవమని తాము భావించు నది సన్నగిలుటకంటె బాధకరమగునది వేరొండుయుండబోదు. నే నెరిగి నంతవరకు నే మెచటను యీ విషయము నావంతయు భావింపలేదు. సిమ్లాపర్వతములలోనున్న ప్రభుత్వాధికారులు లగాయితు క్రింద మైదానములోనున్న వారివరకు ప్రజల యీ తిరస్కార భావమునకు కోపముతోను, గర్వభంగమైనదను భావముతోను కుతకుతలాడు చున్నారను సంగతి మే మాశ్చర్యముతో వింటిమి. ప్రభుత్వాభి ప్రాయములను వ్యక్తపరచు పత్రికల కిప్పటికి నాదృష్టి పోలేదు.

కాంగ్రెసు నాయకులకు బ్రిటిషు ప్రభుత్వమును 'ఓడించితి'మను భావము లేదు. కాని ప్రజల త్యాగములకు, ధైర్యసాహసములకు మాలో విజయోత్సాహముండెను. 1930 లో దేశము చేసినదానికి మాకు కొంత గర్వముండెను. అది మా యాత్మగౌరవము నభివృద్ధి చేసి మాకు విశ్వాసము చేకూర్చెను. మా చిట్టి వాలంటీరుకూడ భావ ప్రపూర్ణుడై యొడలువిరిచి శిరము పైకెత్తెను. ప్రపంచదృష్టి నాకర్షించిన యీ మహాప్రయత్నము బ్రిటిషు ప్రభుత్వముపై చాల యొత్తిడి కలిగించెననియు, మమ్ము మా గమ్యస్థానము తీసికొనివెళ్ళుననియు కూడ మేము భావించితిమి. దీనికి, ప్రభుత్వము నోడించుటకు సంబంధ మేమియు లేదు. మాలో చాలమంది ఢిల్లీ సంధివలన ప్రభుత్వము దేవయుచేయుటయైనట్లు పూర్తిగా గ్రహించితిమి.

యు. పి. లో మేము వ్యావసాయక సమస్య నెదుర్కొనవలసి యుండెను. బ్రిటిషు ప్రభుత్వముతో సాధ్యమైనంతవరకు తోడ్పడు టయే మన ప్రస్తుతనీతి. కనుక మేము వెంటనే యు. పి. రాష్ట్ర ప్రభుత్వముతో సంపర్కము పెట్టుకొంటిమి. పన్నెండుసంవత్సరముల నుండి మనకు వారితో నెట్టి యధికార సంబంధములేదు. వ్యావసాయిక సమస్యను చర్చించుటకు నేను రాష్ట్రాధికారులను చూచితిని.

ఈ విషయము గురించి మేము దీర్ఘ యుత్తరప్రత్యుత్తరములను జరిపితిమి. మా రాష్ట్ర కాంగ్రెసుకమిటీ మా ముఖ్యనాయకులలో నొక్కడైన గోవిందవల్లభ పంతును రాష్ట్రప్రభుత్వముతో సంపర్కముకలిగి యుండు ప్రత్యేకోద్యోగిని నియమించెను. వ్యావసాయక దుస్థితిలోని సత్యములును, వ్యవసాయ దినుసులధర లద్భుతముగా పడిపోవుటయు, సామాన్యరయితు చెల్లింపవలసిన పన్ను చెల్లింపలేని దుస్థితిలోనుండుటయు నంగీకరింపబడెను. ఎంతరెమిషను యివ్వవలె ననునదియే సమస్య. ఈ విషయములో రాష్ట్రప్రభుత్వమే దారిచూపవలెను. సామాన్యముగ ప్రభుత్వమువారు భూఖామందులతోనే వ్యవహరించుచుండిరి. వారి రైతులతో ప్రభుత్వము కెట్టి ప్రత్యక్ష సంబంధము లేదు. భూఖామందులే పన్నులను తగ్గించుటో, కొట్టివేయుటో చేయవలెను. కాని ప్రభుత్వము తమకు రావలసిన రెవిన్యూలో కొంత తగ్గించుకొనినగాని జమీందారులేమియు తగ్గించమనిరి. సాధారణముగా వారు తమ రయితుల కెట్టి రెమిషనులను యిచ్చుటకు శ్రద్ధవహించరు.

రాష్ట్రకాంగ్రెసుకమిటీవారు రయితులతో పన్నుల నిరాకరణ మాపివేయబడినదని, వారు చెల్లింపగలిగినంతవరకు పన్ను చెల్లింపవలెనని చెప్పిరి. కాని వారి ప్రతినిధులుగా వారితరపున కమిటీవా రెక్కువ రిమిషనులను కోరిరి. చాలకాలమువరకు ప్రభుత్వమువా రెట్టి చర్యను తీసికొనలేదు. బహుశః గవర్నరు సర్. మాల్కాము హైలీ సెలవుమీదనో లేక ప్రత్యేకపనిమీదనో యుండుటచే నీ యాలస్యము జరిగియుండవచ్చును. చురుకుదనము, దూరదృష్టిగలచర్య యత్యావసరమయి యుండెను. తాత్కాలిక గవర్నరు, అతని సహాయులు మాటయిచ్చుటకు సందేహించి వేసవిలో సర్. మాల్కాముహైలీ వచ్చువరకు దీని నాపుచేయ నిశ్చయించిరి.

ఈ నిశ్చయము, ఆలస్యము, కష్టస్థితిని మరింత యధ్వాన్న మొనర్చెను. దీనివలన రయితులబాధ ద్విగుణమయ్యెను.

ఢిల్లీసంధి యగుటతోడనే నాయారోగ్యముచెడెను. జైలులో కూడ నేను అస్వస్థతగనే యుంటిని. తరువాత తండ్రిగారి మరణమువలన కలిగిన విచారము, వెంటనే ఢిల్లీరాయబారములో కలిగిన పరిశ్రమ నా శరీరారోగ్యమును కృంగదీసెను. కరాచీ కాంగ్రెసునాటికి నేను కొంచెము తేరుకొంటిని.

కరాచీ హిందూదేశమునకు పశ్చిమోత్తరముగా చాలదూరములోనున్నది. అది తక్కిన దేశముతో కొంతవరకెడారిప్రదేశమువలన వేరుచేయబడుచున్నది. కాని యది భారతదేశములోని వివిధప్రాంతములనుండి యనేకవేలమందిని నాకర్షించి దేశములోని యప్పటి యుద్రేకమును యదార్థముగ వెలిబుచ్చెను. భారతదేశములో జాతీయోద్యమము దినదినాభివృద్ధియగుచున్నదను తృప్తియొకటి కలిగెను. ఇంతవరకు తన కెట్టి దుర్భరకష్టములువచ్చినను వాటిని యథాయోగ్యముగ తరించి, యుక్తమైన త్యాగముచే తనయునికిని ధన్యముగావించుకొనిన కాంగ్రెసుసంస్థయందు గౌరవము, ప్రజలయందు విశ్వాసము, హద్దులనుమీరని యుత్సాహము ద్యోతకమగుచుండెను. కాని ముందున్న భయంకర సమస్యలపట్ల నుపద్రవములపట్ల విపరీతమగు బాధ్యత కలదనుభావముకూడ పీడించుచునేయున్నది—మన మాటలు, తీర్మానములు జాతీయప్రయాణములో జరుపవలసినచర్యలకుపోద్ఘాతములు. కనుక వాటిని తేలికగనుచ్చరించుటకు తీర్మానించుటకు వీలులేదు. ఢిల్లీసంధి యంత యామోదకరముగలేదు. అది మనల ననేకరకములైన రాజీలకు దింపునేమో యను భయముకూడ కలదు. అది యొకవిధముగ దేశసమస్యలలోని స్పష్టతను తీసివేసినట్లు కాన్పించెను. కాంగ్రెసుజరుగుసమయముననే మరియొక విషాదము—భగత్సింగుయొక్క యురి—సంభవించెను. ఈ భావము ముఖ్యముగా నుత్తరహిందూదేశములో నుండెను. కరాచీ, యుత్తరమున నుండుటచే, పంజాబునుండి యనేకమంది ప్రజల నాకర్షించెను.

వెనుకటి కాంగ్రెసులకంటె కరాచీకాంగ్రెసు గాంధీజీకి వ్యక్తిగత విజయమని చెప్పకతప్పదు. గుజరాతులో జయభేరి మ్రోగించిన

నాయకుడును బిరుదుగాంచి, భారతదేశములో పేరెన్నికపొందిన వారిలో నొకడు మహాశక్తివంతుడునగు సర్దారు వల్లభాయిపటేలు అధ్యక్షుడైనను మహాత్ముడే యీరంగమును పాలించెను. అబ్దుల్ గఫర్ ఖాన్ యాధిపత్యమున సరిహద్దునుండి కాంగ్రెసుకు 'యెర్ర చొక్కాల' పటాలమొకటి వచ్చెను. ఈ 'యెర్రచొక్కాల' వారి కీర్తి దేశమంతట ప్రాకుటచే వారెచ్చటకు పోయినను అభినందింపబడుచుండిరి. 1930 ఏప్రిల్ లగాయితు, యెంత ప్రకోపింపబడినను, వారసాధారణము శాంతియుతముగను ధైర్య, సాహసములను ప్రదర్శించుటచే హిందూదేశమంతయు వారిసాహసమును వేనోళ్ళ కొనియాడెను. 'యెర్ర-చొక్కాలు' అను పేరుచే కొంతమంది యన్యాయముగా, వారు కమ్యూనిస్టులనియు, లేక లేబరుపార్టీలో నెడమపక్షము వారనియు భ్రమించుచుందురు. నిజమునకు వారిపేరు "ఖుదాయీ ఖిద్మత్ గార్". ఈ సంస్థ కాంగ్రెసులో చేరెను. తరువాత 1931 లో నది కాంగ్రెసులో నొకభాగమయ్యెను. వారు ధరించు పూర్వకాలపు యెర్రటిదుస్తులచే వారిని యెర్ర-చొక్కాలవారందురు. వారి ప్రణాళికలో నార్థికనీతి యేమియు లేదు. అది జాతీయ, సంఘసంస్కారములకు సంబంధించి యుండెను.

కరాచీలోని ప్రధానతీర్మానము ఢిల్లీసంధికి, రౌండు టేబిలు కాన్ఫరెన్సుకు సంబంధించినది. నేను దానిని వర్కింగుకమిటీలో నామోదించితిని. కాని గాంధీజీ నన్ను దానిని బహిరంగకాంగ్రెసులో ప్రతిపాదింపమనినపుడు సందేహించితిని. అది నాకసాధ్యమయ్యెను. మొదట నేను తిరస్కరించితిని కాని యిది దుర్బలము నసంతృప్తికరము నైనస్థితి. నేను దానికి వ్యతిరేకిని కావలెను. లేదా దానిని సమర్థించవలెను. ఊగిసలాడుటయు, ప్రజలను సందేహ మనస్కుల చేయుటయు యుక్తముకాదు. చివరనిమిషములో బహిరంగ కాంగ్రెసులో తీర్మానము నిక ప్రవేశపెట్టుటకు సిద్ధముగానున్న సమయములో నేను దానిని ప్రతిపాదించుటకు నిశ్చయించుకొంటిని. నా యుపన్యాసములో నామహాసభలో నేను నాభావముల నతినిర్మొగమాటముగ

విశదీకరింప యత్నించితిని. నేను దానిని మనఃపూర్వకముగ నంగీక రించుటకుగల కారణములను చెప్పి, వారినికూడ దాని కంగీకరింపవలసిన దని కోరితిని. ఆ క్షణములో నిచ్చిన యీ యుపన్యాసము హృదయ కుహరమునుండివచ్చి, యెట్టియలంకారములు, లలితపదజాలము లేక జాగ్రతగ తయారుచేయబడిన నా యితర యుపన్యాసములకంటె యెక్కువ విజయము బడసెను.

నే నితర తీర్మానములమీదగూడ, ముఖ్యముగ భగత్సింగు తీర్మానముమీద, ప్రధానహక్కులను గురించిన తీర్మానముమీద, ఆర్థికనీతిమీద మాట్లాడితిని. ముఖ్యముగా చివర తీర్మానమందు నా కెక్కుడు శ్రద్ధకలిగెను. ఇంతవరకు కాంగ్రెసు, గృహపరిశ్రమ లకు, సామాన్యముగ 'స్వదేశీ'కి సంబంధించినంతవరకుతప్ప, కేవల జాతీయపద్ధతులను యోచించెనుగాని యార్థికసమస్యలను తలపెట్ట లేదు. కరాచీ తీర్మానములో నది సామ్యవాదమువైపు కొక యడుగు, చాలచిన్న యడుగు, ముందుకు వేసెను. అది ప్రధానపరిశ్రమలను, సేవ లను జాతీయపరము చేయవలెననెను. బీదలమీద భారముతగ్గించి ధనవంతులమీద దానిని హెచ్చించు ననేక యితర విధానములను సూచించెను. ఇది యెంతమాత్రము సామ్యవాదముకాదు. పెట్టుబడి దారుల ప్రభుత్వ మీ తీర్మానములోనున్న ప్రతిదానిని సులభముగా నంగీకరింపవచ్చును.

అతిమాంద్యము, పేలవమునగు నీ తీర్మానమే భారతప్రభుత్వ పెద్దలను గుడ్లెఱ్ఱజేయునట్లు చేసెను. బహుశః వారు, దొంగతనముగా కరాచీ వచ్చి కాంగ్రెసు నాయకులను పాడుచేసిన బోల్షివిక్కుల 'యఱ్ఱ బంగారమును'గూడ వర్ణించియుందురు. ఒక విధమగు రాజ కీయ యంతఃపురములో జీవించుచు, బాహ్యప్రపంచముతో నెట్టి సంబంధములేక, రహస్యవాతావరణముచే చుట్టివేయబడిన వారి గ్రహణబుద్ధి యద్భుత కథలను, కట్టుచరిత్రలను వినుటకు కుతూహల పడును. తరువాత నీ కథలు, వారి భక్తగణములో చేరిన వార్తాపత్రిక లలో రహస్యరీతిని చిన్నచిన్న వార్తలుగావచ్చుచు తెరతీసివేసినచో

సంకను అనేకములు విశదముకాగలవను సూచనకూడ చేయబడును. కరాచీ తీర్మానములోని ప్రధానహక్కులు మొదలగువాటికి సంబంధించిన విషయములను గురించి కొన్ని కథలు సృష్టింపబడెను. ఈ తీర్మానమునుగురించిన ప్రభుత్వాభిప్రాయ మిదియే. ఒక రహస్యవ్యక్తి, కమ్యూనిస్టుసంబంధి, యీ తీర్మానమును వ్రాసెనని, దాని నతడు కరాచీలో నామీద పారవేసెనని దానిమీద 'నీ తీర్మానము నంగీకరించవలెను లేదా ఢిల్లీ సంధిసమస్యమీద నేను ఢీకొనెదనని, నేను గాంధీజీ కొక సంగ్రామసందేశమును బంపితినని యీ కథ బ్రువ్వెను. గాంధీజీ లంచముగా దీని నంగీకరించి యదివరకే విసిగియున్న విషయనిర్ణయసభచేతను, చివరరోజున బహిరంగ కాంగ్రెసుచేతను బలవంతముగా దీనికొప్పించెనట.

ఆ 'రహస్యవ్యక్తి' యెవరో యింతవరకు నెచ్చటను నుదహరింపబడలేదు. కాని యీ వ్యక్తి యెవరో స్పష్టముగా గ్రహించు సూచన లనేకములు చేయబడెను. రహస్యపద్ధతులు, ద్రావిడప్రాణాయామపద్ధతి నాకు చేతగావు. కనుక నీవ్యక్తి యం. యన్. రాయివలె కాన్పించునని నేను నిర్భాగమాటముగ చెప్పవచ్చును. కాని యం. యన్. రాయిగాని 'కమ్యూనిస్టువాసన' గల మరేవ్యక్తిగాని నిరపరాధమైన యీ కరాచీ తీర్మానమును గురించి యెట్లు భావించునో తెలిసికొనుట సిమ్లా, ఢిల్లీలలోని యీ పెద్దల కొక పాఠముగ వినసొంపుగ నుండగలదు. అట్టి వాని దృష్టిలో యీ తీర్మాన మతీహేయముగ నుండునని వినుట వీరి కాశ్చర్యముగ నుండవచ్చును.

గాంధీగారితో గత పదిహేడు వత్సరములనుండి నా కత్యంత పరిచయము కలదు. నే నతనికి సందేశములను పంపుట లేక నతనితో బేరములాడుట యనుభావము దురూహ్యము. మేము పరస్పరము సమాధానపడవచ్చును. లేదా యొక సమస్యమీద విడిపోవచ్చును. కాని మా పరస్పరసంబంధములలో బేరములకెన్నడు నాస్కారముండదు.

కాంగ్రెసు కీ తీర్మానము కొత్తగాదు. యు. పి. రాష్ట్ర కాంగ్రెసుకమిటీ యీవిషయమై యాందోళన చేయుచునేయుండెను.

అది అ. భా. కాం. కమిటీచేత సామ్యవాదతీర్మానము నంగీకరింపచేయుటకు యత్నించుచుండెను. 1929 లో అ. భా. కాం. కమిటీ యీ సూత్రము నంగీకరించునట్లది కొంతవరకు చేయగలిగెను. తరువాత శాసనోల్లంఘనము వచ్చెను. 1931 ఫిబ్రవరి, మార్చి మాసములలో నేను గాంధీజీతో ఢిల్లీలో నీ విషయమును కదిపితిని. ఆర్థికవిషయ తీర్మానముండవలెననుభావము నతడాహ్వానము చేసెను. ఈ విషయమును కరాచీలో తీసికొనిరావలసినదనియు, దీనికి సంబంధించిన తీర్మానము వ్రాసి తన కచ్చట చూపవలసినదనియు నతడు చెప్పెను. కరాచీలో నే నట్లుచేసితిని. అత డనేకమార్పులు, సూచనలు చేసెను. వర్కింగుకమిటీలో పెట్టుటకు పూర్వము మే ముభయులము దానిలోని పదముల కంగీకరింపవలెనని యతడనెను. నే ననేక చిత్తులను వ్రాయవలసివచ్చుటచే కొద్దిరోజు లాలస్యమయ్యెను. మాకనేక యితరవిషయములుకూడ నుండెను. చివరకు మే మిరువురము నొక ముసాయిదా నంగీకరించి దానిని వర్కింగుకమిటీ ముందరను విషయనిర్ణయసభలోను తెచ్చితిమి. విషయనిర్ణయ కమిటీ కది క్రొత్తవిషయ మనుసంగతి పూర్తిగా నిజము. కొంతమంది సభ్యుల కది యాశ్చర్యము కలిగించెను. అయినను అది కమిటీలోను కాంగ్రెసులోనుకూడ సులభముగనే యామోదింపబడెను. అందులో నుదహరింపబడిన సూత్రముల ప్రకారము దానిని స్పష్టపరచి విపులము చేయుట కది అ. భా. కాం. కమిటీవారు కీయబడెను. నే నీ తీర్మానమును వ్రాయునపుడు నా డేరాలోనికి నన్ను చూడవచ్చిన యనేకమందితో దీనినిగురించి చర్చించితిని. కాని యం. యన్. రాయికీ తీర్మానముతో నెట్టిసంబంధములేదు. అతడు దీనిని నిరసించుననియు, పరిహాసము చేయుననియు నాకు బాగుగ తెలియును.

కరాచీ వచ్చుటకు కొద్దిరోజులు పూర్వము అలహాబాదులో నేను యం. యన్. రాయిని కలుసుకొంటిని. అతడొక సాయంకాలమకస్మాత్తుగా మా యింటికి వచ్చెను. అతడు భారతదేశములో నున్నాడను భావము నాకు లేకపోయినను, 1927 లో నే నతనిని

మాస్కోలో చూచుటచే వెంటనే యానవాలుపట్టితిని. అతడు నన్ను కరాచీలోకూడా చూచెను. కాని మే మయిదునిముషములకంటె నెక్కువగ కలిసియుండలేదు. గత కొద్దిసంవత్సరములనుండి రాయి నన్ను రాజకీయముగ నిరసించుచు నెంతయో వ్రాసెను. అత డనేకసారులు నాకు కొంచెము బాధకలిగించెను; మా కిద్దరకు గొప్ప భేదముకలదు. కాని యతడు నన్నాకర్షించెను. తరువాత నతడు నిర్బంధింపబడి చిక్కులలో పడినపుడు నేను చేయగలిగిన సహాయము చేసితిని. అతని యద్భుతబుద్ధివిశేషము నన్నాకర్షించెను. అత డందరిచే విడిచిపెట్టబడి యేకాకియగుటచేకూడ నా మనసు ద్రవించెను. బ్రిటిషు ప్రభుత్వము సహజముగ నతనిని హింసించుచుండిరి. జాతీయభారతదేశము కతని యందు మోహము లేదు. భారతదేశములో కమ్యూనిస్టులనబడువా రతనిని ద్రోహియని నిరసించిరి. అనేకవత్సరములు రష్యాలో జీవించి కోమింటర్నులతో చిరసహకారము సలిపి అతడు వారిని విడిచిపెట్టెను. బహుశః విడిచిపెట్టునట్లు చేయబడెను. ఇది యెందుచేత జరిగెనో నాకు తెలియదు. అతని ప్రస్తుతాభిప్రాయము లెవ్వియో, సనాతన కమూనిష్టులతో నతనికిగల భేదాభిప్రాయము లెవ్వియో నా కిప్పటికి తెలియవు. కాని యట్టివ్యక్తిని ప్రతివాడు విడిచివేయుటకు నాకు బాధకలిగించుటచే, నేను నా యలవాటుకు వ్యతిరేకముగ డిఫెన్సుకమిటీలో చేరితిని. 1931 లోని వేసవి లగాయతు నేటివరకు (మూడేండ్ల కుపైన) నతడస్వస్థుడై జయిలులో నొంటికొట్టులో నున్నాడు. కరాచీ సభ ముగియులోపల క్రొత్త వర్కింగుకమిటీని యెన్నుకొనవలసియుండెను. దీనిని అ. భా. కాం. కమిటీవారు ఎన్నుకొనెదరు. కాని యా వత్సర అధ్యక్షుడు సూచించుపేరులనే అ. భా. కాం. కమిటీవారంగీకరించు యాచార మొకటి యేర్పడెను. కరాచీలో జరిగిన వర్కింగుకమిటీయెన్నికవలన నే మెవరము నూహింపని కష్టమొకటి యేర్పడెను. అ. భా. కాం. కమిటీలోని కొందరు ముస్లిము సభ్యులు యీ యెన్నిక కభ్యంతరపెట్టిరి. బహుశః వారు తమవర్గములోనివారి నెవరిని యెన్నుకొనకపోవుటచే చిన్నబుచ్చుకొని యుండ

వచ్చెను. పదిహేనుగురు సభ్యులుగల అఖిలభారతకమిటీలో నన్నితర పాలప్రాతినిధ్యము కుదురుట యసంభవము. అసలుతగాదా పంజాబుకు సంబంధించిన స్థానికపేచీ. ఫలితమేమనగా నెన్నికను నిరసించిన వర్గమువారు క్రమముగా పంజాబులోని కాంగ్రెసుపార్టీనుండి చీలి 'అహ్రారుపార్టీలో' చేరిరి. పంజాబులో చాల పలుకుబడి యుత్సాహము కల కొందఱు కాంగ్రెసుముస్లిములు దీనిలోచేరిరి. ఇది చాల మంది పంజాబు ముస్లిముల నాకర్షించెను. ఇది ముఖ్యముగా, మధ్య తరగతులలోని క్రిందితరహాకు చెందినవారికి ప్రాతినిధ్యము వహించెను. దీనికి ముస్లిము ప్రజలతో ననేక సంబంధములుండెను. పయి తరగతులవారికి చెంది కూలిపోవుచున్న ముస్లిము కులతత్త్వప్రధానమైన సంస్థలకంటె నిది చాల బలవత్తరమైన సంస్థ. అహ్రారులు కులతత్త్వమువైపు మొగ్గనారంభించిరి. కాని ముస్లిము ప్రజలతో వారికి సంబంధముండుటచే నది సజీవమగు సంఘమయి యస్పష్టమయిన యార్థికదృష్టి కలిగియుండెను. వారు తరువాత భారతసంస్థానములలో ముఖ్యముగా కాశ్మీరములో, ముస్లిము ఆందోళనలో ప్రధానస్థానము వహించిరి. ఇచ్చట ఆర్థిక యనర్థములు, కులతత్త్వములు కలగాపులగము చేయబడెను. కాంగ్రెసునుండి అహ్రారు పార్టీ నాయకులు కొందఱు జారిపోవుట పంజాబులోని కాంగ్రెసుకు తీరనినష్టమయ్యెను. కాని కరాచీలో మాకీసంగతి తెలియదయ్యెను. ఈ జ్ఞానము క్రమముగా నంకురించెను. వర్కింగు కమిటీ యెన్నికవలన కలిగిన కోపముచేతనే వారు జారిపోలేదు. అది వాయుగతిని తెలుపు నొక తృణము. యదార్థకారము లంతర్గర్భితముగ నుండెను.

కరాచీలో నుండగనే కాన్పూరు హిందూముస్లిము కలహావార్తలు మాకు చేరెను. ఉద్రేకపూరితులగు ప్రజలు తమకు సహాయముచేయ యత్నించుచుండిన గణేశశంకర విద్యార్థిని చంపివేసిరను వార్తకూడ వెంటనేవచ్చెను. భయంకరము, పశుప్రాయము నగు ఆ కలహములు దేశారిష్టములు. గణేశజీయొక్క మృత్యువే, మరేదియు చేయజాలనట్లు, దీనిని రుజువుచేయుచున్నది. ఆ కాంగ్రెసు మహా

ములోనున్న వేలకొలదిప్రజ లతని నెరుగుదురు. యు. పి. నివాసుల మగు మా కందరకు నతడు ప్రియతమమైన మిత్రరత్నము, సహచరుడు. మొక్కవోని ధైర్యసాహసము, దూరదృష్టి జ్ఞానప్రపూర్ణ మగు నాలోచన, నిరంతరోత్సాహము, ఉద్యోగమును, కీర్తిని, ప్రకటనను నిరసించుచు ప్రశాంతముగ పనిచేయు కర్మవీరత్వము. ఆహా యెన్ని గుణములు! తా నమితముగా ప్రేమించి, సేవించిన యుద్యమమునకొర కతడు తన యౌవ్వనగర్వములో తన యసువుల నర్పించెను. పాపిష్టిచేతు లతనిని చంపివేసెను. కాన్పూరు పట్టణము, రాష్ట్రము సప్రతిమానశోభతో వెలిగిన యొక రత్నమును పోగొట్టుకొనెను. ఈ వార్తవినబడుటతోడనే కరాచీలోని యు. పి గుడారము లంధకారబంధురములయ్యెను. ఒక తేజస్సు గతించినట్లు కాన్పించెను. అయినను మృత్యువు నతినిర్భయముగా నెదుర్కొని యశఃకాంతులతో చనిపోయిన గర్వ మతనికుండెను.

36

ద క్షి ణ దే శ సం చా ర ము

డాక్టర్లు నన్ను విశ్రాంతి తీసికొనవలసినదని బలవంతపరచుటచే నేను సింహళములో నొకమాసము గడుప నిశ్చయించితిని. భారతదేశ మెంత విశాలమైనదైనను నాకు నిజమైనమార్పుకు మానసిక విశ్రాంతికి తగినయవకాశము లిచ్చుటలేదు. ఏలనన నే నెచ్చటకు వెళ్ళినను రాజకీయ సహాధ్యాయులు నన్ను కలుసుకొందురు. దానితో మామూలు సమస్యలన్నియు నన్ను వేధించును. సింహళము హిందూదేశమున కందుబాటులోనున్న యతిసమీపదేశము. కనుక కమలయు నిందిరయు, నేనును సింహళము వెళ్ళితిమి. 1927 యూరపునుండి తిరిగివచ్చినతరువాత నే ననుభవించిన మొదటిసెలవుదిన మిదియే. నా భార్య, నా కుమార్తె నేను కలసి యెట్టివిచారములేకుండ ప్రశాంతముగ గడుపుట కదియే ప్రథమము. ఈ యనుభవమును నేను తిరిగి యనుభవించలేదు. ఇట్టిదెన్నడైనను తిరిగి కలుగునా యని నే నొక్కొక్కప్పు డాశ్చర్యపడుచుందును,

అయినను నువరాఎలియా యనుచోట రెండువారములుతప్ప సింహళములో నిజముగా మాకెక్కువ విశ్రాంతి లేకుండెను. అచ్చటనన్నితరగతులవారు మాకపారమైన యాతిథ్యమునిచ్చిరి. మాయెడల సుహృద్భావముఁజూపిరి. ఇంతప్రేమ చూపగలుగుట మాకానందముగనేయుండెను. కాని యది తఱచు బాధాకరముగకూడనుండెడిది. నువరాఎలియాలో కూలీజట్టులు, తేయాకుతోటలలోని పనివాండ్రు ఇతరులు ప్రతిదినము ననేకమైళ్ళ దూరమునుండి వచ్చుచు తమతో నడివిపువ్వులు, కూరగాయలు, యిండ్లలో తయారుచేయబడిన వెన్న మొదలగు బహుమతులను తెచ్చుచుండెడివారు. మేము సాధారణముగా సంభాషించుటకైనను వీలుండెడిది కాదు. మే మొకరినొకరము చూచి నవ్వుకొనుచుండెడివారము. వారు దారిద్ర్యములోనుండి మాకు తెచ్చియిచ్చుచుండెడి యీ

యమూల్య బహుమతులతో మా గృహము నిండుచుండెను. మేము వాటిని యచ్చటనున్న ఆస్పత్రికి, యనాథశరణాలయములకు పంపుచుండెడివారము.

మే మా ద్వీపములోని యనేక సుప్రసిద్ధ దృశ్యములను, చరిత్రాత్మక శిథిలములను, బౌద్ధబుషికులములను, సుందరారణ్యసీమలను చూచితిమి. అనురద్ధపురములోని బుద్ధవిగ్రహము మనోహరముగ నుండెను. ఒకసంవత్సర మయినతరువాత, నేను డేరాడూను జయిలులోనుండగా సింహళములోని యొకస్నేహితుడు నాకీ విగ్రహచిత్రము నొకదానిని పంపెను. నేను దానిని నా గదిలో నొక చిన్న బల్లమీద పెట్టితిని. అది నాకొక విలువైన స్నేహితుడయ్యెను. ఈ విగ్రహముయొక్క శక్తిసమన్విత ప్రశాంతముఖలక్షణములు నన్ను శాంతపరచి, నాకు శక్తినిచ్చి నా మనోవ్యాకులతను పోగొట్టుచుండెను.

బుద్ధుడు నన్నెప్పుడు నాకర్షించెను. ఈ యాకర్షణమునకు కారణములను నేను చెప్పజాలను. అది మతసంబంధమైనది మాత్రము కాదు. బౌద్ధమతముచుట్టు పెరిగిన సిద్ధాంతములతో నాకు ప్రసక్తి లేదు. అతని వ్యక్తియే నన్నాకర్షించెను. అట్లే జీసను వ్యక్తికూడ నన్నెక్కువగ నాకర్షించెను. బౌద్ధమఠములలో పూజింపబడు బౌద్ధభిక్షువులను నే నెందరినో చూచితిని. వాదందరి ప్రధానలక్షణము శాంతి. యాత్మశాంతి, ప్రపంచ విచారములందసక్తత. సాధారణముగా వారిముఖములందు బుద్ధివికాసము భయంకర మానసిక సంగ్రామచిహ్నములు కాన్పించవు. వారికీ జీవితము మహాబ్ధిని జేరుటకు ప్రశాంతముగా మందగమనముతో ప్రవహించు నొక నదివలె నుండెను. నేను వారిని కొద్ది యీర్ష్యతో చూచితిని. ఒక యాశ్రమమునకు జేరవలెననెడి కనపడని కోరిక నాలో కలిగెను. కాని నా జాతక మట్టిదికాదు. దానిని తుపానుల మధ్య ఝంఝామారుతములమధ్య గడపవలెను. నాకెట్టి యాశ్రయము లేదు. నాకు బయట తుపాను లెంత భీభత్సముగనుండెనో

యాంతరంగిక ప్రభంజనుడుకూడ నట్లేయుండెను. భయంకర వీచికల నుండి నన్ను కాపాడుయాత్రయు మొకవేళ దొరికినను నే నచ్చట శాంతిని, సుఖమును పొందియుండగలనా?

కొంచెము కాల మా యాత్రయము మనోజ్ఞముగ నుండెను; సుఖముగ పడుకొని, కలలనుగనుచు ప్రాణదాయకములగు నుష్ణదేశ వాయుప్రసారముల ననుభవింపవచ్చును. అప్పటి నాభావములకు సింహళదేశ మెంతయు తగియుండెను. ద్వీపసౌందర్యము నా కానందము కలిగించుచుండెను. మా విహారదినమును త్వరలోనే పసుగతైను. విచారముతో నేము సెలవుతీసుకొంటిమి. ఆ దేశము, ఆ ప్రజలు నా కనేకసారులు స్మరణకువత్తురు. జయిలులోని శూన్య దినములలో నా కవి సహవాసముగనుండెను.

సింహళమునుండి మేము సరాసరి కన్యాకుమారి దక్షిణాగ్రము చేరితిమి. అచ్చట చాల ప్రశాంతముగ నుండెను. తరువాత తిరువాన్కూరు, కొచ్చిన్, మలబారు, మైసూరు, హైదరాబాదు మొదలగు స్వదేశసంస్థానములను చూచితిమి. ఇందులోకొన్ని చాల యభివృద్ధినొందెను. కొన్ని చాల వెనుకబడియుండెను. తిరువాన్కూరు, కొచ్చిన్ సంస్థానములు విద్యావిషయములో బ్రిటిషుయిండియాకంటె చాల యభివృద్ధిలోనున్నవి. మైసూరు బహుశః పారిశ్రామికముగ నభివృద్ధిలో నుండెను. హైదరాబాదు పూర్తిగా పురాతన ఫ్యూడలు రాజ్యచిహ్నము. మాకు ప్రతిచోట ప్రజలు, అధికారులు కూడ నాదరాభిమానములను చూపిరి. కాని మారాకవలన ప్రజ లుపద్రవకరములగు నాలోచనలను చేతురేమోయను భయ మధికారుల కుండెను. మైసూరు, తిరువాన్కూరు లాసమయములో కొంత పౌరసత్వస్వేచ్ఛను, రాజకీయ కృషికి కొన్ని సావకాశములను కలిగించునట్లు కాన్పించెను. హైదరాబాదులో నీమాత్రముకూడ పూర్తిగా శూన్యము. మాకెంతయాదరణ చూపబడినను నా కుక్కిరిబిక్కిరి యైనట్లే యుండెను. తరువాత మైసూరు, తిరువాన్కూరు తా మది వరకు కలుగజేసిన కొద్ది సావకాశములను లాగివేసిరి.

మైసూరు సంస్థానములోని బెంగుళూరులో నొక మహాసభ జరిగెను. అప్పుడు నేనొక యినుప స్తంభముమీద జాతీయజెండా లేవదీసితిని. నేను వెళ్ళిన కొద్దికాలమునకే యీ స్తంభము ముక్కముక్కలుగ విరుగగొట్టబడెను. మైసూరు ప్రభుత్వమువారు జెండాను చూపుట నేరమని ప్రకటించిరి. నేను యెత్తినజెండా నీవిధముగ నిరాదరించి నిరసించుట నాకు బాధకరముగ నుండెను.

నేడు తిరువాన్కూరులో కాంగ్రెసుకూడ అక్రమ సంఘమయ్యెను. శాసనోల్లంఘన మాపివేయబడిన తరువాత బ్రిటిషు ఇండియాలో నది సక్రమ సంఘమేయైనను అచ్చట నెవరును దానికి సామాన్య సభ్యులనుకూడ జేర్పించకూడదు. ఈవిధముగ మైసూరు తిరువాన్కూరులు మామూలు రాజకీయకృషిని నలిపివేయుచు తామిదివరకిచ్చిన కొద్దిసావకాశములను తిరిగి తీసికొనిరి. అవి వెనుకముఖముపట్టెను.

హైదరాబాదుకు వెనుకకు వెళ్ళవలసిన యవసరము, యిచ్చినవి తీసికొనవలసినవి యేమియు లేవు. అదెప్పుడు ముందుకు పోలేదు. అట్టి యవకాశముల నెన్నడు కలుగచేయలేదు. హైదరాబాదులో రాజకీయసభల నెన్నడు నెరుగరు. సాంఘిక మతవిషయిక సభలను కూడ ననుమానముతో చూచెదరు. వాటికొరకు ప్రత్యేక యనుమతి పొందవలెను. పేరుప్రఖ్యాతులుగల వార్తాపత్రికలేవియు నచ్చటలేవు. బయటనుండి దుర్మార్గక్రియలేవియు దేశములోనికి రాకుండుటకు భారతదేశములో నితరచోట్ల ప్రకటింపబడు యనేకపత్రికల నచ్చటకు రానీయరు. ఈ బహిష్కార మతికఠినమైనదగుటచే మితవాదపత్రికలు కూడ బహిష్కరింపబడును.

కొచ్చిన్‌లో మేము 'తెల్లయూదులు' అనబడువారుండు ప్రదేశము చూచితిమి. ఈచిన్న సంఘ మతిపురాతనమైనది. యసామాన్యమైనది. దానిసంఖ్య నానాటికి క్షీణించుచున్నది. కొచ్చిన్‌లో వారుండుస్థానము పురాతన జెరూసెలమును బోలియుండునని మాకు చెప్పిరి. నిశ్చయముగ దానికి పురాతనరూపముండెను.

మేము మలబారుతీరము పొడుగునను సిరియను క్రైస్తవులుండు పట్టణములనుకూడ చూచితిమి. క్రీస్తుతరువాత మొదటిశతాబ్దములోనే క్రైస్తవమతము హిందూదేశమునకు వచ్చెనను సంగతి యెవరును గ్రహించరు. యూరపు దానిని స్వీకరించుటకు చాల పూర్వమే యది దక్షిణహిందూదేశములో స్థిరవాస మేర్పరచుకొనెను. ఈ క్రైస్తవుల మతప్రధాని ఆంటియోకులోనో, సిరియాలో నెచ్చటనో యున్నను వారి క్రైస్తవమతము పూర్తిగా దేశీయము. దానికి బాహ్యాసంబంధము లేవియు లేవు.

దక్షిణమున నెస్టోరియనుల సంఘముచూచి నే నాశ్చర్యపడితిని. వారు పదివేలమంది కలరని వారి మతగురువు నాకు చెప్పెను. నెస్టోరియనులు చాలకాలముక్రిందటనే యితరజాతులతో కలిసిపోయిరను నుద్దేశ్యముతో నే నుంటిని. వారు హిందూదేశములో నుండిరను సంగతి నాకు తెలియు నే తెలియదు. కాని వారి కొకకాలమందు హిందూదేశములో చాలమంది శిష్యులుండిరనియు, వారు త్తరమున కాశీవరకు వ్యాపించిరనియు మాకు చెప్పిరి.

మేము హైదరాబాదు ముఖ్యముగా సరోజినీదేవిని, యామె కుమార్తెలైన పద్మజ, లీలామణులను చూచుటకే వెళ్ళితిమి. మే మచ్చట నుండగా వారియింటివద్ద ఘోషాస్త్రీల సభ జరిగెను. వారు కమలను చూచుటకు వచ్చిరి. ఆమె వారికొక యుపన్యాసము నిచ్చెను. అందులో నామె పురుషుడు తయారుచేసిన చట్టములు, ఆచారములు మొదలగువాటినుండి స్త్రీలు స్వేచ్ఛను బడయవలసిన యావశ్యకతను గురించి చెప్పియుండును. ఇది జరిగిన రెండుమూడు వారములైన తరువాత నొక చిన్నవిషయము జరిగెను. హైదరాబాదునుండి యొక భయవిహ్వలుడైన భర్త కమల కొక జాబు వ్రాయుచు నామె యచ్చటకు వచ్చినదిలగాయితు తన భార్య విపరీతముగా ప్రవర్తించుచున్నదనియు, తాను చెప్పినట్లు వినుచు తన యడుగులకు మడుగులొత్తుటలేదనియు, వాదముచేయుచు నెదిరించుచున్నదనియు వాపోయెను.

బొంబాయినుండి సింహళమునకు వెళ్ళిన యేడువారములైన తరువాత నేను తిరిగి బొంబాయి చేరితిని. వెంటనే నేను కాంగ్రెసు రాజకీయ సుడిగుండములలోని కురికితిని. ప్రధానవిషయములను చర్చించుటకు వర్కింగుకమిటీసభ జరుగుచుండెను. హిందూదేశములో పరిస్థితులతిత్వరితముగ మారిపోవుచుండెను. యు. పి. వ్యావసాయక పరిస్థితులు స్తంభించెను. సరిహద్దు రాష్ట్రములలో ఖాన్ అబ్దుల్ గఫర్ఖాన్ నాయకత్వముక్రింద 'యెఱ్ఱచొక్కా'ల వారి యుద్యమ మత్యంత ప్రబలమగుచుండెను. వంగదేశములో నత్యంత యుద్రేకము, అణచివేయబడిన క్రోధము, అశాంతి హెచ్చుచుండెను. నిత్యవంట లైన కులకలహములు, కాంగ్రెసు ప్రభుత్వముకు ననేక సమస్యలపై స్థానిక పేచీలు, దానితో ఢిల్లీసంధిని భంగపరచిరను పరస్పరాపవాదములు బయలుదేరెను. తరువాత చర్విత చర్వణమైన ప్రశ్న; రెండవ రౌండుటేబిలు సభలో కాంగ్రెసు ప్రాతినిధ్యము వహింపవలెనా? మహాత్మాగాంధీ యచ్చటకు వెళ్ళవలెనా?

సంధికాలమున సంఘర్షణము

గాంధీజీ రౌండు టేబిలు సభకు లండను పోవలెనా యక్కర లేదా ? యను ప్రశ్న పదేపదే వచ్చుచుండెను. దీనికి సమిద్ధమగు ప్రత్యుత్తరము రాకుండెను. చివరనిమిషమువరకు వర్కింగు కమిటీకి, చివరకు గాంధీజీకి యేమియు తెలియదు. దీనికి జవాబనేకవిషయములమీద నాధారపడియుండెను. క్రొత్తసంభవములు పరిస్థితులలో నెల్లప్పుడు క్రొత్తమార్పులను తెచ్చుచుండెను. ఆ ప్రశ్నకు జవాబుకు నిజమైన క్లిష్టసమస్యలుండెను.

రౌండు టేబిలుసభ యిదివరకే చట్టస్వరూపము నేర్పాటుచేసెననియు, చిత్రముయొక్క ప్రధాన లేఖలన్నియు చిత్రింపబడినవనియు నిక యీ చిత్రమును పూరించుటయే మిగిలియున్నదనియు బ్రిటిషు ప్రభుత్వముతరపున, వారి స్నేహితులతరపున మాకనేకసారులు చెప్పబడుచుండెను. కాని కాంగ్రెసు అట్లు చేయదలంచలేదు. దానికి సంబంధించినంతవరకీ చిత్రమంతయు మొట్టమొదటినుండియు క్రొత్త జవనిక మీదనే వ్రాయబడవలెను. లేక చిత్రింపబడవలెను. ఢిల్లీ సంధిప్రకారము ఫెడరలు విధానము, రక్షణలు కావలెనను భావమామోదింపబడెననుట నిజము. భారతచట్టనిర్మాణసమస్యకు ఫెడరలు విధానమే చాల మంచితరుణోపాయమను విషయము మాలో చాలమందికి చాలకాలముక్రితమే తట్టెను. ఈ భావముకు నేమంగీకరించుటయన మొదటి రౌండు టేబిలు కాన్ఫరెన్సులో తయారుచేయబడిన ప్రత్యేక ఫెడరలు విధానమునే యంగీకరించుట కానేరదు. ఫెడరేషనుకు రాజకీయస్వాతంత్ర్యముతోను, సాంఘిక పరివర్తనముతోను విరోధమెంతమాత్రము లేదు. రక్షణలను భావము నిందుతో జతపరచుట చాల క్లిష్టవిషయము. సాధారణముగ నవి యధికారమును చాలవరకుతగ్గించు నర్థమునే యిచ్చును. కాని 'భారతదేశ ప్రయోజనములకొరకు' అను విశేషణవాక్యము, మాకీ

కష్టమును కొంతవరకు పోగొట్టెను. కరాచీకాంగ్రెసు మన కంగీకార మగు చట్టనిర్మాణమునుగురించి స్పష్టపరచెను, అది దేశ సంరక్షణ మీదను, విదేశవ్యవహారములమీదను, ద్రవ్యనీతిమీదను. ఆర్థిక నీతిమీదను పరిపూర్ణాధికారము కోరెను. భారతదేశ ఋణములను కట్టుకొనుటకుపూర్వము విదేశఋణ సమస్యలు కూలంకషముగ పరీక్షింపవలెను. ప్రధానహక్కులకు సంబంధించిన తీర్మానములు కొన్ని రాజకీయ, ఆర్థికమార్పులనుకూడ సూచించెను. ఇదియంతయు రౌండు టేబిలు కాన్ఫరెన్సులో చేయబడిన చాలతీర్మానములకు, ప్రస్తుత భారతప్రభుత్వపరిపాలనా చట్టమునకు విరుద్ధము.

కాంగ్రెసు దృక్పథముకు, బ్రిటిషుప్రభుత్వ దృక్పథమునకు చాలవ్యత్యాసముకలదు. అది యిప్పటిస్థితిలో తొలగిపోవు నను కొనుట కల్ల. రౌండు టేబిలుసభలో ప్రభుత్వముకు, కాంగ్రెసుకు సమాధానముకుదురునని కొద్దిమంది కాంగ్రెసువారు భావించిరి. నిరంత రోత్సాహియైన గాంధీజీకూడ నెట్టివిశేషమునాశించలేదు. కాని యాత డెప్పుడు నిరాశచేసికొనక చివరవరకు ప్రయత్నించుటకు నిశ్చయించు కొనెను. మే మందరము జయము చేకూరినను చేకూరకపోయినను ఢిల్లీయగ్రిమెంటు ననుసరించి యత్నము సాగించవలసినదే యని భావించితిమి. కాని మేము రౌండుటేబిలులో పాల్గొనుటకు రెండు విషయములు మమ్మెదుర్కొనుచుండెను. రౌండు టేబిలు కాన్ఫరెన్సులో మేము మాదృక్పథమును నిరాటంకముగ వాదించుట కవకాశములుండవలెను. భారతదేశ పరిస్థితులు రౌండు టేబిలు కాన్ఫరెన్సుకు పోకుండ మా కాటంకములను కల్పించవచ్చును. ప్రభుత్వముతో సంఘర్షణ కలిగించుస్థితి రావచ్చును; లేక మేము తీవ్రనిర్బంధములకు గురికావలసిన పరిస్థితులేర్పడవచ్చును. హిందూదేశములో నిట్టిస్థితి యేర్పడి మా కొంపకే నిప్పంటుకొనినపుడు మా ప్రతినిధి యెవడైన నీయగ్నిహోత్రజ్వాలలను నిర్లక్ష్యముచేసి లండనులో చట్ట నిర్మాణము మొదలగు విషయములను గురించి శుష్కవాదములను చేయుట కేవల మప్రస్తుతమగును.

ఈ స్థితి వంగదేశములోను, యు. పి. లోను, సరిహద్దు రాష్ట్రములలోను ప్రధానముగ దేశమంతట నొకమోస్తరుగ కాన్పించెను. వంగదేశములో ఢిల్లీ అగ్రిమెంటునవలన నెట్టిలాభము చేకూరలేదు. అచ్చట నుద్రేకము మరింత హెచ్చగుచుండెను. శాసనోల్లంఘన ఖయిదీలు కొందఱు విడువబడిరి. కాని శాస్త్రరీత్యా శాసనోల్లంఘన ఖయిదీలుకాని రాజకీయఖయిదీలు వేలకొలది జయిళ్ళలో నుండిరి. డెటెన్యూలుకూడ జయిళ్ళలోను, లేక డెటెన్యూ మకాములలోను నుండిరి. 'రాజద్రోహకరములగు' ఉపన్యాసములకు తదితర రాజకీయకృషికి క్రొత్తనిర్బంధములు జరుగుచునే యుండుటచే ప్రభుత్వదాడి యెంతమాత్రము సడలకుండ సాగుచునేయున్నదను భావము సామాన్యమయ్యెను. టెర్రరిజమువలన వంగదేశసమస్య కాంగ్రెసు కధికకష్టము కలిగించెను.

మామూలు కాంగ్రెసుకార్యక్రమముతోను, శాసనోల్లంఘనముతోను పోల్చి చూచినచో టెర్రరిస్టుకార్యములు వ్యాప్తిలోను, ప్రాధాన్యతలోను నతిస్వల్పములు. కాని యవి పెద్ద గందరగోళము కలుగచేయుచు దృష్టి నాకర్షించుచుండెను. కాంగ్రెసు యితరరాష్ట్రములలో పనిచేసినట్లిచ్చట పనిచేయుట కివియాటంకములుగనుండెను. ఏలనన టెర్రరిజము శాంతియుతమగు ప్రత్యక్ష కార్యములకు వ్యతిరేక వాతావరణము సృష్టించుచుండెను. ఇది ప్రభుత్వనిర్బంధముల నాహ్వానించుచుండెను. కాని యివి టెర్రరిస్టులమీద, టెర్రరిస్టులు కానివారిమీదకూడ నిష్పక్షపాతముగ పడుచుండెను.

టెర్రరిస్టుల కొరకు కుద్దేశింపబడిన ప్రత్యేకచట్టములను, ఆర్డినెన్సులను పోలీసులు స్థానికకార్యనిర్వాహణాధికారులు, కాంగ్రెసు వారిపట్ల, లేబరు వ్యవసాయక ప్రచారకులపట్ల, వారామోదింపజాలని పనులనుచేయు నితరులపట్ల వినియోగింపకుండుట దుస్సాధ్యమగుచుండెను. కనుక చార్జి, విచారణ, శిక్ష లేకుండ ననేకవత్సరములుంచబడిన యనేకమంది డెటెన్యూల యదార్థనేరములు టెర్రరిజముకు సంబంధించక నితర రాజకీయకృషికి సంబంధించినవిగ

నుండుట కవకాశములుకలవు. ఋజువు చేయుటకు, ఋజువుగాదని నిరూపించుటకు, వారి కెట్టియవకాశములు నీయబడలేదు. చివరకు వారు చేసిన పాపములేవియో వారికి తెలుపబడలేదు. బహుశః శిక్ష వేయుటకు తగినంతసాక్ష్యము పోలీసువారివద్ద లేకపోవుటచేతనే వారు కోర్టులో విచారణచేయబడలేదు. నేరస్థుడనబడిన వానిని తఱచు కోర్టువారు నేరములేదని విడిచివేయుచుండుటయు, వెంటనే వానిని పోలీసువారుపట్టుకొని డెటిన్యూక్రింద నుంచుటయు జరుగుచునే యుండును.

వంగదేశములోని చిక్కుసమస్య కాంగ్రెసువర్కింగుకమిటీ వారి ననహాయులను చేయుచుండెను. అది వారిని నిరంతరము వేధించుచుండెను. ఏదో యొకరూపమున వంగదేశవిషయ మెప్పుడు వర్కింగు కమిటీముందర నచ్చుచునేయుండును. వారు దానిని తమ శక్తివంచన లేకుండ సాధింప యత్నించుచుండిరి. కాని వారాసమస్యను నిజముగా పరిష్కరించుటలేదనుసంగతి వారికి తెలియును. కనుక వారు దుర్బలత్వముచే నచ్చటివిషయములను వాటికర్మమునకు విడిచివేసిరి. అట్టి పరిస్థితులలో వారికనేమిచేయగలరో చెప్పుటయు కష్టముగనే యుండెను. వర్కింగుకమిటీవారి యీ యుదాసీనత వంగదేశములో తీవ్రముగ నిరసింపబడెను. కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గమువారును, యితరరాష్ట్రములవారును తమ్ము నిర్లక్ష్యము చేయుచున్నారను భావము వంగదేశములో బయలుదేరెను. కష్టకాలములో వంగదేశము విడిచివేయబడినట్లు కాన్పించెను. ఈ యభిప్రాయము కేవలము నిరాధారము. వంగదేశప్రజలపై భారతదేశమునకంతకు పరిపూర్ణాభిమానము కలదు. కాని యీ అభిమానమును యథార్థసహాయముగా మార్చుటెట్లో దానికి తెలియకుండెను. ఇంతేకాక భారతదేశములోని ప్రతిభాగము తనకున్న కష్టములతోనే బాధపడుచుండెను.

యు. పి. లో వ్యవసాయపరిస్థితు లధ్వాన్నమగుచుండెను. రాష్ట్రప్రభుత్వమువారీ సమస్యనుగురించి జాప్యముచేయుచు నున్న,

రివిన్యూరిమిషనులను గురించిన నిశ్చయము నాలస్యముచేసి బలవంతముగా పన్ను వసూలుచేయ నారంభించిరి. వేలకొలది జప్తులు, భూములనుండి రయితులను గెంటివేయుట మొదలగునవి జరుగుచుండెను. మేము సింహళములోనుండగనే బలవంతముగ పన్నులను వసూలుచేయ ప్రయత్నించినపుడు రెండుమూడు వ్యావసాయక కలహములు జరిగెను. అవి చిన్నవేయైనను దురదృష్టవశాత్తు భూఖామందో లేక వారి ఏజంటో చనిపోవుట తటస్థించెను. యు. పి. గవర్నరయిన సర్. మాల్కామ్‌హైలీతో వ్యవసాయపరిస్థితులను గురించి చర్చించుటకు గాంధీజీ నైనీటాలు వెళ్ళెను. దీనివలన మంచి ఫలితమేమియు కలుగలేదు. ప్రభుత్వమువారు రిమిషనులను ప్రకటించిరి. అవి అనుకొనినవాటికంటె చాల తక్కువగ నుండెను. పల్లెటి ప్రాంతములవారిగోల నిరంతరాయముగా హెచ్చిపోవుచుండెను. భూఖామందు, ప్రభుత్వమువారు కలిసి రయితు నెక్కువగ బాధించిరి. వేలకొలది రయితులు తమ వ్యవసాయభూములనుండి గెంటివేయబడిరి. వారికున్న కొద్దియాస్తులు లాగుకొనబడెను. దీని కితరదేశములలో గొప్ప రయితువిప్లవము సంభవించెడిది. కాంగ్రెస్‌వారి యత్నముల చేతనే ప్రజలు దౌర్జన్యకార్యములకు గడంగకుండిరని నా యభిప్రాయము. కాని ప్రజలమీద మాత్రము కావలసినంత దౌర్జన్యము చూపబడెను.

ఈ రయితాంగ తిరుగుబాటులోను, కష్టములలోను, నొక సంతోషవిషయము కలదు. వ్యవసాయ ధర లమితముగా పడిపోవుటచే బీద తరగతివారికందరికి రయితులతోసహా తత్పూర్వముకంటె తినుట కెక్కువ యాహారముండెను.

వంగదేశములోవలెనే సరిహద్దురాష్ట్రములలోను ఢిల్లీసంధివలన శాంతిచేకూరలేదు. అచ్చట నుద్రేకము శాశ్వతమైపోయెను. ప్రత్యేక శాసనములు, ఆర్డినెన్సులుగలిగి చిన్న చిన్న నేరములకుగూడ పెద్ద పెద్ద శిక్షలను వర్షించుచు ప్రభుత్వ మచ్చట నొక సైనిక వ్యాపారమయ్యెను. ఈ పరిస్థితుల నెదుర్కొనుటకు అబ్దుల్ గఫర్ఖాన్ గొప్ప

యాందోళన లేవదీసెను. అతడు ప్రభుత్వమువారి కొరకు బూచివలె నుండెను. ఆరడుగుల మూడంగుళముల యీ జాత్యానుపీరుడు గ్రామ గ్రామము కాలినడకను పోవుచు 'యుక్తాయిచోకాల' కేంద్రములను స్థాపించుచుండెను. అతడు, అతని ప్రధానులు వెళ్ళినచోట్లనెల్ల 'యుక్తాయిచోకాల' చిహ్నములతో రాష్ట్రమునంతను 'ఖుదాయీఖిద్మత్ గార్'ల శాఖలతో నింపివేసెను. వారు పరమశాంతులు అర్థములేని నిందారోపణలుతప్ప వారిపై నొక్క దౌర్జన్యనేరమైనను స్థాపింపబడ లేదు. వారు శాంతమూర్తులైనను కాకపోయినను, వారివెనుక యుద్ధ సాంప్రదాయములు, దౌర్జన్యసాంప్రదాయములు కలవు. వారు కలహమునకు కాలుదువ్వు సరిహద్దుల ప్రాంతమున నివసించుచున్నారు. భారతజాతీయోద్యమముతో సన్నిహితసంబంధముకలిగి సుశిక్షితమైన యీ యుద్యమాభివృద్ధి ప్రభుత్వమునకు కన్నెర్రగానుండెను. అది దౌర్జన్యరహితము, శాంతియుతమునగు యుద్యమమని ప్రభుత్వ మెప్పుడు విశ్వసింపలేదని నేననుకొనెదను. ఒకవేళ వారట్లుభావించినను వారు దానిని భయముతోను, విసుగుదలతోను చూచి యుండెదరు. అది యత్యంత శక్తిసమన్వితమైనదిగ నుండుటచే వారు దానిని ప్రశాంతచిత్తముతో చూడజాలరు.

అబ్దుల్‌గఫర్ఖాన్ యీ మహోద్యమమునకు నిర్వివాద నాయకుడు. అతడు 'పఠానుల మానధనము' 'సరిహద్దుగాంధీ' యని పిలువబడ దొడగెను. ఎట్టికష్టములకు, ప్రభుత్వచర్యలకు వెరువక, ప్రశాంతముగను, భల్లూకపుపట్టుతోను చేయు నిరంతరకృషివలననే సరిహద్దురాష్ట్రములలో నతనికద్భుతమైన పలుకుబడి కలిగెను. అతడు రాజకీయవేత్తలనబడువారివంటి రాజకీయవేత్తకాడు. రాజకీయములలోని యుక్తులు, జిత్తులు నతనికి చేతగావు. అజానుబాహువు; మానసికముగ, శారీరకముగ స్థైర్యమైనవ్యక్తి, జల్పమును గడబిడను నిరసించువాడు, భారతస్వాతంత్ర్య చట్టముతోనే తన సరిహద్దురాష్ట్ర ప్రజల స్వేచ్ఛకొరకు నిరీక్షించువాడు. చట్టనిర్మాణములు, న్యాయశాస్త్ర సంబంధమైన ప్రగల్భములు మొదలగువానియందు శ్రద్ధలేని

వాడు. దేనిని సాధించుటకైనను కార్యశూరత్వ ముండవలెను. మహాత్మాగాంధీ శాంతియుతమగు యద్భుత కార్యక్రమము నొక దానిని బోధించెను. అది యతని నాకర్షించెను. కార్యమును సాగించుటకు సుశిక్షణము, కట్టుదిట్టమైన యేర్పాటులు కావలెను. కనుక నిక నేట్టివాదనయును, తాను చేయవలసిన యేర్పాటులకు సంబంధించిన చాదస్తపు సూత్రములను వ్రాయుటయు నక్కరలేకుండగనే యత డద్భుతవిజయముతో కార్యక్రమమును ప్రారంభించెను.

గాంధీజీయనిన యతని కత్యంతప్రేమ. మొట్టమొదట నతని మొగమాటము వెనుకనుండవలెనను కోరికయు నతనిని గాంధీజీ దగ్గరకు పోకుండచేసెను. తరువాత వారనేక విషయములను చర్చించుటకు కలుసుకొనవలసివలసివచ్చెను. వారి సంబంధములు వృద్ధియయ్యెను. ఈ పఠాను దౌర్జన్యరాహిత్యమును సిద్ధాంతములో నెట్లొప్పుకొనునా యనునది యాశ్చర్యముగ నుండును. దాని నతడు విశ్వసించెను. కనుకనే యెంతటియుద్రేకము కలిగింపబడినను శాంతమును వీడకూడదను భావము నతడు తనప్రజలలో నాటును. సరిహద్దురాష్ట్రప్రజలిక నెన్నటికి దౌర్జన్యమును సుతరాము అవలంబించరని చెప్పుట మూర్ఖత్వము. సామాన్యముగ ప్రతిరాష్ట్రప్రజలకు నిదియే వర్తించును. ప్రజలుద్రేకతరంగములచే రేగుచుందురు. అట్లు రేగిననాడు వారెట్లు ప్రవర్తించెదరో యెవరును జోస్యము చెప్పజాలరు. కాని 1930 లోను తరువాతను సరిహద్దురాష్ట్రప్రజలు చూపిన యాత్మనిగ్రహ మత్యద్భుతము.

అబ్దుల్ గఫర్ఖాన్ పేరు వినుటకుపూర్వము చాలాకాలము క్రితమే నే నతనిసోదరుడగు డాక్టరు ఖానుసాహెబును బాగుగ నెరుగుదును. నేను కేంబ్రిడ్జిలోనుండగా నతడు లండను సెంటుథామస్ ఆస్పత్రిలో విద్యార్థి. తరువాత బారిస్టరు విడుదల నారగించుచున్నప్పుడు మే మత్యంతమిత్రులమైతిమి. లండనులోనుండగా మే మిరువురము కలుసుకొనని దిన మొక్కటియు నుండెడిదికాదు. నే నతనిని యింగ్లండులో విడచిపెట్టి హిందూదేశము వచ్చితిని. చాల

కాల మతడు ఇంగ్లండులోనేయుండి యుద్ధసమయములో డాక్టరుగా పనిచేసెను. తరువాత నే నతనిని నైనీజయిలులో చూచితిని.

సరిహద్దు "యఱ్ఱచొక్కాల" వారు కాంగ్రెసుతో సహ కారము చేసిరి. కాని వారిసంస్థ ప్రత్యేకసంస్థ. అదియొక వింతస్థితి. అబ్దుల్ గఫర్ ఖాన్ యీ రెంటికి సంధానకర్త. 1931 సంవత్సరం వేసవిలో నీసమస్యను వర్కింగుకమిటీవారు సరిహద్దురాష్ట్ర నాయకు లతో కలసి కూలంకషముగ చర్చించి "యఱ్ఱ-చొక్కాల"ను కాంగ్రెసులో మిళితముచేయుటకు నిశ్చయించిరి. ఈవిధముగ "యఱ్ఱ-చొక్కాల" యుద్యమము కాంగ్రెసులో నొకభాగమైపోయెను.

కరాచీకాంగ్రెసు యగుటతోడనే గాంధీజీ సరిహద్దురాష్ట్ర ముకు పోగోరెను. కాని ప్రభుత్వమువారు దీని నెంతమాత్రము ప్రోత్స హింపలేదు. తరువాత నెలలలో ప్రభుత్వాధికారులు 'యఱ్ఱ-చొక్కాల' వారి చేష్టలనుగురించి పదేపదే ఫిర్యాదులు చేసినప్పుడు గాంధీజీ తాను స్వయముగ వెళ్ళి పరిస్థితులను చూడగోరెను. కాని ప్రభుత్వము దీని కొప్పుకొనలేదు. నేను వెళ్ళుటకుకూడ వీలులేదనిరి. ఢిల్లీ యగ్రిమెంటు నిలిచియుండుటచే ప్రభుత్వకోరికకు వ్యతిరేకముగా సరిహద్దురాష్ట్రము పోవుట యుక్తముకాదని మే మనుకొంటిమి.

వర్కింగుకమిటీముందు మరియొకసమస్య కులసమస్య. ఇందులో క్రొత్తయేమియు లేదు. అది క్రొత్తరూపములతో, వింతవేషములతో మాత్రము తలయెత్తుచుండును. ఆ సమయమున రౌండు టేబిలు కాన్ఫ రెన్సువలన దానికి లేనిపోని యాధిక్యత వచ్చెను. బ్రిటిషుప్రభుత్వము తక్కిన సమస్యలనన్నిటిని వెనుకబెట్టి యీ శిఖండిని ముందుకుత్రోయు చునుసంగతి తేటతెల్లము. కాన్ఫరెన్సు సభ్యులందరు కులప్రయోజన ములకు నాయా తెగల ప్రయోజనములకు, ప్రాముఖ్యతనిచ్చుటకు, ప్రజలందరకు సంబంధించిన సామాన్యవిషయములను విడిచిపెట్టి యీ పెడత్రోవలను పట్టుటకు ప్రధానముగా నియోగింపబడిరి. జాతీయ ముస్లిము నాయకులలో నెవనిని పేర్కొనుటకు ప్రభుత్వ మంగీకరింప లేదు. కాన్ఫరెన్సు మొట్టమొదటిలోనే, బ్రిటిషుప్రభుత్వ ప్రోత్సాహ

ముతో, కులసమస్యలలో చిక్కుకొనినచో యదార్థమైన రాజకీయ ఆర్థికసమస్యలను యుక్తముగా యోచించుటకు వీలుండదని గాంధీజీ భావించెను. ఈ పరిస్థితులలో నతడు కాన్ఫరెన్సుకు పోవుటయే వ్యర్థము. కనుక నతడు కులసమస్యలమీద ముందుగా నొక సమాధానము వారిలో వారికి కుదిరిననే లండను పోయెదనని వర్కింగుకమిటీకి కబురుపంపెను. అతని సహజజ్ఞానము చాలన్యాయముగనే యుండెను. కాని వర్కింగుకమిటీవారతనిని త్రోసివేసి మనము కులసమస్యను పరిష్కరింపజాలకపోతిమను కారణముచేతనే యతడు సభకుపోవ నిరాకరింపరాదని తీర్మానించిరి. వివిధకులముల ప్రతినిధులతో సంప్రదించి యొక పరిష్కారముచేయుటకు వర్కింగుకమిటీవారు యత్నించిరి. ఇది యంతవిజయవంతము కాలేదు.

1931 వేసవిలో ననేక సమస్యలకుతోడు యీ పెద్దసమస్యలనుకూడ మేము యోచింపవలసి వచ్చెను. స్థానికాధికారులు ఢిల్లీ సంధిని భంగపరచుచున్నారను ఫిర్యాదులు మాకు వచ్చుచుండెను. వీటిలో నతిముఖ్యమైనవాటిని మేము ప్రభుత్వమునకు పంపితిమి. కాంగ్రెసువారు సంధిని భంగపరచుచున్నారని ప్రభుత్వము నేరారోపణలనుచేసెను. ఇట్లు చార్జీలు కౌంటరుచార్జీలు చేయబడెను. తరువాత నవి పత్రికలలో ప్రకటింపబడెను. దీనివలన కాంగ్రెసుకు ప్రభుత్వముకు గల సంబంధము చక్కబడలేదని వేరుగ చెప్పనక్కరలేదు.

అయినను స్వల్పవిషయములమీద బయలుదేరిన యీ సంఘర్షణకెక్కువ ప్రాధాన్యతలేదు. అతిప్రధానమైన పోరాటము రానున్నదని తెలుపుటయే దీని ప్రాముఖ్యత. ఈ పోరాటము వ్యక్తులమీద నాధారపడక మనజాతీయసంగ్రామ ప్రకృతినుండియు, వ్యవసాయముకు సంబంధించిన ఆర్థిక స్థైర్యభావమునుండియు బయలుదేరెను. అసలు పునాదులలోనే మార్పులేనిదే యది తీరునదికాదు, రాజీపడునదికాదు.

మధ్యతరగతులలోని పెద్దతరహాకుచెందినవా రాత్మాభివృద్ధిని ఆత్మప్రకటనమును కోరుటచేతనే మొట్టమొదట మనజాతీయోద్య

మము ప్రారంభమయ్యెను. దానివెనుక రాజకీయ, ఆర్థిక పిపాస యుండెను. అది క్రమముగా మధ్యతరగతులలోని కింద్రితరహావరకుప్రాకి, దేశములో నొకగొప్పశక్తిగా పరిణమించెను. తరువాత నది గ్రామప్రజల నాందోళనపరచసాగెను. వారు దుఃఖమయము, జీవితప్రమాణములో నధమాధమమునగు జీవితమునుగడుపుటగూడ కష్టతరమగుచుండెను. ప్రాచీన గ్రామ ఆర్థికవిధానము సర్వతోముఖ గ్రామ సౌభాగ్యము చేకూర్చెను. అది చాలకాలముక్రిందట నశించిపోయెను. వ్యవసాయమునకు చేదోడువాదోడుగానుండెడి గృహోపపరిశ్రమలు కొంతవరకు ప్రభుత్వనీతిచేతను, యెక్కువగ విజృంభించుచున్న యంత్రపరిశ్రమల పోటీకి తాళలేకపోవుటచేతను నశించెను. భూమిమీదభారము దిన దినాభివృద్ధి యగుచుండెను. భారతపరిశ్రమ లతిమందగమనము చేయుచు నీలోటు కూడదీయజాలకుండెను. ఎట్టిపరికరములు లేక, నేమరుపాటుగనుండి, యమితభారముచే కృంగిన గ్రామము ప్రపంచ పణ్యారంగములోనికి విసరివేయబడి యిటునటు గిజగిజకొట్టుకొనెను. అది యసమానపరిస్థితులతో పోటీచేయవలెను. దానియుత్పత్తి విధానములు చాల వెనుకబడియుండెను. దానిభూవిభాగపద్ధతి, సేద్య భూమియొక్క పరిమితుల నంతకంతకుచీల్చివేయుచు, గొప్పయభివృద్ధి సాధ్యముకాకుండచేసెను. కనుక వ్యవసాయజాతులు, భూఖామందులు రయితులుకూడ ధరలు హెచ్చుగానున్న కొద్దికాలములలోతప్ప క్రిందకు దిగజారుచుండిరి. భూఖామందులు తమభారమును రయితుల మీద రుద్దవలెనని యత్నించిరి. రయితాంగము చిన్నచిన్న భూస్వాములు, వ్యవసాయముచేయు సేద్యగాండ్రు జాతీయోద్యమములోనికి దిగిరి. గ్రామములోనున్న భూములులేని వ్యవసాయ కూలీలు వేలకొలది యిందులోప్రవేశించిరి. ఈ గ్రామములలోనున్న జాతులందరికి 'జాతీయత' లేక 'స్వరాజ్యము' భూవిభాగపద్ధతిలో ప్రధానమార్పు అను నర్థమునే కలుగజేసెను. అదియే వారిభార ములను లేకుండచేయును లేదా తగ్గించును. భూమిలేనివారికి భూమి

నిచ్చెను. రయితులు జాతీయోద్యమములోని మధ్యతరగతి నాయకులు నీ కోరికలను స్పష్టముగ ప్రకటింపజాలరైరి.

1930 శాసనోల్లంఘనోద్యమము, దానినాయకులకు తెలియకుండగనే ప్రపంచవ్యవసాయ, పారిశ్రామిక వస్తువులధరల మాంద్యముతో ప్రారంభమయ్యెను. గ్రామప్రజలీమార్పువలన తహతహలాడి కాంగ్రెసులోను, శాసనోల్లంఘనములోను చేరిరి. వారికి లండనులోను, లేక మరియొకచోటను తయారుచేయబడిన చట్టనిర్మాణముకాక భూవిభాగపద్ధతిలో, ముఖ్యముగా జమీందారీప్రాంతములలో, ప్రధానమగు మార్పు లేకావలెను. నిశ్చయముగా జమీందారీపద్ధతి దానికాలము చెల్లినను జీవించుచున్నది. దానిలో స్థైర్య మెంతమాత్రము లేదు. బ్రిటిషుప్రభుత్వ మీ భూవిభాగపద్ధతిలో గొప్పమార్పులను చేయుటకు సాహసింపదు. అది 'రాయల్ అగ్రికల్చరల్ కమిషన్'ను యేర్పాటుచేసినప్పుడుకూడ కమిషన్ భూయాజమాన్యమునుగురించి భూమిపన్నుపద్ధతినిగురించి చర్చింపకూడదని నిషేధించెను. ఈ విధముగా సంఘర్షణ మప్పుడు హిందూదేశపరిస్థితుల ప్రకృతిలోనేయుండెను. దానిని రాజీలతోను, పదజాలముతో మంత్రించి మాయముచేయుటకు వలనుపడదు. అది యత్యంత ప్రధాన సమస్యయైన భూమిసమస్యయొక్క పరిష్కారమువలననే యంతరింపగలదు. బ్రిటిషుప్రభుత్వ సహాయముతో నీ పరిష్కారము జరుగుట యసంభవము. తాత్కాలికపద్ధతులవలన నీ దుఃఖముకొద్దికాల ముపశమింపవచ్చును. తీవ్రనిర్బంధములు దీనిని బహిరంగముగ వ్యక్తము చేయకుండ భయపెట్టవచ్చును, ఆపివేయవచ్చును. కాని యంత మాత్రముచే నీ సమస్య తీరునదికాదు.

బ్రిటిషుప్రభుత్వము భారతదేశములోని చిక్కులు చాలవరకు 'ఆందోళనపరులవలననే కలుగుచున్నవని భావించిరి. ఇదియొకపిచ్చియూహ. గత పదిహేనుసంవత్సరములనుండి భారతదేశ మొక మహా

నాయకుని కలిగియుండెను. లక్షలకొలది ప్రజల కతనియెడల ప్రేమ, పూజ్యభావముకూడ నుండెను. అతడనేకవిధముల తనభావములనే ప్రజలమీద చొప్పించుచున్నట్లు కాన్పించెను. అతడు భారతదేశ నవీనచరిత్రలో చాలప్రధానపాత్ర ధరించెను. అయినను అతని యాజ్ఞల నంధప్రాయముగ శిరసావహించినట్లు కాన్పించిన ప్రజలే యితనికంటె ముఖ్యమైనవారు. ప్రజలు ప్రధాననటకులు. వారివెనుక వారిని ముందుకు త్రోయుచు, వారిని సన్నద్ధముచేయుచు, వారి నాయకుని శంఖారావముల నాకర్ణించుటకు తయారుచేసిన గొప్ప చారిత్రక కారణములుండెను. ఈ చారిత్రక రంగమును, ఆర్థిక కారణములును లేనిదే యెట్టినాయకులు, నాందోళనపరులు వారిని కార్య రంగములోనికి దింపజాలరు. నాయకుడైన గాంధీజీ ప్రజానాడిని తన యాత్మ ప్రబోధముచే గ్రహింపగలడు. విజృంభించుటకు కార్యరంగ ములోని కురుకుటకు పరిస్థితులెపుడు పరిపక్వముగనుండునో గ్రహింప గలడు. ఇవి గాంధీజీకిగల ప్రధాన లక్షణములు.

1930 లో భారతదేశ జాతీయోద్యమము దేశములో విజృం భించుచున్న సాంఘికశక్తులకు సరిపడియుండెను. ఈ కారణముచే దానికొక గొప్పశక్తికలిగెను. అది క్రమముగ చరిత్రలో నభివృద్ధి చెందుచు దానికొక సత్వత్వముకలిగెను. కాంగ్రెసు ఆ జాతీయోద్యమ మును వ్యక్తముచేసెను. ఈ శక్తియు నీ బలమును కాంగ్రెసుయొక్క గౌరవాతిశయమును పెంపొందించెను. ఇది పైకి కన్పించునదికాదు. దీనిని లెక్కించుటకు, నిర్వచించుటకు వలనుపడదు. అయినను యిది యెక్కువగనుండెను. నిశ్చయముగ రయితాంగము కాంగ్రెసువైపు ప్రెుగ్గెను. అది తన నిజశక్తిని దానికిచ్చెను. మధ్యతరగతులలోని క్రిందితరహావారి పోరాటములోని సైన్యమునకు వెన్నెముకయైరి. ఈ వాతావరణముచే క్షుభితులై పైతరగతి బూర్జువాలుకూడ కాంగ్రెసుతో స్నేహముచేసికొనుటయే తమకు భద్రమనుకొనిరి. భారతదేశములోని బట్టలమిల్లులలో నత్యధికసంఖ్య కాంగ్రెసు విధిం

చిన ప్రమాణపత్రములను వ్రాసియిచ్చిరి. కాంగ్రెసుకు తమపై కోపము తెప్పించుపనులను చేయుటకవి భయపడుచుండెను. లండన్‌లో మొదటి ఆర్. టి. సి. లో కూర్చుని పెద్దలు సునిశితమగు న్యాయ విషయములను తర్కించుచుండగా నిజమైన యధికారమంతయు నెమ్మదిగ, పైకికాన్పించకుండ, ప్రజాప్రతినిధియైన కాంగ్రెసుపరమగు చుండెను. ఈ భ్రాంతి ఢిల్లీ సంధియైన తరువాతకూడ 1930 లోను తరువాతను జరిగిన విషయములనుబట్టి పెరిగెను. నిశ్చయముగ ముందున్న కష్టములను, యుపద్రవములను యెక్కువగ గుర్తించిన వారు కాంగ్రెసునాయకులే. వారు వాటినెంతమాత్రము తృణీకరింప కుండుట కెంతయో జాగ్రత్తపడిరి.

దేశములో రెండు ప్రభుత్వములు వర్ధిల్లుచున్నవనుభావము సహజముగ ప్రభుత్వముకు కోపము కలిగించుచుండెను. యదార్థముకు దీనికెట్టి యాస్కారము లేదు. పశుబలము పూర్తిగా ప్రభుత్వముకే యుండెను. కాని రెండుప్రభుత్వములున్నట్లు మానసికముగ భావింప బడెను. అధికారధూర్వహ ప్రభుత్వ మీస్థితిని భరింపజాలదు. వారు తరువాత ఫిర్యాదుచేసినట్లు గ్రామములలోని వాతావరణమే వారిని నిజముగా కలవరపెట్టెను. కనుక సంఘర్షణము తప్పనిసరియైనట్లు కాన్పించెను. ఏలనన కాంగ్రెసు ఐచ్ఛికముగ నాత్మహత్య చేసుకొన నేరదు. ప్రభుత్వ మీ ద్వంద్వవాతావరణమును భరింపజాలదు. కనుక వారు కాంగ్రెసును నలిపివేయ నమకట్టిరి. రెండవరౌండుటేబిలు కాన్ఫరెన్సు మూలమున నీ పోరాట మాపుచేయబడెను. ఏ కారణము చేతనో బ్రిటిషుప్రభుత్వము గాంధీజీ లండను కాన్ఫరెన్సులో నుండవలెనని గట్టిగ కోరుచుండిరి. కనుక దీనికడ్డంకులువచ్చు పనులను చేయకుండిరి.

అయినను సంఘర్షణభావము పెరుగుచుండెను. ప్రభుత్వ కాఠిన్యతను మేము గుర్తింపగలిగితిమి. ఢిల్లీసంధియైన వెంటనే ఇర్విన్ భారతదేశమును వీడెను. అతనిస్థానమున విల్లింగ్డను వైస్రాయిగా వచ్చెను. క్రొత్తవైస్రాయి చాలకఠినుడు, దయాదాక్షిణ్యములు లేని

వాడు. వెనుకటివానివలె రాజీల కంత సుముఖముగా నుండడనియు నొక కథ బయలుదేరెను. మన రాజకీయవేత్తలు చాలమంది రాజకీయములను సిద్ధాంతములరీత్యాగాక వ్యక్తులరీత్యా యోజించుచుండు 'లిబరలు' యాచారమున కలవాటుపడిరి. బ్రిటిషుప్రభుత్వ సామ్రాజ్య నీతి వైస్రాయిలయొక్క వ్యక్తిగతాభిప్రాయములపై నాధారపడి యుండదని వీరు గ్రహింపరు. కనుక వైస్రాయిలుమారుటవలన నెట్టి భేదము కలుగలేదు, కలుగజాలదు. కానిపరిస్థితులు వృద్ధిచెందు చుండుటచే ప్రభుత్వనీతి క్రమముగా మారెను. సివిలు సర్వీసు పీక స్థులు సంఘులను, కాంగ్రెసుతో వ్యవహరించుటకు అంగీకరింపలేదు. వారు పొందినశిక్షణ, ప్రభుత్వమన యధికారము చెలాయించుటయని వారికిగల భావములు దీనికి వ్యతిరేకము. సమానహోదాతో గాంధీజీ వ్యవహరించుట కాంగ్రెసు పలుకుబడిని, గాంధీజీ గౌరవమును వృద్ధి పరచెనను భావము వారికుండెను. కనుక నతనిగర్వము నణచివేయ వలెను. ఇది చాల యవివేకమయిన భావము. కాని భారతదేశ సివిలుసర్వీసువారిభావములలో నవనీత మేమియులేదు. కారణమేదియైనను ప్రభుత్వమువారు వెన్నువిరిచి, పిడికిలిబిగించి యొకప్రాచీన ప్రవక్తమాటలలో నిట్లు చెప్పుచున్నట్లు కాన్పించెను. 'నా చిన్న వ్రేలు నా తండ్రి నడుముకంటె దళసరియైనది, అతడు మిమ్ము కొరడాలతో మోదుచో నేను మీకు తేళ్ళను పట్టించెదను.'

కాని యాసమయ మింకను రాలేదు. వీలున్నచో కాంగ్రెసు రెండవ రౌండుటేబిలుసభలో ప్రాతినిధ్యము వహింపవలసియుండెను. వైస్రాయితోను, యితరఅధికారులతోను దీర్ఘసంభాషణలను జరుపుటకు గాంధీజీ సిమ్లా రెండుసార్లు వెళ్లెను. వారనేకహంశములను ముఖ్యముగా సరిహద్దులోని 'యఱ్ఱచొక్కాల' యుద్యమము, యు. పి. లోని వ్యావసాయికోద్యమమును గురించి చర్చించిరి. వంగదేశ విషయముకాక ప్రభుత్వము నెక్కువగా నీ రెండుసమస్యలు బాధించెను.

సిమ్లానుండి గాంధీజీ నాకొరకు పంపెను. నేను భారతప్రభుత్వాధికారులలో కొంతమందిని చూచితిని. నేను యు. పి. ని గురిం

వాడు. వెనుకటివానివలె రాజీల కంత సుముఖముగా నుండడనియు నొక కథ బయలుదేరెను. మన రాజకీయవేత్తలు చాలమంది రాజకీయములను సిద్ధాంతములరీత్యాగాక వ్యక్తులరీత్యా యోజించుచుండు 'లిబరలు' యాచారమున కలవాటుపడిరి. బ్రిటిషుప్రభుత్వ సామ్రాజ్యనీతి వైస్రాయిలయొక్క వ్యక్తిగతాభిప్రాయములపై నాధారపడియుండదని వీరు గ్రహింపరు. కనుక వైస్రాయిలుమారుటవలన నెట్టిభేదము కలుగలేదు, కలుగజాలదు. కానిపరిస్థితులు వృద్ధిచెందుచుండుటచే ప్రభుత్వనీతి క్రమముగా మారెను. సివిలు సర్వీసు మీఠస్థులు సంధులను, కాంగ్రెసుతో వ్యవహరించుటకు అంగీకరింపలేదు. వారు పొందినశిక్షణ, ప్రభుత్వమున యధికారము చెలాయించుటయునివారికిగల భావములు దీనికి వ్యతిరేకము. సమానహోదాతో గాంధీజీ వ్యవహరించుట కాంగ్రెసు పలుకుబడిని, గాంధీజీ గౌరవమును వృద్ధిపరచెననుభావము వారికుండెను. కనుక నతనిగర్వము నణచివేయవలెను. ఇది చాల యవివేకమయిన భావము. కాని భారతదేశ సివిలుసర్వీసువారిభావములలో నవనీత మేమియులేదు. కారణమేదియైనను ప్రభుత్వమువారు వెన్నువిరిచి, పిడికిలిబిగించి యొకప్రాచీన ప్రవక్తమాటలలో నిట్లు చెప్పుచున్నట్లు కాన్పించెను. 'నా చిన్న వ్రేలు నా తండ్రి నడుముకంటె దళసరియైనది, అతడు మిమ్ము కొరడాలతో మోదుచో నేను మీకు తేళ్ళను పట్టించెదను.'

కాని యాసమయ మింకను రాలేదు. వీలున్నచో కాంగ్రెసు రెండవ రౌండుటేబిలుసభలో ప్రాతినిధ్యము వహింపవలసియుండెను. వైస్రాయితోను, యితరఅధికారులతోను దీర్ఘసంభాషణలను జరుపుటకు గాంధీజీ సిమ్లా రెండుసార్లు వెళ్లెను. వా రనేకహంశములను ముఖ్యముగా సరిహద్దులోని 'యర్రచొక్కాల' యుద్యమము, యు. పి. లోని వ్యావసాయికోద్యమమును గురించి చర్చించిరి. వంగదేశ విషయముకాక ప్రభుత్వము నెక్కువగా నీ రెండుసమస్యలు బాధించెను.

సిమ్లానుండి గాంధీజీ నాకొరకు పంపెను. నేను భారతప్రభుత్వాధికారులలో కొంతమందిని చూచితిని. నేను యు. పి. ని గురించియే మాట్లాడితిని. మేము చాల నిర్మొగమాటముగ మాట్లాడుకొంటిమి. మా పరస్పరాభియోగముల వెనుకనున్న యదార్థస్పర్థలను గురించి చర్చించితిమి. 1931 ఫిబ్రవరిలో ప్రభుత్వము శాసనోల్లంఘనోద్యమమును మూడుమాసములలోనే శూన్యముగా నలిపివేయగలిగనని చెప్పుదురు. వారు తమ నిర్బంధయంత్రమును పూర్తిచేసిరి. దానినొకత్రోపుత్రోసిన చాలును; ఒక బొత్తాము నొక్కినచాలును. బలవంతముగా నొప్పించుటకంటె, వీలైనచో నంగీకారముతో గూడిన సమాధానమే మంచిదని వారు తలంచి, పరస్పరసంభాషణలను చేయ సంకల్పించిరి. అది చివరకు ఢిల్లీసంధిగా పరిణమించెను. సమాధానము కుదరనిచో బొత్తాము సిద్ధముగ నుండనేయున్నది. మేము తిన్నగా నడచుకొనకపోయినచో నతికాలములోనే యీ బొత్తాము నొక్కివేయబడునను సూచనకూడ చేయబడెను. ఇది యంతయు నమర్యాదగ, నిర్మొగమాటముగ చెప్పబడెను. మే మేమిచేసినను, యేమిచెప్పినను, మా సంబంధము లేకయే స్పర్థ విధాయకముగ సంభవించునని మా యుభయులకు తెలియును.

మరియొక గొప్పయధికారి కాంగ్రెసును పొగడెను. మేమప్పుడు రాజకీయములకు సంబంధించిన విశాలసమస్యలను చర్చించుచుంటిమి. రాజకీయముల నటుంచినచో కాంగ్రెసు దేశమునకు గొప్పసేవచేసెనని యతడనెను. భారతీయులు మంచిసంఘటకులు కారని సామాన్యముగా నొక యపవాదముకలదు. కాని 1930 లో విపరీతమైన కష్టములు, వ్యతిరేకతయున్నను, కాంగ్రెస్ అద్భుత సంఘటనశక్తి ప్రదర్శించెను.

గాంధీజీ మొదటి సిమ్లాప్రయాణము వలన రౌండుటేబిలు సభకు పోవువిషయమేమియు తేలలేదు. అతడు ఆగష్టుఆఖరున తిరిగి సిమ్లా వెళ్ళెను. అటోయిటో తుది నిర్ణయము చేయవలసియుండెను. భారతదేశము వీడుట కతడు నిశ్చయము చేసుకొనుట కష్టతరముగ నుండెను. వంగదేశములోను, సరిహద్దురాష్ట్రములోను, యు. పి. లోను కష్టములు రానున్నట్లతడు గ్రహించెను. భారతదేశములో శాంతియుండునను ధైర్యము చిక్కినకాని యతడు వెళ్ళదలచుకొన్న

లేదు. చిట్టచివరకు ప్రభుత్వముతో నొక సమాధానము కుదిరెను. అది యొకవాగ్దానములోను, కొన్ని యుత్తరములలోను పొందు పరుపబడెను. ఆర్. టి. సి. ప్రతినిధులను తీసుకొనిపోవు స్టీమరుపై నతడుకూడ వెళ్ళుటకు చివరనిమిషములో, నీపని జరుపబడెను. ఒక విధముగా చివరనిమిషము దాటిపోయిన తరువాతనే యిది జరిగెను. సిమ్లానుండి కాల్కావరకు నొకప్రత్యేక రైలుబండి యేర్పాటు చేయబడెను. ఈ బండి సరాసరిపోవుటకు తక్కిన బండ్లన్నియు నాపి వేయబడెను. నే నతనితో సిమ్లానుండి బొంబాయివరకు వెళ్ళితిని. అప్పుట ఆగష్టు మాసాంతమున నితడు రత్నాకర పశ్చిమతీరములకు పయనమగుచుండ నొక సుప్రభాతమున నే నతనియొద్ద సెలవు తీసి కొంటిని. రెండువత్సరములవరకు నాకదియే యతని తుది సందర్శనము.

38

రౌండుటేబిలు కాన్ఫరెన్సు

హిందూదేశములోను, రౌండుటేబిలుకాన్ఫరెన్సులోను గాంధీగారినెక్కువగా చూచితినని చెప్పుకొను నొక ఆంగ్లపత్రికారచయిత యిట్లు వ్రాయుచున్నాడు. "ముల్టాను స్ట్రీమసు" లోనున్న నాయకులందరు కాంగ్రెసువర్కింగుకమిటీలో గాంధీగారిపై కుట్రలేవతీయబడుచున్నదను సంగతి బాగుగ నెరుగుదురు. కాలము పక్వమైనపుడు కాంగ్రెసు అతనిని తరిమివేయునని వారెరుగుదురు. కాని కాంగ్రెసు గాంధీజీని తరిమివేయుటవలన బహుశః దానిలోని సగముమంది సభ్యులను తరిమివేయును. సర్. తేజబహదరు సప్రూ, జయకరుగార్లు సగముమందినే లిబరలు ఉద్యమమున జేర్చుకొనగోరుచున్నారు. వారిభాషలో నతడు 'పిచ్చియెత్తినవాడు' అను విషయము వారెన్నడు దాచిపెట్టలేదు. తనతోపాటు పదిలక్షలమంది 'పిచ్చివాండ్రను' తీసికొని రాగల 'పిచ్చివానిని జయించుట లాభదాయకము.'

1931 లో లండనువెళ్ళిన సర్. తేజబహదరు సప్రూ, జయకరు, యితర ఆర్. టి. సి. సభ్యులు మొదలగువారి యభిప్రాయముల నిది యెంతవరకు తెలుపుచున్నదో నాకు తెలియదు. కాని భారత దేశ రాజకీయములలో నే కొద్దిపరిచయముకలవాడయినను, పత్రికా రచయిత యగుగాక లేక 'నాయకుడు' అగుగాక, నిట్టి వాఙ్మూలము నిచ్చుట నా కాశ్చర్య విషయముగ తోచుచున్నది. నేను దీనిని చదివి దిగ్భ్రమచెందితిని. నేనును దానినిగురించి యెంతకుపూర్వము సూచనగనైనను విని యుండలేదు.

ఈ కుట్రదారులెవరు? వారేమిజేయబూనిరి? అధ్యక్షులైన వల్లభాయిపటేలు నేను వర్కింగుకమిటీలో నతివాదులలోని వారమని యెప్పుడెప్పుడు చెప్పబడెను. కనుక నీకుట్రచేయు నాయకులలో మమ్ము తప్పక లెక్కవేసియుందురని నే ననుకొనెదను. బహుశః భారతదేశమంతటను వల్లభాయికంటె ఎక్కువభక్తుడైన సహచరుడు

గాంధీజీకి వేరొకడు లేడు. అతడతిశక్తిసంతుడు. తన పనిలో భీష్మ ప్రతిజ్ఞ కలవాడు. అయినను గాంధీజీపట్ల స్వాయముగ నాతని యాదర్శముల యెడలను, నీతి యెడలను భక్తి కలవాడు. అతనివలె నేనీ యాదర్శముల నంగీకరించితినని చెప్పుకొనజాలను. కాని నేను గాంధీజీతో నత్యంత సన్నిహిత సంబంధముగలిగి పనిచేసితిని. ఏ విధముగనైనను నతనిపై కుట్రచేయుట యనుభావము నాకు కంపరముగనుండును. ఇదియే వర్కింగుకమిటీకంతకు నన్వయించును. ఆ కమిటీ నిజముగ నితనిచేతనే సృజింపబడెను. కొద్దిమంది సహకారులతో నాలోచించి యతడు కమిటీని పేర్కొనెను. ఎన్నిక యొక ఆచారవ్యవహారము. ఆ కమిటీలో ననేక వత్సరములు పనిచేసినవారే వానికి వెన్నెముకవలె నుండిరి. వారు దాని శాశ్వతసభ్యులుగనే భావింపబడుదురు. స్వభావములోను, దృష్టిలోను, వారిలో రాజకీయ భేదాభిప్రాయములు కలవు. కాని వత్సరముకొలది సాంగత్యమును, సమిష్టిగ భారములను వహించుటయు, సమానయుపద్రవముల నెదుర్కొనుటయు వారి నైక్యముచేసెను. వారిమధ్య స్నేహము, సహవాసము, పరస్పర గౌరవము వర్ధిపొందెను. వారి కలయిక బాహ్యమైనదికాదు. వారి కాంతరంగిక యైక్యతకలదు. ఒకరిపై నొకరు కుట్రపన్నుట యనుభావము నెవడును యూహింపజాలడు. గాంధీజీ మా కమిటీకధినాయకుడు. ప్రతివాడు త్రోవచూపుమని యతనికొరకెదురుచూచుచుండును. చాల వత్సరములనుండి యిది యట్లేయుండెను. 1930 లో మా కఖండవిజయము చేకూరినతరువాత 1931 లో నిది మరింత స్పష్టమయ్యెను.

వర్కింగుకమిటీలోని 'యతివాదులు' అతనిని 'తరిమివేయుటకు, ప్రయత్నించుటెందులకు ? అతడు చాల రాజీపడు స్వభావముకలవాడనియు, కనుక సనర్థకమైనవాడనియు భావింపబడి యుండవచ్చును. కాని యతడులేనిదే పోరాటమెక్కడిది? శాసనోల్లంఘనము సత్యాగ్రహము యెక్కడివి? సజీవముగు నా యుద్యమములో నతడొక భాగము. నిశ్చయముగ నతడే యా యుద్యమము. ఆ పోరాటముకు

సంబంధించినంతవరకు సర్వము నతనిమీదనేయాధారపడియుండెను. జాతీయపోరాటము నిశ్చయముగ నతని సృష్టిగాదు. అది యేవ్యక్తిపైన నాధారపడలేదు. దానిమూలము లతిగంభీరములు. శాసనోల్లంఘనము చిహ్నముగగల పోరాటములోని యాప్రత్యేకత స్వరూపము ముఖ్యముగ నతనిమీదనే యాధారపడియుండెను. అతనిని వీడుట యనగా నా యుద్యమమును విడిచి క్రొత్త పునాదులమీద నూతనసృష్టిచేయుట. అట్టి విషయమెప్పుడైనను చాల కఠినమైనది. 1931 లో దానినిగురించి యోచించుటకే వీలులేదు.

అతనికొక చిన్నసూచనచేసిన చాలియుండగా మేము కుట్ర పన్నవలసిన యగత్యమేమి? అతడు తప్పుకొనెదనని యొక చిన్న సూచన చేసినంతమాత్రమున వర్కింగుకమిటీయు, దేశమంతయు నెప్పుడును దద్దరిల్లుచుండెను. అతడు మా పోరాటములో నొక భాగముగుటచే నమ్ము విడువవచ్చుననుభావమే మాకు దుర్భరముగ నుండెను. అతనిని లండను పంపుటకే మేము సందేహించితిమి. ఏలనన నతని భావములో భారతదేశ భారమంతయు మాపయి బడును. ఈస్థితిని నే మభిలషింపకుంటిమి. భారము నతనిమీద పడ వేయుటకే నే మలవడితిమి. వర్కింగుకమిటీలోను బయటనుగల మాలో చాలామందికిని గాంధీజీకిని యత్యంతానుబంధ ముండుటచే మే మతడులేని తాత్కాలిక విజయముకంటె నతనితోడి యపజయమునే వాంఛించుచుంటిమి. గాంధీజీ 'పిచ్చివాడో' కాడో మన లిబరలు మిత్రులే నిశ్చయించెదరు గాక! అతని రాజకీయము లొక్కొక్కప్పుడు చాల యాధ్యాత్మికముగ గ్రహించుటకు కష్టముగ నుండుననుట కెట్టి సందేహము లేదు. కాని యతడు కార్యవీరుడని, అద్భుత ధైర్యము కలవాడని, తరుణోపాయము చూపగలవాడని రుజువుచేసెను. 'పిచ్చితన'మిట్టియనుభవ యోగ్యమగు ఫలితముల నిచ్చుచో బహుశః అది చదువుతోనే ప్రారంభమయి చదువుతోనే సమాప్తముచెందు నొక ప్రత్యేకకూటమితో నంతరించు 'అనుభవరాజకీయముల' కెంతమాత్రము తీసిపోవు

పడినారు. లక్షలకొలది యున్న యనుచరులుకూడ 'పిచ్చియెత్తిన' వారే. వారికి రాజకీయములు పట్టని రాజ్యాంగశాస్త్రము తెలియవు. ఆహారము, తలదాచుకొనుటకు కొంప, కట్టుకొనుటకు బట్ట, దున్నుకొనుటకు భూమి మొదలగు మానవావసరములనుగురించి మాత్రమే వారు యోచింపగలరు. మానవనైజమును పరిశోధించుటలో శిక్షను గఱచిన ప్రఖ్యాత విదేశపత్రికారచయితలు భారతదేశములో విపరీత బుద్ధులగుదురు. ప్రాచ్యదేశము కేవలము భిన్నమైనదనియు, దానిని మామూలు ప్రమాణములతో విమర్శించుటకు వీలు లేదనియు బాల్యమందే వారికి పట్టింపబడిన భావముల ఫలితమా యిది? లేక, ఇంగ్లీషువారి సందర్భములో, వారిదృష్టిని నిరోధించి, వారి యభిప్రాయములను తికమకచేయునది సామ్రాజ్యానుబంధమా?

1931 లో గాంధీజీ యూరపు పయనమయిననాడే విఖ్యాత ప్యారిసు పత్రికారచయిత వ్రాసినవ్యాసము చదివితిని. ఆ వ్యాసము హిందూదేశమునకు సంబంధించినది. అందులో నతడు 1921 నాటి అసహాయోద్యమదినములలో వేల్సుయువరాజు హిందూదేశమును దర్శించినపుడు జరిగిన యొక విషయము నుదహరించెను. మహాత్మాగాంధీ యొకచోట యెట్టిప్రకటనయు లేకుండ యువరాజు మందిరమునకు హఠాత్తుగ నాటకములోని పాత్రధారివలెవచ్చి, మోకరించి యువరాజు పాదములుపట్టుకొని వెక్కివెక్కి యేడ్చుచు నీదౌర్భాగ్యదేశమునకు శాంతిని ప్రసాదింపుమని యతనిని ప్రార్థించెననియు నందులో వ్రాయబడెను. ఈ యద్భుతకథను నే నెవరమును, గాంధీజీకూడ వినియుండలేదు. ఈ సంగతి నే నా పత్రికారచయితకు వ్రాసితిని. అతడు విచారము తెలిపెను. కాని తన కది నమ్మదగిన చోటునుండి వచ్చెనని వ్రాసెను. కేవలమసంభవమని దానిముఖము మీదనే వ్రాసిపెట్టబడియున్న యీ కథను పరిశోధించుటకెట్టి యత్నముచేయకయే యతడు విశ్వసించుట నా కాశ్చర్యముగ తోచెను. గాంధీజీని, కాంగ్రెసును, భారతదేశమును గురించి యేమాత్రము తెలిసినవాడు దీనిని విశ్వసింపజాలడు. ఈకథ యవిశ్వాస

నీయము, పరిహాసాస్పదము. ఇవి తలక్రిందులుగా నిలిచి యూహాత్వాన పూర్వకముగా గాలిలో కాళ్ళనుఝాడించుచున్న ముసోలినీదగ్గ ఱకువచ్చి క్యాంటర్బరీఆర్చిబిషప్ (మతగురువు) చేర్చెనను మూర్ఖ కథను బోలియున్నది.

ఒక వార్తాపత్రిక మరియొకజాతికథను తెల్పుచున్నది.గాంధీజీ యొద్ద లక్షలకొలదిపౌనుల ధనరాసులున్నవనియు, వానినతడు రహ స్యముగా స్నేహితులవద్దదాచెననియు, కాంగ్రెసుయీధనముకొరకు ప్రాకులాడుచున్నదనియు నీ కథ చెప్పుచున్నది. గాంధీజీ కాంగ్రెస్ సభ్యుడుగానుండుట మానివేసినచో నీ ధనరాసులుపోవునేమోయని భయపడుచున్నదట. ఈకథకూడనొక యభూతకల్పన. గాంధీజీయెప్పు డను స్వీయముగగాని, రహస్యముగగాని తనయొద్ద ధనము నుంచు కొనడు. అతడువసూలుచేసినదంతయు నేప్రజాసంస్థకో యిచ్చి వేయును. అతనివైశ్యప్రకృతిచేనతడు లెక్కలందతిజాగ్రతగనుంచును. అతడుచేయు వసూళ్ళన్నియు బహిరంగముగతనిఖీచేయబడును. ఈవదంతిబహుశః 1921 లో వసూలుచేయబడిన కోటిరూపాయలకథమీద నాధారపడి యుండెను. ఘనముగాకాన్పించు యీ మొత్తము భారతదేశమంతట పంచిపెట్టబడినచో నతిస్వల్పమేయగును. ఇది జాతీయ విశ్వవిద్యా లయములకు, పాఠశాలలకు, గృహపరిశ్రమలకు, (ముఖ్యముగా ఖద్దరు) అస్పృశ్యతానివారణకు, ననేక యితర నిర్మాణకార్యములకు వినియోగింపబడెను. ఇందులో చాలభాగము ప్రత్యేక కార్యముల కేర్పడెను. అవి యిప్పటికి నాయా పనులకు వినియోగింపబడు చున్నవి. వసూళ్ళలో మిగతసొమ్ము స్థానికకమిటీల కీయబడెను. అది కాంగ్రెసుసంస్థల నిర్మాణమునకు, రాజకీయప్రచారమునకు, ఖర్చు పెట్టబడెను. అసహాయోద్యమము తరువాత కొద్దిసంవత్సరములవరకు, కాంగ్రెసుప్రచారము దానివలననే నడుపబడెను. గాంధీజీ, దేశదారి ద్ర్యముకూడ మన రాజకీయోద్యమము నత్యంతస్వల్పముతోనే నిర్వ హించుకొనుటను బోధించెను. మా సేవచాలవరకు పూర్తిగా నైచ్ఛిక మైనది. జీతములనిచ్చినచోట నది కేవలము కడుపుచిచ్చు చల్లార్చు

వదిగ నుండెను. మాలో నుత్తములైన సేవకులకు కుటుంబములుగల విశ్వవిద్యాలయ బి. ఏ. లకు యింగ్లండులోనియుద్యోగులకిచ్చు అల వెన్సుకంటె తక్కువ యివ్వబడెను. గత పదిహేను సంవత్సరముల నుండియు కాంగ్రెసు యుద్యమము నడుపబడినంత తక్కువ మొత్తముతో నెచ్చటను రాజకీయోద్యమము, లేబరుయుద్యమము పెద్ద యెత్తున నడుపబడెనని నేననుకొనను. ప్రతివత్సరముఅన్నికాంగ్రెసు నిధులు, లెక్కలు బహిరంగముగ తనిఖీచేయబడెను. కాంగ్రెసు అక్రమసంఘముగా ప్రకటింపబడిన శాసనోల్లంఘనదినములలోతప్ప యీ సొమ్ములో నేదియు రహస్యముగ నుంచబడలేదు.

గాంధీజీ కాంగ్రెసుయొక్క యేకైక ప్రతినిధిగా రౌండు టేబిలు కాన్ఫరెన్సుకు లండనువెళ్ళెను. చాలకాలము చర్చించిన తరువాత నిక నెవరిని ప్రతినిధిగ బంపకుండుటకే నిశ్చయించితిమి. భారతదేశములో నతి విషమసమయమున, విషయముల నతిజాగ్రతగ చేపట్టవలసిన యగత్యముకలిగినపుడు, మాలోని శ్రేష్ఠులందరు నిచ్చటనుండవలెనను కోరికయే దీనికి కొంతకారణము. ఆర్.టి.సి. లండనులో జరుగుచుండినను కేంద్రాకర్షకస్థానము భారతదేశమని మేము భావించితిమి. భారతదేశపరిస్థితులే విధాయకముగలండనులో ప్రతిబింబించుచుండెను. నే మనర్థములు జరుగకుండ చూచుకొనుచు మాసంస్థ నుచితస్థితిలో నుంచుకొనగోరితిమి. అయినప్పటికి నొక్క ప్రతినిధినే పంపుట కిదే యదార్థకారణముకాదు. మేము చట్టనిర్మాణములోని చిన్నచిన్న వివరముల నంతరములేకుండ చర్చించుటకే రౌండుటేబిలు సభలో జేరలేదు. ఆస్థితిలో మా కట్టివివరములతోపనిలేదు. బ్రిటిషుప్రభుత్వముతో ప్రధానవిషయములలోసమాధానము కుదిరినపుడే వాటినిగురించి యోచింపవలసియుండును. ప్రజాస్వామిక భారతదేశమున కెంతయధికారమునీయవలెను? యనునదియే సరియైన ప్రశ్న. తరువాత నే చిన్నప్లీడరయినను, ముసాయిదాను, వివరములను తయారుచేయునచ్చును. ఈ ప్రధాన విషయములను గురించి కాంగ్రెసు అభిప్రాయములు తేటతెల్లముగనే యున్నవి.

అందులో తర్కమున కెంతమాత్రము నావకాశము లేదు. మానాయకు డొక్కడే వెళ్ళి యా భావములను విశదము చేయుటయే గౌరవపద్ధతి. అతడు వాటికిగల ముఖ్యకారణములను, విధాయకతను చూపి, వీలైనచో, బ్రిటిషు ప్రభుత్వము వాటి కొప్పుకొనునట్లు చేయ యత్నించును. అది చాలకష్టమనుసంగతి, దుస్సాధ్యమనుసంగతి అప్పటిపరిస్థితులను బట్టి నే నెఱుగుదును. కాని మాకప్పుడిక మరియొకమార్గ మేమియు లేకుండెను. మే మాస్థితి నతిగాఢముగా విశ్వసించి బాసచేసిన మా యాదర్శములను, సిద్ధాంతములను వీడజాలకుంటిమి. ఆ ప్రధానసూత్రములమీద నాధారపడిన సమాధాన మేదియైన యదృష్టవశమునకను గొనబడినచో తక్కినదంతయు సులభముగనే దాని ననుసరించును. అట్టి సమాధానమే కుదిరినచో గాంధీజీ కొందరినిగాని, వర్కింగు కమిటీ సభ్యులందరినిగాని లండను పిలిపించుటకు మాలో మే మేర్పాటుచేసికొంటిమి. అప్పుడు మేమందరము సమాధాన వివరములలో పాల్గొనవచ్చును. ఆ పిలుపుకు మేము సిద్ధముగనుండవలెను. అవసరమైనచో వాయుయానముకూడ చేయవలెను. ఈ విధముగ మేము పిలుపువచ్చిన పదిరోజులలో నతనితో నుండగలము. మొదట ప్రధానవిషయములలో సమాధానమే కుదరనిచో తక్కిన సంధివివరముల సమస్యయే యుండనేరదు. ఆర్. టి.సి.కి కాంగ్రెసు ప్రతినిధులదనముగా వెళ్ళవలసిన యవసరముండదు. కనుక నే మేము గాంధీజీ నొక్కనిని పంపుటకే నిశ్చయించితిమి. వర్కింగుకమిటీ సభ్యురాలగు సరోజినీదేవికూడ ఆర్. టి. సి. కి వెళ్ళెను. కాని యామె దానికి కాంగ్రెసు ప్రతినిధిగా వెళ్ళలేదు. భారతస్త్రీల తరఫున ప్రతినిధిగా నామె యాహ్వానింపబడెను. ఆమె యట్లు వెళ్ళుటకు వర్కింగుకమిటీవారనుమతించిరి.

కాని బ్రిటిషు ప్రభుత్వమునకు మా యభీష్టములతో నేకీభవింపవలెనను యుద్దేశ్య మెంతమాత్రము లేదు. ప్రధానసమస్యల విచారణ కాలయాపనచేయుటయే వారినీతి. వారు స్వల్ప నిరర్థకవిషయములతో కాన్ఫరెన్సును విసిగింపదలచిరి. పెద్ద విషయములు రాచింప

బడినపుడుకూడ ప్రభుత్వమువా రాగవలసినదనిరి. వా రేమాట నీయక పూర్ణాలోచన చేసినతరువాత తమయభిప్రాయము తెలిపెద మని వాగ్దానముచేసిరి. వారొకటేపాట పాడిరి. ఒకేయాట నాడిరి! కులసమస్యయే వారి తురుపుముక్క. వారు దాని నెంతవరకుపయో గింపవలెనో యంతవరకు నుపయోగించిరి. కాన్ఫరెన్సులో నదియే రాజ్యముచేసెను.

కాన్ఫరెన్సులోని భారతసభ్యులలో నధికసంఖ్యాకులు, చాల మంది యిష్టముగను, కొద్దిమంది యిష్టముగను, యీ యధికార మంత్రాంగములో పడిపోయిరి. అది యొక నానాగోత్ర సంఘము. వారు తమకుతప్ప మరెవరికి ప్రతినిధులుకారు. కొంతమందిసమర్థులు, పూజ్యులు. చాలమంది యితరులవిషయమై యీ మాట చెప్ప జాలము. మొత్తముమీద వారు రాజకీయముగ, సాంఘికముగ, భారతదేశాభ్యుదయ భంగకరులగు ప్రతినిధులు. భారతదేశములో నతిజాగ్రతపరులును, మితవాదులునైన భారత లిబరలు పక్షీయు లీ బృందము ముంద రభివృద్ధివాదులుగ ప్రకాశించిరి. వారు భారతదేశ పెట్టుబడిదారుల ప్రతినిధులు. వారు బ్రిటిషు సామ్రాజ్యమునకు బంధింపబడి స్వాభివృద్ధికొరకు లేక రక్షణకొరకు వారివైపు చూచు చుందురు. కులసమస్యమీద 'మైనారిటీ' 'మెజారిటీ'సంఘములనుండి యతిప్రాముఖ్యమైన ప్రాతినిధ్యమువచ్చెను. వీరు పయితరగతులకు చెందిన మొండిపట్టుకలవారు. వీరిలోవీరికి సమాధానమెన్నడుకుదర దను సంగతి జగద్విఖ్యాతము. రాజకీయముగ వీరు పూర్తిగానభివృద్ధి భంగకారకులు. తమ కులాభివృద్ధి యొక్కటే వారి ప్రయోజనము. తమ కులాభీష్టములు నెరవేరువరకు తా మెట్టి యధిక రాజకీయ స్వాతంత్ర్యము నంగీకరింపజాలమని వారుచాటిరి. అది చాల యాశ్చ ర్యకర దృశ్యము. పరప్రభుత్వములోనున్న ప్రజ లెంత యథఃపతితు లగుదురో యది సవిషాదముగ స్పష్టముచేయుచున్నది. సామ్రాజ్య తంత్రములో వా రెట్టినాచిక లగుదురో యది విశదముచేయుచున్నది. మహారాజరాజశ్రీలు, ప్రభువులు, వీరాధివీర బిరుదాంకితులు, యితర

పెద్దపెద్ద బిరుదులుగల యీ మూక భారతప్రజలకు ప్రాతినిధ్యము వహింపజాలదనుట సత్యము. రౌండుటేబిలు కాన్ఫరెన్సు సభ్యులు బ్రిటిషుప్రభుత్వముచే పేర్కొనబడిరి. ప్రభుత్వమునకు సంబంధించినంతవరకు నీ యెన్నిక బాగుగనే చేయబడెను. కాని బ్రిటిషుప్రభుత్వమువారు మనలనట్లుపయోగించుకొని కొల్లగొట్టుకొనగలవిషయమొక్కటే మన దుర్బలత్వమును చాటుచున్నది; పెడమార్గమున బడి, యొకరి ప్రయత్నముల నొకరు భంగముచేయుట కెట్టి వింత సౌకర్యములున్నవో యది విదితము చేయుచున్నది. మన పయి తరగతులవారింకను మనసామ్రాజ్యపాలకులలక్ష్యములోనేచుట్టుకొని పోయి వారిపాటనే పాడుదురు. దానిలోనుండి చూడలేకపోవుటచే వారట్లుచేయుచున్నారా? లేక దాని నిజభావమును గ్రహించియే భారతదేశ స్వేచ్ఛకు, ప్రజాస్వామికమునకు భయపడి,వారు దానిని బుద్ధిపూర్వకముగ స్వీకరించిరా?

ఈ స్వార్థపరుల సంఘమునకు—సామ్రాజ్యవాది, ఫ్యూడలిస్టు, ధనికుడు, పారిశ్రామికుడు, మతతత్పరుడు, కులాభిమాని—యగు ఆగాఖాన్, బ్రిటిషు యిండియా ప్రతినిధుల తరఫున నాయకుడగుట యెంతయు సమంజసముగ నున్నది. స్వయముగా కొంతవర కతనిలో నీ యన్ని ప్రయోజనములు మూర్తీభవించినవి. ఒకపురుషాంతరము నుండి బ్రిటిషుసామ్రాజ్యముతోను, బ్రిటిషుపరిపాలకులతోను సంపర్కముకలిగి, ప్రధానముగ యింగ్లండులోనే నివసించుచుండు యీ పురుషుడు మన నాయకుల ప్రయోజనములను, దృక్పథమును చక్కగా గ్రహించగలడు. వాటికొరకు వాదించగలడు. రౌండు టేబిలు కాన్ఫరెన్సులో నతడు యింగ్లీషు సామ్రాజ్యము తరఫున సమర్థుడైన ప్రతినిధిగ నుండెడివాడు.

ఆ కాన్ఫరెన్సులో మొగ్గుదల మనకు చాల వ్యతిరేకముగ నుండెను. నేను దానివలన నేమియు నాశించకపోయినను ఆ తంతు నాశ్చర్యముతోను, నసహ్యముతోను పరీక్షించుచుంటిని. ఆర్థిక, జాతీయసమస్యలను పయిపయిన గోకుటకుచేసిన విచారభరిత,నిరర్థక

ప్రయత్నములను చూచితిమి. సంధులు, పన్నాగములు, తంత్రాంగములు, మనదేశస్థులే కొంతమంది బ్రిటిషు కన్సర్వేటివ్ పార్టీలోని యత్యంత యభివృద్ధిభంగకారులైనవారితో చేతులుకలుపుట, చిన్న సమస్యలమీద ననంతముగా భాషించుట, కావలసినదానిని బుద్ధిపూర్వకముగ త్రోసివేయుట, పెద్దపెద్ద స్వప్రయోజనములుగలవారిచేతులలో కీలుబొమ్మలవలె నాడుచుండుట, పరస్పరజగడములు, మధ్యమధ్య విందులు, పరస్పరస్తోత్రములు మొదలగు నాటకమునంతను—మేము చూచితిమి. అదంతయు నుద్యోగములకొరకు ప్రాకులాడుట—పెద్దయుద్యోగములు, చిన్న యుద్యోగములు, హిందువులకు, ముస్లిములకు, సిక్కులకు, నాంగ్లోయిండియనులకును, యూరపియనులకును యుద్యోగములు, స్థానములు—కాని యన్ని యుద్యోగములును పయితరగతులకే. ప్రజలను చూచువా రెవరును లేరు. కొంగజపములు మెండుగనుండెను. వివిధబృందములవారు ఆకొన్నతోడేళ్ళవలె, క్రొత్త చట్టనిర్మాణములో కొల్లగొట్టబడు యామిషముకొరకు, పొంచి తిరుగాడుచుండినట్లు కాన్పించిరి. స్వేచ్ఛాభావమే పెద్దయెత్తున యుద్యోగవేటగా మారెను. అది 'భారతీయులవశముచేయుట' యని పిలువబడెను; సైన్యము, సివిలుసర్వీసు మొదలగువాటిలో భారతీయుల కెక్కువ నుద్యోగము లిచ్చుటను గురించియు స్వాతంత్ర్యమును గురించియు యదార్థమైన స్వేచ్ఛను గురించియు, ప్రజాస్వామికమైన భారతదేశమునకు అధికారము నిచ్చివేయుటను గురించియు, భారతప్రజల నెదుర్కొనిన యత్యావసరము, ప్రధానమునగు నే యార్థిక సమస్యా పరిష్కారమును గురించియు నొక్కడును యోచింపలేదు. భారతదేశమంత వీరసంగ్రామము జరిపినది దీనికొరకేనా? త్యాగతత్వములచే పవిత్రమైన వాతావరణమును యీ దుమ్ము ధూమములతో నిండిన గాలికి బలివేయవలసినదేనా?

తళతళ ప్రకాశించుచు, జనాకీర్ణమైయున్న యీ మందిరములో గాంధీజీ యొకాకియై కూర్చొనెను. అతని వేషము, లేక

వేషములేకపోవుట, తక్కిన యందరనుండియు నతనిని వేరుచేయుచుండెను. కాని యతని భావములకు, దృష్టికి నతనిచుట్టునున్న వేషధారుల భావములకు, దృష్టికి నంతకంటె నెక్కువ భేదముండెను. ఆ కాన్ఫరెన్సులో నతనిస్థితి యసామాన్యమైనది. అతడు దానినెట్లు భరింపగలిగెనా యని మేము దూరమునుండియే యాశ్చర్యపడుచుంటిమి. కాని యత డద్భుతమైన యోర్పుతో దానిని సహించి సమాధానమున కేదోయొకమార్గము కనుగొనుటకు విడువకుండ ననేక ప్రయత్నములను చేసెను. అతడొక సూచన చేసెను. కులతత్వము రాజకీయపురోభివృద్ధితో తలపడువను నిజము యొట్లుకప్పబడుచున్నదో యది వెంటనే బహిర్గతముచేసెను. కాన్ఫరెన్సులోని ముస్లిం ప్రతినిధులవలన చేయబడిన యనేక కులసంబంధములగు కోరిక లతనికిష్టములేదు. ఇందులో కొన్ని కోరికలు స్వాతంత్ర్యమునకు ప్రజాస్వామికమునకు నాటంకములని యతడు భావించెను. అతనియొక్క ముస్లిముజాతీయ సహచరులుకూడ నట్లే భావించిరి. అయినను, అచ్చటజేరిన ముస్లిం ప్రతినిధులందరు రాజకీయసమస్య (అనగా స్వాతంత్ర్యతీర్మానము) మీద తనతోను కాంగ్రెసుతోను కలిసివచ్చుచో నతడువాటినన్నిటిని, యెట్టివాదము, ప్రశ్న లేకుండగనే, యొప్పుకొనెదనని వాగ్దానముచేసెను.

అతడుచేసినవాగ్దానమును స్వంతజవాబుదారీమీద నేచేసెను. ఏలనన కాంగ్రెసు నతడు బంధింపజాలడు. కాని దాని నొప్పుకొనవలెనని తాను కాంగ్రెసును ప్రోత్సహించెదనని యతడు వాగ్దానముచేసెను. కాంగ్రెసులో నతనికిగల పలుకుబడి నెరిగినవారెవరు కాంగ్రెసుచే నతడు దీనికొప్పించజాలడని సందేహింపరు. అయినప్పటికి నీవాగ్దాన మంగీకరింపబడలేదు. నిశ్చయముగ ఆగాఖాను భారతస్వాతంత్ర్యముకొరకునిలుచునని యూహించుట కొంచెము కష్టమైన విషయము. నిజమైనకష్టము కులసంబంధమైనది కాదని యిదిస్పష్టము చేయుచున్నది. కాని కాన్ఫరెన్సులో కులసమస్యయే పెద్దదిచేయబడెను. రాజకీయాభివృద్ధి నాటంకపరచువారు కులసమస్యలచాటున

దాగొనిరి. బ్రిటిషుప్రభుత్వము కాన్ఫరెన్సుకు మనుష్యులను జాగ్ర
తగ నెన్నుకొని యీ యభివృద్ధిని భంగపరచువారిని ప్రోగుచేసెను.
సభలో జరుగవలసిన విధానమును తమవశము నందుంచుకొని వారు
కులసమస్యను ప్రధానసమస్యగ చేసిరి. ఈ సమస్యమీద నచ్చట
జేరినవారిలో సమాధానము కలుగనేరదని స్పష్టమగుచునేయున్నది.

బ్రిటిషుప్రభుత్వము తనయత్నములో విజయమునొంది తన
సామ్రాజ్యమును నిలుపుకొనుటకు తగినశరీరబలమునేగాక, సామ్రా
జ్యసాంప్రదాయమును మరికొంతకాలము నిర్వహించుటకు తగినరాజ
నీతిని, యుక్తినికూడ కలిగియున్నదని ప్రకటనచేసెను. రౌండుటేబిలు
కాన్ఫరెన్సు తమకు ప్రాతినిధ్యము వహింపకపోయినను, అది వారి
శక్తికొక ప్రమాణముకాకపోయినను, భారతదేశప్రజలు విఫలులై
రనియే చెప్పవలెను. దేనికొరకుపోరుచున్నారో దానినిగురించి వారి
కొకలత్యశుద్ధి లేకపోవుటచేతనే వారు విఫలులైరి. వారినితప్పు
ద్రోవనుపెట్టి పెడమార్గముపట్టించుటతిసులభము. తమయభివృద్ధి
నాటంకపరచు స్వప్రయోజకులను త్రోసివేయుటకు తగినంతశక్తి
కలవారమని తలంపకపోవుటచేతనే వారు విఫలులైరి. ఎక్కువ మత
పిచ్చియుండుటచేతను, కులద్వేషములను సులభముగ రగుల్కొల్పు
టకు వీలుండుటచేతను వారు విఫలులైరి. మొత్తముమీద విజయము
పొందుటకు తగినంతశక్తి, యభివృద్ధి కలిగియుండకపోవుటచేతనే
వారు విఫలులైరి.

ఈ రౌండుటేబిలు కాన్ఫరెన్సులో జయించితిమా లేదాయను
ప్రశ్న లేదు. దానివలననేమియు నాశింపబడలేదు. అయినను దీనికొక
ప్రాముఖ్యతకలదు. తత్పూర్వపుకాన్ఫరెన్సు హిందూదేశములోగాని
మరెచ్చటగాని యెవరిదృష్టినియాకర్షింపలేదు. అప్పుడుశాసనోల్లంఘ
నము ప్రపంచము నాకర్షించెను. ప్రభుత్వనియామకులై 1930 కాన్ఫ
రెన్సుకు వెళ్లినసభ్యులు నల్లజండాలు,వ్యతిరేక కేకలు, వెంటాడుచుండ
సభలకు వెళ్ళుచుండెడివారు. 1931 లో నిదియంతయు మారిపోయెను.
కాంగ్రెసుప్రతినిధిగ గాంధీజీ లక్షలకొలదియనుచరులకు నాయకుడుగ

వెళ్ళుటచేతనే యీ మార్పుజరిగెను. ఇది యీ కాన్ఫరెన్సుకు గౌరవము నిచ్చెను. హిందూదేశము దీనిచరిత్ర నెక్కువశ్రద్ధతో వీక్షించెను. కారణమేమయిన నపజయము భారతదేశమునకపకీర్తిని తెచ్చెను. గాంధీజీ దానిలో పాల్గొనవలెనని బ్రిటిషుప్రభుత్వమంత యాసక్తి నేలచూపెనో మే మప్పుడె దర్థముచేసికొంటిమి.

పన్నాగములు, సమయానుకూల స్వాహాపరత్వము, వ్యర్థమగు వంకరటింకర తిరుగుళ్ళుగల యీ కాన్ఫరెన్సు భారతదేశముయొక్క యపజయము కానేరదు. అది విఫలమగుటకే నిర్మింపబడెను. దాని విఫలతకు భారతదేశప్రజలు బాధ్యులు కాజాలరు. కాని యది భారత దేశ నిజసమస్యలనుండి ప్రపంచదృష్టిని మరలించుటలో జయము గాంచెను. హిందూదేశములో నదిభ్రమను తొలగించెను. వ్యాకుల తను, అవమానమును కలిగించెను. అభివృద్ధినాటంకపరచువారు తల యెత్తుట కది యాస్కారమయ్యెను. భారతదేశములో జరుగు పనుల వలననే ప్రజలకుజయాపజయములు కలుగగలవు. ఆరు వేలమైళ్ళదూర మున లండనులో జరుగు మంత్రాంగములవలన శక్తివంతమగు జాతీయోద్యమ మంతరింపజాలదు. జాతీయత మధ్యతరగతులవారి యొక్కయు రయితులయొక్కయు నిజావశ్యకతను తెలుపుచున్నది. వారు తద్వారా తమసమస్యలను పరిష్కరించుకొనజూచిరి. ఈయుద్య మము జయించి, తనధర్మమును నెరవేర్చి ప్రజల నభివృద్ధి, స్వేచ్ఛా మార్గముల నింకను ముందుకు గొంపోగల మరియొక యుద్యమము నకు సావకాశము నీయవచ్చును. లేక నిది కొంతకాలము బలవంత ముగ నణచివేయబడవచ్చును. ఆ పోరాటము హిందూదేశములో తరువాత వెంటనే రావలసియుండును. అది కొద్దికాలము బలహీన తను తెచ్చిపెట్టవచ్చును. రెండవ రౌండుటేబిలుకాన్ఫరెన్సు యీ పోరాటము నంతగా బాధించలేదు. కాని యది దానికి కొంతయనర్థ దాయకమగు వాతావరణమును సృష్టించెను.

39

సంయుక్త రాష్ట్రములలో వ్యావసాయిక కష్టములు

వర్కింగుకమిటీ సభ్యుడను, కాంగ్రెసు కార్యదర్శులలో నొకడను నగుటచే నఖిలభారతరాజకీయములతో నాకుసంబంధముండెను. నేను సాధ్యమైనంతవరకు తప్పించుకొనుచుండినను అప్పుడప్పుడు కొంచెము లిసుగుచుండవలసి వచ్చెడిది. మా భారములు, బాధ్యతలు హెచ్చినకొలది వర్కింగుకమిటీ మీటింగులు దీర్ఘములగుచు చివరకవి రెండువారములవరకు వరుసగ సాగుచుండెను. కేవల విమర్శ పూర్వక తీర్మానములనుచేయు రోజులు గతించెను. విస్తృతమై, యనేకసమస్యలతోగూడిన సంస్థయొక్క యనేక వివిధ నిర్మాణ కార్యములను పాలించవలెను. దినదినము కష్టమైన సమస్యలను యోచించవలసి వచ్చెడిది.

అయినను యు. పి. నా ప్రధాన కార్యరంగము. అచ్చటి వ్యావసాయిక పరిస్థితులు కాంగ్రెసుదృష్టి నాకర్షించెను. యు. పి. రాష్ట్ర కాంగ్రెసుకమిటీసభ్యులు నూటయేబదిమంది. వారు ప్రతి రెండుమూడు మాసములకు కలుసుకొనెడివారు. దాని కార్యనిర్వాహకవర్గము తఱచుకలుసుకొని వ్యావసాయికశాఖను చూచెడివారు.

1931 సంవత్సర రెండవభాగములో కార్యనిర్వాహకవర్గము ప్రత్యేక వ్యావసాయికకమిటీ నేర్పరచిరి. అనేకమంది జమీందారులు కార్యనిర్వాహకవర్గముతోను, యీకమిటీతోను మొదటినుండి చివర వరకు సంబంధము కలిగియుండిరి. వారియామోదముతోనే అన్ని చర్యలు జరుపబడెను. మా రాష్ట్రకమిటీయధ్యక్షుడు ఆసంవత్సరము సయ్యద్ అహమ్మదుఖాన్ షెర్వానీ.అతడొక సుప్రసిద్ధజమీందారీ కుటుంబమునకు చెందినవాడు. సాధారణ కార్యదర్శి శ్రీ ప్రకాష్ గారును కార్యనిర్వాహకవర్గములోని ముఖ్యసభ్యులుకూడ జమీందారులు, లేక జమీందారీ కుటుంబములోనివారు. తక్కిన సభ్యులు వృత్తులతోనున్న మధ్యతరగతివారు. మా రాష్ట్ర కార్యనిర్వాహక

వర్గములో సేద్యగానియొక్క, బీద రయితుయొక్క, ప్రతినిధి యొక్కడు లేడు. జిల్లాకమిటీలలో రయితులు గలరు. కాని రాష్ట్ర కార్యనిర్వాహకవర్గములోనికి వచ్చుటకుపూర్వము జరుగవలసిన యెన్నికల నన్నిటిని వారు దాటి పైకి రాజాలకపోవుచుండిరి. కనుక నా వర్గమును మధ్యతరగతులలో చేరుకొన్నవారు బలమైన జమీందారులు పూర్తిగ నాక్రమించిరి. కనుక దానిని యతివాద సంఘమని యే యర్థములోను చెప్పుటకు వీలులేదు. నిశ్చయముగా వ్యావసాయిక సమస్యలో నసలే చెప్పుటకు వీలులేదు.

మా రాష్ట్రములో నేను కార్యనిర్వాహకవర్గములోను వ్యావసాయిక కమిటీలోను సభ్యుడను. నాకంతకంటె నెక్కువస్థానములేదు. మా సలహా సంప్రదింపులలోను యితరపనులలోను నే నెక్కువశ్రద్ధ తీసికొనెడివాడను. కాని నే నేవిధముగను నాయకత్వము వహింపలేదు. మా రాష్ట్రములో నెవడును నాయకపాత్రను వహించెనని చెప్పుటకు వీలులేదు. మేము చాలకాలమునుండి సముష్టిగ, సంఘపరముగ పనిచేయుట కలవడితిమి. ఎప్పుడు సంఘమునకే ప్రాధాన్యత యివ్వబడెను. కాని వ్యక్తికీయబడలేదు. ఆ సంవత్సరాధ్యక్షుడే మాకు తాత్కాలిక ప్రధాని యగుచుండెను. అతడు మా ప్రతినిధి. కాని యతనికికూడ ప్రత్యేకాధికార మేమియులేదు.

నేను స్థానికముగ అలహాబాదు జిల్లాకాంగ్రెసు సభ్యునిగకూడ పనిచేసితిని. ఈ కమిటీ దీని యధ్యక్షుడయిన పురుషోత్తమదాసు టాండనుయొక్క నాయకత్వముక్రింద వ్యావసాయికస్థితి నభివృద్ధి పరచుటలో ముఖ్యపాత్రతీసికొనెను. 1930లో రాష్ట్రములోపన్నుల నిరాకరణోద్యమమును ప్రారంభించుటలో నిది నాయకత్వము వహించెను. వ్యవసాయ ధరలు పడిపోవుటవలన అలహాబాదుజిల్లా కెక్కువ దెబ్బతగిలెను. అయోధ్యలోని తాలూకుదారీజిల్లాలు మరింత యధ్వాన్నముగ నుండెను. కాని యలహాబాదు జిల్లాలో మంచి యేర్పాటులు యెక్కువ రాజకీయచైతన్యమునుండెను. అలహాబాదు పట్టణము రాజకీయ కృషికంతకు కేంద్రమగుటయు, చాలమంది

ప్రధాన సేవకులు చుట్టుప్రక్క గ్రామములకు తరచు వెళ్ళుచుండుటయు దీనికి కారణములు.

1931 మార్చిలో ఢిల్లీసంధి జరిగిన వెంటనే మేము ప్రచారకులను, నోటీసులను గ్రామసీమలకుపంపి, శాసనోల్లంఘనము, యీ యుద్యమము ఆగిపోయెనని రయితులకు తెలియజేసితిమి. పన్ను చెల్లించుటకు రాజకీయముగ నాటంకములేదని చెప్పి చెల్లింపవలసినదనియే మేము వారికి సలహానిచ్చితిమి. కాని ధరలమ్మితముగా పడిపోవుటచే వారికి హెచ్చురిమిషనుల నీయవలెనని మా యభిప్రాయమనియు, వాటికొరకు కలిసి పనిచేయవచ్చుననియు మేము సూచించితిమి. మామూలు రోజులలోకూడ పన్ను తరచు దుర్భరముగ నుండెను. ధరలుపడిపోవుటచే పూర్తిపన్ను లేకతత్తుల్యమైనదానిని చెల్లించుట యసాధ్యముగనుండెను. మేము రయితుప్రతినిధులతో సభలనుజరిపి సాధారణముగ నూటికేబదివంతులను, కొన్నిసందర్భములలో నంతకంటె నెక్కువగ రిమిషనులుండవలెనను తాత్కాలికసూచన చేసితిమి.

వ్యవసాయిక సమస్యను సాధారణ శాసనోల్లంఘనముతో పూర్తిగ వేరుచేయుటకు మేముప్రయత్నించితిమి. 1931 లో మేము దానిని రాజకీయములనుండి వేరుచేసి, ఆర్థికదృష్టితోనే యోచింపగోరితిమి. కాని యీ రెంటికి నెక్కువ సన్నిహిత సంబంధముండుటచే నిది చాల కష్టముగనుండెను. గతములో నీ రెండును యెక్కువగ కలిసిపోయెను. మాకు కాంగ్రెసు సంస్థరీత్యా, స్పష్టముగ రాజకీయ వాసనకూడకలదు. తాత్కాలికముగ నేమొకవిధమగు రయితుసంఘముగ పనిచేయ యత్నించితిమి. కాని మేము మా రాజకీయస్వభావమును వీడలేము. వీడజాలకుంటిమి. మేముచేసిన ప్రతిదానిని ప్రభుత్వము రాజకీయముగనే చూచెను. భవిష్యత్ శాసనోల్లంఘన ఛాయలుకూడ మా ముందరనుండెను. ఇది నిజరూపమును దాల్చినచో రాజకీయమును, ఆర్థికములు చేయిచేయికలిపి నడుచుననుటకెట్టిసందేహము లేదు.

ఈ యన్ని యాటంకములను లక్ష్యము చేయక ఢిల్లీసంధియైనది లగాయతు వ్యావసాయికసమస్యను రాజకీయపోరాటముతో వేరు చేయుటకే నేము మొదటినుండియు యత్నించితిమి. ఢిల్లీసంధి దీనిని సమాప్తముచేయకపోవుటయే దీనికి నిజమైన కారణము. నే మీవిష యమును ప్రభుత్వమునకు, ప్రజలకుకూడ స్పష్టముగ విశదము చేయ గోరితిమి. ఢిల్లీసంభాషణలు జరుగుచుండగా గాంధీజీ తాను రౌండు టేబిలుకాన్ఫరెన్సుకు వెళ్ళకపోయినను కూడ కాన్ఫరెన్సు జరుగుకాల ములో శాసనోల్లంఘనము తిరిగిప్రారంభింపనని యిర్విన్ ప్రభువుకు వాగ్దానమునిచ్చెనని నేను విశ్వసించెదను. అతడు కాన్ఫరెన్సు కన్ని యవకాశములను యివ్వవలెననియు, తత్ఫలితములకొరకు వేచి యుండవలెననియు కాంగ్రెసుకు సలహాచెప్పెను. అప్పుడుకూడ గాంధీజీ యీ వాగ్దానము, స్థానికముగ మాపైచొప్పింపబడగల, ఆర్థికపోరాటమునకు వర్తింపదని స్పష్టముగచెప్పెను. యు. పి. వ్యావసాయికసమస్య యప్పుడు మా యందరికిని కాన్పించుచునే యుండెను. యదార్థమునకు భారతదేశములోనున్న రయితులందరకు నిట్టికష్టమే కలిగెను. సిమ్లా సంభాషణలలో గాంధీజీ ఈ వాంశ మును పునశ్చరణ చేసెను.

యూరపునకు పయనమైవెళ్ళుదినముననే రౌండుటేబిలు కాన్ఫరెన్సుకు, రాజకీయసమస్యలకు సంబంధములేకుండ నార్థిక పోరాటములో ప్రజలయొక్క, ముఖ్యముగా రయితాంగముయొక్క, హక్కులను కాపాడవలసిన యగత్యము కాంగ్రెసుకు కలుగవచ్చునని యతడు స్పష్టపరచెను. అట్టిపోరాటములో దిగవలెనను కోరిక యతనికిలేదు. అతడు దానిని తప్పించుటకే యభిలషించెను. కాని యది తప్పనిసరియైనపుడు దానిని పూనకతప్పదు. మేము ప్రజలను విడిచిపెట్టజాలకుంటిమి. సామాన్య శాసనోల్లంఘనమునకును, రాజ కీయ శాసనోల్లంఘనమునకు ననువర్తించు ఢిల్లీసంధి దీనిని నిషేధింప జాలదని యతడు స్పష్టపరచెను.

యు. పి. రాష్ట్ర కాంగ్రెసుకమిటీవారు, దాని నాయకులు పన్నులనిరాకరణమును తిరిగి ప్రారంభించి ఢిల్లీసంధిని భంగపరచిరను నపవాదము పదేపదే వేయబడుచుండుటచే నే నీ విషయము నుదహరింపవలసివచ్చెను. ఈ యపవాదమును తెచ్చినవారు వారికిసుకరముగ నుండునటుల దీనికి సమాధానము చెప్పగలవారందరు జయిలులో నున్నపుడును, వార్తాపత్రికలును, ముద్రణాలయములును తీవ్రముగు నిర్బంధములకు పాల్పడినపుడు దీనిని తెచ్చిరి. 1931 లో యు. పి. కమిటీవారు పన్నులనిరాకరణోద్యమము నెప్పుడు సాగింపలేదు. శాసనోల్లంఘనముతో సంబంధములేకుండ నార్థికప్రయోజనములకొరకట్టి దానిని సాగించిన నది ఢిల్లీసంధినిభంగపరచుట కానేరదు. గుణమును బట్టి యది యుక్తమా అయుక్తమా యనునది వేరొకవిషయము. ఆర్థికకారణములకు ఫ్యాక్టరీకూలీలు సమ్మెకట్టుట కెంతహక్కుకలదో రైతులకు నంత హక్కుకలదు.

క్రమముగ నధ్వాన్నమగుస్థితిని వ్యావసాయికధరలమాంద్యం మరింత యధోగతికి తీసికొనిపోయెను. చాలవత్సరములనుండి వ్యావసాయికధరలు పెరుగుచుండెను. ప్రపంచపణ్యారంగముతో సంబంధముగల భారతదేశ వ్యవసాయ మీలబ్ధిని పొందెను. ప్రపంచమంతట పరిశ్రమాభివృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి నత్యమితతారతమ్యముండుటచే నిది ప్రతిచోట వ్యావసాయికధరలను పెంచెను. భారతదేశములో నీధరలు పెరుగుటతోడనే ప్రభుత్వమువారి రివిన్యూ, జమీందారులకీయవలసిన పన్నులుకూడ పెరిగెను. కనుక నిజముగా వ్యవసాయముచేయు రయితు దీనివలన నెట్టిలబ్ధి పొందలేదు. మొత్తముమీద రయితులు క్షీణించిరి. యు. పి. లో రివిన్యూకంటె జమీందారు కీయవలసినపన్ను వడిగా హెచ్చిపోయెను. ఈ శతాబ్దములో మొదటి ముప్పదిసంవత్సరములలోను మొదటిదానికంటె రెండవది యైదురెట్లు యెక్కువయ్యెను. ఈ విధముగ ప్రభుత్వాదాయము చాలినంత హెచ్చుగ పెరిగియుండ, భూఖామందు రాబడి మరింత హెచ్చెను. రయితుమాత్ర మెప్పటివలె నాకలిబాధతో

మాడుచుండెను. ధరలుపడిపోయినచోట స్థానికముగ ప్రకృతిసంబంధమైన దుఃఖములు-అనావృష్టి, వరదలు, మిడతలు వడగండ్లు మొదలగునవి-తటస్థించినచోట రివిన్యూ, జమీందారీ పన్నులు రెండు యథాప్రకారముగానే యుండెడివి. కొద్ది రిమిషనులు ఆ ఋతువుకు మాత్రమే జంకుచు జంకుచు యివ్వబడుచుండెడివి. అతి మంచిరోజులలోనే పన్నులభారము చాల యధికముగ నుండెను. ఇతర సమయములలో వడ్డీవ్యాపారస్తునివద్దకు వెళ్ళకుండ పన్నుచెల్లించుట దుర్భరమయ్యెను. వ్యవసాయదారు ఋణము హెచ్చిపోయెను.

వ్యావసాయిక తరగతులన్నియు - భూఖామందులు, స్వంత పొలము వ్యవసాయముచేసికొనువారు, కవులుదార్లు-వడ్డీవ్యాపారస్తునికి బానిసలైరి. ఆమిషములైరి. ప్రాచీనగ్రామ ఆర్థికములలో వడ్డీవ్యాపారస్తు డిట్టిపరిస్థితులలో తన విధాయికధర్మమును నెరవేర్చెడివాడు. తన ధర్మమును కేవలము స్వప్రయోజనముకొరకే కొల్లగొనెను. ఇతడు భూమిని, భూమికిసంబంధించినవారిని నులిమివేయుచుండ వారించున దేదియు లేదు. న్యాయచట్ట మతనికిసహాయము చేసెను. అతడు తాను వ్రాయించుకొనిన పత్రముప్రకార మక్షరాల జరుగవలెనని పట్టుబట్టెను. అట్లే రొక్కించి పుస్తెపూసలను వడికి వేసెను. క్రమముగ చిన్నచిన్న భూఖామందులనుండియు, స్వంత వ్యవసాయదారులనుండియు భూమి తరలిపోయెను. వడ్డీవ్యాపారస్తుడు పెద్దప్రొప్రయిటరు, పెద్దజమీందారు, భూమిగల పెద్దమనిషిగ పెరిగిపోయెను. సేద్యముచేసికొనిన స్వంతవ్యవసాయదారు బనియాజమీందారు లేక సాహుకారులకు బానిసయయ్యెను. కవులుదారుస్థితి యింతకంటె నధ్వాన్నము. అతడుకూడ సాహుకారుబానిస లేక భూమినుండి తరిమివేయబడుటచే పెరుగు భూమిలేని దరిద్ర ప్రజాసైన్యములో చేరిపోయెను. ఈవిధముగ భూఖామందయిన వడ్డీవ్యాపారస్తునికి భూమితో కవులుదారుతో నెట్టి సన్నిహిత సంపర్కము లేకుండెను. అతడు సాధారణముగ పట్టణవాసి. అతడు తనవడ్డీవ్యాపారము నచ్చటనుండి సాగించుచు, పన్నువసూలుచేయుటకు గ్రామముల

లోనికి తన యేజంటులను పంపును. ఏమి దయాదాక్షిణ్యములు లేకుండ నిర్లక్ష్యముగ యంత్రకములవలె పనిచేయును.

భూమిపన్నుపద్ధతియొక్క యస్థిరత్వమును, అయోగ్యతను చాటుట కంతకంత కభివృద్ధిచెందుచున్న వ్యవసాయ ఋణమే చాలును. ప్రజలలో నత్యధికసంఖ్యాకులకు భౌతికముగగాని, యైశ్వర్యరీత్యాగాని వెనుక యాధారమేమియులేదు. వారాకలిగుంటతోనే యుండెడివారు. దుఃఖప్రదములగు నసాధారణ సంభవములకు వారు నిలువజాలకుండిరి. ఏజాడ్యమైనను లక్షలకొలది జనులను తుడిచివేయుచుండెను. ప్రభుత్వముచే నియమింపబడిన రాష్ట్రబ్యాంకింగ్ యంక్వైరీ కమిటీవారు 1929-1930లో హిందూదేశములోని (బర్మాతో సహా) వ్యావసాయిక ఋణము 860 కోట్ల రూపాయలని యంచనా వేసిరి. ఈ ఋణములో జమీందారుల యొక్కయు, స్వంతవ్యవసాయము చేసుకొనువారి యొక్కయు, కవులదారుల యొక్కయు ఋణములుకలవు. కాని ప్రధానముగా నిది నిజముగా వ్యవసాయము చేసికొనువారి ఋణము. ప్రభుత్వమువారి కరెన్సీపద్ధతి పూర్తిగ ఋణదాతల తరగతులకే సహాయపడెను. ఇది ఋణభారమును మరింత హెచ్చించెను. భారతీయులందరు తీవ్రముగ ప్రతిఘటించుచున్నను రూపాయికి 16 పెన్నీలనుగాక, 18 పెన్నీలను స్థిరపరచుటచే వ్యావసాయికఋణమునూటికి 12 1/2 చొప్పున అనగా 107 కోట్లు హెచ్చెను. యుద్ధముయినతరువాత పెరిగిన ధరలు క్రమముగ, తగ్గనారంభించి వ్యవసాయపరిస్థితు లధ్వాన్నమయ్యెను. గోరుచుట్టుమీద రోకటిపోటువలె 1939 లో యార్థిక దురవస్థ సంప్రాప్తమయ్యెను.

యు. పి. లో 1931 లో ధరవరలనుబట్టి పన్నులుండవలెనని మేము వాదించితిమి. అనగా 1931 లోని ధరలవంటి ధరలేయున్న వెనుకటిరోజులలో పన్నులెట్లుండెనో యిప్పుడు నట్లేయుండవలెనని మేమంటిమి. ముప్పదిసంవత్సరములక్రిందట 1901 లో సరిగా ధరలిట్లేయుండెను. ఇదియొక సిసలైనపరీక్ష కాదు. కవులదారులలో— కవులుదారుక్రింద కవులుదారు, సేద్యపుహక్కుగలవాడు, సేద్యపుహక్కు-

లేనివారు – మొదలగువారుండుటచే దీనినాచరణలో పెట్టుట సులువు కాదు. అందరికంటె క్రిందనున్న కవులుదారే యెక్కువబాధలననుభవించువారు. ఇకనొక పరీక్షమాత్రమే కలదు. నిస్సందేహము నిదియే యుత్తమ పరీక్ష. కవులుదారుకు పంటపండించుట కగుఖర్చులను, జీవించుటకు తగినకూలిని తీసినమీదటనే యతనికుండు శక్తిని బట్టియే పన్ను వేయవలయును. కానియీతుదిపరీక్ష ప్రకారము జీవించుటకెంత తక్కువ ఖర్చులను లెక్కవేసినను, హిందూదేశములో సేద్యముచేయబడు భూపరిమితులలో నధికసంఖ్య పూర్తిగ నిరర్థకములు. 1931 లో యు. పి. లో మేము చూపిన యుదాహరణములనుబట్టి చాలమంది యాస్తిని అమ్ముకొనకుండగను, యెక్కువ వడ్డీ కప్పుతేకుండ పన్ను చెల్లింపజాలరు.

మా యు. పి. కాంగ్రెసు కమిటీ సేద్యహక్కుగల కవులుదారుకు నూటికి యేబదివంతునను, అంతకంటె దుస్థితిలోనున్నవానికి మరింత హెచ్చురిమిషను యివ్వవలెనని మొట్టమొదట నొకసూచన చేసెను. 1931 మే నెలలో గాంధీజీ యు. పి. గవర్నరైన సర్. మాల్కాంహైలీ కలిసినపుడు వారియిరువురకు భేదాభిప్రాయము కలుగుటచే వారికి సమాధానము కుదరలేదు. తరువాత వెంటనే గాంధీజీ యు. పి. జమీందారులకు, కవులుదారులకు సందేశములను బంపెను. చివర సందేశములో నతడు కవులుదారులను వారు చెల్లింపగలిగినంత చెల్లింపవలెనని ప్రోత్సహించుచు తానొకయంకె సూచించెను. ఇది మేమదివరకు సూచించినదానికంటె కొంచెము హెచ్చు. మా రాష్ట్రకమిటీ గాంధీజీసూచన కంగీకరించిరి. కాని ప్రభుత్వము దానికంగీకరింపకపోవుటచే విషయములు చక్కబడలేదు.

రాష్ట్రప్రభుత్వస్థితి కష్టముగనుండెను. భూమిపన్ను వారిరాబడిలో ప్రధానమైనది. ఇది లేకపోయినచో లేక బాగుగ తగ్గింపబడినచో వారుదివాలాతీయవలయును. కాని వ్యావసాయిక తిరుగుబాటు కలుగునేమో యనుభీతి హెచ్చుగనుండుటచే సాధ్యమైనంతవరకు తగినరిమిషనులనిచ్చి వ్యవసాయదారుల నోదార్చవలెనని వారి

కుండెను. రెండును జరుగుట సులభమైన పనికాదు. ప్రభుత్వమునకు వ్యవసాయదారునకు మధ్య జమీందారులుకలరు. ఆర్థికదృష్టితో చూచిన యెడల నీజాతి నిరర్థకము, అనవసరము, అజాగర్తనము. ఈ జాతికి స్వస్తిచెప్పినచో మిగులుదానితో ప్రభుత్వము వ్యవసాయదారునకూడ రక్షించుకొనుటకును, సాయముచేసికొనుటకును వీలుగా నుండెడిది. కాని బ్రిటిషు ప్రభుత్వమువారు, తమస్థితినిబట్టి తమ్మంటిపెట్టుకొని యున్న యీ చిన్న సంఘమును, రాజకీయకారణములచే, విడువజాల కుండిరి.

చిట్టచివరకు రాష్ట్రప్రభుత్వము జమీందారునకు వ్యవసాయ దారునకుకూడ రిమిషనులనిచ్చిరి. ఈ రిమిషనులపద్ధతి సులభగ్రాహ్య ముగ లేక చిక్కులతో కూడియుండెను. మొట్టమొదట దాని నర్థము చేసికొనుటే కష్టమయ్యెను. మొత్తముమీద నవి యెంతమాత్రము చాలకుండెను. పైగా అవి వర్తమానఫసలీకి సంబంధించియుండెను. వ్యవసాయదారుల బకాయిలనుగురించి ఋణములనుగురించి యది యేమియు నుదహరించలేదు. వ్యవసాయదారు జరుగుచున్న యర్థ సంవత్సరమునకే పన్ను చెల్లించుకొనలేనపుడు వెనుకటిసంవత్సరముల బకాయిలను ఋణములను చెల్లించుకొనజాలడనిస్పష్టముగ నర్థమగు చునేయుండెను. జమీందారు సాధారణముగ తన కిచ్చిన జమల నన్నింటిని పాతబకాయిలక్రింద కట్టుచుండుట యాచారము. వ్యవ సాయదారుదృష్టిలో నిది చాల యుపద్రవకరమైనపద్ధతి. ఏలనన అత డీయవలసిన యే కొంతభాగమునకో యతనిమీద నెప్పుడును చర్యతీసికొని యతనిని భూమినుండి వెడలగొట్టవచ్చును.

రాష్ట్రకాంగ్రెసు కార్యనిర్వాహకవర్గముకసాధారణకష్టపరిస్థితి యేర్పడెను. వ్యవసాయదారులకు చాల అక్రమము జరుగుచున్నదని మేము దృఢముగ విశ్వసించితిమి. కాని మే మీ విషయములలో నసహాయులమైతిమి. వ్యవసాయదారులను పన్ను చెల్లింపవలదను బాధ్యత మాపై పెట్టుకొనుటకు మే మిష్టపడలేదు. వారెంత చెల్లింప గలరో యంతయు చెల్లించితీరవలయునని మేము నిరంతరము చాటు

చుంటిమి. వారి కష్టముల యెడల, దౌర్భాగ్యముపట్ల మేము సానుభూతి చూపుచు వారికిధైర్యము చెప్పుటకు యత్నించుచుంటిమి. రిమిషనులు తీసి వేసినను చెల్లింపవలసిన పన్ను హెచ్చుగనే యుండెను.

నిర్బంధయంత్రము కదలనారంభించెను. వేలకొలది వ్యవసాయదారులను భూమినుండి వెడలగొట్టు దావాలు తీసికొనిరాబడెను. వాటితో ఆవులను, ఎద్దులను, స్వంతఆస్తిని యథేచ్ఛగ జప్తులుచేయ నారంభించిరి. జమీందారు ఏజెంట్లు వ్యవసాయదారులను కొట్టు చుండిరి. అధికసంఖ్యాకులైన వ్యవసాయదారులు పన్ను మొత్తములో కొంతభాగము చెల్లించిరి. వారంతవరకే చెల్లింపగలిగిరి. బహుశః కొంతమంది మరికొంత చెల్లింపగలిగి యుండవచ్చును. కాని తక్కిన యధికసంఖ్యాకుల కందరికి చాలభారముగనుండెను. కొంత భాగము చెల్లించు యీ పద్ధతివలన వారి కెట్టి రక్షణ కలుగలేదు. న్యాయశాస్త్రమనునొక పెద్దఆవిరిబండ దయాదాక్షిణ్యములు లేకుండ దానిక్రింద పడినవారినందరిని చూర్ణముచేసికొనుచు పోవుచుండెను. కొంతభాగము చెల్లింపబడినను భూమినుండి లేవగొట్టు దావాలు డిక్రీచేయబడెను. జప్తులు, పశువులు, స్వంతఆస్తిని అమ్మివేయుట, నిరంతరాయముగ సాగింపబడుచుండెను. వ్యవసాయదారు లసలు చెల్లింపకపోయినను యింతకంటె నధోగతిలోనుండెడివారు కారు. నిశ్చయముగ వారింతకంటె కొంత బాగుగనేయుండెడివారు. ఏలనన వారి కా సొమ్మైయినను మిగిలెడిది.

వారు తండోపతండములుగ మావద్దకువచ్చుచు "మీ సలహాల ననుసరించి మే మివ్వగలిగినదంతయు నిచ్చితిమి. ఇదియే దానిఫలితము" అని మమ్ము తీవ్రముగ నిందించుచుండిరి. ఒక్క అలహాబాదు జిల్లాలోనే అనేక వేల రైతులను భూములనుండి తరిమి వేసిరి. అనేక వేలమందిపయి నేదోయొక చర్య తీసికొనబడెను. జిల్లా కాంగ్రెసుకమిటీఆఫీసు పగలంతయు దుఃఖాక్రాంతసమూహములచే ముట్టడి వేయబడుచుండెను. దానితోపాటు నాయింటినికూడ ముట్టడి వేసెడివారు; ఈ దుస్థితినుండి తప్పించుకొనుటకే తరచు నే నెచ్చటి

కైన పోవలెనని యేమూలనైనదాగొనవలెననియనుకొనెడివాడను. మా దగ్గరకువచ్చిన వ్యవసాయదారుల యొంటినిండ గాయములు కాన్పించెడివి. జమీందారుల యేజంటులు వారిని కొట్టిరి. మేము ఆస్పత్రిలో వారికి చికిత్స చేయించెడివారము. వారేమిచేయగలరు? మే మేమిచేయగలిగితిమి? మేము యు.పి. ప్రభుత్వమునకు పెద్దపెద్ద యుత్తరములను వ్రాసితిమి. మా కమిటీ గోవిందవల్లభ పంతును నైనిటాలు లేక లక్నోలోని యు. పి. ప్రభుత్వముతో నుత్తర ప్రత్యుత్తరములను జరుపు కాంగ్రెసు ఆఫీసరుగ నియమించెను. అతడెప్పుడుప్రభుత్వమునకువ్రాయుచు నేయుండెను. మారాష్ట్రిఅధ్యక్షుడు షెర్వానీకూడఅప్పుడప్పుడు వ్రాయుచుండెను. అట్లే నేనునువ్రాసితిని.

జూను, జులై నెలలలో వర్షాకాలము ప్రారంభమగుటతోడనే మరియొక కష్టము దాపురించెను. అది దున్నుట, విత్తుట మొదలగు పనులు చేసికొనవలసిన ఋతువు. భూములనుండి వెడలగొట్టబడిన వారు సోమరులుగనుండి వారికండ్లయెదుట వారిపొలములు బీడులయి పడియుండ చూచుచు నూరకుండవలసినదేనా? వ్యవసాయదారు దీనిని చూడలేడు. అది యతని స్వభావమునకువిరుద్ధము. భూములను లాగుకొనుట న్యాయసాంప్రదాయ తంతులతో జరిగెను కోర్టు డిక్రీలమలు జరిగెను. తరువాత నేమియు జరుగలేదు. వారిపుడాభూములనుదున్ని అక్రమప్రవేశ నేరమును చేయవలసినదేనా? తాను దున్నిన పొలము నితరులు దున్నుచుండ రైతు చూచుచు సహింపజాలడు. వారు సలహాకు మా దగ్గరకు వచ్చిరి. మేమేమి సలహా యివ్వగలము?

వేసవిలో నే నాసంవత్సరము గాంధీజీతో సిమ్లా వెళ్ళినపుడు భారతప్రభుత్వఉన్నతోద్యోగి కీకష్టము తెలిపి యతడే మా స్థితిలో నున్నచో తానేమిసలహానిచ్చెడివాడో చెప్పుమంటిని. అతని ప్రత్యుత్తర మాశ్చర్యజనకమగు సత్యమును తెలుపునట్లుండెను. భూమినుండి తరిమి వేయబడిన వ్యవసాయదారు వచ్చి తన నిట్లడిగిన చో ప్రత్యుత్తరమునీయ నిరాకరింతునని యతడు సెలవిచ్చెను. న్యాయ

విధానము ప్రకారము భూమినుండి వెడలగొట్టబడినవాని నతడైనను భూమిని దున్నకూడదని యొక్క మాటలో చెప్పజాలకుండెను. నిర్జీవ మగు సంకెలతో చెరలాటమాడు కాగితములమీద నాజ్ఞలను చేయుట సిమ్లాపర్వతసీమలపై కులుకు నాయుద్యోగికి సులభమైన విషయమే యగును. అతనికి, నైనిటాలులోనున్న రాష్ట్రాధిపతులకు మానవ సంపర్కమేమియు లేదు. అనుభవింపబడుచున్న మానవదుఃఖము వారు చూచి యెరుగరు.

వ్యవసాయదారులకు నే మొక్కటే సలహా చెప్పవలెనని సిమ్లాలో హితబోధచేయబడెను. వారు పన్ను బావత్తు చెల్లింపవలెను. లేదా చెల్లింపగలిగినంత చెల్లింపవలెను. అనగా మేము జమీందారుయొజంటులవలె పనిచేయవలెను. వారు చెల్లింపగలిగినంత చెల్లించవలసినదని చెప్పినపుడు మేమట్లే చేసితిమి. వారు పశువుల నమ్మివేయరాదనియు క్రొత్తగా ఋణము చేయరాదనియు కూడా మేము చెప్పినమాట సత్యము. దాని ఫలితము మేము చూచితిమి.

ఆ వేసవి మాకందరకు చాల భయంకరముగ నుండెను. అది మాకెక్కువ యలసట కలిగించెను. భారతరైతుకు దుఃఖముల ననుభవించుట కద్భుతశక్తి కలదు. అతని కెప్పుడు కఱవులు, వరదలు, వ్యాధులు చూర్ణముచేయు నిరంతర దారిద్ర్యము, సంభవించుచునే యుండెను. అతడు వీటిని భరించలేనపుడు నోరెత్తి చెప్పుకొనకుండ వేలు లక్షలు చనిపోవుచుందురు. అదియే తప్పించుకొనుటకు కతనికి గల మార్గము. అప్పు డప్పు డతనిని వేధించుచుండు గొప్ప దుఃఖములవంటి వేవియు నతనికి 1931 లో సంభవించలేదు. కాని 1931 లో సంభవించిన దుర్దశ లతనికి ప్రకృతిసిద్ధములుగా కాన్పించలేదు. కనుక వాటి నతడోర్పుతో సహింపలేకపోయెను. అవి మానవకృతములని యతడు భావించి వానిని ప్రతిఘటించెను. అతనికి గలిగిన నూతన రాజకీయ విద్య ఫలించెను. 1931 లోని యీ క్రొత్తసంఘటనలు మాకు

కూడ ప్రత్యేకముగ బాధకరముగనుండెను. ఏలనన మేము వీటికి కొంతబాధ్యులమైతిమి. వ్యవసాయదారు లీ విషయములో చాలవరకు మా సలహాల ననుసరించలేదా? మా నిరంతర సహాయము లేనిచో వ్యవసాయదారులస్థితి మరింతయధ్వాన్నమయ్యెడిదని నా దృఢవిశ్వాసము. మేము వారిలో నైకమత్యము కలిగించుటచే వారికి శక్తి చేకూరెను. దీనిచేతనే వారికి యెక్కువ రిమిషనులువచ్చెను. వారి యెడల చూపబడిన నిర్బంధములు, యమానుషచర్యలుకూడ చెడ్డవే యైనను యీ దురదృష్టవంతుల కసాధారణములుకావు. సాధారణముగ గ్రామములో జమీందారుయేజంటు వ్యవసాదారు నవమానపరచుట, బాధించుట సామాన్యము. అందరకు తెలిసినవిషయము. ఇట్లు బాధింపబడువ్యక్తి చనిపోయినపుడుగాని పైవారికిదేమియు తెలియదు. మేము చేసిన కట్టుబాటులవలనను, వ్యవసాయదారులలో కలిగిన నూతన జ్ఞానోదయమువలనను యీ పరిస్థితులు మారెను. వ్యవసాయదారులందరు నిపుడు కట్టకట్టుకొని యురికంబముల నాలింగన మొనర్తురు; తమ దుఃఖముల నన్నింటిని కాంగ్రెసు ఆఫీసుకు తెలియపరచెదరు.

వేసవి ముదిరినకొలదిదౌర్జన్యముగ పన్నులను వసూలుచేయు యత్నములు సన్నగిలెను. నిర్బంధవిధానము తగ్గెను. భూమినుండి వెడలగొట్టబడిన యనేకమంది వ్యవసాయదారుల సమస్యయే మమ్మిపుడు బాధింపదొడగెను. వారికేమి సదుపాయముచేయవలెను? వారి పొలములను వారికిచ్చివేయవలసినదని మేముప్రభుత్వముపైయొత్తిడి కలిగించుచుంటిమి. ఇవి చాలవరకు కాళీగనే యుంచును. భవిష్యత్సమస్యయే మరింత ముఖ్యమయ్యెను. ఇంతవరకివ్వబడినరిమిషనులు గత ఋతువుకు మాత్రమే చెందును. భవిష్యత్తు నిశ్చయింపబడలేదు. అక్టోబరు లగాయతు ముందు వసూళ్లు ప్రారంభమగును. అప్పుడేమి జరుగును? తిరిగి యీ భయంకర చక్రమే మనకు ప్రాప్తమగునా ? రాష్ట్రప్రభుత్వము తమ యధికారులతోను, స్థానిక శాసనసభలోని కొందరు జమీందారుసభ్యులతోనుకూడిన యొక కమిటీనినియమించి

యీ విషయము నాలోచింపమనిరి. వ్యవసాయదారు ప్రతినిధి యొక్కడు నందులోలేడు. చివరనిమిషములో, కమిటీవారు పనిని ప్రారంభించిన తరువాత, మా తరఫున కమిటీలో జేరవలసినదని ప్రభుత్వముగోవిందవల్లభపంతు నాహ్వానముచేసెను. ముఖ్యతీర్మానములన్నియు నదివరకే చేయబడినతరువాత నా తుదిగంటలో కమిటీలో చేరుటవలన ప్రయోజననేమియులేదని యతడు తలచెను.

యు. పి. రాష్ట్రీకాంగ్రెసు కమిటీకూడ నొక చిన్న కమిటీ నేర్పాటుచేసి వారిని భూత, వర్తమాన వ్యావసాయిక లెక్కలను తయారుచేసి ప్రస్తుతస్థితినిగురించి యొక నివేదిక తయారుచేయమని నియమించెను. ఈ కమిటీ యు. పి. లోని వ్యావసాయిక పరిస్థితులను గురించి సర్వమగు పరిశోధనతోకూడిన యొక దీర్ఘనివేదిక తయారుచేసెను. వ్యావసాయిక ధరలు పడిపోవుటవలన కలిగిన నష్టము బాపతువారిగా విడదీసి చూపబడెను. వారి సిఫార్సులు చాల విరివిగ నుండెను. పుస్తకరూపములో ప్రకటింపబడిన యీ నివేదికమీద గోవిందవల్లభ పంతు, రఫీ అహమ్మదు కిద్వాయి, వెంకటేశ నారాయణతివారీగార్ల సంతకములు కలవు.

ఈ నివేదికకు పూర్వమే గాంధీజీ రౌండుటేబిలుకాన్ఫరెన్సుకు వెళ్ళెను. అతడు చాలసందేహముతో వెళ్ళెను. యు. పి.వ్యావసాయిక స్థితి యీ సందేహమునకొక కారణము. అతడు రౌండుటేబిలుకాన్ఫరెన్సుకు పోకపోయినచో యు. పి. లోనే యుండి యీ క్లిష్టసమస్యకొఱకు తన కాలము వినియోగింపనిశ్చయించెను. తుది సిమ్లాసంభాషణ లితరవిషయములతోపాటు యు. పి. ని గురించి జరిగెను. అతడు లండను వెళ్ళినతరువాత జరిగిన పరిస్థితు లెప్పటికప్పు డతనికి పూర్తిగ తెలుపబడుచుండెను. మొదటి యొకటి రెండుమాసములు నే నతనికి వారమువారము మామూలు టపాలోను,విమానటపాలోను వ్రాయుచుండెడివాడను. తరువాతరోజులలో నత డెప్పటికప్పుడే వచ్చునను యుద్దేశముతో నే నంతగా వ్రాయలేదు. అతడు మూడుమాసములకంటె నెక్కువకాలమచ్చట నుండడని మాతో చెప్పెను. ఈలోపల

భారతదేశములో నెట్టివిషమస్థితియు నేర్పడదని మే మాశించితిమి. అతడు లేనికాలములో ప్రభుత్వముతో నెట్టిపోరాటమునైనను తప్పించుకొనవలెననియే మేము వాంఛించితిమి. కాని యతనిరాక చాల యాలస్యమయ్యెను. ఇచ్చట వ్యావసాయిక పరిస్థితులు ముంచుకొనివచ్చెను. ఇచ్చట విషమస్థితిని గురించి మేమతని కొక పెద్దతంతి పంపి మాచేతులు బంధింపబడుచున్నవని సూచించితిమి. ఈ విషయములలో తానాసమయమున నేమిచేయుటకు నసహాయుడననియు మా బుద్ధి కుచితమని తోచినవిధమున ముందుకు పోవలసినదనియు మాకు తిరిగి తంతి యిచ్చెను.

రాష్ట్ర కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గమువారు వర్కింగు కమిటీకి గూడ పరిస్థితుల నెప్పటికప్పుడు పూర్తిగ తెలుపుచుండిరి. నే నెప్పుడు నచ్చటినుండి వారికి యదార్థవిషయముల నెప్పటికప్పుడు తెలుపుచుంటిని. పరిస్థితులు ముదురుచుండుటచే కమిటీవారు రాష్ట్రాధ్యక్షుడైన షెర్వానీతోను, అలహాబాదుజిల్లా యధ్యక్షుడైన పురుషోత్తమదాసు టాండనుతోను ఆలోచనలను సలిపిరి.

ప్రభుత్వ వ్యావసాయిక కమిటీవా రొకనివేదికను తయారు చేసి దానిలో కొన్ని శిఫారసులను చేసిరి. అవి యస్పష్టముగ నసంబద్ధముగనుండి చాలవరకు స్థానికాధికారుల యిష్టమునకు విడిచివేయబడెను. మొత్తముమీద గతఋతువులో నిచ్చినవాని కంటె నెక్కువ రిమిషనులే యివ్వబడెను. కాని యవి మాకు చాలనట్లు కాన్పించెను. ఆ శిఫార్సుల వెనుకనున్న సిద్ధాంతములకు, వాటినివర్తింపచేయువిధములకు నే మభ్యంతరపెట్టితిమి. ఇంతేగాక నా నివేదిక భవిష్యత్తునుగురించి మాత్రమే తెలిపి గతబకాయిలను, ఋణములను, భూములనుండి వెడలగొట్టబడిన యసంఖ్యాకమగు వ్యవసాయదారులను నిర్లక్ష్యముచేసెను. మే మేమి చేయవలెను? గత వసంత, గ్రీష్మఋతువులలో మేము చెప్పినట్లే వ్యవసాయదారులను చెల్లింపగలిగినంత చెల్లించి వెనుకటి బాధలనే యనుభవింపమని సలహా చెప్పవలెనా? ఆ సలహా యతి మూర్ఖమైనదని మేము

కందార్లు తెలిసికొనుటచే తిరిగి దానినే యీయజాలము. వ్యవసాయదారులు శతవిధముల తంటాలుపడి యీ క్రొత్తడిమాండు నంతను, వారేవిధముగనైన చెల్లింపకలిగినచో, పూర్తిగ చెల్లించవలెను. లేదా వారు ప్రస్తుతమేమియు చెల్లింపక పరిస్థితులనవలోకించుచుండవలెను. డిమాండులోని కొంతభాగము చెల్లించుట రెంటికి చెడిన రేవడిచందమగును. వ్యవసాయదారునకున్న కొద్దిపాటి మూలధనము వ్యయమగును. దానితోపాటు భూములుకూడ పోవును.

మా రాష్ట్రకాంగ్రెసు కార్యనిర్వాహకవర్గమువారీస్థితిని గురించి దీర్ఘకాల మతిశ్రద్ధగ యోచించిరి. ఈ రిమిషను వేసవిలో నిచ్చినవాటికంటె నెక్కువగానున్నను నంగీకరించుటకు యోగ్యముగలేదని వారు నిశ్చయించిరి. వ్యవసాయదారునకు లాభకరముగ నుండునట్లు వానిని మార్చుట కింకను నవకాశముండెను. మేము ప్రభుత్వము నట్లు చేయవలసినదని పట్టుబట్టితిమి. కాని మా కాశ లేనట్లు కాన్పించెను. మేము తప్పించుకొన యత్నించిన పోరాటము మాపయి బడుచుండెను. కాంగ్రెసుపట్ల రాష్ట్రప్రభుత్వ భారత ప్రభుత్వములవైఖరి క్రమముగ మారిపోవుచు నంతకంతకు కఠినమగుచుండెను. మా పెద్ద పెద్ద యుత్తరములకు "స్థానికాధికారులను చూడుడు" అను ముభావమగు ప్రత్యుత్తరము వచ్చెడిది. మా కెట్టి ప్రోత్సాహము నీయకపోవుటయే ప్రభుత్వ నీతి యని విశదమయ్యెను. వ్యవసాయదారులకు రిమిషను యివ్వబడినయెడల కాంగ్రెసు ప్రతిష్ఠ హెచ్చవచ్చునని ప్రభుత్వమునకు బాధగనుండెను. చిరకాలాభ్యాసమువల్ల ప్రభుత్వమునకు ప్రతిష్ఠ దృష్టితప్ప వేరొకటిలేదు. ప్రజ లీ రిమిషనులకు కాంగ్రెసు కీర్తింప వచ్చునను భావము ప్రభుత్వమునకు కన్నెఱ్ఱగా నుండెను. కనుక ప్రభుత్వము సాధ్యమైనంతవరకు దీనిని లేకుండ చేయగోరిరి. ప్రభుత్వము కాంగ్రెసు యుద్యమముపై తీవ్రముగ విజృంభింపనున్నారనువార్తలే లోపుగ ఢిల్లీ మొదలైన ప్రదేశములనుండి మాకు వినవచ్చెను. ఆ 'చిన్నవేలి' పుడు మరింత జోరుగ తన

ధర్మమును నెరవేర్చుచుండెను. తేల్పుమమ్ముశిక్షింపవచ్చుచున్నవి. జరుగబోవుపనిని గురించిన యనేకవివరములుగూడ మాకు తెలుప బడెను. నే మదివరలో వినిన వదంతులన్నియు యదార్థములే యను సందేశము నొకదానిని నవంబరు నెలలో నాకు డాక్టరు అన్సారీ పంపెను. అందులో సరిహద్దురాష్ట్రములలోను, యు. పి. లోను అమలుజరుపనున్న ఆర్డినెన్సులనుగురించినవివరములుగూడ నుండెను. ఒక క్రొత్తఆర్డినెన్సు వంగదేశమున కప్పుడే ప్రసాదింపబడెను. చాల వారములైనతరువాత క్రొత్తపరిస్థితుల నెదుర్కొనుటకో యనునట్లు ప్రారంభింపబడిన క్రొత్తఆర్డినెన్సులు డాక్టరు అన్సారీగారి పూర్వ సందేశమును వివరములతోసహా ఛాయముచేసెను. రౌండుటేబిలు కాన్ఫరెన్సు యొక్కనకాలము పొడిగింపబడుటచే ప్రభుత్వమువారు తాము తీసుకొనదలచిన చర్యలను కొంతకాల మాపివేసిరని. రౌండుటేబిలు కాన్ఫరెన్సు సభ్యులు తీపిమాటల నొకరి చెవులలో నొకరూదుకొను కాలమున ప్రభుత్వము హిందూదేశములో పెద్ద నిర్బంధములను ప్రవేశపెట్టుట నాపియుంచిరి.

కనుక తీవ్రత హెచ్చనారంభించెను. మా ప్రమేయము లేకుండ పరిస్థితులు పరుగెత్తుచున్నవనియు, ముందుగనే నిర్ణయింపబడినవాటి గతి నెవరు నాపజాలరనియు నేము భావించతిమి. వాటినెదుర్కొను టకు తగిన సంసిద్ధత జూపుటయేమావిధి. ఈ జీవిత నాటకములో, బహుశః విషాదాంత నాటకము నేము వ్యక్తిగతముగ, సమిష్టిగ మామా పాత్రలను ధరింపవలెను. ఈ రెండుసైన్యములు తలపడు టకు పూర్వము గాంధీజీ వచ్చుననియు, యుద్ధమునకు. శాంతికి బాధ్యత నతడే వహించుననియు నేమింకను తలంచుచుంటిమి. అతడు లేనపుడు నేమెవరము నా బాధ్యతవహించుటకుసంసిద్ధులముగ లేము.

యు. పి లో ప్రభుత్వము మరియొక యడుగుముందుకు వేసెను. ఇది గ్రామసీమలలో నలజడి కలిగించెను. వ్యవసాయదారులకు రివి షను చీటీలను పంచిపెట్టి వారి కెంత రిమిషను ఇవ్వబడెనో తెలు పుచు, నొక మాసములోజులలో నప్పటికున్న బకాయిలను చెల్లింప

నిచో నిచ్చిన రిమిషనులు రద్దుచేయబడుననియు పూర్తిమొత్త మంతయు చట్టముద్వారా, అనగా భూమినుండి వెడలగొట్టబడుట ఆస్తిని జప్తుచేయుట మొదలగువానిద్వారా రాబట్టుకొనబడుననియు భయపెట్టిరి. మామూలు వత్సరములలో వ్యవసాయదారులు తమ పన్నులను దఫదఫాలుగ రెండు మూడు మాసములలో చెల్లించు చుండిరి. ఇప్పుడీ మామూలుగ నిచ్చు కాలపరిమితిగూడ నాస్తి యయ్యెను. గ్రామప్రాంతములన్నియు హఠాత్తుగ నీ విషమస్థితి నెదుర్కొనవలసివచ్చెను. చేతులలో చీటీలను పుచ్చుకొని నిరసించుచు, ఫిర్యాదుచేయుచు, సలహా యడుగుచు వ్యవసాయదారు లిటునటు పరుగిడ నారంభించిరి. స్థానికాధికారులు, ప్రభుత్వమువారు కలుగజేసిన యీ భయము సార్థకమైనదని చెప్పకతప్పదు. అట్లు చేయుతలంపులేదని మాకు తరువాత తెలిసెను. కాని యది శాంతియుత సమాధానావకాశాలను తగ్గించి క్రమముగ పోరాటమునకు దారిచూపెను. వ్యవసాయదారులు, కాంగ్రెసు, యిపుడు వెంటనే యొక నిశ్చయమునకు రావలెను. గాంధీజీ తిరిగివచ్చువరకు మేము మానిశ్చయమును నిలిపియుంచుటకువీలులేదు. మేమేమిచేయవలెను? ఏమిసలహాచెప్పవలెను? చాలమంది తమకీయబడిన కొద్ది గడువులో దానిని చెల్లింపలేరని మే మెరిగియున్నను చెల్లించవలసినదని సహేతుకముగ మే మెట్లు చెప్పగలము? వ్రాయవలసిన బకాయిల సంగతి యేమిచేయవలెను? డిమాండులోని చాలభాగము నిచ్చివేసినను లేక పూర్తిగ నిచ్చివేసినను దానిని పాతబాకీక్రింద జమకట్టినచో భూమినుండి వెడలగొట్టబడు దుర్గతి వారికి తప్పునా?

ఎక్కువమంది వ్యవసాయదారులు గల అలహాబాదు జిల్లా కాంగ్రెసుకమిటి పోరాటము తప్పదనెను. వ్యవసాయదారులనుపన్ను చెల్లింపవలసినదనివారుసలహాచెప్పజాలరైరి. అయినను రాష్ట్రకార్య నిర్వాహకవర్గ, అ.భా. వర్కింగుకమిటీలయంగీకారములేనిదే యది యెట్టి తీవ్రకార్యముచేయుటకు వీలులేదని తెలుపబడెను. కనుక నీ విషయము వర్కింగుకమిటీకివిడిచిపెట్టబడెను. షెర్వానీ,టాండనుగా

క్లిసువుకు రాష్ట్రముతరపునను జిల్లాతరపునను యీ పాంశమునచ్చట ప్రవేశపెట్టిరి. మాముందరనున్న సమస్య అలహాబాదుజిల్లాకు సంబంధించెను. అది కేవల మార్థికసమస్య. కాని యప్పుడున్న రాజకీయ బింకమునుబట్టి దీనికి విపరీతఫలితములు కలుగగలవని మేము గుర్తించితిమి. జరుగనున్న రాయబారములు ముగియువరకు, మంచి షరతులు చేకూరువరకు వ్యవసాయదారులు పన్ను చెల్లించుట నాపివేయవలసినదని సలహాయిచ్చుటకు అలహాబాదుజిల్లాకమిటీ కనుజ్ఞనీయవలెనా? ఉన్నసంకుచితసమస్య యదియే! మేము దానికే కట్టుబడదలంచితిమి. కాని మే మట్లుచేయగలిగితిమా? గాంధీజీ రాకపూర్వము ప్రభుత్వముతో నెట్టి విరోధము పెట్టుకొనకుండుటకు వర్కింగుకమిటీవారు శతవిధముల యత్నింపగోరిరి. ముఖ్యముగా వారు వర్గపోరాటముగ పరిణమించగల ఆర్థికసమస్యమీద నిది కలుగకుండ చేయగోరిరి. ఈకమిటీ రాజకీయముగ చాల యభివృద్ధి చెందినను సాంఘికముగ నట్టియభివృద్ధిని పొందలేదు. అది జమీందారులకు వ్యతిరేకముగ వ్యవసాయదారుల సమస్యను లేవదీయుట కిష్టపడలేదు.

నేను సామ్యవాది నగుటచే నార్థిక, సాంఘిక విషయములలో సలహాయిచ్చుటకు తగుసౌమ్యతలేనివాడనని భావింపబడెను. తమ కెంతయిష్టములేకపోయినను మనలోనున్న యెక్కువ మితవాద తత్త్వము కల సభ్యులు, కుడిపక్షసభ్యులుకూడ యు. పి. పరిస్థితులవలన కార్యరంగములోని కీడ్వబడుచుండిరి. మా రాష్ట్రమునుండి షెర్వానీ మొదలగువారు వర్కింగుకమిటీ మీటింగుకు హాజరుకావలెననియే నేనుకోరితిని. ఏలనన షెర్వానీ (మా రాష్ట్రఅధ్యక్షుడు) యెంత మాత్రము ఉద్రేకికాడు. స్వభావముచే నతడు కాంగ్రెసులో రాజకీయముగను, సాంఘికముగనుకూడ కుడిపక్షమువాడు. ఆతడు వత్సరారంభములో యు. పి. కాంగ్రెసుకమిటీయొక్క వ్యావసాయిక నీతి యెడల విముఖుడుగనే యుండెను. కాని యతడే ఆ కమిటీఅధ్యక్షుడై యీ భారమును వహింపవలసివచ్చినపు డంతకంటె గత్యంతరము

లేదని గుర్తించెను. తరువాత రాష్ట్రకమిటీ తీసికొనిన ప్రతిచర్యయు నతని సన్నిహిత సహకారముతోడను, నతని యధ్యక్షతక్రిందను తీసికొనబడెను.

కనుక వర్కింగుకమిటీలో నేను వాదించుటవలన కలుగుదాని కంటె షెర్వానీ వాదించుటవలనే ఎక్కువ ఫలితము కలిగెను. కమిటీ వారు జంకుచు, కాని దానిని తిరస్కరించ వీలు లేదని భావించుచు, యే ప్రాంతముకైనను రివిన్యూకిస్తులను చెల్లింపకుండుట కనుజ్ఞనీయ వచ్చునని యు. పి. కమిటీకధికారమిచ్చిరి. కాని వారు యు. పి. ప్రజలను శక్యమగుచో నీ చర్యకు గడంగుటమాని రాష్ట్ర ప్రభుత్వముతో రాయబారములను జరుపవలెనని బలవంతపెట్టిరి.

ఈ రాయబారములు కొద్దికాలము జరిగెను. కాని ఫలితము శూన్యము. అలహాబాదుజిల్లాలోని రివిన్యూ అంకెలలో కొంత మార్పుజరిగెనని నేను భావించెదను. మామూలు పరిస్థితులలోనైనచో సమాధానము కుదిరియుండెడిది. అథమము బహిరంగపోరాటమైన తప్పియుండెడిది. భేదములు తగ్గిపోవుచుండెను. కాని పరిస్థితులు చాలయసామాన్యములయ్యెను. ప్రభుత్వ కాంగ్రెసుపక్షములు సమీపములోనే పోరాటము తప్పదనుకొనుచుండిరి. ఇరుపక్షములవారు తీసికొను ప్రతిచర్యయు సమయముకొరకు వేయుచున్న యెత్తును సూచించుకోరికవలె కానిపించెను. ఇందుకు ప్రభుత్వసన్నాహమంతయు రహస్యముగ జరుగగలదు. నిజమునకది యట్లేజరిగి పూర్ణత నొందెను. మనబలము కేవలము ప్రజలనీతిమీదనే యాధారపడెను. ఇది రహస్యకార్యములచే సిద్ధముచేయబడునది కాదు. రహస్యకార్యములచే నుత్థితమగునదికాదు. మాలోకొంతమంది అట్టిపాపము చేసినవారిలో నేనొకడను. మా బహిరంగోపన్యాసములలో మన స్వాతంత్ర్యపోరాట మింకను ముగియలేదనియు, నతిత్వరలోనే మన మనేకపరీక్షలను, కష్టములను నెదుర్కొనవలసియుండుననియు ననేకసార్లు వక్కాణించితిమి. వాటికొఱకు సంసిద్ధులుగ నుండవలసినదని మేము మా ప్రజలను హెచ్చరించితిమి. ఈ కారణముచేత యుద్ధ

మునకు కాలుదువ్వుచున్నామని మమ్ము విమర్శించిరి. యథార్థము నకు మా మధ్యతరగతి కాంగ్రెసువర్కరులకు నిజస్థితి నెదుర్కొనుట కెంతమాత్రము నిష్టము లేకుండెను. ఏదో యొక విధముగ పోరాటము తప్పిపోవునని వారాశించుచుండిరి. వార్తాపత్రికలు చదువు తరగతి వారిదృష్టి లండనులోనున్న గాంధీజీపయినుండెను. విద్యార్థికి లీవిధ ముగ స్థబులుగనున్నను ముఖ్యముగ వంగదేశములోను, సరిహద్దు రాష్ట్రములోను, యు. పి. లోను పరిస్థితులు ముదురుచుండెను. విషమావస్థ సమీపించుచున్నదను వివేకోదయము నవంబరు మాస ములో చాలమందికి కలిగెను.

యు. పి. రాష్ట్రకాంగ్రెసుకమిటీ పరిస్థితు లెటులుండి యెటు వచ్చునోయని పోరాటమువచ్చుచోజరుగవలసినకొన్నిస్థానికయేర్పా టులను చేసిరి. అలహాబాదుజిల్లాకాంగ్రెసుకమిటీరయితుకాన్ఫరెన్సు జరిపెను. మంచిషరతులు ప్రాప్తించనియెడల రయితులను పన్నులు శిస్తులు చెల్లింపవలదని సలహా యివ్వవలసియుండునను సక్రమమైన తీర్మానమందులో గావింపబడెను. ఈతీర్మానము రాష్ట్రప్రభుత్వకోప మునకు గురియయ్యెను. దీనినొక సాకుగాదీసికొని వారు మాతో నిక నెట్టిసంబంధము పెట్టుకొనజాలమనిరి. వారి వైఖరిచూచి రాష్ట్ర కాంగ్రెసు దానినొక సంగ్రామచిహ్నముగా నర్థముచేసికొని తాము కూడ తగిన సన్నాహములను చేసికొనిరి. అలహాబాదులో మరియొక రయితు కాన్ఫరెన్సు జరిగెను. రాయబారములు, షరతులు కుదురు వరకు పన్నులనీయరాదను స్పష్టమగుతీర్మాన మందులో గావింప బడెను. అప్పుడయినను మేము 'సరసమగుపన్ను' లుండవలెనను దృష్టిలో నుంటిమిగాని 'పన్నుల నీయరాదు' అను యుద్యమము నెప్పుడు తలపెట్టలేదు. రెండవపక్షము మాతి ముడుచుకొనునట్లు కాన్పించుచున్నను మేము సమాధానముకొరకు యత్నించుచునే యుంటిమి. అలహాబాదుతీర్మానము జమీందారుకు, వ్యవసాయ దారునకుకూడ సమముగనే వర్తించును. కాని యది ఫలితములో

రయితులకు కొద్దిమంది చిన్నజమీందారులకుమాత్రమే వర్తించునని మే మెరుగుదుము.

1931 నవంబరుచివర డిశంబరు ప్రారంభమున యు. పి. లో పరిస్థితులిట్లుండెను. ఈలోపున వంగదేశములోను సరిహద్దురాష్ట్రములోను వ్యవహారములు విషమించెను. వంగదేశములో సర్వమును మ్రింగు నూతన ఆర్డినెన్సు ప్రయోగింపబడెను. ఇవన్నియు సంగ్రామ చిహ్నములుగాని శాంతిమార్గములుగావు. గాంధీజీయెప్పుడువచ్చును? ప్రభుత్వము చాలకాలమునుండి సన్నాహము చేయుచున్న తీవ్రచర్య ప్రారంభమగులోపల గాంధీజీ హిందూదేశము చేరునా? లేక నతని సహకారులు చాలమంది జయిళ్ళకు పంపబడి పోరాటము ప్రారంభింపబడినతరువాత నతడువచ్చునా? అతడు పయనమయ్యెనని, డిశెంబరు చివరవారములో బొంబాయి చేరనున్నాడని మేము వింటిమి. మేమందరము నతడువచ్చువరకు నాపోరాటము రాకుండనుండవలెననియే కోరితిమి. పోరాటముకొరకైనను మేమతనిని కలుసుకొని యతనిసలహా, యాజ్ఞలను తీసికొనుటవసరము. ఈ పందెములో మే మసహాయులమైతిమి. బ్రిటిషు ప్రభుత్వమే నూతనాధ్యాయమును గడంగెను.

40

శాంతియస్తమించెను

యు. పి. లో నాకున్న పనియటులుండ చాలకాలమునుండి నేను రాజకీయతుపాను కేంద్రములయిన తదితర రెండురాష్ట్రములను (వంగ, సరిహద్దురాష్ట్రములు) చూడవలెనని యాదుర్దాపడుచు నచ్చటి పరిస్థితులను కండ్లార చూడగోరితిని. నేను రెండుసంవత్సరములనుండి చూడని యనేకపాతసహచరులనుకూడ చూడగోరితిని. ముఖ్యముగ నా రాష్ట్రములలోని ప్రజలయుత్సాహమునకు, ధైర్యసాహసములకు, జాతీయపోరాటములో వారియఖండత్యాగములకు నేను నా కృతజ్ఞతాభివందనముల నర్పింపగోరితిని. సరిహద్దురాష్ట్రమునకు పోవుటకు వీలులేకుండెను. భారతప్రభుత్వము ప్రధానకాంగ్రెసువారెవరు నచ్చటకు పోరాదని నిషేధించుటచే మేమచ్చటకువెళ్ళి తద్వారా యెట్టిప్రతిష్టంభన కలుగజేయదలంచలేదు.

వంగదేశములో స్థితిగతులు పాడగుచుండెను. అచ్చటకు వెళ్ళవలెనని నేనెంత యావేశపడుచున్నను వెళ్ళుటకుముందే సందేహించితిని. నేనచ్చట నేమియుచేయజాలనని యు నసహాయుడ నగుదుననియు గుర్తించితిని. చిరకాలమునుండి రెండు కాంగ్రెసువర్గముల మధ్య నచ్చట జరుగుచున్న శోచనీయమగు వివాదముచే పయి రాష్ట్రములోనున్న కాంగ్రెసువారెవరు నచ్చటకు వెళ్ళుటకు భయపడుచుండిరి. అచ్చటకు వెళ్ళినచో నేపక్షములోనైనను చిక్కుకొనిపోవచ్చునని వారు భయపడుచుండిరి. ఇది చాలదుర్బలమైన యుష్ట్రపక్షినీతివలెనున్నది. ఇది వంగదేశమును శాంతిపరచుటకు, దాని సమస్యలను తీర్చుటకు తోడ్పడకుండెను. గాంధీజీ లండను వెళ్ళిన కొంతకాలమునకు రెండువిషయములు భారతదృష్టిని వంగదేశపరిస్థితులపై కేంద్రీకరింపజేసెను. ఈ రెండు హిజిలీ, చిటగాంగులలో జరిగెను.

హిజలీ డెటెన్యూలకు ప్రత్యేక జయిలు, ఈ జయిలులో దొమ్మి జరిగెనని, డెటెన్యూ లుద్యోగస్థులపై బడిరని వారు విధిలేక తుపాకులను పేల్చవలసివచ్చెనని యొక అధికారప్రకటన గావింపబడెను. ఈ కాల్పులవలన నొక డిటెన్యూ మరణించెను. చాలమందికి గాయములు తగిలెను. వెంటనే యొక స్థానికయధికారవిచారణ జరుపబడెను. ఈ కాల్పులకు, తత్ఫలితములకు నధికారు లెంతమాత్రము దోషులుకారని యది సమర్థించెను. కాని యనేకచిత్రలక్షణములందు చూపట్టెను. అధికారుల వ్రాతలతో సరిపడని యనేక యదార్థములు బయల్పడెను. సమగ్రవిచారణ జరుపబడవలెనని యాందోళన బయలుదేరెను. హిందూదేశయాచారమునకు భిన్నముగా వంగప్రభుత్వము గొప్పగొప్ప న్యాయమూర్తులుగల యొక విచారణకమిటీ నియమించెను. అది కేవలమధికారులకమిటీ, కాని యది సాక్ష్యములనుతీసికొని విషయమునంతను పూర్తిగ విమర్శించెను. దానితీర్పు జయిలు అధికారులకు వ్యతిరేకముగ నుండెను. తప్పు చాలవరకు జయిలు అధికారులదే యని యది సమర్థించెను. కాల్పు లన్యాయమని స్పష్టపరచెను. ప్రభుత్వమువారిచే నదివరకు ప్రకటింపబడిన యధికారపత్రములు కేవల మసత్యములని ఋజువుచేయబడెను.

హిజలీసంభవములలో నసామాన్యమైన దేదియులేదు. భారతభూమిలో నిట్టిసంభవములకు లేక ప్రమాదములకు కొదువలేదు. "జయిలుదొమ్ములాటలు" జయిలులో నసహాయులై నిరాయుధులై యున్న ఖయిదీలనుసాయుధులగు వార్డరులు మొదలగువారతిధైర్యసాహసములతో నణచివేయుట మొదలగువార్తలను మనము తరచు విందుము. హిజలీ యొకవిధముగ నసామాన్యమయ్యెను. ప్రభుత్వపక్షపాతబుద్ధిని, అట్టిసంఘటనలమీద వారు ప్రకటించు ప్రకటనలలోని బూటకమును అధికారులచేతనే బయటపెట్టించెను. ఇదివరలో నిట్టి ప్రకటనల నెవడును విశ్వసించెడువాడుకాడు. కాని యిప్పుడు వాటిపస కనుగొనబడెను. హిజలీవ్యవహారమైనతరువాత నొక్కొక్కప్పుడు కాల్పులును, ఒక్కొక్కప్పు డితర దౌర్జన్యపద్ధతులు నవ

లంబింపబడిన జయిలు "సంభవములు" భారతదేశమంతట ననేక చోట్ల జరిగెను. ఈ జయిలుదొమ్మీలలో ఖయిదీలొక్కరే గాయపడుచుండు టొకవింత. ప్రతిసారి తప్పకుండ వివిధ దుష్కార్యములను చేసిరని ఖయిదీలను నిందించుచు నుద్యోగస్తులు నిర్దోషులని ప్రకటించుచు నొక యధికారపత్రము వెలువడుచుండును. అతియరుదుగ జయిలు ఉద్యోగస్తులకు డిపార్టుమెంటుద్వారా కొద్దిశిక్షలు ప్రసాదింపబడును. పూర్తియైన విచారణ సలుపవలెనను కోరెకలన్నియు నిరాకరింపబడెను. డిపార్టుమెంటు చేయు విచారణయే చాలునని తలంపబడెను. హిజిలీ ప్రభుత్వముకొక గుణపాఠము నేర్పెను. ఉచితమగు నిష్పక్షపాతవిచారణలలో తమకు భద్రతలేదని వారు కనుగొనిరి. ముద్దాయియే యుత్తమమగు న్యాయమూర్తి. ప్రభుత్వపత్రములు యదార్థముగజరుగు సంగతులుగాక ప్రభుత్వము ప్రజలనేమి విశ్వసింపవలెనని కోరునో దానినే తెలుపునను హిజిలీపాఠమును ప్రజలుకూడ నేర్చుకొనవలెననుటలో నాశ్చర్యమేమున్నది?

చిటగాంగు వ్యవహారము మరింత యుపద్రవమైనది. ఒక టెర్రరిస్టు ఒక ముస్లిము పోలీసు యిన్స్పెక్టరును కాల్చిచంపి వేసెను. దీని వెంటనే హిందూ-ముస్లిముకలహముజరిగెను. కానియదియంతకంటె నెక్కువయైన దేదియోయని పయికి కాన్పించుచునేయుండెను. అది మామూలు కులకలహముకంటె భిన్నమైనది. టెర్రరిస్టుచర్యకు కులకక్షతో సంబంధములేదు. హిందువు, ముస్లిము అను ప్రశ్నలేకుండ నదియొక పోలీసుయుద్యోగిపై తీసుకొనబడిన చర్య. కాని తరువాత కొంత హిందూ ముస్లిము కలహములు జరిగినసంగతి నిజము. మంచి బాధ్యతగల ప్రజాహితైషులే యెంత తీవ్రనేరారోపణలను చేసినను యిది యెట్లు ప్రారంభింపబడెనో దీనికి కారణమేమి కలదో స్పష్టపరుపలేదు. ఈ కలహములోని మరియొక లక్షణ మేమనిన ఆంగ్లో యిండియనులు, ముఖ్యముగా రైల్వేనౌకర్లు యితర ప్రభుత్వనౌకర్లు యిందులో కలుగజేసుకొనిరి. వీరుయథేచ్ఛగజనబాహుళ్యముమీద పగదీర్చుకొనిరి. చిటగాంగు సంభవములనుగురించి సేనుగుప్త మొద

లగు విఖ్యాత వంగదేశ నాయకు లిదమిద్ధమను నేరములను మోపి, విచారణ చేయవలసినదని లేదా పరువునష్టపుదావా చేయవలసినదని సవాలుచేసిరి. కాని ప్రభుత్వ మదేదియు చేయక యూరకుండెను.

కొంత యసాధారణములగు యీ చిటగాంగుసంభవములు రెండు యుపద్రవములవైపు దృష్టినాకర్షించెను. అనేక కారణముల చేత టెర్రరిజము ఖండింపబడెను. ఆధునికవిప్లవ శాస్త్రముకూడ దానిని ఖండించెను. దానివలన కలుగుఫలితములలో నొకటి ముఖ్యముగా నా కెప్పుడు భయము కలిగించుచుండెను. దానివలనహిందూ దేశములో నచ్చటచ్చట కులకలహములు వ్యాపించు నుపద్రవము కలదు. నేను దౌర్జన్యమునకు వెఱచునంతటి 'పిరికి హిందువు'ను కాను. కాని హిందూ దేశములో విఘాతములను కల్పించుశక్తులింకను బలవత్తరముగ నున్నవని నేను భావించెదను. అచ్చటచ్చట బయలుదేరు దౌర్జన్యములు నిశ్చయముగ వాటికి మరింతబలము చేకూర్చును. సుశిక్షణ, జాతీయైక్యత నిర్మించువిధానము నది మరింత కష్టతరము చేయును. మతము పేరిట లేక స్వర్గముకొరకు ప్రజలు హత్యలలనడిపచో నట్టివానిని టెర్రరిస్టు దౌర్జన్యముల కలవాటుచేయుట చాల యుపద్రవకర విషయము. రాజకీయహత్యయే చెడ్డది. అయినను రాజకీయ టెర్రరిస్టును త్రిప్పవచ్చును. ఏలనన అతడు ప్రపంచ ప్రయోజనముకొరకు యత్నించుచున్నాడు. స్వార్థముకొరకుగాక జాతికొరకు పాటుపడుచున్నాడు. మతహత్య యనర్థమైనది. ఏలనన అది యితరప్రపంచమునకు సంబంధించినది. అట్టివిషయములను గురించి సహేతుకచర్చ కెవడును యత్నమునైనను చేయజాలడు. ఒకొక్కప్పుడీ రెంటిని విడదీయు రేఖ యనుమానాస్పదమై కొంచెమించుమించు మాయమగును.

చిటగాంగుహత్య, తత్ఫలితములు టెర్రరిస్టు చర్యలవలన కలుగు నుపద్రవములను కండ్లకుకట్టినట్లు స్పష్టపరచెను. అది భారత స్వాతంత్ర్యమునకు, ఐక్యతకు విపరీతనష్టము కలిగింపగలదని విదితమయ్యెను. దానివెంటనే తీసికొనబడిన ప్రతీకారచర్యలు భారతదేశ

ములో ఘాసిస్టుపద్ధతులు ప్రారంభమైనట్లు తెలుపుచుండెను. అప్పటి నుంచి యిట్టి ప్రతీకారములు, ముఖ్యముగ వంగదేశములో, ననేక ములు కలిగెను. యూరపియనులలోను, ఆంగ్లోఇండియనులలోను నిస్సందేహముగ ఘాసిస్టుసిద్ధాంతము వ్యాప్తిచెందెను. బ్రిటిషు సామ్రాజ్యతత్త్వము నాశ్రయించుకొని జీవించు కొందరు భారతీయు లకుగూడ నిదియబ్బెను. టెర్రరిస్టులకుగూడ యీఘాసిస్టుదృష్టికలదు. కాని దానిదృష్టి వేరు. వారి జాతీయఘాసిజము యూరపియనుల యొక్కయు ఆంగ్లోయిండియనులయొక్కయు, కొంతమంది పైతరగ తులలోని భారతీయులయొక్కయు సామ్రాజ్యపరమగు ఘాసిజము నెదుర్కొనును.

1931 నవంబరులో కొద్దిరోజులు నేను కలకత్తాలోనుంటిని. నా కూపిరి తిరుగని ప్రోగ్రాముండెను. వ్యక్తులను, సంఘములను యిష్టా గోష్ఠిగకలుసుకొనుచు నేననేకబహిరంగసభలలోనుపన్యసించితిని. ఈ యన్నిసభలలోను నేను టెర్రరిజమునుగురించి చర్చించి యదితప్పని వ్యర్థమని భారతస్వాతంత్ర్యమునకు హానికరమనిచూపయత్నించితిని. నేను టెర్రరిస్టులను తిట్టలేదు. తమ జీవితములో నెన్నడు ధైర్య సాహసకార్యములనుచేసిన పాపమునకుపోని మన 'యోధుల'వలెనేను వారిని 'పిరికివారని, పందలని' నామకరణము చేయలేదు. తనజీవిత మును నిరంతరము నొడ్డుచున్న పురుషుని స్త్రీని పిరికివారని పిలుచుట నా కెప్పుడు హాస్యముగ కాన్పించును.

నేను కలకత్తాలో స్టేషనుకు పయనమగుచుండ నిద్దరు యువకులు నన్ను చూడవచ్చిరి. వారిరువదియేండ్ల తరుణవయ స్కులు. ముఖములు పాలిపోయి యావేశపడుచున్నట్లుండెను. కండ్లు ప్రకాశమానముగ నుండెను. వారెవరో నే నెరుగను. కాని వారు వచ్చినపని నాకు వెంటనే తెలిసిపోయెను. టెర్రరిస్టుల దౌర్జన్యమునకు వ్యతిరేకముగ నేను చేసిన ప్రచారమునకు వారికి నాపై గోపముగలి గెను. అది యువకులపై చెడుఫలితములను కలుగచేయుచున్నదని, నే

నిట్లభ్యంతరములను కలిగించుట సహింపజాలమని వారనిరి. మేము కొద్దివాదనకు దిగితిమి. నేను వెళ్ళవలసిన సమయము మాసన్న మగుటచే నది తొందరగ ముగింపబడెను. మా కంఠములు, మా యావేశములు హెచ్చుచుండెనని నేను భయపడితిని. నేను వారికి కొన్ని కఠిన మాటలను చెప్పితిని. వారిని విడిచి వెళ్ళిపోవునపు డికముందు తిన్నగా నడుచుకొనకపోయినచో నితరులకు చూపబడిన మర్యాద యేనాకును చూపబడునని వారు నన్ను కడసారి సందలించిరి.

నేను కలకత్తా విడిచితిని; రైలులో రాత్రి పనుకొనియుండగా నా యిద్దరిబాలుర యుద్రేకపూరిత ముఖములు చాలసేపు నన్ను వెంటాడించెను. చైతన్యము, శక్తి, మూర్తీభవించినట్లుండెను. యుక్తమార్గములో పనిచేసినచో నా రెంతటి యమూల్యరత్నములు! వారినంత తొందరగ మోటుగ పంపివేసితినే! నేను వారితో దీర్ఘ సంభాషణ జరుపకపోతిని. భారతదేశమును, దాని స్వేచ్ఛను సేవించు విధమున తమ కీర్తివంతములగు పావనజీవితముల నర్పించునట్లు బహుశః నేను వారి నొప్పించగలిగి యుండెడివాడను.

అది డిసెంబరు మాసము. రెండవ రైతుసభ అలహాబాదులో జరిగెను. తరువాత హిందుస్థానసేవాదళాధిపతియైన డాక్టరు యన్. యస్. హార్డికరుకు నేను చేసిన చిరవాగ్దానమును నెరవేర్చుటకు కర్నాటకమునకు పరుగెత్తితిని. జాతీయోద్యమ మైచ్ఛికభటశాఖ యైన సేవాదళము, ఆ సంస్థ ప్రత్యేకము వేరుగ నున్నను, మొదటి నుండియు కాంగ్రెసు సహాయసంస్థగనే యుండెను. అయినను 1931 వేసవిలో వర్కింగుకమిటీ దానిని పూర్తిగ కాంగ్రెసుసంస్థలోకలుపు కొనుటకు నిశ్చయించెను. దానిని కాంగ్రెసు వాలంటీరు శాఖగ చేయకోరిరి. వారట్లుచేసి హార్డికరును నన్ను దాని యధికారులను చేసిరి. ఈ దళముయొక్క ప్రధానస్థానము హుబ్లీలో యుంచబడెను. హార్డికరు నన్నా ప్రదేశమును సందర్శింప ప్రోత్సహించెను. కర్నాటకములో కొద్దిరోజులు యాత్రచేసితిని. ప్రతిచోట ప్రజల యద్భుతో

త్సాహమునకు నే నాశ్చర్య చకితుడ నైతిని. నేను తిరిగివచ్చునపుడు త్రోవలో సైనికశాసనకీర్తి నార్జించిన షోళాపురమును దర్శించితిని.

కర్నాటకయాత్ర నాకు పిక్నిక్కులు యాత్ర యయ్యెను. నా యుపన్యాసములు కటువుగ గానరసములేకయున్నను మృత్యుగానము వలె నుండెను. యు.పి.నుండి నిశ్చయవార్తలే తెంచెను. ప్రభుత్వము జేగంట ప్రయోగించిరి. అలహాబాదునుండి కర్నాటకము పోవునపుడు నేను కమలనుతీసికొనిబొంబాయి వెళ్ళితిని. ఆమెకుతిరిగిజబ్బుచేసెను. బొంబాయిలో నేనామె చికిత్స కేర్పాట్లు చేసితిని. మేముఅలహాబాదు వీడివచ్చిన వెంట నేభారతప్రభుత్వమువారు యు.పి.కిప్రత్యేకఆర్డి నెన్సు ప్రసాదించిరని బొంబాయిలో వింటిమి. గాంధీజీ యిదివరకే సముద్ర ప్రయాణముచేయుచు త్వరలో బొంబాయి రానున్నను వారతని రాకకొఱకు వేచియుండదలచుకొనలేదు. ఆయార్డి నెన్సువ్యవసాయి కాందోళన నెదుర్కొనుటకేయుద్దేశింపబడినట్లు చెప్పబడెను. కాని యది దిగంత విశ్రాంతమై యున్నింటిని యావరించి యెట్టిరాజకీయ, లేక ప్రజాకార్యములనుకూడ సాధ్యము కాకుండచేసెను. అదిబిడ్డలు, పెద్దల యొద్దిలోనుండు పిల్లలుచేయు పాపములకు తల్లిదండ్రులను, సంరక్షకులనుకూడ శిక్షించుటకేర్పాట్లుచేసెను.ఇది పురాతన బైబిలు లోని యాచారమునకు తల్లక్రిందులు.

నేను కర్నాటక యాత్రను కట్టిపెట్టి అలహాబాదు తిరిగివెళ్ళుట కాతురపడుచుంటిని. యు. పి. లో నా సహచరులతో నుండుటయే నాధర్మమని నేనుభావించితిని. నారాష్ట్రములో కొంపలు కూలిపోవు చుండ నెచ్చటనో దూరములోనుండుట యగ్నిపరీక్షవలె నుండెను. అయినను నేనుకర్నాటకప్రోగ్రామును బద్ధుడనగుట కేనిశ్చయించితిని. నేను బొంబాయితిరిగివచ్చుసరికి కొందరుస్నేహితులు గాంధీజీవచ్చు వరకు నన్నచ్చటనే యుండమనిరి. అతడుసరిగా నొక్కవారములో రానైయుండెను, కాని యిది యసంభవమయ్యెను. పురుషోత్తమదాసు టాండను మొదలగువారు నిర్బంధింపబడిన వార్తలు అలహాబాదు నుండి వచ్చెను. పయిగా మా రాష్ట్రకాన్ఫరెన్సు యిటావాలో నా

వారములో జరుగనుండెను. కనుక నేను అలహాబాదు వెళ్లుటకు నిశ్చయించి మూడురోజులైన తరువాత, నేను స్వేచ్ఛగనుండుచో, గాంధీజీని కలుసుకొనుటకు, వర్కింగుకమిటీ మీటింగుకు హాజరగుటకు బొంబాయి తిరిగి పోవలెననుకొంటిని.

నే నలహాబాదు చేరకముందే, చివోకీ స్టేషనువద్ద క్రొత్త ఆర్డినెన్సుక్రింద నాపయి నొకఆర్డ రమలు జరుపబడెను. అలహాబాదు స్టేషనులో ఆ ఆర్డరుయొక్క కాపీకేటు నాపయి నమలుజరుపుటకు మరియొక ప్రయత్నము జరిగెను; నా యింటివద్ద మరియొకవ్యక్తి మూడవ యత్నముచేసెను. నే నట్టిసాహసములకు దిగలేదు. ఆ యార్డరు నన్ను అలహాబాదు మున్సిపలు సరిహద్దులలోనుండవలెనని నిషేధించెను. నే నట్టి బహిరంగసభలకు, నుత్సవములకు హాజరు కాగూడదనియు,బహిరంగసభలలో నుపన్యసించగూడదనియువార్తాపత్రికలలోగాని,కరపత్రములలోగాని యేమియు వ్రాయగూడదనియు నాకు చెప్పిరి. ఇంక ననేక నిర్బంధములుండెను. నా సహోద్యోగులనేకమందిపయి నిట్టిఆర్డరే యమలు జరుపబడెను. వీరిలో షెర్వానీ కూడ నుండెను. మరునాడు ప్రాతఃకాలమున నేను జిల్లామేజిస్ట్రేటుకు (ఆర్డరును అమలు జరిపించినవానికి) వ్రాయుచు దాని నందుకొంటినని తెలుపుచు నే నేమి చేయవలెనో, యేమి చేయరాదో యను సందర్భములో నేనతనినుండి యాజ్ఞలను తీసికొనజాలనని తెలిపితిని. నేను నా మామూలుపనిని మామూలు విధముగ చేసికొందును. ఈ పని చేసుకొను సందర్భములో నేను గాంధీజీని చూచుటకు బొంబాయి త్వరలోనే తిరిగి వెళ్ళదలచుకొంటిని. వర్కింగుకమిటీ [దానికి నేను కార్యదర్శిని] మీటింగులో పాల్గొనదలచితిని.

మరొక్క క్రొత్తసమస్య యెదుర్కొనెను. మా యు.పి. రాష్ట్రీ కాన్ఫరెన్సు ఆ వారములో యిటావాలో జరుగనుండెను. గాంధీజీ రాకయు నిదియు నేకకాలమునందు జరుగనుండుటచే నేను దీనిని మార్చవలెనను సూచనచేయు నుద్దేశ్యముతో, ప్రభుత్వముతో సంఘర్షణ లేకుండ చేయునుద్దేశ్యముతో బొంబాయినుండి వచ్చితిని.

కాని నేను అలహాబాదు చేరకమునుపే మా యధ్యక్షుడైన షెర్వానీకి యు. పి. ప్రభుత్వమునుండి ఖండితమైన సందేశ మొకటి వచ్చెను. అది మా కాన్ఫరెన్సు వ్యావసాయిక సమస్యను చర్చించునాయని ప్రశ్నించెను. అది యట్లుచేయుచో ప్రభుత్వము వారా కాన్ఫరెన్సనే నిషేధించెదరు. రాష్ట్రమునంతను ఆందోళనపరచుచున్న వ్యావసాయిక సమస్యనుచర్చించుటయే కాన్ఫరెన్సుయొక్క ప్రధానప్రయోజనమని విదితమగుచున్నది. సభ జరిపి దానిని గురించి చర్చింపకుండుటకంటె హాస్యము వేరులేదు. అది మనకు మనమే మూషికులమని చెప్పుకొనుటయగును. ఏది యెట్లున్నను, మన యధ్యక్షునకు లేక మరెవరికి కాన్ఫరెన్సును బంధించుట కెట్టి యధికారములేదు. ప్రభుత్వమువారి జడిపింపులతో సంబంధము లేకుండగనే కాన్ఫరెన్సు మరియొక తేదీకి మార్చవలెనని మాలో కొందర ముద్దేశించుచుంటిమి. కాని యీజడిపింపు కొంతయలజడికి కారణమయ్యెను. ఇట్టివిషయములలో [మాలోచాలమంది పెంకితల కాయలను గలము] ప్రభుత్వముచే శాసింపబడుట యనుభావము వెగటుగనుండెను. చాలకాలము చర్చించినతరువాత మేము మా యభిమానమును దిగమ్రింగుటకు నిశ్చయించుకొని కాన్ఫరెన్సును మరియొక తేదీకి మార్చితిమి. ఏమి జరిగినను జరుగుగాక! గాంధీజీ వచ్చువరకు పోరాటము లేకుండ [అదియిదివరకే ప్రారంభింపబడెను] చేయుటకే మేమట్లు చేసితిమి. రాయబారము జరుపుట కశక్యమగు పరిస్థితులలో నతనిని పెట్టుటకు మాకిష్టములేకుండెను. మేము రాష్ట్ర కాన్ఫరెన్సునాపి వేసినను యిటవాలో పోలీసు, మిలటరీ బ్రహ్మాండమగు ప్రదర్శనమునుజరిపెను. కొంతమంది తెలియకవచ్చిన ప్రతినిధులు అరెస్టుచేయబడిరి. అచ్చటనున్న స్వదేశీ ప్రదర్శనశాలను మిలటరీవారు జయప్రదముగ పట్టుకొనిరి.

షెర్వానీ నేను డిసెంబరు 26 వ తేదీ యుదయము అలహాబాదు వీడి బొంబాయి వెళ్ళుటకు నిశ్చయించితిమి. యు. పి. పరిస్థితులను గురించి చర్చించుటకు షెర్వానీ, వర్కింగుకమిటీ మీటింగుకు

ప్రత్యేకముగ నాహ్వానింపబడెను. అలహాబాదు పట్టణము వీడకూడదని మా యిరువురపైనను ఆర్డినెన్సుక్రింద ఆర్డర్లు అమలుజరుపబడెను. అలహాబాదుజిల్లాయొక్క గ్రామప్రాంతములలోను, మరి కొన్ని యు.పి. జిల్లాలలోను పన్నులను చెల్లింపకుండు చర్యల నెదుర్కొనుటకే ఆర్డినెన్సు యుద్దేశింపబడినదని చెప్పబడెను. ఈ గ్రామ ప్రాంతములకు పోకుండ ప్రభుత్వమువారు మమ్ము నడ్డుపెట్టుట యర్థము చేసికొనుట సులభము. కాని యీ వ్యవసాయికాందోళనమును మేము బొంబాయి మహాపట్టణములో నిర్వహింపజాలమనుట సువిదితము. ఆర్డినెన్సు నిజముగా నొక్క వ్యవసాయిక పరిస్థితులకొరకే యుద్దేశింపబడినదో, రాష్ట్రమునుండి వెళ్ళిపోవుచున్నందులకు మమ్మభినందింపవలసియుండెను. ఆర్డినెన్సు ప్రకటింపబడినది లగాయతు స్వరక్షణయే మా సాధారణనీతిగ నుండెను. అప్పటప్పటవ్యక్తులు ఆర్డరులను ధిక్కరించినను మేము దానితో తలపడుట కిచ్ఛగింపలేదు.

యు.పి. కాంగ్రెసువారుకూడ ప్రభుత్వముతో పోరాటము లేకుండనుండవలెనని లేక ప్రస్తుతమయిన నాపివేయవలెనని కోరుచుండిరి. గాంధీజీ వర్కింగుకమిటీ యీ విషయములను గురించి చర్చింపనున్న బొంబాయిపట్టణమునకు షెర్వానీ, నేను వెళ్ళుచుంటిమి. వారి యంత్య నిర్ణయము లెట్లుండునో - నిశ్చయముగా నాకేమియుగూడ తెలియదు.

ఈ యన్ని కారణములచే మేము బొంబాయి వెళ్ళుట కభ్యంతరముండదని నేను భావించితిని. ప్రవాసమును విధించిన ఆర్డరును సాంకేతికముగ నుల్లంఘించినందులకు ప్రభుత్వమువారు తాత్కాలికముగ నైనను సహించెదరనుకొంటిని అయినను నా యంతరాత్మ మరియొకవిధముగ చెప్పుచుండెను.

మేము రైలెక్కుటతోడనే ప్రాతఃకాలపత్రికలలో సరిహద్దు రాష్ట్రక్రొత్తఆర్డినెన్సునుగురించియు, అబ్దుల్ గఫర్ఖాను, డాక్టరుఖాను సాహెబు మొదలగువారియరెస్టులనుగురించియు చదివితిమి. ఇంతలోనే మాబండి బొంబాయిమెయిలు, ఇరదత్ గంజియను నొకమారు

మూల స్టేషనులో నకస్మాత్తుగా నిలిచిపోయెను. ఇదిసాధారణముగ రెయిలు ఆగు ప్రదేశముకాదు. ఇంతలో పోలీసు అధికారులు మమ్మరెస్టుచేయుటకు వచ్చిరి. రైల్వేలైనుప్రక్కనొక బ్లేక్ మేరియా మా కొరకు వేచియుండెను. షెర్వానియు, నేనును కట్టుదిట్టముగ మూసివేయబడిన యీ ఖయిదీలబండిలో నెక్కగానే యది మమ్మ నైనీలో దింపివేసెను. క్రిస్టమసు బహుమానములనిచ్చు యీ రోజు ప్రాంతఃకాలమున నమ్మరెస్టుచేసిన పోలీసుసూపరింటెండెంటు, ఒక ఆంగ్లేయుడు, గుట్టగను విచారముగను కాన్పించెను. పాపము మే మతని క్రిస్టమసు పండుగను పాడుచేసితిమను కొనెను!

తిరిగి ఖయిదుకు సిద్ధము!

41

అరెస్టులు, ఆర్డినెన్సులు, నిషేధములు

మా అరెస్టులు జరిగిన రెండురోజులకు గాంధీజీ బొంబాయి
చేరెను. చిట్టచివరజరిగిన విపరీతములన్నియు నతని కప్పుడే తెలిసెను.
అతడు వంగదేశపు ఆర్డినెన్సునుగురించి లండనులోనే విని తెల్ల
బోయెను. ఇప్పుడతనికి యు.పి., సరిహద్దురాష్ట్రముల ఆర్డినెన్సులు
నూతనక్రిస్టమసుప్రసాదము. ఈ రెండురాష్ట్రములలో నతనియత్యంత
సన్నిహిత సహోద్యోగులు కొందరు నిర్బంధింపబడిరి. కథ ప్రారంభ
మయ్యెను. శాంతికుదురునను యాశలన్నియు నడుగంటెను. అయిన
నా దుస్థితినుండిబయటపడుమార్గముకొఱ కతడొకయత్నముచేసెను.
వైస్రాయి విల్లింగ్డను ప్రభువును చూడకోరెను. యతనికి కొన్ని షర
తులు తెలియజేయబడెను. వంగ, యు.పి., సరిహద్దు రాష్ట్రములలో
జరిగిన సంగతులుగురించి క్రొత్త ఆర్డినెన్సులు వాటిక్రింద జరిగిన
అరెస్టులనుగురించి యతడు చర్చింపకూడదట. భారతప్రభుత్వము
కాంగ్రెసును పూర్తిగా చూర్ణముచేయ నిశ్చయించిన ట్లిప్పుడద్దము
కట్టినట్లుకాన్పించుచుండెను. కాంగ్రెసుతో వారెట్టిసంబంధము పెట్టు
కొనదలంచలేదు. వర్కింగుకమిటీకి శాసనోల్లంఘనముతప్ప మరే
మార్గము కాన్పించలేదు. వారేనిమిషమందైన నరెస్టు కావచ్చునని
భావించి బలవంతముగా నీడ్చుకొనిపోబడుటకు పూర్వము, దేశమున
కొక త్రోవచూపగోరి శాసనోల్లంఘనతీర్మానము నామోదించిరి.
వైస్రాయినిచూచుటకు గాంధీజీ మరియొక యత్నముచేసెను. ఎట్టి
షరతులులేకుండ దర్శన మిప్పించవలసినదని యతడు వైస్రాయికి
రెండవ టెలిగ్రాము పంపెను. దీనికి గాంధీజీ కాంగ్రెసు అధ్యక్షుల
అరెస్టే ప్రభుత్వజవాబు. దేశమునంతను ముంచివేయు భయంకర
నిర్బంధకీలకమును నొక్కుటయే దీనికీయబడిన ప్రత్యుత్తరము,
ఇతరులెవరు పోరాటము కోరినను కోరకపోయినను ప్రభుత్వముదాని
కాతురపడుచు సర్వసిద్ధముగ నున్నట్లు విదితమగుచున్నది.

మేము జయిలులోనుంటిమి. ఈ వార్తలు మాకస్పష్టముగ నసంబద్ధముగ వచ్చుచుండెడివి. మా విచారణ నూతన వత్సరమునకు వాయిదా వేయబడెను. విచారణలోనున్న ఖయిదీలము కనుక శిక్షింపబడిన వారికంటె మా కెక్కువ బంధుదర్శన భాగ్యము లభించుచుండెను. వైస్రాయి దర్శనమీయ నంగీకరింపవలెనా కూడదా యని జరుగు రాద్ధాంతసిద్ధాంతములను మేము వినుచుంటిమి. ఈ దర్శనసమస్యయే తదితర విషయముల నన్నింటిని కప్పివేయుచుండెను. ఇర్విన్‌ప్రభువు దీనికంగీకరించెడివాడనియు నతడు గాంధీజీని కలుసుకొనినచో నంతయు చక్కబడియుండెడిదనియు చెప్పబడుచుండెడిది. భారతపత్రికలు యదార్థములను నిర్లక్ష్యముచేసి, పరిస్థితుల నతిస్థూలదృష్టితో చూచుచుండుట నా కాశ్చర్యము కలిగించెను. భారతజాతీయతకు బ్రిటిషుసామ్రాజ్యతత్త్వమునకుగల విధాయిక సంగ్రామము-బాగుగతర్కించి చూచినచో రెండు పరస్పర విరుద్ధతత్త్వములు-వ్యక్తులు యిష్టాయిష్టములకు జోహారు చేయునా? రెండు చారిత్రకశక్తుల పోరాటము మందహాసములచేతను, పరస్పర మర్యాదలచేతను తీరిపోగలదా? గాంధీజీ బలవంతముగా నొకమార్గము త్రొక్కవలసివచ్చెను. భారతజాతీయత ఆత్మహత్యచేసికొనజాలదు. లేక ప్రధానవిషయములలో నది బుద్ధిపూర్వకముగ విదేశీయులచే శాసింపబడ నిచ్ఛగింపదు. ఈ జాతీయసవాలు నెదుర్కొని, బ్రిటిషు ప్రయోజనములను కాపాడ యత్నించుటకు హిందూదేశ వైస్రాయి మరియొకవిధముగ సంచరింపవలెను. ఆ సమయమున వైస్రాయి యెవరైననేమి! ఇర్విన్‌ప్రభువు సరిగా తూచా తప్పకుండ విల్లింగ్డను ప్రభువుచేసినట్లే చేసియుండెడివాడు. వారిరువురు సామ్రాజ్య నీతి కుపకరణములే. ఇర్విను ప్రభువు తరువాత బ్రిటిషుప్రభుత్వములో నొకసభ్యుడయ్యెను. అతడు భారత దేశములో ప్రభుత్వముతీసికొనిన చర్యలతో సంపూర్ణముగ నేకమయ్యెను. భారతదేశ బ్రిటిషునీతికి వ్యక్తులైన వైస్రాయిలను నిందించుట లేక భూషించుట చాల యప్రయోజకమైనపని, యదార్థసమస్యలు మనకు తెలియకపోవుటచేతను

లేక బుద్ధిపూర్వకముగ మనము వాటిని తప్పించుకొనుట చేతను మనమిట్టి వినోదమున కలవడితిమి.

1932 జనవరి నాల్గవ తేదీ స్మరణీయమైన దినము. అది చర్చలను వాదమును కట్టిపెట్టించెను. ఆరోజు ప్రాతఃకాలమున గాంధీజీ, కాంగ్రెసుఅధ్యక్షుడైన వల్లభాయిపటేలు అరెస్టుచేయబడిడెటెన్యూలుగ నుంచబడిరి. మేజిస్ట్రేటులకు పోలీసుయుద్యోగులకు చాల యధికారములనిచ్చు నాలుగు క్రొత్తఆర్డినెన్సులు సృష్టింపబడెను. పౌరసత్వములు నశించెను అధికారులు మనిషిని ఆస్తిని పట్టుకొనవచ్చును. అది భారతదేశమంతయు ముట్టడింపబడిన ప్రకటనవలెనుండెను. దానితీవ్రత, వ్యాప్తి స్థానికాధికారుల వివేకమునకు విడిచివేయబడెను.

జనవరి నాల్గవతేదీనే యు. పి. ఎమర్జెన్సీపవర్సు ఆర్డినెన్సు క్రింద మా విచారణ నైనీజయిలులోనే జరిగెను. షెర్వానీ కారు మాసములు కఠినశిక్ష, 150 రూపాయలు జుల్మానా. నాకు రెండేండ్ల కఠినశిక్ష 500 రూపాయలు జుల్మానా. మే మొకేనేరము చేసితిమి. అలహాబాదు పట్టణములో నుండవలెనను నొకే ప్రవాస ఆజ్ఞ మాపయి నమలుజరిపిరి.

మే మిరువురము వాటి నొకేమాదిరిగ నుల్లంఘించితిమి. మమ్ము నొకేసెక్షనుక్రింద అరెస్టు, విచారణచేసిరి. అయినను మా శిక్షలుమాత్రము వివిధములుగనుండెను. ఒక భేదముమాత్రముండెను. ఆజ్ఞనుల్లంఘించి బొంబాయివెళ్ళుయుద్దేశ్యముతోనున్నానని నేను జిల్లా మేజిస్ట్రేటుకు వ్రాసితిని. షెర్వానీ అట్టిలాంఛనము దేనిని జరుపలేదు. కాని యతనిప్రయాణముకూడ నందరికి తెలిసిన విషయమే. అది పేపరులలోకూడ తెలుపబడెను. శిక్షవిధించుట తోడనే షెర్వానీ, విచారణచేసిన మేజిస్ట్రేటును తన కట్టి తక్కువ శిక్ష విధించుట కులగౌరవముచేతనా యని ప్రశ్నింప మేజిస్ట్రేటు కంగారుపడెను. అచ్చటనున్న తదితరుల కది వినోదముగ నుండెను.

పవిత్రమైన ఆ జనవరి నాల్గవ తేదీని భారతదేశ మంతట ననేక ఘోరములు జరిగెను. మా కళిసమీపములోనున్న అలహాబాదు పట్టణములోనే ప్రజాసమూహములకు పోలీసులతోను, మిలిటరీతోను సంఘర్షణ మేర్పడెను. మరణములతోను, యితర శరీర వైకల్యములతోను గూడిన మామూలు లాఠీచార్జీలు జరిగెను. జయిళ్ళు శాసనోల్లంఘన ఖయిదీలతో నింపనారంభించెను. ప్రారంభములో నీ ఖయిదీలు జిల్లా జయిళ్ళకు వెళ్ళిరి. అవి పూర్తిగానిండి పోయిన తరువాత నైనీ మొదలగు పెద్ద సెంట్రలుజయిళ్ళు నింపబడుచుండెను. తరువాత నన్ని జయిళ్ళు నిండిపోవుటచే తాత్కాలిక క్యాంపుజయిళ్ళు స్థాపింపబడెను.

నైనీలోనున్న మా చిన్న యావరణలోనికి చాల తక్కువ మంది వచ్చెడివారు. నా పాతస్నేహితుడు, నర్మదాప్రసాద్, మమ్ము కలుసుకొనెను. రంజితపండితుడు మా పెత్తండ్రి కుమారుడు మోహనలాలు నెహ్రూ మాతోనుండిరి. ఆరవ నెంబరు కొట్టిలోనున్న మా చిన్నసోదరమండలిలోనికి మరియొక క్రొత్తసభ్యుడువచ్చి మా కాశ్చర్యము కలిగించెను. బెర్నార్డుఆల్‌విహేర్ సింహాళమునుంచి వచ్చిన తరుణవయస్కుడు. అతడు బారిష్టరుపరీక్ష పూర్తిచేసి యింగ్లండునుండి యప్పుడే వచ్చెను. మా యుత్సవములలో చేర వలదని నా సోదరి యతనితో చెప్పెను. కాని యుత్సాహము పట్టజాలక నత డొక కాంగ్రెసు యుత్సవములో పాల్గొనెను. వెంటనే యతడు మావద్దకు తీసుకొనిరాబడెను.

కాంగ్రెసు అక్రమసంఘమని ప్రకటింపబడెను. పయినున్న వర్కింగుకమిటీ, రాష్ట్రికమిటీలు, అసంఖ్యాకములగుస్థానికకమిటీలు—అన్నియు నక్రమసంఘములయ్యెను. కాంగ్రెసుతోపాటు – కిసాను సభలు, రయితు యూనియనులు, యువజనసంఘములు, విద్యార్థుల సంఘములు, అభివృద్ధిలోనున్న రాజకీయ సంస్థలు, జాతీయ విశ్వవిద్యాలయములు, పాఠశాలలు, ఆస్పత్రులు, స్వదేశీవ్యాపారములు, లైబ్రరీలు—మొదలగు కాంగ్రెసు అభిమానముకలిగినట్టి, లేకముందంజ

వేయుచున్నట్టి యనేకసంస్థలు అక్రమసంఘము లయ్యెను. నిశ్చయముగ నీ లిస్టులు చాల హెచ్చుగనుండి ప్రతి పెద్దరాష్ట్రములోను వందలకొలది పేర్లు కలిగియుండెను. భారతదేశ మొత్తపుసంఖ్య కొన్నివేలమీద నుండవలెను. అక్రమములుగ ప్రకటింపబడిన యీ సంస్థలసంఖ్యయే కాంగ్రెసుయొక్కయు, జాతీయోద్యమము యొక్కయు ఘనతను చాటుచున్నవి.

నా భార్య వ్యాధిగ్రస్తురాలై మంచముపట్టి శాసనోల్లంఘనోద్యమములో నురకజాలనందులకు ఖేదపడుచు బొంబాయిలో పడియుండెను. నా తల్లియు, నిరువురు చెల్లెండ్రు యథాశక్తితో నుద్యమములోనికురికిరి. తోడనే నా చెల్లెండ్రిరువురు నొక్కొక్క వత్సర శిక్షతో జయిలులో ప్రవేశించిరి. జయిలుకు క్రొత్తగావచ్చిన వారివలన మాకు చిన్న చిన్న వార్తలు తెలియుచుండెను. మా కొసంగబడిన స్థానికవారపత్రికవలనకూడ కొన్ని వార్తలు తెలియుచుండెను. వార్తలు కఠినముగ నరికట్టబడుచుండుటచే నేము జరిగినవాటినిగురించి యెక్కువగ నూహింపవలసి యుండెను. వార్తాపత్రికలు, ఏజన్సీలు పెద్ద పెద్ద జుల్మానాల కెప్పుడు భయపడుచుండవలెను. భయపడుచుండెను. కొన్ని రాష్ట్రములలో నిర్బంధింపబడినవానిపేరు లేక శిక్షింపబడినవానిపేరు నుదహరించుట కూడ నేరమయ్యెను.

కనుక మేము బాహ్యపోరాటమునకు దూరులమై నైనీ జయిలులో కూర్చుంటిమి; అయినను శతవిధముల వానినిగురించి తలపోయుచుంటిమి. నూలువడుకుట, పుస్తకములను చదువుకొనుట, యితరపనులు చేయుచుండుట;ఒక్కొకపుడితరవిషయములనుగురించి మాట్లాడుకొనుట, కాని యెల్లప్పుడును జయిలుగోడ వెలుపల జరుగుచుండుదానిని గురించి యోచించుట-యిట్లు కాలమును పుచ్చుచుంటిమి. మేము యుద్యమము వెలుపలనున్నను అందులోనే యుంటిమి. ఒక్కొక్కప్పుడు ఫలానిది జరుగునని యనుకొనుటవలన నెక్కువయులసటకలిగెడిది; లేక యేదో తప్పు జరుపబడెనని కోపము

కలిగెడిది; దుర్బలత్వముపట్ల లేక నైచ్యముపట్ల విసుగుజనించెడిది. ఒక్కొక్కప్పుడు నేమ మతియుదాసీనులమైయుండి రంగమును ప్రశాంతముగ నుద్రేకరహితముగ చూడగలిగెడివారము. బ్రహ్మాండమైన శక్తులుపనిచేయుచున్నపుడు, దైవయంత్రములు మనుష్యులను పిండి చేయుచున్నపుడు చిన్న చిన్న వ్యక్తిగతప్రమాదములను, దుర్బలత్వమును మన మంతగా లెక్కచేయరాదని నేము భావించెడివారము. పోరాటమునుగురించి, ధైర్యోపేతమగు యుత్సాహమును గురించి, క్రూరమగు నిర్బంధములనుగురించి, విషాదకరమగు పిరికితనమును గురించి, రేపేమి వినవచ్చునోయని నే మాశ్చర్యపడెడివారము. ఇదియంతయు నెచ్చటకు గొంపోనున్నది? మన మెచ్చటకు పోవనున్నారము? భవిష్యత్తు తెరమరగున నున్నది. అది యట్లుండుట మంచిది. మాకు సంబంధించినంతవరకు వర్తమానముకూడ కొంతవరకు తెరమఱగుననేయుండెను. కాని పోరాటము, బాధ, త్యాగము తప్పవను సంగతి మాత్రము మాకు తెలియును.

42

అధికారులహంకారములు

1942 తొలిమాసములు బ్రిటిషు అధికారుల హుంకారప్రదర్శనములకు ప్రఖ్యాతివడసెను. పెద్దయధికారులు, చిన్నయధికారులు కూడ తాము నిర్దోషులుగ శాంతులుగ నుండిరనియు కాంగ్రెసు పోరాటమునకు దిగెననియు, పాపముచేసెననియు చాటనారంభించిరి. వారు ప్రజాస్వామికమును సమర్థించుచుండ కాంగ్రెసు డిక్టేటరుల నభిమానించుచుండెను. దాని యధ్యక్షుడు డిక్టేటరని పిలువబడుట లేదా? తమ పవిత్ర కార్యోత్సాహములో ఆర్డినెన్సులు, అన్నివిధములగు స్వేచ్ఛలను అరికట్టుట, వార్తాపత్రికల ముద్రణాలయముల మూతులనుకట్టివేయుట, విచారణలేకుండగనే ప్రజలను ఖయిదుచేయుట, ఆస్తులను ధనమును లాగుకొనుట – ప్రతిదినము జరుగు నిట్టి యనేక 'స్వల్పహింసము' లను వారు మఱచిపోయిరి. వారు భారతదేశములోని బ్రిటిషుప్రభుత్వ ప్రధానలక్షణముకూడ మఱచిపోయిరి. ప్రభుత్వమంత్రులు (మనదేశీయులే) నెల కేకొద్దివేల రూపాయల స్వల్పజీతములతోనో ప్రజాహితముకొఱకు పడజాలనిపాట్లు పడుచుండ కాంగ్రెసువారు 'కత్తులను నూఱుచున్నారు'–జయిళ్ళలో–అని చాటుచుండిరి. క్రిందికోర్టు మేజిస్ట్రేటులు మాకు పెద్దపెద్ద శిక్షలను విధించుటకాక తా మట్లు చేయుసందర్భంలో మా కుపన్యాసముల నిచ్చెడివారు. ఒకొక్కప్పుడు కాంగ్రెసును, దానికి సంబంధించిన వ్యక్తులను దూషించెడివారు. సర్. సామ్యూల్ హోరు కూడ, తన యత్యున్నత భారతదేశకార్యదర్శిపదవియొక్క చలింపని యౌన్నత్యమునుండి 'కుక్కలు మొఱగుచున్నను మా రథము సాగుచునే యున్నది' యని ప్రకటించెను. అతడా నిమిషమున కుక్కలు జయిలులోనున్నవనియు, నవి యచ్చట సులభముగా మొఱగజాలవనియు, బయటనున్నవాని మూతులు గట్టిగా బిగింపబడెననియు మఱచిపోయెను.

అన్నిటికంటె చిత్రమేమన కాన్పూరులో జరిగిన కులకలహములు కాంగ్రెసువలననే జరిగినవనిరి. భయంకరమైన యీ కలహములలోని భయోత్పాతమంతయు వెల్లడిచేయబడి కాంగ్రెసు దీని

కంతకు బాధ్యురాలని పదేపదే చెప్పబడెను. యదార్థమునకు కాంగ్రెసొక్కటే ఈ సందర్భములో యోగ్యముగా ప్రవర్తించెను. తన యుత్తమోత్తమపుత్రులలో నొకని నామె ఇందులో బలియొనర్చెను. కాన్పూరులోని ప్రతిసంఘము, కులము నతనికొఱకు పరితపించెను. ఈ కలహమునుగురించి వినుటతోడనే కరాచీకాంగ్రెసు సభ యొక విచారణ కమిటీని నియమించెను. ఈ కమిటీ సమగ్రవిచారణ సలిపెను. అనేక నెలలు కష్టించి పనిచేసినతరువాత నదియొక పెద్దనివేదికను ప్రకటించెను. ప్రభుత్వము దీనిని తోడనే నిషేధించెను. అచ్చుప్రతులుపట్టుకొనబడి తగులబెట్టబడెను. ఒక పరిశోధనయొక్క ఫలితములనణచివేయుటకు చేయబడిన యీ ప్రయత్నము అధికారవిమర్శకులును, బ్రిటిషు యాజమాన్యముక్రిందనున్న పత్రికలును కాంగ్రెసువలననే యీ కలహములు కలిగెనని మాటిమాటికి చేయు నిందలను వారింపనయ్యెను. నిశ్చయముగ నీ విషయములోను, యితరవిషయములలోనుతుదకు నిజమేజయింపగలదు. కాని యొక్కొక్కప్పుడసత్యము చిరకాలము జీవించును. 'అసత్యముచేయవలసిన పనినంతయు చేసినతరువాత నశించును. సత్యము అమోఘమైనది. గొప్పది. అది జయించును. దాని జయాపజయములకొఱ కెవడును చూడనినా డది జయించును.'

హిందూదేశములో బ్రిటిషుయాజమాన్యమున నున్న ఆంగ్లో యిండియను వార్తాపత్రికలుకూడ నీహులంకారువేటలో నత్యుత్సాహముతోచేరియవిచాలకాలమునుండిదోహదముచేసుకొనుచు, రహస్యముగనణచియుంచుకొనిన, యనేకభావములను వెల్లడించెను. మామూలుగ నవి యేదేని చెప్పినపుడు కొంచెము జాగ్రత్తగ చెప్పవలెను. ఏలనన వాటిపాఠకులలో చాలమంది భారతీయులు కలరు. కాని హిందూదేశములోని విషమస్థితి యీ నిగ్రహములన్నింటిని తుడిచిపెట్టి యందరిహృదయములను బహిర్గత మొనరించెను. భారతదేశములో ఆంగ్లోయిండియను పత్రికలు చాల తక్కువ; ఒకటి తరువాత నొకటిగ నవి పడిపోయెను. మిగిలినవాటిలో చాలపత్రికలు, అవి యిచ్చువార్తలలోనేమి, సాధారణ రూపలావణ్యములలోనేమి

యుత్తమ జాతికి చెందిన పత్రికలు, ప్రపంచవ్యవహారములనుగురించిన వాటిప్రధానవ్యాసములెప్పుడును కన్నకోటిపు దృష్టిలోనేయున్నను, సమర్థములై, జ్ఞానమును గ్రహణశక్తిని వెల్లడిచేయును. నిస్సందేహముగ వార్తాపత్రికల దృష్టిలో నవి భారతదేశములో నత్యుత్తమమైనవి. కాని భారతదేశ రాజకీయ సమస్యలలో నవి యకస్మాత్తుగ పడిపోవును. వాటి నవి మూర్ఖ్యకరముగు పక్షపాతబుద్ధితో మారును: ఒక్కొకసమయములలో నిష్పక్షపాతబుద్ధి తఱచు పిచ్చిక్రిందను, తిట్లక్రిందను మారిపోవును. అవి భారతప్రభుత్వమున కతి విశ్వాసముగ ప్రాతినిధ్యమువహించెను. ప్రభుత్వముకొఱకవిచేయు నిరంతరప్రచారము పిలువని పేరంటమువలె నుండును.

ఈ కొద్ది ఆంగ్లోయిండియను వార్తాపత్రికలతో పోల్చిచూచినచో భారతవార్తాపత్రికలు సాధారణముగ పేలవములు. వాటికి తగినంత ద్రవ్యముండదు. వాటియజమానులకు వానినభివృద్ధి చేయవలెననెడిబుద్ధి. యత్నము వుండదు. వాటినిత్యజీవితమే కష్టతరము. దురదృష్టవంతులగు సంపాదకీయశాఖకు శాంతియుండదు. వాటియందచందములుగూడదరిద్రముగనే యుండును. తఱచు వాటిలో చేయబడు యడ్వర్టైజుమెంటులుచాలనిషిద్ధముగనుండును. జీవితములపట్ల రాజకీయములపట్ల వాటిసాధారణదృష్టి భావోద్రేకముగ, వెర్రిగనుండును. మనము భావోద్రేకముగల జాతియగుటయే దీనికి కొంత కారణమని నేననుకొనెదను. మనము వ్రాయుభాష (ఇంగ్లీషు వార్తాపత్రికల సంగతి) విదేశభాషయగుటచే సరళముగ శక్తివంతముగా వ్రాయుట సులభముకాదు. కాని యదార్థకారణ మేమన చిరదాస్యముచేతను, నిర్బంధములచేతను మన మనేక నిమ్నోన్నతభావములచే బాధపడుచున్నారము. కనుక నేమాత్రము సావకాశము చిక్కినను భావోద్రేకము పొర్లుచుండును.

భారతీయుల యాజమాన్యములోనున్న యింగ్లీషు వార్తాపత్రికలలో హిందూపత్రిక బహుశః నన్నింటికంటె నుత్తమమైనది. అది నాకెప్పుడు మర్యాదకు నౌచిత్యములకు మూర్తియగు వృద్ధకన్యకను జ్ఞప్తికి తెచ్చును. ఆమెయెదుట నెవరైన నొక్క కఠినపదము నుప

యోగించుచో నది యూమెకు వజ్రపాతమువలె నుండును. అది ముఖ్యముగా బూర్జువాజాతికి చెందిన పత్రిక. దానిజీవితము సుస్థిరమయ్యెను. జీవితములోని దుఃఖమయయనుభవము, జీవితపోరాటము కష్టపరంపరలు దానికేమియు లేవు. మితవాదదృష్టికల యనేక యితర పత్రికలకును 'యీావృద్ధకన్యా' ప్రమాణముకలదు. అవి హిందూ పత్రికకున్న యాధిక్యతలేకుండ దానిని సాధించును. తత్ఫలితముగ నవి యన్నివిధముల చాల చప్పగనుండును.

ప్రభుత్వమువారు చాలకాలముక్రింద నే తమపిడికిలిని సిద్ధము చేసికొనియుంచిరి. వారుగుక్క త్రిప్పుకొనుటకు వీలులేనట్లు వారిముష్టి నుపయోగింపగోరిరి. 1930 లో నది యెల్లప్పుడు క్రొత్తఆర్డినెన్సుల ద్వారా యంతకంత కధ్వాన్నమగుచుండినస్థితినరికట్టుటకుయత్నించు చుండెను. అప్పుడు కాంగ్రెసే ముందుకురుకుచుండెను. 1932 పద్ధతులన్నియు వేరు. ప్రభుత్వమే కార్యరంగమునకు దిగెను. అఖిలభారత దేశమునకు, రాష్ట్రములకు చెందిన ఆర్డినెన్సుల గుదిక్రింద యూహింపదగిన ప్రతిఅధికారము ప్రసాదింపబడెను; తీసుకొనబడెను. సంస్థలు అక్రమసంస్థలుగ ప్రకటింపబడెను. భవనములు, ఆస్తులు, మోటారులు బ్యాంకిఅకౌంటులుపట్టుకొనబడెను. బహిరంగసభలు, ఉత్సవములు నిషేధింపబడెను. వార్తాపత్రికలు, ముద్రణాలయములు పూర్తిగా అదుపులో నుంచబడెను. 1930 లో వలెగాక గాంధీజీ యిప్పుడుశాసనోల్లంఘనమును తప్పించవలెననియే నిశ్చయముగ వాంఛించుచుండెను. వర్కింగుకమిటీ సభ్యులు చాలమంది యట్లే భావించుచుండిరి. వారిలో కొందరు, నాతోసహా, మాకెంత యిష్టము లేకపోయినను; పోరాటము తప్పదనియు, కనుకదానికి సిద్ధపడవలెననియు భావించితిమి. యు. పి. లోను సరిహద్దురాష్ట్రములోను యుద్రేకము హెచ్చుచుండుటచే ప్రజాహృదయము రానున్న పోరాటముపైకి మఱలెను. కాని మొత్తముమీద మధ్యతరగతులవారు, విద్యార్థులు పోరాటమునుగురించి యోచించుటలేదు. గాంధీజీ వచ్చుటతోడనే యేదోవిధముగ నీ పోరాటము తప్పింపబడునని వారాశించిరి. వారి కోరికయే వారి కాభావములను కలిగించెను.

ఈవిధముగ 1932 లో ప్రభుత్వమే పోరాటము ప్రారంభము చేసెను. కాంగ్రెసు యెప్పుడు నాత్మరక్షణ చేసికొనుచుండెను. చాలచోట్ల స్థానిక కాంగ్రెసునాయకులు ఆర్డినెన్సులను, శాసనోల్లంఘనము తెచ్చిపెట్టిన శిక్షపరిణామములచే ముట్టడింపబడినట్లయిరి. అయినప్పటికి కాంగ్రెసుపిలుపున కద్భుతమగు సమాధానమువచ్చెను. శాసనోల్లంఘనము చేయువారికి కొఱతయే లేకుండెను. నిశ్చయముగ 1932 లో బ్రిటిషు ప్రభుత్వముతో చేసిన శాసనోల్లంఘనము 1930 లో చేసిన దానికంటె గొప్పది యనుట కెట్టిసందేహము లేదని నేను భావించెదను. 1932 లో, ప్రజలెక్కువ సహనము జూపినను, నారత్యంత శాంతముగనున్నను ప్రారంభములో కలిగిన ప్రబోధ వేగము 1930 కంటె చాలతక్కువగ నుండెను. నేమయిష్టముగ యుద్ధములోనికి దిగినట్లుండెను. 1930 లో నొకవిధమగు కీర్తియుండెను. రెండేండ్లయిన తరువాత నది కొంచెము సన్నగిలెను. ప్రభుత్వము తనకున్న సర్వశక్తులతో కాంగ్రెసుపై బడెను. భారతదేశము కొంచెమించుమించు సైనికశాసనముక్రింద జీవించెను. కాంగ్రెసుకు నిజముగా నేకార్యముచేయుటకు స్వేచ్ఛ, పట్టుదొరకనే లేదు. మొట్టమొదటిదెబ్బలే దానిని దానికిప్రధానపోషకులుగనున్న బూర్జువాజాతియభిమానులను నిశ్చేష్టులను చేసెను. వారి బొక్కసములకు దెబ్బతగిలెను. శాసనోల్లంఘనములో జేరినవారు దాని కెట్టిసహాయము చేసినవారు, స్వేచ్ఛను వారియావదాస్తిని పోగొట్టుకొనుట తథ్యమయ్యెను. యు. పి. లో నిది మాకంత బాధకరముగ కాన్పించలేదు. అచ్చట కాంగ్రెసు బీదవాని కాంగ్రెసు. కాని బొంబాయి మొదలగు మహాపట్టణములో నిది చాలవ్యత్యాసమును కలిగించెను. వర్తకజాతి కిది పూర్తియైన వినాశము. వృత్తులలోనున్నవారికి గొప్పదెబ్బ. కేవల మీ భయమే పట్టణములలో నున్న యాధునికతరగతులవారిని స్తంభింపజేయుచుండెను. రాజకీయ సంబంధములేని యొక ధనవంతుడైన పిరికివర్తకుని సంగతి తరువాత వింటిని. దీర్ఘకాలశిక్ష, ఐదులక్షలరూపాయిల జుల్మానా విధించెదమని పోలీసువారతనిని భయపెట్టిరి. అట్టి జడిపింపులు చాలసామాన్య

మయ్యెను. అవి కేవలము శుష్కవాక్యములుగావు. ఏలనన పోలీసు లప్పుడు సర్వాధికారులు. జడిపింపులు కార్యరూపమునుదాల్చు సాదృశ్యములు, నిత్యము సంభవించుచునేయుండును.

ప్రభుత్వపద్ధతి కభ్యంతరము చెప్పుటకు ప్రతికాంగ్రెసువానికి హక్కుగలదని నేను భావించను. కాని యత్యంత దౌర్జన్యరహితమైన యుద్యమముపై ప్రభుత్వము ప్రయోగించిన దౌర్జన్యము, జబరదస్తీ క్రియలు నెట్టి నాగరికప్రమాణమునుబట్టి చూచినను నిశ్చయముగ దూష్యములేయగును. మనము విప్లవచర్యకు గడంగినపు డది యెంత దౌర్జన్యరహితమైనను ప్రతీకారముండి తీరును. మనము పడకటిండ్లలో కూర్చొని విప్లవము కలుగచేయజాలము. కాని చాలమంది యుభయలాభములను కావలెనందురు. విప్లవపద్ధతులలో దిగదలచుకొనువారు తమసమస్తము పోగొట్టుకొనుటకు సిద్ధపడవలెను. కనుక ధనవంతులు, నైశ్వర్యవంతులు చాల యరుదుగ విప్లవకారులగుదురు.

మోటారులు, బ్యాంకింగు అక్కౌంటులు, పట్టుకొనుటకు తగినయితరఆస్తులు లేని ప్రజలసందర్భములో నితరపద్ధతుల నవలంబించవలసియుండెను. పోరాటముయొక్క నిజభారమంతయు వీరి మీదనే కలదు. ప్రభుత్వమువారు అన్నివిధములగు క్రూరపద్ధతుల నవలంబించుటవలన కలిగిన ప్రయోజనకరమైన యొకఫలితమేమనిన 'గవర్నమెంటేరియనులు' అని పిలువబడు జాతివారు వీటివలన కార్యమునకు పురికొల్పబడిరి. వారిలో కొంతమంది నూతనముగ కాంగ్రెసుతో స్నేహముచేసికొన నారంభించిరి. పాపము భవిష్యత్తును వారు గుర్తింపజాలకపోయిరి. కాని ప్రభుత్వము దీనిని సహింపజాలకపోయెను. వారికి తాటస్థ్య రాజభక్తి చాలకుండెను. 1857 నాటి మ్యూటినీని గురించివ్రాసిన ఫ్రెడరిక్ కూపరు చెప్పినట్లు ప్రభుత్వమువారు "పరిపూర్ణ కార్యరూపమును దాల్చిన, చురుకైన రాజభక్తికి పీసమంత తక్కువకూడ సహింపజాలరు. ప్రభుత్వము తన ప్రజల నైతికబలముమీద జీవించునట్టి యమర్యాదకార్యము కొడిగట్టజాలదు." ఒక వత్సరముక్రితము లాయడ్జార్జి జాతీయప్రభుత్వ

ముతో కలిసిన తన ప్రాతసహోద్యోగులైన బ్రిటిషులిబరలుపార్టీ నాయకులనుగురించి "తనవాతావరణమునకనుసరిపడురంగులనుధరించు మార్పుచెందు జంతువుల నమూనా" యని వర్ణించెను. భారతదేశములోని క్రొత్త వాతావరణము తాటస్థ్యమును సహింపజాలదు. కనుక మనదేశస్థులు కొంతమంది ప్రకాశమానమైన రంగులను ధరించి, గీతవాయిద్యములతోను, విందులతోను తమ రాజభక్తిని విన్నవించుకొనిరి. ఆర్డినెన్సులవలనను, అసంఖ్యాకములగు నిషేధములవలనను రాత్రి, సాయంకాలశాసనములవలనను నేటివలెను వారికి భయపడ వలసిన యగత్యములేదు. ఏలనన నిరపాయంతము రాజద్రోహులకు నవిధేయులకు వర్తించును. రాజభక్తిగలవారికెట్టి భయకారణములేదని యధికారులే ప్రకటింపలేదా? కనుక వారు తమ చుట్టుపట్లనున్న సంగ్రామమును, కష్టములను నెమ్మదిప్రశాంతచిత్తముతో వీక్షింప వచ్చును. 'ఏలనన నాకు భయకారణముండి నేను ముక్తినందితిని. నేనే యిష్టపడుచున్నప్పుడు బలాత్కారమెందులకు?' అను ప్రేమ గాథను వీరంగీకరించిరి.

కాంగ్రెసు యీ సంగ్రామములో జయిళ్ళను స్త్రీలతో నింపి వారినెక్కువగా తన స్వార్థముకొఱకు వినియోగింప చూచుచున్న దనుభావమెట్లో ప్రభుత్వమువారి తలకెక్కెను. స్త్రీలను మర్యాదగా చూతురనియు, వారికి తేలికశిక్షలు విధింతురనియు నది యూహించెనట! అది కేవలము వెర్రియూహ. తమ స్త్రీలను వెర్రిగా జయిలులోనికి త్రోయగోరువారెవరుందురు? సామాన్యముగ బాలికలు, స్త్రీలు తమతండ్రులు సోదరులు, భర్తలయొక్కయు ప్రేరణ లేకుండగనే తమంతతాము పనిచేసిరి. అధమము వారి హృదయపూర్వకమైన తోడ్పాటు వారికుండియుండును. కాని ప్రభుత్వము వారు దీర్ఘశిక్షలతోను, జయిళ్ళలో నమర్యాదగ చూచుటచేతను స్త్రీలను నిరుత్సాహపరుపనిశ్చయించిరి నా చెల్లెండ్రు శిక్షింపబడుట తోడనే కొంతమంది బాలికలు వారు చేయగల కార్యమునుగురించి చర్చించుట కలహాబాదులో సమావేశమైరి! వారికెట్టి యనుభవము లేదు. వారత్యుత్సాహముగనుండి, సలహాకొఱకు చూచుచుండిరి.

వారొకయింట సమావేశమగుచుండ నిర్బంధింపబడి యొక్కొక్కరు రెండేసివత్సరములు కఠిననరకములబడసిరి. ఇదియొకచిన్నవిషయము. ఇట్టివి భారతదేశమంతట ప్రతిదినము జరుగుచునేయుండెను. శిక్షింపబడిన బాలికలు, స్త్రీలు చాలమంది జయిళ్ళలో ననేకబాధ లనుభవించిరి. వారు పురుషులకంటె నెక్కువ బాధలనే యనుభవించిరి. నేను బాధకరములగు ననేక విషయములను గురించి వింటిని. కాని బొంబాయి జయిలులో నితర శాసనోల్లంఘన ఖయిదీలతోపాటు తా ననుభవించిన యనుభవములనుగురించి మీరాబాయి తెలిపిన కథన మతిదారుణముగ నుండెను.

యు. పి లో మా పోరాటము గ్రామములలో కేంద్రీకరింపబడెను. కాంగ్రెసువలన కలిగిన నిరంతర యొత్తిడివలన యెక్కువ రిమిషనులను, అవి చాలవని మేము భావించినను, వాగ్దానముచేసిరి. మా నిర్బంధములు జరుగుటతోడనే యధిక రిమిషనులను ప్రకటించిరి. ఈ ప్రకటన ముందుగా చేయబడకపోవుటొక వింత. దానివలన పరిస్థితులలో చాల వ్యత్యాసముకలిగెడిది. అనాలోచితముగ మేము వాటినితిరస్కరించుటచాలకష్టమయ్యెడిది. కాని యీ రిమిషనులకీర్తి కాంగ్రెసుకు దక్కకూడదని ప్రభుత్వమువా రాతురపడుచుండిరి. కనుక వారొకవంక కాంగ్రెసును పొడుముచేసి వ్యవసాయదారులను శాంతపరచుటకు సాధ్యమైనంత యెక్కువ రిమిషను యివ్వగోరిరి. కాంగ్రెసు వత్తిడి యెచ్చట హెచ్చుగనుండెనో యచ్చట నెక్కువ రిమిషనులు ముట్టెనను విషయము గమనింపదగియున్నది.

ఈ రిమిషనులు వ్యావసాయికసమస్యలను పరిష్కరించలేదు. కానియవి పరిస్థితులనెక్కువసులభముచేసెను. అవి వ్యవసాయదారుల ప్రతిఘటనలోనున్న తీవ్రతను తగ్గించెను. మా పెద్ద పోరాటమును సంబంధించినంతవరకవి ముఖ్యసమయమున దుర్బలపరచెను. ఆపోరాటము యు. పి. లో వేలకొలది వ్యవసాయదారుల కనేకబాధలను కలిగించెను. చాలమంది దానివలన పూర్తిగధ్వంసమైపోయిరి. కాని యీ పోరాటముయొక్క యొత్తిడివలననే లక్షలకొలది రైతులకు వర్తమానపద్ధతిలో రాబట్టుటకు వీలైనంత హెచ్చురిమిషను సంపా

దింపబడి వారి యనేకవిధములగు బాధలనుండి రక్షించెను. తాత్కాలికముగ సంభవించు యీ కొద్దిలాభములు వ్యవసాయదారుల కంత ఘనమైనవి కాకపోయినను, ఆ కొద్దియైనను వ్యవసాయదారుల పక్షమున యు. పి. కాంగ్రెసుకమిటీ చేసిన నిరంతర యత్నముల వలననే సమకూరెననుట కెట్టి సందేహము లేదు. వ్యవసాయదారులు తాత్కాలికముగ లబ్ధిపొందిరి. కాని వారిలో నత్యంతధైర్యవంతులైన వారు మా సంగ్రామములో నశించిపోయిరి. 1931 డిసెంబరులో ప్రత్యేక యు. పి. ఆర్డినెన్సు ప్రకటింపబడినపుడు దాని యావశ్యకతను బోధపరచు నొక స్టేటుమెంటుకూడ వెలువడెను. ఈ స్టేటుమెంటులోను యితర ఆర్డినెన్సులతో వెలువడిన తదితర స్టేటుమెంటులలోను ప్రచారముకొరకు నుద్దేశింపబడిన అనేక యసత్యములు కలవు. అవి యంతయును వారి ప్రారంభ అహంకారములలో నొకభాగము. వాటికి సమాధానమిచ్చుటకు వాటిలోనున్న ఘోర తప్పిదములను ఖండించుటకు మాకవకాశములేదు. మొర్యానిపయి నొకయసత్యము నంటగట్టుటకు చేయబడిన యత్నము నతడు జయిలుకు పోవులోపల సవరించెను. ఈ స్టేటుమెంటులు, ప్రభుత్వసమాధానములు చదువుటకు వినోదముగనుండును. అవి ప్రభుత్వ మెంత గడగడలాడెనో, దాసిబల మెంత క్షీణించెనో విశదముచేసెను. స్పెయినుదేశపు రాజయిన మూడవఛార్లెస్ తన రాజ్యమునుండి జెసూటులను వెడలనంపినపుడు ప్రకటించిన డిక్రీని నేనొకనాడు చదువుచుండగా బ్రిటిషుప్రభుత్వము హిందూదేశములో నమలుపరచిన డిక్రీలు, ఆర్డినెన్సులు, వాటి యావశ్యకతనుగురించి చెప్పబడిన కారణములు నా కమాంతముగా జ్ఞప్తికి వచ్చెను. 1767 ఫిబ్రవరిలో నిచ్చిన యీ డిక్రీలో రాజు తన చర్యకు "నా ప్రజలలో వినయవిధేయతలను, శాంతిని, న్యాయమును నిర్వహింపవలసిన నాధర్మముకుసంబంధించిన యత్యంత గంభీర కారణములు. నేను నా సార్వభౌమహృదయాంతరాళములో నిగూఢముగా దాచిపెట్టుకొనిన ముఖ్యములు, యుక్తములు నవసరములు నవసరమగు నితర కారణములు"గలవని సమర్థించెను.

కనుక ఆర్డినెన్సులకుగల యదార్థకారణములు వైస్రాయి హృదయకుహరములోనో లేక వారి మంత్రివర్గ సామ్రాజ్యపరముగు హృదయసీమలోనో తాళము వేయబడియుండెను. కాని యవి స్పష్టములే. అధికార కారణములు బ్రిటిషుప్రభుత్వము హిందూదేశములో పూర్ణముచేయు ప్రచారముయొక్క నూతన సాంప్రదాయము నర్థముచేసికొనుటకు తోడ్పడుచున్నవి. అనేకయసత్యములతో నిండిన యర్థప్రభుత్వ కరపత్రములు గ్రామములలో, విరివిగా పంచిపెట్టబడినట్లు మేము వింటిమి. వాటిలో కాంగ్రెసు వ్యవసాయవస్తువుల ధరలను పడగొట్టెననియు కనుక వ్యవసాయదారుల కన్నికష్టములను తెచ్చిపెట్టెననియు నొక సూచనచేయబడెను. ప్రపంచఆర్థికమాంద్యమును తేగలిగిన కాంగ్రెసుయొక్క శక్తికింతకంటె వేరుపొగడ్త యేమియు నవసరములేదు? కాని యీ యసత్యముదీనివలన కాంగ్రెసు గౌరవము నశించునను నాశతో విఘ్నవిరామములేకుండ వ్యాప్తిచేయబడుచుండెను.

దీనినంతను లక్ష్యముచేయక యు.పి. లో కొన్ని ప్రధానజిల్లాలలోని వ్యవసాయదారులు శాసనోల్లంఘన శంఖారావమును వినుటతోడనేదానిననుగమించిరి. అది1930యుద్యమమునుమించి యెక్కువ శిక్షణగలది. ప్రథమములో నిందు మంచిహాస్యరసముకూడ నుండెను. మే మొక వింతకథవింటిమి. రై బెరిల్లీజిల్లాలో బలియా యనుగ్రామమును పోలీసుపార్టీ యొకటిసందర్శించెను. పన్ను చెల్లింపనందులకువారు సామానులను జప్తుచేయుటకు వెళ్ళిరి. ఆగ్రామము కొంతయైశ్వర్యవంతమయినది. ఆగ్రామవాసులు కొంతయుత్సాహముకలవారు. వారు పోలీసుయుద్యోగులను, రివిన్యూయుద్యోగులను మర్యాదతో సత్కరించి యిండ్లతలుపులను తెఱచి యుంచి యుద్యోగులను వారియిష్టము వచ్చిన చోటుకు వెళ్ళవలసినదని యాహ్వానించిరి. పశువులు మొదలగునవి కొన్ని జప్తుచేయబడెను. తరువాత గ్రామస్తులు రివిన్యూయుద్యోగులకు,పోలీసుయుద్యోగులకుతమలపాలకులు, వక్కలుయిచ్చి తాంబూల చర్వణము చేయుమనిరి. వారుసిగ్గుపడి చిన్నబుచ్చుకొని

వెడలిపోయిరి. కాని యిది యొక యసాధారణచర్య. త్వరలోనే హాస్యము, ధర్మము, దయాదాక్షిణ్యములు నశించెను. పాప మా బదులియా గ్రామవాసుల హాస్యము వారియుత్సాహమునకు శిక్ష ననుభవింపకుండ చేయజాలదయ్యెను!

ఈ జిల్లాలలో చాల నెలలవరకు వ్యవసాయదారులు పన్నులు చెల్లింపలేదు. బహుశః వేసవి ప్రారంభమునుండిమాత్రమే వసూళ్లు క్వచితుగా వచ్చుచుండెను. అనేకమంది యరెస్టుకావింపబడిరి. కాని యిది ప్రభుత్వనీతికి భిన్నముగ జరిగెను. సాధారణముగ నరెస్టులు గ్రామనాయకులకు ప్రత్యేకవర్కరులకు భద్రపరచి తక్కినవారిని చావగొట్టిరి. ఖయిదుకంటె, కాల్చుటకంటె తన్నుటయే ఘనమైనదని గ్రహించి యవసరమైనప్పుడెల్ల దానిని ప్రయోగించిరి. మారుమూలలోనున్న గ్రామములలో జరుగుటచేత నవి పయిమానవుల కంటబడవు. అది యంతువంతు లేకుండ పెరిగిపోవు ఖయిదీల సంఖ్య తగ్గించును. జప్తులు, ఆస్తినమ్ముట, పశువుల నమ్ముట, భూమినుండి వెడలగొట్టుట మొదలగునవి జరిగెను. తమకున్న కొద్దియాస్తిలాగుకొని స్వల్పధరల కమ్మివేయుచుండ వ్యవసాయదారులు దారుణమగు బాధతో చూచుచు నూరకుండెడివారు.

దేశమంతట పట్టుకొనబడిన యసంఖ్యాకములగు భవనముల వలెనే స్వరాజ్యభవనముకూడ తీసికొనబడి యందలి కాంగ్రెసుఆస్పత్రికి చెందు విలువైనవస్తువులు, పరికరములుకూడ పట్టుకొనబడెను. కొద్దిరోజులవరకు ఆస్పత్రి పూర్తిగ పనిచేయుటయే మానివేసెను. కాని తరువాత దగ్గరనున్న యొక పార్కులో నారుబయట నొక డిస్పెన్సరీ పెట్టబడెను. తరువాత నీ ఆస్పత్రి లేక డిస్పెన్సరీ స్వరాజ్యభవనమునకు చేరియున్న యొక చిన్నయింటిలోనికి మార్చబడి యచ్చట సుమారు రెండున్నరసంవత్సరములు పనిచేసెను.

నేను చాలహెచ్చుగనున్న రాబడిపన్ను చెల్లింప నిరాకరించుటచే మా నివాసమగు ఆనందభవనమును ప్రభుత్వమువారు తీసికొనెదరను వదంతులు బయలుదేరెను. ఈ పన్ను తండ్రిగారి యాదాయముమీద 1930లో విధింపబడెను. శాసనోల్లంఘనముందు

టచే నతడా వత్సర మాపన్ను చెల్లింపలేదు. 1931 లో ఢిల్లీ సంధి
యైన తరువాత దానినిగురించి రాబడిపన్ను విధించు అధికారులతో
నేను కొంత వాదముచేసితిని. కాని చివరకు నేను చెల్లించుటకంగీక
రించి యొక వాయిదా చెల్లించితిని. అప్పుడే ఆర్డినెన్సులు వచ్చుటచే
నే నిక చెల్లింపరాదని నిశ్చయించుకొంటిని. పన్నులు, శిస్తు
యీయవలదని వ్యవసాయదారులకు బోధించుచు నేనే రాబడిపన్ను
చెల్లించుట కేవలము తప్పు,నీతిబాహ్యము. కనుక ప్రభుత్వమువారు
మా యింటిని జప్తుచేయుదురనియే నే ననుకొంటిని. కాని దీనివలన
మా తల్లియింటినుండి వెడలగొట్టబడును. కనుక నాకీతలంపు చాల
వెగటుగ నుండెను. వ్యక్తిగతముగ నే మెంతయో ప్రేమించు
యమూల్యములగు పుస్తకములు, పత్రములు వస్తువులు, పశువులు,
ఇంక ననేకవస్తువులు యితరుల చేతులలోపడి నష్టమైపోవును. మన
జాతీయజెండా లాగివేయబడి దానిచోట యూనియన్‌జాక్ యెత్త
బడును. కాని యీసమయమున నే యిల్లుపోవుట యనుభావముకూడ
నన్నాకర్షించెను. ఆస్తులన్నియు లాగివేయబడుచున్న వ్యవసాయ
దారుల కిది నన్ను చేరికచేసి, వారి కుత్సాహము కలిగించును. మా
యుద్యమదృష్టిలో చూచినచో నిది నిశ్చయముగ జరుగవలసిన
విషయమే. కాని ప్రభుత్వమువా రన్యథా తలంచి మాయింటినిముట్టు
కొనలేదు. బహుశః మా తల్లి యెడలదయచేతను, శాసనోల్లంఘనోద్య
మమున కది మరింత ప్రోత్సాహమునిచ్చునను యోచనచేతను వారట్లు
చేసియుండవచ్చును. చాల నెలలయినతర్వాత నా రైల్వేవాటాలు
కొన్ని రాబడిపన్ను చెల్లింపనందులకుజప్తుచేయబడెను. మోటారులు
జప్తుచేయబడి యమ్మివేయబడెను.

ఈ ప్రారంభమాసములలోని యొకలక్షణము నన్నెక్కువగ
బాధించెను. అనేక మునిసిపాలిటీలు, పబ్లికుసంస్థలు ముఖ్యముగా
కాంగ్రెసు మెజారిటీకలదని చెప్పబడినకలకత్తా కార్పొరేషనే జాతీయ
జెండాలను లాగివేసెను. జెండాలను లాగివేయనిచో తీవ్రచర్య తీసి
కొనెదమని పోలీసువారు, ప్రభుత్వమువారు భయపెట్టుటచే నవి తీసి
వేయబడెను. ఈ చర్య మునిసిపాలిటీని రద్దుచేయుట లేక దాని సభ్యు

లను రక్షించుటకైయుండెడిది స్వప్రయోజనములతో గూడుకొనిన సంస్థలు సహజముగ పిరికివి. ఒహాయోకు విధిలేక వారట్లు చేసిరి. అయినను అది నన్ను బాధించెను. జెండా మన మెక్కువగా ప్రేమించుదాని కొక చిహ్నము. దానినీడను నిలిచి దానిగౌరవమును రక్షించెదమని మన మనేకప్రమాణములను చేసితిమి. దానిని మన చేతులతోనే లాగివేయుట లేదా మనయాజ్ఞలప్రకారము లాగివేయించుట ప్రతిజ్ఞాభంగమే. పాతకమువలెకూడ కాన్పించెను. అది మన యాత్మనుచంపుకొనుట, సత్యమును నాశన మొనర్చుటయగును. బలీయమైన పశుశక్తిముందర యసత్యమును ధృవపరచుట. ఈ విధముగ లొంగిపోయినవారు జాతీయనీతిని భంగపరచిరి, దాని యాత్మగౌరవమునకు హానికలిగించిరి.

వారు పిరికివలె ప్రవర్తించి యగ్నిహోత్రములోని కుఱుకవలె ననికాదు. ముందుకుదుముకలేదని ఖయిదుకురాలేదని యితరనష్టములను బాధలను పొందలేదని దూషించుట తప్పు, మూర్ఖము. ప్రతివాడు ననేకధర్మములను బాధ్యతలను నిర్వహింపవలసి యున్నాడు. అతనిమీద న్యాయవిమర్శచేయుట కితరుని కెవనికి హక్కులేదు. వెనుక కూర్చొనుట లేక వెనుకనుండిపనిచేయుట వేరు. సత్యమును లేక తాను సత్యమనుకొనుదానిని నిరసించుట గర్హ్యమైన విషయము. జాతీయ ప్రయోజనములకు వ్యతిరేకముగ దేనినైన చేయవలసివచ్చినచో మునిసిపల్ సభ్యులు తమస్థానములకు రాజీనామా యివ్వవచ్చును. కాని సాధారణముగ వారాస్థానములవిడుటకిష్టపడరు. "తేనెటీగలు పుష్పములపై వ్రాలుటతోడనే ఝుంకారములను కట్టిపెట్టును. పదవుల నాక్రమించుటతోడనే విగ్గులు మూకీభావము వహింతురు.

అసహాయుడై విషమపరిస్థితులలోనున్నవాని ప్రవర్తనను విమర్శించుటన్యాయముకాదు. ప్రపంచయుద్ధ మనేకసార్లు విశదముచేసినట్లొక్కొక్కప్పుడత్యంతధైర్యశాలిధైర్యముకూడ చెదరిపోవును. అంతకు పూర్వము 1912లో టిటానికు నోడ మునిగిపోయిన సందర్భములో నతిప్రతిభావంతులైనవారు, పిరికివారనదగనివారు, నావికులకు లంచమిచ్చి యాత్మరక్షణము చేసికొనిరి. ఈమధ్య మోరోకోటలతగులపడి

నపుడు సిగ్గుకరమగు విషయములు బయల్పడెను. హేతువును, నిగ్రహశక్తిని నాశముచేయు జంతుస్వభావములుండు సంకటావస్థలో నెట్లు ప్రవర్తింపనో యెవడును చెప్పజాలడు. కనుక మనము దూషింపరాదు.

అనగా ఋజుప్రవర్తనమునుండి జారిపోవుటను గుర్తింపరాదని యర్థముకాదు. అత్యవసరసమయములలో వణకు వంధ్యాజీవులపై జాతీయ నౌకానిర్వాహణ నికముందు పెట్టమని యర్థముకాదు. ఇట్టి ధర్మచ్యుతిని సమర్థించు యత్నమును యుక్తమని పిలుచుట మరింత యక్రమము. నిశ్చయముగా నిది యీధర్మచ్యుతికంటెగూడ గొప్పనేరము.

విశుద్ధశక్తుల మధ్యజరుగుపోరాటము నీతిమీద ధైర్యస్థైర్యముల మీద నాధారపడియుండును. అత్యంత రక్తసిక్తమగు యుద్ధముకూడ వీనిమీదనే యాధారపడును. "తుది రంగములో యుద్ధములు ధైర్యస్థైర్యములచేతనే గెలుపొందుచుండును." అని మార్షల్ ఫాక్ చెప్పెను. దౌర్జన్యరహితపోరాటములో నీతి, ధైర్యస్థయిర్యములు మరింతయవసరము. ఎవడు తన ప్రవర్తనచే నట్టినీతిని భంగపరచి, జాతిస్థయిర్యమును కూలద్రోయునో వాడు యుద్యమమునకు మహాపరాధము చేసినవాడగును.

శుభాశుభవార్తలతో మాసములు గడిచిపోవుచుండెను. మేము మా మా జయిళ్ళలో పేలవములగు నిత్యకర్మల కలవడిపోతిమి. జాతీయవారము ఏప్రిల్ 6 లగాయితు 13 వరకు వచ్చెను. ఇది యనేక యసాధారణ యుదంతములను తెచ్చెనని మే మెరుగుదుము. కాని యొక యుదంతముందర నాకు తక్కినవన్నియు పేలవముగనుండెను. అలహాబాదులో నాతల్లి యొక యుత్సవములో నుండెను. పోలీసు లాయుత్సవమునాపి లాఠీచార్జి చేసిరి. ఉత్సవమాపివేయబడిన తరువాత నెవరో యామెకొక కుర్చీ తెచ్చి వేసిరి. ఆమె యుత్సవముముందర రోడ్డుమీద కుర్చీలో కూర్చొనెను. ఆమెకొరకు ప్రత్యేకముగ చూచుచున్న కొంతమంది, నాకార్యదర్శితో సహా, అరెస్టుచేయబడి తీసికొనిపోబడిరి. తరువాత పోలీసు లాఠీచార్జి ప్రారంభమయ్యెను. నాతల్లి కుర్చీలోనుండిపడగొట్టబడెను. తరువాత

విడువకుండ నా మెతలమీద బెత్తములతో మోదిరి. తలమీద తగిలిన గాయమునుండి రక్తము స్రవించెను. ఆమె స్మృతితప్పి రోడ్డు ప్రక్కన పడియుండెను. అప్పటికి రోడ్డుమీదనున్న ప్రజలు, యుత్సవములో పాల్గొనినవారు తరిమి వేయబడి రోడ్డు విజనముగ నుండెను. కొంతకాలమయినపిదప నామెను లేవనెత్తి యొకపోలీసు ఆఫీసరు తన మోటారులో ఆనందభవనమునకు చేర్చెను. నాతల్లి చనిపోయెనని యారాత్రి యలహాబాద్‌లో నొక యసత్యవదంతివ్యాపించెను. క్రోధపూరితులగు ప్రజలు సమూహములుగ జేరిరి. వారు శాంతిని, దౌర్జన్యరాహిత్యమును మరచిపోయి పోలీసులను ముట్టడించిరి. పోలీసులు తుపాకులను కాల్చిరి. కొంతమంది హతులయిరి.

ఈ యుదంతము జరిగిన కొన్ని రోజులయినతరువాత నాకీ వార్త తెలిసెను. దుర్బల శరీర, వృద్ధురాలును నైన నాతల్లి ధూళి ధూసరిత మార్గములో రక్తస్రావముతో పడియుండెనను భావము హృదయవిదారకముగ నుండెను. అచ్చటనేయున్న యెడల నేనెట్లు ప్రవర్తించెడివాడనో యని నేనాశ్చర్యపడితిని. నా దౌర్జన్యరాహిత్యమెంతవరకు నిలిచియుండెడిదో! అది కొంతవరకే నన్ను తీసికొనిపోయెడిదని నేననుకొందును. ఏలనన యాదృశ్యము పన్నెండు వత్సరములనుండియు నేర్చుకొనుటకు యత్నించిన పాఠమును మరచిపోవునట్లు చేసియుండెడిది. దానివలన నాకు నాజాతికి కలుగుఫలితములకు నే నంత లెక్కపెట్టి యుండెడివాడనుకాను.

ఆమె నెమ్మదిగా కోల్కొనెను. ఆమె మరుసటినెల రైబరెల్లీ జయిలుకు నన్ను చూచుటకువచ్చినపుడింకను తలకు కట్టు కట్టుకొనుచుండెను. కాని మా వాలంటీరు బాలురతోను, బాలికలతోను బెత్తపుదెబ్బలను, లాఠీదెబ్బలను పంచుకొనగల భాగ్యము కలిగినందుల కామె యుత్సాహ గర్వములతో నుండెను. అయినను, ఆమె స్వస్థత బాహ్యమయినదికాని యదార్థముకాదు. ఆ వయసులో నామెయనుభవించిన యా యా వేదన యామెశరీరావస్థను పూర్తిగా తారుమారుచేసి శాశ్వతకష్టములను తెచ్చిపెట్టెను. ఇవి యొక వత్సరమైన తరువాత నుపద్రవకరముగ పరిణమించెను.

43

బెరిల్లీ, ఢేరాడూను జయిళ్ళలో

నైనీజయిలులో ఆరువారములున్న తరువాత నన్ను బెరిల్లీ జిల్లా జయిలుకు మార్చిరి. తిరిగి నా యారోగ్యము కొంత చెడెను. ప్రతి రోజు నాకు జ్వరము తగులుచుండెను. బెరిల్లీలో నాలుగుమాసములు గడిపిన తరువాత, వేసవికాలపు వేండి ప్రచండతరమయినపుడు, హిమాలయపాదముదగ్గరనున్న ఢేరాడూనుజైలుకు నన్ను మార్చిరి. అచ్చట నేనుపదునాల్గుమాసముల పదిహేనురోజులు, రమారమినా రెండు సంవత్సరముల శిక్ష పూర్తియగువరకు నుంటిని. ఉత్తరములు, బంధు మిత్రదర్శనములు, వడపోయబడిన వార్తాపత్రికలమూలమున నాకు వార్తలు చేరుచుండెను. కాని బయటజరుగు దానిలో చాల వరకు నాకెంతమాత్రము తెలియకుండెను. ప్రధానయుదంతములను గురించి నా కస్పష్టభావములు మాత్రమే కలవు.

నన్ను విడిచిపెట్టినపుడు నేను స్వంత వ్యాపారములతోను, అప్పటి రాజకీయపరిస్థితులతోను తీరిక లేకయుండెడివాడను, అయిదు మాసములకు కొంచెముపయిగా స్వేచ్ఛననుభవించిన తరువాత నన్ను తిరిగి జయిలుకు తీసికొనివచ్చిరి. నే నింకను యిచ్చటనే యున్నాను. ఈవిధముగ గతమూడుసంవత్సరములలో నేను చాల భాగము జయిలులోనేయుండి బయటజరిగిన విషయములతో సంబంధము లేకయుంటిని. ఈ కాలములో జరిగినపరిస్థితులను వివరముగ తెలిసికొనుటకు నాకు సావకాశము లేకపోయెను. గాంధీజీహాజరయిన రెండవరౌండుటేబిలు సభ తెరచాటున నేమిజరిగెనో నా కింకను సరిగా తెలియదు. ఈ విషయమునుగురించి నే నతనితో మాట్లాడుటకు నా కింతవరకు సమయము దొరకలేదు.

1932, 1933 వత్సరముల జాతీయపోరాట పరిణామమును చిత్రించుటకు నా కంతగా నేమియు తెలియదు. కాని నేనారంగమును దాని వెనుకనున్న చరిత్రను, నటకులనుకూడ బాగుగ నెరుగుదును

అప్పుడు జరిగిన యనేక చిన్నవిషయములను సహజముగ నర్థముచేసి కొని పోరాటముయొక్క సాధారణగతినిగురించి తగిన భావముకలిగి యుంటిని. మొదటి నాలుగుమాసములు శాసనోల్లంఘనముతీవ్రముగ శక్తివంతముగ పనిచేసెను. తరువాత నది క్రమముగా, మధ్యమధ్య పొంగుచు, క్షీణించెను. ప్రత్యక్షచర్యతోగూడిన పోరాట మెప్పుడు విప్లవస్థాయిలోకొద్దికాలమేనిలువగలదు. అదిస్థాయిగనుండజాలదు. అది విజృంభించవలె విజృంభింపవలెను. లేదాపడిపోవలెను. మొదటి విజృంభణమైనతరువాత శాసనోల్లంఘనము నెమ్మదిగ దిగజారెను. కాని తక్కువస్థాయిలో నది ఎక్కువకాలము నిర్వహింపబడగలదు. అఖిలభారత కాంగ్రెసుసంస్థ అక్రమసంస్థగా ప్రకటింపబడినను జయప్రదముగ పనిసాగించుచునేయుండెను. అది తన రాష్ట్రివర్కరులతో సంపర్కముకలిగియుండి, యాజ్ఞలనుపంపుచు నివేదికలనందుకొనుచు, మధ్యమధ్య ధనసహాయము చేయుచుండెను.

రాష్ట్రిసంస్థలుకూడనించుమించుజయప్రదముగా నేపనిచేసెను. నేను జయిలులోనున్నవత్సరములలోనాకితరరాష్ట్రిములసంగతి తెలియదు. కాని నేను విడుదలయైన తరువాత యు. పి. రాష్ట్రిములో జరిగిన చర్యలను గురించి కొంత సమాచారము పోగుచేసితిని. యు. పి. కాంగ్రెసు ఆఫీసు 1932 సంవత్సరమంతయు క్రమముగ పనిచేసెను. అది గాంధీజీ సలహామీద నప్పటి కాంగ్రెసు ప్రెసిడెంటుచే శాసనోల్లంఘన మాపివేయబడువరకు అనగా 1933 మధ్యవరకు పనిచేసెను. ఈకాలములో జిల్లాలకు తఱచు సందేశములుపంపబడుచుండెను. అచ్చుకరపత్రములు, సైక్లోస్టైలు కరపత్రములు సక్రమముగ ప్రకటింపబడుచుండెను. అప్పుడప్పుడు జిల్లాలో జరుగుచుండినవని తనిఖీచేయబడుచుండెను. మన జాతీయసేవకు సంబంధించిన వర్కరులకు బత్తెములీయబడుచుండెను. ఈ పని చాలవరకు, అవసరమునుబట్టి, రహస్యముగనే జరిగెను. కాని రాష్ట్రికమిటీ కార్యదర్శి ఆఫీసుపనులను చూచుకొనుచు తనధర్మమును బహిరంగ

ముగనే నెఱవేర్చుచుండెను. అతడు నిర్బంధింపబడినపుడు మరియొక డా స్థానము నాక్రమించెడివాడు.

1930, 1932 సంవత్సరముల యనుభవము భారతదేశమంతట రహస్యవార్తావిధానము నేర్పరచుట సులభమేయనుసంగతి విశదము చేసెను. ఎక్కువ యత్నమక్కరలేకుండ, కొన్ని యవాంతరములు సంభవించినను, మంచిఫలితమేకలిగెను. కాని శాసనోల్లంఘన తత్త్వముతో రహస్యవిధానముకు సరిపడదని మేము భావించితిమి. ప్రజా ప్రబోధము దానివలన మందగించెను. పెద్దబహిరంగమైన ప్రజోద్యమములో నొక చిన్న భాగముగ నది యుపయోగకరముగనుండెను. కాని యొక్కయుపద్రవమెప్పుడుకలదు. నిష్ఫలములగుకొన్ని రహస్య క్రియలే యుద్యమస్థానము నాక్రమింపనచ్చును. 1933 జూలైలో గాంధీజీ రహస్య మెంతమాత్రము పనికిరాదని నిరసించెను.

యు. పి. తో సంబంధములేకుండ గుజరాతు, కర్ణాటకములలో కొంతకాలము వ్యవసాయపన్నుల నిరాకరణోద్యమములుజయప్రదముగ సాగింపబడెను. రెండురాష్ట్రములలోను వ్యవసాయప్రొప్రయిటరులు ప్రభుత్వముకు పన్ను చెల్లింపనిరాకరించిరి. దీనివలన వారు చాలకష్టముల ననుభవించిరి. ఈ బాధితులకు సహాయముచేయుటకు, భూమినుండి వెడలగొట్టబడుటవలన; ఆస్తులనులాగుకొనుటవలనకలిగిన దుఃఖములనుపశమింపజేయుటకుకాంగ్రెసుకొన్ని ప్రయత్నములుచేసెను. యు. పి. లో రాష్ట్రకాంగ్రెసునాయకులు ఆస్తులనుపోగొట్టుకొనినరైతాంగమున కీవిధముగ తోడ్పడుట కెట్టి యత్నమునుచేయలేదు. ఇచ్చట సమస్య (కౌలుదార్లు వ్యవసాయ ప్రొప్రయిటర్లకంటె నత్యధికముగ నున్నారు) యతిపెద్దసమస్య. భూవైశాల్యమూ చాలహెచ్చు! రాష్ట్రనిధి చాలస్వల్పము. ఈ యుద్యమమువలన బాధపడిన వేనవేలకు సహాయముచేయుట మాకసాధ్యమైనపని. వారిని, యెప్పుడును ఆకలి బాధచే మాడుచున్న యసంఖ్యాకులయిన తదితరులను, వేరుచేయుట కూడ మాకసాధ్యముగనేయుండెను. కొద్దిమందికేసహాయముచేయుట క్రోధద్వేషములను పుట్టించును. కనుక మేము ధనసహాయము చేయ

జాలమని నిశ్చయించి, మొట్టమొదటనే ఈ విషయమును బహిరంగ పరచితిమి. వ్యవసాయదారులు మా స్థితిని చక్కగా గ్రహింపగలిగిరి. సణగకుండ ఫిర్యాదు చేయకుండ వారెంత సహింపగలిగిరో యాశ్చర్యకరముగ నుండును. మేము జేయగలిగిన చోట కొంతమంది వ్యక్తులకు ముఖ్యముగా జయిలుకు వెళ్ళినవారి భార్యాబిడ్డలకు; సహాయము చేయుటకు యత్నించితిమి. ఈ దురదృష్ట దేశదౌర్భాగ్యమెట్టిదో! నెలకొక రూపాయికూడ దేవతా ప్రసాదముగ భావింపబడును.

ఈ కాలములో మొదటినుండియు యు. పి. రాష్ట్రకమిటీవారు (ఈసంఘముని షేధింపబడెను.) తమ జీతగాండ్రకు స్వల్పజీతములనిచ్చుచునేయుండిరి. వారు జయిళ్ళకు వెళ్ళినపుడు వారి కుటుంబములను పోషించిరి. వారిబడ్జెటులో నిది పెద్దమొత్తము. తరువాత కరపత్రములను, నోటీసులను, బులెటినులను అచ్చువేయించుఖర్చులువచ్చెను. ఇవి కూడ చాల హెచ్చుగనే యుండెను. ప్రయాణఖర్చులుమరియొక ప్రధానవిషయము. తక్కువభాగ్యవంతమైన జిల్లాలకుకొన్ని గ్రాంటుల నీయవలసియుండెను. అతిశక్తివంతమై క్రౌర్యపాలుకొనియున్న ప్రభుత్వముతో తీవ్రప్రజాసంగ్రామము జరిగిన యీ కాలములో పై ఖర్చులు తదితరఖర్చులు యెన్నియో చేయబడినను యు.పి. రాష్ట్రకమిటీవారు 1932 జనవరి లగాయతు 1933 ఆగష్టువరకు యిరువది మాసములలో మొత్తము 63000 రూపాయలు అనగా నెలకు 3140 రూపాయలు ఖర్చుపెట్టిరి. (ఈ మొత్తములో అలహాబాదు, ఆగ్రా, కాన్పూరు, లక్నోలవంటి యెక్కువధన, బలములుకలిగిన జిల్లాకమిటీల ప్రత్యేక ఖర్చులు లేవు.) 1932, 1933 పోరాటములో యు. పి. రాష్ట్రమన్నిటికంటె ముందంజవేసెను. పొందిన ఫలితములనుబట్టి చూడ నది చాల తక్కువఖర్చు చేసెననియే నేననుకొనెదను. శాసనోల్లంఘనము నణచుటకు రాష్ట్రప్రభుత్వము చేసినప్రత్యేక ఖర్చులను ఈ యల్పసంఖ్యతో పోల్చి చూచుట చాలప్రయోజనకరము. తక్కిన పెద్దరాష్ట్రములు కొన్ని ఇంతకంటె నెక్కువఖర్చు చేసెనని నేనూహించెదను. కాని బీహారు, కాంగ్రెసు దృష్టిలో, దాని సరి

హద్దురాష్ట్రమయిన యు. పి. కంటె చాల బీదది. అయినను పోరాటములో నది యద్భుతముగ పనిచేసెను.

క్రమముగ శాసనోల్లంఘనోద్యమము క్షీణించెను. కాని యది జలగసాగినట్లు సాగుచునేయుండెను. అంతకంత కది బాహుళ్యము మీాద జరుగుట తగ్గిపోయెను. ప్రభుత్వమువారి తీవ్రనిర్బంధ విధానమట్లుండ 1932 సెప్టెంబరులో గాంధీజీ హరిజన సమస్యమీాద మొదట యుపవాసముచేసినపుడు దానికి మొట్టమొదట గట్టిదెబ్బ తగిలెను. ఆ యుపవాసము ప్రజాప్రబోధము కలిగించెను. కాని యది దానిని మరియొకవైపు మరలించెను. 1933 మే మాసములో శాసనోల్లంఘన మాపివేయుటచే చివరకది యాచరణలో చంపివేయ బడెను. తరువాత నది యాచరణలోగాక సిద్ధాంతములోనుండెను. అది యట్లాపుచేయబడకపోయినను క్రమముగ నశించియుండెడిది. నిర్బంధములలోని కాఠిన్యతచేతను, దౌర్జన్యముచేతను భారతదేశము సొమ్మసిలిపోయెను. జాతియొక్క ధైర్యస్థైర్యములు తాత్కాలికముగ డస్సిపోయెను. అవి తిరిగి ప్రతిష్ఠింపబడలేదు. శాసనోల్లంఘనమును వ్యక్తిగతముగ సాగింపగలవారింకను అనేకమంది కలరు. కాని వారు కొంత కృత్రిమవాతావరణములో పనిచేసిరి.

ఒక మహోద్యమ మీా విధముగ నెమ్మదిగనశించినదనువార్త మాకు సంతోషకరముగలేదు. అయినను గొప్పవిజయముకలుగునని మాలో నెవరు భావించియుండలేదు. ప్రజలలో నణచివేయబడ జాలని ప్రబోధముకలిగినచో నద్భుతమయిన దేదిమో సంభవించుటకొకవెర్రియవకాశ మెప్పుడును ఉండెను. కాని దానిమీాద నాధారపడుటకు వీలులేదు. కనుక మేము నిమ్నోన్నతములతోను, మధ్యమధ్య ననేక 'ఆటకట్టులతోను గూడిన దీర్ఘపోరాటముకొరకే యెదురుచూచితిమి. ప్రజలకుశిక్షణలోను, సమిష్టికార్యాచరణలోను లక్ష్యశుద్ధిలోను అత్యధిక బలము చేకూరునని యాశించితిమి. ఒక్కొక్కప్పుడు 1932 మొదటిదినములలో శీఘ్రముగ నేదేనియొక బాహ్యవిజయము కలుగునేమోయని భయపడెడివాడను; ఏలనన నిది విధా

యుకముగ నొక రాజీకి దారితీసి గవర్నమెంటేరియనులను, 'సమయానుకూలస్వాభావికులను' మనన త్రిమీద కెక్కించునట్లు కాన్పించెను. 1931 నాటి యనుభవము కండ్లకు కాన్పించుచునే యుండెను. ప్రజలు లాభము పొందుటకు తగిన నిర్దిష్టభావములు పటుతరభావములు కలిగియున్నపుడే విజయము రాగలదు. లేనిచో ప్రజలు పోరాటము సలిపెదరు; త్యాగములు చేసెదరు; చివర నిమిషములలో నితరులు పెద్దరికొనుటలన తీవచ్చి లాభములను గ్రహించుకొందురు. ఇట్టి యుపద్రవ మెంతయో కలదు. ఏలనన కాంగ్రెసులోనే యెన్నియో యసంబద్ధ యాలోచనలు కలవు. మనకెట్టి ప్రభుత్వపద్ధతి కావలెను? ఎట్టిసాంఘికపద్ధతి కావలెను? అనువిషయములను గురించి కచ్చితమైన భావములు లేకుండెను. నిశ్చయముగ కొందరు కాంగ్రెసువారు ప్రస్తుత ప్రభుత్వపద్ధతి నంతగా మార్చవలెనని తలంచలేదు. అందులోనున్న బ్రిటిషువారిని లేక విజాతీయులను తీసివేసి 'స్వదేశీ' సిబ్బందిని పెట్టిన చాలునని వారిమతము.

శుద్ధ 'గవర్నమెంటేరియనుల' విషయము వేరు. ఏలనన ప్రభుత్వాధికారమునకు దాసులగుటయే వారి విశ్వాసము. కాని లిబరలు పక్షమువారు, రెస్పాన్సివిస్టులుకూడ రమారమి బ్రిటిషుప్రభుత్వ లక్ష్యమునే సంపూర్ణముగ నంగీకరించిరి. వారప్పుడప్పుడుచేయువిమర్శ నిరర్థకము, నిష్ఫలము. కొండవిరిగి మీదపడినను సరే! వారు చట్టములనే యుపాసించెదరు కనుక వారు శాసనోల్లంఘనము నాహ్వానము చేయకపోగా ముందుకుపోయి ప్రభుత్వపక్షమున నిలిచిరి. అన్నివిధములగు నాగరిక స్వాతంత్ర్యములు పూర్తిగ నణచివేయబడినపుడువారు మౌనముద్రవహించి లేక భయభ్రాంతులై చూచుచుండిరి. ప్రభుత్వమువారొక్క శాసనోల్లంఘనమును మాత్రమే యెదుర్కొని దానినే యణచివేయలేదు. రాజకీయ జీవితమంతయు, ప్రజాహితైక కార్యములన్నియు నరికట్టబడెను. దీనికంతకు వ్యతిరేకముగ నొక్క కంఠమైనను లేవలేదు. ఈ స్వాతంత్ర్యములకొఱకు సాధారణముగ నిలిచిన వారందరు సంగ్రామములోనే చిక్కుకొనియుండిరి. వారు

ప్రభుత్వనిర్బంధములకు మోకరింప నిరాకరించి శిక్షలనుస్వీకరించిరి. తక్కినవారు పూర్తిగ నణచివేయబడి నోరెత్తి విమర్శయైనను చేయ జాలకుండిరి. ఎప్పుడైనను నిర్వీర్యమైన విమర్శజరిగినయెడల నదిహీన స్వరముతో, క్షమార్పణధోరణిలో నుండెడిది. దానిని వెంటనే కాంగ్రెసుపోరాటమునుజరుపుచున్నవారు తీవ్రముగ ఖండించెడివారు.

పాశ్చాత్యదేశములలో పౌరహక్కులను సమర్థించు బలీయమైన ప్రజాభిప్రాయము నిర్మింపబడెను. వాటి కేమాత్రము భంగము కలిగినను ప్రతిఘటన, ఆందోళన బయలుదేరెను. అచ్చట వాక్కు, వ్రాత, సభలు, సంస్థలు, ముద్రణాలయములు, వ్యక్తులు,—ఈ యన్నింటి స్వాతంత్ర్యముల యెడలతగినంత శ్రద్ధతీసుకొనువార నేకులుకలరు. వారు నిరంతరము వాటికొఱ కాందోళన చేయుచు వాటి నాక్రమింపజూచు ప్రభుత్వ స్వభావము నరికట్టుటకు తోడ్పడుచుందురు. భారతలిబరలు పక్షమువారు బ్రిటిషు లిబరలుపక్ష సాంప్రదాయములను (పేరుతప్ప వారితో వీరికెట్టి సామ్యము లేకపోయినను, కొంతవరకు నిర్వహింతు మని చెప్పెదరు. ఈనాగరికసత్త్వముల నణచివేయునపుడు వీరు తమ బుద్ధ్యా కొంతవ్యతిరేకముచూపెదరని యనుకొందుము. ఏలనన దీని వలన తాముకూడ బాధపడిరి. కాని వా రట్టిపాపము చేయలేదు! వోల్టేయరు మహాశయునివలె "మీరు చెప్పుదానితో నే నెంత మాత్రము నంగీకరింపజాలను. కాని నా కంఠములో ప్రాణమున్నంత వరకట్లు చెప్పు మీ హక్కును నేను కాపాడెదను" అని వీరనజాలరు.

దీనికి వీరినిదూషించుట యుక్తముకాదు. ఏలనన వీ రెన్నడు ప్రజాస్వామికమును, స్వేచ్ఛను, కాపాడుటకు నిలిచినవారుకారు. మాన్చెష్టరుగార్డియన్‌పత్రికా కరస్పాండెంటు చెప్పినట్లు "నిర్బంధము శాస్త్రయుక్తముగప్రయోగింపబడుచున్నది" అనువిషయమునకువారు సంతృప్తులగుచుండుటప్పుడప్పుడువిదితమగుచుండెను. ఈమధ్య బ్రిటిష్ జాతీయప్రభుత్వము రాజద్రోహబిల్లు నొకదానిని చేయుటకు ప్రయత్నించిరి. దానిమీాద బ్రహ్మాండమైన విమర్శ ముఖ్యముగా లిబరలు పక్షమునుండి లేబరుపక్షమునుండి బయలుదేరెను. ఆబిల్లువాక్స్వాతం

త్ర్యము నరికట్టునని, సెన్సారంటులనిచ్చుటకు మేజిస్ట్రేటుల కధికారమునిచ్చునని యదివిమర్శింపబడెను. ఈవిమర్శనువినినప్పుడెల్ల నాకు దానియందభిమానము కలిగెడిది. అప్పుడే నాకు భారతచిత్రముకూడ కాన్పించెడిది. ఇచ్చట చట్టములు బ్రిటిషురాజద్రోహ బిల్లుకంటె నూరురెట్లధికముగా నున్నవి. ఇంగ్లండులో నలుసంతైనను నిచ్చుకొనలేని బ్రిటిషువారు హిందూదేశములో కిక్కురుమనకుండ లాకట్టిపెట్టను కూడ నెట్లు దిగమ్రింగగలరో నా కాశ్చర్యము. తమ భౌతిక ప్రయోజనముల కవసరమైనట్లు తమ నైతికప్రమాణములను మార్చుకొనగల బ్రిటిషుప్రజల యద్భుతయుక్తి నాకెప్పుడు నాశ్చర్యమును, మెప్పును కలిగించెడిది. వారిసామ్రాజ్యమెత్తులకు ప్రోత్సాహమునిచ్చు ప్రతిదాని యందు వారికి సుగుణము కాన్పించును. స్వేచ్ఛను, ప్రజాస్వామికమును ముట్టడించుచున్నారను విశ్వాసముతో, ఆధ్యాత్మికాగ్రహముతో వారు హిట్లరు, ముస్సోలినీలను ఖండింతురు. అట్టివిశ్వాసముతోనే హిందూదేశములో నట్టివారలును, స్వాతంత్ర్యము నూడబెరుకుటయు నవసరమని వారు భావింతురు. తమ ప్రయోజనరహితమైన యదార్థప్రవర్తనమే పెని యావశ్యకతను కోరుచున్నదని చూపుటకు వారత్యుత్తమ నైతిక కారణములను తెలిపెదరు.

హిందూదేశము నంతను దవానల మావరించియుండ పురుషు లగ్నిపరీక్షకు గురియగుచుండ వేలకొలది మైళ్ళదూరములో లండనులో హిందూదేశమునకు చట్టములను తయారుచేయుటకు కొందఱు 'దేవతలు'సమకూడిరి. 1932 లో మూడవ రౌండుటేబిలు సభ, కమిటీసభలు జరిగెను. అసెంబ్లీలోని చాలమంది సభ్యులు యీ కమిటీసభలలో సభ్యత్వముకొఱకు గేలము వేసుకొని కూర్చొనిరి. వారీ విధముగ ప్రజాధర్మనిర్వహణమును, వ్యక్తిగతానందమును మిళితముచేయజూచిరి. ప్రజలఖర్చుమీద నొకతండా బయలుదేరి వెళ్ళెను. తరువాత 1933లో భారతఅస్సెసరులతోగూడిన జాయింటు కమిటీవచ్చెను. సాకులకు యుదారప్రభుత్వము యుచితటిక్కెట్లు నిచ్చిరి. హిందూమాతను సేవించుట కతిశ్రద్ధాళువులై ప్రజలఖర్చుల

మీద తిరిగి చాలమంది సముద్రములను దాటిరి. కొంతమంది యెక్కువదారిఖర్చులు రావలెననికూడ బేరములాడిరట!

హిందూదేశ ప్రజోద్యమములకు భయపడి స్వప్రయోజన ప్రతినిధులు బ్రిటిషుసామ్రాజ్యాధిపత్యముక్రింద లండనులోసమావేశ మగుటలో నాశ్చర్యములేదు. దేశమాత జీవించుటయా నశించు టయా యను సంకుల సంగ్రామములోనుండ నే భారతీయుడైన నిట్లు ప్రవర్తించుట మా జాతీయతను పొడిచినట్లయ్యెను. ఒక దృష్టిలో మాలోచాలమంది కది మంచిదిగనే కాన్పించెను. అది భారతదేశ ములోనున్న యభివృద్ధికోరువర్గమువారిని యభివృద్ధినరికట్టువారిని శాశ్వతముగ వేరుపరచెనని యనుకొంటిమి. ఈ వడపోత ప్రజలకు రాజకీయ ప్రబోధము కలిగించుట కెంతయో సహాయపడును. ఒక్క స్వాతంత్ర్యము మూలముననే మనము సాంఘికసమస్యల నెదుర్కొన గలమనియు ప్రజల భారములను తగ్గింపగలమనియు నిది మరింత స్పష్టము చేయగలదు.

కాని వీరు భారతప్రజలకు తమ నిత్యజీవితములలోనేగాక నైతికముగ, మానసికముగ నెంతదూరము యిరోకను గొనుటయాశ్చర్య కరము. వీరికి వారితో నెట్టి సంబంధములు లేవు. త్యాగములకు, బాధలకు ప్రోత్సహించువారి యాంతరంగిక ప్రబోధమావీ రర్థము చేసుకొనలేదు! పేరెన్నికగనిన యీ రాజకీయ దురంధరులకు సత్య మంతయు నొక్కచోట మూర్తీభవించి యుండును. బ్రిటిషు సామ్రాజ్యశక్తి నెవరును జయప్రదముగ నెదుర్కొనజాలరు. కనుక దానివిష్టమైనను, అయిష్టమైనను అంగీకరింపక తప్పదు. ఇదియే వారి వేదాంతము. సత్యముల భారతసమస్యను పరిష్కరించుట జీవ చట్టనిర్మాణము ప్రజలయామోదము లేనిదే యసంభవ మనుసంగతి వారికి తట్టినట్లు కాన్పించదు. స్పెండరుగారు 'మనకాలపు క్లుప్త చరిత్ర' అను పుస్తకములో చట్టసంబంధమైన విషమస్థితి నంత మొం దించుటకు 1910లో జరిగిన బిరిషుజాయింటు కాన్ఫరెన్సుయొక్క విఫ లతనుగురించి యుదహరించెను. విషమసమయమధ్యమున చట్టమును

నిర్మించుటకు యత్నించు రాజకీయనాయకశిఖామణులు తెగులబడుచున్న కొంపను భీమాచేయించుటకు యత్నించు యోధులవంటివారని యతడనెను. 1932, 1933 లలో భారతదేశములో బయలుదేరిన దవాకలను 1910 లో ఐర్లండులో రేగిన దానికంటె చాలగొప్పది; జ్వాలలారిపోయినను మండుచునుండునిప్పులు భారతస్వాతంత్ర్యేచ్ఛ రూపమున చల్లారుటకు శాశ్వతముగా ఏర్పాటుల మట్టియుండును.

భారతాధికారులలో కార్యస్వాతంత్ర్యము సముచ్ఛ్రితముగ పెరిగెను. ఈ సంప్రదాయము పురాతనమైనది. బ్రిటిషువారీదేశమును ప్రధానముగ పోలీసురాజ్యముగనే పాలించుచుండిరి. నాగరిక పరిపాలకునియొక్క అధికారపూరితదృష్టికాదు సైనికదృష్టియే. శత్రుసైన్యము, జయింపబడిన శత్రుభూమిని ఆక్రమించుకొనునట్టి వాసన యెప్పుడునుకలదు. ప్రస్తుత ప్రభుత్వవిధానమును సవాలుచేయుటచే సైనికస్థితి వర్తిల్లెను. వంగదేశములోను, తదితరచోట్లను అప్పుడప్పుడుజరుగు టెర్రరిస్టుచర్యలీయధికార దౌర్జన్యమునకు దోహదము నిచ్చెను. అవి యధికారచర్యలలో కొంత న్యాయము కలదనుకొనుటకు కారణమయ్యెను. వివిధఆర్డినెన్సులు, ప్రభుత్వనీతి కార్యనిర్వాహకవర్గమువారికి, పోలీసులకు సముచ్ఛ్రితమైన యధికారము నిచ్చుటచేత భారతదేశము పోలీసురాజ్యమయ్యెను. దీనిని మందలించు వారెవరునులేరు.

హెచ్చుతగ్గుస్థాయీలలో భారతదేశములోని రాష్ట్రములన్నియు నీ భయంకర నిర్బంధాగ్ని ననుభవించెను. కాని సరిహద్దు, వంగదేశము లెక్కువగా బాధపడెను. సరిహద్దురాష్ట్రమెప్పుడుప్రధానముగా సైనికప్రాంతముగనేయుండి యర్ధసైనిక రెగ్యులేషనులక్రింద పాలింపబడుచుండెను. దాని స్థితి రాజకీయముగముఖ్యమైనది. 'యర్ర చొక్కాల' యుద్యమము ప్రభుత్వమువారిని పూర్తిగ తారుమారు చేసెను. రాష్ట్రమును 'శాంతపరచుటకు' 'తిరుగబడినగ్రామముల' నణచుటకు సైనికదళములు విరివిగనుపయోగింపబడెను. హిందూదేశమంతట గ్రామములమధ్య అప్పుడప్పుడు (వంగదేశములో) పట్టు

ణములమీద సాముదాయక జుల్మానాలు సామాన్యమయ్యెను. తఱచుశిక్షార్థము పోలీసులను పెట్టుచుండెడివారు. పెద్దపెద్దయధికారము లీయబడి, పయిపుందలింపులులేనపుడు పోలీసులు మితిమీరివర్తిం చుట విధాయకము. లా ఆర్డరుల పేరిటనే యవి భంగపరుపబడిన చక్కని యుదాహరణములెన్నియో కలవు.

వంగదేశములో కొన్నిభాగములసామాన్యదృశ్యమును ప్రద ర్శించెను. ప్రభుత్వమువారు ప్రజలను శత్రువులవలెజూచిరి. పన్నెండు సంవత్సరములు లగాయితు యిరువదియైదేండ్లవరకుగల బాల, బాలిక లందరు తమ చెహరాలను తెలుపుకార్డులనుంచుకొనవలెను. ఒక చోటునుండి బయటకుపోకూడదు. బయటనుండి యొకచోటుకు రాకూడదు. దుస్తులను ధరించుటలో నియమముల నేర్పరచిరి. పాఠశాలలకు నియమముల నేర్పరచిరి. లేదా మూసివేసిరి. సైకిళ్ళు పనికిరావనిరి. పోలీసువారికి రాకపోకలను తెలుపవలెననిరి. రాత్రి చట్టము, సాయంకాలచట్టము సైన్యములను నడపుట, ప్యూనిటివ్ పోలీసులు జుల్మానాలు యింక ననేకనియమములు స్థాపింపబడెను. పెద్దపెద్ద ప్రాంతములు నిరంతర ముట్టడిలోనున్నట్లు కాన్పించెను. ఇవి యవసరములా? ఇవి యవసరము కానియెడల పెద్దపెద్దప్రాంత ములలోనున్న ప్రజలందరిని బాధపెట్టి యవమానపరచి, గొప్ప నష్టములను కలిగించినందుల కా ప్రభుత్వము విపరీతనేరము చేసి నట్లు భావింపబడవలెను. అవి యవసరమేయైనచో నిశ్చయముగ భారతదేశబ్రిటిషుపరిపాలనమీద నదియే తుదితీర్పుగాగలదు.

దౌర్జన్యము జయిళ్ళలోకూడ ప్రజలను వెంటనంటెను. ఖయిదీలను తరగతులుగ విభజించు టొక బూటకము. అది తరచు పైతరగతులలో నుంచబడినవారికి కంటకముగ నుండెడిది. చాలకొద్ది మంది యీ పై తరగతులలో నుండెడివారు. అభిమానధనులైన స్త్రీ పురుషులు నిరంతర కంటకపరిస్థితులకు లొంగవలసియుండెను. మామూలు ఖయిదీలస్థితికంటె రాజకీయఖైదీలస్థితిని యధమాధము మొనరించుటకు ప్రభుత్వముబుద్ధిపూర్వకముగతలపెట్టినట్లుకాన్పింప

చెను. జయిళ్ళ యిన్‌స్పెక్టరు జనరలుగారొకరు శాసనోల్లంఘన ఖయిదీలను "క్రూరముగా చూడవలెను." అనునొక రహస్యసర్క్యూలరు అన్నిజయిళ్ళకు పంపించెను. కొరడాదెబ్బలు జయిలుశిక్షలలో తఱచుగా జరుగునొకశిక్ష. 1933 ఏప్రిల్ 27 వ తేదీని భారతదేశ సహాయకార్యదర్శి కామన్సుసభలో మాట్లాడుచు "1932లో శాసనోల్లంఘన నేరములకు భారతదేశములో 500 మందికిపయిగా కొరడా దెబ్బలు విధింపబడెననుసంగతి సర్. సామ్యూల్ హోరుగా రెరుగుదురు." అని చెప్పెను. జయిలు నియమములనుల్లంఘించిరనుకారణమున జయిలులోవిధింపబడినయనేకకొరడాశిక్షలీసంఖ్యలో జేర్చబడినవో లేదో స్పష్టపరుపబడలేదు. 1932 లో జయిలులోనున్నపుడు కొరడా దెబ్బలశిక్షలు తఱచు వినబడుచుండగా 1930 డిశెంబరులో జరిగిన యొకటిరెండు కొరడాశిక్షలను మేము నిరసించుట మూడుదినములుపవసించుట నాకు జ్ఞప్తికివచ్చెను. నేనప్పుడు దానిపరుషత్వమునకు నిర్విణ్ణుడనై లోపల నొకవిధమగు బాధననుభవించితిని. కాని దానిని నిరసింపవలెనని నేను తిరిగి యుపవసింపవలెనని నాకు తట్టలేదు. ఈ విషయములో నేను మరింత యసహాయుడ ననుకొంటిని. కాలము గడచుటతోడనే మనస్సు మొద్దుబారి పరుషత్వమును సహించును. చెడ్డవస్తువుప్రపంచములోకొంతకాలమునిలిచినచాలును. ప్రపంచము దాని కలవడిపోవును. జైళ్ళలో పురుషుల కఠికఠినమైన పని—యంత్రములు, నూనెగానుగలు మొదలగునవి యివ్వబడెను. ప్రభుత్వమునకు క్షమార్పణ చెప్పకొని, విడుదలయగునట్లు వారిస్థితి యతిదుర్భరముగ చేయబడెను. జయిలుఅధికారుల కది యొక గొప్పవిజయము.

ఈ జయిలుశిక్షలు చాలవరకవమానములను నిర్బంధములను సహింప తిరస్కరించినబాలురమీద, యువకులమీద పడెను. వారందరు నత్యుత్సాహవంతులైన బాలురు. ఆత్మగౌరవము, సాహసము పటుత్వముగలవారు. ఇట్టివారింగ్లండులో బహిరంగపాఠశాలలలోను విశ్వవిద్యాలయములలోను అత్యంత ప్రోత్సాహము, మెప్పు పొందియుండెడివారు. ఇచ్చట హిందూదేశములో వారి యౌవనాదర్శ

ములు, అభిమానధనము వారికి సంకెలలను, ఏకాంతవాసములను, కొరడా దెబ్బలను తెచ్చిపెట్టును.

జయిళ్ళలోని మన స్త్రీలస్థితి యతికఠినము. చింతించినకొలది బాధకరము. వారు చాలవరకు మధ్యతరగతివారు. ఇంటిపట్టుననుండుట కలవడినవారు. స్వలాభముకొరకుపురుషునిచే పరిపాలింపబడుసంఘము చేత సృష్టింపబడిన యనేక నిర్బంధములనుండి యాచారములనుండి వారు బాధపడుచుండిరి. స్వాతంత్ర్య యాహ్వానములు వారెప్పుడు రెండువిధముల నర్థముచేసికొందురు. సంగ్రామములో వారుచూపిన యుత్సాహము, శక్తి యపారము. వీటివెనుక నస్పష్టముగ నిద్రాణముగనున్నను, గృహదాస్యమునుండి విముక్తులుకావలెనను తీవ్రమైన కోరికగలదు. కొద్దిమంది తప్ప వీరందరు మామూలుఖయిదీల తరగతిలో నీతిబాహ్యులైన ఖయిదీలమధ్య భయంకర పరిస్థితులలో నుంచబడిరి. ఒకసారి నేను స్త్రీల యావరణ ప్రక్కనున్న యొక కొటాకులోనుంటిని. ఒకగోడ మాకడ్డము. ఆయావరణములో నితర ఖయిదీలమధ్య కొందరు స్త్రీరాజకీయఖయిదీలు కలరు. వారిలో నా కొకసారి యాతిథ్యము నిచ్చిన స్త్రీ యుండెను. ఒకపెద్దగోడ మాకడ్డముగానున్నను స్త్రీ ఖయిదీ వార్డరులు మన స్నేహితురాండ్రపయి నుపయోగించుచున్న భాష, తిట్టులు నాకు కర్ణకఠోరముగ వినిపించుచుండెను.

1932-1933 లలో రాజకీయ ఖయిదీల యాదరణ రెండువత్సరముల క్రిందట 1930 లో చూపబడిన దానికంటె నధమముగానుండెను. ఇది కేవలమధికారుల వ్యక్తిగత యిష్టాయిష్టములచేత సంభవించినదికాదు. ఇది ప్రభుత్వము బుద్ధిపూర్వకముగ నవలంబించిన నీతి. రాజకీయఖయిదీలవిషయమట్లుండ ఆరోజులలో యు. పి. రాష్ట్రజయిలుశాఖ దయారసవాసనైనను భరింపజాలదనుకీర్తిగడించెను. ఈ సందర్భములో ననిర్వాదమైన తావునుండి మనకొక చక్కని యుదాహరణము కలదు. జయిళ్ళను సందర్శించు గొప్ప హోదాగల ప్రేక్షకుడొకడు 'సర' బిరుదాంకితుడు ప్రభుత్వముచే

పత్రికలలో గౌరవింపబడినవాడు జయిలులో నన్నొకసారి చూడ వచ్చెను. కొన్ని నెలలు క్రిందట నతడు మరియొక జయిలును చూచి తనపత్రికలో దాని జయిలరు "దయగలిగిన క్రమపాలనా దక్షుడు" అని వ్రాసెనట! ఆ జయిలరు తన వ్యవహారమును గురించి ఏమియు నుదహరింపవలదనియతనిని బ్రతిమాలుకొనెనట. అధికారులదృష్టిలో దయకు స్థానములేదని యతడు చెప్పెనట. వ్రాతవలన నతని కెట్టియుపకారము కలుగజాలదని భావించుటచేత నాయకుడు 'అదియుండవలెనని పట్టుపట్టెను. ఫలితము వెంటనే యా జయిలరొచ్చటనో మారుమూలనున్నయొక జయిలుకు వినరు చేయబడెను. అది యతనిదయ కొకశిక్ష.

భయంకరులై పనిచేయుటకు ప్రతిఫలముగా కొందఱు జయిలరులకు బిరుదులు, ప్రమోషనులు, అక్రమముగా నితరులసొత్తు కొట్టివేయుట జయిలులలో సర్వసాధారణము. వీనిని చేయనివా రతి స్వల్పము. కాని నా స్వంతయనుభవము, నా స్నేహితుల యనుభవము కూడ నియమములను కఠినముగ పాలించునట్లు నటించువారే యీ విషయములో నధమాధములగు దోషులని చూపుచున్నవి.

లోపలబయటగూడ నే నదృష్టవంతుడను. నాతో సంపర్కము కలిగిన ప్రతివాడు నన్ను గౌరవమర్యాదలతో చూచెను. జయిలులో నొక్కవిషయముమాత్రము నాకు, మా బంధుజనులకు చాలకష్టము కలిగించెను. మా తల్లియు, కమలయు, కుమార్తె ఇందిరయు నలహాబాదుజయిలులో మా బావమరది రంజిత పండితుని చూడవెళ్ళిరి. వా రెట్టితప్పుచేయకపోయినను జయిలరు వారి నగౌరవపరచి పైకి గెంటివేసెను. నే నీ విషయమును వినినపుడు చాల విచారించితిని. ఈ సందర్భములో రాష్ట్రప్రభుత్వమువారి చర్య నా కాశ్చర్యము కలిగించెను. జయిలు ఆఫీసరులు మా తల్లి నవమానపరచకుండ నేను బంధుదర్శనములను మానివేయ నిశ్చయించితిని. డేరాడూను జయిలులో నేడుమాసములవరకు నేను నా బంధువుల నెవరిని చూడలేదు.

—:O:—

జయిలులోని వివిధ భావములు

గోవిందవల్లభపంతును, నన్ను బెరిల్లీ జిల్లాజయిలునుండి దేరాడూను మార్చి బెరిల్లీలో రైలెక్కించుట మానివేసి యేబది మైళ్ళదూరములోనున్న మారుమూలస్టేషనుకు రాత్రి రహస్యముగా నొకమోటారులో తీసికొనివెళ్ళిరి. నెలలకొలది యేకాంతవాసములోనున్న మాకా రాత్రిపయనము హాయిగొల్పెను.

నేను బెరిల్లీజయిలువీడుటకు పూర్వ మొకవిశేషము జరిగెను. అది నా కింకను జ్ఞప్తికివచ్చుచుండును. బెరిల్లీలో పోలీసుసూపరింటెండెంటు ఒక ఆంగ్లేయుడు. అతడు నేను మోటారులో నెక్కుచుండ కొంచెముసిగ్గుతో బొమ్మలుగల పాతజర్మనుమేగజైనులకట్ట నొకదానిని నాకిచ్చెను. నే నతని నంతకుమును పెన్నడుకలుసుకొనలేదు. దీని తరువాత తిరిగి యతనినిచూడలేదు. నేను జర్మనుభాష నేర్చుకొనుచున్నానని విని యతడు నాకొఱకు వీటిని పట్టుకొనివచ్చితినని చెప్పెను. ఐచ్ఛికముగ నతడు చూపినమర్యాదయు దానిని ప్రోత్సహించిన దయార్ద్రభావమునకు నే నతనియెడల కృతజ్ఞుడనైతిని.

ఆ నిశీథ దీర్ఘప్రయాణములో నే నాంగ్లేయులకు భారతీయులకు, పాలకులకు, పాలితులకు, నధికారులకు, ననధికారులకు, నాజ్ఞలను శిరసావహింపవలసినవారికి గల సంబంధమునుగురించి యోచింప నారంభించితిని. ఈ రెండుజాతులమధ్య నెంతయంతరువుగలదు! ఉభయులమధ్య నెంత యవిశ్వాసము, అప్రేమ కలవు! అవిశ్వాస అప్రేమలకంటె నొండొరులను గురించిన యజ్ఞాన మెక్కుడుగ నుండెను. ఈ కారణముచే వారొకరిని చూచి యొకరుభయపడుచు నొకరిసమక్షమున నొకరు జాగరూకులుగ మెలగుచుందురు. ఒకరికొకరు కంటకులుగ ప్రేమరహితులుగ కాన్పించుచుందురు. ఈ తెర మఱుగున నౌచిత్యము దయ యున్నసంగతి యిరువురుగుర్తింపరైరి. తగినంత మేతవేయగల పాలకుడగుటచే నాంగ్లేయ ఉద్యోగముల

కొఱ కతినీచముగ వేటాడువారిని, సమయానుకూల స్వాహాపరులను చాలమంది నాకర్షించిరి.

ఈ యసహ్యాకర సాదృశ్యములనుబట్టి వారు హిందూదేశ మిట్టిదేయని నిర్ణయింతురు. భారతీయు డింగ్లీషువారిని యుద్యోగిగ మాత్రమే చూచును. నిజభావప్రేరితుడై వ్యక్తిగతముగ పనిచేయు నపుడుండు ప్రవర్తనకు నొకయధికారిగనో లేక సైన్యములో నొక యంగముగనో పనిచేయునపుడుండుప్రవర్తనకు నెంత భేదముకలదు !

‘తయార్’ అను కేక వినవచ్చుటతోడనే బిర్రబిగిసి సైనికుడు తనయాదరమును జారవిడచి యంత్రమువలె పనిచేయుచు నిరప రాధులు నిరుపద్రవకరులునైన ప్రజలను కాల్చిచంపివేయును. అట్లే యే వ్యక్తికి నపకారముచేయ సందేహించు పోలీసు యుద్యోగి, మరు నాడు,నిరపరాధులగు ప్రజలపై లాఠీచార్జిచేయ నాజ్ఞాపించును.అప్పు డతడు తన నొకవ్యక్తిగ తలంపడు. తాను లాఠీచార్జిచేయు లేక కాల్చు ప్రజ వ్యక్తులని తలంపడు.

మనము రెండవపక్షము నొకమూకక్రింద గుంపుక్రింద భావింప మొదలిడుటతోడనే మానవసంబంధము తెగిపోవును. గుంపుకూడ ప్రేమ, ద్వేష, బాధలనుభవించు స్త్రీలు, పురుషులు, బిడ్డలు అను సంగతి మనము మఱచిపోదుము. నిష్కపటియగు సామాన్యఆంగ్లే యుడు చక్కనిభారతీయుల నెరుగుదునని యొప్పుకొనును. కాని వారు తప్పుబుట్టినవారు. మొత్తముమీద భారతీయులందఱు గర్హింపదగిన మూక. సామాన్యభారతీయుడు ఆంగ్లేయులు కొందరు యోగ్యులని యొప్పుకొనును.కాని యీ కొద్దిమందిని మినహాయించినచో తక్కిన యాంగ్లేయులందరు నధికార ధూర్వహులు, క్రూరులు, చాలచెడ్డ వారు. ప్రతివాడు నితరజాతిని తా నెరిగిన వ్యక్తులనుబట్టిగాక తా నెంతమాత్రము నెరుగనివారినబట్టి విమర్శించుట చాల చోద్యము.

నా కనేక సౌకర్యములున్నను జయిలు జయిలుగనేయుండెను. ఒకొక్కప్పుడు భారభూయిష్టమగు నా వాతావరణము దుర్భరముగ నుండెడిది. అచ్చటి వాయువే దౌర్జన్య, నైచ్య, అసత్య, అక్రమ

సంపాదనతో నిండియుండును. తిట్లకు కొఱతయుండదు. ఏమాత్రమభిమానమున్నవాడైనను నిరంతరోద్రేకస్థితితో నుండకతప్పదు. స్వల్పసంభవములు మనుష్యులను తారుమారుచేయుచుండును. ఒకయుత్తరములోని చెడువార్త వార్తాపత్రికలోని యొక విషయము కొంతకాలము క్రోధమునకు లేక విచారమునకు కారణమగును. బాహ్యప్రపంచమున కార్యనిమగ్నతలో నెప్పుడు సుఖముకలదు? అనేకవిధములగు కార్యములు ప్రయోజనములు శారీరక మానసిక స్వాస్థ్యము, శాంతిచేకూర్చును, జయిలులో బయటకుపోవుమార్గము లేవియు నుండకపోవుటచే సీసాలోబిగింపబడినట్లు నిర్బంధింపబడినట్లు భావింపబడును. ఇట్టిస్థితిలో విధాయకముగ పాటికబుద్ధి, విషయములను వికటముగ నర్థముచేసికొనుట సంభవించును. జయిలులో వ్యాధిగ్రస్తుడగుటకంటె కంటకము వేరొండు యుండబోదు.

అయినను జయిలులోని నిత్యకర్మలకు నేను చక్కగ నలవడితిని. నేను శరీర వ్యాయామ మానసికపరిశ్రమలచే స్వస్థచిత్తుడనైతిని. వ్యాయామమునకు పనిపాటలకు బయట నెట్టివిలువయున్నను జయిలులో నవి చాల యవసరము. అవి లేనిచో కొంచెమించుమించు మతిపోవును. నేనొక కఠినమగు కాలపట్టిక ననుసరించెడివాడను. దానిని తప్పకుండుటకు నేను నా మామూలు యాచారములను. నిత్య క్షురకర్మవంటివాటిని, చాలవరకు జరుపుకొనెడివాడను. నేనీ స్వల్పవిషయము నుదహరింపవలసివచ్చెను. ఏలనన మనవారు దీనిని మానివేసి దీనితో నితరవిషయముల యెడలగూడ మాంద్యులగుచుండిరి. పగలంతయు పాటుపడిపనిచేయుటచే రాత్రి నాకు హాయిగ నిద్రపట్టెడిది.

ఇట్లు రోజులు, వారములు, నెలలు గడచిపోవుచుండెను. కాని యొకొక్కప్పు డొకమాసము పెనుభూతమువలెనుండి చప్పున గడవదు. ఒకొక్కప్పుడు నాకు విసుగు, వేసరిపాటు కలుగును. నాకందరియెడల నన్నింటియెడల, జయిలులోనున్న నా యెడల, సహచరులయెడల, జయిలు అధికారులయెడల, బయటనున్న ప్రజ

లోక పనిని చేయలేదనియో, చేసిరనియో వారియెడల, బ్రిటిషు సామ్రాజ్యముయెడల, సందర్భికంబును నాయెడల కోపముకలుగు చుండెడిది. నేను జయిలు జీవితముచే కలుగు వివిధభావోద్రేకములకు తావిచ్చు యుద్రేకముల ప్రాపునగుదును. అదృష్టవశమున నే నీయుద్రేకములనుండి త్వరితముగ స్వస్థతనొందెడివాడను.

జయిలులో బంధుమిత్రదర్శన దినములు సుఖావహములైనవి. దినములను లెక్కించుకొనుచు వాటికొరకు నే మెట్లు వేచియుండెడి వారము! ఆ బంధుదర్శనోద్రేకము చల్లారినతోడనే తిరిగి యంతయు చప్పబడెడిది. మామూలుఒంటరితనము, శూన్యత తప్పెడివికావు. ఒకొక్కప్పుడు తటస్థించున ట్లది జయప్రదముగ నుండనిచో తరువాత నేను దుఃఖపడెడివాడను. ఈ సమయములో జయిలు అధికారు లుండెడివారు. కాని బెరెల్లిలో రెండుమూడుసారులు వీరికితోడు రహస్యశాఖకు చెందినవాడొకడు కాగితము పెన్సిలుపుచ్చుకొని మేము మాట్లాడు ప్రతియక్షరము వ్రాసికొనుచుండును. ఇది నాకు చాల కోపము కలిగించుటచే నివి పూర్తిగ చెడిపోయెను.

అలహాబాదుజయిలులో నన్ను చూడవచ్చినపుడు, తరువాత ప్రభుత్వము నాతల్లి యెడలను భార్యయెడలను చూపిన యమర్యాద ప్రవర్తనచే నేను వీటిని మానివేసితిని. సుమారేడు నెలలవరకు నేనెవ రిని దర్శించలేదు. ఆ కాలము నాకుశంతో మరహితముగ కాన్పించెను.

నేను తిరిగి బంధుదర్శనము చేయుటకు నిశ్చయించినతరువాత మా బంధువులు నన్ను చూడవచ్చినపుడు నా కమితానందము కలి గెను. నా చెల్లెలి చిన్నబిడ్డలుకూడ నన్ను చూడవచ్చిరి. వారిలో కడ గొట్టుబిడ్డ నాభుజములమీద కెక్కగోరినపుడు నేనుద్రేకమును పట్ట జాలకపోతిని. మానవస్పర్శానందము నభిలషించుచుండిన నా కా గృహజీవిత స్పర్శ సుఖదుఃఖములను కలిగించెను.

బంధుదర్శనములను మానివేసినపుడు యింటివద్దనుండియు నితర జయిలునుండియు వచ్చు పాక్షికలేఖలతిప్రియములగుచుండెను. మేము వాటికొరకాతురతతో నెదురుచూచుచుండెడివారము. అనుకొనిన

రోజున యుత్తరమురానిచో నేను చాల బాధపడెడివాడను. అయినను అది వచ్చినయెడల దానిని విప్పుటకు సందేహించెడివాడను. ధృవముగు నానందముతో చెలగాటమాడునట్లు నేను దానితో నాడెడివాడను. ఆ యుత్తరములో నాకు విచారముకలిగించువార్త, విషయములుండు నేమో యను భయముకూడ నుండెడిది. ఉత్తరములను వ్రాయుట యుత్తరములను తీసికొనుట జయిలులోని ప్రశాంతజీవితముపు నిశ్చల స్థితికి భంగకరము. అవి స్వాస్థ్యమును చెదరగొట్టు భావోద్రేకము కలిగించెడివి. తరువాత నొకటిరెండు రోజులవరకు మనస్సు చెదరి పోవుచు నిత్యకృత్యములమీద ధ్యానముంచుట కష్టమయ్యెడిది.

నైనీ, బెరిల్లీలలో నాకు చాలమంది సహచరులుండెడివారు. డేరాడూనులో మొట్టమొదట గోవిందవల్లభపంతు, కున్వరఆనంద సింగు, నేను యుండెడివారము. కాని రెండునెలలయిన తరువాత పంతుజీ యతనిశిక్షాకాలము పూర్తియగుటతోడనే విడిచిపెట్టబడెను. తరువాత మమ్ము మరిద్దరు కలుసుకొనిరి.

1933 జనవరిప్రారంభములో నా స్నేహితులందరు వెడలిపోవు టచే నేనొక్కడినే మిగిలితిని. సుమారెనిమిదినెలలవరకు, ఆగష్టు మాసాంతమున నేను విడుదలయగువరకు డేరాడూనుజయిలులో నే నొక్కడనే యుంటిని. జయిలుఅధికారులు రోజు కేకొలదినిమిష ములో మాట్లాడుటతప్ప యిక నాతో మాటలాడువారెవరు నుండెడి వారుకారు. ఇది పేరు కేకాంతవాసము కాదు. కాని దానికి చాల చేరికయైనది. ఇది నాకు దుఃఖమయమగుకాలము. అదృష్టవశాత్తునేను నాబంధుదర్శనములనుతిరిగిప్రారంభించుటచే నాకుకొంతయుపశాంతి కలుగుచుండెను. నేనుబయటనుండి పువ్వులను, కొద్దిపటములను తెప్పిం చుకొనవచ్చుననిరి. అవి నాకెంతయో యానందము చేకూర్చెడివి. మామూలుగ పటములను, పువ్వులను లోపలకు రానీయరు. అనేక సారులు నాకొఱకు పంపబడిన పువ్వులను నాకిచ్చుటకు నిరాకరించిరి. మాగదులనలంకరించుకొనుటకుచేయుప్రయత్నముల నెంతమాత్రము ప్రోత్సహించెడివారుకారు. నా ప్రక్కగదిలోనున్న నా సహచరు

డొకడు తనయలంకార సామగ్రి నొక క్రమములో నుంచుకొనగా జయిలు సూపరింటెండెంటు దాని కభ్యంతరము చెప్పెను. తనగది నాకర్షవంతముగ, "భోగయోగ్యము"గ చేయరాదని యతడు వారింపబడెను. ఆ విలాసవస్తువు లేవియనిన పండ్లుతోముకొను బ్రష్, పండ్లపొడి, ఫౌంటెన్‌కలము, దానికికావలసిన సిరా, తలనూనెసీసా. దువ్వెన, తలను సింగారించుకొను బ్రష్, మరియొకటి రెండు చిన్నవస్తువులు.

జీవితములోని చిన్నవస్తువులవిలువ జయిలులో బాగుగ గుర్తింపబడును. అచ్చట మనకుండువస్తువు లతిస్వల్పము. వాటికిమరి కొన్నిటిని జేర్చుకొనుట, బదిలీగా తెచ్చుకొనుట సులభవిషయము గాదు. బయటప్రపంచములో మనము పారవేయుచుండు చిన్నవస్తువులనచ్చట ప్రాణప్రదముగ చూచుకొనెదము. విలువవస్తువుల నుంచుకొనుటకు వీలులేనిచోటగూడ ఆస్తియుండవలెనను భావము మనలను విడకుండును.

ఒకొక్కప్పుడు శరీరసుఖము, హాయిగొల్పు పరిసరములు, మిత్రబృందము, ప్రయోజనకరసంభాషణ, పిల్లలతో నాడుకొనుట... వీటికొరకు శరీర మూవేదనపడును. ఒకపటము లేక వార్తాపత్రికలోని యొక పేరా యౌవన పర్వదినములను కండ్లకుకట్టినట్లు జ్ఞప్తికి తెచ్చును. తోడనే యింటిమీద దృష్టిపాఱును. ఆ దినమంతయు చిరాకుగనుండి గడుపుట గగనమగును.

నేను ప్రతిదినము కొద్దిగ వడికెడివాడను. దీనివలన నాకు సుఖముగు శరీరకష్టముకొంత ప్రాప్తించెడిది; మానసిక పరిశ్రమకు కొంత విరామముగనుండెడిది. కాని వ్రాసికొనుట, చదువుకొనుట నాప్రధాన వృత్తి. నిర్బంధములు, తణిఖీచేయుటయుండుటచే నాకుకావలసిన పుస్తకములు లభించెడివికావు. తణిఖీచేయుటకెల్లప్పుడు సమర్థులుండెడివారు కారు. శీర్షిక ఉపద్రవకరముగ రాజద్రోహాకరముగనున్నదని స్పెంగ్లరు యొక్క "పాశ్చాత్యుల పతనము" అను పుస్తకము నాపివేసిరి. మొత్తముమీద నాకనేకరకముల పుస్తకములీయబడుటచే నేనెట్టి ఫిర్యాదుచేయరాదు. నాయెడల ప్రత్యేకాభిమానము చూపబడినట్లు

కాన్పించును. నా సహచరులు చాలమందికి ("ఎ"తరగతిఖయిదీలు) వర్తమాన పరిస్థితులనుగురించిన పుస్తకములు దొరకుట దుర్ఘటమయ్యెడిది. బ్రిటిషుప్రభుత్వమువారి చట్టసంబంధమైన మార్పులను సూచించు అధికార శ్వేతపత్రములుగూడ కాశీజయిలులో నిరాకరింపబడెనని చెప్పిరి. మత పుస్తకములను లేక నవలలను మాత్రమే ప్రభుత్వ అధికారులు హృదయపూర్వకముగ శిఫారసుచేసెడివారు. మతము బ్రిటిషుప్రభుత్వహృదయమున కెంతప్రియమైనది! అది యెంత నిష్పాక్షికముగ మతముద్రగలసమస్తమును ప్రోత్సహించును!

భారతదేశములోసామాన్యపౌరస్వత్వములే త్రుంచివేయబడుచుండ ఖయిదీలహక్కులనుగురించి మాట్లాడుట యసమంజసమగును. అయినను యీవిషయము యోచింపదగినది. కోర్టువారిచే శిక్షింపబడినంతమాత్రముచే నొకనిశరీరమేగాక మనస్సుకూడ నిర్బంధింపబడవలెనను న్యాయ మెచ్చటకలదు? ఖయిదీలశరీరములు నిర్బంధింపబడినను వారిమనస్సులు స్వేచ్ఛగనుండగూడదా? భారత జయిలుపరిపాలనాధికారులు లట్టిప్రశ్నను వినినపుడు నిర్ఘాంతపోయెదరు. ఏలనన నూతనభావములను యోగ్యమగు యోచనలను చేయుటకు వారిశక్తి యత్యల్పము. పుస్తకములను తణిఖీచేయుపద్ధతి యేకాలమందు మంచిదికాదు. అది పక్షపాతముగను బుద్ధిహీనముగను నుండును. భారతదేశములో నది మన కాధునికసాహిత్యమును, పురోభివృద్ధిలో నున్న పత్రికలను, జర్నలులను లేకుండచేయును. నిషేధింపబడిన పుస్తకములసంఖ్య విస్తారముగ నుండుటయేగాక నది నిత్యాభివృద్ధి యగుచుండును. వీటికి తోడు ఖయిదీకి రెండవతణిఖీ (ప్రత్యేకతణిఖీ) యుండుటచే నతడు బయట న్యాయముగ కొని చదువుకొనుట కవకాశముగల యనేక పుస్తకములను వార్తాపత్రికలను చదువుకొనుటకు వీలుండదు.

న్యూయార్కులోని సింగుసింగు జయిలులో కొంతకాలము క్రిందట కొన్ని కమ్యూనిస్టు పత్రికలను నిషేధించుటచే నీసమస్య చర్చకు వచ్చెను. అమెరికాలోని పాలకజాతులలో కమ్యూనిస్టులపై

వ్యతిరేకభావ మతితీవ్రముగ నుండెను. అయినప్పటికి జయిలులో నున్నవారు తమకు కావలసిన యే పుస్తకమునైనను కమ్యూనిస్టు వార్తాపత్రికలు మేగజినులుసహా తెప్పించుకొనుటకు జయిలు అధికారు లొప్పుకొనిరి. జయిలు వార్డెను ద్వేకములను కలిగించునని తలంచి కార్టూనులు మాత్రమే పనికిరావనెను.

అధికసంఖ్యాకులగు ఖయిదీల కెట్టివార్తాపత్రికలు వ్రాతసౌకర్యములు కలుగనీయని భారతదేశములో ఖయిదీలకు మానసిక స్వాతంత్ర్యముండవలెనను సమస్య చర్చించుట కొంచెము పరిహాసాస్పదముగనుండును. ఇది సంపూర్ణ నిరాకరణముగాని తణిఖీకాదు. ఒక్క 'ఎ' క్లాసుఖయిదీ (వంగదేశములో 1వడివిజను)కి వ్రాత సౌకర్యములను కలిగింతురు. వీరందరికైనను దినపత్రికల నీయరు. ఇవ్వబడు పత్రిక ప్రభుత్వము కిష్టమైన దినపత్రిక. 'బి' 'సి' తరగతుల ఖయిదీలకు, రాజకీయఖయిదీలకైనను, తదితరులకైనను, వ్రాత సౌకర్యములుండవు. ఒకొక్కప్పుడు వీరిలో మొదటివారి కివి ప్రత్యేకసౌకర్యములుగ ప్రసాదింపబడి తఱచు లాగివేయబడుచుండును. వేయింటికొక్క 'ఎ' తరగతి ఖయిదీ. భారతదేశఖయిదీల దుస్థితినిగురించి యోచించునపుడు వీరిని మినహాయింపవచ్చును. కాని యట్లభిమానింపబడు 'ఎ' తరగతి ఖయిదీకి పుస్తకములు వార్తాపత్రిక సౌకర్యములు నాగరికదేశములో సామాన్యఖయిదీల కీయబడు వాటికంటె చాలతక్కువ.

వేయింట తక్కిన 999 మంది తడవకు రెండుమూడు పుస్తకముల నుంచుకొనవచ్చును. కాని వారీ సౌకర్యము నెల్లప్పుడు పొందజాలని మరతులుండును. వ్రాసికొనుట చదివిన పుస్తకముల నుండి నోట్సు తీసికొనుట యుపద్రవకర వినోదములు. వారట్టి భోగములలో మునుగరాదు, మానసికాభివృద్ధి నీవిధముగ బుద్ధిపూర్వకముగ నిరుత్సాహపరచుట చోద్యము. ఇది యదార్థమును విదితముచేయుచు నేయున్నది. ఖయిదీని సంస్కరించుటకు, నతనిని యోగ్యమగు నాగరికుని చేయుటకు, నతని మనస్సును

గ్రహించవలెను. దానిని సరియగు మార్గముకు త్రిప్పవలెను. అతనికి చదువుచెప్పి యేదో యొకవృత్తి నేర్పవలెను. కాని భారతదేశములో జయిలుఅధికారుల కీవిషయము, యీ దృష్టి బహుశః గోచరించదు. యు.పి. రాష్ట్రములో నిశ్చయముగ నిట్టిదేదియుకానరాదు. జయిలులోనున్న పిల్లలకు యువకులకు చదువును వ్రాయను నేర్పుటకు నవీనముగ కొన్నియత్నములు చేయబడెను. కాని యివిపూర్తిగ నిరర్థకములు. ఆపనికి నియోగించబడినవా రసమర్థులు. ఖయిదీలకు చదువుకొనుట యనిన గిట్టదట. కాని నాయనుభవము దీనికి కేవలము వ్యతిరేకము. దీనికొఱకుచాలమంది నాదగ్గఱకువచ్చుచుండిరి. చదువుకొనుటకు, వ్రాసికొనుటకు వారిలో సంపూర్ణయుత్సాహముకాన్పించెడిది. మాదగ్గరకువచ్చిన ఖయిదీలకు మేము చదువుచెప్పెడివారము. వారు కష్టపడి పనిచేసెడివారు. ఒకొక్కప్పుడు నేను నిశీథమందు మేల్కాంచినపుడు వారిలోనొకరిద్దరు తమ కొటూరులో నొక గుడ్డిలాంతరుదగ్గర కూర్చుని చదువుకొనుట చూచి యాశ్చర్యపడెడివాడను. వారు మరునాటి పాఠముకు తయారగుచుండెడివారు.

నేను నాపుస్తకములలో మునిగియుండి రకరకములపుస్తకముల చదువుచుండెడివాడను. కాని మామూలుగ 'కఠిన' పుస్తకములనే చదువుచుండెడివాడను. నవలలుమానసికమాంద్యముకలుగచేయును. నేను వాటి నెక్కువ చదువలేదు. ఒకొక్కప్పుడెక్కువగచదువుటచే నేనువిసుగుచెంది వ్రాయుట ప్రారంభించెడివాడను. నాకుమారైకు నేను వ్రాసిన చారిత్రకలేఖలు నా రెండుసంవత్సరముల శిక్షాకాలమునకు నాకు సరిపడిన పనికలిగించి, నామానసికస్వాస్థ్యముకెంతయోతోడ్పడెను. నేను వ్రాయుచుండినభూతకాలచరిత్రలో కొంతవరకు జీవించు నేను నా జయిలుపరిసరములను కొంచెమించుమించు మరచిపోతిని.

పురాణయాత్రీకుల గ్రంథములు-హూనిట్సాంగు, మార్కోపోలో, ఇబన్‌బటూట మొదలగువారి గ్రంథములను, ఆధునికులగు స్వెన్‌హెడెన్, రోరిక మొదలగువారి గ్రంథములు సత్కరింపబడుచుండెను. చిత్రములుగల పుస్తకములుకూడ, ముఖ్యముగ పర్వత

ములు,మంచుదిబ్బలు, యెడారులుగలవి,యాహ్వానింపబడుచుండెను. ఏలనన జయిలులో విశాలసీమలకొఱకు.సముద్రముల కొఱకు,పర్వత ములకొఱకు పరితపించుచుందుము. నావద్ద ఆల్ప్సు, బ్లాంకు, హిమాలయపర్వతముల సుందరచిత్రములుగల పుస్తకములు కొన్ని యుండెడివి. నాగదియొక్క యుష్ణత 115 ఫారెన్‌హీట్ యున్నపుడు నేను తెఱచు యీ పటములనుతీసి మంచుదిబ్బలను తదేకదృష్టితో చూచుచుండెడివాడను. అట్లాసు (దేశములనుచూపు చిత్రములుగల పుస్తకము) మంచి హుషారు పుట్టించెడిది. అది యున్నివిధముల భూతకాలచరిత్ర జ్ఞప్తికి తెచ్చుచుండెడిది. నేనుచూచిన దేశములను గురించిన కలలు, చూడదలచుకొనిన ప్రాంతముల కలలు వచ్చుచుండెడివి. వెనుక తిరిగిన ప్రదేశములను చూడవలెనను కోరిక — గొప్పగొప్ప పట్టణములను సూచించు నితరమార్కులను, చుక్కలను, పర్వతములను సూచించు రంగులుగల ప్రాంతములను, సముద్రములను సూచించు పచ్చనిసీమలను, ప్రపంచములోని శృంగార విశేషములను, నిరంతరము మారు మానవలోక పోరాటములను, సంఘర్షణలను పరీక్షింపవలెననుకోరిక లుద్భవించి మమ్మావహించెడివి. ఇంతలో నేము తొందరగ, విచారముతో అట్లాసు మూడిచి వేసి, మమ్మావరించియుండిన మా మామూలుగోడలకు దైనందిన రసహీన నిత్యకర్మలకు బూనుకొనెడివారము.

45

జయిలు జంతువులు

నేను డేరాడూనుజయిలులో నాగదిలో పదునాలుగున్నర మాసములు నివసించుటచే కొంచెమించుమించు దానిలో నొకభాగమయినట్లు భావింపనారంభించితిని. అందులోనున్న ప్రతిభాగముతో నాకు పరిచయముకలిగెను. వెల్ల వేయబడిన యాగోడలమీద, నునుపులేని నేలమీదగల ప్రతిచిహ్నము, మిట్టపల్లములు, చెద తినివేసిన దూలములలోనున్న పయికప్పుభాగము నాకు బాగుగా తెలియును. బయటనున్న చిన్నదొడ్డిలోగల చిన్నచిన్నపచ్చికసీమలను, అందముకొఱకమర్చబడిన రాతిముక్కలను నేను ప్రాతస్నేహితులవలెచూచుకొనుచుండెడివాడను. నాగదిలో నేనొక్కడినేగాక నాతోకందిరీగలు, తుమ్మెదగుంపులనేకములుండెను. దూలములవెనుక ననేకబల్లులు నివసించుచు సాయంత్రమాహారముకొఱకు బయటకు వచ్చుచుండెడివి. ఆలోచనలు, భావములు భౌతిక పరిసరములమీద తమచిహ్నములను విడిచిపెట్టునెడల నాగదిలోని వాయువుకూడ వాటిచే పూరింపబడి యుండును. అవి యాప్రదేశములోనున్న ప్రతివస్తువుకుకూడ పట్టుకొని యుండును.

ఇతరజయిళ్ళలో నాకు మంచిగదులే యుండెడివి. కాని డేరాడూనులో నాకొక యమూల్య సౌకర్యముండెడిది. ప్రధానజయిలుభాగము చాలచిన్నది. జయిలు వెలుపలనున్న యొక పాతకొట్టులో (జయిలు ఆవరణలోనే) మమ్ము పెట్టిరి. మే మందులో తిరుగుట కెంతమాత్రము చోటులేకపోవుటచే నుదయ సాయంత్రములయందు గుమ్మముముందర నొకవందగజములదూరము మమ్ము నడువనిచ్చెదరు. మేము జయిలుకాంపౌండులోనేయున్నను గోడలనుదాటి బయటకు వచ్చుటచే కొంతదూరములోనున్న పర్వతములను, పొలములను, బహిరంగరోడ్డు చూడగలిగెడివారము. ఇది నాకొసంగబడిన ప్రత్యేకసౌకర్యముకాదు. డేరాడూనుజయిలులోనుంచబడు 'ఎ' 'బి' తరగతి ఖయిదీలందఱకు నిది సమముగనుండెను. కాంపౌండులోనే జయిలుగోడల

బయట యూరపియనులనుంచు మరియొక చిన్నభవనముకలదు. దీని చుట్టు ప్రత్యేకగోడలేదు, కనుక గదిలోనున్న మనిషి సుందర పర్వత దృశ్యములను, బాహ్యజీవితములను అనుభవింపవచ్చును. ఇచ్చటనుంచబడు యూరపియను ఖయిదీలు తదితరులుకూడ జయిలుగుమ్మముముందర ప్రతి యుదయసాయంత్రములందు నడువవచ్చును.

చిరకాల మెత్తైనగోడల వెనుక బంధింపబడిన ఖయిదీయే యీ విహారముల యొక్కయు నీబహిరంగదృశ్యముల యొక్కయు నసామాన్య యాధ్యాత్మికవిలువ గ్రహింపగలడు. ఈ విహారములను నేనెంతయో ప్రేమించుటచే వర్షకాలములోకూడ, నిరంతర ధారాపాతమున్నను, చీలమడమలోతునీళ్ళలో నేనునడచిపోవుచుండెడివాడను. ఇట్టివిహారములను నేనెచ్చటనైనను యనుభవించెడివాడను. కాని ప్రక్కనున్న మహత్తరమగు హిమాలయపర్వతదృశ్యము నాసంతోషమును ద్విగుణముచేసి జయిలుఖేదము నపనయించుటయు చాలవరకుతోడ్పడెను. ఎట్టి బంధుదర్శనము లేక నొంటరిగనున్న యాదీర్ఘకాలములో నే నెక్కువగా ప్రేమించిన ఈపర్వతములను వీక్షించుచుండగలుగుట నాభాగ్యము. నాగదిలోనుండి నేను వాటినిచూడజాలను. కాని నా హృదయము వాటిచేనిండియుండెను. అవి సమీపమున నున్నసంగతి నాకెప్పుడు జ్ఞప్తియందుండి మామధ్య నొకరహస్యపరిచయ మభివృద్ధి యగుచున్నట్లుండెను.

“దూరమున గగనమార్గమున ఖేచరపంక్తులెగిరిపోవుచుండెను. ఒకయేకైకనీలనీరదశ్రేణికూడయాత్రచేయుచు చలచలజరిగిపోయెను. వెనుకనున్న మహోన్నతచింగుటింగుశిఖరముతో నేనొంటరిగకూర్చొనెదను. మేమెన్నడును (ఆ పర్వతము, నేను) పరస్పరము విసుగుచెంది యెరుగము” అని లీకైపో యనునొకకవివ్రాసెను. అతనివలె పర్వతముతో నెప్పుడు విసుగుచెందలేదని నేనుచెప్పజాలను. కాని యాయనుభవ మసామాన్యమైనది. దానిసాన్నిధ్యము నాకానందము కలుగచేసెను. దానినిశ్చలత, దానిస్థైర్యము లక్షలకొలదివత్సరముల యను

భవజ్ఞానముతో నన్ను తిలకించుచు నా చంచలభావముల నెగతాళి చేయుచు నా క్లేశపూరితమనస్సు నుపశమింప జేయుచుండెను.

ఢేరాడూనులో వసంతకాల మతిముదావహముగ నుండును. క్రిందమైదానములలో నుండుదానికంటె నది యిచ్చట హెచ్చుకాల ముండును. శీతకాలము చెట్లయాకులన్నింటిని రాల్చివేసి మోడులను చేసెను. జయిలుద్వారమునకుందరనున్న నాలుగుమహోన్నతయశ్వత్థ వృక్షములుకూడ కొంచెమించుమించు యాకుల నన్నింటిని రాల్చి వేయుట నాకెంతయో యాశ్చర్యము కలిగించెను. అవి బక్కచిక్కి, సంతోషముదక్కి వసంతకాల ప్రాణవాయువులు తిరిగి వాటికుత్సాహముగొల్పి, వాటియంతర్నాడులకు జీవితసందేశమును పంపువరకు నట్లేనిలిచియుండెను. అకస్మాత్తుగా నారావులలోను, తదితర చెట్లలోను చైతన్యముద్భవిల్లెను. తెరమఱుగున జరుగు రహస్యక్రియావిశేషములవలె వానినొకరహస్యావాతావరణమావరించెను. వాని యన్ని భాగములనుండియు పచ్చదనము తొంగిచూచుచుండుటను చూచి నేనాశ్చర్యచకితుడనైతిని. ఆదృశ్యము సంతోషోత్సాహ జనకముగ నుండెను. ఇంతలోనతివేగముగ లక్షలుపదిలక్షలుకొలదిగ లేతయాకులు సూర్యరశ్మిలో తళతళ ప్రకాశించుపిల్లవాయువులతో కేళిసల్పుచుండును. చిగురు, వర్ణములోపల కలుగు నకస్మాత్ పరిణామమెంత యద్భుతమైనది !

లేమావిచిగురు కాశ్మీరుపర్వతములమీద శరత్కాలవర్ణముల వలె చెంగావి వర్ణము కలిగియుండునని నేనంతకుముందెన్నడు గ్రహించియుండలేదు. కాని వెంటనే రంగుమారి యది పచ్చబడును.

వేసవికాల తాపమును చల్లార్చునుగనుక ప్రావృట్కాల వర్షము లెప్పుడును హాయిగొల్పును. కాని యవి యెందును పనికిరావు. ఢేరాడూను వరుణదేవునకు ప్రియమైన ప్రదేశము. వర్షఋతువు ప్రారంభమైన మొదటి యైదారువారములలో నేబది లేక నరువది యంగుళముల వర్షముకురియును. కిటికీలనుండియు, పైకప్పులనుండియు, పడు వర్షధారలను తప్పించుకొనుటకు కాళ్ళుముడిచికొని యేమూలనో

కూర్చొనియుండుట సంతోషప్రదమైన విషయము కానేరదు.

శరత్కాలముకూడ సుఖముగనుండును. శీతాకాలముకూడ, వర్షము లేనిచో నట్లేయుండును. ఉరుములు, వర్షము, గడగడలాడించు చలిగాలులు వెలువడునప్పుడు చక్కనిభవనము, సుఖము, తగిన యుష్ణత యుండవలెనను కోరికపుట్టును. అప్పుడప్పుడు గోళీలకంటె పెద్దవియగు వడగండ్లు రేకుకప్పులమీద దబడదిబడ పడుచు ఫిరంగి మ్రోతవలె నట్టహాసముచేయును.

ముఖ్యముగా నాకొక్కదినము జ్ఞప్తియందున్నది; అది 1932 డిసెంబరు యిరువదినాలుగవ తేదీ. ఆ దినమంతయు వడగండ్లవర్షము. వర్షముకురియుచు చలి మిక్కుటముగ నుండెను. నేను జయిలులో గడపిన దినములలో నది దుర్దినమని చెప్పవలెను. సాయంకాల మకస్మాత్తుగ తెరిపియిచ్చెను. దగ్గరనున్న పర్వతములు, గుట్టలు దట్టమగు మంచుతో కప్పబడిన దృశ్యమును చూచినపుడు నా విచారమంతయు పలాయనమయ్యెను. మరునాడు క్రిస్టమసు పండుగ. నిర్మలముగ నానందదాయకముగను నుండెను.

మా మామూలువిధులను నెరవేర్చుకొనుట కాటంకము కలుగుటచే మేము ప్రకృతిరహస్యముల నెక్కువగ పరీక్షించుచుంటిమి. మేము మాకు కాన్పించువివిధజంతువులను పురుగులనుకూడ పరిశీలించుచుండెడివారము. నేను పరీక్షించుచుండినకొలది నాగదిలోను, బయటనున్న చిన్నదొడ్డిలోను అనేకరకములగు కటకములను చూచుచుండెడివాడను. ఒంటరితనమును గురించి నేను ఫిర్యాదుచేయుచుండినను శూన్యముగను యెడారివలెను కాన్పించిన యీదొడ్డి జీవరాసులతో నిండియున్నట్లు నేను కనుగొంటిని. ప్రాకునట్టి లేక యెగురునట్టి యీ కీటకములన్నియు నన్నెంతమాత్రము బాధింపక తమ జీవితమును గడుపుకొనుచుండ నేనుకూడ వాటిజోలికిపోవుటయుక్తముకాదనుకొంటిని. కాని నల్లులకు, దోమలకు, కొంతవరకు నీగలకు నాకు మధ్య నిరంతరపోరాటము జరుగుచుండెడిది. నాగదిలో వందలకొలదిగనున్న కందిరీగలను తుమ్మెదలను నేను సహించితిని.

ఒక కందిరీగ నన్ను కుట్టినపుడు మా కొక చిన్నసంగ్రామము జరిగెను, ఆకోపములో నే నాజాతినంతను నాశనముచేయ యత్నించితిని. కాని యవి తమ తాత్కాలికాశ్రయమును కాపాడుకొనుటకు చెలరేగి ఘోరసంగ్రామము సలిపెను. నేను తగ్గిపోయి యవి యిక నా జోలికి రాకపోయినచో వానిని సుఖముగ జీవింపనీయవచ్చునని నిశ్చయించుకొంటిని. తరువాత నేనచ్చట సుమా రొక వత్సరము కందిరీగలతోడను, తుమ్మెదలతోడను నివసించితిని. అవి నా జోలికెన్నడురాలేదు. మేము పరస్పరము గౌరవించుకొనెడివారము.

గబ్బిలములనిన నా కసహ్యము. అయినను నేను వానినిసహింపవలసివచ్చెను. సంజచీకటిలో నవి నిశ్శబ్దముగ నెగురుచు వినీలాకాశములోనికి పోవుట చూచెడివాడను. అవి భూమితో సంబంధములేని జంతువులు. అవియనిననాకుభయము. అవి సరిగా ముఖమునకొకయంగుళముదూరమునుండి రయ్యిమని యెగిరిపోవుచుండును. అవి నా ముఖమును గీరునేమోయని నేనెప్పుడు భయపడెడివాడను. పెద్ద గబ్బిలములు చాల యెత్తైన వాయువులో పోవుచుండెడివి.

నేను చీమలను చెదను యితరకీటకములను గంటలకొలది పరీక్షించుచుండెడివాడను. సాయంకాలము బల్లులు మెల్లగా ప్రాకివచ్చి యాహారముకొఱకు కీటకములను వేటాడుచు తోకల నొక వింతవిధముగ నాడించుచు నొండొరులను తరుముకొనుచుండెను. సామాన్యముగ నవి కందిరీగలజోలికిపోకుండెను. కాని యవి వాటి నతిజాగ్రతతో వేటాడి ముందునుంచి పట్టుకొనుట నేను రెండుసార్లు చూచితిని. పట్టుబడకుండుట కవి యట్లు బుద్ధిపూర్వకముగ చేయునో లేక నవి యాగంతుక సంభవములో నేను చెప్పజాలను.

ఉడుతలు చెట్లుదగ్గరున్నచో గుంపులుగుంపులుగ నుండెడివి. అవి చాలసాహసమునుచూపుచు మాసమీపమునకువచ్చుచుండెడివి. లక్నోజయిలులో నేను కదలకుండకూర్చొని చాలసేపు చదువుకొనుచుండ నొకయుడుత చఱచఱ నా కాలుమీదకెక్కి నా మోకాలుమీద కూర్చుని సింహావలోకము చేయును. తరువాత నది నా కండ్ల

కేసిచూచి నేను చెట్టును కాదని గ్రహించెడిది. అప్పుడు భయమావహించుటచే నది పారిపోవును. ఒకొక్కప్పుడు యుడుతపిల్లలు చెట్లమీదనుండి క్రిందపడిపోవుచుండును. వెంటనే తల్లి పరుగెత్తుకొనివచ్చి వాటినియుండ క్రిందచుట్టి తీసికొనిపోవును. అప్పుడప్పుడు పిల్లలు తప్పిపోవుచుండును. నా స్నేహితుడొకడు తప్పిపోయిన పిల్లలను మూటిని పట్టుకొని పోషించెను. అవి చాల చిన్నవి. వాటిని పోషించుట మాకొక సమస్య యయ్యెను. చివరకొక చక్కని మార్గము దొరకెను. ఊటకలములో సిరాపోసికొను గాజుగొట్టముతో వాటి కాహారము నిచ్చుట కేర్పాటుచేయబడెను.

నేను వెళ్ళిన యన్నిజయిళ్ళలోను, ఒక్క ఆల్మోరాలోతప్ప, పిచ్చుక లసంఖ్యాకములుగ నుండెడివి. అవి వేలకొలదియుండి సాయంకాలమగుసరికి యాకసమును కప్పివేయుచుండెను. ఒకొక్కప్పుడు జయిలు అధికారులు వాటిని తుపాకులతో కాల్చి చంపి యాహారముగ చేసికొనెడివారు. గోరువంకలు ప్రతిచోటనుండెడివి. డేరాడూనులో నాగదిగుమ్మముపై నొకదంపతి గూడుకట్టుకొని నివసించుచుండెను. నేను వాటికాహారము పెట్టెడివాడను. అవిచాలమచ్చికపడెను. ఉదయ సాయంకాలములయందు వాటియాహారమున కేమాత్రము ప్రొద్దుపోయినను యవి నాదగ్గరకూర్చుని బిగ్గరగా కేకలు వేయును. అవి చేయు సంజ్ఞలను పరీక్షించుచుండుటయు తాల్మిలేని వానియరపులను వినుటయు వినోదకరముగ నుండును

నైనీలో వేలకొలది రామచిలుకలుండెను. నాకొటారుయొక్క గోడలలోని కన్నములలో నవి తెగలక్రింద నివసించుచుండెను. వాని యుపసర్పణ విధానము, ప్రణయచేష్టలు సదా మనోజ్ఞముగనుండును. ఒక్కొక్కప్పు డొక యాడుచిలుకకొఱకు రెండు మగచిలుకలు ఘోర సంగ్రామము గావించుచుండ నాయాడుచిలుక ప్రక్క నతిశాంతమున కూర్చుని యుద్ధములో జయించినదానిపై తన ప్రేమరసమును చిమ్ముటకు సన్నాహపడుచుండును.

డేరాడూను జయిలులో వివిధరకముల పక్షులు గలవు. వాటి కలకలములు, కిలకిలలు, కూజితములు, కేకలు, కోయిలలగానములు— వినసొంపగుచుండును. వర్షకాలములో తీతువపిట్ట (బుద్ధిజాడ్యముగల పక్షి) వచ్చుచుండెడిది. దానికట్టి పేరెందుకు కలిగెనో నేను వెంటనే గ్రహించితిని. అది రాత్రింబవళ్ళు వర్షించుచున్నను,తీవ్రముగా నెండ కాయుచున్నను, విరామములేకుండా నొక్కపాటనే పాడుచుండును. సాధారణముగ నేమీపక్షులను చూడజాలకుంటిమి. వాటిధ్వనులను మాత్రమే నేము వినగలిగెడివారము. కాని గ్రద్దలు, గరుడపక్షులు గగనమార్గమున నతిరమ్యాకారముగ నెగిరిపోవుచుండ నేను వీక్షించు చుండెడివాడను. అవి యొకొక్కప్పుడు తటాలున క్రిందకుర్రాలుచు తిరిగి పైకెగిరిపోవుచుండును. తఱచు యడవిపక్షుల గుంపు మా తల మీదనుండి యెగిరిపోవుచుండును.

బెరెల్లీ జయిలులో నొక పెద్ద కోతులదండు కలదు. ఇక నవి చేయు చేష్టలకు హద్దులేదు. ఒక కథ నామనస్సుకు బాగుగ పట్టెను. ఒక చిన్నకోతిపిల్ల నా కొట్టుగల యావరణలోని కెట్లోవచ్చి తిరిగి యాగోడ నెక్కి పోజాలకుండెను. జయిలువార్డరు,కొంతమందిఖయిదీ ఓవరుసీర్లు దానిని పట్టుకొని మెడకొక త్రాడుగట్టిరి. దాని తలి దండ్రులు యెత్తైన యా ప్రాకారముపయినుండి యీ కథనంతను చూచుచుండెను. వాటికి హద్దులేని కోపము కలిగెను. అకస్మాత్తుగా వానిలో నొక పెద్దకోతి క్రిందకురికి యా పిల్ల చుట్టూమూగిన మూక నెదుర్కొని యసామాన్యమైన ధైర్యమునుచూపెను. ఏలనన వార్డరు, ఖయిదీ ఓవరుసీర్లు కర్రలను-లాఠీలనుపుచ్చుకొనిగిరగిరత్రిప్పుచుండిరి. చివరకు దాని ధైర్యసాహసములే దిగ్విజయమునొందెను. భయ భ్రాంతులై కర్రలను వెనుక పారవేసి యా మానవమూక పిక్క బలము చూపెను. కోతిపిల్ల స్వజనమును చేరుకొనెను.

మే మెంతమాత్రము నాహ్వానింపజాలని జంతుప్రేక్షకగణము మమ్ము తఱచు చూడవచ్చుచుండెను. మాగదులలో వృశ్చికములకు కొదువలేదు. ముఖ్యముగ వర్షముపడినతరువాత నవి చెలరేగుచుండె

డివి. కాని నన్నిప్పుడు నవి కుట్టకుండు టాశ్చర్యము. వానికి విలువలేని చోట్ల మేము తారసించుట సంభవించెడిది. నా పరుపుమీదనో లేక పుస్తకముమీదనో యని జేరుచుండును. నే నొకసారి యొక నల్లటి విషపుతేలును కొంతకాల మొక సీసాలోనుంచి చిన్న చిన్న యీగల నాహారముగ నిడెడివాడను. తరువాత దాని కొక త్రాడుకట్టి యొక గోడకు వ్రేలాడగట్టగా నది యెటో పారిపోయెను. అది తిరిగి విచ్చలవిడిగా తిరుగునేమో యను భయముచే నేను నా గదినంతను శుభ్రముగా తుడిచి దానికొఱకెంత వేటాడినను నాకది దొరకలేదు.

నా గదులలోను సమీపమునను నాకు రెండు మూడు పాములు కూడ కాన్పించెను. ఒక పామునుగురించిన వార్త పయికిపొక్కెను. తోడనే యది పత్రికాశీర్షికలలో గాన్పించెను. ఈ వినోదమును నే నానందించితిని. జయిలుజీవితము నిస్సారముగనుండును గనుక దీనిని ఛేదించున దేదియైనను సంతోషదాయకముగ నుండెడిది. పాములను నేను మెచ్చుకొనెదనని వానిని నే నాహ్వానము చేసెదనని దీని యర్థముకాదు నేను వాటిని చూచి భయపడను. వాటికాటుకు నేను భయపడి పామును చూచినచో నన్ను రక్షించుకొనజూచుట నిజము. కాని పామనిన యేహ్యత, విపరీతభీతి నాకులేవు. పురికొసపురుగనిన నాకింతకంటె నెక్కువ భయము. అదియనిన భయముకంటె సహజమగు యేవగింపు యెక్కువ. కలకత్తాలోని ఆలిపూరుజయిలులో నర్ధరాత్రివేళ లేచి నా కాలుమీద నేదియో ప్రాకుచున్నట్లు తెలిసికొంటిని. నాదగ్గరనున్న టార్చిలైటును నొక్కిచూడగా నా పరుపుమీద నొకపురికొస కాన్పించెను. అప్రయత్నముగ నే నద్భుత రయమున యాపరుపుమీదనుండి గదిగోడకుతగులునట్లు రివ్వున వ్రాలితిని.

డేరాడూనులో నేనొక క్రొత్తజంతువును చూచితిని, లేక నామట్టుకది క్రొత్త. నేను జయిలుద్వారమువద్ద నిలచి జయిలరుతో మాట్లాడుచుండ బయట నొకమనిషి యొక క్రొత్తజంతువునుతీసికొని వెళ్ళుచుండెను. జయిలరు వానిని పిలిపించెను. అప్పుడు నేనతనిచేతిలో బల్లికి మొసలికి మధ్యరకములోనున్న రెండడుగుల జంతువునుచూచితిని. దాని యొడలునిండ పొలుసులు, కాళ్ళకుపంజాలు గలవు. బ్రతికి

యున్న యీ వికారపుజంతువు గుండ్రముగ నొకవింతచుట్టవలె చుట్టబడెను. దానియజమాని దానిచుట్టుగుండ నొక కఱ్ఱనుపోనిచ్చి దాని నతిహుషారుగ మోసుకొనిపోవుచుండెను. అతడు దానిని ‘‘బా’’ యని పిలచెను. జయిలరు ‘దానిని నీవేమిచేతు’వని ప్రశ్నించ నప్పుడతడు పకపక నవ్వుచు ‘బజ్జ’ చేసికొనెదనని బదులు చెప్పెను. అతడొక మోటవికుడు. తరువాత నే నది యుడుమని తెలిసికొంటిని.

ఖయిదీలు, ముఖ్యముగా దీర్ఘకాలశిక్ష ననుభవించు వారే వినోదములులేక బాధపడుచుందురు. తఱచు వారే పెంపుడుజంతువునో చేరదీసి దానితో చెలిలాటమాడుచు కొంతయుపశాంతి పొందుచుందురు. మామూలు ఖయిదీల కెట్టి సావకాశము లేదుకాని, ఖయిదీఓవరుసీర్లకు కొంతస్వేచ్ఛగలదు. సామాన్యముగ జయిలు అధికారులు వారికభ్యంతరము చెప్పరు. ఉడుతల నతిసామాన్యముగ పెంచుచుందురు. ముంగిస మరియొక పెంపుడుజంతువు. జయిలులో కుక్కలను రానీయరు కాని పిల్లులను ప్రోత్సహింతురు? ఒకసారి యొక పిల్లిపిల్ల నాతో చెలిమిచేసికొనెను. అది యొక జయిలుఅధికారిదగుటచే నతడు బదిలీయగుటతోడనే యదికూడ లేకపోయెను. అదిలేకపోవుట నాకు కొరతగనుండెను. కుక్కలకు తావులేకపోయినను డేరాడూను జయిలులో నాకు కొన్నికుక్కలతో తలవనితలంపుగ సంబంధముకలిగెను. ఒక జయిలుఅధికారి యొక ఆడకుక్కను తెచ్చెను. అతడు బదిలీయైనపుడు దానిని విడిచి వెడలిపోయెను. పాపము దానికొక నివాసము, యిల్లువాకిలి లేక తూములక్రింద నివసించుచు వార్డరులు పారవేయు రొట్టెముక్కలను తినుచు తిరుగుచుండెను; అది సామాన్యముగ తిండిలేక మాడుచుండెను. నన్ను ప్రధానజయిలుబయట నున్న కొట్టులో నుంచుటచే నది తిండికొరకు నాదగ్గరకు వచ్చెడిది. నేను దానికి విడువకుండ తిండిపెట్టెడివాడను. అదియొక తూముక్రింద కొన్ని కూనలనుపెట్టెను. వీనిలోకొన్నిటి నెవరో తీసికొనిపోయిరి. మూడుమాత్రము మిగిలెను; నేను వాటికి తిండి పెట్టెడివాడను. అందులోనొకదానికి చాలజబ్బుచేసి వైరికోప

ముతో కొట్టుకొనుచుండెను. నేను దానితో చాల బాధపడితిని. నేను దాని కతి జాగ్రతతో సేవచేయుచు నొకొక్కప్పుడు రాత్రి పదిపన్నెండుసార్లు లేసి దానిని చూచుచుండెడివాడను. చివర కది బ్రతుకుటచే నా చికిత్సవలన నది తేరుకొనెనని నేను సంతోషించితిని.

బయట నున్నప్పటికంటె జయిలులోనుండగనే నాకు జంతువులతో నెక్కువసంబంధము. కుక్కలనిన నాకెప్పుడును ప్రీతి. నేను కొన్నిటిని పెంచెడివాడను. కాని నాకితరపనులుండుటచే వానినితగు శ్రద్ధతో చూచుటకు వీలులేకపోయెడిది. జయిలులో వాటిసావాసమునకు నేనెంతయు కృతజ్ఞుడనైతిని. సాధారణముగ హిందువులు తమ యిండ్లలో జంతువులను పెంచుటకొప్పుకొనరు. భూతదయ కలిగి యుండవలెనని వారి వేదాంత మెంత బోధించుచుండినను తఱచు వారతి నిర్లక్ష్యముగను, జంతువుల యెడల క్రూరముగను నుందురు. చాలమంది హిందువులచే నతిఘనముగ చూడబడుచు పూజింపబడు గోవుకూడ (కొట్లాటలకు తరచు యిదియే కారణమగుచున్నది) దయతో చూడబడుటలేదు. దయయు పూజచేయుటయు నెల్లపుడు కలిసియుండనేరవు.

తమతృష్ణను, లేక ప్రవర్తనను తెలుపుచిహ్నములుగ వివిధదేశములు వివిధజంతుచిహ్నముల నామోదించును. అమెరికాసంయుక్త రాష్ట్రములకు, జర్మనీకి గరుత్మంతుడు; ఇంగ్లండుకుసింహము, వేటకుక్క; ఫ్రాన్సుకుకోడిపుంజు, పాతరష్యాదేశమునకు యెలుగుగొడ్డు. ఈ యభిమాన మృగములు జాతీయశీలము నెంతవరకు పోతపోయును? ఇవి చాలవరకు ధూర్తస్వభావముకలవి. జగడమునకు కాలు దువ్వునవి. మృగములను వేటాడి తినునట్టి భూతములు. ఈ సాదృశ్యములను ఆదర్శముగనుంచుకొని పెరుగుమనుష్యులను బుద్ధిపూర్వకముగ నా రీతుల నవలంబించి, ధూర్తస్వభావమును చూపుటలోను, సింహ గర్జనలను చేయుటలోను, యితరులను భక్షించుటలోను ఆశ్చర్యమేమున్నది? హిందూదేశస్థుడు శాంతముగ దౌర్జన్యరహితముగనుండుటలో నాశ్చర్యములేదు; ఏలనన గోవు అతని యభిమానమృగము.

46

పోరాటము

బయట పోరాటము సాగుచునేయుండెను. సమీపములో జయము కాన్పించకపోయినను ధైర్యసాహసములుగల స్త్రీ పురుషులనేకమంది వేళ్ళుపాతుకొని, యతిశక్తివంతముగనున్న ప్రభుత్వమును శాంతముగ ధిక్కరించుచునే యుండిరి. విరామము లేకుండ దినాదినాభివృద్ధియగుచున్న నిర్బంధపరంపరలు భారతదేశములో బ్రిటిషు ప్రభుత్వ పునాదులు దేనిమీద నిర్మింపబడెనో విదితముచేయుచుండెను. ఇప్పుడీవిషయములో నెట్టివంచనయును లేకపోవుటచే నిదిమాకుకొంత తృప్తి నిచ్చెను. తుపాకులు, సన్నీలు విజయవంతములయ్యెను. కాని యొక గొప్పయోధుడొకసారి "నీవు తుపాకులతో, సన్నీలతో నేమి చేసినను చేయవచ్చును కాని, వానిమీదమాత్రము కూర్చొనరాదు" అని చెప్పెను. మా యాత్మల నమ్ముకొని యాధ్యాత్మిక వ్యభిచారమున కొడబడుటకంటె నీవిధముగ పాలింపబడుటయే మంచిదనుకొంటిమి. జయిళ్ళలో మేము భౌతికముగ నసహాయులము. కాని మేమచ్చటకూడ మాయుద్యమమునే సేవించినట్లు భావించితిమి. బయటనున్న చాలమందికంటె బాగుగ దానిని సేవించితిమి. మాదుర్బలత్వముచే మమ్ము రక్షించుకొను నుద్దేశ్యముతో భారతదేశ భవిష్యత్తును నాశము చేయవలసిన దేనా? మానవశక్తిసంపదలు, మానవబలము పరిమితిగలవి యను సంగతి నిజమే! చాలమంది వికలాంగులైరి. చాలమంది చనిపోయిరి. చాలమంది వెనుకకు తగ్గిరి. అనేకమంది యుద్యమమునకు ద్రోహముకూడ చేసిరి. కాని యెన్ని యవాంతరములు కలిగినను యుద్యమము సాగుచునేయుండెను. ఆదర్శములు మలినము కాక స్పష్టముగనుండి, యుత్సాహము మొక్కవోకున్నచో నపజయము కలుగజాలదు. మన సూత్రమును సిద్ధాంతమును విడిచిపెట్టుటయు, మన హక్కులను జారవిడుచుటయు, నవమానమునకు మర్యాదహీనముగ లొంగిపోవుటయు నిజమైన యపజయము. శత్రువు కలుగచేయుగాయములకంటె స్వయంకృతములగు గాయములు కుదురుట కెక్కువకాలము పట్టును.

తలచిన మా దుర్బలత్వముపట్ల, తప్పుమార్గమున పోవుచున్న ప్రపంచముపట్ల కొంతవిసుగుదల కలిగెడిది. అయినను మేముసాధింప గలిగినదానికి కొంతగర్వముకూడ నుండెడిది. ఏలనన మాప్రజలు వీరులవలె ప్రవర్తించిరి; వీరగణములో మనముకూడ సభ్యులమని భావించుకొనుట యుత్తమలక్షణము.

ఆ శాసనోల్లంఘన దినములలో బహిరంగ కాంగ్రెసుసభలను జరుపుటకొకసారి ఢిల్లీలోను, మరియొకసారి కలకత్తాలోను రెండుయత్నములుజరిగెను. ఒకయక్రమసంస్థ, నిరాటంకముగ, ప్రశాంతముగ కలుసుకొనజాలదని విదితమగుచునే యున్నది. అట్టి ప్రయత్నము విధాయకముగ పోలీసులతో జగడము తెచ్చిపెట్టెను. పోలీసు లాసభలను లాఠీల సహాయముతో బలవంతముగ చెదరగొట్టి, యనేకమంది ప్రజలనునిర్బంధించిరి. ఈయక్రమసభలకుభారతదేశమంతటనుండియు వేలకొలది జనులు ప్రతినిధులుగవచ్చుట యొక యసాధారణవిషయము. ఈ రెండు సభలలోను యు.పి. రాష్ట్రములోనిప్రజలు ప్రధాన భాగమునహించిరని విని నేను సంతసించితిని. 1933 మార్చి మాసాంతమున మాతల్లికూడ కలకత్తాసభలకు వెళ్ళెదనని పట్టుపట్టెను. ఆమె కలకత్తాకుపోవుచుండ మార్గమధ్యమున మాలవ్యాజీతోను తదితరుల తోను నిర్బంధింపబడి అసన్‌సోలుజయిలులో కొద్దిరోజులుంచబడెను. దుర్బలముగనుండి బాధపడుచున్నను యామెచూపినయుత్సాహశక్తులకు నేనెంతయు నాశ్చర్యపడితిని. జయిలనిన యామె కొక లెక్క గాదు. ఆమె యంతకంటె నెక్కువ యగ్నిపరీక్షనిచ్చెను. ఆమె యేకైకపుత్రుడు, కుమార్తెలిద్దరు ఆమె ప్రేమించిన యితరులు జయిళ్ళలో దీర్ఘకాలశిక్షలననుభవించుచుండ నామెనివసించు యానందభవన మామెకు గుండెదిగులు కలిగించుచుండెను.

మాయుద్యమముతగ్గి తక్కువస్థాయిలో నెమ్మదిగా సాగుచు (మధ్యమధ్య నెప్పుడో తప్ప) నెట్టియుద్రేకము లేకయుండెను. నాభావములు యెక్కువగ నితర దేశములమీదకు పోవుచుండెను. జయిలులో నాకవకాశమున్నంతవరకు నార్థికమాంద్యగ్రస్తమైన ప్రపంచస్థితిని

నేనుపేక్షించుచు నవగాహనము చేసికొనుచుంటిని. ఆ విషయమును గురించి నాకు దొరికిన పుస్తకములన్నింటిని చదివితిని. చదివినకొలది నాకు దానియందు కుతూహలము హెచ్చుగుచుండెను. తనసమస్యలు తనపోరాటములుగల హిందూదేశము జాతీయముగ నంతర్జాతీయముగ రాజకీయముగనార్థికముగసర్వత్రజరుగుతున్న పోరాటములలో, నద్భుతజగన్నాటకములో, నొక చిన్న భాగమయ్యెను. ఆపోరాటములో నాయభిమానమంతకంత కెక్కువగ కమ్యూనిష్టులవైపు మొగ్గుచుండెను.

చిరకాలము క్రిందట నేసామ్యవాదకమ్యూనిజములునన్నాకర్షించెను. రష్యాయెడల నాకభిమానము. సోవియటురష్యాలోననేకవిషయములు–వ్యతిరేకాభిప్రాయమును నిర్దాక్షిణ్యముగ నులిమివేయుట, దేశమునంతను సైన్యమయముచేయుట, వివిధపోలసీలను నిర్వహించుటకు చేయబడిన యనవసర దౌర్జన్యము–ఈయన్నింటిని నేనంగీకరింపజాలను. కాని పెట్టుబడిదారులప్రపంచములో దౌర్జన్యమునకునిర్బంధములకు కొరతలేదు. దౌర్జన్యనే ధనార్జనచేయు సంఘముయొక్కయు ఆస్తియొక్కయు మూలము, పునాదియని నేనంతకంతకు గ్రహించితిని. దౌర్జన్యము లేనిదే యది యనేకరోజులు నిలువజాలదు. ఆకలిచిచ్చు ప్రతిచోట ప్రజాబాహుళ్యమును సదా కొద్దిమంది (వారిలాభముల కొరకును, వైభవాదుల కొరకును) యిచ్చకు లొంగదీయుచున్నపుడు రాజకీయస్వాతంత్ర్యమువలన ప్రయోజనమేమియు నుండదు.

రెండుచోట్ల దౌర్జన్యము సమముగనే యుండెను. కాని పెట్టుబడిదారుల దౌర్జన్య మావిధానమునకు స్వతస్సిద్ధమైనట్లు కాన్పించును. రష్యా దౌర్జన్యము చెడ్డదేయైనను, పరస్పర సహకారము మీదను శాంతిమీదను ఆధారపడు నొకచక్కనిక్రమమును, ప్రజాసామాన్యమునకు నిజమైన స్వేచ్ఛ నిచ్చుటయు దానిలక్ష్యము. సోవియటురష్యా యెన్నితప్పులుచేసినను, యసంఖ్యాకములగు కష్టములను తరించి యీ క్రొత్తక్రమమువైపు చాలయడుగులను వేసెను. తక్కినప్రపంచమంతయు నార్థికమాంద్యముచే నలిగిపోవుచు ననేకవిధముల వెనుకకు పోవుచుండ, సోవియటుదేశములో మన కండ్ల

యెదుటనే యొక మహోద్భుత నవీనప్రపంచమునిర్మింపబడుచుండెను. లెనినుమహాశయుని యనుసరించుచు రష్యా భావికాలముకొఱకు చూచుచు నిక ముందుండవలసిన క్రమమునుగురించిమాత్రమే యోచించుచుండెను. ఇతర దేశములు నిర్వీర్యమైన భూతకాల క్రమముక్రింద చేష్టలుదక్కియుండ, గతకాలమునాటి నిరర్థక నిష్ప్రయోజక శిథిలసంస్థలను రక్షించుటకు తన శక్తులన్నింటిని వ్యయము చేయుచుండెను. ప్రధానముగ, మధ్యఆసియాలో చాల వెనుకబడి యున్న ప్రాంతములు సోవియటు ప్రభుత్వముక్రింద పొందిన గొప్ప యభివృద్ధినిగురించిన నివేదికలు నన్నెంతయో మెప్పించెను. కనుక నీ తూకములో నేను పూర్తిగ రష్యాదేశము నభిమానించితిని. అంధకారబంధురము, విషాదపూరితమునగు ప్రపంచములో సోవియటుల యునికియు, సాదృశ్యమును సంతోషకాంతులను ప్రసరింపజేయుచుండెను.

సోవియటురష్యా విజయముగాంచినను, విఫలమయినను కమ్యూనిస్టుసిద్ధాంత మాహాత్మ్యమున కది కళంకము కాజాలదు. జాతీయ కారణములచేత, యంతర్జాతీయ కారణములచేత బోల్షివిక్కులు తప్పిదములను చేయవచ్చును; లేక విఫలతనొందినను పొందవచ్చును. అయినను కమ్యూనిస్టుసిద్ధాంతము సరియైనదే కావచ్చును. ఆ సిద్ధాంతమును బట్టియే రష్యాలో జరిగినదానిని గ్రుడ్డిగా ననుకరించుట మూర్ఖత్వమగును. ఏలనన దానిని వర్తింపజేయు విధము ఆయా దేశములలోని ప్రత్యేక పరిస్థితులమీఁద, వాని చారిత్రకాభివృద్ధిమీఁద నాధారపడియుండును. మరియు, హిందూ దేశముగాని, మరే దేశముగాని బోల్షివిక్కుల విజయములనుబట్టియు, వారు విధాయకముగ నొనర్చు తప్పులను బట్టియు గుణపాఠము నేర్చుకొనవచ్చును. చుట్టు శత్రుప్రపంచమావరించుకొని యుండుటచే బయటనుండి తమకు యొత్తిడికలుగవచ్చునను భయముచే బోల్షివిక్కులు యెక్కువవేగముగ పోవుటకు ప్రయత్నించిరి; వారు తీవ్రతను కొంతతగ్గించిన యెడల గ్రామప్రాంతములవారికి సంభవించిన దుఃఖము చాలవరకు

లేకుండ పోయెడిది. కాని పరివర్తన వేగము తగ్గించినచో నిజమైన
గొప్పఫలితములు చేకూరగలవా? యను ప్రశ్నయుదయించెను.
మూల నిర్మాణమునే మార్పుచేయవలసిన క్లిష్టసమయ మాసన్న
మయినపుడు సంస్కారపద్ధతి యే ప్రధానసమస్యను పరిష్కరింప
జాలదు. తరువాత యభివృద్ధి యెంతనెమ్మదిగ జరిగినను ప్రాతిపది
కలోమాత్రము ప్రస్తుత క్రమమును పూర్తిగ ఛేదింపవలెను.

భారతదేశములో పరస్పరసంబంధముగల భూసమస్యను, పారి
శ్రామికసమస్యను కొంచెమించుమించు తదితరప్రధాన సమస్యలను
విప్లవమార్గ మొక్కటియే సాధింపగలదు. లాయడ్‌జార్జి తన
'యుద్ధస్మరణములు' అనుపుస్తకములో వ్రాసినట్లు "అగాధమును
రెండుదాటులలో దాటెదమనుటకంటె గొప్పతప్పిదము మరియొకటి
యుండబోదు."

రష్యాసంగతి విడిచిపెట్టి మార్క్సుసిద్ధాంతము, వేదాంతము
నాహృదయములోనున్న యనేకాంధకారకోణములను ప్రకాశమాన
మొనర్చెను. చరిత్రలోనాకొక నూతనయర్థము ద్యోతకమగుచుండెను.
మార్క్సు వ్యాఖ్యానము దానిపయి నొక యద్భుతకాంతి ప్రసరింప
జేసెను. అది యంతయు దానివెనుక నొకప్రయోజనమును, క్రమ
మునుగల తెరవిడిపోయిన నాటకమయ్యెను. భూత, వర్తమానముల
నాశము దుఃఖము, మనలనెంత నిర్ఘాంతపరచునవియైనను భవిష్యత్తు
యాశాపూరితముగ నుండెను. మార్క్సుసిద్ధాంతములోని శాస్త్రీయ
దృష్టియు, నిరంకుశాభిప్రాయములకు విశ్వాసములకు కట్టుబడవలెనని
నిర్బంధ మెంతమాత్రము లేకపోవుటయు, నన్నాకర్షించెను. రష్యా
లోను, తదితర చోట్లను అధికారసమ్మతమగు కమ్యూనిజములో
నెంతయో యభిప్రాయ నిరంకుశత్వమున్నమాట నిజము; తఱచు
దానికి వ్యతిరేకులైనవారు వేటాడబడిరి. సోవియటుదేశములోనద్భుత
మగుమార్పు యతి వేగముగ జరుగుచుండ తీవ్రమగు వ్యతిరేకము
దీనినంతను నాశనముచేయవచ్చునని గ్రహించుట కష్టముకాకపోయి
నను యది శోచనీయముగ కాన్పించెను.

ప్రపంచము నావరించిన యార్థిక మాంద్యము, విషమస్థితి మార్క్సు హేతువాదమును సమర్థించుచున్నట్లు కాన్పించెను. తక్కిన యన్ని పద్ధతులు, సిద్ధాంతములు నంధకారములోపడి కొట్టుకొనుచుండ మార్క్సుసిద్ధాంత మొక్కటే కొంచె మించుమించు తృప్తికరముగ దీని కర్థముచెప్పి నిజమైన తరుణోపాయము ప్రసాదించెను.

ఈ నా విశ్వాస మభివృద్ధియైనకొలది నాలో నూతనభావము లుద్భవించెను. శాసనోల్లంఘనము విజయమునొందలేదను విచారము తరుగ నారంభించెను. ప్రపంచ మతిత్వరితముగ నభిలషింపబడిన గమ్యస్థానమునకు చేరుటలేదా? యుద్ధములు విపరీత నష్టములు సంభవింపవచ్చునను భయోత్పాతము కలదు. అయినను మనము ముందుకుపోవుచున్నారము. ఇచ్చట స్తబ్ధత్వము లేదు. ఈ మహా ప్రస్థానములో మన జాతీయ సంగ్రామ మొక యంతరువు, ఒక మజలీ, నిర్బంధములు, బాధలు మన ప్రజలను భవిష్యత్సంగ్రామములకు తయారుచేయుచు, ప్రపంచము నుఱ్ఱూతలూగించుచున్న నూతనభావములనుగురించి యోచించునట్లు బలవంతపరచుచున్నవి. దుర్బలులు తప్పుకొనినకొలది మన మంతకంతకు బలము, శిక్ష, కష్టసహిష్ణుత గలవారమగుదుము. కాలము మనకు ప్రసన్నముగనుండెను.

కనుక నేను రష్యా, జర్మనీ, యింగ్లండు, అమెరికా, జపాను, చీనా, ఫ్రాన్సు, స్పెయిను, యిటలీ, మధ్యయూరపులలో జరుగు చరిత్రనుగురించి యతిజాగ్రతగ చదివి వర్తమానవ్యవహారములవిషయ గ్రంథుల నర్థముచేసికొన యత్నించితిని. మహాసంక్షోభము నెదుర్కొనుటకు ప్రతిదేశము సల్పిన యత్నములను విడివిడిగను సమగ్రముగను నే నెక్కువ యాసక్తితో వీక్షించితిని. రాజకీయ ఆర్థిక దుస్థితులను పరిష్కరించుటకు నాయుధములను, యుద్ధపరికరములను తగ్గించు సమస్యను చర్చించుటకు, జరుపబడిన యంతర్జాతీయసభల యనేకాపజయములు నాకు మన కులసమస్యను బలవంతముగ జ్ఞప్తికి తెచ్చెను. ప్రపంచము దీనికెంతసుముఖముగనున్నను మన మీసమస్య నింతవరకు పరిష్కరింప జాలకపోతిమి. ఈసందర్భములో నపజయము ప్రపంచవినాశమును,

తెచ్చిపెట్టునను నెంత వ్యాప్తినొందిన విశ్వాసమున్నను యూరపు
అమెరికాల రాజకీయ ధురంధరులందరు సమన్వయమునకు రాజాలక
పోయిరి. దీనినితీర్చవలసిన పెద్దలున్యాయమార్గమున పోవసాహసింపరు.

ప్రపంచదుఃఖములను, పోరాటములనుగురించి యోచించుటలో
కొంతవరకు నేను నాస్వంతకష్టములను, జాతీయ కష్టములను మరచి
పోతిని. ప్రపంచచరిత్రలోని యీ మహావిప్లవయుగములో జీవించు
చుంటినని నేనొక్కొక్కప్పు డుత్సాహభరితుడ నగుచుందును.
బహుశః రాబోవుగొప్పమార్పులసందర్భములో ప్రపంచములోని నా
చిన్నసీమలో నేనుకూడ కొద్దిభాగము తీసికొనవలసియుండును. మరి
యొకప్పుడు పోరాటము, దౌర్జన్యములతో నిండియున్న ప్రపంచవాతా
వరణము నన్నుకృంగదీయును. మానవుడధఃపతితుడై బానిసయగుట
కలవడుటచే బాధను, దారిద్ర్యమును, క్రూరత్వమును ధిక్కరింపజాల
నంతటి మొద్దుబారిన మనస్సులుగల విద్యాధికులైన స్త్రీపురుషుల
దృశ్యము మరింతశోచనీయమైనది. సత్పురుషులుహీనవంతులైయుండ
నీతిబాహ్యమైన యీవాతావరణములో బోకరింపగల నీచులు నారి
తేరిన మోసగాండ్రు వృద్ధిచెందిరి. హిట్లరువిజయము, దానిననుసరించిన
బ్రౌను టెర్రరు వజ్రపాతమువలెనుండెను. అయినను నదితాత్కాలికమే
యని నన్ను నేనోదార్చుకొంటిని. మానవప్రయత్నము, పౌరుషము,
వృథయనెడుభావము కొంచెమించుమించు కలిగెడిది. యంత్రము
గ్రుడ్డిగా నడిచిపోవుచుండ దానిలోనున్న యొకచిన్నభాగము, యొక
సీల, యేమిచేయగలదు?

అయినప్పటికి, జీవితమునకు సంబంధించిన కమ్యూనిష్టు వేదాం
తము నా కాశను, సుఖమును ప్రసాదించెను. దానిని భారతదేశమున
నెట్లుప్రవర్తింప జేయవలెను? రాజకీయస్వాతంత్ర్యసమస్యను మన
మింకను సాధించుకొనలేదు. మా మనస్సులు జాతీయదృష్టితో నిండి
యుండెను. ఏకకాలమందే మేమార్థికస్వాతంత్ర్యమునుకూడ దుముక
వలెనా? లేక వాని నొకటి తరువాత నొకటిగ తీసికొనవలెనా?
ప్రపంచ పరిస్థితులు, భారతదేశములో జరుగుచున్న విషయములు

కూడ సాంఘిక సమస్యను బలవంతముగ ముందుకు తెచ్చుచున్నవి; రాజకీయస్వాతంత్ర్యము నిక నెంతమాత్రము దానినుండి వేరుజేయు టకు వీలులేనట్లు కాన్పించెను.

భారత దేశములో బ్రిటిషుప్రభుత్వము నీతి సాంఘికాభివృద్ధిని భంగపరచు తెగలు రాజకీయస్వాతంత్ర్యము నెదుర్కొనునట్లు చేసెను. ఇది జరుగక తప్పదు. భారత దేశములో వివిధతరగతులు, వర్గములు, స్పష్టముగ నిరూపింపబడవలెనని యే నేనుకోరుచుంటిని. కాని యితరు లీవిషయము నామోదించిరా? చాలమంది యట్లు చేయలేదు. కొన్ని పెద్దపట్టణములలో కొద్దిమందిసనాతనకమ్యూనిష్టులున్నసంగతినిజము. వారు జాతీయోద్యమమునకు వ్యతిరేకులయి దానిని తీవ్రముగ విమ ర్శించుచుండిరి. మంచికట్టుబాటులతో నేర్పడిన లేబరు యుద్యమ ములుకూడ గట్టితనములేని సామ్యవాదమునే కలిగియుండెను. కాని యవిచిన్నచిన్నముక్కలయి యార్థికమాంద్యముచే బాధపడుచుండెను. విద్యార్థులలో, మంచి వివేకముగల ప్రభుత్వాధికారులతో గూడ, కమ్యూనిజమునకు, సామ్యవాదమునకు సంబంధించిన యస్పష్టభావములు వ్యాపించెందెను. ప్రజాస్వామికములను గురించిన బ్రైస్ గ్రంథము లను, మోర్లే, కీత్, మేజిన్ గ్రంథములను చదువుచుండిన కాంగ్రెసు యువతీ, యువకులు దొరికినపుడెల్ల సామ్యవాదము, కమ్యూనిజము, రష్యాలను గురించి యిప్పుడు చదువుచుండిరి.

మీరారటు కుట్రకేసు ప్రజల హృదయముల నీనూతనభావముల వైపు మరలించుటకు చాల తోడ్పడెను. ప్రపంచము నావరించినవిమ మావస్థ దృష్టి నరికట్టుచుండెను. ప్రతిచోట నొక నూతన పరిశోధ నోత్సాహముప్రబలెను. వర్తమాన సంస్థలను ప్రశ్నించుట, సవాలు చేయుట, విమర్శించుట ప్రారంభమయ్యెను. మానసిక వాయుప్రసార గతి తెల్లమగుచున్నను నది యాత్మవిశ్వాసములేని మృదువచనము. కొంతమంది ఫాసిస్టు భావములను ప్రవేశపెంచిరి. నిర్దుష్టమైన నిర్వచ నముగల లక్ష్యము లేకుండెను. జాతీయతయే యింకను ప్రధాన భావముగనుండెను.

కొంత రాజకీయ స్వాతంత్ర్యము సాధింపబడువరకు జాతీయతయే ప్రధానశక్తిగనుండునని నాకు స్పష్టమయ్యెను. ఇందుచేతనే భారతదేశములో కాంగ్రెసు యన్నిటికంటె ముందంజవేసిన సంస్థ. ఇప్పటికి నది యట్లేయున్నది అది యతిశక్తివంతమైనసంస్థ. గాంధీజీ నాయకత్వముక్రింద గత పదమూడు వత్సరములలో నది ప్రజలలో నద్భుతప్రబోధము కలిగించెను. దానిలక్ష్య మస్పష్టమైన బూర్జువా లక్ష్యమేయైనను అది యొక విప్లవప్రయోజనము సాధించెను. దాని యుపయోగ మింకను తఱిగిపోలేదు. జాతీయదృష్టి సాంఘికదృష్టికి తావిచ్చువరకు నది యట్లే యుండును. కనుక భావియభివృద్ధి కాంగ్రెసు ద్వారముననే జరుగవలెను. కనుక నేను కాంగ్రెసును వీడుట,జాతిని నడుపు ప్రధానశక్తినుండి సంబంధము త్రెంచుకొనుటవలె కాన్పించెను. అది మనచేతిలోనున్న దివ్యాస్త్రమును వ్యర్థము చేసికొనుటయగును. అది నిష్ప్రయోజకమగు సాహసకృత్యములలో శక్తిని వమ్ముచేసికొనుట యగును. అయినను కాంగ్రెసు, దాని ప్రస్తుత నిర్మాణమునుబట్టి యదార్థప్రయోజనముగల సాంఘిక పరిష్కారము నెప్పటికైన నామోదించునా? దానిముందర నట్టి సమస్యను తెచ్చినచో నది కాంగ్రెసును రెండుమూడు చీలికలక్రింద చీల్చివేయుటగ పరిణమించును. అధమము చాలమంది దానినుండి తరిమివేయబడుదురు. సారాంశములు చక్కగ స్పష్టపరుపబడి సమ్యగ్బద్ధమైనవర్గ మొకటి సార్థకమగు సాంఘికవిధానముకొఱకునిలుచునెడల పైచీలికలనుమనమభిలషింపవచ్చునుఆహ్వాయముచేయవచ్చును.

కాని ప్రస్తుతము కాంగ్రెసనగా గాంధీజీ. అతడేమిచేయును? భావములలో నతడొక్కొక్కప్పుడద్భుతముగ వెనుకబడియుండును. ఆచరణలో నతడు నవీనభారతయుగములో ననన్యవిప్లవకారుడు, అసాధారణవ్యక్తి. అతనిని మామూలు ప్రమాణములచే విమర్శించుట దుస్సాధ్యము. సాధారణ తార్కికసూత్రములనుకూడ నతని యెడల వర్తింపజేయుటసంభవము. కాని యతడు హృదయాంతరాళమున విప్లవకారుడగుటచేతను, భారత రాజకీయస్వాతంత్ర్యమునకు బద్ధకంకణుడగుటచేతను, దానినిసాధించువరకు వెనుదిరుగని పాత్రమ

వహించితీరును. ఈ విధానములోనే యంత దమ్భృతమగు ప్రజాశక్తుల నుద్రేకింప జేయును. అతనుకూడ క్రమక్రమముగ సాంఘికపరమావధి వైపు సాగిపోవునని నేను సగ మాశపడితిని.

భారతదేశములోను, బయటనుగల శుద్ధకమ్యూనిస్టులు చాల వత్సరములనుండి గాంధీజీని, కాంగ్రెసును తీవ్రముగ నెదుర్కొనుచునే యుండిరి. వారు కాంగ్రెసునాయకుల కనేక నీచోద్దేశ్యముల నాపాదించిరి. కాంగ్రెసు లక్ష్యమునుగురించిన సిద్ధాంతసంబంధ విమర్శలు చాలవరకు సమర్థములు, శక్తివంతములు, విషయబద్ధములు. తరువాత సంభవించినవిషయములు కొంతవరకు వాటిలోనున్న న్యాయమును ఋజువుచేసెను. సామాన్య భారత రాజకీయపరిస్థితులను విడివిడిగా పరీక్షించి విమర్శించినచో మొదటి కమ్యూనిస్టు విమర్శలు కొన్ని 'తు' 'చ' తప్పకుండ యథార్థములయ్యెను. కాని వారు తమ సామాన్యసూత్రములను విడిచిపెట్టి వివరములోనికి దిగుటతోడనే తప్పుమార్గమున పడిపోవుచుందురు. సంఖ్యలోను, పలుకుబడిలోను కమ్యూనిస్టులు భారతదేశములో చాల దుర్బలులగుటకు కారణమేమనిన వారు కమ్యూనిజమునుగురించి శాస్త్రీయజ్ఞానమును వెదజల్లి ప్రజాహృదయమును త్రిప్పుకొనుటకు బదు లితరులను తిట్టుటయందే తమశక్తినంతను వినియోగించిరి. ఇది యెదురుతిరిగి వారికే యెక్కువ యపకారము చేసెను. వారిలో చాలమంది లేబరులో పనిచేసెడి వారు. అచ్చట నేకొద్దికేకలో పనివాండ్రను తమవైపు త్రిప్పుకొనుటకు సరిపోయెడివి. కాని విద్యార్థికులకు వట్టికేకలు చాలవు. ఇప్పుడు భారతదేశములో మధ్యతరగతికి చెందిన విద్యార్థికుడే విప్లవకారుడనుసంగతి వారు గుర్తింపరైరి! శుద్ధకమ్యూనిస్టుల సంబంధము లేకుండగనే చాలమందివిద్యార్థికులను కమ్యూనిజము ఆకర్షించెను. అయినను వారిమధ్య నెంతయో యంతరువుకలదు.

ప్రభుత్వముపయి విశేషమొత్తిడి కలిగించి భారతపెట్టుబడిదారులకు, జమీందారులకు పారిశ్రామిక, వర్తక హక్కులను సంపాదించిపెట్టుటయే కాంగ్రెసునాయకులలక్ష్యమని కమ్యూనిస్టులయభిప్రాయము.

"కాంగ్రెసు వ్యవసాయదారుల యొక్కయు మధ్యతరగతికి చెందిన క్రిందితరహావాని యొక్కయు, పారిశ్రామికపనివాండ్రయొక్కయు రాజకీయ, ఆర్థిక యసంతృప్తిని బొంబాయి, అహమ్మదాబాదు, కలకత్తాలోని యంత్ర యజమానులయొక్కయు లక్షాధికారుల యొక్కయు రథములకు కట్టివేయజూచును." భారతదేశ పెట్టుబడిదారులు తెరమఱుగున కూర్చొని ప్రజోద్యమము నారంభింపవలసినదని మొదట కాంగ్రెసు వర్కింగుకమిటీవారి నాజ్ఞాపింతురు. తరువాత నది చాల గొప్పదియై, యుపద్రవకరమైనపుడు దాని నాపివేయమనియో లేక పెడత్రోవబట్టించమనియో నాజ్ఞాపింతురు. మరియు బ్రిటిషువారు పోవలెనని కాంగ్రెసునాయకులు నిజముగా కోరరు. ఏలనన నాకలితో మాడుచున్న ప్రజలను నిరోధించుటకు, కొల్లగొనుటకు వారియవసరమెంతయో కలదు. భారతదేశ మధ్యతరగతులవారు తమంతతామీ పనిచేయుటకసమర్థులమని భావించి బ్రిటిషువారిసహాయమ పేక్షింతురు.

సమర్థులైన కమ్యూనిస్టులే యిట్టిపిచ్చివ్రాతలను విశ్వసించుచుండుటాశ్చర్యకరము. ఇట్టివిశ్వాసములుండుటచేతనే వారుభారతదేశములో నెక్కువ యపజయమునొందిరి. భారతజాతీయోద్యమమును యూరపులోని లేబరు ప్రమాణములనుబట్టి విమర్శించుటయే వారు చేసిన ముఖ్యప్రమాదము. లేబరునాయకులు తఱచు లేబరుయుద్యమమునకు ద్రోహముచేయుండుట వీరికి చాలయనుభవము. కనుక వీరా సాదృశ్యమునే హిందూదేశమునకును వర్తింపజేతురు. భారత జాతీయోద్యమము లేబరుయుద్యమము, బీదలయుద్యమము కాదని విదితమగుచునేయున్నది. అది బూర్జువాయుద్యమమని దాని పేరే విశదము చేయుచున్నది. దానిలక్ష్యమింతవరకు రాజకీయ స్వాతంత్ర్యముగాని సాంఘిక క్రమమును మార్చుటగాదు. ఈ లక్ష్యము గొప్పదికాదని, చాలదని విమర్శింపవచ్చును. వర్తమాన యుగమునకు పనికిరాదని జాతీయతనే ఖండింపవచ్చును. కాని యుద్యమమునాదుల నంగీకరించు భూమిపద్ధతిని, పెట్టుబడిదారులపద్ధతిని కూలద్రోయుటకు యత్నింపక కాంగ్రెసునాయకులు ప్రజలను ద్రోహము

చేసిరని చెప్పుట మూర్ఖత్వము. అట్లుచేసెదమని వారెన్నడు చెప్పియుండలేదు. కాంగ్రెసులో కొందరు భూమిపద్ధతిని పెట్టుబడి పద్ధతిని మార్చవలెనని కోరుచున్నారు. కాని వారు కాంగ్రెసు పేరిట నట్లు మాట్లాడజాలరు.

జాతీయోద్యమమువలన బ్రిటిషువస్తువులను తదితర విదేశ వస్తువులను బహిష్కరించుటచేతను స్వదేశిని ప్రోత్సహించుటచేతను భారతదేశ పెట్టుబడిదార్లు చాల లబ్ధిపొందినమాట సత్యము. ఇది విధాయకము. ప్రతిజాతీయోద్యమము బహిష్కారమునుబోధించి స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహించును. శాసనోల్లంఘనము జరుగుచున్నకాలములో మేము బ్రిటిషువస్తుబహిష్కారమును బోధించుచున్నపుడుకూడ బొంబాయి మిల్లుపరిశ్రమ యజమానులందరు నొక సంఘముగా లాంకషైరుతో నొడంబడికచేసికొన సాహసించిరి. కాంగ్రెసుదృష్టిలో నిది జాతీయోద్యమముపట్ల పరమద్రోహము. అది దానినట్లే ప్రకటించెను. అసెంబ్లీలోని బొంబాయిమిల్లు యజమానుల ప్రతినిధికూడ మాలోచాలమంది జయిలులోనుండగా కాంగ్రెసును "అతివాదులను" పదేపదే దూషించెను.

కాంగ్రెసు జాతీయదృష్టులనుండి చూచినను గతకొద్దిసంవత్సరములలో భారతదేశములోచాలమంది పెట్టుబడిదారులు తీసికొనినపాత్ర నీతిబాహ్యమైనది. ఒటావావలన తాత్కాలికముగ కొన్ని చిన్నవర్గములకు లాభము కలిగియుండవచ్చును. కాని యది భారతదేశపరిశ్రమకంతకు చెడ్డచేసెను. దానివలన నాపరిశ్రమ బ్రిటిషుపెట్టుబడికి, పరిశ్రమకు మరింతబానిసయయ్యెను. అది ప్రజలకుహానికరము. మాపోరాటమింకను జరుగుచుండ వేలకొలది జయిళ్ళలో క్రుమ్గుచుండ నీరాయబారము జరుపబడెను. ప్రతి వలసదేశము యింగ్లండునుండి యతికటినషరతులనువిందుకొనెను. హిందూదేశమే దానికొకవరము ప్రసాదింపగలిగెను. గత కొద్దివత్సరములలో బ్రిటిషుపెట్టుబడిదారులు భారతదేశమును నష్టముకలిగించు వెండిబంగారువర్తకము సాగించిరి.

పెద్దజమీందారులు తాలూకాదార్లు రెండుటేబిలు కాన్ఫరెన్సులో కాంగ్రెసును పూర్తిగ వ్యతిరేకించిరి. శాసనోల్లంఘనకాలములో వారు ప్రభుత్వపక్షముననున్నట్లు బహిరంగ ప్రకటనచేసిరి. వారి సహాయముతోడనే ప్రభుత్వము వివిధరాష్ట్రములలో ఆర్డినెన్సు రూపములో నిర్బంధశాసనములనుచేసిరి. యు. పి. రాష్ట్రశాసన సభలో జమీందారు సభ్యులలో నధికసంఖ్యాకులు శాసనోల్లంఘన ఖయిదీల విడుదలకు వ్యతిరేకముగ వోటుచేసిరి.

1921, 1930లలో ప్రజయొత్తిడివలన గాంధీజీ తీవ్రయుద్యమములను ప్రారంభించెనన్నుభావము శుద్ధపొరపాటు. కాని రెండుసార్లు గాంధీజీయే నడకను త్వరితముచేసెను. 1921లో కొంచెమించుమించు నతడొక్కడే కాంగ్రెసునునడిపించెను. దానిసహాయోద్యమములోనికి దింపెను. 1930లో నతడేవిధముగ నడ్డుపెట్టినను యెట్టితీవ్ర ప్రత్యక్ష కార్యవిధానము సాధ్యమయ్యెడిదికాదు. యదార్థవిషయజ్ఞానములేని వ్యక్తిగత మాహాత్మ్యవిమర్శలనుచేయుట దౌర్భాగ్యమైనపని. ఇట్టివి నిజసమస్యలనుండి దృష్టిని మరల్చును. గాంధీజీ సత్యసంధతను నిజాయితిని ధిక్కరించినవాడు తనకు, తన యుద్యమమునకు తీరని నష్టము కలిగించినవాడగును. భారతదేశములో కోట్లకొలది ప్రజల కతడు సత్యదేవత. అతని నేమాత్రము గ్రహించినవాడైనను న్యాయముకొరకతడెంత యాతురత చూపునో గ్రహింపగలడు.

హిందూదేశ కమ్యూనిష్టులు పెద్దపట్టణములలోని పారిశ్రామిక పనివాండ్రతో సంబంధముకలిగియుండిరి. పల్లెటిప్రాంతములతో వారికెట్టి సంపర్కములేదు. వాటినిగురించి వారికేమియు తెలియదు. వారి శ్రామిక పనివాండ్రు వ్యవసాయదారుల తరువాతనే పరిగణింపబడవలెను. ఏలనన నేడు భారతదేశములోనున్న సమస్య వ్యవసాయదారులసమస్యయే. కాంగ్రెసు సేవకులు గ్రామసీమలన్నిటిలోవ్యాపించియున్నారు. మామూలువ్యవహారములో కాంగ్రెసు గొప్ప వ్యవసాయకసంస్థ. తమ యత్యవసర మనోరథమీడేరినతోడనే వ్యవసాయదారుల క్వచితుగ విప్లవకారులగుదురు. భవిష్యత్తులో నెప్పుడో

రొకప్పుడు పట్టణమునకు, గ్రామమునకు పారిశ్రామిక పనివానికి, వ్యవసాయదారుకు గల మామూలు సమస్య భారతదేశములోకూడ తలయెత్తగలదు.

అనేకమంది కాంగ్రెసునాయకులతోను వర్కులతోను నాకతి సన్నిహిత పరిచయముగలదు. వారికంటె యోగ్యులైన స్త్రీ పురుషులను నేను వాంఛింపజాలను. అయినను ప్రధానసారాంశములనుగురించి నాకు వారికి భేదాభిప్రాయములు కలుగుచుండెను. నాకతి స్పష్టముగ కాన్పించు విషయము వారి కర్థముకాకపోవుట లేక వారు గుర్తింపకపోవుట తరచు నాకు విసుకుదలగనుండెడిది. బుద్ధివిశేషము కొరవడుట దానికి కారణముకాదు. ఎందుచేతనో మేము వివిధ లక్ష్యములమధ్య తిరుగుచుంటిమి. ఈ హద్దుల నకస్మాత్తుగ తరించుట చాల కష్టమని నేను గుర్తించితిని. అవి జీవితమునకు సంబంధించిన వివిధ వేదాంతములు. మనము క్రమముగ నప్రయత్నముగ నా పరిణామమును పొందుదుము, ఇతరపక్షమును నిందించుట నిరర్థకము. సామ్యవాదమనగా జీవితమును దాని సమస్యలను నొక విధమగు మానసికదృష్టితో చూచుటయనియర్థము. అది వట్టి తర్కముకాదు. దానికంటె నెక్కువది. సాంప్రదాయములమీదను శిక్షణ పోషణల మీదను, భూతవర్తమాన పరిసరముల యదృశ్యప్రభావములమీదను నాధారపడు యితర దృక్పథములుకూడ నట్టివే. కఠినపాఠమును బోధించు జీవిత మొక్కటియే మనలను నూతనమార్గములగుండ నడిపించును. చివర కది మనలను మరొక విధముగ యోచించునట్లు (ఇది చాల కష్టమైనపని) చేయును. బహుశః మన మీ విధానములో కొద్దిగ సహాయభూతులము కావచ్చును.

మతమననేమి?

1932 సెప్టెంబరు రెండవవారములో ప్రశాంతము విసుగు పుట్టించునదియగు మాజయిలుజీవిత మకస్మాత్తుగ నొకబాంబుమ్రోత వలన దద్దరిల్లెను. నిమ్నజాతులకు రామ్సేమాక్డోనాల్డు ప్రసాదించిన 'కమ్యూనల్ అవార్డు' ఫలితమైన ప్రత్యేకనియోజకవర్గపద్ధతిని నిరసించుటకు గాంధీజీ "చనిపోవువరకు నుపవసింప" నిశ్చయించెనను వార్త తేతెంచెను. ఆహా! ప్రజలను హడలగొట్టుటకతనికెట్టిశక్తికలదు! అకస్మాత్తుగా నా తలలోనికనేకవిధభావములు చొరుచుకొనివచ్చెను. అనేకవిధ సంభవములు, ఘటనలు జరుగవచ్చుననుతలంపు నన్నావేశించి నాశాంతిని భంగముచేసెను. రెండురోజులవరకు నాకెట్టి దోవ తెన్ను కానరాక నేనంధకారములోనుంటిని. గాంధీజీచర్యవలన జరుగు కొన్ని ఫలితములను తలచుకొనినపుడునాహృదయముక్రుంగిపోయెడిది. వ్యక్తిగతమగు భావము భరింపనశక్యముగనుండెను. నేనతని నిక నీ లోకములో తిరిగి చూడజాలకపోవచ్చునని దిగులుపడితిని. వత్సరక్రిత మింగ్లండు వెళ్ళుచుండగ నేనతనిని కడసారి చూచితిని. అదియే నా కతని తుది సందర్శనము కాబోవుచున్నదా!

తరువాత తన తుదియాత్మార్పణ కెట్టి చిన్న సమస్యను—నియోజకవర్గముకు సంబంధించిన చిన్నసమస్య — నతడు తీసికొనినందులకు నేను బాధపడితిని. ఇది మన స్వాతంత్ర్యోద్యమమున కెట్టి ఫలితము నిచ్చును? దీనివలన తాత్కాలికముగనైన ప్రధానసమస్యలు మరుగు పడిపోవా? అతడు తన యత్యావసర లక్ష్యమును సాధింపగలిగినచో దానివలన నొక ప్రతిక్రియ పుట్టదా? ఒకటి సాధించితిమి. కొంత కాలమువరకు మన మిప్పు డేమియు చేయనక్కరలేదను భావము జనింపదా?

అతనిచర్య కమ్యూనల్ అవార్డును, ప్రభుత్వముచే తయారు చేయబడిన సామాన్యరాజకీయస్కీమును గుర్తించికొంతవర కామోదించినట్లగుటలేదా? ఇది యసహాయోద్యమముతో శాసనోల్లంఘ

వముతో సమన్వయమగునా ? బ్రహ్మాండమగు త్యాగము ధైర్యసాహసోపేతములగు యత్నములు చేసినతరువాత మనయుద్యమ మిట్టి నామరూపములులేని విషయముతో శోకముడువవలసినదేనా ? ఒక రాజకీయ సమస్య నతడు మతవిషయికముగ హేతువిరుద్ధముగ చూచుటయు నీ సందర్భములో నతడు తరచు భగవంతుని యుదహరించుచుండుటయు నా కతనియెడల కోపముకలిగించెను. ఉపవసింపవలసిన దినమును భగవంతుడే నిర్దేశించున ట్లతడు సూచించెను. ఇదియెంత భయంకర యుదాహరణము.

బాపూజీ చనిపోయినచో భారతదేశ మప్పుడెట్లుండును ? దాని రాజకీయము లెట్లు ప్రవహించును ? భవిష్యత్తు దుఃఖమయముగ శూన్యముగ కాన్పించెను. దానిని తలచినపుడు నిరాశ నాహృదయము నావరించెడిది. నేనిట్లు యోచింపగా యోచింపగా నా బుద్ధి వికల మగుచుండెడిది. కోపము, నిరాశ యీ ప్రబోధమునకంతకు జనకుడైనవానియెడల ప్రేమ ముప్పిరిగొని యుండెడివి. ఏమిచేయుటకు నాకు తోచకుండెను. కనుక నేను ప్రతివానియెడల (ముఖ్యముగా నా యెడలనే) చిర్రుబుర్రుగ ముక్కోపిగ నుండెడివాడను.

తరువాత నొకచిత్రము జరిగెను. నే నుద్రేకముల రాశి నైతిని. అట్లు కొంతసేపుంటిని. ఆ స్థితి గతించినతరువాత నా మనస్సు శాంతించెను. భవిష్యత్తు అంత యంధకారముగ కాన్పించలేదు. బాపూజీ పరిపక్వసమయము కనిపెట్టి యుక్తకార్యముచేయు చిత్ర యుక్తిగల వ్యక్తి. అతనిచర్య గొప్పఫలితముల నీయవచ్చును. బాపూజీ చనిపోయినను మన స్వాతంత్ర్యపోరాటము సాగుచునే యుండును. కనుక నేమిజరిగినను మనము దానికి సిద్ధముగ తయారుగ నుండవలెను. గాంధీజీమరణమునుగూడ నిర్విచారముగ నెదుర్కొను టకు నిశ్చయించుకొని నేను శాంతినొంది, యుద్రేకము నణచుకొని ప్రపంచమును, అది ప్రసాదించు సమస్తమును నెదుర్కొనుటకు సిద్ధ ముగనున్నట్లు భావించితిని.

తరువాత దేశమంతట నద్భుతమగు ప్రబోధము కలిగినట్లు హిందూసంఘములో నొక వింతయుత్సాహతరంగ ముప్పతిల్లినట్లు వార్తలేతెంచెను. అస్పృశ్యత కంత్యకాలమువచ్చినట్లు కాన్పించెను. ఎరవాడజయిలులో కూర్చొనిన యీ బక్కమనిషి, యీ చిన్నవ్యక్తి యెంతటి గారడీడు! ప్రజాహృదయములను కదల్చు తంత్రుల నెట్లు మీటవలెనో బాగుగ గ్రహించిన యెంతటి చతురుడు! అతనివద్ద నుండి నాకొక తంతివచ్చెను. నేను శిక్షింపబడినతరువాత నతనివద్ద నుండి నాకువచ్చిన మొదటిసందేశమిదియే. అంత దీర్ఘకాలమయిన తరువాత నే నతనిని గురించి వినుట నా కాహ్లాదకరముగనుండెను. ఈ తంతిలో నత డిట్లు వ్రాసెను.

"ఈ యన్నిమహాసంక్షోభదినములలోను నీవు నా మనోనేత్రమున నుంటివి. నీ యభిప్రాయము తెలిసికొనుటకు నే నత్యాతురపడుచుంటిని. నీ యభిప్రాయము నాకెంత యమూల్యమో నీకే తెలియును. ఇందు కుమారుని, సరూపబిడ్డలను చూచితిని. ఇందుకులాసాగానున్నది ఆమె యొడలు పెంచుచున్నది. నేను చాలయారోగ్యముగనున్నాను. తంతిద్వారా ప్రత్యుత్తరము నిమ్ము. ప్రేమ"

ఉపవాసశ్రమ ననుభవించుచున్నను, అనేక కార్యములలో నిమగ్నుడయినను నా కుమార్తెయు, నా చెల్లెలు బిడ్డలు నతనినిదర్శింప వచ్చిన సంగతి, యిందిర యొడలుచేయుచున్నదను సంగతికూడ నుదహరించుట యసాధారణ విషయము. అయిన నది యతనికెన్న స్వభావము. అతడు జీవితములో నతిస్వల్పముగ కాన్పించు విషయములనుగూడ (నిజముగవాటికి చాలవిలువగలదు) నెప్పుడును మరచిపోజాలడు. నియోజకవర్గము విషయమైన యొకయొడింబడిక జరిగెనని కూడా నాకప్పుడే వార్త వచ్చెను. గాంధిజీకి ప్రత్యుత్తరమిచ్చుటకు నా జయిలు అధికారి యంగీకరించుటచే నతనికి క్రింది తంతినంపితిని.

"మీతంతియు, నొక యొడంబడిక కుదిరెనను క్లుప్తవార్తయు నా కానంద, శాంతులను చేకూర్చెను. మీరుపవసించుటకు నిశ్చయించిరను మొదటివార్త మానసికసంక్షోభమును, చిత్తవైకల్యమును

కలిగించెను. కాని తుద కుత్సాహము ప్రజ్వరిల్లెను. నేను చిత్తశాంతి పొందితిని. అణగద్రొక్కబడి. పీడింపబడువారికొరకు చేయు త్యాగ మెంతైనను చాలదు. అత్యధమస్థితిలోనున్న వారి స్వాతంత్ర్యమును బట్టియే దేశస్వాతంత్ర్యము పరీక్షింపబడవలెను. కాని మన యేకైక లక్ష్యము నితరసమస్యలు మరుగుపరచునని భయపడుచున్నాను. మత దృష్టినుండి విమర్శించుట కశక్తుడను. ఇతరులు మీ పద్ధతులను కొల్లగొట్టవచ్చునను భయము కలదు. కాని నేనొక యింద్రజాలికునకు సలహా చెప్పుట కెట్లుసాహసింపగలను? ప్రేమ."

పూనాలో సమావేశమైనవారందరు నొక 'యొడంబడిక' మీద సంతకము చేసిరి. బ్రిటిషుప్రధానమంత్రి యెన్నడు నెరుగని వేగముతో నాయొడంబడిక నంగీకరించి తన వెనుకటి 'అవార్డును' దాని ప్రకారము మార్చివేసెను. ఉపవాసము సమాప్తమయ్యెను. అట్టి యొడంబడికలు, అగ్రిమెంటులు నాకు గిట్టవు. కాని పూనాయొడంబడికను, నే నామోదించితిని.

ఉద్రేకము చల్లబడెను. మేము మాజయిలు కృత్యములకు మరలితిమి. హరిజనోద్యమమును గురించి, జయిలునుంచి గాంధీజీ జరుపు చర్యలనుగురించి మాకు వార్తలువచ్చుచుండెను. అవి నాకంత సుఖకరముగలేవు. అస్పృశ్యత నంత మొందించి మందదృష్టవంతులైననిమ్న జాతుల నుద్ధరించు యుద్యమమున కద్భుత వ్యాప్తికలిగెను. ఇది యొడంబడికవలనగాక దేశములో చెలరేగిన చెడుగునుతొలగింపవలెననెడి సంగ్రామోత్సాహమువలననే జరిగెను. ఇదియంతయునవసరమే. కాని శాసనోల్లంఘనమునకు నష్టము కలిగెను. దేశదృష్టి యితరవిషయములమీదకు మరలెను. చాలమంది కాంగ్రెసు వర్కరులు హరిజనోద్యమమునకు బూనుకొనిరి. బహుశః వీరిలో చాలమంది చల్లనిపనులలో నిరుకుకొనుట కవకాశములను చూచుకొనుచుండిరి. అది సహజము. లక్షలకొలది వర్కరు లెల్లప్పుడు తీవ్రబాధలను, గృహవిచ్ఛేదములకు సిద్ధముగనుండవలెనని కోరుట న్యాయముకాదు. కాని మన మహోద్యమము నెమ్మదిగ నశించుటను వీక్షించుట బాధకరముగ

నుండెను. అయినను శాసనోల్లంఘన మింకను సాగుచునేయుండెను. అప్పుడప్పుడు 1933 మార్చి ఏప్రియల్ లోని కలకత్తా కాంగ్రెసువంటి జనసముద్రముతో గూడిన యుత్సవములు జరుగుచుండెను. గాంధీజి యరవాడజయిలులో నుండెను. కాని వ్యక్తులను కలుసుకొనుటకు హరిజనోద్యమ సందేశములకు నతనికి కొన్ని సౌకర్యములు కలిగింప బడెను, ఇందువలన నతడు జయిలులో నుండెనను వ్యథ లేకుండెను. ఇదియంతయు నన్ను నిరుత్సాహపరచెను.

చాలనెలలయినతరువాత, 1933 మే మొదటివారములో గాంధీజి యేకవింశదినోపవాసము ప్రారంభించెను. దీని ప్రథమవార్త వినగనే నాకొక గుండుదెబ్బవలె తగిలెను, కాని యిదియొక విధిధర్మ మని నేను దీనిని స్వీకరించి యీ పాఠమున కలవడిపోతిని. అతడునిశ్చ యించుకొని ప్రకటనచేసినతరువాత దానిని మానవలసినదని కొందరు ప్రోత్సహించుట నాకు కోపముకలిగించెడిది. నామట్టు కుపవాస మగ్రాహ్యమైనది, నిశ్చయముచేసికొనుటకు పూర్వము నన్నడిగియుం డినచో తప్పకుండ నేను దానికి గట్టి వ్యతిరేకము చెప్పియుండెడి వాడను. కాని నేను గాంధీజీమాటల కెక్కువ విలువనిచ్చితిని. దానిని భంగముచేయ యత్నించువారుతప్పుచేయుచున్నట్లు నాకుకాన్పించెను. అది యతనికి సంబంధించిన వ్యక్తిగత విషయము. కనుక, నా కెంత యసుఖముగనున్నను నేను దానిని సహించితిని.

ఉపవాసము ప్రారంభించుటకు కొద్దిరోజులుపూర్వ మతడునా కొక యుత్తరము వ్రాసెను. అది నన్నెంతయో కదల్చివేసెను. అతడు జవాబు కోరుటచే నేనీ క్రింది తంతి పంపితిని. "మీ యుత్తరము చేరినది. నా కర్థముకాని విషయములనుగురించి నేనేమి చెప్పగలను? మీరొక్కరే తరచు మార్గముచూపు దిక్కుగనున్న యొక వింత దేశమున నుంటిని. అంధకారములోనే నేను నా మార్గమును తడుము కొనుటకు యత్నించుచున్నాను. కాని నేను జోకారుచున్నాను. ఏమి సంభవించినను నా యోచనలు, ప్రేమ మీ మీదనే యుండును."

అతని చర్యయెడల నా కసమ్మతి; అతనికి కష్టము కలిగింపరాదనుకోరిక ఈ రెంటిమధ్య నేను నలిగితిని. నేనతనికుత్సాహకరమైన వార్త పంపలేదని భావించితిని. ఇప్పు డతడు భయంకరాగ్ని పరీక్షకు నిలువనెంచెను. కనుక నేను నాశక్తికొలది యతనికుత్సాహముకలిగింపవలెను. చిన్నవిషయములే మానసికముగ పెద్దవియగును. అతడీపరీక్ష దాటి జీవించుటకు శక్తినంతనువినియోగించవలెను. ఏమిసంభవించినా నతనికి మృత్యువే వచ్చినను, మనము దానిని ధైర్యముగ స్వీకరింపవలెనని నేను భావించితిని. కనుక నేనతనికి మరియొక తంతి నిచ్చితిని.

"మీ రిప్పుడు మీ యద్భుత సాహసమును ప్రారంభించిరి. కనుక నేను నా ప్రేమను అభినందనములను మీకు తిరిగి పంపుకొనుచున్నాను. ఏమి సంభవించినను మంచిదే! ఏమిసంభవించినను జయము మీదే! యని నేనిప్పుడెక్కువ స్పష్టముగ భావించుచున్నానని నమ్మగోరుచున్నాను." అతడుపవాసమునుండి బయటపడెను. దానిని ప్రారంభించిన మొదటిదినముననే యతనిని విడిచివేసిరి. అతని సలహాపై శాసనోల్లంఘన మాసువారములు విరమింపబడెను.

ఉపవాసకాలమున దేశములో బయలుదేరిన యుద్రేక పూరిత ప్రబోధమును నేను తిరిగి పరీక్షించితిని. ఇది రాజకీయములలో సరియగు మార్గమేనా యను నాశ్చర్యము నా కంతకంతకు హెచ్చుచుండెను. కేవల మహోత్సాహము తిరిగితలయెత్తినట్లు నాకుకాన్పించెను. భారతదేశమంతయు 'మహాత్మ' వైపు పూజ్యభావముతో తేరిపారి చూచుచు నత డద్భుతము వెంబడి యద్భుతములనుచేసి, యస్పృశ్యతను రూపుమాపి, స్వరాజ్యము మొదలగువానిని తెచ్చి పెట్టునని యనుకొనుచు తానేమియుచేయక నూరకుండెను. తమకు తామాలోచన చేసుకొనవలెనని గాంధీజీ యితరులను ప్రోత్సాహముచేయలేదు. త్యాగము, పవిత్రతయును నీరెంటినే యతడుపదేవదేవకాంక్షించును. నాతనియెడల నెంత ప్రేమానుబంధమున్నను మానసికముగ నేనంతకంత కతనికి దూరమగుచున్నట్లు భావించితిని. అనేకసారు లతడు తన రాజకీయ క్రియాకలాపములో ప్రమాదరహితమగునాత్మప్రబోధముచే

నడుపబడుచుండెను. కార్యాచరణయందతని కమోఘశక్తి కలదు. కాని జాతికి తగిన శిక్షణనిచ్చుటకు విశ్వాసమే సరియైన మార్గమా? దానివలన కొద్దికాలము లబ్ధికలుగవచ్చును. కాని తుదకేమగును?

దౌర్జన్యముమీాద, సంఘర్షణమీాద నిర్మింపబడిన ప్రస్తుత సాంఘిక క్రమము నతడెట్లంగీకరింపగలడో నేను గ్రహింపజాలకుంటిని. నాలోకూడ సంఘర్షణ రేగెను. రెండు విరుద్ధవిశ్వాసములు నన్ను చీల్చుచుండెను. బలవంతముగా నాకుసమకూడినజయిలురక్షణపోవుట తోడనే నన్ను కష్టము లెదుర్కొనునని నేనెరుగుదును. నేను ఇల్లు వాకిలి లేనివానివలె, నేకాకినైనట్లు భావించితిని. నేను ప్రేమించిన భారతము, నేను సేవించిన భారతమునాకొకవింత దేశముగ, నాశ్చర్యకరమగు దేశముగ కాన్పించెను. నా దేశస్థులేమిభావించుచున్నారో, ఎట్లు భావించుచున్నారో గ్రహింపజాలకపోవుట నాదోషమా? నాకతి సన్నిహితులైనవారికి నాకు మధ్యనొక కనపడనిగోడ యున్నట్లు నేను భావించితిని. దీనిని తరించుటకశక్తుడనగుటకు విచారపడుచు నాలోనికి నేనణగిపోవుచుండెడివాడను. ప్రాచీనప్రపంచము వారి నావరించినట్లు నాకు కాన్పించును. నూతనప్రపంచమింకను చాలదూరముననుండెను.

"రెండు ప్రపంచముల మధ్య (ఒకటినశించినదియు, రెండవది జన్మించుట కశక్తమైయున్నదియు) అది భ్రమించుచు తన తల దాచుకొనుట కింకను చోటులేక యుండెను."

హిందూదేశ మన్నివిషయములకంటె నెక్కువగ మతప్రసక్తి కలదేశమనిభావింపబడుచున్నది. హిందువులు, సిక్కులు, ముస్లిములు, తదితరులు తమతమ విశ్వాసములకు గర్వపడుచుతలలనుపగలగొట్టుట వలన తమవిశ్వాసములలోనిసత్యములను రుజువుచేయుచున్నారు. హిందూదేశములోను తదితరచోట్లనుకూడ మతమని పిలువబడు దాని ప్రదర్శనము నన్ను భయముతో ముంచివేసెను. తరచు నేను దానిని ఖండించితిని. నేను దానిని పూర్తిగ తుడిచిపెట్టగోరితిని. అదికొంచె మించుమించు యెల్లపుడును గ్రుడ్డివిశ్వాసము, వెనుకముఖము, పిడివాదము, మొండిపట్టు, పిచ్చినమ్మకము, యితరులను పీడించుట, స్వార్థ

ప్రయోజనములను కాపాడుట ఈయన్నింటిని సమర్థించును అయినను అందులో నింతకంటె భిన్నమైనది, మానవుల యాంతరంగికాక్రోశమును తీర్చునది, మరియొక టేదియో కలదని నే నెరుగుదును. దేని యెడల నది యట్టియద్భుతశక్తి యెట్లుకాగలిగెను? అసంఖ్యాకములగు దుఃఖితాత్ముల కది శాంతిని, సుఖమును యెట్లుచేకూర్చగలిగెను? ఆ శాంతి గ్రుడ్డివిశ్వాసమునకు ప్రశ్నింపజాలని చేతకానితనమునకు కేవలమొక యాశ్రయమా? ఆ శాంతి సముద్రతరంగ సంహాతులనుండి రక్షించు సముద్రాశయమున దాగొనుటచే కలిగిన శాంతియా? లేక నది యింతకంటె నధికమైనదా? కొందరి సందర్భములలో నిశ్చయముగ నది యింతకంటె నధికమైనదే!

కాని విరోధములతోగూడిన మతము (గతకాలములో నదియెట్లుండినను) నేడు చాలవరకు జీవముపోయిన మృతకళేబరము వంటిది. జి. కె. ఛెస్టర్టన్ దానిని (తనకు చెందిన ప్రత్యేకమతముద్రను కాదు. ఇతరములను!) భూగర్భ జంతువుల బాహ్య రూపములతో పోల్చెను. దీనిలోనుండు నాత్మపదార్థము సంపూర్ణముగ మాయమయ్యెను. కాని దానికి కేవల భిన్నమగు నితరపదార్థముతో నది నింపబడుటచే దానియాకారము మిగిలెను. ఒకవేళ; విలువగల దేదియైన కొంతమిగిలినచో నది యితర యుపద్రవకర వస్తువులచే నావరింపబడెను.

మన ప్రాచ్యమతములకు పాశ్చాత్యమతములకు గూడ నిట్టిస్థితియే సంభవించినట్లు కాన్పించును. నిజమైన యర్థములో నేకోశమందు మతముకాని ఇంగ్లీషుచర్చి మతమే యిందుకు ప్రబలనిదర్శనము. కొంతవరకు నిది నిబంధన రూపములోనున్న ప్రొటెస్టెంటు మతముకంతకు వర్తించును. కాని ఇంగ్లండు చర్చి చాలకాలమునుండి ప్రభుత్వవ్యవసాయశాఖయగుటచే బహుశః మరికొంతముందుకు వెళ్లెను.

దాని భక్తులు చాలమంది నిస్సందేహముగ నుత్తమోత్తమశీలము కలవారు. కాని యాచర్చి బ్రిటిషు సామ్రాజ్య ప్రయోజనముల నద్భుతముగ సేవించెను. అది సామ్రాజ్య తత్వమునకు, పెట్టుబడిదారులతత్వమునకు నైతికము, క్రైస్తవమత సంబంధమునగు రక్షణ

నిచ్చెను. అది ఆసియా, ఆఫ్రికాలలోని బ్రిటిషు దోపిడీనీతి నత్యు త్తమ నైతిక ప్రమాణములద్వారా సమర్థింప యత్నించెను. ఎప్పుడును న్యాయముగనే యుండిరను నసాధారణమును, నసూయపడదగినదియు నగుభావమును నది వారికి కలిగించెను. సుఖదాయకమగు నీ పవిత్రభావమును కలుగచేయుటకు చర్చిసహాయపడెనో లేక నదియే దానిని పుట్టించెనో నేను చెప్పజాలను. యూరపు అమెరికా ఖండములలోని యింతకంటె తక్కువ యదృష్టవంతమైన దేశములు తఱచు ఇంగ్లీషువారిని మోసగాండ్రని నిందింతురు. "ఇంగ్లీషువారి నమ్మిక స్వామిద్రోహము" అనునది యొక చెప్పిపోటుమాట. కాని యీ నింద బహుశః ఇంగ్లీషువారిజయమున కసూయచే కలిగినది. నిశ్చయముగ, నే యితర సామ్రాజ్యప్రభుత్వము ఇంగ్లండుపై రాళ్ళు విసరజాలదు. ఏలనన దాని చరితకూడ తత్తుల్యమైనదే. బుద్ధిపూర్వకముగ మోసముచేయు నే జాతికి బ్రిటిషువారు నిరంతరము ప్రదర్శించుచుండిన శక్తిసంపత్తులు లేవు. వారవలంబించిన 'మతము' వారి స్వప్రయోజనములను సంబంధించినచోట వారినైతికజ్ఞానమును మొద్దుపరచి వారికిందులో సహాయముచేసెను. ఇతర ప్రజలు, జాతులు బ్రిటిషువారికంటె నతి యధమముగ ప్రవర్తించిరి. కాని తమకు లాభించినదాని నొక పుణ్యకార్యముగచేయుటలో వారెవరికిని యింతటిజయము చేకూరలేదు. మన కందరకు నెదుటవాని దోషములు నలుసులైనను కాన్పించును. మనదోషములు గుమ్మడికాయలంతయైనను కానరావు. కాని బ్రిటిషువారీ విద్యలో నందరిని చిత్తుచేసెదరు.

ప్రొటెస్టెంటు మతము నూతనపరిస్థితులకు సరిపడియుండుటకు యత్నించెను. అది రెండులోకముల యుత్తమభోగములను అనుభవింపగోరెను. ఈ ప్రపంచముకు సంబంధించినంతవరకు విజయము నొందెను. కాని మతదృష్టిలో (నిబంధనలతో గూడిన మతము) నది రెంటికి చెడ్డ రేవడివలె చెడిపోయెను. మతము క్రమముగ హేతుశూన్యమగు నుద్రేకమునకు పెద్దవర్తకమునకు దావిచ్చెను. పాతమార్గముునే యంటిపెట్టుకొని యుండుటచే రోమనుక్యాథలిక్ మతము

కిస్థితికల్పెను. ఆ మార్గము సరిగా నున్నంతవరకు అది వృద్ధిచెందును. పాశ్చాత్యదేశములలో నే డది యొక్కటే సచేతనమైనమతముగ (దానిసంకుచితార్థములో) కాన్పించును. ఒకరోమను క్యాథలిక్ స్నేహితుడు నాకు జయులులోనికి కేథాలిసిజమునుగురించినయనేకపుస్తకములను పోపుగారి యుత్తరములను పంపించెను. నేను వానిని శ్రద్ధతో చదివితిని. వానిని చదివిన తరువాత నామతమున కనేకమంది ప్రజలపైగల పలుకుబడిని నేను గ్రహింపగలిగితిని. ఇస్లాముమతము జనసామాన్యమునకు చెందు హిందూమతమువలెనే (యదిసందేహాస్పదము) మానసిక సంఘర్షణములేనట్టి యొక భద్రమగు నాశ్రయమును ప్రసాదించెను. ఈ జీవితములోని దోషములను కూడగట్టగల భవిష్యజ్జీవితము నది భీమాచేసిపెట్టును!

ఈ విధముగ తలదాచుకొనజూచుటనాకసంభవముగనుండెను. తుపానులతోను అలలతోను నిండియుండు సముద్రమునే నేను వాంఛింతును. చనిపోయిన తరువాత జరుగు విషయములందు, పరమునందు నా కంతయభిరుచిలేదు. ఈ జీవితసమస్యలే నామనస్సును నింపునంతటి యాకర్షవంతముగ కాన్పించును. ప్రధానముగ నైతికమయినదేయైనను (మతవిరుద్ధము లేక మతమును సందేహించునట్టిదియైనను?) చీనాదేశస్థుల సాంప్రదాయకకృషి దానిని జీవితమునకు వర్తింపచేయుటలో నే నంగీకరింపకపోవచ్చును. నన్నాకర్షించును. మన మనుసరింపవలసిన మార్గము మనము జీవింపవలసిన విధము నాకు ప్రధానములు. జీవితమును తిరస్కరించుట దానినర్థముచేసికొనుట కాజాలదు, దానినిస్వీకరింపవలెను. దానికితగిన సన్నాహముచేసికొని దానినిచక్కపరచవలెను, కానిమామూలు మతదృష్టికి ప్రపంచముతో సంబంధములేదు. అదినిర్దుష్టభావముః కుశలత్వపువలెకాన్పించును. ఏలనన నది స్థిరములు మార్చకూడని సిద్ధాంతములు ధర్మపన్నములను నిరాటంకముగ నంగీకరించుపునాదులమీద నిర్మింపబడుటయేగాక ఉద్రేకము, ద్వేషము, రాగము అను పునాదులనుగూడ నంగీకరించెను. ఆత్మకుసంబంధించినయాధ్యాత్మికములను నా భావన కదియనేకమైళ్ళదూరము, అంతకుపూర్వము భావింపబడిన భావములకు సత్యము సరి

పడకపోవచ్చుననుభయముచే నది బుద్ధిపూర్వకముగ లేదా యబుద్ధిపూర్వకముగ సత్యమువట్ల కండ్లుమూసికొనును. అది సంకుచితమయినది. ఇతరభావములను యితర యభిప్రాయములను అది యెంతమాత్రము సహింపనేరదు. అది తనకేంద్రమునుదాటక అహంకారపూరితమయియుండును, స్వార్థపరులచేతను సమయానుకూల స్వార్థపరులచేతను అది తఱచు కొల్లగొట్టబడును.

మతతత్పరులతో తరచు నుత్తమోత్తమ నైతిక, యాధ్యాత్మిక వ్యక్తులుండలేదని, యిప్పుడులేరని దీనియర్థముకాదు. నీతిని, యాధ్యాత్మికములను పరముకుచెందు ప్రమాణమునుబట్టిగాక నిహప్రమాణమునుబట్టి విమర్శింపవలసినచో మతదృష్టి యొక జాతియొక్కయు ప్రజయొక్కయు నైతిక, యాధ్యాత్మికాభివృద్ధికిసహాయపడకపోవుటయేగాక దాని కభ్యంతరముగగూడ నుండునని దీనిభావము. సాధారణముగ మతము సంఘమున కతీతమైనభగవంతుని లేక పరబ్రహ్మమునుచూచు యత్నమగుచున్నది. మతాభిలాషికి సాంఘిక శ్రేయస్సుగాక తన ముక్తియే కావలెను. యోగి స్వార్థనాశముచేయ యత్నించుచు నా విధానములో సాధారణముగ తానును చిక్కుకొనును. నైతిక ప్రమాణములకు సాంఘికావసరములతో సంబంధములేదు. కాని యవి పాపమను నత్యంత మానసిక సిద్ధాంతముపై నిర్మింపబడెను. నిరోధములతో నున్నమతము విధాయకముగ స్వప్రయోజనపరత్వమగును. కనుక నది తప్పనిసరిగ మార్పును. అభివృద్ధిని యెదుర్కొను శక్తియే యగును.

మొదటిదినములలో క్రైస్తవచర్చి, తమ సాంఘికశక్తిని చక్కబరచుకొను బానిసలకు సహాయపడలేదనుసంగతి సువిదితము. ఆర్థిక పరిస్థితులవలన బానిసలు యూరపుయొక్క మధ్యయుగములో సామంతుల కమ్ముడుపోయిన నౌకరులైరి. రెండువందలేండ్ల క్రితము చర్చి కెట్టి దృష్టియుండెనో లండన్‌బిషప్ అమెరికా దక్షిణకాలనీలోని బానిసల యజమానులకు (1727లో) వ్రాసిన యొక యుత్తరము వలన తెలియుచున్నది.

"క్రైస్తవమతము జీససుబోధలను స్వీకరించుట– ఇది నాగరిక సంబంధమైన యేధర్మములో గాని, ఆస్థిలోగాని యెట్టి కనీసపు మార్పునుచేయదు. కాని యీ యన్ని విషయములలో నవియేస్థితిలో నున్న మనిషినాస్థితిలోనే యుంచును. క్రైస్తవ మతము పాపబంధము నుండియు, సైతానునుండియు మానవుల లోభ, మోహ, మాత్స ర్యాములనుండియు మోక్షము నిచ్చును. కాని వారిబాహ్యపరిస్థితివిష యమై–యది యంతకుమును పేదదియైనను–బానిసత్వమైనను, స్వాతం త్ర్యమైనను, వారు క్రైస్తవులగుటవల్లను, 'మంత్రోదకము' తీసి కొనుటవల్లను వారిలో నెట్టిమార్పును కలుగజాలదు" అని యీ బిషప్ వ్రాసెను.

నేడు నిబంధనలతోనున్న యేమతమును దావరికము లేకుండ నిల్లు వ్యక్తపరచదు. కాని ప్రస్తుత సాంఘిక క్రమమును గురించియు, ఆ స్థితిని గురించియు దాని దృష్టి ముఖ్యముగ నిల్వయుండును.

శబ్దము, భావమును తెలుపు యసంపూర్తి సాధనమని మన మెఱుగుదుము. తరచు అవి యనేక విధముల నర్థము చేసికొనబడు చున్నవి. 'రెలిజియన్' అను పదమువలె (లేక నీ యర్థమిచ్చు యితర భాషలలోని పదములవలె) బహుశః యే భాషలలోని యే శబ్దమును కూడ ననేక ప్రజలచేత ననేకవిధముల నర్థముచేసికొనబడదు. ఈ శబ్దమును వినుటవలనగాని, చదువుటవలనగాని బహుశః యే యిద్దరు మనుష్యులకు నొకేభావములు, రూపములు యుత్పన్నముకాజాలవు. ఆ భావములలోను, రూపములలోను, పూజలు పునస్కారములు, కర్మకాండ, వేదములు, పవిత్రగ్రంథములు, నీతులు, సిద్ధాంతములు, భక్తి, ప్రేమ, భయము, ద్వేషము, దయ, త్యాగము, సన్యాసము, ఉపవాసము, విందులు, ప్రార్థన, ప్రాచీనచరిత్ర, వివాహము, మృత్యువు, పరము, కొట్లాటలు, బుర్రలు పగులగొట్టుట యిత్యాదు లెన్నియో యుండవచ్చును. ఇన్ని విధములైన రూపములు, అర్థ ములు నుండుటచే కలుగు గందరగోళముసంగతి యటుండ, యుద్రేక రహితభావము నసంభవము చేయునట్టి బలమైన యుద్రేక మెప్పుడును యుండితీరును. 'మతము' అనుపదము సరియైన యర్థమును కోల్పోయి.

కేవల గందరగోళము మాత్రమే చేయుచున్నది. తఱచు దాని కనేక విరుద్ధార్థము లుండుటచే నది యంతుపొంతులేని వాదనకు, చర్చకు నావకాశ మిచ్చుచున్నది. మనము దాని నుపయోగించుట పూర్తిగ మానివేసి యంతకంటె స్వల్పమైన యర్థములుగల వేదాంతము ఆధ్యాత్మికములు, నీతులు, మనఃశాస్త్రము ధర్మము పూజాపురస్కారములు, దివ్యశాస్త్రము మొదలగునట్టివాని నుపయోగించిన చాలబాగుండును. ఈ పదములుకూడ సస్పష్టమైనవే కాని 'మతము' కంటె వీనికున్న వ్యాప్తి చాల తక్కువ. ఒక గొప్పలాభమేమనిన 'మతము' అను పదము నావరించు భావములు, ఉద్రేకములు యీ పదముల కంతగా కల్పింపబడలేదు.

కనుక మతమన నేమి? బహుశః అది వ్యక్తియొక్క యాంతరంగికాభివృద్ధి శ్రేయస్కరమని తలంపబడిన మార్గమున నతనిబుద్ధి వికశించుటయు కావచ్చును. ఆ మార్గమునుగురించి మరల తర్కము బయలుదేరును. కాని మతమునుగురించి నాకు తెలిసినంతవరకది యీ యాంతరంగికమార్పు కావలెననియే చెప్పును. బాహ్యపరివర్తన మీ యాంతరంగికాభివృద్ధి బాహ్యపరిసరముల నత్యంత శక్తితో చక్కబరచుననుటలో నెట్టి సందేహాము లేదు. కాని బాహ్యపరిసరమాంతరంగికాభివృద్ధికి మిక్కిలి తోడ్పడును. అవి యొకటి కొకటి తోడ్పడును. ఆధునిక పారిశ్రామిక పాశ్చాత్యఖండములలో బాహ్యాభివృద్ధి యాంతరంగికాభివృద్ధి నెక్కువగ దిగద్రొక్కి వేసెననుట సామాన్యమాట యయ్యెను. కాని మనము పారిశ్రామికముగ వెనుకబడియున్నాము. మనబాహ్యాభివృద్ధి మందముగనున్నది. కనుక మన యాంతరంగిక పరిణామము గొప్పదియను యర్థము కానేరదు. ఇట్టిపిచ్చిభ్రమలతో మనల నోదార్చుకొన యత్నించుచు మనము తక్కువవారమను భావమును పోగొట్టుకొన యత్నించుచున్నాము. వ్యక్తులు కొందఱు పరిస్థితులను, పరిసరములను తరించిగొప్ప యాంతరంగికోన్నతిని పొందవచ్చును. కాని సంఘములకు జాతులకు నాంతరంగికపరిణామము కలుగుటకు పూర్వము కొంత బాహ్యాభివృద్ధి

యవసరము. ఆర్థికపరిస్థితులకు దాసుడై జీవితసంబంధముచే నలిగిపోవు వాడెట్టి యుత్తమ యాంతరంగికజ్ఞానమును సాధింపజాలడు. అట్టివారతి క్వచితు. రాజకీయముగ, నార్థికముగ, నితరజాతికి బానిసయై నిర్బంధింపబడి, కొల్లగొట్టబడి, నలిగిపోవుజాతి యాంతరంగికాభివృద్ధి నెన్నటికి సాధింపజాలదు. అంతరంగికాభివృద్ధికి బాహ్యస్వేచ్ఛ, తగిన పరిసరములు నవసరమగుచున్నవి. బాహ్యస్వేచ్ఛను సంపాదించుటకు నాంతరంగికాభివృద్ధి నాటంకపరచు పరిసరములను మార్చుటకు నవలంభింపబడు విధానము మన నిజలక్ష్యమునకే హానిచేయగూడదు. మన లక్ష్యముకంటె మన మవలంబించు సాధనమే యెక్కువ ముఖ్యమైనదని గాంధీజీ చెప్పినప్పు డతనిదృష్టిలో నిట్టిభావమే యుండెనని నే ననుకొనెదను. కాని యా సాధన మన లక్ష్యమునకు తీసుకొనిపోవు నదిగ నుండవలెను. లేనిచో నదియంతయు వ్యర్థప్రయత్నమగును. అది మరింత బాహ్యాభ్యంతర యధఃపతనముకు గారణముకావచ్చును

“మతము లేకుండ నెవడు జీవింపజాలడు” అని గాంధీజీ యొకచోట వ్రాసెను. “హేతువాదాహంభావముచేత మతముతో తమకెట్టి సంబంధములేదని ప్రకటించువారు కొందరుకలరు. కానియది “నేను గాలిని పీల్చుచున్నాను కాని నాకు ముక్కు లేదు,” అనునట్లుండును. మరియొకచోట నతడిట్లనెను. “సత్యమువల్ల నాకుగల భక్తియే నన్ను రాజకీయరంగములోనికి దింపెను. మతమునకు రాజకీయములతో నెట్టి సంబంధములేదని చెప్పువారికి మతమున కర్థము తెలియదని నే నెట్టి సందేహములేకుండ చెప్పగలను.” మతమును రాజకీయములనుండియు, జీవితమునుండియు బహిష్కరింపగోరువారిలో చాలమంది ‘మతము’ అను పదమున కతడు చెప్పు యర్థముగాక వేరొక విపరీతార్థమునిచ్చుచున్నారని యతడు చెప్పిన యెడల బహుశః మరింత యొప్పుగనుండెడిది. అతడుదానిని మతమును విమర్శించువారి యర్థమునకు భిన్నమైన–బహుశః అన్ని భావములకంటె నెక్కువగ నైతిక భావములో—యర్థములో నుపయోగించుచున్నాడని స్పష్టమగుచునేయున్నది. ఒకే పదమును వివిధార్థములలో నుపయోగించుటచే పరస్పరసమన్వయము మరింత కష్టమగుచున్నది.

మతమునకు జాన్‌డ్యూయీ పండితు డాధునిక నిర్వచనము చేసెను. అతని ప్రకారము "వివిధములు, మారునవియగు జీవిత విషయములలో, యదార్థ మానసిక దృష్టిని ప్రవేశపెట్టు నదేదియైనను మతమనబడును. లేక "ఒక యాదర్శపూర్వక లక్ష్యముకొఱ కెన్ని యాటంకములనైనను యెంతటి వ్యక్తిగత నష్టమునైనను భరించుచు చేయబడు నే కార్యమైనను వస్తుతః మతమే" ఇది మతమైనచో నిశ్చయముగ దీనిపట్ల నెవనికి నెట్టి యభ్యంతరము నుండజాలదు.
రోమారోలాకూడ నిబంధనలతో గూడిన సనాతన మతస్థులకు భయముగొల్పునట్లు మతముకు విశేషార్థము చెప్పెను. అతడు తాను రచించిన 'రామకృష్ణుని జీవితము'లో నిట్లు చెప్పెను.

"ఎట్టిమత విశ్వాసమునకు కట్టుబడని చాలమంది లేక కట్టుబడుటలేదని విశ్వసించువారు దానిని సామ్యవాదము, కమ్యూనిజము, భూతదయాళుత్వము, జాతీయత, చివరకు హేతువాదము, అని యందురు. ఒక భావముయొక్క మూలమును నిశ్చయించునది దాని గుణము కాని లక్ష్యముకాదు. ఆ భావము మతమునుండి బయలుదేరుచున్నదా లేదా యనునది దాని గుణమునుబట్టి నిర్ణయింపబడవలెనేగాని దాని లక్ష్యమునుబట్టి నిర్ణయింపబడరాదు. అది నిర్భయముగ సత్యాన్వేషణమున కెట్టి కష్టములనైన నెదుర్కొని, యే కైక దీక్షతో నెట్టి త్యాగమునకైనను సంసిద్ధతను చూపినచో నేనుదానిని మతసంబంధమైన దనియెనెదను. ఏలనన నది ప్రస్తుతసాంఘికజీవితము కంటె, సమగ్ర మానవ లోకమంతటికంటె నుత్తమమైనదే. పురుషార్థ లక్ష్యమును విశ్వాసమును తెలుపుచున్నది నిరీశ్వరవాదము కూడ, తత్వాన్వేషణాతత్పరతగల తీవ్రప్రకృతులనుండి బయలు దేరునపుడు మత సంబంధమైన 'ఆత్మ' యొక్క మహా సైన్య ప్రస్థానములోనే జేరుచున్నది.

రోమారోలా షరతులను నిర్వహింపగలనని నేను చెప్పజాలను కాని ఈ షరతుల మీద నా మహాసైన్యము యొక్క విధేయత గల సైనికునివలెనుండుటకు నేను సంసిద్ధుడనైయుంటిని.

48

బ్రిటిషు ప్రభుత్వ "ద్వంద్వ నీతి"

ఎరవాడ జయిలునుండియు, వెలుపల బయటనుండియు గాంధీజీ యాదేశానుసారము హరిజనోద్యమము నడిపింపబడుచుండెను. దేవాలయప్రవేశమునకు గల యాటంకములను తొలగింపవలెనను గొప్ప యాందోళన బయలుదేరెను. అసెంబ్లీ సభలో నట్టి బిల్లు ప్రవేశపెట్టబడెను. అప్పుడొక విఖ్యాత కాంగ్రెసునాయకుడు ఢిల్లీలో నిల్లిల్లు తిరుగుచు, అసెంబ్లీసభ్యులనందరిని దర్శించుచు, నీదేవాలయ ప్రవేశబిల్లుకొరకు వోటులను భిక్షించునద్భుత ప్రదర్శనము జరిగెను. గాంధీజీ స్వయముగ వతనిద్వారా అసెంబ్లీసభ్యులకొక వార్త పంపెను. అప్పటికింకను శాసనోల్లంఘనము జరుగుచునే యున్నది. ప్రజలు జయిళ్ళకు పోవుచునేయున్నారు. కాంగ్రెసు అసెంబ్లీని బహిష్కరించెను! మన అసెంబ్లీ సభ్యులందరు దానిని విడిచివచ్చిరి. మిగిలిన మొండిముక్కలును, కాళ్లను [illegible]వేసినవారు కలిసి యావిషమ సమయములో కాంగ్రెసు నెదిరించుచు, ప్రభుత్వమునుబలపరచుచు తమ ఘనతను చాటుకొనిరి. వారిలో నధిక సంఖ్యాకులు ఆర్డినెన్సుల యసాధారణాధికారములకు కొంత స్థిరత్వము ప్రసాదించు నిర్బంధ చట్టములను చేయుటలో ప్రభుత్వమునకు తోడ్పడిరి. వారు ఒటావా సంధిని దిగమ్రింగిరి. వారు ఢిల్లీ సిమ్లా, లండనులోనున్న ఘనులతో భోజనభాజనములను చేసిరి. విందులను గుడిచిరి. భారతదేశములోని బ్రిటిషు ప్రభుత్వముకు జేజేలుకొట్టుటలో చేరిరి. భారతదేశములోని "ద్వంద్వనీతి" యని పిలువబడుదాని విజయముకొరకు ప్రార్థించిరి.

అప్పుడున్న పరిస్థితులలో గాంధీజీ చూపిన ప్రాధేయతకు నే నాశ్చర్యపడితిని. కొద్దివారములక్రితమే తాత్కాలికాధ్యక్షుడుగ పని చేసిన రాజగోపాలాచారిగారి భగీరథ యత్నములకంతకంటె నెక్కువగ నాశ్చర్యపడితిని. ఈ చర్యవలన శాసనోల్లంఘనము నష్టపడెను.

కాని దీనిలోనున్న నైతికపతనమే నా కెక్కువ బాధ కలిగించెను. గాంధీజీగాని, మరేకాంగ్రెసునాయకుడుగాని యిట్టిచర్యలను ప్రోత్సహించుట యపిసిగను, జయిళ్ళలోనున్న యసంఖ్యాకులయెడలను, పోరాటమును సాగించుచున్న వారియెడలను కొంచె మించుమించు నమ్మిక స్వామిద్రోహముగను నాకు కాన్పించెను. కాని యతడు దానిని మరియొక విధముగ చూచునని నేనెరుగుదును.

ఈ దేవాలయ ప్రవేశబిల్లు సందర్భములో ప్రభుత్వవైఖరి [యప్పుడును, తరువాతను] సత్యమును వెల్లడించెను. దానిని ప్రోత్సహించినవారి మార్గమున కది కల్పింపగలిగినన్ని కష్టములను గల్పించెను. వాయిదా వెంబడి వాయిదాలను వేసెను. దానికి వ్యతిరేకమును ప్రోత్సహించెను. తరువాత తుదకు తానే వ్యతిరేకముగ నున్నట్లు ప్రకటించి దానిని చంపివేసెను. భారతదేశములోని యన్ని సంఘసంస్కారోద్యమములపట్లను (హెచ్చుతగ్గుస్థాయిలో) దానివైఖరి యట్లేయుండెను మతములో జోక్యము కలిగించుకొనము అనుమిష మీద నది సాంఘికాభివృద్ధి నాటంకపరచెను. కాని మన సాంఘిక దోషములను విమర్శించుటకు యితరుల నట్లుచేయ ప్రోత్సహించుటకు నిది వారికెట్టి యాటంకము కలిగింపదని వేరుగ చెప్పనక్కర లేదు. అదృష్టవశాత్తు శారదా శిశువివాహ నిర్బంధ బిల్లు చట్టమయ్యెను. కాని ప్రభుత్వమిట్టి చట్టముల నమలుపరచుట కెంత యయిష్టముగనుండెనో యీ దుర్రదృష్ట చట్టముయొక్క తరువాత చరిత్ర [మరేదియు చూపజాలనట్లు] విశదముచేయుచున్నది. వింత నేరములను సృష్టించుచు, నొకరికొకరు మరియొకవిని శిక్షించుటకు తగిన బందోబస్తులను చేసికొనుచు,నిశీధమందుఆర్డినెన్సులనుసృష్టింపగల ప్రభుత్వము; వాని నుల్లంఘించినందులకు లక్షలకొలదిజనమును జయిళ్ళకుపంపగలిగిన ప్రభుత్వము శారదాచట్టమువంటి క్రమచట్టము నమలుపరచుటకు జంకెను కాబోలు! ఈ ఆక్టుయొక్క మొదటిఫలిత మేమనిన నిది యే దోషమును డీకొనుట కుద్దేశింపబడెనో యది యద్భుతముగ పెరిగిపోయెను. ఈ ఆక్టు అతి తెలివి తక్కువగా నివ్వబడిన

యీ రెండుమాసముల సావకాశమును తీసుకొనుటకు ప్రజలు త్వరపడిరి, తరువాత నీ ఆట్టు కొంచెమించుమించుగ నొకపరిహాసమని కనుగొనబడెను. ప్రభుత్వమెట్టిచర్య తీసుకొనకుండ దీనినిచులకనగని నిర్లక్ష్యము చేయవచ్చునని ప్రజలు గ్రహించిరి. అధికారరీత్యా ప్రచారము చేయుటకు ప్రయత్నలేశమైనను గావింపబడలేదు. గ్రామములలో చాలమందికి ఆట్టుసంగతియే తెలియదు. వారు హిందూ, ముస్లిం గ్రామ పురోహితులవలన దీని యవకతవక కథను వినిరి. యదార్థ విషయము లా పురోహితులకే తెలియవు.

హిందూదేశములో బ్రిటిషుప్రభుత్వముసాంఘికదోషములపట్ల చూపు అసాధారణసహనము వానియెడలగల పక్షపాతబుద్ధిచే కలిగినదికాదు వానిని రూపుమాపుటకు వారంతగా లెక్కచేయరనుట సత్యము. ఏలనన యీ దోషములు వారు హిందూదేశమును పరిపాలించుటకుగాని, దాని నిధులను కొల్లగొనుటకుగాని యడ్డమురావు సాంఘిక సంస్కరణమువలన ప్రజలకు కోపముకలిగించు యుపద్రవమెప్పుడును కలదు. రాజకీయరంగములో కావలసినంతకోపము నెదుర్కొనవలసియుండుటచే బ్రిటిషుప్రభుత్వములేను కష్టములకు క్రొత్తవానిని చేర్చుకొన నిచ్ఛగింపకుండెను. కాని సంఘసంస్కారము చేయుగోరువాని దృష్టిలో నిప్పటిస్థితిగతు లధ్వాన్నముగనుండెను. బ్రిటిషువారంతకంతకే సాంఘికదోషములకు పైకికాన్పించని రక్షణ నిచ్చుచున్నారు. భారతదేశాభివృద్ధి కత్యంత భంగకారకులైనవారి సన్నిహితసంపర్కముచేతనే వారిట్లు తయారైరి. వారి పరిపాలనకు వ్యతిరేకము హెచ్చినకొలదివారు క్రొత్తస్నేహితులను చూచుకొనుచుండవలెను. నేడు భారతదేశములో మతతత్వవాదులలో పతివాదులు, జ్ఞానము, సంస్కారము వలదనువారు బ్రిటిషుప్రభుత్వము కచంచల మూలస్తంభములు. ముస్లింకులసంస్థలు ప్రతి విషయములోను_రాజకీయ, ఆర్థిక, సాంఘికము లన్నింటిలోను యభివృద్ధిభంగకరములని ప్రసిద్ధిచెందెను. వానికి హిందూమహాసభ పోటీ. కాని ఈ వెనుకకు నడుగెత్తు పందెములో వారికాలలు మరియొకరున్నారు.

వారు సనాతనులు. వారు మత సంబంధముగ నెట్టి యభివృద్ధియు కూడదనుటలో నతివాదులేగాక బ్రిటిషుపరిపాలనయెడల గొప్పరాజ భక్తి[అర్థము వారట్లు బిగ్గరగా చెప్పకొందురు]. కలవారు.

శారదాచట్టమును ప్రజలకు తెలుపుటకు నమలుపరచుటకు బ్రిటిషుప్రభుత్వము మిన్నకయుండి యెట్టి చర్యయు తీసుకొనకపోయి నను కాంగ్రెసు, తదితర యనధికారసంస్థలు దాని తరుపున యేల ప్రచారముచేయలేదు? బ్రిటిషువిమర్శకులు, నితర విదేశవిమర్శకులు తఱచు యీ ప్రశ్న వేయుచుండిరి. కాంగ్రెసు గత పదిహేను సంవత్సరములనుండి [ముఖ్యముగ 1930 లగాయతు) జాతీయ స్వాతంత్ర్యముకొరకు బ్రిటిషు ప్రభుత్వముతో పోరాటములోమునిగి యుండెను, యితర సంస్థలకు నిజమైనబలముగాని ప్రజలతో నెట్టి సంబంధముగాని లేదు, ఆదర్శములును నైతికబలమును, ప్రజా సామాన్యములో పలుకుబడియు గల, స్త్రీపురుషులు కాంగ్రెసులోని కీడ్వబడి తమ జీవితములో చాలభాగము బ్రిటిషుజయిళ్ళలో గడుపు చుండిరి.

తక్కిన సంస్థలు ప్రజాసంపర్కమునకు భయపడు కొద్దిమంది చేయు తీర్మానములను దాటి వయికిపోజాలకుండెను. అవి "పెద్దమనిషి తరహాగా పనిచేసెను. అఖిలభారత స్త్రీసమాజమువలె పనిచేసెను. వారికి తీవ్రమైన ప్రచారముచేయు సత్తువలేదు. అదిగాక ఆర్డినెన్సులు వానివెనుకవచ్చిన చట్టములును అన్ని ప్రజాహితకార్యములను భయంకరముగ నణచివేయుచుండుటచే వారుగూడా నిర్విణ్ణులైరి, సైనిక శాసనము విప్లవచర్యల నణచివేయవచ్చును. కాని యది దానితోపాటు నాగరికతను పౌరక కార్యములనుగూడ నిర్వీర్య మొనర్చును.

కాంగ్రెసు, తదితరయధికారేతర సంస్థలు సంఘసంస్కారము కెక్కువగ పనిచేయజాలకపోవుటకు గల కారణమింతకంటె గంభీర మైనది. జాతీయతయనువ్యాధి మనలను బాధించుచున్నది. అది మన దృష్టినంతను మ్రుంగివేయుచున్నది. మనకు రాజకీయస్వాతంత్ర్యము

వచ్చువరకు నది యుక్తి చేయును. బెర్నార్డుషా చెప్పినట్లు 'జయింపబడిన జాతి రాచపుండుగల మనిషివంటిది. వాడు మరిదేనిని గురించియు యోచింపజాలడు. జాతికి జాతీయోద్యమముకంటె గొప్ప శత్రువు వేరొకటిలేదు. అది యణచివేయబడిన యొక సహజధర్మము యొక్క బాధను తెలుపు చిహ్నముమాత్రమే యగుచున్నది. జయింపబడిన దేశములు ప్రపంచస్థానములో తమస్థానమునుకోల్పోవుచున్నవి. ఎందుచేతనన అవి జాతీయస్వాతంత్ర్యమును సంపాదించి తద్వారా జాతీయోద్యమములను వదలించుకొను యత్నముకంటె వేరేమియు చేయజాలవు"

మంత్రులకు కొన్ని శాఖలు బదిలీచేయబడినను ప్రస్తుత పరిస్థితులలో మన మెట్టి సాంఘికాభివృద్ధిని చేయజాలమని గత యనుభవము తెలుపుచున్నది. ప్రభుత్వ సభ్యత్వము కన్సర్వేటివుల కెప్పుడు సహాయకారిగనుండెను. అనేకతరములనుండి బ్రిటిషు ప్రభుత్వము వారు స్వతంత్రశక్తిని చంపివేసి నిరంకుశముగ లేక వారే చెప్పినట్లు మన సంరక్షకులుగ పాలించిరి. అధికారేతరులుచేయు నెట్టి గొప్ప యత్నమునైన నది యామోదింపజాలదు. అది దానికి కూఢాగ్రములను కల్పించును. హరిజనోద్యమమునకు (దాని స్థాపకులన్నివిధములైన జాగ్రతలను తీసికొనినను) అప్పుడప్పుడు ప్రభుత్వాధికారులతో సంఘర్షణవచ్చుచుండెను. కాంగ్రెసు సబ్బువాడవలెనని ప్రచారము దేశమున ప్రారంభమును చేసినచో ననేకవిధముల ప్రభుత్వముతో సంఘర్షణ సంభవించునని నేను రూఢిగ చెప్పగలను.

ప్రభుత్వము తలచుకొనినచో ప్రజలను సంఘసంస్కారనుముఖులనుచేయుట కష్టమైనపనికాదు. కాని విదేశ పరిపాలకు లెప్పుడు సందేహించుచు మార్పుచేయు విధానములో దూరముపోజాలరు. విజాతీయ సంపర్కము తీసివేసి యార్థికపరివర్తనలకు ప్రాముఖ్యత నిచ్చినచో సమర్థతగల పరిపాలన గొప్ప సాంఘిక సంస్కారములను చులకనగా ప్రవేశపెట్టవచ్చును.

కాని జయిలులో మామనస్సులుసంఘసంస్కారము, శారదా చట్టము, హరిజనోద్యమములతో (శాసనోల్లంఘనమున కడ్డమువచ్చె

కని హరిజనోద్యమమువల్ల నాకు కొంచెము కోపము కలుగుటతప్ప నిండియుండలేదు, 1933 మే మొదటివారములో శాసనోల్లంఘన మారువారము లాపివేయబడెను. తరువాత నేమియగునో యని మే మాతురతతో చూచుచుంటిమి అవిరామమే యుద్యమమునకు తుది సంఘాతమయ్యెను. జాతీయపోరాటమును మనము మన యిష్టము వచ్చినప్పుడు బిగించుచు విడిచిపెట్టుచు చెరలాట మాడజాలము. దానిని విరమించుటకు పూర్వమే యుద్యమమును నడిపించిన నాయకత్వము దుర్బలముగ నిర్వీర్యముగ నుండెను. చిన్నచిన్న కాన్ఫరెన్సులు ననేక వదంతులు చెలరేగుచు చురుకైనపని మొందివడుచుండెను. కొంతమంది తాత్కాలికాధ్యక్షులు చాల గౌరవనీయులు. కాని తీవ్రమైన యుద్యమమున కట్టివారిని సేనాధిపతులుగ నియమించుట వారియెడల క్రూరత్వమే యగును, వారలసిపోయిరి. క్లిష్టస్థితినుండి తప్పుకొనవలెనని వారికి కోరిక యున్నట్లనేక సూచనలు కాన్పించుచుండెను. పెద్దవారి యూగిసలాటయు, అనిశ్చయము నసంతృప్తిని కలిగించెను. కాని కాంగ్రెసు సంఘములన్నియు నక్రమ సంఘములగుటచే దీనిని సక్రమముగ వ్యక్తముచేయుట యసంభవమయ్యెను.

అప్పుడు గాంధీజీ యేకవింశతి దినోపవాసము, జయిలునుండి విడువబడుట, ఆరువారములు శాసనోల్లంఘనమును విరమించుట-సంభవించెను. ఉపవాసము పూర్తియైనతరువాత నతడు నెమ్మదిగ కోలుకొనెను. జూన్ నెలమధ్య శాసనోల్లంఘన విరామము మరి యారువారములు హెచ్చింపబడెను. ఈ లోపున ప్రభుత్వతీవ్రవిధాన మెంతమాత్రము సడలలేదు. అండమాను ద్వీపములలో రాజకీయ ఖయిదీలను (వంగదేశములో విప్లవదౌర్జన్యచర్యలకు శిక్షింపబడిన వారచ్చటకు బంపబడిరి.) తిన్నగ చూడక పోవుటచే నిరశనవ్రతము ప్రారంభమయ్యెను. అందులో నొక రిద్దరు (చనిపోవువరకు నుపవసించి) చనిపోయిరి. ఇతరులు చనిపోవనుండిరి. అండమానులలో జరుగుచున్న దానిని నిరసించుటకు భారతదేశములో జరుపబడు సభ

లలో నుపన్యసించువారు నిర్బంధింపబడి శిక్షింపబడిరి. బాధపడ వలసియుండుటయే గాక, ఖయిదీలు నిరసనదీక్షయను భయంకరాగ్ని పరీక్ష కాహుతియగుచుండ (నిరసన చూపుటకు మరియొక మార్గము లేక) నోరెత్తి చెప్పుకొనుటకు కూడ నేము నోచుకొనలేము. కొన్ని నెలలైనతరువాత 1933 సెప్టెంబరులో (నేను జయిలు వెలుపల నున్నపుడు) రవీంద్రనాథటాగూరు, సి. యఫ్. ఆండ్రూసు మొదలగు వనేకమంది విఖ్యాతపురుషుల సంతకములతో నొక అప్పీలు చేయబడెను. వీరికి కాంగ్రెసుతో నెట్టి సంబంధము లేదు. అండమాను దీవులలోనున్న ఖయిదీల నెక్కువభూతదయతో చూడవలసినదనియు, వారిని భారతజయిళ్ళకు మార్చవలసినదనియు వారు కోరిరి. భారత ప్రభుత్వ హోంమెంబరు యీ స్టేటుమెంటుపట్ల తన తీవ్రమగుసమ్మతిని వెలిబుచ్చుచు ఖయిదీల యెడల సానుభూతి చూపుచు సంతకములను చేసినవారిని కఠినముగ విమర్శించెను. తరువాత (నాకు జ్ఞాపకమున్నంతవరకు) నట్టి సానుభూతి వెలిబుచ్చుట వంగదేశములో నొక శిక్షార్హమైన నేరమయ్యెను.

శాసనోల్లంఘన విరామముయొక్క రెండవవాయిదా పరిమితి ముగియులోపల గాంధీజీ పూనాలో నొక యిష్టాగోష్ఠి సభ జరుపనుండెనను వార్త డేరాడూను జయిలుకు వచ్చెను. అచ్చట రెండు మూడువందలమంది జేరిరి. గాంధీజీసలహామీద సమష్టి శాసనోల్లంఘన మాపివేయబడెను. కాని వ్యక్తిగత శాసనోల్లంఘనము చేయవచ్చుననిరి. రహస్యపద్ధతులన్నియు బహిష్కరింపబడెను. ఈ తీర్మానము లెక్కువ ప్రబోధజనకముగలేవు. కాని వారికిసంబంధించినంతవరకు నే నెట్టి ప్రత్యేకాభ్యంతరము చెప్పలేదు. సమష్టి శాసనోల్లంఘనము నాపుటయనగా దానిని మానుటయే! నిజమునకప్పుడు సమష్టియుద్యమము లేదు. రహస్యకృత్యములు పనిచేయుచున్నామని చెప్పుకొనుట కొక సాకుగమాత్రమే యుండెను. మా యుద్యమగౌరవమునుబట్టి చూచినచో నది తరచు యవినీతి తెచ్చిపెట్టును. ఆదేశములను పంపుటకు పరస్పర సంబంధము కలిగి

యుండుటకు కొంతవర కిది యవసరము. కాని శాసనోల్లంఘనము రహస్యముగ నుండరాదు.

వర్తమానస్థితిని గురించి, మా లక్ష్యములనుగురించి పూనాలో నెట్టి, నిజమైనచర్చయు జరుగకపోవుట నా కాశ్చర్యవిషాదములను కలిగించెను. రెండుసంవత్సరముల భయంకరపోరాటము, నిర్బంధములు జరిగినతరువాత కాంగ్రెసుసేవకు లొకచోట కలుసుకొనిరి. ఈ లోపల హిందూ దేశమున, బయటప్రపంచమున చాలసంగతులుజరిగెను. బ్రిటిషుప్రభుత్వమువారి చట్టసంస్కార సూచనలుగల శ్వేతపత్రము ప్రకటింపబడెను. ఈ కాలములో మేము బలవంతముగ మౌనము వహింపవలసియుండెను. రెండవపక్షమున విషయములను మరుగు పుచ్చు నిరంతర యసత్యప్రచారము జరుగుచుండెను. ప్రభుత్వమును బలపరుచువారేగాక లిబరలుపక్షమువారు, తదితరులుగూడ కాంగ్రెసు తన స్వాతంత్ర్యలక్ష్యమును విరమించుకొనెనని తరచు చెప్పుచుండిరి. కనీసము మా రాజకీయలక్ష్యమును పునశ్చరణచేసి, తిరిగి స్పష్టపరచి వీలైనచో దానికి సాంఘిక, ఆర్థిక లక్ష్యములను జేర్చియుండవలసినదని నేననుకొంటిని. దీనికిబదులు చర్చయంతయు సమిష్టి శాసనోల్లంఘనమునకు, వ్యక్తిశాసనోల్లంఘనమునకు సంబంధించిన మంచి చెడుగులకు, రహస్య మవసరమా కాదా యనుదానికిబంధింపబడినట్లుస్పష్టముగ కాన్పించును. ప్రభుత్వముతో 'సంధి' యను కొంత వింత సంభాషణకూడ జరిగెను. గాంధీజీ (నాకు జ్ఞాపకమున్నంతవరకు) సందర్శన మీయవలసినదని వైస్రాయికి తంతియిచ్చెను. వైస్రాయి దానికి 'నాస్తి' యను ప్రత్యుత్తరమిచ్చెను. గాంధీజీ 'గౌరవమైన సంధి'ని గురించి కొంత యుదహరించుచు రెండవతంతి యిచ్చెను. ప్రభుత్వము విజయోత్సాహముతో జాతి నన్నివిధముల నలిపివేయుటకు యత్నించుచుండ, అండమానులలో ప్రజ లుపవాసములుచేసి చచ్చిపోవుచుండ, వేటాడబడుచున్న మృగతృష్ణవంటి యీ శాంతి ఎక్కడిది? కాని, యేమి జరిగినను, యెల్లప్పుడు సంధికోరుటయే గాంధీజీస్వభావమని నే నెరుగుదును.

నిర్బంధములు జోరుగా సాగుచుండెను. బహిరంగ చర్యల నణచివేయు ప్రత్యేక శాసనములన్నియు నాచరణలోనుండెను. 1933 ఫిబ్రవరిలో మాతండ్రి మరణించిననాటి సాంవత్సరిక దినమున జరుగు స్మారకసభకూడ పోలీసు లాపివేసిరి. అది కాంగ్రెసుకు సంబంధించని సభ. సర్ తేజబహాదురు సప్రూవంటి స్వచ్ఛమైన మితవాది దీని కధ్యక్షత వహింపవలసియుండినను దీనికీగతి పట్టెను. ఇకముందు రానున్న ప్రసాదములకు నమూనాగా మనకు శ్వేతపత్రము ప్రసాదింపబడెను.

ఇదియొక చిత్రమైన పత్రము. దీనినొకసారి చదివినవానికి నిట్టూర్పు పుట్టును. భారతదేశ మొక దేక్ష్యమ్యానముగు భారతప్రభుత్వముగ మార్పుచెందవలసి యుండెను. ఈ ఫెడరేషనులో వివిధ సంస్థానముల ఫ్యూడల్ ప్రతినిధులకు విశేషాధికారముండును. కాని యీ సంస్థానములలో పయివారెవరు జోక్యము కల్పించుకొనరాదు. అట్టిది సహింపబడదు. అచ్చట కలితిలేని శుద్ధ నిరంకుశత్వమే రాజ్యముచేయును. యదార్థమైన సామ్రాజ్యపాశములు, ఋణశృంఖలములు, మనలను శాశ్వతముగ లండను మహానగరమునకు కట్టివేయును. రిజర్వుబ్యాంకుద్వారా యింగ్లండుబ్యాంకు కరెన్సీ నీతిని, ద్రవ్యనీతిని వశమునందుంచుకొనును. ఇదివరకెవరి కేహక్కులుగలవో యవన్నియు నభేద్యముగ కాపాడబడును. అదనముగనూతనహక్కులు కూడ నిర్మింపబడనున్నవి. ఈ స్థాపింపబడిన హక్కుల క్షేమస్థైర్యములకొరకు మన యాదాయములన్నియు చాలవరకు హామీగా యివ్వబడెను. మే మతిగాఢముగా ప్రేమించు సామ్రాజ్యపదవులు ముట్టబడకుండ, శాసింపబడకుండ సాగుచుండును. అవి మనలను మరికొన్ని స్వపరిపాలనా మోతాదులకు తయారుచేయును. మాకురాష్ట్రీ స్వపరిపాలన ప్రసాదింపబడనున్నది. కాని గవర్నరుమాత్రముసర్వాధికారములను చలాయించు నుదార నిరంకుశుడయి మనలను క్రమము తప్పకుండనుంచును. వైస్రాయి, నిరంకుశ శిరోమణి, సర్వాధికారి. యందరిపైనను కూర్చొనును. తన యిష్టమువచ్చినట్లు చేయుటకును, తాను కోరినపుడు శాసించుటకే నతనికి సర్వాధికారములు నుండును.

నిశ్చయముగ కలోనియల్ ప్రభుత్వ నిర్మాణమందు బ్రిటిషుపాలిక జాతుల బుద్ధికుశలత మున్నెన్నడు నింతస్పష్టముకాలేదు. హిట్లరులు ముస్సోలినీలు వారి నెక్కువగ మెచ్చుకొనెదరుగాక! వారు భారత వైశ్రాయిని చూచి యసూయపడెదరుగాక!

భారతదేశముయొక్క కాళ్ళను చేతులను బంధించిన యొక చట్టమును తయారుచేయుటయేగాక 'ప్రత్యేక బాధ్యతలు' రక్షణలు అను మరికొన్ని సంకెలలుగూడ వానికి జేర్చబడెను. వీనితో నీ దుర దృష్టదేశము కదలమెదలజాలని ఖయిదీగ చేయబడెను నెవిల్లి చాంబ ర్లైను చెప్పినట్లు "చేయబడిన సూచనలన్నింటిని మానవబుద్ధి సృజింప గల లక్షణ లన్నింటితోను కాపాడుటకు వారు చేయగలిగినదంతయు చేసిరి."

మరియు నీ వరములను ప్రసాదించినందులకు మన మెక్కువ సుంకమును చెల్లించుకొనవలెననిరి. ప్రప్రథమములో కొద్ది కోట్లు మొత్తముగను తరువాత వార్షికముగను చెల్లింపవలెను. చాలినంత సొమ్ము చెల్లింపనిదే, 'రక్షణ' లేనిదే మనముస్వరాజ్యమును పొంద జాలము. భారతదేశము దారిద్ర్యముచే పీడింపబడుచున్నదను భ్రమలో మేముంటిమి. అది యదివరకే యెక్కువ ఋణభారములో కృంగియుండుటచే మేము దానిని తేలికచేయుటకొరకుస్వాతంత్ర్యము నాశించితిమి. స్వాతంత్ర్యమును వాంఛించుటకు ప్రజలను ప్రోత్స హించిన దీశక్తియే కాని య్యీ డీ భారము మరింత యధికమగు నట్లు కావ్పించెను.

భారత సమస్యయొక్క యీ యకటావికటపు పరిష్కారము బ్రిటిషు దయారసముచే ప్రసాదింపబడెను. మన పాలకులు చాల యుదారులని మనకు చెప్పబడుచుండును ఇదివరకెన్నడు నే సామ్రాజ్యప్రభుత్వము తనంత తానైచ్ఛికముగ నిట్టి యధికార మును, అవకాశములును తన పాలనలోనున్న ప్రజల కిచ్చియుండ లేదు. ఈ వరములకు ప్రసాదించిన దాతలకు నిట్టియుదారతకాశ్చర్య పడి వీని కభ్యంతర పెట్టినవారికి నింగ్లండులో గొప్ప చర్య బయలు

చేరెను. ఇంగ్లండు హిందూదేశముల మధ్య మూడు వత్సరముల దీర్ఘకాలములో ననేకమంది రాకపోకల యొక్కయు, మూడురౌండు టేబిలు కాన్ఫరెన్సుల యొక్కయు, ననంఖ్యాకములగు కమిటీల యొక్కయు, సలహాలయొక్కయు ఫలితమిదియే.

కాని యింగ్లండును సందర్శించుట యింకను పూర్తికాలేదు. శ్వేతపత్రమును విమర్శించుటకు బ్రిటిషు పార్లమెంటు యొక్క జాయింటు సెలెక్టుకమిటీ యొకటియుండెను భారతీయులు దీనియందు సాక్ష్యమిచ్చుటకు అస్సెసర్లుగ వెళ్ళిరి. లండనులో ననేక యితర కమిటీలుకూడ సమావేశమగుచుండెను. యేదో యొక కమిటీలో సభ్యత్వము సంపాదించుటకు తెరచాటున గౌరవహీనమగు పోరాటములు జరిగెను ఈ సభ్యత్వమువలన సామ్రాజ్యరాజధానికి యుచిత ప్రయాణము, నచ్చటనుండుట ప్రాప్తించును. శ్వేతపత్రములోని నల్లరాళ్ళవంటి చట్టములకు జంకని ధైర్యశాలురు సముద్రయాన యుపద్రవములను, వాయుయాన కష్టములను, అంతకంటె నెక్కువగ లండనునగర నివాసకష్టములను నెదుర్కొని తమ వ్యక్తిత్వఘాటీ చేతను, యెదుటవాని నొప్పింపగల శక్తిచేతను శ్వేతపత్రములోని చట్టములను మార్పుచేయ యత్నించుటకు బూనుకొనిరి. తాము బూనినకార్యము శక్యముకానిదని వారికి తెలియును. వారట్లే చెప్పిరి. కాని వారు విడిచిపెట్టువారు కారు. వారు చెప్పునది వినువారు లేకపోయినను చెప్పవలసినది చెప్పుచునేయుందురు. వారిలో నొకడు రెస్పాన్సివిష్టు నాయకుడు, తక్కినవారందరు విడిచివెళ్ళిపోయినను బహుకాలము లండనులోనున్న యధికారులను దర్శించుచు విందులు గుడుచుచు తానెట్టి రాజకీయమార్పులను గోరుచున్నాడో వారిహృదయములకు గట్టిగా పట్టించుటకు చివరవరకు మకాము వేసికొని కూర్చొని యుండెను. చిట్టచివరకు తన జన్మభూమికి వచ్చినపుడతడు తనకృషిని విరమింపక తాను చెప్పవలసినదని చెప్పువరకు లండనులో నాగిపోయి నట్లు గంపెడాశతోనున్న ప్రజలకు చెప్పెను.

నా తండ్రి రెస్పాన్సివిష్టు మిత్రులలో హాస్యరసము లేదని తరచు ఫిర్యాదుచేయుచుండుట నాకుజ్ఞాపకము అతడు పరిహాసముగా

చేయు రిమార్కులవలన (వారు వానినెంతమాత్రమును గుర్తింప లేకుండిరి) వారితో చిక్కులు తటస్థించుచుండెడివి. తరువాత నతడు వారికి నచ్చచెప్పి శాంతింపచేయుచుండెడివాడు. మహారాష్ట్రుల యద్భుత సంగ్రామోత్సాహము మొక్కవోని ధైర్యముగల తిలక మహాశయుని నే నపుడు తలంచితిని.

లిబరలుపక్షమువారు శ్వేతపత్రము నెంతమాత్రము నామోదింపలేదు. భారతదేశములో దినదినము జరుగుచున్న నిర్బంధములను గూడ వారిష్టపడలేదు. అప్పుడప్పు డతి యరుదుగ వారు వానిని విరసించుచుండిరి. కాని వారు కాంగ్రెసును, అది చేయు నన్ని పనులను ఖండించుచుండిరి. వా రప్పుడప్పుడు కొంతమంది ప్రధాన కాంగ్రెసువాదులను జయిలునుండి విడిచిపెట్టవలసినదని ప్రభుత్వమును సూచించుచుందురు. వారు తా మెరిగిన కొంతమంది వ్యక్తుల పరముగ మాత్రమే యోచింపగలరు, లిబరలుపక్షమువారును, రెస్పాన్సివిస్టులునుగూడ నిక ప్రజాశాంతి కెట్టి యుపద్రవము కలుగదు గనుక ఫలానవానిని విడిచిపెట్టవలెనని చెప్పుచుందురు. తరువాత నతడు యుక్తముగ ప్రవర్తింపనిచో ప్రభుత్వమువా రతని నెప్పుడు పట్టుకొనినను పట్టుకొనవచ్చును. ఈ సారి ప్రభుత్వమువా రెక్కువ న్యాయముగగూడ నట్లుచేయవచ్చును ఇంగ్లండులోగూడ కొంతమంది వ్యక్తులు కొంతమంది వర్కింగుకమిటీసభ్యులను, లేక ప్రత్యేక వ్యక్తులను పై వాదముల ననుసరించియే విడిచిపెట్టవచ్చునని దయతో వాదించెడివారు. మేము జయిలులోనుండగా మమ్ము గురించి శ్రద్ధతీసికొనినవారియెడల మేము కృతజ్ఞులముగ నుండకతప్పదు. కాని మేమొక్కొక్కప్పుడు మా శ్రేయస్సు నుద్దేశించిన యీ స్నేహితుల నుండి రక్షింపబడిన బాగుండెడిదని భావించెడివారము. వారిసదుద్దేశ్యములపట్ల మా కెట్టిసందేహము లేదు. కాని వారు సంపూర్ణముగ బ్రిటిషుప్రభుత్వ లక్ష్యము నే కలిగియున్నట్లు స్పష్టమగుచున్నది. మా యుభయులమధ్య గొప్ప యగాధముగలదు.

లిబరలు పక్షమువారు భారతదేశములో సంభవించువానిని చాలవరకామోదింపలేదు. దానికి వా రెంతయు వగచుచుండిరి, అయి

వను వారేమిచేయవలెను? ప్రభుత్వముపై వారెట్టి పటుత్వముగల చర్యనైనను తీసికొనుట దురూహ్యము. వారు కేవలము తమ్మొక ప్రత్యేకసంఘముగ రక్షించుకొనుటకు ప్రజా సామాన్యమునుండియు, ప్రజలలో చైతన్యముగల వ్యక్తులనుండియు నంతకంతకు దూరముగ పోవుచు దక్షిణాముఖము పట్టి ప్రభుత్వలక్ష్యమునుండి వేరుచేయుటకు వీలులేని లక్ష్యము [illegible]. వారికిసంఖ్యాబలమూ లేదు! ప్రజలలో పలుకుబడియూ పూజ్యము! కనుక వారివలన ప్రజాసంగ్రామమునకెట్టి యుపద్రవములేదు. కాని వారిలో నాధిక్యత సంపాదించినవారు, పేరు పొందినవారు, వ్యక్తిగతముగ గౌరవింపబడువారు కొందరుగలరు. ఈ నాయకులు, లిబరలు రెస్పాన్సివిస్టు బృందములు మొత్తము మీదను బ్రిటిషుప్రభుత్వ నతిక్లిష్టకాలములోనున్న సమయములో ప్రభుత్వనీతికి తమ నైతికబలము నిచ్చి వారికమూల్య సేవచేసిరి. పటుత్వమైన విమర్శలేకపోవుటచేతను, లిబరలు పక్షమువారు తప్పుదప్పుకు సమ్మతిని, ఆమోదమును చూపుటచేతను, ప్రభుత్వనిర్బంధములకు, న్యాయసౌన్యతకుగూడ లాభముకలిగెను. ఈ విధముగ లిబరలుపక్షమువారు, రెస్పాన్సివిస్టులు దేశములో జరుగుచున్న భయంకరమైన, మున్నెన్నడును కని విని యెరుగని నిర్బంధమునకు నైతికాధికారము నిచ్చిరి.

శ్వేతపత్రము చెడ్డది, చాలా చెడ్డది అని లిబరలునాయకులు చెప్పిరి. దానినిగురించి యేమిచేయవలెను? 1933 ఏప్రియల్ మాసములో కలకత్తాలో జరుపబడిన లిబరలు ఫెడరేషను సభలో శ్రీనివాసశాస్త్రిగారు, లిబరలు నాయకశిఖామణి, చట్టసంబంధమైన మార్పులెంత యసంతృప్తికరములైనను, వానినాచరణలో పెట్టవలెనని వాదించిరి. "మిన్నక విషయములను జారవిడుచుట కిది సమయముకాదు" అని యతడు చెప్పెను. ఇచ్చినదానిని తీసుకొని దానినాచరణలో పెట్టుటకు ప్రయత్నించుట యొక్కటే యతడూహింపగలిగిన కార్యము. ఇదికానినాడు మరియొకపని యేమియు చేయక యూరకుండుటయే! మరియు "మనకు జ్ఞానము అనుభవము, మితము,

ఒప్పించగలశక్తి, నిర్మలమగుపలుకుబడి, యదార్థమైన సామర్థ్యములు. మనకీ సుగుణములేయున్నచో వానిని పరిపూర్ణమైనబలముతో ప్రకటించుట కిదియే సమయము" అని యతడు చెప్పెను. ఈపదగుంభనతోనిండినపిలుపునుగురించి కలకత్తాలోని స్టేట్సుమన్ పత్రిక ప్రకాశమానమగు శబ్దజాలము" అని వ్యాఖ్యానము చేసెను.

శాస్త్రిగారెప్పుడు శబ్దజాలమును జోడుగ నుపయోగించుచుందురు లలితపదములయెడలను, వానిమధుర ప్రయోగమునందును వక్తకుండునట్టిప్రేమ యాయనకు గలదు. కాని యాయన తీవ యుత్సాహములో కొట్టుకొనిపోవును. అతడు సృష్టించు శబ్దయింద్ర జాల మతని భావము నితరులకు మరుగుపరచును. బహుశః యతనికీ యట్లేయగును. ఆతడు 1933 ఏప్రియల్ లో శాసనోల్లంఘనమింకను జరుగుచుండగా కలకత్తాలోచేసిన యీపిలుపును పరీక్షించుట ప్రయోజనకరముగ నుండును, మూలసూత్రములను, లక్ష్యములను నటులుంచినచో మనము రెండు విషయములను గమనింపవలసియుండును. మొదటిది యేమిజరిగినను, బ్రిటిషుప్రభుత్వముచే మనమెంతగా నగౌరవింపబడినను, పలిపివేయబడినను అవమానింపబడినను, కొల్లగొట్టబడినను మనము దానికి దాసులముకావలెను మనమీహద్దు దాటిపోగూడదను పంక్తి యెన్నటికిని వ్రాయబడజాలదు. ఒకక్రిమి మారవచ్చును. కాని శాస్త్రిగారి సలహావినినచో భారతప్రజలు మారజాలరు. అతనిప్రకారము వేరొక మార్గములేదు. అనగా బ్రిటిషు ప్రభుత్వ నిశ్చయములకు తలయొగ్గుటయు, వానినంగీకరించుటయు నొక మతముతో సమానము, మనకిష్టమున్నను లేకపోయినను మన మందరము, నీకర్మకు [కిస్మతు] దాసులము కావలెను.

అతడొక వినిశ్చయమైన, యిదమిద్ధమనుస్థితిని గురించిసలహాయిచ్చుటలేదని గమనింపవలసి యున్నది "చట్టసంబంధమైన మార్పులు" (అవి చాల చెడ్డవిగనుండునను స్పష్టమైన భావముమవ సన్నను) యింకను తయారగుచున్నవి. శ్వేతపత్రములోని మార్పులు చెడ్డవిగనున్నను పరిస్థితులనన్నింటిని గమనించి, యవి శాసనములు

గావింపబడినచో, వాని నాచరించుటకు నేను సుముఖుడనని యతడు చెప్పియుండినచో నతనిసలహా మంచిదైనను చెడ్డదైనను యుద్ధార్థములకు సంబంధించి యుండెడిది. శాస్త్రిగారింకను చాలదూరము వెళ్ళి చట్టసంబంధమైన మార్పు లెంత యసంతృప్తిగనుండినను తనసలహా చెల్లవలెననెను. జాతీయదృష్టిలో నతిముఖ్యమైనవిషయమున నతడు బ్రిటిషు ప్రభుత్వమునకు సంపూర్ణాధికార మిచ్చుటకు సిద్ధముగ నుండెను. ఏవ్యక్తిగాని, వర్గముగాని, పార్టీగాని యగోచరమగు భావివ్యాత్తుసందర్భములో నిట్టియంగీకారము నియ్యగలరో నా కర్థము గాకున్నది. దానికేసిద్ధాంతములుగాని, యెట్టి నైతిక రాజకీయప్రమాణములుగాని లేక పాలకులయాజ్ఞలకు విధాయకముగ తలయొగ్గుటే దానిసిద్ధాంతము, నీతియైనచో నిట్టి యంగీకారము నీయవచ్చును.

నాకుతట్టు రెండవవిషయము కేవలము రాజకీయయెత్తుకు యుక్తికి సంబంధించినది క్రొత్తసంస్కరణలను చట్టముగాచేయుదీర్ఘ ప్రస్థానములో శ్వేతపత్రమొక మజిలీ. ప్రభుత్వదృష్టిలో నదియొక ప్రధానమైన మజిలీ కాని యింకను చాల మజిలీలను చేయవలసి యున్నది. ఈ తరువాత ప్రయాణములో దీనిని మంచికో చెడ్డకో మార్చినను మార్చుటకవకాశముగలదు. ఈ మార్పులన్నియు వివిధ ప్రయోజనములుగలవారు బ్రిటిషుప్రభుత్వమీదను, పార్లమెంటు మీదను కలిగించు యొత్తిడిపయి నాధారపడియుండును. ఈ గుంజులాటలో భారతదేశ లిబరలుపక్షము వారిని తమవైపు త్రిప్పుకొనవలెననుకోరిక ప్రభుత్వముపయి పనిచేసి, చట్టములనుసడలించుటకు ప్రోత్సహింపవచ్చును. లేక నధమము ఆక్రమణలనైనను ఆపివేసెడిది. కాని క్రొత్తసంస్కరణల నంగీకరించుటయా, త్రోసివేయుటయా, యాచరింపకుంటయా యనుసమస్య బయలుదేరుటకు చాలముందుగనే శాస్త్రిగారుచేసిన గంభీరప్రకటన భారతలిబరలు పక్షమువారిని సంపూర్ణముగ నిర్లక్ష్యము చేయవచ్చునని ప్రభుత్వమునకు విశదము చేసెను, వారిని త్రిప్పుకొనవలెనను సమస్యయే లేదు. గెంటివేయబడినను వారు ప్రభుత్వమును వీడువారుకారు. ఈ లిబరలుపక్షము

వారి దృష్టినుండి నేను [చూడగలిగినంతవరకు] యీ విషయము చూచినను కలకత్తాలోని శాస్త్రిగారి యుపన్యాస మసాధారణముగ చెడ్డయెత్తుగను, లిబరలుపక్షయుద్యమము కపటకారిగను కాన్పించెను.

శాస్త్రిగారి పాతయుపన్యాసమునుగురించి నేను చాలవరకు వ్రాయ సాహసించుటకు కారణమందులోనున్న సహజ ప్రాముఖ్యత గాని లిబరలు ఫెడరేషనుకున్న ప్రాముఖ్యతగాని కాదు. లిబరలు నాయకుల మానసిక ప్రవృత్తిని, చిత్తవృత్తిని గ్రహింపవలెనను కోరికయే నన్నిందులకు ప్రోత్సహించెను. వారు సమర్థులు, గౌరవ నీయులు అయినను యెంత సహృదయముతో చూచినను వారెట్లు ప్రవర్తించిరో నేనెంతమాత్రము గుర్తింపలేకపోతిని. 1933 జూనులో శాస్త్రిగారిచ్చిన మరియొక యుపన్యాసము నన్ను బాధించెను. తాను 1927 వరకు సభ్యుడుగానుండిన భారతసేవక సంఘములో నాతడుపన్యసించుచుండెను. బ్రిటిషుపరిపాలన హఠాత్తుగా పోయినచో భారతదేశమునకు కలుగు యుపద్రవముల నతడుపేర్కొనెనట. రాజకీయోద్యమములలో తీవ్రమైన ద్వేషముతో నిండి యొకపార్టీ మరియొకపార్టీని హింసించును, అణచివేయును. మొట్టమొదటినుండియు సహనమే బ్రిటిషు రాజకీయ జీవితలక్షణము, కనుక భారతభవిష్యత్తు బ్రిటనుయొక్క సహకారముతో నెంత యెక్కువగా జరుపబడిన భారతదేశములో నంత యెక్కువ సహనముండుట కవకాశమున్నది. కలకత్తా స్టేట్సుమను పత్రిక యిచ్చిన శాస్త్రిగారి యుపన్యాస సంగ్రహమువిూదనే నాధారపడవలసియుండెను. "అది సంతోషకరమైన సిద్ధాంతము. డాక్టరుముంజీకూడా నీభావముతో నే మాట్లాడుచున్నట్లు మేము గమనించుచున్నాము" అనికూడ స్టేట్సుమన్ వ్రాసెను. శాస్త్రిగారు రష్యా' ఇటలీ, జర్మనీలలో స్వేచ్ఛయణచి వేయబడుచున్నదనియు, నచ్చట పశుత్వము, యమానుషములు జరుపబడుచున్నవనియు నుదహరించెనట!

నేను దీనిని చదివినపుడు బ్రిటను భారతదేశములకు సంబంధించిన శాస్త్రిగారి దృష్టి "డైహార్డు" బ్రిటిషుకన్సర్వేటివు దృష్టినెంత

యసాధారణముగ పోలియున్నదో నాకు తెల్పెను. వివరములలో భేదములున్నమాట సత్యము. కాని ప్రధానముగ నొక్కటే లక్ష్యము విన్స్టను చర్చిల్ తన విశ్వాసముల కెట్టి యుపకృతియు చేయనక్కర లేకుండ నిదే ధోరణిలో, నిదే భాషలో తన భావములు వెల్లడించి యుండెడివాడు అయినను శాస్త్రిగారు లిబరలుపార్టీలో వామపక్షమునకు చెందును. అతడు దాని నాయకులలో నత్యంత సమర్థుడు.

శాస్త్రిగారి చారిత్రకాభిప్రాయములను, ప్రపంచవ్యవహారములనుగురించిన భావములను నే నెంతమాత్రము నంగీకరింపజాలను. బహుశః ఆంగ్లేయేతరవిదేశీయుడు వీని నంగీకరింపడు. విశాలభావములుగల చాలమంది యింగ్లీషువారే యతనితో నేకీభవింపకపోవచ్చును. ప్రపంచమును, నిజదేశమును బ్రిటిషుపాలకజాతి రంగులకంటిజోడుతో చూడగలవరప్రసాద మతనికి గలదు. అయినప్పటికి భారతదేశములో గత పదునెనిమిది మాసములనుండియు ప్రతిదినము జరుగుచున్నట్టియు, నతడుపన్యసించుకాలమున జరుగుచున్నట్టియు నసాధారణ చర్యల నతడు నిర్లక్ష్యముచేయుట గమనింపదగినవిషయము. అతడు రష్యా, యిటలీ, జర్మనీల నుదహరించెనేగాని తన దేశములో నన్ని స్వాతంత్ర్యములు శూన్యమగుట, అణచివేయబడుట నుదహరింపడు. వార్తలరికట్టబడుచుండుటచే సరిహద్దురాష్ట్రములోను వంగదేశములోను (రాజేంద్రబాబు తన కాంగ్రెసు అధ్యక్షోపన్యాసములో దానిని 'వంగదేశమానభంగము' అని పిలిచెను) భయంకరసంఘటనముల నన్నింటిని యతడెరుగకపోవచ్చును. కాని యతడు భారతదేశము పడుచున్న యపరిమితబాధలను, తన ప్రజలు స్వేచ్ఛకొరకు, జీవితముకొరకు శక్తివంతమగు ప్రభుత్వముతో చేయుచున్న పోరాటమును యెరుగడా? ప్రాంతప్రాంతమున నమలుజరుపబడిన పోలీసు రాజ్యమును, సైనిక శాసనమును పోలిన పరిస్థితుల నతడెరుగడా? ఆర్డినెన్సులనతడెరుగడా? జయిళ్ళలోని నిరశనవ్రతములు మొదలగు నితరబాధల నతడెరుగడా? బ్రిటిష్ దేశము నతడే సహనముకొరకు నే స్వాతంత్ర్యముకొరకు పోరాడెనో యవి భారతదేశములో బ్రిటనువలననే నిలిపివేయబడెనను సంగతి నతడు గుర్తింపలేడా?

అతడు కాంగ్రెసుతో నంగీకరింపవచ్చు, అంగీకరింపక పోవచ్చును. కాంగ్రెసునీతిని విమర్శించుటకు, ఖండించుటకు నతనికి స్వేచ్ఛకలదు. కాని తనదేశ స్త్రీపురుషులు చూపిన యద్భుత ధైర్యసాహసముల యెడల, నాత్మార్పణయెడల భారతీయుడు, స్వేచ్ఛాదేవి నారాధించువాడు, గ్రహణశక్తికలవాడు నగు తానెట్లు ప్రవర్తించెను? మన పాలకులు భారతహృదయముపై గొడ్డలితో చెరలాటమాడినపుడతడెట్టి బాధనువ్యథనుపొందలేదా? లక్షలకొలది జనులొక మహాసామ్రాజ్య పశుశక్తికి మోకరింపనిరాకరించుట, ఆత్మదాస్యముకంటె శరీరమారణము ప్రాణసమములగు గృహములు విచ్ఛిన్నమగుట, ప్రేమాస్పదులందరు వెతలనొందుట-శ్రేయస్కరమని ప్రకటించిన ఈ యాత్మవికసనమునంతను నతడు శూన్యమనియే తలచెనా? జయిలులో బయట మేమెప్పుడు ధైర్యమునే ప్రకటించిమందహాసములతో నవ్వుముఖములతో నుంటిమి. కాని తఱచు మా మందహాస మానందబాష్పమగుచుండెడిది.. మా నవ్వులొక్కొక్కప్పుడేడ్పును సమీపించెడివి.

ధైర్యవంతుడు, నుదారుడగు వెర్రియర్ యెల్విన్ అను నొక యాంగ్లేయుడు 1930 ని గురించి యిటు చెప్పెను. "ఒకజాతియంతయు తన మానసిక దాస్యసంకెలలను త్రోసిపుచ్చి తన నిజగౌరవప్రస్థానమును సాగించుటొక యద్భుతము. సత్యాగ్రహపోరాటములో చాలమంది కాంగ్రెసు వాలంటీర్లు ప్రదర్శించిన యద్భుతశిక్షణము రాష్ట్రగవర్నరులలో నొక డుదార ధృవపత్రము నిచ్చిన శిక్షణము..."

శ్రీనివాసశాస్త్రిగారు సమర్థుడు, గ్రహణశక్తికలవాడు. తన దేశీయులచే నెక్కువగ గౌరవింపబడువాడు. అతడుకూడ పైయనుభవమునే కలిగియుండవలెను. అట్టిపోరాటములో తన దేశీయులకొరకు బాధపడియుండవలెను. ప్రభుత్వము పౌరసత్వములను, ప్రజాహితకార్యములను, అణచివేయుచుండుట నతడు ఖండించుననుకొందును. అతడు, నతనిసహోద్యోగులు దుర్భరబాధలనొందుచున్న రెండురాష్ట్రములనువంగదేశము,సరిహద్దురాష్ట్రము–స్వయముగసందర్శించియుండవలెనని కాంగ్రెసుకును, శాసనోల్లంఘనమునకునుసహాయముచేయుటకు

గాక నధికారులయొక్కయు, పోలీసులయొక్కయు నత్యాచారములను బయటపెట్టి ఈరీతిగ వారించుటకు) యనుకొందుకు పౌరసత్వములను స్వేచ్ఛను ప్రేమించువారితర దేశములో నిట్లు సామాన్యముగ చేయుచుందురు. కాని యతడట్లు ప్రవర్తించుటకు బదులు ధృవపత్రము నిచ్చెను. అతడు వారికి తననైతికసహాయమునిచ్చి తద్వారానిర్బంధ విధానమున కుత్సాహ ప్రోత్సాహములను కలిగించెను.

అతడిట్లు భావించియుండడని, తన చర్యయొక్క ఫలితములను గుర్తించలేదని నేను దృఢముగ చెప్పగలను. కాని యతని యుపన్యాసమున కిట్టిఫలితము గలదనుట నిస్సందేహము. అయినచో అతడీవిధముగ నేల యోచింపవలెను? ఏల యాచరించవలెను?

లిబరలు నాయకులు స్వదేశీయులకు నాధునిక భావములకు దూరులైరనుటకంటె నా కీప్రశ్నకు వేరొక సమాధానము దొరకలేదు. వారు చదివెడు బూజుపట్టిన పుస్తకములు వారి దృష్టినుండి భారతదేశప్రజలను తెరిమివేసెను. వారొకవిధముగ తమ్ముతామే ప్రేమించుకొను విద్య నభివృద్ధిచేసికొనిరి. మేము జయిళ్ళకుపోయితిమి. మా శరీరములు గదులలో బంధింపబడెను. కాని మా మనస్సులు స్వేచ్ఛగ ప్రపంచ విహారము చేయుచుండెను. మా యుత్సాహ మినుమడించెను. కాని లిబరలుసోదరులు స్వయంకృత మానసిక కారాగారములను నిర్మించుకొని వానిచుట్టు గిరగిర తిరుగుదురు. వారికి బయటకుపో మార్గము దొరకదయ్యెను! వారు నేత్రగోచరమగు ‘వస్తుదైవతములను’ పూజించిరి. వస్తువులు మారినపుడు (ఈనశ్వరప్రపంచంలో నవి యెప్పుడును మారుచుండును) వారు చుక్కాని, దిగ్దర్శిని యంత్రము లేనివారై శారీరక మానసికవికాసము లేక, యాదర్శములు, నైతికప్రమాణములు లేనివారై యుందురు. మనమందరము ముందుకు పోవలెను. లేదా ముందుకు త్రోయబడుదుము. నిత్యపరివర్తన చెందు ప్రపంచములో మనము స్థావరముగ నిలిచిపోజాలము. కదలుటకు, మార్పు చెందుటకు, భయపడి లిబరలు పక్షమువారు తమ్మావరించిన ఝంఝామారుతములకు భయభ్రాంతు

లైరి. దుర్బలగాత్రులగుటచే తడబడుకాళ్ళతో వారు ముందుకు పోజాలక తమకుదొరికిన ప్రతితృణమును బట్టుకొనుచు నిటునటుకొట్టుకొనుచు "దీర్ఘాలోచనచే పాలిపోయి వ్యాధినొందిన" యెప్పుడు సందేహించుచు, జంకుచు, నిశ్చయహీనులగుచు వారు భారతరాజకీయములలో షేక్స్పియరు మహాకవి నాటకములో హామ్లెటులయిరి.

లిబరలు వారపత్రికయైన 'సర్వెంటు ఆఫ్ ఇండియా' జయిలుకు వెళ్ళునరకు చిందులు త్రొక్కెదరనియు వెళ్ళినతరువాత బయటకు రావలెనని తహతహలాడెదరనియు శాసనోల్లంఘన చివరిరోజులలో కాంగ్రెసును నిందించెను. కాంగ్రెసుయొక్క సమగ్ర నీతి యదియేయని యది కొంతయుద్రేకముతో వ్రాసెను. దానికి లిబరలు పక్షమువారి ప్రత్యామ్నాయనీతి, బ్రిటిషుమంత్రులతో రాయబారము, ఇంగ్లీషుప్రభుత్వములో మార్పుకలుగవలెనని ప్రార్థించుట.

ఆర్డినెన్సుచట్టములను, తక్కిన నిర్బంధచట్టములను ధిక్కరించుటయే కాంగ్రెసునీతియనుట, కొంతవరకు నిజము. దీనివలన జయిలు ప్రాప్తించును. దీర్ఘపోరాటానంతరము కాంగ్రెసుజాతి యలసిపోయి ప్రభుత్వముపై తగిన యొత్తిడి కలిగింపలేకపోవుటగూడ నిజము కాని యొక వాస్తవిక నైతిక ఫలితముకలదు.

భారతదేశ మనుభవించుచుండినట్టి నిర్బంధము, పాలకుల కతివ్యయకరమైనది, వారికిగూడ నది బాధకరమై నరములబిగిని సడలింపచేయు నొక కఠినపరీక్ష. తుదకది తమ పునాదులను దుర్బలపరచునని వారికి బాగుగ తెలియును. అది వారి పరిపాలనానిజస్వభావమునుపీడింపబడు ప్రజలకు విశాలప్రపంచమునకు నిరంతరము బహిరంగపరచును. వారు తమ యినుపముష్టి దాచుటకు ముఖమల్ తొడుగు ధరించుటకెంతయో యుత్సహించెదరు. ఎట్టి ఫలితములు సంభవించినను తమ యిచ్ఛకు లొంగని ప్రజలతో వ్యవహరించుటకంటె నేప్రభుత్వమునకు నెక్కువకోపము కలిగించునది (చిట్టచివరకు) యుపద్రవకరమైనది వేరొకటి యుండనేరదు. కనుక నచ్చటచ్చట జరుగు నిర్బంధవిధాన ధిక్కారమునకుగూడ విలువయున్నది. అది ప్రజలకు శక్తినిచ్చును. ప్రభుత్వనీతిని నాశనము చేయును.

నైతికఫలితము మరింతప్రధానమైనది. థోరోకవిట్లు చెప్పెను. “స్త్రీ పురుషు లక్రమముగనిర్బంధింపబడుకాలమున జయిలే యోగ్యమైన స్త్రీ పురుషుల కుత్తమస్థానము”. ఈ సలహా లిబరలు సోదరులకు తదితరులకు కటువుగ నుండవచ్చును. కాని శాసనోల్లంఘనముతో సంబంధము లేకపోయినను, మన సహచరులు చాలమంది యెప్పుడును జయిలులో నుండుచున్నప్పుడు, ప్రభుత్వముయొక్క నిర్బంధ సాధనసామాగ్రి మనలను నిరంతరము నణచివేయుచు, నగౌరవపరచుచు, మన ప్రజలను కొల్లగొనుటకు సహాయపడుచుండ – నిట్టి పరిస్థితులలో నైతికజీవిత మసంభవమని మాలో చాలామంది తలచు భావించెడివారము. మన దేశములోనే మన మనుమానింపబడువారివలె సంచరించెదము. పోలీసులు వెంటనంటి పరీక్షించుచుందురు. మా మాటలు, సర్వాంతర్యామియైన రాజద్రోహ చట్టమును భంగము చేయునేమోయని వ్రాసికొనబడును. మా యుత్తర ప్రత్యుత్తరములను విప్పి చూచెదరు. ఏదోయొక బహిష్కారము లేక అరెస్టు మాకొరకెవ్వడు నెదురుచూచుచుండును. మా కొక్కటే గతి. ప్రభుత్వాధికారము కతినీచముగ తలయొగ్గవలెను. ఆధ్యాత్మికాధఃపతనమునొందవలెను మాలోనున్న సత్యమునునిరాకరింపవలెను. మేము నీచమనితలంచు కార్యములకు నైతికవ్యభిచారమునకు నొడబడవలెను. లేదా ప్రతిఘటించి తత్ఫలితము ననుభవింపవలెను. జయిలుకు వెళ్ళవలవని కష్టముల నాహ్వానింపవలెనని కోరు వెర్రులెవరు నుండరు. కాని రెండవ దౌర్భాగ్యస్థితికంటె జయిలే వాంఛనీయము. బెర్నార్డుషా చెప్పినట్లు “నీచప్రయోజనములకు స్వార్థపరులచేతిలో కీలుబొమ్మయగు టొక్కటియే జీవితవిషాదము.”

49

దీర్ఘశిక్ష యంతరించెను

నా విడుదలకాలము సమీపించుచుండెను. 'సత్ప్రవర్తనకు' మామూలు రిమిషను ఇవ్వబడెను. దీనివలన నా రెండేడ్ల శిక్షలో మూడున్నరమాసములు తగ్గిపోయెను. విడుదలబడుదునను భావముచే జనించు యుద్రేకమువలన నామనశ్శాంతిలేక, జయిలు కలుగజేయు సాధారణ మానసికమాంద్యమంతరించెను. బయట నేనేమిచేయవలెను? ఇది యొక కష్టమైన ప్రశ్న. దీనికి సమాధానమిచ్చుటకు కలుగు సందేహము విడుదలవలనగల యానందమును మ్రింగివేయుచుండెను. కాని యాభావం కూడ తాత్కాలికము. చిరకాలమణచి వేయబడిన నాయుత్సాహశక్తి యుబుకుచుండుటచే నేను బయటకుపోవలెనని యాతురతపడుచుంటిని.

1933 జూలై మాసాంతమున నొక విషాదవార్త వచ్చెను. సేనుగుప్త హఠాత్తుగ చనిపోయెను. మేము కాంగ్రెసువర్కింగు కమిటీలో చాలవత్సరములు సన్నిహితసహోద్యోగులమేగాక నాబాల్యంపు కేంబ్రిడ్జి దినములనాటినుండి మాకు సంబంధముండెను. మేము మొట్టమొదట కేంబ్రిడ్జిలో కలుసుకొంటిమి. నేనప్పుడు నూతనముగ ప్రవేశించితిని. అతడప్పుడే పట్టభద్రుడయ్యెను.

సేనుగుప్త డిటెన్షనులో చనిపోయెను. 1932 ప్రారంభములో నతడు యూరపునుండి వచ్చుటతోడనే ప్రభుత్వఖయిదీగ నరెస్టుచేయబడెను. అప్పటినుండియు నతడు ఖయిదీ లేక డిటెన్యూ. అతని యారోగ్యము ధ్వంసమయ్యెను. ప్రభుత్వ మతనికి వివిధసౌకర్యములను కలిగించిరి. కాని ప్రయోజనములేకపోయెను. కలకత్తాలో నతని యంత్యక్రియలనాడు ప్రజలు బ్రహ్మాండమగు నుత్సవము జరిపి యతనిని గౌరవించిరి. చిరబంధనముచే నవయుచున్న వంగాత్మ కొద్దికాలమయినను ప్రస్ఫుటించినట్లు కాన్పించెను.

ఇట్లు సేనుగుప్త నిర్గమించెను. వత్సరములతరబడి ప్రవాసము, జయిలులో నుండుటచే నారోగ్యము చెడిన సుభాసుబోసు చికిత్సకై

యూరపు వెళ్లుటకు ప్రభుత్వముచే చిట్టచివర కనుమతింపబడెను. మా భీష్ముడు విఠల్ భాయి పటేలుకూడ, రోగగ్రస్తుడయి యూరపులోనే యుండెను. జయిలుజీవితము యొక్క శరీరకష్టముకు, బయట నున్న నిరంతరకృషివలన కలుగు శ్రమకు తాళలేక నింకనెంతమంది యారోగ్యములు ధ్వంసమయ్యెనో! ఎంతమంది చనిపోయిరి! తమ యసాధారణ జీవితములచే నెంతమంది మానసిక భ్రష్టుత్వము, విపరీత భావములను పొందిరి!

దేశమంతట జరుగు భయంకర, నిగూఢ బాధ సేనుగు ప్రవృత్త్యావువలన నా కండ్లకుకట్టినట్లు ద్యోతకమయ్యెను. నాకు కొంత నిరాశ, విసుగు జనించెను. ఇదియంతయు నే పరమావధికొరకు? దేనికొరకు? నా యారోగ్యవిషయమున నే నదృష్టవంతుడను. నా కాంగ్రెసుకృషివలన నెంతయొత్తిడి, క్రమరహిత జీవితము నే ననుభవింపవలసివచ్చినను మొత్తముమీద, నే నారోగ్యముగ నుంటిని. బహుశః కొంతవరకు నా తలిదండ్రులనుండి సంక్రమించిన పటుత్వ గాత్రము, కొంతవరకు శరీరవిషయమై నేను తీసికొనిన శ్రద్ధ దీనికి కారణములు కావచ్చును. వ్యాధి, దుర్బలత, స్థౌల్యము నా కేవగింపుగనుండును. వ్యాయామము, కావలసినంత చక్కనిగాలి, సరళాహారముల తోడ్పాటుతో నే నవిలేకుండ చేసికొంటిని. భారతదేశములో మధ్యతరగతులవారికి కలుగు వ్యాధులు చాలవరకు తిండి దోషమువలన కలుగుచున్నవని నా స్వంతయనుభవము చెప్పుచున్నది. అవివేకురాలగు తల్లి బిడ్డలకు మిఠాయిలు, యితర చిరుతిండ్లు మిక్కుటముగ పెట్టి యావజ్జీవాజీర్ణ రోగమునకు స్థిరపునాదులను వేయును. బిడ్డ నెక్కువ గుడ్డలతో కప్పివేయుచుండును భారతదేశములో నింగ్లీషువారుకూడ మిక్కుటముగ మెక్కునట్లు కాన్పించుచు. బహుశః వారు వెనుకటి తరమువారికంటె కొంతనయము. వెనుకటి వారు బలమైన తిండి వేడివేడి 'పెద్దపెద్ద పట్టు' పట్టెడివారు.

నా కాహారముపట్ల నెట్టి వెర్రులులేవు. మితముమీరి తినక పోవుట, జీర్ణముకాని యాహారములను మానివేయుట; ఈ రెండు నా

నియమములు కొంచెమించుమించు కాశ్మీర బ్రాహ్మణులందరివలెనే మేము మాంసాహారులము. బాల్యమునుండి నేను మాంసాహారిని. కాని నాకు దానియందంత యెక్కువ యభిరుచిలేదు. 1920 లో సహాయనిరాకరణము వచ్చుటతోడనే నేనుమాంసాహారముచు మానివేసి శాకాహారినైతిని. నే నారుసంవత్సరముల తరువాత యూరపు వెళ్ళువరకు శాకాహారిగనేయుండి యచ్చట తిరిగి మాంసాహారినై హిందూదేశము తిరిగివచ్చుటతోడనే తిరిగి శాకాహారినైతిని. నాడు లగాయితు నేను శాకాహారిగనే యుంటిని. మాంసాహారము నాకు చక్కగ సరిపడునట్లుతోచును. కాని నాకు దానియెడల నొకవిధమగు విముఖత్వముకలిగెను. నాకందులోకొంత మోటుతనముకాన్పించెను.

చాలనెలలవరకునాకు ప్రతిదినము జ్వరముతగులుచుండినపుడు (చాలయారోగ్యవంతుడనను గర్వమునకవి యపకృతినొనరించుటచే) విసుగుదల కోపము కలిగెడిది. నే నిదివరలో నెప్పుడును చూపెడి యుత్సాహము, శక్తి, చైతన్యత కాన్పించకపోవుటకిదియే ప్రథమము. వినాశ, క్షైణ్య,వికారరూప మొకటినా యెదుటకాన్పించి భయసూచకమయ్యెను. నేను మృత్యువుకు భయపడితినని యనుకొనను కాని శారీరక మానసిక కార్యము వేరొకవిషయము.

ఎట్లయిననేమి నాభయము లుత్ప్రేక్షలని రుజువయ్యెను. నేను నా వ్యాధిని వదలించుకొని, నాశరీరమును వశములోనికి తెచ్చుకొనగలిగితిని, శీతకాలములో చాలకాలము సూర్యాతప స్నానములు చేయుటచే నాకు స్వాస్థ్యము చేకూరెను. నాతోడివారు జయిళ్ళలో కోటులతోను, శాలువలతోను గజగజ వణకుచుండ నేను వస్త్రములు లేకుండ సూర్యరశ్మితో శరీరమును హాయిగకాచుకొనుచు కూర్చొనెడివాడను. ఇది శీతకాలములో నొక్కయుత్తర హిందూదేశములోనే సాధ్యమగును. తక్కినచోట్ల సాధారణముగ సూర్యుడతితీక్ష్ణముగ నుండును.

నా వ్యాయామములలో నొకటినాకుప్రత్యేకముగ నానందము చేకూర్చెడిది. అది శీర్షాసనము. అరచేతులను నేలమీదనుంచి,

వ్రేళ్ళను వ్రేళ్ళతో చక్కగ బంధించి తలవెనుకభాగమును, మోచే తులను నేలమీద నానుకొని శరీరమునుక్రవలె తలక్రిందుగ నిలువ బెట్టవలెను. శరీరరీత్యా యీ యాసనము చాల మంచిదని నాయభి ప్రాయము. దానివలన కలిగిన మానసిక ఫలితమువలన నాకు దాని యందు మరింత యెక్కువయభిమానము. కొంచెము హాస్యముగ నుండు యీ తలక్రిందులుస్థితి నాలోనున్న హాస్యమును పెంచి జీవిత చాపల్యములయెడల మరికొంత సహనమును కలిగించెను.

నా సాధారణ యారోగ్యస్థితి, సుఖముగ నుంటివనను శరీర జ్ఞానము జయిలులో తప్పనిసరియగు నిరుత్సాహ సమయములను తరిమటయందు నా కెంతయో సహాయపడెను. జయిలులోను, బయటను మారుచుండు పరిస్థితులకు తగియుండుటకు గూడ నాకది సహాయ పడెను. నన్నాసమయమున పడద్రోయునట్లు కాన్పించిన కష్టములు నాకనేకములు కలిగెను. కాని నాకే యాశ్చర్యమగునట్లు వానినుండి నే ననుకొనిన కాలముకంటె త్వరితముగ కోల్కొనుచుంటిని. నేను ప్రధానముగ మితముగలవాడను. యుచితజ్ఞుడను. నే నెప్పుడు తల నొప్పి యెట్టిదో యెఱుగకపోవుటయే దీనికొక ఋజువు అని నేననుకొనె దను. నే నెప్పుడు నిద్రలేకపోవుటచే బాధపడి యెరుగను. నాగరికత యొక్క యీ సామాన్యవ్యాధులనుండియు, చదువులోను వ్రాతలోను నాకండ్లను (ఒకొక్కప్పుడు జయిలులో గ్రుడ్డివెలుతురులోను) విప రీతముగ నుపయోగించినను, కంటిజబ్బునుండి నేను తప్పించుకొంటిని. ఒక ప్రత్యేక కంటివైద్యుడు నా మంచి కంటిదృష్టిని గత వత్సరము చూచి యాశ్చర్యపడెను ఏబదియేండ్ల క్రితమటకు నే నొకటి రెండు వత్సరములలో కండ్లజోడు నుపయోగింపవలసియుండునని జోస్యము చెప్పెను. అతడు చాల పొరబడెను. అదిలేకుండ నేనింకను జయప్రద ముగనే గడుపుచున్నాను. ఈవిషయములు నేను మితముగలవాడను, యుచితజ్ఞుడను, అను నాపేరును స్థాపింపగలిగినను యెట్టిదియున్ను, మార్పు లేని వైరిమితమును, యుచితజ్ఞత పాటించువాడనని నాకు భయము.

జయిలునుండివిడుదలయగుటకు నేనెదురుచూచుచుండ బయట క్రొత్తరకపు వ్యక్తిశాసనోల్లంఘనము ప్రారంభమగుచుండెను. గాంధీజీ మార్గదర్శకుడగుటకు నిశ్చయించి ప్రభుత్వమువారికి పూర్తియగు నోటీసు యిచ్చి గుజరాతు వ్యవసాయదారులకు శాసనోల్లంఘనమును బోధించుటకు ఆగష్టు మొదటితేదీని బయలుదేరెను అతనిని వెంటనే ఆరెస్టుచేసి, యొకసంవత్సరము శిక్ష విధించి యరవాడ జయిలులో నతని మామూలు గదికి తిరిగి పంపించిరి. అతడు తిరిగి వెళ్ళినందులకు నేను సంతోషించితిని. కాని వెంటనే యొక క్రొత్తచిక్కు తటస్థించెను. అతడు జయిలునుండి హరిజన ప్రచారము చేసికొనుటకు వెనుక తనకున్న యవకాశములే యిప్పుడుండవలెననెను. ప్రభుత్వమువారట్లుచేయ తిరస్కరించిరి. ఈ సమస్యపై గాంధీజీ యుపవసించెనని మేమకస్మాత్తుగ వింటిమి. అట్టి యుపద్రవకరమైన చర్య తీసికొనుటకు మా కది చాల స్వల్పవిషయముగ కాన్పించెను. అతడు ప్రభుత్వముతో సల్పిన వాదము పూర్తిగ యుక్తమైనదేయైనను అతని నిశ్చయమును నే నర్థముచేసికొనుట బొత్తిగ దుస్సాధ్యమయ్యెను. మే మేమియు చేయజాలక తెల్లబోయి చూచుచుంటిమి.

ఉపవాసమువారమురోజులుజరిగినతరువాత నతనిస్థితి వేగముగ పాడగుచుండెను. అతని నొక ఆస్పత్రికి మార్చిరి. అయినను అతడింకను ఖయిదీయే యగుటచే ప్రభుత్వమువా రతనికి హరిజనపనుల్కు సౌకర్యముల నీయలేదు. జీవింపవలెనను యిచ్ఛ యిప్పుడు లేకపోవుటచే నతడు క్రుంగిపోవుచుండెను. మృత్యువాసన్నమగునట్లు కాన్పించెను. అతడు సెలవుతీసికొనెను. తనవద్దనున్న కొద్ది స్వంత సామగ్రిని పంచిపెట్టెను. కొన్నిటిని ఆస్పత్రినర్సుల కిచ్చివేసెను. కాని ప్రభుత్వమువారి కతడు తమ చేతులలో చనిపోవుట కిష్టములేక నకస్మాత్తుగా నా సాయంకాలమే విడిచివేసిరి. అతనిని రక్షించుట కదియే సరియైనసమయము. ఒక్కరోజు గతించెనాబహుశః యతడు దక్కెడివాడు కాడు. బహుశః యతనిని రక్షించినకీర్తి చాల

వరకు సి. యస్. అండ్రూసుకు చెందును. గాంధీజీ వలదనినను వతడు హిందూదేశములో రివ్యూన వ్రాసెను.

ఈ లోపల నన్ను ఆగష్టు 23 వ తేదీన డేరాడూను జయిలు నుండి మార్చిరి. పదునెనిమిదిమాసము లితర జయిళ్ళలో గడిపిన తరువాత నైనీజయిలుకు నేను తిరిగివచ్చితిని. నా తల్లికి జబ్బుచేసి నట్లు, ఆస్పత్రికి తీసికొనిపోబడినట్లు వార్తవచ్చెను. మా తల్లి స్థితి చాల యుపద్రవకరముగ నున్నదని భావింపబడుటచే 1933 ఆగష్టు 30 వ తేదీ నేను విడువబడితిని. మామూలుగ సెప్టెంబరు 12 వ తేదీని నా శిక్ష పూర్తియగుటతోడనే నేను విడువబడెడివాడను కనుక రాష్ట్రప్రభుత్వము నాకు పదిహేనురోజులెక్కువ రిమిషను యిచ్చెను.

—)o(—

50

గాంధీజీని దర్శించుట

నేను విడుదలయగుట తోడనే మంచమువట్టిన మా తల్లివద్దకు లక్నోవెళ్ళి కొన్నిదినము లచ్చటనేయుంటిని. చాలకాలము జయిలులో గడిపినతరువాత బయటకు వచ్చుటచే నేను సంగములేని వానివలె, పరిస్థితులతో స్పర్శలేనివానివలె నుంటిని. నేను జయిలులో నెట్టి మార్పులేక యుండగా ప్రపంచము త్వరితముగ కదలుచు మార్పుచెందుచు పోవుచున్న ట్లాశ్చర్యముతో గుర్తించితిని. బిడ్డలు, బాలురు, బాలికలు పెద్దవాండ్రగుచుండుట; పెండ్లిండ్లు, పుట్టుకలు, చావులు, ప్రేమ, ద్వేషము, కృషి, క్రీడ, విషాదము, వినోదము, జీవితములో నూతన ప్రయోజనములు, సంభాషణకు నూతన విషయములు, నేను చూచినదానిలోను, వినుదానిలోను సదా ఏదో యొక వింతవిషయము ఉండెడిది, నన్ను వెనుకకు దిగద్రొక్కి జీవితము పరుగిడినట్లు కాన్పించెను. అది నాకు తృప్తికరముగ లేదు. నేను వెంటనే నా పరిసరములకు సరిపెట్టుకొని యుండెడివాడను. కాని నాకట్టి కోరిక కలుగలేదు స్వల్పకాలము జయిలు వెలుపల విహారము చేయుటకు వచ్చినట్లు, కొద్దికాలములోనే తిరిగి వెళ్ళిపోవలసియుండు నట్లు నేను గుర్తించితిని. కనుక కొలదికాలములోనే వీడనున్న పరిస్థితులకు సరిపెట్టుకొని యుండవలెనని నేనేల బాధపడవలెను?

రాజకీయముగ హిందూదేశము శాంతముగ నుండెను. ప్రభుత్వము వారు బహిరంగచర్యల నణచివేసిరి, వశపరచుకొనిరి. అప్పుడప్పుడరెస్టులు జరుగుచుండెను. కాని యప్పటి భారత మౌనమున కెంతయో యర్థముగలదు. అది భయంకరనిర్బంధము చాలకాల మనుభవించిన తరువాత నలసటచేకలుగు చెడుసూచనగల మౌనము! అది చాల గంభీరమైన మౌనము ! కాని నిర్బంధములనే యెరుగు ప్రభుత్వముల కది గోచరముకాదు. భారతప్రభుత్వ మాదర్శపూర్వకమైన పోలీసు ప్రభుత్వము. పోలీసు చిత్తవృత్తి ప్రభుత్వశాఖలన్నిం

టిని మట్టుబెట్టెను. తిరుగుబాటు బాహ్యముగ నణచివేయబడెను. దేశమునంతను వేగులవాండ్రయొక్కయు, గూఢచారులయొక్కయు మహాసైన్యము కప్పివేసెను. ప్రజలలో నైతికదుర్బలత్వము, సర్వత్ర వ్యాపించిన భయము కలిగెను. ఎట్టిరాజకీయకృషియైనను, ముఖ్యముగ గ్రామప్రాంతములలో వెంటనే యణచివేయబడెను. వివిధ రాష్ట్రప్రభుత్వములవారు కాంగ్రెసువారిని మున్సిపాలిటీలనుండి స్థానిక సంస్థలనుండి తరిమివేయ ప్రయత్నించుచుండిరి. ప్రభుత్వ దృష్టిలో శాసనోల్లంఘనములో జయిలుకు వెళ్ళిన ప్రతివాడు మున్సిపాలు పాఠశాలలలో బోధించుటకు, మునిసిపాలిటీలో నెట్టిసేవ చేయుటకు పనికిరాడు. మునిసిపాలిటీలు మొదలగువానిమీద నెక్కువ వత్తిడి కలిగింపబడెను. దోషులైన కాంగ్రెసువారిని యుద్యోగములనుండి తొలగింపనియెడల ప్రభుత్వగ్రాంటులీయబడవని భయపెట్టిరి. ఇట్టినిర్బంధ యుదాహరణములలో కలకత్తా కార్పొరేషను విశేషము పేరువడసెను. చివరకు రాజకీయ నేరములకు శిక్షింపబడినవారికి కార్పొరేషనులో నుద్యోగములనీయరాదని వంగప్రభుత్వమొక చట్టముచేసిరని నేనువిశ్వసించెదను

నాజీల యత్యాచార చరిత్రలు బ్రిటిషు ప్రభుత్వాధికారుల వయినను వారి పత్రికలవయినను నొక చిత్రఫలితమును కలిగించెను. తాము హిందూదేశములో జరిగినవన్నియు యుక్తమేయని యవి వారికి మద్దతునిచ్చెను. నాజీలే మనతో వ్యవహరింపవలసివచ్చిన యెడల నెంత యధ్వాన్నముగ నుండెడిదో! యని మాకు బోధింపబడుచుండెడిది! నాజీలు నూతన ప్రమాణములను నూతన చరిత్రను స్థాపించిరి. నిశ్చయముగ వారితో పోటీచేయుట సులభవిషయము కాదు. బహుశః మా స్థితి యధమముగనే యుండియుండెడిది, గత మయిదు సంవత్సరములలోను హిందూదేశమంతట వివిధప్రాంతములలో జరిగిన సంభవములను గురించిన వార్తలన్నియు నావద్ద లేకపోవుటచే నేను తీర్పుచెప్పుట కష్టమైన విషయము. హిందూదేశములోనున్న బ్రిటిషుప్రభుత్వము "నీయెడమచేయి చేయు దానము

నీకుడిచేతికి తెలియకుండునుగాత" అను గుప్తదానమును విశ్వసించును. కనుకనది నిష్ప్రయోజనమైన పరిశోధనను జరుపవలెననెడి ప్రతి సూచనను నిరాకరించెను. సామాన్యయాంగ్లేయుడు పశుత్వమును ద్వేషించునను సంగతి నిజమేయని నేను భావించెదను. నాజీలవలె యింగ్లీషువారు బహిరంగముగ "బ్రూటాలిటేటు" (లేకనీయుద్ధమువచ్చు యింగ్లీషుపదము) పశుకృత్యములో బహిరంగముగ నోలలాడుటయు నాపదము నతిప్రీతితో నుచ్చరించుటయు చేయగలరని నేనూహింప జాలను. ఒకవేళ వారాకృత్యము నాచరించినను దానికి కొంచెము సిగ్గుపడుదురు. మనము జర్మనులమైనను, యింగ్లీషువారమైనను, భారతీయులమైనను మననాగరికప్రవర్తనకవచము చాల పలుచనగ నుండును. రాగద్వేషములు ప్రకోపించినపు డది తొలగిపోయి యసహ్యమయిన దానిని బహిర్గత మొనరించును. ప్రపంచయుద్ధము మానవలోకమును భయంకర పశుప్రాయ మొనరించెను. దీని ఫలిత మును మనము సంధియైన తరువాతగూడ జర్మనీ కాహారపదార్థము లను పోకుండ నలువైపులను ముట్టడించిన భయంకర రూపమున చూచియేయుంటిమి—దీనికొక యింగ్లీషు గ్రంథకర్త "ఏ జాతియు నెన్నడు గావింపని యత్యంత బుద్ధిహీనమైన, పశుప్రాయమైనభయం కరమైన కౌర్యము" అని వర్ణించెను. 1857, 1858 సంవత్సరము లను భారతదేశము మరచిపోలేదు. మనప్రయోజనములకే ధాక తగిలినపుడు, "యెరుపు" వచ్చునప్పుడు మనముమనశుభలక్షణములను సంఘనీతిని మరచిపోదుము; అసత్యము "ప్రచారము" అగును, పశుత్వము శాస్త్రీయమైన నిర్బంధము "న్యాయ, క్రమముల" నుద్ధరించుట యగును.

అది వ్యక్తులయొక్క లేక ప్రత్యేక ప్రజలయొక్క దోషము కాజాలదు. ప్రతివాడు నట్టిపరిస్థితులలో నట్లేప్రవర్తించును. హిందూ దేశములోను, విదేశపాలనలోనున్న ప్రతిదేశములోను, పాలకుల మీాద నంతర్హితముగ నొకసవాలు యెప్పుడు నుండును. అదినానాటికి మరింత స్పష్టము, భయోత్పాతజనకము నగును. ఈసవాలు పాలక

వర్గము యొక్క సైనిక సుగుణములను, అవగుణములను సదా యభివృద్ధిచేయును. మాసవాలు శక్తివంతము, వీర్యవంతము నైనదగుటచే గత కొలది వత్సరములలో భారతదేశమున మేము మా సైనికగుణములను, అవగుణములను విశేషముగ చూచితిమి. కాని భారతదేశములో కొంతవరకు మే మెప్పుడు సైనిక హృదయమును సహింపవలసి యుండెను. ఇది సామ్రాజ్యఫలితములలో నొకటి. ఇది దీనితో సంబంధమున్న రెండుపక్షములవారినికూడ భ్రష్టులను చేయును. భారతీయుల భ్రష్టత్వము తగినంత స్పష్టముగనే యున్నది. కాని రెండవవారి భ్రష్టత్వమింతకంటె నెక్కువ సూక్ష్మమైనది. కాని యది విషమ సమయములలో బహిర్గతమగుచుండును. తరువాత మూడవ పక్ష మొకటియుండెను. పాపము దీనికి రెండురకముల భ్రష్టత్వములను పంచుకొను దౌర్భాగ్యము పట్టెను

ఉన్నతోద్యోగుల యుపన్యాసములను, అసెంబ్లీలోను, కౌన్సిళ్ళలోను వారి సమాధానములను, ప్రభుత్వ వాఙ్మూలములను చదువుటకు జయిళ్ళలో నాకు తగినంత సావకాశముండెను. గత మూడువత్సరములలో వానిలో కొంత మార్పువలిగినట్లు నే ననుకొంటిని. ఈమార్పు యంతకంతకు స్పష్టముగ విశదమగుచుండెను. వారియుపన్యాసము లధికార పురస్కారముగ, భయజనకముగనుండెను. అవి గొప్ప సైనికాధికారి తన సైనికులను సంబోధించు భాషలో నుండెను. వంగదేశములోని మిడ్నపూరు డివిజను కమిషనరు 1933వ నవంబరు లేక డిసెంబరులో నిచ్చిన యుపన్యాసము దీనికొక చక్కని యుదాహరణము. పరాజితులు దుఃఖభాగులని యతని సూత్రము. అధికారేతర యూరపియనులు (ముఖ్యముగ వంగదేశములో) వాక్క్రియలలో శుద్ధ భాసిస్టు స్వభావమును చూపిరి.

సింధులో శిక్షింపబడిన కొంతమంది నేరస్తులమధ్య బహిరంగముగ నురితీయుట, పశుత్వమును తెలుపు మరియొక యుదాహరణము. సింధులో నేరములు హెచ్చిపోవుచున్నవి కనుక నచ్చటి యధికారులీ నేరస్థులను బహిరంగముగ నురిదీయ నిశ్చయించిరి. ఇది యితరుల

కొక సందడింపు. ఈ ఘోరమైన దృశ్యమును జూచుటకు ప్రజల కనేక సౌకర్యములు గావింపబడెను. అనేక వేలనుండి హాజరయిరని కూడ చెప్పబడెను.

కనుక నేను జయిలునుండి విడుదలయగుటతోడనే భారతదేశ రాజకీయ, ఆర్థిక పరిస్థితులను పరీక్షించితిని. అవి చాల నిరుత్సాహకరముగనుండెను. నా సహచరులు చాలమంది జయిళ్ళలోనుండిరి. క్రొత్త అరెస్టులు జరుగుచునేయుండెను. ఆర్డినెన్సులన్నియు నమలులోనే యుండెను తణిఖీపద్ధతి ముద్రణాయంత్రముల మూతులను బిగించెను; మా యుత్తరప్రత్యుత్తరములను తారుమారు చేసెను. తన యుత్తరముల నర్థము లేకుండ తణిఖీచేయుటచే నా మిత్రుడు, రఫీ అహ్మదు కిద్వాయికి చాల కోపముకలిగెను. ఉత్తరము లాపివేయబడుచు చాల యాలస్యముగ వచ్చుచుండెడివి, కొన్ని పోవుచుండెడివి. దీనిచే నతని యేర్పాటులు భగ్నమగుచుండెను. తన యుద్యోగమును మరికొంత జాగ్రతగ నిర్వహింపవలసినదని యతడు తణిఖీదారునకు వ్రాయగోరెను. కాని యడెవరికి వ్రాయవలెను ? ఈ తణిఖీదారు బహిరంగయుద్యోగికాడు. అతడు రహస్యముగ పనిచేయుచుండునొక సి.ఐ.డి యుద్యోగి. ఇతనికృషియు నునికియు బహిరంగముగ గుర్తింపబడవు. రఫీఅహ్మదు దీనినిగురించి తణిఖీచేయు అధికారి కొక యుత్తరము వ్రాసి పయి కవరుమీద తనచిరునామా నే వ్రాసియీకష్టమును పరిష్కారముచేసెను. సరిగా యీ యుత్తరము వెళ్ళవలసిన చోటుకు వెళ్ళెను. తరువాత నతని యుత్తర ప్రత్యుత్తర వ్యవహారము కొంత చక్కబడెను.

నాకు తిరిగిజయిలుకు వెళ్ళవలెననుకోరిక లేకుండెను. నేనుదానిని పూర్తిగ చవిచూచితిని. కాని నేను నా రాజకీయ కృషినంతను మానుకొన నిశ్చయించినగాని వర్తమానపరిస్థితులలో దీనిని తప్పించుకొను టెట్లో నాకు తెలియలేదు. నాకట్టి యుద్దేశ్యము లేదు. ప్రభుత్వముతో సంఘర్షణ తప్పదని భావించుచుంటిని. ఒకపనిని చేయవలెననియో లేక చేయరాదనియో యే నిమిషమందయిన పైగా నొక

ఫర్మానా జారీచేయబడవచ్చును. 'నీవిట్లునడువవలెను' అను బలవంతమునకు నా స్వభావ మశేషము తిరుగబడును. భారతప్రజల నణచివేయుటకు లొంగదీయుటకు నొకప్రయత్నము జరుపబడుచుండెను. విశాలరంగములో పనిచేయుటకు నే నసహాయుడను. నే నేమియు చేయజాలకుంటిని. కాని యుద్ధమును స్వయముగ నామట్టుకు నేను తిరస్కరింపగలను.

నేను తిరిగి జయిలుకు వెళ్ళుటకుపూర్వము కొన్ని పనులను నిర్వహించుకొనవలసియుండెను. ముందు నేను మాతల్లి వ్యాధివిషయమై చూచుకొనవలసియుండెను. ఆమె చాల నెమ్మదిగ స్వస్థతచెందుచు నొక సంవత్సరమువరకు మంచముమీదనే యుండెను. తన తుది యుపవాసమునుండి కోలుకొనుచున్న గాంధీజీని చూచుటకు నే నాతురపడుచుంటిని. రెండువత్సరములుపయిగ నే నతనిని కలుసుకొనలేదు. నేను రాష్ట్రీయసహచరులనుగూడ చూడగలిగినంతవరకుచూచి భారతదేశ ప్రస్తుత రాజకీయపరిస్థితులనేగాక ప్రపంచ పరిస్థితులను, నా మనస్సులోనున్న భావములను వారితో చర్చింపగోరితిని. ఈ ప్రపంచము త్వరలోనే యొక రాజకీయ ఆర్థికయుత్పాతము ననుభవింపనున్నదని నే నప్పుడు భావించితిని. మా జాతీయప్రోగ్రాముతయారుచేయుటలో మేము దీనిని గుర్తింపవలసియుండెను. నాగృహపరిస్థితులనుగూడ నేను చూచుకొనవలసియుండెను. నేను వానినింతవరకు నిర్లక్ష్యముచేసితిని. మా తండ్రిచనిపోయినప్పటినుండియు నే నతని కాగితములను, దస్తావేజులను పరీక్షించియుండలేదు. మేము మా ఖర్చులను చాలవరకు తగ్గించితిమి. అవి యింకను భరింపజాలనంతగనుండెను మే మా భవనములో నున్నంతకాలము వానిని తగ్గించుట దుస్సాధ్యము శక్తిలేక మేము మోటారుకారు పెట్టుకొనలేదు. అంతేగాక ప్రభుత్వము దాని నే ఋణమైనను జప్తుచేయవచ్చును. ఆర్థికచిక్కులలోపడి మేము బాధపడుచుండ ద్రవ్యసహాయముచేయవలసినదని వచ్చు యుత్తరముల కట్టలనుచూచి నేను వినోదపడెడివాడను. (తనిఖీయుద్యోగి యీ గుట్టను నిరభ్యంతరముగ పంపెడి

వాడు) నేను చాల ధనవంతుడనని సాధారణముగ నొక దురభిప్రాయము కలదు.

నేను విడుదలగుటతోడనే నా కడసారి చెల్లెలు కృష్ణకుమారికి వివాహముచేయవలసియుండెను. నేను తిరిగి వారిని బలవంతముగ విడవలసియుండుటకు లోపలనే యీ వివాహము జరుపవలెనని నాతురతతో నుంటిని. కృష్ణకూడ నొక వత్సరము శిక్ష ననుభవించి కొద్ది మాసముల క్రితమే జయిలునుండి బయటకు వచ్చెను.

నాతల్లి యారోగ్యము చూచుకొని గాంధీజీనిదర్శించుటకు నేను పూనా వెళ్ళితిని అతనిదర్శనభాగ్యము తిరిగినాకు లభించినందులకు నేను సంతోషించితిని. అతడుకొంచెమునీరసముగనున్ననుత్సాహితముగకొల్లాసుచుండెను. మేము దీర్ఘసంభాషణలను జరిపితిమి జీవితమునుగురించి రాజకీయములనుగురించి, ఆర్థికములనుగురించి మాదృష్టులలో చాల వ్యత్యాసముండెను. నాదృష్టి నవగతముచేసుకొని దానిని సమీపించుట కతడు సల్పిన మనఃపూర్వక ప్రయత్నములకు నే నతని కెంతయు కృతజ్ఞుడను. మా యుత్తరప్రత్యుత్తరములు నా హృదయమునునింపిన విశాల సారాంశములలోని కొన్నింటిని కలిగియుండెను. వానికిసంబంధించిన భాష కొంత యదృష్టముగనున్నను సాధారణ తాత్పర్యము సుస్పష్టము సుస్థాపిత ప్రయోజనముల నూడబెరుకవలెనని యతనుచేసిన ప్రకటన నాకు సంతసముకలిగించెను. అతనిప్రవర్తనవిధానములుకొన్ని (నాదృష్టిలో) మృదుత్వముతోను, మర్యాదతోను గూడిన బలవంతవిధానము కంతదూరముకాకపోవుటచే నా కంత భేదము కాన్పించలేదు. అదృష్టసిద్ధాంతములను విచారణచేయుట కతడిష్టపడడని భావించినను సత్యమనుతర్కము, ప్రధాన సాంఘిక పరివర్తనములు అవసరములను స్థితి కతనిని క్రమక్రమముగ గొంపోవునని నేను భావించితిని అతడొక యద్భుతవ్యక్తి. వెర్రియును మొల్వేను చెప్పినట్లతను మధ్యయుగపు క్యాథలిక్కుబుషి. అయినను భారతకృషీవల హృదయమును నాకళింపుచేసుకొనిన కార్యదక్షతగల నాయకుడు. విషమపరిస్థితు లెదుర్కొనినపుడత డేమిచేయునో, యెట్లుతిరు

గునో చెప్పజాలము. కాని యతడెట్లుతిరిగిన నావైపే బలమగును. మన యాలోచనల ప్రకార మతడు తప్పుమార్గమునేబట్టినను అది యెప్పుడును సరళమార్గమే యగును. అతనితో పనిచేయుట శుభ ప్రదము: కాని యవసరమైనచో వేరుమార్గము త్రొక్కవలసియుండును.

ప్రస్తుత మీ సమస్యకు తావులేదని నేను భావించితిని. మేము మా జాతీయ సమరరంగమధ్యమున నుంటిమి. శాసనోల్లంఘనమింకను కాంగ్రెసు కార్యక్రమముగనుండెను. మేము యథాప్రకారము మా కార్యము నిర్వహించుచు ప్రజలలో సామ్యవా[illegible]లను వ్యాప్తి చేయప్రయత్నింపవలెను. ఇట్లు చేసి మేము ప[illegible]స్థితిని ప్రకటింపవలసిన మరియొక తరుణమాసన్నమయినపుడు తగిన యభివృద్ధికి సిద్ధముగనుందుము. ఈ లోపల కాంగ్రెసు అక్రమసంస్థగ నుండెను. ప్రభుత్వమువారు దానిని నలిపివేయుటకు ప్రయత్నించుచుండిరి. మేము మా దాడి నెదుర్కొనవలసియుండెను.

గాంధీజీ ప్రధానసమస్య వ్యక్తిగతముగ నుండెను. అతనిమట్టుకతడేమిచేయవలెననునది చిక్కుసమస్య. అతడు తిరిగి జయిలుకు వెళ్లినచో హరిజనోద్యమ సౌకర్యముల ప్రశ్న తిరిగి యుదయించును. బహుశః ప్రభుత్వమువారు లొంగకపోవచ్చును; అతడు తిరిగియుపవసించును. ఈ చర్విత చర్వణము జరగవలసినదేనా? అతడిట్టిమార్గాల మూషికనీతి కొప్పుకొనక తాను తిరిగి ఈసౌకర్యములకొరకుపవసింపవలసివచ్చినచో తాను విడుదలయైనను ఉపవాసము విరమింపబడదని చెప్పెను. అనగా చనిపోవువరకు నుపవసించును.

అతడు చేయగల రెండవపని యేమన తన సంవత్సర శిక్షాకాలములో జయిలుకుపోక దానిని హరిజనోద్యమమునకు వినియోగింపవలెను. అయినను అతడు కాంగ్రెసు వర్కరులను కలుసుకొని యవసరమైనపుడు వారికి సలహా యిచ్చుచుండును.

అతడు మూడవమార్గమును సూచించెను. కొంతకాలమతడు కాంగ్రెసునుండి పూర్తిగవిరమించి దానిని "యువకుల" హస్తగతము చేసెదననెను.

మొదటి పద్ధతివలన నతడుపవసించి చనిపోవుటతప్పదు. కనుక నేమెవరము దానిని సిఫార్సుచేయలేదు. కాంగ్రెసు అక్రమసంఘముగ నున్నపుడు మూడవపద్ధతి నవలంబించుటెంత మాత్రము వాంఛనీయముకాదు. ఇది శాసనోల్లంఘనమును, అన్నివిధ ప్రత్యక్షకార్యములను వెంటనే విరమించి తిరిగిన్యాయవిధానములకు, చట్టబద్ధచర్యలకు దిగుటగ పరిణమించును. లేదా యిపుడు గాంధీజీచేత కూడ బహిష్కరింపబడి, వేరుచేయబడి ప్రభుత్వముచే మరింతనలిపి వేయబడు కాంగ్రెసుగ పరిణమించును. యింతేగాక నొకచోట కలుసుకొనుటకు నొకనీతిని చర్చించుకొనుటకు వీలులేని యక్రమసంస్థ నేవ్యక్తియు వారును చేబట్టుటకవకాశము లేదు. కనుక నతడుసూచించిన వానిలో రెండవపద్ధతికి నేమంగీకరించితిమి. మాలో చాలమంది కది ఇష్టము లేదు, చావగా మిగిలిన శాసనోల్లంఘన కార్యక్రమమున కిది యొక పెద్ద గొడ్డలి దెబ్బయని నేమెరుగుదుము. నాయకుడే సమరరంగము నుండి విరమించిన యెడల ననేకమంది యుత్సాహవంతులగు కాంగ్రెసు వర్కరులీ యగ్నిలోనికి దుముకజాలరు. కాని యీ చిక్కులోనుండి బయటపడుటకు మరియొక తెన్ను కానరాదయ్యెను. కనుక గాంధీజీ పయివిధముగనే ప్రకటించెను.

గాంధీజీ నేను శాసనోల్లంఘనమును విరమింపరాదనియు, దానిని సన్నసన్నగానైనను నడుపవలెననియు నొప్పుకొంటిమి. ఇక నేను ప్రజాదృష్టిని సామ్యవాద సిద్ధాంతములమీదకు, ప్రపంచ పరిస్థితులమీదకు త్రిప్పగోరితిని.

నే నింటికి తిరిగివచ్చినపుడు బొంబాయిలో కొద్దిదినము లుంటిని. నే నచ్చట యుదయశంకరుని నృత్యకళను గ్రోలితిని. ఇది నాకు తలవని తలంపుగ చేకూరుటచే నేను దీని నాహ్వాయముగ ననుభవించితిని. నాటకములు, గానము, సినీమాలు, టాకీలు, రేడియో, దూరశ్రవణము యిత్యాదులు చాల వత్సరములనుండి నాకననుభూతములు. ఏలనన నాకు స్వేచ్ఛయబ్బిన మధ్యకాలములలో గూడ నే నితరపనులలో నెక్కువగ మునిగియుండెడివాడను. నేనింతవర

కొక్కసారియే టాకీకి పోగలిగితిని. సినిమా ప్రపంచములో ప్రసిద్ధి చెందినవారి నామములు నాకు నామమాత్రముగనుండెను. ముఖ్యముగా నాకు నాటకములతో సంబంధము లేకుండెను. విదేశములలో రచింపబడు నూతన నాటకములను నే వసూయతో చదువుచుండెడి వాడను. ఉత్తరహిందూదేశములో మంచి నాటకములను చూచుట కవకాశములు లేకుండెను. మా సమీపములో నట్టివేవియు లేకుండెను.

వంగ, మహారాష్ట్ర, గుజరాతీ నాటకములలో గొప్పయభివృద్ధి కలిగెనని నేను విశ్వసించెదను. హిందూస్థానీ నాటకరంగ మట్లుగాక మిక్కిలి సంస్కార శూన్యముగ, కళావిహీనముగ నున్నది; భారతదేశములోని ఫిల్ములు చాలవరకు (టాకీలును మాట్లాడని ఫిల్ములను కూడ) కళోపాసనచేయు దోషమున కొడిగట్టువని నేను వింటిని. అవి సాధారణముగ ప్రాచీన భారతదేశ చరిత్రనుండియో, పురాణగాథల నుండియో తీసికొనబడు విషయమునకు చెందిన సంగీత మిశ్రిత కథలు, పుక్కిటిపురాణములు.

అవి నగరవాసులవాంఛను సప్లయిచేయునని నేననుకొనెదను. సంస్కార రహితములు, బాధకరములు నగు యీ ప్రదర్శన కళకును యింకను నిలిచియున్న వీధినాటకములు, బొబ్బిలికథలు, నృత్యము మొదలగు కళకును గల వ్యత్యాస మెంతయో గలదు. వంగదేశము, గుజరాతు, దక్షిణహిందూదేశములోని గ్రామప్రజలు ప్రధానముగ నెంతకళాభిజ్ఞులో మన మొక్కొక్కప్పు డత్యాశ్చర్యముతో కనుగొనగలము. మధ్యతరగతులవారట్లుగాక తమ మూలములను పోగొట్టుకొనినట్లు కాన్పింతురు. వా రుపాసించునట్టి కళాసాంప్రదాయమేదియు లేదు. వారు జర్మనీ, ఆస్ట్రియాలలో గుట్టలుగ తయారుచేయబడు అందవికారమగు చౌకరకపు ప్రింటులతో మురియుచు నొక్కొక్కపుడు రవివర్మ చిత్రములనుగూడ గుర్తించుచుందురు. హార్మోనియము వారి యభిమానజంత్రము (స్వరాజ్య ప్రభుత్వ మీవికారయంత్రమును శన ప్రబంధము చట్టములచే నిషేధించుననుగంపెడాశతో నేను జీవించుచున్నాను.) కాని లక్నోలోనుయితర చోట్లనుగల పెద్దతాలూకుదార్ల

భవనములలో నతి ప్రమాదకరమగు నసంగతకళయు, కళాసిద్ధాంతములన్నిటిని భంగపరచుటయు గాననగును. ఖర్చుపెట్టుటకు వారికి పుష్కలముగ ద్రవ్యముకలదు. ఘనతను ప్రకటించుకొనవలెనను నిచ్ఛగలదు! కనుక వా రట్లేల చేయరాదు! వారిని దర్శింపబోవు ప్రజలు వారి యీ యుత్పసిద్ధిని కండ్లారజూచు విచారకలుషిత ద్రష్ట లగుదురు.

సుప్రసిద్ధ టాగూరువంశ మొక కళాప్రబోధమును నవీనముగ కలిగించెను. భారతదేశమంతట దాని ప్రతిభ యప్పుడే ప్రసరించెను. కాని, దేశములోని ప్రజ లడుగడుగునకు నిర్బంధింపబడుచు, వారింపబడుచు, నణచివేయబడుచు భయభ్రాంతమగు వాతావరణంలో జీవించుచుండ నే కళగాని విరివిగా నెట్లభివృద్ధి చెందగలదు ?

బొంబాయిలో నేననేకమంది స్నేహితులను, సహచరులనుకలుసుకొంటిని. వారిలో కొందఱు కొద్దికాలము క్రిందటనే జయిలునుండి బయటపడిరి. అచ్చట సామ్యవాదము బలముగనుండెను కాంగ్రెసులోని పయితరగతులలో నవీనముగ సంభవించిన మార్పువల్ల తిరస్కారము హెచ్చుగనుండెను. తన యాధ్యాత్మికదృష్టిని రాజకీయములకు వర్తింపజేసినందులకు గాంధీజీ తీవ్రముగ విమర్శింపబడెను. ఆ విమర్శతో చాలవరకు నే నేకీభవించితిని. కాని, పరిస్థితులనుబట్టి మనకు వేరుగత్యంతరము లేదనియు, నుద్యమమును సాగింపక తప్పదనియు నేను స్పష్టముగ గ్రహించితిని. శాసనోల్లంఘనమునువిరమించు యత్నమేదియు మనకు శాంతిని ప్రసాదింపజాలదు. ఏలనన ప్రభుత్వ నిర్బంధవిధానముసాగింపబడుచునేయుండును మనకృషివిధాయకముగ జయిలుకే మార్గమగును. మన జాతీయోద్యమము ప్రభుత్వముచే నణచివేయబడవలెను. లేదా ప్రభుత్వముపై తన యిచ్ఛను చలాయించవలెను. దీనికి మరియొక మార్గము లేదు. అనగా జాతీయోద్యమ మెప్పుడు ప్రభుత్వముచే నక్రమసంఘముగ ప్రకటింపబడుస్థితికి వచ్చెను శాసనోల్లంఘనము విరమింపబడినను యీ యుద్యమము వెనుకకు మరలజాలదు. శాసనోల్లంఘనమును సాగించుటవలన నాచ

రణలో నెక్కువభేదములేదు. కాని యానైతిక తిరస్కారమునకొక
ప్రయోజనముకలదు. పోరాటమును కట్టిపెట్టినపు డవినీతి ప్రబలును.
అప్పుడు నూతనభావములను వ్యాపింపజేయుటకంటె సమరకాలము
లోనే వాటిని వ్యాపింపజేయుట సుకరము. పోరాటమును విరమించి
నచో మనము చేయగలిగిన దొక్కటియే కలదు, మనము బ్రిటిషు
ప్రభుత్వముతో రాజీపడి శాసనసభలలోని చట్టబద్ధ కార్యకలాపము
లకు దిగవలెను

అది యెంతకఠినమైనస్థితి! దీనికంగీకరించు టంత సులభవిషయ
ముకాదు. నేను నాసహచరుల మానసిక సంఘర్షణలను గుర్తించితిని.
ఏలనన నేనే యట్టివాని నొకప్పు డెదుర్కొనవలసియుండెను. కాని
సామ్యవాదసిద్ధాంతమును కార్యశూన్యతకొక యాశ్రయముగ చేయ
గోరినవారిని కొందరిని కనుగొంటిని. తమంతతాము రవంత కార్యము
నైనను చేయరానివారు సంగ్రామాతీతులుగనున్నప్పుడు కార్యభారము
నంతను వహించిన యితరులను నభివృద్ధిభంజకులని విమర్శించుట
కొంచెము క్రోధోద్దీపితముగ నుండకమానదు. ఈ పడకగది సామ్య
వాదులు గాంధిజీ నతికఠినముగ వచ్చి రియాక్షనరీయని నిందించిరి. వారు
తర్కమునకెంతమాత్రము కొరతపడని వాదనలను కుప్పించిరి. కాని
ఈ 'రియాక్షనరీ' భారతదేశము నెరిగినవాడు. గ్రహించినవాడు. అతడే
కృషీవల భారతదేశము విప్లవకారుడనబడువా డెవడు కదల్చన
ట్లతడు భారతదేశమును కదల్చివేసెనను విషయ మాచంద్రార్కము
నిలిచిపోగలదు. అతని నవీనహరిజనోద్యమముకూడ సనాతనహిందూ
మతమును నెమ్మదిగ త్రవ్వి దానిని పునాదులవరకు కదల్చివేసెను.
సనాతనబృందమంతయు నొక్కపెట్టున నతనిపై యెదురుతిరిగిరి. అతడు
వారినెంత యుదారముగ, మర్యాదగ, సన్మానించినను వారతనిని
ప్రబలశత్రువుగ పరిగణించిరి. చిత్రముగ నతడు ప్రబలశక్తులనువిడిచి
పెట్టుచుండును, ప్రయోగించుచుండును. అవి నీటిమీద యలలవలె
విస్తరించుచు కోట్లకొలది ప్రజలను చేరుచుండును, వారినినిమిషములో
మార్చివేయుచుండును. 'రియాక్షనరీ' యగుగాక విప్లకారుడగుగాక!

అతడు భారతముఖమునంతను మార్చివేసెను. దాసానదాసులై యువి నీతిపరులై పడియున్న ప్రజల కతడు యభిమానధనమును, శీలసంపత్తును ప్రసాదించెను. ప్రజలలో నొకశక్తిని, ప్రబోధమును నిర్మించెను. భారతసమస్యను ప్రపంచసమస్యగ చేసెను. దౌర్జన్యరహితసహాయ నిరాకరణము లేక సాత్త్వికనిరోధము భారతదేశమునకు, ప్రపంచమునకు నతడు ప్రసాదించిన మహనీయవరము. అది భారతదేశపరిస్థితుల కతిచిత్రముగ సరిపడెననుటకు సందేహ మెంతమాత్రములేదు.

సవిమర్శయుక్తము మనసమస్యలనుగురించి సాధ్యమైనంతబహిరంగచర్చ కవకాశమీయవలెను. గాంధీజీయొక్క యనన్యస్థానమీ చర్చకు కొంతయాటంకము కలిగించుట దురదృష్టము. అతనిపై నాధారపడుట, నిశ్చయము నతనికే విడిచివేయుట పరిపాటియయ్యెను. ఇది చాల పొరపాటు, లక్ష్యములను, పద్ధతులను హేతుబద్ధముగ నంగీకరింపవలెను. దానిపై నాధారపడు సహకార, శిక్షణలచేతనే జాతి యభివృద్ధి చెందగలదు. ఎంతగొప్పవాడైనను విమర్శ కతీతుడుగనుండరాదు. కాని విమర్శ కేవలము కార్యకారి కానిచో దానిలో నేదో యొక దోషముండును. సామ్యవాదు లిట్టివానికి పాల్పడిన ప్రజలచే గర్హింపబడుటతప్పదు. ప్రజలు కార్యములనుబట్టియే విమర్శించుచుందురు. "భవిష్యత్తుకుచెందు సుకుమారకార్యములనుగురించి కలలను గనుచు నేటికఠినకార్యములను త్రోసిపుచ్చువాడు వంచకుడగును" అని లెనినుమహాశయుడు వచించెను. అనగా నది వాస్తవిక జీవితాభివృద్ధిపయి నాధారపడుటను తిరస్కరించుటయగును. కలల వెంట అభివృద్ధిమార్గమును పోనాడుటయగును.

భారతదేశ సామ్యవాదులు, కమ్యూనిష్టులు చాలవరకు పారిశ్రామిక బీదజనులకు సంబంధించిన సాహిత్యముమీదనే పెరిగిరి. బొంబాయి, కలకత్తా మొదలగు కొన్ని ప్రత్యేకప్రాంతములలోనే చాలమంది ఫ్యాక్టరీ కూలివాండ్రు, పనివాండ్రుకలరు. తక్కినభారతదేశమంతయు వ్యావసాయిక దేశము కనుక పారిశ్రామిక పనివాండ్రదృష్ట్యా భారతసమస్యను యథోచితముగ పరిష్కరించుటకు వీలులేదు.

జాతీయత, గ్రామఆర్థికము లిచ్చట ప్రధానములు, ప్రాశ్చాత్యసామ్య వాదమునకు వీనితో నెట్టిసంపర్కము లేదు యుద్ధమునకు పూర్వము రష్యాదేశ పరిస్థితులు హిందూదేశమును పోలియేయుండెను. కాని యచ్చటసాధారణములు, నసామాన్యములు నగు సంభవములు తట స్థించెను. అట్టివే యిచ్చట నైననుజరుగునని యనుకొనుట మూర్ఖత్వము. ప్రస్తుతపరిస్థితులనుగ్రహించుటకు, నన్వయించుకొనుటకు కమ్యూనిస్టు వేదాంతము సహాయపడునని నా విశ్వాసము. మరియు నది భవిష్య దభివృద్ధిమార్గము సూచించును కాని యదార్థములను, పరిస్థితులను యుక్తముగ గుర్తింపకుండ గ్రుడ్డిగ నీ వేదాంతమును వర్తింప జేయుట దీనియెడల నపచారము, దౌర్జన్యము చేయుటయే యగును.

ఎట్లైనను జీవితమంత సులభమైన విషయము కాదు. జీవితములో నున్న పోరాటములు, పరస్పరసంఘర్షణలు ఒకొక్కప్పుడు కొంతనిరా శను కలిగించును భేదాభిప్రాయములుండుటలో నాశ్చర్యమేమియు లేదు. సమస్యలవట్ల సమానాన్వయమును పొందిన సహచరులు వివిధ సారాంశములను కలిగియుండుటలోగూడ నాశ్చర్యమేమియు లేదు. కాని తను నిజమర్యలత్వము నుదాత్తపదజాలములోను, ఉదార సిద్ధాంతములలోను కప్పిపుచ్చ జూచు వ్యక్తిపట్టుబడకమానడు ప్రభు త్వమునకు వ్రాతమూలముల నిచ్చియు, హామీల నిచ్చియు జయిలు నుండి దప్పించుకొన ప్రయత్నించు వ్యక్తి, లేక సందేహాస్పదమగు నితగ ప్రవర్తనగల వ్యక్తి, యితరులను విమర్శించుటకు సాహసించి వచో తానుబూనిన యుద్యమమునకే ఘాతచేసినవాడగును.

బొంబాయి పట్టణరాజమగుటచే నన్నిరకముల మనుష్యుల కాకరము. అయినను ఒక విఖ్యాతనగరవాసి తన రాచకీయ 'ఆర్థిక' సాంఘిక మతవిషయకదృష్టిలో చిత్రమగు, ననన్యసాధ్యమగు, 'నుదా రత'ను ప్రదర్శించెను. కూలీల నాయకుడయి యతను సామ్యవాది యయ్యెను. రాజకీయములలో సాధారణముగ నతడు ప్రజాప్రభుత్వ వాదియని పిలుచుకొనెడివాడు. అతడు 'హిందూసభ'యొక్క గౌరాబు పట్టి. ప్రాచీనమత, సాంఘికాచారములను కాపాడుటకు, వాటితో

జోక్యము కలిగించుకొనకుండ శాసనసభలను వారించుటకు నతడు వాగ్దానముచేసెను. ఎన్నికసమయములో నతడు సనాతనపక్షయభ్యర్థి, ఇట్టి వినోదకరమగు చౌచౌ జీవితముతో తృప్తిపొందక నతడు వ్యర్థముగపోవు తనశక్తిని కాంగ్రెసును విమర్శించుటయందు, గాంధీజీని 'రియాక్షనరీ' యని నిందించుటయందు సద్వినియోగము చేసెను. మరికొందరితో కలసి యతడు కాంగ్రెసుకు ప్రజాస్వామికపక్ష మను దానిని లేవదీసెను. దీనికి వస్తుతః ప్రజాస్వామికముతో నెట్టి సంబంధములేదు. దీనికి కాంగ్రెసుతోగల సంబంధము ఆ మహాసభపై దాడి వెడలుట యొక్కటియే! క్రొత్తసీములను జయింపవలెనని గాలము వేసి పరిశోధించుచు లేబరుప్రతినిధిగ నతడు జినీవా లేబరుకాన్ఫరెన్సుకు తయారయ్యెను. ఇంగ్లీషువారిమాదిరి 'జాతీయ' ప్రభుత్వ ప్రధానమంత్రిత్వమున కతడర్హతనుసృష్టించుకొనుచుండెనని మనము యోచించుకొనవచ్చును.

కొద్దిమందికి మాత్రమే యిట్టి చౌచౌ దృష్టియు, చేష్టలు లభింపగలవు. అయినను కాంగ్రెసును విమర్శించువారిలో వివిధ రంగములను చూచినవారు చాలమందికలరు. అన్ని వాయిద్యములను వాయించినవారును కలరు. వీరిలో కొద్దిమంది సామ్యవాదులని తమ్ము, పిలుచుకొనిరి. వీరు సామ్యవాదమునకు చెడ్డపేరు తెచ్చిరి.

51

లిబరలు దృష్టి

గాంధీజీని చూచుటకు పూనా వెళ్ళినపు డొకనాటిసాయంకాలము నే నతనితో కలసి 'భారతసేవకసంఘ' భవనమునుచూచుటకు వెళ్ళితిని. ఆ సంఘసభ్యు లతనిని సుమా రొక గంటసేపు రాచకీయ ప్రశ్నలడిగిరి. అతడు వానికి సమాధానములను చెప్పెను. ఆ సంఘాధ్యక్షుడైన శ్రీనివాసశాస్త్రిగా రచ్చటలేరు. తక్కిన సభ్యులందరిలో నతిసమర్థుడైన పండిత హృదయనాథకుంజ్రూగారుకూడ నచ్చటలేరు. కాని కొందరు సీనియరుసభ్యులుండిరి. ఆ సమయమున నచ్చటనున్న మేము కొందర మా ప్రశ్నల నాశ్చర్యముతో వినుచుంటిమి వారతిస్వల్పసంభవములనుగురించి పృచ్ఛించిరి. అవిచాలవరకు గాంధీజీ వైస్రాయిని దర్శనమీయవలెనని కోరుట, వైస్రాయి దానిని తిరస్కరించుట మొదలగువానితో గూడియుండెను. పలువిధ సమస్యాభరితమయిన ప్రపంచములో వారు భావింపగలిగిన ముఖ్యవిషయ మిదియేనా? స్వాతంత్ర్యముకొరకు తమమాతృభూమి ఘోరసంగ్రామము సలుపుచున్నపుడు, వందలకొలది సంస్థలక్రమసంఘములుగ ప్రకటింపబడినపు డడుగవలసిన ప్రశ్నలివియేనా? వ్యావసాయక దుస్థితి, విపరీత నిరుద్యోగమును దాపరింప జేసి పారిశ్రామిక మాంద్యము, వంగ, సరిహద్దు రాష్ట్రములలోను, తదితర ప్రాంతములలోనుజరుపబడినఘోరకృత్యములు, ఉపన్యాసములు, వ్రాతలు, సభలు, భావములు మొదలగువాని స్వాతంత్ర్యములనణచివేయుట, అనేక జాతీయ, అంతర్జాతీయ సమస్యలు—ఇన్నియుండగా నెట్టిప్రశ్నలు దొరకెను !

బహిఃప్రపంచముతో నెట్టిసంపర్కములేని యొక మఠములో నడుగుపెట్టినట్లు నాకుతోచెను. అయినను మనమిత్రులుహుషారయిన రాచకీయ దురంధరులు, సమర్థులు, త్యాగము, చిరప్రజాసేవక చరిత్ర కలవారు. మరికొద్దిమందితో కలసి వారు లిబరలుపక్ష మేరుదండివలె నుండిరి. ఈపక్షములోని తక్కుంగలవా రూరుపేరులేని నిరర్థకమూక,

రాజకీయకృషితో సంబంధమున్నట్లప్పుడప్పుడు తృప్తిపడగోరువారు, వీరులోకొందరు ప్రభుత్వాధికారులనుండి వేరుజేయుటకువీలులేనివారు.

ఒకదేశము వేయుప్రశ్నలే యాదేశ రాజకీయాభివృద్ధికి ప్రమాణములు సరియైన ప్రశ్న వేసికొనకపోవుటయే దేశవిఫలతకు కారణమగుచుండును మన కాలమును, శక్తిని, బుద్ధులను శాసనసభాస్థానములను కులమువారీగా పంపకము చేయుటయందు వ్యర్థముచేయుటయు లేక కమ్యూనల్ అవార్డు సమస్యమీద పక్షములనుసృష్టించి, దానిని గురించి వ్యర్థవాగ్వివాదాలతో ప్రొద్దుపుచ్చుటయు, మన రాజకీయ దుస్థితికి ప్రమాణములు. అదేవిధమున భారతసేవక సంఘమువారి మందిరమున నాడు వేయబడిన ప్రశ్నలా సంఘముయొక్క, లిబరలు పక్షముయొక్క వింతమానసికస్థితిని ప్రతిబింబించుచుండెను. వారికి రాజకీయ లేక ఆర్థిక సిద్ధాంతములున్నట్లు కాన్పించదు. విశాల దృష్టియులేదు. వారి రాజకీయములన్న అధికారు లేమిచేతురు? లేక నేమిచేయకుందురు? అను పడకగది లేక కాఫీహోటలు రాజకీయము లుగ కాన్పించెను.

'లిబరలుపక్షము' అనునామకరణము మోసమున కాస్పదము కావచ్చును. ఇతరచోట్ల నాపదమొక యార్థికనీతిని—స్వేచ్ఛావాణిజ్యము మొదలగుదానిని—వ్యక్తిస్వాతంత్ర్యము, పౌరసత్వహక్కులుఅను నొక లక్ష్యమును నిరూపించును. ఆంగ్లదేశపు లిబరలు సాంప్రదాయమార్థిక పునాదులపై నిర్మింపబడెను. వర్తకములో స్వాతంత్ర్యముండవలెనను నభిలాష, రాజుయొక్క గుత్తపద్ధతినుండి, నిరంకుశ సుంకముల విధానమునుండి స్వేచ్ఛబడయవలెనుకోరిక రాజకీయ స్వాతంత్ర్యేచ్ఛకు మార్గముచూపెను. భారతదేశ లిబరలుపక్షము వారి కట్టి పునాదియేదియులేదు స్వేచ్ఛావర్తకములో వారికి నమ్మిక లేదు. వారందరు రక్షణకావలెననియే కోరెదరు. పౌరసత్వములకు వారెక్కువ ప్రాముఖ్యత నీయరని యీమధ్యజరిగిన సంభవముల వలన విదితమగుచున్నది. నిరంకుశ ప్రభుత్వములు, అర్థఫ్యూడల్ ప్రభుత్వములు, ప్రజాస్వామిక ప్రాతిపదికలు, వ్యక్తి స్వాతంత్ర్యము

కూడ లేనట్టియు నగు భారతసంస్థానములతో వారికెక్కువసంపర్క, సహాయములు కలవు. యూరోపియను లిబరలులకు వీరికినీ విషయములో పోలికయే లేదు. నిశ్చయముగ భారతదేశ లిబరలు లెంతమాత్రము లిబరలులు (అనగా ఉదారులు) కారు వారెవరో సరిగా చెప్పగలుగుట కష్టసాధ్యము. వారి కిదమిత్థమను స్థిరభావనిర్మాణ మేదియు లేదు. వారల్పసంఖ్యాకులే యైనను నొకరితో నొకరికి సరిపడదు. ఒక్క 'న' కారములోనే (అనగా వ్యతిరేకించుటలోనే) వారు దిట్టలు. వారికి సర్వత్ర ప్రమాదమే కాన్పించును. కనుక దానినుండి తప్పింకొన యత్నింతురు. అట్లు చేయుటలో సత్యము ద్యోతకమగునని వారాశింతురు. నిశ్చయముగ వారి సత్యమెప్పుడు రెండు చివరల మధ్య నుండును. అతి యనుకొనునట్టి ప్రతిదానిని విమర్శించుటచే వారు మితము, పవిత్రత, మంచితనము గలవారమనెడి భావమునను భవింతురు. బాధకరము, కష్టతరమునగు విచారసాగరమునుండి నిర్మాణ భావములనుండి తప్పించుకొనుటకు వారికీ పద్ధతి తోడ్పడును. పెట్టుబడిదారుల విధానము యూరపులో పూర్తిగ జయింపలేదనియు, నది చిక్కులపాలయ్యెననియు వారిలో కొందర స్పష్టముగ భావింతురు. ఇక సామ్యవాదము స్వార్థప్రయోజనములపై దాడివెడలును గనుక చెడ్డది. బహుశః భవిష్యత్తులో నేదో యొక యద్భుత పరిష్కారము, యొక మధ్యేమార్గగృహము కనుగొనబడును. ఈ లోపల స్వార్థప్రయోజనములు రక్షింపబడవలెను. భూమి గుండ్రముగనున్నదా లేక బల్లపరపుగనున్నదా యనువాదమొకటి బయలుదేరినచో వారీ యతివాదభావములను ఖండించి యది చతురముగనో లేక కోడిగ్రుడ్డువలెనో యుండవచ్చునని తాత్కాలికముగ సూచించెదరు.

అప్రధానములను, అల్పవిషయములను గురించి వారతి యుద్రేకపడెదరు. అహాహాలును చప్పట్లును అత్యద్భుతముగ చెలరేగును. వారు బుద్ధిపూర్వకముగను, భావముచేతనుగూడ ప్రధాన సమస్యలను చేబట్ట నొల్లరు. ఏలనన నట్టి సమస్యలకు మూలచికిత్సలు భావ,

క్రియలలో ధైర్యసాహసములునుండవలెను. కనుక లిబరలుల జయాప జయము లర్థరహితములు. వారికే సిద్ధాంతముతోను సంబంధము లేదు. ఆపార్టీయొక్క ప్రధానలక్షణము, ప్రత్యేకచిహ్నము, (అట్లు భావింపతగినయెడల) ప్రతిదానియందు, మంచికాని చెడుకాని, మితము, మితి, అదియొక జీవితపంథ. బహుశః పాతపేరైన మిత వాదపదనే వీరికెక్కువ దగియుండెడిది.

కాని మితి, యెంతమంచిదైనను గొప్పగుణము. ప్రకాశించు గుణముకానేరదు. అది మాంద్యమునుకలిగించును కనుక భారతలిబ రలులు దురదృష్టవశమున "మందగొడిసైన్యము" అయిరి. వారిచూపులు మందముగను, విరసముగను, వ్రాతలు, సంభాషణలు నిర్వీర్యముగను రసవిహీనముగను నుండును దీనికి మినహాయింపులు లేకపోలేదు. సర్ తేజబహదురు సప్రూ వీరిలో నతివిఖ్యాతపురుషుడు. అతడు నిశ్చయ ముగ మాంద్యుడుకాడు. అతనిలో సరసమునకు కొదువలేదు, అతడు తనమీద ప్రయోగింపబడిన వేళాకోళమునైనను సంతోషముతో స్వీకరింపగలడు. కాని మొత్తముమీద లిబరలువర్గ మస్ఖలితబూర్జువా ప్రాతినిధ్యము వహించును. లిబరలుపక్షమువారి ప్రధాన వార్తాపత్రిక యైన "లీడరు" పత్రిక గతవత్సరము తన తత్త్వమును తెలుపు ప్రధాన వ్యాసమును వ్రాసెను. గొప్పవారు, అసామాన్యపురుషులు ప్రపంచ మున కెప్పుడు ముప్పు తెచ్చిపెట్టరనియు, కనుకనది సామాన్యవ్యక్తికి నిత్యప్రత్యక్షమగు వ్యక్తికి, యెక్కువ ప్రాధాన్యత నిచ్చుననియు వచించెను. అది చక్కని సూచనను నిర్మొగమాటముగ చేసి తన జెండాను సాధారణస్థితికి కట్టివేసెను.

మితవ్యాపారము, చలనములేకుండుట, సాహసములు, హఠా త్పరివర్తనములు లేకుండవలెననుకోరిక మొదలైనవి వృద్ధాప్య లక్షణ ములు. అవి యువకులకు తగినవికావు. కాని మనదేశ మతి ప్రాచీన మైనది. ఒక్కొక్కప్పుడు మాబిడ్డలు శ్రమతోను, విసుగుదలతోను జనించునట్లు కాన్పింతురు. కాంతితఱగు వృద్ధలక్షణములు వారి యందు కాన్పించును. కాని యిప్పుడీ ప్రాచీన దేశముకూడ విప్లవ

శక్తులతో రేకెత్తుచున్నది మితవాదదృష్టి తెల్లబోవుచున్నది. పాత ప్రపంచము నశించుచున్నది. లిబరలుల తియ్యని హేతువాద సంభాషణవలన లాభమేమియు లేదు. ఇంతకంటె వారే తుపానుతోనో, వరదతోనో, భూకంపముతోనో వాదించుకొనిన బాగుండెడిది. వారి ప్రాతయూహాలు నిష్ఫలములగుచున్నవి. నూతన భావములను, కార్యములను, అలవరచుకొనుటకు వారు సాహసింపరు. యూరపియను సాంప్రదాయమునుగురించి మాట్లాడుచు డాక్టరు ఏ. యన్. వైటుహెడ్ గారిట్లు చెప్పిరి. "ప్రతి పురుషాంతరము తన తండ్రులనాటికాల పరిస్థితులలోనే సంపూర్ణముగ జీవించునవి, తన బిడ్డల జీవితముల నట్టి శక్తితోనే పోతపోయుటకా పరిస్థితులనే రవాణా చేయవలెనను పిచ్చి యూహతో నీ సాంప్రదాయమంతయు నల్లుకొనబడియున్నది. మన మసత్యభావములోనున్న మానవచరిత్రయొక్క మొదటియుగములో జీవించుచున్నాము." డాక్టరు వైటుహెడ్డు తన విమర్శలో మితవాదము నవలంబించి ప్రమాదమునకు లోనయ్యెను. ఏలనన ఆయూహ యెప్పుడు నిజము కానేరదు. యూరపియను సాంప్రదాయమే చాలన హీనమైన యెడల మనసాంప్రదాయమునుగురించి వేరుగ చెప్పవలెనా? కాని విప్లవసమయ మాసన్నమయినపుడు చారిత్రక నడక యీ సాంప్రదాయములను లెక్కచేయదు. మన మసహాయులవలె నిరీక్షించి చూచుచు మన ప్రయత్నములు భగ్నమగుట కితరులనునిందింతుము. గిరాల్డుహోర్డుగారు సూచించినట్లు "మన ప్రయత్నములు భగ్నమగుటకు మన భావములలోనున్న లోపములేవియో కారణములుగాక నితరులెవరో బుద్ధిపూర్వకముగ వానిని భగ్నపరచిరని విశ్వసించు భావ మతి ప్రమాదకరమైన భ్రాంతి.

మనమందర మిట్టి భయంకర భ్రాంతిచే బాధపడుదుము. గాంధీజీ దానినుండిముక్తినొందలేదని నేనొక్కొక్కప్పుడు భావించుచుందును. కాని మన మధమమను పనినైనను చేసి జీవితములో సంపర్కము నుంచుకొన యత్నింతుము. ప్రయత్నించుచు నొక్కొక్కప్పుడు పడుచు నీ భ్రాంతియొక్క శక్తిని నిర్వీర్యమొనర్చుచు నెమ్మ

దిగ ముందుకు పోదురు. కాని లిబరలులు విశేష బాధపడుదురు. తప్పు చేయుదురేమోయను భయముచే వారు పనినే చేయరు. పడిపోవుదురేమోయను భయముచే వారు నడువనే నడువరు. ప్రజాసామాన్యముతో వారెట్టి యుక్తసంపర్కము కలిగించుకొనక తమ మానసిక కుహరములలో జపించుకొనుచు స్వీయగారడీవిద్యతో కూర్చొనెదరు. శ్రీనివాసశాస్త్రిగారు పదునెనిమిది మాసముల క్రిందట తనతోడి లిబరలులను "ఊరక చూచుచు విషయములను జారవిడువరాదని" మందలించెను. ఆ మందలింపులో నతడు గుర్తించిన దానికంటె నెక్కువ సత్యమున్నది. ఎల్లప్పుడు ప్రభుత్వమే చేయుచుండునాయని యోచించుచుండుటచే నతడు వివిధప్రభుత్వ కమిటీలు పొందుగు చట్టబద్ధమైన మార్పులను గురించి యూహించుచుండెను. కాని లిబరలుల దురదృష్టమేమనిన తమ ప్రజలే ముందుకు నడచిపోవుచుండ వారూరక నిలచి విషయములను జారవిడచిరి. వారు తమ ప్రజలనే చూచి భయపడిరి. పాలకులతో పొత్తు చెడగొట్టుకొనుటకంటె వారీ ప్రజలతో సంబంధము విడగొట్టుకొనుటయే యోగ్యమనుకొనిరి. తమ నిజభూమిలోనే వారు విదేశస్థులయిరనుటలో నాశ్చర్యమేమికలదు? మిన్నకుండు వారినివీడి జీవితము పరుగెత్తుననుటలో నాశ్చర్యమేమున్నది? తమదేశస్థులు ప్రాణములకొరకు స్వాతంత్ర్యముకొరకు ఘోరసంగ్రామములను జరిపినపుడు లిబరలుధీరులు శత్రువులనరికట్టు గోడకే వైపున నిలచిరో వేరుగ నడుగనక్కరలేదు. వారు గోడకవతల వైపున నిలచి మాకు నుంచి సలహానిచ్చిరి. వారనేక ధర్మవన్నములను వల్లించిరి. రౌండుటేబిలు కాన్ఫరెన్సులలోను, కమిటీలలోను వారు బ్రిటిషు ప్రభుత్వముకుచేసిన సహాకారము ప్రభుత్వముకు గొప్ప నైతికబలము. వారు దానిని నిరాకరించినచో పరిస్థితులలో నెంతయో భేదముండెడిది. ఈ కాన్ఫరెన్సులలో నొకదానికి బ్రిటిషు లేబరుపార్టీకూడ హాజరుకాకుండుట గమనించవలసిన విషయము. మన లిబరలులట్టిపాపము చేయలేదు. అట్లుపోవలదని కొంతమంది బ్రిటిషువారు ప్రార్థించినను వారు వెళ్ళుట మానలేదు.

మనమందరము వివిధ ప్రయోజనములకొరకు హెచ్చుతగ్గుస్థాయిలలో మితవాదులమో లేకనతివాదులమో యగుదుము. మనము దేనికొరకై తగినంత శ్రద్ధతీసికొందుమో దానినిగురించి గట్టిగ భావింతుము. దానినిగురించి యతివాదులమగుదుము. లేనియెడల మనముదారమగు సహనమును, వేదాంతపరమగు మితిని చూపవచ్చును. దేశములో స్వప్రయోజనములు తుడిచివేయబడవలెనని సూచింపబడినప్పుడతి సాత్త్వికమితవాదికూడ నెక్కువగ నుద్రేకించుట, అతివాదియగుట నేనెరుగుదును. మన లిబరలుమిత్రులు కొంతవరకు ధనికులకు కలవారికి ప్రతినిధులు. వారు స్వరాజ్యమువచ్చువరకు వేచియుండగలరు. దానినిగురించి వారంతగా నుద్రేకపడ నవసరములేదు. కాని గొప్ప సాంఘిక మార్పు కేసూచనయైన చేయబడినచో వారులిక్కిపడుదురు. అప్పుడు వారి మితవాదము పలాయనమగును. తియ్యని హేతువచనములు సెలవుతీసికొనును. వారి మితవాదమంతయు బ్రిటిషు ప్రభుత్వపట్టుననే కానవగును. తాము తగినంత గౌరవప్రదముగ, రాజీబుద్ధితోను నుండునెడల తమమాటలు మన్నింపబడునని వారాశింతురు. బ్రిటిషువారి యుద్దేశ్యములను వారువిధాయకముగనొప్పుకొనతీరవలెను. బ్లూపుస్తకములు (ఇంగ్లీషుపార్లమెంటుకు సంబంధించినవి) వారికి వేదగ్రంథములు. ఎర్‌స్కిన్‌మేగారి పార్లమెంటరీ యాచారమను గ్రంథము, అట్టి పుస్తకములు వారి కుపాస్యములు. ఒక క్రొత్త ప్రభుత్వనివేదిక యుద్రేకమునకు, గాలిమేడలకు, కారణమగును. ఇంగ్లండునుంచి తిరిగివచ్చు లిబరలు నాయకులు వైటుహాలులో నివసించు గొప్పవారికృత్యములను గురించి యద్భుత స్టేటుమెంటులను చేయుచుందురు. ఏలనన లిబరలులకు, రెస్పాన్సివిస్టులకునట్టి యితరవర్గములవారికి వైటుహాలు యింద్రభవనము. పూర్వకాలములో పుణ్యాత్ములగు అమెరికనులు చనిపోవునప్పుడు ప్యారిసు వెళ్లుచుండెడివారట! పుణ్యాత్ములగు లిబరలులయాత్మ లొక్కొక్కప్పుడు వైటుహాలు ఆవరణలో తిరుగుచుండవచ్చును.

నేను లిబరలునుగురించి వ్రాసితిని. కాని, యిది కాంగ్రెసులోనున్న చాలమందికిగూడ వర్తించును. మితవాదములో లిబరలులను జయించిన రెస్పాన్సిస్టుల కిది మరింత యెక్కువ వర్తించును. సామాన్య లిబరలుకు, సామాన్యకాంగ్రెసువారికి నెక్కువ వ్యత్యాసము కలదు. అయినను వారినిభేదించు రేఖ స్పష్టముగ, కచ్చితముగ లేదు. అభివృద్ధిచెందిన లిబరలులకు మితవాదియైన కాంగ్రెసువానికి భేదమంతగా లేదు. కాని, గాంధీజీధర్మమాయుని ప్రతికాంగ్రెసువానికి దేశముతో, ప్రజలతో కొంతసంబంధము కలిగెను. అతడు క్రియచేసి చూపించెను. కనుకనే యతడు శుష్కమై, దోషభూయిష్ఠమైయుండు తత్వములవలన సంభవించు కొన్ని ఫలితములను తప్పించుకొనగలిగెను. లిబరలులట్లుకాక పాతవారితోను క్రొత్తవారితోనుకూడ సంబంధముల కోల్పోయిరి. ఆ వర్గము క్షీణించిపోవు తెగయొక్క ప్రతినిధి.

మనలోచాలమంది ఛాందసభావమును పోగొట్టుకొంటిమి. కాని నూతన యాత్మదృష్టి నార్జింపలేదు "సముద్రమునుండి మైనాకుడు పుట్టెను." ఇక్ష్వాకుడెవడో దేవదుందుభిని మ్రోగించెను." అనునవి మనకు తృప్తినీయవు. "ఇసుక రేణువులో ప్రపంచమును చూచుట; అడవిపువ్వులో స్వర్గమునుచూచుట; అనంతమును కరతలామలకము చేసికొనుట; గంటలో ననంతకాలము నిముడ్చుకొనుట; ఇట్టియదృష్టవంతులు మనలో మంచుకు కానరారు.

"దేశభక్తి కాంగ్రెసువారిముల్లెకాదు" అని యాగ్రహముతో నుడువబడుచుండును. ఈవాక్యమే పదేపదే పాటక్రింద పాడుచుండుట విచారకరము. ఏ కాంగ్రెసువాది యిట్టిదురహంకారము బూనియుండడని నేను తలంచెదను అది కాంగ్రెసువారి గుత్తయని నిశ్చయముగ నేను తలంపను. కోరినవారికి దానిని బహుమతిచేయుటకు నేనెంతయో సంతసించెదను. అది మోసగాండ్రకు జీవితముకొరకు పొంచియుండువారలకు నాశ్రయమగును. అందరి యభిరుచులకు నన్ని ప్రయోజనములకు, నన్నితరగతులకు సరిపడునట్లు దానిలో ననేకరకములున్నవి. నేడు జూడాసు (గురుద్రోహి) జీవించియున్నయెడల నిస్సందేహముగ

దీనిపేర పనిచేసిడినాడు. ఈ రోజులలో దేశభక్తి చాలదు. మనకింత కంటె నుత్తమమైనది, విశాలమైనది, యుదారమైనది కావలెను

కేవల మితవాదము చాలదు. నియమము మంచిది. అది మన విజ్ఞాన ప్రమాణము కాని యానియమము వెనుక దానినిపట్టియుంచున దేదో యొకటియుండవలెను. పంచభూతములను వశపరచుకొనుట: ఇంద్రధ్వజము నారోహించుట, దవానలమును తరలుకొనివచ్చు జల ప్రవాహమును తన ప్రయోజనముకొరకు లొంగతీసుకొనుట-ఇవివిధి నిర్మితములైన మానవహక్కులు. కాని తనను దహించు రాగద్వేషము లను నియమించుట, పట్టియుంచుట యున్నిటికంటె కష్టసాధ్యమైనపని. అతడు వానిని వశపరచుకొననంతవరకు తన మానవసంపదను పూర్తిగ ననుభవింపజాలడు. కాని మనము కదలనికాళ్ళను, స్తంభించి పోయిన చేతులను నిరోధింపవలెనా?

లిబరలుమిత్రులు సర్వోత్కృష్టమగు నసిధారావ్రతమును తా మనుసరింతుమనియు, కాంగ్రెసుయొక్కయు, ప్రభుత్వము యొక్కయు నతివాదములమధ్య తాము మెళుకువగ సంచరింతుమ నియు చెప్పుదురు. వారితరులదోషములను నిరూపించు స్వయంనిర్మిత న్యాయాధికారులు ఆదోషములనుండి తాము విముక్తులైనట్లు వారే యభినందించుకొనెదరు వారు తూకము చూచుటకు యత్నింతురు. న్యాయవిగ్రహమువలె వారు కండ్లను మూసికొనెదరు. లేక నేత్ర పట్టము కట్టుకొనెదరు. "పండితోత్తములారా!......గుడ్డినేతలారా వలుసులను విరాకేరెదరు. గుమ్మడికాయలను గుభాలున దిగమ్రింగె దరు!"

డొమినియను ప్రభుత్వము - స్వాతంత్ర్యము

గత పదిహేడువత్సరముల కాంగ్రెసునీతిని నిర్ణయించినవారిలో చాలమంది మధ్యతరగతులవారు. లిబరలు కాంగ్రెసువాది యొకతరగతినుండియే వచ్చి, యొక వాతావరణములోనే వృద్ధిచెందిరి. వారి సాంఘికజీవితము, సంబంధములు, స్నేహములు ఒకమాదిరిగనే యుండెను, మొట్టమొదట వారియుభయులకు గల రెండురకముల బూర్జువాతత్త్వములలో భేదమంతగా లేదు: స్వభావమానసిక భేదములు వారిని వేరుచేయనారంభించెను. వారు వేరువేరు దిశలకు చూడనారంభించిరి. ఒకరు ప్రభుత్వమువైపు, ధనికులవైపు, మధ్యతరగతులలో పైతరహాకు చెందినవారివైపుచూడ నారంభించిరి. రెండవవారు మధ్యతరగతిలోని క్రిందితరహావారివైపు చూచిరి, వారితత్త్వమింకను నొకటిగనే యుండెను. లక్ష్యములు మారలేదు. కాని రెండవవర్గము వారి వెనుక వర్తకులనుండి తక్కువవృత్తులనుండి నిరుద్యోగులైన విద్యార్థులనుండి వచ్చినవారి సంఖ్యాబలముయొక్క యుత్సాహముండెను. వారి స్వరము మారెను ఇప్పుడందులో పూజ్యభావము, వినయవిధేయతలు లేవు. కాని తీవ్రత, చురుకుపాలు హెచ్చెను. కార్యశూరత్వము చూపుటకు తగినంతబలము లేకపోవుటచే ఘాటైన భాషద్వారా కొంత యుపశాంతి కలుగుచుండెడిది. ఈనూతన సంచలనమును చూచి భయపడి మితవాదప్రభృతులు జారిపోయి, యేకాంతమున సురక్షితముగ నుండగోరిరి. అయినను కాంగ్రెసులో చిన్నబూర్జువాలసంఖ్య యత్యధికముగనున్నను, మధ్యతరగతిలోని పైతరహావారికే గట్టిప్రాతినిధ్యముండెను. జాతీయపోరాటములో జయము చేకూరవలెనను కోరికచేతనేగాక నాపోరాటములోనొకయాంతరంగిక తృప్తినిగోరి వారందులో కురికిరి. తద్వారావారు తాముకోల్పోయిన మానధనమును, ఆత్మగౌరవమును తిరిగి సంపాదించుకొనగోరిరి: శిథిలమైన తమ యాన్యత్యమును నిలుపుకొన గోరిరి. అది మామూలు.

జాతీయావేశము. ఇది యందరకు సామాన్యమేయైనను యిచ్చటనే మితవాదికి నతివాదికిగల స్వభావజన్య భేదములు పొడసూపెను. క్రమముగ మధ్యతరగతిలోని క్రిందితరహావారు కాంగ్రెసు నాశ్రయించిరి. తరువాత కృషీవలులు పలుకుబడిని సంపాదించిరి

కాంగ్రెసు అంతకంతకు గ్రామప్రజల ప్రతినిధియైనకొలది లిబరలులకు దానికి మధ్యయంతర మధికమయ్యెను. కాంగ్రెసు దృక్పథమును గ్రహించుట లేక గుర్తించుట లిబరలుల కసాధ్యమయ్యెను. పైతరగతి చిన్న యూరుటింటిని, మట్టిగుడిసెను అర్థముచేసికొనుట తేలిక కాదు అయినను, యీభేదములున్నను, ఈ రెండు తత్వములు జాతీయములు, బూర్జువాతత్వములు. ఈ తేడా తరహాకు చెందినది కాని జాతికి చెందినదికాదు. లిబరలువర్గములో నతికులాసాగానుండ గలవారు చాలమంది కాంగ్రెసులో చివరవరకు నుండిరి.

చాలకాలము వరకు బ్రిటిషువారు హిందూదేశమును తమ గ్రామమందిరమువలె చూచిరి. వారాభవనములోని సుందర భాగముల నాక్రమించుకొనిన యజమానులు, పెద్దలు. భారతీయులు నౌకరుల హాలులోను, ఆహారపదార్థశాలలలోను వంటశాలలలోను కుములుచుందురు. సరియైనప్రతిగ్రామభవనములోను ఆ క్రింది ప్రపంచములో బట్లరు యిల్లుచక్కబెట్టునది, వంటలవాడు, డలాయతు, దాసీది, భృత్యుడు యిత్యాది-న్యూనవర్గముండును. వారిలో వరుసగ కఠినమగు న్యూనాధిక్యతలుండును. కాని యీ భవనములోని పై ప్రపంచము వారికి, క్రిందిప్రపంచమువారికి సాంఘికముగ రాజకీయముగ నభేద్యమగుగోడ యుండును. బ్రిటిషుప్రభుత్వ మీ యేర్పాటులను మనపై చొప్పించుటలో నాశ్చర్యమేమియు లేదు. కాని మనము లేక మనలో చాలమంది మనజీవితములు, విధి యీ విధముగ నేర్పాటింపబడుట సహజమని, విధాయకమని యంగీకరించుటయే యాశ్చర్యకర విషయము మనము నమ్రమమైన గ్రామ మందిర నౌకరుబుద్ధి నలవర్చుకొంటిమి. ఒకప్పుడు మన కఖండమర్యాద చూపబడును. మనకు ప్రేక్షకాగారములో నొక చిప్పెడు తేయాకు ప్రసాదింపబడును.

గౌరవముగ చూడబడుట, వ్యక్తిగతముగ పై ప్రపంచములోని గొంపోబడుట మన మహత్తరకోరిక, సైనిక విజయముకంటె రాజకీయ విజయముకంటె హిందూదేశములో బ్రిటిషు ప్రభుత్వమువారి యీ మానసికవిజయము చాల గొప్పది భానిస బానిసవలెనే యోచింప ప్రారంభించెను.

కాలముమారెను. ఇప్పుడింగ్లండులోను హిందూదేశములోను గ్రామమందిర నాగరికతమాదిరి బుద్ధిపూర్వకముగ నొప్పుకొనబడుట లేదు. కాని మనలో నింకను నౌకరులహోలుల నంటిపెట్టుకొనియుండవలెనను కోరికగలవారు, నౌకరీదుస్తులు. డలాయితు బిళ్ళలు చూచి మురియువారు, గర్వించువారు కలరు. లిబరలులవంటి యితరులా గ్రామమందిరమును మొత్తముగ నంగీకరింతురు. దాని వసితనమును, ఆ నిర్మాణమునంతను మెచ్చుకొనుచు యజమానుల స్థానములో క్రమక్రమముగ తాము ప్రవేశింపజూతురు. దీనిని వారు భ్రాంత పరముచేయుట యని పిలుతురు. పరిపాలకుల వర్గముకు మార్చుటయే వారి సమస్య హెచ్చుగ వెళ్ళినచో నూతన పాలక వర్గమును వాంఛింతురు, వారెన్నడు నూతన ప్రభుత్వ విధానమును గురించి యోచింపరు. వారికి స్వరాజ్యమనగా సమస్తముయథాప్రకారముగనే సాగుట. కొంచెము వన్నె నల్లబడినచాలును, వారు లేక వారివంటి వారు ప్రధానపాత్ర వహించునట్టియు, నున్నత యాంగ్లాధికారుల స్థానముల నాక్రమించునట్టియు భవిష్యత్తునే చూడగలరు. అదేమాదిరి యుద్యోగము, ప్రభుత్వశాఖలు, శాసన సభలు, వర్తకము, పరిశ్రమలు—తమ పదవులలోనుండు ఐ. సి. యస్, లు; అప్పుడప్పుడు తళుకు బెళుకు దుస్తులతో కాన్పించుచు, తమ ప్రజల నొప్పించుటకు సమస్తాభరణములతో మెరయుచు సౌధసీమలలోనుండు రాజకుమారులు. తమరైతులను బాధించు ప్రత్యేకాధికారములను కోరు భూఖామందులు. ధనసంచులను చేతబుచ్చుకొని జమీందారులను, రైతులనుగూడ బాధించు వడ్డీవ్యాపారస్తుడు; ఫీజుగుంజుకొను లాయరు; స్వర్గములోనుండు భగవంతుడు.

వారిదృష్టి (ప్రధానముగ) ఉన్నతస్థితిని సంరక్షించుటమీదనే యాధారపడియున్నది. వారుకోరు మార్పులన్నియు వ్యక్తిగతములైనవని చెప్పవచ్చును. ఈమార్పులను వారు బ్రిటిషువారి ప్రసాదము వలన నెమ్మదినెమ్మదిగ ముక్క-ముక్క చొప్పున సాధింపచూతురు. వారి రాజకీయములయొక్కయు, నార్థికములయొక్కయు పునాది యావత్తు బ్రిటిషుసామ్రాజ్యస్థిరత్వముమీద సాగుదలమీద నిలిచి యున్నది. ఈ సామ్రాజ్య మచంచలమని భావించి వారు దానికి సరిపెట్టుకొనెదరు. వారు దాని రాజకీయ, ఆర్థికతత్వమునే గాక దాని నైతిక ప్రమాణములకూడ నంగీకరింతురు. అవియన్నియు బ్రిటిషు అధికారమును భద్రముగ సాగించుటకే నిర్మింపబడెను.

కాంగ్రెసుదృష్టి యింతకంటె భిన్నమైనది. అది కేవలము మరియొక పరిపాలకులనుగాక నొకనూతనప్రభుత్వమునుసృష్టింపజూచుచున్నది. ఈనూతన ప్రభుత్వరూపమెట్లుండునో, సామాన్యకాంగ్రెసువారికే యెక్కువస్పష్టముకాకపోవచ్చును దానినిగురించేయభిప్రాయములు భేదింపవచ్చును. కాని వర్తమానపరిస్థితులు, పద్ధతులు నిక నెంతమాత్రము సాగకూడదు, సాగరాదు అనునది కాంగ్రెసులో సామాన్యవిషయము ప్రధానమార్పు లత్యవసరము. డొమినియను ప్రభుత్వమునకు స్వాతంత్రమునకు భేద మిచ్చటనే కలదు. మొదటిది మనలను బ్రిటిషు ఆర్థిక పద్ధతి కనేక ప్రత్యక్షా ప్రత్యక్ష పాశములచే బంధించు వెనుకటి నిర్మాణమునే సూచించును. రెండవది మనపరిస్థితులకు సరిపడు నూతన నిర్మాణమును నిర్మించుకొనుటకు మనకు స్వేచ్ఛనిచ్చును.

అనగా యింగ్లండుపట్ల యింగ్లీషుప్రజలపట్ల తిరుగులేని, రాజీలేని శత్రుత్వమని యర్థముకాదు. ఏమిసంభవించినను మరల వారితో త్రెంచుకొనవలెనను కోరికయుకాదు. ఇంత 'గ్రంథము' జరిగిన మీదట భారతదేశమునకు యింగ్లండునకు మధ్య ద్వేషభావము లుండుట సహజము. "అధికారమత్తత సన్నిహితమగు తాళము చెవిని పెడగొట్టి గొడ్డలి నుపయోగించును" అని టాగూరు వచించెను. మన

హృదయములను తెలుపు యశముచెడి చాలకాలము క్రిందటనే నాశనముచేయబడెను. గొడ్డలి మనపై తనివితీర యుపయోగింపబడినను మనము బ్రిటిషువారియెడల పక్షపాతము వహించునట్లు చేయజాలకపోయెను. మనము భారతదేశముయొక్కయు, మానవలోకముయొక్కయు విశాలధర్మమును సేవించితిమని యనుకొనుటచే మన తాత్కాలికాహంకారముచే మత్తులముకాము. ఒకవేళ మనమట్లు జారినను పదిహేనుసంవత్సరములనుండి గాంధీజీప్రసాదించిన కఠిన శిక్ష మనల నట్లు చేయనీయదు. నేను బ్రిటిషుజయిలులో కూర్చుని దీనిని వ్రాయుచున్నాను. అనేక నెలలనుండి నామనస్సు విచారగ్రస్తమైయుండెను. జయిలులో నేను మునుపెన్నడు బాధపడనట్లే యేకాంతవాసములో నెక్కువబాధపడితిని. అనేక సంభవములచే నా మనస్సు క్రోధ, రోషపూరిత మయ్యెను. అయినను నే నిచ్చట కూర్చొని నాహృదయమును, మనస్సును గంభీరముగ పరీక్షించి చూచుకొనునపుడు నాకు ఇంగ్లండు యెడల నింగ్లీషువారియెడల నెట్టి కోపము కానరాదు. నేను బ్రిటిషు సామ్రాజ్య తత్త్వమును ప్రేమింపను. దానిని భారతదేశముపై రుద్దుటకొప్పుకొనను. క్యాపిటలిష్టు పద్ధతి నాకంగీకారముకాదు. బ్రిటిషు పాలకతరగతులవారు భారతదేశమును కొల్లగొట్టువిధమును నేనెంతమాత్రము ప్రేమింపను: దానిని నేను విరసింతును. కాని దీనికి యింగ్లండు. యింగ్లీషు ప్రజలందరు బాధ్యులని నేను భావింపను. ఒకవేళ నేనట్లు భావించినను అందులో నంతవ్యత్యాస మేమియు నుండదు. ఏలనన ఒక దేశపుప్రజల నందరను గర్హించుట లేక వారిపట్ల కోపము వహించుట మూర్ఖత్వమగును. మనవలెనే వారును పరిస్థితులకు దాసులయిరి.

వ్యక్తిగతముగ నామానసికపరిణతికి నేను యింగ్లండుకెంతయో ఋణపడియుండుటచే దానికెన్నడు కేవలవ్యతిరేకముగ భావింపజాలను. నే నేదిచేసినను యింగ్లండులో పాఠశాలలలోను, కళాశాలలోను అలవర్చుకొనిన మానసికభావములను, యితరదేశములను, జీవితమును విమర్శించు ప్రమాణములను, పద్ధతులను వీడజాలను.

రాజకీయరంగము మినహా నాయభిమానమంతయు యింగ్లండుమీద యింగ్లీషుప్రజలమీద నుండును. నేను హిందూదేశములోని బ్రిటిషు పరిపాలనకు రాజీనొల్లని శత్రువునైనచో దానికి నేను కారకుడను గాను.

ఆ పరిపాలనకు, నధికారమునకు మే మధ్యంతర పెట్టెదము. దానితో బుద్ధిపూర్వకముగ రాజీపడము. ఇంగ్లీషువారితోను తదితర దేశములతోను మనకత్యంతసన్నిహితసంపర్కములుండు గాక! భారత దేశంలో మాకకలంక వాయుప్రసారము అకలంకములు, ప్రాణప్రద ములునగు భావములు, సౌభాగ్యప్రదమగు సహకారము కావలెను. మేము యుగములతో చాల బూజుపట్టినవారమైతిమి. కానియింగ్లీషు వారు వ్యాఘ్రాకారములో వచ్చునెడల మాస్నేహభావము, సహకారము నాశింపరాదు. సామ్రాజ్యతత్త్వమను వ్యాఘ్రమునకు భయంకరితను వ్యతిరేకముతప్పదు. నేడు మాదేశ మా భయానకజంతువు నెదుర్కొనవలసియున్నది ఆటవిక, క్రూర వ్యాఘ్రమునుమచ్చిక చేయుట సాధ్యముకావచ్చును. దాని సహజక్రౌర్యమును మంత్రించి వేయవచ్చును. కాని, క్యాపిటలిజము, సామ్రాజ్యతత్త్వముకలసిరొక దురదృష్ట దేశముపై కురుకునపుడు వానిని మచ్చికచేయు టసాధ్యము

తాను తన దేశమును రాజీపడరని చెప్పుట మహౌర్ఖ్యము. ఏలనన జీతి మెప్పుడు రాజీపరచులకు మనలను బలవంతపరచుచున్నది. దానిని మరియొక దేశమునకు లేక ప్రజలకు వర్తింపచేయుటలో సత్యముకలదు. అప్పుడు దానిని సాధించుటకు మానవశక్తిచాలదు. భారతస్వేచ్ఛ, బ్రిటిషు సామ్రాజ్యతత్త్వము పరస్పర విరుద్ధములు సైనిక శాసనము, ప్రపంచములోనున్న టిపిమాత్రలు వాని పరస్పర వైరుధ్యమును పోగొట్టజాలవు. దరిజేర్పజాలవు. భారతదేశమునుండి బ్రిటిషు సామ్రాజ్యతత్త్వముకు స్వస్తి చెప్పబడినప్పుడే యదార్థ హిందూ బ్రిటిషు సహకారముకు తగిన పరిస్థితు లేర్పడును.

ఆధునిక ప్రపంచములో స్వాతంత్ర్యము సంకుచిత సిద్ధాంతమని మనకు నీతులు గఱపబడుచుండును. ప్రపంచ మంతకంతకు నన్యోన్యాశ్రయమగుచున్నది. కనుక స్వాతంత్ర్యము కోరుటలో మనము

గడియారమును వెనుకకు త్రిప్పుటకు యత్నించుచున్నాము! బ్రిటనులోనున్న లిబరలులు, శాంతిని గోరువారు, సామ్యవాదులనబడు వారు ఈ వాదమునే చేయుచు సంకుచిత జాతీయతకు మనలను మందలింతురు. పరిపూర్ణ జాతీయ జీవితమునకు మార్గము "బ్రిటిషు కామన్వెల్తు" ద్వారా కలదని మనకు సూచింతురు. ఇంగ్లండులోనన్ని మార్గములు లిబరలిజము, సోషలిజము, ఫాసిజము మొదలైనవి— సామ్రాజ్యమును సంరక్షించుటకే త్రోవచూపుట విచిత్రము తాను గొల్లగొనిన ధనమును కాపాడుకొనుటకొరకు జయించినజాతి "శాంతి" "శాంతి" యను వాక్యము నుచ్చరించును. పరిపాలకజాతి తనస్థితిని సంరక్షించుకొనుటకు "జాతీయత" కంటె నుత్తమమైనదిగా సింగారించుకొనుచుండును. ఈవిధముగనే గాంధీయెదుట మాక్డొనాల్డు అంతర్జాతీయ వాదిగ కబుర్లు చెప్పెను" అని ట్రాట్స్కీ వచించెను.

రాజకీయ స్వాతంత్ర్యము వచ్చినతరువాత భారతమెట్లుండునో యేమిచేయునో నేను చెప్పజాలను. కాని జాతీయ స్వాతంత్ర్యము కోరు భారతీయు లతివిశాలమైన అంతర్జాతీయతను కూడ కోరుదురని చెప్పగలను. సామ్యవాదికి జాతీయత వర్థములేదు. కాని కాంగ్రెసు ప్రథమశ్రేణిలోనున్న యనేకమంది సామ్యవాదులుకానివారి తేరిన అంతర్జాతీయవాదులు. ప్రపంచముతో సంబంధములేని స్వాతంత్ర్యమును మేము కోరుటలేదు. ఇతరదేశములతోబాటు యదార్థమైన యంతర్జాతీయ క్రమముకొరకు మా స్వాతంత్ర్యములో నొక భాగము నిచ్చివేయుటకు మేముసంపూర్ణముగనంగీకరించుచున్నాము. ఏ సామ్రాజ్యపద్ధతియైనను, దాని కెట్టి ఘనమైన నామకరణ మిడినను, అట్టి ఆక్రమమునకు శత్రువుగాక తప్పదు. అట్టి పద్ధతిచే ప్రపంచ సహకారము లేక ప్రపంచశాంతి చేకూరజాలదు

వివిధ సామ్రాజ్యపద్ధతు లెట్లు నిరంకుశత్వమువలనను, ఆర్థిక సామ్రాజ్య పద్ధతివలనను తమకు తాము వేరగుచున్నవో ప్రపంచ సంభవములు తెలుపుచునేయున్నవి. అంతర్జాతీయాభివృద్ధికి బదులు దాని తల్లక్రిందులు మతమునే మనము చూచుచున్నాము. దీనికారణ

ములను తెలిసికొనుట ఘనకార్యము కాదు. అవి ప్రస్తుత అర్థిక క్రమ దుర్బలత్వమును సూచించును. దీని ఫలితమేమనిన విరంకుశ ప్రాంతములలో తక్కిన ప్రపంచమునుండి దానిని వేరుచేయుచున్నది. భారత దేశములో నది, ఒటావా మొదలగు తీర్మానములద్వారా, మనకితర దేశములతో గల సంబంధ బాంధవ్యముల నధికముగ తగ్గించెను. మనము మునుపటికంటె నెక్కువగ బ్రిటిషు పరిశ్రమలపై నాధారపడు టాని సలమైగిమి. అనేక విధముల యీ నీతివలన కలిగిన నష్టము నటుంచినను దీని యపకారములు సువిదితములు. ఈ విధముగ డొమినియను ప్రభుత్వము విశాల అంతర్జాతీయ సంబంధములకు బదులు ఒంటెత్తుతనమునకే మార్గము కునట్లు కాన్పించును.

అయినను భారత లిబరలు మిత్రులు ప్రపంచమును, మరింత ప్రత్యేకముగ తమ దేశమును తను బ్రిటిషు కండ్లజోళ్ళద్వారా చూచుబుద్ధి సంపాదించిరి. కాంగ్రెసు యేమి చెప్పుచున్నదో, యొద్దుల కిల్లు చెప్పుచున్నదో గ్రహింపయత్నింపకుండకనే వారు స్వాతంత్ర్యము డొమినియను ప్రభుత్వముకంటె సంకుచితము, తక్కువ యౌన్నత్య శిఖరమను పురాతన బ్రిటిషువాదమునే చిలకపలుకులవలె నప్పగింతురు. అంతర్జాతీయతయనగా వారికి నైలుపోలు. ఎలన వారికితర దేశముల విషయమై బొత్తిగా తెలియదు భావలు రాకపోవుట దీనికి కొంతకారణమైనను వారు వానిని నిర్లక్ష్యము చేయుటతో తృప్తిపొందెదరు. హిందూదేశములో వారెట్టి ప్రత్యేక చర్యను, యెట్టి తీవ్ర రాజకీయములను అంగీకరింపరు. కాని వారి నాయకులలో కొందర కట్టిపద్ధతు లితర దేశములలో నవలంబింపబడుట కెట్టియభ్యంతరము కానరాదు. వారు వానిని దూరమునుండి గుర్తింపగలరు, మెచ్చుకొనగలరు. పాశ్చాత్యదేశ యాధునిక డిక్టేటరులు కొందరు వారిచే మానసికముగ నారాధింపబడుదురు.

వేరులు సాధారణముగ పెడమార్గమును త్రొక్కుంపవచ్చును కాని మనము నూతన ప్రభుత్వమును వాంఛించుచున్నామా? లేక నూతన పాలకవర్గము మాత్రమే కోరుచున్నామా? అనునదే హిందూ

దేశ యథార్థసమస్య. లిబరలుల సమాధానము స్పష్టమే! వారికి రెండవది తప్ప మరేమియు నవసరములేదు. అది కూడ క్రమక్రమముగ సాధింపదగిన దూర లక్ష్యము. 'డొమినియను ప్రభుత్వము' అను పదములు పదేపదే వాడబడును. కాని తాత్కాలికమైన వాటి నిజవిషయము "కేంద్రములో బాధ్యత" అను నైంద్రజాలిక పదములచే వ్యక్తీకరింపబడుచున్నది. అధికారము, స్వాతంత్ర్యము, స్వేచ్ఛ, మోక్షము అను కడుపునిండుమాటలను వారు నోటినిండ నుచ్చరింపజాలరు. అవి యుపద్రవముగ ధ్వనించును. ప్రజాసమూహమునకు చప్పగనున్నను లాయరుభాష, దృష్టి వారికి నచ్చును. విశ్వాసముకొఱకు, స్వాతంత్ర్యముకొఱకు నుపద్రవముల నెదుర్కొని ప్రాణములనొడ్డిన వ్యక్తులు, వర్గములు అసంఖ్యాకములుగలవు. "కేంద్రములోని బాధ్యత" కొరకు మరియొక లీగలు పదముకు యెవడైనను బుద్ధిపూర్వకముగ నొకపూట తిండి మానుకొనుట లేక సుఖముగ నిద్రింపకుండుట సంశయాస్పదమైన విషయము.

కనుక నిదియే వారిలక్ష్యము. దీనిని వారు ప్రత్యక్ష కార్యక్రమము వలనగాక శ్రీనివాసశాస్త్రిగారు సెలవిచ్చినట్లు "పరిజ్ఞానము, అనుభవము, మితము, ఒప్పింపగలనేర్పు, ప్రశాంతమగు పలుకుబడి, యథార్థ సమర్థత"—ఇన్నింటిని ప్రదర్శించి సాధింపగోరుదురు. పభుత్వ మధికారమును మన కొప్పజెప్పినట్లు సత్ప్రవర్తన చేతను సుకర్మచేతను మనము వారిని బుజ్జగింపవలెను. అనగా మన దుడుకుతనమువలన కలిగిన కోపముచేత లేక మనశక్తిసామర్థ్యములను శంకించుటచేత లేక నీ రెండుకారణములచేత ప్రభుత్వమువారు మనల నిపుడు తిరస్కరించుచున్నారు. ఇది ప్రస్తుతస్థితియొక్కయు ఇంపీరియలిజముయొక్కయు చిత్రమయిన విమర్శ. సోపానక్రమముగ పాలకజాతుల సహకారముతో నధికారమును సంపాదింపవలెనను భావమును గురించి ప్రొఫెసరు "టానీ" యను ఇంగ్లీషురచయిత యొకయధ్యాయమును వ్రాసెను. అతడు బ్రిటిషులేబరుపార్టీనిగురించి యుదహరించెను. కాని అతని మాటలు హిందూదేశమునకు మరింత

యెక్కువగ వర్తించును. ఏలనన ఇంగ్లండులో నధమము ప్రజాస్వామిక సంస్థలైనను కలవు. అచ్చట సిద్ధాంతములో అధికసంఖ్యాకుల యిచ్ఛ మన్నింపబడగలదు. ప్రొఫెసరు టానీ యిట్లు వ్రాసెను:

"ఉల్లిపాయలను పొరపొరగా తినవచ్చును. కాని జీవించియున్న పెద్దపులిని క్రమశః చర్మము నొలుచుట సులభము కాదు. జంతువులను చంపుట దానివృత్తి అది మొదట చర్మము నొలుచును......"

"హక్కులుగల తరగతులలో నవివేకులున్న దేశమేదైన యున్నచో నది ఇంగ్లీషుదేశముకాదని నిశ్చయముగ చెప్పవచ్చును. ఒక ఆస్తియొక్క క్రియదనావేజులుగల బుద్ధిమంతుడైన లాయరు నా యాస్తినుండి తరిమివేయుటకు జోకరించు టెంతవ్యర్థమో లేబరుపార్టీ యొక్క హక్కులను కోరుటలో యుక్తి, సరసత, వారిని మోసము చేయగలవని భావించుటయు నంతవ్యర్థము. సరసవర్తనులు, మేధావులు శక్తివంతులు, ఆత్మవిశ్వాసముకలవారు, దేనికిని వెరువనివారు ధనిక ప్రభుత్వములో నుందురు. వారు తమ రొట్టె కేవైపున నేయి వ్రాయబడినదియు బాగుగ నెరుగుదురు ఆ నేయి తఱుగకుండునట్లు వారు చూచుకొనెదరు...వారి యునికికి గట్టిభయము కలిగినయెడల వారివశములోనున్న ఆర్థిక, రాజకీయ పాచికలన్నింటిని-ప్రభువులసభ, చక్రవర్తి ముద్రణాలయము, సైన్యములో నసంతృప్తి, ద్రవ్యకాటకము, అంతర్జాతీయ కష్టములు (1931లో పౌండు సమస్యమీద వార్తాపత్రికల దాడుల విశదముచేసినట్లు) ఎమిగ్రేయను వానివలె-స్వంతజేబులను రక్షించుకొనుటకు స్వదేశమునకే హానిజేయు యుక్తి కూడ వారుపయోగింతురు.

బ్రిటిషు లేబరుపార్టీ మంచిశక్తిగలసంస్థ. చందాలను చెల్లించు లక్షలకొలది సభ్యులుగల ట్రేడుయూనియనులు, మంచియభివృద్ధిలో నున్న పరపతిసంఘసంస్థలు, వృత్తులలోనున్న తరగతులలోని సభ్యులు, అభిమానులు దానికి గొప్పయండలు వయసువచ్చినవారికి వోటుహక్కుగల ప్రజాస్వామిక పార్లమెంటరీసంస్థలు పౌరసత్వము

లకు సంబంధించిన చిరచరిత్ర బ్రిటనులో కలవు. ఇన్ని సావకాశము లున్నను మందహాసముచేతను బోధనలచేతను లేబరుపార్టీవారు యదార్థాధికారమును సంపాదింపజాలరు అని టానీ చెప్పుచున్నాడు. లేబరుపార్టీవారికి కామన్సుసభలో మెజారిటీయున్నను అది యెట్టి గొప్పమార్పులను చేయజాలదు. రాజకీయ, సాంఘిక, ఆర్థిక, ద్రవ్య సంబంధ, సైనికకోటలెన్నియో తమ వశమునందున్న హక్కులుగల తరగతుల వ్యతిరేకముముందర నది నిర్వీర్యమగును. హిందూదేశ పరిస్థితులు కేవలము భిన్నములని వేరుగ చెప్పనక్కరలేదు. ఇచ్చట ప్రజాస్వామిక సంస్థలు సాంప్రదాయములు లేవు. వానికి బదులు మనకు సుస్థాపితమైన ఆర్డినెన్సుల యాచారము, డిక్టేటరు ప్రభుత్వము వ్యక్తి, వాక్కు, సభ, వ్రాత, ముద్రణాదుల స్వాతంత్ర్యము నణచి వేయుట యిత్యాదులు కలవు. లిబరలుల వెనుకగూడ నెట్టి బలియమైన కట్టడములేదు. వారు తమ మందహాసములమీదనే యాధార పడవలెను.

లిబరలులు 'అశాస్త్రీయము' లేక 'న్యాయవిరుద్ధము' నగు నే చర్యకైనను శుద్ధవ్యతిరేకులు. ప్రజాస్వామిక చట్టములుగల దేశము లలో 'చట్టసంబంధమైన' యను పదమునకు విశాలమైన యర్థము కలదు. అది న్యాయములను నియమించును. స్వేచ్ఛలను రక్షించును. అది కార్యనిర్వాహకుల నదుపులోనుంచును అది రాజకీయ, ఆర్థిక నిర్మాణములో మార్పులను చేయుటకు ప్రజాస్వామిక పద్ధతులను కల్పించును. కాని హిందూదేశములో నట్టి చట్టమేదియు లేదు. ఆ పదమున కట్టియర్థములేదు. దాని నిచ్చట నుపయోగించుట హిందూ దేశములో స్థానములేని యొక భావమును ప్రవేశపెట్టుటయగును. 'శాస్త్రీయమైన' యను పద మిచ్చట కార్యనిర్వాహకుల నిరంకుశ చర్యలను ననుసరించుటకే వినియోగింపబడునని చెప్పుట వింతగ నుండును. లేక అది 'లీగల్' అను నర్థములో నుపయోగింపబడును. 'లీగల్' లేక 'ఇల్లీగల్' అను పదములనే మనము వాడుటయుక్తము.

ఒక నూతనఆర్డినెన్సు లేక నూతన "లా" నూతన నేరములను సృష్టించును. ఒక బహిరంగసభకుపోవుట నేరము కావచ్చును. అద్దె సైకిలుమీదపోవుట, ఒకరకపుదుస్తులను ధరించుట, సాయంకాలమగు సరికింటనుండకపోవుట, ప్రతిదినము పోలీసుకు తననుగురించినివేదించు కొనకపోవుట ఇవన్నియు మరియనేక చర్యలు—నేడుహిందూదేశములో నేభాగముననో యొకచోట నేరములగుచున్నవి. ఒక చర్య దేశములో నొకభాగములో నేరముకావచ్చును. మరియొక భాగములో నేరము కాకపోవచ్చును. బాధ్యతలేని ప్రభుత్వము క్షణములో నిట్టి న్యాయములను సృష్టింపగలుగునపుడు 'లీగల్' అనుపదమున కా కార్యనిర్వాహకుల యిచ్ఛయనియే యర్థము దానికి వేరుయర్థముండజాలదు సాధారణముగ ఆ యిచ్ఛకు తలయొగ్గబడుచున్నది. ఏలననవిధేయత వలన కలుగుఫలితములు సుఖదాయకములుకావు. కాని దానినెల్లప్పుడు శిరసావహింతునని చెప్పుట బాధ్యతలేని ప్రభుత్వమునకు, లేక నిరంకుశత్వమునకు తుచ్ఛమైన దాస్యమగును. అది యాత్మను చంపుకొనుట. తన కార్యములపట్ల నిక నెన్నటికి స్వేచ్ఛను సంపాదింపజాలకపోవుట యగును.

తమవశములోనున్న చట్టమును యంత్రములద్వారా మామూలు పద్ధతిలో గొప్పఆర్థిక మార్పులు సాధ్యమగునా? యను వాద మిపుడు ప్రతి ప్రజాస్వామిక ప్రభుత్వములో జరుగుచున్నది. ఇది యసాధ్యమని చాలమంది తమయభిప్రాయములను వెల్లడించి యేదోయొక యసామాన్య విప్లవపద్ధతి యవలంబింపబడవలెననిరి. భారతదేశములో మన కీవాదములోనున్న విషయము ప్రధానముకాదు. ఏలనన మనకు కావలసిన మార్పులను తెలిసికొనుటకు మన కెట్టి చట్టసంబంధమైన సాధనములు లేవు. శ్వేతపత్రము యట్టిదే. మరియొకటి శాసనమైనచో ననేకవిధములగు చట్టసంబంధమైన యభివృద్ధి పూర్తిగానిలిచిపోవును. విప్లవము లేక న్యాయవిరుద్ధకార్యములప్ప దీనికి వేరుమార్గము లేదు. కనుక మన మేమి చేయవలెను? మార్పుసంగతి యెంతమాత్రము తలపెట్టక మనవిధికి నమస్కరింపవలెనా?

నేడు భారతదేశస్థితి మరింత యసాధారణముగ నున్నది. కార్యనిర్వాహకు లన్ని బహిరంగకృషులను ఆపగలరు. నియమింపగలరు. ఆపుచున్నారు. నియమించుచున్నారు. తమయభిప్రాయములో తమ కుపద్రవకరమైన ప్రతిచర్యను వారు నిషేధింతురు. ఈవిధముగ నుపయోగకరమైన ప్రజాహితకృషియంతయు (గతమూడువత్సరములలో వలె) నాపివేయబడగలదు. దీనికి లొంగుటయనగా ప్రజాహితకార్యములన్నింటిని మానుకొనుటయని యర్థము. ఇది యసాధ్యమైనస్థితి. ఎల్లప్పుడు "చట్టము" ప్రకారము నడచెదనని యెవరునుచెప్పజాలరు. ప్రజాస్వామిక ప్రభుత్వములోకూడ తద్వ్యతిరేకముగ నుండవలెనని యంతరాత్మచే నిర్బంధింపబడు సమయముగలుగవచ్చును. నిరంకుశముగ లేక యథేచ్ఛగ పరిపాలింపబడు దేశములో నట్టియవకాశములతితరచుగకలుగుట తప్పదు. నిశ్చయముగ నట్టిదేశములో 'న్యాయముకు' నైతిక బలమేమియు నుండజాలదు.

"ప్రత్యక్షకార్యము నిరంకుశత్వమునకు సంబంధించినది కాని, ప్రజాస్వామికమునకు సంబంధించినదికాదు. ప్రజాస్వామికమునకు విజయము చేకూర్చనుత్సహించువారు ప్రత్యక్షకార్యమును వీడవలెను" అని లిబరలులు చెప్పుదురు. ఇది భ్రమజనితము. ఈరచనసందిగ్ధరచన. ఒకొక్కప్పుడు ప్రత్యక్షకార్యము - కూలీలసమ్మె - న్యాయబద్ధము కూడ కావచ్చును. కాని, బహుశః రాజకీయకార్యమని వారి భావము కాబోలును! నేడు జర్మనీలో హిట్లరుహయాముక్రింద నట్టి విధమగుచర్య సాధ్యమగునా? తుచ్ఛమైన విధేయత లేక న్యాయ విరుద్ధమైన విప్లవచర్య అచ్చట ప్రజాస్వామ్యమును సేవించునెట్లు?

భారతలిబరలులు, తఱచు ప్రజాస్వామికమును స్మరించుచుందురు. కాని, వారిలో చాలమందికి దానిదరికి జేరవలెనను కోరిక లేదు. లిబరలు నాయకులలోనతిముఖ్యులలో నొకడైన సర్ పి. యస్. శివస్వామిఅయ్యరు 1934 మే నెలలో నిట్లుచెప్పెను "కాన్‌స్టిట్యూయంటు అసెంబ్లీసమావేశము జరుగవలెనని వాదించుటలో కాంగ్రెసు ప్రజాసమూహ పరిజ్ఞానముమీద నెక్కువ విశ్వాసముంచుచున్నది

వివిధరౌండుటేబులు సభలలో పాత్రవహించిన వారి శక్తిసామర్థ్య ములపట్ల నిజాయితీపట్ల న్యాయమును చూపలేదు. కాన్‌స్టిట్యూ యంటు అసెంబ్లీ యంతకంటె నెక్కువచేయునని నే ననుకొనను కనుక సర్ శివస్వామిగారి ప్రజాస్వామికభావము 'ప్రజాసమూహ మునకు దూరవిషయము. అది బ్రిటిషుప్రభుత్వముచే పేర్కొనబడిన 'నిజాయితీ' సమర్థతగల వ్యక్తులగుంపు కెక్కువ సరిపడును. మరియు నతడు శ్వేతపత్రము నాశీర్వదించెను. దానితో "పూర్తిగ తృప్తి పడకపోయినను దేశము దానిని సంపూర్ణముగ తిరస్కరించుట తెలివి తక్కువ యని యతడు భావించెను. బ్రిటిషుప్రభుత్వమునకు సర్ సి యస్ శివస్వామిఅయ్యరుకు మధ్య సంపూర్ణసహకార మేల యుండకూడదో కారణము కానరాకున్నది.

కాంగ్రెసు శాసనోల్లంఘమును విరమించెను. లిబరలులు సహజముగ దీని నామోదింతురు. ఈ "వివేకహీనము, దుర్బుద్ధి ప్రేరితమగుయుద్యమమునకు" దూరముగనుండగల తమ బుద్ధివిశేషము నకు వా రానందించుకొనుట యాశ్చర్యముకాదు. మే మట్లు "చెప్పి యుండలేదా" అని వారడిగిరి. అది చిత్రమైనవాదము. మనము తీవ్రపోరాటము సల్పినపుడు పడగొట్టబడితిమి. కనుక పోరాడుటే చెడ్డయట. ప్రాకుట సర్వోత్తమము. భద్రతమమైనది. ఆ సాష్టాంగ స్థితినుండి పడగొట్టబడుట, పడుట యసంభవము.

భారతదేశములో బ్రిటిషుపరిపాలకుల చరిత్రయెట్టిది? భారతీయుడుగాని, ఆంగ్లేయుడుగాని దీనిగురించి నిష్పక్షపాత దృష్టికలిగి యుండుట సాధ్యమని నే ననుకొనను. ఇది సాధ్యమేయైనను ఆధ్యాత్మికాది భౌతికాంశములను తూచుట కొలుచుట మరింత కష్టసాధ్యమైనది బ్రిటిషుపరిపాలన "భారతదేశము శతాబ్దములుగా నెరుగని దానిని, ఆ ఖండములో నే భాగమందు తన యధికారమును ప్రశ్నింపని యొక ప్రభుత్వము ప్రసాదించెను" అని మనకు చెప్పుదురు. * అది "చట్ట" సంబంధమైన పరిపాలనను స్థాపించెను. యుక్తము, సమర్థమునగు ప్రభుత్వమును ప్రసాదించెను. అది భారతదేశమునకు పాశ్చాత్య పార్లమెంటరీ ప్రభుత్వమును, వ్యక్తిస్వేచ్ఛను తెచ్చి పెట్టెను. "బ్రిటిషు ఇండియాను యేకైక ప్రభుత్వముగమార్చివేయుటచే నది భారతీయులలో రాజకీయ యైక్యత యనుభావమును కలుగజేసి" యీ విధముగ జాతీయతయొక్క ప్రథమావస్థను దోహదము చేసెను ఇది బ్రిటిషువారి వాదము. "చట్ట" పరిపాలన, వ్యక్తిస్వేచ్ఛ అనునవి చాల వత్సరములనుండి కానరాకున్నను యిందులో చాల సత్యము కలదు.

ఈ కాలమునుగురించిన భారతీయులపరిశోధన అనేకయితరాంశములకు ప్రాధాన్యత నిచ్చుచు విదేశప్రభుత్వముకలుగజేసిన భౌతికయాధ్యాత్మికాపకారములను సూచించును. ఉభయుల దృష్టులలోను భేదమెంతయోకలదు. బ్రిటిషువారిచే పొగడబడునది యొక్కొక్కపుడు భారతీయులచే గర్హింపబడును. డాక్టరు ఆనందకుమారస్వామి వ్రాయునట్లు "భారతప్రజలపై గావింపబడిన మహోపచార

* ఈ యుదాహరణవాక్యములు భారతచట్టముల సంస్కరణములకు(1934) సంబంధించిన జాయింటు పార్లమెంటరీ కమిటీ రిపోర్టులోనివి.

ములో బ్రిటిషువ్యక్తి తప్పుచేసినయెడల నది వానిదికాని యావద్భారతిది కాదు. కాని, భారతదేశములోని యాంగ్లపరిపాలననుగురించిన విమర్శకగ్రంథములు, అంశములు విప్లవప్రయోజనము తలిగించి, మన జాతీయతకు రాజకీయఆర్థికపునాదులను ప్రసాదించెను. దాదాభాయి నౌరోజీయొక్క 'దారిద్ర్యము, భారతదేశములో బ్రిటిష్‌వ్యతిరేకపరిపాలన', రమేశచంద్రదత్తు, విలియండిగ్బీ తదితరులు-వ్రాసిన పుస్తకములు-మనజాతీయభావాభివృద్ధిలో గొప్పపరివర్తనము కలిగించెను. ప్రాచీనభారతచరిత్రయొక్క మరికొన్ని పరిశోధనలు ప్రాచీనకాలము నాటి జ్ఞానవిజ్ఞాన యుగములను బహిర్గతమొనరించెను. వీనిని మనము విశేషాదరముతో చదివితిమి. హిందూదేశ బ్రిటిషుచరిత్ర వారి హిస్టరీపుస్తకములలో వ్రాసినదానికంటె భిన్నమైనదను విషయము గూడ మనము కనుగొంటిమి.

బ్రిటిషువారు చెప్పు చారిత్రక, ఆర్థిక పరిపాలక కథలకు మన సహాలు హెచ్చుచుండెను. అయినను మనమింకను వారి యావరణలోనే పనిసాగించుచుంటిమి. శతాబ్దాంతమగుసరికి భారతజాతీయత యీ స్థితిలో నుండెను.

పందొమ్మిదవ శతాబ్ది భారతవిద్యాధికులు బ్రిటిషు తత్త్వమునకు విధేయులగుటలో నాశ్చర్యము లేదు. ఇరువదియవ శతాబ్దములో జరిగిన కల్లోలానంతరముకూడ కొంతమంది యీ భ్రమచే బాధపడుచుండుట యాశ్చర్యము. పందొమ్మిదవ శతాబ్దములో బ్రిటిషుపాలకజాతు లైశ్వర్య, విజయాధికారములతో నెగడి ప్రపంచనిరంకుశులైరి. ఈచిరచరిత్ర, శిక్ష, నిరంకుశత్వములోని కొన్ని గుణావగుణములను వారికి ప్రసాదించెను. గత నూటడెబ్బదియైదుసంవత్సరములలోనున్నత స్థితికి రాగలుగుటకు తగిన సాధనములను, శిక్షణను మనకు సంపూర్ణముగ ప్రసాదించితిమని వారు సంతోషించుకొనవచ్చును. వారు - అనేక దేశములు, జాతులు తలంచినట్లే భగవంతుని పెద్దకొడుకులమని తమసామ్రాజ్యము భూతలస్వర్గమని భావించనారంభించిరి. వారి ప్రత్యేకస్థితి గుర్తింపబడి, వారి యాధిక్యత శంకింపబడకుండిన యెడల,

వారి కపకారము జరుగనంతవరకు, వారుదారులు, నమ్రులు. కాని వారి నెదిరించుటయన వారిదృష్టిలో దివ్యక్రమము నెదిరించుటయే! కనుక నది మహాపాపము: దానిని పాతిపెట్టవలెను.

తదితర ప్రపంచమునుగురించికూడ బ్రిటిషువారి సామాన్య దృష్టి యిదియేయైనపుడు హిందూదేశములో నిది మరింత ప్రస్ఫుటించెను. బ్రిటిష్‌వారు హిందూదేశ సమస్యను వీక్షించు దృష్టిలో మోహ మేదియో కలదు. సదా ధర్మపథముననే యుందమను చల్లని యభయము. మహాభారమును న్యాయముగ వహించితిమనుమాటలు తమజాతి ధర్మమందు తమ సామ్రాజముద్రయందు విశ్వాసము. తమ విశ్వాసపునాదులను సవాలుచేసిన యవిశ్వాసకులయెడల, పాపుల యెడల ద్వేష, క్రోధముగల దృష్టిలో మత స్వభావమేదియో యుండెను. పాపులను రక్షించిన వెనుకటి "ఇంక్విజిటరు"ల వలె మనకోరిక లేకుండగనె వారు మనలను రక్షింప బూనుకొనిరి. ఈ పాపరక్షణ పుణ్యావర్తకములో వారయాచిత లాభములను పొందిరి. దేశమును సామ్రాజ్యప్రణాళికకు సరిపడునట్లు నడుపుట బ్రిటిషు ముద్రప్రకారము కొంతమంది పురుషులను తయారుచేయుట భారతాభివృద్ధియని పిలువబడెను. మనము బ్రిటిషు లక్ష్యములను, భావములను యెంతయెక్కువగ నంగీకరించిన నంతయెక్కువగ "స్వీయప్రభుత్వము"నకు తగియుందుము స్వేచ్ఛను బ్రిటిషువారికోరికల ప్రకారమే యుపయోగించెదమని ప్రదర్శించి యట్లు భీమాయిచ్చిన వెంటనే స్వేచ్ఛ మనదియగును: మనకీయబడును.

భారతదేశ బ్రిటిషు పరిపాలన చరిత్రనుగురించి భారతీయులకు నాంగ్లేయులకు భేదాభిప్రాయములుండును. అది బహుశః సహజము. కాని యున్నతి ప్రభుత్వాధికారులు: భారత దేశం సెక్రటరీలుసహా, విపరీతచిత్రములను చిత్రించి యదార్థములమీద నాధారపడిన స్టేటుమెంటులను చేయుచుండుట చోద్యము. కొంతమంది నిపుణులు, యితరులుతప్ప యింగ్లీషుప్రజలు భారతదేశము నావంతయు నెరుగకపోవుట యసాధారణవిషయము. సామాన్యవిషయములే వారికి మర

గైనయెడల భారతాత్మ వారికెంతదూరములో నుండునో వేరుగ చెప్పవలెనా? వా రామె శరీరమును తమ యధీనములో నుంచుకొనిరి. కాని యది బలాత్కారకర్మ. వా రామెను తెలిసికొనలేరు తెలిసికొనుటకు ప్రయత్నించలేదు. వా రెన్నడు నామె కండ్లకేసి చూడలేదు. ఏలనన వారికండ్లు విముఖముగనుండెను. అవమానము చేత, సిగ్గుచేత నామెకండ్లు అవనతమయ్యెను. శతాబ్దముల సంపర్కానంతరము వారు పరస్పర ద్వేషపూరిత దృక్కులతో నొకరినొకరు చూచుకొనెదరు.

భారతదేశము గర్భదారిద్ర్యముచేత నవమానముచేత కృంగుచున్నను ఆమెలో నొకవింతయుదారత, యుత్కృష్టకళలు, ప్రాచీన సాంప్రదాయములు, ప్రస్తుత దుఃఖములు నామె కెంతభారముగ నున్నను, కనురెప్ప లలసటచే నెంత మూతలువడుచున్నను ఆమెలో "శ్రోత్రభావములచేతను, వింతకళలచేతను, మనోజ్ఞ రాగములచేతను అంతరంగమునుండి శరీరోపరిభాగమునకు ప్రస్ఫుటించు శోభకలదు." భిన్నాభిన్నమైన యామె శరీరబాహ్యాంతరములలో మునమింకను నొక మహాత్మాభిమానము చూడగలము. ఆమె యనేక యుగ ప్రస్థానములగావించి, పరిజ్ఞానమును సంపాదించెను. విదేశస్థులతోవర్తకము చేసి వారిని తన విశాలకుటుంబములో కలుపుకొనెను. మహాదైర్యము, దౌర్భాగ్యము ననుభవించెను అవమానములను, భయంకర దుఃఖములను భరించెను అనేక వింతదృశ్యములను చవిచూచెను. కాని ఈ మహాప్రస్థానమంతట తన యనాది విజ్ఞానము నాశ్లేషించి యుండెను. దానినుండి శక్తిని, వీర్యమును లాగుకొని దాని నితరదేశములకు యథేచ్ఛగ పంచిపెట్టెను. తూగుటుయ్యాలవలె నామె నిమ్నోన్నతములలో నూగెను. తపనిశేష భావనాశక్తి సాహసములచే స్వర్గమునుచేరి, వాని రహస్యములను బయటపెట్ట సాహసించెను; నరకకూపముయొక్క యసహ్యానుభవములనుకూడ నామె యనుభవించెను. దుఃఖప్రదములగు పిచ్చి నమ్మకములు, శృంగదీయ దురాచారములుపెరిగి యామెను కూలద్రోసినను బాహ్యితకభాస్కరోదయ

మగునాడు మహా మేధావులగు తన ముద్దుబిడ్డ లుపనిషత్తులతో ప్రసాదించిన ప్రబోధము నామె యెన్నడు పూర్తిగా విస్మరించియుండలేదు. ఎన్నడును విశ్రాంతినెరుగక సెల్లప్పుడు యత్నించుచు, పరిశోధించుచుండు నిశితములగు వారి మనస్సులు శుష్కసిద్ధాంతముల వెనుక శరణుపొందలేదు. జీవరహితములగురూపములను, కర్మకాండాదులను నిత్యానుష్ఠానము చేయుటయందు వారు తృప్తులు కాలేదు వారు వర్తమాన దుఃఖములనుండివ్యక్తిగత శాంతి కోరలేదు. రాబోవు స్వర్గములో స్థానమును కోరలేదు. వారు తేజస్సును, జ్ఞానమునుకోరిరి "అసత్తునుండి నన్ను సత్తునకు గొంపొమ్ము; అంధకారమునుండి వెలుతురుకు గొంపొమ్ము; మృత్యువునుండి నన్ను యమరత్వమునకు గొంపొమ్ము" * నేడుకూడ లక్షలకొలది ప్రజలచే నిత్యము జపింపబడు "గాయత్రి మంత్రములో "జ్ఞానము" "వెలుతురు" ఆహ్వానింపబడుచున్నవి.

రాజకీయముగ తఱచు విచ్ఛిన్నమగుచున్నను భారతాత్మ యెల్లపుడు నొక సామాన్య పైతృకధనమును సంరక్షించుచుండెను. ఆమెయొక్క భిన్నత్వములో నద్భుతమగుయేకత్వముండెడిది. ప్రాచీన దేశములన్నిటిలోవలెనే యిచ్చటను మంచిచెడ్డలు రెండును కలవు. కాని మంచి కప్పివేయబడుటచే దాని కొఱకు వెతకవలసియుండెను. చెడ్డవాసనకు దాపరికము లేదు నిర్దయాత్ముడగు భ్రాంత చండభాస్కరుడు దానిని బహిర్గత మొనర్చుచుండెను.

హిందూదేశమునకు యిటలీకి కొంత పోలికగలదు. రెండును చిర విజ్ఞాన సాంప్రదాయముగల ప్రాచీన దేశములు. హిందూదేశముతో పోల్చినపుడు ఇటలీ నవీనమైనది హిందూదేశము దానికంటె నతి విశాలమైనది రాజకీయముగ రెండును ముక్కలక్రిందచీల్చబడెను. అయినను హిందూదేశములోవలెనే ఇటాలియా యను భావమెన్నడు నశించిపోలేదు. ఆ భిన్నత్వములో నేకత్వము ప్రధానముగ నుండెడిది. ఇటలీలోని యేకత్వము చాలవరకు రోమునగరమునకుసంబంధించినది.

* బృహదారణ్యకోపనిషత్తు 1. 3. 27.

ఆ మహాపట్టణము దేశమునంతను పాలించెను. అది ఐకమత్యమునకు మూలము, చిహ్నమునైయుండెను. కాశీ హిందూదేశమునకే గాక ప్రాచ్య ఆసియాకుకూడ ప్రాచ్య అమరనగరమని పిలువబడినను హిందూదేశములో నట్టి యేకైక కేంద్ర మేదియును లేదు. కాశీ సామ్రాజ్యములో గాని భౌతికాధికార స్థాపనలో గాని యెన్నడు జోక్యము కలిగించుకొనలేదు. భారత విజ్ఞానము భారతదేశమంతట విరివిగ వెదజల్లబడుటచే దేశములో నేభాగమునుఅవిజ్ఞానకేంద్రమని చెప్పుటకు వీలులేదు. కన్యాకుమారి మొదలు హిమాలయములలోని అమర్‌నాథ్ బదరీనాథ్‌లవరకు, ద్వారకావతి మొదలు జగన్నాధము వరకు నొకేభావములు ప్రవహించెను. ఒకచోట భావసంఘర్షణ కలిగినచో దానిధ్వని దేశములోనున్న మూలమూలకు చేరెడిది.

ఇటలీ పశ్చిమయూరపు ఖండమునకు మత విజ్ఞానములను ప్రసాదించినట్లే భారతదేశము ప్రాచ్యఆసియాకు ప్రసాదించెను. రాజకీయముగ ఇటలీ సాగలబడి యున్నప్పుడుకూడ నామె జీవితము యూరపునాళములగుండ ప్రవహించుచుండెను.

మెటర్నిక్ అనునతడు ఇటలీని "భూగోళములో నొక ప్రత్యేక భాగము" అని వచించెను. మెటర్నికులు కాబోవువారు చాలమంది యీపదమును భారతదేశమునకు గూడ నుపయోగించిరి. చిత్రముగ భూగోళస్థితినిబట్టికూడ రెండు ఖండములలోను వాటిస్థితిలో పోలిక కలదు. ఇంగ్లండును ఆస్ట్రియాతో పోల్చుట గమనింపదగిన విషయము. ఏలనన నిరువదియవశతాబ్దములోనున్న యింగ్లండు పందొమ్మిదవ శతాబ్దమునాటి ఆస్ట్రియాతో పోల్చబడెను. ఆస్ట్రియా యప్పుడింకను గర్వము పొగరుబోతుతనము గొప్పతనములతో విరవీగుచుండెను; కాని దానికి శక్తిని ప్రసాదించిన వ్రేళ్ళు నశించుచుండెను. వినాశము ఆ మహావృక్షమును దొలుచుచుండెను.

తన దేశమును మానవరూపములో వర్ణించు స్వభావము నాపుకొనజాలకుండుట చిత్రము. బాల్యసంబంధములు, ఆచారబలము చాలగట్టివి. భారతదేశము "భారతమాత" అందమైనస్త్రీ; అతివృద్ధ

కాలైనను, ఆకారములో నెవ్వాడు యౌవనవంతురాలు, విచారభరిత నేత్ర. అసహాయురాలు. విద్వేశస్తులచేత, పరాయివారిచేత క్రూరముగ చూడబడుచు తనను రక్షింపరమ్మని తల్లి బిడ్డల నాక్రోశించుచున్నది. ఇట్టి చిత్రములక్షలకొలది జనులయుద్రేకములను రగుల్కొలిపి వారిని కార్యోత్సాహులను, త్యాగులనుచేయును. అయినను భారతదేశము ప్రధానముగ బక్కపేగులు, బీదరయితు, బిక్కమొగములు, కూలిజనము, చూచుటకందచందములు లేనివారు. ఏలనన దారిద్రములో నందములేదు. మనము కలలనుగను యందమైన స్త్రీ, కట్టుగుడ్డలేక తిన తిండిలేక నడుములు వంగిపోయి పొలములలోను, ఫ్యాక్టరీలలోను పని చేయువారి ప్రతినిధియేనా ? లేక యుగముల నుండి ప్రజలను నలపి, వారిని కొల్లగొని వారిపై క్రూరమగు నాచారములను రుద్ది వారిలోచాలమంది నస్పృశ్యులను చేసిన స్వల్పవర్గము వారి ప్రతినిధియా? మనము మన యూహలచే సృష్టింపబడిన వానితో సత్యమును కప్పివేయయత్నించి దానినుండియూహాప్రపంచమునకు పారిపోవ జూతుము.

వివిధతరగతులు, పరస్పర పోరాటములు నున్నను భారతదేశములో వీరి నందరిని నైక్యముచేసిన సామాన్యబంధ మొకటి యుండెను. దానిజిగి, పట్టుదల, దేనికైనను నిలువగలశక్తి యాశ్చర్యము. ఈశక్తికి కారణమేమి? ఇది కేవలము జడత్వ సాంప్రదాయముల యుదాసీనతవలన కలుగు శక్తిసామర్థ్యమా ? ఇదియొక క్రియారూపముగల, రక్షణశక్తిగల సూత్రము. ఇది బలీయమైన బాహ్యశక్తులను జయప్రదముగ నెదిర్చెను. దాని నెదిర్కొన బయలుదేరిన దేశములోని శక్తులను తనలో నిముడ్చుకొనెను. ఎంతశక్తికలదియైనను యిది రాజకీయ స్వాతంత్రమును కాపాడజాలకపోయెను. రాజకీయ మైక్యతను సాధింప యత్నింపజాలకపోయెను. ఈ రెండును కష్టింపదగినంత యోగ్యములుగావని తలంపబడెను; వీని ప్రాముఖ్యత యత్యావివేకముగ నిర్లక్ష్యముచేయబడెను. దీనికే మనము బాధపడితిమి. చరిత్రయందంతట ప్రాచీనభారతలక్ష్యము రాజకీయ, సైనిక

విజయమును కీర్తింపలేదు; అది ద్రవ్యమును, ధనార్జన వృత్తులలోని వారిని నీచముగ చూచెను. ఐశ్వర్యము గౌరవము దాంపత్యము వహింపలేదు! సంఘమునకు ద్రవ్యరూపములో సేవచేసినవారికి గౌరవము కలదనిరి.

ప్రాచీన విజ్ఞాన మనేక భయంకర ఝంఝామారుతములను, తుపానులను దాటగలిగెను. కాని యది దాని బాహ్యరూపమును సంరక్షించుకొనినను దాని నిజసారము కోల్పోయెను. నేడది మరి యొక సర్వశక్తివంతమైన నూతనశత్రువును పాశ్చాత్య 'బలియా' విజ్ఞానమును వహానముగను, నిస్పృహతోను పోరుచున్నది. అదియీ నూతనదాడికిలొంగిపోవును ఏలనన పాశ్చాత్యవిజ్ఞానమును శాస్త్రి మును తెచ్చును. శాస్త్రివిన్నాతుకుమైన లక్షల కాహారమునిచ్చును కాని పశ్చిమదేశములు యీ గొంతుకను పినుకువిజ్ఞానములోనున్న దోషముల కొక చింతామణిని కూడ-వాయ్యకావదసూత్రములు, పరపతి సూత్రములు అందరిశ్రేయస్సుకొరకు సంఘసేవచేయుట-ప్రసాదించును ఇది ప్రాచీన బ్రాహ్మణసేవాలక్ష్యమున కంతదూరము కాదు. కాని యిది అన్నితరగతులను. వర్గములను బ్రాహ్మణులను జేసి తరగతులలోని భేదములను రద్దుచేయును. భారతదేశము తన నూతన దుస్తులను ధరించినపుడీ మాదిరిలో తయారుచేయించుకొన వలసియుండును. ఇది ప్రస్తుతపరిస్థితులకు నామె ప్రాచీన భావమునకు సరిపోవును. ఈమె స్వీకరించు భావము లా దేశగంధమును కలిగి యుండవలెను

భారతము - ప్రాచీనము, నవీనము

భారతజాతీయత పరప్రభుత్వమునోర్వలేకపోవుట సహజము, విధాయకము. అయినను పందొమ్మిదవ శతాబ్దాంతమువరకు మన విద్యాధికులలో నధిక సంఖ్యాకులు బ్రిటిషుసామ్రాజ్యలక్ష్యమును బుద్ధిపూర్వకముగ లేక నబుద్ధిపూర్వకముగ నంగీకరించుట చోద్యము. దీనిమీాద వారు తమస్వంతవాదనలను నిర్మించుకొని దానిబాహ్య చిహ్నములను మాత్రమే విమర్శింపసాహసించెడివారు. పాఠశాలలలోను, కళాశాలలలోను బోధింపబడెడిచరిత్ర, ఆర్థికశాస్త్రము, తదితరవిషయములు_అన్నియు పూర్తిగ బ్రిటిషుసామ్రాజ్యదృష్టితోనే వ్రాయబడెను. అవి మనయనేకభూత, వర్తమానదోషములను,బ్రిటిషువారిసుగుణములను. ఉత్కృష్టతను చాటుచుండెను. కొంతవరకు మనమీాయవకతవక కధనమును స్వీకరించితిమి. మనము సహజముగ దానిని తిరస్కరించినపుడుగూడ మనపై దానికెక్కువ పలుకుబడి యుండెడిది మొట్టమొదట మనము దానినుండి మానసికముగ తప్పించుకొనలేకపోతిమి. ఏలనన మనకితరవిషయములు, వాదనలు తెలియవు కనుక మనము మతసంబంధమైన జాతీయతయందు శరణుజొచ్చితిమి. అధమము మన వేదాంతములలో మన మే యితరప్రజలకు తీసిపోవువారము కామను భావమునందు శరణుజొచ్చితిమి. పాశ్చాత్యుల బాహ్యాడంబరములు, తళుకుబెళుకులు మనకులేకపోయినను అంతకంటె నమూల్యము, యోగ్యము నగు నాంతరంగిక తత్వమును కలిగియున్నారమని మనదౌర్భాగ్యమందు, అధఃపతనమునందు ఓదార్పు పొందెడివారము.

మన భూతవర్తమాన పరిస్థితులనుగురించి బ్రిటిషువారుచేసిన స్టేటుమెంటులను క్రమముగ సందేహింపనారంభించితిమి. కాని మనమింకను బ్రిటిషుతత్వమను పంజరమునుండియే భావించుచు పనిచేసితిమి. చెడ్డయంతయు 'బ్రిటిషేతరము' అనెడివారము. హిందూదేశ

ముల కాశీర్వచనములవంటి బాహ్యాకారములుండుట భారతదేశ బ్రిటిషుపరిపాలనయొక్క ప్రధానలక్షణము."

యదార్థమునకు భారతదేశములో గత నూటయేబది వత్సరములనుండి జరుగుచుండినమార్పులు ప్రాచ్యపాశ్చాత్యములలో సమానముగ జరిగిన ప్రపంచమార్పులు. పశ్చిమ యూరపులోను, ప్రపంచమంతట నభివృద్ధియైన 'ఇండస్ట్రియలిజము' యంత్రాభివృద్ధి దానితో జాతీయతను, శక్తిగల కేంద్రప్రభుత్వపద్ధతిని సర్వత్ర తెచ్చి పెట్టెను. బ్రిటిషువారు భారత కవాటమును పశ్చిమాభిముఖముగ తెరచి యూరపు పాశ్చాత్య యంత్రములను, శాస్త్రమును ప్రసాదించినందుల కభివందనీయులు. కాని వారట్లుచేసి దేశపారిశ్రామిక పురోభివృద్ధిని నులిమివేసిరి. భారతదేశ మిదివరకే పశ్చిమాసియా విజ్ఞానమైన యిస్లాముయొక్కయు, ప్రాచ్యమునకంతకు వ్యాపించిన ప్రాచ్యవిజ్ఞానముయొక్కయు సంగమస్థానమయ్యెను. ఇప్పుడింకను పశ్చిమమునుండి మరింత శక్తివంతమైన మూడవ వచ్చెను. భారత దేశము వివిధ ప్రాచీన నవీనభావముల సమరరంగము, కేంద్రస్థానము, ఈ మూడవశక్తిజయించి భారతదేశ ప్రాచీనసమస్యలను పరిష్కరించి యుండెడిదనుటను సందేహములేదు. కాని దీనిని తెచ్చుటకు తమంత తామే సహాయపడిన బ్రిటిషువారు దీనిపురోభివృద్ధినరికట్టయత్నించిరి వారు మనపారిశ్రామికాభివృద్ధి నరికట్టి తద్వారా రాజకీయాభివృద్ధి నాలస్యముచేసిరి. దేశములోవారు ఫ్యూడల్ ప్రభుత్వములను, ఇతర శిథిలసంస్థలను కాపాడిరి మార్పుచెందుచు, కొంతవర కభివృద్ధిచెందుచున్న చట్టములను, ఆచారములను వారువచ్చినప్పుడున్న స్థితిలో గడ్డకట్టుకొనిపోవునట్లుకూడ చేసి యీ సంకెలనుండి తప్పించుకొనుట కష్టసాధ్యముచేసిరి. భారతదేశ బూర్జువాలు వారి యాశీర్వాదముచేత, సహాయముచేత పెరిగినవారు కారు. రైల్వేలను యితర పారిశ్రామికోత్పత్తులను ప్రవేశపెట్టినతరువాత పరివర్తనచక్రమును వారాపజాలకపోయిరి. వారు దాని నడ్డగించి, దానిగతిని మాంద్యపరచగలిగిరి. దీనిని వారు స్పష్టముగ తమ లాభముకొరకే చేసిరి.

"ఈగట్టిపునాదిమీద మహోత్కృష్ట భారతప్రభుత్వసౌధము నిలిచియున్నది. ఈస్టుయిండియాకంపెనీయధీనములో నున్న రాష్ట్రము లన్నింటిని చక్రవర్తి యధీనములోనికి తీసుకొనిన తరువాత, 1858 లగాయతు, భారతదేశముపొందిన యైశ్వర్య, విద్యాభివృద్ధులు మున్నెన్నడు తన చరిత్రలో నేయుగములోను కనివినియెరిగిన వాని కంటె గొప్పవియని నిస్సందేహముగ చాటవచ్చును."* ఈ స్టేటుమెంటులో పైకికానిపించునంతట యదార్థములేదు. బ్రిటిషుప్రభుత్వము వచ్చుటతోడనే విద్య యదార్థముగ తగ్గిపోయెనని తరచు చెప్పబడుచుండెను. కాని యీ స్టేటుమెంటు సంపూర్ణముగ యథార్థమేయైనను యిది యాధునిక పారిశ్రామికయుగమును పాతయుగములతో పోల్చినట్లగును. ప్రపంచములో ప్రతిదేశములోను గతశతాబ్దమున, శాస్త్రము, యంత్రాభివృద్ధి, యైశ్వర్య విద్యాభివృద్ధులు అద్భుతముగనుండెను. ఇఙ్లీదేశమును గురించియైన నిట్టి యభివృద్ధి "మున్నెన్నడు తన చరిత్రలో నేయుగములోను కని విని యెరిగిన దానికంటె గొప్పదియని నిస్సందేహముగ చాటవచ్చును.'

బహుశః ఆదేశచరిత్ర హిందూదేశ చరిత్రయంతటి పురాతనమైనది కాకపోవచ్చును. ఇట్టి సాంకేతికాభివృద్ధి యీ పారిశ్రామిక యుగములో మనకేవిధముగనైనను, బ్రిటిషుప్రభుత్వము లేకపోయినను అబ్బియుండెడిదనిసూచించుటతిశయోక్తికాదు. నిశ్చయముగ మనము మనస్థితి ననేక యితరదేశములతో పోల్చిచూచినచో మనకింతకంటె నెక్కువయభివృద్ధియే చేకూరియుండెడిదని యూహించుట దోషము కానేరదు. బ్రిటిషువారే యీయభివృద్ధిని నులిమివేయుటచే మనము పోరవలసివచ్చెను. రైల్వేలు. టెలిగ్రాఫులు, టెలిఫోనులు, వైర్లెసు యిత్యాదులు బ్రిటిషుప్రభుత్వముయొక్క మంచితనమునకు, యుదారతకు పరీక్షలు కాజాలవు. అవి యవసరములు, ఆహ్వానింపదగినవి. వానిని మొట్టమొదట మనకు తీసుకొనివచ్చిన యేజెంటులు బ్రిటిషువారు కనుక మనము వారికి కృతజ్ఞులము. కాని యీ పారిశ్రామిక

* జాయింటు పార్లమెంటు కమిటీ రిపోర్టు (1934)

నాందీ ప్రవేశముకూడ ముఖ్యముగ బ్రిటిషుప్రభుత్వమును బలపరచు టకే జరిగెను పైవి జాతియొక్క రక్తనాళములు. వానిగుండ జాతీయరక్తము ప్రవహించి, దానివర్తకము నభివృద్ధిపరచి, యుత్ప త్తులను తీసికొనిపోవుచు, దానిలక్షలకొలది ప్రజల కైశ్వర్యమును, నూతనోత్తేజమును ప్రసాదింపవలసియుండెను చివరకట్టి ఫలితము చేకూరునసనుట సత్యము. కాని యవి మరియొక ప్రయోజనము కొరకు — బ్రిటిషువస్తు పుణ్యస్థలముల కొరకు, సామ్రాజ్యాధికార మును బలపరచుకొనుటకు నుద్దేశింపబడి యందుకే పనిచేసెను. పరి శ్రమమయము చేయుటకు, నవీన ప్రయాణసౌకర్యములకు నేనెంతయో సుముఖుడను, కాని నేను భారత మైదానములగుండపోయినపుడొక్కొ క్కప్పుడును, రైల్వే—ప్రాణమునిచ్చునది—హిందూదేశమును బంధించి, ఖయిదుచేయు యినుపబంధనముగ నాకు తోచుచుండెను.

ప్రభుత్వము పోలీసుపని చేయవలెనను భావమే బ్రిటిషువారి కుండెను. ప్రభుత్వమును రక్షించుటయే పాలకులపని. తక్కినదాని నితరులు చేసుకొనవలెను. వారి 'పబ్లికు ఫైనాన్సు' సైనికవ్యయము, పోలీసు, సివిలుపరిపాలన, ఋణములమీదవడ్డీ — వీనివిషయములకే సంబంధించును పౌరుల యార్థికావసరములు బ్రిటిషు ప్రయోజనము లకు బలిచేయబడెను. ప్రజలయొక్క విజ్ఞానాదియవసరములు బొత్తిగ నిర్లక్ష్యముచేయబడెను. పబ్లికు ఫైనాన్సు, యితరదేశములలో నందరకు నుచితవిద్య, ప్రజల 'యారోగ్యాభివృద్ధి, బీదలయొక్కయు, దుర్బల మనస్కులయొక్కయు జాగ్రత, వ్యాధి, వృద్ధాప్యము, నిరు ద్యోగము మొదలగువానినుండి పనిచేయువారలను రక్షించు భీమా— ఈయన్నింటిని ప్రసాదించెను. ఇవి యిచ్చట ప్రభుత్వబుద్ధికి కేవల మగ్రాహ్యములు. ఇది ధనవ్యయమగు యీకార్యములలో జోక్యము కల్పించుకొనజాలకపోయెను. పలనన దానిపన్నుల పద్ధతిలో నభివృద్ధి లేదు. అది పెద్దరాబడులమీదకంటె తక్కువ రాబడులమీద నెక్కువ మొత్తములను వసూలుచేయును. దానిసంరక్షణ ఖర్చులు,

పరిపాలనఖర్చులు విపరీతముగనుండి యాదాయమును చాలవరకు మ్రింగివేసెను.

తమ రాజకీయ ఆర్థికాధికారమును బలపరచు ప్రతిదానిమీద కేంద్రీకరించుటే బ్రిటిషుపరిపాలన ప్రధానలక్షణము. తక్కినదంతయు నసంగతము. వారు శక్తివంతమగు కేంద్రప్రభుత్వమును, సమర్థతగల పోలీసుదళమును సృష్టించినందులకు తమ విజయమునకు తామే మెచ్చుకొనవలెను. కాని భారతప్రజలు దానికి తమ్ముతా మభినందించుకొనజాలరు. ఐక్యము శుభ్రమైనదే. కాని దాస్యములోని యైక్యము గర్వింపదగినదికాదు. ఒక నిరంకుశ ప్రభుత్వముయొక్క బలమే ప్రజల కెక్కువభారము కావచ్చును. అనేక విధముల నుపయోగకారియగు పోలీసుదళము తాను రక్షించుట కుద్దేశింపబడిన ప్రజలకు వ్యతిరేకముగ నుపయోగింపబడవచ్చును. అది యట్లే చేయబడెను. ఆధునిక నాగరికతను ప్రాచీనగ్రీసుదేశపు నాగరికతతో పోల్చుచు బెర్ట్రండు రస్సెలు "మనదానితోపోల్చిన గ్రీసుదేశపు నాగరికతలోగల యాధిక్యత యేదియన పోలీసుల యసమర్థత. ఇది చాలమంది సత్పురుషులు తప్పించుకొనుట కవకాశమిచ్చెను." అని వ్రాసెను

భారతదేశములో బ్రిటిషువారి యాధిక్యత మనకు శాంతి నిచ్చెను. మొగలుసామ్రాజ్యము విచ్ఛిన్నమైన తరువాత సంభవించిన కష్టములు, దురదృష్టములు గతించినవెనుక భారతదేశము శాంతిని గోరుచుండెను. శాంతి యెట్టి యభివృద్ధికైనను నవసరము, యమూల్యము, అది సంభవించినపుడు దాని నాహ్వానముచేతుము. కాని శాంతినికూడ మనము భరింపరాని వెలకు కొనగలము. మనము శ్మశానశాంతిని పొందవచ్చును. పంజరము లేక ఖయిదు యిచ్చు సంపూర్ణభద్రత ననుభవింపవచ్చును. లేక శాంతి తమ బాగు కసమర్థులైనవారి వైరినిస్పృహా గావచ్చును. విదేశవిజేతలచే బలాత్కారముగ నొసంగబడు శాంతి కందులోనుండవలసిన సుఖవిశ్రాంతులను కలుగజేయు సుగుణములుండవు. యుద్ధము భయంకరమైనది. మాన

తగినది. కాని; యది కొన్ని సుగుణములను ప్రోత్సహించును. అవి మనస్తత్త్వవేదియగు విలియం జేమ్సు ప్రకారము, విశ్వాసము, పట్టుదల, కలయిక, శౌర్యము, తెలివి, విద్య, క్రొత్తవస్తువులను కనిపెట్టు బుద్ధి, పొదుపు, శరీరబలము, చురుకుదనము ఈ కారణములచే జేమ్సు యుద్ధమువలన కలుగు బీభత్సమువినా జాతికీగుణములు ప్రసాదింపగల నైతికసామ్యమునకొరకు యత్నించెను అసహాయోద్యమమును గురించియు, శాసనోల్లంఘనమునుగురించియు నతడు వినియుండినచో బహుశః యతని యభీష్ట మీడేరెడిది.

చరిత్రలో 'అయితే' ,ఏమిజరిగెడిదో' యనుచర్చ వ్యర్థప్రసంగము. శాస్త్ర,పారిశ్రామిక; పశ్చిమప్రపంచసంబంధము భారతదేశమునకు కళ్యాణకరమనియే నేను భావించెదను. శాస్త్రము పాశ్చాత్యులు మనకిచ్చిన గొప్పవరము. భారతదేశమునకిది కొఱతయయ్యెను. ఇది లేనిచో నది నశింపక తప్పదు. మన సంబంధముల పద్ధతి దురదృష్టమైనది. అయినను, బహుశః యీ సంఘాత పరంపరలు మాత్రమే మనలను కుంభకర్ణనిద్రనుండి మేల్కొల్పగలిగెను. ఈదృష్టితోచూచిన ప్రొటెస్టెంటులు, ,యెవరికివారే' యనువారు, ఆంగ్లోసాక్సనులునగు ఇంగ్లిషువారు దీనికర్హులు. ఇతర పాశ్చాత్యులందరికంటె వీరికి మనకు నెక్కువ భేదములు కలవు. కనుక మన కెక్కువ గొప్పదెబ్బలను వడ్డించగలరు.

వారు మనకు రాజకీయయైక్యతనిచ్చిరి. అదియవసరమె కాని, మనకీయైక్యత యున్నను లేకపోయినను భారతజాతీయత యభివృద్ధిచెంది దానిని కోరియుండెడిది. నేడు అరబ్బులోక మనేక ప్రత్యేక ప్రభుత్వముల క్రింద_స్వతంత్రములు, రక్షింపబడునవి, మాండేటరీలు మొదలగునవిగ చీల్చబడినది. కాని యరబ్బైక్యము కావలెనని యవన్నియు కోరుచున్నవి. పాశ్చాత్య సామ్రాజ్యాధికారము లడ్డము రానియెడల అరబ్బుజాతీయత యీ యైక్యతను చాలవరకు సాధించి యుండెడిదనుట కెట్టిసందేహము లేదు. కాని హిందూదేశములోవలెనే భేదభావములను ప్రోత్సహించి మైనారిటీసమస్యలను సృష్టించుట యీ

యధికారములవనియై యున్నది. ఈ సమస్యలు జాతీయ ప్రేరణను దుర్బలపరచి కొంతవరకు దానిశక్తిని ప్రతిఘటించును. సామ్రాజ్యాధికారము నిలిచియుండుటకు, నిష్పక్షపాత మధ్యస్తునివలె నటించుటకు నిది యొకసాకు.

భారతరాజకీయ మైక్యత సామ్రాజ్యాభివృద్ధిలో కొసరు భాగము. తరువాత వత్సరములలో భేదములను, కులసమస్యలను బుద్ధిపూర్వకముగ హెచ్చరించుట మనము కండ్లార చూచియుంటిమి. అవి మన భవిష్యదభివృద్ధికి ప్రబల శత్రువులు.

బ్రిటిషువా రిచ్చటకువచ్చి చిరకాలమైనది! వారధికారమునకు వచ్చినతరువాత నూటడెబ్బది సంవత్సరములు గతించెను. నిరంకుశ ప్రభుత్వములన్నింటికి వలెనే వారికి సర్వస్వేచ్ఛయుండెను వారి కోరికల ననుసరించి భారతదేశమును తయారుచేయుట కసమానమైన యవకాశము చిక్కెను ఈ సంవత్సరములలో ప్రపంచమంతయు, ఇంగ్లండు, అమెరికా, యూరపు, జపాను—గుర్తించుటకు వీలులేనట్లు మారిపోయెను. 18వ శతాబ్దములో అట్లాంటికు నంటిపెట్టుకొని యుండిన నామరూపములులేని అమెరికను కాలనీలు నేడు ప్రపంచములో సమానవైభవము, నత్యంతశక్తి, శాస్త్రములో విశేషాభివృద్ధిగల జాతియయ్యెను. జపాను తృటికాలములో నద్భుతమగు మార్పులను పొందెను. నిన్న మొన్నటివరకు నిర్జీవమైన జారుప్రభుత్వహస్తముచే నభివృద్ధియంతయు నణచివేయబడి, నులిమివేయబడిన విశాలమగు యు. యస్. యస్. ఆర్. రాష్ట్రములు నేడు నూతన జీవితములో నుద్దీపితమగుచు మనకండ్లయెదుట నొక నూతన ప్రపంచమును నిర్మించెను, భారతదేశములో గూడ గొప్ప మార్పులు కలిగెను. అది 18వ శతాబ్దముకంటె నిపుడు చాల భిన్నముగ నున్నది. రైల్వేలు, నీటిపారుదల పనులు, ఫ్యాక్టరీలు, పాఠశాలలు, కళాశాలలు, పెద్దపెద్ద ప్రభుత్వ భవనములు యిత్యాదులు వచ్చెను.

అయినను, యన్ని మార్పులు కలిగినప్పటికి నేడు భారతదేశ మెట్లున్నది? వేలకొలది మైళ్ళ దూరముననున్న విదేశీయులచే పాలింప

బడుచు, దాని దివ్యశక్తియంతయు పంజరబద్ధమై, స్వేచ్ఛగ నూపిరి పీల్చుకొనుటకైనను సాహసింపలేక పడియున్న బానిసదేశము. ఆమె ప్రజ లెవరితో పోల్చుటకు వీలులేని గర్భదరిద్రులు. అచిరజీవులు. అనివార్యాధులను జాడ్యముల నెదుర్కొన నసమర్థులు. అజ్ఞానము ప్రబలము. విశాల ప్రాంతములలో నెట్టి పారిశుధ్యము, వైద్య సహాయము కానరావు. మధ్యతరగతులలోను, ప్రజాసామాన్యము లోను నిరుద్యోగము విపరీతప్రమాణములోనున్నది. స్వేచ్ఛ, ప్రజా స్వామికము, సామ్యవాదము, కమ్యూనిజములు అర్థవిహీనములగు లక్ష్యవాదులయొక్కయు, సిద్ధాంతములయొక్కయు, లేక దొంగల యొక్కయు వెర్రికేకలని చెప్పబడుచుండును. ప్రజలందరు మొత్తము మీద సుఖపడుటయే నిజపరీక్ష. నిశ్చయముగ నిది ప్రధానమైన పరీక్ష. ఈ పరీక్షనుబట్టియే నేడు హిందూదేశము భయంకర దరిద్ర ప్రదర్శనము చేయుచున్నది. ఇతరదేశములలో నిరుద్యోగ సమస్య లను, దుఃఖనివారణకు సంబంధించిన గొప్ప స్కీములను గురించి విందుము. లక్షలకొలది నిరుద్యోగులైనవారియొక్కయు, విశాల వ్యాప్తిచెంది, శాశ్వతమైపోయినట్టియు మన దుఃఖముసంగతి ఏమి కావలెను? ఇతరచోట్ల జరుగుచున్న ఇండ్ల స్కీములనుగురించికూడ మనము చదువుచుంటిమి. మట్టిగుడిసెలలో నివసించు లేక నే యిండ్లులేక నల్గాడు మన లక్షలకొలది ప్రజల గృహము లెచ్చట నున్నవి? మేమున్నచోటనేయుండి లేక కాబేలునడక పతికష్టము మీద నడచుచుండ, నితరదేశములలో విద్య, పారిశుధ్యము, వైద్య సహాయము, విజ్ఞానసౌకర్యములు, ఉత్పత్తి దినదినాభివృద్ధియగు చుండుటనుచూచి యసూయపడకూడదా? పన్నెండు సంవత్సరముల స్వల్పకాల ప్రయత్నముచే రష్యాదేశము తన విశాల రాష్ట్రములలో నజ్ఞానమును రమారమి నశింపుచేసి, ప్రజాజీవితముతో సంబంధము గల యొక చక్కని యాధునిక విద్యావిధానమును వృద్ధిచేసెను. వెనుకబడియున్న టర్కీకూడ ముస్తఫా కెమాల్ పాషా నాయకత్వము క్రింద విద్య విశేషాభివృద్ధిని గాంచెను. ఫాసిస్టు యిటలీ, తన యధి కారమును ప్రారంభించుటతోడనే, విద్యావిహీనతపై దాడివెడలెను.

విద్యామంత్రియైన జెంకెలు "యజ్ఞానమును ముందరనుండి యెదుర్కొనవలెను. మన రాజకీయశరీరమును తినివేయుచున్న యీ రాచపుండు నెఱ్ఱని యినుపకడ్డీతో కాల్చివేయవలెను" అని యాజ్ఞాపించెను. ఇవి ప్రేక్షకాగారమునకు తగని పరుషవాక్యములు. కాని యివి యీభావము వెనుకనున్న విశ్వాసమును, శక్తిని విశదము చేయును. మనమిచ్చట నెక్కువ పెద్దమనిషితరహా చూపుచు విశేషలలితపద జాలము నుపయోగింతుము మన మతిజాగ్రత్తగ సంచరించుచు మన శక్తులను కమిషనులలోను, కమిటీలలోను వ్యయపరచెదము.

భారతీయులు మాటల ప్రోగులనియు, కార్యశూన్యులనియు నొక యపవాదముకలదు. ఇది యుక్తమైన నేరము. కాని కమిటీలకు కమిషనులకు బ్రిటిషువారికిగల యనంతశక్తికి మన మాశ్చర్యము వెలిబుచ్చగూడదా? ప్రతికమిషను చాలకాలము కష్టించిన తరువాత నొక ప్రతిభావంతమగు నివేదికను "ఒక గొప్ప ప్రభుత్వపత్రమును" తయారుచేయును. ఇది సక్రమముగ స్తుతింపబడి భద్రముగ నే గూటిలోనో దాచబడును. కనుక మనము ముందుకుపోవుచున్నట్లు అభివృద్ధి చెందుచున్నట్లు భావింతుము. అయినను మనమున్న చోటనే యున్నారము. 'గొప్పతనము' తృప్తినొందుచున్నది. ఉన్నప్రయోజనములు చలనములేకుండ నిలిచిపోవుచున్నవి మనము చాలవేగముగ పోవుదుమను భయముతో వారణములు, బ్రేకులు, రక్షణలు మొదలగు వానిని గురించి చర్చింతుము.

"మొగలు పరిపాలననాటి సామ్రాజ్యవైభవమే ప్రజలదారిద్ర్యమునకు ప్రమాణము" అని 1934 జాయింటు పార్లమెంటరీ కమిటీ చెప్పుచున్నది. అది యుక్తమైన విమర్శ, పరీక్ష. కాని యీ ప్రమాణమునే మనము నేడును వర్తింపచేయగూడదా? వైస్రాయిగారివైభవప్రదర్శనములతో గూడిన నేటి నూతన ఢిల్లీసంగతియేమిటి? ఆశ్చర్యకరమగు గర్భదారిద్ర్యమొకప్రక్క వేధించుచుండ నీ యాడంబరమా! ఈ వ్యత్యాసము బాధకరముగ నుండును. హృదయముగల వ్యక్తులు దీని నెట్లు సహింపగలరో యోచించుట దురూహ్యము. పైకి

కాన్పించు సామ్రాజ్యవైభవముల వెనుకనున్న భారతదేశము దరిద్రభూయిష్టము దుఃఖపూరితము. ఇదియంతయు నతుకులవని. మెరుగుపూతలు. వీరివెనుక నాధునికపరిస్థితులచే నంతకంతకు కృంగిపోవుచున్న చిన్న బూర్జువాలు కలరు. ఇంకను వెనుక వచ్చిదరిద్రముతో దుఃఖమయజీవితములనుగడుపు పనివాండ్రు కలరు. తరువాత "అనంతయంధకారముకొరకుపుట్టిన" బీదవ్యవసాయదారు కలరు.

"శతాబ్దములభారముచే కృంగి యతడు తన కోల్పికపై నాధారపడి భూమివైపు తేరిపారిచూచును అతనిముఖమున యుగములనాటి శూన్యత తాండవించును; వీపున ప్రపంచభారము గోచరమగును.

"......ఈ భయంకరాకారముగుండ బాధపడిన యుగములు వీక్షించును. వంగిన యీ నడుము కాలవిషాదచరిత్రను తెలుపును దోచుకొనబడిన, ద్రోహముచేయబడిన, యాస్తిలాగుకొనబడిన మానవలోకము ఈ భయంకరరూపముద్వారా ప్రపంచమును సృష్టించిన శక్తులను తమ నిరసనను వెలిబుచ్చును. ఈ నిరసనమే జ్యోతిషముకూడ నగును."

భారతదేశములోనున్న దోషములన్నింటికిని బ్రిటిషువారిపయి రుద్దుట మూర్ఖత్వము ఆ బాధ్యతను. మనము వహింపవలెను. మనము దానినుండి తప్పించుకొనుటకు వీలులేదు. మననిజదుర్బలత్వముచే సంభవించిన ఫలితముల కితరులను నిందించుట యుక్తముకాదు. అధికారధూర్వహ ప్రభుత్వపద్ధతి, ముఖ్యముగ విదేశప్రభుత్వము, విధేయతను దోహదముచేయు చిత్తవృత్తినే ప్రోత్సహింపవలెను. ప్రజలమానసిక దృష్టిని, యాచరణను తగ్గించుటకు యత్నము చేయవలెను. అదియువకులలోనున్న శుభావహాలక్షణములన్నింటిని—యుత్సాహము, ధైర్యసాహసములు క్రియాశక్తి 'వీర్యము'—నలిపివేయవలెను. నైచ్యము, బల్లివలె నంటిపెట్టుకొని యుండుట, యజమానుల నాశ్రయించుట, సంతోషపెట్టుట మొదలగుభావములనే ప్రోత్సహింపవలెను. అట్టిపద్ధతి నిజమైన సేవచేయవలెననెడి చిత్తవృత్తిని, ప్రజాసేవయెడల భక్తిని పురికొల్పజాలదు. అది ప్రజాసేవయందెంతమాత్రముయుత్సాహములేక

ఏదో విధముగ పొట్టపోసికొను నాశయముగలవారినే తీసికొనును. భారతదేశములో బ్రిటిషువా రెట్టితరగతిమనుష్యులను చేరదీసెదరో మనము చూచుచునే యున్నాము. వారిలో కొందరు బుద్ధిబలము కలిగి మంచిపనిచేయగల సమర్థులు కలరు. వారి కితరత్ర నెట్టియవకాశము లేకపోవుటచే ప్రభుత్వసేవకో లేక అర్ధప్రభుత్వసేవకోయొడంబడుదురు. క్రమముగ వారి చురుకుపాలు తగ్గి వారి మనస్సులు సారములేని నిత్యకర్మబద్ధమై యీ పెద్దయంత్రములో భాగములుగ నిమిడిపోయెదరు వారు నిరంకుశత్వమునకు కావలసిన గుణములను "గుమాస్తాపదవికి తగినజ్ఞానమును ఆఫీసు నడపగల రాచకీయకళను" వృద్ధిచేయుదురు క్వాచిత్కముగ ప్రజా సేవయందు మానసికభక్తి యుండవచ్చును. ప్రజ్వలించునట్టి యుత్సాహముండదు. ఉండజాలదు. విదేశప్రభుత్వముక్రింద నిది సాధ్యముకాదు.

పేరుమినహా. చిన్నయధికారులలో చాలమంది యెన్నదగినవారుకారు. వారు తమ పైయధికారుల నాశ్రయించుట. క్రిందవారిని బాధించుట మాత్రమే యెరుగుదురు. ఈ దోషము వారిదికాదు. అది యీపద్ధతివలన కలుగు శిక్షలోనున్నది. మనదేశములో తఱచు కాన్పించుయాశ్రయింపు జీవితములోను, బంధువులకుద్యోగములనిచ్చు పక్షపాత యాచారములోను నాశ్చర్యమేమియున్నది? సేవజేయుటకు వారికెట్టియాదర్శములులేవు నిరుద్యోగ పిశాచము, తత్ఫలితమగు నాకలిబాధ వారిని పీడించుచు. కనుకయుద్యోగముల కంటి పెట్టుకొని యుండుటయు. వారిబంధువులకు స్నేహితులకు పదవులనిప్పించుటయు వారిప్రధాన తాపత్రయము. గూఢచారి వేసడములు వెంటాడు ప్రజలలో మనోజ్ఞములగుసుగుణములనువృద్ధిచేయుటసులభమైన పనికాదు.

ఈ మధ్య జరిగిన మార్పులవలన ప్రజాసేవయందభిరతి, హృదయముకలవాడు ప్రభుత్వసేవలో జేరుట మరింత కఠినముయ్యెను. ప్రభుత్వము కట్టివా రవసరములేదు. ఆర్థికముగ తప్పనిసరియైనగాని వారు ప్రభుత్వసంపర్కము నంగీకరింపరు.

కాని సామ్రాజ్యభారమును నల్లవారుకాక తెల్లవారు భరించుచున్నట్లు ప్రపంచమంతయు నెరుగును. సామ్రాజ్య సాంప్రదాయ

మును నిర్వహించుటకు మనకు వివిధసామ్రాజ్యశాఖలుగలవు. వాటి ప్రత్యేకహక్కులను, కాపాడుటకనేకసంరక్షణలు కలవు. ఈ శాఖల ప్రయోజనములతోను, అభివృద్ధితోను, భారతకళ్యాణము ముడిపెట్టబడును. ఐ. సి. యస్. యొక్క ప్రత్యేకహక్కు, పెద్దపదవి తీసివేయబడినచో నరమృత, యపనీతి ప్రబలునని చెప్పుదురు. ఐ. యం. యస్. కొరకు ప్రత్యేకింపబడిన పదవులను తగ్గించినచో "భారతదేశ యారోగ్యమునకు భంగముగలుగును." సైన్యములోని బ్రిటిషు యుద్యోగులను ముట్టితిమా మనల నానావిధములగు భయంకర ఉపద్రవములు ముట్టడించును!

ఇందులో కొంత సత్యమున్నది. పై పెద్దయధికారులు హఠాత్తుగా వెళ్ళిపోయి తమశాఖలను క్రిందివారికి విడిచివేసిన యెడల సమర్థత తగ్గిపోవును. కాని యీపద్ధతియే దీనికికారణము. క్రింది యధికారు లెంతమాత్రము శ్రేష్ఠులుకారు. బాధ్యత వహించుటకు వారి కెట్టియవకాశములు నీయబడలేదు. భారతదేశములో గొప్ప బుద్ధిబలసంపన్నులు కావలసినంతమంది యున్నారని నేను విశ్వసించెదను. తగుదీక్ష తీసికొనినచో వా రనతికాలములోనే యుపయోగింతురు, తయారగుదురు. కాని దానికి ప్రభుత్వ, సాంఘిక పరివర్తనము కలుగవలెను. అనగా నొకనూతనప్రభుత్వ మేర్పడవలెను.

ప్రస్తుతము చట్టములలో నెట్టిమార్పులువచ్చినను మనలను రక్షించి, మనకు నీడనిచ్చు పెద్దయుద్యోగములనెడి 'యుక్కుచట్టము' మామూలుగనే సాగుచుండునట! పవిత్రప్రభుత్వ రహస్య సంరక్షక మతాధిపతులకు ఏ రా గర్భగుడిని కాపాడుచు నీచుల నా పవిత్ర యావరణములోనికి రాకుండ వారించెదరు. మనకీయబడిన హక్కుల కర్హులమని మనము ఋజువుచేసినచో క్రమముగా వా రొక్కొక్క తెరతీసివేయుచు చివర కెప్పుడో భవిష్యద్యుగములో నాశ్చర్యచకితములు, భక్తిపురస్సరములు నగు మన నయనముల కా యత్యంత పవిత్రపదార్థము బహిర్గతమగునట!

ఈ సామ్రాజ్యశాఖలన్నింటిలోను ఐ. సి. యస్. కు అగ్రస్థాన మీయబడెను. ప్రభుత్వము భారతదేశములో నడుచుటకుగల

కీర్త్యపకీర్తులు వీరికే ముట్టవలెను. ఈ శాఖయొక్క గుణగణములను గురించి మన కనేకసార్లు చెప్పబడెను. సామ్రాజ్యస్తంభములో దాని యుత్కృష్టత యొక్క సామెతయయ్యెను. భారతదేశములో దానికున్న యప్రతిహతాధికారపదవి యది ప్రసాదించు నిరంకుశాధికారము, దీనినిగురించి చేయబడు విశేష పొగడ్తలు నెట్టి వ్యక్తి, వర్గముల మానసిక స్వాస్థ్యమునకును శ్రేయస్కరములు కాజాలవు ఈ శాఖ యెడల నాకెంతయభిమానమున్నను యిది వ్యక్తిగతముగ, మొత్తము మీద నాత్మస్తుతి యను వ్యాధికి లొంగిపోయెనని చెప్పక తప్పదు. ఐ.సి.యస్. వారి సుగుణములను మరచిపోనీయను. కాని యాశాఖను గురించి శుష్కోపన్యాసములు గావింపబడెను యింకను కావింపబడు చున్నవి కనుక నీ జోరును తగ్గించునట్లు చేయుట యవసరమని నే నొకొక్కప్పుడు భావించుచుందును. వెబ్లెను అను అమెరికాదేశపు యార్థిక శాస్త్రవేత్త హక్కులుగల తరగతులను "ఉంపుడుతరగతులు" అని పిలిచెను. ఐ సి యస్ ను, యితర సామ్రాజ్యశాఖలను "ఉంపుడుశాఖలు" అని పిలుచుటలోగూడ నంత సత్యముగలదని నేను భావించెదను. అవి చాల వ్యయకర విభవములు, భోగములు.

మేజరు డి గ్రహాంపోలు భారతదేశ వ్యవహారములలో నెక్కువ శ్రద్ధతీసుకొనుచుండెడివాడు. అతడు కొంతకాలముక్రిందట మోడరన్ రివ్యూ పత్రిక కిట్లు వ్రాసెను. "ఐ సి యస్. శాఖ చాల సమర్థమైనది, పటుత్వమైనది అను నంశము నెవరును కాదనుట కెన్నడు యత్నించి యుండలేదు" ఇట్టి స్టేటుమెంటులే యింగ్లండులో తరచు చేయబడుచు విశ్వసింపబడుచుండుటచే దీనిని పరీక్షించుట ప్రయోజనకరము. ఇట్టి స్టేటుమెంటులను చేయుట భద్రముకాదు ఈ విషయము నిరాకరింపబడలేదని మేజరు గ్రహాంపోలు భావించుట చాల పొరపాటు. చాలకాలముక్రిందటనే గోఖలేగారుకూడ ఐ.సి.యస్. ను గురించి చాల కఠినవిషయములను చెప్పెను. సామాన్యభారతీయుడు—కాంగ్రెసువాది యైనను కాకపోయినను—మేజరు గ్రహాంపోలుతో డీకొనగలడు డీకొనును. అయినను నా సభ్యులు కొంతవరకు యుక్తముగనే యుండి వివిధయవస్థలను గురించి యోచించుకొను

చుండవచ్చును. శక్తి సమర్థతలు దేనికొరకు? బ్రిటిషు సామ్రాజ్యమును హిందూదేశములో బలపఱచుటకు, దేశమును కొల్లగొట్టి దానికి సహాయముచేయుటకు నైన యెడల నిశ్చయముగ ఐ. సి. యస్. బాగుగనే పనిచేసెను. కాని భారతప్రజలు సౌభాగ్యమే నిజమైన పరీక్షయైనయెడల వారు పూర్తిగ విఫలులైరి. ఏ ప్రజలనుండి హెచ్చుజీతములు వచ్చుచున్నవో యట్టిప్రజలను వీరికి రాబడిచేతను, జీవిత ప్రమాణముచేతను గల దూరమును చూచినచో నీ విఫలత మరింత స్పష్టము కాగలదు.

ఈ శాఖ మొత్తముమీద నొకవిధమగు ప్రమాణమును నిలిపెననుట పూర్తిగ యథార్థము. అప్పుడప్పుడది యసాధారణ ప్రజ్ఞగల వారినిచ్చుచుండెను. ఇట్టి యే శాఖనుండియైనను నింతకంటె నెక్కువ యాశింపరాదు. బ్రిటిషు పబ్లికు స్కూలుయొక్క తత్త్వము నిది ప్రధానముగ యలవఱచుకొనెను. ఇది యొక మంచి ప్రమాణమును నిలిపినను యీమాదిరిని దాటివెళ్ళుట కంగీకరింపదు. ప్రత్యేకవ్యక్తుల ప్రత్యేకశక్తిసామర్థ్యములు దైనికనిర్జీవతంతులో నాశనమగుచుండెను; పెద్దమనిషితరహా శ్రద్ధకలవారు, సేవను గ్రహించినవారు చాలమంది కలరు. కాని యీ సేవ సామ్రాజ్యసేవ. భారతదేశము దానితరువాత విధిలేక వచ్చును వారికీయబడిన శిక్షనుబట్టి వారుండు పరిస్థితులను బట్టి వారట్లే ప్రవర్తింపగలరు. వారు స్వల్పసంఖ్యాకులు, విజాతీయులు. తఱచు మిత్రులుకాని ప్రజలమధ్య నుండుటను కనుక నేకీభావముకలిగి యొక విధమగు ప్రమాణమును నిలిపిరి. తమ జాతి యొక్కయు, పదవియొక్కయు గౌరవమును నిలుపుకొనుట కిది యవసరము, వారికి నిరంకుశాధికారములు కలవు. కనుక విమర్శను నిరాకరించి దానిని మహాపాపముగ భావించి, యంతకంతకు సహనమును కోల్పోయి, బెత్తమును ఝుళిపించు బడిపంతులవలెను, బాధ్యతలేని పరిపాలకులకుండుదోషముకలవడిపోయిరి. పరివర్తనము చెందు ప్రపంచములో వారాత్మతృప్తిగల సంకుచితములై యభివృద్ధి చెందుచున్న వాతావరణమున కెంతమాత్రము తగనివారైరి. తమకంటె సమర్థులు నవసరములను గుర్తించి నడవగలవారు భారత సమస్యలను

చేబట్టినపుడు వీరు కోపించిరి. వారిని నిందించి, యణచివేసి, వారి కనేక యడ్డంకులను కల్పించిరి. యుద్ధానంతర పరివర్తనముల పూర్వ పరిస్థితులను తెచ్చిపెట్టినప్పుడు వారు వాటితో తూగలేక కర్తవ్య విమూఢులైరి. అల్పావధిగలది, అతినిరర్థమైనది యగు వారివిద్య నూతన పరిస్థితులకు, నవసరములకు తగినట్లు వారిని తయారుచేయ లేదు. చిరకాల బాధ్యతవలన వారు చెడిపోయిరి మొత్తమువిూద వారికి సంపూర్ణాధికారము కలదు. "అధికార మవినీతిని కలిగించును" అని ఆక్టనుప్రభువు చెప్పెను. "సంపూర్ణాధికారము మరింత యవినీతిని కలిగించును."

వృద్ధియగుచున్న తీవ్ర జాతీయోద్యమము నెదుర్కొనుటకు వారు దౌర్జన్యము నవలంభించిరి. సామ్రాజ్యములు దానిమీదనే నిలుచుచున్నవి. ప్రతిపక్షము నెదుర్కొనుటకు వారికింకొకమార్గము చూపబడలేదు. అనవసర, అత్యధిక దౌర్జన్యము నుపయోగించుటే పరిస్థితులను వారిచేతిలోనుండి జారిపోవునట్లు విశదము చేసెను. మామూలు పరిస్థితులలో వారి కుండునట్లు కాన్పించిన నిగ్రహము, ఆత్మసంయమము వారిపుడు కోల్పోయిరి. వారినాడులు సడలిపోయెను; వారి బహిరంగ ఉపన్యాసములలో గూడ హిస్టీరియా చిహ్నము కాన్పించెడిది గత కాలమునాటి ప్రశాంత విశ్వాసము గతించెను. సందిగ్ధసమయము నిర్దాక్షిణ్యముగ మనల నందరను బహిర్గతమొనర్చి మన యత్యంతాంతరంగిక దుర్బలత్వమును ప్రదర్శించును. శాసనోల్లంఘన మట్టి సమయము; అట్టి పరీక్ష. చాల కొద్ది మంది (యిరుపక్షములోను - కాంగ్రెసు, ప్రభుత్వము) మాత్రమే యీ పరీక్షకు పూర్తిగ నిలువగలిగిరి. యదార్థ ప్రతిభావిశేషములు కలవారు కొద్దిమందియే యుందురని సందిగ్ధసమయములో కనుగొనబడునని లాయిడ్ జార్జి చెప్పుచున్నాడు తక్కినవారు సందిగ్ధసమయములలో లెక్కకు రారు. ప్రశాంత సమయములో గుట్టలవలె కాన్పించు యిసుకతిన్నెలు, గొప్ప వరద వచ్చునపుడు మునిగిపోయి నీటిపయినుండు యున్నత శిఖరములు మాత్రమే కాన్పించును,

ఐ. సి. యస్. వారు విద్యచేతను భావములచేతను దేశములో సంభవించినదానికి తయారుగనుండలేదు వారికీయబడిన యసలు శిక్ష సాహిత్యవిద్య. అదివారికొకవిధమగు విజ్ఞానమును, శోభనుయిచ్చును. అది విక్టోరియారాణి కాలమునకు తగినపాతప్రపంచ సాంప్రదాయము అది యాధునికపరిస్థితుల కెంతమాత్రము పనికిరాదు. వారు సంకుచితమైనను తమ స్వంతప్రపంచములో–ఆంగ్లోయిండియను–యిదిహిందూదేశముకాదు, యింగ్లండుకాదు–జీవింతురు. సమకాలిక సంఘములో పనిచేయు శక్తులను వారు గుర్తింపజాలరు భారత ప్రజల ధర్మకర్తలు సంరక్షకులు అను వినోదకరమగు నధికారము చలాయించుచున్నను వారు వారినిగురించి యేమియు నెరుగరు. కాలుదువ్వు నూతన బూర్జువాల వంతకంటె యెరుగరు. వారు తమచుట్టు ఉద్యోగములకొరకు నిచ్చికములకొరకు మూగువారినిబట్టి భారతీయులను విమర్శింతురు; తక్కినవారి నాందోళనకారులని దొంగలని త్రోసివేతురు. యుద్ధానంతరము ప్రపంచమంతటను జరిగిన పరివర్తనములనుగురించి ముఖ్యముగ నార్థికప్రపంచమునుగురించి వారి జ్ఞాన మతిస్వల్పము. వారు తాముపోవు రథచక్రమార్గములో నిరుకుకొనిపోయి మార్పుచెందు పరిస్థితులకు తగినట్లు లేవజాలకున్నారు. తాము ప్రాతినిధ్యము వహించు పీఠ మాధునిక పరిస్థితులకు తగియుండలేదని వారంతకంతకు టి. యస్. యిలియటు 'శూన్యమానవులు' అను పుస్తకములో వర్ణించిన మాదిరిని జేరుచున్నారని గుర్తింపరైరి.

అయినను బ్రిటిషు సామ్రాజ్యము సాగునంతకాల మీపీఠము సాగుచునేయుండును. ఇది యింకను శక్తివంతముగనున్నది. సమర్థులు ప్రతిభకలవారు నగు నాయకులను కలిగియున్నది. భారతదేశములో బ్రిటిషు ప్రభుత్వము గుల్లబారిపోయిన దంతమువలెనుండి బాధ హెచ్చుగ నున్నను సులభముగ పీకుటకు వీలులేనట్లున్నది. దానిని పీకివేయువరకు లేక దానంతటది పడిపోవువరకు నాబాధ తగ్గకమరింత యధ్వాన్నము కావచ్చును.

ఐ. సి. యస్. వారిలో యింగ్లీషువారు, భారతీయులు చాల మంది యుత్తములు కలరు. కాని ప్రస్తుత పద్ధతి నడచునంతకాలము వారి యోగ్యత భారత ప్రజల కుపయోగింపని విషయములకే వినియోగింపబడును. ఈ శాఖలోని కొందఱు భారతసభ్యులీ పబ్లిక్ స్కూలు తత్వముతో తన్మయత్వమునొంది రాజభక్తిలో నసమానులగుదురు తన గొప్పను పొగడుకొను యొక యుత్సాహవంతుడగు భారత ఐ. సి. యస్. సభ్యుని నేనొకసారి కలుసుకొంటిని. అతడు తన శాఖ సుగుణములను వర్ణించి వర్ణించి బ్రిటిషు సామ్రాజ్యమును సమర్థించుచు అది రోమను సామ్రాజ్యముకంటె, చెంఘీజుఖాను, తైమూరుల సామ్రాజ్యములకంటె శ్రేష్ఠమైనది కాదా? యను ప్రత్యుత్తర మక్కరలేని వాదముతో ముగించెను.

తమ ధర్మముల నతి సమర్థతతో నిర్వహించుచున్నారని, కనుక తమ హక్కులను నొక్కి వక్కాణించుట యోగ్యమేయని ఐ. సి. యస్. శాఖవారితలంపు. హిందూదేశ బీదతనమునకు సాంఘికాచారములు, బనియాలు, వడ్డీవ్యాపారస్థులు, అన్నిటికంటె నసంఖ్యాకులగు ప్రజలు కారకులు. అందరికంటె గొప్ప బనియాయగు బ్రిటిషు ప్రభుత్వముసంగతి చల్లగ జారవిడువబడును. వారీ ప్రజలనుగురించి యేమిచేయగోరుదురో నే నెరుగను. పలనన కఱవులు, జాడ్యములు, సాధారణముగ నెక్కువ మరణములు మొదలగునవి విశేషసహాయము చేసిననుగూడ జనాభా విస్తరించుచున్నది. జనన నిరోధము సూచింపబడెను దీనిని సమర్థించువారలలో నేనొకడను. కాని యీ పద్ధతుల నుపయోగించుటకే ప్రజల జీవిత ప్రమాణము చాల హెచ్చుగ నుండవలెను. కొంత సామాన్యవిద్య యుండవలెను. దేశమంతట నసంఖ్యాకులగు వైద్యులుండవలెను, ప్రస్తుతపరిస్థితులలో జనన నిరోధపద్ధతులు ప్రజల కెంతమాత్రము నందుబాటులో లేవు. మధ్యతరగతులవారికి లాభము పొందవచ్చును. వారట్లు చేయుచున్నారని నేను విశ్వసించెదను.

జనాభా విస్తారముగ పెరిగిపోవుచున్నదను వాదమును మరి కొంచెము తర్కించవలసియున్నది. నేడు ప్రపంచమంతటగల సమస్య యాహారము, తదితర ముఖ్యపదార్థములు లేకపోవుట కాదు. తిను వారులేరు. అనగా ఆహారము మొదలగువానిని కొనగలశక్తి యనన్నాతురులకు లేదు. ప్రత్యేకముగ హిందూదేశమునుగురించి రోచించినను అన్నలోపము లేదు. ప్రజాభివృద్ధియైనను, యాహార సరఫరాకూడ పెరిగెను. జనాభా పెరిగికొలది యది యంతకంటె నెక్కువగ పెరగ గలదు. భారతిదేశములో జనమమితముగ పెరిగిపోవుచున్నారని పెద్దగోల చేయబడును. చాల పాశ్చాత్యదేశములతో పోల్చిచూచిన యెడల నిది చాల తక్కువ. భవిష్యత్తులో నెక్కువ భేదముండుననుసంగతి యదార్థము. జనాభివృద్ధి నరికట్టుటకు లేక నాపివేయుటకు కూడ పాశ్చాత్యదేశములలో వివిధశక్తులు పనిచేయుచున్నవి హిందూదేశములోకూడ దానిని తగ్గించు శక్తులు వృద్ధియగు సూచనలు గలవు.

హిందూదేశము స్వాతంత్ర్యము సంపాదించినతోడనే, తన నూతన జీవితమును తన యిష్టప్రకారము నిర్మించుకొనగల శక్తి కలుగుటతోడనే, యది విధాయకముగ తన పుత్ర పుత్రికారత్నముల నీ పనికి వినియోగించును. శ్రేష్టమానవసృష్టి యెల్లప్పుడు స్వల్పముగనే యుండును. బ్రిటిషు ప్రభుత్వముక్రింద హిందూదేశములో నది మరింత స్వల్పము మన పబ్లిక్ కార్యములకు చెందిన యనేక శాఖలకు మనకు చాలమంది విదేశ నిపుణుల సహాయ మవసరము. ప్రత్యేక సాంకేతిక శాస్త్రీయజ్ఞాన మవసరమైన శాఖల కత్యావసరము. ఐ. సి. యస్.లోను యితర సామ్రాజ్యశాఖలలోను పనిచేసినవారిలో చాలమంది యీ నూతన క్రమమున కవసరము; వారాహ్వానము చేయబడుదురు. కాని ఐ. సి. యస్. తత్త్వము మన పాలకవర్గములోను, మన పబ్లిక్ శాఖలలోను జీర్ణించియుండునంతకాలము భారతదేశములోనే నూతనక్రమము నిర్మింపబడజాలదని నేను దృఢముగ చెప్పగలను. అధికార ధూర్వహతత్త్వము సామ్రాజ్యతత్త్వమునకు

తోడునీడ; స్వాతంత్ర్యముండుచోట నది యుండజాలదు. అది స్వాతంత్ర్యమునైనను నలిపివేయును. లేదా యదియే తుడిచివేయబడును అది ఫాసిస్టుప్రభుత్వమునకే సరిపడగలదు. కనుక మనము నూతనక్రమముక్రింద పని ప్రారంభించుటకుపూర్వము ఐ.సి.యస్. వంటి శాఖలు (ప్రస్తుతమున్న రూపములో) పూర్తిగ మాయమగుట యత్యావసరమని నాకు తోచును. ఈశాఖలకు చెందిన వ్యక్తులు వారికిష్టముండి. వారు సమర్థులైనయెడల, నూతన షరతుల కొప్పుకొను పద్ధతిమీద యాహ్వానింపబడుదురు. నేడు వారికీయబడు విపరీత జీతములు, అలవెన్సులు యివ్వబడునని కలలోనైన తలంపరాదు. తాము సేవించు ధర్మముపట్ల పరిపూర్ణవిశ్వాసము, దానిని సాధింపవలెననెడి పూనికగలిగి, గొప్పజీతములయందలి మోహముచేతగాక దానిలోనున్న యానందముకొరకు, దాని ప్రఖ్యాతికొరకు శ్రద్ధ సమర్థతగలిగి పనిచేయు సేవకులే నూతనభారతమును సేవింపనర్హులు. ద్రవ్యాపేక్ష చాల తక్కువకు దిగవలెను. విదేశస్థుల యవసరము యోచింపబడును కాని సాంకేతికజ్ఞానములేని సివిలువాలకు లందరికంటె తక్కువ వాంఛనీయులు. భారతదేశములో నట్టివారికి కొరతలేదు.

భారత లిబరలులు నట్టి యితరవర్గములు భారతపరిపాలనను గురించి బ్రిటిషుతత్త్వము నామోదించినసంగతి నేనిదివరలో చెప్పియుంటిని. ఈ సర్వీసులసందర్భములో నిది ముఖ్యముగ కాన్పించును. వలనన వారు వీనిని 'భారతీయులపరము' చేయవలయుననియే గోల చేసెదరు. ఈ శాఖలు, ప్రభుత్వనిర్మాణ మూలప్రకృతి, తత్త్వము పూర్తిగా మార్పుచెందవలెనని కోరరు. చాల ప్రధానమగు నీవిషయములో నెంతమాత్రము సడలుటకు వీలులేదు. బ్రిటిషు సైన్యములు, శాఖలు తగ్గినంతమాత్రముచే భారతస్వాతంత్ర్యము చేకూరనేరదు. వాని వెనుకనున్న యధికారతత్త్వము పోవలెను. వారి జీతములు, హక్కులు చాల తగ్గిపోవలెను. చట్టనిర్మాణము జరుగు యీ దినములలో రక్షణలనుగురించి పెద్దకబుర్లు వినబడుచున్నవి. ఈ రక్షణలు భారత ప్రయోజనములకొరకే యైనయెడల ఐ. సి. యస్., యితర

శాఖలు అంతరింపవలెనని శాసింపబడవలెను. నూతనచట్టముతో వీని కెట్టి సంబంధము నుండరాదు.

రక్షణశాఖలనబడునవి మరింతరక్రివంతములు, రహస్యములు నైన విషయములు. వానిని గురించి మనము విమర్శింపరాదు! నోరెత్తి మాట్లాడరాదు! ఏలనన నట్టియున్నతవిషయములను గురించి మనకేమి తెలియును? సూటుకటు, కోటుకటు కట్టిపెట్టి చాల హెచ్చు మొత్తములను చెల్లించుటొక్కటే మనము చేయవలసినపని! 1934 సెప్టెంబరులో భారత చీఫ్ కమాండర్ సర్. ఫిలిప్ ఛెట్వోడు సిమ్లాలో స్టేటుకౌన్సిలులో మాట్లాడుచు తనపని యేదియో చూచుకొనవలసినదనియు, నతని పనితో జోక్యముకల్పించుకొనరాదనియు ఘాటైన మిలిటరీ భాషలో భారత రాజకీయవేత్తలను మందలించెను. ఒక ప్రాపోజిషనుకు సవరణ నుపపాదించిన వాని నుదహరించుచు నత డిట్లు చెప్పెను. "కత్తితో సామ్రాజ్యమును సంపాదించి తదారభ్య దానిని కత్తితోనె నిలుపుగొని యుద్ధములో మునిగితేలుచు, యుద్ధప్రావీణ్యతను సంపాదించిన బ్రిటిషుజాతియొక్క సాంగ్రామిక పరిజ్ఞానము పడకకుర్చీ విమర్శకుల మాటలచే తరిమివేయబడునని యతడు, యతని స్నేహితులు భావింతురా?" అతడింకను వినసొంపైన యనేక రిమార్కులు చేసెను. అతడు తన యుపన్యాసమునంతను వ్రాసుకొనివచ్చిన వ్రాతప్రతినుండియే చదివెను.

సైనిక విషయములను గురించి తెలియని సామాన్యమానవుడు చీఫ్ కమాండరుతో వాదించు టసంగతము అయినను పడకకుర్చీ విమర్శకుడుకూడ కొన్ని యభిప్రాయములను వెలిబుచ్చవచ్చును. సామ్రాజ్యమును కత్తితో పరిపాలించువారి ప్రయోజనములు, తమ శిరములపై తళతళ మెరయు నీ యాయుధ మెప్పుడు వ్రేలాడుచుండు ప్రజల ప్రయోజనములు భేదింపవచ్చును. భారతసైన్యము భారత ప్రయోజనములను, సామ్రాజ్య ప్రయోజనములను సేవింపవచ్చును. ఈ రెంటికి భేదముండవచ్చును. లేదా సంఘర్షణమే యుండవచ్చును. తమపనిలో జోక్యము కలిగించుకొనరాదను గొప్పసేనాధిపతుల కోరి

కలు యుక్తములో, కావో ప్రపంచ యుద్ధానుభవములనుబట్టి రాజకీయవేత్త, పడకకుర్చీవిమర్శకుడు యోచింపవచ్చును. వారి తప్పుడు చాలవరకు స్వేచ్ఛయేయుండును అన్నిచరిత్రలనుబట్టి చూచిన యెడల ప్రతిసైన్యములోను—బ్రిటిషు, ఫ్రెంచి, జర్మన్, ఆస్ట్రియన్ ఇటాలియన్, రషియన్‌వారు ప్రతివిషయములోను విపరీత గందరగోళము చేసిరి. విఖ్యాతిగాంచిన బ్రిటిషుసైనిక చరిత్రకారుడు, తంత్రవేత్తయగు కెప్టెన్ లిడెలుహార్టు యుద్ధముజరుగుచున్న యొక స్థితిలో బ్రిటిషు సోల్జరులు శత్రువుతో పోరుచుండ బ్రిటిషు సేనాధిపతులు తమలో తామె పోరాచుండిరని తన 'ప్రపంచయుద్ధచరిత్ర' యను పుస్తకములో వ్రాసెను. జాతీయోపద్రవము వారిభావములలోగాని, ప్రయత్నములలోగాని యైక్యమును కలిగింపలేదు; మరియు నతడు 'యుద్ధము' విగ్రహములలోనున్న మన విశ్వాసమును నాశనము చేసెను; గొప్పవారు సామాన్యమానవులకంటె భిన్నపదార్థముతో చేయబడిరను మన వీరారాధన ముక్కలుచేసెను. నాయకుల యవసరమింకను కలదు; బహుశః యెక్కువగ కలదు. కానివారుసామాన్య మానవజాతివారేయని మన కిప్పుడు కలిగిన ప్రబోధము వారినుండి విపరీతమైనదాని నాశింపరాదనియు, లేక వారిని విపరీతముగ నమ్మరాదనియు మనలను గుర్తింపజేయుచున్నది" అని వ్రాసెను.

రాజకీయధురంధరుడగు డి లాయడ్‌జార్జి 'యుద్ధస్మరణములు' అను తన పుస్తకములో ప్రపంచయుద్ధములోని సేనాధిపతుల యొక్కయు, సేనానులయొక్కయు తప్పులను, దోషములను గురించి భయంకర చిత్రములను చిత్రించెను. ఈ దోషములు లక్షలకొలది జనుల ప్రాణములను తీసివేసెను. ఇంగ్లండు, ఆమె మిత్రులు యుద్ధములో జయించిరి. కాని యది "రక్తముతో నుక్కిరి బిక్కిరియైన విజయము" ఉన్నతోద్యోగులు మనుష్యులను, అవకాశములను నిర్లక్ష్యముగ, తెలివితక్కువగ చేబట్టి ఇంగ్లండును కొంచెమించుమించు మృత్యుసదనమునకు గొంపోయిరి. ఆమెయు. నామెమిత్రులు వారి శత్రువుల ప్రమాదమువలననే రక్షింపబడిరి. ఇంగ్లండుయొక్క

గొప్ప యుద్ధమంత్రి ఈవిధముగ వ్రాయుచు సెల్లికో ప్రభువు తల లోనికి భావముల నెక్కించుటకు శస్త్రచికిత్స చేయవలసివచ్చెనని విశదపరచెను. శక్తినుద్బోధించునట్టి నిశ్చలముఖలక్షణములను కలిగి యుండుటయే ఫ్రెంచి సేనాధిపతియైన జోఫ్రే యొక్క ముఖ్యమగుణమని యతడు భావించునట్లు కాన్పించును, "కష్టములోనున్న ప్రజలు సహజముగ దానికొఱకే చూచెదరు. గడ్డము వివేకస్థానమను దురభిప్రాయము వారికుండును."

కాని లాయిడ్ జార్జి కమాండ్రన్ ఛీఫ్, ఫీల్డుమార్షల్ హేగ్ మీదనే ప్రధానదోషము నారోపించెను. హేగ్ అసాధారణాహంకారముగలిగి రాజకీయవేత్తలు. యితరులు చెప్పినదానిని వినకపోవుటయేగాక ముఖ్యవిషయములను బ్రిటిషు మంత్రివర్గమువారికి కూడ తెలియపర్చక ఫ్రాన్సులోనున్న బ్రిటిషుసైన్యమును మహోపద్రవము లోనికి దింపెను. అపజయ మతని నెదుర్కొనినను అతడు పశాండెలీ కేంబ్రైయను భయంకరమైన రొంపిస్థలములో ననేకమాసములవరకు తన తెలివితక్కువ పోరాటమును సాగించెను. అచ్చట ఆఫీసరు లొక్కరే 17,000 మంది చనిపోయిరి నాలుగులక్షలమంది ధైర్యవంతులైన బ్రిటిషు సోల్జరులు 'చావుసంఖ్యకు వచ్చిరి. చనిపోయిన తరువాత 'నా యజ్ఞాతసోల్జరు' గౌరవింపబడుట మంచిదని, అతని జీవిత మతిచౌకగా నుండెను. జీవించియుండగా నతని లెక్క యేమియు లేకపోయెను.

ఇతరులవలె రాజకీయవేత్తలును తఱచు ప్రమాదములకు లోనగుచుందురు. కాని ప్రజాస్వామిక రాజకీయవేత్తలు ప్రజలను, విషయములను గురించి, బాధ్యతతో మెలగవలెను. సాధారణముగ వారు తమతప్పులను గుర్తించి సవరించుకొన ప్రయత్నింతురు. అధికార రాజ్యముచేయుచు విమర్శకు స్థానములేనిచోట సైనికుడు వేరువిధమగు వాతావరణములో తయారగును అతడితరులసలహా పాటింపడు. అతడు తప్పుచేసినప్పుడు పూర్తిగ చేయుచు తప్పు దిద్దుకొనమనినను దిద్దుకొనడు.

సైన్యములో 'భారతీయులను ప్రవేశపెట్టు' విధానము జరుగుచున్నదనియు, మరి ముప్పదిసంవత్సరములలో నొక భారతసేనాధిపతి కూడ భారతరంగములో కాన్పించవచ్చుననియు చెప్పబడుచున్నది. నూరు సంవత్సరములకు యెక్కువకాలము మించకుండ భారతీయుల వశముచేయుపద్ధతి చాలవర కభివృద్ధి కావచ్చును. మంచితరుణములో యింగ్లండు ఒకటిరెండు సంవత్సరములలోనే లక్షలకొలదిగ మహాసైన్యము నెట్లు నిర్మింపగలిగెనో యాశ్చర్యముగ నుండును. మనకు సలహా చెప్పు సలహాదారులే దానికున్నయెడల నది యెక్కువ జాగ్రతగను, భద్రముగను నడిచియుండెడిది. కట్టుదిట్టమైన శిక్షణ గల యీ సైన్యము తయారగుటకు చాల పూర్వమే నిశ్చయముగ యుద్ధము ముగిసియుండెడిది. రష్యన్ సోవియటు సైన్యములుకూడ రమారమి శూన్యమునుండియే ప్రారంభమై యనేకమంది శత్రువుల నెదుర్కొని విజయముగాంచుటగూడ మనము చూచుచున్నారము. నేడు ప్రపంచములో నవి యత్యంతసమర్థమైన సైన్యములలో నొకటిగనున్నవి యుద్ధములో మునిగి తేలుచు 'యుద్ధప్రావీణ్యతను' సంపాదించిన సేనాధిపతులెవరు వారికి సలహాయిచ్చినట్లు తోచదు.

డేరాడూనులో నుద్యోగస్తులబిడ్డల నాఫీసరులుగ తయారుచేయుటకొరకై సైనికశిబిరము కలదు. వారు కవాతుచేయుటలో నతిచురుకుగనుందురట! వారు నిస్సందేహముగ గొప్ప ఆఫీసరులు కావచ్చును. సాంకేతిక శిక్షణ లేనిదే యిట్టి శిక్షణవలన ప్రయోజనమేమియని నేనొక్కొక్కప్పు డాశ్చర్యపడుచుందును. పూర్వకాలపు గోమనుపటాలమువలన నేడెంత ప్రయోజనముండునో కాల్బలము, గుర్రపుదళమువలనను నంతియే ప్రయోజనముండును. వాయుయుద్ధము, వాయుబాంబులు, టాంకులు శక్తివంతమైన మరఫిరంగులు గల యీ రోజులలో బాణము, విల్లుకంటె తుపాకి కొంచెము శ్రేష్ఠమైనది; వారిశిక్షకులు, సలహాదారులు ఈ సంగతి గుర్తింపకపోలేదు.

భారతదేశములో బ్రిటిషు పరిపాలనా చరిత్ర యెట్టిది ? దాని దోషములు మన తప్పులఫలితములే యైనపుడు ఫిర్యాదు చేయుటకు మన మెవరము? పరివర్తనమను ప్రవాహములో సంపర్కమునువీడి మురుగుగుంటలలో ప్రవేశించి మనలో మనము తృప్తి చెందుచు, నుష్ట్రపక్షివలె బయటజరుగుచున్న దానిని నిర్లక్ష్యముచేయుచో మన నాశనమును మనమే తెచ్చుపెట్టుకొనెదము. ప్రపంచములో బయలుదేరిన యొక నూతన భావతరంగ శిఖరముమీద బ్రిటిషువారు మన దేశము వచ్చి శక్తివంతమైన చారిత్రకశక్తులకు ప్రాతినిధ్యము వహించిరి. మనము మనల నెగురగొట్టుచు నిటునటు పడవేయు గాలి వానను గురించి ఫిర్యాదుచేతుమా? లేక మనలను గజగజ వణికించు చలిగాలిని గురించి చేతుమా? గతమును గత కలహములను చాలించి మనము భవిష్యత్తు నెదుర్కొనవలెను. శాస్త్రమును విశ్వాంతమయిన తత్వంతతిని మనకు ప్రసాదించిన బ్రిటిషువారికి మనము కృతజ్ఞులము. అయినను బ్రిటిషు ప్రభుత్వమువారు భారతదేశములో చీలిక, మత పిచ్చి, అభివృద్ధిభంగము, కులకక్షలు, మోసము మొదలగు స్వభావములను ప్రోత్సహించుటకు చేసిన యత్నములను మరచిపోవుట లేక ప్రశాంతచిత్తముతో వీక్షించుట కష్టసాధ్యము బహుశః యదికూడ మన కవసరమైన యొకపరీక్ష, యొకసవాలు. నవ్యభారత ముత్పన్న మగు లోపల దౌర్బల్యమును, నపవిత్రతను, అవినీతిని పాద్రోలి యగ్నితప్తముచేయవలెను.

55

సివిల్ వివాహము - లిపిసమస్య

1933 సెప్టెంబరులో నొకవారము పూనా బొంబాయిలలో గడపిన తరువాత నేను లక్నో తిరిగివచ్చితిని. నా తల్లి యచ్చట నింకను ఆస్పత్రిలోనేయుండి చాల నెమ్మదిగ కోలుకొనుచుండెను. కమలకూడ లక్నోలోనుండి యామె కుపచారముచేయుచుండెను వారము వారము నా చెల్లెండ్రు అలహాబాదునుండి వచ్చుచుండిరి. నే నచ్చట రెండుమూడు వారములుంటిని. అలహాబాదులోకంటె నా కిచ్చటనే యెక్కువ తీరిక దొరికెను. నిత్యము ఆస్పత్రికి రెండుసారులు పోవుచుండుటయే నా ప్రధానకార్యము. తీరికగలగంటలలో నేను పత్రికలకు కొన్ని వ్యాసములు వ్రాసెడివాడను ఇవి దేశమంతట ప్రచురింపబడుచుండెను. "భారతమా! యెచ్చటకు?" అను నొక వ్యాసపరంపర ప్రజాదృష్టినాకర్షించెను. ఈ వ్యాసములు టెహరను కాబూలులలో పరిషియనుభాషలోనికి తర్జుమాచేయబడెనని నేను తెలుసుకొంటిని నవీనాభివృద్ధితోను. ఆధునిక పాశ్చాత్యభావముతోను సంపర్కముగలవారికి వ్యాసములలో గ్రొత్తదనము, స్వకపోల కల్పితము లేవియునుండవు. కాని, హిందూదేశములో మన ప్రజలు గృహచ్ఛిద్రములలో మునిగియుండుటచే నితరచోట్ల జరుగు విషయముల నవలోకించుట కంతె వీలులేకుండెను. నా వ్యాసముపట్ల చూపబడిన యాదరణయు, ననేక యితర సూచనలను ప్రజలు విశాల భావముల నభివృద్ధిచేయుచున్నారని విశదము చేసెను.

ఆస్పత్రిలోనుండుట మా తల్లి కతి విసుగుగ నుండుటచే మే మామె నలహాబాదు తీసికొనిపోవనిశ్చయించితిమి. నా సోదరి కృష్ణ కుమారియొక్క వివాహముకూడ దీనికొక కారణము. హఠాత్తుగ నన్ను తిరిగి జయిలుకు తీసికొనిపోవులోపల నీ వివాహము జరిపించుటకు మేము వేగిరపడుచుంటిమి. శాసనోల్లంఘన మింకను కాంగ్రెసు కార్యక్రమములో నుండ కాంగ్రెసు సంస్థయు, ననేక యితర సంస్థలు

సక్రమసంఘములుగా నుండునన్న బయట నెంతకాలముండనిచ్చెదరో నాకు తెలియకుండెను.

మేము అక్టోబరు మూడవవారములో వివాహము జరుప నెంచితిమి. దానినొక లౌకిక క్రియగ జరుపదలంచితిమి. యదార్థమునకు మాకు మరియొక మార్గము లేక పోయినను, నేను దీనికి సంతసించితిని ఈ వివాహము రెండువర్గముల మధ్య [బ్రాహ్మణ, బ్రాహ్మణేతరుల మధ్య] జరుగనుండెను. ప్రస్తుత బ్రిటిషుయిండియాను చట్టము ప్రకారము ఏ మతము నిట్టి వివాహమును అంగీకరింపదు. అదృష్టవశమున నూతనముగ నామోదింపబడిన యొక సివిల్ వివాహచట్టము మాకు సంప్రాప్తమయ్యెను. ఇట్టివి రెండు చట్టములుండెను నా చెల్లెలివివాహము జరిగిన రెండవచట్టము క్రింద హిందువులు, తత్సన్నిహిత బౌద్ధ, జైన, సిక్కు మతస్థులు మాత్రమే వివాహము చేసికొనవచ్చును పుట్టుకచేత లేక మారుటచేత వధూవరు లీమతములలో నొకదానికి చెందకపోయినచో నీ రెండవచట్టము వారికి వర్తింపదు. వారికి మొదటి చట్టము వర్తించును. దీనిప్రకారము వారుభయులును ప్రధానమతములను నిరసింపవలెను. లేదా వారు వాటికి చెందని ట్లొక వాఙ్మూలమునైన నియ్యవలెను. కేవల మనవసరమగు యీ నిరసన యొక పెద్దయల్లరి. ఎట్టి మతేచ్ఛ లేనివారైనను చాలమంది యీ వాఙ్మూలమును అంగీకరింపనిచో యీ చట్టమువలన లబ్ధిపొందజాలరు. వివిధ మతములకు చెందు శిష్టాచార సంపన్నులంతర్వివాహములకు సౌకర్యమిచ్చు మార్పులను తిరస్కరింతురు ఫలితమేమన ప్రజలిట్టి నిరసన వాఙ్మూలమునిచ్చునట్లు బలాత్కరింపబడుదురు. లేదా చట్టముక్రిందకువచ్చుటకు నామకః మార్చుచుందురు వ్యక్తిగతముగ నే నంతర్వివాహములను ప్రోత్సహింపగోరెదను మనము ప్రోత్సహించినను మానినను, అట్లుచేసికొనుట అంగీకరించు సామాన్య సివిల్ వివాహచట్ట మొకటి యత్యావసరము మతమును మార్చుకొనుట లేక నిరసించుట యవసరము లేకుండగనే యది యన్ని మతస్థులవారు వివాహముచేసికొనుట కనుమతింపవలెను.

నా చెల్లెలు వివాహమునుగురించి మే మెట్టి యట్టహాసము చేయలేదు. అది చాల నిరాడంబరముగ జరిగెను. సాధారణముగ భారత వివాహములలో జరుపబడు నట్టహాసము నాకు గిట్టదు. నా తల్లి వ్యాధిగ్రస్తురాలై యుండుటచే, ఎంతకంటె నెక్కువగ శాసనోల్లంఘన మింకను జరుగుచు మన సహచరులు చాలమంది జయిళ్ళలోనుండుటచేత నెట్టి యాడంబరమునకు తావు లేకుండెను. కొద్దిమంది బంధువులు స్థానిక స్నేహితులు నాహ్వానింపబడిరి ఇది నా తండ్రిగారి పాతస్నేహితులకు చాలమందికి కష్టము కలిగించెను. నేను వారిని బుద్ధిపూర్వకముగ నిర్లక్ష్యముచేసితినని యనుకొనిరి.

వివాహాహ్వానపత్రిక ల్యాటిను లిపిలో హిందూస్థానీ భాష వ్రాయబడెను ఇదియొక నూతనవిషయము. ఇట్టి యాహ్వానము లెప్పుడు నాగరిలిపిలోగాని పర్షియను లిపిలోగానియుండును. హిందూస్తానీభాషను ల్యాటిను లిపిలో వ్రాయుట సైనిక మిషనరీ సంఘములలోతప్ప మరెవరికీ తెలియదు. ప్రజలు దీని నెట్లు భావింతురో నేను చూడగోరితిని. ఇది యంత బాగుగ నాదరింపబడలేదు. ఇవి తక్కువ మందికే పంపబడెను. విరివిగ పంపియుండినచో మరింత యెక్కువ యనాదరణ పుట్టెడిది. గాంధీజీ నేను చేసినదాని కంగీకరింపలేదు.

నేను ల్యాటినుభాషను వరించుటచే దాని నుపయోగింపలేను టర్కీలోను, మధ్య ఆసియాలోను దానికి గలిగిన విజయము నన్ను మెప్పించెను. దానినభిమానించుటకుబలవత్తర కారణములే యుండెను. అయినను నేను విశ్వసింపలేదు. విశ్వసించినను ప్రస్తుత పరిస్థితులలో భారతదేశమున నది యుపయోగింపబడుటకు రవంత యాస్కారమును లేదని నే నెరుగుదును దాని కన్నిప్రక్కలనుండియు, జాతీయవాదులు_మతము, హిందువులు, ముస్లిములు, నవీనులు, ప్రాచీనులు తీవ్రమైన వ్యతిరేకులు ఈ వ్యతిరేకము కేవల మ్ముద్రేకమువిూద నాధారపడదని నేను భావించెదను. గొప్పసంస్కారము. చరిత్ర గల యేభాషయైనను తనలిపిని మార్చుకొనుట సామాన్యవిషయము కాదు. ఏలనన లిపి సాహిత్యములో నొకయత్యంతసన్నిహితభాగము.

లిపిని మార్చినచో భిన్నశబ్దచిత్రములు, భిన్నధ్వనులు, భిన్నభావములు నుత్పన్నమగును. క్రొత్తసాహిత్యమునకు, పాతసాహిత్యమునకు మధ్య దాటశక్యముకాని గోడయొకటి నిర్మింపబడును; రెండవది నశించి కొంచెమించుమించు విదేశభాషయగును. సంరక్షించుకొనుటకుదగిన సాహిత్యములేనిచోట నిట్టిసాహసము చేయవలెను. భారతదేశములో నే నిట్టిమార్పు భావింపజాలను. ఏలనన మనసాహిత్యము సారవంతమైనది. యమూల్యమైనది. అది మన చరిత్రతోను, భావములతోను బద్ధమైయున్నది. అది మన ప్రజల జీవితములతో సన్నిహిత సంబంధము కలిగియున్నది. అట్టి మార్పును బలవంతముగ తెచ్చుట క్రౌర్యము, హాస్యమగును. ఇది మన ప్రజాసామాన్య విద్యాభివృద్ధి నరికట్టును.

కాని యీ సమస్య భారతదేశములో నేడు తర్కింపవలసినది కూడకాదు సంస్కృతభాషనుండి పుట్టిన-హిందీ, బెంగాలీ, మరాటీ, గుజరాతీల కొక సామాన్యలిపి సృష్టించుటచే మనమిపుడు చేయవలసినది లిపిసంస్కారమని నాకు తోచుచున్నది. ఉన్నస్థితిలో వాటిలిపులొకేమూలమునుండి బయలుదేరి యెక్కువ భేదములులేక యుండుటచే నొక సామాన్యలిపిని కనుగొనుట కష్టముకాదు. దీనివలన నీ నాలుగు నేకగర్భజనితభాషలు మరింత సామీప్యము పొందగలవు.

ఇంగ్లీషుప్రభుత్వము భారతదేశములో వందలకొలది భాషలు గలవను నొక కథ ప్రపంచమునకు సతతము చాటుచుండెను. రుజువునకు జనాభాలెక్కలు కలవు. వీటి నొకతరగతికి చేర్చి 'వర్నాక్యులర్లు' అనగా బానిసల భాషలు అనిపిలుతురు. (ల్యాటినులో 'వర్నా' అనగా యింటపుట్టిన బానిసయని అర్థము) మనవారు చాలమంది, యీ యర్థము నెరుగక దీనిని స్వీకరించిరి. ఇంగ్లీషువారు భారతదేశములో నొకజీవితకాలము గడుపుచు భాషను బాగుగ నేర్చుకొనుట కెంతమాత్రము కష్టపడకపోవుట యాశ్చర్యము. వారియొద్ద నుండు 'ఖాన్‌సామా' (వంటలవాండ్రు, సేవకులు) సహాయముతో వారొకవిధమగు నసాధారణ పిచ్చిభాషను, పచ్చిపులుసు హిందుస్థాని తయారుచేసి యదియే నిజమైన వస్తువని యూహింతురు భారత జీవి

తమును గురించిన విషయములను తమ క్రిందివారినుండి, యిచ్చకములాడువారినుండి గ్రహించునట్లే వారు హిందూస్థానీని గురించిన భావములను తమయింటి నౌకరులనుండి తీసికొనెదరు, నౌకరులు తమ 'సాహిబ్ లోగ్' (యజమానులు)కు నేమియు నర్థముకాదను భయముచే పచ్చిపులుసు హిందూస్థానీలోనే మాట్లాడవలెనను నియమము పెట్టుకొనెదరు. హిందూస్థానీభాషకు నితర భారత భాషలకు నుత్తమ సాహిత్యమున్న సంగతి వారి కెంతమాత్రము తెలియనట్లు కాన్పించును

భారతదేశములో రెండు మూడువందల భాషలున్నట్లు జనాభా లెక్కలు చెప్పునట్లే జర్మనీలో యేబది లేక అరువది భాషలున్నట్లు చెప్పుచున్నవి. జర్మనీలోని చీలికలకు, వ్యత్యాసములకు నివి కారణములని యెవడును చెప్పినట్లు నాకు జ్ఞాపకము లేదు. యదార్థముకు జనాభా లెక్క అన్నివిధములగు చిన్న చిన్న భాషలను (ఒక్కొక్కప్పుడే కొద్దివేలమందియో మాట్లాడుభాషకూడ ఉచ్చరించును తఱచు భాషాభేదములుకూడ శాస్త్రపరిశోధనకొరకు) వేరు వేరు భాషల క్రింద జేర్చబడును. వైశాల్యమునుబట్టి చూచినచో భారతదేశములో నతితక్కువ భాషలున్నట్లు నాకు కాన్పించును. యూరపులోని సమానవైశాల్యముగల ప్రాంతములతో పోల్చినచో భాషసందర్భములో నిచ్చట నెక్కువ సన్నిహిత బాంధవ్యమున్నది. కాని చదువు బొత్తిగా లేకపోవుటచే సామాన్య ప్రమాణములు లేక భాషాభేదము లేర్పడెను. భారతదేశములో నున్న ప్రధాన భాషలు హిందూస్థానీ, (హిందీ, ఉరుదు రెండు రకములును) బెంగాలీ, గుజరాతీ, మరాటీ, తమిళము, తెలుగు, మళయాళము, కన్నడము, వీనికి అస్సాముభాష ఉరియా, సింధి, పుస్తు, పంజాబీలను కలిపినచో (కొద్దిమంది యాటవికులు, కొండజాతులుతప్ప) దేశమంతయుపూర్తి యగును, వీనిలో నుత్తర, మధ్య, పశ్చిమ భారతములో వ్యాపించుయుండో ఆర్యనుభాషల కెక్కువ సంబంధము కలదు. దక్షిణమున నున్న ద్రావిడభాషలు, భిన్నములైనను సంస్కృతభాషాప్రభావమునకు లొంగి సంస్కృతపదములతో నిండియున్నవి.

పైనుదహరింపబడిన యెనిమిది ప్రధానభాషలకు యమూల్య ప్రాచీనసాహిత్యములుకలవు. వానిలో ప్రతిభాషయునేడువిశాలప్రాంతములలో మాట్లాడబడును. ఆ ప్రాంతములు స్పష్టముగ, నిస్సందేహముగ వేరుచేయబడియే యున్నవి. ఈ భాషలనుమాట్లాడువారిసంఖ్యలనుబట్టి చూచినచో నివి ప్రపంచములోనున్న పెద్దభాషలలో చేరును. అయిదుకోట్లమంది బెంగాలీభాష మాట్లాడుదురు. హిందూస్థానీ భారతదేశములో పదునాల్గుకోట్లమంది మాట్లాడుదురని నేనూహించెదను. అది భారతదేశమంతట చాలమందిచే కొంతవర కర్థము చేసుకొనబడుచున్నది. అట్టిభాషకు విశేషావకాశములు కలవు. అది బలీయమైన సంస్కృతభాషాపునాదిపైనిర్మింపబడి పర్షియనుతో సన్నిహిత సంబంధము కలిగియున్నది. ఈ విధముగ నది రెండు సారవంతములైన నిధులనుండి శక్తిని గ్రహింపగలదు. నిశ్చయముగ నీమధ్య సంవత్సరములలో నది యింగ్లీషుభాషనుండికూడ బలము సంపాదించెను. దక్షిణముననున్న ద్రావిడదేశ మొక్కచోటనే హిందూస్థాని రమారమి విదేశభాషవలెనుండును. కాని, యచ్చటిప్రజలు దానిని, నేర్చుకొనుటకు విశేషప్రయత్నములను చేయుచున్నారు. రెండు సంవత్సరముల క్రిందట (1932 లో) దక్షిణమున హిందీ ప్రచారము చేయుచున్న యొక వైచ్ఛిక ప్రయివేటుసంఘముయొక్క లెక్కలను నేను చూచితిని. గతపదునాల్గువత్సరములలోను దాని ప్రయత్నమువలన నొక్క మద్రాసురాష్ట్రములోనే 550,000 మంది హిందీ చదివినట్లు చెప్పబడెను ప్రభుత్వముచే నేవిధముగను బలపరుపబడని వైచ్ఛికయుద్యమమున కిది సామాన్య విషయముకాదు. హిందీ చదువుకొనినవారిలో చాలమంది తమంత తామే యీ యుద్యమ ప్రచారకులగుచున్నారు.

హిందుస్థానీ భారతదేశములో సామాన్యభాష కాగలదనుటకు నాకెట్టి సందేహము లేదు. మామూలు పనులకు నేడదియట్లె యున్నది. లిపి నాగరలిపి యుండవలెనా పర్షియనులిపి యుండవలెనా యను మూర్ఖవాదములవలన దాని యభివృద్ధియరికట్టబడెను. ఎక్కువ సంస్కృత పదముల నుపయోగింపవలెనని యొకరు, పర్షియను పద

పైనుదహరింపబడిన యెనిమిది ప్రధానభాషలకు యమూల్య ప్రాచీనసాహిత్యములుకలవు. వానిలో ప్రతిభాషయు నేడువిశాలప్రాంతములలో మాట్లాడబడును. ఆ ప్రాంతములు స్పష్టముగ, నిస్సందేహముగ వేరుచేయబడియే యున్నవి. ఈ భాషలనుమాట్లాడువారిసంఖ్యలనుబట్టి చూచినచో నివి ప్రపంచములోనున్న పెద్దభాషలలో చేరును. అయిదుకోట్లమంది బెంగాలీభాష మాట్లాడుదురు. హిందూస్థానీ భారతదేశములో పదునాల్గుకోట్లమంది మాట్లాడుదురని నే నూహించెదను. అది భారతదేశమంతట చాలమందిచే కొంతవర కర్థము చేసుకొనబడుచున్నది. అట్టిభాషకు విశేషావకాశములు కలవు. అది బలీయమైన సంస్కృతభాషాపునాదిపైనిర్మింపబడి పర్షియనుతో సన్నిహిత సంబంధము కలిగియున్నది. ఈ విధముగ నది రెండు సారవంతములైన నిధులనుండి శక్తిని గ్రహింపగలదు. నిశ్చయముగ నీమధ్య సంవత్సరములలో నది యింగ్లీషుభాషనుండికూడ బలము సంపాదించెను. దక్షిణముననున్న ద్రావిడదేశ మొక్కచోటనే హిందూస్థాని రమారమి విదేశభాషవలెనుండును. కాని, యచ్చటిప్రజలు దానిని, నేర్చుకొనుటకు విశేషప్రయత్నములను చేయుచున్నారు. రెండు సంవత్సరముల క్రిందట (1932 లో) దక్షిణమున హిందీ ప్రచారము చేయుచున్న యొక స్వైచ్ఛిక ప్రయివేటుసంఘముయొక్క లెక్కలను నేను చూచితిని. గతపదునాల్గువత్సరములలోను దాని ప్రయత్నములవలన నొక్క మద్రాసురాష్ట్రములోనే 550,000 మంది హిందీ చదివినట్లు చెప్పబడెను. ప్రభుత్వముచే నేవిధముగను బలపరుపబడని స్వైచ్ఛికయుద్యమమున కిది సామాన్య విషయము కాదు. హిందీ చదువుకొనినవారిలో చాలమంది తమంత తామే యీ యుద్యమ ప్రచారకు లగుచున్నారు.

హిందూస్థానీ భారతదేశములో సామాన్యభాష కాగలదనుటకు నా కెట్టి సందేహము లేదు. మామూలు పనులకు నేడదియట్లె యున్నది. లిపి నాగరలిపి యుండవలెనా పర్షియనులిపి యుండవలెనా యను మూర్ఖవాదములవలన దాని యభివృద్ధియరికట్టబడెను. ఎక్కువ సంస్కృత పదముల నుపయోగింపవలెనని యొకరు, పర్షియను పద

ములనుపయోగింపవలెనని యొకకట్టు దానిని దిగలాగెను. రెండు లిపులనుకూడ నధికారరీత్యా యంగీకరించుట తప్ప దానికి వేరొక మార్గములేదు. ప్రజలు వారి యిష్టమువచ్చిన లిపి నుపయోగింపవలెను. కాని రెండు కొనలకు తీసికొనిపోవు స్వభావములను నిరుత్సాహపరచి సామాన్యోపయోగములో నున్న వాడుకభాషమీద నాధారపడు మధ్యరకపు సాహిత్యభాష నభివృద్ధిచేయుటకు ప్రయత్నము జరుగవలెను. జనసామాన్యములో విద్య యభివృద్ధియైన కొలది యిది విధాయకముగ జరుగగలదు. ప్రస్తుతము సాహిత్యాభిరుచికి, శైలికి మధ్యవర్తులనుకొనబడు చిన్నమధ్యతరగతి వర్గముల వారతిసంకుచిత మనస్కులు, ఛాందసులు, తమ ప్రజలతోను, ప్రపంచ సాహిత్యముతోను సంపర్కములేక, చైతన్యమనునదియే లేని ప్రాచీన రూపములకు వారంటిపెట్టుకొనియుందురు.

హిందూస్థానీ భాషాభివృద్ధియు, వ్యాప్తి భారతదేశములోని యితర గొప్ప భాషలైన—బెంగాలీ, గుజరాతీ, మరాటీ, ఉరియా, దక్షిణదేశ ద్రావిడభాషల యథోచితోపయోగముతోను, సంపదభివృద్ధులతోను తలపడరాదు, తలపడవు. వీనిలో కొన్ని హిందూస్థానీ కంటె నిదివరకే యెక్కువ మెలకువను, బుద్ధిపాటవమును కలిగి యున్నవి. ఆ యా ప్రాంతములలో విద్య గఱపుటకు, నితర వ్యవహారములకు నవియే యధికారసమ్మతములైన భాషలు వానిద్వారా ప్రజాసామాన్యములో విద్య, విజ్ఞానము ఎక్కువ త్వరితముగ వ్యాప్తినొందగలవు.

ఇంగ్లీషు భారతదేశములో సామాన్యభాష కాగలదని కొందరు భావింతురు. ఏ కొద్దిమంది పై తరగతుల విద్యాధికుల విషయములోనో తప్ప నాకిది పిచ్చియూహవలె కాన్పించును ప్రజాసామాన్యముయొక్క విద్యా విజ్ఞాన సమస్యకు దీనికి సంబంధమేమియు లేదు. ఇంగ్లీషు అంతకంత కెక్కువగా సాంకేతిక, శాస్త్రి వ్యవహార విషయములలో నుత్తర ప్రత్యుత్తరములను జరుపుకొను భాషగ నుండవచ్చును. మనలో చాలమంది విదేశ భాషలను (ప్రపంచభావములను, చర్యలను తెలిసికొనుచుండుటకు) తెలిసికొను

టత్యావసరము. మన విశ్వవిద్యాలయములు యింగ్లీషుతోపాటు, ఫ్రెంచి, జర్మన్, రష్యన్, స్పానిషు, ఇటాలియను భాషలనుకూడ ప్రోత్సహింప కోరెదను. ఇంగ్లీషును నిర్లక్ష్యము చేయవలెనని దీని యర్థముకాదు. ప్రపంచమును గురించి సమదృష్టి కలిగియుండవలెనని మన మొక్క యింగ్లీషు సులోచనములనే ధరింపరాదు. ఒక్క భావము, ఒక్క లక్ష్యమునిరాదనే కేంద్రీకరించుటచేత మన మిదివర కేమానసికముగ కావలసినంత యంగవైకల్యము పొందితిమి. మన జాతీయవాదులలో నతిపిచ్చియెత్తినవారుకూడ భారతదేశమునకు సంబంధించిన బ్రిటిషుదృష్టినే తా మెంత నిర్బంధింపబడిరో గుర్తింపజాలకున్నారు.

ఇతర విదేశభాషలను మనమెంత ప్రోత్సహించినను, ఇంగ్లీషు భాషయే మనలను బయటి ప్రపంచముతో కలుపు ప్రధానసంధానకరణిగ నుండకతప్పదు. అది తప్పనిసరి. గతకొన్ని పురుషాంతరముల నుండి మన మాంగ్లము నభ్యసించుటకు యత్నించుచుంటిమి. ఈ యత్నములో మనము కొంత మంచి విజయమును గాంచితిమి. ఈచిరకృషివలన కలిగిన లబ్ధిపొందక మన మిపుడు దీనినంతను తుడిచివేయుట మూర్ఖత్వమగును నేడు యింగ్లీషుకూడ చాల విశాలవ్యాప్తిని పొందిన ప్రపంచభాష యనుటకు సందేహము లేదు. అది యితరభాషలను వేగముగ దిగద్రొక్కుచున్నది. 'అమెరికను' భాష దాని స్థానము నాక్రమించిన తప్ప యదియే యంతర్జాతీయ వ్యవహారములకు, రేడియోద్వారా వార్తాప్రసారమునకు తగు భాష కాగల సూచనలు కలవు. కనుక మనమాంగ్లభాషాజ్ఞానమును సాగింపచునే యుండవలెను. దానిని సాధ్యమైనంతవరకు నేర్చుకొనుటయే యుక్తము; కాని యిపుడు మనలో కొంతమంది చేయునట్లు యా భాషలోనున్న యందచందములను గ్రహించుట కెక్కువ శక్తిని, కాలమును వినియోగించుట ప్రయోజనహీనమని నా యభిప్రాయము. వ్యక్తు లట్లు చేయవచ్చును. కాని యనేక సంఖ్యాకులకు దానిని లక్ష్య

ముగానుంచుట వారిపై ననవసర భారమును వేయుట యగును; వారి యితర యభివృద్ధి కది యాటంకమగుచు.

ఈమధ్య 'సామాన్య ఆంగ్లము' నన్నెక్కువగ నాకర్షించెను. ఇంగ్లీషును యింత యత్యధికముగ నాశముచేయుట గొప్ప పురోభివృద్ధిసూచకము 'ప్రమాణ ఇంగ్లీషు' భాషకంటె మనము సామాన్య భాషను విరివిగ నేర్పించుట యుక్తము. మొదటిదానిని పండితులకు, ప్రత్యేక విద్యార్థులకు విడిచివేయవచ్చును,

హిందూస్తానీ యింగ్లీషునుండియు నితర విదేశభాషలనుండియు ననేక పదములను తీసికొని తనలో లీనముచేసికొనుటను నేను వ్యక్తిగతముగ ప్రోత్సహింపగోరెదను. మనకు నవీనపదములు లేవు. కనుక నిది యవసరము. సంస్కృతమునుండియు, అరబ్బీనుండియు నూతనముగ కష్టమైన పదజాలమును సృష్టించుటకంటె బాగుగ తెలిసిన పదములను వాడుటయే శ్రేష్ఠము. విదేశపదముల నుపయోగించిన భాష మైలపడిపోవునని కొందరందురు. ఇది చాల పొరపాటు. మన భాషను సాగునట్లుచేసి, ఇతరభాషలోని పదములను, భావములను తనలో నిముడ్చుకొను శక్తిగలిగి పెరుగునట్లు చేసినప్పుడే భాష వృద్ధిపొందును

నా చెల్లెలు వివాహ మగుటతోడనే నా సహచరుడు, పాత స్నేహితుడు, సంవత్సరమువయిగా వ్యాధిగ్రస్తుడునైయున్న శివప్రసాదగుప్తను చూచుటకు నేను కాశీ వెళ్ళితిని. లక్నోజయిలులో నుండగా నతనికి హఠాత్తుగ పక్షవాతము వచ్చెను. అప్పటినుండి యతడు నెమ్మదిగ కోలుకొనుచుండెను నేను కాశీలోనుండగ నొక చిన్న హిందీసాహిత్యసంఘము నాకు స్వాగతపత్రము నిచ్చెను. దాని సభ్యులతో నేను చక్కని యిష్టాగోష్ఠి సలిపితిని. నా కతిస్వల్పముగా తెలియు విషయములనుగురించి పండితులముందర మాట్లాడుటకు సందేహించుచుంటినని నేను చెప్పితిని. అయినను నేను కొన్ని సూచనలు చేసితిని. సమాసములతోను, అలంకారములతోను, కృత్రిమ సంస్కృతపదములతోను, ప్రాచీనరూపములతోను వ్రాయ

బడు హిందీని నేను విమర్శించితిని. కొద్దిమంది సభ్యులకే యుద్దేశింపబడు యీరాజభాషను విడిచిపెట్టవలెనని సూచించితిని. హిందీరచయితలు బుద్ధిపూర్వకముగ ప్రజలకొరకు, ప్రజల కర్థమగు భాషలోనే వ్రాయవలెనని చెప్పితిని. ప్రజాసంబంధమువలన భాషకు నూతన వికాసము, సరళత చేకూరును. హిందీగ్రంథకర్తలు పాశ్చాత్యభావములపట్ల, సాహిత్యముపట్ల నెక్కువ శ్రద్ధవహించినచో దానివలన నెక్కువలబ్ధి పొందగలరని నేను సూచించితిని. యూరపియనుభాషల యుత్తమకావ్యములనుండియు, నాధునిక భావములనుగురించి వ్రాయు పుస్తకములనుండియు, తర్జుమాలనుచేయుట చాల యవసరము. అధునిక బెంగాలీ, గుజరాతీ, మరాటీలు, యీ సందర్భములలో నాధునిక హిందీకంటె నెక్కువ యభివృద్ధిలో నున్నవనికూడ నేను చెప్పితిని. నిశ్చయముగ హిందీకంటె బెంగాలీలో నీమధ్య నెక్కువ కల్పనాశక్తి ప్రదర్శింపబడెను ఈ విషయములనుగురించి మిత్ర సంభాషణలను జరిపినతరువాత నేను వచ్చివేసితిని. నా విమర్శలు పత్రికలకు పంపబడునని నేను భావింపలేదు. అచ్చటనున్నవారెవరో హిందీపత్రికల కొరకు రిపోర్టు పంపిరి.

అప్పుడు హిందీపత్రికలు నన్నుగురించి గగ్గోలుపెట్టి నేను హిందీని విమర్శించుచు నది బెంగాలీ, గుజరాతీ, మరాటీలకుతీసిపోవు చున్నదని చెప్పసాహసించితి నని యల్లరిచేసెను నేనేమియు తెలియనివాడ ననిః; నన్ను అణచివేయుటకు మందలించుటకు ననేక పరుష పదము లుపయోగింపబడెను. ఆ చర్చను గమనించుటకు నాకు తీరిక లేకపోయెను అది నేను తిరిగి జయిలుకు పోవువరకు సాగుచునే యుండెనట!

ఈ విషయము నాకు కనువిప్పయ్యెను. అది హిందీపండితుల యొక్కయు, పత్రికారచయితల యొక్కయు నసాధారణ సహనరాహిత్యతను, తమ బాగుకోరినవారిచే చేయబడిన యొకచిన్న నిష్కపటవిమర్శను భరించుటపట్ల వారి నిరాకరణమును తెలుపుచుండెను. తక్కువవార మనిపించుకొనుటయా? అను భావము పనిచేసెను. ఆత్మవిమర్శయను

నది యెంతమాత్రము లేదు. విమర్శక ప్రమాణములు హీనముగ నుండెను గ్రంథకర్తయు విమర్శకుడు పోరుపెట్టుకొని వ్యక్తిగత యుద్దేశ్యములు గలవని యొకరినొకరు నిందించుకొనుట యసామాన్య విషయముగాదు. వారి దృష్టియంతయు సంకుచితము. బూర్జువావాసన కలది. ప్రాంతీయాభిమానము. గ్రంథకర్తలు, పత్రికారచయితలు విస్తారమైన ప్రజాసామాన్యమును, వారిప్రయోజనములను నిర్లక్ష్యము చేసి యొకరికొర కొక రొకచిన్న కూటముకొరకు-వ్రాసికొనుచుండు నట్లు కన్పించును. అతివిశాలము, నాకర్షణీయమునగు రంగస్థల ముండగ నిట్లుచేయుట విచారము, దురదృష్టము, శక్తినిపాడుచేయుట.

హిందీసాహిత్య భూతచరిత్ర గొప్పది; కాని యదియెల్లకాలము దానిమీదనే జీవింపజాలదు. దానికి గొప్ప భావికలదనియు, నీదేశ ములో హిందీపత్రికలద్భుతశక్తివంతములగుననియు నే నెరుగుదును. కాని, ఈ రెండును సంకుచితయాచారములను త్రోసివేసి ధైర్యముగ ప్రజల నుద్దేశించి వ్రాయువరకు నెక్కువ యభివృద్ధి నొందజాలవు.

56

కులతత్త్వము - తిరోగమనము

విఠల్భాయి పటేలు యూరపులో మరణించెనని నా చెల్లెలి వివాహములో వింటిమి. అతడు చాలకాలమునుండి బాధపడుచు ననారోగ్యకారణముచేతనే భారతదేశ జయిలునుండి విడువబడెను. అతని మరణము మాకు పిడుగుపడినట్లుండెను. సంగ్రామమధ్యమున మా నాయకశ్రేష్ఠు లొక్కొకరితరువాత నొకరు మమ్ము విడుచుచుండిరను భావ మసాధారణ మనఃఖేదమును కలిగించుచుండెను. విఠల్భాయి యనేక మెప్పులను బడసెను. అతని అసెంబ్లీయధ్యక్షత, పార్లమెంటరీశక్తి ప్రఖ్యాతిబడసెను. ఇది పూర్తిగా సత్యము. కాని దీనిని పదేపదే పునశ్చరణచేయుట నాకు కోపము కలిగించెడిది. హిందూదేశములో మంచి పార్లమెంటేరియనులను లేక సభానాయకస్థానము నలంకరింపగలవారికి నెప్పుడైనను కొఱతయున్నదా? మన న్యాయవాదశక్తి మనల నాపనికే యర్హులచేసెను. విఠల్భాయి యంతకంటె చాల గొప్పవాడు. అతడు భారతస్వాతంత్ర్యముకొఱకు పోరిన యప్రతిహత వీరశిఖామణి.

నవంబరులోనే నేను కాశీ వెళ్ళినపుడు హిందూవిశ్వవిద్యాలయ విద్యార్థుల కుపన్యసింపగోరిరి. నేను దీనికంగీకరించి వైసుఛాన్సలరు మదనమోహనమాలవ్యాగారి యధ్యక్షతక్రింద నొక పెద్దసభలో నుపన్యసించితిని. నా యుపన్యాసములో నేను కులతత్త్వమునుగురించి యెక్కువగ చెప్పవలసివచ్చెను. నేను దానిని తీవ్రభాషలో— ముఖ్యముగ హిందూమహాసభాచర్యలను గర్హించితిని. నేనుముందుగ భావించుకొని యీ పని చేయలేదు కాని కులతత్త్వవాదుల పురోభివృద్ధి నరికట్టు ప్రయత్నముపయి నాకు చాలకాలమునుండీ యపరిమిత కోపముండెను. నే నా విషయము నందుకొనుసరికి కోపము కొంత పైకుబికెను. హిందూకులతత్త్వవాదుల తిరోభావముగురించి నేను బుద్ధిపూర్వకముగనే నొక్కి చెప్పితిని. ఏలనన హిందూమహాసభను

చాలకాల మొక స్తంభముగానుండిన మాలవ్యాజీ యధ్యక్షతవహించిన సభలో హిందూమహాసభను విమర్శించు టంత సభ్యమైనపని కాదని, నాకాసమయమున తోచలేదు. ఇటీవల నతనికి దానితో నంత సంబంధములేకపోవుటచే నాకది తోచలేదు. మహాసభ యొక్క నూతన నాయకు లతనిని రమారమి గెంటివేసినట్లు కాన్పించెను. అతడు నాయకులలో నొకడుగా నున్నంతకాలము హిందూమహాసభ రాజకీయముగ తిరోగమనము నహింపలేదు. అయినను నతని యాహ్వానముమీద వెళ్ళి యతనిని పరిహాసస్థితిలోనుంచు విమర్శనలుచేయుట తగదని నేను తరువాత గ్రహించితిని. నేను దీనికి చాల చింతించితిని.

నేను మరియొక ప్రమాదమునకుకూడ విచారించితిని. అజమీరులో నొక హిందూయువజనసంఘముచే నూతనముగ నామోదింపబడిన తీర్మానప్రతులు మాకు టపాద్వారా పంపబడెను. ఈ తీర్మానము చాల యభ్యంతరమైనది. నేను దీనిని నా కాశీ యుపన్యాసములో నుదహరించితిని. నిజమున కిట్టి తీర్మానమేదియు నెట్టిసంఘము చేతను గావింపబడలేదు. మే మొక మోసములో పడిపోతిమి.

నా కాశీయుపన్యాసము గగ్గోలుపుట్టించెను. అట్టికేకలకు నే నలవడినను హిందూమహాసభనాయకుల దాడిలోనున్న తీవ్రతకు నే నెంతయో యాశ్చర్యపడితిని ఈదాడులు చాలవరకు వ్యక్తిగతముగ నుండి సారాంశమునకు కావలసినవిషయమును ముట్టకుండెను. వారు వెళ్ళవలసినంతవరకు వెళ్ళిరి చివరకు నా కవకాశము చిక్కెను. నేను నెలలకొలది (జయిలులోనున్నప్పుడుకూడ) వారికి సమాధానమిచ్చుట కాతురపడుచుంటిని. కాని దానినెట్లు చేపట్టవలెనో తెలియకుండెను. అదియంతయు నొక కందిరీగల గూడు. నేను కందిరీగల కలవడినవాడనేయైనను బూతులక్రింద పరిణమించిన చర్చలోనికి దిగుట ముదావహము కాదు. కాని, యది నాకు తప్పనిసరియయ్యెను. నేను హిందూ, ముస్లిము కులతత్త్వములనుగురించి నాకు సహేతుకముగ కన్పించిన యొక వ్యాసమును వ్రాసితిని. ఈ రెండును నమ్మతగిన కులతత్త్వములు కావని, వాని వెనుక దాగియున్న సాంఘిక, రాజకీయ తిరోభావములనియు నేను రుజువుచేసితిని. కులనాయకుల యువ

వ్యాసముల యొక్కయు, నా ఉపన్యాసముల యొక్కయు వార్తాపత్రికలనుండి తీసిన ముక్కలు నా యొద్దనుండెను. నా యొద్ద కావలసినంత విషయము ముండుటచే దానినంతను నొక వార్తాపత్రిక వ్యాసములో నిమిడించుట చాల దుర్ఘటముగ నుండెను.

ఈ నా వ్యాసము భారతిపత్రిక లన్నింటిలోను ప్రకటింపబడెను. దానిలో నే నుద్యమములనుగురించియు నెంతయో వ్రాసినను వారు మిన్నకుండుట వింతగ నుండెను. నన్ను తీవ్రముగ విమర్శించిన హిందూమహాసభానాయకు లసలే నోరెత్తలేదు. ముస్లిముల తరఫున సర్ మహమ్మదు ఇక్బాలుగారు రెండవ రౌండు టేబిలు కాన్ఫరెన్సుకు సంబంధించిన కొన్ని యంశములను సవరించుటకు ప్రయత్నించెను. అదియునహో నా వాదమునుగురించి యతడేమియు మాట్లాడలేదు. నే నతనికిచ్చిన సమాధానములో రాజకీయ,కుల సమస్యలను రెంటిని కూడ కాన్స్టిట్యుయంటు అసెంబ్లి నిర్ధారణ చేయవలెనని సూచించితిని. తరువాత కులతత్త్వమునుగురించి నేను మరి యొకటి, రెండు వ్యాసములను వ్రాసితిని. ఈ వ్యాసము లాదరింపబడుటయేగాక యోచనచేయువారిపయి మంచి ఫలితము కలుగజేసినందులకు నే నపరిమితోత్సాహము పొందితిని. కులతత్త్వము వెనుకనున్న రాగద్వేషములను మంత్రించి వేయగలనని నే నూహింపలేను. కులనాయకులు భారతదేశములోను, యింగ్లండులోనుగల యత్యంత తిరోభావ వాదులకు జ్యేష్ఠభ్రాతలని చూపుటయే నాయుద్దేశ్యము. నిజమునకు వారు రాజకీయాభివృద్ధికి సాంఘికాభివృద్ధికి శత్రువులు. వారి కోరికలకు ప్రజలతో నెట్టి సంబంధము లేదు. పైనున్న చిన్న బృందములవారికి కొంత యభివృద్ధి కలుగజేయుటకే యవి యుద్దేశింపబడెను. 'హిందూ ముస్లిము ఐక్యము' అని తరచు వేయబడు కేక (నిస్సందేహముగ నుపయోగకరమే యైనను) యైకమత్యరాహిత్య కారణములను తెలిసికొనినగాని నిష్ఫలమని నాకు కాన్పించెను. అయినను యీ గారడీమంత్రమును తరచు జపించినచో నైకమత్యము చివరకూడివచ్చునని కొందరు భావించుచున్నట్లు కాన్పించును.

1857 విప్లవము లగాయతు కులసమస్యవట్ల బ్రిటిషునీతి యెట్లుండెను? ఈచరిత్ర వినదగినది. హిందువులు, ముస్లిములు ఏకమై పనిచేయుట కభ్యంతరములను కల్పించి యొకరిపయి నొకరినాడించుట వారి నీతియైయుండెను. 1857 తరువాత ప్రభుత్వము హిందువులకంటె మహమ్మదీయులనే కన్నెఱ్ఱగచూచెను. ముస్లిములెక్కువకాలుదువ్వు దురని, భారతదేశములో మొన్నటివరకు వరిపాలకులమను స్మృతి వారి కుండునని, వారుపద్రవకరులని ప్రభుత్వము భావించెను. ముస్లిములు నూతనవిద్యకు దూరులై ప్రభుత్వముక్రింద కొద్దియుద్యోగములను మాత్రమే కలిగియుండిరి. ఇదియంతయు సందేహమునకు కారణ మయ్యెను. హిందువులు ఇంగ్లీషుభాష నతిసుకరముగ నవలంబించి గుమాస్తాపదవులను గుత్తగొనిరి. వారు చాలసాధువులుగకాన్పించిరి.

అప్పుడు నూతనజాతీయత-పైనుండి ఇంగ్లీషుచదువుకొనిన పై తరగతివిద్యార్థులనుండి యభివృద్ధియయ్యెను. ఇది సహజముగ హిందువులలోనేయుండెను. ముస్లిములు విద్యలో వెనుకబడియుండిరి. ఈ జాతీయత యతిసాధుభాషలో, హీనస్వరముతో మాట్లాడెను. అయినను బ్రిటిషుప్రభుత్వమునకిది రుచించలేదు. కనుక వారు ముస్లిములను ప్రోత్సహించుచు వారిని జాతీయవేదికనుండి వేరుచేయగోరిరి. ఇంగ్లీషువిద్య లేకపోవుటొక్కటే ముస్లిముల కాటంకముగనుండెను. కాని యిది క్రమముగ తొలగిపోకతప్పదు. దూరదృష్టితో బ్రిటిషువారు భవిష్యత్తుకు పునాదులను వేసుకొనిరి. ఈ కృషిలో వారికిగొప్ప వ్యక్తియగు సర్ సయ్యద్ అహ్మదుఖాను సాయపడెను.

సర్ సయ్యదు తనజాతి దుస్థితికి (ముఖ్యముగ విద్యలో)విచారపడెను. బ్రిటిషుప్రభుత్వ దృష్టిలో తనజాతిపట్ల నాదరాభిమానములు లేవని ఖేదపడెను. తన సమకాలికులు చాలమందివలెనే యతడు బ్రిటిషువారి నెక్కువగ మెచ్చుకొనెడివాడు. అతని యూరపు సందర్శన మతనిపైగొప్పఫలితమును కలుగచేసెను. 19వ శతాబ్దమధ్యమున నున్న యూరపు, లేక పశ్చిమయూరపు తన విజ్ఞానశిఖరము నధిరోహించి, ప్రపంచమునకప్రతిహతరాణియై, తన యాధిక్యతను

కారణములగు గుణసంపత్తుతో మెరయుచుండెను. పై తరగతుల యాస్తులతిభద్రముగనుండి గొప్పమార్పులు కలుగునను భీతిలేక దిన దినాభివృద్ధి చెందుచుండెను. అవి స్వేచ్ఛ యభివృద్ధియగుచున్న దినములు. జగత్కల్యాణము జరుగునను నమ్మకముగలదినములు. అచ్చటకు వెళ్ళిన భారతీయు లీ గంభీరదృశ్యముచే నాకర్షింపబడుటలో నాశ్చర్యమేమియు లేదు. మొట్టమొదట హిందువు లెక్కువమంది వెళ్ళిరి. వారు యూరపును, యింగ్లండును మెచ్చుకొనుచు తిరిగి వచ్చిరి. క్రమముగ వారాకాంతికి, భ్రాంతికి నలవడుటచే మొదటి యాశ్చర్యము తొలగిపోయెను. కాని సర్ సయ్యదుగారి విషయములో మొదటి యాశ్చర్యము,. మోహము చాల ప్రస్ఫుటముగ నుండెను. 1869 లో యింగ్లండును దర్శించి యతడు తన యభిప్రాయముల నింటికి వ్రాసెను. ఒకయుత్తరములో నతడిట్లు వ్రాసెను. భారతదేశములోనున్న యింగ్లీషువారు ఆ దేశప్రజలను పశువుల వలెను, హేయముగను, అమర్యాదగను చూతురను నేరమునుండి వారిని నేను విడుజాలకపోయినను వారు మనల నర్థముచేసికొన జాలకపోవుటచేతనే యట్లు చేయుచున్నారని భావించెదను. మనలను గురించిన తమ యభిప్రాయములలో వారంతదోషులు కారనికూడ నేనొప్పుకొనకతప్పదు. ఇంగ్లీషువారిని పొగడకుండగనే భారతదేశములోనున్న ప్రజలు, యెక్కువవారును, తక్కువవారును, పెద్దవర్తకులును, చిన్నదుకాణదారులును, విద్యాధికులును, విద్యలేనివారును యింగ్లీషువారితో పోల్చి చూచినచో విద్యలోను, నడకలోను నిజాయితిలోను, సమర్థుడగు, స్ఫురద్రూపియైనవానిముందర నందవికారమగు జంతువెట్లుండునో యట్లుండెదరు. హిందూదేశములోనున్న మనలను నిర్వీర్యమైన పశువులని విశ్వసించుట కాంగ్లేయులకు కారణముగలదు...నేను చూచినది, నిత్యమును చూచుచుండునది భారతీయుని యూహ కెంతమాత్రము నందని విషయములు...ఆధ్యాత్మికముగ, లౌకికముగ మానవున కుండవలసిన సద్విషయములన్నియు భగవంతునిచే యూరపునకు, ముఖ్యముగ యింగ్లండునకు ప్రసాదింపబడెను.

బ్రిటిషు వారిని,యూరపును ఇంతకంటె నెక్కువగ నెవడుపొగడగలడు? సర్ సయ్యదు కత్యద్భుతమైన యభిప్రాయముకలిగినట్లువిశదమగుచున్నది. బహుశఃయతడు తన నిజప్రజనునిద్రనుండి మేల్కొల్పుటకు ముందంజవేయునట్లుప్రోత్సహించుటకు ఘాటైనభాష నుపయోగించి, వ్యాఖ్యానములనుత్ప్రేక్షించెను.పాశ్చాత్యవిద్యనభ్యసించుటయే యీ ముందంజ యని యతడు విశ్వసించెను. ఆ విద్యలేనిదే యతని సంఘ మంతకంతకు వెనుకకు పోవును, నిర్వీర్యమగును. ఇంగ్లీషువిద్య యనగా ప్రభుత్వోద్యోగములు, భద్రత, పలుకుబడి గౌరవము కనుక నీ విద్యపట్ల నతడు తన శక్తినంతను వినియోగించి తన ప్రజలను తన పలెనే యోచించునట్లు చేయ ప్రయత్నించెను. అతడు వారి బుద్ధి యితర విషయములమీదకు బోకుండచూడగోరెను. ముస్లిముల స్తబ్ధత్వమును, సందేహములను ఛేదించుట కష్టసాధ్యము. హిందూబూర్జువాలచేత ప్రతిపాదింపబడు నూతన జాతీయారంభము వారి బుద్ధిని చెడగొట్టుదానివలె నతనికి గాన్పించెను. కనుక నతడు దాని నెదిర్చెను. పాశ్చాత్యవిద్యలో నర్ధశతాబ్దముముందంజ వేసినహిందువులు ప్రభుత్వమును విమర్శించు వినోదములో క్రీడింపవచ్చును. తనవిద్యా విషయిక ప్రయత్నములలో నతడా ప్రభుత్వసహాయమును పూర్తిగ నపేక్షించెను. కనుక ననాలోచితకార్యములచే నతడు దీనినిపోగొట్టుకొన విష్టపడక జాతీయకాంగ్రెసుపట్ల విముఖుడయ్యెను. బ్రిటిషు ప్రభుత్వమిట్టి దృక్పథమునుప్రోత్సహించుట కువ్విళ్ళూరు చుండెను.

ముస్లిములకొరకు పాశ్చాత్యవిద్యమీద కేంద్రీకరింపవలెననెడి సర్ సయ్యదు నిశ్చయము యుక్తమైనదే. అది లేకుండ వారు యీ క్రొత్తరకపు జాతీయ నిర్మాణములో నుచితపాత్ర వహింపజాలరు. వారు తమకంటె నెక్కువ విద్య, యార్థికపరిస్థితులు గలిగిన హిందువుల వెనుక నుండవలసిన గతి పట్టియుండెడిది. చరిత్రచేతను లక్ష్యము చేతను ముస్లిము లపుడు బూర్జువా జాతీయోద్యమమునకు సిద్ధముగ లేరు. వారిలో హిందువులలోవలె బూర్జువాలు లేరు, కనుక సర్ సయ్యదు కృషి పైకి చాల మితవాదపరముగనే కాన్పించినను నిజమైన విప్లవదశలోనుండెను. ముస్లిము లింకనుప్రజాస్వామిక

వ్యతిరేకమైనఫ్యూడల్ లక్ష్యములోనే మునిగియుండిరి. కాని హిందువులలోని మధ్యతరగతివారు యూరపియను లిబరలుల స్థాయిలో నాలోచింప నారంభించిరి. ఉభయులు పూర్తిగ మితవాదులు. బ్రిటిషు ప్రభుత్వముపై నాధారపడినవారు. సర్ సయ్యదుగారి మితవాదము, కొద్దిమంది ధనవంతులగు ముస్లిము భూస్వాములమితవాదము. హిందూమితవాదము వృత్తిలోను, వర్తకములోను అతిజాగ్రతగ సంచరించుచు పరిశ్రమలకు, పెట్టుబడికి మార్గము వెదుకుచుండువాని మితవాదము. ఈ హిందూ రాజకీయవేత్త లింగ్లీషు లిబరలిజముయొక్క ప్రకాశమానమగు కాంతులైన గ్లాండ్‌స్టన్, బ్రైట్ యిత్యాదులవైపు చూచుచుండుదురు. ముస్లిము లట్లు చేసిరని నేననుకొనను బహుశః వారుటోరీలను, యింగ్లండులోని భూములున్న తరగతులను మెచ్చుకొనిరి. ఆర్మీనియాలో జరిగిన హత్యలను, టర్కీని గాడ్‌స్టన్ పదేపదే గర్హించుటచే వారికి బూచివలెనుండెను. డిస్రాలీటర్కీయెడల నెక్కువస్నేహముగ నున్నట్లుకాన్పించెను; కనుక వారతనియెడల కొంచెము పక్షపాతము వహించిరి.

సర్ సయ్యదు యుపన్యాసములు కొన్ని నేడు వింతగనుండును. 1887 డిశంబరులో లక్నోలో నతడిచ్చిన యుపన్యాసములో నాసమయములోనే జరుగుచున్న జాతీయకాంగ్రెసుయొక్క యతి మితవాద కోరికలను విమర్శించి గర్హించెను. సర్ సయ్యద్ "ప్రభుత్వమువారాష్ట్రనిస్థానముతో పోరినను లేక బర్మాజయించినను వారినీతిని విమర్శించుటమనపనికాదు...చట్టములనుచేయుటకు ప్రభుత్వమొక కౌన్సిలును నిర్మించెను...ఈకౌన్సిలు కది యన్నిరాష్ట్రములనుండి ప్రజల పరిస్థితులతోను, పరిపాలనతోను గొప్పపరిచయముకలవారి నెన్నుకొనెను. మరియుసంఘములోను తమస్థానము నాక్రమించుటచే ఆ యసెంబ్లీలో స్థానమునకర్హులగువారిని కొందరి నెన్నుకొనును. సమర్థతకుబదులుసంఘస్థితినిబట్టి వారి నేల యెన్నుకొనవలెను? అని కొందరడుగవచ్చును. తక్కువజాతివాడు లేక పేరుప్రఖ్యాతులులేని వంశమువాడు బి. ఏ. లేక యం. ఏ యై కావలసిన సమర్థతకలిగియున్నచో నతడు తమపై యధికారము వహించి, తమజీవితములను, ఆస్థిని మార్చుచట్టములనుచేయు

పదవిలోనుండుటకు మన యుత్తమజాతులలో వ్వరికొనునా? యని నేను మిమ్ములను నడుగుచున్నాను. ఎన్నటికి యెవ్వరికొనరు...వైస్రాయి సద్వంశ సంజాతునితప్ప మరెవరిని తనసహోద్యోగిక్రిందతీసికొని, తన సోదరునివలెభావించి, ప్రభువులు, డ్యూకులు మొదలగువారితో మెలగవలసిన విందుల కాహ్వానింపజాలడు...ప్రభుత్వము శాసనములనుచేయుట కవలంబించిన పద్ధతులలో ప్రజాభిప్రాయములను మన్నించుటలేదని మనము చెప్పకలమా ? చట్టములను చేయుటలో మనకు భాగములేదని మనము చెప్పగలమా ? నిశ్చయముగ నట్లు చెప్పజాలము.”

భారతదేశములోని 'ఇస్లాముప్రజాస్వామికము' యొక్క ప్రతినిధియు నాయకుడు నీవిధముగ మాట్లాడెను. అయోధ్యతాలూకు దార్లు, ఆగ్రా, బీహారు, బెంగాలురాష్ట్రములలోని భూస్వామందులు నేడు ఈ సరళిలో మాట్లాడుటకు సాహసింతురని నే ననుకొనను. అయినను సర్ సయ్యదు ఈ విషయములో ననన్యుడు కాడు. అనేక కాంగ్రెసు యుపన్యాసములుకూడ నేడింత వింతగనే కాన్పించును. కాని యప్పటి హిందూ ముస్లిము సమస్యయొక్క రాజకీయ, ఆర్థిక స్థితి యిటుండెను. పైకిలేచుచున్నట్టియు, నార్థికముగ మంచి స్థితిలోనున్నట్టియు మధ్యతరగతి [హిందువులు] ఫ్యూడలు భూస్వాములతరగతిచే (ముస్లిములు) కొంతవరకు నెదుర్కొనబడి, యడ్డగింపబడెను. హిందూ భూస్వామందులు తరచు తమబూర్జువాలతో సన్నిహిత సంబంధము కలిగియుండి మధ్యతరగతులవారి కోరికలపట్ల తటస్థముగను, లేక సానుభూతితోనుకూడ నుండెడివారు. బ్రిటిషువారెప్పుడు ఫ్యూడలు సంఘమును బలపర్చెడివారు. ప్రజాసామాన్యమును, మధ్యతరగతుల లోని క్రిందితరహావారును [ఇరువంకలవారును] ఈ చిత్రములో బొత్తిగ కాన్పించరు.

శక్తివంతము, నధికారసమన్వితమునగు సర్ సయ్యద్ రూపము భారతముస్లిముల నాకర్షించెను. అలీఘురు కళాశాల యతనికోరికల యొక్క స్థూలాకారము. మార్పులువచ్చు కాలములో నొక యభివృద్ధిదాయక భావము త్వరలోనే తనపని నిర్వర్తించినదై, కాలముతీరి

యాలంకారిగ నుండవచ్చును. భారత లిబరులులే దీనికి చక్కని సాక్ష్యము. వారు ప్రాచీనకాంగ్రెసుసాంప్రదాయునిజసంతతివారనియు తరువాతవచ్చిన మనము మధ్యగావచ్చినవారమనియు తరచుజ్ఞాపకముచేయుదురు, నిశ్చయము. కాని ప్రపంచము మారుచుండునని పాతకాంగ్రెసు సాంప్రదాయము గతవత్సర హిమముతో మాయమగునని యదియొక జ్ఞప్తిగమిగిలెనని వారుమరచిపోయిరి. అట్లే సర్ సయ్యదు సందేశ మా కాలమునకు తగియుండెను. ఆవసరమయ్యెను. కాని యది యభివృద్ధిచెందుసంఘముయొక్క తుదిలక్ష్యము కాజాలదు. అత డింకొక పురుషాంతరము జీవించియున్నచో నతడే తన సందేశమునకు మరియొకరూపకల్పన చేసియుండెడివాడు. లేక నితరనాయకులతని పాతసందేశమునకు నూతన యర్థముచెప్పి దానిమారుచున్న పరిస్థితుల కన్వయింపగలిగెడువారు. కాని, సర్ సయ్యదుకు కలిగిన విజయము నతని స్మరణయెడలగల పూజ్యభావముచే పాతవిశ్వాసము వీడుట కష్టసాధ్యమయ్యెను. దురదృష్టవశమున భారతదేశములోని ముస్లిములకు నూతనమార్గము చూపించు విశేష ప్రతిభగలసమర్థులు కొఱతగనున్నారు. అలీఘరు కళాశాల చక్కనిపని చేసెను అనేక మంది సమర్థులను తయారుచేసెను; ముస్లిమువిద్యార్థికుల దృష్టినంతను మార్చివేసెను. అయినను అది తన గూడుదాటి బయటకుపోజాలకుండెను. ఫ్యూడలుతత్త్వము దానిపై రాజ్యముచేసెను. సామాన్య విద్యార్థి లక్ష్య మెప్పుడు ప్రభుత్వనౌకరిమీద నుండెను. నవక్షేత్ర పరిశోధన, యాత్మ సాహసము మచ్చునకైన నతనిలో గానరావు. ఒక డిప్యూటీ కలెక్టరు పదవి వచ్చుచో నత డపరిమితానందభరితుడగును ఇస్లాము ప్రజాస్వామికములో తా నొక సభ్యుడననుకొనుటతో నతని గర్వ ముపశమించును. ఈ సౌభ్రాతృత్వమునకు దాఖలాగా టర్కీషుఫెజ్ అనబడు నొక యెఱ్ఱటోపి నతడు గోటుగ తలపయి ధరించును. దీనిని తురుష్కులే త్వరలో విడిచివేసిరి. ఈ విధముగ ప్రజాస్వామికమునకు తన శాశ్వతాధికారమును స్థిరపరచుకొనిన తరువాత భారతదేశములో రాజకీయ ప్రజాస్వామికమున్నదా లేదా యను విచారము నతడు పెట్టుకొనడు.

ఈ సంకుచితదృష్టి ప్రభుత్వ నౌకరీలకొరకు దేవురించుట అలీఘరు లేక నితరచోట్ల గల ముస్లిము విద్యార్థులకొక్కరికే నియమింపబడలేదు. సహజముగ నెట్టి సాహసము లేని హిందూవిద్యార్థులలో నిది తత్తుల్యముగనే ప్రదర్శింపబడుచున్నది. కాని పరిస్థితులు చాల మంది నీ బాటనుండి తరిమెను. వీరసంఖ్యాకముగ నుండిరి. వీరందరికి చాలినన్ని నౌకరీలు లేవు, కనుక వీరు జాతీయ విప్లవోద్యమమునకు వెన్నెముకయైన విద్యాధిక కులబాహులైరి.

సర్ సయ్యదుగారి రాజకీయసందేశ సంకుచిత ఫలితమునుండి భారత ముస్లిము లింకను పూర్తిగ కోలుకొనకమునుపే యిరువదియవ శతాబ్దారంభమున జరిగిన విషయములు వారికిని జాతీయోద్యమమునకును గల భేదమును పెంపుచేయుటకు బ్రిటిషుప్రభుత్వమునకు సహాయపడెను. సర్ వలెన్‌టిన్ షిరాల్ తన 'భారతదేశ యసంతృప్తి' యను పుస్తకములో నిట్లు వ్రాసిరి. "నేడు భారతదేశ మహమ్మదీయు లొక్కుమ్మడిగా తమ ప్రయోజనములను, యాశయములను బ్రిటిషు పరిపాలనాస్థాపనతోను, స్థిరత్వముతోను నైక్యముచేసికొనినట్లు మున్నెన్నడు చేసియుండలేదని ధైర్యముగ నొక్కి వక్కాణింపవచ్చును." రాజకీయ జోస్యములు చాల యుపద్రవకరములు. సర్ వలెన్‌టిన్ వ్రాసిన ఐదేండ్లలోనే ముస్లిము విద్యాధికులు తమ బంధనములను త్రెంచుకొని కాంగ్రెసుతో చేయి కల్పుటకు గట్టి ప్రయత్నము చేయుచుండిరి. పదేండ్లలో భారత ముస్లిములు కాంగ్రెసును మించినట్లు కాన్పించిరి. వారు కాంగ్రెసుకే దారి చూపుచుండిరి. కాని యీ పదేండ్లుచాలముఖ్యమైనవి. మహాసంగ్రామము వచ్చి ఛిన్నభిన్నమైన ప్రపంచమును మరణకాల యాస్థిగా మన కర్పించెను

అయినను సర్ వలెన్‌టిన్ యట్టి పర్యవసానమునకు వచ్చుటకు బాహ్యముగ ననేక కారణములు గలవు. ఆగాఖాను ముస్లిము నాయకుడయ్యెను. వారింకను ఫ్యూడల్ సాంప్రదాయముల కంటిపెట్టుకొని యుండిరనుట కా విషయమేచాలు. ఆగాఖాను బూర్జువా నాయకుడు కాడు. అతడు చాల డబ్బుగల రాకుమారుడు; ఒక మత

శాఖకు నాయకుడు; బ్రిటిషువారిదృష్టిలో, బ్రిటిషుపాలకజాతులతో అతనికి సన్నిహిత సంబంధముండుటచే, అతడు గొప్పపురుషుడు. అతనికి విశేషవిజ్ఞానము కలదు. గొప్పయింగ్లీషుభూస్వామి జీవితము వంటి జీవితమును, వేటాడుజీవితమును, యెక్కువగ యూరపులోనే జీవించెను. ఈ విధముగ వ్యక్తిగతముగ అతనికి సంకుచిత కులవిషయములు, సంఘవిషయములు లేవు. అతడు భూస్వాములైన ముస్లిములను, వృద్ధిచెందుచున్న బూర్జువాలను బ్రిటిషు ప్రభుత్వముతో జోడించుటకే ముస్లిము నాయకత్వము వహించెను. కులసమస్య నిజముగ రెండవది; ప్రధానలక్ష్యముకొరకే దానికి ప్రాముఖ్యత యివ్వబడును. ఆగాఖాను వైస్రాయి మింటో ప్రభువుకు "బంగాళా విభజనవలన కలిగిన రాజకీయస్థితిని గురించి మహమ్మదీయుల యభిప్రాములను తెలిపెను. లేనిచో తొందరపడి హిందువుల కెక్కువరాజకీయహక్కులివ్వబడవచ్చును. దీనివలన నధికసంఖ్యాకులైనహిందువుల ప్రభ యెక్కువగుటచే నది బ్రిటిషుపరిపాలనా స్థైర్యమునకు నిర్వివాద రాజభక్తిగల యల్పసంఖ్యాక మహమ్మదీయుల ప్రయోజనములకు నుపద్రవకరముగ నుండును" అని నచ్చచెప్పెనని షిరాల్ చెప్పుచున్నాడు.

కాని బాహ్యముగ బ్రిటిషుప్రభుత్వముతోనున్నను దీనివెనుక నితరశక్తులు పనిచేయుచుండెను. నూతన ముస్లిము బూర్జువాలు తమ పరిస్థితులతో నంతకంతకసంతృప్తులగుచు జాతీయోద్యమమున కాకర్షింపబడుచుండిరి. ఆగాఖానుగారే యీ విషయమును గుర్తించి బ్రిటిషువారిని తగిన భాషలో మందలించిరి. 1914 జనవరిలో ఎడింబరో రివ్యూలో వ్రాయుచు ప్రభుత్వము హిందువులను ముస్లిములను విడదీయు పద్ధతి మానుకొనవలసినదనియు, రెండు మతముల లోని మితవాదులను నొక మకాములోనికి పోగుచేసి రెండు సంఘములకు చెందిన యువక భారత తీవ్రజాతీయభావముల నెదుర్కొనవలెననియు నతడు ప్రభుత్వమునకు సలహాచెప్పెను. కనుక నతనికి ముస్లిము కుల ప్రయోజనములందుకంటె భారతదేశ రాజకీయ పరివర్తన నడ్డగించుటయందే యెక్కువశ్రద్ధయున్నట్లు విశదమగుచున్నది.

కాని, ఆగాఖాను బ్రిటిషు ప్రభుత్వము ముస్లిము బూర్జువాలను జాతీయతనుండి మరల్పజాలకపోయిరి. ప్రపంచయుద్ధము దీనిని మరింత త్వరితపరచెను. క్రొత్తనాయకులు రంగము నాక్రమించుటతోడనే ఆగాఖానుకు స్వస్తిచెప్పబడెను. అలీఘరు కాలేజీ స్వరముకూడ మారిపోయెను. క్రొత్తనాయకులలో ఆలీసోదరు లిరువురు నతి శక్తి సామర్థ్యములు కలవారు. వారిరువురు ఆలీఘరు కళాశాలలోనివారే! డాక్టరు యం. యె. అన్సారీ, మౌలానా అబుల్ కలాం అజదు, యింకను అనేకమంది బూర్జువా నాయకులు ముస్లిము రాజకీయవ్యవహారము లలో ప్రధానపాత్రవహింప నారంభించిరి. అల్లే, కొంచెముతక్కువ మోతాదులో, యం. యె. జిన్నాయును చేసెను. గాంధీజీ యీ నాయకులలో చాలమందిని సాధారణముగ ముస్లిములను తనఅసహా యోద్యమములోనికి లాగివేసెను. 1919_23 లో వారు నాయకపాత్ర లను వహించిరి.

తరువాత తిరోగమనము వచ్చెను. హిందువులలోను ముస్లి ములలోను బలవంతముగ వెనకకు నెట్టివేయబడిన కులప్రముఖులు ముందుకు వచ్చిరి. ఇది కొంచెము నెమ్మదిగ జరిగినను, విడువకుండ సాగింపబడెను. కులద్వేషము లుండుటచే హిందూ మహాసభకు మొదట కొంత ప్రాముఖ్యత కలిగెను. కాని, రాజకీయముగ నది కాంగ్రెసు నెక్కువగ మెప్పించలేకపోయెను. ముస్లిముకులసంఘములు తమప్రజలలో కొంత పలుకుబడి తిరిగిసంపాదించుకొనగలిగెను. అయి నప్పటికి ముస్లిమునాయకులలో బలమైనవర్గము మొదటినుండి చివర వరకు కాంగ్రెసుతోనే యుండిరి. బ్రిటిషుప్రభుత్వమీలోపల రాజ కీయ తిరోగాములైన ముస్లిము కులనాయకులకు కావలసినంత ప్రోత్సాహమునిచ్చెను. వీరి విజయములను గమనించి హిందూ మహాసభవారు తిరోగమనములో వీరితో పోటీచేయ ప్రారంభించిరి. ఈవిధముగ ప్రభుత్వదయ సంపాదింపవచ్చునని వీరనుకొనిరి. మహా సభలో ముందంజవేయువారు తరిమివేయబడిరి. లేక వారంతట వారే విడిచి వెళ్ళిపోయిరి. అది యంతకంతకు మధ్యతరగతిలోని పైతరహా వైపు, ముఖ్యముగ ఋణదాత, బ్యాంకరులవైపు మొగ్గెను.

శాసనసభా స్థానముల పంపకముగురించి నిరంతరాయముగ చర్చించుకొనుచున్న యిరువంకల కులరాజకీయవేత్తలు ప్రభుత్వ ప్రాపకముకొరకే చూచుచుండిరి. అది యుద్యోగములకొరకు మధ్య తరగతి విద్యాధికుల గుంజులాట. ఉద్యోగములుతక్కువ;కనుక వాటి కొరకు హిందూముస్లిము కులనాయకులు పోట్లాడుకొనిరి. మొదటి వారు స్వరక్షణకొరకు రెండవవారంతకంతకెక్కువకావలెనని పోరిరి. ఈ పోరాటముల వెనుక మరియొక ప్రముఖపోరాటముండెను. అది కేవలము కులసమస్యకాదు; కాని, దానికి దోహదమునిచ్చెను. మొత్తముమీద హిందువులు పంజాబు, సింధు, బెంగాలులలో నెక్కువధనికులు, ఋణ దాతలు, పట్టణవాసులు; ముస్లిము లీరాష్ట్రములలో నెక్కువబీదలు, ఋణగ్రస్తులు, గ్రామవాసులు, కనుక తరచు వీరిపోరాట మార్థిక మైనది కాని దాని కెప్పుడు కులస్వభావము కల్పింపబడెడిది. గ్రామ ఋణములను తగ్గించుటకు తీసికొనిరాబడినవివిధ రాష్ట్రములలోని చర్చలలో నిది యీమధ్య గతించిన మాసములలో, ముఖ్యముగ పంజాబులో, పైకి పొక్కెను. హిందూమహాసభాప్రతినిధులు మొదటి నుండియు వీని నెదుర్చు బ్యాంకరులతరగతి పక్షము వహించిరి.

హిందూమహాసభ ముస్లిముకులతత్త్వమును విమర్శించు తమ జాతీయతలో నెట్టి కళంకములేదని యెల్లప్పుడు చాటుచుండును. ముస్లిముసంస్థ లసాధారణ కులతత్త్వప్రచోదితములని యందరకు తెలిసిన విషయము. మహాసభయొక్క కులతత్త్వము జాతీయత బురఖాలో నుండుటచే నంత సులభగ్రాహ్యముకాదు. జాతీయము, ప్రజాస్వామికమునగు పరిష్కారము పైతరగతి హిందూప్రయోజనములకు నష్టము కలిగించినపుడు పరీక్షవచ్చును. ఈ పరీక్షలో హిందూమహాసభ యనేకసారులోడిపోయెను. కొద్దిసంఘమువారి అర్థికప్రయోజనములకొరకధికసంఖ్యాకులు ప్రకటించిన కోరికలకు భిన్నముగ వారు సింధుదేశ విభజనమును మొదటినుండియు నెదిరించిరి.

కాని, రౌండుటేబిలు కాన్ఫరెన్సులలో హిందూముస్లిముకుల తత్త్వవాదులిరువురు నసాధారణప్రతీకారమును జాతీయ వైరుధ్యమును ప్రదర్శించిరి. బ్రిటిషుప్రభుత్వము నిక్కచ్చియైనకులతత్త్వము

గల ముస్లిములను మాత్రమే పేర్కొనెదమని పట్టుబట్టిరి. వీరు ఆగాఖాను నాయకత్వముక్రింద నత్యంతతిరోగాములు బ్రిటిషువబ్లిక్ జీవితములో నత్యంత యుపద్రవకరులునైన వారితో నేకమయిరి. ఆగాఖాను, అతనిబృందము లాయిడ్ ప్రభువుతోను, అతని పార్టీతోను సన్నిహిత సంబంధము కలిగియుండు టాశ్చర్యము. వారు మరియొక యడుగు ముందుకువేసి, యూరపియను సంఘప్రతినిధులతోను, యితరులతోను, ఆర్. టి. సి లో సంధులను చేసికొనిరి. ఇది విచారకరవిషయము. ఏలనన యీసంఘము హిందూదేశములో భారత స్వాతంత్ర్యమునకు ప్రబల విరోధి.

హిందూమహాసభా ప్రతినిధులు దీనికి జవాబుగ స్వాతంత్ర్యమున కన్నివిధములగు నాటంకములను (ముఖ్యముగ పంజాబులో) బ్రిటిషు ప్రయోజనములకొరకు సంరక్షణలను కోరిరి. బ్రిటిషుప్రభుత్వముతో సహాకారముచేయు ప్రయత్నములతో వారు ముస్లిములను చిత్తుచేయ ప్రయత్నించి. దేనిని సాధింపకపోగా, తమ నిజవిషయమునే పాడుచేసుకొని స్వాతంత్ర్యధర్మమునకు ద్రోహమొనర్చిరి. ముస్లిము లాత్మగౌరవముతో మాట్లాడిరి. హిందూకులతత్త్వవాదులు దీనికైనను నోచుకొనలేదు.

ముఖ్యవిషయమేమనిన యిరుపక్షముల నాయకులు కొద్దిమంది పయితరగతికి ప్రాతినిధ్యమువహించి తమ స్వార్థములకొరకు ప్రజల మతద్వేషములను కొల్లగొని, లబ్ధిపొందుచున్నారు. ఉభయులునార్థిక సమస్యల విచారణనణచివేయుటకు, తప్పించుటకుసర్వప్రయత్నములు చేయుదురు. ఈసమస్యల నణచిపెట్టరాని సమయము త్వరలోనే రానున్నది. అప్పు డిరువరియొండ్లక్రిందట ఆగాఖాను తీవ్రవాదుల నెదుర్చుట కొక సామాన్యకూటముక్రింద జేరవలెనని మితవాదుల కిచ్చిన సలహానేయుభయపక్షకులనాయకులు చాటుదురు. కొంతవరకది యిదివరకే కాన్పించుచున్నది. ఉభయపక్షములవారు బహిరంగముగ నెంతపోరాడుకొనినను అసెంబ్లీలోను యితరచోట్ల నభివృద్ధిభంజక తీర్మానములను చేయుటకు ప్రభుత్వముకు సహాయము చేయుటలో సహకారము చేసికొనుచున్నారు. ఈ త్రితయము ఒటావా

తీర్మానములో మిళావుకాలేదా!

ఈలోపుగ ఆగాఖానుకు కన్సర్వేటివు పార్టీయొక్క కుడిపక్షములో నతివాదులకు సన్నిహిత సంబంధము సాగుచునేయుండెను. 1934 అక్టోబరులో నతడు బ్రిటిషు నౌకాదళమువారి విందుకు గౌరవయతిథిగవెళ్ళెను. లాయిడ్ ప్రభువు దీనికధ్యక్షుడు. లాయిడ్ప్రభువు బ్రిస్టల్లో జరిగిన కన్సర్వేటివు కాన్ఫరెన్సులో బ్రిటిషు నౌకాదళమును మరింత బలపర్చవలెనని చేసిన సూచనల నీయన మనఃపూర్వకముగ నామోదించెను. ఈ భారతనాయక శిఖామణి సామ్రాజ్యమును, యింగ్లండును కాపాడుటయందు బాల్డ్విన్కంటె లేక 'జాతీయ' ప్రభుత్వముకంటె నెక్కువయాతురపడుచు బ్రిటిషునౌకాదళ మభివృద్ధికావలెనని వారికంటె ముందంజవేసెను అవును! ఇదియంతయు శాంతికొరకు!

మరుసటినెలలో 1934 నవంబరులో, లండను నగరములో నొక ఫిలుము ప్రయివేటుగ చూపబడెనని రిపోర్టు చేయబడెను. "ముస్లిము ప్రపంచము బ్రిటిషు సామ్రాజ్యముతో నలిచ్చిన్న స్నేహము" దాని యుద్దేశ్యము ఈ సందర్భములో ఆగాఖాను లాయిడ్ప్రభువు నతిథులుగ పిలువబటిరట. ఈ యుభయులు నవినాభావముగ నైక్యమైపోయిరి. రెండు గుండెకాయలు - తేజబహాదరు సప్రూ, యం. ఆర్. జయకర్లు మన జాతీయ రాజకీయములలోవలె - ఒకటివలె స్పందించును. భారతదేశము కత్యధిక సంతర్పణ జరుగుచున్నదని లాయిడ్ ప్రభువు అధికారములోనున్న కన్సర్వేటివు నాయకులమీదను, జాతీయ ప్రభుత్వముమీదను దయాదాక్షిణ్యరహితముగ ధ్వజమెత్తెను.

ఇటీవల కొంతమంది ముస్లిము కులనాయకులయుపన్యాసములలోను, వాఙ్మూలములలోను చిత్రమైన మార్పుకాన్పించును. దీనికి నిజమైన ప్రాముఖ్యతలేదు. కాని చాలమంది యిట్లు భావింతురని నేననుకొనను. అయినను యిది కులతత్త్వ చిత్తప్రవృత్తిని తెల్పును. దీనికి పెద్ద ప్రాముఖ్యత యివ్వబడెను. భారతదేశ 'ముస్లిముజాతి', 'ముస్లిము విజ్ఞానము", హిందూముస్లిము 'విజ్ఞానముల" పరస్పర

బద్ధవైరుధ్యము ప్రధానములయ్యెను. దీని విధాయక సారాంశ మేమన యీ రెండు 'విజ్ఞానములకు' మధ్యవర్తిగనుండుటకు, వీనిని సమదృష్టితో నడపుటకు బ్రిటిషుప్రభుత్వ మాచంద్రార్కము భారత దేశములో నుండవలెను. కొద్దిమంది హిందూకులనాయకులు సరిగా యిట్లే భావింతురు. ఒక్కవ్యత్యాసము మాత్రముండును. తా మధిక సంఖ్యాకులుగ నుండుటచే తమ ముద్దరగల 'విజ్ఞానమే' చివరకు జయించునని వా రాసింతురు.

హిందూ, ముస్లిము 'విజ్ఞానములు', 'ముస్లింజాతి'—ఈ పదము లాకర్షవంతములగు భూతకాలచారిత్రక వీధులను, భవిష్యద్వర్తమాన వాయు సౌధములను యెంత చిత్రముగ తెరచును! భారత దేశములో ముస్లిముజాతి – జాతిలోజాతి. యిది యిమిడికయైనది కూడ కాక నస్పష్టము, నిర్ధారణచేయుటకు వీలులేనిది. రాజకీయ ముగ నీభావమసంగతమైనది; ఆర్థికముగ నిది పిచ్చిమాట. అవిచార్యము. ఇది దీనివెనుకనున్న చిత్తవృత్తిని తెలుపుటలో మనకు తోడ్పడుచున్నది. మధ్యయుగములలో నిట్టి కలియరాని వేరు వేరు 'జాతులు' ఉండెడివి. ఆటమను సుల్తానుల ప్రథమ దినములలో కాన్‌స్టాంటునోపిలులో నిట్టి 'జాతి' వేరుగ జీవించి కొంత స్వాతంత్ర్యము కలిగియుండెడిది. ల్యాటిను క్రిస్టియనులు, సనాతన క్రిస్టియనులు, జ్యూమతస్థులు మొదలగువా రుండెడివారు. ఇది యన్యరాష్ట్రముల నాక్రమించుకొనుట కారంభము, ఇటీవల నిది యనేక ప్రాచ్యదేశముల కుపద్రవములుగ పరిణమించెను. కనుక "ముస్లిము జాతి" యనగా జాతియనునదెంతమాత్రముకాదని మతసంబంధముకలదని యర్థము. అనగా ఆధునిక యర్థములో యేజాతిని వృద్ధిచెందనీయరాదని యర్థము. అనగా నాధునిక నాగరికతను విడిచి మనము తిరిగి మధ్యయుగ పద్ధతులకు పోవలెననియర్థము. నిరంకుశప్రభుత్వము లేక విదేశప్రభుత్వము చివరపర్యవసానము. మనస్సుయొక్క యుద్రేక స్థితితప్ప వేరేమియులేదని యదార్థములను, ముఖ్యముగ నార్థిక యదార్థములను నెదుర్కొనునిచ్ఛలేకుండుట యని యర్థము. రాగాదుల తర్కమును తల్లక్రిందులు జేయుమార్గముకలదు. అవి యహేతు

కముగ కాన్పించుచున్నంత మాత్రమున మనము వానిని నిర్లక్ష్యము చేయజనదు. కాని ముస్లిముజాతి యను భావ మల్పభావముల కట్టు కథమాత్రమేయగును. పత్రికలలో దాసికీయబడిన ప్రచురణయే లేని యెడల దాని నెవరును వినియే యుండకపోవుదురు. చాలమందిరొక్క వేళ దానిని విశ్వసించినను యదార్థజ్ఞానముచే నదిపలాయనమగును.

హిందూ, ముస్లిము 'విజ్ఞానము' అను భావములుకూడనిట్టివే. 'జాతీయవిజ్ఞానములు' అనుభావములుకూడ శీఘ్రముగనశించుచున్నవి. ప్రపంచమంతయు నొకేవిజ్ఞానకేంద్రమగుచున్నది. జాతులన్నియు చాలకాలమువరకు తమప్రత్యేక చిహ్నములను—భాష, ఆచారములు, భావించువిధములు మొదలగువానిని, ఉంచుకొనవచ్చును. కాని యంత్రయుగము, శాస్త్రము, శీఘ్రయానము. ప్రపంచ వార్తల నవిచ్ఛిన్నముగ సరఫరాచేయుట, దూరశ్రవణము, సినిమా — మొదలగు వాని నంతకంతకు చదునుచేయును. ఈ విధాయకస్వభావము నెవడు నెదిరింపజాలడు. ఆధునిక నాగరికతను ధ్వంసముచేయు ప్రపంచ యుత్పాతమొక్కటియే దీనినివారింపగలదు. సాంప్రదాయజన్యమైన హిందూముస్లిము జీవిత వేదాంతములలో నిశ్చయముగ ననేక భేదములుకలవు. కాని ఈ రెంటిని యాధునిక శాస్త్రీయ,పారిశ్రామిక జీవితదృష్టితో పోల్చిచూచినచో నీభేదములుకాన్పించవు. ఎలనన ఈ రెండవదానికిని మొదటిరెంటికిని విశేషయంతరువుకలదు. నేడు భారతదేశములోనున్న యదార్థపోరాటము,హిందూ ముస్లిమువిజ్ఞానము అది యీ రెంటికి, వీనిని జయించుచున్న యాధునికనాగరికతయొక్క శాస్త్రీయ విజ్ఞానమునకుమధ్య కలదు. 'ముస్లిమువిజ్ఞానమును' (అది యేదయైనను) రక్షించుకొనగోరువారు హిందూవిజ్ఞానముగురించి బాధపడనక్కఱలేదు. వారు పశ్చిమదిశనుండివచ్చు రాక్షసిని కాచుకొనవలెను. ఆధునికశాస్త్రీయ, పారిశ్రామిక విజ్ఞానము నెదుర్కొను ప్రయత్నములన్నియు హిందువులవికానిండు ముస్లిములవికానిండు విఫలములగునని చెప్పుటకు వ్యక్తిగతముగ నాకెట్టిసంశయము లేదు. నే నీ విఫలతను నిర్వ్యాచారముగ పేక్షించుచుందును. రైల్వేలు మొదలగునవి యిచ్చుటకు వచ్చినప్పుడే యనైచ్ఛికముగను, అబుద్ధిపూర్వ

కముగను మనముకోరితిమి. అలీఘరుకళాశాలను ప్రారంభించినపుడు సర్ సయ్యదు భారతముస్లిములతరపున కోరుకొనెను. కాని నిజముగా మనకెవరికి నీ విషయములో నెట్టి స్వేచ్ఛయులేదు మునిగిపోవువాడు గడ్డిపరకనైనను పట్టుకొని రక్షింపదలచుకొను స్వేచ్ఛయే మనకు కలదు.

కాని, యీ'ముస్లిముల విజ్ఞానము'యేది? ఇది అరబ్బులు, పరిష్యనులు, తురుష్కులు మొదలగువారుచేసినఘనకార్యములకు సంబంధించిన యొకవిధమగు కులస్మృతియా? లేక భాష, కళ, గానము, ఆచారములు మొదలగువాని స్మృతియా? వర్తమాన ముస్లిము కళ, ముస్లిము గానముల నుదహరించినవాడొక్కడు నాకు కాన్పించడు. భారతదేశములో ముస్లిముభావముల నుత్పన్నముచేసినవి అరబ్బీ, పరిష్యనుభాషలు; ముఖ్యముగ రెండవది కాని పరిష్యనుభాషయుచ్చారణలో మతవాసన యేమియులేదు. పరిష్యనుభాషయు, ననేకపరిష్యను సాంప్రదాయములు, ఆచారములు వేలకొలది సంవత్సరములక్రిందట భారతదేశమువచ్చి యుత్తర హిందూదేశమంతట తన ప్రభావమును వ్యాపింపజేసెను. పరిష్యాదేశము ప్రాచ్యులకు ఫ్రాన్సువంటిది. అదితన భాషను, విజ్ఞానమును తన యిరుగు పొరుగు వారికి పంపును. అది భారతదేశములోనున్న మనకందరికి సామాన్యమైన, యమూల్య పిత్రార్జితము

ఇస్లామికజాతులు, దేశములు సాధించినఘనకార్యాభిమానమే బలవత్తరమైన యిస్లామికానుబంధములలో నొకటిగ కాన్పించును. వివిధజాతుల యీ యుదారచరిత్రకు ముస్లిములపట్ల యసూయపడు వారుందురా? వారు దానిని జ్ఞప్తియందుంచుకొని ప్రేమించునంత కాలము వారినుండి దానినెవరును తీసికొనిపోజాలరు. యధార్థమునకి గతచరిత్ర చాలవరకు మనకందరకు సామాన్యపిత్రార్జితము. ఏలనన యూరపుయొక్క యత్యాచారముపై ఆసియాదేశస్థులమైన మనల నొక సామాన్యబంధ మైక్యముచేయుచున్నట్లు భావింతుము. స్పెయినుదేశములోనున్న అరబ్బుల పోరాటములనుగురించి, క్రైస్తవులు చేసిన మతయుద్ధములను గురించి నేనెప్పుడు చదివినను నాసాను

భూతి వారి ప్రక్కనే యుండెడిది. నేను నిష్పక్షపాతముగ నుండుటకు విజయమునకు సంబంధించియుండుటకు ప్రయత్నించితిని. నే నెంత ప్రయత్నించినను యాసియా దేశపు ప్రజల సంబంధమువచ్చినపుడు నాలోనున్న యాసియాతత్త్వము నా విమర్శను మార్పుచేసెడిది.

ఈ "ముస్లిమువిజ్ఞానము"ను తెలిసికొనుటకు నే నెంతయో ప్రయత్నించితిని. కాని నేను సఫలుడను కాలేదని యొప్పుకొనక తప్పదు. ఉత్తరహిందూ దేశములో నత్యల్పసంఖ్యాకులగు మధ్య తరగతి ముస్లిములమీదను హిందువులమీదనుపర్షియనుభాషకు, సాంప్రదాయములకు పలుకుబడియున్నటు నేను చూచితిని. ప్రజాసామాన్యమును చూచినచో 'ముస్లిమువిజ్ఞానము' యొక్క స్పష్టమైనచిహ్నము లేవియన పొడుగు పొట్టిగాని యొక తరహా పాయిజామాలు, మీసముల నొక ప్రత్యేకవిధమున గొరిగించుట లేక కత్తిరించుట, గడ్డమునుమాత్రము స్వేచ్ఛగ పెరుగనిచ్చుట, ప్రత్యేకరకమైన మూతిగల యొక చెంబు—ఇట్లే హిందువుల యాచారములు ఒక ధోవతి ధరించుట, పిలకజుట్టు, మరియొకవిధమగు చెంబు. నిజమునకీ భేదములు కూడ పట్టణములకు సంబంధించినవి. అవి మాయమగుచున్నవి. ముస్లిము వ్యవసాయదారును, పారిశ్రామిక వర్కరును హిందూవ్యవసాయదారునుండి, వర్కరునుండి వేరుచేయుట కష్టము. ముస్లిము విద్యార్థికు లరుదుగ గడ్డమును పెంచుదురు. అలీఘరు యింకను జాలుతోనున్న యర్రటి తురుష్కటోపీని (తుర్కీదేశము దానిని విడిచిపెట్టినను అది తురుష్కమనబడును) వరించును. ముస్లిముస్త్రీలు చీరలుకట్టుకొని మెల్లమెల్లగా ఘోషావీడి వయికివచ్చుచున్నారు. నా రుచు లీ యాచారములలోని కొన్నింటితో నైక్యముకాజాలవు. నాకు గడ్డమును, మీసములు, పిలకలు గిట్టవు. కాని నా రుచులను నే నితరులపై బలవంతపరుప నిచ్ఛగింపను. కాని యమానుల్లా కాబూలులో గడ్డముల సమాంతము తీయించివేసినపుడు నేను సంతోషించితినని యొప్పుకొనక తప్పదు.

ఎల్లప్పుడు వెనుకకే తిరిగిచూచు హిందువులు, ముస్లిములు, తమ చేతులనుండి జారిపోవుచున్నవానినే పట్టుకొనుచుందువారును

శోచనీయమగు దృశ్యమును ప్రదర్శింతురు. నేను భూతకాలమును గర్హింపగోరుటలేదు,తిరస్కరింపగోరుటలేదు. మన భూతకాలములో ప్రత్యేక సౌందర్య మెంతయోకలదు. అది శాశ్వతముగ నుండునను టకు నా కెట్టి సందేహములేదు. కాని వీ రా సౌందర్యమును వరింపరు; వీ రతి నిష్ప్రయోజనమైనదానిని, తరుచు హానిచేయుదానిని గ్రహింతురు.

ఇటీవల సంవత్సరములో భారత ముస్లిములకు నిరంతరాయ ఘాతలు తగిలెను. వారత్యంత ప్రేమతో దోహదముచేసికొనినయనేక భావములుముక్కలైపోయెను.ఇస్లాముకు గురుపీఠమైన టర్కీ 1920 లో భారతదేశము దేనికొరకతిధైర్యముగ పోరెనో, యట్టి ఖిలాఫతుకు స్వస్తిచెప్పుటకే క్రమక్రమముగ మతమునే విడిచిపెట్టెను. టర్కీ యొక్క నూతనచట్టములో నది ముస్లిము ప్రభుత్వమని చెప్పబడెను. కానియెట్టిదురభిప్రాయములు కలుగకుండుటకు కెమల్ పాషా 1927లో నిట్లు చెప్పెను. "టర్కీ ముస్లిము ప్రభుత్వమని చట్టములో చేయబడిన సూత్ర మొక రాజీసూత్రము. మొట్టమొదటి యవకాశముదొరుకుట తోడనే యది తుడిచివేయబడును." తరువాతి నత డీ సూచనప్రకార మాచరించెనని నేను విశ్వసించెదను. ఈజిప్టుకూడ మరింతయెక్కువ జాగ్రతతోనైనను, టర్కీననుసరించుచు తన రాజకీయములను మత సంబంధము లేకుండ నుంచెను. అట్లే, చాల వెనుకబడియున్న అరబు తప్ప, తక్కినయరబు దేశములుచేసెను.పరిష్యాతన వైజ్ఞానిక ప్రబోధము కొరకు వెనుతిరిగి యిస్లాముయొక్క పూర్వపురోజులను కాంక్షించు చున్నది. ప్రతిచోట మతము వెనుకకుపోవుచున్నది. జాతీయత ముందుకు వచ్చుచున్నది. జాతీయత వెనుక సాంఘిక, ఆర్థిక విషయములను గురించిచెప్పు యితర 'యిజములు'తత్వములువచ్చుచున్నవి. 'ముస్లిము జాతి'' "ముస్లిమువిజ్ఞానము''సంగతి యేమయ్యెను!ఇక ముందది దయా సముద్రులగు బ్రిటిషు పరిపాలకులక్రింద యుత్తర హిందూదేశములోనే కాన్పించునా ?

57

ప్రతిష్టంభన

నా నిర్బంధము, శిక్ష తప్పదని నాకుండెను. దేశమంతయు ఆర్డినెన్సులచే పాలింపబడుచుండ, కాంగ్రెసే యక్రమసంఘముగనుండ నిది సందేహాస్పదమెట్లు కాగలదు! బ్రిటిషుప్రభుత్వ తత్వమును బట్టియు నాకృతినిబట్టియు నన్నణచివేయుట విధాయకమని కాన్పించెను. ఈ నిత్య యవకాశముండుటచే నా పని కొంత చెడుచుండెను. నే నేమి చేయుటకు స్థిరపరచుకొనజాలకుంటిని. చేయగలిగినంత చేయుటకు నేను త్వరపడుచుంటిని.

నిర్బంధము ననవసరముగ దెచ్చిపెట్టుకొనుట నా కిష్టములేక దాని కావకాశమునిచ్చు కార్యములను చాలవరకు తగ్గించితిని. రాష్ట్రములోను, బయటసంచారము చేయవలసినదని నాహ్వానములు వచ్చుచుండెను. నే నందులకంగీకరింపలేదు. ఉపన్యాసములనిచ్చు దే సంచారమైన నుద్రేకకరమైన దండయాత్రయగును. ఇది హఠాత్తుగ నాపివేయబడును. అప్పుడు నా కింకొక మధ్యమార్గములేదు. నే నే ప్రదేశమునకైనను మరియొక యుద్దేశ్యముతో వెళ్ళినపుడు – గాంధీజీతోను వర్కింగుకమిటీతోను సంప్రదించుటకు – నేను బహిరంగోపన్యాసముల నిచ్చుచు స్వేచ్ఛగా మాట్లాడెడివాడను. జబ్బలపురములో గొప్పసభ, బ్రహ్మాండమగు యుత్సవము జరిగెను. ఢిల్లీలోనే పెద్దసమావేశము జరిగెను. ఈ సభావిజయమే ప్రభుత్వమికనిట్టివాటిని సహింపజాలదని తెలుపుచుండెను ఢిల్లీసభ ముగియుటతోడనే నా నిర్బంధవదంతులు చెలరేగెను. కాని నేను అలీఘురులో ముస్లిము విద్యార్థుల కుపన్యసించి యలహాబాదు చేరుకొంటిని. ప్రభుత్వము

రాజకీయములను నలిపివేయుటకు యత్నించుచుండ రాజకీయేతర పల్లెపనులలో పాల్గొనుట నా కిష్టము లేకుండెను. మన సంగ్రామముతో సంబంధములేని శుష్కకలాపములలో జోక్యము కల్పించుకొని దానినుండి తప్పించుకొనవలెననెడి స్వభావము కాంగ్రెసు వారిలో కాన్పించెను. ఇది సహజము; కాని దీనినప్పుడు ప్రోత్సహింపగూడదని నేను భావించితిని.

పరిస్థితులనవలోకించి భవిష్యత్కార్యములను నిర్ణయించుటకు 1933 అక్టోబరులో యు.పి. కాంగ్రెసు వర్కరులసభ యలహాబాదులో జరిగెను. రాష్ట్రీకాంగ్రెసుకమిటీ యక్రమసంఘము. కనుక మేమా కమిటీని పిలువలేదు. కాని జయిలు వెలుపలనున్న కమిటీ సభ్యులను యితరవర్కరులను యిష్టాగోష్టిసభకు పిలిచితిమి. మా సభలు ప్రయివేటు సభలయినను వాటికి రహస్యములు లేవు ప్రభుత్వముజోక్యముకల్పించుకొనునో లేదో మాకు చివరవరకు తెలియదు ఈ సభలలో నార్థికమాంద్యము, నాజీసిద్ధాంతము, కమ్యూనిజము మొదలగుప్రపంచపరిస్థితినిగురించి మేమెక్కువ శ్రద్ధతీసికొంటిమి. భారతపోరాటము నితర చోట్ల జరుగుసంభవములతో నన్వయించి చూడవలెనని మేము మా వర్కరులను కోరితిమి. చివర కాసభ మా లక్ష్యమును నిర్వచించుచు నొక సామ్యవాద తీర్మానము నామోదించెను. శాసనోల్లంఘన విరామము నది యాక్షేపించెను. సమష్టిశాసనోల్లంఘనమున కవకాశము లేదనియు వ్యక్తిగతశాసనోల్లంఘనముకూడ త్వరలోనే క్షీణించు ననియు లేక నతితక్కువవ్యాప్తి కలిగియుండుననియు నందరకు తెలియును. కాని ప్రభుత్వార్డినెన్సుచట్టములు, దాడి సాగుచుండుటచే విరమించుటవలన మనకు కలుగు వ్యత్యాసమేమియును లేదు. కనుక మేము మా మూలాలు శాసనోల్లంఘనమును సాగించుటకే తీర్మానించితిమి, కాని యరెస్టులను కోరుట కేమియు చేయవలదనియే మావర్కరులకు చెప్పితిమి. వారు తమ సామాన్యధర్మమును నెరవేర్చుచు నందులో వారికి నిర్బంధములు ప్రాప్తించుచో సంతోషముతో స్వీకరింతురు. ముఖ్యముగ గ్రామములలో తిరిగి సంబంధముకలిగించుకొనివ్యవసాయ

దారుల స్థితినికనుగొనవలసినదని మేము వారికి చెప్పితిమి. పన్ను చెల్లింపరాదను యుద్యమ మప్పుడు లేనేలేదు. పూనా సభ యనంతర మిది తుదిసారి విరమింపబడెను. అప్పటి పరిస్థితులలో నదెపుడనుద్ధరింపబడజాలదని స్పష్టమగుచుండెను. ఈప్రోగ్రాముసాధువైనది, తీవ్రతలేనిది: ఇందులో న్యాయవిరుద్ధమైన దేదియులేదు. అయినను యిదియరెష్టులకు కారణమగునని మేము గ్రహించితిమి. మా వర్కరులు గ్రామముల లోనికి వెళ్ళుటతోడనే అరెష్టుచేయబడి పన్నులనిరాకరణమును బోధించిరని శిక్షింపబడిరి. నా సహచరులు నిర్బంధింపబడినతోడనే నేనా గ్రామప్రాంతములకు వెళ్ళవలెననుకొంటిని. కాని నాకితర పనులుండుటచే పోజాలకపోతిని.

అఖిలభారత పరిస్థితి విచారించుట కానెలలో రెండుసార్లు వర్కింగుకమిటీసమావేశమయ్యెను. గాంధీజీప్రోత్సాహము చేతపూనా కాన్ఫరెన్సుజరిగినతరువాతనన్ని కాంగ్రెసుకమిటీలు, ఆఫీసులు విరమింపబడుటచే పైకమిటీ పనిచేయుటయే లేదు. నాస్థితి చిత్రముగనుండెను. నేను జయిలునుంచివచ్చుటతోడనే యీ ఆత్మహత్యవంటి, ఆర్డినెన్సు కంగీకరింపనొల్లక కాంగ్రెసుయొక్క సామాన్యకార్యదర్శినని చెప్పుకొనగోరితిని. కాని నేను గాలిలో పనిచేసితిని. సరియైన ఆఫీసు, యుద్యోగులు, తాత్కాలికాధ్యక్షుడు లేరు. గాంధీజీ యాలోచనల కందుబాటులోనున్నను, అఖిల భారత సంచార కార్యక్రమములో నిమగ్నుడై యుండెను. సంచారములో మేమతనిని జబల్‌పురములోను ఢిల్లీలోను పట్టుకొంటిమి. వర్కింగుకమిటీసభ్యులతో మేముచ్చట యాలోచనలను చేసితిమి. వివిధసభ్యుల మధ్యగల భేదాభిప్రాయముల నతిచక్కగ వివాదము చేయగలిగెను. ఒక ప్రతిష్టంభన యేర్పడెను. అందరకు రుచించు తరుణోపాయమేదియు దొరకలేదు. శాసనోల్లంఘనమును విరమింపవలెననువారికి కూడదనువారికి మధ్య గాంధీజీ పరిష్కరింపవలసియుండెను. అప్పుడతడు విరమించుటకేసుముఖుడు, కనుక వ్యవహారములు యథాప్రకారముగనే సాగింపబడెను.

కాంగ్రెసుతరఫున శాసనసభలకు పోవలెనను విషయ మప్పుడప్పుడు కాంగ్రెసుసభ్యులచే చర్చింపబడుచుండెను. కాని వర్కింగు కమిటీసభ్యు లీవిషయమై యంతశ్రద్ధతీసుకొనలేదు. ఆసమస్య యింకను యుదయింపలేదు. అది యకాలవిషయము. 'సంస్కరణలు' అథమము మరి రెండుమూడు సంవత్సరములకుగాని రూపమునుదాల్చవు ఎన్నికలలో పోటీచేయుటకుసిద్ధాంతరీత్యావ్యక్తిగతముగ నాకెట్టి యభ్యంతరములేదు. ఆ సమయమువచ్చినపుడు కాంగ్రెసు పోటీచేయువలసి యుండుననియే నేను నిశ్చయించుకొంటిని. కాని యప్పుడీసమస్య లేవదీయుట దృష్టిని పెడత్రోవకు త్రిప్పుటయేయగును పోరాటము సాగింపబడినచో మనలనెదుర్కొనిన సారాంశములు పరిష్కరింపబడునని, రాజీపద్ధతుల ప్రభావము తగ్గునని నే నాశించితిని.

ఈలోపల నేను పత్రికలకు వ్యాసములను, స్టేటుమెంటులను పంపించుచుంటిని. కొంతవరకు నా వ్రాతలలోని తీవ్రతను నేను తగ్గించవలసియుండెను. లేనిచో సెన్సారుప్రయోగము లెంతదూరమైనను సాగగలవు. నేనట్టి సాహసములకు సిద్ధపడినను ముద్రణాధికారులు, ప్రకాశకులు, సంపాదకులు దీనికి సంసిద్ధులుకారు. మొత్తముమీద వార్తాపత్రికలు నాయెడల సుముఖముగనేనుండెను కాని యవి యెల్లపుడు నట్లుండలేదు. ఒక్కొక్కప్పుడు స్టేటుమెంటులు, ప్రకరణములు నణచివేయబడుచుండెడివి. నేను కష్టపడివ్రాసిన పెద్ద వ్యాసమొకటి బుట్టదాఖలుచేయబడెను. నేను 1934 జనవరిలో కలకత్తాలోనున్నపుడొక ప్రధానదైనికపత్రికాధిపతి నన్ను దర్శింపవచ్చెను. అతడుకలకత్తా పత్రికల ప్రధానసంపాదకుని యభిప్రాయముకొరకు నాస్టేటుమెంటు పంపితిననియు నతడు దాని నంగీకరింపకపోవుటచే నది ప్రచురింపబడ లేదనియు చెప్పెను. ఈ "ప్రధానపత్రికాధిపతి" కలకత్తాలోప్రభుత్వ ముద్రణాలయ తనిఖీదారు.

నేను పత్రికలకుపంపిన కొన్నిస్టేటుమెంటులలోని ఘాటుతనము నకు కొంచె మాశ్చర్యపడితినని నా స్నేహితురాలువ్రాసెను. నేను కొంచెమించుమించు 'గర్విష్టి'నగుచుంటిని. ఇది నా యాశలన్నియు

వ్యర్థమగుటవలన కలిగినఫలితమా? ఇది కొంతవరకు సత్యము. జాతీయముగ మనమందరము విఫలతచే బాధపడుచున్నాము. వ్యక్తిగతముగకూడ నిది కొంతవరకు నిజమయియుండవలెను. అయినను నేనిట్టి భావముచే నెక్కువ బాధపడుటలేదు. ఏలనన నామట్టుకునాకువిఫలుడనైతినను భావ మెన్నడు గలుగదాయెను! గాంధీజీ రాజకీయముగ నన్నాకర్షించినది మొదలు నేనతనియొద్ద నధమమొక్క పాఠమునుఫలితములకు భయపడి భావముల నణచివేసికొనకుండుట నేర్చుకొంటిని. ఆ యాచారమును రాజకీయరంగములో ననుసరించుటవలన నా కెన్నియో కష్టములు సంభవించెను. కాని వాటితోపాటు నా కది యెక్కువ సంతుష్టినికూడ ప్రసాదించెను. దీనివలననే మనలో చాలమంది యదార్థ మనశ్ఛేదమును, అధమాధమ విఫలతను తప్పించుకొంటిమి. అసంఖ్యాకులగు ప్రజలు ప్రేమతో చూచుచున్నా రను జ్ఞానముకూడ నధిక మనశ్శాంతి నిచ్చును. అదియోటమికే, విఫలతకు చింతామణివంటిది. ఇతరులచే విస్మరింపబడి యేకాకిగనుండు టతి భయంకరభావములలో నొకటియని నే నూహించెదను.

అయినప్పటికి నా దురదృష్టవిచిత్రప్రపంచములో విఫలతయను భావమును మనమెట్లుతప్పించుకొనగలము? సమస్తము తారుమారగుచున్నట్లు మన మెంత తరుచుగ చూచుచుందుము? ప్రయత్నమును విడకపోయినను మనచుట్టుపట్లనున్న మానవుల గుణగణములను చూచునపుడు సందేహములు మనలను ముట్టడించును. వివిధ సంభవములపట్ల తరచు నాకు కోపము, తిరస్కారముకలుగుచుండును. అట్టి వ్యక్తులుబృందములుగురియగుచుండిరి. జీవితమును ప్రదర్శనశాలక్రింద చూచు దృష్టివయి నాకంతకంతకుతిరస్కార మెక్కువగుచుండెను. ఇది ప్రధానసమస్యలనునిర్లక్ష్యముచేసి వాని నుదహరించుట యనుచితమని భావింపును. ఏలనన నవి వారి బాల్యకసమునకే నష్టము తెచ్చును. లేక వారి దురభిమానములను స్పృశించును. ఈ తిరస్కారము విఫలత. 'గర్విష్టి' తనము యెంతయున్నను నేను నాతప్పిదములను, యితరుల తప్పిదములనుకూడ చూచి పరిహసించుశక్తినింకను పోగొట్టుకొనలేదు.

దయామయుడగు విధియందు ప్రజలకుగల విశ్వాసమునకు నేనొక్కొక్కప్పు డాశ్చర్యపడుచుందును. ఆ విశ్వాసము దెబ్బలు తగిలిన కొలది తలయెత్తుచునే యుండును. దుఃఖములును, దయామయుడు కాడను ఋజువులునుకూడ నా విశ్వాస గంభీరతకు పరీక్షలని భావింపబడును.

అభివృద్ధియందు, ధర్మమునందు, లక్ష్యములయందు, మానవ శ్రేష్ఠత్వమునందు, మానవవిధియందు విశ్వాసముండునట! ఇదియొక విధియందలి నమ్మకమునకు సంబంధించినదికాదా? దీనిని తర్క హేతువులతో, సమర్థింపప్రయత్నించుచో వెంటనే మనకు కష్టములు సంభవించును. కాని మనలోనున్నదేదియో ఈ యాశను, విశ్వాసమును ఆశ్లేషించియుండును. ఇదిలేనిచో జీవితము పచ్చికబయళ్ళులేని యెడారియగును!

నా సామ్యవాద ప్రచారఫలితము వర్కింగుకమిటీలోని కొంతమంది సహోద్యోగులను తారుమారుచేసెను. నే ననేకవత్సరముల నుండి యీ ప్రచారముచేయుచుండినపుడు వారూరుకొనినట్లే యిప్పుడును సహించియుండెడివారు. కాని నేనిపుడు దేశములో చెలామణియగుచున్న ప్రయోజనములను కొంతవరకు భయపెట్టుచున్నాను. నా ప్రయత్నమిక నిరుపద్రవకరమని పిలువబడజాలదు. నాతోడివారు కొందరు సామ్యవాదులుకారని నేనెరుగుదును. కాని కాంగ్రెసుకార్యనిర్వాహక సభ్యుడుగనుండి సామ్యవాదప్రచారము చేసికొనుటకు నాకు సంపూర్ణస్వేచ్ఛకలదని నేనెప్పుడును భావించుచుంటిని. నాకట్టి స్వేచ్ఛలేదని వర్కింగుకమిటీ సభ్యులు కొందరు భావించుచున్నారను సంగతి నాకాశ్చర్యము కలుగజేసెను. నేను వారినసత్యస్థితిలోనుంచుచుంటిని కనుక, వారు తిరస్కరించిరి. కాని నేనేమిచేయవలెను? నా ధర్మములలో నతిప్రధానమని భావించుదానిని నేనువిడిచిపెట్టజాలను. ఈ రెంటికి సంఘర్షణముండుచో నేనువర్కింగుకమిటీనుండి రాజీనామా యివ్వగోరెదను. కాని యీ కమిటీ యక్రమసంఘముగనుండి, సరిగా పనికూడ చేయుచుండనపుడు నే నెట్లు రాజీనామా యివ్వగలను?

గాంధీజీ మద్రాసునుండి వ్రాసినపుడుకూడ నాకీకష్టము తిరిగి తటస్థించెను. 'మద్రాసుమెయిలు' పత్రికకతడిచ్చిన సందర్శనమును గురించిన విషయము నాకంపబడెను ఈ సందర్శనమునుకోరినవాడు నన్నుగురించి ప్రశ్నించెను. నా ప్రయత్నములను గురించి గాంధీజీ కొంచెమించుమించు తీవ్రమార్పణ చెప్పుచు నాయుదారతయందతనికి నమ్మకముగలదని చెప్పెను. నేను కాంగ్రెసును ఈనూతనపద్ధతులకు బంధించువాడనుకాను ఇట్లు నాకు తెలుపబడునని నేనూహింపలేదు. కాని గాంధీజీ తనసందర్శనములో పెద్దజమీందారీ పద్ధతినిసమర్థించుట నన్నెక్కువగ కలతపెట్టెను. ఇది గ్రామముయొక్కయు, జాతియొక్కయు ఆర్థికశ్రేయస్సు కత్యావసరమయిన భాగమనియతడు భావించునట్లు కాన్పించును. ఇది నాకుచాలయాశ్చర్యముకలిగించెను. ఈరోజులలో నీపెద్దజమీందారులను తాలూకాదారులను, సమర్థించువారతియరుదు ప్రపంచమంతట నవిముక్కలుచేయబడెను. భారతదేశములోకూడ నవి చిరకాలముండజాలవని చాలమంది గుర్తించిరి. తాలూకాదార్లు, జమీందార్లుకూడ ఈ పద్ధతిపోవుట కంగీకరింతురు. ఈ పద్ధతి తననిజభారముచేతనే కృంగిపోవుచున్నది. అయినను గాంధీజీకి దీనియందు సానుభూతికలదు. అతడు ధర్మకర్తృత్వమును గురించి మాట్లాడును. అతనిదృష్టికినాదృష్టికి నెంతబేధముకలదు? నేనికముందితనితో నెంతవరకు సహకారముచేయుగలను; అని ఆశ్చర్యపడితిని. నేను వర్కింగుకమిటీలో నికముందుకూడ నుండవలెనా? అప్పుడు మార్గమేమియు లేకుండెను, కొద్దివారములైన తరువాత నేను తిరిగి జయిలుకు వెళ్లుటచే నీసమస్య యసంగతమయ్యెను.

నాస్వవిషయములు చాలకాలమును ప్రింగివేసెను. మాతల్లియారోగ్యము బాగుపడుచుండెను. ఆమె యింకను మంచముపట్టియుండినను అపాయము తప్పిపోయెను చాలకాలమునుండి నిర్లక్ష్యము చేయబడుచుండిన నాయార్థికములను చక్కబెట్టుకొనగోరితిని. మేము చేయుగలిగిన ఖర్చుకంటె నెక్కువఖర్చు చేయుచుంటిమి. మాఖర్చులను తగ్గించుమార్గమేదియు కాన్పించదు. శరీరయాత్రసాగించుటకునేనెంత

బాధపడుటలేదు. నావద్ద ధనమేమియు మిగలనిదినముకొరకు నేను చూచుచుంటిని. ఆధునిక ప్రపంచములో ధనము, ఆస్తులు చాలయవసరములు. కాని, దీర్ఘయాత్రలను చేయగోరువారికవి తరుచు ప్రతిబంధకములు. సాహసకార్యములను చేయుటకు ద్రవ్యవంతులకు ప్రాణకంటకముగనుండును. తమవస్తువులను, పశ్వాదులను పోగొట్టుకొనుటకు వారెల్లపుడు భయపడుదురు. ప్రభుత్వమువారు తమ యిష్టమువచ్చినప్పుడు ద్రవ్యమును, ఆస్తిని, వశపరచుకొనగలిగినపుడు లేక సర్కారులో కలిపివేసికొనగలిగినపుడు దాని యుపయోగమేమి? కనుక నాకున్న స్వల్పమునుకూడ వదలించుకొనగోరితిని. మా యవసరములు చాలతక్కువ. మాకుచాలినంత సంపాదింపగలనను ధైర్యము నాకుండెను. మాతల్లి తనయవసానకాలములో నసుఖముల ననుభవింపరాదనియు జీవితప్రమాణములో నెక్కువన్యూనతను పొందరాదనియు నేనాతురపడుచుంటిని. నాకుమార్తె విద్య కాటంకముండకూడదనికూడ నేనాతురపడుచుంటిని. దీనికి, నాయుద్దేశ్యప్రకారము ఆమె యూరపులో నుండవలెననుకొంటిని. ఇంతకు మినహా నాకు నా భార్యకు ద్రవ్యముకొరకు ప్రత్యేకావసరములు లేవు లేదా, యనార్థద్రవ్యాభావమున కలవాటుపడకపోవుటచే మేమట్లు భావించితిమి. ద్రవ్యము కొఱతపడుదినము వచ్చినప్పుడు మాకది సంతోషదాయకముగ నుండజాలదని నేను పూర్తిగా నెరుగుదును. నేను చివరవరకు మిగుల్చుకొనిన రొక్క దూబరఖర్చు:- నేను పుస్తకముల నెక్కువగ కొనుచుండును. అరికట్టిపెట్టుట నాకు కష్టముగనుండును.

మా ఆర్థికస్థితిని చక్కబెట్టుకొనుటకు నా భార్యనగల నమ్మివేయుటకు మేము నిశ్చయించితిమి. వానితోపాటు వెండిసామాగ్రి, మాయొద్దనున్న విలువగల యితరవస్తువులు, బండ్లు కొలదిగనున్న చిల్లరసామగ్రి విక్రయింపదలచితిమి. కమల తన నగలను పన్నెండు సంవత్సరములనుండి ధరింపక బ్యాంకిలో పడవేసినను అమ్మివేయుట కంగీకరింపకుండెను. ఆమె వానిని మా కుమార్తెకిచ్చి వేయవలెనను కుతూహలముతో నుండెను.

1934, జనవరిమాసము. అలహాబాదుజిల్లా గ్రామములలో నున్న మావర్కర్లు నిరపరాధముగ పనిచేయుచున్నను నిర్బంధింప బడుటచేత మేము గ్రామములకు వెళ్ళవలసియున్నట్లు కాన్పించెను. మా యు. పి. రాష్ట్రీ కాం. కమిటీకార్యదర్శియైన రఫీఅహ్మదుకిద్వాయి కూడ నిర్బంధింపబడెను జనవరి 26వ తేదీ—స్వాతంత్ర్యదినము— వచ్చు చుండెను. దానిని మే మెట్లు నిర్లక్ష్యముచేయగలము? ఆర్డినెన్సులు నిషేధములు యెన్నియున్నను 1930 లగాయితు యిది విడువకుండ దేశమంతట సక్రమముగ జరుపబడుచుండెను. కాని, యిపుడు మార్గ మును చూపువారెవరు? చూపవలసినమార్గ మేది? సిద్ధాంతములో నైన నఖిలభారత కాంగ్రెసు అధికారిగ పనిచేయువారు నేనుతప్ప మరెవరు లేరు నేను కొంతమందిస్నేహితులతో నాలోచించితిని. ఏదియో కొంత జరుగవలెనని యందరు నంగీకరించిరి. కాని జరుగవలసిన దానిని గురించి యంగీకారమేమియు కుదరలేదు. సమిష్టి నిర్బంధములకు దారితీయు కార్యములను తప్పించుకొనవలెననెడి సామాన్యస్వభావము నాకు కాన్పించెను. చివరకు స్వాతంత్ర్యదినము నుచితరీతిని జరుపవలె ననెడి యొక చిన్నసందేశమును పంపితిని. దానిని జరుపవలసినవిధము నాప్రాంతములవారికే విడచివేసితిమి. అలహాబాదు జిల్లాయందం తట జరుపవలసిన కార్యక్రమము నేర్పరచితిమి.

ఈ స్వాతంత్ర్యోత్సవముల నేర్పాటుచేసినవా రాదినముననే నిర్బంధింపబడుదురని మేము భావించితిమి. నేనుతిరిగి జయిలుకు వెళ్ళు లోపల వంగదేశమును దర్శింపగోరితిని. అచ్చటనున్న పాతస్నేహితు లనుచూచుటకు, గత కొద్దిసంవత్సరములనుండియు నా దేశప్రజలు చేసిన యపారత్యాగములకు వారి నభినందించుటకు నేనీ యాత్ర నుద్దేశించితిని. వారికి సహాయముచేయుటకు నేనేమియు చేయజాలనని బాగుగ నెరుగుదును. సానుభూతి, సహచరభావము నుండిన సార్థక మేమి? అయినను వంగదేశము తనయవసరసమయమున యావద్భా రత దేశముచేతను విడువబడినట్లు భావించుచుండుటచే నివి యవశ్యము లయ్యెను. ఈ భావముండుట న్యాయము కాకపోయినను యుండెను.

కమల యారోగ్యమునుగురించి మావైద్యులతో నాలోచించుటకుకూడ నేనామెను తీసికొని కలకత్తా వెళ్ళవలసియుండెను. ఆమెకెంతమాత్రము నారోగ్యములేదు. కాని కొంతవరకు మే ముభయులము దీనిని నిర్లక్ష్యముచేసి చికిత్సకొరకు కలకత్తాలోనో మరొకచోటనో దీర్ఘకాలముండలేకపోతిమి. నేనుబయటనుండు కొద్దికాలము మేముభయులముసాధ్యమయినంతవర కొక్కచోటనే యుండగోరితిమి. నేను తిరిగి జయిలుకు వెళ్ళినతరువాత చికిత్సచేయించుకొనుటకుడాక్టరులనుసంప్రదించుటకునామెకుకావలసినంత సావకాశముండును. ఇప్పుడు నిర్బంధ మాసన్నమగుటచే కలకత్తాలో నాసమక్షమున నీ పరీక్ష చేయించుటకు నిశ్చయించితిని; తరువాత తక్కినపనులు చూచుకొనవచ్చును.

కనుక కమల నేను జనవరి 15 వ తేదీని కలకత్తా వెళ్ళుటకు నిశ్చయించితిమి. మేము స్వాతంత్ర్యదినోత్సవములకు తగినంతముందుగనే తిరిగి రావలెననుకొంటిమి.

58

భూ కం ప ము

1934 జనవరి 15వ తేదీ మధ్యాహ్న కాలము. అలహాబాదులో నేను మాయింటివరండాలో నిలిచి కొంతమంది వ్యవసాయదారుల కుపన్యసించుచుంటిని. సాంవత్సరిక మాఘమేళా ప్రారంభమయ్యెను. దినమంతయు వందలకొలది ప్రేక్షకులు మమ్ముచూడవచ్చుచుండిరి. హఠాత్తుగ నేను నాకాళ్ళమీద నిలువజాలక ముందుకు జోగనారంభించి సమీపముననున్న యొక స్తంభమును కౌగిలించుకొంటిని. తలుపులు డబడబకొట్టుకొన నారంభించెను. సమీపముననున్న స్వరాజ్య భవనమునుండి హోరుమను శబ్దము వినవచ్చెను, ఇంటికప్పునుండి పెంకులు జలజల రాలుచుండెను. ఇదివరకుభూకంపము నెరుగకపోవుటచే నేమి జరుగుచున్నదియు నాకు మొదట తెలియకుండెను. కాని వెంటనే నేను గ్రహించితిని, ఈ నూతన యనుభవము నాకువినోదము శ్రద్ధ కలుగచేసెను. తిరిగి నేను వ్యవసాయదారులతో సంభాషింప నారంభించి వారికి భూకంపమునుగురించి చెప్పితిని. వృద్ధురాలగు మా పెత్తల్లి నన్ను ఇంటనుండి పారిపోవలసినదని దూరముననుండి కేకలు వేసెను. ఆ భావమునాకు విపరీతముగ కాన్పించెను. భూకంపమును నే నంతయెక్కువగ పాటింపలేదు ఎట్లయినను మేడమీద మంచము పట్టియున్న మాతల్లిని, ప్రయాణసన్నాహము చేయుచున్ననా భార్యను విడిచి నేను నా యొంటిప్రాణమును దక్కించుకొనజాలను. ఆ తాకుడులు చాలసేపునిలచి ఆగిపోయెను. అవికొద్దినిముసముల సంభాషణకు కారణమయి వెంటనే విస్మరింపబడెను. ఆ రెండుమూడు నిముసములు బీహారులోను యితరచోట్ల లక్షలకొలది ప్రజల కెట్లు పరిణమించెనో

మాకప్పుడు తెలియలేదు. దానిని మేము గ్రహింపజాలకపోతిమి. ఆసాయంకాలమే కమల నేను కలకత్తా పయనమైతిమి. మాకు తెలియకుండ మా రైలు ఆరాత్రి మమ్ము భూకంప ప్రాంత దక్షిణభాగము నుండి తీసికొనిపోయెను. మరునాడీ విపత్తునుగురించి కలకత్తాలో వార్తలేమియు లేకుండెను. ఆ మరునాడు వార్తాలేశములు రానారంభించెను. మూడవరోజు విపత్తుయొక్క స్వభావము కొంత ద్యోతకమయ్యెను.

మేము మా కలకత్తాప్రోగ్రాములో మునిగియుంటిమి. చాల మంది వైద్యుల ననేకదఫాలు సందర్శించితిమి. చివరకొకటి రెండుమాసములయిన తరువాత చికిత్సకొరకు కమల తిరిగి రావలెనని నిశ్చయింపబడెను. తరువాత చాలకాలమునుండియు కలుసుకొనని స్నేహితులను కాంగ్రెసు సహోద్యోగులను మేము కలుసుకొనవలసి యుండెను. ఆ కాలమంతయు నేను మనోభారముచే బాధపడితిని. కష్టములు కలుగునను భయముచే నేమిచేయుటకు ప్రజలు భయపడుచున్నట్లు కాన్పించెను. వారిదివరకు నెన్నియో యనుభవించిరి. ఇతరచోట్లకంటె నిచ్చట వార్తాపత్రికలతి జాగ్రత్తగనుండెను. ఇతరచోట్లవలెనే యిచ్చటను భవిష్యత్కార్యక్రమమును గురించి సందేహము. విభ్రమము కలదు. నిశ్చయముగ భయముకంటె సందేహమే రాజకీయకృషికభ్యంతరముగనుండెను. ఫాసిజము, సామ్యవాదము, కమ్యూనిజము ఈభావములు వాతావరణములో నుండెను. కాని యివన్నియు నస్పష్టముగ నొకదానితోనొకటి మిళితమయియుండెను. వీరిమధ్య ఖచ్చితమగు రేఖగీయుట లేక నిర్వచించుటకష్టము. ప్రభుత్వదృష్టినాకర్షించి వారిచే నెక్కువగ ప్రకటింపబడుచున్న టెర్రరిస్టుయుద్యమమును గురించి యెక్కువగ తెలిసికొనుటకు నాకవకాశము కాలములేకపోయెను. నాకు తెలిసినంతవరకు దానికెట్టి రాజకీయప్రాధాన్యత లేదు. టెర్రరిస్టు వర్గమువారి పాతసభ్యులకు దానియందు నమ్మకముపోయెను. వారు వేరువిధముగ భావింపనారంభించిరి. బెంగాల్ ప్రభుత్వచర్యలవలనకలిగిన తిరస్కారభావముచేత నచ్చటచ్చట వ్యక్తులు చెలరేగి యొకవిధమగు జగడమునకు దిగిరి, ఇరుపక్షముల కలహాభావము ప్రధానముగ నేయుండెను. వ్యక్తులగు టెర్రరిస్టుల

సందర్భములోనిది స్పష్టముగనేయుండెను. ప్రభుత్వముకూడ సంఘ విరుద్ధకార్యములను శాంతముగ చేబట్టుటకు బదులు దీని నొక కలహ దృష్టిలో చూచిరి. ఉగ్రరిష్టు చర్యలచే నెదుర్కొనబడిన యే ప్రభుత్వ మైనను వానిని డీకొనియణచివేయుటకు ప్రయత్నింపకతప్పదు. కాని యపరాధుల యెడల నిరపరాధుల యెడల విచక్షణరహిత చర్యలను జరుపుటకంటె ప్రభుత్వము ప్రశాంతమార్గముల బూనుట యుక్తమైన కార్యము. ఉగ్రరిష్టుచర్య లంతకంతకు తగ్గిపోవుచున్నవి. కాని, యివి జరుగుట కెప్పుడును నావకాశముండెను. వీని నెదుర్కొనవలసినవారి శాంతి చెడగొట్టుట కివి చాలును. ఇట్టికార్యములు జాడ్యముకాక జాడ్యముకు కారణములనుసంగతి స్పష్టమగుచునేయున్నది. రోగ ముకుగాక దాని చిహ్నములకు చికిత్సజేయుట వ్యర్థము.

ఉగ్రరిష్టుల యువకులు, యువతులు—రహస్య కార్యములలో నున్న మోహముచేత నేనిజముగ నాకర్షింపబడుచున్నారని నేను విశ్వ సించెదను రహస్యము, సాహసము సంతతోత్సాహములగు యువకుల నెప్పుడు నాకర్షించుచుండును. ఈ కేకలన్నియు దేనినిగురించి? ఈ తెర చాటునున్న మనుష్యులెవరు? వీనిని తెలుసుకొనవలెననెడికోరిక జనిం చును. ఇదివరకిశోధకకథలోని పిలుపువంటిది. వీరికేమియు చేయవలె నను యుద్దేశ్య ముండదు. సందేహింపబడు వారితో కలసి యున్నంతమాత్రమున పోలీసు దృష్టిలో వీరును సందేహింపబడు వారేయగుదురు. త్వరలోనే వీరును డెటెన్యూల సంఖ్యలోనో లేక ప్రవాసితుల డేరాలలోనో జేర్చబడుదురు, న్యాయక్రమములు హిందూదేశములో బ్రిటిషుపాలనచే గర్వింపదగిన విజయములని చెప్పబడును. నా సహజస్వభావముచేత నేను వారికి సుముఖుడను. జీవితంలో శిక్షయుండవలెను; అరాజకము, అక్రమము, అసమర్థత యనిన నే నిష్టపడను; కాని, ప్రభుత్వములు, రాజ్యములు ప్రజలపై బలవంతముగ నంటగట్టు న్యాయ, క్రమముల ప్రయోజనము సందేహాస్పదమని నా విషాదపూరిత యనుభవము చాటుచున్నది. ఒక్కొక్కప్పుడు వానిమూల్య మత్యధికముగనుండును; ఆ న్యాయము

అధికారము చేయువారి యిచ్ఛయు, అక్రమము సర్వత్రవ్యాపించి యుండు భయముయొక్క ప్రతిబింబము. భయంకరముమీద నాధారపడు కార్యమేదియు నభిలషితము కాజాలదు. ప్రభుత్వముయొక్క నిర్బంధ పరికరములే పునాదిగగలిగి యివిలేనిచో నిలువజాలని 'క్రమము' నాగరిక పరిపాలనకాక సైనిక యాక్రమణ యగును. కల్హణ కవియొక్క వేయి యేండ్ల నాటి కాశ్మీర చారిత్రకపురాణమగు రాజతరంగిణిలో న్యాయ, క్రమముల యర్థములో ధర్మము, అభయము అనుపదములు పదేపదే యుపయోగింపబడినట్లు నేను వింటిని. పవిత్రత, భయము లేకుండుట! న్యాయము చట్టముకంటె గొప్పది; ప్రజల నిర్భయత్వమే క్రమము భయపడిపోయినప్రజలపై 'క్రమము'ను బలవంతము చేయుటకంటె నిర్భయత్వమును దోహదము చేయుట వాంఛనీయము.

మేము కలకత్తాలో మూడున్నరరోజు లుంటిమి ఈకాలములో నేను మూడు బహిరంగోపన్యాసములనిచ్చితిని. నేనిదివరకుకలకత్తాలో చేసినట్లే టెర్రరిస్టుచర్యలను గర్హించి యవినిరర్థకములని వాదించితిని. తరువాత ప్రభుత్వమువారు బెంగాలులో ననుసరించిన పద్ధతులను తీసికొంటిని. రాష్ట్రములో జరిగిన యుదంతములు నన్ను కదల్చివేయుట చేతనే నా వేశముతో మాట్లాడితిని. మొత్తముగా ప్రజలనందరనువిచక్షణ లేకుండా నణచివేసినమానవగౌరవమునే భంగపరచినరీతి నన్నెక్కువగ కలతబెట్టెను ఈమానవసమస్యముందర రాజకీయసమస్య రెండవది. తరువాత కలకత్తాలో నాపయిజరుపబడినవిచారణలో నీమూడుయుపన్యాసములు మూడు నేరములయ్యెను. వానిఫలతమే నా ప్రస్తుతశిక్ష.

కవిశేఖరుడగు రవీంద్రనాథటాగూరును దర్శించుటకు కలకత్తానుండి మేము శాంతినికేతనము వెళ్ళితిమి. అతనిని దర్శించుట యెప్పుడునుముదావహముగనుండును. అంతదగ్గరకుపోయినతరువాత మేమీయవకాశమును జారవిడువనొల్లకుంటిమి. నేనదివరలో శాంతినికేతనము రెండుసార్లు వెళ్ళితిని. కమల కదియే ప్రథమపర్యాయము మేముమా కుమార్తె నచ్చటకుబంప నూహించుచుంటిమి. కనుక నామె దానిని చూచుటకుప్రత్యేకముగవచ్చెను. త్వరలోనే యిందిర మెట్రిక్యులేషను

పరీక్షకు వెళ్ళనై యుండెను. ఇకముందామె నెచ్చట చదివింపవలెనను సమస్య మమ్ము బాధించుచుండెను. ఆమెను ప్రభుత్వ లేక అర్ధప్రభుత్వ విశ్వవిద్యాలయములలో చేర్పించుటకు నాకెంతమాత్రమునిష్టములేదు. అవి నాకు గిట్టవు. వానినావరించియుండు వాతావరణమంతయు నధికారపూరితము, ప్రభుత్వవాసనాయుతము, స్వేచ్ఛావిరహితము. అవి కొంతమంది చక్కని స్త్రీపురుషులనుతయారుచేసెననుటకుసందేహము లేదు. ఇకముందును చేయవచ్చును. కాని యీకొద్దిమినహాయింపులు విశ్వవిద్యాలయములు యువకుల సహజశక్తుల నణచివేయుచున్నవి. నాశముచేయుచున్నవను నేరమునుతీసివేయజాలవు. శాంతినికేతనము ఈ మృత హస్తమునుండి విముక్తినొందుటచే మేము దానిని స్థిరపరచితిమి.

మేము తిరిగి యింటికిపోవు మార్గములో రాజేంద్రబాబుతో భూకంపబాధితులనివారణసమస్యనుగురించిమాట్లాడుటకు పాట్నాలో దిగితిమి. అతడప్పుడే జయిలునుండి విడువబడి యనధికార నివారణ కార్యమునకు తిప్పనిసరిగా నాయకత్వమును వహించెను మా టెలిగ్రాములేవియు నందజేయబడకపోవుటచే మారాకసంగతి యెవరికి తెలియకుండెను. కమలసోదరునితో మేముండగోరిన భవనము నాశనమయ్యెను. అది పెద్దరెండస్థులమేడ కనుక చాలమంది యితరులవలెమే మారుబయటనే నివసించితిమి.

మరునాడు నేను ముజఫరుపురమును చూచితిని. అప్పటికి భూకంపముకలిగి సరిగా యేడురోజులయ్యెను. అయినను బాగు ప్రధానవీధులలోతప్ప చెత్తను తీసినవారులేరు. ఈ వీధులను కొన్ని చేసినపుడు శవములు బయటపడుచుండెను అవికొన్ని పడిపోవుచున్న గోడనో లేక యింటికప్పునో ఆపుకొనుటకు ప్రయత్నించువానివలె నుండెను. ఈ శిథిలములు మరపునకురాక భయజనకములుగనుండెను. ఈ గండమునుండి బయటపడినవారు పూర్తిగ భయవిహ్వలులై నోటమాటరాక యుండిరి...

అలహాబాదు చేరుటతోడనే కాంగ్రెసులోనున్న మేము, తదితరులు డబ్బువసూలుచేయుట, వస్తుసామగ్రి పోగుచేయుట మొదలగు పనులలో నిమగ్నులమయితిమి. నాసహచరులునుకొందరుభూకంపము కలుగుటచే స్వాతంత్ర్యదినోత్సవము నాపివేయవలెననిరి. కాని, నేను భూకంపము మనప్రోగ్రాముకేల భంగముకలిగింపవలెనో చూడజాలకుంటిని. కనుక జనవరి 26వ తేదీని అలహాబాదుజిల్లాలోని వివిధ గ్రామములలోను పట్టణములలోను సభలు జరుపబడెను. మేమనుకొనినదానికంటె మా కెక్కువ విజయమే చేకూరెను. పోలీసువారి యాటంకములు, నిర్బంధములు జరుగునని మాలో చాలమంది భావించిరి. అక్కట్ల కొద్ది యాటంకములు కల్పింపబడెను. కాని మేమీ సభనుండి బయటపడగలిగితిమి మా గ్రామములలో కొన్నిచోట్లను, యితరపట్టణములలోను అరెస్టులు జరిగెను.

బీహారునుంచి తిరిగివచ్చుటతోడనే భూకంపమునుగురించి నేనొక స్టేటుమెంటుయిచ్చి ద్రవ్యసహాయము కావలెనను సందేశముతో ముగించితిని. బీహారుప్రభుత్వము భూకంపము కలిగిన మొదటి కొద్ది రోజులలో చురుకుగ పనిచేయలేదని నే నందులో విమర్శించితిని. భూకంపము కలిగిన ప్రాంతములోని యుద్యోగులను విమర్శించుట నా యుద్దేశ్యముకాదు. ఎంతటి ధైర్యస్థైర్యములు కలవారైనను వణికించునట్టి యతి కఠిన పరిస్థితిని వారెదుర్కొనవలసి యుండెను. నామాటలలో కొన్ని యిట్టి యర్థమునకు సావకాశ మిచ్చుటచే నేను విచారపడితిని. కాని మొట్టమొదట బీహారుప్రభుత్వ ప్రధాన కార్యాలయమువారెక్కువ సమర్థతచూపలేదని నేను రూఢిగా భావించితిని ముఖ్యముగ చెత్తనంతను తీయించివేసినచో ననేకమంది ప్రాణములు దక్కియుండెడివి. ఒక్క మాంఘీరు పట్టణములోనే వేలకొలది చంపబడిరి. మూడువారము లయినతరువాత నే నచట అసలు ముట్టుకొనబడని చెత్తనెంతనో చూచితిని. అచ్చటకు కొద్దిమైళ్ళదూరములోనున్న జమల్పూరులో వేలకొలది రైల్వేవర్కర్లుగలరు. ఈ విషాదము జరిగిన కొద్దిగంటలలోనే వీరినందరిని యుపయోగించుకొన వచ్చును.

భూకంపము జరిగిన పన్నెండురోజులయిన తరువాతకూడ ప్రాణములతో నున్న మనుష్యులు పైకితీయబడిరి. ఆస్తి రక్షించుటకు ప్రభుత్వమువారు వెంటనే చర్యతీసికొనిరి. కాని భూమిలో పాతుకొనిపోయినవారిని రక్షించుటకు వారంత వేగిరపడలేదు. ఆ ప్రాంతములలో మున్సిపాలిటీలు పని చేయుటలేదు.

నా విమర్శ యుక్తమనియే నేను భావించెదను. భూకంపము కలిగిన ప్రాంతములలో నధిక సంఖ్యాకులు నాతో నేకీభవించిరని నేను తరువాత తెలిసికొంటిని. కాని యుక్తమయినను, అయుక్తమయినను అది ప్రభుత్వమునుత్వరపెట్టుటకే చేయబడెను. కాని, నిందింపవలెనను యుద్దేశ్యముతో చేయబడలేదు. ఈ సందర్భములో బుద్ధిపూర్వకముగ పాపమును చేసిరని వారి నెవరును నిందింపలేదు. అది యొక వింతయైన యసామాన్య పరిస్థితి యగుటచే ప్రమాదములను మన్నింపవచ్చును. భూకంపమువలన కలిగిననష్టమును కూడదీయుటకు బీహారు ప్రభుత్వమువారు తరువాత నెక్కువ శక్తిసామర్థ్యములతో పనిచేసిరని నేను వింటిని.

కాని నా విమర్శ తిరస్కరింపబడెను. వెంటనే బీహారులో కొద్దిమంది ప్రభుత్వమువారి కొక ధృవపత్రమును ప్రసాదించిరి. భూకంపము, తన్నివారణోపాయములు రెండవ విషయమయ్యెను. ప్రభుత్వము విమర్శింపబడెను. కనుక రాజభక్తిపరాయణులు దానిని సమర్థింపవలెను. ప్రభుత్వమును విమర్శింపరాదు. భారతదేశము ప్రభుత్వమును విమర్శింపకూడదను నొక వింతసిద్ధాంతమున కిది యొక యుదాహరణము పాశ్చాత్యదేశములలో నిది నిత్యకృత్యము. సైనికతత్త్వము విమర్శను సహింపజాలదు. 'రాజుగారివలె హిందూదేశములోని బ్రిటిషు ప్రభుత్వము. దాని పెద్దయధికారులు తప్పుచేయజాలరు.' అటువంటి దానిని సూచించుటకూడ రాజద్రోహము.

మరియొకవింత యేమనిననిరంకుశప్రభుత్వము,కఠినప్రభుత్వము అను విమర్శకంటెనసమర్థప్రభుత్వమను విమర్శను వారెక్కువతిరస్కరింతురు. మొదటి విమర్శకుజయిలుప్రసాదము రావచ్చును. కానిప్రభు

త్వము నిసికలవాటుపడిపోవుటచే నిజముగ దీని నంతగ లక్ష్యము చేయదు. ఇంతకు నధికార తత్త్వముగల జాతి కేది యొకవిఘ్నము గు పొగడ్తయే! కాని, యసమర్థులు; ధైర్యసాహసములు లేనివారు అనుట వారికి శూలములవలె నుండును. ఇది వారి స్వాభిమాన మూలమునే కొట్టినట్లగును. ఇది భారతదేశములో దేవదూతలమని భావించుయింగ్లీషుఅధికారుల భ్రమలను తొలగద్రోయును. వారు క్రైస్తవ ప్రవర్తనకు విరుద్ధముగ ప్రవర్తించుచున్నాడను నేరమును నోరెత్తకుండ సహించుటకు సంసిద్ధతను చూపినను అసమర్థుడని, యవివేకియని పిలుచుచో సహింపజాలని ఆంగ్లికనుబిషపువంటివారు.

అలహాబాదులోని భూకంప సహాయకకమిటీవారు భూకంపము సంభవించిన ప్రాంతములనుచూచియచ్చట జరుగుచున్న యుపశమన పద్ధతులనుగురించి యొక్కనివేదిక తయారుచేయవలసినదని నన్ను పంపిరి. నేనొక్కడను వెంటనే బయలుదేరి నాశనదేవతచే నల్లకల్లోలము గావింపబడిన ప్రాంతములలో పదిరోజులుతిరిగితిని కంటికి నిద్రయును పదిలేక యుదయము అయిదుగంటల లగాయతు నిశీథమువరకు నేను బీటలుతీసి వంకరటింకరలు తిరిగిపోయియున్న యీ రోడ్లమీద మోటారులోను, వంతెనలు నాశనమయిరోడ్లు నీటిలో మునిగిపోయిన చోట్లచిన్నచిన్న పడవలమీదను ప్రయాణముచేసితిని. ఎచ్చటజూచి నను కూలిపోయినకొంపలు, చీల్చివేయబడి యొక పెద్దరాక్షసిచేమెలి పెట్టబడినట్లుకాన్పించినరోడ్లుకలపట్టణములు భయంకరముగ కాన్పించెను. ఈరోడ్డులలోకలిగిన పెద్దపెద్దపగుళ్ళనుండియిసుక నీటి ప్రవాహమువలె పైకి తన్నుకొనివచ్చి ప్రజలను, పశువులను తుడిచివేసెను. ఈపట్టణములకంటె నెక్కువగ నుత్తరబీహారు మైదానములు నాశన దేవత కాలవాలమయ్యెను. మైళ్ళకొలది యిసుక, పెద్దపెద్దపగుళ్ళు, చాలదూరము జలమయము, యిసుక, నీరు పైకి తన్నుకొనివచ్చిన చిన్నచిన్నబీటలు, బీహారు ఆరామమిట్లుండెను. ఈప్రాంతములమీద నుండి యెగిరివెళ్ళిన కొందరు బ్రిటిషుయుద్యోగు లివి యుద్ధకాలము నాటి యుత్తరఫ్రాన్సు సమరరంగములవలె కాన్పించెనని చెప్పిరి.

ఆ యనుభవ మతిభయంకరమైనది. భూకంపము మొట్టమొదట ప్రక్క యూపుతో ప్రారంభమయి నిలుచున్నవారిని పడద్రోసెను. తరువాత పైక్రిందకు యూపివేసెను. తరువాత మర ఫిరంగులు ప్రేలినట్లు లేక నూరు వాయు విమానములుచేయు రణగొణధ్వని బయలు వెడలెను. అనేక చోట్ల బొరియలనుండి, కలుగులనుండి పదిపన్నెండడుగుల యెత్తువరకు నీరు చిమ్ముచుండెను. ఇదియంతయు మూడు మూడున్నర నిమిషములుమాత్రమేజరిగి తరువాతయుపశమించెను. కాని యా మూడు నిమిషములే ప్రళయకాలమయ్యెను. దీనినంతయు కండ్లారచూచుచుండిన చాలమంది ప్రపంచమంతరించుచున్నదని యూహించుకొనుటలో నాశ్చర్యమేమియులేదు. పట్టణములలో భవనములు కూలిపోవు పెళపెళధ్వనులు, నీరు భూమిలోనుండి పైకిచిమ్ముట, వాతావరణమంతయు దుమ్ముతోనిండిపోవుట, కొద్దిగజముల దూరములోనున్న దానిని చూడజాలకపోవుట - మొదలగువిపరీతములు జరిగెను. పల్లెలలో దుమ్ములేకపోవుటచే నెక్కువదూరము చూడవచ్చును. కాని స్థిమితముగ చూచువారెవరునులేరు. బ్రతికియున్నవారు నేలమీద పడిపోయిరి, లేక భయవిహ్వాలతచే నేలమీద దొర్లుచుండిరి. భూకంపము జరిగిన పదిరోజులకు పన్నెండేండ్ల బాలుడు భూమినుండి ప్రాణములతో పైకితీయబడెను. ఆతడాశ్చర్యచకితుడైపోయెను. పడగొట్టబడి మరియొక వస్తువుచే కప్పివేయబడినప్పు డతడు ప్రపంచమంతరించెననియు, తానొక్కడే జీవించియున్నాడనియు ననుకొనెనట. ముజఫరూపురులో కొంపలు కూలిపోవుచు, చుట్టుప్రక్కల వందలకొలది జనులు చనిపోవుచుండ నొక యాడపిల్లపుట్టెను. అనుభవములేని యా మాతాపితల కేమిచేయవలెనో తోచక దుఃఖాక్రాంతులైయుండిరి. చివరకు మాతాశిశువులుజీవించిసుఖముగవర్ధిల్లుచున్నారని నేను తరువాత వింటిని. భూకంపముపేరిట ఆపిల్లకు 'కంపాదేవి'యని పేరిడిరట.

మాసంచారములో మేముమాంఘీరును చిట్టచివరచూచితిమి. మేము చాలదూరము తిరిగితిరిగి నేపాలు సరిహద్దువరకు వెళ్ళి యనేక హృదయవిదారకములగుదృశ్యములను చూచితిమి. పాడుపడిన స్థలము

లను నాశనము గావింపబడిన పట్టణములను చూచుట కెంత యలవడినను మంచి ధనవంతమైన మాంఘీరుపట్టణ విధ్వంసమును చూచుట తోడనే మాకడుపులు తరుగుకొనిపోయెను. ఆ భయంకర దృశ్యమును నే నెన్నడు మరువజాలను.

భూకంపము గలిగిన ప్రాంతములలో పట్టణములలోను పల్లెలలోనుగూడ నివసించువారిలో స్వయంసహాయము లేకపోవుట చాల విచారకరము. బహుశః యీ సందర్భములో పట్టణములోనున్న మధ్యతరగతులవారు చాలనేరస్తులు. వారందరు పయినుండి యెవరో వచ్చి తమకుసహాయముచేతురని వేచియుండిరి. సేవచేయుటకు వచ్చిన మరికొందరు పనిచేయుట యనగా ప్రజల నాజ్ఞాపించుట యనుకొనిరి. ఈ యసహాయతకు కొంతవరకు భూకంపభయముచే గలిగిన నిర్వీర్యతయే కారణమనుటకు సంశయములేదు. అది నెమ్మదిగ తగ్గిపోయెను. కాని బీహారులోని యితరప్రాంతములనుండియు నితరరాష్ట్రములనుండియు కొల్లలుగా వచ్చిన యుపశమన సేవకుల శక్తిసామర్థ్యము లత్యద్భుతములు. ఈయువకులయొక్కయు, యువతులయొక్కయు సేవాతత్వ పటుత్వము చూచుట కత్యద్భుతముగనుండెను. ఇందులో ప్రత్యేకమైన వివిధసంస్థలు పనిచేసినను వారిలో మంచి సహకారముండెను. గుట్టలుగ పడియున్న చెత్తచెదారములను త్రవ్వి శుభ్రపరచు స్వయంసహాయోద్యమమునకు కొంత ప్రోత్సాహము నీయవలెనని నేనొక యత్నముచేసితిని. నేను కొంత సందేహించుచు చేసినను అది చాల జయప్రదమయ్యెను. ఉపశమనసంస్థలయొక్క నాయకులందరు పారలను, తట్టలను చేతబూని రోజంతయుకష్టపడి త్రవ్విరి. మేమొక చిన్నపిల్లయొక్క శవమును పైకితీసితిమి. నేనాదినముననే మాంఘీరు వీడితిని. కాని ప్రజలుత్రవ్వుటనుసాగించుచు మంచిఫలితములను సాధించిరి.

అనధికార యుపశమన సంస్థలన్నింటిలోను కేంద్ర రిలీఫ్ కమిటీ యతి ప్రధానమైనది దీనికి రాజేంద్రబాబు నాయకుడు. ఇది కేవలము కాంగ్రెసుసంస్థకాదు. ఇది వివిధబృందములకు, దాతలకు ప్రాతినిధ్యము వహించిన యఖిలభారతసంస్థ. అయినను గ్రామములోని

కాంగ్రెసుసంస్థల సహాయము దీనికి గలదు. గుజరాతు, యు.పి. జిల్లాలలోతప్ప భారతదేశములో మరేరాష్ట్రములోను కాంగ్రెసువర్కరులకు వ్యవసాయదారులతో నింత సంబంధము లేదు. యథార్థమునకు వర్కరులందరు చాలవరకు వారినుండియే వచ్చిరి. బీహారు భారతదేశమంతటిలోను ప్రధానముగ వ్యవసాయదారుల రాష్ట్రము. ఇచ్చట కాంగ్రెసు అతి నిరాడంబరమైనది. వ్యవసాయదారు లందరు దానికి గొప్పయండ. అ. భా. కాం. కమిటీలో కూడ బీహారుసభ్యులు ఏ విషయములోను తొందరపడు స్వభావము కలవారు కారు. అచ్చట నుండుట వారికి కొంచెమాశ్చర్యముగ నుండునట్లు కాన్పించెడిది. కాని రెండు శాసనోల్లంఘనోద్యమములలోను బీహారు అసమానముగ పనిచేసెను. తరువాత జరిగిన వ్యక్తి శాసనోల్లంఘనములో గూడ వది యఖండముగ పనిచేసెను.

రిలీఫ్‌కమిటీవారు వ్యవసాయుదారులను జేర్చుకొనగలుగుటకే చక్కని సంస్థ నుపయోగించుకొనిరి. గ్రామములలో మరే సంస్థయు నింత సహాయము చేయజాలదు. బీహారుకు నిర్వివాదనాయకమణియైన రాజేంద్రబాబు రిలీఫ్‌కమిటీకికాంగ్రెసుసంస్థకుగూడ నధిపతియయ్యెను. బీహారుదేశ పుత్రరత్నమైన ఇతడు వ్యవసాయదారువలె కాన్పించును. సరళమైన దృష్టి, వాడియైననిష్కపటనేత్రములు గోచరించనంతవరకు మొదట చూపుల కతడంత దర్పముగ కాన్పించడు. అతని చూపులకు యా నేత్రములను యెవడును మరువజాలడు. వానిద్వారా సత్యదేవత మనలను వీక్షించును. వానిని శంకింపజాలము. రయితువలె బహుశః యతనిదృష్టికొంచెముపరిమితమైనది. ఆధునికప్రపంచదృష్ట్యాకొంచెము సాధువైనది; కాని, యతని యసామాన్యశక్తిసామర్థ్యములు, పరిపూర్ణ నిష్కపటస్వభావము, భారతస్వాతంత్ర్యముపట్ల భక్తివిశ్వాసములు మొదలగు గుణగణములచేనతడు తనరాష్ట్రములోనేగాక భారతదేశమంతట నారాధింపబడుచున్నాడు. రాజేంద్రబాబుకు బీహారులోగల సర్వాంగీకృతనాయకస్థానముకంటెది భారతదేశములో మరేరాష్ట్రములోను మరెవరికినిలేదు. గాంధీజీయొక్క నిజసందేశము నితనికంటె నెక్కువగ గ్రహించినవారు కొద్దిమందిమాత్రమేకలరని చెప్పవచ్చును.

బీహారు రిలీఫ్ వర్కుకు నాయకత్వము వహించుట కిట్టి పురుషుడు లభించుట యదృష్టము. అతనియందలి విశ్వాసమే భారతదేశమంతట నుండియు విశేషధనము నాకర్షింపగలిగెను. అనారోగ్యముచే నెంత దుర్బలుడుగ నున్నను అత డీపనిలోని కురికెను. అతడే యన్ని కార్యములకు కేంద్రమయ్యెను. అందరు నతనిసలహా యడుగుచుండుటచే నతడు విశ్రాంతియనునది లేకుండ పనిచేసెను.

నేనీ భూకంపప్రాంతములలో తిరుగుచున్న కాలములో నేఅస్పృశ్యతాదోషమునకు శిక్షగ భూకంపము విధింపబడెనని గాంధీజీయిచ్చిన వాఙ్మూలము నత్యాశ్చర్యముతో చదివితిని. ఈ విమర్శయెవని నైన నిర్ఘాంతపరచును. దీనికి రవీంద్రనాథటాగూరు యిచ్చిన సమాధానముతో నేను పూర్తిగా నేకీభవించితిని. శాస్త్రదృష్టి కింతకంటె విరుద్ధమైనది వేరొండు యూహింపబడజాలదు. పదార్థముమీద మానసిక సంభవములకు, భావప్రవృత్తులకు గల సంబంధమును గురించి బహుశః నేడు శాస్త్రముకూడ పరిపూర్ణ నిరంకుశత్వమును చూపదు. మనః క్లేశమువలన బాధపడువానికజీర్ణము పట్టుకొనవచ్చును. లేక నంతకంటె చెడ్డదే సంభవింపవచ్చును. కాని మానవదోషమునకు లేక నాచారమునకు భూచలనమును మార్చు శక్తి యుండుననుట వెర్రిమాట. పాపము, యీశ్వరాగ్రహము, ప్రపంచ వ్యవహారములలో మానవుని యల్పత్వము అను భావములు మనలను కొద్దివందల సంవత్సరములు వెనుకకు తీసికొనిపోవును.

భూకంపము పాపమునకు దైవముచే విధింపబడిన శిక్షయే యైనచో మన మేపాపమునకు శిక్షింపబడుచున్నారమో తెలిసికొను టెట్లు? మన మనేక పాపములకుత్తరవాదులమైయున్నారము. ఎవనికి వాడు తనకు ప్రీతికరమైన యర్థమునే చెప్పవచ్చును. మనము విదేశ ప్రభుత్వమునకు దాసులమైనందులకు లేక నన్యాయమైన సాంఘికపద్ధతిని సహించినందులకు శిక్షింపబడియుండవచ్చును. అసంఖ్యాకములగు ఎస్టేటులుగల దర్భాంగమహారాజు ఆర్థికముగభూకంపమువలన విపరీత నష్టము పొందెను. కనుక నిదిజమీందారీపద్ధతిమీదనొక తీర్పురాదా?

బీహారులోని నిరపరాధులైన ప్రజలు దక్షిణహిందూదేశ ప్రజలలో నున్న యస్పృశ్యతాదోషమునకు శిక్షింపబడిరని సూచించుటకంటె విది యెక్కువయుక్తము. భూకంపమస్పృశ్యతకాలవాలమైన దేశమునే యేల వీక్షింపలేదు? భూకంపము శాసనోల్లంఘనములకుతగినయీశ్వరాగ్రహమని నష్టపోయిన యుత్తరబీహారు స్వాతంత్ర్య సమరములో ప్రధానపాత్ర వహించెను.

ఈవిధముగ మన మంతములేనియూహలను పెంచుకొనవచ్చును. విధికృత్యములతో మనమేలజోక్యముకల్పించుకొనవలెను? అనుప్రశ్న తరువాతబయలు వెడలును. దివ్యనిర్ణయముల ఫలితములనుతగ్గించుటకు మనమేలదయారసకార్యములనొనర్పవలెను? మనలనింతదోషభూయిష్ఠముగ పుట్టింపనేల? మనచుట్టు నిట్టియుచ్చులను, వాగురులనుకల్పింపనేల? దుఃఖమయము, క్రూరమునగు ప్రపంచమునుసృజింపనేల? పెద్దపులిని మేకపిల్లను కల్పింపనేల? ఇంతచేసి తరువాత మనలనుశిక్షించుటెందులకు? విధి మనపై నిట్టి నిర్దయాత్మక పరిహాసము నేల ప్రయోగింపవలెను?

రిలీఫువర్కు కొరకు వివిధరాష్ట్రములనుండి వచ్చిన స్నేహితులతో చర్చించుచు నేనుపాట్నాలో చివరరోజురాత్రిచాలకాలముమేల్కొంటిని. యు.పి. నుండి చాలమంది ప్రతినిధులు వచ్చిరి. మాలోముఖ్యులందరు నచ్చటనుండిరి. భూకంపయుపశమన కార్యములలో మేమెంతవరకు నిమగ్నులము కావలెనను సమస్య మమ్ము బాధించుచుండెను. దీనినిగురించి మేము చర్చించితిమి. ఇది తేలికయైనదికాదు దీనికిచాలకాలము పట్టును. అంతకాలము రాజకీయములనుండి విరమింపవలెను. దానివలన రాజకీయముగ మా రాష్ట్రములో నెక్కువ చెడుఫలితము కలుగును. కాంగ్రెసులో ననేకవేలమంది యున్నను ముఖ్యులెవ్వరుకొద్దిమందియే కలరు. వారిని విడిచిపెట్టుటకష్టసాధ్యము. అయినను భూకంపమురొక్క పిలుపు అనుల్లంఘనీయము. నామట్టుకు నాకు కేవలము రిలీఫువర్కుకే బంధింపబడవలెనను నుద్దేశ్యము లేదు. ఈపని

చేయువారికి కొరతయుండదని నే ననుకొంటిని. ఇంతకంటె నెక్కువ సాహసకార్యములను చేయగలవారు కొద్దిమంది యుండిరి.

నేను నాసంచారమును ముగించి యలసిసొలసి ఫిబ్రవరి 11వ తేదీని అలహాబాదుచేరుకొంటిని. పదిరోజులనిరంతరశ్రమవలన కలిగిన నా భయంకరాకారమును చూచి నా బంధుజను లాశ్చర్యపడిరి. అలహాబాదు రిలీఫ్కమిటీవారికి నా సంచారముయొక్క రిపోర్టు వ్రాయ నారంభించితిని. కాని నేను నిద్రాసక్తుడనై యిరువది నాల్గుగంటలలో నధమము పన్నెండుగంటల కెక్కువ నిద్రలో గడపితిని.

మరునాడు మధ్యాహ్నము కమలయు నేనును ఆలస్యముగ తేనీరు త్రాగితిమి. పురుషోత్తమదాసుటాండను మమ్మప్పుడే కలుసుకొనెను. మేము వరండాలో నిలుచునియుండగ నొక మోటారు రయియని వచ్చెను. దానిలోనుండి యొక పోలీసుఆఫీసరు తటాలున నేలమీద దుమికెను. నాకుపిలుపువచ్చెనని నేను వెంటనే గ్రహించితిని. నేనతని యొద్దకువెళ్ళి "నేను మీకొరకు చాలకాలమునుండి వేచియుంటిని" అని చెప్పితిని. అతడు కొంచెము సమాధానపురస్సరముగ మాట్లాడుచు నది యతనిదోషముకాదనెను. వారంటుకలకత్తానుండి వచ్చెను.

అయిదు నెలల పదమూడురోజులు బయటవుండి నిప్పుడు తిరిగి యేకాంతవాసమునకు జేరుకొంటిని. కాని యథార్థభారము నాదికాదు. ఆ భారమంతయు నెప్పటివలెనే, వ్యాధిగ్రస్తురాలైన నాతల్లి, నాభార్య, నాసోదరి మొదలగు స్త్రీజనముమీద పడెను.

—)o(—

59

అలీపూర జయిలు

ఆరాత్రియే నన్ను కలకత్తాతీసికొనిపోయి లాల్‌బజారుపోలీసు స్టేషనులో నుంచిరి. ఇచ్చట నుత్తరహిందూదేశములో నెచ్చటలేనంత మంది యూరపియను సార్జెంటులును, ఇన్‌స్పెక్టరులుకలరు. కానిస్టేబు లందరు బీహారువారు లేక యు. పి. వారివలె కాన్పించిరి. ఖయిదీల లారీలో నేను కోర్టునుండి జయిలుకు, నొక జయిలునుండి మరియొక జయిలుకు చేసిన యనేక ప్రయాణములలో రక్షకభటులు నాకూడా ననేకమంది యుండెడివారు. వారుచేయుపనియందువారికి ప్రీతిలేక అతి విచారముగా కాన్పించెడివారు నాయం దెక్కువ సానుభూతిగా నుండుటచే నొక్కొక్కప్పుడు వారి కండ్లనుండి కన్నీటిధారలు జల జల రాలుచుండెడివి.

మొదట నన్ను ప్రెసిడెన్సీజెయిలులోనుంచిరి. అచ్చటినుండి విచారణకొరకు ప్రధాన ప్రెసిడెన్సీ మేజస్ట్రేటుకోర్టుకు తీసికొనిపోవు చుండెడివారు. ఇది నాకొక నూతన యనుభవము. కోర్టుగది, యా భవనము బహిరంగకోర్టువలెగాక ముట్టడింపబడిన కోటవలె కాన్పించెను. కొద్దిమంది పత్రికాప్రతినిధులను, మామూలు లాయర్లనుతప్ప నాచుట్టుప్రక్కల కెవరిని రానీయలేదు. పోలీసులుబందోబస్తుతో నుండిరి. ఈ యేర్పాటులు ప్రత్యేకము నాకొరకే చేయబడలేదు. అవి నిత్యకృత్యములు; నన్ను కోర్టు గదిలోనికి తీసికొనివెళ్ళునపుడు నేనొక మార్గముగుండ చాలదూరము నడువవలసియుండెను. ఆ మార్గము కిరుప్రక్కలను, నెత్తిమీదను చిక్కని యినుపతీగెలతో అల్లి వేయబడెను అదియొకపంజరములో నడుచుచున్నట్లుండెను. నేరస్థులను నిలుపుస్థలము మేజస్ట్రేటుగారి స్థానమునకు దూరములో నుండును. కోర్టుగదిలో పోలీసువారు కాలాంబర కవచధారులు లాయరులు మూగిరి.

కోర్టు విచారణలు నాకు క్రొత్తలుకావు. నా వెనుకటివిచారణలనేకములు జయిలుఆవరణలోనే జరిగెను. కాని యచ్చటస్నేహితులు, బంధువులు, పరిచయులు నుండెడివారు. ఆ వాతావరణమంతయు కొంత సుఖప్రదముగ నుండెడిది. పోలీసులు సామాన్యముగ వెను, నుండెడివారు. ఈ పంజరములవంటి నిర్మాణములేవియు నుండెడివి కావు. ఇచ్చట నంతయు తారుమారు. నేను క్రొత్తవారిని యపరిచిత ముఖములను, మామధ్య నెట్టిసామ్యము లేనివారిని చూచితిని. ఆ మూక యాకర్షణీయముగ కాన్పించలేదు. కాలాంబర కవచధారులైన లాయర్ల సమూహముమీద చూచుట కంత యందముగనుండదు. ఇక పోలీసుకోర్టులాయరు లొకవిధముగు ప్రేమరహితదృక్కులు కలిగియున్నట్లు కాన్పింతురు. చిట్టచివర కా నల్లదుస్తులుకలవారిలో నే నొక పరిచయస్థుడగు లాయరును చూచితిని. కాని యతడా గుంపులో మాయమయ్యెను.

విచారణ జరుగుటకుపూర్వము బయట వసారాలో కూర్చున్నను నేనొంటరిగనున్నట్లు, యేకాకినైనట్లు భావించితిని. నా నాడి వేగిరపడుచుండెను. వెనుకటి విచారణకాలములలో నా కుండిన యాంతరంగిక శాంతి యిప్పుడు లేకుండెను. విచారణలకు, శిక్షలకు నలవడిన నేనే యిట్లున్నచో నెట్టి యనుభవములేని యువకుల కెంత తొట్రుపాటుగనుండునో నే నప్పుడు గ్రహించితిని. డాకులో నేను స్వస్థచిత్తుడనైతిని. నేను వాదింవలేదు. మరునాడు, ఫిబ్రవరి 16 వ తేదీని నాకు రెండుసంవత్సరములు శిక్ష విధించిరి; నా కేడవసారి ఖయిదు జీవితము ప్రారంభమయ్యెను.

నేనుబయటనున్న యయిదున్నరమాసములు యుక్తముగ గడిపితినని తృప్తిపొందితిని. నేనుకొన్ని యుపయుక్తకార్యములు నెరవేర్చుకొంటిని. నాతల్లి కారోగ్యము కలిగి యుపద్రవము తప్పిపోయెను. నా చిన్నచెల్లెలు కృష్ణ పరిణయమాడెను. నాకుమార్తెవిద్యావ్యవస్థిరపరుపబడెను. నేను మాగృహాచ్ఛిద్రములను, ఆర్థికచిక్కులనుకొన్నింటిని చక్కబరచుకొంటిని. చిరకాలమునుండి నేనునిర్లక్ష్యముచేయుచు వచ్చిన యనేక స్వంతవ్యవహారములను సరిచూచుకొంటిని. ఇక ప్రజా

హితకార్యముల నారోజులలో నెవడును యెక్కువగ చేయజాలడని నే నెరుగుదును. కాంగ్రెసుదృక్పథమును గట్టిపరచుటకు నేను కొంచెము సాయపడితిని. దానిని సాంఘిక, యార్థికపంథవైపు కొంత వరకు త్రిప్పుటకు సాయపడితిని. గాంధీజీతో నేను సలిపిన పూనాకరస్పాండెన్సు వలనను, తరువాత పత్రికలలోని వ్యాసముల వలనను కొంతపనిజరిగెను. కులసమస్యమీాద నేను వ్రాసిన వ్యాసములుకూడ కొంత లాభము చేకూర్చెను. మరియు రెండుసంవత్సరములు దాటిన పిదప గాంధీజీని, యితరమిత్రులను తిరిగిసందర్శించి మరికొంత కాలమునకు చాలిన ధాటియైన చిత్తశక్తిని సంపాదించితిని.

కాని నాకు హృత్పరితాపము కలిగించునది యొకటి-కమలయనారోగ్యము మిగిలిపోయెను. ఆమె యెంత అస్వస్థతగ నుండెనో నా కప్పుడు తెలియకుండెను. ఏలనన నామె మంచము పట్టువరకు గట్టిగ పనిచేయుచుండుట కలవడెను. కాని నేను ఖేదపడితిని. అయినను నేనిప్పుడు జయిలులోనుండుటచే నామె స్వేచ్ఛగ చికిత్సచేయించుకొనవచ్చునని యాశపడితిని. నేను బయటనున్నకాలములో నామె నన్ను చిరకాలము విడిచియుండుట కిష్టపడక పోవుటచే నిది యెక్కువ కష్టసాధ్యముగ నుండెను.

నాకు మరియొక విచారముండెను. నేను అలహాబాదు జిల్లాలోని గ్రామసీమల నొక్కసారియైన చూడనందులకు విచారపడితిని. మా సందేశములను నెరవేర్చినందుల కచ్చట ననేకమంది యువకులు నిర్బంధింపబడిరి. జిల్లాలో మేము వారి ననుసరింపక పోవుట వారియెడల నవిధేయతగ కాన్పించెను.

నన్ను ప్రెసిడెన్సీజయిలునుంచి ఆలిపూరుజయిలుకు మార్చిరి. నా కచ్చట పదియడుగుల పొడవు తొమ్మిది యడుగుల వెడల్పుగల యొక చిన్నగది యివ్వబడెను. దానిముందర నొకవసారా, చిన్న బహిరంగప్రదేశము కలవు. ఆ దొడ్డిగోడ యేడడుగుల యెత్తున నుండెను. దానిపైనుండి యొకవింతదృశ్యము కాన్పించుచుండెను. ఏక

అంతస్తు యిండ్లు, రెండస్తుల మేడలు, గుమ్మా యిండ్లు, చతురపుటిండ్లు, చిత్రమగు కప్పులు - ఇట్లనేకవిధములగు వికారపుటిండ్లు కన్పట్టెను. ఉన్న కొద్దిస్థలమును వినియోగింపవలెనను యూహతో నవి యొకటి తరువాత నొకటి కట్టబడినట్లు కాన్పించును.

ఈ వికారపు కట్టడముల దృశ్యమునుండి తేరుకొనుటతోడనే నే నొక భయంకరదృశ్యము నెదుర్కొనవలసియుండెను. సరిగా నాగదికిని, దొడ్డికిని యెదుట రెండు పొగగొట్టములు కాఱుమేఘములవంటి దట్టమగు కాటుకపొగ గుప్పుగుప్పున విడువ నారంభించెను. ఒక్కొకప్పుడు దాని గాలి నా మీదకు పంపి నన్నుక్కిరిబిక్కిరి చేయుచుండెను. అవి జయిలు పాకశాలలోని పొగగొట్టములు!

ఇట్టి ప్రారంభము నాకింపుగ లేకుండెను. ఎత్తని, యిటుకగోడల కట్టడములతో గూడిన ఆలిపూరు జయిలుయొక్క పరివర్తన శూన్యమగుదృశ్యమును, దాని పాకశాల గొట్టములనుండి వచ్చుధూమము ననుభవింపవలసిన భవిష్యత్తు, నాకు ప్రీతికరముగ లేకుండెను. నా దొడ్డిలో చెట్లు పచ్చదనము లేకుండెను అదియంతయు చవటాచేయబడి, శుభ్రముగ. ‘పక్కాగ’నుంచబడెను. కాని, నిత్యము మసిపప్ప క్రిందపడుచుండెను. ఆ బోడితనము నిరుత్సాహజనకముగ నుండెను. దూరమున నొకటి రెండు చెట్లుమాత్రము కాన్పించెను ఒక చెట్టు మీద నొక గ్రద్ద గూడుపెట్టెను. నేను దానిని శ్రద్ధతో పరికించెడివాడను. దాని పిల్లలు పెరిగి పెద్దవగుచు తమ వృత్తిరహస్యములను నేర్చుకొనుచుండెను. అవి యొక్కొక్కప్పుడు తటాలున నేలకు వ్రాలుచు నే ఖయిదీచేతినుండియో, నోటినుండియో రొట్టెముక్కలను తన్నుకొనిపోయెడివి.

సూర్యాస్తమయము మొదలు సూర్యోదయమువరకు మమ్ము మాగదులలో తాళము వేసెడివారు. శీతకాల దీర్ఘవాసరనిశలు మందమందముగ జరిగెడివి. నేను గంటలకొలది చదువుటతోను, వ్రాయుటతోను విసిగి ఆ చిన్న గదిలోనే నాలుగైదడుగులు ముందుకు వెనుకకు

వేయుచు పచారుచేయుచుండ జంతుప్రదర్శనశాలలో భల్లూకములు తమ పంజరములలో తిరుగాడుట నాకు జ్ఞప్తికివచ్చెడిది. ఒక్కొక్కప్పు డెక్కువ విసుగు జనించునపుడు నాకు ప్రీతికరమైన శీర్షాసన చికిత్సచేసెడివాడను.

రాత్రి తొలిజామున నంతయు ప్రశాంతముగనుండి ట్రాము బండ్లధ్వనులు, గ్రామఫోనుగానము, దూరమునుండివినవచ్చుగాత్ర పాట, మొదలగుపట్టణధ్వనులు మాత్రము వినిపించెడివి. దూరము నుండి వచ్చు యీ సన్ననిపాట శ్రవణానందముగ నుండెడిది. కాని రాత్రులం దెక్కువ విశ్రాంతి యుండెడిదికాదు. డ్యూటీమీదనుండు జయిలు సంరక్షకులు పెద్దధ్వనిచేయుచు నడుచుచుండెడివారు. గంట గంటకు నేదోయొక పరీక్ష. కొంతమంది ఆఫీసరులు నేమెవరము పారి పోలేదని ధృవపరచుకొనుటకు చేతిలాంతరులను పుచ్చుకొని వచ్చెడి వారు. ప్రతిరాత్రి మూడుగంటలకు పెద్దపెద్ద యరపులు, బొబ్బలు, గర్రుబుర్రులు, రాచుట, తోముట, మొదలగునవి వినిపించును. అది పాకశాల కార్యప్రారంభ సూచన.

ఆలిపూరు, ప్రెసిడెన్సీజయిళ్ళలో ననేకమందివార్డర్లు, గార్డులు, గుమాస్తాలు, ఆఫీసరులు కలరు. ఈ రెండుజయిళ్ళలోను సైనిజయిలులో నున్నంతమంది ఖయిదీలు 2200 మొదలు 2300 వరకు గలరు. కాని యీ రెండు జయిళ్ళలోను ఒక్కొక్కదానిలో సైనీజయిలులోనున్న యుద్యోగులకంటె రెట్టింపుకు పైగ నున్నారు. ఇచ్చట చాలమంది యూరపియను వార్డరులు, పింఛను తీసికొను భారత సైనికోద్యోగులు కలరు. యు. పి. లో కంటె కలకత్తాలో బ్రిటిషుసామ్రాజ్యమెక్కువ ప్రమకరముగను, నిశ్చయముతోను పనిచేసెననుట ధృవము. పెద్ద యుద్యోగస్తులు ఖయిదీల దగ్గరకు వచ్చునపుడు సామ్రాజ్యశక్తి నెల్లప్పుడు జ్ఞప్తికితెచ్చుచు దానిచిహ్నముగనుండుటకు ఖయిదీలందరును "సర్కార్ సలాం"అను కేక వేయవలెను. ఈ కేకతో నొకవిధమగు నవయువ సంచలనముకూడ జరుగవలెను. ఖయిదీలు వేయు ఈ కేక

రోజు కనేకసారులు, ముఖ్యముగ ప్రతిదినము సూపరింటెండెంటుదగ్గర నుండి వెళ్ళునపుడు, నా యావరణగోడలను దాటి నాకువినవచ్చెడిది. సూపరింటెండెంటు పోవునపుడు అతని నెత్తిమీద పట్టెడి రాజ్యఛత్రము నా యేడడుగుల గోడపైనుండి కాన్పించెడిది.

'సర్కార్‌సలాం'అను నీయసాధారణ కేకయు, దానితో నుండవలసిన శరీరచేష్టలు ప్రాచీనయుగచిహ్నములా? యనినేనాశ్చర్యపడెడివాడను. లేక నవి యీ వేశపరుడగు నేయూంగ్లాధికారిచేతనో కనిపెట్టబడెనా? ఇది ఇంగ్లీషువానికల్పనయనియే నేను భావించెదను. ఇందులో నొకచిత్రమైన యర్ధాంగ్ల జాతి ధ్వని కలదు. అదృష్టవశమున నీ కేకయు. పి. జయిళ్ళలోలేదు. బెంగాలు అస్సాములలో తప్ప, బహుశః మరే రాష్ట్రములలో నుండదు.

అలీపూరులో చేయబడిన యొకమార్పు నాకు తృప్తికరముగ నుండెను. మామూలుఖయిదీలయాహారము యు. పి. ఖయిదీలయాహారము కంటె చాల యోగ్యముగనుండెను. జయిలు భోజనములో యు. పి. చాలరాష్ట్రములకు వెనుకబడి యుండును.

శీతకాలము త్వరలో గతించెను. వసంతకాలము వరుగెత్తెను. వేసవి ప్రారంభించెను. రోజురోజు యెండతీవ్రమగుచుండెను. కలకత్తా శీతోష్ణస్థితినాకెప్పుడు ప్రీతికరముకాదు. కొద్దిరోజుల యునికియైనను నాకచ్చట నిస్సారముగ నుండును. ఖయిదు పరిస్థితులు సహజముగ మరింత యధ్వాన్నముగ నుండును. వ్యాయామము చేసికొనుటకు తగినంతస్థలము లేకపోవుటచే నాశీతోష్ణస్థితిలో నెక్కువకాలముగదిలో తాళము వేయబడియుండుటచేత నా యరోగ్యము కొంత చెడెను. నా బరువు త్వరితముగ తగ్గనారంభించెను. నేను తాళములను, గొళ్ళెములను, గడియలను, గోడలను ద్వేషింప నారంభించితిని.

ఒక నెలగడచినతరువాత నా దొడ్డి వెలుపల నన్ను వ్యాయామము చేసికొననిచ్చిరి. ఈమార్పు నాకు సుఖముగనుండెను. ఉదయ

సాయంకాలములయందు నేను పెద్ద గోడక్రింద విహరించెడివాడను. క్రమముగ నేను ఆలిపూరు జయిలుకు, కలకత్తాశీతోష్ణములకు నలవడి పోతిని. చివరకు పొగ, కీచుధ్వనులతో కూడిన పాకశాలకూడ సహ్యమయ్యెను. ఇతరవిషయములు నా మనస్సును నింపుచుండెను. నేనితర బాధలతో నింపబడితిని. బయటనుండి వచ్చు వార్తలేవియు సుముఖముగ లేకుండెను.

60

తూర్పు పశ్చిమములో ప్రజా ప్రభుత్వము

నేను శిక్షింపబడినతరువాత అలిపూరులో నాకే దినపత్రిక రాలేదు. విచారణజరుగుకాలములో కలకత్తాలోని డైలీ స్టేట్సుమన్ పత్రిక వచ్చెడిది. నేను శిక్షింపబడిన మరునాడే దీని నాపివేసిరి. యు. పి. లో 1932 లగాయతు ఎ క్లాసు ఖయిదీలకొక దినపత్రికను (ప్రభుత్వమువారి కిష్టమైనదానిని) రానిచ్చెడివారు. ఈపత్రికకు బదులు నాకు స్టేట్సుమన్ వారపత్రిక నిచ్చెడివారు. దినపత్రిక పించను పుచ్చుకొన్న ఆంగ్లోద్యోగులకొరకు, వర్తకులకొరకు నుద్దేశింపబడి వారికి కావలసిన భారతదేశ సంక్షిప్తవార్తలను కలిగియుండును. ఇందులో విదేశవార్తలేమియు నుండకపోవుటచే నేను చాల బాధపడెడివాడను. విదేశ వ్యవహారములను నేనతిశ్రద్ధగవీక్షించుచుండెడివాడను. అదృష్టవశమున నన్ను మాన్చెస్టరుగార్డియను వారపత్రిక తెప్పించుకొననిచ్చుటచే నంతర్జాతీయ వ్యవహారములు నాకు తెలియుచుండెడివి.

నా విచారణకాలములోనే యూరపులో తిరిగి తీవ్రసంఘర్షణ బయలుదేరెను. ఫ్రాన్సులో నీహాంగు బయలుదేరి ఫాసిస్టుదౌర్జన్యాల క్రింద పరిణమించి 'జాతీయ' ప్రభుత్వమనునదియేర్పడెను. ఆస్ట్రియాలో ఛాన్సెలరు డాల్ఫసుపనివాండ్రను కాల్చివేయుచునచ్చటనున్న సాంఘిక ప్రజాప్రభుత్వమును నాశనముచేయుచుండెను. ఆస్ట్రియాలోని రక్తపాతము నన్ను కృంగదీసెను. ఈ ప్రపంచమెంత భయంకరమైనది! ఎంత రక్తపిపాసకలది. తన స్వప్రయోజనములను కాపాడుకొనునపుడు మానవుడెంత క్రూరుడుగ నుండును! యూరపుఅంతట నమెరికాలోను ఫాసిజము వృద్ధియగుచున్నట్లు కాన్పించెను. జర్మనీలోహిట్లరుఅధికారమునకు వచ్చినపుడచటనున్న ఆర్థికకష్టముల కతడెట్టి తరుణోపాయము చూపించలేదు. కనుక నతని పరిపాలన త్వరలోనే యంతరించునని

నేనను కొంటిని. అట్లే ఫ్యాసిజము తక్కినచోట్ల ప్రాకినపుడు దానిగోతి నదియే త్రవ్వుకొనుచున్నదని నే నూరట చెందితిని; దాని తరువాత సంకెళ్ళన్నియు తెగకతప్పదు. కాని నాకోరిక యే న కట్టియాశను పుట్టించుటలేదా? యని నే నాశ్చర్యపడనారంభించితిని. ఈ ఫ్యాసిస్టుతరంగ మతిసులభముగ నంతత్వరగ నంతరించునా? ఫ్యాసిస్టుడిక్టేటరులు భరింపరాని పరిస్థితు లేర్పడినను లొంగక తమదేశములను ఘోరసంగ్రామ రంగముగమార్చి వేయరా? అట్టిపోరాటముయొక్క ఫలితమేమగును?

ఇంతలో వివిధరూపములుగల ఫ్యాసిజము విస్తరించెను. 'నిజాయితీరిపబ్లిక్' అయిన నవీన స్పెయినుదేశములో గొప్ప తిరోగమనము వచ్చెను. పెద్దమనిషితరహాగల యాదేశ లిబరలునాయకుల లలితపదజాలమంతయు దేశపతనము నాపజాలకుండెను. లిబరలిజము ప్రతిచోట నాధునిక పరిస్థితుల నెదుర్కొనుట కసమర్థమైయుండెను. అదిశబ్దములకును, వాక్యములకును అంటిపెట్టుకొనియుండి యవియే కార్యములగునని భావించెను.

ఆస్ట్రియావిషాదమునుగురించి మాన్‌చెస్టరుగార్డియను పత్రిక వ్రాసిన ప్రధానవ్యాసములను నేనతిశ్రద్ధగ చదివితిని. "ఈ రక్తసిక్త పోరాటమునుండి యెట్టిఆస్ట్రియాబయల్పడును? యూరపులోనతి రియాక్షనరీలైన యొక కూటము తుపాకులతోను, మరఫిరంగులతోను పరిపాలించునట్టి యాస్ట్రియాతయారగును" "కాని, యింగ్లండు స్వాతంత్ర్యముకొరకేనిలబడుచో దాని ప్రధానమంత్రి మౌనముద్రవహించు నేలకో! డిక్టేటరుపదవులనుగురించిన యతని స్తోత్రముల ననేకములను వింటిమి. అవి 'జాతీయాత్మను జీవింపచేయును'; 'ఒక నూతనదృష్టిని, నూతన శక్తిని ప్రసాదించును' అని యతడు చెప్పగా మేమువింటిమి. కాని తరచు శరీరమును, నంతకంటె నాత్మను ఖూనిచేయు క్రౌర్యములను గురించి యింగ్లండు ప్రధానమంత్రి యేదో కొంత చెప్పి యుండవలసినది." మాన్‌చెస్టరుగార్డియనుపత్రిక స్వేచ్ఛకొరకే నిలబడునెడల భారతదేశములో స్వాతంత్ర్యము నలిపివేయబడుచున్నపుడిది యేల నోరెత్తిమాట్లాడదు? మేముకూడ శరీరబాధలనే గాక నంతకంటె నధ్వాన్నమగు నాత్మవరీతులను గూడననుభవించితిమి.

"ఆస్ట్రియా ప్రజాప్రభుత్వము నాశముగావింపబడినను అది చివరవరకు పోరుచు శాశ్వతకీర్తిని సంపాదించి, యొక పౌరాణిక గాథ సృజించుకొనెను. ఇది ముందెప్పుడో యొకప్పుడు యూరపులో కలుగు స్వాతంత్ర్యోత్సాహమును తిరిగి రగుల్కొలుపవచ్చును. "స్వాతంత్ర్యములేని యూరపు విగతప్రాణియయ్యెను సౌభాగ్యప్రదములగు ప్రాణచిహ్నము లేవియు నచ్చట స్ఫురింపవయ్యెను; క్రమముగ నూపిరితిరుగని యుక్కిరిబిక్కిరిస్థితి దాపురించెను గిజగిజ తన్నుకొనుట, లేక నాంతరంగికోద్రేకము, కడియెడములకు కొట్టుకొనుటమాత్రమే యిపుడు పైబడనున్న మానసిక విస్మృతిని తప్పింపగలవు...రైనులగాయతు యూరలుపర్వతములవరకు యూరపు పెద్ద జయిలుక్రింద తయారయ్యెను."

రాళ్ళను కఱగించు యీవాక్యములు నా హృదయమున ప్రతిధ్వనించెను కాని, హిందూదేశముగతి? మాన్ చెస్టరుగార్డియనుపత్రిక, యింగ్లండులో స్వాతంత్ర్యప్రియులమా దౌర్భాగ్యస్థితి నేల విస్మరింపవలెను? ఇతరచోట్ల వారంత తీవ్రముగ గర్హించుదానిని యిచ్చట చూడకుండ నెట్లుండగలరు? ఇరువది యేండ్లక్రిందట, నైరోపామహాసంగ్రామసమయమున, వందొమ్మిదవశతాబ్ది సాంప్రదాయములక్రింద శిక్షనొంది స్వభావముచే జాగరూకుడును, మితభాషియైన గొప్ప యింగ్లీషు లిబరలునాయకశిఖామణి యిట్లు చెప్పెను :_ "దౌర్జన్యము ధర్మముపై విషాదభరిత విజయము బడయుచుండ సాక్షీభూతుడనై యూరక చూచుటకుముందు నేను మనదేశము చారిత్రకపుటనుండి తుడిచివేయబడగోరెదను." అతిధైర్యమైన యీ భావము వాగ్ఝరితో ఘోషింపబడెను. దీనిని ఋజువుపరచుటకు లక్షలకొలది సాహసికులైన యాంగ్ల యువకులు ముందుకురికిరి. కాని అస్క్వితుగారి స్టేటుమెంటు వంటిదానినే భారతీయుడు చేసినచో వాని కెట్టిగతిపట్టును?

జాతీయచిత్తవృత్తి చిత్రమైనది. మనము యోగ్యులమని నిష్పక్షపాతబుద్ధి గలవారమని యూహింతుము. ఇతరులే, యితర దేశమే యెల్లప్పుడు నన్యాయముగ ప్రవర్తించును. మన మితరులవంటి

వారము కాదని మనహృదయాంతరాళములో నెచ్చటనో యొక నమ్మకముండును. పరదేశ భాగ్యమును నియమించు ప్రభుత్వజాతికి చెందు నదృష్టమే మనకు పట్టినా! యిక చెప్పవలసిన దేమున్నది? అత్యుత్తమమైన యీ ప్రపంచములో సమస్తము కళ్యాణముకొరకే యని విశ్వసింపకుండ మన మెట్లుండగలము? పరివర్తనము కావలెనని యాందోళనచేయువారందరు స్వార్థపరులు, లేక మనవలన పొందిన లాభములను మరచిన కృతజ్ఞులు, వంచింపబడిన యవివేకులు.

బ్రిటిషుజాతి లంకసీమజాతి; చిరవిజయముచేతను, విభవాతిశయముచేతను వారితరులను హీనముగ చూచెదరు. పైతరహాకు చెందు బ్రిటిషువారిదృష్టిలో ప్రపంచ మీ విధముగ విభజింపబడును. (1) బ్రిటను–పెద్దకాళ్లీ. తరువాత (2) బ్రిటిషువలసలు (తెల్లజనాభా మాత్రమే) మరియు అమెరికా (ఆంగ్లోసాక్సనులు మాత్రమే; డాగోలు: వాప్ జాతులు మొదలైనవారు కారు) (3) పశ్చిమయూరపు (4) తక్కిన యూరపు (5) దక్షిణ అమెరికా (లాటిన్ జాతులు)–పెద్దకాళ్లీ తరువాత (6) ఆసియా, ఆఫ్రికాలకు చెందిన యెరుపు, పసుపు, నలుపు రంగులుగల జాతులు–కొంచెమించుమించు యేకగుది.

ఈతరగతులలో చిట్టచివరనున్న మనము మనపాలకులువసించు పీఠమున కెంతదూరములోనుంటిమి? వారు మనవైపు చూచునపుడు వారిదృష్టి మందగించుటలో నాశ్చర్యమేమున్నది? మనము ప్రజాప్రభుత్వమును గురించి, స్వేచ్ఛనుగురించి, మాట్లాడునపుడు వారికి కోపమును కలిగించెదమనుటలో నాశ్చర్యమేమున్నది? ఈ పదములు మన యుపయోగముకొరకు సృజింపబడలేదు భారతదేశములో ప్రజాస్వామికసంస్థలను భవిష్యత్తులోకూడ చాలకాలము వరకు నూహింపజాలనని చాటినది గొప్పలిబరలు రాజకీయధురంధరుడైన జాన్‌మార్లీ కాడా? కెనడాదేశమునకు బొచ్చుకోటు పనికిరానట్లు భారతదేశమునకు ప్రజాప్రభుత్వము భర్జింపదు. తరువాత సామ్యవాద ధ్వజవాహకులు, దీనరక్షణకంకణులు నగు బ్రిటిష్ లేబరుపార్టీ వారు వెల్లివిరియువిజయోత్సాహములో 1924 లోని బెంగాలు ఆర్డినెన్సులు

తిరిగిప్రసాదించిరి. వారి రెండవపరిపాలనాకాలములో మాస్థితి మరింత చెడిపోయెను. భాషచేత, సంస్కారముచేత భేదములుండుటచే నొక యాంగ్లేయుడు, ఫ్రెంచిదేశస్థుడు నొకేవిధముగ భావింపజాలరు; ఇక నాంగ్లేయునకు ఆసియావాసికి మధ్య నెంత విపరీతభేదముండును?

భారతసంస్కరణసమస్యనుగురించి యీమధ్యప్రభువులసభలో చర్చజరిగెను. ఉదారప్రభువు లనేక వన్నెచిన్నెల యుపన్యాసముల నిచ్చిరి. భారతదేశములో నొకరాష్ట్రమునకు గవర్నరుగనుండికొంత కాలమువైస్రాయిగపనిచేసిన లిట్టన్‌ప్రభువువీరిలో నొకడు; ఇత డుదారత, సానుభూతిగల గవర్నరని పదే పదే చెప్పబడుచుండును. ఇత డిట్లు చెప్పెనట "హిందూదేశమునకంతకు కాంగ్రెసుకంటె భారతప్రభుత్వమున కెక్కువ ప్రాతినిధ్యముగలదు. అధికారులు, సైన్యము, పోలీసు, సంస్థానాధిపతులు, పటాలములు, హిందువులు, ముస్లిములు—వీరువారననేల యందరిపేరను ప్రభుత్వము మాట్లాడగలదు. కాంగ్రెసు చివరకు దేశములోనున్న యొకపెద్ద సంఘము తరపునగూడ మాట్లాడజాలదు." అతడు తనయర్థమును స్పష్టముచేయుటకు "భారతదేశాభిప్రాయమని నేను చెప్పినపుడు నే నెవరిసహాకారముమీద నాధారపడగలనో, ముందురాబోవు గవర్నరులు, వైస్రాయిలుకూడ నెవరిమీద నాధారపడవలయునో వారిని గురించియే తలచుచున్నాను."

ఇతనియుపన్యాసమునుండి రెండుప్రధానవిషయములు బయటపడుచున్నవి. భారతప్రభుత్వమునకు సహాయముచేయువారే లెక్కింపదగిన భారతదేశము. ఇండియాలో బ్రిటిషుప్రభుత్వమే యెక్కువ ప్రాతినిధ్యము కలది కనుక ప్రజాప్రభుత్వము. ఈ వాదము 'పెద్దమనిషి తరహాగ' చేయబడుటనుబట్టిచూడగా సూయజుకాలువ దాటుటతోడనే యాంగ్లశబ్దములు తమయర్థమును మార్చివేయునట్లు కాన్పించును. చక్రవర్తిప్రతివానికిని ప్రాతినిధ్యమువహించును. కనుక నిరంకుశప్రభుత్వమేయెక్కువప్రాతినిధ్యముకలప్రజాప్రభుత్వమనువాదముసహజముగదీనితరువాతవెట్టువలెకాన్పించును; పృథ్వీపతులు యీశ్వరాధికారముకలవారను పూర్వపు తత్త్వమునకు మనము చేరుకొనెదము.

ఏ. సి. యస్. శాఖాభూషణమైన సర్ మాల్కం హైలి 1934 నవంబరు 5 వ తేదీని యు. పి. గవర్నరుగ కాశీలో మాట్లాడుచు భారతసంస్థానములలో నిరంకుశత్వముండవలెనని సమర్థించెను. ఈసలహా యనవసరము. భారతదేశములోనే సంస్థానమును తనంతట తా నైచ్ఛికముగ నిరంకుశత్వమును విడిచిపెట్టెను. యూరపులో ప్రజాప్రభుత్వములు విఫలమగుచున్నవను సాకుతో నీ నిరంకుశత్వమునుకాపాడవలెనని చేయుప్రయత్నము గమనింపదగియున్నది. మైసూరుదివాను సర్ మిర్జా ఇస్మాయిల్ ప్రతిచోట పార్లమెంటరీప్రజాప్రభుత్వము లంతరించుచుండ గొప్ప సంస్కరణములు కావలెనను సమర్ధన కాశ్చర్యమును వెలిబుచ్చెను "మన ప్రస్తుత చట్టమన్నివిధముల తగినంత ప్రజాస్వామికముగ నున్నదని సంస్థానాత్మ భావించుచున్నట్లు నేను దృఢముగ చెప్పగలను" అని ఆయన చెప్పెను. మైసూరుయొక్క 'ఆత్మ' అనునది యా రాజు, దివానుగార్ల యాధ్యాత్మిక స్వరూపము కాబోలును! ప్రస్తుతము మైసూరులోనున్న ప్రజాప్రభుత్వమును నిరంకుశత్వమునుండి వేరు చేయజాలము.

హిందూదేశ కులకక్షలవలన మన ప్రజాప్రభుత్వ మభివృద్ధి కాజాలదని చెప్పెదరు. కాని యా కులకక్షలకు శాశ్వత దోహదము నిచ్చెదరు మనలో సంఘీభావము లేదనికూడ చెప్పెదరు. ఈజిప్టులో కులకక్షలు లేవు. అచ్చట పరిపూర్ణమైన రాజకీయమైక్యత కలదు. ఐక్యతే యచ్చట స్వాతంత్ర్యమునకు, ప్రజాప్రభుత్వమునకు నడ్డమువచ్చుచున్నది. నిజముగ ప్రజాప్రభుత్వమార్గము సూచీముఖ మార్గము తూర్పుదేశములకు ప్రజాప్రభుత్వ మనగా వారిని పరిపాలించు అధికారులయాజ్ఞలను శిరసావహించుట; వారి ప్రయోజనములను వేటిని ముట్టరాదు ఈ షరతుకు అంగీకరించుచో ప్రజాప్రభుత్వ స్వేచ్ఛ యనర్గళముగా సాగగలదు.

61

సంహారము

ఏప్రిల్ మాసము వచ్చెను. బయట ప్రపంచములో జరుగు సంగతులనుగురించి యసంతృప్తికరములగు వార్తలువచ్చుచుండెను. మా జయిలు సూపరింటెండెంటు గాంధీజీ శాసనోల్లంఘనము నాపివేసెనని ప్రసంగవశమున చెప్పెను. నాకంతకంటె మరేమియు తెలియలేదు. అనేకసంవత్సరములనుండి యెంతయో ఘనముగ భావింపబడిన దానిని యిట్లు విరమించుటకు నేను చాల విచారించితిని. ఎప్పుడో యొకప్పు డిది విరమింపబడవలెనని నేనెరుగుదును. గాంధీజీ దేశము యొక్కయు, కాంగ్రెసులో నత్యధికసంఖ్యాకుల యొక్కయు అభిప్రాయములను సరిగ గ్రహించెననుటకు సందేహము లేదు. అసంతృప్తిగనున్నను నేనీనూతనపరిస్థితికి సమాధానపడ ప్రయత్నించితిని.

శాసనసభలలో ప్రవేశించుటకు వెనుకటి స్వరాజ్యపార్టీ తిరిగి తలయెత్తనున్నదనికూడ నేను వింటిని. అదికూడ తప్పనిసరిగ తోచెను. కాంగ్రెసు ముందుయెన్నికలలో పాల్గొనకుండ నుండజాలదని నేను భావించుచుంటిని. నేను వెలుపలనున్న అయిదుమాసముల కాలములో నీదృష్టిని నిరుత్సాహపరచుటకు ప్రయత్నించితిని. నేను దీనికింకను సమయము రాలేదని, నిది ప్రత్యక్షకార్యమునుండి కాంగ్రెసువారిలో పొంగుచున్న నూతన సాంఘిక పరివర్తన భావములనుండియు దృష్టిని మరల్చునని భావించితిని. బిగువు యెక్కువకాలమున్నకొలది ప్రజల లోను, విద్యార్థులలోను యీ భావములు వ్యాప్తిచెందుననియు మన రాజకీయఆర్థికపరిస్థితి వెనుకనున్న యథార్థము బయటపడుననియు నేను భావించితిని ఈవిధానమువలన కాంగ్రెసు నిర్మలమైనయాలోచనలు, నిశ్చయమైన పరమావధిగల యుద్యమముగ సంస్థయగునని నేను భావించితిని. బహుశః అందులోనున్న కొంతమంది దుర్బలులు జారి పోవచ్చును. అదియొక నష్ట మెట్లగును? ప్రత్యక్షవిధానముయొక్క పటువనుకూడ విరమించి చట్టసమ్మతము న్యాయబద్ధమునగు పద్ధతులను

తిరిగి యుపక్రమింపవలసివచ్చినపుడు మన పరమలక్ష్యమును మనస్సులోనుంచుకొని కాంగ్రెసులో ముందంజవేసి యెక్కువగ పనిచేసిన వట్టి విూ పద్ధతుల నుపయోగించుకాలమువచ్చెను. కాని, శాసనోల్లంఘనమునకు వెన్నెకముకవంటివారు, కాంగ్రెసులో సమర్థముగ పనిచేసినవారు వెనుకకు పోవుచుండుట, అట్టిపాత్రలు వహింపని యితరులు తగుదుమమ్మాయని సిద్ధమయి పెద్దపీటలమీాద కూర్చొనుచుండుట నాకు విచారమును కలిగించెను.

శాసనోల్లంఘనమును విరమించునపుడు గాంధీజీయిచ్చిన స్టేటుమెంటు నేను కొద్దిరోజులతరువాత చదివి యాశ్చర్యపడితిని. నాహృదయము కృంగెను. నేనుదానిని మరలమరలచదివితిని. గాంధీజీ యిట్లు వ్రాసెను—"ఈస్టేటుమెంటు సత్యాగ్రహాశ్రమవాసులతోను, తత్సంబంధులతోను చేసిన సంభాషణఫలితము...నే నెక్కువగ గౌరవించినట్టి చిరకాలసహచరుడు, పూర్తి జయిలుపనిని చేయుట కిష్టపడక, తన ప్రత్యేకాధ్యయనమును చేయుచుండెననుట ప్రసంగవశమున తెలిసికొనుట దీనికి మరింత ముఖ్యకారణము. నిస్సందేహముగ నిది సత్యాగ్రహాశ్రమములకు విరుద్ధము. నేను ప్రేమించు స్నేహితుని దోషముకంటె నిది మరింతయెక్కువగ నాదోషమునే విశదము చేసెను. తన దుర్బలత్వము నాకు తెలియునని భావించితినని యా స్నేహితుడు చెప్పెను నేను గ్రుడ్డిగనుంటిని. నాయకునియంధత్వము క్షమార్హము కాదు. ఆచరణలో శాసనోల్లంఘనమునకు తాత్కాలికముగ నే నొక్కడనే ప్రతినిధిగ నుండవలెనని వెంటనే కనుగొంటిని"

ఆ 'స్నేహితుని తప్పు లేక లోపము అతిస్వల్ప విషయము. తరచు నేనట్టి దోషము చేసితిని. కాని నేనందుల కెంతమాత్రమును పశ్చాత్తాపపడను. ఒకవేళ అది ముఖ్యమైన విషయమేయైనను ప్రత్యక్షముగ వేలకొలది ప్రజలకును, అప్రత్యక్షముగ లక్షలకును సంబంధించు గొప్ప జాతీయోద్యమమును ఒకవ్యక్తి యొక్క దోషముకొరకు బలి వేయవలసినదేనా? ఇది నాకు విపరీతము, నీతిబాహ్యమునగు తీర్మానముగ కాన్పించెను. ఏది సత్యాగ్రహమో యేదికాదో నేను చెప్ప

సాహసింపజాలను. కాని, నాస్వంతవిధమున నేనుకొన్ని ప్రమాణముల ననుసరించి ప్రవర్తింప ప్రయత్నించితిని. గాంధిజీ స్టేటుమెంటువలన నా ప్రమాణములన్నియు తారుమారయ్యెను, కూలిపోయెను. గాంధీజీ సాధారణముగ తన అంతఃకరణనుబట్టి ప్రవర్తించును. తఱచు అది యుక్తముగనే యుండును; ప్రజాహృదయమును గుర్తించి, మంచిపని పక్వస్థితియందు కార్యరంగమున కురుకుటయందుగల యద్భుతశక్తిని అతడనేకసార్లు ప్రదర్శించెను. తన చర్యను సమర్థించుకొనుట కతడు తరువాతచూపు కారణములు కార్యానంతరము పుట్టుతలంపులు; అవి యెక్కువరసవంతములుగనుండవు. నాయకుడు లేక కర్మవీరుడు మంచి పట్టుసమయములో నెప్పుడు నప్రయత్నముగనాచరించి తరువాత దాని కారణములగురించి యోచించును. శాసనోల్లంఘనమునాపి వేయుటలో గాంధీజీ యుక్తముగనే ప్రవర్తించెననికూడ నేను తలంచితిని. కాని యతడు చూపిన కారణము బుద్ధికవమానమువలె నాకు కాన్పించెను. తనయాశ్రమవాసుల నతడు తనయిష్టమువచ్చినట్లు మందలించుట కధికారముకలదు; వారన్ని విధముల ప్రమాణములచేసి, యొక కట్టుబాటు కంగీకరించిరి. కాని కాంగ్రెసు అట్టిదేదియును చేయలేదు; నేనట్లుచేసి యుండలేదు. నా కెట్టిప్రయోజనమును లేని మానసిక,రహస్యకారణములకు మమ్మేల యిటునటు గుంజవలెను? ఇట్టి పునాదిమీద నెట్టి రాజకీయోద్యమమునైనను భావింపయోగ్యమగునా? సత్యాగ్రహ నైతిక భావమును నేను గ్రహించినంతవరకు బుద్ధిపూర్వకముగ నేఅంగీకరించితిని. ఆ ప్రధానభావము నాకు నచ్చెను అదిరాజకీయములను మరింత యున్నతము,ఉదారమునగుస్థాయికి గొంపోవునట్లుకాన్పించెను. లక్ష్యమన్ని విధములగు సాధనలను సమర్థింపజాలదని నే నొప్పుకొనెదను.

ఆ స్టేటుమెంటు నా కెక్కువ భయము దిగులు కలిగించెను. చివర నతడు కాంగ్రెసువారికి సలహా చెప్పెను. "వారు ఐచ్ఛిక దారిద్ర్యము,స్వార్థత్యాగముఅనుకళను నేర్చుకోవలెను వారు జాతిని నిర్మించుపనులలో నిమగ్నులు కావలెను; స్వయముగవడుకుచు, నేయుచు ఖద్దరునువ్యాప్తిచేయవలెను. వారినిత్యజీవితసంబంధములలో నన్ని విధముల ననింద్యమగు పరస్పర ప్రవర్తనలవలన హృదయ

పూర్వకముగ కుల సంఘీభావమును పెంపొందింపవలెను. తమలో నేరూపములోనున్నను అస్పృశ్యతను తరిమి వేయవలెను. మద్యపానము మొదలగు మత్తుపదార్థములను సేవించువారితో సంపర్కము కలిగించుకొని, స్వయముగ పవిత్రతనార్జించి త్రాగుడు పూర్తిగ మాన్పించవలెను. ఈ సేవలవలన బీదవానితరహాకు సరిపడు భృతియేర్పడగలదు. ఈ బీదప్రమాణము చాలనివారు యెక్కువలబ్ధినిచ్చు జాతీయప్రాముఖ్యతగల చిన్నచిన్న పరిశ్రమలలో స్థానము నేర్పరచుకొనవలెను."

ఇది మే మనుసరింపవలసిన రాజకీయ ప్రోగ్రాము. మా కిద్దరకును మధ్య చాలయంతరమున్నట్లు నాకు కాన్పించెను. సంవత్సరముల తరబడి యతనితో బంధించిన నా వినయ విధేయతంతువులొక్కసారి తెగిపోయినట్లు భావించితిని. చాలకాలమునుండి నాలో నొక మానసిక పోరాటము సాగుచుండెను. గాంధీజీచేసినది నా కర్థముకాలేదు; నచ్చలేదు. అతని యుపవాసములు, శాసనోల్లంఘనము జరుగుచుండగ నితరసారాంశములపై దృష్టి కేంద్రీకరించుట, వ్యక్తిగతస్వయంకృతపాశములు, వెనుకటి ప్రమాణమును భక్తిని, కృషిని మూలకు త్రోసిన యతని నూతనప్రమాణము, భక్తియివన్నియు నన్ను బాధించెను. నేను జయిలుబయటనున్న స్వల్పకాలములో నీ భేదములు మరికొన్ని వెనుకటికంటె నాకెక్కువ భారమయ్యెను. మామధ్య ప్రకృతిసిద్ధములగు భేదములుకలవని గాంధీజీ చెప్పిరి. అవి యంతకంటె నెక్కువే యగును. అనేక విషయములలో నతనికి వ్యతిరేకములగు స్పష్టమైన, నిశ్చయభావములు కలిగియున్నానని నేను గుర్తించితిని. అయినను కాంగ్రెసు జాతీయ స్వాతంత్ర్యముకొరకు పోరాడుచుండెను. కనుక పెద్దయుద్యమముకొరకు నేను వీని నణచివేసితిని. నా నాయకునిపట్ల నా సహచరులపట్ల విధేయతగ, విశ్వాసముగ నుండవలెననియే నేను ప్రయత్నించితిని. నా యాధ్యాత్మిక నిర్మాణముధర్మముపట్ల, సహచరులపట్ల విధేయత కున్నతస్థానము నిచ్చెను. నా యాధ్యాత్మిక విశ్వాసమనెడి లంగరునుండి నేను లాగివేయబడుచున్నానని భావించినపుడు నాలో అనేక సంరంభములుజరిగెను. కడకు నేను రాజీపడితిని.

బహుశః నేను తప్పుచేసితిని. ఈ లంగరును విడిచివేయుట యెవనికి యెప్పటికి యుక్తము కానేరదు. కాని, భావములలో సంఘర్షణకలిగినపుడు నాసహచరులపట్ల నాకుండవలసిన విధేయతనే నేనారాధించితిని ముంచుకొనివచ్చుపరిస్థితులు, మన సంగ్రామాభివృద్ధి నాకష్టములను కరగించి నా స్నేహితులకు దరిచేర్చునని నేననుకొంటిని.

ఇప్పుడు అలిపూరుజయిలుగదిలో నే నేకాకినై పోతినని హాగాతుగ భావించితిని. జీవితము నిరుత్సాహజనకముగ కాన్పించెను, నిర్మానుష్యమైన యెడారివలె కాన్పించెను. నేను నేర్చుకొనిన కఠినపాఠములలో నతికఠినమైనది, యతి బాధాకరమైనది నన్నిప్పుడెదుర్కొనెను. ఎట్టి ముఖ్యమైనవిషయములోను మన మెవనిమీదను ఆధారపడుట సాధ్యముకాదు. జీవితములో మన మొంటరిగనే ప్రయాణము చేయవలెను, ఇతరులమీద నాధారపడుట హృదయవిదారకతరమే!

పేరుకొనియున్న నా కోపము కొంత మతముమీదకు, మతదృష్టిమీదకుతిరిగెను మతముస్థిరప్రయత్నమునకు, నిర్మలభావములకు నెంతటి శత్రువు! ఇది యుద్రేకముమీద, రాగముమీదఆధారపడుట లేదా? 'ఆధ్యాత్మికత' యనియట్లహంకరించుచునిదినిజమైనయాధ్యాత్మికతకు,నాత్మవస్తువులకు నెంతదూరముననున్నది? వేరొకప్రపంచమనుచు నిది మానవుడు, సంఘము, సాంఘికన్యాయము అనువిషయములను భావింపదు. ముందుగనే కొన్ని భావములను కల్పించుకొని సత్యము వానికి విరుద్ధముగనుండునను భయముతో బుద్ధిపూర్వకముగ సత్యముపట్ల కండ్లుమూసికొనును దానికి సత్యము పునాది. అయినను దానిని గ్రహించిదానికొరకు పరిశోధనచేయదు. దానినిగురించి యితరులకు బోధించుటయే దాని జవాబుదారీ. అది శాంతినిగురించి మాట్లాడుచు దౌర్జన్యములేనిదే జీవింపజాలని సంస్థలను, పద్ధతులను బలపరచెను. అది రక్తపాతమును గర్హించెను. కాని నెమ్మదిగ శాంతియుత కవచములో వచ్చి మాడ్చి చంపివేయు దౌర్జన్యముసంగతియేమి? ఎట్టి బాహ్య శరీర గాయములను కలిగింపక మనస్సును భంగపరచి, యుత్సాహమును నలిపి, హృదయమునుముక్కలుచేయుదానిసంగతి!

నాలో, నింతగందరగోళమును కలిగించిన వానినిగురించి

నేను యోచించితిని. ఇంతకు ప్రజలపైనయద్భుతము నప్రతిహతము
నగు మంత్రశక్తి, యమోఘమగు నధికారము కలిగిన గాంధికి
యెంతటి వింతమనిషి! అతనివ్రాతలు అతనిమాటలు వాని వెనుకనున్న
వ్యక్తినిగురించి తగుభావమును కలిగించును! అవి సూచించుదానికంటె
నతనిశక్తిచాలగొప్పది అతడు హిందూదేశమునకు చేసినసేవ యెంత
దిగంతవిశ్రాంతమైనది; అతడామె ప్రజలకు ధైర్యము, పౌరుషము, శిక్ష,
సహనము, ధర్మముకొర కత్యుత్సాహముతో త్యాగముచేయుశక్తి
స్వాభిమానము కలిగించెను. శీలమునకు ధైర్యమొక్కటే నిశ్చయమైన
పునాదియని యతడు చెప్పెను; అది లేనిదే నీతి, మతము, ప్రేమ
యుండనేరవు. "భయమునకు దాసులమైనంతకాలము మనము సత్య
ప్రేమలను అనుసరింపజాలము" దౌర్జన్యము నతడెంత యేవగించు
కొనినను దౌర్జన్యముకంటెకూడ పిరికితనము మరింతయేహ్యమైనదని
యతడు చెప్పెను. "మానవుడు వ్యవహారదక్షుడగుటకు శిక్షయే
ప్రమాణము, పూచీ, త్యాగము, శిక్ష, ఆత్మసంయమములేనిదే
మనకు ఆశ, మోక్షము లేవు. శిక్షలేని త్యాగము బూడిదలోపోసిన
పన్నీరువలె నుండును" ఇవి కేవలము మాటలు, బహుశః విశ్వాసము
గల మాటలు, నీతివాక్యములుకావచ్చును: కాని యీమాటలవెనుక
శక్తికలదు. ఈ'వామనుడు'మాటలను చేతలను జోడించు వ్యక్తియని
భారతమెరుగును

అతడు భారత ప్రతినిధి. పీడింపబడిన యీ ప్రాచీనదేశ నిజా
త్మను వ్యక్తీకరించుట కతడువచ్చెను. రమారమి యతడే భారతము;
అతని దోషములు భారతదేశ దోషములే, అతని నగౌరవపరచుట
యతనికి చెందదు. అది జాతిని పరాభవించుట, ఇట్టినిర్లక్ష్యచేష్టలను
చేసిన నైగ్రాయి యిత్యాదులు వారెట్టి యుపద్రవసస్యమును చల్లు
చుండిరో గుర్తింపజాలకపోయిరి. 1931 డిసెంబరులో రౌండుటేబిలు
కాన్ఫరెన్సునుండి తిరిగివచ్చునపుడు (పోప్) మతగురువుఅతనికిసందర్శ
నము నీయనిరాకరించెనని నేను మొదట వినినపుడెంత బాధపడితినో!
అదిహిందూదేశము నగౌరవపరచుటవలె నాకు కాన్పించెను ఆ నిరా
కరణము బుద్ధిపూర్వకముగనే చేయబడెననుటకెట్టి సందేహమును

లేదు. క్యాథలిక్ చర్చి తన మతమునకు చెందని ఋషులను మహాత్ములను మెచ్చుకొనజాలదు. ఒక ప్రొటెస్టెంటు చర్చి గాంధీజీని గొప్ప మత తత్పరుడు, నిజమైన క్రైస్తవుడు అని పిలిచెను. కనుక నీ పిచ్చి మతముతో తన కెంతమాత్రమును సంబంధము లేకుండ చేసికొనుట రోముపట్టణమునకు మరింత యవసరమయ్యెను.

ఆసమయమందే ఆలీపూరుజయిలులో 1934 ఏప్రిల్‌లో నేను బెర్నార్డుషా వ్రాసిన క్రొత్తనాటకములను చదివితిని. 'పర్వతములమీద' అనుదానికి వ్రాయబడిన పీఠిక, జీససుకు పైలేటుకు జరిగినచర్చనన్నాకర్షించెను. మరియొకసామ్రాజ్యము మరియొక మతపురుషుని యెదుర్కొనవలసిన యీకాలమున కది తగియున్నట్లు కాన్పించెను. ఈ పీఠికలో జీసను పైలెటుతో నిట్లుచెప్పును "భయమును పారద్రోలుము రోముగొప్పతనమునుగురించి నాకిక నెట్టిబడాయిమాటలును చెప్పకుము. రోముగొప్పతనమని నీవు చెప్పునది భయముతప్ప మరొకటి కాదు. సర్వత భయము! భూతకాలమునుగురించి భయము, భవిష్యత్తునుగురించిభయము బీదవారిభయము, ధనవంతులభయము, పెద్దమతబోధకులభయము, చదువుకున్న గ్రీకులయొక్కయు, యూదులయొక్కయుభయము, మోటువారైన 'గాలులు', గాతులు, హూణులు మొదలగువారి భయము, వారిభయమునుండి మిమ్ము రక్షించుకొనుటకు మీకునాశనముచేసిన కార్థేజివలనభయము ఇప్పుడు వెనుకటికంటె నధ్వాన్నమైన భయము. సార్వభౌమికసీజరువలన భయము, పరిహాసింపబడి, తన్నబడి, నిర్ధనుడనై. దేశద్రిమ్మరినైన నావలన భయము. భగవంతునిపాలనపట్లతప్ప ప్రతిదానియెడల భయము. రక్తపాతము, కత్తి. బంగారములందుతప్ప దేనియందు విశ్వాసములేకపోవుట. రోముకొరకు నిలుచునీవు పందవు, ఈశ్వరరాజ్యముకొరకు నిలుచు నేను ప్రతిదానినిధిక్కరించితిని, సమస్తమును పోగొట్టుకొంటిని. శాశ్వతసామ్రాజ్యపట్టభద్రుడనైతిని." కాని, గాంధిజీ గొప్పతనము, అతడు హిందూదేశమునకు చేసినసేవ. నేను స్వయముగ నతనికి తీర్చుకొనవలసిన యద్భుతఋణము—ఇవి శంకింపబడుటలేదు. ఇవన్నియునున్నను అనేకవిషయములలో నతడు శుద్ధతప్పులు చేసి

యుండవచ్చును. ఇంతకును అతనిలక్ష్యమేది? అనేకసంవత్సరముల సన్నిహిత సంపర్కమును కలిగియున్నను నా కతని లక్ష్యమునుగురించి నిర్మలభావము కలుగలేదు. అతనిమట్టుకతనికి నిర్మలభావములున్నవని నేననుకొనను. ఒకయడుగు ముందుకుపోయినచాలునని యతడనును. అతడు భవిష్యత్తును చూడప్రయత్నింపడు నిర్దుష్టమైన పరమావధి నుంచుకొనడు. పరికరములను చూచుకొనడు. ఫలితము దానంతటదియే జాగ్రతపడునని యతడు విసుగులేకుండ చెప్పుచుండును. మీ స్వవిషయములలో, మీవ్యక్తిజీవితములలో మంచితనముగనుండును. తక్కినదంతయు దాని ననుసరించును. ఇది రాజకీయ లేక శాస్త్రీయదృష్టికాదు. బహుశః యిది నీతిశాస్త్రసంబంధమైన దృష్టి కూడకాదు. ఇది సంకుచిత ధర్మబోధ. మంచితనమనగానేమి? యను ప్రశ్న కది యేమియు నుత్తరమీయజాలదు. అది కేవలము వ్యక్తికి సంబంధించినదా లేక సాంఘికమా? గాంధిజీ మానసికశక్తుల అభివృద్ధికి నేమియు ప్రాముఖ్యతనీయక శీలమునకే ప్రాశస్త్యము చూపును. శీలములేని చదువు యుపద్రవకరము కావచ్చును. కాని విద్యలేని శీలమనగా నేమి? నిశ్చయముగ శీల మెట్లభివృద్ధి చెందును? గాంధిజీని మధ్యయుగపు క్రైస్తవఋషులతో పోల్చుచుందురు. అతడు చెప్పునది చాలవరకు దీనికిసరిపడును. అది యాధునిక మానసికానుభవమునకు, పద్ధతికి యెంతమాత్రము సరిపడదు,

లక్ష్యముపట్ల నతడు పైకికన్పించునంతటి యస్పష్టముగ నుండడని నేనూహించెదను. అతడొక నిశ్చితమార్గమున నడచుట కుద్రేకముతో వాంఛించును. కాని, యిది యాధునిక భావములకు, పరిస్థితులకు పూర్తిగ విరుద్ధము. ఇంతవరకు నత డీ రెంటిని సమన్వయపరుపజాలకపోయెను. లేక తనలక్ష్యమునకుగొంపోవు మధ్యసోపానములను నిరూపింపలేకపోయెను. కనుక నస్పష్టత కాన్పించును. కాని యతడు దక్షిణాఫ్రికాలో పాతికసంవత్సరముల క్రిందట తన సిద్ధాంతమును ప్రారంభించిననాటినుండి యతని సామాన్యాభిరుచి సుబోధకముగనే యుండెను. అతని యప్పటితర్వాత లిప్పటికిని యతని భావములను తెలుపునో లేదో నెరుగను. అవి పూర్తిగ నట్లుచేయునని యనుకొనను.

కాని, యతనిభావము వెనుకనున్న పునాదిని యర్థముచేసికొనుట కవి ష్టోద్పడును.

అతడు 1909 లో నిట్లు వ్రాసెను. "గత యేబదిసంవత్సరములనుండియు తాను చదివిన చదువు మరచిపోవుటలోనే భారత మోక్షముకలదు రైల్వేలు, టెలిగ్రాఫులు, ఆస్పత్రులు, లాయర్లు, డాక్టర్లు మొదలగునవన్నియు పోవలెను. పైతరగతు లనబడువారు సావధానపూర్వకముగ, భక్తిశ్రద్ధలతో నిరాడంబర వ్యవసాయజీవితమును నేర్చుకొనవలెను" మరియు "రైలు, మోటారులలో యెక్కినపుడెల్ల నేను యుక్తమని భావించుదాని కపచారము చేయుచున్నానని యెరుగుదును." "అత్యంత కృత్రిమములుశీఘ్రములునగు గమనశక్తి ద్వారా ప్రపంచమును సంస్కరింపబూనుట యసాధ్యమును సాధింపబూనుటవంటిది."

ఇదియంతయు నాకు కేవలముతప్పు ఉపద్రవకరము, సాధింపనలవికానిదియగు సిద్ధాంతమువలె కాన్పించును. గాంధిజీ దారిద్ర్యమును, బాధను, సన్యాసజీవితమును ప్రేమించును స్తోత్రముచేయును. అది దీనివెనుక కాన్పించును. అతనిదృష్టిలో కోరికలను పెంచుకొనుట జీవిత ప్రమాణముల హెచ్చుచేయుట నభివృద్ధి,నాగరికత కాజాలవు "కోరికలను బుద్ధిపూర్వకముగ నైచ్ఛికముగ తగ్గించుకొనవలెను. అది యథార్థమైన ఆనందమును, తృప్తిని పెంపొందించి, సేవచేయుశక్తి నధికముచేయును ఇదియే నాగరికత, యభివృద్ధి" ఈ ప్రాతిపదికమాత్రము లొకసారి యంగీకరింపబడినచో గాంధిజీయొక్క తక్కిన భావము నర్థముచేసికొనుట సులభమగును అతని కార్యములుసుబోధకములు కాగలవు. మనలో చాలమందిమి వీని నంగీకరింపక నతని కార్యములు మనకు నచ్చనపుడు గోలచేయుదుము.

దారిద్ర్యమును, బాధను స్తోత్రముచేయుట నామట్టుకు నాకు గిట్టదు. అవి యనవసరములని నేననుకొనను. అవితరిమి వేయబడవలెను. సన్యాస జీవితము వ్యక్తులకు సరిపడినను సాంఘికాదర్శముగ నేనంగీకరింపజాలను. నిరాడంబరత, సమత్వము, ఆత్మసంయమము మెచ్చదగినవే. కాని శరీరమును మాడ్చుట నాకు గిట్టదు. వస్తాదుకు శరీర

శిక్షణ యవసరమైనట్లే మనస్సుకు నాచారములను శిక్షలోనుంచి వశపరచుకొనుట యవసరమని నేను విశ్వసించెదను విశేషభోగలోలుడగువాడు సమయమువచ్చినపుడెక్కువబాధ సహించుననియు, నసామాన్యమగు నాత్మనిగ్రహము చూపుననియు, పిరికివలె ప్రవర్తించుననియు భావించుట వెఱ్ఱితనము. మంచి శరీరారోగ్యమున కెంతశిక్ష యవసరమో మంచి నైతికస్థితికి నంత శిక్ష యుండవలెను. కాని, యది నిశ్చయముగ సన్యాసము, శరీరమును శుష్కింపజేయుట కాజాలదు.

'నిరాడంబరమైన వ్యవసాయదారు జీవితము' నాదర్శముగ జేయుటకు నేనెంతమాత్రము నంగీకరింపజాలను. అయినను నాకు కంపరమెత్తును నేను దానికి లొంగుటకుబదులు వ్యవసాయదారులను గూడ దానినుండి బయటకు లాగగోరెదను. అనగా వారిని పట్టణవాసులను జేయుటకాక, నచ్చటనుండు విజ్ఞానసౌకర్యములను గ్రామసీమలకు వ్యాపింపజేయవలయుననియే నాకోరిక. ఈజీవితము యథార్థమైనయానందము నీయకపోవుటయే గాక నాకు రమారమి జయిలువలె నుండును. "చేత పారనుబూని మనిషి" లో నాదర్శప్రాయముగ జేయవలసిన దేమిగలదు? అసంఖ్యాకములగు పురుషాంతరములనుండి నలిపివేయబడి, కొల్లగొట్టబడిన రైతు తనతోడి పశువులకంటె నొక్కవాసి మెరుగు. "అతనికి సంతోషము, ఆశ లేకుండచేసిన దెవరు? విచారము వెలిబుచ్చక, మొద్దుబారిన ఎద్దువలె చేసినదెవరు?"

మానవసంస్కారమువీడి మనస్సుకు స్థానములేని యజ్ఞానపరిస్థితులకు పోవలెనను యీకోరిక నాకు కేవలమర్థశూన్యముగ కాన్పించును. మానవునకు కీర్తి, విజయము చేకూర్చువస్తువే దూషింపబడుచున్నది. నిరుత్సాహపరుపబడుచున్నది. మనస్సునణచివేసి దానియభివృద్ధి నరికట్టు భౌతికవాతావరణము వాంఛనీయమని భావింపబడుచున్నది. ప్రస్తుత నాగరికత దోషములతో నిండియున్నది. కాని, దానిలో గుణముకూడకలదు. దానిలోనున్న యాదోషమునుపోగొట్టుకొనగలశక్తి దానికిగలదు. దానిని సమూలనాశము చేయుటయనగా దానిలోనున్న యాశక్తిని తీసివేసి నిర్వీర్యము, నిరుత్సాహజనకము, దుఃఖప్రదము నగుస్థితికి పోవుట యగును. కాని యిది వాంఛనీయమే

యనియనుకొనినను యసంభవము. పరివర్తన ప్రవాహమును మన మాపజాలము. దానితో మనకెట్టిసంబంధము లేక నుండజాలము. 'ఈడెను' వనఫలము ననుభవించిన మన మా రుచిని మరచిపోయి, ఇక్ష్వాకుల కాలమునకు పోజాలము.

ఈ వాద మతికష్టమైనది. ఏలనన, యీ రెండుదృష్టులు కేవల విరుద్ధములు గాంధీజీ యెప్పుడు వ్యక్తిమోక్షము, పాపము అను దృష్టిలో యోచించుచుండును మా యందరిమనస్సులలో సాంఘిక శ్రేయస్సు ప్రధానముగ నుండును. పాపమనుభావమును నేనర్థముచేసికొనజాలను కనుకనే గాంధిజీయొక్క సామాన్యదృష్టి నాకునచ్చదు. సంఘమును సాంఘిక నిర్మాణమును మార్చుటకతడు యిష్టపడడు. అతడు వ్యక్తులపాపములను పారద్రోలుటకు యత్నించును. 'స్వదేశీని' అనుసరించువాడు ప్రపంచమును సంస్కరింపవలెనను నిరర్థక యత్నమున కెన్నడు పూనుకొనడు అది భగవంతునిచే నియమింపబడు సూత్రముల ననుసరించి కదలునని, కదలగలదని యతడు విశ్వసించును" అని యతడువ్రాసెను. అయినను ప్రపంచమును సంస్కరించు ప్రయత్నములో నతడు తగినంత ముందంజ వేయును. కాని, యతని సంస్కారము వ్యక్తులకు సంబంధించినది. యింద్రియ భోగములను జయింపవలెను. అవి పాపభూయిష్టములు. ఒక రోమను క్యాథలికు రచయిత చేసిననిర్వచనము నతడంగీకరించునని నే ననుకొనెదను. "పాపబంధమునుండి తప్పించుకొనుటయే స్వేచ్ఛ." రెండువందల యేండ్లక్రిందట లండనుపట్టణబిషప్ చెప్పినమాటల నివి యెంత పోలియుండెను! క్రైస్తవమతము పాపబంధమునుండి సైతానునుండి మానవమద, మాత్సర్యాదులనుండి, విపరీతకోరికలనుండి రక్షించును."

ఈదృష్టిని గుర్తించితిమేని కామముపట్ల గాంధీజీకిగల భావమును కొంచెమర్థముచేసికొనగలము. ఇది నేటి సామాన్యమానవుని కసాధారణవిషయము. "ఆతనిదృష్టిలో సంతానకోరిక లేనివారికలయిక నేరము" మరియు "కృత్రిమపద్ధతులు నపుంసకత్వమును, వరములనిస్సారతను కలిగింపకతప్పదు" మనకర్మలయొక్క ఫలితములనుండి తప్పించుకొనజూచుటతప్పు, అవినీతికరము. తన జిహ్వానుతృప్తిపరచుకొనుచు,

మందులను, బలవర్ధనలేహ్యములను సేవించుచు తత్ఫలితములనుండి తప్పించుకొనజూచుట చాలచెడ్డ తన పశువాంఛలను తీర్చుకొనుచు తత్ఫలితములనుండి తప్పించుకొనజూచుట మరింత యధమమైనదని."

నాకీ దృష్టి యసహజముగ, నాశ్చర్యకరముగ కాన్పించును అతనిదృష్టినిక్కమైనచో నేను నపుంసకత్వమునకు, నరములసబ్ధత్వమునకు దరిజేరిన నేరస్థుడనగుచున్నాను రోమనుకాథలికు మతస్థులుకూడ జనన నిరోధమును తీవ్రముగ నెదిర్చిరి కాని, వారు గాంధీజీవలెయీ వాదమును చివరనరకు తీసికొనిపోలేదు. వారు మానవస్వభావమని భావించినదానితో రాజీపడిరి. గాంధీజీ యట్లుగాక సంతానముకొరకు తప్ప స్త్రీ పురుషుల కలయికను గుర్తింపడు. 'కామమును నేను పరిగణింపకపోవుట యసంభవమైన యాదర్శమని నాకు చెప్పుచుండును. ఇచ్చట నుదహరింపబడిన కామము సహజమని నే నెంతమాత్రము నంగీకరింపజాలను. అది వినాశకరము. సోదరునకు సోదరికి, తల్లికిబిడ్డకు తండ్రికి కూతురునకుగల ప్రేమయే స్త్రీపురుషుల సహజసంబంధము. ఈ సహజప్రేమయే ప్రపంచమున కాధారభూతము' అనియతడు చెప్పెను. 'భార్యాభర్తల కామము కూడ సహజమని నేను చాటెదను' అని యతడు మరింతగట్టిగ చెప్పెను. దానినొక విశ్వాసముగ మన మంగీకరింపవలెను. లేదా తిరస్కరింపవలెను. దీనికి వేరొక మధ్యమార్గము లేదు. ఇది విశ్వాసమునకు సంబంధించినది. కాని హేతువుకుసంబంధించినదికాదు. ఈ విషయములో గాంధీజీ పొరపడెననియే నేను భావించెదను. అతని సలహా కొంతమందికి భరింపవచ్చును కాని, యది జనసమూహముమీద నిరర్థకము. శరీరముకు నరములకు వ్యాధికారకము. ఇంద్రియనిగ్రహము వాంఛనీయమే. కాని గాంధీజీ సిద్ధాంతము దీనిని సాధింపగలదని నేను భావింపను. ఇది చాలయతివాదము. చాలమందికిది శక్తికి మించినది. లేదా భార్యాభర్తలకు తగవుసంభవించును. జనన నిరోధపద్ధతులు విధాయకముగ ససాధారణవిషయములోలత యగునని గాంధీజీ స్పష్టముగ భావించును; కేవల కామము స్వైరవిహారమునకు దారియని యతడు భావించును. ఈ రెండు సారాంశములలో నేదియు

సమర్థింపబడనేరదు. ఈ కామవిషయములో గాంధీజీ కింత వైముఖ్యమేల యుండవలెనో నా కర్థముకాకున్నది. అది యతనికి 'మసిబొగ్గు లేక శుద్ధతెలుపు' సమస్య, ఈ రెండువర్ణముల మధ్య ఛాయ లేవియు నుండవు. ఈ రెండు చివరలందు నత డసామాన్య యసహజ యతివాదస్థితిని తీసికొనుచున్నాడు. ఇది బహుశః యీ రోజులలోని కామశాస్త్రపుస్తక ప్రవాహముమీద కలిగిన వైరభావమని యనుకొనెదను. నేను సామాన్య వ్యక్తిని. నా జీవితములో నింద్రియ వాంఛ తన పాత్రను నిర్వహించెను. కాని, యది నన్ను నా యితర కార్యములనుండి మరల్చలేదు. అది తక్కువస్థానమునే వహించెను. అతని దృష్టి ముఖ్యముగ ప్రపంచమును ప్రపంచపద్ధతులను ధిక్కరించు సన్న్యాసదృష్టి. జీవితమును తిరస్కరించి యది చెడ్డయని భావించువానిదృష్టి. సన్న్యాసి కది సహజము. కాని యీ జీవితము నంగీకరించి దాని లబ్ధిని పొందుటకు ప్రయత్నించుచున్న లౌకికుల మీద దీనిని వర్తింపచేయుట దురవగాహము.

నే నితరవిషయముల వెంబడిబడి కొట్టుకొనిపోతిని. కాని, అలిపూరుజయిలులోని యాదుర్దినములలో నీ భావములన్నియు నొక సహేతుక క్రమము ననుసరింపక తక్కిడి బిక్కిడిగ నా మనస్సును నింపుచు నన్ను కలవరపరచి బాధించుచుండెను. అన్నిటికిని పైన యొంటరితనమును, సంహారమును గురించిన భావముండెను. ప్రాణమును త్రుంచివేయు నా జయిలు వాతావరణము, బిక్కు బిక్కుమను నా చిన్నగది దీనిని మరింతదోహదముచేసెను. నేను జయిలు వెలుపల నున్నచో నీబాధ తాత్కాలికముగనుండెడిది; నేను త్వరితముగ నూతన పరిస్థితులకు సరిపెట్టుకొని యాత్మప్రకటనచేతను క్రియచేతను యుపశాంతిని పొందెడివాడను. జయిలులో నాకట్టి శాంతి లేకపోవుటచే కొన్ని దుర్దినములనుగడిపితిని. అదృష్టవశాత్తు నేనట్టినిరాశనుండి వెంటనే కోల్కొనుచుందును. నేను నామనఃఖేదమునపనయించుకొనుచున్న సమయమున కమల నన్ను దర్శింపవచ్చెను. ఇది నా కపరిమితోత్సాహముకలిగించెను. నా యొంటరితనము పలాయనమయ్యెను. ఏమిజరిగినను, యేమిసంభవించినను మేమిద్దరమున్నారమని నేను భావించితిని.

విరుద్ధభావములు

గాంధీజీని స్వయముగ నెరుగకనతని వ్రాతలను మాత్రమే చదివినవా రతడు సనాతన మనిషియనియు ఛాందసుడనయు "ములకాష్ఠయమరాతి" కలవాడనియు సంతోష సంహారకుడనియు, "ఆపాద మస్తకము కాలాంబరములఁ ధరించి తమనిత్యవిధులను జరుపు మత బోధకుల" వంటివాడనియు భావింపవచ్చును. కాని, యతని వ్రాతలతని కన్యాయముచేయుచున్నవి. వానికంటె నతడు చాల గొప్పవాడు. అతడు వ్రాసినదాని నుదహరించి విమర్శించుట యుక్తము కానేరదు. అతడు ఛాందసజాతికి కేవల వ్యతిరేకి. అతని చిరునవ్వు సంతోషదాయకముగ నుండును. అతనినవ్వు అందరను నవ్వింపజేయును. అత డుత్సాహమును వెదజల్లును. శిశువువలె నతనిలో మనలను మోహింపజేయున దేదియో కలదు.

అత డసాధారణుడు, విపరీత పురుషుడు మహాపురుషులందరు కొంతవరకట్లేయుందురు. దీనులయెడల నతని కెంతటి యపార విచార ప్రేమలున్నను వారిని విధాయకముగ సృష్టించుచు, నలిపివేయుపద్ధతి నతడేల సమర్థించునాయను సమస్య నన్ననేక సంవత్సరములనుండి బాధించుచుండెను. దౌర్జన్యరాహిత్యముపట్ల నతనికెంతరాగమున్నను కేవలము దౌర్జన్యముమీద నిర్బంధములమీద నాధారపడు రాజకీయ సాంఘికనిర్మాణము నత డేల యభిమానింపవలెను ? అత డట్టి పద్ధతి నభిమానించుననుట బహుశః యుక్తము కాకపోవచ్చును. అతడు శాస్త్రసమ్మతమైన యరాజకమును సమర్థించును. కాని, యాదర్శ పూర్వకమగు అరాజకప్రభుత్వ మింకను చాలదూరమున నుండుట చేత దాని నూహించుట సుకరము కాకపోవుటచేత నతడు ప్రస్తుత క్రమములు యంగీకరించును.

ఒక్కొక్కప్పుడతడు తాను సామ్యవాదినని చెప్పుకొనుచుండును. కాని, యతడాశబ్దమునుతనస్వంతభావములోనుపయోగించును. సాధారణముగ సామ్యవాదమని పిలువబడు సాంఘిక నిర్మాణముతో దానికెట్టి సంబంధములేదు. అతని ననుసరించు విఖ్యాతకాంగ్రెసునాయకులు కొందరాపదము నొకవిధమగుపిచ్చి భూతదయాళుత్వమను భావములో నుపయోగింతురు. గాంధీజీ కీవిషయము తెలియునని నేనెరుగుదును. అతడార్థికవిషయములనుగురించి, సామ్యవాదము, మార్క్సిజములనుగురించికూడ చాలపుస్తకములను చదివి, యితరులతో చర్చించెను. కాని ప్రధానవిషయములలో మన సేదానంతటది మనలను ముందుకు తీసికొనిపోజాలదను నా విశ్వాసమంతకంత కభివృద్ధియగుచున్నది. "నీ హృదయము విశ్వసించుటకిష్టపడనిచో నీబుద్ధినిశ్చయముగనిన్నెపుడు విశ్వసింపనీయదు" అని విలియంజేమ్సు చెప్పెను. భావములు సాధారణ దృష్టిని పాలించుచు మనస్సును వశపరచుకొనును. మన సంభాషణలు ఆర్థిక, రాజకీయ, మతవిషయములనుగురించినవి_యేవియైనను నిజముగ నుద్దేశము లేక స్వభావమునిూద నాధారపడును. "మానవుడు తాను సంకల్పించుదానినిచేయగలడు; కాని, యతడు తన యిచ్ఛానుసారము సంకల్పింపజాలడు" అనిస్కొపెన్‌హోర్ చెప్పెను.

దక్షిణఆఫ్రికాలో గాంధీజీలో నొక యకాలపరివర్తనము కలిగెను. ఇది యతనిని పూర్తిగ కదల్చివేసి, యతనిజీవిత దృక్పథమును మార్చివేసెను. అప్పటినుంచి తనభావములకన్నిటికి నతడు స్థిర పునాదులను వేసికొనెను. అతని మనఃకవాటము బంధింపబడెను. నూతన సూచనలనుచేయువారి నతడత్యంతశ్రద్ధతో, ఓర్పుతోవినును; కాని మర్యాదపూర్వకమగు నీ శ్రద్ధ వెనుక కవాటము బంధింపబడినదను భావము ద్యోతకమగుచుండును. కొన్ని భావము లతనిలో స్థిరపడిపోవుటచే నతనికి తక్కినవన్నియు నప్రధానములు. ఇతరములు, ద్వితీయములు నగు విషయములనుగురించిపట్టుబట్టుట ప్రధానస్కీమునుండి దృష్టిని చెదరగొట్టుటయగును; దానిని భంగపరచుటయగును.

ఆ ప్రధానయాధారము వంటిపెట్టుకొని యుండుచో నీ యితరవిషయములును చక్కబడగలవు. పరికరములు సరియైన వైనచో ఫలితము యుక్తము కాక తప్పదు.

ఇదియే యతని భావము వెనుకనున్న ప్రధాన యాధారమని నే ననుకొనెదను. సామ్యవాదమును, ముఖ్యముగ మార్క్సిజమును [దానికి దౌర్జన్యముతో సంబంధముండుటచే] అతడుశంకించును. "తరగతులమధ్య పోరాటము" అనుపదముతే సంఘర్షణను, దౌర్జన్యమును స్ఫురింపజేయును. కనుక నతని చెవిని పడరాదు. ప్రజాసామాన్యము యొక్క జీవితప్రమాణమును (ఒక యతిసామాన్య పరిమితిని మించి) హెచ్చింపవలెనను కోరిక యతనికిలేదు. ఏలనన విశ్రాంతి, యున్నత జీవితప్రమాణముభోగలాలసను పాపమును దోహదముచేయవచ్చును. ఇప్పుడున్న కొద్దిమంది ధనికులే భోగలాలసులుగ నుండుట మంచిది కాదు ఈ సంఖ్య నభివృద్ధిచేయుట మరింత యనర్థము. అతడు 1926 లో వ్రాసిన యొక యుత్తరమునుండి యిట్టి సారాంశము తీయవచ్చును. ఈ దృష్టి సామ్యవాదమునకు, క్యాపిటలిజమునకు కూడ చాల దూరము. నేడు శాస్త్రీయము, పారిశ్రామికవిద్య, స్వప్రయోజనపరుల యుద్ధమే లేనిచో, ప్రతివానికి నన్నవస్త్రములును, యిండ్లను ప్రసాదించి జీవితప్రమాణము నెక్కువగ పెంచగలదని చెప్పుచో దానియందతనికి విశ్వాసములేదు. కొంత మితిదాటినతరువాత నతడా ఫలితములను కోరడు. కనుక సామ్యవాద మతని నాకర్షింపదు. క్యాపిటలిజము కొంతవరకు మాత్రమే సహ్యము. అతడీ రెంటిని ప్రేమింపడు కాని, రెండవది యంత చెడ్డదికాదు. అమలులోనున్న దానిని గుర్తింపవలెను. కనుక ప్రస్తుతము దానిని సహించును.

ఈ భావముల నతని కాపాదించుటలో నేను పొరబడియుండవచ్చును. కాని, యతని తలంపు లీవిధముగ నుండవచ్చునని నేను భావించుచున్నాను. ప్రజలధికసుఖములను, విశ్రాంతిని యాదర్శముగ జేసికొనవలెనని యతడుకోరడు. వారు నైతికజీవితము జీవింపవలెను. దురభ్యాసములను మానివేయవలెను. ఇంద్రియముల నంతకంతకరి

కట్టుచు వ్యక్తిగతముగ, నాధ్యాత్మికముగ వృద్ధిచెందవలెను, ప్రజలను సేవింపదలచినవారు వారి యైశ్వర్యము నెక్కువగ పెంపొందించుట కంటె తామే వారి స్థితికి దిగి వారితో సమానస్థాయిగ కలసిపోవలెను. అట్లుచేయుటచే వారు విధాయకముగ వారి నుద్ధరించుటకు కొంత సాయపడగలరు. అతని ప్రకార మదియే ప్రజాప్రభుత్వము. 1934 సెప్టెంబరులో నతడొక స్టేటుమెంటులో నిట్లు చెప్పెను. "నా కెదురా డుటకు చాలమంది నిస్పృహ చెందిరి. జన్మతః ప్రజాప్రభుత్వవాదినైన నా కిది యవమానకరవిషయము. మానవలోక దరిద్రులతో పూర్తిగ నైక్యభావమునొందుట, వారికంటె నధికముగ జీవింపవలెనను కోరిక లేకపోవుట, యటిస్థితికొంకు బుద్ధిపూర్వకముగ యథాశక్తి ప్రయత్నముచేయుట ప్రజాప్రభుత్వార్హమగునెడల నేనా యధికారమును కలిగియున్నాను."

ఆధునిక ప్రజాప్రభుత్వవాది, సామ్యవాది, లేక క్యాపిటలిస్టు, యీ వాదమును, యీదృష్టిని అంగీకరింపడు. కాని, ప్రాచీన మత దృష్టికలవాడు దీనిని కొంత యంగీకరింపవచ్చును. ఉభయులు భూత భావబద్ధులై గతకాలపక్కిలోనే భావించుచుందురు? వర్తమానమెట్లు న్నది? ముందేమిరానున్నది ? అని యోచించుటకంటె వారెక్కువగ జరిగినదానిని గురించియే యోచించెదరు. ఈ రెండు మానసిక ప్రేరణలమధ్యను ప్రపంచములో నపారభేదముగలదు. పాతప్రపంచములో ప్రజాసామాన్యయైశ్వర్యము నభివృద్ధిచేయుట కష్టసాధ్యముగనుండెను. బీదలెప్పుడును మనతోనుండిరి. అప్పటికొద్దిమంది ధనికులు సాంఘిక వ్యవస్థలో ప్రధానభాగమయిరి: ఉత్పత్తిపద్ధతికి వారవసరమైరి. కనుక ధర్మబోధకుడు, సంస్కారప్రియుడు సూత్రబుద్ధిపీరినంగీకరించి బీదల యెడల పీరు చేయవలసిన ధర్మములను గుర్తింపచేయుటకు ప్రయత్నించిరి. పీరుబీదలకు ధర్మకర్తలుగ నుండవలెను; దయకలిగియుండవలెను. మతము దయ నొక పుణ్యకార్యముగ విధించెను. పెద్ద భూఖామందు, క్యాపిటలిస్టు, ఫ్యూడల్ ప్రభువు పీరందరు ధర్మకర్తలను భావమును గాంధీజీ యెప్పుడు పోషించుచుండును. అతడు మతప్రవక్తల చిరపరం

వర ననుసరించును. "ధనికులు సర్వేశ్వరుని సేవకులు. అతని యైశ్వర్య సంరక్షకులు; దానిని పంచిపెట్టుటకు నియమింపబడినవారు. ఏసు స్వయముగ బీదలనిధిని వారికి వప్పగించెను." అని పోప్ చాటెను. ప్రజాబాహుళ్య మెరిగిన హిందూమతము, ఇస్లాముకూడ ధనికులను దానధర్మములు చేయవలెనని యెప్పుడును బోధించుచున్నవి. వారు దేవాలయములను, మసీదులను, ధర్మశాలలను నిర్మించుచు తమ విభవమునుండి కొన్ని కానులను, రూకలను బీదల కిచ్చుచు పుణ్యాత్ములైనట్లు భావించుచుందురు.

ఈ మతదృష్టి పాతప్రపంచదృష్టి. అప్పటి దుఃఖమునుండితప్పించుకొనుటకు పరలోకమురానున్న దనునాశయొక్కటియేగత్యంతరము. కాని. పరిస్థితులుమారి మానవయైశ్వర్యము పూర్వమెన్నడు నూహింపబడనివిధమున నేడు పెరిగినను ఈ ప్రాతకాలపు పట్టువిడువదయ్యెను. ఇప్పు డనిశ్చితములు గణింప శక్యముకానివియగు కొన్నియాధ్యాత్మిక ప్రయోజనము లెక్కువగపేర్కొనబడుచుండును. క్యాథలిక్ మతస్థులు పన్నెండు, పదమూడు శతాబ్దములు క్రైస్తవమత కృతయుగమని భావింతురు. అప్పుడు ఋషులు వర్థిల్లిరి. క్రైస్తవరాజులు ముస్లిముల మీద మతయుద్ధములను సల్పిరి. గాథిక్ దేవాలయములు విస్తరిల్లెను. వారి ప్రకారమది "మధ్యయుగపుగ్రామసంఘములయాజమాన్యమున యనుభవింపబడిన యదార్థక్రైస్తవ ప్రజాపాలనము. అంతకుమునుపు తరువాత నట్టిది యనుభవింపబడలేదు." ముస్లిములు మొదటిఖాలిఫుల నాటి "ఇస్లాం ప్రజాపరిపాలనము" వైపు విజయవంతములగు వారి యద్భుతజీవితములవైపు ఆతురతతో తిరిగిచూచుచుందురు. అశ్లేహిందువులు వైదిక, పురాణయుగములవైపుచూచుచు "రామరాజ్యము"ను గురించి కలలను గనుచుందురు. అయినను ఆ రోజులలో ప్రజాసామాన్యమంతయు తిండిలేక, జీవితమునకు కావలసిన కనీసపు అవసరములైనను లేక నల్లాడిరనిచరిత్రయంతయు మనకు తెలుపుచున్నది. పైనున్న యేకొద్దిమందియో తగిన విశ్రాంతి, యుపపత్తియు కలవారు, ఆధ్యాత్మిక జీవితమును గడిపియుండవచ్చును. తక్కినవారందరు కేవల

యుదరపోషణకొరకే బాధపడిరి. ఆకలి చిచ్చుతో బాధపడువానికి విజ్ఞానాభివృద్ధి, ఆధ్యాత్మికాభివృద్ధి యసంభవములు; అతని భావములన్నియు నాహారముమీదను దానిని సంపాదించు విధానముమీదను కేంద్రీకరింపబడియుండెను.

పారిశ్రామికయుగము మనకండ్ల కధికముగ కాన్పించు ననేక, కానుకలను తెచ్చిపెట్టెను కాని, ప్రపంచమునంతను సమగ్రముగ ముఖ్యముగ నెక్కువపరిశ్రమమయము గావింపబడిన దేశములను తీసికొనినచో నది యాధ్యాత్మిక, విజ్ఞానాభివృద్ధుల నెక్కువసంఖ్యాకులకు సుకరముచేయునట్టి యైశ్వర్యపునాదులను నిర్మించెననుసంగతి మనము మరచిపోలేము. ఇదిహిందూదేశములోను, ఇతర వలసదేశములలోను యెక్కువగ కాన్పించదు. ఏలనన మనము పరిశ్రమలవలన నెక్కువలబ్ధి పొందలేము. వానివలన మనము కొల్లగొట్టబడితిమి; అనేక విధముల యైశ్వర్యములో నంతకంటె నెక్కువగ విజ్ఞానములో ఆధ్యాత్మికముగ మరింత యధోగతికి పోతిమి. ఈదోషము పరిశ్రమలదికాదు; పరప్రభుత్వమే దీనికి కారణము. హిందూదేశములో పాశ్చాత్యవిజ్ఞాన మని పిలువబడునది, తాత్కాలికముగ, బానిసత్వమును బలపరచెను: అది మన సమస్యలను పరిష్కరించుటకు బదులువానినిమరింత పెద్దచేసెను.

అది మన దురదృష్టము. ఇది ప్రస్తుత ప్రపంచమును గురించిన మనదృష్టిని మలినముచేయగూడదు. ప్రస్తుతపరిస్థితులలో నుత్పత్తిపద్ధతికిలేక సంఘముకంతకు ధనవంతుడవసరమైనవాడు, లేక వాంఛనీయుడు కాడు. అతనికాలము చెల్లెను: అతడిప్పుడు నష్టమువచ్చుచున్నాడు ధనికులను దయగలిగియుండవలసినదనియు, బీదలనుతమదుస్థితికికృతజ్ఞతను చూపుచు పొదుపుగలిగి సత్ప్రవర్తన గలిగి యుండవలెననియు బోధించు పాత పురోహితధర్మమున కికనర్థములేదు. మానవునిసంపద యద్భుతముగ పెరిగెను: అది ప్రపంచసమస్యల నెదుర్కొని పరిష్కరించుకొనగలదు. ధనవంతులలో చాలమంది యితరులను పీడించువారైరి. ఇట్టి జాతియొక్కయునికి కేవలమునష్టమేకాక మానవసంపద నమితముగ వ్యర్థముచేయుట యగును. ఈజాతివారిని ప్రత్యక్షముగదోహదము

చేయుపద్ధతి కృషి, యుత్పత్తులను వారించి యురువంశలను - యితరుల కృషిమీద జీవించువారిని పనిలేక మాడిపోవువారిని-కృషిలేనివారిని ప్రోత్సహించును. కొంతకాలముక్రిందట గాంధీజీయే యిట్లువ్రాసెను. 'పనిలేక మాడుచున్నట్టిప్రజలకు భగవంతుడు కృషిరూపమునను చేసిన పని కాహారరూపమునను చూపురూపమొక్కటియే యంగీకృత మగును - ఆహారముకొరకు కృషిచేయుటకే భగవంతుడు మానవుని సృజించి కృషిచేయకుండ మెక్కెడువారు దొంగలని చెప్పెను.'

గత సమస్యలులేని యిప్పుడు పురాణపద్ధతులను, సూత్రములను ప్రయోగించి, యప్రస్తుత పదజాలము నుపయోగించి యాధునిక ప్రపంచ క్లిష్టసమస్యల నర్థముచేసికొన ప్రయత్నించుట విఫలతకు, గందరగోళమునకు కారణము. స్వంతఆస్తి ప్రపంచముయొక్క ప్రధాన భావములలో నొకటియని కొంతమంది తలంపు. కాని, స్వంత ఆస్తి యనుభావమే యెప్పుడును మారుచుండెను. ఒకప్పుడు బానిసలు ఆస్తి యైరి. అట్లే స్త్రీలను పిల్లలును, వధువు ప్రథమరాత్రిమీద ప్రభువుకు గలహక్కు, రోడ్డులు, దేవాలయములు, వంతెనలు, బల్లకట్టులు, గాలి, భూమి-స్వంత ఆస్తియయ్యెను. పశువులిప్పటికి ఆస్తి యగుచున్నవి. కాని, యనేకదేశములలో యజమానుల హక్కులు చట్టములచేనియమింపబడెను. యుద్ధకాలములో ఆస్తిహక్కులు తుడిచివేయబడును. నేడు ఆస్తియంతకంతకు వస్తురూపమును వీడుచున్నది. వాటాలు, పరపతిమొదలగునవి యాస్తియగుచున్నవి. ఆస్తినిగురించిన భావము మారినకొలది ప్రభుత్వముయొక్క పజోక్యము కల్పించుకొనును ప్రజాభిప్రాయముకోరుటచేచట్టము ఆస్తికల యజమానులయొక్క యరాజకమైన హక్కులను నిరోధించును. సర్కారుతో ఆస్తికలిపివేయుటవంటి స్వభావముగలయనేకవిధ హెచ్చుపన్నులుప్రజాశ్రేయస్సుకొరకువ్యక్తిగతములగు స్వంతయాస్తియొక్క హక్కులను మ్రింగివేయును. ప్రజాశ్రేయస్సు పబ్లికునీతి కాధారమగును. తన స్వంత యాస్తిహక్కులను రక్షించుకొనుటకైనను మనమీప్రజాశ్రేయస్సుకు వ్యతిరేకముగనాచరింపరాదు. ఇంతకు వెనుకకాలములో ప్రజలలో నధికసంఖ్యాకులకు

ఆస్తినుంచుకొను హక్కులే లేవు. వారే ఇతరులచే పొందబడిన యాస్తి స్వైరి. నేడుకూడ కొద్దిమందికే యట్టిహక్కులు కలవు. స్వార్థప్రయోజనములను గురించి మనమెక్కువగ విందుము ! నేడొక నూతన స్వార్థప్రయోజనము గుర్తింపబడుచున్నది. ప్రతిపురుషుడు, ప్రతి స్త్రీ జీవించుచు, కృషిచేసుకొనుచు తమకృషిఫలితముల ననుభవింపవలెను. మార్పుచెందునట్టి యీ భావములచేత ఆస్తి, పెట్టుబడి నశించిపోవు. అవి విస్తరింపచేయబడును; కేంద్రీకరింపబడుటచే నవి కొద్దిమందికి ప్రసాదించిన నధికార మిపుడు సంఘపరమగును.

గాంధీజీ వ్యక్తినాంతరంగికముగ, నైతికముగ నాధ్యాత్మికముగ నభివృద్ధిపరచి తద్వారా బాహ్యావాతావరణమును మార్చగోరును. ప్రజలు దురభ్యాసములను, విషయలోలతను మాని పవిత్రులు కావలెను. అతడు బ్రహ్మచర్యము కావలెనను; చుట్టలు, మత్తుపదార్థములు మద్యపానము మొదలగువానిని మానవలెను. ఈ దురభ్యాసములలో నేది యెక్కువ యుపద్రవకరమను విషయమున భేదాభిప్రాయములుండ వచ్చును. కాని, వ్యక్తిగతముగ చూచినను, అంతకంటె నెక్కువగ సాంఘికముగను, లోభము, స్వార్థము ఆర్జించవలెనను కోరిక, స్వలాభము కొరకు వ్యక్తులు భయంకర పోరాటములను సలుపుట, తరగతులు వర్గములు క్రూరముగ కొట్లాడుకొనుట, ఒక వర్గము మరియొక వర్గమును నిర్దయాత్మకముగ నణచి వేసి కొల్లగొనుట, జాతుల ఘోరసంగ్రామములను చేయుచుండుట వీటికంటె నీ వ్యక్తిగతదోషములు తక్కువ యుపద్రవకరములనుటకు సందేహముకలదా! బలవంతులు దుర్బలులను కొట్టుకొనితిన వలెనను చట్టమును వెనుకటివలెనే "శక్తికలవారు తీసికొనెదరు, సమర్థతగలవారు ఉంచుకొనెదరు" అను నాశయమునుగల ప్రస్తుత దురాశాగ్రస్తసంఘములో నివి సహజముగ లేవా? నేటిస్వలాభాపేక్షవిధాయకముగ పోరాటము కలిగించుచు ఈ పద్ధతియంతయు మానవునిలో నున్న దోచుకొను స్వభావమున కన్ని యవకాశములను, రక్షణను ఇచ్చును ఇది కొన్ని చక్కని స్వభావములను ప్రోత్సహించుననుటకు సందేహములేదు; కాని, యంతకంటె నెక్కువగ మానవుని నీచస్వభా

వముల కాస్పదమయ్యెను. విజయమనగా నితరులను కూల్చివేసి, యా కూలిన వారిపై స్వారిచేయుట. సంఘవిరాయుద్దేశ్యములను, కోరికలను ప్రోత్సహించుచు మనలోనున్న యుత్తములను పీనికాకర్షించుచో నిట్టి వాతావరణములో గాంధీజీ తన యాదర్శమును – నైతికమానవుని – సాధింపగలడని యోచించునా? అతడు సేవాతత్త్వము నభివృద్ధిచేయ గోరును. అతడు కొందరువ్యక్తుల సందర్భములో సఫలతనొందవచ్చును: కాని, సంఘము అర్జనచేయు సంఘములోనున్న విజేతల నాదర్శముగ జూపునంతకాలము, స్వలాభమును ప్రధానోద్దేశ్యముగ నుంచునంత కాల మధిక సంఖ్యాకులగు ప్రజ లీపద్ధతినే యనుసరింతురు.

కాని యిప్పటి సమస్య కేవల నైతికబోధకు, ధర్మబోధకు చెందినదికాదు. అది ఆచరణకు తేలవలసిన నేటి యత్యవసర సమస్య. ప్రపంచమంతయు నాశాశూన్యమగు గందరగోళములో మునిగియుండుటచే నేదో యొక తరుణోపాయము కనిపెట్టవలెను. అజగరమువలె మనమేదియో జరుగునని కనిపెట్టుకొని యుండజాలము మనము క్యాపిటలిజము, కమ్యూనిజ్జము, సామ్యవాదము మొదలగు వానిలోనున్న చెడ్డలను విమర్శించుచు ప్రాచీనములు, నవీనములునగు నన్నిపద్ధతులలోని యుత్తమ లక్షణములను సమన్వయపరచు కళ్యాణప్రదమగు మధ్యమార్గముకొరకు వ్యర్థముగ నాశపడుచు కేవల 'నాస్తి' భావముతో జీవింపజాలము. వ్యాధినిబట్టి చికిత్సను ప్రయోగింపవలెను. జాతీయముగ, నంతర్జాతీయముగ కూడ మన మున్నచోటనే నిలిచిపోజాలమనుసంగతి ధృవము: అతి ధృవము. మనము వెనుకకు పోవుటకు ప్రయత్నింపవచ్చును లేక ముందుకు పోవచ్చును. వెనుకకు పోవుట యనూహ్యము కనుక ముందుకు పోకతప్పదు.

అయినను గాంధిజీయొక్క యనేక కార్యము లత డతిసంకుచితాధికారముల సమర్థించుచున్నాడని భావించుటకవకాశమిచ్చును. అతడు స్వయంకృషిమీదనే యాధారపడు జాతినేగాక గ్రామమును కూడ సృష్టింపగోరును. ప్రాచీనసంఘములలో గ్రామముకొంచెమించుమించు తనపైననే యాధారపడి యన్న, వస్త్రములనిచ్చెను: ఇతరవిధముల

దాని యవసరములను చేకూర్చెను; అనగా విధాయకముగ నదిచాల తక్కువజీవితప్రమాణము. గాంధీజీ దీనిని శాశ్వతలక్ష్యముగ భావించుచున్నాడని నేననుకొనను; ఇది యసాధ్యలక్ష్యము. నేటివిశేష జనసంఖ్య కొన్ని దేశములలో జీవించుటకూడ దుర్ఘటమగును; వారి దుర్భిక్షమునకు, కాటకమునకు మరలుట కంగీకరింపరు; గ్రామపరిశ్రమల నభివృద్ధి చేయుటవలన హిందూదేశమువంటివ్యవసాయక దేశములో (మన ప్రస్తుత ప్రమాణమతితక్కువగనున్నది) ప్రజాసామాన్యములో కొద్ది అభివృద్ధి కలుగవచ్చును. కాని ప్రతి యితర దేశమువలెనే మనమును తదితర ప్రపంచముతో బంధింపబడితిమి. మనము దీనిని త్రెంచుకొనుటయసాధ్యమని నాకు తోచుచున్నది. కనుక మనము ప్రపంచదృష్టితోనే భావింపవలెను. ఈ దృష్టిలో సంకుచితమైన యార్థిక నిరంకుశత్వమునకు తావులేదు. వ్యక్తిగతముగ నాకిది వాంఛనీయముగ కాన్పించదు

మనకు సాధ్యమగు నేకైక పరిష్కారమునే మనము విధాయకముగ స్వీకరింపవలెను. సామ్యవాద క్రమమును స్థాపింపవలెను. దీనిని మొదట మనదేశ సరిహద్దులలోను తరువాత ప్రపంచమంతట స్థాపింపవలెను. ప్రజాశ్రేయస్సుకొరకు ఐశ్వర్యోత్పత్తిని పంపకమును నియమింపవలెను. దీనినెట్లు సాధింపవలెననునది వేరువిషయము. కాని, ప్రస్తుతక్రమమువలన లబ్ధిపొందు కొందరియభ్యంతరములవలన జాతి, లేక మానవకళ్యాణము నాపుచేయరాదని స్పష్టమగుచున్నది. అట్టి పరివర్తనమునకు రాజకీయ, సాంఘిక సంస్థలడ్డముతగులుచో వానిని తొలగింపవలెను; వాంఛనీయము, ఆచరణీయము నగు పై యాదర్శమును బలివేసి వానితో రాజీపడుట నమ్మికస్వామిద్రోహము. అట్టి పరివర్తనము కొంతవరకు ప్రపంచ పరిస్థితులచే త్వరితముచేయబడవచ్చును. బలవంతము చేయబడవచ్చును. కాని, ప్రజాసామాన్యముయొక్క మనఃపూర్వకాంగీకారము లేనిచో నది స్థాపింపబడజాలదు. కనుక వారిని దీనివైపు త్రిప్పుకొనవలెను; మార్చవలెను. కొద్దిమంది దౌర్జన్యయుతమగు కుట్రలవలన లాభము లేదు. ప్రస్తుత పద్ధతివలన లాభములను పొందినవారిని మార్చుటకుకూడ సహజముగ ప్రయత్నములను సలుపవలెను.

గాంధీజీ ప్రత్యేకముగా నభిమానించుఖాదీయుత్పత్తివిధానము
వ్యక్తికి యతిశయము నిచ్చుచున్నది. కనుక నిదిపారిశ్రామికయుగము
కంటె వెనుకకు తీసికొనిపోవును. ప్రస్తుతమే ప్రధానసమస్యాను పరిష్కరించుటకు
నిది పనికిరాదు. ఇది యుచితమార్గమున నభివృద్ధి చెందుట
కడ్డమువచ్చు బుద్ధిని కలిగించును. అయినను తాత్కాలిక సోపానముగ
నిది యొకప్రయోజనమును నెరవేర్చునని నేను విశ్వసించెదను. ప్రభు
త్వము దేశమునంతకు చెందు వ్యవసాయ, పారిశ్రామిక సమస్యలకు
యుక్తపరిష్కారమును చేయువరకు నిది సహాయకారిగనే యుండ
వచ్చును. హిందూదేశములో భయంకరమైననిరుద్యోగసమస్యకలదు,
అంతకంటె నెక్కువగ గ్రామములలో కొంతకాలము పనిలేకపోవుట
కలదు. ఈ స్థితిని పోగొట్టుటకు ప్రభుత్వమెట్టిప్రయత్నముచేయలేదు.
పూర్తిగ పనిలేనివారికి, కొంతవరకు పనిలేనివారికి, ఖాదీ ఆర్థికముగ
కొద్దిసహాయము చేసెను. ఈయభివృద్ధి తమ స్వప్రయత్నములచే కలు
గుటవలన నది వారి యాత్మగౌరవమును పెంచి, కొంతవిశ్వాసమును
కలిగించెను. దీనివలన కలిగిన మానసికఫలిత మత్యద్భుతమైనది:
ఖాదీ, గ్రామపట్టణముల మధ్యగల యంతరువును కొంతవిజయముతో
నయముచేయ ప్రయత్నించెను. అది రైతాంగమును మధ్యతరగతి
విద్యాధికుని దగ్గరకు తెచ్చెను. చూచువానిమీదను, ధరించువాని
మీదను వస్త్రములకొక విశేష మానసిక ఫలితము కలదు. మధ్యతర
గతులవారు నిరాడంబరమైన తెల్లని ఖద్దరుదుస్తులను ధరించుటవలన
వారిలో సరళత కలిగెను: డాంబికము, పామరత్వము తగ్గిప్రజాసామా
న్యముతో నైక్యభావము కలిగెను. మధ్యతరగతులలోని క్రిందితరహా
వారు ధనవంతుల ననుకరించుట మానివేసిరి: తమ చౌకదుస్తుల కవ
మానపడుట మానివేసిరి. నిశ్చయముగ వారుగౌరవమునుపొందుటయే
గాక నింకను చీనిచీనాంబరములను ధరించువారికంటె నధికులమని
భావించిరి. అతిదరిద్రుడుకూడ నీ యాత్మగౌరవమును కొంత యనుభ
వించెను. ఖద్దరుధారులైన గొప్పసమూహములో దరిద్రునిధనవంతుని
కనిపెట్టుట కష్టసాధ్యము: ఒక విధమగు సౌభ్రాతృత్వముకూడ వృద్ధి

పొందెను. నిస్సందేహముగ ఖాదీ ప్రజాసామాన్యమును చేరుటకు కాంగ్రెసునకు సహాయముచేసెను అది జాతీయస్వాతంత్ర్య చిహ్నమయ్యెను.

యంత్రయజమానులు తమవస్త్రముల ధరలను పెంచకుండ ఖాదీ వారింపగలిగెను విదేశపోటీ, ముఖ్యముగ లాంకషైరుపోటీ, లోగడ యీపనిచేసెడిది ఈపోటీ తగ్గుటతోడనే (ప్రపంచ యుద్ధసమయమున జరిగినట్లు) భారత దేశములో బట్టలధరలు విపరీతముగ పెరిగి మిల్లులు విశేషలాభములను పొందెడివి. స్వదేశీ యుద్యమము, విదేశవస్త్రబహిష్కారము యీ మిల్లుల కెక్కువగ తోడ్పడెను, కాని ఖద్దరుయొక్క యునికివలన యదిలేనిచో ధరలు పెరుగునట్లు పెరుగుటకు వీలులేకపోయెను. మిల్లులు నిశ్చయముగ ముతకగుడ్డలను తయారుచేసి ప్రజలయొక్క ఖాదీయభిమానము కొల్లగొనెను. మరియొక యుద్ధము వంటి యత్యవసరస్థితి కలిగినచో భారతమిల్లు యజమానులు 1914 లగాయతు ప్రజలను కొల్లగొనినట్లిప్పుడు చేయుటకు వీలులేదు. ఖాదీ యుద్యమము దీనిని వారించును: కొద్దికాలపు నోటీసులో విస్తరింపగల శక్తి ఖాదీకిగలదు.

హిందూదేశములో ఖాదీకి ప్రస్తుత మిన్ని యవకాశములున్నను నది తాత్కాలిక వ్యవహారము. తరువాతకూడ నిది విశేష ఆర్థిక మార్పును సుకరముచేయు నుపవృత్తిగనుండవచ్చును. కాని, భవిష్యత్తులో ప్రస్తుత వ్యవసాయపద్ధతి యంతయు తారుమారు కావలెను: పరిశ్రమ లభివృద్ధికావలెను. భూమి సమస్యనుగురించి కళ్ళనీళ్ళుతుడుచు అతుకుల పనివలనను, లక్షలకొలది రూపాయలను వెచ్చించి చిన్న చిన్న పైపైమార్పులను సూచించు కమీషనువలనను లాభములేదు. ప్రస్తుత భూమిపద్ధతి మన కండ్లయెదుటనే కూలిపోవుచున్నది. అది యుత్పత్తికి, పంపకమునకు పెద్దయెత్తున జరగవలసిన సహేతుక కార్యముల కాటంకముగనున్నది. చిన్నచిన్న ఖండములను సేద్యముచేయుట యంతరింపవలెను. సాముదాయిక సహకారవ్యవసాయపద్ధతి ప్రవేశపెట్టవలెను. ఈ విధముగ తక్కువ ప్రయత్నముతో విశేషోత్పత్తిచేయు గొప్ప మార్పుమాత్రమే యాధునిక పరిస్థితులకు పనికివచ్చును.

భూమియే పైన ప్రజలకందరకువృత్తినీయదు, యివ్వజాలదు. పెద్దయెత్తు మీాద జరుగు వ్యవసాయమువలన (గాంధీజీ భయపడునట్లు) వ్యవసాయ పనివాండ్ర యవసరము చాలవరకు తగ్గిపోవును. తక్కినవారు, కొంత వరకు, చిన్నయెత్తుమీాద జరుగు పరిశ్రమలను ప్రధానముగ పెద్దయెత్తు మీాద జరుగునట్టి సంఘమునకు చెందచేయబడు పరిశ్రమలను, సాంఘిక సేవలను చేబట్టవలెను.

ఖాదీ యనేక ప్రాంతములలో కొంతయువశాంతిచేకూర్చెను. కాని, ఈ విజయములోనే యుపద్రవబీజములున్నవి. అది నశించి పోవుచున్న రైతు భూమిపద్ధతికి సహాయపడుచు నంతవరకు శ్రేష్టమైన పద్ధతికి కావలసినమార్పుల నాలస్యముచేయుచున్నది ఈ ఫలితమంత గొప్పదికాకపోయినను దీనిస్వభావము పోలేదు. కౌలుదారుకు లేక తన కొద్దిస్వంతభూమిచేసుకొనువానికి మిగులున దతిస్వల్పము. అతని హీనజీవితమును గడుపుటకుకూడ నదిచాలదు ఆకొద్దిరాబడికితోడుగ నతడు మరిదేనినోయితరత్ర చూచుకొనవలెను లేదా పన్ను, శిస్తులను చెల్లించుట కతడు మరింతఋణముచేయవలెను. కనుక పైగావచ్చు ఈ యాదాయము ప్రభుత్వమునకో, భూఖామందుకో చెల్లిపోవును. ఇది లేనిచో వారిట్లుచేయజాలరు. పైగావచ్చు ఈ యాదయము కన్నె క్కుగా నుండునంతయున్నచో పన్ను హెచ్చింపబడిదానినికూడమ్రింగి వేయవచ్చును. ప్రస్తుత పద్ధతిలో కవులుదారుయొక్క తదితరపాటు, పొదుపరితనము చివరకు భూఖామందుకే లాభముచేయును.

గాంధీజీ గ్రామపరిశ్రమల నుద్ధరించుటకు జేయు ప్రయత్నము ఖాదీ ప్రోగ్రామును మరింత విస్తరింప జేయుటయేయగును. అది వెంటనే సత్ఫలితము నిచ్చును ఇందులో కొంత శాశ్వతము, కొంత తాత్కాలికము కావచ్చును. తన ప్రస్తుత దుర్భరస్థితిలో నది గ్రామస్తునకు సహాయముచేయును; చచ్చిపోవుటకు సిద్ధముగనున్న కొన్ని విజ్ఞాన, కళాధిక్యతలను పునరుద్ధరింపవచ్చును. కాని, యది యంత్రములమీాద యంత్రపరిశ్రమలమీాద తిరుగుబాటుగ నున్నంతవరకు జయింపజాలదు. గ్రామపరిశ్రమలనుగురించిహరిజనపత్రికలో నత డొక వ్యాసమున నిట్లు

వ్రాసెను. "కావలసిన పనిచేయుటకు తగినంతమంది జనం లేనపుడు యంత్రములు మంచివి. హిందూదేశములోవలె పనిచేయువారవసరముకుమించి యున్నచోట నది చెడుగు పరిణమించును. మనగ్రామములలోని కోట్లకొలది జనముకు తీరికకలిగించుటెట్లు యనునది మన సమస్యకాదు. సంవత్సరములో నారుమాసములువనిలేక యుండువారి కాలము నుపయోగించుటెట్లు? అనునదియేసమస్య. నిరుద్యోగమువలన బాధపడు నన్నిదేశములకు నీయభ్యంతరముండును దోషము వనిలేకపోవుటలో లేదు. ప్రస్తుత లాభసాటి పద్ధతిలో పనిచేయించుటవలన యజమానులకులాభములేదు. చేయవలసినవని కావలసినంతయున్నది. రోడ్లు,పంటకాలువలనుత్రవ్వుట, యిండ్లుకట్టుట పారిశుధ్యమును వైద్యసహాయమును, పరిశ్రమలను విద్యుత్తును, సాంఘిక, వైజ్ఞానిక సేవలను, విద్యను-వ్యాప్తిచేయవలెను. ప్రజల కిప్పుడులేని ముఖ్యావసరములగు యనేక వస్తువులనుసరఫరాచేయవలెను. లక్షలకొలదిప్రజలు రానున్న యేబదిసంవత్సరములవరకుకష్టపడి పనిచేయవచ్చును. కాని సంఘము దాని నందరిశ్రేయస్సుకొరకుసంఘటింపజేసి వ్యక్తిలాభముకాకసాంఘికాభివృద్ధిని లక్ష్యముగ చేసినపుడుమాత్రమే యిది పనిచేయును. రష్యాలోని సోవియట్ యూనియనులో (ఇతరలోపములేవియున్నను) నిరుద్యోగము నశించెను. పనిలేకపోవుటచే మన ప్రజలు సోమరులుగ లేరు. పనిచేయుటకు, విజ్ఞానాభివృద్ధికి తగిన సౌకర్యములను కలిగించకపోవుటచే వారట్లున్నారు.

గాంధిజీ రాట్నమును, ఖదురును అభివృద్ధిచేయుటకు, వాటియుత్పత్తి శక్తిని పెంపుచేయుటకు యత్నించి కొంత విజయము బడసెను. అది యంత్రమును, పరికరమును అభివృద్ధిచేయుట కొక ప్రయత్నము. ఈ యభివృద్ధి సాగుచో (గృహపరిశ్రమలనువిద్యుత్తుతో పనిచేయవచ్చును) స్వల్పలాభసమస్య తిరిగి తలయెత్తును; అది యనవసర యుత్పత్తిని నిరుద్యోగమును కలిగింపవచ్చును. ఏదోయొక యాధునిక పారిశ్రామిక శాస్త్రమునకుసంబంధించినచో గ్రామపరిశ్రమలు నేడుమనకుముఖ్యావసరములైన భౌతిక, వైజ్ఞానిక వస్తువులనుకూడ ప్రసాదింపజాలవు. అవి

యంత్రముతో పోటీచేయజాలవు. మన దేశములో పెద్దయెత్తు యంత్ర కృషి నాపివేయుట వాంఛనీయమా? అదిసాధ్యమగునా? కేవలయంత్రములకు తాను వ్యతిరేకి కాడని గాంధిజీ యనేకసార్లు చెప్పెను; అవి హిందూదేశములో నేడప్రస్తుతములని యతడు భావించునట్లు కాన్పించును. కాని, యినుము, ఉక్కు మొదలగు మూలపరిశ్రమలను, లేక నిదివరకే దేశములోనున్న తేలికపరిశ్రమలను మనముకట్టిపెట్టగలమా?

మనమట్లు చేయజాలమనుట స్పష్టము. రైల్వేలు, వంతెనలు, సామానుల రాకపోకల సౌకర్యములు మొదలగునవి మన కున్నప్పుడు మనమైనను వాని నుత్పత్తిచేయవలెను; లేదా యితరులపైనాధారపడవలెను. మన రక్షణకు పరికరములు కావలసినచో మనకు మూలపరిశ్రమ లేకాక చాల యభివృద్ధిచెందిన యంత్రపారిశ్రామిక పద్ధతికూడ కావలెను. నేడు యే దేశము పారిశ్రామికాభివృద్ధి లేనిచో యదార్థ స్వాతంత్ర్యము ననుభవింపజాలదు; ఇతరులదాడులనుండి రక్షించుకొనజాలదు. ఒక మూల పరిశ్రమను బలపరచుటకు, పూర్తిచేయుటకు,మరియొకటి యుండవలెను. చివరకు యంత్రములను తయారుచేయు పరిశ్రమయే యుండవలెను. ఈ మూలపరిశ్రమలన్నియు పనిచేయుచున్నపుడు తేలిక పరిశ్రమలు విధాయకముగ వ్యాప్తిచెందవలెను. ఈవిధానమాగుటకు వీలులేదు. మన భౌతిక, వైజ్ఞానికాభివృద్ధియే గాక మన స్వేచ్ఛకూడ దీనితో బంధింపబడియున్నది పెద్దపరిశ్రమలు వ్యాపించిన కొలది చిన్నయెత్తు గ్రామపరిశ్రమలు వాని పోటీకి తాళజాలవు. సామ్యవాదపద్ధతిలో వాటికి కొంత యవకాశముండవచ్చును; కాని పెట్టుబడిదారుల పద్ధతిలో నసలేయుండదు. సామ్యవాదపద్ధతిలోకూడ నవి పెద్దయెత్తున యుత్పత్తిచేయబడిన ప్రత్యేక వస్తువులను తయారుచేయు గృహపరిశ్రమలక్రింద మాత్రమే యుండగలవు.

యంత్ర పరిశ్రమలనుజూచి కొంతమంది కాంగ్రెసునాయకులు భయపడుదురు; వారు పారిశ్రామిక దేశములోనున్న ప్రస్తుత కష్టములన్నియు బాహుళ్యముమీాద జరుగు యుత్పత్తివల్లనే కలుగుచున్నవని యూహింతురు: అది పరిస్థితిని విపరీతముగ నర్థముచేసికొనుటయగును.

ప్రజలకేదికావలెనో దానిని చాలినంత విరివిగ తయారుచేయుట దోషమా? విశేషోత్పత్తి చేయకుండ వారిని లేమిలో నుంచుటయే యుక్తమా? ఉత్పత్తిచేయుటలో దోష మేమియులేదు; దానిని పంచి పెట్టు విధానములో దోషము కలదు; అది సమర్థమైనది కాదు.

మన వ్యవసాయము ప్రపంచ పణ్యారంగముపై నాధారపడి యుండును. గ్రామపరిశ్రమల నభివృద్ధిచేయగోరువా గీకష్టము నెదు ర్కొనవలెను. వ్యవసాయదారు వర్తకముకు కావలసిన పంటలను పండించి, ప్రపంచధరలపై నాధారపడవలెను. ఈ ధరలు మారుచుండ నతడు శిస్తు, లేక పన్ను రొక్కరూపములో చెల్లింపవలెను. అతడీ సొమ్ము నెట్లో యార్జించవలెను. కనుక మంచిధర వచ్చునని యతనికి తోచుపంటనే యతడు పండించును. ఆహారవిషయములోకూడ నత నికి నతని కుటుంబమునకు సరిపడుదాని నతడు పండింపజాలడు.

అపరదినుసులయొక్కయు,నితరవ్యవసాయవస్తువులయొక్కయు, ధరలు పడిపోవుటచే లక్షలకొలది వ్యవసాయదారులు, ముఖ్యముగ బీహారులోను, యు. పి. లోను హఠాత్తుగ చెఱకుపంట ప్రారంభిం చిరి. పంచదారమీద పన్ను వేయుటచే పంచదార ఫ్యాక్టరీలు కుక్క గొడుగులవలె తలయెత్తెను. చెఱకు విశేషముగ కావలసివచ్చెను. కాని, త్వరలోనే యవసరముకంటె సప్లయి యెక్కువయ్యెను. ఫ్యాక్టరీ యజమానులు వ్యవసాయదారులను నిర్దాక్షిణ్యముగ కొల్ల గొనిరి. ధర పడిపోయెను.

ఈ కొద్ది భావములు మరి యనేకములు మన వ్యవసాయ, పారిశ్రామిక సమస్యల కెట్టి సంకుచితపరిష్కారము సాధ్యము, వాంఛ నీయము కాదని నాకు తోచెను. నిశ్చయముగ నవి మన జాతీయ జీవితముయొక్క ప్రతిలభావమును మార్పుచేయును. మన మర్థరహి తము, నుద్రేకజనకము నగు పదముల నాశ్రయింపక నీ యదార్థ ముల నెదుర్కొని వానికి సరిపెట్టుకొనవలెను. మన మసహాయము లైన చరిత్ర విషయములు గాక చరిత్రకారులము కావలెను.

విరుద్ధగాంధిజీ తిరిగి నా తలపునకువచ్చును. విశేష బుద్ధిబలము, పీడింపబడువారిని, అణగద్రొక్కబడువారినియుద్ధరింపవలెనను రాగము గల యతడు నశించిపోవుపద్ధతిని, యీ దుఃఖమునకు దుర్న్యాయమునకు కారణమైనదాని నేల బలపరచును? అతడొక మార్గమును వెదుకు చున్నాడనుట సత్యము: కాని యీ భూతకాలమార్గము మూసివేయ బడలేదా? బిగింపబడలేదా? యీ లోపల నతడు ఫ్యూడల్ సంస్థానములు, పెద్ద జమీందారీలు, తాలూకుదారీలు, ప్రస్తుత క్యాపిటలిస్టు పద్ధతి అభివృద్ధికి భంగకరములగు నీ పాతక్రమమునకు చెందు చిహ్నముల నాశీర్వదించును. ధర్మకర్తృత్వమును సిద్ధాంతమునువిశ్వసించుట సహేతుకమేనా? అప్రతిహతమైన యధికారమును, నైశ్వర్యమును ఒక వ్యక్తి చేతికిచ్చి యతడు వానిని కేవలము ప్రజల శ్రేయస్సుకే వినియోగించు ననుకొనుట సహేతుకమేనా? ఈ విధముగ విశ్వసింప బడుటకు మనలోనుత్తమోత్తములుతగినంతపరిపూర్ణులుగ నున్నారా? ప్లేటో మహాశయుని వేదాంతులైన రాజులుకూడ నిట్టి భారమును యథార్థముగ వహింపజాలరు. ఈ దయామయులగు మానవాతీతులను కూడతమపై నుంచుకొనుట యితరులకు శ్రేయమేనా? కానిమానవాతీతులును లేరు, వేదాంతులైన రాజులును లేరు, తమ నిజలాభమును లేక తమ నిజోద్దేశ్యముల నభివృద్ధిచేయుటయే ప్రజాశ్రేయస్సు అని భావించు దుర్బల మానవులుమాత్రమేకలరు. పుట్టుక, పదవి, ఆర్థికాధికారము—అను గొడ్డుమోతుతనము శాశ్వతమయి అనేక విధ యుపద్రవఫలితముల నిచ్చును.

ఈ మార్పు తెచ్చుటెట్లు? త్రోవలోనున్న యడ్డంకులను తీసివేయుటెట్లు? బలవంతముచేతనా, మార్పుచేతనా? దౌర్జన్యమా, దౌర్జన్యరాహిత్యమా? అను సమస్యను నేను ప్రస్తుతము యోచించుట లేదని తిరిగి చెప్పగోరుచున్నాను. దీనినిగురించి నేనుతరువాతచర్చించె దను. కాని, మార్పవలసినయవసరము గ్రహింపబడవలెనుస్పష్టముగ నుదహరింపబడవలెను. నాయకులు, యోచనపరులు దీనిని స్పష్టముగ యోచించి చెప్పకపోయినచో తమవలెనే యోచించున ట్లితరు

నైనను మార్పుచేయగలరా? అవసరమైనలక్ష్యమును ప్రజలలో నభి వృద్ధి చేయగలరా? సంభవించు కార్యములే నిస్సందేహముగ జ్ఞానమును బోధింపగలశక్తులు. కాని, వాని ప్రాముఖ్యతను గుర్తించుటకు వానినుండి యోగ్యమగు ఫలితములను పొందుటకు వానిని సరిగ నర్థముచేసికొనవలెను.

నావాక్యముల కప్పుడప్పుడాగ్రహపడు స్నేహితులు, మంచివారు నుదారులునగురాజులు, దానధర్మములుచేయుభూఖామందులు, నుపకారము, సరసతగల పెట్టుబడిదారులు నీకు కాన్పించలేదా? యని తరుచు నన్నడుగుచుందురు. నిశ్చయముగ కన్పించిరి. నామట్టుకు నే నీ భూఖామందులతోను, యైశ్వర్యముకలవారితోనుకలసితిరుగుతరగతివాడను; నేనొకమాదిరి బూర్జువాను బూర్జువా వాతావరణములో పెరిగినవాడను. ఈ శిక్షణవలనకలుగు నన్ని దురభిమానములను కలవాడను. కమ్యూనిస్టులు నన్ను చిన్నబూర్జువా యనిరి. ఇదియెంతయు సత్యము. బహుశః నన్ను వారిపుడు "పశ్చాత్తప్తుడగుబూర్జువా"యని పిలువవచ్చును. కాని, నే నెవడనునది విషయముకాదు. జాతీయ,అంతర్జాతీయ, ఆర్థిక సాంఘికసమస్యలను వ్యక్తులపరముగ నాలోచించుట మూర్ఖత్వము. నన్ను ప్రశ్నించు స్నేహితులే మనపోరాటముపాపముతోకాని పాపులతోకాదని చెప్పుట కెప్పుడు విసుగుచెందరు. నేనంత దూరముకూడ పోను. నాపోరాటము పద్ధతితోకాని వ్యక్తులతోకాదు. ఒకపద్ధతినిశ్చయముగ చాలవరకు వ్యక్తులలోను,వర్గములలోనుమూర్తీభవించును. ఈవ్యక్తులనువర్గములనుమార్చవలెను. లేదా పోరవలెను. కాని యొకపద్ధతి, నిష్ప్రయోజనమై,గుదిబండయైనచో నదిపోవలెను. దానినంటిపెట్టుకొనియుండు తరగతులు, వర్గములుకూడ మార్పుచెందవలెను. ఈమార్పుసాధ్యమైనంతతక్కువబాధ కలిగింపవలెను. కాని, దురదృష్టవశాత్తు బాధ, స్థానభ్రష్టత్వము తప్పవు. అతిచిన్నచెడుగుకు భయపడి మనము గొప్పచెడుగును సహింపజాలము.

మానవసంబంధముయొక్క ప్రతిమాదిరికిరాజకీయ, సాంఘిక, ఆర్థికములకు వెనుక నేదోయొక శాస్త్రముకలదు. ఈ సంబంధములు

మారినపుడు యీ శాస్త్రసంబంధమైన పునాదికూడ మారవలెను. మామూలుగా యీ శాస్త్రము పరిస్థితులకు వెనుకబడియుండును. వెనుకటి యన్నికష్టములకు కారణమగు 19 వ శతాబ్దములో ప్రజాప్రభుత్వపద్ధతి క్యాపిటలిజముకలిసియే యభివృద్ధియయ్యెను: కాని, యవి పరస్పరవిరుద్ధములు. వాటికి సహజ వైరుధ్యముకలదు. ప్రజాస్వామికము, సార్వజనికాధికారముకావలెనను. క్యాపిటలిజముయర్థాధికారమునుకొద్దిమందిచేతులలోనుంచును. ఈదురదృష్టదాంపత్యమెట్లో కాలము వెళ్ళబుచ్చెను. ఏలనన రాజకీయమైన పార్లమెంటరీ ప్రజాస్వామికము స్వతః తక్కువపరిమితిగల ప్రజాస్వామికము. అది గుత్తపద్ధతితోను, అధికార కేంద్రీకరణముతోను జోక్యము తీసుకొనలేదు.

అయినప్పటికి ప్రజాస్వామిక తత్త్వము వృద్ధిచెందినకొలది 'ఘటాశ్రాద్ధము' విధియయ్యెను. ఇప్పుడీసమయమువచ్చెను. నేడుపార్లమెంటరీ ప్రజాస్వామిక మపఖ్యాతిపాలయ్యెను. దానికి ప్రతీకారముగ ననేకవిధములగు కేక లాకసమును నింపుచున్నవి. దీనివలన హిందూదేశములోనున్న బ్రిటిషుప్రభుత్వము మరింతప్రతీకారమును బూనుచు రాజకీయస్వాతంత్ర్య బాహ్యరూపములనుకూడ లాగివేయుటకు దీనినొక సాకుచేయుచున్నది. భారతసంస్థానాధిపతులు తమ నిరాటంక నిరంకుశ పరిపాలనను దీనిచే సమర్థించుకొనజూచుట వింతగనుండును. వారు తమ రాష్ట్రములలో ప్రపంచములో మరెచ్చటలేని మధ్యయుగ పరిస్థితులను నిలుపుదుమని ఘీంకరించుచున్నారు. కాని, పార్లమెంటరీ ప్రజాస్వామిక విఫలత యతివ్యాప్తిగాక నవ్యాప్తియే యని గుర్తింపవలెను. అది యార్థిక ప్రజాస్వామికము నేర్పరుపకపోవుటచే తగినంత సార్వజనికము కాజాలదు. దాని పద్ధతులు మందమై, జంఝాటయుతమై శీఘ్రపరివర్తన యుగమునకు తగియుండలేదు.

భారత సంస్థానములు నిరంకుశపాలనలని చెప్పవచ్చును. అవి, బ్రిటిషు ఆధిపత్యమునకు లొంగియుండును. కాని, బ్రిటిషుప్రభుత్వము తన ప్రయోజనముల నభివృద్ధిచేసుకొనుటకు, రక్షించుకొనుటకు మాత్రమే జోక్యము కల్పించుకొనును. ఈ పాత ప్రపంచపుఫ్యూడల్

సంస్థానములు మారక యిరువదియవ శతాబ్ది మధ్యభాగము వరకు నిలువగలుగు టాశ్చర్యకరము; అచ్చటిగాలి భారముగ, చలనరహితముగ నుండును నీరు మందముగ పారును. మార్పుకు కదలికకు వలవాటుపడి బహుళః వానితోకూడ విసుగు చెందిన శ్రోత్రవానికి నిద్ర మత్తువచ్చును. కొద్ది రామణీయకత దొంగతనముగ నతని నావేశించును. కాలదేవత కదలక నిలుచునట్లు, మారని దృశ్యము కంటికి కాన్పించునట్లు నుండు చిత్రమువలె నదియంతయు నసత్యముగ కాన్పించును రమారమి యప్రయత్నముగ నతనికి భూతకాలచరిత్ర తన బాల్యమునాటి కలలు జ్ఞప్తికివచ్చును. పటకాలు, కవచములు ధరించిన యోధులయొక్కయు ధైర్యముగలసుందరకన్యకలయొక్కయు రూపములు నేత్రగోచరములగును. ఋజువులుగల కోటలు, శౌర్యము, గౌరవ, స్వాభిమానములను గురించిన పిచ్చియూహాలు, అసమాన ధైర్యస్థైర్యములు, మృత్యుధిక్కారము తలపునకువచ్చును ముఖ్యముగ నతడు కల్పనాకథలకు, డాంబికములు, దుస్సాధ్యములు నగు కార్యములకు కాకరమగు రాజపుత్రస్థానములో నున్నచో నివి వచ్చును.

కాని,త్వరలోనే యీరూపములంతరించి బాధ, హింస పొడచూపును. గాలిపీల్చుకొనుట కష్టమగును, యుక్కిరి బిక్కిరియగును. చలనరహితముగు లేక మందగామియగు నీటిక్రిందదుర్గంధము,క్రుళ్ళు కలవు. మానసికముగ, శారీరకముగకూడ కట్టివేయబడినట్లు, బిగింపబడినట్లు, నొక్కి వేయబడినట్లు భావింపబడును. సంస్థానాధీశ్వరునిభవ్యహర్మ్యములు దిక్కులేక నల్లాడు ప్రజల పరిపూర్ణాజ్ఞాన దుఃఖములు ద్యోతకమగును.సంస్థానాధీశ్వరుని స్వంతయవసరములకు, భోగములకు రాష్ట్రధన మెంత యపారముగ నా సౌధములోనికి పోవును! ఏసేవ రూపములోనైన నా ప్రజలకెంత స్వల్పము తిరిగివచ్చును! మనసంస్థానాధిపతుల యట్టహాసములకు విపరీత ధనవ్యయముచేయబడును. తమ కొరకుచేయు నిట్టి దూబరా ఖర్చుకు తిరిగి వారేమియిచ్చుచున్నారు?

ఈ సంస్థానముల నొక రహస్య తెర యావరించి యుండును. ఇచ్చట వార్తా పత్రికలు ప్రోత్సహింపబడవు అతి మొహర్బానీగా నొక సాహిత్య సంబంధమైన లేక వర్ధ ప్రభుత్వ వారపత్రిక యుండవచ్చును తరచు పైనుండివచ్చు పత్రికలు నిషేధింపబడును. విద్య యతి తక్కువగ నుండును. ఆడంబరముతోను, పటాటోపము తోను వచ్చు వైస్రాయి రాక, పరస్పర పొగడ్తలు లేక నతి యట్టహాసముతో చేయబడిన వివాహము, రాజుగారి జన్మదినోత్సవము లేక రైతుల తిరుగుబాటు_ఇవియే సంస్థానములనుండి వచ్చు ప్రధాన వార్తలు. వారిని విమర్శలనుండి (బ్రిటిషు యిండియాలో కూడ) ప్రత్యేక చట్టములు కాపాడును. వారి రాష్ట్రములలో నతి నిరపాయ మగు విమర్శకూడ తీవ్రముగ నణచివేయబడును. బహిరంగ సభలు రమారమి యనూహ్యమును, సాంఘిక ప్రయోజనముకొరకుజరుగు సభలు కూడ తరుచు నిషేధింపబడును. పైనుండివచ్చు ప్రధాన నాయకులు సంస్థానములలోనికి రాకుండ తరుచు నిరోధింపబడుదురు. చిత్తరంజనుదాసు చాల వ్యాధిగ్రస్తుడై యారోగ్యముకొరకు కాశ్మీరము వెళ్ళనిశ్చయించుకొనెను. అతడు రాజకీయ ప్రచారముకొరకు బయలుదేర లేదు. అతడు సరాసరి కాశ్మీర సరిహద్దు వరకు వెళ్ళినతరువాత నచ్చట యాపివేయబడెను. జిన్నాగారినిగూడ హైదరాబాదు సంస్థానములోనికి రానీయలేదు. హైదరాబాదు పట్టణములోనే స్వగృహమున్న సరోజినీదేవిని చాలకాల మచ్చటకు రానీయలేదు.

సంస్థానములలో నిట్టి పరిస్థితులున్నప్పుడు కాంగ్రెసు ఆప్రజల ప్రాథమిక హక్కులకొరకు నిలిచి వారిని మొత్తముమీద నణచి వేయుట యుక్తముకాదని విమర్శించుట సహజమై యుండెడిది. కాని గాంధీజీ సంస్థానముల సందర్భమున కాంగ్రెసులో నొక నూతన నీతిని "సంస్థానముల యాంతరంగిక పరిపాలనలో జోక్యము కల్పించు కొనరాదు" అని సృష్టించెను. సంస్థానములలో నసామాన్యములు, బాధ కరములు నగు సంభవములు జరిగినను సంస్థానాధికారులు కాంగ్రెసుపై నకారణ వైరముబూనినను నతడీ "జోజో"నీతిని విడువడాయెను.

కాంగ్రెసుయొక్క విమర్శ వారికికష్టముకలిగింపవచ్చుననియు నందుచే వారిని 'మార్పుట' కష్టమగుననియు భీతియున్నట్లు కాన్పించును. సంస్థానప్రజల కాన్ఫరెన్సు అధ్యక్షుడైన యన్. సి. కేల్కారుగారికి 1934 జూలైలో వ్రాయుచు గాంధీజీ జోక్యమును కలిగించుకొనకూడ దను తన విశ్వాసమును పునశ్చరణచేసెను. "సంస్థానములు బ్రిటిషు చట్టముక్రింద స్వతంత్రసంస్థలు; బ్రిటిషు భారతమని నిర్వచింపబడు భాగము ఆఫ్ఘనిస్థానము లేక సింహళ నీతి నెట్లు నిరూపింపజాలదో యట్లే సంస్థానములనీతిని నిరూపింపజాలదు" అని అతడు వ్రాసెను. భారతసంస్థాన ప్రజాసభయు, లిబరలు పక్షమువారును నతని యభిప్రాయములను సలహాలను ఆక్షేపించుటలో నాశ్చర్యములేదు.

కాని, ఈఅభిప్రాయములు సంస్థానాధిపతుల కింపుగనుండెను. వారు వానివలన లాభము పొందిరి. ఒక మాసములోపల తిరువాన్కూరు సంస్థానము తమరాష్ట్రములో జాతీయ కాంగ్రెసునునిషేధించి, దానిసభల నాపి వేసి, సభ్యులను జేర్పించుటకూడదనికేరాదనెను. అట్లుచేయుటలో 'బాధ్యతగలనాయకులే' యీ సలహాచెప్పిరి. గాంధిజీ స్టేటుమెంటును సూచించుచు-యని చెప్పెను. బ్రిటిషు ఇండియాలో శాసనోల్లంఘనము (సంస్థానములలో నిదియెన్నడును ప్రవేశపెట్టబడలేదు) విరమింపబడిన తరువాతను, భారతప్రభుత్వము తిరిగి కాంగ్రెసును సక్రమసంఘమని ప్రకటించిన తరువాతను ఈ నిషేధము జరిగెనని గమనింపవలసియున్నది.

కాంగ్రెసునీతిని, గాంధిజీ సలహాను అనుసరించి తిరువాన్కూరు ప్రభుత్వము ప్రశాంతమగుదినములలో కాంగ్రెసుపైసలిపినయకారణ దాడినిగురించి బహిరంగములో నొక్కమాటయైనను చెప్పబడలేదు కొంతమంది లిబరలులుకూడ దీనిని తీవ్రముగనిరసించిరి. నిశ్చయముగ సంస్థానములకు సంబంధించినంతవరకు గాంధిజీ లిబరలులకంటె చాల మితవాది; యెక్కువ విరోధముకలవాడు. బహుశః నాయకులలో వివిధ సంస్థానాధిపతులతో సన్నిహితసంబంధముకల పండిత మదన మోహన మాలవ్యాయొక్కడే తత్తుల్యమైన విరోధమునుచూపుచు వారికి కష్టము కలిగించుట కిష్టపడడు.

గాంధీజీ భారత సంస్థానాధిపతుల సందర్భములో నెల్లప్పుడు నిట్టి జాగరూకతతో నుండును. 1916 ఫిబ్రవరిలో హిందూవిశ్వవిద్యాలయ ప్రారంభోత్సవసందర్భమున యనేకమంది సంస్థానాధిపతులున్న సభలో నతడు కాశీలో మాట్లాడెను. అనాడొక సంస్థానాధిపతియధ్యక్షతవహించెను. అతడు దక్షిణాఫ్రికానుండి క్రొత్తగావచ్చెను; అఖిల భారత రాజకీయభారమింకను నతనిమీద పడలేదు అతడు ప్రాధేయపూర్వకముగను భవిష్యత్తు చెప్పువానివలెను యుపన్యసించివారినితను తమపద్ధతులను మార్చుకొనవలసినదనియు, వ్యర్థమగు నాడంబరమును భోగములను మానవలసినదనియు చెప్పెను. 'సంస్థానాధిపతులారా! వెళ్ళి మీయలంకారములను అమ్మివేయుడు' అని యతడనెను. వారు తమ నగల నమ్మివేయలేకపోయినను నిశ్చయముగ వెళ్ళిపోయిరి. వారు తల్లడపడి యొకరొకరుగ సభను వీడిరి. చివర కధ్యక్షుడుకూడ మెల్లగ జారెను. గాంధీజీ మాట్లాడుచునేయుండెను. అచ్చటనున్న అనిబిసెంటు సతికికూడ గాంధీజీ విమర్శవలన కష్టముకలిగి సభనుండి వెడలిపోయెను.

కేల్కారుకువ్రాసిన యుత్తరములోమరియు నతడిట్లు చెప్పెను. 'సంస్థానములు తమ ప్రజలకు స్వపరిపాలన నీయవలెనని నేను కోరెదను. తాము పరిపాలించు ప్రజలకు వారుధర్మకర్తలని భావించవలెననియు యుదారమున కట్లుండవలెననియు నేను కోరెదను...'ఈధర్మకర్తృత్వమనుభావము లో నేదేనియున్నచో భారతపరిపాలనకుతాము ధర్మకర్తలమని బ్రిటిషుప్రభుత్వముచేయు వాదనకు మనమేల యభ్యంతర పెట్టవలెను? వారు విదేశీయు లను విషయము తప్ప నాకు భేదమేమియు కాన్పించదు హిందూదేశములోని వివిధప్రజలశరీరఛాయలోను, జాతులపుట్టుకలోను విజ్ఞానములోను రమారమి తత్తుల్యమైన భేదములే యున్నవి.

గత కొద్ది వత్సరములనుండి బ్రిటిషుఅధికారులుభారతసంస్థానములలోనికి వేగముగ ప్రవేశించుచున్నారు. ఇష్టములేకపోయినను అసహాయుడుగనుండు రాజుపై వారు స్వారీచేతురు. భారతప్రభుత్వముపై నుండి సంస్థానములమీద నెల్లప్పుడు విశేషాధికారము చలాయించు

చుండును. ఇప్పుడుదీనికితోడు కొన్నిప్రధానసంస్థానములలో నాంతరంగికాధికారముకలదు. కనుక నీ సంస్థానములు మాట్లాడునపుడు తరచు భారతప్రభుత్వమే మరియొక కంఠముతో మాట్లాడును.

మతరీత్యా యితరత్ర తక్కువసంఖ్యాకులకు ప్రత్యేకనియోజకవర్గము లుండరాదని చాల విమర్శచేయబడెను. అవి ప్రజాపరిపాలనకు కేవల మసంబద్ధములని సూచింపబడెను. నియోజకవర్గమునేమాత్రము ఒసగని మతముల అరలపెట్టెక్రింద విభజించినచో ప్రజాస్వామికము బాధ్యతాయుతములని పిలువబడు ప్రభుత్వము సంభవము కాజాలదు. కాని, ఈ విమర్శకులలో నతి శ్రద్ధావంతులు, పట్టుదలకలవారు నగు మాలవ్యా, హిందూమహాసభానాయకులు, సంస్థానపరిస్థితులనుగురించి యెంతమాత్రము మాట్లాడకుండిరి. వారు సంస్థాననిరంకుశపాలనలకు తక్కిన భారతదేశ ప్రజాపరిపాలనకు మధ్య నొక ఫెడరలుయూనియను యుండుట కంగీకరించిరి. ఇంతకంటె నసంబద్ధము, విపరీతము నగు యూనియనును మన మూహింపజాలము. కాని, జాతీయతకు, ప్రజాస్వామికమునకు కంకణము కట్టుకొనిన హిందూమహాసభా నాయకు లెట్టికష్టము లేకుండగనే దీనినిదిగమ్రింగిరి. మనముతర్కస్థైర్యములను గురించి మాట్లాడుచుందుము. కాని, మన ప్రధానప్రేరణ లుద్రేకము మీదనే యాధారపడును.

కనుక నేను సంస్థానములు-కాంగ్రెసు అను విరుద్ధమునకుతిరిగి వచ్చెదను. థామస్ పైను నూటయేబదియేండ్లక్రిందట బర్కునుగురించి చెప్పినపదము 'అతడు శృంగారముగనున్న తురాయినిచూచి విచారపడును. కాని చనిపోవుచున్న పక్షిని మరచిపోవును.' నాకుజ్ఞప్తికివచ్చుచున్నది. నిశ్చయముగ గాంధిజీ చనిపోవుచున్న పక్షి నెన్నడు మరచిపోడు. కాని తురాయినిగురించి యంత పట్టుబట్టనేల?

రమారమి యీ భావములే తాలూకుదారీ, పెద్దజమీందారీ పద్ధతులకును వర్తించును ఈ యర్థప్రభుత్వపద్ధతి యొక్క కాలము చెల్లెననియు, నిది యుత్పత్తికి సాధారణాభివృద్ధికి పెద్దయాటంకమనియు

వాదింప నవసరములేదు. ఇది వృద్ధిచెందుచున్న క్యాపిటలిజమునకు కూడ నన్వర్థకము. రమారమి ప్రపంచమంతట పెద్దపెద్ద యెస్టేటులు క్రమముగ నశించి వ్యవసాయ ప్రొప్రయిటరీలకు స్థానమిచ్చెను. హిందూదేశములో ప్రతిఫలము విషయము రావచ్చునని నేనెల్లప్పుడు నూహించితిని. కాని, గాంధీజీ తాలూకుదారీపద్ధతిని యున్నవిధముగ నామోదించి సాగింపగోరునని గత వత్సరమున కనుగొనినేనాశ్చర్య పడితిని. 1934 జూలైలో కాన్పూరులో నతడిట్లు చెప్పెను; "ఇరుపక్షముల హృదయపరివర్తనమువలన భూఖామందులకు రయితులకుమధ్య మంచి సంబంధములేర్పడగలవు. అది జరిగినచో నుభయులు సామరస్యముగ, ప్రశాంతముగ జీవింపవచ్చును. అతడు తాలూకుదారీ జమీందారీపద్ధతిని రద్దుచేయుట నెప్పుడు నామోదించియుండలేదు. దానిని రద్దుచేయవలెనని భావించువారు తమ మనస్సులను తామే యెరుగరు." (ఈ చివరనేరము క్రూరమైనది.)

మరియు నతడిట్లు చెప్పెను; "ఆస్తులుగల తరగతులవారి యాస్తులను తగిన కారణములేకుండ లాగివేయుటకు నేనొప్పుకొనను. మీ హృదయములను కరగించి మిమ్ము మార్చుటయే నా లక్ష్యము (అతడు పెద్దజమీందారుల సభలో మాట్లాడుచుండెను.) మీరు మీస్వంత యాస్తినంతను మీకవులదారుల తరపున ధర్మకర్తలుగ నుంచుకొని దానిని వధానముగ వారియుపయోగముకొరకేవినియోగింపవలెను. మీయాస్తినుండి మిమ్మునక్రమముగ తరిమివేయవలెనను ప్రయత్నము చేయబడునేని నేను మీతరపునపోరెదను...పాశ్చాత్య దేశములోని సామ్యవాదము, కమ్యూనిజము మనభావములతో ప్రధానముగ భేదించునట్టి కొన్ని భావములపై నాధారపడెను. మానవస్వభావము ముఖ్యముగ స్వార్థపూరిత మను వారి విశ్వాసము వానిలోనొకటి ...కనుక మన సామ్యవాదము, కమ్యూనిజము దౌర్జన్యరాహిత్యము మీదను, కూలివాడు, పెట్టుబడిదారు, భూఖామందు, రయితు—వీరి సామరస్యమైన సహకారము మీదను నిర్మింపబడవలెను."

ప్రాచ్య, పాశ్చాత్యముల మూలభావములలో నట్టిభేదములున్న సంగతినాకు తెలియును. బహుశః యున్నవి. కాని, గత కొన్ని వత్సరములనుండి కలిగిన భేదమేమనిన భారతభూస్వామి, పెట్టుబడిదారులతమ రైతులయొక్కయు, పనివాండ్రయొక్కయు ప్రయోజనములను పాశ్చాత్య పెట్టుబడిదారు భూస్వామికంటె నెక్కువ నిర్లక్ష్యముచేసిరి. భారతభూస్వామి రయితులక్షేమము కొరకెట్టిసాంఘిక సేవచేయుటకు యత్నము చేయలేదు. పాశ్చాత్య పరిశోధకుడైన బైల్సుఫర్డు యిట్లు విమర్శించెను. "భారతవడ్డీవ్యాపారస్తులు, భూస్వాములుయేసమకాలిక సాంఘిక పద్ధతిలోను లేనట్టి సర్వభక్షకులు." బహుశః తప్పు భారత భూస్వామిదికాదు అతనికిమించినపరిసితులేర్పడెను. క్రమముగ నతడు పతితుడయ్యెను. ఇప్పుడతడు తనను రక్షించుకొనజాలని కఠినస్థితిలో నున్నాడు. వడ్డీవ్యాపారస్తులు, చాలమంది భూస్వాముల భూములను లాగుకొనిరి; చిన్నచిన్న భూస్వాములు తమ భూములకే కవులుదారులైరి. పట్టణములోనుండు యీ వడ్డీవ్యాపారస్తులు తనఖాలమీద బాకీలనిచ్చి తనఖాకాలము మీరిపోవుటతోడనే జమీందారులైరి. గాంధిజీ సిద్ధాంతము ప్రకారము వీరిపుడు తమచేతనే భూములనుండి వెడలుగొట్టబడిన దురదృష్టప్రజలకు ధర్మకర్తలు; ప్రధానముగ రయితుల క్షేమముకొరకే తమ రాబడిని వినియోగింపవలసినవారు.

తాలూకుదారీపద్ధతి మంచిదేయైనచో దానిని హిందూదేశమంతట నేల ప్రవేశపెట్టరాదు? హిందూదేశములో విశాలప్రాంతములలో వ్యవసాయ ప్రొప్రయిటరులు కలరు. గుజరాతులో పెద్దజమీందారీలను, తాలూకుదారీలనుసృష్టించుటకు గాంధిజీయంగీకరించునా? అట్లుచేయునని నేనూహింపను. అయితే యు.పి కి బీహారుబెంగాలులకు నొకవిధమగు భూమిపద్ధతియు, గుజరాతు, పంజాబులకు మరియొకవిధమగు భూమి పద్ధతియు నుండనేల? భారతదేశముయొక్క పూర్వ, పశ్చిమ, యుత్తర, దక్షిణభాగములలోని ప్రజలలో బహుశః యెట్టి ప్రధాన భేదములు లేవనుకొనెదను; వారి మూలభావములన్నియునొకటియే! అర్థమేమన యున్నది సాగవలెను. ఉన్నస్థితిని రక్షింపవలెను.

ప్రజల కేది లాభదాయకమో, యేది వాంఛనీయమో యను నార్థిక పరిశోధన యుండకూడదు ప్రస్తుత పరిస్థితులను మార్చుటకు ప్రయత్నింపరాదు. ప్రజల హృదయములను మార్చుటొక్కటియే చేయవలసిన పని. ఇది జీవితమును, దాని సమస్యలను శుద్ధ మత దృష్టితో చూచుటయగును దీనికి రాజకీయములతోను, ఆర్థిక, సాంఘిక శాస్త్రములతోను సంబంధమేమియు లేదు. అయినను గాంధీజీ దీనిని దాటి రాజకీయ జాతీయ రంగములలో విహరించును.

నేడు భారతదేశము నిట్టి కొన్ని వైరుధ్యము లెదుర్కొనుచున్నవి. మనము మనలను కొన్ని ముదులక్రింజ బధించుకొంటిమి. వానిని విప్పివేసినగాని ముంపడుగు వేయుట కష్టము. ఈ విడుదల యుద్రేకమువలన కలుగజాలదు. చాలకాలము క్రిందట స్పినోజా "జ్ఞానమువలనను, అవగాహన వలనను కలిగిన స్వేచ్ఛయా లేక నుద్రేకమువలన కలుగు బంధనమా? అందులో నేది శ్రేష్టము" అని ప్రశ్నించెను. అతడు మొదటిదానినే వరించెను.

63

మార్పు లేక బలవంతము

పదునారేండ్ల క్రితము గాంధీజీ తన దౌర్జన్యరాహిత్య సిద్ధాంతముతో భారతదేశమును మోహింపజేసెను. నాటినుండియది భారతాకాశము నాక్రమించెను. లక్షలకొలది ప్రజలు దానిని జపించిరి. ఆమోదించిరి కొంతమంది దానితో పెనుగులాడి తరువాత షరతులతోను షరతులు లేకుండగను స్వీకరించిరి. కొంతమంది దానిని బహిరంగముగ వెక్కిరించిరి. అదిమన రాజకీయ, సాంఘిక జీవితములో నెక్కువపాత్రను వహించెను. అది బాహ్యప్రపంచ దృష్టినికూడ చాలవరకాకర్షించెను. ఈసిద్ధాంతము నిశ్చయముగ రమారమి మానవభావముతో సమకాలికముగనేయుండెను. కాని, బహుశః గాంధీజీ దానిని జన బాహుళ్యము మీద రాజకీయ సాంఘికోద్యమములకు మొట్టమొదటవర్తింపజేసెను. వెనుక నది వ్యక్తికి సంబంధించియుండుటచే ముఖ్యముగ మతసంబంధమయ్యెను. వ్యక్తియాత్మనిరోధమునుచూపి పరిపూర్ణ యుదాసీనతను సాధింప యత్నముచేసి తద్వారా ప్రపంచ పోరాటముల కతీతుడయి యొక విధముగువ్యక్తిస్వాతంత్ర్యమును, మోక్షమును సాధింపబూనును. దానివెనుక విశాల సాంఘిక సమస్యలను చేపట్టి సాంఘికపరిస్థితులను మార్చవలెననుభావము లేదు. హెచ్చుతగ్గులతోను అన్యాయములతోను కూడుకొనిన వర్తమాన సాంఘికనిర్మాణమును రమారమిస్వీకరించును. ఈవ్యక్తిగతలక్ష్యమును గాంధీజీ సాంఘికలక్ష్యముగమార్చ ప్రయత్నించెను. అతడు సాంఘిక, రాజకీయపరిస్థితులను రెండింటిని మార్చగోరెను; బుద్ధిపూర్వకముగ నీలక్ష్యమును మనస్సులోనుంచుకొని యతడు దౌర్జన్యరాహిత్యపద్ధతికి కేవలము భిన్నమగు నీవిశాల రంగముమీద ప్రయోగించెను.

"మానవపరిస్థితులలోను, పరిసరములలోను గొప్ప మార్పులను కలుగచేయగోరువారు సంఘములో కల్లోలమును కలుగజేసిన గాని యట్లు చేయజాలరు. ఇట్లుచేయుటకు రెండేమార్గములు- దౌర్జన్యము, దౌర్జన్యరాహిత్యము కలవు. దౌర్జన్యయుతమగుదెబ్బతిడి స్థూలశరీరమును నొప్పించును. అది బాధనొందువానిని ఖేదపెట్టునట్లే బాధించువానినికూడ పతితునిచేయును. కాని యాత్మ బాధద్వారా [ఉపవాసదినములు] చేయు దౌర్జన్యరహిత బలవంతము కేవలము భిన్నవిధమున పనిచేయును. అది యెవరిమీద ప్రయోగింపబడునో వారిస్థూలశరీరమునుగాక నైతికదాడిని స్పృశించిదానినిబలపరచును" అని యతడు వ్రాసెను.

ఈభావము కొంతవరకు భారతభావమునకు సరిపడెను. కనుక బాహ్యముగనైనను దేశముచే నుత్సాహముతో నంగీకరింపబడెను. దాని వెనుకనున్న విశేషాంతరార్థములను బహు కొద్దిమందిమాత్రమే గుర్తించిరి. ఆ కొద్దిమందికూడ విశ్వాసములోను, క్రియలోనుశరణుజొచ్చిరి. కాని, క్రియలోనున్న వేడి చల్లారుటతోడనే కొంతమంది మనస్సులలో ననేక ప్రశ్న లుదయించెను. వానికి ప్రత్యుత్తరములు దొరకుట దుర్ఘటమయ్యెను. ఈ ప్రశ్నలు సన్నిహిత రాజకీయగతిని మార్చలేదు. అవి యీ దౌర్జన్యరహిత పోరాటము వెనుకనున్న శాస్త్రమునుచర్చించెను. రాజకీయ.దృష్టిలో దౌర్జన్యరహితయుద్యమ మింకనుజయింపలేదు. ఏలనన భారతదేశమింకనుసామ్రాజ్యపిడికిలిలో పట్టుబడియున్నది. సాంఘికదృష్టిలో నది పెద్ద మార్పును దేనిని తలంపలేదు. అయినను యేమాత్రముబుద్ధితీక్షణత కలవాడైనను అది లక్షలకొలది ప్రజలలో గొప్పమార్పుకలిగించినసంగతి చూడగలడు. అది వారి శీలమును, శక్తిని, యాత్మవిశ్వాసమును ప్రసాదించెను. ఈయమూల్య వరములులేనిదే రాజకీయ, సాంఘికాభివృద్ధిని దేనిని సాధింపజాలము. లేదా నిలుపుకొనజాలము. గాంధీజీ యుదహరించిన 'సాంఘికకల్లోలము'ను లేవదీయుటకిది తోడ్పడి యమూల్యమయ్యెనని చెప్పుటకెట్టి సందేహమును లేదు. విప్లవకరమగు మార్పుకుముందు ప్రజలలోకలుగు చైతన్యవిధానము నిది తెచ్చిపెట్టెను.

స్పష్టముగ నది దానికనుకూల విషయం. కాని యది మాకు తృప్తినీయజాలదు. యదార్థమైన ప్రశ్నలకు సమాధానములు లేవు. దురదృష్టవశాత్తు గాంధీజీ యీసమస్యను పరిష్కరించుటలో మనకంతగా తోడ్పడు ఈవిషయమునుగురించి యతడనేకసార్లు మాట్లాడెను. అనేకసార్లు వ్రాసెను; కాని నాకు తెలిసినంతవర కత డెప్పుడు దాని యంతరార్థములను [శాస్త్రరీత్యా లేక జ్ఞానరీత్యా] బహిరంగముగ చర్చించియుండలేదు. లక్ష్యముకంటె సాధనములు ముఖ్యమనియు, నిర్బంధముకంటె మార్పు మంచిదనియు నతడు పదేపదే చెప్పుచుండును: దౌర్జన్యరాహిత్యమును సత్యముతోను, మంచితనముతోను కలుపుచుండును. అతడీ పదములను తరచు నామాంతరములైనట్లు వాడుచుండును. దీనితో నేకీభవింపనివారందరిని పంక్తిబాహ్యులుగను నైతిక చట్టమున కపచారము చేసినవారివలె చూచు స్వభావమొకటి బయలుదేరెను. అతని కొంతమంది శిష్యులలో నిది విధాయకముగ నహంకారభావమును దాల్చెను

ఈవిశ్వాసముకుదురుఅదృష్టముపట్టని మాబోంట్లననేకసందేహములు బాధించెను. ఈ సందేము లంతగా ప్రస్తుతావసరములకు గాక వ్యక్తిగతముగ నైతికము సాంఘికముగ శక్తివంతమునగునిరంతరాయ కర్మవేదాంతము కావలెననెడు మనోభీష్టమునకు చెందుచున్నవి. ఈ సందేహములు నన్నువీడలేదని నేనొప్పుకొనెదను. ఈసమస్యకు తృప్తికరమగు పరిష్కారము నాకు దొరకలేదు. దౌర్జన్యమును నేనతితీవ్రముగ దేష్వింతును. ఐనను నేను దౌర్జన్యపూరితుడనైయున్నాను. బుద్ధిపూర్వకముగనో యబుద్ధిపూర్వకముగనో యితరులను నిర్బధించుటకు నేను తరచుప్రయత్నించుచుందును. తన సన్నిహితశిష్యకోటిలోచాల మందిని,తనసహోద్యోగులనుమానసికమృత్పిండముగమార్చుగాంధిజీ యాధ్యాత్మిక నిర్బంధముకంటె గొప్ప నిర్బంధమేదికలదు ?

కాని, వ్యక్తిగతమైన యీ దౌర్జన్యరాహిత్య సిద్ధాంతమును సాంఘికజాతీయవర్గములుకావలసినంతవరకలవర్చుకొనగలవా? యను నదియేయదార్థప్రశ్న. ద్వేషమును,క్రౌర్యమును,స్వార్థమునుతరిమివేసి

మానవలోకము నీస్థాయికి తెచ్చు టొక్కటియే వాంఛనీయమైన పరమావధియనుట సత్యము. అది సాధ్యమా యసాధ్యమా యనునది చర్చనీయాంశము కావచ్చును; కాని, యదిలేకుండ జీవితము నాశించుట "యేయర్థము లేకుండ రణగొణధ్వనితోను, యావేశముతోను చెప్పు వివేకహీనుని కథవలెనుండును." ఈ లక్ష్యమును సాధించుట కడ్డముగ నుండుటయేగాక తద్వ్యతిరేక స్వభావములను కల్పించు నాటంకములను లెక్కపెట్టక మన మీ గుణములను బోధించుచు దానికొరకు తిన్నగా ప్రయత్నింపవలెనా? లేక మొదట మన మీయడ్డంకులను తీసివేసి ప్రేమ, సౌందర్యము, సుహృద్భావమువృద్ధి చెందుట కెక్కువయుక్తమగు వాతావరణమును సృష్టింపవలదా? లేక మన మీ రెండు విధానములను జోడింపవలెనా?

మరియుదౌర్జన్యమునకు, దౌర్జన్యరాహిత్యమునకు, బలవంతమునకు మార్పుకుమధ్యగల రేఖయంతస్పష్టముగానున్నదా? తరచు నైతికనిర్బంధముశరీరనిర్బంధముకంటె నెక్కువ భయంకరనిర్బంధమగుచుండును. దౌర్జన్యరాహిత్యము సత్యముకునామాంతరమా? సత్యమననేమి? యనునది పురాణసమస్య. దానికవేలకొలది ప్రత్యుత్తరములీయబడెను. అయినను యీ ప్రశ్న మిగిలేయున్నది. కాని యదియేదియైనను, దౌర్జన్యరాహిత్యముతోపూర్తిగ నేకముకాజాలదు. దౌర్జన్యముస్వతః చెడ్డదెయైనను వస్తుతః యవినీతికరమని భావించుటకు వీలులేదు. ఇందులో ననేక తరహాలు, అనేకఛాయలు కలవు తరచు అంతకంటె చెడ్డయైన దానికంటె నిది మంచియే కావచ్చును. గాంధీజీయే పిరికితనముకంటె నిది మంచిదని చెప్పెను; భయము, దాస్యము, మొదలగుననేక చెడుగులను దీనికి జేర్చవచ్చును. సామాన్యముగ దౌర్జన్యము ద్వేషముతో కూడియుండుననుట నిజము: కాని, సిద్ధాంతములోనైనను యిది యెల్లప్పుడు నీవిధముగ నుండనక్కరలేదు. దౌర్జన్యము ప్రేమమీదనాధారపడవచ్చునని యూహింపవచ్చును. (శస్త్రవైద్యుని యుదాహరణము లేదా?) ఇట్టి యాధారముకలదేదియు నెప్పుడును ప్రధానముగ నీతిబాహ్యము కాజాలదు. ఇంతకు ధర్మమునకు, నీతికి ప్రేమ, ద్వేషము

యంత్యాపరీతులు. కనుక దౌర్జన్య మతితరచు నైతికముగ నన్యాయ మేయై యాదృష్టిలో నుపద్రవకరమని భావింపబడినను అది యెల్ల ప్పుడు నట్లుండనవసరము లేదు.

జీవితము సంఘర్షణ, దౌర్జన్యములతో నిండియున్నది. దౌర్జ న్యము దౌర్జన్యమునే వృద్ధిచేయునట్లు కాన్పించును. కనుక నది దానిని జయించుమార్గము కానేరదు. అయినను దానిని కేవలముకూడదనుట వలన జీవితముతో నెంతమాత్రము సంబంధములేని శుద్ధశూన్యదృష్టి యేర్పడును. దౌర్జన్య మాధునిక రాజ్యాంగముయొక్కయు, సాంఘిక పద్ధతియొక్కయు జీవగఱ్ఱ. రాజ్యాంగ నిర్బంధసామగ్రిలేనిదే పన్నులు వసూలు కాబడనేరవు. భూస్వాములకు శిస్తులురావు. స్వాంతఆస్తి మాయమగును. చట్టము, దాని సాయుధశక్తులతో స్వాంతఆస్తిని ఇత రులనుండి కాపాడును జాతీయప్రభుత్వము తన్ను సంరక్షించుకొనుచు, విజృంభించు దౌర్జన్యమువలన నిలిచియుండును.

గాంధీజీ దౌర్జన్యరాహిత్యము కేవల శూన్యవ్యాపారము కాదు; ఎదురాడక లొంగిపోవుటకాదు. అది దౌర్జన్యరహిత తిరుగు బాటు ఆచరణరూపమైన, సజీవ కార్యవిధానము. అది వర్తమాన స్థితికి పిల్లివలె లొంగిపోవువారికొరకు ఉద్దేశింపబడలేదు. అది సంఘ ములో కల్లోలమును కలిగించుటకే సృష్టింపబడి తద్వారా వర్తమాన పరిస్థితులను మార్చును. సంస్కారోద్దేశ్యము లేవియైనను ఆచరణలో నది బలీయమైన సాధనము. గాంధీజీ తన మొదటి వ్రాతలలో 'బల వంతపరచుట' యను పదము నుపయోగించెను. 1920 లో వైస్రాయి (ఛెలమ్స్‌ఫర్డు) పంజాబుసైనిక శాసన దురంతములను గురించి చేసిన యుపన్యాసమును విమర్శించుచు నత డిట్లు వ్రాసెను. "కౌన్సిలును ప్రారంభించునపుడు వైస్రాయి యుపన్యాసము అతనితోను, యతని ప్రభుత్వముతోను ఆత్మగౌరవము కలవారు సంబంధము కలిగియుం డుట కసాధ్యమగు మానసిక దృక్పథమును చూపుచున్నది.

పంజాబుమీద చేసిన విమర్శలు పరిహారమును నిర్మొగమాట ముగ నిరాకరించినట్లు విశదముచేయుచున్నవి. సన్నిహిత'భవిష్యత్తు'కు

సంబంధించు సమస్యలమీద కేంద్రీకరింపుడు ! అని యీయన మనకు హితవొసగును. పంజాబు దురంతముల విషయమై పశ్చాత్తాపపడునట్లు ప్రభుత్వము బలవంతబరచుటయే సన్నిహిత భవిష్యత్తు...

జాతితో జాతి, తరగతితో తరగతి పోరాడు ప్రస్తుతపరిస్థితులలో దౌర్జన్యము, నసత్యము విధాయకములుగ గాన్పించుచున్నవి. తమ యధికారమునకు, హక్కులకు నంటిపెట్టుకొని యుండగోరుచు తాము అణచివేయు ప్రజల కభివృద్ధిచెందు యవకాశములను నిరాకరించుహక్కులుగల జాతులు, తరగతులు దౌర్జన్యము, బలవంతము, అసత్యములమీద నాధారపడవలెను ప్రజాభిప్రాయ మభివృద్ధియగుచు నీ సంఘర్షణలయొక్కయు, నవి చేయునట్టి యణచివేయుటలోనున్న యదార్థములు నంతకంతకు బహిర్గతమైనకొలది దౌర్జన్యము తగ్గుట సాధ్యముకావచ్చును. యదార్థమునకు నవీన యనుభవమంతయు తద్వ్యతిరేకమునే తెలుపుచున్నది. వర్తమాన సంస్థలపైనవాలు హెచ్చినకొలది దౌర్జన్యము పెరుగుచున్నది. బాహ్యమగుదౌర్జన్యము తగ్గిన చోటకూడ నది మరింత యుపద్రవకరములైన సూక్ష్మరూపములను దాల్చుచున్నది. జ్ఞానాభివృద్ధి, మతదృష్టి, నీతి యే విధముగను యీ దౌర్జన్యస్వభావము నణచజాలకపోయెను. వ్యక్తు లభివృద్ధిచెందిను నవప్రమాణములో నుత్థితులైరి. బహుశః నేడు చరిత్రలోమున్నెన్నడు లేనంతమంది యుత్తమజాతి పురుషులు (పురుషోత్తమ మాదిరి తప్ప) కలరు: సంఘము మొత్తముమీద నభివృద్ధిచెంది పురాణయాటవిక స్వభావమును నియమించుటకు బహుస్వల్పముగ ప్రయత్నింప నారంభించెను. కాని, వర్గములు, కులములు మొత్తముమీద నెక్కువగ నభివృద్ధిచెందలేదు. వ్యక్తి తా నెక్కువ నాగరికుడగుచు తన యనేక యాదిమ రాగాదులను, చెడుగులను సంఘమునకు బదిలీ చేసెను. దౌర్జన్యమెప్పుడు నైతికముగ రెండవరకము వ్యక్తులనే యాకర్షించును. కనుక నీ సంఘములయొక్క నాయకు లరుదుగ యుత్తమ స్త్రీ పురుషు లగుదురు.

ప్రభుత్వమునుండి యధమాధమరూపములోనున్న దౌర్జన్యము క్రమముగ తగ్గింపబడునని యనుకొన్నను పరిపాలనకు, సాంఘిక జీవిత

ముకు కొంత నిర్బంధ మవసరమను సంగతిని నిర్లక్ష్యము చేయరాదు. సాంఘిక జీవితమున కేదో యొకవిధమగు ప్రభుత్వ ముండవలెను. ఈవిధముగ నధికారములో నుంచబడువారు సంఘమున కపకారము చేయునట్టియు, స్వతః స్వార్థపూరితమైనట్టియు వ్యక్తులయొక్కయు లేక వర్గములయొక్కయు స్వభావముల నన్నింటిని వారింపవలెను. సాధారణముగ వా రవసరమును మీరి వర్తించెదరు. ఏలనన యధికారము మనలను పతితులను, అవినీతిపరులను చేయును. పరిపాలకులు స్వేచ్ఛ నెంత ప్రేమించి, నిర్బంధము నెంత ద్వేషించినను ఆ ప్రభుత్వములో ప్రతిమానవుడును కేవలము స్వార్థహితుడై, ప్రజాసామాన్య శ్రేయస్సు నభిలషించు పరిపూర్ణుడగువరకు తిరుగుబాటుచేయు వ్యక్తులపై నిర్బంధము నుపయోగింపవలసియుండును. దండయాత్రలను చేయుచుండు బాహ్యజాతులపైనకూడ వారు నిర్బంధమును ప్రయోగింపవలెను. అనగా దౌర్జన్యమును దౌర్జన్యముతో నెదుర్కొని యాత్మరక్షణ చేసికొనవలెను. ఏకైక ప్రపంచ ప్రభుత్వమున్నప్పుడు మాత్రమే దీని యవసరముండదు.

కనుక నీవిధముగనాంతరంగిక ఐక్యములకు, బాహ్యసంరక్షణకు నిర్బంధ, దౌర్జన్యము లవసరమగునపుడు మన మెచ్చటగీతగీయవలెను? రాజకీయములకు మన మీవిధికృతమగు నైతికామోదము నొకసారి యిచ్చితిమా దౌర్జన్యరహిత నిర్బంధము, దౌర్జన్యసహిత నిర్బంధము లేక ప్రభుత్వనిర్బంధము, విప్లవకారులనిర్బంధము సంపూర్ణముగ వేరు చేయుట సాధ్యముకాదని రైనుహోల్డునీబరు సూచించుచున్నాడు.

లోపభూయిష్టమగు నీప్రపంచములో నేజాతీయప్రభుత్వమైనను స్వీయరక్షణకొరకు (పైవారిదాడులనుండి) దౌర్జన్యము నుపయోగింప వలసియుండునని గాంధీజీ యొప్పుకొనునని (ఇది నాకు నిశ్చయముగ తెలియదు) నేననుకొనెదను; ప్రభుత్వము నిశ్చయముగ తన యిరుగు పొరుగు ప్రభుత్వములపట్ల పరిపూర్ణమైన శాంతియుత మిత్రనీతి నవలంబింపవలెను. అయినప్పటికి దాడి సంభవింపనే సంభవింపదనుట మూర్ఖత్వము. అది నిర్బంధ స్వభావముగల కొన్ని చట్టములను కూడ

చేయవలెను. అనగా వివిధ తరగతులనుండి, వర్గములనుండి కొన్ని హక్కులను, అధికారములనుతీసికొనివానిస్వేచ్ఛాక్రియలనువిరోధించవలెను. చట్టము లన్నియు కొంతవరకునిర్బంధయుతములు. కాంగ్రెసు యొక్క కరాచీ తీర్మానము "ప్రజా దోపిడిని సమాప్తము చేయుటకు మాడుచున్న లక్షలకొలది ప్రజలయొక్క యదార్థ యార్థిక స్వేచ్ఛ కూడ రాజకీయ స్వేచ్ఛలో నిమిడి యుండవలెను" అని శాసించెను. వాంఛనీయమైన యీ భావమును సఫలము చేయుట కెక్కువ హక్కు లున్న వారు వానిని తక్కువహక్కులున్న వారికిచ్చి వేయవలసి యుండును. మరియు పనివాండ్రకు జీవించుట కవసరమైన కూలియు ననేక యితర సౌకర్యములు నుండవలెను. ఆస్థిమీద ప్రత్యేకపన్నులు విధింపబడును. "ప్రభుత్వముప్రధానపరిశ్రమలను. సేనలను, ఖనిజసంపత్తును, రైల్వేలను, నీటివనరులను, నావికాదిరవాణాసౌకర్యములను కలిగి యుండవలెను. లేదా నియమింపవలెను." మరియు "మత్తుపదార్థములు. పానీయములు సంపూర్ణముగ నిషేధింపబడవలెను." అని శాసించెను. అనేకమంది ప్రజలు దీనినంతనుఆక్షేపించవచ్చును; వారధికసంఖ్యాకుల యిచ్ఛకు లొంగవచ్చును: కాని యుల్లంఘనమువలన కలుగు ఫలితములకు భయపడియే వారిట్లుచేయుదురు. నిశ్చయముగ ప్రజాస్వామికమనగానల్పసంఖ్యాకులధికసంఖ్యాకులచేనిర్బంధింపబడుటయే యగును.

ఆస్థియొక్క హక్కులను మార్చునట్టి లేక చాలవరకు లాగి వేయునట్టి చట్టము నధికసంఖ్యాకు లామోదింతురు. అది నిర్బంధమను కారణముచే నాక్షేపించబడవలసినదేనా ? ఎన్నటికిని కాదు. అన్ని ప్రజాస్వామిక చట్టములలోను యిదేపద్ధతి యవలంబింపబడును. కనుక నిర్బంధమును కారణముచే నాక్షేపించుటకు వీలులేదు అధిక సంఖ్యాకు లవినీతిగను, అన్యాయముగను వర్తించుచున్నారని చెప్పవచ్చును. అధికసంఖ్యాకు లామోదించిన చట్టము నైతికసూత్రమును దేనినైన నతిక్రమించెనా? యనునదే విచారణీయాంశము. దీనినిశ్చయింపవలసినవా రెవరు?వ్యక్తులును, వర్గములును తమనిజప్రయోజనముల ననుసరించి ధర్మసూత్రములను నిర్ణయించు నెడల ప్రజాస్వామిక

ముకు కొంత నిర్బంధ మవసరమను సంగతిని నిర్లక్ష్యము చేయరాదు. సాంఘిక జీవితమున కేదో యొకవిధమగు ప్రభుత్వ ముండవలెను. ఈవిధముగ నధికారములో నుంచబడువారు సంఘమున కపకారము చేయునట్టియు, స్వతః స్వార్థపూరితమైనట్టియు వ్యక్తులయొక్కయు లేక వర్గముల యొక్కయు స్వభావముల నన్నింటిని వారింపవలెను. సాధారణముగ వా రవసరమును మీరి వర్తించెదరు. ఏలనన యధికారము మనలను పతితులను, అవినీతిపరులను చేయును. పరిపాలకులు స్వేచ్ఛ నెంత ప్రేమించి, నిర్బంధము నెంత ద్వేషించినను ఆ ప్రభుత్వములో ప్రతిమానవుడును కేవలము స్వార్థహీనుడై, ప్రజాసామాన్య శ్రేయస్సు నభిలషించు పరిపూర్ణుడగువరకు తిరుగుబాటుచేయు వ్యక్తులపై నిర్బంధము నుపయోగింపవలసియుండును. దండయాత్రలను చేయుచుండు బాహ్యజాతులపైనకూడ వారు నిర్బంధమును ప్రయోగింపవలెను. అనగా దౌర్జన్యమును దౌర్జన్యముతో నెదుర్కొని యాత్మరక్షణ చేసికొనవలెను. ఏకైక ప్రపంచ ప్రభుత్వమున్నప్పుడు మాత్రమే దీని యవసరముండదు.

కనుక నీవిధముగనాంతరంగికయైక్యములకు, బాహ్యసంరక్షణకు నిర్బంధ, దౌర్జన్యము లవసరమగునపుడు మన మెచ్చటగీతగీయవలెను? రాజకీయములకు మన మీవిధికృతమగు నైతికామోదము నొకసారి యిచ్చితిమా దౌర్జన్యరహిత నిర్బంధము, దౌర్జన్యసహిత నిర్బంధము లేక ప్రభుత్వనిర్బంధము, విప్లవకారులనిర్బంధము సంపూర్ణముగ వేరు చేయుట సాధ్యముకాదని రైనుహోల్డునీబరు సూచించుచున్నాడు.

లోపభూయిష్టమగు నీప్రపంచములో నేజాతీయప్రభుత్వమైనను స్వీయరక్షణకొరకు (పైవారిదాడులనుండి) దౌర్జన్యము నుపయోగింపవలసియుండునని గాంధీజీ యొప్పుకొనునని (ఇది నాకు నిశ్చయముగ తెలియదు) నేననుకొనెదను; ప్రభుత్వము నిశ్చయముగ తన యిరుగు పొరుగు ప్రభుత్వములపట్ల పరిపూర్ణమైన శాంతియుత మిత్రనీతి నవలంబింపవలెను. అయినప్పటికి దాడి సంభవింపనే సంభవింపదనుట మూర్ఖత్వము. అది నిర్బంధ స్వభావముగల కొన్ని చట్టములను కూడ

చేయవలెను. అనగా వివిధ తరగతులనుండి, వర్గములనుండి కొన్ని హక్కులను, అధికారములనుతీసికొనివానిస్వేచ్ఛాప్రియులనువిరోధించవలెను. చట్టము లన్నియు కొంతవరకునిర్బంధయుతములు. కాంగ్రెసు యొక్క కరాచీ తీర్మానము "ప్రజా దోపిడిని సమాప్తము చేయుటకు మాడుచున్న లక్షలకొలది ప్రజలయొక్క యదార్థ యార్థిక స్వేచ్ఛ కూడ రాజకీయ స్వేచ్ఛలో నిమిడి యుండవలెను" అని శాసించెను. వాంఛనీయమైన యీ భావమును సఫలము చేయుట కెక్కువ హక్కు లున్నవారు వానిని తక్కువహక్కులున్నవారికిచ్చివేయవలసి యుండును. మరియు పనివాండ్రకు జీవించుట కవసరమైన కూలియు ననేక యితర సౌకర్యములు నుండవలెను. ఆస్థిమీద ప్రత్యేకపన్నులు విధింపబడును. "ప్రభుత్వముప్రధానపరిశ్రమలను. సేనలను, ఖనిజసంపత్తును, రైల్వేలను, నీటివనరులను, నావికాదిరవాణాసౌకర్యములను కలిగి యుండవలెను. లేదా నియమింపవలెను." మరియు "మత్తుపదార్థములు. పానీయములు సంపూర్ణముగ నిషేధింపబడవలెను." అని శాసించెను. అనేకమంది ప్రజలు దీనినంతను ఆక్షేపించవచ్చును; వారధిక సంఖ్యాకుల యిచ్ఛకు లొంగవచ్చును: కాని యుల్లంఘనమువలన కలుగు ఫలితములకు భయపడియే వారిట్లుచేయుదురు. నిశ్చయముగ ప్రజాస్వామికమనగా నల్పసంఖ్యాకులధిక సంఖ్యాకులచేనిర్బంధింపబడుటయేయగును.

ఆస్థియొక్క హక్కులను మార్చునట్టి లేక చాలవరకు లాగివేయునట్టి చట్టము నధికసంఖ్యాకు లామోదింతురు. అది నిర్బంధమను కారణముచే నాక్షేపించబడవలసినదేనా ? ఎన్నటికిని కాదు. అన్ని ప్రజాస్వామికచట్టములలోను యిదేపద్ధతి యవలంబింపబడును. కనుక నిర్బంధమును కారణముచే నాక్షేపించుటకు వీలులేదు అధికసంఖ్యాకు లవినీతిగను, అన్యాయముగను వర్తించుచున్నారని చెప్పవచ్చును. అధికసంఖ్యాకు లామోదించిన చట్టము నైతికసూత్రమును దేనినైన నతిక్రమించెనా? యనునదే విచారణీయాంశము. దీనినిశ్చయింపవలసినవారెవరు? వ్యక్తులును, వర్గములును తమనిజప్రయోజనముల ననుసరించి ధర్మసూత్రములను నిర్ణయించు నెడల ప్రజాస్వామిక

పద్ధతి యనుసరించును. స్వంత ఆస్థి యుండుటవలన (అతి నియమిత భావములో తప్ప) వ్యక్తులకు సంఘమంతటిమీద నుపద్రవకరమైన యధికారము కలుగునని నేను భావింతును. కనుక నది సంఘమునకు కత్యంతాపకారియగును. అది త్రాగుడుకంటెకూడ నెక్కువ యవినీతికరమని నేను భావింతును.

దౌర్జన్యరాహిత్యమునందు విశ్వాసముకలదని చెప్పుకొను కొందరు యజమానుల సమ్మతిలేనిదే స్వంతయాస్థిని ప్రభుత్వవశము చేసుకొను యత్నము నిర్బంధమగుననియు, కనుక దౌర్జన్యరాహిత్యమునకు వ్యతిరేకమనియు నాతో చెప్పిరి. తమశిస్తులను బలవంతముగ వసూలుచేసికొనుటలో ప్రభుత్వసహాయమును పొందుట కెంతమాత్రము జంకని పెద్దజమీందారులు, తమభూములలో స్వాతంత్ర లేబరుసంఘము లుండుటకుగూడ ననుజ్ఞనీయని యనేక ఫ్యాక్టరీఖామందులైన పెట్టుబడిదారులు యీ భావమును నాకు శృతపరచిరి. ఫలితము ననుభవించువారిలో నధికసంఖ్యాకులు మార్పు కోరుచున్నారను విషయము చాలదట! దానివలన నష్టముపొందు వ్యక్తులనే మార్పుచేయవలెను. ఈ విధముగ స్వార్థములుగల కొద్దిమంది స్పష్టముగ కావలసినమార్పు నరికట్టవచ్చును.

ఆర్థికప్రయోజనములే తరగతుల యొక్కయు, వర్గముల యొక్కయు రాజకీయభావములను నిరూపించునని చరిత్ర తెలుపును. హేతువు, నైతికోద్దేశ్యములు ప్రయోజనముల నణచివేయజాలవు. వ్యక్తులు మారవచ్చును. వారు తమప్రత్యేకహక్కులను విడిచిపెట్టవచ్చును; కాని, తరగతులు; వర్గములు నట్లుచేయవు. పరిపాలించునట్టియు, హక్కులు కలిగినట్టియు తరగతినిమార్చు యత్న మింతవరకెల్లప్పుడు విఫలమయ్యెను: కనుక నది యికముందు జయింపగలదనుట కెట్టికారణములు కాన్పించవు.

ఒక తరగతిని లేక జాతిని మార్పుచేతుమనుటయు, సంఘర్షణను సహేతుకవాదముచేతను, న్యాయముచేయమని ప్రార్థించుటచేతను నిర్మూలింపవచ్చుననుటయు నాత్మవంచన యగును. తగినంత వత్తిడి

లేనిదే పరిపాలనచేయు నధికారపూరిత ప్రభుత్వము దేశముమీద తన పరిపాలనను వదలుననుకొనుటయు, నొక తరగతి తన యున్నతస్థితిని హక్కులను విడిచిపెట్టు ననుకొనుటయు వట్టి భ్రమలు.

గాంధీజీస్పష్టముగ నా వత్తిడినే (అది బలవంతమని యతడు పిలువకపోయినను) ప్రయోగింపగోరును. అతని ప్రకార మాత్మబాధయే యతనిపద్ధతి. దీనిలో మానసికస్వభావముండుటచేతను, కొలుచుటకు తూచుటకు, మరే స్థూలప్రమాణముచేతను గ్రహించుటకు వీలు లేకపోవుటచేతను, దీనిని భావించుట కొంత కఠినమైన విషయము. శత్రువు నిది కంగారుపరచుననుట కెట్టిసందేహము లేదు. ఇదివాని నైతిక మర్మములను బహిర్గతమొనరించును; వాని స్థైర్యమును చెదరగొట్టును. వానిలోనున్న సర్వోత్తమమైనదానిని స్పృశించును. సమాధానమునకు ద్వారమును తెరచియుంచును. ఆత్మబాధయు, ప్రేమమార్గమును శత్రువులోను, చూపరులలోనుకూడ శక్తివంతమైన మానసిక, యాధ్యాత్మిక భావముల నుత్పన్నముచేయుననుట కెట్టి సందేహము లేదు. అడవిజంతువును సమీపించువిధములో చాలభేదముండునను విషయము వేటకాండ్రందరకు తెలియును. అదిదూరమునుండియే వేటకాని బింకమును గ్రహించి తదనుగుణ్యముగ వర్తించును. అతనిలో చీమ కాలంత భయమున కాస్పదముండుచో (దానినతడే గుర్తింపకపోవచ్చును.) నది యెట్లో యామృగమునకుచేరి యతనిలో భయమును పుట్టించును. ఈసమయములోనది వానిపైకురుకును. సింహమునుమచ్చిక చేయువాని స్థైర్య మొక్కనిమిషము చెదరెనా యతడు వెంటనేయెదుర్కొనబడును. ఏమాత్రము భయములేని మనిషి కడవిమృగముల వలన నపాయము కలుగజాలదు. కనుక మానవు లీ మానసిక ప్రేరేపణలకు లోబడుట సహజము. కాని, వ్యక్తులట్లులోబడినను, వర్గమును తరగతియు నట్లుచేయుట సందేహాస్పదము ఆతరగతికి (మొత్తము మీద) రెండవపక్షముతో సన్నిహితసంపర్కము, ప్రత్యక్షసంబంధము నుండజాలదు. అది వినునట్టి నివేదికలకూడ నసంపూర్తిగను, వికారముగనుండును. ఏదిజరిగినను దానియధికారమును ధిక్కరించు యేవర్గము

మీదనైన ప్రయత్నముగ కలుగు కోప మత్యధిక మగుటచే వది చిల్లర భావములన్నింటిని మ్రింగి వేయును. తనయుత్తమాధికారమును, హక్కులును సాంఘికశ్రేయస్సు కవసరమను భావముకు చిరకాలము నుండి యలవడిపోవుటచే వ్యతిరేకాభిప్రాయము మతిభ్రష్టత వలె నుండును. న్యాయము, క్రమము, వర్తమానస్థితిని సంరక్షించుట ప్రధానగుణములగును. వానిని సవాలుచేయు ప్రయత్నములు గొప్ప పాపములగును.

కనుక వ్యతిరేకవర్గమునకు సంబంధించినంతవరకు పరివర్తనవిధానము మందమగనుండును. నిశ్చయముగనొక్కొక్కప్పుడువారికత్యవు రొక్క సాధుత్వము, పావనత (వారినితప్పుమార్గములోనికీడింపునట్లు కాన్పించును కనుక) వారికి మరింత కోపమును కలుగచేయును. తాను తప్పుచేసియుండవచ్చునని రొకవ్యక్తి సందేహింప నారంభించుచో వతని ధార్మికాగ్రహ మభివృద్ధియగును. అయినప్పటికిని దౌర్జన్య రాహిత్యశాస్త్ర మెదిరిపక్షములోని చెదురు వ్యక్తులను మార్చి తద్వారా ప్రతిపక్షదారుఢ్యమును తగ్గించును. ఇంతకంటె నెక్కువగ నది తటస్థుల సానుభూతి నాకర్షించును అది ప్రపంచాభిప్రాయమును మార్చు బలీయమైన యుపకరణము కాని. పరిపాలనచేయు వర్గము వార్తలను పైకిపోకుండ చేయవచ్చును. లేదా వికారపరచవచ్చును అది ప్రచురణచేయు యేజెన్సీలను నియమించును. కనుక యదార్థములను తెలియకుండ చేయగలదు దౌర్జన్యరాహిత్యపద్ధతి యవలంబింపబడు దేశములోనున్న యుదాసీనులగు నధికసంఖ్యాక ప్రజలమీదనే యీ శాస్త్ర మద్భుతముగ పనిచేయును. వారు నిశ్చయముగ మారుదురు. దానియెడల నత్యుత్సాహమును చూపుదురు. కాని, వారదివరకే యీలక్ష్యమును సాధారణముగనామోదించిరి. కనుక వారిలో విశేషమార్పు అవసరమే లేదు. మార్పునకు భయపడువారిలో నంత స్పష్టమగు ఫలితము కాన్పించదు. భారతదేశములో నసహాయోద్యమము, శాసనోల్లంఘనము శీఘ్రముగ వ్యాపించుటవలన దౌర్జన్య రహిత యుద్యమ మధికసంఖ్యాకులపై నెంత శక్తివంతముగ పని

చేయునో సందేహాస్పదుల నెట్లు మార్చివేయునో విశదముచేసెను. అది దానికి మొదటినుండి వ్యతిరేకులైనవారి నెక్కువ మార్పుచేయ లేదు. ఉద్యమ విజయము నిశ్చయముగ వారి భయములను వృద్ధిచేసి వారిని మరింత వైరులను చేసెను.

ప్రభుత్వము తనస్వేచ్ఛను రక్షించుకొనుటకు దౌర్జన్యము నుపయోగించుట న్యాయమని యొప్పుకొనబడినచో నాస్వేచ్ఛను సాధింప యత్నించుటలోగూడ నదేవిధమున నది యేలన్యాయముకాదో యర్థముకాకున్నది. దౌర్జన్యపద్ధతి వాంఛనీయముకాకపోవచ్చును, పొసగకపోవచ్చును. కాని,యది సుతరాము యక్రమము,నిషిద్ధము కాజాలదు. సాయుధసైన్యములన్నియు ప్రభుత్వములోనున్నవను విషయ మొక్కటియే దానినుపయోగించుటకు వారికెక్కువ హక్కు స్థిరపరుపజాలదు. దౌర్జన్యరహిత విప్లవము జయించి ప్రభుత్వమును వశపరచుకొనినచో దౌర్జన్యమును ప్రయోగించుటకు దాని కిదివరకులేనిహక్కు వెంటనే కలుగునా? దాని యధికారముమీద తిరుగుబాటు కలుగుచో నదిదాని నెట్లెదుర్కొనును; దౌర్జన్యపద్ధతుల నుపయోగించుట కది సహజముగ యిష్టపడదు. అది యున్ని శాంతియుత పద్ధతులచేతను పరిస్థితినిసాధింప యత్నించును కాని,యది దౌర్జన్యము నుపయోగించు హక్కును వీడజాలదు. మార్పుకిష్టపడని ప్రతికూలురు ప్రజలలో నిశ్చయముగ నుందురు. వారు పూర్వపుస్థితికి పోవలెనని యత్నింతురు. తమ దౌర్జన్యము నూతనప్రభుత్వ సాయుధబలముచే నణచివేయబడదని భావింపబడుచో వారు దానిని మరింతజోరుగ నుపయోగింతురు. కనుక దౌర్జన్యమునకు, దౌర్జన్యరాహిత్యమునకు మార్పుకు, బలవంతమునకుమధ్య నొక కచ్చితమైన గీతగీయుట యసాధ్యమని తోచుచున్నది. రాజకీయ మార్పుల సందర్భములోనే యదార్థమైన కష్టముకలదు. హక్కులుకల తరగతికి కొల్లగొట్టబడు తరగతికి మధ్య నది మరింత కష్టతరమగును.

ఒకలక్ష్యముకొరకు బాధ పడు టెల్లప్పుడుమెప్పువడసెను. లొంగిపోకుండ నెదురుబాధింపకుండ నొకధర్మముకొరకు బాధపడుటలో నుదారత, గొప్పతనము కలవు అయినను దీనిని బాధకొరకే బాధపడు

సిద్ధాంతమునుండి వేరుచేయు రేఖ యతిసున్నితమైనది. ఈ రెండవరకపు యాత్మబాధ యొక్క వత్తిడిక్రింద, కొంత పరువుతక్కువ వ్యాపారము క్రింద పరిణమింపవచ్చును దౌర్జన్యము తరచు పాపిష్టిదగుచో దౌర్జన్య రాహిత్యము, (అధమము దాని వ్యతిరేక భావములోనైనను) మరి యొక తప్పిదము చేయవచ్చును పిరికితనమునకు, నిర్వ్యాపారత్వము నకు, వర్తమానస్థితిని నిల్పుకొనుటకు దౌర్జన్యరాహిత్యము నొక ముసుగగా చేసికొను అవకాశముకూడ యెల్లప్పుడు కలదు.

గొప్ప సాంఘికమార్పులు కలుగవలెనను భావమునకు భారత దేశములో ప్రాధాన్యతవచ్చిననాటినుండియు నట్టిమార్పులకు విధాయకముగ దౌర్జన్య మవసరమనియు కనుక నది పనికిరావనియు నొక వాదము బయలుదేరెను తరగతుల మధ్య పోరాటములను (అవి యెంతయెక్కువగనున్నను) తలపెట్టరాదు; ఏదోయొక స్థితిలో దౌర్జన్యము లేనిదే సాంఘిక సమస్యాపరిష్కారము జరుగనేరదనుట సంభవమే కావచ్చును హక్కులుగల తరగతులు తమ స్థితిని రక్షించుకొనుటకు దౌర్జన్యము నుపయోగించుటకు సందేహింపరనుట నిశ్చయము. దౌర్జన్యరాహిత్యశాస్త్రముద్వారా, సిద్ధాంతములో, గొప్ప రాజకీయమార్పును సాధింపగలుగుచో దానితోనే సాంఘికమార్పును కూడ నేల సాధింపజాలము? రాజకీయస్వేచ్ఛను, బ్రిటిషు సామ్రాజ్యమును తొలగించుటయు మనము దౌర్జన్యరహితముగ సాధింపగలిగినపుడు ఫ్యూడల్ సంస్థానములు, భూస్వాములు, తక్కిన సాంఘిక సమస్యలు–మొదలగువానినికూడ నావిధముగనే యేల పరిష్కరింప జాలము; ఇదియంతయు దౌర్జన్యరాహిత్యముగ సాధ్యమగునా కాదా యనునది యెక్కువ సమస్యకాదు. ఈ రెండును దానిచే సాధింపబడ వచ్చును లేనిచో రెండును సాధింపబడనేరవు. దౌర్జన్యరాహిత్య పద్ధతి విదేశపాలకునిమీదనే వినియోగించునని చెప్పబడజాలదు. దానిని దేశములోని స్వజాతీయ స్వార్థప్రయోజనములమీదను, ప్రతీకారులమీదను వినియోగించుట యెక్కువ సుకరము; ఏలనన వారి మీద కలుగు మానసికఫలితము లితరులమీద కలుగుదానికంటె నధికముగ నుండును.

దౌర్జన్యరాహిత్యమునకువిరుద్ధములని యనుకొనబడినలక్ష్యములను,నీతులనుభారతదేశములోగ్రహించు నవీనస్వభావము తలక్రిందులు పద్ధతిగ నాకు కాన్పించును. అతియోగ్యము, పటుతరమునగు విధమున మమ్ము మా లక్ష్యమునకు తీసికొనిపోవునని దౌర్జన్యరాహిత్య పద్ధతి వాగ్దానముచేయుటచేత మేము పదిహేనేండ్ల క్రితము దానినంగీకరించితిమి. అప్పుడు లక్ష్యము,దౌర్జన్యరాహిత్యము వేరు వేరుగనుండెను. లక్ష్యము కేవలము దాని తోకవలె లేక దానిఫలితమువలెనుండలేదు. స్వేచ్ఛ లేక స్వాతంత్ర్యము దౌర్జన్యరాహిత్యముచే సాధ్యమైనయెడలనే ప్రయత్నింపబడవలెనని యెవ్వరును చెప్పియుండలేదు కాని, యిప్పుడు మనలక్ష్యమే దౌర్జన్యరాహిత్యముచే పరీక్షింపబడుచున్నది. దానికి సరిపడనట్లు కాన్పించినయెడల త్రోసివేయబడుచున్నది. కనుక దౌర్జన్యరాహిత్యభావము బిరబిగిసిన ధర్మమవ్వుచున్నది. దానిని సవాలుచేయరాదు! ఈకారణముచే బుద్ధినొప్పింపగల దాని యాధ్యాత్మికశక్తి తగ్గిపోవుచు నది మతము, విశ్వాసము అను గూళ్ళలో చేరిపోవుచున్నది. స్వార్థపరుల స్వార్థముల కది జీవగఱ్ఱకూడ నగుచు వర్తమానస్థితిని సంరక్షించుకొనుటకు దానిని కొల్లగొనుచున్నది.

ఇది చాల విచారకరము. దౌర్జన్యరాహిత్య విరోధభావములు, నట్టి సంగ్రామశాస్త్రము భారతదేశమునకు, తక్కిన ప్రపంచమునకు నమూల్యములని నేనుభావించెదను. వీనినిగురించియోచించునట్లాధునిక భావమును బలవంతపరచి గాంధీజీ గొప్పసేవచేసెను. వానికి గొప్ప భవిష్యత్తుకలదని నేనువిశ్వసించెదను. మానవలోకమువానినిపూర్తిగ నవలంబించుటకు తగినంతయభివృద్ధి చెందకపోవచ్చును. "గ్రుడ్డివానికి నీదృష్టియను కాన్ప్వ్రత్తి నిచ్చెదవు" "కాని, దాని నతడేకక్రక్రింద నువయోగించుటతప్ప మరెట్లు వినియోగింపగలడు!" ప్రస్తుతమాదృష్టి తగినంతయుండకపోవచ్చును. కాని, యన్నియుత్కృష్టభావములవలెనే దానివలుకుబడియభివృద్ధిచెందియంతకంతకు మనకార్యములను మార్చివేయవచ్చును. అసహాయోద్యమము దుష్ప్రభుత్వమునుండి లేక సంఘమునుండి సహాకారమును లాగివేయునట్టి యతిశక్తివంతమైన

సృజనశక్తికల భావము. నైతికసంపదకలవారు కొద్దిమంది దాని నాచరించినను దానిఫలితము విస్తరించి దినదినాభివృద్ధి యగుచుండును. అధికసంఖ్యాకులలో బాహ్యఫలితము యెక్కువ గోచరమగును. కాని, యితర కారణములు నైతికసారాంశమును మరుగుపరచవచ్చును. దాని విస్తృతి దానిగంభీరతను మార్చునట్లు కాన్పించును. సాముదాయక మానవుడు వ్యక్తిని వెనుకకు త్రోసివేయును.

అయినప్పటికి శుద్ధదౌర్జన్యరాహిత్యమునే రాపాడుటచే నది జీవితమునకు దూరము, బాహ్యము నగుచున్నది. ప్రజలు దానిని గ్రుడ్డిగ నొక మతమువలె నంగీకరింతురు. లేక పూర్తిగ నిరాకరింతురు. వివేచనస్వభావమూలాలకు త్రోయబడెను. 1920లో భారతదేశక్రిస్తులపై నదిమంచిఫలితము కలుగజేసెను. అనేకమంది యా సంఘము నుండి విరమించిరి. మిగిలినవారు కూడ సందేహమనస్కులై దౌర్జన్య కృత్యములను మానివేసిరి. దానికిప్పుడు వారిమీద నట్టిపలుకుబడి లేదు. అసహాయోద్యమములోను, శాసనోల్లంఘనములలోను ప్రధానపాత్రలనుధరించి. దౌర్జన్యరాహిత్యపద్ధతియొక్క యంతరార్థములకనువగునట్లు జీవించుటకు మనఃపూర్వకముగ ప్రయత్నించిన యనేకమందికాంగ్రెసు వారుకూడ కాంగ్రెసులోనుండనర్హులుకాని కాంగ్రెసు భ్రష్టులవలెనే భావింపబడుచున్నారు. దౌర్జన్యరాహిత్యము నొక మతముగ, సిద్ధాంతముగ నంగీకరింపక జాలకపోవుట పోరాడతగిన యేకైక లక్ష్యమని వారు భావించిన సామ్యవాద ప్రభుత్వ లక్ష్యము—అందరకు సమాన న్యాయము, సమానావకాశములు; ప్రస్తుతమున్న స్వంతఆస్తి హక్కులను ప్రత్యేకాధికారములను చాలవరకు రద్దుచేసి యేర్పాటుచేయు సంఘము వీడకపోవుట వారు చేసిన పాపములు. గాంధీజీ మహాశక్తి సంపన్నుడు అతనిదౌర్జన్యరాహిత్యము శక్తివంతమైనది, చైతన్యములో నుట్టిపడు స్వభావముకలది. అతడు దేశమును తిరిగి యెప్పుడుద్దీపితము చేయునో యెవరికిని తెలియదు. అతనిగొప్పతనము, అతనివిరుద్ధములు ప్రజలను కదల్చువతనిశక్తి యపారములు. అతడు మామూలుప్రమాణముల కతీతుడు. మన మితరులను కొలవేయునట్లుపరీక్షించు నట్లతనిని

గొలవేయుజాలము; పరీక్షింపజాలము. కాని, యతని శిష్యులమని చెప్పు కొనువారు చాలమంది పసలేని స్వప్తి వాచకులు; లేక టాల్‌స్టాయి మాదిరి సాత్త్వికులు, లేక జీవితముతోను, సత్యముతోను సంబంధము లేని యొక సంకుచిత సంఘ సభ్యులు. వారు ప్రస్తుతక్రమమును నిలుపు కొనజూచువారి ననేకమందిని (దీనికొరకు దౌర్జన్యరాహిత్యము క్రింద శరణుజొచ్చువారిని) తమచుట్టు జేరతీయుదురు. ఈ విధముగ స్వార్థము జొరబడి శత్రువునుమార్చువిధానము దౌర్జన్యరాహిత్యముపేరిట నిజపరి వర్తనముగ పరిణమించి శత్రువుతో నేకీభవించునట్లు చేయును. ఉత్సా హముతగ్గి మనము దుర్బలులమైనపుడు కొంచెము వెనుకకుపోవలెనను స్వభావము, రాజీస్వభావము, ఎల్లప్పుడు నుండును. ఇది శత్రువును మార్చుకళయని పిలుచుట సుఖావహముగనుండును. ఒక్కొక్కప్పుడు పాత స్నేహితులను బలివేసి యీలబ్ధిని సంపాదింతుము. మన క్రొత్త స్నేహితులకు కోపము కలిగించునట్టివారి యధిక ప్రసంగములను వాక్యములను గర్హించి వారు మన బలగములోని యైక్యమును భంగముచేయుచున్నారని దూషింతుము. సాంఘిక క్రమములో యదార్థ పరివర్తనము తెచ్చుటకు బదులు వర్తమాన పద్ధతిలోని యుదారతకు, దయకు ప్రాశస్త్యమిత్తుము. ఉన్న స్వార్థములు యథా ప్రకారముగనే యుండును.

సాధనయొక్క ప్రాముఖ్యతను యెక్కువ స్థాయిలో నుంచి గాంధీజీ మనకుగొప్ప సేవచేసెనని నేను విశ్వసించెదను. అయినప్పటికి తుదిమాట విధాయకముగ మన దృష్టిలోనున్న లక్ష్యమునుగురించియే యుండవలెను; మనము దానిని భావింపజాలనిచో స్పష్టమైన లక్ష్యము లేని ద్రిమ్మరుల మగుదుము. కాని పరికరములను నిర్లక్ష్యము చేయు టకు వీలులేదు. ఏలనన నైతిక విషయమటులుండ వానికి కార్యసాధక శక్తికూడ కలదు. దుష్టములు, నవినీతికరములగు పరికరములు తరచు దృష్టిలోనున్న లక్ష్యమునే విఫలముచేయును. లేదా యనేక క్రొత్త సమస్యల నుత్పన్నముచేయును. ఇంతకు మన లక్ష్యముచేతగాక మన మవలంబించు పద్ధతులచేతనే యదార్థముగ పరీక్షింపబడుదుము.

అనవసర పోరాటములకు, ద్వేషములకు కారణమగు పరికరముల వలన మన లక్ష్యమును సాధించుట మరింత కష్టము, దూరము నగును; సాధనసాధ్యములు నిశ్చయముగ నతి విశేషసంబంధము కలిగియుండుటచే మనము వానిని వేరు చేయజాలము. గాంధీజీ నైతిక శిక్షణమును కఠినముగ శాసించుటకూడ చాల యవసరము. కాని, వ్యక్తులకు సంబంధించిన యతని శిక్షాప్రమాణములు చర్చనీయములు. అతడు సాంఘిక దోషములకంటె వ్యక్తి దోషములకు, లోపములకు విశేషప్రాముఖ్యత నిచ్చును. దీని యావసరము స్పష్టము గనేయున్నది. ఏలనన యెడారిని వీడి ప్రత్యేకహక్కులుగల వర్గములతో నధికారస్థానములలో దూరవలెననెడు మోహ మనేకమంది కాంగ్రెసువారిని లాగివేసెను. ముఖ్యుడైన కాంగ్రెసువాని కా ద్వార మెప్పుడూ తెరువబడియే యుండును.

నేడు ప్రపంచమంతయు 'పంచాగ్నుల' నడుమ నున్నది. కాని వానిలో నాత్మవ్యాధి యతి విశేషముగ నున్నది ఇది ముఖ్యముగ తూర్పు దేశములలో నున్నది. నవీనముగ నితర చోట్లకంటె ఆసియాలో నెక్కువ మార్పులు కలిగెను. వానికి సరిపెట్టుకొనవలసిన విధానము చాల బాధకరముగనున్నది. పరిస్థితులను పరిపాలించు రాజకీయసమస్య యన్నిటికంటె తక్కువ ప్రాముఖ్యతకలది. మన కది ప్రధానసమస్య. యదార్థమైన సమస్యలను చేబట్టుటకు పూర్వ మిది తృప్తికరముగ పరిష్కరింపబడవలెను. మనము యుగములనుండిమార్పు చెందుచుండని యొక మారాల సాంఘికక్రమమున కలవడిపోతిమి. మనలో చాలమంది యది యొక్కటియే సాధ్యము, యుక్తము నగు సాంఘికపునాది యని యింకను విశ్వసించుచు మన నైతిక భావములను దానితో మేళవింప జేయుచున్నాము. కాని గతకాలమును వర్తమానముతో గుదిగుచ్చ వలెనను మనయత్నములు విఫలమగును. "చివరకు గతిలేక ఆర్థికనీతు లార్థికావసరములను కనిపెట్టుకొనియుండును" అని వెబ్లను చెప్పెను. నేటి యవసరములు వానిప్రకార మొక నూతననీతిని సృష్టించుకొనునట్లు మనలను బలవంతపరచును. మన మీ యాత్మవ్యాధినుండి బయటపడి

నేటియదార్థమైన యాధ్యాత్మిక విలువలను తెలిసికొనవలెననిన నేమతముయొక్క సిద్ధాంతములవెనుకను శరణు పొందక సారాంశములను నిర్మొగమాటముగ, ధైర్యముగ నెదుర్కొనవలెను మతము చెప్పునది మంచిదికావచ్చును చెడ్డదికావచ్చును. కాని యది దానిని చెప్పువిధమును దానిని మనము విశ్వసింపవలెననుటయు నేసమస్యను వివేచనతో యోచింపవలెననుదానిని దోహదముచేయదు. ఫ్రూడ్ చెప్పినట్లు మతసిద్ధాంతములు "మూడుకారణములచే విశ్వాసనీయార్హములగుచున్నవి. మొదటిదానినిమనపితామహులిదివరకే విశ్వసించిరి; రెండవది యీప్రాచీనకాలమునుండియే మనకందజేయబడిన రుజువులు కలవు. వాని యదార్థ్యములను మనమెంతమాత్రము శంకింపరాదని నిషేధింపబడినారము"

దౌర్జన్యరాహిత్యమును, తత్సంబంధములను మనము మతదృష్టితోను సిద్ధాంతదృష్టితోను విచారింపవలసినయెడల వాదమునకు స్థానముండదు అదియొక తెగకు సంబంధించు సంకుచిత సిద్ధాంతముగ తయారగును. దానినిప్రజలంగీకరింపవచ్చును అంగీకరింపకపోవచ్చును. దానిశక్తియు, వర్తమానసమస్యల కన్వయము తగ్గిపోవును. కాని, ప్రస్తుతపరిస్థితులకు సంబంధించునట్లు మనము దానిని చర్చింప సంసిద్ధులమగుదుమేని యీప్రపంచమును పునఃసృష్టిచేయు మనయత్నములకది యెంతయో తోడ్పడగలదు. ఈ చర్చలో సాముదాయక మానవునియొక్క స్వభావము, దుర్బలత్వము మనము పరిగణింపవలెను బాహుళ్యముమీద జరుగుయేకార్యమైనను, ముఖ్యముగగొప్పమార్పులను విప్లవకరములగు మార్పులను కోరుయేకార్యమైనను, నాయకులు దానినిగురించి యోచించువిధమునగాక వర్తమాన పరిస్థితులనుబట్టియు నంతకంటె నెక్కువగ వారెవరితో పనిచేయుదురో యట్టి మానవలోకము దానిని భావించు విధమునుబట్టియు ఫలించును.

ప్రపంచ చరిత్రలో దౌర్జన్యము విశేషపాత్ర వహించెను. నేడది తత్తుల్యమైన ప్రాముఖ్యతనే వహించుచున్నది. బహుశఃచాల కాలమువరకది యుట్లేచేయును. గతమార్పులు చాలవరకు దౌర్జన్యము

చేతను, బలవంతముచేతను చేయబడెను. డబ్ల్యూ, గ్లాడ్‌స్టను ఒక సారి యిట్లు చెప్పెను. "రాజకీయవిషమపరిస్థితులలో దేశప్రజలకు దౌర్జన్యమును ద్వేషింపుడు. క్రమమును ప్రేమింపుడు, ఓర్పు వహింపుడు, అనుసందేశములుతప్ప మరేవియు నీయబడనిచో దేశ స్వాతంత్ర్యము లెన్నటికి సాధింపబడియుండెడివి కావు."

అప్పుడు, యిప్పుడు దౌరన్యప్రాముఖ్యతను నిర్లక్ష్యముచేయుట సాధ్యముకాదు. అట్లుచేయుట జీవితమును నిర్లక్ష్యము చేయుటయే యగును. అయినను దౌరన్యము నిస్సందేహముగ చెడ్డది అది దాని వెనుక నంతములేని చెడుఫలితములను విడిచిపెట్టును. తరచు దౌర్జన్యముతోనుండు ద్వేషము, క్రౌర్యము, పగ, శిక్షించుట—యనుభావములు దౌర్జన్యముకంటెను చెడ్డవి. నిశ్చయముగ దౌరన్యము వస్తుతః చెడ్డది కాదు. దానితోనుండు యీభావములచేతనే యది చెడ్డదియగుచున్నది. ఈభావములులేని దౌర్జన్య ముండనచ్చును మంచి, చెడ్డకూడ దౌర్జన్యముండవచ్చును. కాని యీ భావములనుండి దౌర్జన్యమును వేరుచేయుట దుర్ఘటము. కనుక సాధ్యమైనంతవరకు దౌర్జన్యమును తప్పించుట వాంఛనీయము. అయినప్పటికి దానిని తప్పించుట కంత కంటె నెక్కువగ చెడుగులకు లొంగిపోవు శూన్య స్వభావమునుమన మంగీకరింపజాలము. దౌరన్యమునకు లొంగుట, లేక దౌరన్యము మీద నాధారపడిన యన్యాయ పరిపాలన నంగీకరించుట దౌర్జన్య రాహిత్యతత్త్వమునే వ్యతిరేకించుట యగును. దౌర్జన్యరాహిత్య పద్ధతి శక్తివంతముగనుండి యట్టిప్రభుత్వమును, సాంఘిక క్రమమును మార్చునట్టిశక్తి కలిగియుండవలెను.

అది యట్లుచేయగలదో లేదో నాకు తెలియదు. అదిమనలను చాలదూరము తీసికొని పోగలదని నేను భావించెదను—కాని, యదిమన లను తుదిలక్ష్యమునకుతీసికొనిపోగలదాయని నేను శకింతును. అదెట్లు జరిగినను యేదో యొకవిధముగు నిర్బంధము విధాయకమని తోచును. సంఘములోనున్న ప్రస్తుత పోరాటములు—జాతీయములు, తరగతుల మధ్య—నిర్బంధమువలనగాని యెన్నడు నిర్మూలింపబడనేరవు. నిశ్చయ

ముగ గొప్పమార్పు యుండితీరవలెను; ఏలనన విశేషజనము మారిన గాని సాంఘిక పరివర్తనోద్యమమునకు నిజమైనయాధారముండనేరదు. కాని, కొంతమందిమీద నిర్బంధముండును. ఈ మూలవిరోధములను దాచిపెట్టి యవి లేవని చూప యత్నించుటయుక్తము కాదు. అది సత్యము నణచివేయుటయే గాక యదార్థములనుగురించి ప్రజలను తప్పుమార్గమున పెట్టి వర్తమానక్రమమును ప్రత్యక్షముగ సమర్థించుటయగును; తమ ప్రత్యేకహక్కులను సమర్థించుకొనజూచు పాలక తరగతులకు నైతికాధారము నిచ్చుట యగును ఒక యక్రమపద్ధతి నెదుర్కొనుట కది యే యసత్యసిద్ధాంతములపై నాధారపడెనో వానిని బయటపెట్టిసత్యమును విశదముచేయవలెను. అసహాయోద్యమములో నొక సుగుణమేమనిన నది యీఅసత్యసిద్ధాంతములనుబయల్పరచును.

తరగతులు లేని సంఘమును స్థాపించుట మన పరమలక్ష్యము. అందరకు సమానార్థికన్యాయము, సమానావకాశములు, మానవ లోకము నున్నతమైన యార్థిక వైజ్ఞానిక స్థాయికి తెచ్చుట కేర్పాటు చేయబడిన పునాదిమీద స్థాపింపబడుసంఘము,ఆధ్యాత్మిక ప్రయోజనములను, సహకారమును, స్వార్థరాహిత్యమును, సేవాతత్త్వమును, న్యాయమునుచేయవలెనను కోరిక, సుహృద్భావము, ప్రేమ - ఈ యన్నింటిని దోహదముచేసి చివరకు ప్రపంచక్రమమును, కళ్యాణమును సాధించుసంఘము దీని కడ్డమువచ్చిన ప్రతిదానిని మెల్లగా తొలగింపవలెను. అవసరమైనచో బలవంతము నుపయోగింపవలెను. తరచు నిర్బంధ మవసరమగు ననుట కెట్టి సందేహము లేదు. కాని, బలవంతమును ద్వేష, క్రౌర్యములతో గాక నభ్యంతరమును తొలగింపవలెనను యుదారకోరికతో నుపయోగింపవలెను. అది కష్టమే యగును. అది సులభమైన పనికాదు. సుకరమైన మార్గమేదియును లేదు. అసంఖ్యాకములగు గోతులును కలవు. కాని, కష్టములు, గోతులు మనము వానిని చూడనిచో మాయము కాజాలవు. వాని నిజస్వభావమును గ్రహించి మనము వానిని ధైర్యముగ నెదుర్కొనవలెను. ఇదియంతయు గగనకుసుమమువలె, వాయుసౌధమువలె

కాన్పించవచ్చును. ఈ యుదారభావములచే ననేకమంది ప్రేరేపింపబడకపోవచ్చును. కాని, మనము దానిని దృష్టిలో నుంచుకొని బలవరచవచ్చును; క్రమముగ నవి రాగ, ద్వేషములను తగ్గింపవచ్చును.

మన వద్ధతు లీ లక్ష్యమునకు తీసికొనిపోవలెను ఈభావములమీద నాధారపడవలెను. కాని, మానవస్వభావము (సమూహముమీద) దాని తత్వమునుబట్టి మన పనతులను, బోధలను యెల్లపుడు మన్నింపదనియు లేక నున్నత నైతిక సూత్రములను బట్టి యాచరింపదనియు గుర్తింపవలెను. మార్పునకు తోడు తరచు నిర్బంధముకూడ నుండవలెను. ఈ నిర్బంధమును నియమించి దాని చెడుగు తగ్గిపోవువిధమున నుపయోగించుటయే మనము చేయగల యుత్తమ కార్యము.

64

తిరిగి ఢేరా జయిలు

ఆలీపూరుజయిలులో నాస్వాస్థ్యము చెడి నా బరువు తగ్గుటచే నేను డెహారాడూనుజయిలుకు బదిలీచేయబడితిని. నా బదిలీకి నేను సంతోషించితిని. కాని, యీ సారి బాగుచేసి యమర్చబడిన పాత గొడ్లశాలలో నన్నుంచిరి. దానికొక వరండా, చిన్నదొడ్డి యుండెను. నా కది వెనుకటిదానికంటె బాగుగనున్నను యితరమార్పులు బాగుండలేదు. నే నచ్చట మూడు మాసములున్నను నా కీ సత్పర్వతదర్శనముకూడ లభింపలేదు. నా చుట్టున్నగోడ వెనుకటికంటె బాగుగ యెత్తుచేయబడెను. నన్ను జయిలు ద్వారముముందర తిరుగనీయలేదు. నా చిన్న దొడ్డియే నా వ్యాయామమునకు చాలినంత పెద్దదియని భావింపబడెను.

ఇవియు, మరికొన్ని నూతననిర్బంధములు నాకాశాభంగముగనుండెను. నాకు కోపముకలిగెను నేను నిస్పృహుడనై నా కవకాశమున్న యాకొద్దివ్యాయామమును తీసికొన నిచ్ఛగింపకుంటిని. నేను మున్నెన్నడు ప్రపంచసంబంధమంతయు తెగి యింత యేకాకిగనుండలేదు. దీనివలన నా నరములు క్రుంగనారంభించి శరీర, మానసిక క్షైణ్యమునొందితిని. నా గోడకవతల కొన్ని యడుగుల దూరములో రమణీయకత, పరిమళము, శార్వలసౌంభము కండ్లకింపుగూర్చు భూమి, దూరములోని వృక్షవాటికలు కలవని నే నెరుగుదును. కాని యవయన్నియు నాకందనిమ్రాకులు. ఎల్లప్పుడు ఆగోడలనే చూచుచుండుటచే నాకండ్లలసిపోయిబరువెక్కెను నన్నుప్రత్యేకముగనుంచుటచే జయిలోనుండు మామూలు కదలికకూడ నాకు లేకుండెను.

ఆరువారములైన తరువాత వర్షములారంభించెను. ఉష్ణము తగ్గెను. వాతావరణముమారెను. నూతనజీవితముపొడసూపెను. నాశరీరము చల్లబడి విశ్రాంతినొందెను. కాని, నా కండ్లకు మనస్సుకు విశ్రాంతిలేదు. ఒక్కొక్కప్పుడు నా దొడ్డి యినుపతలుపు తెరువబడుచుండెడిది. హఠాత్తుగ నాకు బహిఃప్రపంచము వర్ణములతో ప్రకాశించుచు ముత్యములవంటి వర్షబిందువులతో మెరయు పచ్చనిపొలములు

లెట్లు కాన్పించెడివి. ఒక్కక్షణిక కాలము! ఇంతలో తలుపు దభాలున మూయబడెడిది. నేను దగ్గరనున్నచో మరింత జాగ్రత తీసికొనవలసిన దని హుకుము! ఆ క్రొత్తదన, పచ్చదనముల యీషద్దర్శనము నాకు స్వదేశభ్రాంతి కొల్పెడిది. హృదయవేదన కలిగెడిది. తలుపు తెరువబడినను కూడ నే నవతలకు చూచుట మాని వేయగోరితిని.

కాని, యీ విచారమంతయు, జయిలుదోషముకాదు బయట విషయములేవియు బాగుండలేదు. కమల యనారోగ్యముగనుండెను. రాజకీయములు నాకు బాధకరముగనుండెను కమల పురాతనవ్యాధి ముదురుచుండెను. నే నామెకేమియు సేవ చేయజాలని యసహాయుడనై తిని విచారించితిని. నేనామె ప్రక్కనున్నచో పరిస్థితులు వేరుగ నుండెడివి.

ఇచ్చట నాకు దినపత్రిక వచ్చెడిది. మూడు సంవత్సరములైన తరువాత పాట్నాలో అ. భా. కాం. కమిటీ సమావేశమయ్యెనని తెలిసికొంటిని. పరిస్థితులనుగురించి పూర్తియైన చర్చలు జరగకపోవుట నాకాశ్చర్యముగనుండెను. గాంధీజీ యెప్పటివలెనే డిక్టేటరువలె కాన్పించెను. "మీరు నా నాయకత్వమునను సరింపగోరుచో నామతములనంగీకరింపవలెను" అని యతడు చెప్పెను. అతనికోరిక చాల సహజముగనే యుండెను. ఏలనన మనమతనిని కావలెననికోరుచు నతని దృఢవిశ్వాసములకు వ్యతిరేకముగ నడుపమని చెప్పజాలము. పరస్పర చర్చలు జరిపి యొకనీతి నంగీకరించుటకంటె పైబలవంతమెక్కువగ నున్నట్లు కాన్పించెను. గాంధీజీ భావరాజ్యముచేయుచు ప్రజలయసహాయతను గురించి ఫిర్యాదుచేయుట చిత్రము. బాహుళ్యముమీద నతనిపట్ల చూపబడిన భక్తి, వినయవిధేయతలు మరెవరిపట్ల చూపబడలేదని నే ననుకొనెదను ప్రజలు తమకొరకతనిచే నియమింపబడిన యున్నత ప్రమాణమును చేరజాలకపోయిరని నిందించుట యుక్తముగ కాన్పించదు. హరిజనోద్యమప్రచారములోనుండుటచే నతడు పాట్నాలో సభ పూర్తియగువరకుకూడ నుండలేదు. అ. భా. కాం. కమిటీ వ్యవహార దక్షతను చూపవలెననియు వెంటనే వర్కింగుకమిటీవారి తీర్మానముల నమలుపరుపవలెననియు చెప్పి యతడు వెళ్ళిపోయెను.

దీర్ఘచర్చవలన విషయములు చక్కబడనేరవనుట నిజము. సభ్యులలో నిశ్చయభావములు లేకుండెను. విమర్శించువారే కాని నిర్మాణసూచనలను చేయువారు లేరు. శాసనోల్లంఘన మాపివేయు ఒడుటకే నిశ్చయింపబడెను. తరువాత నేమిజరుగవలెను ? రెండు కక్షలు బయలుదేరెను. ఒకరు చట్టసమ్మతిమైన కార్యములను చేయవలెననిరి. రెండవవారు అస్పష్టసామ్యవాదపద్ధతిని భావించుచుండిరి. సభ్యులలోని యధికసంఖ్య యిరుకక్షులకు చెందరు. వారు చట్టసమ్మత కార్యములకు మరలుట కిచ్చగింపరు. సామ్యవాదమునిన భయము. సృజనభావములు లేవు. వారికి గాంధీజీయే జీవగఱ్ఱ. వెనుకటివలెనే వారతని ననుసరించిరి. గాంధీజీబలమువలన మితవాదులకు కమిటీలోను కాంగ్రెసులోను బలముకలిగెను.

ప్రభుత్వము కాంగ్రెసుపై నిషేధమును తొలగించుటచే నది క్రమసంఘమయ్యెను. కాని, దాని క్రిందిసంఘములు, తత్సంబంధ సంఘము–వాలంటీరుశాఖ, సేవాదళము, కిసానుసభలు, అనేక విద్యాసంస్థలు, యువజనసంఘములు, యివన్నియు నింకను బహిష్కారములోనే యుండెను. ప్రత్యేకము 'ఖుదాయీ ఖిద్ మత్ గార్లు' లేక 'సరిహద్దుయెఱ్ఱచొక్కాలు' నిషేధములోనుండెను ఇది 1931 లో కాంగ్రెసులో జేరి యా రాష్ట్రప్రాతినిధ్యము వహించెను. ఈవిధముగ కాంగ్రెసు ప్రత్యక్షకార్యవిధానమును మానుకొనినను ప్రభుత్వము శాసనోల్లంఘనము కొరకు కేర్పరచిన ప్రత్యేకశాసనముల నట్లే యుంచెను. లేబరుయూనియనులమీద, రయితుసంఘములమీద, ప్రత్యేకనిఘాయుంచి యుత్తమప్రభుత్వాధికారులం జమీందారులను భూస్వాములను యేకముకావలెనని ప్రోత్సహించుచుండిరి.

హిందూ, ముస్లిము కులతత్త్వముయెడల నే నెన్నడు పక్షపాతము వహింపలేదు. హిందూమహాసభ కార్యదర్శియొకడు "యెఱ్ఱచొక్కాల" నిషేధము నామోదించుచు ప్రభుత్వభుజమును తట్టుటచే నా కాసభపై మంటపుట్టెను. ఒడుదుడుకు యుద్యమమేదియు లేనపు ప్రాతిపదిక నాగరికహక్కులను లాగివేయుటనా కాశ్చర్యముకలిగిం

చెను. ఈ సిద్ధాంతముసంగతి యట్లుండ యీసంగ్రామ సంవత్సరములలో సరిహద్దు ప్రజ లత్యద్భుతముగ ప్రవర్తించిరనుట జగద్విదితము. వారి నాయకుడు ఖాన్‌అబ్దుల్ గఫ్ఫూర్‌ఖాన్ యింకను విచారణ లేకుండ ప్రభుత్వఖయిదీగ జయిలులోనుండెను. కులద్వేషము లింతకంటె ముందుకు పోజాలవట్లు నాకు కాన్పించెను. హిందూమహాసభా ప్రధాన నాయకు లీభావమునంగీకరింపనట్లు వెంటనే ప్రకటింతురని నేనాశించితిని. కాని, నాకు తెలిసినంతవరకు దీనినిగురించి వారెవరు పల్లెత్తు మాట రానీయలేదు. ఈ కార్యదర్శియొక్క స్టేటుమెంటు నన్ను తారుమారుచేసెను. ఆ మందు వేసవియుష్ణతచే నేనొక మధ్యాహ్నము వేళ కునికిపాట్లుపడితిని. నాకొక చిత్రమైన కలవచ్చెను. అబ్దుల్ గఫ్ఫూర్ఖాను అన్నివైపులనుండియు ముట్టడింపబడుచుండెను. అతనిని రక్షించుటకు నేను పోరుచుంటిని. అలసియున్న స్థితిలో దుఃఖాక్రాంతుడనగుచు నేను మేల్కాంచితిని. నా తలగడ కన్నీటిచే తడిసియుండెను. ఇది నాకాశ్చర్యముగ నుండెను. నా జాగ్రదవస్థలో నే నెన్నడు నట్టి భావప్రకోపము నెరుగను.

ఈ సమయముననే చేయబడిన కాంగ్రెసు వర్కింగుకమిటీ తీర్మానము 'స్వాంతయాస్తిని లాగుకొనుట, వర్గపోరాటములనుగురించి చేయబడు స్వైరసంభాషణనుబట్టి' చేయబడెను. కరాచీ తీర్మానము 'యుక్తకారణము, తగిన పరిహారము లేనిదే స్వాంతయాస్తిని వశపరచుకొనుటను, తరగతులమధ్య పోరాటమును, ప్రోత్సహింపదు. మరియు వర్కింగుకమిటీవారు వర్గపోరాటము, ఆస్తిని వశపరచుకొనుట కాంగ్రెసు సిద్ధాంతమైన దౌర్జన్యరాహిత్యమునకు వ్యతిరేకమని యభిప్రాయపడుచున్నారు' నన్ను బాధించెను. ఇందులోని పదములు సరియైన యర్థములో నుపయోగింపబడలేదు, నిశ్చయముగ నిది సామ్యవాదపక్షముపై గురిపెట్టబడెను. వర్గపోరాటమన నేమియో తీర్మానమును తయారుచేసినవారికి తెలియదని యిది స్పష్టముచేయుచున్నది. బాధ్యతగల సామ్యవాదు లాస్తినివశపరచుకొనుటనుగురించి మాట్లాడియుండలేదు. ప్రస్తుతపరిస్థితులలో వర్గపోరాటమున్నదని తరచు చెప్పబడెను. ఇట్టి విశ్వాసముకలవా రెవరును కాంగ్రెసులో మామూలు

సభ్యులుగకూడ నుండరాదని వర్కింగుకమిటీ తీర్మానము సూచించు నట్లు కాన్పించును. సామ్యవాదము నామోదించెనని, స్వంతయాస్థికి వ్యతిరేకమని యెవరును కాంగ్రెసు నెన్నడును దూషించియుండలేదు. కొంతమంది సభ్యు లట్టిభావములను కలిగియుండిరి. కాని, సమస్తము నాలింగనముచేయు నీ జాతీయసంస్థలో సాధారణ సభ్యులుగ నుండు టకుగూడ వారి కివ్వి డాస్కారము లేనట్లు కాన్పించును.

రాజు లగాయతు గర్భదరిద్రునివరకు గూడ కాంగ్రెసు ప్రాతి నిధ్యము వహించునని తరచు చెప్పబడెను. తరచు జాతీయోద్యమము లిట్టియధికారము చాటుచుండును. అనగా నవి జాతిలోనున్న యధిక సంఖ్యాకులకు ప్రాతినిధ్యము వహించుననియు, వాని నీతి యందరి ప్రయోజనములను కోరుననియు భావము. కాని యీ యధికారము నిలుచునదికాదని దాని ముఖమునీాదనే వ్రాయబడియున్నది. ఏరాజ కీయ సంస్థయు భిన్నలక్షణములను తెలియజేయజాలదు, బింకములేని నిరర్థకమవ్వ కాకుండ పరస్పర విరుద్ధప్రయోజనములకు ప్రాతినిధ్యము వహింపజాలదు. కాంగ్రెసు రాజకీయాధికారమును సాధించునిశ్చయ మైన లక్ష్యమును, వేదాంతమును గలిగిదానిని జాతీయకళ్యాణమునకు వినియోగించు రాజకీయ శక్తియైనను కావలెను. లేదా యది స్వంత యభిప్రాయములు లేక నందరను నాశీర్వదించు కేవల భూతదయా తత్వము గల సంస్థయైనను కావలెను. ఆ లక్ష్యమును, ఆ వేదాంత మును, సాధారణముగనంగీకరించువారికే యది ప్రాతినిధ్యమువహింప గలదు. దీనికి వ్యతిరేకులు జాతికిని, సంఘమునకును విరోధులనియు, నభివృద్ధిభంజకులనియు దానిచే భావింపబడుదురు. తన నిజవేదాంతము నమలుపరచుటకు వీరిప్రభను నిరోధింపవలెను. లేదా తొలగింప వలెను. జాతీయమైన సామ్రాజ్య వ్యతిరేకోద్యమము సాంఘిక పోరా టములజోలికి పోదుకనుక, నట్టి యంగీకారమున కెక్కువ యాధార ముగ నుండగలదనుట సత్యము. కనుక కాంగ్రెసు హిందూదేశప్రజల యొక్క యధికసంఖ్యాకులకు భిన్నవరుసలలో ప్రాతినిధ్యము వహిం చెను. అది సామ్రాజ్యవ్యతిరేక సమస్యమీాద నంగీకారముగల పరస్పర

విరుద్ధవర్గములనుతనలో నిముడ్చుకొనెను. ఈప్రధాన సారాంశమునకు భిన్నాభిప్రాయములు కలవారు కాంగ్రెసులో జేరక ప్రభుత్వయండ జేరిరి. ఈవిధముగ కాంగ్రెసు ఒక విశ్వాసముచేతను, శక్తివంతుడగు గాంధీజీ ప్రభచేతను బంధింపబడిన యనేక వర్గములు గల శాశ్వత యఖిలపక్ష వర్గమయ్యెను.

తరువాత వర్కింగుకమిటీ వర్గపోరాటమును విశదముచేయ యత్నించెను. ఈతీర్మానములోని భాష యదిచేసిన నిశ్చయము ప్రధానములు కావు. అది కాంగ్రెసు పోకడలకు మరియొక సూచన రాబోవు అసెంబ్లీ యెన్నికలలో ధనవంతుల సహాయము పొందుటకు క్రొత్తపార్లమెంటరీపక్షమువారి ప్రోత్సాహముచే నీతీర్మానము పొసగెను. వారి ప్రోత్సాహముచే మితవాదులను, కన్సర్వేటివులను కలుపుకొనుటకు కాంగ్రెసు అంతకంతకు కుడివైపు చూచుచుండెను. కాంగ్రెసును ప్రతిఘటించి శాసనోల్లంఘనకాలమున ప్రభుత్వముతో జేరినవారియెడల బుజ్జగించువాక్యములు ప్రయోగింపబడుచుండెను. అడ్డగీటు పెట్టుచు, విమర్శించుచుండు యెడమపక్ష మీ 'మార్పు'కు, రాజకీవిధానమునకు వ్యతిరేకమని తలంపబడెను. ఎడమపక్షమువారి దోషారోపణమువలన కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గమువారు తమ నూతనపద్ధతిని వీడజాలరని వర్కింగుకమిటీ తీర్మానము, వ్యక్తుల యుపన్యాసములు విశదముచేసెను. ఎడమపక్షమువారు యుక్తముగ ప్రవర్తింపనిచో కాంగ్రెసునుండి వెలివేయబడుదురు. కాంగ్రెసుపార్లమెంటరీబోర్డువారు జారీచేసిన ప్రకటన కాంగ్రెసు గత పదిహేను సంవత్సరములలో చేసిన ప్రకటనలకంటె జాగ్రతగను, మితముగను. నుండెను.

ధేరాడూనుజైలులో కొంతవరకు నాభావములీవిధముగనుండెను బయటప్రపంచముతో నాకు సంబంధము లేకపోవుటచే పరిస్థితులను గురించి నేను నిశ్చయాభిప్రాయముల నేర్పరచుకొనజాలకపోతిని. బాహ్యసంపర్కమున్నచో బహుశః నా భావములు కొంత మారి యుండవచ్చును.

వర్తమానముతో విసుగుచెంది నేను భూతకాలములో మునిగితిని. నేను ప్రజావ్యవహారములలో పాల్గొన నారంభించిన తరువాత భారతదేశములో రాజకీయముగ నేమిజరిగెను? మేము చేసిన దెంత యుక్తము? ఎంతయయుక్తము? నాభావములను లిఖితముచేసిన చో నవి యెక్కువ క్రమయుక్తము సహాయకారిగనుండునని నాకు తట్టెను. ఇది నావిచారములనుండి నిరుత్సాహములనుండి నామనస్సును తప్పించును. కనుక 1934 జూన్ నెలలో నే నీ 'ఆత్మకథను' ఢేరాడూనుజయిలులో ప్రారంభించితిని. నాకు వ్రాయవలెనను బుద్ధిపుట్టినప్పుడెల్ల వ్రాయుచు నెనిమిదిమాసములు వ్రాసితిని. తరచు మధ్యమధ్య కాళీలువచ్చుచుండెను. మూడుసార్లు మూడునెలలు అట్టికాళీలువచ్చెను. కాని, నేను దీనిని సాగించుచు నిప్పుడీ వ్యక్తిగత ప్రస్తావముచివరకువచ్చితిని. ఇందులో చాలవరకు నిరుత్సాహముచేతను, భావ ప్రకోపముచేతను నేను బాధపడుపరిస్థితులలో వ్రాయబడెను. బహుశః యిది కొంత నేను వ్రాసినదానిలో ప్రతిబింబించియుండవచ్చును. కాని, యీ వ్రాతయే నా ప్రస్తుత విచారములనుండి నన్ను తప్పించుటకు చాలవరకు తోడ్పడెను. నేను వ్రాయునపుడు బాహ్యపాఠకులనుగురించి భావించుచుండుట లేదు. నన్ను నేనే సంబోధించుకొనుచుంటిని. నేనే ప్రశ్నలను వేసికొనుచు నాయుపయోగముకొరకు నేనే సమాధానముల నిచ్చుకొనుచుంటిని. ఒక్కొక్కప్పుడు దీనితో కొంత వినోదించెడివాడను. నేను సాధ్యమైనంతవరకు సరళముగ భావింపగోరితిని. గత చరిత్రకు సంబంధించిన యీ విమర్శ నా కందులకు తోడ్పడునని యూహించితిని.

జూలై మాసాంతముకు కమలయారోగ్యము శీఘ్రముగ చెడిపోవుచు కొద్దిరోజులలో విషమపరిస్థితి యేర్పడెను. ఆగష్టు 11వ తేదీని నన్ను ఢేరా జయిలునుండి పోలీసులలహాబాదు తీసికొనివచ్చిరి. అచ్చట జిల్లామేజిస్ట్రేటు బాధపడుచున్న నాభార్యనుచూచుటకునన్ను తాత్కాలికముగ విడిచిపెట్టుచున్నామని చెప్పెను. నా కప్పుడే జయిలులో నారుమాసములు నిండెను.

65

పదకొండు రోజులు

"శక్తి శాశ్వతము; ఘోర క్షీణించును; శరీరము నశించును, ఆత్మనశింపదు" బైరన్.

నా విడుదల తాత్కాలికము. కమల శల్యావశిష్టమయి, తనవ్యాధితో పోరాడుచు ఛాయవలె నుండెను. ఆమె నన్ను వీడవచ్చునను భావము నాకుదుర్భరముగనుండెను మా వివాహమయి పదునెనిమిది సంవత్సరముల యారుమాసములయ్యెను నా మనసొక్కసారి యాదినమును స్మరించెను. ఈ కాలము మేమనుభవించినసమస్తమును సంస్మరించెను. నా కపుడిరువదారేండ్లు. ఆమెకు పదిహేడు సుమారుగ నుండెను. ఆమె ప్రపంచపోకడల నెరుగని కేవలయమాయక పడుచు. మా వయోభేదము హెచ్చు. కాని మా మానసికదృష్టిభేదము మరింత హెచ్చు. ఆమెకంటె నేను చాల వృద్ధిచెందితిని. అయినప్పటికి నాలో నెంత ప్రపంచజ్ఞానము కాన్పించినను నేనుచాల కుర్రతనముగ నుండెడివాడను. అభిమానరాశియైన యీ సుకుమార కన్య మనస్సు పుష్పమువలె నెమ్మదిగ వికసించుచున్నదనియు, దానికి సౌమ్యదోహద మవసరమనియు నేను గుర్తింపలేదు. మేమన్యోన్యానురాగము గలిగి సుఖముగనే జీవించెడివారము కాని, మా దృష్టులు వేరుగ నుండుటచే కొంత సరిపెట్టుకొనలేకపోయెడివారము. దీనివలన నప్పుడప్పుడు చిన్నచిన్న తగవులు — బాలబాలికల వ్యాపారములవంటివి — స్వల్పవిషయములమీద కలుగుచు చిరకాల ముండక వెంటనే సమాధానము కలుగుచుండెడిది. ఉభయులము తొందర స్వభావము కలవారము; అభిమానవంతులము. మా గౌరవములను నిలబెట్టుకొనవలెననెడి కుర్రతనపు భావము కలవారము. అయినప్పటికి నెమ్మదినెమ్మదిగ సరిపెట్టుకొనుచు మా యనురాగము పెరిగెను. మా వివాహము జరిగిన యిరువదియొక్క మాసములకు మాయేకైక పుత్రిక యిందిర జనించెను.

మా వివాహము రాజకీయరంగ పరివర్తనలతో సమకాలిక మయ్యెను. నేను వానిలో మునుగుచుంటిని, అవి 'హోంరూలు' దిన

ములు వానివెంటనే పంజాబు సైనికశాసనము, అసహాయోద్యమము వచ్చెను. నేనంతకంతకు రాజకీయ ఝంఝూమారుతములో నెక్కువగ తగులొన్నంటిని. వీనిపైనే నెక్కువగ కేంద్రీకరించుటచే బుద్ధిపూర్వకముగ నేనామెను నిర్లక్ష్యముచేసి యామెంగతికి విడిచివేసితిని. నిజముగ నప్పుడామెకు నా సంపూర్ణసహాయ మవసరముగ నుండెను. ఆమె యెడల నాప్రేమ యభివృద్ధిచెందుచుండెను. తన సాంత్వన వచనములతో నన్నోదార్చుట కామె యచ్చటనున్నదని తెలిసికొనుట నాకు సుఖావహముగనుండెను. ఆమె నాకు పుష్టినిచ్చెను. కాని, తాను నిర్లక్ష్యము చేయబడినట్లు భావించి యామె బాధపడియుండవలెను.

తరువాత నామెను విడువనివ్యాధి, నేనుచిరకాలముజయిళ్ళలో నుండుట! అప్పుడు, మేము జయిలుదర్శనములందు మాత్రమే కలుసుకొనుచుండెడివారము. శాసనోల్లంఘన మామెను మా సంగ్రామప్రథమశ్రేణిలోనికి లాగెను. జయిలుకు రాగలిగినందుల కామె యానందించెను. మేమంతకంతకు సన్నిహితుల మగుచుంటిమి. మా యపురూపసమ్మేళనములమూల్యములుగ నుండెడివి. మేము వాని కొరకెదురుచూచుచు రోజులను లెక్కించుకొను చుండెడివారము. మే మొకరితో నొకరము విసుగుచెందెడివారము కాము. మా కలయికలలలోను, స్వల్పకాలిక జీవితములోను క్రొత్తదనము. నూతనరుచి నవ్యశోభ యుండెడివి, ఒకరితో నొకరము నిరంతరము క్రొత్తవిషయము కనుగొనుచుంటిమి. ఒక్కొక్కప్పు డీ నూతన యావిష్కరణములు మాకు రుచించెడివికావు. మా వయసు మీరిన యనంగీకారములలోగూడ కొంత బాలబాలికా విచేష్టితముండెడిది.

పదునెనిమిదేండ్ల వైవాహికజీవితము గడపిన తరువాతగూడ నామె కన్యవలె, పడుచువలెనుండెను. ఆమె యెంతమాత్రము కుటుంబినివలె కాన్పించదు. ఆమె చాలకాలముక్రిందట మాయింటికి వచ్చిన వధువువలెనే యుండియుండవచ్చును. కాని, నేను చాలవరకు మారిపోతిని. నాలో నావయసుకుతగిన యర్హత, చురుకుదనము, లాఘవములున్నను—నాలో కొన్ని చిన్న తనపు లక్షణములుకూడ కలవని

చెప్పుదును. నా ముఖవిలాసము నన్ను బయటపెట్టును. నేను కొంత బట్టతలవాడను; నా తల నెరిసెను; ముఖమున ముడతలుండెను. నా కండ్లచుట్టు శ్యామల ఛాయలుండెను కష్టములతోను, విచారములతోను కూడుకొనియున్న గతనాలుగేండ్లు నాపయి ననేక చిహ్నములను కలుగజేసెను ఈ చివర వత్సరములలో కమల నేను కొత్త ప్రదేశములకు పోయినపుడామెను నాకూతురని యనుకొనెడివారు. ఆమెయు, నిందిరయు నక్కచెల్లెండ్రవలె కాన్పించెడివారు.

పదునెనిమిదేండ్ల వివాహజీవితము ! కాని, వానిలో నెన్ని దీర్ఘసంవత్సరములు నేను జయిళ్ళలోను, కమల యాస్పత్రులలోను, గడిపితిమి? ఇప్పుడు తిరిగి నేను జయిలులోనేయుండి కొద్దిదినములు బయటకువచ్చితిని. ఆమె వ్యాధిగ్రస్తురాలై, జీవితముకొరకు పోరాడుచుండెను. ఆరోగ్యమును సరిగ కాపాడుకొనలేదని నా కామెపై కొంచెము కోపము. అయినను నేనామె నెట్లు నిందింపగలను ? జాతీయపోరాటములో తన సంపూర్ణభాగమును వహింపజాలని యశక్తతకును, నిర్వ్యాపారత్వమునకు నామెయుత్సాహ మోర్పు వహింపజాలకుండెను. శరీరదుర్బలతచే నామె తగినంత చేయజాలక పోయెను. చికిత్సయు చేయిచుంకొనజాలకపోయెను. ఆమె యాంతరంగికాగ్ని శరీరమును దహించివేసెను నేనెక్కువగ నభిలషించుచున్న యీసమయములో నామె నన్ను వీడిపోదు. మే మిప్పుడే యదార్థముగ నొకరినొకరము తెలిసికొని యర్థముచేసికొన ప్రారంభించితిమి. మాసంయుక్తజీవిత మిప్పుడే న్యాయముగ ప్రారంభమయ్యెను. మేమొకరిపై నొకర మంత యాధారపడితిమి. మేమిరువురము కలసి చేయవలసినదెంతయో యుండెను ఆమెను గంటగంటకు, దినదినము పరీక్షించుచు నేనిట్లు తలపోయుచుండెడివాడను. సహచరులు, స్నేహితులు నాదగ్గరకురాగా నేనవరితోను చర్చించుట కిష్టపడలేదు. నాకు పరిస్థితులు తిన్నగా తెలియవు. స్వయముగ వ్యక్తులతో సంపర్కమున్నగాని యేమి చెప్పుటకు నేమిచేయుటకు వీలులేదని నా చిరయనుభవము బోధించెను. ప్రభుత్వము నాభార్యను చూచు

టకు నాయెడలచూపిన సరసతను నేను రాజకీయ ప్రయోజనముల కుపయోగింపదలచుకొనలేదు. నేనెట్టి పబ్లికు స్టేటుమెంటును చేయ లేదు. ప్రయివేటులోకూడ నే నట్టిసీతిని నిశ్చయించుకొనలేదు

కమలస్థితినిగురించి నేను గాంధీజీకి తెలిపితిని. నా మానసిక స్థితినిగురించికూడ నీ సద్భావమును వెల్లడించితిని. ఇటీవల విషయ ములుకొన్ని నాకు బాధకరముగ, విచారకరముగ నుండెను. నా యుత్తరములో నిది కొంత ప్రతిబింబించెను. ఏమిచేయవలెను, ఏమి చేయకూడదు అను విషయమై నేనేమియు సూచింపలేదు జరిగిన దానినిగురించి నాభావములను వెల్లడించితిని ఆ యుత్తరము భావో ద్రేకపూరితముగ నుండెను. అది గాంధీజీకి చాల బాధను కలిగించె నని నేను తరువాత తెలిసికొంటిని.

ప్రభుత్వపుపిలుపు వచ్చునని నేను దినదినము చూచుచుంటిని. అనేకవదంతులు బయలుదేరెను. బొంబాయి కాంగ్రెసు, నవంబరు లోని అసెంబ్లీ యెన్నికలు లేనిచో నన్ను విడిచిపెట్టియుండెడివారట! ఇప్పుడే నన్ను విడిచివేసినను విడువవచ్చు ననిరి. నా విడుదలయైన పదకొండవదినము, ఆగష్టు 23 వ తేదీ వచ్చెను. పోలీసు మోటారు వచ్చెను. నేను నైనీజయిలుకు పోవలెనని ఆఫీసరు చెప్పెను. నేను నా స్వజనమువద్ద సెలవుతీసుకొంటిని. నేను మోటారు ఎక్కుచుండ వ్యాధిగ్రస్తురాలైన నా తల్లి చేతులు చాచుకొని నాయొద్దకు తిరిగి పరిగెత్తుకొనివచ్చెను. అప్పటి ఆమెవదనము నన్ను చాలాకాలము పీడకుండెను.

66

తిరిగి జయిలుకు

నేను తిరిగి నైనీజయిలులో నుంటిని. నాకు క్రొత్త జయిలు ప్రారంభమైనట్లుండెను బయటనుండి లోపలకు, లోపలనుండి బయటకు నే నెట్టి రెక్కలచెందునైతిని! ఇటు నటు యీ తిరుగుడువ్యాపారము నా శరీరస్థితిని భావోద్రేకముచే కదల్చివేయుచుండెను. నిరంతరము మార్పులకు సరిపెట్టుకొనుట సులభముకాదు. నన్ను నా వెనుకటి 6 నెం. కొట్టులో గాక మరియొక చోటుకు మార్చిరి. అందులో నిపుడొక విచారణ, శిక్ష లేని ఖయిదీ యుంచబడెను. అతనితో నన్ను కలుపుట భద్రము కాదని తలపబడెను.

రాత్రిందివములను నే నచ్చట గడుపుచుండినను నా మనమన్యత్రయుండెను, నా పునర్నిర్బంధమువలన కమలలో కలిగిన యభివృద్ధి చెడునని నేను భయపడితిని. అది అట్లే జరిగెను. కొన్నిరోజులు డాక్టరుల యభిప్రాయములను నాకు తెలియబరచిరి. రెండువారములైన తరువాత నామె స్థితి క్రమముగ చెడుచున్నను వీని నాపివేసిరి. చెడువార్తలు, వానికొరకు వేచియుండుట దీనివలన రోజులు దీర్ఘములయ్యెను. రాత్రులొక్కొక్కప్పుడు మరింత యధ్వాన్నమయ్యెను. కాలము కదలనట్లుండెను. కదలినను కదలనంత మందముగ జరిగెను. ప్రతి గంట గండముగ, భయంకరముగ నుండెను. నన్ను తిరిగి నిర్బంధించి మాసముగడచిన తరువాత నొక పోలీసుఆఫీసరు కమలను చూచుటకు నన్ను దీసికొనివెళ్ళెను. నన్ను వారమునకు రెండుసారు లిట్లు తీసుకొనివచ్చుచుందు మని యతడు చెప్పి యా కాలమునుకూడ స్థిరపరచెను. నేను నాల్గవరోజున వేచియుంటిని. నాకొరకెవరునురాలేదు. అయిదు, ఆరు, యేడురోజులిట్లు గతించెను. కనిపెట్టుకొనియుండుటకు నాకు విసుగుపుట్టెను. ఆమెస్థితి తిరిగి యుపద్రవకరమయ్యెను. ఆమెను చూచుటకు నన్ను వారమునకు రెండుసార్లు తీసికొనివెళ్ళెదమని చెప్పుట యెంతటిపరిహాసమో! అని నేను భావించితిని. చిట్టచివరకు సెప్టెంబరు గతించెను. ఆ ముప్పది దినములు నేనెన్నడు ననుభవించని దీర్ఘతమ దుర్దినములు.

నేను రాజకీయములలో దిగనని వాగ్దానముచేసినచో, యిష్టా గోష్ఠిగనైననుసరే, నేను విడిచివేయబడుదునని మధ్యవర్తులు సూచించిరి, అప్పుడు రాజకీయములు నాతలంపులో నేలేవు; నేను బయట నున్న పదకొండుదినములలోను చూచిన రాజకీయములు నాకసహ్యముగనుండెను. కాని వాగ్దానమునిచ్చుటయా! నాప్రమాణములకు, యుద్యమమునకు, నాసహచరులకు, నాకు ద్రోహముచేయుటయా! అదియసంభవము. అట్లుచేయుట నాభావములకును, నేను పవిత్రమని తలంచు సమస్తమునకు మృత్యుఘాతము. కమల నానాటికి క్షీణించుచున్నదని నే నామెప్రక్కనున్నచో సేదదేరునని చెప్పుచుండెడివారు. ఆమె కీయవకాశము నిచ్చు నా కోరికకంటె నా స్వాభిమానము, గర్వము అధికమైనదా? ఇది నాకొక గొప్పదురవస్థ. కాని యదృష్ట వశమున నాకీసందిగ్ధదశ పట్టలేదు. నేనట్టివాగ్దానమునిచ్చుట కమలయే నిరాకరించునని నేనెరుగుదును.

అక్టోబరు మొదటిరోజులలో ఆమెనుచూచుటకు నన్ను తీసికొనివెళ్ళిరి. ఆమె జ్వరతీవ్రతతో నిశ్చేష్టయైయుండెను. నేనామెప్రక్క నుండగోరెను. కాని నేను తిరిగి జయిలుకు పోవుచుండుటచే నామె నన్ను చూచి ధైర్యముగ నవ్వునవ్వి నన్నుకొంచెము వంగవలసినదని సంజ్ఞచేసెను. నేను వంగితిని "ప్రభుత్వమునకు మీరు వాగ్దానము నియ్యవలెనను యీవదంతియేమిటి? అట్లు యివ్వవలదు!" అనియామె మెల్లగ చెప్పెను.

చివరకు కమలను భోవాలి తీసుకొనివెళ్ళుటకు నిశ్చయింపబడెను. ఆమె యచ్చటకు వెళ్ళుటకు పూర్వదినమున నన్నచ్చటకు తీసికొనిపోయిరి. నేనామెను తిరిగి యెప్పుడుచూతును? ఆమె నాకిక కాన్పించునా? ఆమె యానాడు సంతోషముగ, సుఖముగ కాన్పించెను. నాకిది చాలాకాలమునుండి లేని సంతోషమును కలిగించెను. తరువాత మూడువారములకు నన్ను ఆల్మోరాజిల్లా జయిలుకుమార్చిరి. భోవాలి మార్గములోనే యుండెను. నేను నా పోలీసుతోసహా కొద్ది

గంటలచ్చట గడిపితిని. కమలకు సుగుణముగ నున్నందులకు నేను సంతసించి యుత్సాహముతో ఆల్మోరా వెళ్ళితిని.

ఆల్మోరా జయి లొక శిఖరముమీద నిర్మింపబడెను. నాకు దర్జాయైనకొట్టు యివ్వబడెను. పెద్దహాలు 51 అడుగుల పొడవు, 17 అడుగుల వెడల్పు. నేల గతుకుగ 'కచ్చా'గను నుండెను చెదతిని వేసిన పైకప్పునుంచి ముక్కలు, తుక్కు నిరంతరము జలజల రాలు చుండెను. దానికి పదిహేను కిటికీలు, ఒక గుమ్మము కలవు. వీటికి తలుపులులేవు, నాకు శుభ్రమైనగాలికి కొదవలేకయుండెను. చలి యెక్కువయైనప్పుడు చాపలతో కొన్నికిటికీలు మూసివేయబడెడివి. ఈ విశాలప్రదేశములో నే నేకాంత ఘనత ననుభవించితిని. కాని నేను కేవల మొంటరిగ లేను. అధమము మూడున్నరడజనులపిచుకలు కూలుచున్న కప్పులో తమనివాసము నేర్పరచుకొనెను. ఒక్కొక్కప్పుడు సంచారముచేయు మేఘమొకటి నన్ను దర్శింపవచ్చి కిటికీలగుండ తన సహస్రచేతులను చాచి యాప్రదేశమును చల్లపరచి పోవును.

ఇచ్చట నన్ను ప్రతిదినము సాయంకాలమయిదు గంటలకు, తాళము వేసెడివారు. ఉదయము ఏడుగంటలకు నా తలుపు తాళములు వీడును. పగలు నాగదిలోనో బయట వరండాలోనో కూర్చొనెదను. గోడలపైనుండి నాకొకపర్వతశిఖరము కాన్పించెడిది. ఆ పైన విశాలనీలాకాశము మేఘరాశితో నిండియుండెడిది ఈమేఘము లద్భుతములగురూపములను దాల్చెడివి. వానిని పరీక్షించుటకు నాకెప్పుడు విసుగుపుట్టెడిదికాదు. అవి యన్నిమృగములరూపములను దాల్చుటను చూచుచున్నట్లు నేను భావించితిని. ఒక్కొక్కప్పు డవి యన్నియుకలసి మహాసముద్రమువలె కాన్పించెడివి; లేక నవి సముద్రతీరమువలెనుండును. దేవదారులనుండివీచు వాయువుయొక్క మర్మరధ్వని దూరముననున్న సముద్రతరంగ ఘోషమువలె నుండును.

కమలస్థితికి నేను ఖేదపడుచుంటిని. చెడువార్త నన్ను తారుమారుచేసెడిది, కాని పర్వతవాయువు నన్ను శాంతింపజేసి మోదా

ప్పుటచే నేను గాఢముగ నిద్రపోయెడివాడను. నేను నిద్రపోవుటకు ముందు—నిద్ర యెంతటి యద్భుత విషయము! యెంత రహస్యవిషయము! దానినుండి మనమేల మేల్కొనవలెను? నేనసలు మేల్కొనలేదనుకొనుడు? యని భావించెడివాడను.

అయినను బయటకు పోవలెననెడి కోరిక మునుపటికంటె గాఢముగ నుండెను. బొంబాయికాంగ్రెసు జరిగిపోయెను. నవంబరు గతించెను. అసెంబ్లీయెన్నికల యుద్రేకము చల్లారెను; నన్ను విడిచిపెట్టెదరనుకొనుచుంటిని. కాని యింతలో అబ్దుల్‌గఫూర్‌ఖాను నిర్బంధము, శిక్ష వినవచ్చెను. సుభాసుచంద్రబోసు భారతదేశమునకు తిరిగివచ్చినపుడు వేసిన అరస్టు ఆశ్చర్యకరముగనుండెను. తన దేశస్థులలో నధిక సంఖ్యాకులచే ప్రేమింపబడువానిమీద నవి ప్రయోగింపబడెను. వ్యాధిగ్రస్తుడైయున్నను మృత్యుశయ్యమీదనున్న తండ్రిని చూచుటకతడు త్వరపడివచ్చెను. ప్రభుత్వదృక్పథ మీవిధముగ నున్నప్పుడు నా యకాల విడుదల యసంభవము. తరువాత ప్రభుత్వప్రకటనమట్లే వెలువడెను.

ఒకనెల యాల్మోరాలో నున్నతరువాత నన్ను కమలను చూచుటకు తీసుకొనివెళ్ళిరి. తరువాత నేనామెను మూడువారములకొకసారి చూచెడివాడను. సర్ శామ్యూల్ హోర్ (భారతసెక్రటరి) నన్ను వారమున కొకటిరెండుసార్లు నాభార్యను చూడనిచ్చునట్లు పదేపదే చెప్పెను. ఆల్మోరాలోనున్న మూడున్నరమాసములలో నేనామె నయిదుపర్యాయములే చూచితిని. నేను దీనినొక ఫిర్యాదు కొరకు చెప్పుటలేదు. ఈవిషయములో ప్రభుత్వమువారు నాపట్ల చాలయుక్తముగనుండి కమలనుచూచుటకు అసాధారణ సౌకర్యములను కలిగించిరి. దీనికి నేను వారికి కృతజ్ఞుడను. నాస్వల్పకాలసందర్శనము లామెకు నాకుకూడ నమూల్యములయ్యెను. నేనామెతో చాల కాలము సంభాషించెడివాడను. మేమొకరికొకరమతిప్రేమాస్పదులమైతిమి. ఆమెనువీడుట బాధకరముగనుండెడిది. మేము కలుసుకొని విడిపోయెడివారము.

నాతల్లి చికిత్సకొరకు బొంబాయి వెళ్ళెను. ఆమెకు గుణముగ నున్నట్లే కాన్పించెను. జనవరిమధ్యభాగమున నొకనాడు నాకొకతంతి వచ్చెను. ఆమెకు పక్షవాతము వచ్చెనని యది తెలిపెను. నన్ను బొంబాయి ఖయిదుకామెసమీపములో నుండుటకు మార్చెదరనిరి. ఆమెస్థితి చక్కబడుటచే నన్ను మార్చలేదు.

జనవరి తరలిపోయి ఫిబ్రవరివచ్చెను. వసంతకాలధ్వను లాకసమును నింపుచుండెను. పిగిలిపిట్ట, కోయిల యిత్యాదిపక్షులు మరల కాన్పించి గానముచేయ నారభించెను. లేతమొలకలు భూమినుండి యద్భుతముగ పైకిలేచుచు నీ వింతప్రపంచమును తిలకించుచుండెను. యఱ్ఱగన్నేరు పర్వతసీమలను రక్తకాంతితో నింపుచుండెను. బఠానీల తీగలు పుష్పించుచుండెను. రోజులు గడచుచుండ భోవాలీ సందర్శనమును గురించి యోచించుచు నేను వానిని లెక్కించుచుంటిని. జీవితములోని యమూల్యమైన ప్రసాదములు విఫలిత, క్రౌర్యము, యెడబాటు—వీని ననుసరించునను లోకోక్తిలో నెంత సత్యమున్నది! యని నే నాశ్చర్యపడుదును. అట్లు కానియెడల బహుశః అవి గుర్తింపబడవు. నిర్లిప్తభావమునకు బహుశః బాధ యవసరము. అది యధికమైనచో బుద్ధిని కప్పివేయవచ్చును. జయిలు ఆత్మపరీక్షను ప్రోత్సహించును. జయిలులోనున్న దీర్ఘసంవత్సరములు నన్నంతకంత కాత్మవిచారణ చేసికొనుటకు బలవంతపరచెను. స్వతః నేను అంతర్ముఖుడను కాను. కాని జయిలుజీవిత మాత్మపరీక్షకు మార్గము చూపును.

ఇటీవల విషయములు

నాకు వచ్చు వార్తాపత్రికలవలన బొంబాయి కాంగ్రెసు సభా తీర్మానములను తెలిసికొంటిని. ఇరువది సంవత్సరములు సన్నిహిత సంపర్కముచే నా వ్యక్తిత్వము కాంగ్రెసుసంస్థలో మిళితమైపోయెను. నా పదవి, బాధ్యతవలన నాకుగల హక్కుకంటె నా సంస్థతోను, వేలకొలది నా పాతస్నేహితులతోను నన్ను బంధించిన యగోచరమైన పాశములు బలవత్తరముగ నుండెను. అయినను నే నా తీర్మానములతో తృప్తినొందలేదు. కొన్ని ముఖ్యవిషయములు జరిగినను ఆ కాంగ్రెసుసభ యంతయు నిస్సారముగ నుండెను. నేను శ్రద్ధతీసుకొను విషయములేవియు చర్చింపబడలేదు. నే నచ్చట నుండుచో నేమిచేసెడివాడనో యని యాశ్చర్యపడితిని. నిశ్చయముగ నాకే తెలియదు. నే నప్పుడు చింతింపవలసిన యవసరముకూడ లేదు

ఆ సభలో రెండు ప్రధానలక్షణములు కాన్పించెను. గాంధీజీ యొక్క యసాధారణవ్యక్తిత్వము, మాలవ్యా, ఆనేలనాయకత్వము క్రింద ప్రదర్శింపబడిన యత్యంత నిస్సార కులతత్త్వ వ్యతిరేకత, భారత ప్రజాహృదయముయొక్కయు, మధ్యతరగతులవారియొక్కయునాంతరంగిక ప్రవృత్తులను గుర్తెరింగిన వారందరు గాంధీజీ భారతదేశములో నసాధారణపురుషుడనిన యాశ్చర్యపడరు. ప్రభుత్వాధికారులు, కొందరు ఘోషా రాజకీయవేత్తలు నతడు రాజకీయరంగములో దిగత్రొక్కివేయబడెనని తరచు యూహించుచుందురు. అతడు తన వెనుకటి శక్తితో, పలుకుబడితో తిరిగి విజృంభించినపుడు వారు నాలుకలుకరచుకొనుచు నీమార్పుకుగల నూతన కారణములను వెతుకుచుందురు. అతని యభిప్రాయముచేత నవి సాధారణముగ సంగీరింపబడుటచేత నతడు

కాంగ్రెసును, దేశమును పాలించుటలేదు. అతనియసాధారణవ్యక్తిత్వమే దీనికి కారణము. ప్రతిచోటను వ్యక్తిత్వమే పరిగణింపబడును. ఇతర చోట్లకంటె నది భారతదేశములో మరింత ప్రాధాన్యత వహించును. అతడు కాంగ్రెసునుండి విశ్రాంతితీసికొనెను. బాహ్యముగ నిది కాంగ్రెసుచరిత్రలోను, భారతచరిత్రలోను నొక మహాధ్యాయమును సమాప్తముచేసెను. కాని ప్రధానముగ దీనికెట్టి గొప్ప ప్రాముఖ్యతలేదు. తన యధికారమునుండి యతడు తప్పించుకొనజాలడు. అతని పదవి యుద్యోగమువలన, యితర స్థూలసంబంధమువలన యతనికిసంక్రమించ లేదు. కాంగ్రెసు వెనుకటివలె యిప్పుడును అతని దృక్పథమునే ప్రతిబింబింపజేయును అది యతనిమార్గమునుండి తప్పిపోయినను గాంధీజీ దానిని, దేశమును చాలవరకు ప్రేరేపించుచునేయుండును. ఆబాధ్యత నుండియు, భారమునుండియు నతడు తప్పుకొనజాలడు. తాత్కాలికముగ నతడు కాంగ్రెసునుండి విరమించెను బహుశః యతడొక విధముగు వ్యక్తిగత ప్రత్యక్షవిధానమును యోచించుచుండవచ్చును. దానిని కాంగ్రెసు సమస్యగ చేయుట కతడిష్టపడడు.

కాంగ్రెసు నియోజకవర్గ నియమితసభ యను భావము నవలంబించినందులకు నేను సంతోషించితిని. సమస్యను పరిష్కరించుటకు వేరుగత్యంతరములేదు. ప్రభుత్వమువారు దీనిని జరుగనీయరు; కాని యెప్పుడో యొకప్పుడిది జరుగక తప్పదు. ఈలోపుగ తగిన బలమును చేకూర్చుకొనవలెను. కొంతమంది దీనినొకవిధముగు అఖిలపక్షసభగ చేయగోరిరి. ఇది కేవలము వ్యర్థము. నియోజకవర్గ నియమితసభయనగా ప్రజలనుండి బలమును, ప్రేరేపణమునుపొందినవిశాల ప్రజాసంఘముచే నెన్నుకొనబడిన సభయనియర్థము. అట్టిసభ వెంటనే యదార్థసమస్యల నెదుర్కొనును. అది కులతత్వపోరొంపులలో దిగబడదు. బొంబాయి కాంగ్రెసుజరిగినవెంటనే అసెంబ్లీఎన్నికలుజరిగెను. ఎన్నికలలో నాకు ప్రీతిలేకపోయినను కాంగ్రెసు అభ్యర్థులు గెలుపవలెనని నేనుకోరితిని. ప్రతిపక్షములవారు — ఇందులో నుద్యోగములకొరకు వేటాడువారు. కులతత్వవాదులు, నమ్మకస్వామిద్రోహులు నానాగోత్రములవారు —

ఓడిపోవలెనని కోరితిని. చివరకు కాంగ్రెసుకఖండవిజయముకలిగినందులకు రాదగినవారు చాలమంది యోడినందులకు తృప్తినొందితిని.

కాంగ్రెసు నేషనలిస్టులనబడువారిదృష్టి నాకువిచారకరముగ కాన్పించెను. వారు కమ్యూనల్ అవార్డును తీవ్రముగనెదిరింపవచ్చును. కాని, వారు తమస్థితిని బలపరచుకొనుటకత్యంత కులతత్వవాదులతోను సనాతనవాదులతోను కూడ కలిసిరి. బెంగాలులో తప్ప వారన్నివిధముల కాంగ్రెసుకు వ్యతిరేకులు. వీరే కాంగ్రెసుకు ప్రబల ప్రతికక్షులు—భూఖామందులు, లిబరలులు, నిశ్చయముగ నధికారులు. వీరింతమందియున్నను కాంగ్రెసు అభ్యర్థులు నెగ్గిరి.

కమ్యూనల్ అవార్డునుగురించిన కాంగ్రెసుదృష్టి యసాధారణమైనది. అయినను ప్రస్తుతపరిస్థితులలో నదియంతకంటె వేరేమియుచేయజాలదు. ఇంతవరకు తటస్థభావము, నిరసననీతి నవలంబించుటచేతనే ఈ స్థితి సంభవించెను. ఫలితములకు వెనువక బింకమైనమార్గము నవలంబించి దాని ననుసరించుట యుక్తము, గౌరవప్రదమునై యుండెడిది. కాని, కాంగ్రెసు దాని కప్పుడంగీకరింపక పోవుటచే నిప్పటిపద్ధతికంటె వేరొకమార్గము లేదు. కమ్యూనల్ అవార్డు స్పష్టముగ నవ్యాక్తమైనది. అదియున్నంతకాల మెట్టి స్వాతంత్ర్యము సాధించుటకువీలులేదు. కనుక దానినంగీకరించుట యెన్నడుపొసగదు. అది ముస్లిములకెక్కువనిచ్చెనను కారణ మెంతమాత్రమును కాదు. వారు కోరినదాని నిచ్చుట బహుశః సాధ్యమేయగును. నిజమేమన బ్రిటిషు ప్రభుత్వము హిందూదేశము ననేక పరస్పర విరుద్ధశాఖలక్రింద విభజించి యొకదానితో నొకటి తలపడునట్లుచేసి యనర్గళముగ పరిపాలనచేయుచున్నది. అది బ్రిటిషుప్రభుత్వముపై నాధారపడుటను విధాయకముగచేయుచున్నది.

అతి రియాక్షనరీ కులసంఘములైన హిందూమహాసభ ముస్లిము కాన్ఫరెన్సులకు వెనుకనున్న వారి నిజస్వరూపముల నసెంబ్లీఎన్నికలు విశదపరచెను. వారి యభ్యర్థుల అభిమానులు పెద్ద భూఖామందులు, వడ్డీవ్యాపారస్థులు. నవీన ఋణవిమోచనబిల్లులను తీవ్రముగ నెదిరించి హిందూమహాసభకూడ బ్యాంకర్ల యెడల పక్షపాతము వెలిబుచ్చెను.

హిందూసాంఘిక తరగతులపై కొద్దిమంది "హిందూమహాసభ"యగుచున్నది. అందులో నొకభాగము, వృత్తులలోనున్న కొంతమంది కలసి లిబరలు లగుచున్నారు. వారికి హిందువులలో నెట్టి పలుకుబడి లేదు. ఏలనన మధ్యతరగతిలోని క్రిందితరహావారు రాజకీయముగ మేల్కాంచిరి. పారిశ్రామిక నాయకులుకూడ వీరికి దూరము వృద్ధి చెందుచున్న పరిశ్రమలకు నర్ధఫ్యూడల్ ప్రయోజనములకు కొంత స్పర్ధకలదు. ప్రత్యక్షకార్యక్రమములకు లేక సాహసకార్యములకు భయపడు పారిశ్రామికులు ప్రభుత్వముతోను, జాతీయతతోనుకూడ సఖ్యముగనుండగోరెదరు, వారు లిబరులు,కమ్యూనలువర్గములను లెక్క చేయరు. పారిశ్రామికాభివృద్ధి, లాభములు వారి ప్రధానాశయములు.

ముస్లిములలో నీమధ్యతరగతులలోని క్రిందితరహావారి ప్రబోధము, పారిశ్రామికాభివృద్ధికొరవడియుండెను. కనుక వారి కులసంస్థలను వచ్చి రియాక్షనరీలు, ఫ్యూడల్ ప్రభువులు, పింఛనుదారులు వశపరచుకొనుటయేగాక సంఘముమీదకూడ మంచి పలుకుబడి గలిగియున్నారు. ముస్లిముకాన్ఫరెన్సు 'సర' బిరుదాంకితులు, పెద్దజమీందారులు, పాతమంత్రులు గల యొక గొప్పప్రదర్శనము. అయినను, ముస్లిము ప్రజాసామాన్యములో నెక్కువశక్తియున్నట్లు కాన్పించును. బహుశః వారి సాంఘికస్వేచ్ఛయే దీనికి కారణము. ఒకసారి కదలిక కలిగినచో వా రెక్కువ చురుకుగ సామ్యవాదముఖులు కావచ్చును. వర్తమానమున ముస్లిము విద్యాధికులు మనఃకాయముల స్తబ్ధులు. వారిలో నుత్సాహములేదు. వారు తమ పాతసంరక్షకులను త్రోసివేయ సాహసింపరు.

రాజకీయాభివృద్ధినొందిన కాంగ్రెసు నాయకులుకూడ ప్రజాపరిస్థితులు కోరనంతటి జాగ్రతను వహించిరి. వారు ప్రజలసహాయమును కోరుదురు కాని వారి యభిప్రాయములను కనుగొనరు; వారిబాధలను గురించి పరిశోధన చేయరు. ఎన్నికలకు ముందు వివిధ కాంగ్రెసేతర మితవాదులను త్రిప్పుటకు వారుతమప్రోగ్రాముయొక్క జోరుతగ్గించిరి. దేవాలయప్రవేశ బిల్లువంటిదానియెడలగూడ తమ దృష్టిని మార్చు

కొనిరి. చెన్నపట్టణ శ్రోత్రియులను శాంతిపరచుటకు వాగ్దానము లీయబడెను. సరియైన తీవ్ర యెన్నికలప్రచారము సాగించినచో నెక్కువ యుత్సాహము కలిగెడిది; ఎక్కువ ప్రజాప్రబోధమునకు తోడ్పడెడిది ఇప్పుడు కాంగ్రెసు పార్లమెంటరీపద్ధతి నవలంబించెను. కనుక కొన్ని చిల్లరవోటులను సంపాదించు నుద్దేశ్యముతో సాంఘిక, రాజకీయాభివృద్ధి భంజకులతో మరికొన్ని ఎక్కువ రాజీలు జరుగును; ప్రజలకు కాంగ్రెసు నాయకులకు మధ్య మరింతయెక్కువ యంతర మేర్పడును. ఉపన్యాసములకు లోటుండదు. ఉత్తమ పార్లమెంటరీ మర్యాద లవలంబింపబడును; అప్పుడప్పుడు ప్రభుత్వము పరాజయమునొందును. ప్రభుత్వ మిదివరకు చేయునట్లే వీనిని నెమ్మదిగ నిర్లక్ష్యముచేయును

కాంగ్రెసు శాసనసభలను బహిష్కరించిన వత్సరములలో నసెంబ్లీ, రాష్ట్రసభలు, ప్రజల యదార్థప్రతినిధిసభలనియు నవి ప్రజాభిప్రాయమునే వెల్లడిచేయుచున్నవనియు ప్రభుత్వకక్షి చెప్పుచుండెడిది. ఇప్పుడు ప్రభుత్వదృష్టి మారిపోవుట చోద్యముకదా! ఎన్నికలలో కాంగ్రెసువిషయముల యుదాహరణ వచ్చినపుడెల్ల నియోజక వర్గము చాల చిన్నదని, ముప్పదియారుకోట్లలో మూడుకోట్లు మాత్రమేయని చెప్పుచుందురు. వోట్లులేనివారందరు బ్రిటిషుప్రభుత్వము వెనుక కోటవలె నున్నారని భావము. దీనిచికిత్స స్పష్టముగనే యున్నది. వయసువచ్చినవారికందరకు వోటుహక్కు యిచ్చినచో యదార్థము తెలియగలదు.

అసెంబ్లీ యెన్నికలు ముగిసినతోడనే భారతచట్టసంస్కరణలను గురించిన సంయుక్తపార్లమెంటరీ కమిటీ నివేదికవచ్చెను. ఇది యందరిచేత విమర్శింపబడెను. గర్హింపబడెను. ఈ వరప్రసాదము వలన మనకు స్వేచ్ఛయెట్టిదో యీదేశములోనున్న యతి మిత వాదులు రాజకీయముగ వెనుకబడినవారు నగు వర్గములవా రభివృద్ధిభంగకరమని దీనిని గర్హించుటవలననే తెలియుచున్నది. లేబరు పార్టీ, లేబరుప్రభుత్వము యేదో చేయునని కొందరాశించిరి. సామ్రాజ్యనీతి సందర్భమున యింగ్లండులో లేబరు, టోరీపక్షముల మధ్య మనమేమియు నాశింప నవసరములేదు.

భారతరాజకీయరంగములో బాహ్యమైన మార్పులను గ్రహించుటకు నేను ప్రయత్నించితిని. కాని, యివన్నియు నా కసత్యములుగ కాన్పించెను. హిందూదేశ నిజపరిస్థితులు నన్ను బాధించుచుండెను. అన్ని విధములగు స్వేచ్ఛలు వణచివేయబడెను. అమితమగుబాధ, విధలత, సుహృద్భావమునుపాడు చేయుట, చెడుగును ప్రోత్సహించుట– ఈ లక్షణములు కన్పట్టెను అనేకమందియువకులుజయిళ్ళలో మ్రగ్గుచుండిరి మామూలురోజులలోకూడ ననేక సంస్థలు బహిష్కరింపబడెను. ఎమర్జెన్సీ అధికారములు 'శాంతిచట్టములు' ప్రభుత్వ ఆయుధశాలలో స్థానము నేర్పరచుకొనెను. అనేకవందలపుస్తకములు, మేగజైనులు నిషేధింపబడెను, లేదా 'సముద్రసుంకముల చట్టముక్రింద' దేశములోనికి రాకుండానాపివేయబడెను. 'ఉపద్రవకరమగు సాహిత్యము' నుంచుకొనుటవలన దీర్ఘశిక్ష ప్రాప్తించెడిది. రవీంద్రనాథఠాగూరు రష్యానుగురించి యొకవ్యాసమును 'మోడరన్‌రివ్యూ'లో వ్రాసినందుల కాపత్రికాధిపతి మందలింపబడెను. రవీంద్రనాథఠాగూరు 'డబ్లినులోని మిత్రసంఘమునకు' పంపిన యొకచిన్న సందేశమునుకూడ ప్రచురింపరాదనిరి. ఠాగూరువంటి ఋషిసత్తముడు, విజ్ఞానపిపాసి రాజకీయములను బుద్ధిపూర్వకముగ వీడినవాడు, భారతదేశములో పూజింపబడువాడు, ప్రపంచఖ్యాతిగాంచినవాడు యీవిధముగ నణచివేయబడుచో నిక మామూలు మానవులగతి చెప్పవలెనా? ఇట్టిపరిస్థితులలో సరళ పత్రికారచన కాస్కారములేదు. చరిత్రను రాజకీయములను, ఆర్థికములను వర్తమానవ్యవహారములను యథార్థముగ తర్కించుటకు, బోధించుటకు వీలులేదు. సంస్కరణలను బాధ్యతాయుత పరిపాలనను ప్రవేశపెట్టుటకిదియొక వింత పూర్వాధ్యాయము.

నేడు ప్రపంచమొకవిధమగు మానసికసంక్షోభములోమునిగియున్నదని, ప్రస్తుతపరిస్థితులతో నసంతృప్తి చెందియున్నదని బుద్ధిమంతులకు తెలియును. మనకండ్లయెదుటనే విపరీతమార్పులు జరుగుచున్నవి. భవిష్యత్తు సమీపముననేయున్నది. అది ప్రతి వానిని మంచికో చెడుగుకో తీసికొనిపోవును. కనుక ప్రతినాగరికుడు దాని

వెనుకనున్న వివిధశక్తులను తెలిసికొని తన కార్యవిధానము నేర్పరచు కొనుట ధర్మము. ఒక ప్రపంచము నశించి మరియొక నూతన ప్రపంచము రానైయున్నది. ఒకసమస్యకు సమాధానము కనుగొనుటకు పూర్వ మా సమస్య యేదియో తెలిసికొనవలెను.

ప్రపంచసంభవములను గురించిన మన రాజకీయవేత్తలయుదాసీనత, యజ్ఞానము నాశ్చర్యకరములుగ నుండును. బ్రిటిషు అధికారులలో పైనున్నవారికి తప్ప క్రిందివారికివి యవసరములేదు. ప్రభుత్వము ప్రపంచసంభవములను దృష్టిలోనుంచుకొనియే తమనీతి నేర్పరచు కొనుచుండును. భారతదేశమును మ్రింగుట, దానిని సంరక్షించు కొనుట బ్రిటిషు విదేశనీతిలక్షణము. జపానుయొక్క యధికారము, సోవియెటు యూనియనుయొక్క దినదినాభివృద్ధియగు శక్తి. సింకియాంగులో ఆంగ్లో రష్యా జపానులయొక్క కుట్రలు, మధ్యఆసియా, ఆఫ్ఘనిస్థానము, పర్షియాలోని సంభవములు, భారతరాజకీయములతో సన్నిహితసంబంధము కలిగియున్నవని యెంతమంది భారతరాజకీయ వేత్త లెరుంగుదురు? మధ్యఆసియా పరిస్థితి కాశ్మీరుస్థితిని మార్చి దానిని బ్రిటిషు రాజనీతికి, రక్షణకు కీలకముచేయును.

ప్రపంచములో నతిశీఘ్రముముగ జరుగుచున్న యార్థికమార్పులు మరింత ప్రాముఖ్యములు. పందొమ్మిదవ శతాబ్దపు పద్ధతులు గతించెను, అవి ప్రస్తుతమునకు వర్తింపవు. మన మొక యెద్దుబండిని ఇనుప పట్టాలమీద పెట్టి యదియే రైలుబండి యనజాలము. అది తప్పి కొనవలసినదే! పాతసరుకుక్రింద దానిని తీసివేయవలెను. రష్యాలోనే కాక నమెరికాలోను, యింగ్లండులోను 'క్రొత్తపంపకములు,' గొప్ప మార్పులు అనుమాటలను వినుచుందుము. భారతదేశములో కూడ మన కనేక 'క్రొత్తపంపకములు' కావలెను. "గ్రహింప యోగ్యమైన దంతయు నిదివరకే గ్రహింపబడెను. చేయ నర్హమైనదంతయు, నిదివరకే చేయబడెను," అను పాతపాటలన్నియు నిరర్థకములు ఉపద్రవకర ప్రలాపములు.

మనమనేక సమస్యల నతిధైర్యముతో నెదుర్కొనవలెను. ప్రజలపరిస్థితుల నెక్కువగ నభివృద్ధిచేయుద లనపుడు ప్రస్తుత సాంఘిక యార్థికపద్ధతి నిలిచియుండుట కవకాశమున్నదా? ఈ విశాలాభివృద్ధి నాపద్ధతి పొందియైన చేయగలదా? కేవల రాజకీయమార్పు యెంత గొప్పయభివృద్ధి తీసికొనిరాగలదు? అతివాంఛనీయ పరివర్తనమునకు స్వార్థప్రయోజనము లడ్డుతగులుచో ప్రజాదుఃఖమును, దారిద్ర్యమును శాశ్వతిమొనర్చుచో వానినింతుంప యత్నించుట యుక్తమా? అది నీతియా? నిశ్చయముగ స్వార్థప్రయోజనముల కపకారము చేయుట లక్ష్యముకాదు. అవి యితరున కపకారము చేయకుండ చేయుటయే లక్ష్యము. వీనితో రాజీపడుటకు సాధ్యమగుచో నట్లు చేయుట యత్యంతము వాంఛనీయము. దీని యుక్తాయుక్తములను గురించి ప్రజలలో భేదాభిప్రాయములుండవచ్చును, కాని, యొక సమాధాన మవసరమను విషయము నెవడును శంకింపడు. ఒక స్వార్థప్రయోజనమునుతీసివేసి మరియొక దానిని సృష్టించుటవలన లాభము లేదు. స్వార్థప్రయోజనములట్టి రాజీకంగీకరింపవని చరిత్ర చాటుచున్నది. సంఘమునకు ప్రాణాధారపాత్రను వహింప మానివేసిన తరగతులు చిత్రముగ బుద్ధిహీనముగ నుండును. అవి సమస్తమును మ్రింగవలెనని యనుకొని చివరకు సమస్తమును పోగొట్టుకొనును.

ఆస్తిని కలుపుకొనుట మొదలగు "యథేచ్ఛా సంభాషణ" యెంతయో కలదు. అడ్డులేకుండ కొల్లగొను పునాదమీదనే ప్రస్తుత పద్ధతి యేర్పడెను. దీనిని నిర్మూలించుటకే సాంఘికమార్పులు దేశింప బడినవి. పనివానియొక్క పాటువలనవచ్చు ఫలితమునుండి నిత్యము కొంత లాగివేయబడుచున్నది. శిస్తు, పన్నులు చెల్లింపజాలనంతగ హెచ్చింపబడి చివరకు వ్యవసాయదారునిభూమి లాగివేయబడుచున్నది వ్యక్తులు సామాన్యభూములను లాగుకొని పెద్దజమీల నేర్పాటుచేసికొనిరి; ఈ విధముగనే వ్యవసాయప్రొప్రయిటర్లు తుడిచి వేయబడిరి.

దీనిని కొంతవరకు తగ్గించుటకే సంఘము ఆస్తిని తగ్గించు స్వభావముగల భారమైన పన్నులు, మరణకాలపు పన్నులు, ఋణ

విమోచన చట్టములు, నాణెములను పెంచుట మొదలగు వివిధ యుపాయములద్వారా ప్రయత్నింతును. సోవియటు యూనియను వారేకాక ప్రధాన క్యాపిటలిస్టు దేశములు కూడ నవీనముగ పెద్ద మొత్తున జాతీయఋణములను నిరాకరించిరి, బ్రిటిషువా రమెరికా కీయవలసిన ఋణమును నిరాకరించుట యొక గొప్ప యుదాహరణము! దీనిని భారతదేశమనుకరించు టెంత యుపద్రవకరము! కాని యివన్నియు కొంతవరకు మాత్రమే సహాయపడగలవు. ఇవి మూలకారణమును తీసివేయజాలవు. నూతనసృష్టిచేయుట కా మూలకారణమును తీసివేయవలెను.

ప్రస్తుతక్రమమును మార్పుపద్ధతినాలోచించునపుడు మనము దానికొరకై వెచ్చింపవలసిన యార్థిక, యాధ్యాత్మిక మూల్యమును పరిగణింపవలసియుండును. మనము దూరదృష్టి లేకుండ నుండజాలము. అది భౌతికముగ నాధ్యాత్మికముగ మానవాభివృద్ధికి మానవానందమునకు తోడ కెంతవరకు సహాయపడగలదో చూడవలెను. కాని, ప్రస్తుతక్రమమును మార్చకపోవుటవల కలుగు విపరీతనష్టములు విఫలజీవితములు, వికలములైన జీవితములు, దుఃఖము, కడుపుబాధ నైతికయాధ్యాత్మికపతనము — వీనినెల్లప్పుడు దృష్టిలో నుంచుకొనవలెను. నిరంతరము వెల్లివిరియు ప్రవాహమువలె నీప్రస్తుత యార్థిక పద్ధతి యసంఖ్యాకములగు ప్రజాసందోహములను ముంచుచు వినాశమునకు తీసికొనిపోవుచున్నది. మనలో కొంతమంది చేదలతో నీళ్ళు తోడినంతమాత్రముచేత నీప్రవాహము నరికట్టజాలము. ఈ ప్రజలను రక్షింపజాలము. పెద్దయేటిగట్టుల నిర్మించి కాలువలను త్రవ్వి ప్రవాహ విధ్వంసకశక్తిని మార్చి మానవశ్రేయస్సుకొర కుపయోగింపవలెను.

సామ్యవాదము కోరు గొప్ప మార్పులు కొద్ది శాసనములను చేసినంతమాత్రమున కలుగనేరవు. కాని యభివృద్ధిమార్గము చూపుటకు కట్టడముయొక్క పునాదులను వేయుటకు మూలశాసనములు, నధికారము నవసరములు. సామ్యవాదసంఘనిర్మాణము నదృష్టమునకు విడిచిపెట్టరాదు. కట్టినదానిని పడగొట్టుచు పడుచులేచుచు చేయు

పనియు పనికిరాదు. ప్రధాన యభ్యంతరములను తీసివేయవలెను. లక్ష్యము సృజించుటకాని నాశనముకాదు; ప్రస్తుతలేమిని భవిష్యత్ వృద్ధికిమార్చుట మన మార్గము మన యిష్టాయిష్టములమీద శుద్ధ న్యాయముమీదలేదు. అది యార్థికముగ దృఢముగ నభివృద్ధిప్రదముగ మార్పుచెందు పరిస్థితుల కనుగుణ్యముగ మానవలోకములో నెక్కువమందికి కళ్యాణదాయకముగ నుండవలెను.

స్వార్థముతో పోరాటముతప్పదు: మరొకసంధలేదు. మనలో ప్రతివాడు తనపక్షమును నిర్ణయించుకొనవలెను. నిర్ణయించుకొనుటకు పూర్వము జ్ఞానము, గ్రహణశక్తి యుండవలెను. సామ్యవాద భావ ప్రవేశము చాలదు. దీనితోపాటు బుద్ధిహేతుబద్ధముకావలెను. పశ్చిమ దేశములలో నిట్టివిధమగుసాహిత్యమెంతయోకలదు. భారతదేశములో నిది చాలకొరవబడియున్నది. మంచి మంచి పుస్తకముల నిచ్చుటకు రానీయుడు. కానీ, యితరదేశములనుండివచ్చు పుస్తకముల చదివి నంతమాత్రమున చాలదు. సామ్యవాదము హిందూదేశములో నిర్మింపవలెనన్న నది హిందూదేశ పరిస్థితులనుండియే యుత్పన్నము కావలెను. ఈ పరిస్థితులను శ్రద్ధతో పరీక్షించుట అవసరము.

సామ్యవాదమును తెచ్చుటకు మానసిక పునాది యున్నంత మాత్రమున చాలదు. ఇతరశక్తులు కావలెను. కాని, యీపునాదిలేనిదే మనము విషయమును సరిగా చేపట్టజాలము. శక్తివంతమైన యుద్యమమును లేవదీయజాలము. భారతదేశములో ప్రస్తుతము వ్యవసాయకోద్యమము చాల ప్రధానమైనది; అదియెప్పుడునట్లే యుండవచ్చును. కాని, పరిశ్రమలుకూడ తక్కువ ప్రధానములుగావు. అవి యభివృద్ధియగును. మనలక్ష్యమేది? వ్యవసాయప్రభుత్వమా లేక పారిశ్రామికమా? మన కెక్కువగ కృషీవలులముగ నుండకతప్పదు కాని, మనము పరిశ్రమలను వృద్ధిచేయుగలము.

మన పరిశ్రమల యజమానులు తమభావములలో చాలవెనుక బడియున్నారు. వారు నేటికి తగిన క్యాపిటలిస్టులుకూడకారు. ప్రజలు చాల బీదవారగుటచే కొనుగోలుశక్తి లేనివారని వారు భావింతురు.

కూలిని హెచ్చించుటను, పనిచేయుకాలమును తగ్గించుటకు వారొప్పు కొనరు. పనిచేయు కాలపరిమితిని పదిగంటలనుండి తొమ్మిదిగంటలకు తగ్గించిరి. దీనివలన అహమదాబాదు మిల్లుయజమానులు జీవితమును తగ్గించిరి. దీనివలన పనివారి యాదాయము తగ్గిపోయెను. పనివాని జీవితప్రమాణముక్షీణించెను. అవకాశమున్నప్పుడు వారు పెద్దలాభము లనుపొందుదురు: కూలివారు మామూలుగనేయుందురు. వారివి మేడలు, దివ్యభవనములు, వీరివి మట్టిగుడిసెలు. వారివి భోగములు, వీరివిరోగ ములు. వారివి కేళీవిలాసములు, వీరివికడుపుమంటలు. వారికి ప్రభుత్వ రక్షణ. వీరిది దిక్కుమాలిన దీనస్థితి. కాని, మనమీవ్యత్యాసములు తప్పనిసరి యనుకొని చలింపక బాధపడకుండ త్రోసివేయుదుము.

పారిశ్రామికకూలీస్థితికంటెను (ఆర్థికముగ) వ్యవసాయకూలీ స్థితి మరెంత నీడుగు. వ్యవసాయదారు కొక సదుపాయము కలదు. అతడు శుభ్రమైనగాలిలో జీవించును. కనుకకూలివాండ్రక్రుమ్మరింపు అతనికిలేదు కాని, యతడు చాల యజ్ఞానములో మునిగియుండుటచే తరచు బహిరంగ వాయుప్రసారముగల తనగ్రామమునుగూడ గాంధీజీ చెప్పినట్లు 'పేడకుప్పగ' చేయును. సంఘక్షేమముకొరకు సహకారము లేక సంయుక్తప్రయత్నభావ మతనిలోలేదు. దీని కతనని గ్రహించుట సుకరమే! కాని, ప్రతివాడు నతనిమీద చేయి యెత్తువాడే యగుటచే జీవిత మతనికొక నిరంతరవ్యక్తిగతసంగ్రామము; అసలతడెట్లుజీవించు చున్నాడా? యనునది యవిశ్వసనీయమై యాశ్చర్యముగ నుండును. 1928_29లో పంజాబు వ్యవసాయదారు సగటు నిత్యాదాయము తలకు తొమ్మిదణాలని కనుగొనబడెను. ఇది 1930_31 లో తలకు తొమ్మిదిపైసలకు పడిపోయెను! యు. పి., బీహారు, బెంగాలుల లోని వ్యవసాయదారులకంటె పంజాబురయితు చాలయదృష్టవంతు డని చెప్పబడును. యు. పి. లో కొన్ని తూర్పుజిల్లాలలో (గోర క్పూరు మొదలైనవి) మంచిరోజులలో. నార్థికమాంద్యమునకు పూర్వము, పొలములో పనిచేయు నిత్యకూలి తలకు రెండణాలు.

ఈ పంకిలమునుండి మనము బయటపడుటెట్లు? మనముపాయములను పన్నవచ్చును. కాని యంత యధోగతిలోనున్న ప్రజలను లేవదీయుట కష్టసాధ్యము. కాని, మార్పువలదనుస్వ ప్రయోజక వర్గములనుండియే యదార్థమైన కష్టము కలుగును, సామ్రాజ్యపరిపాలన క్రింద యీ మార్పుకాస్కారము లేనట్లు కాన్పించును. రానున్న వత్సరములలో హిందూదేశమేవైపు చూచును? కమ్యూనిజము, ఫాసిజములు—యీ యుగ ప్రధానలక్ష్యములుగ కాన్పించును సర్ మాల్కాం హైలీ భారతదేశము జాతీయ సామ్యవాదమును స్వీకరించునని జోస్యము చెప్పెను; అనగా నొక విధమగు ఫాసిజము. బహుశః సన్నిహితభవిష్యత్తుకు సంబంధించినంతవర కతడు చెప్పునది యుక్తమే కావచ్చును. హిందూదేశములోని యువకులలోను, యువతులలోను ఫాసిస్టుభావము లిదివరకే కాన్పించుచున్నవి. కాంగ్రెసు వీరిని ప్రతిబింబింప ప్రారంభము చేయుచున్నది. ఫాసిజముకు దౌర్జన్య పద్ధతులతో సన్నిహిత సంపర్కముండుటచే దౌర్జన్యరాహిత్యము నాశ్లేషించిన కాంగ్రెసుపెద్దలకు దీనియెడల సహజభయము కలదు. కాని స్వంతయాస్తులను రక్షించుచు స్వార్థప్రయోజనములను (నిర్మూలింపక) వారించు సామాజికప్రభుత్వము—ఫాసిజముయొక్క వేదాంతసంబంధమైన పునాది యనబడునది—వారికి నచ్చవచ్చును. పైకిది ప్రాతదాని నిలుపుకొనుచు క్రొత్తదాని నవలంబించు నుత్తమ పద్ధతిగ కాన్పించును. ఒక మూల రొట్టెను తినుచు దానినుంచుకొనుటకూడ సాధ్యమా యనునది వేరువిషయము.

కాని, మధ్యతరగతి యువకులు ఫాసిజమువైపు పరుగిడుదురు. ప్రస్తుతము భారతదేశములో సాక్షాత్తు మధ్యతరగతులలో నొక భాగము విప్లవకరముగ నున్నది; కూలీలు, వ్యవసాయదారులు [పారిశ్రామికకూలీలు మరింత శక్తివంతముగనున్నను] అంతముందుకు రాలేదు. ఫాసిస్టుభావములు విస్తరించుటకే జాతీయమధ్యతరగతియను వైనరంగముగనున్నది. కాని విదేశప్రభుత్వమున్నంతకాలముయూరపియను ఫాసిజమిచ్చట విస్తరింపజాలదు. భారతఫాసిజమువిధాయకముగ భారతస్వాతంత్ర్యము కొరకు నిలువవలెను. కనుక నది బ్రిటిసామ్రాజ్య

తత్త్వముతో నేకముకాజాలదు. అది ప్రజలసహాయము పొంద వలెను బ్రిటిషు అధికారము పూర్తిగ తీసివేయబడినచో ఫాసిజము యెక్కువ వేగముగ నభివృద్ధిచెందును.

కాని, బ్రిటిషు అధికారము త్వరగ పోవు సూచనలు లేవు. ఈలోపల ప్రభుత్వ మెంత కఠిన నిర్బంధము నుపయోగించుచున్నను కమ్యూనిస్టు, సామ్యవాద భావములుకూడ విస్తరించుచున్నవి. భారత దేశములో కమ్యూనిస్టుపార్టీ యక్రమసంఘము; ఆ పదమునకు యధేచ్ఛావ్యాఖ్యానము చేయబడుచుండుటచే నభిమానులు, ముందడుగువేయు లేబరుయూనియనులు నందులో జేర్చబడుచున్నవి.

ఫాసిజము కమ్యూనిజములమధ్య నా యభిమానము పూర్తిగ కమ్యూనిజమువైపుననే యుండును. కాని నేనెంతమాత్రము కమ్యూనిస్టునుకాను. నామూలములింకను బహుశః కొంతవరకు 19 వ శతాబ్దములోనేయున్నవి; 'మానవయుదారత' నుండి నేను పూర్తిగ తప్పించుకొనజాలకపోతిని. ఈబూర్జువాస్వభావము నన్ననుసరించుచుండుటచే చాలమంది కమ్యూనిస్టుల సహజకోపమున కిది కారణమగుచున్నది. ధర్మవన్నములు నాకు గిట్టవు. కారల్ మార్క్సు వ్రాతలు, మరే యితర పుస్తకములు శంకింపరానివని భావించుట, ఆధునిక కమ్యూనిస్టు లక్షణముగకాన్పించు వర్గవిభాగము, వ్యతిరేకులను వేటాడుట నాకు గిట్టవు. రష్యాలో జరిగినదానిని, ముఖ్యముగ శాంతముగ నున్నదినములలో నుపయోగించిన మితిమీరిన దౌర్జన్యమును, నే నంగీకరింపజాలను. అయినను నే నంతకంతకు కమ్యూనిస్టు శాస్త్రమువైపు మొగ్గుచుందును.

మార్క్సు స్టేటుమెంటులుకొన్ని తప్పులు కావచ్చును దీనిని విమర్శించుటకు నే నశక్తుడను. కాని, సాంఘికోత్పాతములను గురించి యతని కసాధారణదృష్టి కలదు. అతడవలంబించిన శాస్త్రపద్ధతియే దీనికికారణము. ఈ పద్ధతిని గతచరిత్రకు ప్రస్తుతవిషయములుకూడ వర్తింపచేసినపుడు మన కివి మరి యేపద్ధతివలన నర్థముకానట్లుస్పష్టపడ గలవు. కనుక నే నేడు ప్రపంచములో జరుగుచున్న మార్పులలోనిరహస్యమును బయటపెట్టు పరిశీలన మార్క్సు శిష్యవర్గమువారి వ్రాతల

మండియే వచ్చుచున్నది. మార్క్సు తరువాత బయలుదేరిన కొన్ని స్వభావములను [మధ్యతరగతిలోని విప్లవ స్వభావమువంటివి] నిర్లక్ష్యము చేసెనని చెప్పుట సులభము. కాని మార్క్సిజములో పిడివాదము లేదు. అదియొక దృష్టిని, విషయమును చేపట్టును. ఆ దృష్టి మన సాంఘిక మార్పుల నర్థముచేసికొనుటకు తోడ్పడి కార్యవిధానమును సూచించును.

ఆ కారణవిధానముకూడ, మార్పుచెందక కరడుకట్టినది కాదు. అది పరిస్థితుల కనుగుణ్యముగ నుండును. అదియే లెనినుదృష్టి. అతడు తన కార్యమును మార్పుచెందు పరిస్థితులకు తగినట్లవలంబించెను. "సంగ్రామకాలము సంయుక్తపరిస్థితుల వివరములు పరీక్షింపకుండ పోరాట సాధనను గురించిన ప్రశ్నకు అవునని కాదని చెప్పసాహసించుట మార్క్సుసందేశమును పూర్తిగ విడిచిపెట్టుట" యని యతడు చెప్పెను.

ఈ విశాలదృష్టి, యథార్థజ్ఞానముగల కమ్యూనిస్టు కొంతవరకు సాంఘిక జీవిత చైతన్యస్వభావమును గుర్తించును. అతనికి రాజకీయములు చీకటిలో తడవుకొనుటవలె, కేవలము సమయముకొరకు కాచుకొనియుండు చరిత్రవలె కాన్పించవు. అతను మనఃపూర్వకముగ నెదుర్కొను పోరాటము, చేయు త్యాగము నతని లక్ష్యములను, ఆశయములను సార్థకముచేయును. మానవ విధిని సాధించుటకు ముందుపోవుచున్న మహాసైన్యములో తానొక భాగమని యతడు గ్రహించును. చరిత్రతో క్రమక్రమముగ నడుచుచున్నట్లతనికి ద్యోతకమగును. బహుశః యనేకమంది కమ్యూనిస్టులిట్లు భావింపరు. లెనినుమాత్రమే యతని కార్యవిధానమునంత పటుత్వముగనొనరించిన జీవితమంతయు నొక్కటియను భావము కలిగియుండును కాని యతనియుద్యమ వేదాంతము నర్థముచేసికొనిన ప్రతికమ్యూనిస్టు కొంతవరకు దీనిని గ్రహించియుండును. కొంతమంది కమ్యూనిస్టులతో నొప్పవహించుట కష్టము. వారితరులకు కోపము తెప్పించు చిత్రమైన పద్ధతి కనిపెట్టిరి. కాని, వారనేక కఠినపరీక్షలపాలైరి. సోవియటు

యూనియను వెలుపలవారసంఖ్యాకములగు కష్టములకు నెదుర్కొనవలసెను. నే నెల్లప్పుడు వారి యమిత ధైర్యమును, త్యాగశక్తిని మెచ్చుకొంటిని అసంఖ్యా ప్రజ లనేకవిధముల బాధపడునట్లు వారును బాధపడుదురు. కాని, సర్వశక్తివంతము, క్రూరము నగు విధిముందర వారట్లు గ్రుడ్డిగననుభవింపరు. వారు మానవులవలె బాధపడుదురు. అట్టి బాధలో నొకవిషాదకరమగు నుదారత కలదు.

రష్యాలోని సాంఘిక ప్రయత్నముల జయాపజయములు మార్క్సు సిద్ధాంతబలమును ప్రత్యక్షముగ బాధింపజాలవు. అనేక విషమపరిస్థితు లేకమయి, లేక ననేకప్రభుత్వము లేకమయియా ప్రయత్నములను తారుమారు చేయవచ్చును. కాని, శక్తివంతములగు నా సాంఘికప్రబోధము లవి చిరస్థాయిగ నుండును. అచ్చటజరిగిన యనేక విషయములను నేను సహజముగ ప్రేమింపజాలకపోయినను ఆ సిద్ధాంతము ప్రపంచమునకు తారకమంత్రమని నేను భావింతును. వారి కార్యములు నాకు పూర్తిగ తెలియవు; నేనువానిని విమర్శించుటకు తగిన స్థితిలో లేను. నా ప్రధాన భయమేమనిన నమితమగు దార్ఢ్యము, నిర్బంధములు చెడ్డకు దారితీయవచ్చును. దీనిని తీసివేయుట కష్టము కావచ్చును. కాని, రష్యాను నడుపు ప్రస్తుతనాయకుల నుగుణమేమన వారు తమ తప్పిదములనుండి పాఠములను నేర్చుకొనుటకు భయపడరు. వారు తమయడుగులను వెనుకకువేసి పునఃసృష్టిచేసికొన గలరు. వారెల్లప్పుడు తమలక్ష్యమును తమయెదుట నుంచుకొనెదరు. కమ్యూనిస్టు యింటర్నేషనల్ ద్వారా వారితరదేశములలో చేసిన ప్రయత్నములు విచిత్రముగ విఫలమయ్యెను. ఇప్పుడవి చాల తగ్గింపబడినట్లు కాన్పించును.

హిందూదేశమునకుతిరిగివత్తము. బాహ్యపరిస్థితులిచ్చటిగమనమును త్వరితముచేసిన నే తప్ప సామ్యవాద,కమ్యూనిజములుదూరవిషయములుగ కాన్పించును. మేము కమ్యూనిజముతో కాక కులతత్త్వములతో వ్యవహరింపవలెను. కులములరీత్యాహిందూదేశ మంధకారయుగములోనున్నది. రాజకీయ వ్యక్తులు స్వల్ప విషయములతోను,

మంత్రులతోను, పన్నాగములతోను తమశక్తులను వ్యర్థము చేయుచున్నారు వీనిలో నొకరినొకరు మించవలెనని చూచుచున్నారు. ప్రపంచమును మరింత కళ్యాణప్రదముగ నానందదాయకముగ చేయుటకు వారెవరును ప్రయత్నింపరు. బహుశః యిదియొక తాత్కాలిక స్థితి, త్వరలోనే యిది పోవచ్చును.

కాంగ్రెసు చాలవరకీ కుల యజ్ఞానమునుండి దూరముగ నుండెను. కాని దానిదృష్టి పిల్లబూర్జువాదృష్టి. కనుక నా దృష్టితోనే చికిత్స చేయగోరుదును. ఈపద్ధతివలన నది జయముపొందజాలదు. నేడది మధ్యతరగతిలోని క్రిందితరహా వారికి ప్రాతినిధ్యము వహించును. కాని యది పైకికాన్పించునంత శక్తివంతముగ లేదు. దానిని రెండు ప్రక్కలనుండి రెండుశక్తులు నొక్కుచున్నవి. ఒకటి యన్ని బందోబస్తులు కలిగియున్నది. రెండవది దుర్బలముగ నున్నను త్వరితముగ వృద్ధిచెందుచున్నది. భవిష్యత్తు చెప్పుట కష్టసాధ్యము. అది దాని చారిత్రక ధర్మమైన జాతీయస్వాతంత్ర్యమును పొందుటకు పూర్వము బందోబస్తులతోనున్న రెండవ పక్షమువైపు పోజాలదు, కాని దానికా విజయము చేకూరులోపల నితరశక్తులు బలపత్తరములై దానిని తమవైపు త్రిప్పుకొనవచ్చును; లేదా క్రమముగ దాని ఉద్వాసము చెప్పవచ్చును. జాతీయస్వాతంత్ర్యము సాధింపబడువరకు కాంగ్రెసు హిందూదేశములో ప్రధానపాత్ర వహించును.

69

ఉ ప సం హా ర ము

కర్మ చేయుట మనవిధి, ధర్మము కాని మనకర్మ పూర్తి చేయుట మనచేతులలో లేదు.

—టాల్‌మడ్.

నే నీ కథచివరకు వచ్చితిని. నా జీవిత వృత్తాంతమును (ఉన్న విధమున) నేటివరకు (1935 ఫిబ్రవరి 14, అల్మోరాజిల్లాజయిలు) తెచ్చితిని. నేటికి మూడు నెలలక్రిత మీజయిలులో నే నా నలుబదియైదవ జన్మదినము జరిపితిని. నే నింకను చాలవత్సరములు జీవించవలసియున్నదని నేననుకొనెదను. ఒక్కొక్కప్పుడు నిరాహారము, అలసట నన్నలుముట్టును. ఇతరకాలములో నపరిమితోత్సాహశక్తులతో తులతూగుచుందును. నా శరీర మాటుపాటుల కాగగలదు. నా మనస్సు ప్రహారణములనుండి సుకరముగ కోలుకొన గలదు. కనుక హఠాత్తుగ నన్నొక విధి క్రమింగనిచో నే నింకను చాలకాలము జీవింపగలనని భావించెదను.

బహుశః యీసాహసములు చాల యుద్రేకజనములుగ నుండకపోవచ్చును. చిరకాలము జయిలులోనుండుటను సాహసమని యనజాలము. ఇందులో నసామాన్యత లేదు. నే నీవత్సరములను లక్షలకొలది నా దేశ స్త్రీపురుషులతో కూడ ననుభవించితిని. మారుచుండు భావములు, ఉత్సాహానుత్సాహములు, తీవ్ర కార్యకలాపము, బలాత్కార యేకాంతము యివి మా సామాన్యచరిత్ర. నేను ప్రజలలో నొకడను. నేను దానితో కదలుచు నొక్కొక్కప్పుడు దానిని నడుపుచు దానిచే పాలింపబడుచుంటిని. అయినను నేనొకవ్యక్తిగ నుండి ప్రజాసమూహములలో ప్రత్యేకజీవితమును జీవించెడివాడను.

ఈసంవత్సరము లితరవిషయములతో పాటునాకొక యమూల్య వరమును ప్రసాదించెను. జీవితము నా కంతకంతకు తన్మయత్వము నొందించు సాహసకార్యమువలె కాన్పించును. అచ్చట మనము నేర్చుకొనవలసిన దెంతయోకలదు, చేయవలసిన దెంతయోకలదు. నే నభివృద్ధిపొందుచున్నట్లొక నిరంతర భావముండెడిది. నా కింకను ఆ భావమే కలదు. అది నా యత్నములకు, గ్రంథపఠనమునకు నూతనోత్సాహము నిచ్చును. సాధారణముగ జీవితమును సార్థకము చేయును.

ఈ కథ వ్రాయుటలో నేడు నా భావములను, మనఃప్రవృత్తులను, తెలుప యత్నించితిని. నా భావములను చిత్రింపగోరితిని. భూతభావమును తిరిగి గ్రహించుట సులభముకాదు. సంభవమగు సంభవములను మరచిపోవుటయు సులభముకాదు; కనుక తరువాత కలిగిన భావములు నా మొదటిరోజులలోని చరిత్రకు కొంత మెరుగు పెట్టి యుండవచ్చును. కాని, నా మానసికాభివృద్ధిని, ప్రధానముగ నాలాభముకొరకు, చిత్రించుటయే నాయుద్దేశ్యము. నేను వ్రాసిన దంతయు నా యుండినవిధమును గాక నే నొకప్పు డెట్లుండగోరితినో లేక యుంటినని భావించితినో దానిని తెలుపు చరిత్ర.

కొన్ని నెలలక్రిందట సర్ సి.పి. రామస్వామయ్యరు నేనుప్రజా సామాన్యభావములకు ప్రతినిధిని కానని నాత్యాగములచేతను, ఆదర్శములచేతను, నావిశ్వాసములలోనున్న యావేశముచేతను, నేనుమరింత యుప్రదవకరుడనని చెప్పెను. ఈస్వవిషయములలో నేనతనితో జగడము పెట్టుకొన నిచ్ఛగింపను మేమనేక వత్సరములనుండికలుసుకొనలేదు. కాని, చిరకాలము క్రిందట మేమిరువురముహోమురూలుసంఘమునకు సంయుక్త కార్యదర్శులము. తదాది అనేక సంభవములు జరిగెను. సర్ సి. పి. పైకిపోవుచు తలతిరుగునంతటి యున్నతస్థితికి వెళ్ళెను. నేను భూమిమీదనే భూమికిసంబంధించి యుంటిని. ఇప్పుడు మా కిరువురకు సామ్యమేదియు [సామాన్య జాతితప్ప] లేదు నేడతడు హిందూదేశములో బ్రిటిషుప్రభుత్వమును సమర్థించు జగజెట్టి హిందూదేశము లోను, యితరచోట్లను నిరంకుశత్వమును శ్లాఘించువాడు. స్వాయముగ

వతడొక భారతసంస్థానములో వెలుగొందు నిరంకుశత్వ భూప ణము. మేము చాల విషయములలో భేదింతుము. కాని యొక విష యములో-నేను ప్రజాభావమునకు ప్రతినిధిని కానను విషయములలో నేకీభవింతుము.

నే నెవరి కేని ప్రతినిధినా? యనియాశ్చర్యపడుచుందును. చాల మందికి నాయెడ మిత్రభావము, దయయున్నను నే నెవరికిని ప్రతినిధిని కాననియే భావింతుర. నే నొకవింతయైన ప్రాచ్య, పాశ్చాత్య 'చా చో' నైతిని. ప్రతి-చోట చోటులేనివాడను. ఎచ్చట నాశ్రయములేని వాడను. బహుశః నా భావములు, జీవితమును గ్రహించు విధము ప్రాచ్యమునకు గాక పాశ్చాత్యమనబడుదానికే యెక్కువగ సంబంధించియుండును. కాని, హిందూదేశమునన్నంటిపెట్టుకొనియుండును. నా వెనుక, నెక్కడనో మినుకుమినుకుమను స్మృతిలో శతపురుషాంతములనాటి బ్రాహ్మణజాతిస్మృతి కలదు. నేనాభూతకాల వంశపారంపర్యమును నా నవీనస్వార్జితమును పోగొట్టుకొనజాలను. అవి రెండును, నా భాగములు. అవి నాకు తూర్పు, పశ్చిమములు. నేను పడమర దేశములలో క్రొత్తవాడను, విదేశీయుడను. నేను వానికి చెందను. కాని, నా నిజదేశములోకూడ నొకొక్కప్పుడు, పరదేశీయునివలె భావింతును

దూరపు కొండలు నునుపుగను, యెక్కుటకు సులభముగను కాన్పించును, శిఖరమా! ఆహ్వానింపుచుందును. కాని, యెక్కినకొలది కష్టములు కాన్పించును. పైకి వెళ్ళినకొలది ప్రస్థానము మరింత శ్రమ జనకముగ నుండును. శిఖరము మేఘమండలములోనికి పోవుచుండును. అయినను. ఆ యారోహణము ప్రయత్నార్హము అదియొక ప్రత్యేకా నందమును, తృప్తిని యిచ్చును. బహుశః సంగ్రామమే జీవితమునకు విలువనిచ్చును. కాని, యది తుదిపర్యవసానముకాదు, ఏది యుక్త మార్గమో తెలిసికొనుట తరుచు కష్టము. ఒకొక్కప్పు డయుక్తమైనది, సులభముగ తెలియును దానిని మానివేయుట కొంత మెరుగు. సోక్రటీసు ఇట్లు చెప్పెను: "మృత్యువనగా నేదియో నాకు తెలియదు- అది మంచిదే కావచ్చును. నేను దానికి వెరువను. కాని మన భూత

కాలమును పీడుట చెడ్డవిషయమని నేనెరుగుదును. చెడ్డదని నాకు తెలిసినదానికంటె మంచిదే యగుట కవకాశమున్నదానిని నేను వరింతును."

నేను జయిలులో గడిపిన వత్సరములు! నా భావములలో మునిగి యేకాకినై కూర్చొనుట! ఒకదానివెనుక నొకటి విస్మృతిలోనికి పోయిన యెన్ని ఋతువులను నేను చూచితిని! శుక్ల, కృష్ణపక్ష చంద్రుల నెందరను చూచితిని! నిర్లక్ష్యముగ, సగర్వముగ నడచి పోవు నక్షత్రరాశి నెన్నిసార్లు చూచితిని! నా యౌవన 'గతరాత్రు' లెన్ని యిచ్చట మణగిపోయినవి! ఒక్కొక్కప్పుడు మృతిచెందిన ఈ గత దివసప్రేతములు లేచుచు "ఇది ప్రయోజకారియా? "యని ప్రశ్నించును. సమాధానము నిశ్చందేహము. నా ప్రస్తుతజ్ఞానము, యనుభవము కలిగి తిరిగి జీవించుటకు నా కవకాశమిచ్చుచో నేను నా జీవితములో ననేకమార్పులను చేయుటకు యత్నించెదను. నా గతచర్యల ననేకవిధముల నభివృద్ధిచేయ యత్నించెదను. కాని, ప్రజా కార్యములలోని నా ప్రధాన నిశ్చయము లట్లే యుండెను. నేను వానిని మార్పు చేయలేను. అవి నాకంటె బలవత్తరములు. నా వశములో లేని యొక శక్తి నన్ను వానివైపు తరిమెను.

నా నిర్బంధముజరిగి సరిగ సంవత్సరమయ్యెను. నా రెండేండ్ల శిక్షలో నొక సంవత్సరము గతించెను. మరియొక నిండుసంవత్సరము కలదు. ఈసారి విడిఖయిదు కనుక రిమిషనులులేవు. నేను ఆగస్టులో బయటనున్న పదకొండురోజులు నా శిక్షాకాలములో చేర్చిరి. ఈ సంవత్సరముకూడ గడచిపోవును. నేను బయటపడుదును. తరువాత? నాకు తెలియదు. కాని నా జీవితములో నొకయధ్యాయము ముగిసె ననియు, మరియొకటి ప్రారంభమగుననియు నేను భావించితిని. అదే దియో నేను స్పష్టముగ నూహింపజాలను. జీవితగ్రంథములోని పుటలు మూయబడి యుండును.

సమాప్తము.

వ్రాసిన తదుపరి

బేడెన్‌వీలరుష్వార్జువాల్డు,
అక్టోబరు 25, 1935.

గత మే మాసములో నా భార్య భోవాలీవీడి మరికొంతచికిత్స కొరకు యూరపు వెళ్ళెను. ఆమె వెళ్ళినతరువాత నేను భోవాలీ వెళ్ళలేదు. క్వెట్టా భూకంపమునుగురించి వార్తలువచ్చెను. కొంత కాలము తక్కినదంతయు మరువబడెను. కాని యెంతకాలమో కాదు. భారతప్రభుత్వము తనను,తనవిధములను మరచిపోనీయదు. కాంగ్రెసు ప్రెసిడెంటు—భారతదేశ భూకంపమునుగురించి మరెవ్వరికంటెను యెక్కువ తెలిసినవాడు నయిన రాజేంద్రబాబును క్వెట్టాకు పోనీయలేదు. గాంధీజీని మరే ప్రజానాయకునికూడ వెళ్ళనీయలేదు క్వెట్టాను గూర్చి వ్రాసినందులకనేక భారతపత్రికలుధరావతులనుకోల్పోయెను.

ప్రతిచోట సైనికభావనే! పోలీసుదృష్టియే:— అసెంబ్లీలోను, నాగరికప్రభుత్వములోను, సరిహద్దులలోను బాంబువ్రాతలలోను — అదేదృష్టి. ఇండియాలోను, బ్రిటిషుప్రభుత్వము ప్రజలలోని యనేక శాఖలతో శాశ్వతముగ పోరాడుచున్నట్లు కానిపించును.

పోలీసుశాఖ యుపయోగకరము. అవసరమునగు శాఖ. కాని పోలీసుమయమును పోలీసులాఠీలతో నిండిన ప్రపంచము వాసయోగ్యము కానేరదు. దౌర్జన్యమును నిరోధములేకుండ నుపయోగించుటచే దానికి గురియైనవా డవమానమును, మానహానినిపొందునట్లే దాని నుపయోగించువాడును అవమానమునొందునని తరచు చెప్పబడును. ఉన్నతసేవలలోని, ముఖ్యముగ ఐ. సి. యస్. శాఖలోని, క్రమాభివృద్ధిచెందు మానసిక, నైతిక పతనముకంటె నాశ్చర్యకరమైనది, నేడు భారతదేశములో మరియొకటి కానిపించదు. ఇది పెద్దయధికారములలో చాల స్పష్టముగ కానిపించును. కాని, యిది సూత్రమువలె నన్ని సేవలలోను కలదు, పై పదవిలోనికి పోవుటకవ

కాలము వచ్చినపుడీ నూతనతత్త్వము నెవ డెక్కువగ ప్రదర్శించునో వాడు విధాయకముగ పైకి పోవును.

సెప్టెంబరు నాల్గవ తేదీని నన్ను హఠాత్తుగ ఆల్మోరా జయిలు నుండి విడిచిపెట్టిరి. నా భార్యస్థితి విషమించెనని వార్తలువచ్చెను. ఆమె జర్మనీలో ష్వార్జువాల్డులోని బేడెన్‌వీలరులో చికిత్సనొందు చుండెను. నా శిక్ష రద్దుచేయబడెనని చెప్పి నన్ను విడచివేసిరి. నేను విమానములో యూరపు వరుగిడితిని.

యూరపు అల్లరిగనుండెను. యుద్ధభయ మావరించుచుండెను. ఆర్థికదుస్థితి యెదురుచూచుచుండెను. అబిసీనియా ముట్టడింపబడెను. ఆమె ప్రజలు బాంబులతో మాడ్చివేయబడిరి. వివిధ సామ్రాజ్యోద్ధతులు తలవడుచు నొకదానినొకటి భయపెట్టుచుండెను. ఇంపీరియల్ ప్రభుత్వములలో నతిపెద్దదియైన యింగ్లండు తనక్రిందనున్న ప్రజలపై బాంబులను వేయుచు క్రూరముగ నణచివేయుచు శాంతికొరకు,లీగుసమ్మతికొరకుచూచును కాని యిచ్చట 'నల్లయడవి'లో నంతయు నెమ్మదిగను ప్రశాంతముగను యున్నది. పొగమంచు లోయలనావరించి దూరములోనున్న ఫ్రాన్సు సరిహద్దులను కప్పివేయుచుండ నేను నిరీక్షించుచు వానివెనుక నేమి యున్నదా యని యాశ్చర్యపడుచుందును